అన్నమయ్య పదకోశం

(తాళ్లపాకకవుల సంకీర్తన నిఘంటువు)

నిఘంటునిర్మాత

ఆచార్య రవ్వా శ్రీహరి

ఎడిటర్- ఇన్- చీఫ్
తిరుమల తిరుపతి దేవస్థానములు
పూర్వ ఉపకులపతి
ద్రవిడవిశ్వవిద్యాలయం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2012

ANNAMAYYA PADAKOSAM

By
Prof : **Ravva Sri Hari**

T.T.D. Religious Publications Series No. : 937

© All Rights Reserved

First Edition : **December 2012**

Copies : **2000**

Price : **140/-**

Published by :

Sri L.V. Subrahmanyam, I.A.S
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P : **D. Satyavati**

Cover Design : **Siva Sankar,** T.T.D. Press.

Printed at :

Chennai Micro Prints, Chennai - 29.

ముందు మాట

భారతీయ ఆర్షవాఙ్మయం మిక్కిలి ప్రాచీనమైనది. వేద. ఉపనిషత్. ఆగమ. ఇతిహాస. కావ్య. ప్రబంధాది సంప్రదాయాలతో విలసిల్లిన సనాతన వాఙ్మయం మానవజీవనపథానికి నిబద్ధతతో కూడిన దిశానిర్దేశం చేసిందనడం నిర్వివాదాంశం. వేదకాలం నుండి కూడ భారతీయులు భాష. శబ్దజాలం పట్ల నిశిత దృక్పథంతో కూడిన అధ్యయనం సాగిస్తూవున్నారు. యాస్కుని నిరుక్తం. పాణిని వ్యాకరణం వంటి బృహద్గ్రంథాలు ఈ యంశాన్ని నిరూపిస్తున్నాయి.

భారతీయ విజ్ఞాన సర్వస్వానికి మూలకందాలైన వేదాలు, ఉపనిషత్తుల సారాంశాన్ని శ్రీవేంకటేశ్వర తత్త్వ. మహాత్మ్యాలకు సమన్వయించి సంకీర్తనావాఙ్మయాన్ని సృష్టించిన తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య. 15.16 శతాబ్దాలలో ప్రజాబాహుళ్యంలో నలుగుతున్న వ్యావహారిక పదజాలంతోనే. జానపదుల నిసర్గమనోహరమైన భావజాలంతోనే పదరచన చేసిన అన్నమయ్య శబ్దప్రయోగాలకు ప్రత్యేకించి ఒక నిఘంటువు అవసరం - అన్న అంశాన్ని గుర్తించి తిరుమల తిరుపతి దేవస్థానం - అన్నమాచార్య ప్రాజెక్టు ఈ బృహత్తర ప్రణాళిక చేపట్టడం జరిగింది. అన్నమయ్య వాఙ్మయ పరిశోధనా ప్రస్థానంలో ఈ నిఘంటు నిర్మాణం ఒక తలమానికమైన అంశమే. ఎందువల్లనంటే ఈ మహత్తర ప్రస్థానంలో 1920 దశకాల నుండి మహామహులైన శ్రీసాధు సుబ్రహ్మణ్యశాస్త్రి. శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి. శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. శ్రీఉదయగిరి శ్రీనివాసాచార్యులు. శ్రీగౌరిపెద్ది. రామసుబ్బశర్మ - ప్రభృతులు సంతరించిన ఆ యా సంపుటాల పీఠికలలో శబ్దచర్చ. అర్థనిర్ణయం - వంటి అంశాలు కూడ ఉన్నాయి. ఈ అర్థనిర్ణయంలోని క్లేశాన్ని కూడ వారు విశదీకరించియున్నారు. సమకాలీన శాసనాలను. కావ్య ప్రయోగాలను కూడ అధ్యయనం చేసి. సందర్భోచిత శైలీ ప్రాముఖ్యాన్ని గుర్తించి ఎంత లోతులకు ఈ అధ్యయనాన్ని సాగించవలసి ఉంటుందో వారి వారి వ్యాసాలలో అవగతం అవుతుంది. ఇటువంటి క్లేశాలను అధిగమించి "అన్నమయ్య పదకోశం" - నిర్మాణం కావించిన ఆచార్య రవ్వాశ్రీహరి అభినందనీయులు. ఈ ప్రణాళికకు సంబంధించిన రూపకల్పన. ప్రతిపాదన వంటి అంశాలలో చొరవ చూపిన అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డా॥మేడసాని మోహన్ కూడ అభినందనీయులు.

ఈ నిఘంటు నిర్మాణంలో ఇది ప్రథమ ప్రయత్నమైనందువల్ల సమగ్రం - సాంగోపాంగం - అనలేము. సముచితంగా మార్పులు. చేర్పులు సహృదయంతో. సత్యాన్వేషణ దృక్పథంతో ఎవరైనా పెద్దలు సూచిస్తే తరువాతి ముద్రణలలో ఆ యంశాలు చేర్చే అవకాశం ఉండవచ్చు. ఈ "అన్నమయ్య పదకోశం" పరిశోధకులకు. భాషాభిజ్ఞానులకు. అన్నమయ్య వాఙ్మయారాధకులకు తప్పక ఉపయోగపడుతుందనే ప్రగాఢవిశ్వాసంతో అందిస్తున్నాం.

సదా శ్రీనివాసుని సేవలో

కార్యనిర్వహణ అధికారి.

ఒక మాట

పదకవితాపితామహుడు. మహాభాగవతోత్తముడునైన తాళ్ళపాక అన్నమాచార్యులవారు తొలి తెలుగు వ్యావహారిక కవి. 15.16 శతాబ్దాలలో ప్రజావ్యవహారంలో ఉన్న పదజాలం. పండిత పరిభాషగా నున్న సామాసిక శబ్ద ధోరణి - ఈ రెండు అంశాలూ మేళవించిన శిష్టవ్యావహారికం అన్నమయ్య దృక్పథంలో భాసిస్తుంది. పద్యానికి భిన్నంగా పదాన్ని ఎంచుకొని. ప్రాబంధిక ప్రామాణిక భాషాశైలికి భిన్నంగా వ్యావహారిక మార్గాన్ని ఎంచుకొన్న అద్భుతమైన దేశీయకవి అన్నమయ్య. అలా అని ఆ మహాకవి పద్యప్రక్రియను చిన్నచూపు చూడలేదు. విలక్షణమైన ఈ ఒరవడినే తరువాతి తాళ్ళపాకకవులు అనుసరించారు.

అన్నమయ్య శబ్దజాలాన్ని మనం పరిశీలించే సందర్భంలో ఒక్క అంశాన్ని స్పష్టంగా దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. అది ఏమిటంటే ఈ భాషా శబ్దప్రయోగాలన్నీ ఆంగ్లభాషా స్పృహ ఊహమాత్రంగా కూడ లేని రోజుల్లో ప్రజల నాలుకలపై చిందులాడిన జీవద్భాషా విశేషాలు. ఉదాహరణకు మనం ఎవరికైనా ఒక మంచివార్త చెప్పాలంటే "మీకొక గుడ్‌న్యూస్" - అంటాం. శుభవార్త అనడానికి ఇప్పుడు గుడ్ న్యూస్ - అనే పదం ఎక్కువగా వాడుతుంటారు. అన్నమయ్య ఇటువంటి సందర్భాలకు "మేలు సుద్ది" - అనే పదాన్ని ప్రయోగించడం - వంటివి చూస్తే మాత్రం పరభాషాస్పృహలేని తెలుగుబిడ్డ పూర్వశతాబ్దాలలో ఎంత స్వచ్ఛమైన తెలుగు మాట్లాడేవాడో మనకు తెలుస్తుంది. పరభాషాపదాలు ఏమాత్రం ప్రసంగాలలో దొర్లకుండా పూర్తిగా మనం తెలుగులోనే మాట్లాడుకోవాలి - అనే పట్టుదలతో ప్రయత్నిస్తే. అటువంటి ప్రయత్నానికి అన్నమయ్య భాషాధ్యయనం ఎంతో ఉపకరిస్తుంది.

ప్రస్తుతం ఆచార్య రవ్వాశ్రీహరి గారు ఎంతో పరిశ్రమించి రూపొందించిన "అన్నమయ్య పదకోశం" - అనబడే ఈ నిఘంటువు వారి పరిశోధనాత్మక ఫలం. అయితే పదకోశనిర్మాణానికి సంబంధించి ఇది ప్రథమప్రయత్నమైనందువల్ల సమగ్రతను సంతరించుకొన్నదనడానికి నేను సాహసించలేకపోతున్నాను. సారస్వతక్షీరసాగరంగా మహోదయులు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారిచే పేర్కొనబడిన అన్నమయ్య పదవాఙ్మయంలోని శబ్దప్రయోగవిశేషాలపై భవిష్యత్తులో ఇంకా ఎన్నో దృక్పథాలతో కూడిన పరిశోధనలు జరిగే అవకాశంఉంది.

తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు నిర్వహిస్తున్న ప్రణాళికాబద్ధమైన వాఙ్మయ వ్యాసంగాలలో ఈ "అన్నమయ్య పదకోశం" - వెలువరించడం ఒక మైలురాయి వంటి సన్నివేశం. ఈ అంశమై తమ సాధికారికమైన పరిశోధనా కృషిని అంకితభావంతో నిర్వహించిన ఆచార్య రవ్వాశ్రీహరిగారికి నా నమస్సుమాంజలులు.

ఈ మహావాఙ్మయ యజ్ఞానికి ఉత్తేజకరమైన సూచనలతో. ఆదేశములతో ప్రోత్సహించిన అప్పటి తి.తి.దే.ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీభూమన కరుణాకర రెడ్డిగారికి. ప్రస్తుత తి.తి.దే.అధ్యక్షులు శ్రీకనుమూరి బాపిరాజుగారికి. ధర్మపాలనాధురంధరులైన అప్పటి కార్యనిర్వహణ అధికారులు శ్రీకె.వి.రమణాచారిగారికి. శ్రీ ఐ.వై.ఆర్.కృష్ణారావుగారికి. ఆర్షవిద్యారాధకులు. ప్రస్తుతకార్యనిర్వహణ అధికారి శ్రీ.ఎల్.వి.సుబ్రహ్మణ్యం గారికి. విద్వదారాధనా పతంగులు. సంయుక్తకార్యనిర్వహణ అధికారి శ్రీ.పి.వెంకటరామిరెడ్డిగారికి నా కైమోడ్పులు.

హరియవతార మితడు అన్నమయ్య
అరయ మా గురుడితడు అన్నమయ్య

- డా॥మేడసాని మోహన్. సంచాలకులు. 17/11/2012

అన్నమాచార్య ప్రాజెక్టు. తి.తి.దేవస్థానములు.

తిరుపతి.

ఆముఖం

తొలి తెలుగువాగ్గేయకారుడు, పదకవితాపితామహ బిరుదాంచితుడు తాళ్లపాక అన్నమాచార్యులు తన పదహారవయేటనే తిరుమలలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి సాక్షాత్కారాన్ని పొంది తదాజ్ఞచే తన్మయుడై రోజుకొక్కటికి తక్కువ కాకుండా సుమారు ముప్పైరెండువేల సంకీర్తనలు రచించి ధన్యుడైన భక్తవరేణ్యుడు.

ముప్పైరెండువేల సంకీర్తనల్లో మనకు లభించినవి 14358 మాత్రమే, అన్నమయ్య కుమారుడు పెదతిరుమలాచార్యుడు ఈ సంకీర్తనలనన్నింటినీ రాగిరేకులపై చెక్కించి అమూల్యమైన సంకీర్తన సాహిత్యాన్ని మనకందించినాడు. ఈ సంకీర్తనల్లో అన్నమాచార్యుల సంకీర్తనలతోపాటు పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యుల సంకీర్తనలు కూడా ఉన్నా ప్రధానవ్యపదేశంచేత వీటికి అన్నమాచార్యుల సంకీర్తనలనే వ్యాప్తి వచ్చింది.

ఈ సంకీర్తనల్లో నాలుగు అంశాలు ప్రధానంగా గోచరిస్తాయి. అవి 1. భక్తి 2. సాహిత్యం 3. సంగీతం 4. భాష

వీటిన్నింటిలోనూ అన్నమయ్య తన విశ్వరూపాన్ని ప్రదర్శించినాడనడంలో సందేహం లేదు. స్వామివారిని వేలకొద్ది కీర్తనల్లో రసభావబంధురంగా వర్ణిస్తూ గానం చేసినాడంటే ఆయన ఎంత భక్తిభావ సంపన్నుడో, ఎంత సాహితీనిర్మాణదక్షుడో, ఎంత సంగీతప్రవీణుడో, ఎంత భాషాప్రయోగచతురుడో అర్థం చేసుకోవచ్చు.

అన్నమయ్య సంకీర్తనల్లోని భాష ఎంతో విలక్షణమైంది. సమకాలంలో వస్తున్న ప్రబంధాల్లోని దీర్ఘ సమాసభూయిష్ఠమైన సంస్కృతపదబహుళశైలిని త్రోసిరాజని ప్రజల వ్యవహారంలో ఉన్న తెలుగుభాషకు పట్టంకట్టిన మహానుభావుడు. తన సంకీర్తనల ద్వారా భక్తిభావాన్ని సామాన్యప్రజల్లో కూడా వ్యాప్తి చేయాలనే లక్ష్యమే ఇందుకు కారణం. ఒక విధంగా అన్నమయ్య తొట్టతొలి వ్యావహారికభాషోద్యమనిర్మాత అని చెప్పవచ్చు. ఆయన భాష విలక్షణమైంది. జనవ్యవహారం ముందు వ్యాకరణనియమాలు పట్టించుకోనవసరంలేదన్న భావంతో వ్యాకరణవిరుద్ధాలైన ప్రయోగాలకుకూడా జనవ్యవహారం కారణంగా సాహసంతో తన సంకీర్తన వాఙ్మయంలో ప్రయోగార్హత కల్పించినాడు. భాషావ్యవహారానికి జీవం పోసే ప్రాంతీయమాండలిక పదాలనెన్నింటినో వాడి ప్రస్తుతం ప్రామాణికభాష పేరుతో వివిధ ప్రాంతాల్లోని అచ్చమైన తెలుగుపదసంపదను ఎంత ప్రయత్నపూర్వకంగా పోగొట్టుకున్నామో మనకు గుర్తు చేసినాడు. వెలిబుచ్చే అభిప్రాయాన్ని సమర్థంగా, రమణీయంగా, హృదయానికి హత్తుకునేటట్లుగా చెప్పడానికి ఉపయోగించే జాతీయాలను, సామెతలను పరశ్శతంగా వాడి భాషకు సహజత్వాన్నీ, రమణీయతనూ సాధించినాడు. తిక్కనవలె కొన్ని సంస్కృతపదాలకు అచ్చతెలుగుపదాలను సృష్టించి భాషావిషయంలో తన సృజనశక్తిని ప్రకటించుకోవడమే కాకుండా తెలుగుభాషకున్న శక్తిని తెలియజేసినాడు. ఆయా భాషాప్రాంతాల సామీప్యకారణంగా, తత్తద్భాషా వ్యవహర్తలతో సహజీవనం కారణంగా అన్యభాషాపదాలను కూడా స్వీకరించి తన ఉదారత్వాన్ని ప్రదర్శించినాడు, వింతవింత తద్ధితాంతపదాలను వాడడమేకాక ఒక్కో సంకీర్తనలో ప్రతి చరణంలోనూ తద్ధితాంతపదాలను వాడి సంకీర్తనకొక వింత సొబగును ఆపాదించినాడు.

వింతసంధులు, (ఒబ్బుద్ధి, నియ్యెడ మొ॥) వైరిసమాసాలు, (దినపెండ్లి, నిత్యకొత్తలు మొ॥) మహాప్రాణవర్ణాలకు బదులు అల్పప్రాణప్రయోగం (సుకం,వీది,బాద, బోజనము మొ॥) రేఫఱకారాల విషయంలో శైథిల్యం, వ్యావహారికభాషలోనూ అరసున్నలను ప్రయోగించడం, అరసున్నలు లేనిచోట అరసున్నలు ప్రయోగించడం (కట్టఁగడ, మామఁగారు, మాఁట మొ॥) వింత వాక్యరచనా విధానం మొదలైన అంశాలలో వ్యావహారికతతో పాటు భాషాసాహసిక్యాన్ని కూడా ప్రదర్శించినాడు, విలంబానికి ఓర్వని భావతీవ్రత, దానిని అల్లివేయటంలో గల వేగం కారణంగా కూడా అన్నమయ్య ఎన్నో భాషా విశేషాలతో రచన చేసినాడు.

అన్నమయ్య భాషలో అప్రసిద్ధమైన దేశ్యపదాలు, మాండలికపదాలు, జాతీయాలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. వీటిలో ఎక్కువ పదాలు ఈనాటి భాషావ్యవహారంలో లేకపోవడంవల్లా, ఇతర కవిప్రయోగాల్లో కూడా కనిపించకపోవడంవల్లా, కొన్ని మాండలిక పదాలు కావడంవల్లా వీటి అర్థాలు నేడు సులభంగా తెలియడం లేదు. అన్నమయ్య సాహిత్యంలో విశేషకృషి చేసిన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు, డా॥వేటూరి ఆనందమూర్తిగారు మొదలైన పండితులు కొన్ని పదాలకు అర్థనిర్ణయంచేసి పఠితలకు మహోపకారం చేసినారు. ఐనా అర్థనిర్ణయం కావలసిన పదాలు ఇంకా ఎన్నో మిగిలి ఉన్నాయి.

తిరుమల తిరుపతి దేవస్థానంవారి కృషివల్ల ఇటీవల అన్నమయ్య కీర్తనలకు దేశంలో విశేష ప్రచారం కలుగుతుంది. విశ్వవిద్యాలయాల్లో కూడా అన్నమయ్య సాహిత్యంపై విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్నమయ్య సాహిత్యాన్ని చక్కగా అర్థం చేసుకోవడానికి వీలుగా అన్నమయ్య వాడిన విశేషపదాలకు అర్థవివరణలు చూపే నిఘంటువు రావలసిన అవసరాన్ని ఎంతోమంది పండితులు వెలిబుచ్చినారు.

2004లో నేను **'శ్రీహరి నిఘంటువు'** పేర సూర్యరాయాంధ్రనిఘంటుశేషాన్ని ప్రకటించినాను. అప్పుడున్న పరిమితులను బట్టి అందులో, అన్నమయ్య సంకీర్తనల్లోని కొన్ని పదాలకు మాత్రమే అర్థవివరణ చేయడం జరిగింది. మిగిలిపోయిన పదాలు ఇంకెన్నో ఉన్నాయి. అన్నమయ్య వాడిన క్లిష్టపదాల కన్నింటికీ ప్రత్యేకంగా ఒక నిఘంటువును కూర్చాలన్న ఆకాంక్ష నా కప్పుడే కలిగింది. అన్నమయ్య పదకోశాన్ని రచించగలిగిన సామర్థ్యం నా కున్నదా అని ఆలోచించుకోకుండానే 'చాపలాయ ప్రచోదితః' అన్నరీతిగా ప్రథమప్రయత్నంగా 29 సంపుటాల్లోని సంకీర్తనల్లోని క్లిష్టపదాలనన్నింటినీ కార్డులపై వ్రాయడం ప్రారంభించినాను.

ఆ తరువాత ఆయా పదాల అర్థనిర్ణయంకోసం ప్రయత్నం ప్రారంభించి వివిధ నిఘంటువులు, ఇతరాధారాల సాహాయ్యంతో నిఘంటునిర్మాణాన్ని కొనసాగించినాను.

అప్పటి తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారులు డా॥ కే.వి.రమణాచార్యులుగారు ఈ కార్యక్రమం దేవస్థానం పక్షాన జరగడం సముచితంగా ఉంటుందని భావించి కావలసిన సహాయ సంపత్తిని సమకూరుస్తూ నిఘంటు నిర్మాణబాధ్యతను నా కప్పగించినారు. తాళ్ళపాక సంకీర్తనల్లోని అన్ని పదాలకు కాకుండా క్లిష్టమైన పదాలకు మాత్రమే అర్థవివరణ చేయడం జరిగింది.

విద్వాంసులు సందిగ్ధపదాల విషయంలో చర్చించి అర్థనిర్ణయం చేయడానికి వీలుగా అన్నమయ్య సాహిత్యంలో కృషి చేసిన డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు, శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు గారు, ఆచార్య కే.సర్వోత్తమరావుగారు, ఆచార్య పి.నరసింహారెడ్డిగారలతో సమావేశం ఏర్పాటు చేయవలసిందని కోరగా అన్నమాచార్యప్రాజెక్టు డైరెక్టర్ డా॥ మేడసాని మోహన్‌గారు వెంటనే ఏర్పాటుచేసి సందిగ్ధపదాల అర్థనిర్ణయవిషయంలో సహకరించినారు. ఇందుకు వీరందరికీ నా కృతజ్ఞతలు.

ఈ పదకోశనిర్మాణవ్యాజంతో అన్నమయ్య సంకీర్తనల నన్నింటినీ అక్షరశః చదివే అవకాశం కలగడం, వేంకటేశ్వరస్వామిపై అన్నమయ్య చూపిన భక్తి భావాన్నీ, తెలుగుభాష సొగసులను ఆస్వాదించే భాగ్యం కలగడం, అన్నమయ్య వివిధరీతుల్లో వర్ణించిన ఆ స్వామి వైభవాన్ని మనస్సులో సాక్షాత్కరింపజేసుకొని అనుభవించే అదృష్టం కలగడం నా పూర్వజన్మసుకృతఫలంగా భావిస్తున్నాను.

ఈ పదకోశనిర్మాణవిషయంలో అనుసరించబడిన విధానాన్ని దిగువ పొందుపరుస్తున్నాను.

అర్థవిషయంలో క్లిష్టత ఉన్న పదాలనే ప్రధానంగా స్వీకరించడం జరిగింది. ఐతే ఇటీవలికాలంలో అన్నమయ్య సంకీర్తనలను ఎంతోమంది భక్తులు, సంగీతజ్ఞులు పాడుకుంటూ ఉండటంవల్ల వారి సౌకర్యం కోసం ఒకింత కఠినంగా తోచే కొన్ని పదాలు కూడా చేర్చబడ్డాయి. సాధారణ పదాలకు ఇతర నిఘంటువుల్లో అర్థాలు లభిస్తాయి కనుక వాటిని ఈ నిఘంటువులో గ్రహించలేదు. అలాగే శబ్దరూపవిషయంలో కొంత విలక్షణత కలిగిన పదాలను తుమ్మిద, కానికె, ఆతుమ మొదలైన పదాలను కూడా ఆరోపాలుగా గ్రహించడమైనది. అంతేకాక ఆయా కీర్తనల్లో పేర్కోబడ్డ వ్యక్తుల పేర్లు, స్థలాలపేర్లు కూడా వివరింపబడ్డాయి.

ప్రతి ఆరోపానికి సంబంధించిన వ్యాకరణ విశేషంతోపాటు ఆ శబ్దానికున్న అర్థమూ, ఆ శబ్దం ప్రయోగింపబడిన సంకీర్తనంలోని రెండు చరణాలూ ఉదాహరింపబడ్డాయి. కొన్నిచోట్ల ఆయా ఆరోపాలకున్న వివిధార్థాలూ చూపబడ్డాయి. దీనివల్ల ఆయా ఆరోపాలు ప్రయోగింప బడినచోట్ల సందర్భానుగుణంగా సముచితమైన అర్థాన్ని చెప్పుకోవడానికి వీలవుతుంది. అర్థ వివరణసందర్భంలో తాళ్లపాకకవుల సంకీర్తన సంపుటాల్లో సంపాదకులు, ఇతరపండితులు వివరించిన అర్థవిశేషాలూ గ్రహింపబడ్డాయి. కొన్ని సందర్భాల్లో అర్థవిశేషాలు తెలియని పదాలు ప్రశ్నార్థకంతో చూపి ప్రయోగం మాత్రం చూపడం జరిగింది. ఆయా పదాలు సంకీర్తనల్లో ఎన్నెన్ని పర్యాయాలు ప్రయోగింపబడ్డాయో ఆరోపాల తరువాత కుండలీకరణంలో సంఖ్యతో సూచింపబడింది.

ఇందులో ఇంకా చేర్చవలసిన పదాలు లేకపోలేదు. ఐతే వాటి అర్థవిషయంలో సందిగ్ధత ఉండడంవల్ల ఈ పదకోశంలో చేర్చడం జరుగలేదు. మొత్తంపై నా శక్తిమేరకు, ఎరుకమేరకు ఈ పదకోశాన్ని సిద్ధంచేసి మీ ముందు ఉంచుతున్నాను. ఇందులోని బాగోగులను తెలియజేస్తే సహృదయతతో స్వీకరిస్తాను.

ఇటీవలే తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులై భక్తుల సౌకర్యాల విషయంలో ఎంతో కృషి చేస్తున్న శ్రీ కనుమూరి బాపిరాజు ఎమ్.పి. గారికి

తొలిదశలో ఈ పదకోశనిర్మాణబాధ్యతను నా కప్పగించి అన్నివిధాలా తోడ్పడుతూ ప్రోత్సహించిన సహృదయులు అప్పటి తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారులు డా॥కే. వి. రమణాచార్యులు ఐ. ఏ. ఎస్. గారికి

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విషయంలో ప్రత్యేకశ్రద్ధ వహిస్తూ ఈ నిఘంటు నిర్మాణవిషయంలో నాకు అన్నివిధాలా సాహయ్యం చేసిన పూర్వకార్యనిర్వహణాధికారులు శ్రీ ఐ. వై. ఆర్ కృష్ణారావు ఐ. ఏ. ఎస్. గారికి,

ధర్మప్రచారానికి ఆధ్యాత్మికగ్రంథాల ప్రచురణ ఆవశ్యకాన్ని గుర్తించి ప్రచురణ కార్య క్రమాలను వేగవంతం చేస్తున్న ధర్మనిష్ఠులు, ప్రస్తుత కార్యనిర్వహణాధికారులు శ్రీ ఎల్. వి. సుబ్రహ్మణ్యం ఐ. ఏ. ఎస్. గారికి, జే. ఈ. వో. శ్రీ వెంకటరామరెడ్డి ఐ. ఏ. ఎస్. గారికి,

నిఘంటునిర్మాణప్రారంభంనుండీ నేటివరకూ అడుగడుగునా తగు సలహాలనిచ్చి సహకరించిన సహృదయమిత్రులు అన్నమాచార్యప్రాజెక్టు డైరెక్టర్ డా॥ మేడసాని మోహన్‌గారికి

సందిగ్ధపదాల అర్థనిర్ణయంకోసమై ఏర్పాటుచేసిన సమావేశాల్లో పాల్గొని నాకు తోడ్పడిన విద్వాంసులు డా॥ సముద్రాల లక్ష్మణయ్య, శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు, ఆచార్య కే. సర్వోత్తమరావు, ఆచార్య పి. నరసింహారెడ్డిగారలకు

అర్థనిర్ణయవిషయంలో సందిగ్ధపదాల పట్టికలను వివిధపండితులకు పంపి నా సందేహాలను తీర్చవలసిందిగా కోరినపుడు సహృదయతతో స్పందించిన విద్వత్కవులు కీ. శే. మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం (రైల్వేకోడూరు) గారికీ, డా॥ శ్రీరంగాచార్యులు (హైదరాబాదు) గారికీ

ఈ పదకోశాన్ని ముద్రించడంలో అత్యంతశ్రద్ధ వహించి చక్కగా ముద్రించిన టి. టి. డి ప్రెస్సు మేనేజర్ శ్రీ సాంబశివరావుగారికి

నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ పదకోశనిర్మాణదశలో నాకు లేఖకుడుగా సహకరించిన చి॥బి. శ్రీనివాసులుకు, కార్యాలయ సహాయకుడుగా తోడ్పడిన చి॥ బి. జగ్జీవన్‌కు, డి. టి. పి చేసిన ధూళిపాళ సత్యవతిగారికి నా శుభాకాంక్షలు.

జిజ్ఞాసువుల కీ ఈ పదకోశం ఏ మాత్ర ముపయోగించినా నా ప్రయత్నం సఫల మౌతుందని భావిస్తాను.

(రవ్వా శ్రీహరి)

అ

అంకకత్తె: (అంకము + కత్తె) వి. శూరురాలు, ముఖ్యురాలు, మాత్సర్యశీలురాలు, కళంకం కలది, పార్శ్వమందుడే చెలికత్తె, పామరురాలు చూ: అంకెకత్తె.

"ఏడసుద్ది నన్నుఁజూచి యేల కొంకేవు

ఆడానీడా నిన్నొరయ నంకకత్తెనా" 27-227

"వంక లాడవలెఁగాక వలచిన పతితో

అంకకత్తెవలె నేల అ ఙ్ఙిదిమేవే" 27-233

అంకగాఁడు: (2) వి. పామరుడు (ఆం.ప.ని.), చలము పట్టువాడు, శూరుడు, ముఖ్యుడు.

"బింకమాడకుండ నాన వెట్టితినవో

అంకగానివలె నన్ను నఙ్ఙిదిమీని" 17-437

నిఘంటువుల్లో అంకకాఁడు అనే రూపమే. చూ: అంకెకాఁడు.

అంకించు: స.క్రి. స్తుతించు (పట్టుకొను, కలిగించు, దొంగిలించు, తిప్పు, ధరించు), గుఱుతించు.

"పంకజభవాదులకుఁ బరదైవ మాతఁడని

అంకింతు రితఁడో అధికుఁడొకచో" 1-37

అంకిలి: వి. అడ్డగింత. (క్షోభం అని ఆం.ప.ని.)

అంకు: వి. దవడకీలు. (గ్రామదేవత)

"కందువల వెన్న దీసే కాంతలతో నవ్వ నేల

కిందువడి అంకులు దాఁకించుకో నేల" 20-584

అంకురార్పణము: వి. ఆరంభం; ఏ శుభకార్యారంభం లోనైనా పాలికాపూజ చేసి అందులో నవధాన్యాలు చల్లి మొలకలు పోస్తారు.

"వెలయఁగ లక్ష్మీవిభుని పెండ్లికిని

బలసి అంకురార్పణ మదివో" 22-96

అంకులు: వి. ఆభరణవిశేషం.

"అంకులు వెట్టించుకోఁగా నండ వచ్చితి గాక

లంకెలఁ బెనఁగితేను లావు చూపేవా" 20-306

అంకె: వి. 1. సామీప్యము, చేరిక 2. పట్టు, ఊతం, వశం, అధీనం, అదను, సమయం. (పీఠిక)

అంకెకత్తె: వి. (అంకె + కత్తె) అధీనంలో ఉన్న స్త్రీ, ప్రధానురాలు, మాత్సర్యశీలురాలు, కళంకం కలది.

"అలిగితే నీతోడి అంకెకత్తె నందువు

యెలమి నీతోడి గాడ కేమి సేతురా" 25-213

"అంకెకత్తె నైతినంటా అప్పటి నుప్పతించేవు

సంకెదీర నీకు నీవే సాదవు గారాదా" 23-412

"తూటిపాటి తెలియకే దొడ్డమేలు రాఁగా రాఁగా

ఆఱడిబెట్టను నేను అంకెకత్తెను గానీ" 13-41

"అగ్గలమై నీతోడి అంకెకత్తెనా నేను

దగ్గరి నంతాఁగలిగి తగురా నీకు" 11-295

అంకెకాడు: (అంకె + కాడు) వి. మొనగాడు, ముఖ్యుడు, శూరుడు. (వర్తకముఖ్యుడు)

"ఇంక నేలా నాతోడ యింత సేయ

అంకకాఁడ వౌర శేషాద్రినాథ" 12-10

"కొంకు లేక కూడితివి కూరిమితో నిటు నన్ను

అంకెకాడ విఁక నీకు వల పున్నదా" 24-584

"కొంకు దేర నిన్ను నిట్టే కూడుదు నటే

అంకెకాఁడ నీకు నేను అప్పణిచ్చేనా" 16-395

అంకెకుఁజిక్కు: అ.క్రి. దారికి వచ్చు.

"ఆసలే పుట్టించుఁగాని అంకెకు తాఁజిక్కడే

వేసరక యంతేసి వేఁడుకోనీనా" 28-565

అంకెకు రాని పనులు: వి; బహు. దారికి రాని పనులు, గణనకు రాని పనులు.

"అంకెకు రాని పను లైనపాటి చాలును

మంకులు చెల్లవు నిన్ను మరిగినదానను"
7-585

అంకెకు లోనగు: అ.క్రి. వశంలోనికి వచ్చు, గణనలోనికి వచ్చు.

"కొంకక నీ మేన నెన్ని గురుతులు నించుకొన్నా

నంకెకు లోనగుఁ గాక యలిగేనా" 13-401

అంకెకు వచ్చు: ప.బం; అ.క్రి. 1. దారికి వచ్చు, రీతికి వచ్చు 2. వశమగు.

"ఇల నా యంకెకు రావు యింద్రియములు నావైనా
కలసి నా మర్మములే కాఁడిపారీఁగాని"

10-58 old

"ఆస విడిచినఁగాని యంకెకు రాదు విరతి"

15-326

అంకెలో నుండు : అ.క్రి. అధీనంలో ఉండు, వశంలో ఉండు. 12-425

అంకెవచ్చు : అ.క్రి. (?)
"అరుదై శ్రీవేంకటేశ అంకెవచ్చేనా నీకు
పరువపు నీ మాటపట్టు నమ్మివుంటిని" 20-509

అంగజముద్ర : వి. మన్మథముద్ర, నఖక్షతాదికం.
"అంగజముద్రలు నీపై నట్టె నెలకొనె నంటే
అంగడిఁబెద్దరికము అది నీకుఁ గాదా" 25-395

అంగజసాము : వి. మన్మథకేళి; వింత సమాసం.
"ముంగిట చెలి చెమట ముంగారులవె ముంచె
అంగజసాములచేత నలసినవేళను" 26-121

అంగడిఁదోయు : స.క్రి. (?)
"తేనెలు పెరల దించె తీగెలను వల్లెవేసె
ఆనుకొని చంద్రకళ లంగడిఁదోసె" 23-63

అంగడిఁబడు : ప.బం; అ.క్రి. 1. పరుగెత్తు (పారిపోవు ఆం.శ.ర.) 2. బహిరంగమగు, బయటబడు, బజారునపడు.
"ఆవల భయపడ్డవా రంగడిఁబడితే దొర
లోవల విచారించి వూరడింతు రంతలోనే" 3-70
"జంగిలి సతుల నీవు సారెసారె నమ్మించఁగా
అంగడిఁబడీనవే నీ అన్నమాటలు" 8-151

అంగడిఁబెట్టు : ప.బం; స.క్రి. బట్టబయలు చేయు, బహిరంగపరచు, అల్లరిపెట్టు.
"అంగడిఁబెట్టేవు మమ్ము నౌనోయి బావ నీ
ఇంగితము లెల్లాఁగంటి మింకా నా బావా"

16-305

అంగడిఁబెట్టే వయసు : వి. యౌవనం.
"అంగడిఁబెట్టే వయసు అడియాల మానునే
బెంగతనాన నుండినాఁ బెడరేఁచుఁ గాక" 21-404

అంగడిఁబెద్దరికము : వీధి పెద్దఱికం, రచ్చబండ పెద్దఱికం.
"అంగజముద్రలు నీపై నట్టె నెలకొనె నంటే
అంగడిఁబెద్దరికము అది నీకుఁ గాదా" 25-395

అంగడికర్మము : వి. బాహ్యకర్మము.
"మింగుచుఁ గర్మపునామము మేసిన సంసారికి
అంగడికర్మమే బ్రహ్మమై తోఁచును" 3-367

అంగడికెక్కు : ప.బం; అ.క్రి. బయటపడు, రచ్చకెక్కు, వీధికెక్కు, బజారుకెక్కు, బహిరంగమగు, అల్లరిపడు
"ముంగిట నాకఁడున్నాఁడు మూల నున్నదాన నేను
అంగడికెక్కె వలపు లవుఁ గదవే" 11-350

అంగడికెత్తినట్టి దివ్వె : ప.బం; వి. ఇతరుల కుపయోగపడేది, బయల నెత్తిన దివ్వె.
"అంగడి కెత్తినట్టి దివ్వె లంగనాముఖాంబుజములు
ముంగటి పసిడికుంభములును ముద్దుల కుచయుగంబులు" 1-1

అంగడిచుట్టరికము : ప.బం; వి. అస్థిరమైన చుట్టరికం.
"ముంగిట నే నుండఁగాను మోహించి చెనకేవు
అంగడిచుట్టరికాలు అవి యాల" 9-231

అంగడిజంత : ప.బం; వి. బజారుస్త్రీ, బజారు గయ్యాళి, విణ. దుష్టురాలు, సాహసికురాలు (సూ.ని.)
"రంగయిన పెండ్లికూఁతురవు సిగ్గువలెఁగాక
అంగడిజంతవలె నాన లెంత చూపేవే" 22-354

అంగడిజాణతనము : ప.బం; వి. వీధిలోని నేర్పరితనం.
"కంగు లేక నీకు నేను కాపిరము సేయఁగాను
అంగడిజాణతనాల క దేమి గారణము"

25-323 , 7-252 & 25-457

అంగడిదొరతనము : ప.బం; వి. రచ్చబండ పెద్దఱికం, వీధి పెద్దఱికం, వీధి పెత్తనం, అందరికీతెలిసే దొరతనం.

"యెంగిలి మోవి చూపి యితవరి వైతివి
అంగడి నీ దొరతనా లవి యేమి చెప్పేదే"
29-392

అంగడినమ్ముకొను : *ప.బం; అ.క్రి.* అందులోనే పడి తన్నుకొను.
"ఆపదలంగడి నమ్మిఁ గొనరో
పాపాత్ములు పైపయిఁబడకా" 1-142

అంగడిపరిమళము : *ప.బం; వి.* అందరికీ లభించేది.
"అంగడిపరిమళ మందరివాఁడవు నీవు
సంగడిఁ దన సొమ్మంటా సాదించీఁగాక"
25-466

అంగడిబేరాలు : *ప.బం; వి; బహు.* ఫలప్రదం కానివి, బయటి బేరాలు.
"పొంగఁబొంగఁ బొంగులాయ పొలఁతి కోరికలవి
అంగడిబేరా లాయ నడియాసలు"
29-402 & 18-531

అంగడిమొక్కు : *ప.బం; వి.* అంగప్రదక్షిణం, తిరువీథులందు చేసే ప్రదక్షిణం, అందరితోపాటు చేసే నమస్సు, బయలున చేసే పొర్లుదండం.
"అంగపుఁజెమటల ప్రహ్లాదవరదా! నీకు
నంగడిమొక్కు మొక్కేఁ బ్రహ్లాదవరదా!"
21-203

అంగడిలోనికి నెక్కు : *ప.బం; అ.క్రి.* వీధికెక్కు, బజారుకెక్కు, బహిరంగమగు. చూ : అంగడికెక్కు.
"ముంగిటికి వచ్చె నివె మోహపు నీ సుద్దులు
అంగడిలోనికి నెక్కె నా సుద్దులు" 19-189

అంగడివలపు : *వి.* వేశ్య ప్రేమ, అస్థిరమైన ప్రేమ.
"అంగడివలపులకు ఆసపడేటివాఁడవు
అంగమే కాదా నిన్ను నడిగేఁగాని" 23-522

అంగడివాడు : *వి.* దుకాణదారు.
"అమ్మెడు జక్కవలంటా నడిగితినే వోరి
కమ్మర మానవు నే మంగడివారమా" 17-75

అంగడివేయు : *ప.బం; స.క్రి.* బహిరంగముచేయు, వెల్లడిచేయు.
"నిచ్చ నిచ్చా నీ విద్యలు నేరనివారా తాము
గచ్చుల తమ గుట్టంగడివేయ నోపనా" 25-257

అంగడిసతి : *ప.బం; వి.* జారస్త్రీ, కులట.
"అంగడిసతుల నెల్లా నంటినవాఁడవు నీవు
చెంగక ప్రియము లెల్లాఁ జెప్పరాదా ఇఁకను"
14-159

అంగడిసరకు : అందరికీ అందుబాటులో ఉండే వస్తువు.
"శ్రీవేంకటేశ నన్నుఁ జెందితి వింతటిలోనే
నీ వంగడిసరకవు ని న్నే మనేమయ్యా" 14-68

అంగద : *వి.* ఆట, తిండి, ఆశ, ఆకలి, కోపం, కుతూహలం, ఉత్సాహం, మనోవ్యథ, దుఃఖం, ఉపద్రవం. (ద్వేషం అని ఆం.ప.ని)
"యెంగిలి మోవిచ్చె నాపె యెనసి శ్రీవేంకటేశు
డంగదేలే యే లిద్దరట్టే మనములను" 13-470

అంగపు బంధువులు : *వి; బహు.* శరీరసంబంధం గల బంధువులు, దగ్గరి బంధువులు.
"అంగపుబంధువు లెల్ల అంటుబంధములు సుండి
సంగతి హరి యొకడె సత మింతేకాని" 4-108

అంగమచ్చము : (అంగము + మచ్చము) *ప.బం; వి.* 1. ఆనవాలు 2. శరీరం మీది గుర్తు, పుట్టుమచ్చ మొ॥
"అంటిన మోవిపై కెంపె అంగమచ్చమాయఁగాక
నంటున దారుకాణించ నా వసమా" 10-II-30

అంగమచ్చెము : 'అంగమచ్చము'నకు రూపాం.
"పట్టితి నంగమచ్చెము భావించి చూచినప్పుడే
పెట్టితి నీమీఁద నొక్క పెనునేరమి" 14-291

అంగము : *వి.* అందం, ఆకర్షణ. ప్రా. అంగ; సం. చంగ. (సుందరం)
"అంగమయిన మొల పీతాంబరమున
కొంగుబంగారై కూడె నీతఁడు" 9-2-7old
"ముంగిలిఁ బిడికిలించి మొలఁజేర్చిన చేయి

అంగమాయ నీ సొబగు హనుమంతరాయ"

4-413

"అంగపు నీ మాటల పయ్యెద గొంత విసరితే
వెంగలివాని గుట్టు విరియుఁ బో యివుడే"

21-530

"బంగారు మొలనూళ్లతో బాగై
యుండినపిఱుఁదు
అంగమైన పాదములు హస్తములను" 28-383

అంగరంగవైభవము: *ప.బం; వి.* అంగములకు (దేవతల విగ్రహాలకు), రంగమునకు (ఆలయమునకు) భోగాలు చేయటం, దేవుని ఊరేగింపులో అన్ని హంగులు ఏర్పరచి బయలుదేర దీసినప్పటి వైభవం, సమస్త భోగాలు.

"ఆటలఁ బాటలఁ జూచి అంగరంగవైభవముల
నీటుతోడ సొమ్ములెల్లా నిండాఁబెట్టుక" 14-368

"అట్టె కాఁగిటఁ గావించె అంగరంగవైభవాలు
ముట్టిన మీ చెనకులు ముయికి ముయి"

21-188

అంగవించు: *అ.క్రి. 1.* దగ్గరికివచ్చు, చేరువఅగు 2.ఉంకించు, యత్నించు 3. మించు, జయించు 4.తెగించు, సాహసించు 5. ఉల్లసించు, ఉత్సహించు. స.క్రి. అతిక్రమించు .

"చెంగట నలమేల్మంగ శ్రీవెంకటేశ నిన్ను
నంగవించి కూడె నీవే యఖిలభోగాలు" 7-129

"అచ్చుమోపి దాసునిఁగా నంగవించిరి నీ దాసు
లిచ్చల నన్నుఁజేపట్టు మిందులకు నైననాను"

15-16

"పొంగేటి జవ్వనముతో పొదరిల్లు దూరి నీతో
నంగవించి సన్నసేసే నది గొనవా" 19-363

"రంగుగనే నలమేలుమంగను శ్రీవేంకటేశ
అంగవించి నీ వేలితి వందా లాయ రతులు"

24-340

"వుంగిటి నాతఁడు నీతో నొడివట్టి పెనఁగితే
నంగవించవానే నిన్నాడుదుఁబో అపుడు"

9-282

"యింగితాన శ్రీవేంకటేశుఁడాకె తన పొందు
కంగవించి సొకిరై తన కనరాదు గాని" 7-162

"వెట్టిగాడు వేంకటాద్రివిభుఁడ నీవు మదనరచన
లట్టునిట్టు సేయ నన్ను నంగవించినాఁడవో"

5-136

"పూవువలెఁ దొల్లి తాను పొందు గలది గనక
ఆవేళఁ దా నొరసితే నంగవించకుందురా" 21-56

"కొంగువట్టి తీసితేను కోపగింతురా యేమి
అంగవించి అందుకు లోనౌదురుగాక" 8-98

"అంగవించి శ్రీవేంటాధీశుడై నన్నుఁగూడె
సంగడిసేసలు పైపై జల్లితి నేను" 26-537

అంచ(ల)న: *వి; క్రి.విఙ.* (మాం.) 1. దగ్గరలో 2. ప్రక్కన, పార్శ్వం. జానపదగేయాల్లోనూ అంచన పదం ఉంది.

"అదిగదిగో అనంతపురము
అంచనా టెంకాయవనము
పక్కలోనే పామిడేరన్నా"

"మించి నిండుకొంటే నెనిమిదియే దిక్కులు
అంచల నీ కతలైతే ననేకములు" 2-314

అంచ: From అంచు affix, near, with by వద్ద.

"అంచ నెవ్వరు నిద్రవొమ్మని బుద్ధి చెప్పవద్దు
మించి వారి తమోగుణమే కప్పీని" 2-184

అంచగమన: వి. 'హంసగమన' శబ్దానికి తద్భవరూపం. హంసనడకవంటి నడక గలది.

"మంచముపై ముసుగులు మనసులో
విసుగులు
అంచగమన కిదివో అమరె నేడు" 7-53

అంచు: వి. కొన, చివర అని సామాన్యార్థములు. కాని అన్నమయ్య దీనిని చనుమొన, కుచాగ్రము అనే అర్థంలో వాడినాడు.

"అంచు మోవ నొరఁగఁగ ఆనుకోనైతి ననేవు
నించిన కొండలు మోవ నీ యంతవారమ్మా"

7-17

"బలిమి నరంట్లును పక్కనఁనైఁ దోయనేలే

అలమి యంచుల బాతురాడింతురా" 7-182

"అంచు మోవ నాకు నదే ఆనతియ్యవయ్యా"
18-94

"ప్రాంచద్భూషణ బాహుమూలరుచితోఁ బాలిండ్లు
పొంగారఁ పైయంచుల్ మోవఁగ" అని మ.చ. ప్రయోగం.

అంచెఁబొందులు : మధ్య మధ్య విశ్రాంతి తీసుకుంటూ పొందే పొందులు.

"యెంచగ శ్రీవేంకటేశునకు మనకు
నంచెఁ బొందు లాయె నట్టె కాని" 11-450

అంచెజాణతనము : వి. (?)

"అంచెజాణతన మటు నీ వాడగ
మంచము ములిగే మానవయ్యా" 20-163

అంచెల లేకలు : *వి; బహు.* వాహనాలు లేక వాహకుల మార్పుపై వచ్చే లేఖలు.

"అంచెల లేక లంపి అట్టే కొంత పొద్దువుత్తు"
12-233

అంజనగాఁడు : (అంజనము + కాఁడు) అంజనం వేసి నిధి నిక్షేపాలు కనిపెట్టేవాడు, పోయిన వస్తువులను కనిపెట్టే వాడు.

"చనవున జలధిలో సంపదింద్రునికిఁ జూపి
అనువరి వాఁడివో అంజనగాఁడు" 8-22

"నెట్టన నంజనగాఁడై నేల దవ్వించే మనసు
అట్టె కాయసిద్ధికిఁ గా నాసపడేటి మనసు"
15-280

అంజనగిరి : వి. శ్రీవేంకటేశ్వరస్వామి నెలకొన్న ఏడు తిరుమలకొండల్లో అంజనాద్రి అనే కొండ.

"మిసిమి నంజనగిరిమీఁద వసంతవేళను
వెసఁ గల్పవృక్షము విరులిచ్చినట్లు" 13-107

అంజనగిరిరాయఁడు : వి. అంజనాద్రికి అధిపతియైన శ్రీవేంకటేశ్వరుడు.

"అంజనగిరిరాయఁడు వేంకటపతి
సంజీవని పరుషల కొదవఁగను" 1-119

అంజనాద్రీశ్వరుఁడు : వి. వేంకటేశ్వరస్వామి, అంజనాద్రికి ఈశ్వరుడు అని వ్యు.

"అలిగి సాదించఁ దగడంజనాద్రీశ్వరునిఁ గలికి
చూపులనె మదిఁ గరగఁజేసదను" 25-478

అంజనీతనయుడు : వి. హనుమంతుడు, అంజనాదేవి పుత్రుడు. 'అంజనా' అనడానికి బదులు 'అంజనీ' అని ప్రయోగించడం విలక్షణం.

"అంజనాచలముమీఁద నతఁడు శ్రీవేంకటేశుఁ
డంజనీతనయుఁ డాయ ననిలజుఁడు" 4-443

అంజనీదేవి : 'అంజనాదేవి' యే అంజనీదేవి గా పేర్కొనబడింది. హనుమంతుని తల్లి పేరు.

"అంజనీదేవి కొడుకు హనుమంతుడు
సంజీవని దెచ్చినాఁడు సారె హనుమంతుడు"
4-272 & 4-499

అంజు : *అ.క్రి.* 1. భయపడు, బెదరు 2. సందేహించు.

"అంజనీదేవికిఁ గొడుకైనాఁడు యే పనుల
నంజఁడు కలశాపుర హనుమంతుఁడు" 4-499

అంటఁబారు : *ప.బం; అ.క్రి.* పరుగెత్తు, వెంటబడు.

"అంటఁబారి పట్టుకోరె అమ్మలాల యిదే
వెంటఁబారనీదు నన్ను వేడ మాయ తురుము"
1-122

అంటకుముట్టకు : *ప.బం; క్రి.ప.* సంబంధం పెట్టుకోకు.

"ఎప్పుడు వచ్చునో యంటూ నెదురుచూచీఁ బతికి
దప్పిదేరు మోముతోడ దాచలేదు ప్రియము"
5-336

అంటిముట్టు : *ప.బం; స.క్రి.* 1. స్పృశించు, తాకు 2. సంబంధం కల్పించుకొను.

"నంటునఁ దల వంచుక నవ్వులు నవ్వీ నాపె
అంటిముట్టి చెనకీ నీ యాసోదాలకు" 25-392

అంటిమోసు : వి. అరటి మొలక. (అంటి = అరటి)

"ఆఁటది యింతకోపునా అంటిమోసువంటిది

మాఁటులనే లాలించి మరపుకోవయ్యా" 28-38

అంటివనము : వి. అరటివనం. (అంటి = అరటి)

"గరిమనడుమ వ్రాయఁగా సింహమై తోఁచె

వరుసఁ దొడల యంటివనము వ్రాసెనే" 9-70

అంటిసుడి వంటిది : వి. (?)

"ఇంటికి విచ్చేసితివి యెంత పనికి

అంటి (అరటి) సుడివంటి దాననందు కోపేనో"

23-198

అంటుఁదామరలు : *వి; బహు.* అంటుకొని జంటగా పుట్టిన తామరలు.

"ఆకసవుఁ గొలనిపై నంటుదామరలు వుట్టె

యీ కత చెప్పగదవే యింతిరో నీవు" 23-350

అంటుకొను : *ప.బం; స.క్రి.* తగులుకొను, లగ్నమగు, ఆసక్తమగు.

"అచ్చట నీ వెవ్వతెనో అంటుకొన్నది చాలక

యిచ్చగించి నాతోఁజెప్ప విది యొకటె" 11-215

అంటుజేయు : *ప.బం; స.క్రి.* అపరిశుద్ధం చేయు, మైలపడ జేయు.

"ఇతవుగానివార మేల నీకు నా మేని

అతితాప మంటుఁజేసు నటు వోవయ్యా" 5-40

అంటుబచ్చలి : వి. తీగెకు అంటుకొని పైకి పాకే ఒకరకం బచ్చలి. ఒకదాన్ని ఆధారంగా చేసుకొని ఉండేది.

"వోడఁగట్టిన దూలమై వొకతె నీ కుండఁగాను

ఆడనే వేరొకతెకు నంటుబచ్చలైతివి" 18-232

ఓడకు నడుమ కట్టిన నిలువుదూలము (దీనికి తెరచాప కడతారు) వలె నీకు ఒకతె ఉండగా నిన్నంటుకొని పాకిన బచ్చలితీగె వలె అంటుకొని వేరొకతె .... ఓడవంటి నీకు నడిమి దూలముగా ఒకతె (లక్ష్మి) ఉరమున నుండగా దానికి పద్మావతి అంటుకొన్న బచ్చలితీగెవలె కలిసిందని భావం.

అంటుబచ్చలి వంటివాఁడు : ఒకదాన్ని ఆధారం చేసుకొని ఉండేవాడు.

"అవునయ్యా నీ సుద్దు లటువంటివి

జవళితో నంటుబచ్చలి వంటివాఁడవు" 19-20

అంటుముట్టు : ప.బం. 'అంటు' అనే అర్థంలో జంటపదం. 1. స్పృశించు, తాకు, సంబంధం కల్పించుకొను. వి. 2. సంబంధం, స్పర్శ, తాకిడి, మైల 3. ఆర్తవం, ముట్టు 4. విటీవిట సంబంధం.

"అంటుముట్టు అడియాసకేకా మెంటునఁ

జెమటలు మిక్కిలిఁ బొలసె" 20-356

"అంటుముట్టు లేక మనసు లంటుకొన్న చెలిమి

కంటఁగంట నవ్వించే ఘనమైన చెలిమి" 1-29

అంటురాయి : వి. సూదంటురాయి, అయస్కాంతం చూ : సూదిరాయి.

"ఇదివో నీ పొందు లెట్టనరాదు

కదిసితే నంటురాయి గతివంటివాడవు" 18-20

అంటుసంటు : *ప.బం; వి.* అయినవారు, చుట్టాలు, రక్తసంబంధులు. (ఆం.శ.ర.)

అండవారు : (అండ+వారు) *వి; బహు.* సమీపంలోని వారు.

"అతఁడూ నీవూ నొక్కటే అండవారలే వేరు

సతులతో నీ గుట్టు సారెఁ జూపేవు" 14-82

అండుకాచు : *అ.క్రి.* 'ఆలసించు' కావచ్చు. నిఘంటువుల్లో వాచ్యార్థం. కానరాదు (పద. వ్యా.) దీనికి సం.ప.న. లో ఈవిధంగా వివరణ ఉంది. "అండు = going near అని కిట్టెల్. అండై అని తమిళము. అండ అని తెలుగు. కాచు ధాతువు సాహచర్యముతో అండు శబ్దము, దగ్గరగ తిరిగి రహస్యమును గుర్తించు అను నర్థమున మాండలికముగ ప్రసిద్ధము. కిట్టెలిచ్చిన యర్థమున కిది కొంత విశేషార్థము కావచ్చును. (18 సం. 427 పు.)

"తోడనే మాటాడేవారిఁ దోయనేల సరసము

ఆడరాదా యేఁటికి నీ వండుకాచేవు" 18-150

"అండుకాచే వదియేమే ఆదరించి యాతఁడు

పెండెము నీ పాదమునఁ బెట్టేనంతేను" 18-144

"కొండవలె నన్నునే కూటిమి మనలో నెందో

అండుకాచి నీవతని నడిగితివటవే" 25-50

"మెండుగా బరకాంతలమీఁది తమి పుట్టితేను

అండుకాచందుకు భ్రమయకుండుటే బుద్ధి"
2-195

"సెలవి నవ్వినవాఁడు సిగ్గులు దేరుచుఁగాక
అలసి తానింకా నేమి అండుకాచీనే" 25-90

అండుకొను : అ.క్రి. అంటుకొను (?) లేదా అండకొను కావచ్చు. ఆశ్రయించు.
"అండనే శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
అండుకొని యిప్పుడూ నీ యండనే
వున్నదానవు" 17-387
"అండనుండుమని నన్ను నంత
వాలాయించకువే
అండుకొని మరుఁడేడ నాయమేసునో" 11-285

అంతకతొల్లి : అవ్య. అంతకుముందు.
"అంటఁగాక వున్నదాన నట్టె వుండరా
అంటెనె నీ చూపులు నన్నంతకతొల్లె" 9-48

అంతయింత యను : *ప.బం; స.క్రి.* లెక్కించు, పరిగణించు, పరిమాణాన్ని తెలుపు.
"ఆమని నీ సింగార మంత యింత యనరాదు
వేమారు నీ చూపు వెల్లి విరిసీఁగాన" 20-205

అంతరంగమైనవాఁడు : వి. ఆప్తుడైనవాడు, సన్నిహితుడైన వాడు, ప్రాణమిత్రుడు.
"అంతరంగమైనవారి నాదరించకిఁకఁబోదు
పంతము నీది సుమ్మీ బడిదాన నేను" 11-566

అంతరంగుడు : వి. మిక్కిలి ఆప్తుడు, ప్రాణసఖుడు.
"అట్టె శ్రీవేంకటేశుఁడ వంతరంగుడవు హరి
వుట్టిపడి కానకున్న నొచ్చెము దేహికి హరి"
3-369

"అంతరంగులున్నారా నన్నాదరించేరా"
అని క్షేత్రయ్య. ఇట అంతరంగి అనే పదానికి ప్రాణసఖి అని అర్థం.

అంతరంగురాలు : (అంతరంగ + ఆలు) ప్రధానురాలు, మిక్కిలి ఆప్తురాలు.
"పంతగత్తె నంటాను బలిమి చూపను నేను
అంతరంగురాల నంటూ నట్టె సొలదు" 28-500

అంతరాత్మకుఁడు : వి. అంతరాత్మ స్వరూపుడు, దేవుడు.
"ఆతుమ నున్నాడు అంతరాత్మకుడు
ఆతుమ మరచిన నాతడు మరచును" 3-378

అంతరియామి : వి. 'అంతర్యామి'కి వికృతరూపం. అంతటా వ్యాపించి యున్నవాడు. జీవాత్మ, పరమాత్మ. అన్నమయ్య 'అంతర్యామి' అనే రూపం కూడా వాడినాడు.
"రవ్వగు శ్రీసతి రమణుఁడు మా
కవ్వనజోదరుఁ డంతరియామి" 1-83 & 2-381

అంతరియామిత్వము : వి. 'అంతర్యామిత్వము' నకు వికృతి రూపం; అంతట వ్యాపించి ఉండే లక్షణం.
"వరుస నంతరియామిత్వము నవతారములు
పరఁగ మూడుమూర్తుల ప్రభావము" 2-332

అంతరు : వి. 'అంతరువు' కు రూపాంతరమా?
1. తారతమ్యం 2. చాటు, మరుగు.
"చీచీ యిందుకే పో సిగ్గయ్యీ నాకు
యేచి అంతరు మాలిన యీడుజోడు లేలరా"
11-214

అంతేసివారము : *వి; బహు.* గొప్పవారు.
"అంతేసివారల కటువలె నుండఁగ
వింతజీవులకు వివేక మెట్లొకో" 3-335

అందఁగాఁడు : వి. సుందరుడు; ఇందులో అందశబ్దం మీది అరసున్న చింత్యం.
"అందఁగాఁడ తిరువేంకటాద్రీశ పెక్కెండ్ల విందవై నీ
వొ(కొ)కతెపై వెచ్చఁదన మున్నదా" 5-1
అందశబ్దంమీద అరసున్న లేని ప్రయోగం కూడ కనిపిస్తుంది.
"అద్దుకొనీఁ గాఁగిట అందగాఁడు" 18-105

అందగారి : వి. అందగాడు. ఈ అర్థంలో కన్నడంలో 'అందగార' అని అంటారు. A showy man, a handsome man (కిట్టెల్).

'అందగార' నుండి ఏర్పడిందే ఈ అందగారి అనే పదం.

"ఎక్కడనుండి వచ్చెనో యీపె నీకు
గక్కున యీ చేఁతలను కడు నందగారి"
29-524

అందగారితనము : వి.సౌందర్యం, అందం ; చూ: అందగారి

"ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
అందగారితనమైతే నట్టె నిన్ను నవ్వనా" 27-84

అందగారిది : (అందగారి + అది) వి. సౌందర్యవతి, అందకత్తె ; చూ: అందగారి.

"మందెమేళపుదానికి మారుకొని వుండఁజెల్లు
అందగారిదానికి పై యాడఁజెల్లును" 25-119

అందగారిమాటలు : వి; బహు. అందమైన మాటలు చూ: అందగారి.

అందచందము : (అందము + చందము) వి. సొగసు అనే అర్థంలో వాడబడే జంటపదం. 'చందము' లోని 'చ' కారం లోపింపగా ఏర్పడ్డపదమే అందం.

"తివిరి శ్రీవేంకటేశ తెరవఁగూడితి విట్టే
సవరనిమేని కందచందమే సింగారము" 7-374

అందదుకు : (అదుకు + అదుకు) విణ. మిక్కిలి అదుకులు గలది, చాలీచాలని అనే రెండర్థాలు నిఘంటువుల్లో కనిపిస్తున్నాయి.

"కొందరు చుట్టాలు కొందరు వగసే
అందదుకు మానుటదియే నీ పూజ" 3-320

అందనిపంటి కజ్ఞు చాచు : ప.బం; అ.క్రి. దొరకనిదానికై, అలభ్యమైన దానికై ఆశించు (అందని పండుకై మెడ చాచు అని వాచ్యార్థం .)

"వెస గురుఁడు లేక శ్రీవేంటేశు సాధించితే
అసదై యందని పంటి కజ్ఞు చాచుట" 15-106

అందని పండ్లకు అజ్ఞు చాచు : ప.బం; అ.క్రి. అలభ్యమైన దానికై ఆశించు.

"చిందరవందర పని చెప్పుదునో వుండేవో
అందని పండ్లకేల యజ్ఞు చాచే విపుడు"
17-127

అందని మానిఫలంబు : ప.బం; వి. అలభ్యవస్తువు, అలభ్యం.

"ఆ కమలోదరుఁ గోరని కోరికె
లందని మానిఫలంబులు" 2-235

అందికలుఁ బొందికలు : ప.బం; వి; బహు. ఈడుజోడు వంటి శబ్దం.

"విందము దన సుద్దులు వేగిర మేలే
అందికలుఁ బొందికలు అణఁగీనా యిఁకను"
14-263

అందిపొందు : ప.బం; స.క్రి. 1. పొందు 2. అంటు, తాకు 3. గ్రహించు, పట్టుకొను 4. అందుకొను 5. చేరు, అతుకు 6. అవలంబించు. అ.క్రి. 1. లభ్యమగు 2. సమానమగు, సాటియగు 3. సరిపడు, తగియుండు.

"జిడ్డుదేరఁ జెనకఁగా శ్రీవేంకటేశ
అడ్డాక లేక ఇట్టె అంది పొందవలదా" 28-189

అందుకంటె : దానికంటె. ఇట 'దాని' అనే షష్ఠ్యంత తచ్ఛబ్దార్థానికి బదులుగా అందు అనే సప్తమ్యర్థకం ప్రయోగింపబడటం విశేషం. అందుకొఱకు వంటిది.

"ఇరవున యిటుగాక యెరవెరవై వూడితే
పరఁగ నందుకంటె పాపము లేదు" 23-286
"పాయుమన్న నందుకంటె పాపము లేదు"

-అందుకు : కొఱకు, కోసం అనే అర్థాల్లో క్రియాజన్య విశేషణంపై వాడబడే పదం. ఉదా:- కూడేయందుకు, వచ్చేయందుకు మొ॥

"అంగవించి నిన్నుఁగూడేయందుకు నేనూఁగలను
చుంగుల శ్రీవేంకటేశ చొక్కవద్దా యిఁకను"
11-122

అందుకోలు : వి. 1. చేతికి అందుబాటులో నున్నది, సమీపం 2. అందుకోవటం 3. అతి సమీపం

"యెందరిఁ గైకొంటివో యిటువలెనె తొల్లి
అందుకోలు వావు లిట్లు నీకు నిపుడు" 27-86
"ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి

అందుకోలు జాణతనాలాడేవా ఇంకాను "

26-482

"సందుసుడి వనితవు జాణవమ్మా

అందుకోలు పెండ్లాడే వౌనమ్మా" 18-160

అందుతో : దానితో, ఇట 'దాని' అనే షష్ఠ్యంత తచ్ఛబ్దార్థకానికి బదులుగా 'అందు' అనే సప్తమ్యర్థకం ప్రయోగింపబడటం విశేషం.

"సంపెంగనూనె యంపేవు సారెసారె నందుతోనె

అంపవైతి గన్నెరలు అప్పుడైనాను" 5-87

అందుమీఁద : దానిమీద, 'దాని' అనే షష్ఠ్యంతానికి బదులుగా 'అందు' అనే సప్తమ్యంత ప్రయోగం విలక్షణం.

"అందుమీఁద నాలఁగాచె వతి మంకుఁదనము

సందుల వంకలొత్తితే చాయకు వచ్చీనా" 7-415

అందువంక : అందుమూలంగా, దాని కారణంగా.

"అంగవించి అందువంక అన్నిటా వెరవుదేరి

రంగుగా యీడ నిట్టే రచ్చసేసే విపుడు" 20-409

అందెల సూడిగాలాపె : వి. అందెల చేతి కడియాలు గల స్త్రీ.

"అందెల సూడిగాలాపె అండనుండి విడెమిచ్చె

అంది ఇచ్చీ కొనవేళ్ల నాకు మడిచి" 22-181

అంబరమధ్య : వి. స్త్రీ; వ్యు. శూన్యమైన నడుము గలది.

"కంబుకంఠికిని కప్రపుబొట్టు వెట్టరే

అంబరమధ్యకును ఆరతులు యెత్తరే" 29-15

అంబారాసులు : *వి; బహు.* ధాన్యపురాసులు.

"లంపటాలు సంపదలు లలి నంబారాసులాయ

యింపుల ముంచి తలలకెత్తుకోరో" 3-170

అంబాళపుఁగాయలు : *వి; బహు.* భక్ష్యవిశేషము.

"పాయరాని యంబాళపుఁగాయలు

నాయతమగు దధ్యన్నములు" 6-4

అక్కాళపాశము : వి. 'అక్కుళ్లు' అనే ధాన్యవిశేషంతో చేసిన పాయసం, ఆకలి పుట్టించే పాయసం.

"అక్కాళపాశాలు నప్పాలు వడలు

పెక్కైన సయిదంపు పేణులును" 1-22

అక్కిలించు : అ.క్రి. 'అక్కళించు'కు రూపాం. కావచ్చు. పొట్ట మొ॥ ముడుగజేయు, సంకుచితం చేయు, తగ్గించు.

"ముక్కున నూర్పులు నీకు ముంచె నంటె లేదంటా

అక్కిలించి లోలోనె ఆఁపీనె వీఁడు" 11-182

అక్షంతలు : *వి; బహు.* 1. పూజాదులకు ఉపయోగించే పసుపు (లేదా కుంకుమ) కలిపిన బియ్యం, సేసఁబ్రాలు 2. నొసటి బొట్టుకై బొగ్గు కలిపి నలుపు చేయబడిన పసుపులేపం, చాదు, రూపాం. అక్షింతలు. 'అక్షతలు' అని సాధు రూపం.

"దండిగా నొసల నక్షంతలు నీకుఁబెట్టు మనె

దండమువెట్టు మనెను తనమారుగా" 14-492

"దయపుట్టఁ జెప్పి నీతోఁ దమయింటఁ బెండ్లి యని

ప్రియమున నక్షంతలు పెట్టెఁగా నీకు" 24-426

అక్షరవాచి : వి. బ్రహ్మ(?)

"అరయ నక్షరవాచి యతఁడట యిలలోన

పరమమంత్రాలె పో పలుకు లెల్ల" 4-341

అఖండదీపము : వి. దేవాలయంలో ఒక్కక్షణం కూడా ఆరిపోకుండా రాత్రింబవళ్లు వెలిగే దీపం.

"దిట్టయై కోరి యఖండదీప మెత్తఁగఁ బోలు

నిట్టు చూపె చూచీని నివ్వెరగై" 24-61

అగడు : విణ. నీచం, హీనం, నింద్యం. వి. అపనింద, దూరు, పేరాశ.

"తగుల వలచువాఁడు తమకమె చూపుఁగాక

అగడైన అడియాస లణఁచఁగఁ గలఁడా" 7-367

"అగడుగా యెడమాట లాడించవద్దు గాని

తగిలిన చన్నులంటఁగా తగదనేనా" 27-7

అగడుసేయు : (అగడు+చేయు) స.క్రి. 1.రట్టుచేయు, అల్లరి చేయు 2. చిన్నపుచ్చు 3. నిందించు.

"మొగమాటలు గలవు ముంచి యంకెకు రాకుంటే

అగడుసేసే కోపము లణఁచఁగరాదు" 26-353
"విభునిఁ దెమ్మని చెలులతోఁ జెప్పఁగఁబోతే
అగడు సేయకుమని ఆనపెట్టేనే" 10-2-45
"పగటున నే నీతో పలుకక వుండితేను
అగడుసేసి యిట్టె అలిగితి వనవా" 9-162

అగపడు : అ.క్రి. కనిపించు, ప్రత్యక్షమగు .
"అన్నిటా నిట్టే కాని యగపడదు
అన్నమదమునఁ జిత్త మగపడదు" 4-120
"అగపడి శ్రీవేంకటాద్రిపై నిల్చి నతఁడు
జగదేకమూర్తి కౌసల్యాసుతుఁడిపుడు" 4-279

అగవుదగవులు : ప.బం; వి; బహు. (అగవు + తగవు) పద.పారి. ఇచ్చిపుచ్చుకొనుటలు అనే అర్థాన్ని వ్యు.ప., వధూవరులకిచ్చే పెండ్లికానుకలు, సారెపెట్టి వధువు నత్తవారింటికి పంపే వేడుకలు అనే అర్థాన్ని చూపినాయి. ఇట 'కానుకలు' అనే అర్థం ఉచితంగా ఉంటుందేమో.
"తగిలి కొంగువట్టితే తమకించే నింతలో
అగవుదగవుల ప్రహ్లాదవరదా" 13-344

అగవూ తగవూ : వధూవరులకిచ్చే పెండ్లి కానుక.
"మృగరూపై గద్దెమీఁద మెఱసీ వాఁడదిగో
అగవూఁదగవెఱిఁగి యహోబలేశుఁడు" 11-585

అగువరములు : వి; బహు. అనుకూలమగు వరములు, తగిన వరములు, చాలిన వరములు.
"చిగురుఁ జేవ యగు శ్రీవేంకటేశుఁడు
అగు వరములొసఁగు నటుగాన" 4-333
క్రిందిప్రయోగంలో ఇచ్చిపుచ్చుకోవడమనే అర్థం కుదురుతుంది.
"నగినదొక్కటే కాని నాకు నేమి తెలియదు
అగవుదగవు లెల్లా నాతఁడెరుఁగు" 27-392

అగ్గము : విణ. 1. అధీనం 2. కనబడింది 3. అనుకూలం, అందుబాటులోనిది, సమీపించింది.
"సిగ్గుపడ నేమిటికి చెక్కు చెయి యేమిటికి
అగ్గమై మీలోనఁబట్టినదే పంతము" 21-197

అగ్గలము : వి. రా.సీ; మాం. లెక్కలేకపోవడం, నిర్లక్ష్యం. బ్రౌన్. 1. మెండు 2. దుస్సహం.
"సిగ్గుపడ నేటికి చెందిన కౌగిటిలోన
అగ్గలమయ్యేరా నీకు నండవారెల్లా" 20-454
"అగ్గలపుసరసాల కవుఁగాదనేవు సుమ్మీ
సిగ్గుపడి చెక్కు చేత చింత నుందుఁగానీ" 20-257
"సిగ్గులే నిజమయితే సేవలు చేయఁగనేల
అగ్గలపురతుల చయ్యాటము" 26-252

అగ్గలికె : వి. 'అగ్గలిక'కు రూపాం. 1. ఉత్సాహం, పూనిక, విజృంభణం 2. ఆధిక్యం 3. శౌర్యం 4. విలాసచేష్ట.
"నీతి యెంత చూచితేను నీవెంత నేనెంత
యీతల నా యగ్గలికెకు నేమనుచున్నాఁడా" 15-413

అగ్గళిక : వి. ఉత్సాహం, పూనిక, విలాసచేష్ట, సరసం.
"వెగ్గళించి ఆతనిపై వేసితివి చేయి నీ
అగ్గళిక లెల్లఁజెల్లె నాయఁగదె పనులు" 15-26

అగ్గళ్లు : ప.బం; అ.క్రి. 'అగ్గడి' శబ్దానికి బహువచనరూపం. 1. ముందుభాగాలు 2. కొనలు 3. అంచులు.
"అప్పటి మానవే నీవు అతనిఁగానని వేళ
వుప్పరాలై అగ్గళ్లు వురికినదానవా" 17-109
"ఆరితేరినదేవుఁడ వగ్గళ్లురుకుదురా
రీతివారికైనా నిట్టుండు మోహము" 16-17

అగ్గిపొంతనున్న వెన్న : ప.బం; వి. కరగిపోయేది.
"చింతలవేదనలఁ జిక్కువడుచు నగ్గి
పొంతనున్న వెన్నయై పోయెఁగాలము" 1-48

అగ్గిబాసగొను : ప.బం; స.క్రి. అగ్నిపరీక్ష చేయు, అగ్నిసాక్షిగా పెండ్లాడు.
"అడరి వుత్తమురాలి నగ్గిబాస గొన్నవాఁడు
సడిఁబెట్టి మేనమామఁజంపినవాఁడు" 11-235

అగ్గువ : అ.క్రి. తగ్గు, చౌక.

"అమరఁగాపురము నీ వట్టే మాతోఁజేయఁగాను
తమక మగ్గువాయ చెంతల నెల్లాను" 13-311
పై కీర్తన పాదాలకు తరువాత నున్న పాదాల్లోని 'హెచ్చె' అనే పదం పై అర్థానికి సాధకంగా ఉంది.
"మమకారమున నీవే మాటలట్టే యాడఁగాను
ప్రమదపుటాస హెచ్చె భావించినట్టెల్లాను"
13-311
అగ్గువ అనే ఈ పదానికి 'చౌక' అనే అర్థం కూడా ఉంది.
"కోతి మాంసమగ్గువయ్యె"
"తడఁబడి నీ సుద్దులు దైలువారఁ జెవులును
అడఁచరాని నవ్వులు అగ్గువాయనయ్యా"
21-105

అగ్నీకరణము: వి. అగ్నిసాత్తుగా చేయడం.
"వివిధజంతువ్రాత భువన మగ్నీకరణ
నవనవప్రియ గుణార్ణవ నారసింహా" 1-281

అఘాసురుఁడు: వి. శ్రీకృష్ణునిచే చంపబడ్డ అసురుడు, బకాసురిని తమ్ముడు.
"తొడిఁబడ మద్దులు భువిపైఁ గూలఁగ దొబ్బి
యఘాసురుఁ జంపితివి" 3-277

అచ్చలము: (ఆ + చలము) వి. ఆ + చలము = ఆ పట్టుదల; క్రమంగా పట్టుదల అని రూఢి. 1. కోపం 2.పట్టుదల 3. ఉత్సాహం. అచ్చలాన అనేదానికి వదలక, దాఁచక అనే అర్థాలు సూచింపబడ్డాయి. 14సం 348 పు.
"వచ్చేనని రాకుందురా యేమే నీవు
అచ్చల మేమి గల్లాను అప్పుడే యాడరాదా"
17-48
"అచ్చలాననే పొద్దు నండనుండి పనిసేసే
నెచ్చెలులు గూడేది నీ సారము" 18-549
"అచ్చలానఁజేచాఁచితే నంతలు నిలుచునా
పెచ్చుపెరిగి వలపు పెద్దసేసుఁగాక" 29-529

అచ్చలాన: వదలక, దాచక; అచ్ఛల శబ్దభవం. స్ఖలితం ఛలమ్ అని అమరం.
"నెచ్చలి వలపుజాడో నీ వలపుజాడో యిది
అచ్చలాన నాతో నీవు ఆనతీవయ్యా" 14-599

అచ్చికబుచ్చికలు: *ప.బం; వి; బహు.* తేడాలు లేకపోవడం, అనుకూలత, బెల్లింపు మాటలు .
"మలసిన సరసపు మచ్చికలు
అలవాటైన రతుల అచ్చికబుచ్చికలు" 29-831

అచ్చికము: వి. 'అచ్చిక' కు రూపాం. 1. కలవరం, క్షోభ 2.కొరత, వెలితి, లోపం.
"కమ్మటి నీ భక్తి యనే కామధేను వున్నవారు
వుమ్మడి నచ్చికము లేకుందురయ్యా" 2-309
"ఇచ్చకుఁడ శ్రీవేంకటేశ నన్నుఁగూడితి
అచ్చికములెల్లఁబాసె నంపరాదా" 19-486

అచ్చితుడు: వి. 'అచ్యుతుడు' అనడానికి జానపదవ్యవహారం; చూ. అచ్యుతుడు.
"అచ్చితుడు జనించె నద్దమరేతిరికాడ
ముచ్చిలు రాకాసులు ముట్టుపడిరి" 4-20

అచ్చివచ్చు: *ప.బం; అ.క్రి.* కలిసివచ్చు, శుభప్రదమగు.
"అచ్చివచ్చు నీ కెప్పుడు నంగనతోడి పొందు
కొచ్చికొచ్చి ఇందుకెంత కోరుకొంటా నుంటివో"
18-224
"అచ్చివచ్చిన చోటికి ఆయాలు దాకించుకొన్న
మచ్చికఁగళలు రేఁగే మర్మము తాను" 11-394
"కచ్చువెట్టి యాతఁడు నీ కైవసమై వున్నవాఁడు
అచ్చివచ్చునే నీకు నాతనిపై వలపు" 25-34

అచ్చివచ్చులు: *ప.బం; వి; బహు.* కలసిరావడాలు, శుభప్రదం కావడాలు, లాభసాటిగా ఉండడాలు, లాభించడాలు.
"ఆవు లీతని పేరిట నచ్చివచ్చు లెంచి చూడ
వేవేలు గొల్లెతలకు విటుఁడవును" 28-17

అచ్చుకట్టు: *స.క్రి.* 1. ఏర్పరుచు, విభజించు 2. నేర్పు, కర్రలకు వడిదారం కట్టి అచ్చు తయారు చేయు.
"యెడయక కళలనే యిదివో పదనులెక్కె
కడగోరి రేక నచ్చుకట్టరాదా నీవు" 7-434

అచ్చుతుఁడు: వి. 'అచ్యుతుడు' అనే శబ్దానికి వికృతి రూపం. అచ్చితుడు అనే ప్రయోగం

కూడా ఉంది. విష్ణుమూర్తి.
"అచ్చుత మిమ్ముఁ దలంచేయంత పని వలెనా
యిచ్చల మీవారె మాకు నిహపరా లియ్యఁగా"
3-23
అన్నమయ్య 'అచ్చుత' శబ్దంతో పాటు 'అచ్యుత' శబ్దాన్ని కూడా ప్రయోగించినాడు.
"ఆదినంత్యము లేని అచ్యుతమూర్తివి"
2-122, 3-1, 3-561, 3-253

అచ్చుమోపు : (?)
"యిచ్చట శ్రీవేంటేశ యిహమందే వరమిచ్చి
అచ్చుమోపి యేలఁగా నేనన్నియుఁ దెలిసితి"
2-15

అచ్చులు : వి; బహు. ప్రతిరూపాలు.
"ఇచ్చకములాడినవే ఇంపులు నేకౌఁగాక
అచ్చులము మమ్ము నేల అలయించేవు"
21-316
"నిచ్చనిచ్చ నీ గుణాలు నెఱుఁగని వున్నవా
అచ్చులౌదు రిన్నిటాను ఆనలేనయ్యా" 27-2

అచ్చొత్తినట్లు : ప.బం. ముద్ర వేసినట్లు, గుర్తు వేసినట్లు.
"అతివఁజూచిన చూపు అచ్చొత్తినట్లు నీ
మతిలో నున్నదో మాటాడవు" 24-554

అజాగళస్తనము : వి. వ్యర్థం, నిష్ప్రయోజనం. మేకమెడలో నున్న స్తనాలు పాలేమీ ఇవ్వవు కనుక అవి వ్యర్థమే కదా!
"అదె యశక్తుఁడ నేను అజాగళస్తనము
అదియె పనికి వచ్చునంతయె నేను" 15-202

అజామిళుఁడు : రూపాం. అజామీళుడు, అజామీడుడు. ఒక బ్రాహ్మణుడు శూద్రస్త్రీని కూడి ధర్మాన్ని వీడి పాపకర్మలు చేసేవాడు. ఇతని కామె యందు సంతానం కలిగింది. అతని పేరు నారాయణుడు. అజామీళుడు రోగగ్రస్తుడై మృతి చెందడానికి సిద్ధంగా ఉండగా అతని ప్రాణాలు తీసుకు పోవడానికి యమదూతలు రాగా అతడు తన కుమారుని నారాయణా! అని పిలిచినాడు. అది విష్ణునామం కనుక విష్ణుదూతలు వచ్చినారు. అజామీళుడు కుమారునుద్దేశించి పలికిందే అయినప్పటికీ నారాయణపదం విష్ణునామం కనుక అక్కడ యమదూతలకు స్థానం లేదని వారు అజామీళున్ని స్వర్గానికే తీసుకొనిపోయినారు. ఆవిధంగా అజామీళుడు విష్ణువు అనుగ్రహానికి పాత్రుడైనాడు.
"శ్రీపతినే అడిగినను జిగి నజామీళువలె
చేపట్టి సిరుల రక్షంచుగాక" 4-347

అజ్జకాఁడు : (అజ్జ+కాఁడు) వి.అదను తెలిసినవాడు, నేర్పరి
"బుజ్జగించరాదా పొలఁతి నిట్టే
అజ్జకాఁడ నంటా నుంటి వౌనయ్యా నీవు"
13-358

అజ్జాయించు : అ.క్రి. ఆలస్యం చేయు, తాత్సారం చేయు. (అజ్జ = సమయం)

అటమటపడు : అ.క్రి. బాధపడు, వ్యాకులపడు.

అటమటీడు : (అటమటము + ఈడు) దుష్టుడు, వంచకుడు, అసత్యాలు మాట్లాడేవాడు, వ్యర్థుడు. (అటమట = వంచన, దుఃఖం, అసత్యం, వ్యర్థం అని ఆం.ప.ని.)

అటికలి : వి. 'అటకలి'కి రూపాం. కుంకుడుగాయపులుసు, సీకాయపొడి మున్నగు జిడ్డును పోగొట్టే ద్రవ్యం, జిడ్డు పోవడానికి రుద్దుకునే ఉడకబెట్టిన పిండివంటి పదార్థం. అన్నమయ్య ఈ పదాన్ని 'అటికలి' అని ప్రయోగించినాడు.
"సంతసాన నంటరో సంపెంగనూనియ దెచ్చి
కాంతలు గందపుటటికలి వెట్టరో" 7-473

అటుగనక : అవ్య. అందువల్ల, ఆ కారణంగా.
"అటుగనకనేఁ దన్ను నౌఁగాదనఁగలనా
నటనఁ దన కరుణే నాకు వలెఁగాకా" 12-516

అట్ట : వి; బహు. తలతెగిన శరీరం, కబంధం.
"అని రావణు తల లట్టలుఁ బొందించి
చెనకి భూతములు చెప్పె బుద్ధి" 3-31

అట్టలుగట్టు : అ.క్రి. అట్టలుగా ఏర్పడు.
"గుట్టున శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె

అట్టలుగట్ట నవ్వితివా కన్నులనే" 16-178

అట్టుగ: వి. 'అటక'. రూపాం. అటుక, అటక, అటుకు, అట్టిక, అట్టువ.

"అక్కజపు రోళ్లెక్కి అట్టుగపై దాఁచిన

చక్కిలాలు నురుగులుఁ జవిగొనీని" 24-267

"గొల్లఁడు దెచ్చిన పాలకుండ లందుకొనవలె

యిల్లు చొచ్చి అట్టుగపై నెక్క కుండవయ్యా"

11-273

అట్టువంచి తడుకల్లు: ప.బం. శ్రమపడి ప్రయత్నం చేయు.

అడపకత్తె: (అడపము + కత్తె) వి. వక్కలాకుల సంచిని లేదా బరణిని అందించే స్త్రీ, తాంబూలకరండ వాహిని, తాంబూలమందించే స్త్రీ; చూ: అడపము వనిత.

"వడియుఁజెమటలతో వలపులు రేఁగఁగాను

అడపకత్తెలతోడి ఆలోచన వలెనా" 13-25

అడపమాపె: (అడపము + ఆపె) వి. వక్కలాకుల సంచిని అందించే స్త్రీ.

"పెట్టుకొన్న పదకము పెద్ద అడపమాపెది

నెట్టన నీ సింగారాలు నే నెరఁగనా" 7-432

అడపముది: (అడపము + అది) వక్కలాకుల సంచి లేక బరణిని అందించే స్త్రీ.

"తారుకాణ నేసి నిన్నుఁ దడవఁగరాదుగాక

కోరి యడపముదానిఁ గొనగోర నూఁదవా"

29-456

అడపము వనిత: వి. వక్కలాకుల సంచిని లేదా బరణిని అందించే స్త్రీ. తాంబూలమందించే స్త్రీ. చూ: అడపకత్తె, అడపము సతి మొ॥

"తొడ చరచి నన్నేల అడిగేవు విడెము

అడపము వనిత నీ కందియ్యఁగా" 25-85

అడపమువారు: వి; బహు. అడపం అంటే వక్కలాకులు ఉంచుకునే సంచి. అడపంవారు అంటే రాజులకు తాబూలం అందించే సేవకులు లేక సేవికలు అని అర్థం.

"అతివకు నీకు నేము అడపమువారము"

20-5-33

అడపమువెలఁది: వక్కలాకుల సంచిని లేదా బరణిని అందించే స్త్రీ. తాంబూలమందించే స్త్రీ.

"వూడిగపుసతులాల వొద్ద నుండగదరే

వీడె మీరే అడపమువెలఁదులాల" 24-268

అడపముసతి: వి. వక్కలాకుల సంచిని లేదా బరణిని అందించే స్త్రీ. తాంబూలమందించే స్త్రీ.

"జాడతోనే అడపముసతుల వెదకఁగాను

వీడెము నీ విచ్చేవు విటకత్తెవమ్మా" 12-160

అడబాల: వి. వంటవాడు, వంటకత్తె (అడసాల = వంటశాల)

"పొత్తుల నాకెతో నుండి పూఁచి వడ్డించుమనేవు

హత్తి మీకు నిద్దరికి నడబాలనా" 17-214

"అగ్గమై తవుడుదిండి కడబాల లేల" 15-154

అడబళ = అడవళ A cook, అడి - అడె, అడిగె - cooking, అడిగెమాడువవళు - A female cook" అని కిటెల్ నిఘంటువులో 'అడబళ' అనే పదానికి వంటవాడు అనే అర్థం చూపబడింది. అడబళకే అడబాల అనేది వికృతి రూపం. బసవపురాణం లోనూ (7 ఆ.) పోతనభాగవతం (10 స్కం. II-7) లోనూ దీనికి ప్రయోగాలు కనిపిస్తున్నాయి.

అడబాల సతి: వి. వంటకత్తె.

"అడబాలసతి బోనమారగించు మటంచు

బడిబడిని విన్నపము సేయఁగా" 2-23

అడవిఁగాసిన వెన్నెల: ప.బం; వి. వ్యర్థం, నిరుపయోగం. అడవిలో కాసే వెన్నెల అని వాచ్యార్థం.

"వొడలఁబెట్టిన సొమ్ము లొగిఁ దనకుఁ గానరా

వడవిఁగాసిన వెన్నె లది కన్నులకును" 1-486

"హరిగొలువని కొలువులు మఱి

యడవిఁగాసిన వెన్నెలలు" 2-235

అడవిఁగాసే వెన్నెల: ప.బం; వి. వ్యర్థమైనది.

"ఇంత గాల మాయను యేడ నున్నారో వీరు

వింతలై యడవిఁ గాసే వెన్నెలాయ బ్రదుకు"

3-344

"ఆవలి మోమైన నవ్వు అడవిఁగాసే వెన్నెల
తనివి యాతని నెంతదడవు సాదించేనే"
17-187

అడవికిఁగాయు వెన్నెల: *ప.బం; వి.* వ్యర్థం, నిరుపయోగం. అడవిలో కాసే వెన్నెల అని వాచ్యార్థం.

"పోయఁ గాలంబడవికిఁగాయు వెన్నెల కరణి
శ్రీయుతుఁ దలచుడీ నరులు మాయఁబడి
చెడక" 1-194

అడవిమృగములకు పల్లము వేయు: *అ.క్రి.* పల్లము అంటే గుఱ్ఱం మొదలైన వాటిని ఎక్కేప్పుడు కింద మెత్తగా ఉండడానికి కుట్టి మీదవేసికట్టే గంత అని అర్థం. అడవి మృగాలకు పల్లము వేయడమంటే వ్యర్థమని భావం. అడవి మృగాలపై స్వారీ చేయడం సాధ్యం కాదు కనుక వాటిపై పల్లం వేయడం వ్యర్థమే కదా!

"అల్లనె చూడవె అడవిమృగములకుఁ
బల్లము వేసీఁబై వీఁడు" 5-124

అడవుల వెన్నెల: *ప.బం; వి.* వ్యర్థం, నిష్ప్రయోజనం.

"అడవుల వెన్నెలలాడెడి బ్రదుకులు
తడతాఁకుల పరితాపములు" 1-24

అడాటము: *వి.* ఈ పదం నిఘంటువుల్లో కానరాదు. ఇది 'ఎడాటము' కావచ్చును. ఎడాటమునకు 1. విషయం 2.భేదం, ప్రణయకోపం 3. క్రీడావిలాసం 4. ఎడబాటు అనే అర్థాలు ఉన్నాయి.

ప్రణయకోపం:

"మగువఁగూడితి నెమ్మది శ్రీవేంకటేశుఁడ
అగడుసేయ నున్నదా అంగన యడాటాన"
14-10

"పొందుసేయ వలసితే పొలఁతుల యడాటాన
యిందుముఖులను జూపి యెలయింతురా"
14-500

"జాణతన మెంచవద్దా సతుల యడాటాన
వీణె వాయించినదాఁకా వేగిరమా" 23-464

విషయం, క్రీడావిలాసం:

"కాంతల యడాటాన కాఁకదేరినవాఁడవు
చెంతల వలపించ నేర్చినవాఁడవు" 23-452

అడిచిపడు: *ప.బం; అ.క్రి.* తమకించు, త్వరపడు, మండిపడు.

"బెదరి యైదుగురికిని భీతినొందుచుఁగడుఁ
జెదరంగఁజూతువే చిలుకా
అదయులైన శత్రులాఱుగురికిఁ గాక
అడిచిపడుదువే నీవు చిలుకా" 1-50

అడిబంటు: (అడి + బంటు) *ప.బం; వి.* సేవకుడు, కాపలావాడు, పాదసేవకుడని వాచ్యార్థం. బ్రౌన్ ధూర్తుడు అని వివరించినాడు. అర్థమిట సరిపడదు.

"కామక్రోధములకు కాణాచికాఁపను
ఆమని యింద్రియముల కడిబంటను" 2-480

అడిబండఁడు: *ప.బం; వి.* అధముడు, దుష్టుడు, సిగ్గుమాలినవాడు, ఒక తిట్టు. రూపాం. అడిబండ.

"చిడిముడిగొల్లెతల చీరలు దొంగిలినట్టి
అడిబండనికి నేటి యాచారమే" 9-102

కిటెల్ నిఘంటువులో "అడి, అడియ, అడిగ - one who is in low position, slave, బండు, బండ (k) వండ (T) a shameless dishon ourable man" అని చూపబడింది.

అడియాలము: (46) (అడ + ఆలము) *వి. క.* అడయాళ 1.ఆనవాలు 2.రుజువు, ప్రమాణం (3.చిహ్నలతో కూడిన రాజధ్వజాదికం.)

"అడరి సొమ్ములిద్దర మట్టే మార్చుకొంటి మని
అడియాల మిచ్చి పంపనందు కేమే" 7-162

అడియాలముగ: *క్రి.విశ; మాం.* అలవోకగా, సులభముగా.

"అడియాలముగ గోరనంటి యంటి చెనకేవు
కడు నాతఁడు మరిగి కైకొనునంటాను" 29-18

అడుకులు: (4) *వి; బహు.* అటుకులు.

"అడుకులు చక్కిలాలు ఆనవాలు నురుగులు

వడపప్పు మొదలుగా వాములకొలఁదులు"

4-27

ఇట 'అడుకులు' లోని డకారం ప్రాసస్థానంలో ఉండడం వల్ల ఇది నిర్ధారకప్రయోగం.

అడుగడుగుకు : *ప.బం.* మాటిమాటికి, తేపతేపకు, పదేపదే.

"అడుగడుగుకు నీ వాడఁగాను మా

బడలికంతయుఁదోయ పండరంగిరాయ" 5-218

"అడుగడుగుకు విడే లందుకొంటా సంకీర్తన

లెడయక భాగవతు లెచ్చి పాడఁగా" 18-281

"పొంచి అడుగడుగుకుఁ బొడలేవాఁడు

చెంచలించక పగలు సాదించేవాఁడు" 28-350

అడుగులకు మడుగులు పరచు : *ప.బం; స.క్రి.* అతిభక్తితో సేవించు, పూర్వం ఎవరైనా గొప్పవారు వస్తే వారి అడుగులు నేలకు తగులకుండా ఉతికిన బట్ట పరచి దానిమీద నడిపించుకొంటూ వచ్చేవారు. అందుపై వచ్చిన పలుకుబడి.

"అడుగులకు మడుగులాపె కిట్టే పరచేవు

యెడయకాపె కాఁగిట నెనుశుండేవు" 13-175

"అరివి మోహమున నీ యడుగులకు మడుగులే

బరచకా విరహతాపమునఁ బడవలసే" 5-213

"అడుగులకు మడుఁగు లటు నీవు పరచేవు

బడి నాపె గర్వమైతే పట్టరాదు" 26-401

అడువు : వి. ఎక్కువ, అతి (వ్యు.)

"యీవలను శ్రీవేంటేశు శరణాగతుల

కావటించిన పుణ్య మడువు గాదు" 2-114

అడుసు చొరు కాళ్లు కడుగు : *ప.బం.* స్వయంగా ఆపదను తెచ్చుకొని దానికి ప్రతీకారం చేసుకొను. (బురదతొక్కు - కాళ్లుకడుగు అని వాచ్యార్థం.)

"అడుసు చొరనేపట్టె నటునిటు గాళ్లుఁ

గడుగుకొననే పట్టెఁ గలకాలము" 1-14

అడుసులోపలి కంబము : *ప.బం; వి.* అస్థిరం, నిలువనిది, బురదలోని స్తంభం స్థిరంగా నిలువదు కదా!

"గడకుఁగట్టిన పాఁతగతి దోచె మనసు

అడుసులోపలి కంబమై తోఁచె మనసు" 1-337

అడ్డపాటె : (అడ్డపాటు?) ఇది 'అడ్డపాటు' కు రూపాం. కావచ్చు. ఆటంకం, నిరోధం, అడ్డగింత.

"ఆఅడి యితని భక్తులైన చనవరులకు

ఆటితేరి పుణ్యపాపా లడ్డపాటి లేదు" 15-110

అడ్డపాపఁడు : (అడ్డము+ పాపఁడు) వి. అడ్డముగా పట్టదగిన శిశువు, పసిబిడ్డ.

"నడ్డిముక్కుతోడ వెట్టినవ్వులు నవ్వినవాఁడు

అడ్డపాపఁడై యున్న ఆకుమీఁదివాఁడు"

4-43 & 6-60

అడ్డమాడు : (3) *ప.బం; అ.క్రి.* అడ్డుచెప్పు, వ్యతిరేకించు, విరుద్ధంగా చెప్పు, ఎదురుచెప్పు.

"అడ్డమాడఁజాలను అవుఁగాదనఁజాలను

దొడ్డదొరవు నీ మాట తోయఁజాలను" 18-342

అడ్డాఁక : (5) (అడ్డు + ఆఁక) *ప.బం; వి.* అడ్డు, నిరోధం, నిర్బంధం, ఎదురు అనే అర్థాల్లో జంటపదం.

"జిడ్డుదేరఁ జెనకఁగా శ్రీవేంకటేశ కూడితి

వడ్డాఁక లేక ఇట్టె అంది పొందవలదా" 28-189

అడ్డాలుదుడ్డాలు వచ్చు : *ప.బం; వి; బహు.* తారుమారుగా వచ్చు, అడ్డదిడ్డంగావచ్చు.

"వొడ్డినందుకెల్లా నాతఁడోపికతో నుండఁగాను

అడ్డాలుదుడ్డాలు వచ్చేవప్పటి నీవు" 11-74

అడ్డాలు వచ్చు : *ప.బం; అ.క్రి;* రా.సీ.మాం. అడ్డుకొను, అడ్డుపడు. అడ్డాలడ్డాలు వస్తావే అని రా.సీ. ప్రయోగం. (అన్న. రా. మాం.)

"పూని నేనప్పటి నీపై పుప్పొడి చల్లితేను

ఆనుకొని సారెసారె అడ్డాలు వచ్చీని" 22-325

అడ్డికపుది : (అడ్డికము + అది) వి. ఎల్లప్పుడు సమీపము నందుండు పరిచారికయా అని సం.ప.స. 14 సం 348 పు.

"గట్టిగాఁ దమవద్దనే కాచుకవుండుమనీ

దట్టమైన అడ్డికపుదాననా నేను" 14-567

అడ్డివెట్టు : అ.క్రి. ఆటంకపఱచు, అడ్డుపెట్టు, నిరోధించు. క; త; తు. భాషల్లో అడ్డు అనే అర్థంలో అడ్డి అనే పదం ఉంది.
"వెడ్డువెట్టి నే మెల్లా వేసరితిమి
అడ్డివెట్ట కిప్పుడే రావయ్య లోనికిని" 23-395

అడ్డెన : వి. (?)
"అట్టె పీఁటపై నునిచి యడ్డెనపైఁ బళ్లెమిడి
వొట్టి వడ్డించరే బోనా లువిదలాల" 22-242

అణకించు : స.క్రి. 1.ఎగతాళి చేయు, అపహసించు 2.మోసపుచ్చు, వంచించు 3.ఉల్లాసమాడు.
"కావించి కన్నులలోని కళంకు దెలియలేక
ఆవలిఁ జందురు నలు సణకించినట్లు" 3-192

అతికము : విశి. 'అధికము' అనే పదానికి జానపద వ్యవహారరూపం. ఎక్కువ.
"స్వతంత్రుడవు నీవు సరిలేని దొరవు నే
నతికమై యాడినట్లు ఆడఁబోయేనా" 4-431
ఇట తకారం ప్రాసస్థానంలో ఉండడంవల్ల ఈ ప్రయోగం నిర్ధారకం.

అతినిష్ఠూరి : విశి. మిక్కిలి కఠినుడు.
"సమరతి నాయకుని చాయకు రాకుండితేను
అమరిన చుట్టమా అతినిష్ఠూరి గాక" 7-393

అతివసంతము ఆడు : మిక్కిలిగా రంగులు చల్లుకొను.
"రతిదేవి మొదలైన రమణులు నాట్యమాడి
రతివసంతమాడే మేఘావళి యెల్ల" 7-445

అతివె : వి. 'అతివ'కు వ్యావహారికరూపం.
"అతివె లిదెంత వచ్చి యనరా నన్ను
రతిసేసి తెరదీసి రామలఁ బిలిపించేవు" 11-447

అతిశయుఁడు : వి. అధికుడు, అతిశయము (= ఆధిక్యము) అనే భావార్థకమైన పదానికి అధికుడని ధర్మివాచకంగా ప్రయోగం. ఇట్టి ప్రయోగాలు అన్నమయ్య కీర్తనల్లో ఎన్నో.
"అన్నిటాఁ దాము నతిశయులే
యెన్నఁగ నధికులె యెసఁగఁగను" 4 అను. 75

అత్తఁగారు : వి. ఇందులోని అరసున్న విలక్షణం.
"అత్తఁగారు వచ్చుదాఁకా నణఁగుంటిని
యెత్తిన కోపముతోడ యేమందునో" 21-67

అత్తయింటికోడలు : ప.బం; వి. మగనాలు, మగడుగల స్త్రీ.
"అత్తయింటికోడల నన్నమ్మ మీఁద నేరా నీ
తొత్తుఁదిట్టినట్టె తిట్ట దొరకొంటివి" 5-3

అత్తయ్య : (అత్త + అయ్య) వి. అత్తగారు.
"గుడ్డము పయిన కోనేటిరాయని
నడ్డగించుకొంటి నత్తయ్యా" 5-313

అత్తల : (ఆ + తల) అవ్య. అవతల.
"చిత్తమంతర్ముఖము సేసుకొన నేర్చెవా
అత్తల నతఁడు యోగి యనఁబడును" 2-452

అత్తలనిత్తల : (అత్తల + ఇత్తల) ప.బం. అవతల - ఇవతల.
"అత్తలనిత్తల నీకు ఆపె నేను నుండగాను
పొత్తులనవ్వు నవ్వేవు పోపో నీవు" 9-271

అత్తలివారు : వి; బహు. అవతలివారు.
"పొత్తుకు రావలసిన నేఁబోరి యింతేనంటి
అత్తలివారి సొత్తు అరసితిఁగాక" 11-473

అత్తింటికోడలు : ప.బం; వి. మగనాలు, మగడు గల స్త్రీ.
"శ్రీవేంకటేశుడవు చిన్న చక్కనిదాన
ఆవటించేమి సేతువో అత్తింటికోడలను" 27-551

అత్తు : అ.క్రి. 1. కలసిమెలసి యుండు, ఏకీభవించు 2. తగులుపడు, అనుకూలమగు 3. కలుగు, సంభవించు 4. అంటుకొను 5. యుక్తమగు. స.క్రి. 1. అద్దుకొను 2. కూడు, పొందు.
"అత్తి శ్రీవేంకటపతి ఆదరించి కూడితివి
పొత్తు సత్తుఁగూడె నింక బూటక మేలయ్యా"
26-7

అత్తుగడ : వి. (అత్తు+కడ) పొందిక. (చేరుగడ, సామీప్యం)
"చిత్తము వచ్చినచోట సేవ లెల్లా నీడేరు
అత్తుగడైతే మాట లనువులౌను" 12-295

అదను : (10) వి. తగిన సమయం, అవకాశం, వేళ, విధం.
"అదన శ్రీవేంకటేశుఁడాతఁడే నన్ను నేలే
పదరకువే యీతఁడు పచ్చిదేరీ నంటాను"
25-165

అదనూఁబదనూ : సమయమూ సందర్భమూ అనే అర్థంలో జంటపదం.
"అదనూఁబదనూ నెఱిఁగి అండ నుంటేఁ జాలు
చదురుఁబదురు నొక్క సమ్మతౌనే" 17-32

అదరుబెదరు : *ప.బం; అ.క్రి.* జంకు, భయపడు అనే అర్థాల్లో జంటపదం.
"సుదతులాల చూడరమ్మా సోద్య మిదియే కాఁబోలు
అదరిబెదరి కరఁగె గోరు ఆయ మంటఁబోలును"
17-279

అదవద : వి. (ధ్వన్యనుకరణరూపం) 1. అవమానం 2. కలత, చింత 3. తొందర. విశ. 1. చెదరినది, తారుమారైనది 2. శ్రమపడినది 3. క్షుబ్ధం (వ్యు.)
"కొండలనునుపులు కొనకొన మమతలు
అండలకేగిన అదవదలు" 1-24
"అమరని సింగారాలు అదవదలు
తమి లేని కాగిళ్లు తలపోఁతలు"
"ముంచి తగులములకు మొదలు
అంచెల నలిగితేను అదవదలు" 28-573
"మా పొందు సేయుమా మచ్చికలతోడ
ఆవనిఁదిరుగఁగా నదవదలాయ" 18-554

అదిబిదుకు : *ప.బం.* ఇది 'అదుబిదుకు' కావచ్చు. భయం అని అర్థం. ధ్వన్యనుకరణశబ్దం. బిదుకు బిదుకు అంటే వ్యవహారంలో భయమని అర్థం.
"పొదిగేవు ఒకవేళ పొరలేవు వొకవేళ
అదిబిదుకు వలపు లవి యాల" 9-226

అద్దపునీడ : *ప.బం;* వి. అశాశ్వతం. 1-486
"వొద్దికై శ్రీవేంకటోత్తముఁడు యింతలో
అద్దపునీడవలె నాత్మఁబొడచూపె" 1-486

అద్దమరాతిరి : (3) వి. అర్ధరాత్రి, మధ్యరాత్రి, నడురేయి.
"అద్దమరాతిరి వోయె నమ్మలాల అయ్యో
నిద్దుర గంటఁబెట్టుదు నిన్నటనుండి" 5-32

అద్దమరాతిరి కాడ : (4) ఇట కాడ అనేది 'కడ'కు వ్యావహారికరూపం. అర్ధ రాత్రి సమయంలో .
"అద్దమరాతిరికాడ నటు చంద్రోదయముతో
వొద్దికఁ గృష్ణుడు పుట్టెనో చెలులాల" 22-92

అద్దమరేతిరి : (2) వి. మధ్యరాత్రి, నడురేయి. చూ : అద్దమరాతిరి.
"నిద్దురవోయే వేళ నీవు నన్ను లేపగాను
అద్దమరేతిరి వోపనంటిఁ గాక" 11-362

అద్దమరేతిరికాడ : అర్ధరాత్రిసమయాన, ఇట కాడ అనేది 'కడ'కు వ్యావహారిక రూపం.
"బుద్దులు చెప్పఁగ వచ్చి పూఁచిన వాకిళ్లు దాటి
అద్దమరేతిరికాడ నాయఁగా తాను" 22-75
"బుద్దులు చెప్పగ వచ్చి పూఁచిన వాకిళ్లను దాటి
నిద్దురవోయే వేళ నీవు నన్ను లేపగాను
అద్దమరేతిరి వోపనంటిఁగాక" 11-362

అద్దమరేత్రి : వి. అర్ధరాత్రి.
"కదిసి యద్దమరేత్రికాడ నేఁడు
వుదయించెఁ గృష్ణుఁడు చంద్రోదయాన నేఁడు"
4-179

అద్దమరేత్రికాడ : అర్ధరాత్రి సమయాన, నడురేయి సమయాన. ఇట 'కాడ' అనేది 'కడ' కు వ్యావహారికరూపం.

అద్దమరేయి : వి. మధ్యరాత్రి, నడురేయి.
"చెంగావిచీర గట్టి చెమటలు గారఁగాను
అంగమలియ వచ్చితి వద్దమరేయి" 26-517

అద్దములో చంద్రోదయము : నానుడి.
నిష్ప్రయోజనం. 10-115 old

అద్దములో నీడ : *ప.బం;* వి. అలభ్యం.
"గుక్కక శ్రీవేంటేశ కూడినట్టె కూడేవు
నిక్కి యద్దములో నీడ నీ వలపు" 27-340

అద్దములోపలి నీడ : *ప.బం; వి. చూ :* అద్దములో నీడ.

"అద్దములోపలి నీడలు అందరి దేహరూపులు" 2-133

అద్దరిపాటు : *వి.* ఇది 'అద్దిరపాటు' కావచ్చు. 1. ఏమరిపాటు, ఆకస్మికత 2. ఆశ్చర్యపడటం.

"నీ విదె నే నదె నెమ్మదిఁ దాను నదె

ఆవలిమొగము లేల అద్దరిపాటాయెను" 11-199

"ఏల తలవంచుకొనే రిద్దరును నన్నుఁజూచి

తాలిమి నద్దరిపాటు తగదు నావల్ల" 7-7

"అద్దరిపాటుగాను నా యండకు నీవు వచ్చితే

కొద్దిమీరిన వేడుక గుదిగొనును" 27-567

అద్దలించు : *స.క్రి.* 'అదలించు'కు రూపాం. బెదిరించు, కదలించు, తిరస్కరించు, తట్టు, కొట్టు, లాగు, సర్దు (వ్యు.)

"వొద్దనఁగాఁ బొయ్యేవు వొంటిఁ జిక్కించుక యాపె

అద్దలించి యేమైనా ననకుండేనా" 7-30

"యేడనైన నిలిచి నీ వెవ్వతెతోనైనా మాఁట

లాడుకొన్న నిన్ను నే నద్దలింతునా" 16-570

అద్దికము : *వి.* కావలి, రక్షణం, కనిపెట్టిచూడడం.

"మిక్కిలి కాఁగిటఁ గూడి మెప్పించవచ్చెఁగాక

కక్కసించి నీపై నద్దికము వచ్చెనా" 19-103

అద్దిగో : *అవ్య.* అదిగో, అదే చూడు అని దూరంలో ఉన్న వస్తువును నిర్దేశించే పదం.

"ముద్దుల మొగమువాఁడు ముత్తేల నామమువాఁడు

అద్దిగో శంఖచక్రాల హస్తాలవాఁడు" 7-116

అద్దో : (15) *అవ్య.* 'అదిగో' అనే అర్థంలో వాడబడే రా.సీ. మాండలికపదం. రూపాం. అద్దొ.

"అద్దో నే మెందాకానైనాఁ గాచుచుండలేము

వొద్దనే యెంతవాడైనా నోసి రావే" 5-9

"తిద్దితిని జగడము తేరిచి శ్రీవేంకటేశ

అద్దో మొదల మమ్ము నారడిసేతురా" 17-397

అనఁగుపెనఁగు : *ప.బం. అ.క్రి.* అన్యోన్యంగా, ప్రీతితో కలిసిమెలసి ఉండు.

"అనగుచుఁ బెనఁగుచు ఆయములంటుచు

చనవులు మెరసీ జవరాలు" 27-159

అనంతగిరి : *వి.* ఏడు తిరుమలకొండల్లో ఒకటైన శేషాద్రి. (అనంతుడు = శేషుడు) ఏడుకొండలకూ ఇది ఏలిక.

"గరుడాచలం బనఁగా శ్రీవేంకటశైలంబనఁగా

గిరులకు నేలికె యగు ననంతగిరి దా నీ గిరి

యనఁగా"

అనంతాళువారు : *వి.* భగవద్రామానుజులవారి ఆజ్ఞతో తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామికి పుష్పమాలా కైంకర్యం చేసిన భక్తుడు. తన పుష్పమాలాకైంకర్యం కోసం ఒక పుష్పోద్యానాన్ని పెంచదలచి దానికి నాందిగా ఒక పెద్ద చెరువును నిర్మింపదలచి ఇతరులెవ్వరి సాహాయ్యం లేకుండా తాను, తన భార్యతో మాత్రమే ఆ చెరువును తవ్వడానికి పూనుకున్నాడు. అతను గడ్డపారతో మట్టిని తవ్వి గంపలతో ఇస్తుండగా అతని భార్య ఆ మట్టిని దూరంగా పోసేది. అప్పుడామె నిండుచూలాలు. ఆ స్థితిని చూచి శ్రీవేంకటేశ్వరస్వామి పంద్రెండేండ్ల బాలుని రూపంతో వచ్చి మట్టిని దూరంగా పోయడంలో సహాయపడతాడు. ఈ విషయాన్ని భార్య ద్వారా తెలుసుకున్న అనంతాళ్వారు తన భార్యను నమ్మించి స్వామి కైంకర్యంలో పాలు పంచుకుంటున్న ఆ బాలునిపై కోపంతో గునపాన్ని పైకెత్తి బాలుని పైకి విసిరివేస్తాడు. అది ఆ బాలుని చిబుకానికి తాకి రక్తం కారుతుంది. బాలుడు ఆనందనిలయంలోకి వెళ్లి కనబడకుండా దాక్కొంటాడు. అర్చకులు స్వామివారి చిబుకంపైన రక్తస్రావాన్ని చూచి కలకలం చెంది అనంతాళువారి కీ విషయం చెపుతారు. అనంతాళువారు విషయాన్ని గ్రహిస్తాడు. అర్చకులు ఆ గాయంపై పచ్చకర్పూరం అద్దుతారు. నేటికీ శ్రీస్వామివారి చిబుకంపైన పచ్చకర్పూరం అద్దటం ఆచారం. స్వామివారిని కొట్టడానికి

అనంతాళువారు ఉపయోగించిన గడ్డపార ఇప్పటికీ తిరుమలలోని స్వామివారి ఆలయ మహాద్వారం లోపల వేలాడదీసి ఉంచబడింది.

"అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోఁచినాఁడు" 1-151

అనరుహుఁడు : వి. అనర్హుఁడు.

"మునుప శ్రీపతికి మ్రొక్కిన చేతుల
అనరుహులకు దండమనుట యెట్టు" 3-456

అనలుఁగొనలు : *ప.బం; బహు.* తీగెలు.

"అక్కట మొదలొకటి అనలుఁగొనలు వేరు
యెక్కడని తగిలేది యేమిసేసేది" 2-247

అనలుఁగొనలు అగు : *ప.బం; అ.క్రి.* తీగెలు సాగు.

"మునుకొని యిప్పటి మోహము చూచిన
అనలుఁగొనలునై యాసలు పొదలు" 24-51

అనలుఁగొనలు సాగు : (2) *ప.బం; అ.క్రి.* తీగె సాగు, వృద్ధిచెందు.

"అనలుఁగొనలు సాగునట్టి యాసలు
గడించరావు
తనివి లేని చుట్టరికపు తగులువారికి" 27-584

అనాయుధాసో అసురా అదేవాః : వేదమంత్ర వాక్యం. ఆయుధాలు లేనివారూ, దేవద్వేషులూ ఐన రాక్షసులు. (6 అష్టకం; 6వ అధ్యాయం, 33వ వర్గం, 9వ మంత్రం) చక్రసమానవీర్యం కల వజ్రంతో పారదోలుము అని అర్థం.

"అనాయుధాసో అసురా అదేవా" యని
వినోదముగ ఋగ్వేదము దెలిపెడి" 2-485

అని : అవ్య. కొన్నిచోట్ల నిరర్థకంగా వాడబడే పదం. ఉదా :- ఎందుకని, ఎందరికని.

"విందులువెట్టేరు వేవేలు మోపుల
యెందుకని వొగ్గేవేమయ్యా నీవు" 25-249

"ఎందరికని వుత్తరమిచ్చేవు నీవు
సందడించి వొక్కమాటే చల్లేరు సరసము"
7-529

అనుకు : *విశ.* పలుచనిది; పిండివంటలు చేసేప్పుడు నీళ్లు ఎక్కువైతే పిండి అనుకైందని అంటారు. (రా.సీ.మాం. 62 పు.)

"అగ్గలమై చూచితేను అనుకనేవు ననుపు
సిగ్గులువడితే నట్టే చిక్కన నేవు" 14-62

అనుచరించు : *అ.క్రి.* సహాయంగా ఉండు, తోడుగా ఉండు, అనుసరించు, సాగనంపు.

"అనుచరించితో లేదో ఆకనే ముందరనైనా
వెనక నాతోడ నవ్వేవు గాని" 5-7

అనుభవత : (అనుభవ + త) వి. అనుభవం. భావార్థకమైన అనుభవశబ్దంపై మళ్లీ భావార్థంలో 'త' ప్రత్యయం రావడం విలక్షణం.

"ఎవ్వరికిఁ గలదురా యిటువంటి యనుభవత
యివ్వల నీ వాకెవలె నిటు నోమవలదా" 9-151

అనుభవన : (6) వి. అనుభవం; అనుభవించడం ఈ అర్థంలో ఇది అన్నమయ్య విలక్షణ ప్రయోగం.

"అనుభవనకుఁ బ్రాప్తమైనది
తనకుఁదానె వచ్చి తగిలి కాని పోదు" 1-6

అనుమె మినుమైతే : సామెత. కృశించిపోవడమని భావం. అనుములు =పెసలు, అలసందలు, శనగలు, మినుములు వంటి కాయవస్తువు - పప్పుబద్దలు - అనుముల బద్దలు పెద్దవి; మినుముల బద్దలు చిన్నవి - ఆ పెద్దవైన అనుములు మినుములైనవి. అంటే వాటి విలువ తగ్గిందని అర్థం. పెద్దవి చిన్నవైనవని భావం.

"కననీ కననీ తనకడల చుట్టరికాలు
అనుమె మినుమైతే నదెవ్వరి మేలు" 9-105

అనువు : వి. 1. ఉపాయం 2. విధం 3. అవకాశం 4. సామర్థ్యం 5. అనుకూలత 6. ఒప్పు 7. మంచినుడి. *విశ.* యుక్తం.

"మనవులు చెప్పితేనే మచ్చికలు రేఁగుఁగాక
అనువుకు మాటాడితే నందములవునా" 12-474

అనుసు : వి. గదాదండములు మొ॥ వాటికి వేసే ఇనుము మొ॥ వాటి కడియం.

"పాపపుణ్యా లిరువంక పైఁడి వెండి యనుసులు

పైపైఁ గుత్తికె మేటిపై చనిగె" 3-467

అన్నువ: విణ. 1. కొంచెం, తక్కువ, అలఁతి 2. చిన్నది 3. మనోహరం, అలవి, సన్నం.

"కన్నుల తుదలంగెంపు గానరాఁగాను నీకు
నన్నువ యలుకలు వేఱాయె నొసవితిమి"

6-140

అన్నువట్టు: అ.క్రి. 1. పారవశ్యం పొందు 2. ఆవేశం పొందు 3. కాంతిని పొందు.

"యిది పుణ్య మిది పాప మెట్టని తెలిసేమయ్యా
అదన నన్నపునామె యన్నువట్టెను" 4-253

అన్యోన్యము: వి. 1. ప్రేమ, అనురాగం (2. పరస్పరం)

"ఒకరొకరి అన్యోన్యము చూడరే
సకలము నెరిఁగిన సరసులె వీరు" 7-308

అప్ప: అవ్య. 1. ఆశ్చర్య, ప్రీతి, పూజ్యతా, గౌరవాదర, ప్రశంసాసూచకపదం (2. అక్క 3. తండ్రి 4. తల్లి)

"అనిశముఁ జెప్పరప్ప అతని సుద్దులే నాకు
విన వేడు కయ్యాని వేమారును" 29-522

అప్పఁజెల్లెండ్లు: వి; బహు. అక్కచెల్లెండ్లు. (అప్ప = అక్క)

"అప్పఁజెల్లెండ్ల మింతే అతఁడు నవ్వినంతనె
ఇప్పుడు వేరుగఁ జూచే నిది యేమే నీకు"

26-97

అప్పఁడు: వి. తండ్రి.

"అప్పఁడైన వేంకటాద్రి అసవాలకుడు గాన
తప్పకుండఁబెట్టె వాని తలకెత్తరే" 4 అను. 20

అప్ప(డు): వి. (రా.సీ; మాం.) తండ్రి, గౌరవవాచకం, సంబోధించేప్పుడు ప్రయోగించే శబ్దం, వ్యక్తి నామాంతంలో ప్రయోగించే శబ్దం.

"అప్ప! వేంకటనగాధిప! మీ కృప
ఇప్పుడు తెలిసితి నిదివో నేడు" 4-17; 372 పు.

"అప్పడు తొల్లే అనుమతించె నివి
తప్పక యాతని దలఁచుటే కలది" 4-50

"అప్పా! నే దొల్లి అజ్ఞాని నైనది తప్పా!
నేడు గావ తగదా నన్ను" 2-11

అప్పటిన్: దే; (39) అవ్య. 1. మరల 2. పూర్వంవలె. (విలక్షణ ప్రయోగం)

"అగడై తొల్లే నేను ఆలినై వుండఁగాను
మొగము చూచి అప్పటి మొక్కకుమీ నీవు"

7-211

"సరి నిన్న భుజించిన చాలు నన్న యన్నమే
అరిది నే డప్పటిని నాసరేచీని" 3-351

"చేప్పే నప్పటి నేమే చెవిలోన నేకతాలు
అప్పసము సేవసేసే యాపె వుండఁగాను"

13-494

అప్పణ: (30) వి. 1. ఉత్తరువు, ఆజ్ఞ, అనుమతి 2. ఇచ్చుట, కానుక. అప్పణై, (క) అప్పణె; కిట్టెల్ ఆజ్ఞ, అనుజ్ఞ command, order, permission, leave అనే అర్థాలు చూపి ఆజ్ఞాపన శబ్దభవంగా పేర్కొన్నాడు. అప్పణమాడు అని కన్నడంలో నున్నట్లే తాళ్లపాకవారు అప్పణ - అప్పణదెచ్చు, అప్పణిచ్చు, అప్పణచేయు మొ॥ పదబంధముల ప్రయోగించినారు.

"అనువునఁదాఁ దనిపి అప్పణియ్యఁగా మమ్ము
యెనసితి నిందాఁకా నందెరఁగక వుంటివి"

23-405

"అప్పణిచ్చి మిము సమ్మతి సేయుచు నట
మముఁ గావఁగఁ దానే కర్త" 7-60

"నీ కడ నిన్నే కొలిచి నీ యప్పణ దెచ్చి" 7-29

ఆజ్ఞ, అనుజ్ఞ అనే అర్థాలు ఇట పొసగుచున్నవి అని ఆనందమూర్తిగారు. (సం.కీ.వా.)

అప్పణ ఇచ్చు: (3) అ.క్రి; స.క్రి. ఆజ్ఞ ఇచ్చు, అనుమతి నిచ్చు, కానుకగా ఇచ్చు, అర్పణ చేయు.

కానుకగా ఇచ్చు:

"నే నేమందునో యంటా నీ వనుమానించ నేల
పూని అప్పణ ఇచ్చేను పొందవయ్యా సతిని"

18-443

ఆజ్ఞ ఇచ్చు:

"వలపుల వడ దాకె వనిత నిన్నుఁబాయఁగ
అలరి చలిమందుల కప్పణీవయ్యా" 27-293

అప్పణగొను: స.క్రి. 1. పైవారు ఆదరపూర్వకంగా ఇచ్చేదాన్ని స్వీకరించు; అప్పనొపెట్టు అన్నది వైష్ణవ పరిభాషగా వినబడుతుంది. దేవాలయాదుల్లో ప్రసాదము అప్పనొపెట్టు మని అనడం ఉన్నది. దీనిమీద మరింత సాగి అప్పనము = ఊరక వచ్చినది అన్న అర్థాలలో కొన్నిప్రాంతాలలో 'ఇదేమి అప్పనంగా వచ్చిందా' అని వాడుకలో వినబడుతుంది. ఇదే అర్థంలో 'ఉద్దరకు వచ్చిందా' అని రా.సీ. లో వ్యవహారంలో ఉంది. 2. కానుక గ్రహించు. రూపాం. అప్పనగొను.

"తరుణి అప్పణగొని తమకించి నాతోడ
యొరవులనవ్వులు నీ వేల నవ్వేవు" 11-3

"అప్పణగొంటివా గోపాంగనలకెల్లఁ దొల్లి
యిప్పుడు నాతో మాయ లేల సేసే వికను"
11-88

అప్పణసేయు: స.క్రి. కానుకగా ఇచ్చు, అర్పణ చేయు, సమర్పించు.

"అసురుసురు కాఁగిట నడియాస రతులను
పొసఁగ నప్పణసేసీఁ బొలితి నీకు" 29-19

అప్పణించు: (2) స.క్రి. 1. అనుమతించు, ఆజ్ఞాపించు 2. కానుక ఇచ్చు 3. అప్పగించు, అధీనం చేయు.

"యిక్కువ శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
తక్క కాపె అప్పణించె దైవము నీ కిపుడు"
27-132

"వుప్పతిల్ల మొదల నీ వుద్దండాలు సేసితేను
అప్పుడే చేతకుఁజేత కప్పణించుట గాదా"
14-141

అప్పన: వి. అర్పణ శబ్దభవం. కాని దీనికి అర్పణమని అర్థం కాదు. ఆజ్ఞ అని అర్థం. (అప్పణె = ఆజ్ఞ అని కిట్టెల్)

అప్పనము: విణ. ఎడతెగని.

"అప్పనమైన భ్రమ ఆలజాలాలకున్నట్లు
యిప్పుడే వుండవలదా యీతని మీఁదటను"

అప్పము: వి. రొట్టె, అప్పచ్చి, సం. అపూపం, త. అప్పం, గుడాపూపం. బెల్లం, పిండి కలిపి చేసిన గుండ్రని భక్ష్యం.

"అప్పమైన నీయరే యమ్మలాలా నేఁ
డప్పుఁడారగించీ నదె యమ్మలాలా" 5-345

అప్పలప్పలను: *ప.బం; అ.క్రి.* పిల్లలను దగ్గరకు పిలవడంలోని అనుకరణశబ్దం.

"అద్దపుంజెక్కులతోడ నప్పలప్ప లనినంత
గద్దించి యశోద మేనుఁగౌగలించు శిశువా"
6-1

"యెంచి యప్పలప్పలనుచు యెనసి కాఁగిలించ నేర్చె
దించరాని వురముమీఁద దివ్యకాంతను" 2-387

"అంచెల అప్పలప్పలని వచ్చి కాఁగిలించి
చంచుల మేనెల్ల గీఱె సన్నమా వీఁడు" 26-158

అప్పలప్పలు: వి. క్రీడావిశేషం.

"అల్లరి నా కౌఁగిట నప్పలప్పలాడే వంటా
పిలిచి కూడేని పిన్నబిడ్డఁడా వీడు" 17-173

"అప్పలప్పలాడే నంటూ నంతలోనె కాఁగిలింప
చిప్పిలఁగూడితి వవురా చిన్నిబాలుఁడా"
27-123

అప్పసపుకాంతలు: ఇట అప్పనపు కాంతలు అని పాఠం కావచ్చు. కానుకగా వచ్చిన కాంతలు.

"అప్పటి నవ్వేవు ప్రహ్లాదవరదా
అప్పసపుకాంతల ప్రహ్లాదవరదా!" 25-329

అప్పసము: (11) అవ్య. 1. నిచ్చలు, ఎల్లప్పుడు 2. స్వయంగా 3. నిజంగా. కర్నూలు మండలంలో ఈ పదం ఇప్పటికీ స్వయంగా అనే అర్థంలో వాడుకలో ఉందట. (చూ: మాం.ప.కో.) రూపాం. అప్పిశము.

"చెప్పినప్పటి నేమే చెవిలోన నేకతాలు
అప్పసము సేవ సేసేయాపె వుండఁగాను"
13-494

ఎల్లప్పుడు :
"చెప్పిన నా మాఁట విను సేసునే పనులైనాను
అప్పసము నా మేలువాఁడై వుండునే" 27-541
స్వయంగా :
"కొప్పు గడు వీడఁగాను కుచములు గదలఁగ
అప్పసము నీ వద్దికి నాపె వచ్చెను" 14-71

అప్రతి : (న + ప్రతి) విశి. సాటి లేనిది.
"మతిలోపల విరక్తి మగువ జనియించి య
ప్రతి యయి మోక్షసంపదలు గడియించె"
1-308

అబక : వి. కొయ్యగుద్దలి, పెద్ద తెడ్డు, కొయ్యకు టెంకాయ చిప్పను గుచ్చి గరిటె వలె చేసినది. పళ్లెం, పాత్ర అని మాం.ప.కో. (రా)
"ఆతల నబక ముంచినట్టి వేడి చెయ్యంటదు
జాతిదేహము మోఁచిన సహజ మింతే" 2-288

అభయహస్తమిచ్చు : *ప.బం; అ.క్రి.* భయం లేదనే ధైర్యమిచ్చు.
"భావించి రాజసాన నభయహస్తమిచ్చినాడు
దైవ మాతనినే నమ్మి తరుణులు మొక్కరే"
24-136

అభయహస్తము : *వి; ప.బం.* భయం లేదని ధైర్యాన్ని ఇచ్చే హస్తం.
"బంతినే యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడ
అంతటికి నీ యభయహస్తమే చాలును"
15-394

అభ్యుదయమగు : *అ.క్రి.* ఉదయించు.

అమయు : *అ.క్రి.* ఉపయుక్తమగు.
"వలపు లాకటికి వనిత లధర మిది
చెలువుని కిపుడమసిన విందు" 24-45

అమరగాఁడు : (అమరము + కాడు) యోధుడు, (పర్యా) అమరము ననుభవించి రాజసేవ చేయు భటుడు. (సూ.ని.) అగత్యమైనపుడు కొంత సైన్యాన్ని తీసుకొని రావలసింది అనే నిబంధనమీద చిన్నరాజులకు విడువబడిన సీమపై అధికారం కలవాడు. (బ్రౌన్)
"ఇరువది నలుగురి కిటు నే గమికాఁడ
అరిది దేహపుటురి అమరగాఁడా" 15-39

అమాస : వి. 'అమావాస్య'కు వ్యావహారికరూపం.
"పున్నమ నమాసయు పోగై నిలువఁబోలు
వున్నతి యోగీంద్రుల యూహ గాఁబోలు"
4-386
"అనుఁగుఁబున్నములకు అమాసచీకట్లకు
అనయ సరికి సరందుకందుకు" 3-363

అమ్మఁగారు : వి. అరసున్న విలక్షణం.
"అమ్మఁగారి విన్నపములయినాను విని నీవు
కమ్మక నన్ను నిట్టె కావరాదా" 16-336

అమ్మక చెల్ల : (అమ్మ + అక + చెల్లెలు) అవ్య. ఆశ్చర్యార్థకశబ్దం, ఔర.
"అమ్మకచెల్ల నే నీకు నడ్డమా వోరి యింపు
గుమ్మరింపుచు నా గుట్టు కొలగొంటి వోరి"
5-11

అమ్ముడువోవు : (అమ్ముడు + పోవు) *ప.బం; అ.క్రి.* ఒకరికి దాసుడగు, ఒకరు చెప్పినట్లు ప్రవర్తించు, వశమగు, అమ్ముడగు, వెలకుపోవు.
"మదిమది నుండిన నా మనసే నమ్మితినా
అదియును నింద్రియాల కమ్ముడువోయినది"
2-20

అమ్మేటి(మ్మోడి) దొకటి అసిమలో (ని) దొకటి : ప.బం. సంచిలో ఉన్న వస్తువు ఒకటి. అమ్మే వస్తువు మరొకటి. లోనొకటి, వెలుపలొకటి అనడం.
"అమ్మోడిదొకటి అసిమలోదొకటి
బిమ్మిటి నిందేటి పెద్దలమయ్యా" 1-483
అసిమిలోని దొకటి, యమ్మోడిదొకటి అని హరివంశ ప్రయోగం. 2-151

అమ్మేదొకటి అసిమలందొకటి : చూ : అమ్మేదొకటి అసిమలో దొకటి.
"అలరి యమ్మేదొకటి యసిమలందొక టాయ
చెలి యాతని కేమని చెప్పుదుమే నేము" 22-14

అమ్మేదొకటి అసిమిలోదొకటి : *ప.బం; వి.* సంచిలో ఒకటి పెట్టుకొని మరొకటని చెప్పి విక్రయింప జూచుట అనే అర్థంలో వాడబడే సామెత. (అసిమ = సంచి) మాట ఒక తీరుగను చేత ఒక తీరుగను ఉండడమని భావం.

అమ్మేదొకటియును నసిమిలోని దొకటియు : సామెత; మోసగించు అనే అర్థంలో వాడబడుతుంది.

"అమ్మేదొకటియును నసిమిలో దొకటియు
నమ్మిన నీ మోహమింతా కానరాదా నాకును "
17-284

చూ: అమ్మేదొకటి అసిమలం దొకటి.

అయఁగారు : వి. గురువు. చూ: అయ్యఁగారు.

"చదివించే అయఁగారు జంకించి చూచితేను
వొదిగి చదువుఁగాక వోపననీనా" 2-400

అయజియలు పెట్టు : *ప.బం; అ.క్రి.* పొగడు (తె.జాతీ.) చూ: అయ్యజియ్యలు వెట్టు.

అయితేఁగనక: అవ్య. అయినపక్షంలో.

"దవ్వు చేరువ మనసు తన యిచ్చయితేఁ గనక
రవ్వగ మృగాదులెల్ల రాజ్యమేల నేరవా" 1-372

అయినపాటి : వి. అయినంత, అయినకొలది.

"నిందలువేసేవు గాక నిజమా యిది
అందుకేమి వోరి నీకు అయినపాటి చాలదా"
17-325

అయిరాణి : వి. అయిరేని అని వాఙ్మయంలోను, అరివేణికుండ లని లోకవ్యవహారంలోను కనబడే పదానికి ఇది ప్రాకృత రూపం. అయిరేని కుండలని అర్థం. "అయిరాణి ఇంద్రాణీ ధుంధుమారి పరాచిచ శక్రవల్లభాయామ్" అని షడ్భాషా చంద్రిక ఝుూడాదిసూత్రం లో అయిరాణి అనే పదం పేర్కొనబడింది. ఇది ఇంద్రాణీ శబ్దభవం కావచ్చు. అయిరేని కుండలతో జరిపే పూజకూడా శచీపూజయే. వివాహకాలంలో సౌమంగల్య సిద్ధి కోసం శచీపూజ ప్రశస్తమై ఉన్నది. (చూ. పీఠిక. 5సం. 30పు.)

"బచ్చెనల మెఱుఁగుగుబ్బల అయిరాణి దెచ్చి
కుచ్చుఁబులకల(?) బూజగుండలాయను (?)"
5-189

అయ్యఁగారు : (అయ్య + గారు) వి.
1. పూజ్యుడు, బ్రాహ్మణుడు 2. ఆచార్యుడు. ఇట అయ్యపై నున్న అరసున్న చింత్యం. అయ్యంగారు శబ్ద సాదృశ్యంతో వచ్చిందేమో ? చూ: బావఁగారు.

అయ్య(లు) అసాదలు : *వి; ప.బం; బహు.* ఆచార్యులు మరియు తక్కువ కులానికి చెందినవారు. పెద్దలు మరియు చిన్నలు అని భావం. సూ.ని. లో 'అసాది' అనే శబ్దం చూపబడింది. దానికి గ్రామదేవతను పూజించు పూజారి, మాదిగ అనే రెండర్థాలు ఇవ్వబడ్డాయి.

"పయ్యెద జారఁగ నిల్చె భ్రమయించ నేమంటివి
అయ్య అసాదలు పెట్టేనందుకు నేమంటివి "
8-12

"అట్టు నిట్టును నీకు నయ్యలు నసాదలును
బెట్టినా నీచేతఁ బిరువీకులైతి" 5-213

అయ్య జియ్య(లు) వెట్టు: *ప.బం; అ.క్రి.* అయ్యా! జియ్యా అని వినయంతో మనవులు చేసుకొను, పొగడు, గౌరవించు. చూ :- అయ జియలు పెట్టు.

"యియ్యెడ సతులలోన నెమ్మెలు మెరసే నీకు
అయ్య జియ్య వెట్టినాను అప్పటిని మేలు "
8-44

"శరణాగతారాతి ధరణీరమణు లయ్య
జియ్యలువెట్టుచు సేవ సలుప" అని సారంగ. (1-62) ప్రయోగం.

అరగంటఁజూచు : స.క్రి. పరవశంగా చూచు.

అరగు : వి. 'అరుఁగు'కు వ్యావహారికరూపం. తిన్నె, ఇంటి ముందుద్వారానికి ఇరువైపులా గోడనానుకొని కట్టిన తిన్నె అరుగు. కూర్చొవడానికి, పడుకోవడానికి అనువుగా ఉంటుంది. తెలంగాణంలో దీన్ని 'అరుగు' అని వ్యవహరిస్తారు. శ.ర.లో 'అరుగు' అనియే చూపబడింది. అరుఁగనియే తఱచుగా వాడుక. అరఁగని యెుకానొకచో గానబడుచున్నదని

కూడా సూచింపబడింది. అన్నమయ్య అరసున్న లేకుండానే ప్రయోగించినాడు.

"పుట్టినవారికెల్లా పొత్తుల దీ జగము
మెట్టి కూచుండే యరగు మేదిని యెల్లా" 2-310

అరగొర : (3) వి. అఱగొఱలు, న్యూనత, అసంపూర్ణత, అఱమఱ, భేదం, గుట్టు, కాపట్యం, సందేహం.

"ఆయములంటితేను అరగొరలే లేవు
పాయక వద్ద నుండితే పంగెము గాదు" 26-427

"అడిగే నేననఁగానే అరగొర లెల్లఁ దేర్చ
కడమలు మాని నవ్వఁగదవె యిఁక" 9-280

"కందువ శ్రీవేంకటేశ కలిసితి విట నన్ను
అందాలు సేయించును నీ యరగొర లెల్లాను"
21-380

అరగొరత : వి. నిఘంటువుల్లో 'అఱగొఱ' అనే పదమే కాని 'అరగొరత' అనే పదం లేదు. 'అఱగొఱ' పదానికి నిఘంటువులో 1. కపటం 2. భేదం 3. న్యూనత అనే అర్థాలు చూపబడ్డాయి. అరగొఱతకు కూడా ఈ అర్థాలు చెప్పుకోవచ్చు. అన్నమయ్య 'అరగొరత'లో రెండు రేఫాలనూ సాధురేఫాలుగానే ప్రయోగించినాడు.

"అతఁడిదె నీ విదె అరగొరతేఁటికే
కాతరానఁ గాఁగిలించి కపటము లేఁటికే" 20-457

"విరసమేమి గల్లాను వేళవేళనే పాసె
అరగొరత కేల అవి నీ వెఱగవా" 20-159

"అతఁడిదె నీవిదె అరగొరతేఁటికే
చేతిలోని వాఁడితఁడు సిలుగు లింకేటికే" 20-370

అరగొరసేయు : *ప.బం; అ.క్రి.* న్యూనత కలిగించు, న్యూనం చేయు.

"అయములంటిన మీఁద అరగొరసేతురా"
23-235

అరచందురుని రేకలు : *వి; బహు.* నఖక్షతాలు, గోరిగుర్తులు.

"మురిపమది యెట్లుండు
ముద్దుఁజనుఁగవమీఁద
నరచందురుని రేక లపుడెట్టులుండు" 6-27

అరచేత నిలుచు : *ప.బం; అ.క్రి.* సులభంగాఅబ్బు - లభించు, సులభమగు.

"వడిగా శ్రీవేంకటేశ్వర మీ శరణనఁగా
అడరి వైకుంతము మా యరచేత నిలిచె" 8-12

అరచేతనుండు : *ప.బం; అ.క్రి.* సులభసాధ్యమగు.

అరచేతికి అందు : *ప.బం; అ.క్రి.* సులభంగా లభ్యమగు.

"విందై యిహము వెనకకుఁదీసి
అందీ వైరాగ్య మరచేతికిని" 8-4 old

అరచేతికి దొరుకు : *ప.బం; అ.క్రి.* సులభంగా లభ్యమగు.

"ఇలపై శ్రీవేంకటేశ్వర యిహపర
మలవడి దొరకెను అరచేతికిని" 3-118

అరచేతిది : (అరచేయి + అది) *ప.బం; వి.* అందుబాటు లోనిది, సులభమైనది.

"శ్రీవైకుంఠుని దాసుల మట
యరచేతిది మోక్షము మాకిదివో" 3-371

అరచేతి దైవము : *ప.బం; వి.* అందుబాటు లోని దైవం. సులభదైవం.

"వింతవింత విభవాల వేంకటేశుఁడిదె మా
యంతరంగమున నుండే అరచేతి దైవము"
1-172

అరచేతి ధనము : *వి; ప.బం.* అందుబాటులో నున్న అమూల్యవస్తువు, అరచేతి మాణిక్యము వంటి పదం.

"పరఁగ నంతరంగాన పాఁతినట్టి ధనము
హరినామ మిదియ పో అరచేతిధనము" 3-27

అరచేతి నిమ్మపండు : *ప.బం; వి.* అందుబాటులోని వస్తువు, కరతలామలకము వంటిది. ప్రేమను తెలిపే లోకోక్తి.

"నెలకొన్న అరచేతి నిమ్మపండువంటిది
వలపుల కాతరాన వాడింతురా" 7-426

"విభుండఱచేతిలోని నిమ్మపంటివలె నత్యాసక్తి మన్నింప" అని సారంగ. 2-113

అరచేతి మణి : *ప.బం; వి.* అందుబాటులో నున్న అమూల్యవస్తువు.
"తెఱఁగుల నీ పతికి తెల్లని నవ్వులు చల్లి
అఱచేతి మణివైతి వలమేలు మంగా" 11-512

అరచేతి మాణికము : *ప.బం; వి.* అందుబాటులో నున్న అమూల్య వస్తువు.
"అంతనింత గొల్లెతల అరచేతి మాణికము
పంతమాడే కంసుని పాలి వజ్రము" 3-577
"అక్కరో శ్రీవేంకటేశుఁడరచేతి మాణికము
యిక్కువలు గరఁగించే వింటే పో మంటా"
17-52

అరచేతి మాణిక్యము : *ప.బం; వి.* చూ : అరచేతి మాణికము.
"అరచేతి మాణిక్యమై యాపె నీ పొత్తున
యెరుకసే శారగించీ నేమి చేప్పేది" 14-386

అరచేతి మోక్షము : వి. సులభసాధ్యమైన మోక్షం.
"గరిమ మా పుట్టుగు నీ గర్భవాసములోనే
అరయ మా మోక్షము నీ యరచేతిదే" 3-11

అరచేతిలోని పువ్వు : *ప.బం; వి.* అందుబాటులో నున్న వస్తువు ; కరతలామలకంవంటి పదం.
"అలమేల్మంగలో నవ్వు అరచేతిలోని పువ్వు
లలిఁదారుకాణించరే లలనలాల" 12-120

అరచేనుండు : *ప.బం; అ.క్రి.* అందుబాటులో సిద్ధంగా ఉండు.
"అకటా దృష్టంబరచే నుండఁగ
సకలము నుపదేశముల కనేవి" 3-120
'అర' శబ్దం శకటరేఫతో కూడా వాడబడింది.

అరడు : వి. 'అరటి' కావచ్చు.
"అలరి యరడువద్ది తీగె అంటఁబార కేల మాను
చెలులసరస నున్నవారి చిత్త మూరకుండునా"
15-438

అరడుఁజేయు : బాధించు.
"మెల్లనే శ్రీవేంకటేశ మేలుకొలిపి కూడితివి
వొళ్లెల్ల నరడుఁజేసు వొద్దురా నేము" 26-63
"చిల్లెరతీఁగెలవంటి చేతులు మావినా
ఒళ్లెల్ల నరడుఁజేసు వొద్దురా నేము" 26-63

అరతన్ : అరుతన్ కావచ్చు. కంఠమునందు.
"అంది శ్రీవేంకటేశ్వరుకిదె యలమేలుమంగ
చెంది యరతఁగట్టఁగా శ్రీవిభుడై నిలచె" 2-50

అరదు : వి. 'అరుదు'కు వ్యావహారికరూపం, ఆశ్చర్యం, అపూర్వం.
"ఎనసి నన్నుఁగాచుటేమి యరదు నీకును
ననఘుఁడ పరమతత్వానంద తిరువేంకటాధిప"
1-35

అరమఱ : (అర + మరలుట) *ప.బం; వి.* 1. సందేహం 2. ఖేదం, పొరపొచ్చెం.
"అచ్చపుసిగ్గులలోని అంగభంగాలు
నీ అచ్చుపడ్డ కాఁగిటిలో నరమఱలా" 19-412

అరమఱచు : (4) *ప.బం.* జంకు, సంకోచించు, సగం మఱచు, ఆదమఱచు, పరవశించు.
"సిరుల శ్రీవేంకటేశ సేవచేసితి, అరమఱచితి
నవ్వే నలమేలుమంగ నేను" 20-476
"కరఁగులు నీ మోము కళలోనె కానరాదా
అరమఱచితి నంటూ నాడవలెనా" 11-352
సగం మఱచు, ఆదమఱచు, పరవశించు.
"ఆయాలు సోకించితిని అరమరచి చొక్కితి
చాయనేయవలెఁ గాక సాదించేనా" 11-65
"సిరుల శ్రీవేంకటేశ చేరి నీ కాఁగిట నేను
అరమరచితిఁ బనులన్నియు నింతేపో" 21-481

అరమఱపు : (5) *వి.; ప.బం.* పారవశ్యం.
"అట్టె శ్రీవేంకటేశ అరమఱ పాయ మేను
చుట్టమై ఇంత సేయ సూడా నీకు" 22-151

అరళుపాడులు పెట్టు : *అ.క్రి.* 'అరళుప్పాడు' అంటే మీరు చెప్పవచ్చు నని ఆదేశం. భగవత్ కృపను పొందటానికి సంకీర్తనములను చెప్పడాన్ని సంకీర్తన అరళప్పాడుగ చెప్పదగును. సంకీర్తనసేవ, ముంగిట పారుపత్యములు చేయు, దర్బారు చేయు, కొలువు చేయు. సంకీర్తన అరళుప్పాడు భాగవతులు. (దేవునికి సంకీర్తనలు పాడే

భాగవతులు అని ద.హిం.శా. 4సం. లో కలదు. 710 శాసనం)

"అంగరంగవైభవాల కరళుపాడులు వెట్టి
అంగపు నిత్యదానాదు లన్నియుఁజేసె" 7-473

అరవసము: (అర + వశము) వి. సగం లోగిపోవడం, లోగి లోగకుండటం అని భావం.

"వనిత తమ్ములము నీ వదనాన నిడఁగాను
మునుకొని అరవసమున నుండేవు" 14-85

అరవిరి: వి. అరవిరి అంటే సగం విరిసిన మొగ్గ అని అర్థం. సగం విరిసిన పువ్వు ముచ్చటగా ఉంటుంది కనుక అరవిరి చందమగు అందాన్నే సొగసుఁదనమునే అరవిరి అని ప్రయోగించి ఉంటారు.

"అరవిరివిధమైన నాన తీయరాదా" 75-190

"అలవోక నగవు నీ అరవిరిసాము" 5-195

"అందపు రెండుకన్నుల నరవిరి నీ మోము
చెందమ్మిరేకుల బోల జెల్లు నయ్య విఠల" 5-201

"వినయవివరంబు లరవిరి మ్రొక్కులాయె" 5-199

"అరవిరి నురమున అలయుచును వీఁడె
తిరువేంకటపతి దెలుపరమ్మా" 5-338

అరవు: వి. ఎరవు.

"విమల మూరితియైన వేంకటగిరిపతి
అమరఁజేరక యరవాయ బ్రదుకు" 1-250

అరవెరమాటలు: వి; బహు. కలవరింత మాటలు, అడ్డదిడ్డమైన మాటలు.

"దురితపుణ్యత్రిదోషజ్వరము వట్టి
అరవెరమాట లాడీని" 1-300

అరసత్తిది: వి. తక్కువ శక్తి కలది (?) శక్తి హీన (?)

"తానే యింత జాణ గాని తలఁప నే మెడ్డలమా
ఆనుక యూరకుండితే అరసత్తిదాననా" 17-428

అరాజికము: వి. 'అరాజకం' అనే పదానికి వికృతిరూపం. నాయకుడు లేనందువల్ల కలిగే అస్తవ్యస్త పరిస్థితి, అరాచకమని వ్యవహారం. అనాయకం, రాజు లేనిది.

"యింపుల శ్రీవేంకటేశ యిది యరాజికమాయ
పంపున నీ కిదె మొఱ ప్రతిపాలించఁగదే" 4-58

అరిగోరు: భాగం.

"అట్టె కర్మము లనేటి అరిగోరులు పెట్టేము
నట్టుకొట్టి జీవులకు నరకము లేలయ్యా" 15-128

అరిగోరువెట్టు: అ.క్రి. భాగంపెట్టు. (ప్రభుత్వ భాగం, రైతుభాగం, మొత్తం ఫలసాయం.)

"అట్టె కర్మములకు నరిగోరువెట్టేము
నట్టుకొట్టి(ట్టే) జీవులకు నరకము లేలయ్యా" 3-487

"అట్టె కర్మములనేటి అరిగోరులు (?) వెట్టేము
నట్టుకొట్టి జీవులకు నరకము లేలయ్యా" 15-128

అరిగోలు: వి. నదిని దాటించే సాధనాల్లో ఒకటి (సూ.ని.)

"అనుఁగువిభుఁడు వాడె అరిగోలు దన సొమ్ము
వెనకముందర విన్నవించరమ్మా చెలులూ" 11-55

అరిదిపడు: అ.క్రి. వింతపడు (అరిది = వింత)

"తెర వేసుకొనఁగానే దీకొని ఇంతిఁగూడేవు
అరిదిపడవు సారె నంటువాయవు" 27-71

అరివేనన్: అరివాణము = గిన్నె, చషకం, తలె.

"మరులేల కొలిపేవు మనసు నా కియ్యరాదా
అరివేనఁదెచ్చితివా అప్పుడే నీవు" 7-487

అరుత లింగము గట్టి పరువతమేగిన బత్తుడు: సామెత. మెడమీద మేకపిల్లను పెట్టుకొని ఊరంతా వెతకినాడనే సామెత వంటిది.

అరుదందు: ప.బం; అ.క్రి. (అరుదు + అందు) ఆశ్చర్య పడు.

"యీ నెపాన నిన్ను నన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
ఆనుక నవ్వినందుకే అరుదందేవు" 26-442

అరువడము: వి. ఆశ, కోరిక, సాన్నిహిత్యం, దగ్గరి సంబంధం.

"ఆపెకు నీకు నెంత అరువడమో

రేపును మాపునుఁ దమి రేఁచీని" 13-105

అరుహము : వి. అర్హము అనే శబ్దానికి జానపదవ్యవహార రూపం. యోగ్యం, యుక్తం, తగినది. ఇట రేఫకూ, హ వర్ణానికీ మధ్య ఉకారాగమం రావడం విశేషం. ఇట్టి రూపాలు శివకవుల రచనల్లో అనేకం.

"అంతయు ననరుహమును
నరుహంబనగరాదు
అంతవానికిఁ బరుల కలవడదుగాన" 1-60

అరుహానరుహము : (అరుహ+అనరుహము) అర్హము మరియు అనర్హము – తగినది మరియు తగనిది. యోగ్యం మరియు అయోగ్యం. చూ : అరుహము.

"అందరును సమమైతే నరుహానరుహము లేదా
అందరిలో హరియైతే నౌఁగాక" 2-170

అరుహుఁడు : వి. అర్హుడు అనే శబ్దానికి జానపద వ్యవహారరూపం. ఇట రేఫకూ, హకారానికీ మధ్యలో ఉకారం రావడం విశేషం. ఇట్టి ప్రయోగాలు శివకవుల రచనల్లో అతిసాధారణం.

"సతతదయాచారసంపన్నుఁడై మఱికదా
అతిశయవైష్ణవాన కరుహుఁడౌట" 1-423

అర్చావతారము : వి. భక్తులు పూజించుకోవడానికి వీలుగా వెలసిన భగవంతుని రూపం.

"సన్నిధిఁగల యర్చావతారమిది
వున్నతి ఘనమని వుండఁగవలెను" 15-230

అఱచేత నుండు : *ప.బం; అ.క్రి.* సులభంగా లభించు.

"అచ్చట వీరి ప్రసాదమమృత పానములు
అచ్చమై తెలిసే వారి కఱచేత నున్నది" 1-479

అఱచేతిది : (అఱచేతి + అది) సులభసాధ్యం, అందుబాటు లోనిది.

"ఆదైన చదువులు అఱచేతి వతనికి
మేదినిఁ దిరుగాడు మెట్లవలెనా" 2-68

అఱచేతిలోనిది : *ప.బం; వి.* అందుబాటులోనిది, సులభమైనది.

"చెచ్చెర నుపచారము చెప్పిన యాపెకుఁగదా
అచ్చపుమన్నన లెల్లా నఱచేతిలోనివి" 21-234

అఱచేతిలోనివాఁడు : *ప.బం; వి.* అందుబాటు లోని వాడు, సులభుడు.

"యెప్పుడు అహంకార మిటు మానును
అప్పుడు దైవము అఱచేతిలోనివాఁడు" 15-42

'అఱ' శబ్దం సాధురేఫతో కూడా వాడబడింది.

అఱచేతివారు : *ప.బం; వి; బహు.* సులభులు.

అఱవడము : వి. (?)

"మఱి యే పురుషార్థము మా వంకలేదు మీకు
అఱవడము మాకెంత అత్తువో నీవు" 3-59

అఱిమురి : *క్రి.విశ.* 1. అనాలోచితంగా 2. వెంటనే 3. అత్యంతం, మిక్కిలి 4. తబ్బిబ్బుగా 5. తరుచుగా 6. నిశ్చయంగా 7. బొత్తిగా 8. శీఘ్రంగా, వేగంగా. *విశ.* అత్యంతం, మిక్కిలి, గడబడ లాగా తొందరనుగానీ, తొందరపాటునుగాని తెలిపే ధ్వన్యనుకరణం.

"మెఱయు శశికాంతపు మేడ లోపలను
అఱిమురి కప్రంపుటరుగు మీఁద"

ఈ పదం వావిళ్ల నిఘంటువులో 'అఱిముఱి' అని చూపబడంది. 1. త్వర 2. క్షోభం, కలత అనే అర్థాలు చూపబడ్డాయి.

అఱుకమ్ము : చుట్టూ కమ్ము, కవియు, మెడ పట్టుకొను.

"అరు(లు) కమ్మి పెనగేవు అద్దిరా నీవు"

అలపు : వి. అలసట, శ్రమ.

"పోసరించి కెళవుల పొందులే వెదకుఁగాక
ఆసోదకాని కెంతైనా నలపు గద్దా" 16-36
"బలిమి వొద్దఁగూచుండి పాదాలేమి గుద్దేవే
అలపు దీరుచుకో అంతలో నీవు" 22-195

అలబలము : వి. కలకలం, సందడి, జనులు, పక్షులు మొ॥ వాని ధ్వని.

"వెలినున్న చైతన్యవిధుల దొరలచేతి
యలబలముగాన మహామేలు" 2-124
"అందంద మాటలాడే అలబలము చూడక

కందువఁ దెర దీసుటే కల్ల నా వల్ల" 7-7

అలమటఁబడు : *ప.బం; అ.క్రి.* చింతపడు.
"వావిరి నిదెఅఁగక వట్టి యలమటఁబడి
జీవు లేల బడలేరు చింత లిట్టే పాయరో" 2-94

అలమట : *వి.* చింత.
"దించక తిరిగే తిమ్మటలన్నియు
అంచల వెఙ్ఱుల అలమటలు" 3-157

అలమటకాఁడు : (అలమట + కాడు) *వి.*
1. దురవస్థ కలవాడు, శ్రమ కలవాడు, దుఃఖం కలవాడు, బాధ కలవాడు.
"సరసపుమాటల సటకాడవు
మరుతంత్రముల యలమటకాఁడవు" 28-527

అలమేర్(ల్)మంగ : *వి.* అలమేల్మంగ, శ్రీవేంకటేశ్వరస్వామి ధర్మపత్ని, పద్మావతి. రూపాం. అలమేల్మంగ, అలమేలుమంగ, అలర్‌మేల్‌మంగ = పుష్పం (పద్మం) పై భాగంలో జన్మించిన లక్ష్మీదేవి అని అర్థం. త. అలర్ మేల్ మంకై.
"నిరతి శ్రీవేంకటేశ నేనల మేర్‌మంగను" 7-342

అలయించు : *స.క్రి.* శ్రమింపజేయు, విసిగింపజేయు, ఆలస్యంచేయు.
"కలయఁగ నేర్చుఁగాని గక్కన శ్రీవేంకటేశ
అలయించనేరదు అలమేల్‌మంగ" 16-570

అలయింత : (అలయించు + త) *వి.*
శ్రమపెట్టడం.
"పొలిఁతి నాకేల యీ పొందులు వీని
అలయింతవలపుల నలయుచును" 6-130

అలవోక : *వి; ప.బం.* స్వేచ్ఛ, యదృచ్ఛ.
"సొలసి సొలసి చూచే చూపులే వేడుకగాక
అలవోక లవి యెల్లా నాసరేఁచీనా" 8-115

అలసిసొలసి : *ప.బం; అ.క్రి.* మిక్కిలి ఆయాసపడి అనే అర్థంలో జంటపదం.
"వెలుగు చేను మేసినట్టి విధము దోఁచె
నీయందు
అలసి సొలసి నిన్ను నిఁక నాడ నేఁటికే" 23-593

అలసును : *స.క్రి.* అలయును అనే పదానికి వ్యావహారికరూపం.
"మారుకొ నీరెండుగాళ్లే మాపుదాఁకాఁ జుట్టనోపు
యే రీతి దేవ! నీ గుడికేగ నలసుఁగాని" 2-230

అలికి పూసి కుడుపు : శుద్ధిచేసి, గంధంపూసి, నైవేద్యం సమర్పించు.
"ఆరగించి వేలుపుల అలికి పూసి కుడిపి
కూరిమి శ్రీవేంకటాద్రి గోవిందుఁడమ్మా" 2-167

అలిగించు : *ప.బం; స.క్రి.* కోపింపజేయు.
"అలిగించు ములిగించు నంతలోనె
భ్రమియించు
కొలఁది సంసారపు గుణ మిది" 10-223

అలుకలు : *వి.* 'అలకలు'కు వ్యావహారికరూపం(?) ముంగురులు.
"పులకజొంపములఁ బ్రుంగుడగుచు నీ
యలుకల చెమటల కమ్ముడువోయె" 6-11

అలుకసేయు : *అ.క్రి.* కోపించు.
"అలుకసేసుకొంటివి అక్కడకుఁబోవలసి
తెలుసు కాని యేఁటికో తిరిగివచ్చితివి" 11-599

అలుకు ఉలుకు : *ప.బం; అ.క్రి.* భయపడు అనే అర్థంలో జంటపదం. (అలుకు = భయపడు, ఉలుకు = భయపడు)
"అలికేవు వులికేవు అంతలోన భ్రమసేవు
వెలయ నిలువుననె వెరగందేవు" 9-19

అలుకుడు సేయు : *అ.క్రి.* అలికిడి చేయు, చప్పుడు చేయు.
"అచ్చపు శ్రీవేంకటేశు నలమి కౌఁగిటఁబట్టి
కొచ్చి కూడే వేల అలుకుడు సేసేవే" 12-525

అలుగక ములుగక : *ప.బం; అవ్య.* కోపపడక - మూలుగక. (గౌణగక)
"అలుగక ములుగక అతని గుణములు
తెలుసుకొనఁగదవె దినదినములను" 8-6

అలుగువారు : *ప.బం; అ.క్రి.* అలుగు అంటే పరీవాహం. చెరువు మొ॥ వాటిలోని అదనపు నీరు పోవడానికి ఏర్పరచిన దారి. దానిపైనుండి నీరు ప్రవహించు అని వాచ్యార్థం. అధికమగు.

"అరిది సురతభావరసము
లలుగువారఁబోలును" 17-279

అల్లది : (అల్ల + అది) వి. అయ్యది. ఇట అల్ల నిర్దేశార్థకం. పరిదృశ్యమానమైనదాన్ని చూపటం.

"నీవు మన్నించినదాన నీకు వలచినదాన
ఈవల నల్లది నాతో యీడుజోడుగా" 11-32

అల్లదివో : (అల్ల + అది + వో) అదిగో, పరిదృశ్యమైనదాన్ని చూపటం.

"అదివో అల్లదివో హరివాసము"
"అల్లదివో వోఁగునూతు లౌభలేశు పెద్దకోన
వెల్లి పల నీటిజాలు వెడలే సోన" 4-375

అల్లదె : (అల్ల + అదె) అదిగో. అల్ల నిర్దేశార్థకం. పరిదృశ్యమైనదాన్ని చూపటం.

"అల్లదె జవ్వని హరి యురమున నదె
మెల్లనె యిటు వుపమించరే మీరు" 19-375

అల్లప్పుడు : (అల్ల + అప్పుడు) అప్పుడు. ఇందలి 'అల్ల' అనేది నిర్దేశార్థకం.

"మేలిమి పొదరింటిలో మీరిద్దరు నల్లప్పుడు
తాలిమితోడ నేకతము లాడుకొనరాదా" 12-419

అల్లమవుతా బెల్లమవుతా : *ప.బం.* గాఢస్నేహం కలిగిఉంటూ; 'అల్లం బెల్లం' అని సామెత. ముద్ద చేస్తే రెండూ కలుస్తాయి. విడదీయరాని స్నేహం అని భావం.

"కొల్లి శ్రీవేంకటపతి కూడె నా కౌఁగిటిలోన
అల్లమవుతా బెల్లమవుతా అడిగేఁబో యిఁకనూ"
17-468

అల్లములు బెల్లములగు : *ప.బం; అ.క్రి.* ప్రతికూలంగా ఉన్నవి అనుకూలములగు.

"ఆయనాయ నీ మాట లల్లములు బెల్లములు
మూయ మూయ నీకె మూరెఁడు సోరు" 9-73

అల్లవాఁడు : (అల్ల + వాఁడు) వి. ఆ వాడు, ఆతడు. ఇట అల్ల అనేది నిర్దేశార్థకం.

"ఎట్టు సేసినాఁ జేయుమిక నాతఁడల్లవాడే
పట్టరాని వ్రతముతో పానుపుపైనే" 8-177

అల్లా : అవ్య. ఎల్లా, అంతా (అల్ల = ఎల్ల, అంత)

"మెట్టి కూచుండే యరఁగు మేదిని యల్లా"
2-310

"వాటపుఁ బెండ్లి చవికె వనిత నీ పిరుఁదు
మేఁటి రాజ్యపదవి నీ మేనల్లాను" 18-58

అల్లాడన్ : (అల్ల + ఆడ) అక్కడ, ఆ చోటు. ఇట అల్ల అనేది నిర్దేశార్థకం.

"అల్లాడఁబడి వున్నదా ఆడుఁదనము
పల్లదానఁ బదికితే పచ్చిగాదా తనువు" 13-349

అల్లికాము : వి. అల్లికాడ, కలువతూడు.

"తిన్నని మేఘము చూచి తిట్టుచు నీరెల్లఁగార
సన్నపు టల్లికామల చాఁచి పిలిచీని" 7-422

అల్లిదామెర : వి. తెల్లకలువ.

"తల్లివె మాకెల్ల నీవు తగు నీకు చెలులము
అల్లిదామెరలై నీ వాతనిఁ జొక్కించను" 7-66
"అల్లిందామరల పొందులైన కన్నులవాఁడు
తల్లిఁగూఁతుఁ గౌఁగిటఁ దగిలినాఁడు" 6-43

అల్లిబిల్లి : *ప.బం; విణ.* 1. కలసిమెలసి ఉన్నది, కూడిమాడి అన్నట్లు 2. సాంద్రమగు 3. ప్రియమైనది. వి. 1. పెనకువ 2. స్నేహం 3. బాలక్రీడావిశేషం.

"బల్లిదుఁడలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడ
అల్లిబిల్లై యున్నాఁడమ్మా యశోదమ్మా" 4-161

అల్లిబెల్లియగు : కలిసిమెలిసి యుండు.

"నంటున జక్కవలపై నల్లఁబులుగులు వారె
అంటి తామరా జిగురూ నల్లిబెల్లే యగు"
24-562

అల్లిరము : వి. మనుగుడుపులు, పెండ్లివిందు.

"అన్నిచోట్లనుండి అల్లిరము లారగించ
వెన్నుఁడవై వేడుకతో విచ్చేసినట్లు" 3-433

అల్లుకొను : వృద్ధిచెందు.

"అల్లుకొనెఁ గర్మములు అక్కడికి నిక్కడికి"
2-490

అల్లునేరేళ్ళు : *ప.బం; వి; బహు.* 1. బాలికలు వెన్నెలలో ఆడే ఒక ఆట 2. నమస్కారం 3. ఒకవిధమగు పాట; రూపాం. అల్లోనేరేళ్లు.

"అవల వెన్నెలలోనె అల్లునేరే ళ్లింతే
నివిరి నిన్నటి వునికి నేఁటికిఁ గలదా" 1-449

"వేయకురే కొల నాపై వెన్నెల గలప్పుడే
ఆయెడ నల్లు నేరేళ్లనుట యెఱఁగరా" 19-440

అల్లోనేరేళ్లు : ప.బం; వి. (1. జంబూ ఫలాలు, జంబూ వృక్షాలు) 2. బాలికలు వెన్నెలలో ఆడుకొనే ఒక ఆట.

"నెయ్యము లల్లోనేరేళ్లో
వొయ్యన వూరెడి వువ్విళ్లో" 5-179

"వెన్నెలదినమున నల్లోనేరేళ్లు గాక
యావలఁగలవే" అని భా.రా.

అళగిరి : వి. అహోబలానికి పేరు. అహోబల నృసింహస్వామికి అళగిరిసింగం అని పేరు.

"అళగిరి చక్క నళగిరి వో యళగిరి
తలవంచుకోర నామట తారుకాణ సుమ్మీ" 19-457

అళగు : వి. సౌందర్యం.

అళతి : వి. (రా.సీ; మాం.) కొలతలు తీసుకోవడం, గుడ్డలు కుట్టించేటప్పుడు దర్జీ 'అలితి' ఉందా అని అడుగుతాడు. 'ఆది' అని కోస్తా వ్యవహారం.

"హత్తి కలువరేకుల యళతులు గొలిచేవు
కొత్తగా కనుగొనల కొలది దెలిపేవా" 22-257

అవగళించు : స.క్రి. 'అవఘళించు'కు రూపాం.

"చెందిన వేడుక శిశుపాలుఁడు
అంది పెండ్లాడఁగ నవగళించి" 5-18

అవధానము : వి. ఒక కవితా ప్రక్రియ; ఇందులో ఏకాగ్రతకు ప్రాధాన్యమెక్కువ.

"మూటగా నిట్టె పుస్తకమున వ్రాసుకుండితివో
నాఁటనుండియు నవధానములు నేరుతువో" 23-359

అవధారు : అవధరింపుము. వినుము అనే హెచ్చరికను తెలియజేసే శబ్దం.

"అవధారు పరాకుసేయకు మపరాధముగా నెంచకు
వివరింపఁగ నీవే గతి విష్ణుఁడ మన్నించఁగదే" 2-295

అవలయివల చేయు : ప.బం; స.క్రి. చలింపజేయు, కలతపరచు.

"తివిరి జలధిదాటి దీపించి లంకయెల్లా
అవలయివల సేసే హనుమంతుఁడు" 2-207

అవసరించు : స.క్రి. వేగిరపెట్టు, ఉవ్విళ్లుగొలుపు.

"ఇవల నలమేల్మంగ నిటు తా నన్నేలినాఁడు
అవసరించేవు నీకు నాతఁడే రమణుఁడా" 25-29

అవళు : వి. (?)

"అవళు గలిగి కా అష్టపుత్రులును
భవములు శ్రీహరిపాలనె కలిగె" 15-157

అవుఁగాదననివాఁడు : వి; బహు. తిరస్కరించనివాడు, బదులు చెప్పనివాడు.

"జవరాలు తనునెంత చలము సాదించినాను
అవుఁగాదననివాఁడే అందపురమణుఁడు" 18-368

అవుఁగాదను : (6) ప.బం; అ.క్రి. తిరస్కరించు, బదులు చెప్పు.

"అడ్డమాడఁజాలను అవుఁగాదనఁజాలను
దొడ్డదొరవు నీ మాట తోయఁజాలను" 18-342

అవుఁగాదనేవాఁడు : వి; బహు. తిరస్కరించేవాడు, బదులుచెప్పేవాడు, ఆలోచించేవాడు.

"అందుకేమీ దోసమా అవుఁగాదనే వారెవ్వరు
చెంది మాతో బాసలేల సేసేవు నీవు" 13-267

అవుఁగాములు : (5) వి; బహు. మంచి చెడ్డలు, రూపాం. ఔగాములు.

"కోలుముందుగా రతిఁగొన్నదే కోలుగాక
ఆలిమగని కైతే అవుఁగాములు" 14-514

అవుగులు : వి; బహు. భక్ష్యవిశేషం.

"అరిసెలు గారెలు నవుగులును
కరజికాయలును ఖండమండెగలు" 6-4

అవుదు : వి. (?) సందిగ్ధ పద సమీక్షలో (21సం. 385పు.) ఈ పదం కన్నడంలోని ఆముదపు చెట్టు అనే అర్థంకల అవుండ్ల (అవుండ,

అవుడ్లు, అవుడ్ల, అవుడలు, అవుకలికె) అనే పదమే తెలుగులో అవుఁదుగా మారిందేమో అని ఊహింపబడింది. అలాగే అవుడ్ల శబ్దం సంస్కృత ఆమండ శబ్దభవంగా కూడా సందేహింపబడింది. అవుదు శబ్దాన్ని అకుండ, అవుండ్ల శబ్దభవంగా భావించినపుడు అముదము అనే అర్థం చెప్పుకోవాలి. (ఆం.ప.ని.) అర్థం ఇక్కడ కుదురుతుందా? ఆలోచించాలి. వా.ని. లో అవుదు (జాదు) కు నీటి కాలువ అనే అర్థం చూపబడింది. ఈ అర్థం ఇట కుదురవచ్చు.

"చెలువుడ మఱియును చెక్కులు నొక్కఁగ
అలరిన యాసలు అవుదునఁజిక్కె" 21-116

అవుభళనారసింహుఁడు : వి. అహోబలక్షేత్రంలో వెలసిన నరసింహస్వామి.

"అన్నిటా జాణ గదవే అవుభళనారసింహుఁడు
కన్నెలాటలు చూపఁగాఁ గత లడిగీని" 13-472

అవుభళము : వి. అహోబళమనే నృసింహక్షేత్రం. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఉన్నది. అన్నమయ్య కీర్తనల్లో 'అహోబలం' అవుభళ, ఓబుళ, ఔభళ, ఓబుల, ఔబుళ ఇత్యాదిగా వాడబడింది.

అవుభళేశుఁడు : వి. అహోబలక్షేత్రస్వామి యైన నృసింహస్వామి ; అహోబల అనే పదానికి అవుభళ అనేది వ్యావహారికరూపం. చూ : అవుభళము.

అవులు : వి. 'అవి' శబ్దానికి బ.వ.రూపం కావచ్చు. 'అవి' శబ్దానికి సూర్యుడు, భూమి, గాలి, కొండ, ప్రాకారం, ఇల్లు, ప్రభువు, కాంతి, ముట్టుది, గొఱ్ఱె, ఎలుక, కంబళి, అడవి ఉలవలు అనే అర్థాలున్నాయి. ఇట గాలి, కాంతి అనే అర్థాలు కుదురవచ్చు లేదా అవులువారు అంటే గుల్లగుల్లయగు, నుజ్జునుజ్జగు అనే అర్థం కుదురవచ్చు.

"భావపు వింతలతోడ పచ్చి సింగారముతోడ
అవులువారెడి మేని అలపులతోడ" 5-337

అవుషధము : (2) వి. 'ఔషధము'. ఇందలి ఔ అనే వర్ణం ఉచ్చారణానుకూలంగా 'అవు' అని ప్రయోగింపబడింది.

"అట్టె పథ్యములొల్ల అవుషధము గొననొల్ల
మట్టు లేని మఱఁగొల్ల మైల గానొల్ల" 4-65

అవ్వచరి : వి. తిరుమల నడకదారిలో మోకాలి పర్వతానికి ముందుండే లోయను అవ్వాచారి కోన అని అంటారు. అవ్వాచారి అనే వైష్ణవభక్తుని పేరు మీద ఈ కోనకు ఆ పేరు వచ్చి ఉంటుంది.

"చక్క నేఁగుచు నవ్వచరిఁగడచి హరిఁదలఁచి
మ్రొక్కుచును మోకాళ్లముడుగు గడచినమీఁద"
1-227

అష్టమదములు : వి; బహు. ఎనిమిది విధాల మదాలు. అవి 1. అన్నమదం 2. అర్థమదం 3. స్త్రీమదం 4. విద్యామదం 5. కులమదం 6. రూపమదం 7. ఉద్యోగమదం 8. యౌవనమదం.

"పరమయోగు లీభావ మష్టమదము
భవవికారమని మానిరి" 2-383

అష్టాక్షరమంత్రము : వి. ఎనిమిది అక్షరాలు గల "ఓం నమో నారాయణాయ" అనే మంత్రం.

"యీతఁడే కా వుపదేశమిచ్చె నష్టాక్షరమంత్ర
మీతఁడే రామానుజులు యిహపరదైవము"
2-372

అసదు : (3) విణ. అల్పం, కృశం, సన్ననిది, నికృష్టం, దుర్బలం వి. అల్పుడు, దీనుడు.

"అతనుసంపదకంటె నసదా చెలిరూపు
మతి చింతచేత వేమరు నలఁగెఁగాక" 6-7

అసపెట్టు : (అసము + పెట్టు) పురికొల్పు, ఉత్సాహపెట్టు, ఆశపెట్టు.

"నన్నేల యసపెట్టేవు నాయకునిమీఁదను
పిన్నదాన ఆతనికిఁ బ్రియమాడేదానను"
20-541

అసమిచ్చు : అ.క్రి. అనురాగం పంచు. (అసము = కీర్తి, దర్పము, అనురాగము - ఆంధ్ర పదనిధానము) చనవు అని సారంగ. వ్యాఖ్య. చనవిచ్చు (?) అవకాశమిచ్చు(?)

"ముసిముసినగవుతో మునిఁగి నా కొనగోరి

కసమిచ్చి యేల లోఁగే వానతీవయ్యా" 24-46
"రసికత నీతో సరసము లాడేనంటే
అసమిచ్చేవా ఆపె ఆసలనున్నాఁడవు" 19-166
"కొసరి కొసరి నీపై కోపమున నుంటిఁగాని
అసమిచ్చు నీతో మాటాడ నైతిఁగా" 21-499
"మగువకు నసమిచ్చి మాటలెల్లా నాడించి
తగవు దిద్దవచ్చేను తగునా నీకు" 26-257
"మగువకు నసమిచ్చి మాటలెల్లా నాడించి
తగవు దిద్ద వచ్చేవు తగునా నీకు" 26-257
"ఎంతవలపైనను మొగవాని కసమిచ్చి మాట లాడుదుర" అని క్షేత్రయ్య ప్రయోగం.

అసము : (1) వి. యశస్సు, కీర్తి, పొగడ్త, అనురాగం అని (ఆం.ప.ని.) అహంకారం, గర్వం, దర్పం, ఉత్సాహం, శక్తి, పలుకుబడి, అవకాశం, వీలు, ప్రేమ, చనవు, స్నేహం.
"కొసరేటి తరిననెంత గోరనూఁదుదు నిన్ను
అసముతో నవ్వుదువందుకు నీవు" 7-344
"అసమునఁ జేయిచాఁచీ నాతఁడు గదే" 20-554

అసము దించు : అ.క్రి. అహంకారం వదల్చు, గర్వం వదల్చు, దర్పం వదల్చు.
"పొసఁగ పాదరసముఁ బోలిన నా మనసు
అసముదించక సదా అల్లాడీఁగాను" 2-395
"అసము దించక బీరాలాడీఁ గాక తాను
ససిఁగాటు దత్తరము నాకంటెఁబో" 24-118
"యిసుక లెక్క వెట్టితే నెంతైనా గలదు
అసముదించని పుణ్యా లటువంటివే" 3-568
"అసముదించని ఆన అది యెంతోకాని
అసముదించఁగ లేపు ఆరగించఁబెట్టరే" 11-256
"అసముదించక మాఁట లాడేగాని నీతో
విసిగితి నీ విరహవేదనలను" 20-130
"అసముదించక మాఁటలాడేవు గాక నాకు
వసమయ్యేవా యింత వన్నెకాఁడవు" 10-2-28

అసముదిగు : అ.క్రి. గర్వముపోవు.
"యెసఁగి శ్రీవేంటేశ యింతలో నన్నుఁగూడితి
అసముదిగితేఁగన కప్పుడనరాదా" 11-234

అసలుఁగంబము : (అసలు + కంబము) ప.బం; వి. అస్థిరమైంది. బురదలోని స్తంభమని వాచ్యార్థం.
"అసలుఁగంబ మీ యాశాదోషము
విసిగిన నూరక విడువనిది" 1-180

అసలు : అవ్య; అ.దే. నిజంగా, వాస్తవంగా.
"కొసరే మా మాటలు కూరిమిలో తేటలు
అసలు నే డింపేనా నాఁడె కాక" 11-154

అసలుకొను : అ.క్రి. బురదగా అగు, పూసినదగు.
"కుప్పలుగా మై నసలుకొని కస్తూరితోడ
తొప్పఁదోగేటి చెమటతోడ" 5-130

అసలు చొచ్చి అలయు : ప.బం; అ.క్రి. తెలిసి తెలిసి బాధలో పడు. 11-3 భా 74 old

అసవాలకుఁడు : వి. శక్తి గలవాఁడు. (ఆ.మూ.)
"అప్పఁడైన వేంకటాద్రి అసవాలకుఁడు గాన
తప్పకుండఁ బెట్టి వాని తలకెత్తరే" 4 అను. 20.

అసాదలు : వి; బహు. 'ఆసాదులు'కు రూపాం. చర్మకారులు.
"పయ్యెద జారఁగ నిల్చె భ్రమియించ నేమంటివి
అయ్యె అసాలు వెట్టే నందు కేమంటివి" -12 old

అసిపత్రము : వి. నరకభేదము, వృక్షాలను నరికినవాడు అసిపత్రనరకానికి వెళతాడట.
"సరి నసిపత్రములు నాఁటు సమయదెంతైనా
జిగిరింపు చుండు" 15-410

అసిమ : వి; మాం. గుడ్డతో కుట్టిన పొడుగాటి సంచి, నడుమ తెరవటానికి వీలుగా ఉంటుంది. అటు, ఇటు సరకులు వేసుకొని భుజంమీద వేసుకొని వెళ్ళడానికి వీలుగా ఉంటుంది. అశ్వసంచి అని వ్యవహారం. సంచి. రూపాం. అసిమి.
"అమ్మెడి దొకటి, అసిమలో దొకటి
బిమ్మిటి నిందేటి పెద్దలమయ్యా" 1-483
"ఆడేదొకటి నీ యసిమలోని దొకటి
యాొడ నాతో నాడుమాఁట లివియైనా నిజమా" 24-90

అసిమి : వి. గుడ్డతో కుట్టిన పొడుగైన సంచి. నడుమ తెరువడానికి వీలుంటుంది. రెండువైపులా వస్తువులు వేసి బుజం మీద వేసుకొని పోవడానికి వీలుగా ఉంటుంది.
"అమ్మెడి దొకటి అసిమిలోని దొకటి " 1-483
నుడికడలిలో అసెము అనే రూపం చూపబడింది. మూడు నాలుగు అరలు గల గుడ్డసంచి అనే అర్థం చూపబడింది. కనుక అసెము అనే రూపాం. కూడ వ్యవహారంలో ఉండి ఉంటుంది.

అసురలు : వి; బహు. రాక్షసులు. 'అసురులు' అనే ప్రయోగం కూడా ఉంది. 24-135
"పురుషోత్తముని పూజ పొంతఁబోరు అసురలు
సరవి విష్ణుని జపించనివారు నసురలే" 3-5

అసురుసురగు : (21) ప.బం; అ.క్రి. అలసిపోవు, బడలు, మిక్కిలి శ్రమపడు, చిరాకుపడు - ధ్వన్యనుకరణం.
"విసుగక జీవుఁడు వీరిఁడిమాయల
అసురుసురయి తా నలసీఁగాక" 1-495

అసురుసురను : (5) ప.బం; అ.క్రి. బడలు, శ్రమనొందు. (అనుకరణశబ్దం)
"అదె పొడిఁబడి పతి యసురుసురనఁగా
పదరి నేఁబిలుచుట పాటి యౌనా" 11-156

అసురుసురులు : ప.బం; వి; బహు. బడలికయందు విడిచే ఉచ్ఛ్వాసనిశ్వాసల ధ్వన్యనుకరణం.
"నేమే చెప్పిన నొల్లవు నీయంతనే నీకిప్పుడు
యీ మోహపుటసురుసురులు యెక్కడివే నీకు"
19-543

అస్తమానము : వి. 'అస్తమనము' నకు వికృతి రూపం. సాయంకాలం, సూర్యాస్తమయం.
"సతి నీ మో మెత్తుటే చంద్రోదయ మౌట
అతివ నీ తలవంపు అస్తమానము " 24-163

అస్తినాస్తులు : వి; బహు. కలిమిలేములు, అస్తి, నాస్తి అనేవి సంస్కృత క్రియాపదాలు. ఇట నామవాచకంగా ప్రయోగింపబడటం విశేషం.
"మన్నన శ్రీవేంకటేశ్వరుకరుణను మా యాచార్యుఁడే అధికారి
వున్నరీతినే అస్తినాస్తుల నూరకుండుటే నా తలఁపు" 1-463

అస్సారము : వి. అసారము (సారం లేనిది) అనే పదానికి వికృతిరూపం. ఇట సకారానికి ద్విత్వప్రయోగం విలక్షణం. సారం లేనిది. ఇట 'స్సా' అనేది ప్రాస స్థానంలో ప్రయోగించడం విశేషం. ఇట్టి ప్రయోగాలు చేయడంలో అన్నమయ్య ధైర్యం దొడ్డది.
"ఇస్సీ నే నెఱఁగనా యీపాటి నేను
అస్సారాన నడిచేనా అన్నిటా నేను " 27-207
"లెస్సాయఁగా నేఁడు నీ లెక్కలేని సరసాలు
అస్సారముగా వలపు లారడిఁబెట్టేవు" 18-460

అస్సురుసురు : వి. బడలిక యందు విడిచే నిట్టూర్పు ధ్వనికి అనుకరణం; రూపాం. అసురుసురు.
"కోరి నేరా లెంచనేలే కొయ్యగాండ్లతోడ
వోరుచుకుండే టస్సురుసురే మేలు" 11-458

అహంబ్రహ్మత్వము : 'అహం బ్రహ్మాస్మి' అనే భావం.
"అక్కటా ప్రాణికిని అహంబ్రహ్మత్వమే కాని
దిక్కుదెసయైన వానిఁ దెలుసుకో నోపఁడు "
15-262

అహమాదిశ్చ మధ్యం చ : "అహమాదిశ్చ మధ్యం చ భూతానా మంత ఏవ చ" అనే భగవద్గీతా శ్లోకంలోని (10-20) భాగం. "సమస్త ప్రాణుల సృష్టి స్థితిలయాలకూ నేనే కారకుణ్ణి" అని తాత్పర్యం.
"మెండగు యీ జీవులను మీరు గారన వెఱతును
వుండెడి వీరలు నిత్యులు వొగి నహమాదిశ్చ మధ్యము గాన" 2-121

అహమించు : అ.క్రి. గర్వించు, నేనే అన్నింటిని చేయగలను అనే ధీమాతో విజృంభించు.
"సహజాచారము లెల్లా సర్వేశ్వరుని యాజ్ఞే

అహమించి నమ్మకుండు టదియే పాషండము "

1-431

అహమిక : వి. అహంకారం, అహంభావం, ఉత్కంఠ.

"చేపట్టి నీ శిరసు పూజించే అహమిక కంటే

నీ పాదాలు పూజించే నేమ మెక్కుడు" 2-483

అహివెట్టు : (అహి + పెట్టు) స.క్రి. తాకట్టుపెట్టు, కుదువబెట్టు. రూపాం. ఆహివెట్టు.

"అప్పుడే గోవిందునికి అహివెట్టితిఁ జిత్తము"

"అహివెట్టితి జొన్నగడ్డాగ్రహార

వృత్తి యేనూఱు రూకల వృత్తమునకు" (క్రీడా. 245 ప.) అని శ్రీనాథుని ప్రయోగం.

అహోబలదేవుఁడు : వి. అహోబలక్షేత్రంలో నెలకొన్న నృసింహస్వామి. 2-508

అహోబలనృసింహస్వామి : చూ: అహోబలేశుఁడు.

అహోబలము : వి. ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలోని నృసింహస్వామిక్షేత్రం. రూపాం. అవుభళం, ఓబుళం. ఈ క్షేత్రం కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో ఉంది. దీనికి అహోబిలం, ఔబళం, ఔభళం, ఓబుళం అనే పేర్లు కూడా వ్యవహారంలో ఉన్నాయి. స్వామి గుడి గోపురాలు చిన్న అహోబలంలో ఉన్నాయి. ఊరూ వాడా ఇకడే. పెద్ద అహోబల సానువుల్లోనే నవనారసింహుల మూర్తులున్నాయి. అన్నమయ్యకు తిరుమల తరువాత చాలా అభీష్టమైన క్షేత్రం ఇది.

"ఆరీతి నీ కొలువిట్టే అహోబలము మీఁదే

నారుకొనె నీఁ నేరుపు నారసింహా" 2-248

అహోబలేశుఁడు : వి. అహోబలక్షేత్రంలో నెలకొన్న నృసింహస్వామి. నవనారసింహులలో ఇట వెలసిన నరసింహుడు ప్రహ్లాదనరసింహుడు.

"దాసులపాలిటి నిధానమై వున్నాఁడదిగో

ఆసాబాసా నితఁడే అహోబలేశుఁడు" 4-488

అహోబలేశ్వరుఁడు : వి. అహోబలక్షేత్రానికి స్వామియైన నృసింహస్వామి. ఇతడు ప్రహ్లాద నరసింహస్వామి. అన్నమయ్య అహోబలం లోనే శ్రీశఠకోప యతీంద్రులవద్ద పన్నెండు సంవత్సరాలు శిష్యరికం చేసి శ్రీనృసింహ మహామంత్రసిద్ధి పొందినాడు. కనుకనే అహోబల నృసింహస్వామిపై ఎన్నో సంకీర్తనలు రచించినాడు.

"అహోబలేశ్వరుఁ డరికుల దమనుఁడు

మహామహిమలను మలసీ వాఁడె" 2-112

ఆ

ఆఁక : వి. 1.నిరోధం, అడ్డు 2.వేల, చెలియలికట్ట 3.చెరసాల 4.కట్టుబాటు, మర్యాద.

"ఆఁక శ్రీవేంకటేశ పాలంటె గుటుకన్నమాట

యేఁకట నీ జాడ లాయ నిఁక నేఁటిమాటలు"

9-272

ఆఁకటికిఁగూరఁదిన్నట్లు : నానుడి, సామెత. ఇబ్బంది పడడమని భావం.

"కూడులేక యాఁకటికిఁ గూరఁదిన్నట్లు

ఆడనీడ మోవిచిగురాకు దినేరయ్య" 1-234

ఆఁకటికి గుక్కిళ్లు ఆసయినట్టు : ఏమీ లేనప్పుడు అందుబాటులో నున్న సామాన్య వస్తువులపైనే ఆశ కలిగినట్లు. ఆకలి ఐనప్పుడు గుక్కిళ్లపై ఆశ కలిగినట్లు అని శబ్దార్థం.

"చీకటి నోటికిఁ గడిచేయే కొంట వచ్చినట్టు

ఆఁకటికి గుక్కిళ్లు ఆసయినట్టు" 2-96

ఆఁకరు : అ.క్రి. 'ఏఁకరు' ఏకారు కు రూపాం. చేసిన పనినిగాని, తప్పునుగాని పదేపదే చెప్పు.

"కన్నులనే యాఁకరేవు కౌఁగిటనే కూడేవు

సన్నల శ్రీవేంకటేశుఁ జలమునను" 12-532

ఆఁకారు : (ఆఁక + ఆరు) అ.క్రి. ఏ'కారు'కు వ్యావహారికరూపం; 1. ఉవ్విళ్లూరు, మిక్కిలి కోరిక కలిగి యుండు. 2. భయపడు, దైన్యంతో బాధపడు.

"అండనున్నవారు చూచి యాఁకారనేల"

29-294

"కప్పురము మోవి నిచ్చి కాఁకలతోఁ దమకించి

యిప్పుడె యాఁకారీని నెవ్వతెరా" 17-72

ఆఁగఁజేయు : స.క్రి. ఆపివేయు.
"ఇతవుగానివార మేల నీకు నా మేని
అతితాపమంటుఁ జేసు నటు వోవయ్యా" 4-40

ఆఁగు : స.క్రి. 1. మోచు 2. కాపాడు 3. నిషేధించు.
"ఆఁగెను ని న్నురముపై నట్టె శ్రీవేంకటేశుఁడు
వేఁగా తీఁగెకుఁగాయ వినోదమే కాక" 7-81

ఆఁటదానితనము : (ఆఁటదాని + తనము) వి. స్త్రీత్వం.
"పోనీ వూరకుండవే యేపొద్దుదాఁకఁ గెలనేవు
దానికేమి నీ యాటదానితన మించుకా" 2-498

ఆఁటది : (100) (ఆఁట + అది) వి. ఆడది, స్త్రీ, నర్తకి, వేశ్య. 'ఆఁట' శబ్దంలోని అరసున్న విచార్యం. ఈ పదానికి విరళ ప్రయోగమని తె.వ్యు,కో. లో చెప్పబడినా అన్నమయ్య కీ పదం ఎంతో ఇష్టమని చెప్పవచ్చు. అన్నమయ్య కీర్తనల్లో ఈ పదం సుమారు వంద పర్యాయాలు ప్రయుక్తమైంది.
"ఆఁటది యింతకోపునా అంటిమోసువంటిది
మాఁటలనే లాలించి మరపుకోవయ్యా" 28-38

ఆఁడిముత్యము : వి; ప.బం. గుండ్రని ముత్యం, జాతిముత్యం. రూపాం. ఆణిముత్యము.
"కడఁజూడ జలధికి కల్లలు బుల్లలునే
నడుమ నాఁడిముత్యాలు నవరత్నాలే" 26-87

ఆఁడుఁగులము : వి. ఆడుజాతి, స్త్రీజాతి.
"తెల్లని వెల్లాఁ బాలే తెలిసితి వవులే
గొల్లదొమటాయ నాఁడుఁగుల మెల్లాను"
19-517

ఆఁడుఁగొల : (ఆఁడు + కొల) వి. స్త్రీహత్యా పాపం.
"ఆలకించ నింతటను ఆఁడుఁగొల నీ కేల
కూళతనములు మాని కూడవయ్య ఆపెను"
27-255
"వువ్విళ్ల నిది వూరకుండ నేలనుచునా
అవ్విభుఁడు చలముకొనె నాఁడుగొల యేల"
11-242
"ఆడుఁగొల వచ్చుఁజుమ్మీ ఆచారా లింతైతే
నేఁడు గామించితిఁజుమ్మీ నిన్ను రఘునాథ"
26-37

ఆఁడుఁదగవు : వి. స్త్రీల తగవు.
"ఎఱఁగవా ఆఁడుఁదగ వింతిరో నీవు
తఱవాతిపనులకుఁ దమకించదే" 13-150

ఆఁడుఁబోడి : వి. (?) ఆడుఁబోడిమి లో 'మి' లోపించి యేర్పడిన రూపం కావచ్చు. ఆడువారి పద్ధతి, ఆఁడుదనము అని అర్థముగా తోచుచున్నదని సం.ప.స. (19సం.)
"కన్నదే కంటి గురుమ కంటివి నీ వవు లేరా
అన్నిటా నీ కాఁడుఁబోడి అగ్గువాయను"
19-517
"మఱి యాఁడుఁబోడెడ్డెడు మగపోడిమా నేడు"
22-456

ఆఁడుబారీ : (?)
"కోనేటిరాయఁడు కోరి నిద్రించీ వాడే
ఆనకమై జాలీయరో ఆఁడుబారీ" 15-118
ఈ కీర్తనలో అన్నిపాదాలు చివర 'పారి' అనే పదం ప్రయుక్తం.

ఆఁడులు : వి; బహు. స్త్రీలు, విశేషణమైన 'ఆఁడు' శబ్దాన్ని విశేష్యంగా ప్రయోగించడం విలక్షణం.
"వాఁడె వాఁడె వీఁడె వీఁడె వాడలలో మెరసీని
ఆఁడుల నడుమ నెంత అలరీని చూడరే"
13-107

ఆఁడువారు : (3) వి; బహు. స్త్రీలు.
"ఆఁడువారమైతే అంత సిగ్గు విడిచేమా
వేఁడుక పానుపుపైకి పిలిచేవు నీవు" 7-428

ఆండ్లు : (9) వి. 'ఆలు' శబ్దానికి బహువచన రూపం. స్త్రీలు, భార్యలు. 'ఆండ్రు' గ్రాంథికరూపం.
"వేసరక సేసేవు వినయా లెవ్వరికైనా
ఆసోదకాఁడవు నీకు నాండ్లుఁబాతా" 13-18
"అప్పనమై యిద్దరము నాండ్ల మింతే నీకు

ముప్పిరి దేవరవలె మొక్కించుకోరాదా"

10-2-78

-ఆండ్లు : పేదాది శబ్దాలపై చేరే 'ఆలు' శబ్దానికి బహువచనరూపం. 'ఆంఁడ్రు' అనే గ్రాంథిక రూపానికి ఇది వ్యావహారికరూపం. అన్నమయ్య అంతటా -ఆండ్లు అనే వ్యావహారికరూపాన్నే కాని ఆంఁడ్రు అనే గ్రాంథిక రూపాన్ని వాడలేదు. ఉదా :- ప్రియురాండ్లు మొ॥

25-374, 6-76

ఆందోళము : వి. పరితాపం, ఉత్కంఠ.

"ఆతుమలో హరిమీది అందోళమే వలె

చేతికి లోఁగాకుంటేను చింతించవలె" 3-228

ఆకడ : అవ్య. అక్కడ, ఆచోట.

"యేకతాన నీవొక్కఁడ వింటిలోఁ బవ్వళించితే

ఆకడ కెవ్వతో రాఁగా నలమితివి" 14-592

ఆకతాలు : *వి; బహు.* కతములు, కారణాలు .

"వట్టి యాకతాలు చెప్పి వద్దికి దగ్గరే విదె

అట్టె వుండరాదా అన్ని నయ్యీఁగాని" 11-242

ఆకరిషించు : స.క్రి. 'ఆకర్షించు' అనే దానికి వికృత రూపం. రేఫ షకారాలకు నడుమ ఇకారం ఆగమం గా వచ్చింది, ఆకర్షణచేయు. చూ : ఆకరుషించు.

"చిత్తజ భూతము బంపి చెలుల నాకరిషించి

తత్తరించి కూడేటి భూతనాథుడవు" 26-362

ఆకరుషించు : స.క్రి. 'ఆకర్షించు' కు వికృత రూపం. రేఫ షకారాలకు నడుమ ఉకారం ఆగమం; ఆకర్షణచేయు. చూ : ఆకరిషించు.

"ఆకరుషించ దలంతును అప్సరోగణములను

కైకొని దేవతాసమితినిఁ గనుఁగొనఁదలఁతును"

15-387

ఆకసపుఁజంద్రునికి నాసపడు : *ప.బం; అ.క్రి.* అసాధ్యమైనదానికి ఆశపడు .

"ఆకసపుఁజంద్రునికి నాసపడఁగా నేమి ?

వాకై రాని పతికి వలవఁగా నేమి ?" 9-66

ఆకసపుఁగొలనిపై అంటుఁదామరలు : ఇదొక పొడుపుకథ; ఆకాశం అంటే శూన్యం - అంటే నడుము; నడుమనే కొలని పైభాగంలో ఉన్న అంటుకొన్న తామరలు - స్తనాలు అని అర్థం. లావైన స్తనాలు అంటుకొని ఉన్న తామరమొగ్గల్లాగా ఉన్నాయని భావం.

"ఆకసపుఁగొలనిపై అంటుఁదామరలు వుట్టె

యీ కత చెప్పఁగదవే యింతిరో నీవు" 23-350

ఆకాశగంగ : వి. తిరుమలలో గల పవిత్ర తీర్థాలలో ఒకటి. ఇది శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 4కి.మీ. దూరంలో ఉంది. ఆకాశగంగ జలాన్నే స్వామితీర్థంగా ఉపయోగిస్తారు.

"కామితఫలదాయిని ఆకాశగంగయుఁగల

మా కొండా" 15అను. 460

"ఆకాశగంగ తోయములు సోఁకిన భవము

లంతంత వీఁడి పారఁగను" 1-227

ఆకాశపంచాంగము : *ప.బం;* వి. ఆధారంలేని వట్టి ఊకదంపుడు, అర్థంలేని వ్యవహారం.

"ఆకాశపంచాంగము అందుకుఁబేరేదే

రాకపోక జగడము రాఁజీ నదే" 19-421

ఆకాశపాకాశము : వి. అల్లకల్లోలము .

"ఆకాశపాకాశ మరుదైన కూటంబు

లోకరంజకము తమలోని సమ్మతము" 1-328

ఆకాసము : వి. 'ఆకాశము'నకు వికృతిరూపం.

"రాకాసునెల్లాఁగొట్టి రావణుని భంగపెట్టి

ఆకాసము మోచెనదే హనుమంతుఁడు" 3-143

ఆకు(లు)వ్రాయు : ప.బం. ఉత్తరం వ్రాయు, లేఖ వ్రాయు.

"ఆకులు వ్రాశంపఁగాను అనుమానింతువో యంటా

చేకొని నేనే విన్నవించితి నింతాను" 14-407

ఆకుగొరుకులు : *వి; బహు.* తమలపాకుల కొరుకుటలు. (?)

"ఆకుగొరుకులగు యంగజుమర్మము

యీ కడఁజెలి కెర వేలాయా" 16-370

ఆకుమడుచు : ప.బం; అ.క్రి. తమలపాకు ఈనెలు తీసి సున్నం రాసి వక్కలు చేర్చి మడుచు.
"ఆకుమడచి చేతికంది నీ విచ్చితివట
నీకేల సిగ్గుపడ నిజమావోయీ" 22-298

ఆకె : (107) (ఆ + అక) వి. ఆమె; 'ఆకె' అనే పదంలో చివర 'ఎ' కారం ఆదేశంగా వచ్చిందని గ్రహించాలి. 'ఆమె' అనే అర్థంలో అన్నమయ్య ఆకె, ఆపె అనే పదాలనే అంతటా వాడినాడు. 'ఆమె' అనే పదాన్ని వాడలేదు.

ఆగడపుఁదలపోఁతలు : వి; బహు. అల్లరి ఊహలు, కొంటె ఊహలు.
"వేగి లేచి సేసేదెల్లా వెలఁదులతోడి పొందే
ఆగడపుఁదలపోఁత లాఁప నెట్టు వచ్చును"
18-386

ఆగడీఁడు : (7) (ఆగడము + ఈఁడు) విణ. ఆగడము చేసేవాడు, కొంటెవాడు, దుండగీఁడు, దుష్టుఁడు.
"ఆగడీఁడవని నే నిన్నప్పుడు దూరినందుకు
వేగిరపడేవు నీవు వింతవాఁడవా" 16-204

ఆచమనియ్యము : వి. 'ఆచమనీయం' శబ్దానికి వికృత రూపం. ఆచమింపదగింది, ఉపస్పర్శింపదగింది.
"జలధులన్నియును నాచమనియ్యము మీకు
అల యా వరుణజల మిదియే స్నానము"
2-272

ఆచార్యపురుషుఁడు : వి. ఆధ్యాత్మిక జీవనం గడుపుతూ సమాజానికి మాన్యుడైనవాడు.
"ఆచార్యపురుషులు అవ్వలఁగొందరు
యేచిన సమయులై ఏర్పడిరి" 1-499

ఆజ్ఞ : వి. ఉత్తరువు.
"పోరుచుఁ జెఱకువింటి పూవుటమ్ము
లంటఁజొచ్చె
ఆరయ తుమ్మిదలకు ఆజ్ఞ లేదు" 26-534

ఆట : వి. రూపకం, నాటకం.
"అన్ని కర్మములు చేసి ఆటలో
బ్రాహ్మణుఁడనైతి
నన్ని వేదములనేటి యంగడివీధి" 6-6

ఆటకము : వి. (?)
"ఆతఁడు వాసులెక్కించి ఆటకానకుఁబెట్టితే
యేతులకుఁ గాఁతాళించి యేల చూచేవే"
19-186

ఆటపాటలు : (3) ప.బం; బహు. ఆటలుపాటలు, ఉల్లాసకరమగు క్రీడలు.
"అక్కజపు సతులచే నాటపాటలు వినీని
చుక్కలూరి చెన్నునిఁ జూడరమ్మ చెలులు"
29-2

ఆటలో పతిమ : ప.బం; వి. నిమిత్తమాత్రం.
"ఎవ్వరివాఁడో యెఱఁగరాదు
అవ్వలివ్వలి జీవుఁ డాటలో పతిమే" 1-472

ఆటలో బ్రాహ్మణుఁడు : ప.బం; వి. విదూషకుడు; నాటకంలోని బ్రాహ్మణుడు అని వాచ్యార్థం.
"అన్నికర్మములుఁజేసి ఆటలో
బ్రాహ్మణుఁడనైతి
నన్నివేదము లనేటి యంగడివీధి" 2-6

ఆటవాఁడు : (ఆట + వాఁడు) వి. నటుడు, నర్తకుఁడు, ఆటగాడు.
"పాటి నా కర్మమే క్రియాభాషాంగము
ఆటవాఁడ నింతె నేను అవధారు దేవ" 2-150
'ఆఁటది' మొదలైన శబ్దాల్లో 'ఆఁట' శబ్దాన్ని అర సున్నతో ప్రయోగించగా ఇట అరసున్న లేకుండా ప్రయోగించడం విశేషం.

ఆడ : (7) అవ్య. 'అక్కడ'కు వ్యావహారికరూపం. ఈ పదం రా.సీ.లోనూ, తెలంగాణలోనూ ఎక్కువగా వాడుకలో ఉంది.

ఆడనీడ : (6) (ఆడ + ఈడ) అవ్య. అక్కడ ఇక్కడ.
"పేరంటాండ్లకు మీరు పేరు లిద్దరుఁ జెప్పఁగా
నారసి నవ్వేరు సతు లాడ నీడను" 13-101

ఆడనుంటి : అక్కడనుండి.

"పొదిగిన మా యిద్దరికిఁ బొత్తుల నీ వాడనుంటే
యిదివో వలపు చల్లే వెరఁగనా నేను" 14-437

ఆడసుద్దులు : *వి; బహు.* స్త్రీల మాటలు.
"వేవేలు విష్ణుకథలు వినియేటి చెవులను
ఆవటించి యాడసుద్దు లాలకించేదా" 2-115

ఆడానీడా : అవ్య. అక్కడా ఇక్కడా.
"కూడి శ్రీవేంకటేశుఁడు గురుతులేల నించీనే
ఆడానీడాఁ దెలుసుక అన్నిటా నమ్మితిని" 23-238

ఆడిక : *వి.* 1. నింద, అపవాదం 2. బాస, ప్రతిజ్ఞ.
"కూడిన శ్రీవేంకటేశు గోర నేను గోరితేను
ఆడికల నీ వేల అడ్డమాడేవే" 8-87
"వలపు సిగ్గెఱుఁగదు వడి నేమి సేయవచ్చు
అలసి యాడికలకుఁ గలఁగదు మనసు" 26-401
"ఆడికకుఁ బాలైతి నందరిముందూ నేను
యీడ నన్ను మన్నించి యీడేరించు మనవే" 29-428

ఆడికాడు : (ఆడి + కాఁడు) *వి.* 1. గుట్టు తెలిసినవాఁడు, మర్మజ్ఞుడు 2. ఆప్తమిత్రుడు, గాఢమైన పరిశీలనదృష్టి కలవాడు. రూపాం. ఆణికుఁడు.
"చెంగట నీపె జూపి చేసన్నలు సేసేవు
అంగడి ఆడికాఁడవు అదెఱఁగవా" 27-467

ఆడికె : (11) *వి.* 'ఆడిక'కు వికృతిరూపం. 1. బాస, ప్రతిజ్ఞ 2. నింద, అపవాదం
"కోడెవయసువాఁడు మంచి గోపసతుల మనము లెల్ల
ఆడికెలకు నోపి కొల్లలాడి బ్రదికె నితఁడు" 1-324
"అపకీర్తులఁబడి ఆడికె లోనై
అపవాది యౌట అది రోఁత" 1-26

ఆడినదే మాట : *ప.బం; వి.* అన్నదే మాట, అడ్డుపెట్టేవారు ఎవరూ లేరనడం.
"ఆడినదే మాటా అదె శ్రీవేంకటపతి
కూడే నేననఁగాను గొణఁగేవు" 19-322
"ఆడినదే మాటా ఆతఁడే యెరుఁగును
యేడలేని బుద్ధులు మీరేమి చెప్పేరే" 19-393
"ఆడినదే మాట గాక అప్పటి వేరొకటా
వోడక తానేడ నైనా నుండుఁగాక" 17-264

ఆడినదే యాట : *ప.బం; వి.* అడ్డుపెట్టేవారు ఎవరూ లేరనడం.
"లలి మోవి పిప్పిసేసీ లావణ్య మెఱఁగడు
అలరి తా నాడినదే ఆట యనవే" 26-249
"ఆడినదేయాటా ఆకెఁజక్కఁ జూడరాదా
వీడుదోడు వయసులు వేడుకోవెట్టో" 7-328

ఆడినవే వేదాలు : *ప.బం; వి; బహు.* చెప్పిందే ప్రమాణం.
"చెలులచే యింకా బుద్ధి చెప్పించవలెనా
వెలయ నీ వాడినవే వేదాలు గావా" 23-189

ఆడుకోలు : *వి.* 'ఆడికోలు'కు రూపాం. దూఱు, నింద, ఒప్పందం.
"యీడుకుఁగా మాతోను యింత సేయఁ బని లేదు
ఆడుకోలు గలిగితే నన రాదా" 9-193
"వేడుక శ్రీవేంకటేశ వెలయ నన్నుఁగూడితి
ఆడుకోలిదే సుమ్మీ ఆనతిత్తుఁగాక" 20-81
"పాడితో శ్రీవేంకటేశ పైకొంటివి మెత్తుఁగాక
ఆడుకోలు పంతాలకు నలసేనా ఇఁకను" 20-454

ఆడుతాఁబాడుతా : *ప.బం; అవ్య.* ఆడుతూపాడుతూ, అవలీలగా, హాయిగా, అనాయాసంగా. 'ఆడుతూ' పాడుతూ అనే పదాల్లోని శత్రర్థక 'తూ' వర్ణాన్ని అన్నమయ్య ఆడుతా, పాడుతా అని 'తా' వర్ణంతో వాడడం కనిపిస్తుంది.
"ఆడుతాఁబాడుతా నీతో నట్టె ముద్దు గునుసుతా
వోడక నీ దండచేరి వున్నారమయ్యా" 3-390

ఆడుమాట : *వి.* స్త్రీయొక్క పలుకు.
"ఆడుమాటనక అంతలో ద్రౌపదిని
వాఁడిమిఁ గాచిన వరదుఁడు" 1-394

ఆడేటి దొకటి అసిమలోని దొకటి : *ప.బం; వి.* చెప్పేదొకటి చేసేదొకటి.

"ఆడేటి దొకటి నీ యసిమలోని దొకటి
యీడ నాతో నాడు మాఁట లివియైనా నిజమా"
24-90

ఆడేటివి గొణఁగులు అమ్మేవి సణగులు : నానుడి; చెప్పేదొకటి చేసేదొకటి.

"ఆడేటివి గొణఁగులు అమ్మేవి సణగులు
యీడనే మా పొందు నీకు నితవయ్యీనా"
14-204

ఆడోవారు : వి; బహు. 'ఆడవారు'కు వ్యావహారికరూపం. స్త్రీలు.

"కావరించి యాడోవారి కాఁగిట నలసివచ్చి
వోవరిలో నా చొప్పులే వూహించేవు గాక"
18-453

ఆణా(నా)జ్ఞ : (ఆణ + ఆజ్ఞ) ప.బం; వి. హద్దు, ఆజ్ఞ అనే పదాలు ఏకార్థకాలైనా కలిపి వాడడం నేటికీ వ్యవహారంలో ప్రసిద్ధమే అని పరిష్కర్తలు. (II – 72 పాదపీఠిక) ఆన అనే పదంలోని 'న' కారం ణకారంగా ప్రయోగింపబడటం విశేషం. రూపాం. ఆనాజ్ఞ.

"రాజు సేసిన యాణాజ్ఞ రాజుకంటె నెక్కుడా
వోజతో వజ్రాయుధాన కోపునా పర్వతాలు"
2-72

"ఏపను లెవ్వరికి గలదెంత యంతే కాని
శ్రీపతి యాణా(నా)జ్ఞచేతఁ జిక్కునది జగము
యేపున మా యాణాజ్ఞ లేఁటివయ్యా" 4-19

"శ్రీపతి యాణాజ్ఞలు మీఱఁగ చింతింపఁగఁ దరమా" 4-102

"జాణఁడు తనకు నాకు సరికి బేసికి లంకె
ఆణాజ్ఞకు లోను అట్టే సేయుమనవే" 22-24

అన్నమయ్య 'ఆణాజ్ఞ' అనే పదంతో పాటు 'ఆనాజ్ఞ' అనే పదం కూడా వాడినాడు.

ఆణికాఁడు : (ఆణి + కాఁడు) వి. దీనికి శ.ర.లోనూ, బ్రౌన్.లోనూ, వాచ.లోనూ మర్మజ్ఞుడనే అర్థం ఉన్నది. తె.వ్యు.కో లో దీనితోపాటు ఆప్తమిత్రుడనీ, గాఢమైన పరిశీలనదృష్టి గలవాడనీ అర్థాలు కూడా ఉన్నాయి. ఆనందమూర్తిగారు దీనికి మేలువాడు, ఘనుడు అనే అర్థాలను చూపినారు. దీనికి ప్రమాణంగా కిట్టెల్ నిఘంటువును ఉదాహరించినారు. (ఆణి = Excellency, superiority) పై అర్థాలన్నీ ప్రయోగాల్లో యుక్తంగానే కనిపిస్తున్నాయి. 1.మాననీయుడు, ఆప్తమిత్రుడు 2.మర్మజ్ఞుడు, గాఢమైన పరిశీలనా దృష్టి కలవాడు. రూపాం. ఆడికాఁడు.

"ఔనయ్యా మేలెరిగిన ఆణికాఁడవు
తానకమైన నీ దొరతనమెల్లాఁగంటిమి" 10-298

"కందువ కాఁగిట నేల ఘాతలెల్లాఁ జూపేవే
అందుకు శ్రీవేంకటేశుఁడాణికాఁడు" 21-46

"ఆణికాఁడవట యంతటికి
జాణవు తెలియము సరిగొనవయ్యా" 24-49

ఆణిముత్యము : వి. ప్రశస్తమైన ముత్యం, గుండ్రని ముత్యం. చిలుకూరి నారాయణరావుగారీ పదంలోని 'ఆణి' శబ్దానికి గుండ్రన అనే అర్థం తప్పనీ, మేలైన, మాననీయమైన అని అర్థమనీ తెలిపినారు. (ఆం.భా.చ. 483 పు.) చూ: ఆడిముత్యము.

"జాణతనాలాడఁగాను సరసుఁడందుకు మెచ్చి
ఆణిముత్యముల కంఠహార మిచ్చెను" 23-462

ఆతల : (9) (ఆవలి + తలము) అవ్య. అవతలి ప్రదేశము, ఆవలికాలం.

"ఆతల నబక ముంచినట్టి వేఁడి చెయ్యంటదు
జాతిదేహము మోఁచిన సహజమింతే" 2-288

ఆతల యీతల : అవతల – ఇవతల, అవతలి ప్రదేశం - ఇవతలి ప్రదేశం, ఆవలి కాలం – ఈవలి కాలం.

"చేతికి వీడెమియ్యఁగ చెలియను చాలు నీకు
నాతల యీతలను ఆయాలు మోచెను" 7-32

ఆతుమ : వి. ఆత్మ; అన్నమయ్య 'ఆత్మ' అనడానికి బదులుగా అంతటా 'ఆతుమ' అనే రూపాన్నే ప్రయోగించినాడు. సమాసాల్లో కూడా ఆతుమ అనే ప్రయోగం కనిపిస్తుంది. ఉదా :- పరమాతుమ, ఆతుమ బంధువు, ఆతుమ వేదాలు. అన్నమయ్య కీర్తనల్లో

ఒక్కచోట మాత్రమే 'ఆత్మ' అనే ప్రయోగం కనిపిస్తుంది. చూ : 8.181

"ఘనపాపిఁగనక నీ కరుణఁగోరి నీ వనవరతము
నా యాతుమ విహరించుమంటిఁగాక" 1-35

కళాపూర్ణోదయంలో కూడా 'ఆతుమ' అనే ప్రయోగం కనిపిస్తుంది. 6-161

ఆతుమవేదాలు : *వి; బహు.* ఆత్మను వివరించే వేదాలు.

"గాతల కౌరవుఁదిట్టి కందువ సాందీపునితో
ఆతుమవేదాలు నేర్చి తా నోరనే" 16-178

ఆతుమార : (5) (ఆతుమ + ఆర) ఆత్మసాక్షిగా; ఆత్మతృప్తిగా, మనసారవంటి పదం.

"ఆతుమార రమణుని అలుకెల్లఁ దీరిచితివి
రాతిరిఁబగలు నట్టె రాజ్య మేలనమ్మా" 23-321

"చేకొని యాతుమార సేవలెల్లాఁ జేసితివి" 23-73

ఆతురపడు : *అ.క్రి.* బాధపడు.

"కాతరినై నే నిన్ను కరకరిఁ బెట్టినాను
ఆతురపడవు యెంత అభ్యాసమో" 27-471

ఆతురబందుగుఁడు : వి. రోగార్తులకు బంధువు.

"ఆతురబందుగుఁడవు హరినారాయణ కృష్ణ!
మా తలఁపెఱిఁగి నీవే మన్నించితి విపుడు"
2-277

ఆత్మ : వి. జీవాత్మ, పరమాత్మ, మనస్సు, బుద్ధి.

"యింతి కాఁగిలించుకొన్న యితవు
దెలుసుకొంటే
అంతటి వేడుక నీయాత్మ నున్నది" 8-181

ఆత్మాపుత్రనామము : వి. తానే పుత్రునిరూపంలో జన్మించడం.

"ఆత్మా వై పుత్రనామాసి" అని వేదవాక్యం. 4సం.

ఆత్ముఁడు : వి. ఆత్మస్వరూపుడు. ఈ అర్థంలో మహదర్థకంగా ఇది విలక్షణప్రయోగం.

"అనుభవించువాఁడాత్ముఁడే యందురు
అణురూపం బని తలఁచఁగరాదు" 15-403

ఆదరింపు : (ఆదరించు + పు) వి. ఆదరించడం, ఆదరణ, గౌరవం.

"పోదిమాటలు మిగుల భోగంబులకుఁ దగులు
ఆదరింపులు సతము లగుటకునుఁ దగులు"
27-585

"దయతోడి యాదరింపు తగులాయములు
సేసు
నియతాన మెలఁగేటి నేరుపు లివి" 28-288

ఆదిగొను : (54) ప.బం. పొంచు, (పర్యాయ) మొదలిడు, ఎదుర్కొను, నడుపు, మీఁదపడు, ఎదురుపోవు, ఎదుర్కొను (వ్యు.), కన్నువేయు, ఆసక్తి చెందు, (శ.ర.) మొఱగు, లాచు, లాచుకొను. (పర్యా.కో) 'ఆదికొను' అని శ.ర.

"పాదుకొన్న సంసారబంధము నోరూరించితే
ఆదిగొని మత్తుఁడు గానట్టివాఁడే నిత్యుఁడు"
2-117

"ఆదిగొని చెలులెల్ల నట్టె పైపైఁ బడఁగాను
గాదిలి యాతని మది కాయగాచె నిపుడు"
21-398

"గుఱుతుచూచు నే రాగా ఆదిగొని నఱచేతి
వెన్నముద్ద
పాదుకొన నోర నిండాఁజాపుకొన్నాడు" 20-450

"పాదుకొన్న సంసారబంధము నోరూరించితే
ఆదిగొని మత్తుఁడు గానట్టివాఁడే నిత్యుఁడు"
2-117

"ఆదిగొని వెదకితే నట్టె నాలిక కొన
వేదమై నిలిచినాఁడు వీఁడివో హరి" 3-57

"శ్రీదేవు హరి నాశ్రితపారిజాతుని
ఆదిగొని శరణంటి మన్యము నే మొల్లము"
10-87

ఆసక్తిచెందు అనే అర్థం ఇట యుక్తం.

ఆదిచదువులు : *వి; బహు.* తొలిచదువులు, వేదాలు.

"అనుఁగువారికి నాది చదువుల
పనిగొన్న మంత్రసారము" 4-419

ఆదినంత్యములు : (ఆది + అంత్యములు) వి. మొదలు తుది.
"ఆదినంత్యము లేని అచ్యుతమూరితివి" 2-122

ఆదిమతము : వి. విశిష్టాద్వైతమతం.
"ఆదిమతమునఁగాని తగులవు నీ వంటే
యే దెస ఘంటాకర్ణుఁ డే మతమువాఁడు" 15-3

ఆదిమూరితి : (7) వి. తొలిమూర్తి, ఆదిదైవం.
"అంతటాఁదా నున్నవాఁడు అరయ
స్వతంత్రుఁడు
అంతము నాదియు లేని ఆదిమూరితి" 2-509

ఆదోపాదో : ప.బం. పాదసూచికలో సంపాదకులు ఇట "ఆటో పాటో అని రేకు" అని అన్నారు.
"అసమగతి వాని రాక (ఆటో పాటో) ఆదో పాదో
రసికు వేంకటేశు పొందు రాజ్యమో లక్ష్మో"
5-193

ఆధరువుబొమ్మ : వి. ఆధారం గల బొమ్మ, ఆశ్రయం గల బొమ్మ.
"నెలవై నీలోనివాఁడ నీవే నేనౌదునా
పొలసి నియ్యాధరువు బొమ్మ నింతేకాక"
2-139

ఆధీనపుది : (అధీనము + అది) వి. ఇతరుల అధీనంలో ఉన్నది, అస్వతంత్రురాలు, పరతంత్రురాలు.
"నీ యాధీనపుదానను నిన్ను వెంగెమాడనోప
రాయడించ కెటువలె రక్షించినా మంచిదే"
13-498

ఆధీనము : (14) విశ. 'అధీనము' నకు వికృతిరూపం. వశం; పెక్కుచోట్ల ఆధీనమనే పదమే ప్రయోగింపబడింది. ఒక్కచోట మాత్రమే అధీన, మని వాడబడింది. 4-450
"కర్మము నాదెందుఁగాని కర్మములో ఫలమెల్ల
అర్మిలి నా జన్మముల ఆధీనమే" 2-1

ఆనందించుకొను : అ.క్రి. సంతోషాన్నిపొందు. రా.సీ. వ్యవహారంలో కొన్ని ధాతువులపై విలక్షణంగా 'కొను' అను ప్రయుక్తం కావడం విశేషం. ఉండుకొను మొ॥
"అలరి నీవు గూడితే నానందించుకొనుఁగాక
అలమేలుమంగ నీ చొప్పులు చూచునా"
12-122

ఆనక : అవ్య. తరువాత; చూ : ఆనుక.
"ఆనక పోరాదుగాని అండనుండువారము
నిను నీ వెరఁగలేవు నీ కేడ వలపు" 7-227

ఆనకము : (4) వి. జీవింపజేసేది, ఉత్సాహపెట్టేది. (శ.దీ.)
"ఆనకమై వైరాగ్యమంట దలవాటు లేక
కానఁబడ కర్మములు గాసిఁబెట్టరాదు" 4-257
"నూనెగొలచే కుంచము నునుపెక్కు మీద మీద
ఆనకమై దిగువారీ నాయనాయ నయ్యా"
7-108

ఆనతి : వి. పద్ధతి, లోకువ, తడబాటు మొ॥ కావచ్చు. (ఆజ్ఞ, అనుమతి)
"పలికే ఆనతి చెప్పీ బలునిందలు"

ఆనవాలు : (ఆన + పాలు) వి; బహు. బాగుగా మరగ కాచిన పాలు.
"తేనెలు జున్నులు టెంకాయపాలు
ఆనవాలు వెన్నట్లును" 6-4

ఆనవెట్టు : (ఆన + పెట్టు) స.క్రి. ఆజ్ఞాపించు.
"ఆనవెట్టి మమ్ము మాటలాడించేవే నన్ను
గుణము దెలిసెనంటా గట్టున నున్నాఁడతఁడు"
7-535

ఆనాజ్ఞ : (7) (ఆన + ఆజ్ఞ) వి; ప.బం. ఆజ్ఞ - హద్దు అనే అర్థాల్లో వాడబడే జంటపదం. రూపాం. ఆణాజ్ఞ.
"తలవరులు ముగురు తగు వాదులేఁబైయారు
వొలసి ఆనాజ్ఞ కిందుఁజోటే లేదయ్యా" 3-464
అనాజ్ఞలు అని బహువచనంలో కూడా ప్రయోగింపబడింది.
"పంచేంద్రియములకే పైరులు వేసితిమి
అంచెలఁ బ్రాణులకిఁక నానాజ్ఞ లేలయ్యా"
3-487

ఆనాజ్ఞలు : (ఆన + ఆజ్ఞలు) వి. ఆజ్ఞ అనే అర్థంలో వాడబడే జంటపదం.

"యాహాల నా యాసలును యేమి సేయు నన్నిటికి
శ్రీహరి యానాజ్ఞ లిటు చిమ్మిరేఁచఁగాను" 4-53

అణాజ్ఞలు అనే పదం కూడా అన్నమయ్యలో కనిపిస్తుంది.

ఆనిపట్టు : (4) అ.క్రి. ఊని పట్టు.

"ఆనిపట్టి తనతో నలిగి వుందానవా
మోనానఁ దన కిప్పుడు మొక్కనా నేను"
9-125, 9-17, 19-409, 21-518 & 17-188

ఆనుక : (66) అవ్య. అటుపిమ్మట, తరువాత; రూపాం. ఆనక.

"జానకీరమణ సప్తజలధులు లంఘించి
ఆనుక సంజీవి దెచ్చె హనుమంతుడు" 4-490

"కానుక పైఁడి గాదెలకాడఁదన నిజరూపు
ఆనుక పొడచూపీని అఖిలేశుఁడు" 3-511

ఆపతి : వి. ఆపద; 'ఆపత్తి'కి వ్యావహారికరూపం. రా.సీ.లోనూ, తెలంగాణంలోనూ మాండలికంగా వ్యవహారంలో ఉంది.

"ఉప్పతిల్లు మానము వొడిఁబట్టుకుండఁగాను
అప్పుడే కన్నెరికాన కాపతి రాదా" 25-268

ఆపదోద్ధారుఁడు : వి. 'ఆపదుద్దారకుడు'కు వ్యావహారిక ప్రయోగం. ఆపదలనుండి ఉద్ధరించేవాడు.

"అరయఁ బ్రహ్లాదుని ఆపదోద్ధారసింహము
గిరివై యిందిరకును క్రీడాసింహము" 3-151

ఆపసోపము : (6) వి; ప.బం. ఇబ్బంది, (తె.జా.) అలుక, జ్వరాదులవల్ల కలిగే అలసట, అసురుసురు.

"ఆకకే మోహించుఁగాక ఆపసోపపుఁదాపాన
చీకాకుపడి నాలోఁ జిన్నఁబోరాదా" 19-439

"చేపట్టినదానవు సిగ్గులు పడుదురా
ఆపసోపాలఁబెట్టకు అందపు నీ వలపు" 23-340

ఆపె : (ఆ+అప) వి. 'అప' శబ్దంలోని పకారంలోని అకారానికి ఎకారం రాగా 'ఆపె' అనే రూపం ఏర్పడుతుంది. ఆమె అని అర్థం. అన్నమయ్య సంకీర్తనల్లో 'ఆమె' అనే అర్థంలో అంతటా ఆకె, ఆపె రూపాలే కాని ఆమె అనే రూపం కనిపించదు.

ఆపొద్దు : వి. (రా.సీ; మాం.) ఆ రోజు, ఆ దినం.

"ఆ పొద్దున నుండనీవు అట్టె కాచుకుండగాను
యేపున నీ వున్న మంచమెక్కితి నేను" 20-420

ఆపోనారాయణుఁడు : వి. నారములంటే నీరు. నారములే స్థానంగా కలవాడు నారాయణుడు. నారాయణ శబ్ద వ్యుత్పత్తిని చెప్పే శ్లోకంలో "ఆపో నారా ఇతి ప్రోక్తాః" అని ఉండడం వల్ల ఆపోనారాయణుడనే రూపాన్ని అన్నమయ్య కల్పించినాడు.

"అదన ఆపోనారాయణుఁడవైన నీకు
అదియ పో మంత్రకలశాభిషేకము" 4-46

ఆపోవు : (ఆదట + పోవు) అ.క్రి. తృప్తిపడు.

"ఆపోక కౌరవుఁడు హరిపరాఙ్ముఖుఁడైన
పైపైనే సంపదలు పార్థుచేఁబడవా" 4-347

ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినః : ఇది భగవద్గీత లోని శ్లోక భాగం. (8-16) "బ్రహ్మలోకం వరకూ ఉన్న అన్నిలోకాలూ కూడా తిరిగి రావడం అనేది ఉన్నదే" అని దీని అర్థం. శ్రీకృష్ణుడు దీన్ని అర్జునునితో చెపుతున్నాడు.

"ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున
మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న
విద్యతే" భ.గీ. 8-16

ఆమని : వి. వసంతఋతువు, సమృద్ధి.

"ఆమని యీఁగకు సుఖమాజన్మమై తోఁచు
యేమిటా నెక్కువ సుఖమెవ్వరి కేదయ్యా"
2-409

ఆమనికాలము : (5) వి. వసంతకాలం.

"చేముట్టి నాతో నప్పటి చేరి సరసమాడేవు
ఆమనికాలము గాఁగా నగ్గువాయ వలపు"
7-83, 7-586 & 17-522

ఆమనివేళ : వి. వసంతసమయం.

"సతి కనుఁగవలనే చకోరములు నిక్కి
ఆతని నవ్వు వెన్నెల లామనివేళ" 26-121

ఆ మరి : ఆ తరువాత.

"వంతుకెక్కిఁన వెంగెమా మరేమైనా నంటినా
కొంతగొంత నీ వేఁటికిఁ గొంకేవోకాక" 27-215

ఆముకొను : (11) అ.క్రి. 1. కైకొక్కు, బలియు, కొవ్వు 2. అలముకొను, పైకొను, వ్యాపించు 3. గాఢమగు, అధికమగు. స.క్రి. కవియు, పైకొను.
వ్యాపించు, గాఢమగు :

"బూమెలాడి యైనదే బొమ్మల జంకించుఁగాని
ఆముకొన్న నవ్వులే యతివలు చల్లేవి"
16-576, 13-410, 15-255, 14-591, 15-30, 12-292, 11-51, 13-25, 28-338, 29-209 & 22-177

"ఏమనేము నిన్ను యెగసక్కెడ విన్నిటా
ఆముకొన్న సటకాడ నౌదు వయ్యా" 27-39

"ఆముకొని మోహించితి హరి నీ రూపునకు"

"ఆముకొన్న ప్రేమవాఁడు ఆకడ జారుకొన్నాడు" అని క్షేత్రయ్య పదం.

ఆయ : (212) క్రి.ప. అగుధాతువు భూతకాలిక ప్రథమపురుషైక వచనరూపం. ఆయెను అని అర్థం. అన్నమయ్య పెక్కుచోట్ల 'ఆయె'ను అనే రూపానికి బదులుగా 'ఆయ' అనే రూపాన్ని వాడినాడు.

ఆయఁబోయ : (ఆయెను + పోయెను) *ప.బం;* క్రి.ప. అయ్యిందేదో అయ్యింది - పొయ్యిందేదో పొయ్యింది. రూపాం. ఆయెఁబోయె.

"యెఱఁగక పుట్టితివి యిన్ని యోనులందుఁ దొల్లి
తటినీఁటి కాయఁబోయ దానికేమి" 9-331

ఆయకట్టు : అ.క్రి. ఆదాయం వచ్చేట్లు సాగుచేయు. (పండించు)

"తచ్చన తరితీపుల తగవరివాఁడవు
పచ్చ లాయకట్టే లాబపువాఁడవు" 19-17

ఆయము : వి. 1. మర్మం 2. వచ్చుబడి, పన్ను.

"చేతికి వీడెమియ్యఁగ చెలియకు చాలు నీకు
ఆతల యాతలను ఆయాలు మోచెను" 7-32

ఆయాస : వి. ఆయాసం, 'ఆయాసము' అని 'ము' లేకుండా ప్రయోగించడం విలక్షణం.

"అలసి యిందు నాయాస లేమిటికి
కలిగినపాటే కానీవయ్యా" 3-454

ఆయిటి : వి. ఆవిరి, సుడిగాలి కావచ్చు. బూరుగు (శ.ర.)

"అంగన విరహవేళ నాయిటిగాలై వూర్పు
వెంగలితనాన నట్టె విసరఁజొచ్చె" 11-442

"అలరి నిట్టూరుపుల ఆయిటి విసరఁజొచ్చె
వెలయఁ దనవలపు వెదవెట్టు మనవే" 28-409

ఆయిటిగాలి : వి. "ఆయిటి అనునది 'ఆవర్త' శబ్దమునకు వ్యావహారికరూపముగా తోచుచున్నది. సుడిగాలి అని యర్థము. గ్రీష్మర్తువులో వీచే పెనుగాలికి ఆవటిగాలి, ఆవిటిగాలి అనియు వ్యవహారమున్నది" అని సం.ప.స. (18 సం. 428పు.)

"వుమ్మగిలు నూరుపుల నొనరె నాయిటిగాలి
తమ్మికంటి జవ్వనపుఁ దతి వచ్చె రావయ్యా"
18-152

ఆయితము : (3) విణ. 'ఆయత్తము'అనే పదానికి వికృతిరూపం : సిద్ధం. రూపాం. ఆయిత్తము.

"చాయల చక్రవాళాద్రి సముద్రాలు దాటివచ్చె
ఆయితమై పైఁడి టెక్కె లవే కానవచ్చె" 3-512

ఆయితము సేయు : స.క్రి. సిద్ధం చేయు.

"కమలనాభుఁడ నీకు గంగాదినదులెల్ల
నమర యొక మజ్జనం బాయితము సేసె"
2-436

ఆయిత్తము : (3) విణ. 'ఆయత్తము'నకు వ్యావహారికరూపం.

"హరియందు మీఁదట ఆయిత్తమై యున్నాఁడదె
అరులనెల్ల గెలిచి అమరులఁగావను" 2-274

ఆయు : అ.క్రి. ఉత్కంఠను అణచుకొను, త్వరను అణచుకొను. దీనికి నఞర్థకంగానే

(ఆస్తులేడు, ఆయలేడు, ఇత్యాదిగా) ప్రయోగం.

"ఆయలేవే తనమాట కందాలు చెప్పఁగవచ్చీ

చాయసేసుకొన్నఁ బోఁడు సాధించీని" 26-139

ఆయురన్నం ప్రయచ్ఛతి : సంస్కృత సూక్తి. ఆయుస్సే అన్నాన్ని సమకూరుస్తుంది అని భావం.

"కాయమేల బడలీని కడుపు నించుకొఱకు

ఆయురన్నం ప్రయచ్ఛతి యనఁగాను" 15-223

ఆయుష్యము : వి. ఆయుస్సు.

"ఱాతఁజేసినట్టుండు నాఱడి దేహ మాయుష్యముతో

ఆతుమ యెడసితేను అదవదలవును" 15-418

ఆయెఁబోయె : ప.బం; క్రి. అయ్యిందేదో అయ్యింది, పొయ్యిందేదో పొయ్యింది.

"నాకు నీకు నేమి వోదు నాఁడె నాఁటికాయెఁ బోయె

పోకుమంటూ నాఁగేవు పొద్దు వోదా" 6-59

-ఆయె : వ్యతిరేకక్రియపై భూతార్థంలో చేరే అనుబంధ క్రియ. మణగదాయె, పోదాయె, లేదాయె, తినడాయె, పడదాయె, దైవారదాయె 6-92, తెలియలేదాయె 6-19

ఆరచి : వి. ఇది శ.ర; సూ.ని; బ్రౌన్ మొ॥ తె.వ్యు.కో. ల్లో లేదు. పొడుపుకథ కావచ్చు.

"యిచ్చట శ్రీవేంకటేశుఁడిన్నిటాను నన్ను

యిచ్చల నీ యారచిని నెన్నాళ్లైనా గెలువు"

29-11 అను.

"మగువ యీ యారచి మతి నీవు దెలియవే

తొగరు నీ పలుకుల తుదదాఁకా గడువు" 24-4

ఆరచి కత : వి. 'రహస్యపు కతయా? అని సంపాదకులు. (19-439) పొడుపుకథ కావచ్చు.

"ఆయములంటే యారచికత యిది

చాయల సన్నకు చలి యిఁక నేదయ్యా" 9-36

"చెప్పితే నారచికత చెప్పకుండితే వెత

దప్పికి నీరే మందు తలపోయఁగదరే" 19-421

ఆరజకత్తె : (ఆరజము + కత్తె) వి. సొగసైనది, మనోజ్ఞురాలు, ఇంపులాడి, విలాసవతి.

"ఆఁటది బతిమాలితే నారజకత్తె యందురు

యేఁటిది నన్నుఁగొసరే విన్నిటా జాణఁడవు"

29-191

ఆరజకాఁడు : (ఆరజము + కాఁడు) వి. మనోజ్ఞుఁడు, సొగసుకాడు, విలాసకాడు.

"మేటివైయైన నీ విభుఁడు మిక్కిలి నారజకాఁడు

ఆఁటదానికిఁ గలదే యందు కే మాయనే" 18-7

ఆరజపుది : (ఆరజము + అది) వి. మనోజ్ఞురాలు, సొగసైనది, విలాసవతి.

"సారె సారెఁ దనతోను సరిగా నవ్వు మనీని

ఆరజపుదానవా నే నందరిలోన" 29-455

ఆరజపువాఁడు : (ఆరజము + వాఁడు) మనోజ్ఞుఁడు, విలాసకాడు.

"అనిశ మందరు వంటి ఆరజపువాఁడా

చెనకి పెనఁగఁగాను చేతనంటేఁగాక" 16-7

ఆరజము : వి. (11) 1. ఇంపు 2. లీల, విలాసం 3. కలధ్వని. మనోహరము (ఆం.ప.ని.) దుర్విలాసం (వ్యు.)

"యీరాని వడిగితేను యేచి వలపు విరుగు

నేరుపులు చెప్పఁబోతే నిగుడు నారజము"

29-540

"కేరికేరి నవ్వులును కేఁకరించే సన్నలును

ఆరజము లవియే మీ కలవాటు" 27-102

ఆరజీఁడు : (ఆరజము + ఈఁడు) వి. సొగసైనవాడు, మనోజ్ఞుఁడు, విలాసకాడు.

"ఓరుపులతో చుట్టువలె నుండుఁగాక

ఆరజీఁడైనవానికి నౌఁగాము లేఁడని" 27-101

ఆరతి : వి. నివాళి, నీరాజనం; సం. ఆరాత్రికం, ప్రా. ఆరత్తియమ్.

"సంతసాన మాఁటలాడే సంబురముతోడనే

యింతలో ముత్యాల ఆరతెత్త మఱచితిని"

7-159

ఆరికమ్ము : (ఆరికె + అమ్ము) డాలు అనే ఆయుధం.
"ఆరికమ్ము వేసె నట్టె అల్ల నరకాసురుపై
మేర మీరి రావణునిమీఁద నేసెను" 2-107

ఆరుఁదేరు : (3) *ప.బం; అ.క్రి.* గడతేరు, ఆరితేరు.
"ఆరెఁదేరె నెడమాటలాడించ మీతో నేలే
చేరి తానే యడిగితేఁ జెప్పేఁగాని" 7-235
"చేరి నిన్ను నిటు గూడె శ్రీవేంకటేశ్వరుఁడు
ఆరెఁదేరెఁ బిలువవే ఆతని మా యింటికి" 11-161

ఆరు కర్మలు : వి. షట్కర్మలు. అధ్యయనం, అధ్యాపనం, యజనం, యాజనం, దానం, ప్రతిగ్రహం.

ఆరుచు తీరుచు : *ప.బం; స.క్రి.* ఊరార్చు, కోర్కె తీర్చు.
"అగపడి యెవ్వరైనా నారిచి తీరిచేమంతే
చిగురుఁగొమ్మను చాఁగై
చిమ్మిరేఁగఁజొచ్చును" 7-19

ఆరు మతాలు : *వి; బహు.* శైవం, వైష్ణవం, శాక్తం, గాణాపత్యం, సౌరం, కాపాలికం అనే ఆరుమతాలు.
"వాడిక నారుమతాలవాఁడై తిరుగుకంటే
యీడనే శ్రీపతివారై యీడేరరో" 9-279

ఆరుమూరు సేయు : *ప.బం; అ.క్రి.* పనిని చెడగొట్టు, క్షీణింపజేయు.
"ఆరుమూరు సేసి విద్యలందరికిఁ బారఁజల్లి
పారితెంచి వోలలాడెఁ బాలవెల్లి" 5-48

ఆరు శాస్త్రాలు : వి. తర్కం, వ్యాకరణం, అలంకారం, మీమాంస, ధర్మశాస్త్రం, జ్యోతిశ్శాస్త్రం.
"ఆరుశాస్త్రముల ఆరుమతంబుల
నారుగర్మముల నైనాను
యీ రీతిల మిము శరణని కొలువక
యెవ్వరికుపాయము లేదు" 2-412

ఆరోగిణఁము : వి. భోజనం.(వ్యు.)

ఆర్పులు - బొబ్బలు : *ప.బం; వి; బహు.* అరపులు అనే అర్థంలో జంటపదం.
"ఆర్పులు బొబ్బలు నవె వినుఁడు
యేర్పడ నసురుల నిటువలె గెలిచె" 2-108

ఆఱడి : వి. 1. కష్టం, దుఃఖం, బాధ 2. హాని, భంగం 3. నింద, ఱట్టు, అపవాదం (సూ.ని.)
"అరుదై శ్రీవేంకటేశుఁడట్టె నిన్నుఁ గలసెను
అరమరచేవు మేను ఆఱడింత గలదా" 7-63

ఆఱడిఁబెట్టు : స.క్రి. అల్లరిపెట్టు, నిందపెట్టు, బాధపెట్టు, వ్యర్థంచేయు.
"చెలులము నేమైనాఁ జెప్పవలె నీకు బుద్ధి
అలుకలు పనిలేవు ఆఱడిఁబెట్టకువే" 26-530

ఆఱడికత్తె : (ఆఱడి + కత్తె) వి. దుష్టురాలు, నింద్యురాలు, వ్యర్థురాలు, అప్రయోజకురాలు.
"నేరుపరి యైనదే నిండుకొని యుండ నేర్చు
నా రీతి నాఱడికత్తె ఆడు వెంగేలు" 17-118

ఆఱుగురు పగవారు : వి. శరీరంలోని ఆరుగురు శత్రువులు. అరిషడ్వర్గ మన్నమాట. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు.
"పదిలము కోట పగవారు
అదనఁగాచుకొందు రాఱుగురు" 1-61

-ఆల : సంబోధనలో బహువచన పదాలపై చేరే ప్రత్యయం. అన్నమయ్య ఏ కొన్నిచోట్లనో తప్ప 'అంతటా' 'ఆల' అనే రూపాన్నే ప్రయోగించినాడు. సాధారణంగా ఈ అర్థంలో 'ఆర' చేరుతుంది. అన్నమయ్య 'ఆల' అని ప్రయోగించడం జానపదవ్యవహారసరళిని బట్టే అని భావించాలి. అన్నమయ్యలో 'ఆల' తో కూడిన రూపాలు సుమారు 250కి పైగా కనిపిస్తున్నాయి. 'ఆర' తో కూడిన రూపాలు మాత్రం ఎనిమిదే కనిపిస్తున్నాయి.
"అమ్మలాల, అక్కలాల, అతివలాల" 14-143

ఆలకింపు : వి. శ్రద్ధగా వినడం.
"యెనసిన యాసలె యెదురుల చూపులు
అనుఁగుఁ గూరిములె ఆలకింపులు" 9-20

ఆలజాలము : (4) శ.ర.; సూని; బ్రౌన్, వ్యు.కో, పద కోశాల్లో ఈ పదం కనిపించదు. వేటూరి

ప్రభాకరశాస్త్రి గారు ఈ పదానికి నీట గిరగిర తిరుగు ఒక రకపు పురుగులు అని అర్థం చెప్పినారు. (చూ : తెలుగు మెఱుగులు – పుట 78-80) నీటి ప్రవాహమందు కోలాహలముగ తిరుగులాడు ఈ జలజంతువుల ఆటయే కాబోలు నేటికిని చాలా ఉత్సాహముతో చెలరేగిన కార్యక్రమమును చెప్పునపుడు "ఆలజాలంగా ఉంది" అని వ్యవహారంలో ఉంది అని సంపాదకులు. (1సం. పీఠిక) ఈ పదం "ఆలజాలంబు నీరిలో నీదుజాడ, గాలిపడగ యాకసమునఁగాఁలు త్రోవ, నిదురలోపల గలఁదోచు నీడవిధము, గానవచ్చునె యప్పుడె కన్నుఁగాక" అనే ఉ. హరి, పద్యంలో కూడా కానవస్తుదనీ, ఇక్కడ కూడా ఆ అర్థమే పొసగుతుందని శాస్త్రిగారు వివరించినారు.

"అప్పసమైన భ్రమ ఆలజాలాల కున్నట్లు
యిప్పుడే వుండవలదా యీతనిమీఁదటను" 15-46

"అరయఁ జంచలముచే నాలజాలంబువలె
దిరుగ దొరకొనియెఁ దన దేహము" 1-321

"తటతటన నీటిమీఁదట నాలజాలంబు
లిటునటుఁ జరించవా యీఁది యీఁది" 1-218

ఆలదొడ్డివారు : (2) వి; బహు. గొల్లవారు.

"ఆలదొడ్డివారము నే మంతేసి యెఱఁగము
పాలదుత్త దుత్తెఁడేసి పట్టవయ్యా" 7-180&5-58

ఆలపోతు : వి. ఎద్దు.

ఆలపోతుకొండ : వి. శ్రీవేంకటేశ్వరస్వామి నెలకొన్న ఏడుకొండలలో ఒకటైన వృషభాద్రి.

"ఆలజాలమైన నీట నలరఁదేలిన వాఁడు
ఆలపోతుకొండమీఁద ననువైనవాఁడు" 5-216

ఆలపోతువాఁడు : వి. శివుడు; ఎద్దువాహనంగా కలవాడని వాచ్యార్థం.

"ఆలపోతువానితోడ నంటిన మేనివాఁడు
ఆలగాపరులతోడ నాడినవాఁడు" 5-216

ఆలరి : దుష్టుడు, టకటొంకు, అవివేకి, మూర్ఖుడు, అనాథుడు, భర్తృహీనుడు.

"ఆలరి జాణఁడవని అంటిఁగా నేను
ఆలనైతి నింత యేఁటి కంటిఁగా నేను" 14-103

దుఃశీలము :

"ఆలరి బంగారు గంటే నందరి మనసులూను
పోలిమి నా పసఁ జిక్కి పుంగుడుగాకుండునా" 4-66

"ఆలరి శ్రీవేంకటేశ ఆండ్లఁ బెండ్లాడితివి
తాలిమి నన్నట్లానె దయఁజూడరా" 23-491

"పాలసముద్రము బలిమిఁ దచ్చికొని
రాలరి దేవతలమృతమును" 2-10

"ఆలరి శ్రీవేంకటేశుఁడా తఁడేమి సేసినాను
నీలాగు భాగ్యము గాక నేనేమి సేతునే" 9-99

ఆలరికత్తె : (ఆలరి + కత్తె) వి. 1. దుస్స్వభావురాలు, దుష్టురాలు 2. అవివేకిని, మూర్ఖురాలు 3. దిక్కులేనిది, అనాథ, భర్తృహీన విణ. దిక్కులేనిది.

"తాలిమిగలదానికి తనంతనే వచ్చు మేలు
ఆలరికత్తెకుఁ గద్దా ఆపసోపాలు" 27-420

ఆలరితనము : (ఆలరి + తనము) వి. 1. దుష్టస్వభావం 2. అవివేకం, మూర్ఖత 3. దిక్కులేనితనం, భర్తృహీనత.

"పోలించి నీకుఁగాఁబూనుక వచ్చొకతెతో
ఆలరితనాన వాదు లడిచినది" 26-117

ఆలరీఁడు : (31) (ఆలరి + ఈఁడు) విణ. దుస్స్వభావుడు, దుష్టుడు, అవివేకి, మూర్ఖుడు, అనాథ.

"ఆలరీఁడ రుక్మిణిఁ బయ్యాడించి
తెచ్చినలవాటు
పోలి మీతో నంటుఁగాక పోనిచ్చునటయ్యా" 14-32

ఆలవట్టమాపె : (ఆలవట్టము + ఆపె) వి. గాలికోసం విసనకఱ్ఱను ఊపే సేవకురాలు. చూ : ఆలవట్టము.

"సారె సారె నీ చేఁతలు చక్కఁబెట్టరాదు గాక
చేరి యాలవట్టమాపెఁ జెక్కు నొక్కవా" 29-456

ఆలవట్టమిడు : అ.క్రి. గుడ్డతో గుండ్రంగా కూర్చిన విసనకఱ్ఱతో వీచు, రాజాదులకు ఎండ తగులకుండా ఉండే సాధనాన్ని పట్టు.

"ముక్కున నిట్టూరుపులు ముంచి బుసకొట్టఁగానే
అక్కరతోఁగొంతవడి యాలవట్ట మిడెను"
28-298

ఆలవట్టము : వి. 1. వస్త్రంతో గుండ్రగా చేసిన విసనకఱ్ఱ. 2. గుండ్రటి విసనకఱ్ఱ లాగా ఉండి రాజాదులకు ఎండ తగులకుండా పట్టే ఒక సాధనం, గుడ్డగొడుగు.

"అరుదుగ సకలలోకారాధ్యుఁడయి మించి
విరివి నాలవట్టాల విసరరే సతులు" 5-343

"అంగన నిట్టూరుపులే యాలవట్టములు
నీకును" 29-538

"ఆలవట్టములు వట్టే రవధరించఁగదో పెద్ద
పాలిండ్ల బరువున భామ బడలితివి" 5-273

ఆలవట్టాలవారు : *వి; బహు.* విసనకఱ్ఱలతో వీచేవారు. (ఆలవట్టము = విసనకఱ్ఱ)

"సిరులఁ గట్టికవారు సేయరే బరాబది
వరుస నాలవట్టాల వారెల్లా విసరరే" 24-269

ఆలవారు : (ఆలు + వారు) *వి; బహు.* గొల్లవారు. ఆవులను పాలించేవారు అని వ్యుత్పత్తి.

"హత్తి శ్రీవేంకటేశ ఆలవారమైతేఁ జూచి
కొత్త పేయల గూడంటూ నొప్పంటేవు" 7-156

ఆలిమగనాట : (ఆలిమగని + ఆట) వి. భార్యాభర్తలుగా అభినయిస్తూ బాలికలు ఆడుకునే ఒక విధమగు ఆట.

"ఆలమి శ్రీవేంకటేశుఁడాలి మగనాట లంటా
చెలరేగి మోవెడిగే చిఱుతా వీఁడు" 17-173

ఆళాపించు : 'ఆలాపించు'కు వ్యావహారిక రూపం కావచ్చు.

"పాటలలో శంకరాభరణ మాళాపించరే" 28-273

ఆళువారు : వి. రూపాం. ఆళ్వారు. ద్రావిడ ప్రబంధకర్త యగు విష్ణుభక్తుడు (వీరు పదిమంది అని కొందరు, పన్నెండుమందని కొందరు.) వీరు గరుడాళ్వారు, అనంతాళ్వారు మొదలైనవారు.

"తిరమై యాళువారల తేజము దానై యుండు
గరుడానంతముఖ్యఘనుల సంగడిని" 4-192

ఆవటము : వి. పొందిక; విణ. అనుకూలం, అనుగుణం, వీలైనది. పరిహాసము, ఎగతాళి ఇత్యాదిగ మాండలికవ్యవహారం.

"అలమేల్మంగవు నీవు అతఁడు శ్రీవేంకటేశుఁ
డలయించితే రతు లావటమై వుండునా"
24-573

"మోవి యానేది గొంత ముంటిపోట్లును గొంత
ఆవటమాయ నీకు నట్టే కాదా" 24-196

ఆవటించు : స.క్రి. 1. కలిగించు, కావించు 2. వహించు, పూను 3. సంగ్రహించు, సేకరించు 4. పొందుపరచు, సవరించు 5. తిను, భక్షించు.

"నీ వొళ్లలేని గుణము నేఁ జేసిపెట్టేనా
ఆవటించి నమ్మి వుండుటది మేలు నాకు"
19-213

పొందుపడు :

"కంచపు గాలావటించే కలిమిలో వారమింతే
చంచలపుటాసలు చేయిచాఁచ నేటికే"

"నీ వొళ్ల లేని గుణము నేఁజేసి పెట్టేనా
ఆవటించి నమ్మి వుండుటది మేలు" 19-213

ఎదిరించు, లెక్కచేయకుండు, వ్యతిరేకించు :

"శ్రీవేంకటేశ్వర నీవే చేరి నన్ను గూడితివి
ఆవటించి యిఁక నిన్ను నలయించఁ జెల్లునా"
12-36

ఆవపచ్చడి : వి. ఆవపెట్టి చేసిన పెఱుగుపచ్చడి. (వ్యు.)

"కాంత గోరి చెనకులు కారపుఁగూరల విందు
పంతపుమాటలే ఆవపచ్చడి విందు" 21-529

ఆవల : వి. పరలోకం.

"శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు

ఈవలేది యావలేది యితని దాసునికి" 2-19

ఆవి : వి. 1. శ్వాస 2. తాపం.

"భావపు వింతలతోడ పచ్చి సింగారముతోడ
ఆవులు వారెడి మేని అలపులతోడ" 5-337

ఆవులవారు : వి. గొల్లలు, ఆవులు కాచేవారు.

"మేలిమి ఆవులవారి మెలుతలు మీరుగాన
మూలనున్న మీ చన్నులు ముట్టి నేఁగూడితిని" 11-346

ఆవేలము : వి. తమ్మ, నమలినతాంబూలం (వాచ.)

"పుక్కిటితమ్మలముతోఁబొంచి యేకాంతా లాడేవు
తక్కక నోరి ఆవేలము తాఁకించేవే" 12-525

ఆశకుఁడు : వి. ఆశ గలవాఁడు, వింతప్రయోగం, భారకుడువంటిది.

"ఏమి సేయఁగల యెంతాశకుఁడను
తామసపుమనసు తనియదు నాకు" 3-329
"అలరి నీ వైతేను ఆశకుడవూఁగావు"

ఆశ్చరియము : వి. 'ఆశ్చర్యము'నకు వికృతిరూపం.

ఆసకత్తె : (7) (ఆస + కత్తె) వి. ఆశ గల స్త్రీ, లోభం కల స్త్రీ.

"అట్టె కాఁగిలించుకొంటే ఆసకత్తె నందువు
గుట్టున నూరకుండితే గొంట నందువు" 25-213

ఆసకాఁడు : (3) (ఆస + కాఁడు) వి. ఆశ గలవాఁడు, లోభి.

"అక్కర నీ వింత ఆసకాఁడ వవుత
యిక్కడ మాలోనె యెఱఁగముగా" 9-13
"అలవిగాని మోహపు టాసకాఁడ నీ
వలుగకురా వెఱపయ్యాని" 6-103

ఆసకురాలు : (ఆసక + ఆలు) వి. ఆసక్తురాలు, ఆశ గల స్త్రీ, 'ఆశకుడు' అన్న శబ్దానికి స్త్రీలింగ రూపం. వింతప్రయోగం.

"ఆసకురాలైనది అలయదు రతులను
పాసి తొలఁగదెప్పుడు పైకొనుఁగాని" 28-295

ఆసగించు : (13) అ.క్రి. ఆశపడు, అపేక్షపడు.

"ఆసగించి వున్న యింతి నారఁడిఁబెట్టుదురా
సేసవెట్టి పెండ్లాడిన చెలువుఁడవు" 19-45
"కాఁపురము సేసితేను కానిమ్మనీఁ జొప్పడునే
పైపై నాసగించితే బాఁతిపడనగునే" 26-431

ఆసచేయు : అ.క్రి. ఆశ కలిగిఉండు, ఆశించు.

"ముంగిటనుండి నీవు మోము దప్పక చూచితే
అంగడి నుండిన చెలి యాసచేసెను" 18-416

ఆసపాటు : (3) (ఆశపడు + టు) అపేక్ష, కోరిక.

"ఆసపాటుగా హరి యున్నాఁడదె
అందుకు ప్రహ్లాదుఁడు సాక్షి" 2-41

ఆసపాలకుఁడు : ప.బం; వి. ఇది ఆసపాతకుడు కావచ్చు. ఆశపోతు, పిసినారి, ఆశాపాతకుఁడు.

"అప్పఁడైన వేంకటేశుఁ డాసపాలకుఁడు గాన
తప్పకుండ పెట్టె వాని తలకెత్తరే" 5-148

ఆసబాస : ప.బం; వి. ఆశపెట్టుకోవడం - బాస చేయడం.

"తలవంచుకుండినాను తలఁపు నామీదనే
పలుకకుండిన నాసబాస నామీఁద" 7-276

ఆసయిచ్చు : (ఆస + ఇచ్చు) ప.బం. ఆశగొలుపు, ఆశ కలిగించు.

"చేసినంతఁ జేయనీరే చెప్పకురే యా సుద్ది
ఆస యిచ్చాతఁ డొకమాటాడితేఁ జాలు" 19-385

ఆసలాసలు : (2) (ఆసలు + ఆసలు) ప.బం; వి; బహు. మిక్కిలి ఆశలు. రూపాం. ఆసాసలు.

"నా సొమ్మైనవాఁడవు నన్ను నీవు యెడసేవా
ఆసలాసలను నీకు నేఁకరేఁగా" 28-497
"సేసవెట్టినట్టివాఁడు చేరి కాఁగిలించుఁ గాక
ఆసలాసలె రేఁచి అట్టె వుండీనా" 11-98

ఆసలిచ్చు : (ఆసలు + ఇచ్చు) ప.బం. ఆశలు గొలుపు, ఆశలు కలిగించు.

"మొగము చూచి నీవు ముంచి
యాసలియ్యఁగానే

తగిలి నీ మాటలట్టె దాఁటజాలఁడు" 21-236

ఆసలు మెడఁగట్టుకొను : *ప.బం; అ.క్రి.* మిక్కిలి ఆశలు కలిగి ఉండు.

"ఆసలు మెడఁగట్టుక అన్నియుఁ జదివినాను

దోసము లెల్లా మాని దొర నయ్యేనా" 3-250

ఆసలు సానలఁబట్టు : *ప.బం; అ.క్రి.* ఆశలను తీవ్రం చేయు, ఆశలను తీక్ష్ణంచేయు.

"కంటిమి వింటిమి నీ కతలు నేఁడు

నంటుననే ఆసలు సానలఁబట్టేవా" 8-30

ఆసాబాసా : *ప.బం; వి.* రూపాం. ఆసబాస; ఆశపెట్టుకోవడం మరియు బాసచేయడం.

"దాసులపాలిటి నిధానమై వున్నాఁడదిగో

ఆసాబాసా నితఁడే అహోబలేశుఁడు" 4-488

"సేసెఁ బొందు లిద్దరిని శ్రీవేంకటేశుఁ డీతఁడు

ఆసాబాసా నెవ్వరిదే అంగనలాలా" 22-493

ఆసాసలు : (ఆసలు + ఆసలు) *ప.బం.* అధికాశలు, గొప్ప ఆశలు. ద్విరుక్తి ఆధిక్యాన్ని తెలుపుతుంది.

"ఆసాసల నీ మాటకు నడ్డమాడనైతిఁగాక

వాసిదెచ్చుకొని నిన్ను వంచుకోలేనా" 19-532

"వూని నేఁ బిలువకుంటే పొగిలేవా నీవేమైనా

దాని యాసాసలనైనాఁ దనుతువుగాక" 24-592

ఆసుకోవి : వి. ఆసుపోసే కోవి. ఆసు అనేది చేనేత పనిముట్లలో ఒకటి. దీనిపై దారాన్ని పడుగుకు అనుకూలంగా పోసుకుంటారు. కోవిద్వారా దారం కుడికీ, ఎడమకూ తిరుగుతూ చుట్టబడుతుంది. ఆసందర్భంలో 'ఆసుకోవి' కుడికీ, ఎడమకూ తిరుగుతూ ఉంటుంది. ఎవరైనా మాటిమాటికీ ఇటూ అటూ తిరుగుతూ ఉంటే "ఆసుపోసినట్టు తిరుగుతున్నాడు" అని అంటారు. రూపాం. ఆసుగ్రోవి.

"గాసి కోపక సిగ్గుతోఁ గదలితే వెంటవెంట

ఆసుకోవివలె వచ్చీనట్టే కాదా" 14-354

ఆసోదకత్తె : (14) (ఆసోదము + కత్తె) కోరిక గల స్త్రీ, ఆశ గల స్త్రీ. చూ: ఆసోదము.

"తడవి శ్రీవేంకటేశ తగవు నీ వెఱఁగవా

అదరి నీవు మన్నించే యాసోదకత్తెలము"

27-195

ఆసోదకాఁడు : (33) (ఆసోదము + కాడు) వి. కోరిక గలవాడు, ఆశ గలవాడు.

"అచ్చుగా నా సరులంటీ నాసోదకాఁడు

యిచ్చటనే కాచుకున్నాఁ డెలయింపుకాఁడు"

18-105

ఆసోదపుఁగత్తె : (ఆసోదము + కత్తె) కోరిక గల స్త్రీ, ఆశ గల స్త్రీ.

"వేసారక నీతో వేమారు విన్నవించఁగ

ఆసోదపుఁగత్తె యని యాడవా నీవు" 13-444

ఆసోదపుఁదనము : (ఆసోదము + తనము) వి. ఆశ, కోరిక; ఆసోదము అనే భావార్థకశబ్దంపై స్వార్థంలో 'తన' ప్రత్యయం. చూ: ఆసోదము.

"ఆసోదపుఁదనములు అంగములు వనితలకు

ఈ సుదతిఁ గూడితివి యేలుకోవయ్యా" 19-83

ఆసోదపుది : (ఆసోదము + అది) వి. కోరిక గల స్త్రీ, ఆశ గల స్త్రీ.

"ఆసోదపుదాన నన్నా నంటివి గాని

పాసి వుండలేఁ జుమ్మి పాయకుందుఁగాని"

26-134

ఆసోదము : (145) వి. కోరిక, ఆశ, కామం. అన్నమయ్య సంకీర్తనల్లో కనబడే విలక్షణపదాల్లో ఆసోదమనే పదం ఒకటి. ఇది ఆసోదము, ఆసోదకాడు, ఆసోదకత్తె, ఆసోదపుఁగత్తె, ఆసోదపుఁదనము, ఆసోదపు బాపడు అనే రూపాల్లో కనిపిస్తుంది. ఈ పదం బ్రౌణ్యం మిశ్రమమాండలిక పదకోశంలో తప్ప ఇతర నిఘంటువుల్లో కనిపించదు. బ్రౌణ్యం ఈ పదానికి విశ్రాంతి, సేదదీర్చుకోవడం అనే అర్థాలను చూపింది. కాని ఇవి సంకీర్తన పాఠాల్లో పొసగడం లేదు. తాళ్ళపాక పద సంకీర్తన మూడో సంపుటం అనుబంధంలోని సందిగ్ధ పదసమీక్షలో సంపాదకులు అర్థాన్ని చర్చిస్తూ "ఇది ఆస్వాదశబ్దభవమని పండితులొక్కరు సూచించిరి. ఆచోద్యభవమా" మేమనుకొనుచుంటిమి. రమణీయత అర్థము కావచ్చును అని వివరించినారు. దీనిని బట్టి

వారు ఆసోదశబ్దానికి రమణీయత అనే అర్థాన్ని సంభావించినట్లుగా చెప్పుకోవచ్చు. ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు అర్థాన్ని చర్చిస్తూ అన్నమయ్య పదాల ఆధారంగా వాంఛ, కోరిక అనే అర్థాన్ని భావిస్తున్నట్లుగా ఊహించినారు. (సంకీర్తనవాఙ్మయము - పదకవితలు - భాషా ప్రయోగవిశేషములు, పుట 430) ఆనందమూర్తి గారూహించిన ఈ అర్థం అన్నమయ్య ప్రయోగాలను పరిశీలించినపుడు 'రమణీయత' అనే అర్థం కన్నా సముచితంగా కనిపిస్తుంది. అంతేకాక ఈ అర్థానికి సమర్థకంగా ఒక బలమైన ప్రమాణం కూడా ఈ నిఘంటుకర్తకు లభించింది. తాళ్లపాక పెద తిరుమలాచార్యులు భగవద్గీతకు రచించిన వ్యాఖ్యానంలో "కామమాశ్రిత్య దుష్పూరం దంభమాన మదాన్వితాః" అనే శ్లోకంలోని 'దుష్పూరం కామమాశ్రిత్య' అనే పద్యానికి ఒక పాఠంలో "ఎంతైనా తీరని ఆసోదముతోను" అని వివరణ ఇవ్వబడింది. ఇట కామ శబ్దానికి ఆసోదమనే శబ్దం సమానార్థకంగా ప్రయోగింపబడింది. కనుక ఆసోదమంటే కామం, కోరిక, ఆశ అనే అర్థాలను చెప్పుకోవడం సముచితంగా కనిపిస్తుంది.

ఆస్తియుఁబాస్తి : *ప.బం; వి.* ఆస్తిపాస్తులు, ఆస్తీపాస్తీ. జంటపదం.

"ఇదివో నా సంపదా అస్తియుఁబాస్తి
నీవు యితరంబు నాకుఁ బని లేదు"

7-106 & 2-340

ఆహికము : *వి.* నిఘంటువుల్లో ఈ పదానికి ధూమకేతువు, సుషిరవాద్యవిశేషం, వరుసజ్వరం అనే అర్థాలు చూపబడ్డాయి. అన్నమయ్య కింది ప్రయోగంలో వీటిలో ఏ అర్థమూ సముచితంగా కనిపించదు.

"ఆహికముగ నిట్టి అధమవృత్తికి నే
సాహసమున నెట్టు చాలుదునయ్య" 1-235

ఆహిపెట్టు : (అహి + పెట్టు) *స.క్రి.* ఈ శబ్దం శ.ర., సూ.ని., బ్రౌన్ మొ॥ నిఘంటువుల్లో కానరాదు. ప్రభాకరశాస్త్రిగారు దీనికి కుదువబెట్టు అనే అర్థాన్ని నిర్ధారించినారు. (చూ : తెలుగుమెఱుగులు - 147 పు) కుదువపెట్టు, తాకట్టుపెట్టు.

"నవ్వి నవ్వి వేగినంతా నలిఁబొద్దులు వుచ్చేవు
అవ్వల నివ్వల నెందు నాహిపెట్టితి వయ్యా"

28-547

"వెదకి కామునికి విషయములకు నే
అదివో నా వయసెల్ల నాహివెట్టితిని" 4-142

ఇ

ఇంట గెలిచి రచ్చ గెలుచు : *ప.బం; అ.క్రి.* మొదట స్వస్థలంలో గెలిచి తరువాత పరస్థలంలో గెలుచు.

"ఇంట గెలిచి కా నీవు యిఁక రచ్చ గెలిచేది
వెంటనే ఆనతీరాదా వినవలె నేను" 8-4

ఇంటాడ : (ఇంటి + ఆడ, వాడ) 1. ఇంటిదగ్గర (2. ఇంటివాడ)

"రవ్వలాయ మా వలపు రమ్మనవే
యింటాడకు"

ఇంటికాడ నిడి గానుగకాడ గసి : ఇడి = సేమియ, భక్ష్యవిశేషం, గసి = కాచిననెయ్యి, లోనగు వాటిలో దిగే మడ్డి; ఇంట్లోనేమో ఆవిరికుడుము, గానుగ దగ్గరేమో గసి. ఒకచోట అనుకూల వస్తువు, మరోచోట ప్రతికూల వస్తువూ లభ్యం కావడమన్నమాట.

"కని ఇంటికాడ నిడి గానుగకాడా గసి
నినుఁజూచి నేరుచుకోనేరనే నేను" 19-383

ఇంటికాడి బేరము : *వి.* సులభమైంది.

"నీ తలనే వేగెనా నెట్టుకొన్న వలపులు
యేతుల సిగ్గువడకు యింటికాడిబేరము" 7-515

ఇంటిది : (ఇంటి + అది) *వి.* గృహిణి, భార్య, యజమానురాలు.

"ఇంటిదాన నే నుండఁగా యెరవు సతమా నీకు
పెంటవెట్టుక నావద్దఁ బ్రియాలు చల్లేవు" 9-269

ఇంటిమగఁడు : (ఇల్లు + మగఁడు) *వి.* భర్త.

"యెక్కడో గొల్లసతుల కింటిమగఁడాయఁగా
తక్కక వెదకే పరతత్త్వమితఁడే" 1-454

"ఇంటిమగని జూచి యిల్లాలు దుఃఖించి
వెంట విటునిఁ దగిలి వెతలఁబడును" అని
వేమన.

ఇంటియాడ: (ఇంటి + ఆడ) ఇంటి దగ్గర, ఇంటికాడ.

"పొంది ఆవులు దూడలుఁ బొలానఁ గలసుఁజేసు
అందాఁకా నీవు మా యింటియాడ నుండవయ్యా" 11-273

ఇంటియాపె: (ఇల్లు + ఆపె) *ప.బం; వి.* ఇల్లాలు, గృహిణి.

"దంటతనము నిన్ను దప్పులెంచీ నంటాను
ఇంటియాపె నేల నీఁగే వింతవాఁడవు" 36-578

ఇంటిలోని నిధానము: *ప.బం; వి.* అందుబాటులో నున్న అమూల్యవస్తువు.

"గక్కన శ్రీవేంకటేశ కలిసితివి యిక్కువ
లన్నియు నింక నింటిలోని నిధానము" 9-154

ఇంటిలోని పంట: *ప.బం; వి.* అందుబాటులో నుండేది.

"అరుదై తూరుపుఁగొండ నారఁగ బండిన పంట
యిరవై శ్రీవేంకటేశు నింటిలోని పంట" 4-342

ఇంటిలోని పోరు: *వి; ప.బం.* దుర్భరమైన పోరు.

"పన్నిన పగల వెలుపటివారికంటె
ఎన్నరాని పగ గాదా యింటిలోని పోరు"

15-199

ఇంటిలో పోరు: *ప.బం; వి.* అనుక్షణ బాధాకరం.

ఇంటివేలుపు: *వి.* (ఇల్లు + వేలుపు) కులదైవం, ఇలువేలుపు.

"కంటి మున్నిటి సత్వాలు కమలాక్ష యిఁక నీవే
యింటివేలుపవై మమ్ము నీడేర్తువు గాకా"

15-311

ఇండువిండ్లవారు: *వి; బహు.* ఇండ్లు నిండ్లవారా? ఇంటింటి వారని అర్థం కావచ్చు.

"బండిబోయఁడవై పౌఁజులలో నుండఁగ
యిండువిండ్ల వా రేమందురు" 23-547

ఇండె: *వి.* పూలమాల; త. ఇంటై, క. ఇండె.

"నిండిన మోహమునను నినుఁదూరఁ జాలదు
ఇండెవెట్టి బాసలు నీ వెన్ని యిచ్చినా" 13-394

ఇండెవట్టు: *ప.బం.* (?)

"రెండుఁజూచి పగయుఁగూరిమి దోఁచె నింతలోనె
యిండెవట్టె నిన్నిటికి నేమి సేతురా" 5-173

ఇంతక తొలుత: అవ్య. ఇంతకుముందు, ఇంతకుమునుపు. ముందు, మునుపు అనే శబ్దాలకు బదులు తొలుత, తొల్లి అనే రూపాలను వాడడం అన్నమయ్యకు అలవాటు.

"ఇచ్చితిమి కానుక యింతక తొలుతే నీకు
తచ్చేము మా సిగ్గు దగ్గరి రావయ్యా" 27-155

ఇంతకతొల్లి: (14) అవ్య. ఇంతకు ముందు, ఇంతకు మునుపు, ముందు, మునుపు అనే పదాలకు బదులు తొలుత, తొల్లి అనే రూపాలను వాడడం అన్నమయ్యకు అలవాటు.

"చన్నుమొనలు దాఁకించి సారెకు సేవలు సేసే
యెన్నఁడు గూడితివో యింతకతొల్లి" 18-74

ఇంత గుండెవాఁడు: *వి.* ఎక్కువ ధైర్యం కలవాడు.

"వంతులాడేవు పిలువ వచ్చిన మాతోనె నీవు
ఇంత గుండెవాఁడ వైతే నెటు వొయ్యీ జనులు"

11-335

ఇంతానింత: ఇదంతా (?)

"మోవి చూచినంతలోనే ముంచి నోరూరీ నీకు
వావిరి నింతానింత వలపే కాదా" 22-196

"వాగమైన దింతానింత వలపే కాదా" అంతనంతా శరీరపోషణమనే ధూర్జటిప్రయోగంలోని అంతానంత ఇటువంటి రూపమే!

ఇంతేసి: (ఇంత + ఏసి) *విణ.* ఇంతటి, ఇటువంటి; ఇంతటి ప్రమాణం.

"మెత్తని మనసుదాన మేలు దాఁచనే నేర
కొత్తగా నింతేసికిని గురి యైతినయ్యా" 11-50

ఇంద: (3) అవ్య. ఇదుగో, తీసుకో.

"వీడెమింద వేసుకో వెస దప్పిదేరుచుక
వాడుమోముతో నలసి వచ్చితివి" 3-418

ఇంద కొండు: ఇదుగో తీసుకోండి.
"అందపు శ్రీవేంకటేశ అంతరాత్మవై వున్నాఁడ
ఎందు చూచిన యింద కొండో యనుచు"
2-102

ఇందకో: (2) క్రి. ఇదుగో తీసుకో.
"వీడె మింద కోవయ్య వింతవారమా
వేడుకకు వెల లేదు వెరపేల నీకు" 7-532

ఇందము: (5) క్రి. ఇదుగో, తీసుకో; చూ: ఇంద.
"నిగ్గుల శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
వొగ్గి వీడె మిందమంటా నుప్పతించే వేలరా"
17-348

ఇందవయ్యా: (9) (ఇంద + అయ్యా) ఇదుగో, తీసుకో.
"ఇవ్వలి మోమేలయ్యే వాపెతో మాటాడవయ్యా
ఇవ్వల నాకెకుఁగాను ఇందవయ్యా కానికె"
12-207
"కందువైన వాసనలు కప్పిపెట్ట నేమిటికి
ఇందవయ్యా జవాది ఇచ్చే నేను" 29-200

ఇందవె: ఇదుగో.
"ఇందవె యాతఁడు నీ కిచ్చిన సొమ్ము
కందువ నీ మేలులోని కాంతలము గదవే"
18-148

ఇందుకంటె: (5) దీనికంటె, ఇంతకంటె. సప్తమ్యంతమైన 'ఇందు'పై 'కంటె' విభక్తి ప్రత్యయం విలక్షణం. ఇందుకోసంవంటి పదం.
"ఇందుకంటె నేమిసెల్లు నింకా నేను
నింద నీపైఁ బడీ జుమ్మీ నీ చిత్తమీఁకను"
26-382

ఇందుకొను: (5) అ.క్రి. ఇముడ్చుకొను, ఒంట పట్టించుకొను, రుచించు, ఇష్టమగు.
"సేవ సేయుచుండఁగాను జీతము మానుపరాదు
యీవిధి నాన దోసితే నిందుకోరాదు" 2-434

"అతివంపిన యేకాంతమాయములు
సోఁకఁబోలు
ఇతవై నీలోలోనే యిందుకొంటివి" 10-2-40

ఇందు రమ్మంటే ఇంటిలోనికే వచ్చు: *ప.బం; అ.క్రి.* కొంచెం అవకాశం ఇస్తే చాలు అంతా తానే ఆక్రమించు. (దుర్మార్గునికొక అంగుళంమేర నిలువ స్థలం ఇస్తే ఎదురయి వాడిల్లంతా లాగి వేసుకుంటాడు.)
"ఇందు రమ్మంటేఁజాలు నింటిలోనికే వత్తువు
సందడిఁగాలు దొక్క జాణవుగా నీవు" 17-385

ఇందువంక: (7) దీనిద్వారా, దీనిమూలంగా, ఇటునుండి.
"యెంచ నిందువంకనే పో ఇందరిలో రూపు లేక
అంచెల నంతరభూతమై యుండవలసె" 24-33

ఇంపు: *అ.క్రి. వి.* ఇష్టపడు, (?) వలపు చూపు.
"అలమేలుమంగవు నీ వతఁడు శ్రీవేంకటేశుఁ
డిల
తామెంత గూడినా నింపు నీపై నితఁడు" 26-288

ఇంపువాఁడు: వి. ఇచ్ఛ గలవాడు, ఆనందం కలవాఁడు.
"అంగవించి నీసేత కడ్డమాడని సతిని
యెంగిలిసేతురా మోవి ఇంపువాఁడవు" 21-285

ఇంపుసొంపులు: *ప.బం; వి;* బహు. అందచందాలు.
"ఇంపుసొంపులు వేంకటేశ్వరునిమీద
గుంపైన చందురులు కుచయుగముమీఁద"
6-131

ఇంబు: వి. ఇంపు, మనోహరత, ఇమ్ము. చూ: కిటెల్: ఇమ్ము - (tel) ఇమ్పు - ఇమ్పిన పద్మముఖి.
"బింబాధరుఁడాతఁడు పికవాణిని నేను
యింబడర నిద్దరికి నేటి పొందులే" 15-28 old

ఇంస: వి. 'హింస'కు జానపదవ్యవహారం.
"యింసలన్నియుఁదేరె నిందరుఁజుట్టము లైరి
హంస చేతి పాలు నీరు నట్లాయె బ్రదుకు" 2-6

ఇక్కువ: వి. 1. సంకేతస్థలం 2. జాడ

3. వేదవిహితమైన విధి.
"ఇక్కువ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
మొక్కలములెల్లా మాని మొక్కవద్దా
యిందుకు" 27-184
"ఇక్కువతో యజ్ఞము సేయించెఁబో మా
గురుఁడు"

ఇగిరించు: అ.క్రి. 1. చిగిరించు 2. కలుగు, పొడము 3. ఎఱుపెక్కు; ప్రే.క్రి. ఇగిరిపోజేయు, నశింపజేయు (వావిళ్ళ)
"ఇగిరించేవు పైపైనె యిట్టిదివో వలపు" 7-9

ఇగురులోపలి నిప్పు: ప.బం; వి. మృదువైన దానిలో కఠినమైన పదార్థం.
"చిగురులోపలి చేఁగ చెప్పరే మీరు
నిగురు లోపలి నిప్పు నిలుపరాదె" 19-421

ఇగురువెట్టు: స.క్రి. చిగిరించు.
"పగగొన్న మోహతాపము వేరుగ విజ్ఞాన
మిగురువెట్టక మానె నేఁటి బ్రదుకు" 1-156

ఇగో: అవ్య. 'ఇదిగో' అనే పదానికి వ్యావహారికరూపం. చూపుటను తెలిపే పదం.
"వీఁడిగో నిలుచున్నాఁడు విజయనగరములోన
వేఁడుకొన్న ప్రతాపానఁ బెద్దహనుమంతుఁడు"
3-519

ఇగ్గు: అ.క్రి; రా.సీ. మాండలికపదం. మిక్కిలి సంతోషించు, గర్వించు, బడాయిపడు (రా.సీ; మాం. 65 పు.) (ఇగ్గు = ఈడ్చు; ఇగ్గులాడు = అన్యోన్యమీడ్చుకొను అని ఆం.ధా.పా.)
"అగ్గమై శ్రీవేంకటేశ అన్నిటా గూడితి మిదె
యిగ్గుచు నుందము వెరపిఁక నేలయా" 20-600

ఇచ్చకాఁడు: (ఇచ్చ + కాఁడు) వి. కోరిక గలవాఁడు, కాముకుడు, ముఖప్రీతికి మాటలాడేవాడు.
"నీ యిచ్చకాఁడవు తొల్లే నీ వెవ్వతెవద్ద నున్నా
నాయమా నిన్ను దూర నడుమ నేను" 12-193

ఇచ్చకీఁడు: (ఇచ్చకము + ఈడు) ముఖప్రీతిని కలిగించే వాడు, కపటవర్తనుడు.
"చేకొని శ్రీవేంకటేశ చెల్లుఁజెల్లు యిది నీకు
యేకాలముఁ బాయకుమీ యిచ్చకీఁడా" 20-153

ఇచ్చకుఁడు: (9) వి. ప్రియవాది, నయవంచకుడు, ఇచ్చకాలమారి.
"ఆరీతి మాటాడఁగా ని న్నొగాదనరాదు గాక
కూరిమి నీపతి యిచ్చకుఁడె కాఁడా" 9-283

ఇచ్చకురాలు: (10) (ఇచ్చక + ఆలు) ప్రియవాదిని, నయవంచకురాలు, ఇచ్చకాలమారి.
"ఇచ్చకురాలను నీకు ఇట్టె నన్నుఁగూడితివి
పచ్చిగా నేల నవ్వేవు పంతగాఁడవా" 18-307

ఇచ్చలాడు: (4) (ఇచ్చలు + ఆడు) అ.క్రి. ఇచ్చకము లాడు, ముఖప్రీతిమాటలు పలుకు.
"తగవులు చెప్పలేను తగ నిచ్చలాడలేను
తగువైన వావులతో" 20-124

ఇచ్చలాడు: అ.క్రి. ఇష్టపడు.
"శ్రీవేంకటేశ నీవు చేరి నన్నుఁ గూడితేను
యీవల సవతులెల్లా యిచ్చలాడేవు" 27-214

ఇచ్చితే: అస.క్రి. ఇస్తే, అన్నమయ్య అంతటా 'ఇచ్చితే' అనే పదమే ప్రయోగించినాడు.
"వేడుకకత్తె యైనది వీడెము చేతి కిచ్చితే
తోడనే యందుట గాని తొలఁగరాదు" 12-80

ఇచ్చేయందుకు: (ఇచ్చే + అందుకు) ఇవ్వడానికి అనే అర్థంలో వాడబడే పదం. ఇచ్చేందుకు.
"దేవ నీ విచ్చేయందుకు దీనికిఁగా నింత యేల"
1-372

ఇట్టికపీట: వి. ఇటుకపీట.
"గట్టిగాఁబుండరీకుఁడు కడువేడుకఁ బెట్టిన
యిట్టికపీఁటపై నున్నాఁడీ విట్ఠలుఁడు" 2-217

ఇడియు: అ.క్రి. చీలు, భేదిల్లు.
"కడలేని పొలయలుకలచేతఁ దన దేహ
మిడియఁగ నిజసుఖ మెన్నఁడు" 1-352

ఇడుపు: వి. 1. గోడ, చిత్రరచనకు అనువైన వస్త్రాదికం 2. ద్వారప్రాంతం లోని గోడ.
"అదరి శ్రీవేంకటేశ అందుకే మమ్మేలితివి
ఇడుపుల నాకెమీఁద నెంత గద్దో వలపు" 13-175

ఇడుపునఁజేర్చు : *వి; ప.బం.* తమిళంలో ఇడుపు అంటే నడుమని అర్థం. కనుక ఇడుపునఁజేర్చు అంటే ఎత్తుకొను అని చెప్పవచ్చు.

"తొడిఁబడఁగూడితివి దొమ్మిరతిఁదేలితివి
యిడుపునఁజేర్చితి యీ మోహము" 14-255

ఇడుమపాటు : వి. కష్టము.

"పొడవైన మమతతోఁ బొదలఁబొదల మాన
మిడుమపాట్లఁబడె నేటి బ్రదుకు" 5-98

ఇడుమపాట్లఁబడు : అ.క్రి. కష్టాలు పడు, బాధలు పడు.

"పొడవైన మమతతోఁ బొదలఁబొదల మాన
మిడుమపాట్లఁ బడె నేఁటి బ్రదుకు" 1-156

ఇతవరి : (4) (ఇతవు + అరి) వి. హితం కోరేవాడు, మేలు కోరేవాడు, శ్రేయోభిలాషి.

"ఇతవరియైన కాంత యెరవులు సేయదు
సతమైన దేహుని నా చోల పట్టదు" 24-377

ఇతవరిది : (ఇతవరి + అది) వి. హితం కోరే స్త్రీ, మేలుకోరే స్త్రీ, శ్రేయోభిలాషిణి.

"ఎఱుఁగుదుఁ జెప్పవే నీ కితవరిదాన నేను
నెఱయా నీ సుద్దులివి నిన్ననే వింటిని" 28-536

ఇత్తడి దెచ్చి యపరంజిఁ జేయు : *ప.బం; అ.క్రి.* మూమూలు వస్తువును అమూల్యవస్తువుగా చేయు. చూ : ఇత్తడి బంగారు సేయు.

"ధరలోన నతిపాతకుని నన్నిట్టు
అరయ నిత్తడిఁదెచ్చి యపరంజిఁ జేసె" 1-282

ఇత్తడి బంగారు సేయు : *ప.బం; అ.క్రి.* మామూలు వస్తువును విలువైనదానినిగా చేయు.

"ఇత్తడి బంగారు సేయ నింతకు నేరుతునంటా
కొత్తేసేఁతలెల్లా దొరకొంటిగా నీవు" 1-360

ఇత్తల : (50) (ఈ + తల) అవ్య. ఈతల, ఇవతల, ఇటువైపు, ఈవల, ఇప్పుడు, ఈ పదం నిఘంటువుల్లో కానరాదు.

"ఇత్తల శ్రీవేంకటేశుఁడింతలోఁ దా వచ్చి కూడె"
22-292

"ఇత్తల నీవు నేను యిటు గూడిన కూటమి
చిత్తాన మఱవకుమీ చెలికాఁడ" 20-153

దీనివలెనె అత్తల, ఎత్తల అనే ప్రయోగాలు కూడా సంకీర్తనల్లో ఉన్నాయి.

ఇత్తలనత్తల : (2) ఇవతల అవతల, ఇటువైపు అటువైపు, ఇప్పుడు అప్పుడు.

"ఇత్తలనత్తల నీ వెందరిఁబెండ్లాడినా నీ
చిత్తము వచ్చినదే మించిన దేవులు"
12-202 & 1-448

ఇదేమే : (ఇది + ఏమే) ప.బం. చనవుతో అనేమాట. 'ఇది ఏంటి' అని వాచ్యార్థం.

"ఎన్నాళ్లకెన్నాళ్లు యిదేమే నీవు
విన్నపము లాలకించి విచారించేవు" 21-34

ఇదేసందుగా : *ప.బం; క్రి.విణ.* ఇదే అవకాశమని, అవకాశం దొరికింది కదా అని.

"ఇత్తలనేఁ బరాకైతే నిదే సందుగా నాతని
నొత్తేవు కొనగోర నొల్లనే నీవు" 22-194

"ఇరవై శ్రీవేంకటేశ యేలితి వీక నింతలో
సరులు దిద్దేవు యిది సందా నీకు" 28-302

ఇద్దరు ఇద్దరే : *ప.బం; వి.* అసాధ్యులు, అసామాన్యులు.

"ఇంక నేల రావయ్య యిద్దరము నిద్దరమే
సంకెదేరేఁ బనులెల్ల సరికి బేసాయను" 9-285

ఇనుపగుగ్గిళ్లు : *ప.బం; వి; బహు.* కొరుకుడు పడనివి, అసాధ్యములు.

"ఇందువల్ల నేమి గద్దు యినుపగుగ్గిళ్లింతే
ఇందిరారమణు సేవే యిరవైన పదవి" 2-268

"ఎనలేని బీరము లెండమావులు
ఇనుపగుగ్గిళ్లు నీ వేమి సేసేవే" 5-196

ఇనుపగుగ్గిళ్లు నములు : *ప.బం; అ.క్రి.* అసాధ్యమైన పనికి పూనుకొను.

"నానించినుప గుగ్గిళ్ళు నములుట బలిమిని
ధ్యానించి మనసుఁబట్టి దైవము సాధించుట"
2-49

ఇనుమారు : (ఇను + మారు) రెండు మార్లు.

"పువ్వుల చెండు వేసెఁ బొలఁతి ని న్నినుమారు

రవ్వలుగ నవి నీ వురమునఁ దాకె" 12-2

ఇనుమిక్కిలి : *ప.బం; అవ్య.* మిక్కిలి, అధికం, ఇబ్బడి.

"మంతుకు నేనెరిఁగిన మనసువాఁడవే నీవు
యింతనింత వొకటికి నినుమిక్కి లయ్యేది"
16-352

ఇనుము అడిచేవారికి తగరము అడుచుట తడవగునా! : నానుడి; కష్టమైనపని చేసేవానికి సులభమైన పని చేయడానికి ఆలస్యమౌతుందా? అని భావం.

"యెనలేక యెదిరికి యినుమడిచే వారికి
తన తగరమడువఁ దడవయ్యీనా" 3-161

ఇనుము గుడిచిన నీరు : (4) *ప.బం; వి.* వ్యర్థం, ఇంకిపోయింది. వేడెక్కిన ఇనుముపై చల్లిన నీరు వ్యర్థమే కదా!

"సడిఁబడి కుడిచిన కుడుపెల్ల నినుము
గుడిచిన నీరై కొల్లఁబోయె" 1-124

ఇనుము దాగిన నీరగు : *ప.బం; అ.క్రి.* వ్యర్థమగు.

"వూహల నా భోగమెల్లా వొళ్లఁబట్టె నంటా నుంటే
దాహముతోడ నినుము దాగిన నీ రాయఁగా"
3-41

ఇనుమున నిరిగిన నీళ్ళు : *ప.బం; వి; బహు.* లేనివి.

"మనసునఁదాగిన పాలివి మదిగల కోరిక లిన్నియు
యినుమున నిగిరిన నీళ్లు యిల నాహారములు"
2-133

ఇనుమున నిగిరిన నీళ్లు : *వి; బహు.* మిగులనివి.

"ఇనుమున నిగిరిన నీళ్లు యిల నాహారములు"
2-133

ఇమ్మఁడికి ముమ్మడి : *ప.బం.* అత్యధికం, రెండింతలకు మూడింతలు.

"ఏ మాయనే మీకు నేలె చింత
యీమేర వలపులు యిమ్మడికి ముమ్మడి"
7-519

ఇయ్యకతొల్లి : *అవ్య.* ఇవ్వకముందు; ఇవ్వకపూర్వం; వ్యతిరేక క్త్వార్థకం మీద ముందు, పూర్వం అనే అర్థాల్లో అన్నమయ్య అంతటా 'తొల్లి' అనే శబ్దాన్ని ప్రయోగించడం కనిపిస్తుంది.

"కప్పురమియ్యక తొల్లి కడు వేగిరము
నీకు అప్పుడె కాఁగిట నన్ను నప్పళించేవు"
6-211

ఇయ్యకొలుపు : *వి; స.క్రి.* అంగీకరింపజేయు, ఒప్పించు.

"కైకొని శ్రీవేంకటాద్రి ఘనుఁడిట్టె నన్నుఁగూడె
యీకడ యాతని నేల యియ్యకొలిపేరే" 7-39

ఇయ్యకోలు : (4) *వి.* సమ్మతి, మెప్పుదల.

"ఎరవులు లేక మరి యియ్యకోళ్లే కలితేను
గొరబుగాని యట్టి సిగ్గులే సుఖము" 21-66

ఇరవగు : (2) *అ.క్రి.* ఉండు, నెలకొను, స్థిరమగు.

"ఇరవాయ సూర్యచంద్రు లెదురు పారి"
15-118

ఇరవుకొను : (2) *ప.బం; అ.క్రి.* నెలకొను, స్థిరపడు, కలుగు, నివసించు.

"వేమరు శ్రీవేంకటేశు వెస నీవు గూడితివి,
ఈమెయి నలమేల్మంగ విరవుకోరాదా" 26-413

ఇరుమేలు : (11) *వి; బహు.* రెండువైపులు.

"వరుసతో నిద్దరికి వలపు పంచి పెట్టేవు
యిరుమేలా నీ యాస యెంతగలదయ్యా"
22-221

ఇరుమొనసూది : (8) *ప.బం; వి.* రెండువైపులా పదును గలది, సవ్యసాచి, రెండువైపులా తీక్ష్ణత గల సూది అనే అర్థంలో ఏర్పడిన పలుకుబడి.

"ఇచ్చట నన్నుఁ గూడితి విరుమొన సూదివైతి
విచ్చనవిడికాఁడవు వెర పేల యిఁకను" 7-457

ఇరువుకొను : *అ.క్రి.* 'ఇరవుకొను'కు రూపాం. నెలకొను, స్థిరపడు, ఆక్రమించు.

"సిరులు మించఁగ మించ శ్రీవేంకటేశుఁడు కూడి
యిరువుకోవలదా యిచ్చకము లిపుడు" 8-150

ఇఱ్ఱిదీము : వి. మృగతృష్ణ, ఎండమావి.
"వెఱ్ఱి దెలిసి రోకలి వెసఁ జుట్టుకొన్నట్లు"
"ఇఱ్ఱిదీముభోగముల సేసేము" 3-174

ఇఱ్ఱిదీము భోగములు : *ప.బం; వి; బహు.* చంచలమైన సుఖములు. (ఇఱ్ఱిదీము = మృగతృష్ణ)
"వెఱ్ఱి దెలిసి రోఁకలి వెస జుట్టుకొన్నట్లు
యిఱ్ఱిదీము భోగముల సేసేము" 3-174

ఇలువరుస : (2) *ప.బం; వి.* ఇంటివంతు, వంశానుక్రమం, కులమర్యాద, పాతివ్రత్యం, మంచినడత, అభిమానం.
"ఇలువరుస యెంచుక యిచ్చలో మెలఁగేఁగాక
చలములు తనతోను సాధించేనటే" 25-256
"యిచ్చకమెఱిఁగి తన యిలువరుస నెరపి
నిచ్చఁబతిఁ గూడినదే నెరవాది" 22-524

ఇల్లారు : వి. గవాక్షిని మూసే గంప (మాం.) ఇంటి పైభాగంలో ధాన్యం నిలువ చేసుకోవడానికి రాతితో కట్టిన కట్టు. గుడిసె, గొల్లెన, గడ్డితో చేసిన బుట్ట, వలయాకారం. రూపాం. ఇలారం, ఇల్లారం, ఇలవరం.
"ఎడయని పయ్యదనే ఇల్లారుగాఁ బెట్టి
కడలేని రతుల కంగాణింతువు రావయ్యా"
22-320

ఇల్లిందాకా : (ఇల్ల + ఇందాక) ఇంతవరకు.
"వెల్లువెత్తినప్పటి నన్నుఁ బిలువకురా నీవు
ఇల్లిందాకా కాఁకఁబెట్టి యిఁకనేల ప్రియము"
11-333

ఇల్లిటము : (28) వి. 'ఇల్లటము' నకు వ్యావహారికరూపం. ఇల్లఱికము. రూపాం. ఇల్లంటము, ఇల్లింటము, అల్లుడు అత్తవారింటిలో చేసే కాపురం (వ్యా.)
"చల్లనిచూపుల సతికి వలచిపోయి
యిల్లటమున్నవాఁ డీతఁడు" 5-296

ఇల్లిదె : (21) (ఇల్ల + ఇదె) *ప.బం.* ఇదివో, అల్ల వలె 'ఇల్ల' ప్రసిద్ధిని, నిర్దేశార్థాన్ని తెలిపే పదం. అల్ల అనే పదం అదె శబ్దానికి పూర్వమందువచ్చి అల్లదె అయినట్లుగా ఇల్ల అనే శబ్దం ఇదె శబ్దానికి పూర్వమందు చేరి ఇల్లిదె అని ఔతుంది.
"తొల్లి యెట్టుండునో తాను తుద నెట్టుండునో తాను
యిల్లిదె నట్టనడుమ నింతేసి మెరసీ" 2-380

ఇల్లు నింపు : *ప.బం; వి.* వధూవరుల నూతన గృహప్రవేశం.
"నేఁడే నాగవెల్లి నేఁడే యిల్లునింపులు
పోఁడిమి గోవిందపతి భోగించీ నిదివో" 20-558

ఇల్లుముంగిలి : (3) *ప.బం; వి.* 'ఇల్లు' అనే అర్థంలో పలుకుబడి.
"ఇల్లుముంగిలి చూచి యీ దేహులు వాని
నొల్లమనుచు రోసి వుడుగరు" 10-44

ఇల్లురికి : (4) (ఇల్లు + ఉరికి) *ప.బం.* అభిమానం లేక ఇల్లు వీడివచ్చి.
"ఇల్లురికి మాతో నేల యీసడించ వచ్చేవు
చెల్లు బడాతనిమీఁదఁజేయవే నీవు" 7-252

ఇల్లురికి పేరటము చెప్పు : *ప.బం; అ.క్రి.* పిలువని పేరటము అని ప్రయోగం.
"ఇల్లురికి పేరటము లేల చెప్పవచ్చేవే
పల్లదాన నీవు గొంత పైకొసరా" 2-331

ఇల్లులేని ముంగిలి : *ప.బం; వి.* అసంభవం, ఉండదనడం, ఇల్లు లేకుండా ముంగిలి ఉండదనే దానిపై ఏర్పడ్డ పదబంధం.
"వెల్లిగొను మమతపై విసిగేవు యీ
యిల్లు లేని ముంగిలి నీ వేమి సేసేవే" 5-190

ఇసిళ్ల పుట్టవెట్టు : *ప.బం; స.క్రి.* విపరీతంగా సంతానం కను .
"మదనజలంబుల కాలువ మాపెద్దల
పూర్వంబులు (?)
"పొదలిన పుత్రుల యిసిళ్ల పుట్టలు పెట్టెదము"
3-340

ఇసిళ్లు : *వి; బహు.* ఱెక్కల పురుగులు. వర్షంతరువాత పుట్టల్లోనుండి బయటికి వస్తాయి. కొంతసేపటికి రెక్కలు పోగా కేవలం

నేలపై పాకుతూ మరణిస్తాయి. పుట్టలవద్ద నిప్పు రగిలిస్తే పైకి వస్తాయి. ఉసిళ్లు అని కూడా అంటారు.

ఇసుకఁదాడు వేడు : (తాడు + పేడు) *ప.బం; అ.క్రి.* అసాధ్యమైన కార్యాన్ని తలపెట్టు, ఇసుకతో తాడు పేనడం సాధ్యం కాదనే భావంతో ఏర్పడిన పదబంధం.

"యెలయింపుమాఁటలనె ఇసుకఁదాడు వేఁడేవే

సొలపుఁజూపులనే సొక్కు చల్లేవు" 29-464

ఇసుకగుళ్లు : *వి; బహు.* ఒకానొక బాలక్రీడ.

"బాలులు యిసుకగుళ్లు పసఁగట్టు కాడినట్టు

వీలి వెఱ్ఱివాఁడు గంతువేసిన యట్టు" 2-37

ఇసుకతక్కరి : *ప.బం; వి.* ఇసుకతక్కెడ, (?) వంచకం, హద్దులేనిది.

"ఇసుకతక్కరి వంటి దీ వలపు

అసము దించక నవ్వే వది నే నెఱఁగనా"

27-340

ఇసుకదిబ్బెము : *వి.* ఇసుకతిన్నె, ఇసుకదిబ్బ, సైకతస్థలి.

"యింతలోనా పిరుఁదులు

యిసుకదిబ్బెములంటా

రంతులుగాఁ గడు నేల రాఁపుసేసేరే" 9-210

ఇసుకపాతర : (10) *ప.బం; వి.* ఎంతకూ తరుగనిది, అంతు లేనిది.

"క్రియ నిసుకపాతర కెల్లొత్తు నీ మాయ

జయమంది వెడలఁగ జనులకు వశమా" 3-347

ఇసుకపాతర దవ్వు : (2) *ప.బం; అ.క్రి.* వ్యర్థప్రయత్నం చేయు.

"తన వైరాగ్యము లేక తత్త్వము వెదకేనంటే

తనియ కిసుకపాఁతర దవ్వుటా" 15-106

ఇసుకమీఁదు : *ప.బం; వి.* నిలుకడ లేని స్థితి. (?)

"ఇంత చాలదా నీకు యిసుకమీఁదు లేలరా

చింతతోడ నుండఁగాను చిముడఁజేయ నేలరా"

17-467

"కొసరి శ్రీవేంకటేశ కూడితివి నన్ను నీవె

యిసుకమీఁదైన చేతలేల మరచేవు" 9-263

ఇసుమంత చెలమకు యేఁతము లెట్టుటా : సామెత; చిన్నదానికి పెద్ద ఏర్పాట్లా అని భావం. వ్యర్థమని తాత్పర్యం.

"పసగా కితనిఁ దన పనికిఁగాఁ బొగడుట

యిసుమంత చెలమకు యేఁతము లెట్టుటా"

15-106

ఇహపరము : (2) *వి.* ఇహలోకం మరియు పరలోకం.

"యిమ్మల శ్రీవేంకటేశుఁ డిచ్చినంతే యిహపర

మెమ్మెల నిది మరచి యేమరఁగ నేలో" 4-220

ఈ

ఈఁతకు మిక్కిలి లోతు లేదు : కష్టాలకు తలొగ్గిన తరువాత అవి ఎన్ని ఐతే నేమిటి? (ఈదడానికి సిద్ధపడిన తరువాత ఇక ఎంత లోతుంటే నేమి? అని వాచ్యార్థం.) చేతనైనవానికి అసాధ్యం లేదు. (పద.)

"ఈతకు మిక్కిలి లోతు యిఁక లేదు

బాఁతిపడనేమనఁగా భయమేల నీకు" 25-431

ఈఁతగాదు మోఁతగాదు : (?)

"ఈఁతగాదు మోఁతగాదు

ఇంతే లోతు మోహము" 26-66

ఈఁతలబంటి : తలమున్కలు, దుస్తరం.

"వలపు లీతలబంటి వాసులు రొమ్ములబంటి

సొలసితే మాటలు పుక్కిటిబంటి" 23-536

ఈఁతలు మోఁతలు : (3) *వి.* నానాబాధలు, ఛిన్నాభిన్నము, దుర్భరము.

"ఈఁతలుమోఁతలు నీకు యీడకు రాఁబొద్దు లేదు" 24-77 & 4-426

"ఈఁతలు మోఁతలు నిఁక నేలయ్యా" 9-35

ఈఁతలు మోఁతలు నగు : (2) *అ.క్రి.* చిన్నాభిన్నమగు, దుర్భరమగు, కష్టమగు.

"ఇదివో నీ సరసము యీఁతలు మోఁతలు నాయ" 25-292

"కాఁతాళించి చూచి నిన్ను గమ్మటి వేడుకొనీని

యీఁతలుమోఁతలు నాయ నింతి వలపు"

28-141

ఈఁత లేని చల్లులాట : *ప.బం; వి.* అసంభవం. ఈత లేకుండా జలక్రీడ కుదరదనే దాని నుండి వచ్చిన పలుకుబడి.

"పూఁతమాటల సొలపు బొంకులనే దూరేవు
ఈఁత లేని చల్లులాట యేమి సేసేవే" 5-196

ఈఁతామోఁతలు : వి. దుర్భరములు. (పద.)

"మోము లెత్తుకొనిందరు మోవితేనె లొసఁగేరు
యేమి సేసేవయ్య నీవు యీఁతామోఁతలు"
23-513

ఈఁతామోఁతా : *ప.బం; వి.* నానాబాధలు.

"ఏలే యింతేసి చేఁత యీఁతామోఁతా
వేళ వచ్చినదాఁకా వెరగులే చాలు" 26-55

ఈఁతో మోఁతో : ప.బం. సుద్దో మద్దో, నుయ్యో కొండో, కాయో పండో.

"అప్పుడు శ్రీవేంకట విభుఁడలరించె నిదె
ఇప్పుడె యీతని కృప యీఁతో మోఁతో" 5-341

ఈఁదాడంటే గోదాఁడను : (2) *ప.బం; అ.క్రి.* ప్రతిమాటనూ వ్యతిరేకించు.

"ఈఁదుకరమ్మనవే యిటు నన్నుఁజూచుఁగాని
ఈఁదాడంటే గోదాఁడనే యెడమాట లేఁటికి"
18-37

ఈఁదామోఁదా : ఇబ్బడి ముబ్బడి. (తె.జా.)

"మీఁద మిక్కిలి సన్నలు మీరే యెఱుఁగుదురు
ఈఁదామోఁదా మొక్కు మొక్కే మిదివో నేము"
13-119

ఈఁదులాడించు : స.క్రి. ఈతకొట్టించు.

"వొనరిన యారు పొంతనున్నవి వళితరంగాలు
యెనసె నీ వేడుకలు యీఁదులాడించవయ్యా"
29-139

ఈండ్లు : 'ఈడు'కు బహు. రూపం. సమానులు.

"భూసురుల కామినులు బోయల నాయకుల
జేసుకొని యీండ్లై చిచ్చురికిరి" 4 అను .77

ఈ(యీ)ద : వి. 1. ఈదగాలి 2. చలిగాలి.

"యీదచేత వానచేత నెల్లనాఁడుఁ బాయని
బాదచేత మేలెల్ల బట్టబయలై" 1-90

ఈకడాకడ : (ఈకడ + ఆకడ) ఇక్కడక్కడ.

"పైకొని శ్రీవేంకటేశ బలిమిఁగూడితి నన్ను
యీకడాకడి సుద్దులు ఇఁక నెంచనేఁటికి"
20-307

ఈకె : (ఈ + అక) వి. ఈమె: అక శబ్దంలోని కకారం మీది అకారం ఎకారంగా మారింది ; అన్నమయ్య 'ఈమె' అనే అర్థంలో ఈకె, ఈపె అనే శబ్దాలనే వాడినాడు. ఈమె అనే శబ్దాన్ని ఒక్కచోట మాత్రమే వాడినాడు. (16-326)

ఈటిసేయు : (?)

"దక్కె నీకుఁజాలదా తగు రుకుమిణి నీవు
వెక్కసాన యీటిసేసి వేసుకొన్నది" 9-25

ఈటు : (88) వి. 'ఈటు' శబ్దానికి నిఘంటువుల్లో వ్యర్థము, శూన్యము అనే అర్థాలు ఇవ్వబడ్డాయి. ఇవి అన్నమయ్య ప్రయోగాల్లో పొసగవు. ప్రయోగాలను బట్టి ఈ పదానికి వేడ్క, ఉత్సాహం, కుతూహలం అనే అర్థాలు చెప్పవచ్చునని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సూచించినారు. వీటితోపాటు బలిమి, దర్పం, అతిశయం అనే అర్థాలు కూడా చెప్పవచ్చు నని వేటూరి ఆనందమూర్తిగారు సూచించినారు. ఈడు, సమానం,సాటి అనే అర్థాల్లో కూడా ఈ పదానికి ప్రయోగాలు కనిపిస్తున్నాయి. మొత్తంపై ఈ పదానికున్న అర్థాలను ఈవిధంగా సంగ్రహించవచ్చు. అ. వేడ్క, ఉత్సాహం, కుతూహలం. ఆ. బలిమి, దర్పం, అతిశయం. ఇ. ఈడు, సమానం, సాటి.

అ. వేడ్క, ఉత్సాహం, కుతూహలం.

"నీటు లేమిటికి మీరు నెట్టనఁగూడితి రిట్టు
ఈటుతో మదనరాజ్యమేలఁగ రాదా" 18-318

"ఈటుతో బెండ్లాడితివి యిట్టె సేసవెట్టితివి"
11-412

"ఈటునం గాలు తొక్కేది యెన్నడే తాను
ఈటుతో శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి"
12-304

ఆ. బలిమి, దర్పం, అతిశయం :

"చీటికిమాటికిఁ దొల్లి చేసన్నకై వచ్చేవాఁడ
నీటున రాజసాన నీవెవ్వరిఁ గైకొనవు" 11-386
"తేటలుగా నీ నిజాలె తెలిసే చెలులకెల్ల
యీటుతోడి కుచ్చితాలు యిఁక నేలయ్యా"
14-157

ఈడు, సమానం, సాటి
"ఈటులేని శ్రీవేంకటేశుఁడేఁగీ నల్లవాఁడె
కోటానఁగోటి దాసుల కోరిక లీడేర్చేను" 3-274
"ఈటైన సవతులము ఇట్టె బుద్ధి చెప్పనేల
పాటించి మొగమోటానఁబైకొనేరుగాక" 28-415
సం.ప.స (సం.14) లో "ఈటు – ఇంత, అని కన్నడ మందర్థము. 'ఈడు' అను తమిళ శబ్దమునకు గౌరవము, తృప్తి, బహుమానము మొ॥ అనేకార్థములు గలవు. అని పేర్కొనబడింది.

ఈటుమీరు: ప.*బం;* అ.*క్రి.* కొలఁది మీరు. (క. ఈటు = ఇంత)
"నీటునఁదమి పెంచితే నెలకొనీ విరహము
యీటుమీరి జవ్వము యేమి సేతురా" 14-106

ఈటువెట్టు: (21) ప.*బం;* స.*క్రి.* సమానంచేయు, పోల్చు (పద.)
"పాటెల్లా నొక్కచో నుండు భాగ్యమొక్కచో నుండు
యీటువెట్టి పెద్దతనా లెంచఁబని లేదు" 2-182

ఈడ: (36) అవ్య. 'ఇక్కడ'కు వ్యావహారిక రూపం. రా.సీ. లోనూ, తెలంగాణంలోనూ ఈ పదం జనవ్యవహారంలో సర్వసాధారణం. అన్నమయ్య 'ఇక్కడ'కంటే 'ఈడ' అనే పదాన్నే పెక్కు పర్యాయాలు వాడినాడు.
"ఈడా నుండఁడు చూడ నింటనే వున్నాడు"
20-220

ఈడనాడ: (ఈడ + ఆడ) అవ్య. ఇక్కడక్కడ. రూపాం. ఈడాడ.
"యిటు నన్నుఁ గూడేవాఁడు యీడనాడ నేలుండునే
తటుకన తా నాకు దక్కవలదా" 20-117

ఈడాడ: (ఈడ + ఆడ) ఇక్కడక్కడ.
"పూనిన దిక్కుల గాలిపొందు నీడాడని
మానీన లోకమెల్లా మలయుగాక" 2-168

ఈడు: వి. 1. వయస్సు 2. సామ్యం, ఉద్ధి 3. యౌవనం, పెండ్లివయసు 4. తాకట్టు, కుదువ. పెండ్లిండ్లలో ధనరూపంగా ఇచ్చిన కానుక.
"ఈడుతో శ్రీవేంకటేశుఁడిద్దరి నొక్కటఁగూడె
మాడుపుటింటిలో సిగ్గు మాకేటికే" 27-127

ఈడు: వి. సామర్థ్యం.
"ఈడెఱుఁగక వేంకటేశుఁడ నిను(గొని
యాడుట యది నా యపరాధము" 1-271

ఈడుకు నీడు: అవ్య. సరిసమానం.
"సరుగ నీవు గూడఁగా చన్నుల నాపె నొత్తఁగా
ఇరవాయ సమరతు లీడుకు నీడు" 25-181

ఈడుజోడాడు: ప.*బం;* అ.*క్రి.* ఒకటినొకటి అతిశయించు, ఒకరిని మరొకరు మించు. (పద.)
"జాడతో శ్రీవేంకటేశ సరుసఁ బెండ్లాడితిని
ఈడుజోడాడినదాఁకా నియ్యకొనరాదా"
17-446

ఈడుజోడు: (43) వి. సమానము, వివాహానికి వధూవరుల అనుకూలత.
"ఆడ నీ వదినెయైతే ఆపె నీకు దొడ్డుగాక
ఈడుజోడు సవతులు యింత కోపఁగలరా"
26-245

ఈడుదోఁడు: వి. ఈడుజోడు.
"వేడుకకాఁడైన శ్రీవేంకటేశు నండ నన్ను
ఈడుదోఁడై యందలాన నెక్కించరె" 24-199

ఈడుపడు: అ.*క్రి.* సమానమగు, సరిపడు, కుదురు. ఆ పని యీడుపడ లేదని దక్షిణాంధ్రలో నేటికీ వ్యవహారంలో ఉన్నదట.
"ఈడుపడ నే నిన్ను నింతకంటె నే మాడేను
యేడ లేని యాసలు నీ వేల పెట్టేవిఁకను"
21-326

ఈడులువెట్టు : అ.క్రి. సమానం చేయు.
"ఈడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యీడు లేల వెట్టేవు యివ్వల నవ్వలాను"
19-159
"యీడులు వెట్టితినా యెరుక సేసుకొంటా"
18-483

ఈడువెట్టు : (4) స.క్రి. సమానంచేయు. (పద.)
"బారెడేసి నా నెరులపాటి వాపె నెరులును
యేరీతి నుండీనో ఇప్పు డీడువెట్టుమా" 25-53
"ఇంతలో మీ చక్కదనా లీడువెట్టి చూచేవాఁరు
చింతదీర మమ్ము సంతోషించనేరదా"
"సరుగు సూడిగముల సతు లీడువెట్టుక
పరఁగఁబొత్తు గూడఁగాఁబడరాదు గాని" 12-251
"చక్కని కన్నుల సూర్యచంద్రులుగాఁగలవాఁడు
ఎక్కడుగా కిందటిలో నీడువెట్టేవా" 3-45
"వీడని చుట్టరికము వెంటవెంటఁ దగులఁగా
ఈడువెట్టి మా పొందుల కేకరఁగ వలెనా" 27-73

ఈడేలు : *ప.బం; అ.క్రి.* సఫలమగు, కృతార్థుడగు.
"నీ కథలు విని మే మీడేరితిమి" 6-161

ఈణెమెట్టు : వి. వీణెమెట్టు; వీణె సరకట్టు; ఈణె అనేది వీణెకు జానపదవ్యవహారరూపం.
"మిక్కుటమై కేల యీణెమె ట్లెగముట్టెఁగాని
ఇక్కువ నీ సుద్దులకు నేమీ ననదు" 26-540

ఈతల : (9) అవ్య. (ఈ + తల) ఇవతల, ఇవలిభాగం.
"రాతిరేది పగలేది రమించు సాత్వికులకు
యీతల నింతా వెలుఁగింతే కాక" 4-9

ఈతల నాతల : అవ్య. ఇవతల అవతల, ఇటూ అటూ.
"ఆతఁడు నీవును నేకమైనట్టే వుందురుగాక
యీతల నాతలా బింకాలేల దూసేరే" 7-80

ఈతల బాయట : ఇవతలా బయటా.
"పోతరము గలదంటా పొలఁతుల సిగ్గులు
ఈతల బాయట వేసే దెందైనాఁగలదా" 28-188

ఈత లేని చల్లులాట : *ప.బం; వి.* అసంభవం.
"పూఁతమాటల సొలపు బొంకులనె దూరేవు
యీఁతలేని చల్లులాట యేమి సేసేవే" 5-196

ఈద : వి. చలిగాలి; శ.ర.లో అరసున్నతో కూడిన ప్రయోగం ఉంది.
"ఈదచేత వానచేత నెల్లనాఁడుఁ బాయని
బాదచేత మేలెల్ల బట్టబయలై" 1-90

-ఈని : తద్ధర్మార్థకక్రియాప్రత్యయం. కొసరీని, వచ్చీని, పోయీని మొ॥

ఈపు : ఇది 'ఈవు' కావచ్చునేమో!
"పైకొన నేరిచితేను పాయమే బంగారుకొండ
యీకడ మెచ్చనేర్చితే యీపు సంజీవి" 29-6 (అను)

ఈరసపు సంసారము : *వి.* ఈర్ష్యగల సంసారం.
"ఈరసపుసంసార మింగలము దగిలించి
యేరుదాఁటిపోయె నెటువంటి జాణే" 1-173

ఈరసము : (2) వి. 1. ఈర్ష్య 2. ద్వేషం 3. కోపం 4. చలం, పట్టుదల, మాత్సర్యం.
"చేరువ నే నున్నదాన చేతిలోనిదాన నింతే
యీరసానఁగాదనే వా రెవరయ్య నిన్నును"
7-540

ఈరసించు : (2) స.క్రి. అసూయపడు, ఈర్ష్యపడు, కోపించు (తె.వ్యు.కో.)
"నేరుపులెల్లా దక్కె నెయ్యయములు దలకెక్కె
ఈరసించి తోడివారు యేమి గట్టుకొనేరే"
19-177

ఈరికెలెత్తు : *ప.బం; అ.క్రి.* 'ఈరిక'కు రూపాం. మొలకలెత్తు.
"యెలమిఁగోరికలై యీరికెలెత్తె నవే
బలుపంట లిఁక నీ భాగ్యము కొలఁదయ్యా"
11-442

ఈరుదియ్యఁబేను వచ్చు : (10) సామెత; కొంచెం కదుపగా పూర్తిగా కదలు, ఒక ప్రత్యవాయాన్ని తొలిగించుకొనే కోరికతో ఆ ప్రయత్నం చేయగా అంతకన్న పెద్దదే సంభవించడం, తీగె కదిపిన డొంకంతా కదలు, ఈరు దీయుటకు తలను

దువ్వినపుడు ఈరుతో పాటు దువ్వెనకు పేలు కూడా వస్తాయనే దానినిబట్టి ఏర్పడిన పదబంధం.

"సారెకు నాకెకుఁగా బాసలు దానే సేయరాఁగా
ఈరుదియ్యఁబేను రాక యేల మానునే"

11-446

ఈరెండ : వి. (ఈరు + ఎండ) లేఁత ఎండ, కొద్దిపాటి ఎండ.

"పొదలు రతికాఁకలు పొద్దులువొడచి వచ్చె
ఇదివొ తమకమున నీరెండలు గాసెను" 7-450

ఈలకఱచు : ప.బం; అ.క్రి. దేనికోసమో ఎదురు చూడు.

"గాలపుఁజిక్కుల కర్మపుతొడసుల
యీల కరచే మే మొకో" 10-5

ఈలకూరకు నుప్పడుగు : ప.బం; అ.క్రి. అవసరం లేనిదాన్ని అడుగు ; ఈలకూరలోనే చాలా ఉప్పు ఉంటుంది. మళ్ళీ ఉప్పు అడగటం అనవసర మన్నమాట.

"తలఁపులో నీవలె తాలిమి మా కున్నదా
వొలసి యీలకూరకు నుప్పడిగేవారము" 8-131

ఈలకూర కుప్పు చాలదు : అనవసరంగా తప్పుపట్టే సందర్భాలలో వాడబడే పలుకుబడి. అసలు ఈలకూరలోనే ఉప్పు ఉంటుంది. అది చాలకపోవడమనేది ఉండదు.

"ఏల నాతోఁగరాళించి యిది (చేనిది) వో తప్పు
యీల కూరకుప్పు చాల దిది వో తప్పు" 7-272

"చాలుఁజాలు ననరే సాదించ మమ్మింత యేల
ఈలకూర కుప్పు చాల దిందేమి గలదు"

21-532

ఈలకూర కుప్పులు : ప.బం; వి; బహు. అనవసరమైనవి.

"నాలుకతుదలే నయములు తన
ఈలకూర కుప్పు లింతే లే" 17-422

ఈలకూర కుప్పువేయు : ప.బం; అ.క్రి. అనావశ్యకమైనది చేయు, వ్యర్థప్రయత్నం చేయు ; ఈలకూర ఒక ఉప్పని కూర. ఆ కూరలోనే ఉప్పు ఉంటుంది. మళ్లీ దాంట్లో ఉప్పువేయడం అనవసరం కదా !

"వేళ లేదు పొద్దు లేదు వేగిరించీ నింతలోనే
ఈలకూర కుప్పు వేసే నిటుండి రమ్మనవే"

20-162

ఈలకొను : అ.క్రి. ప్రాణములు ఉగ్గబట్టు, బిగియబట్టు, ఈలకఱచు.

"యీలకొని మాయామృగ మెమ్ముల
నొరసినమ్ము
రాలించె నుత్తరగోపురముపై గొడగులు" 3-133

"ఈలకొన్న యెముకల యింటిలో
కాపురమింతే" 3-334

ఈవల : వి. ఇహలోకము.

"శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
ఈవలేది యావలేది యితని దాసునికి" 2-19

ఈశ్వరేశ్వరుఁడు : వి. ప్రభువులకు ప్రభువు.

"ఈశ్వరేశ్వరుఁడు యితఁడు దివిజులకు
శాశ్వతమూరితి జగములకు" 4-19

ఈసడము : వి. నింద, దూఱు, ఈసడింపు.

"లాసిన శ్రీవేంకటేశు లాగు లెల్లఁ గనుఁగొని
యీసడము దీర వురమెక్కనైతినా" 9-32

ఈసమంత : అవ్య. 'వీసమంత'కు జానపద వ్యవహారరూపం, కొంచెం.

"రాసికెక్కఁగదె యీ కరతలు
యీసమంతైనా వొద్దే యీ వెతలు" 28-573

"బాసిచ్చిన శ్రీవేంకటపతిఁ గూడి పంగింతురా
యీసులు వాసులు సేసు కిచ్చకము లాడవే"

25-447

ఈసులు వాసులు : (2) ప.బం; వి; బహు. నిందలు - పొగడ్తలు అనే అర్థంలో వాడబడే పదబంధం.

"ఈసులు వాసులు మాకు నేల రేఁచేవు
నీ సూటికి రాని సేఁత నేము సేసేమా" 27-359

ఈహీ : అవ్య. ఎగతాళితో నవ్వుటకు అనుకరణశబ్దం.

"ఈహీ శ్రీహరిఁగంటే యింత లేదుగా వట్టి
దాహపుటాసల వెట్టి దవ్వుటింతే కాకా" 2-69

ఉ

ఉంకు : అ.క్రి. 1. పైకెగయు 2. భయపడు 3. పూను.
"సంకె లేక నిన్ను మరి సాదించదగవా
ఉంక నీవు చెప్పినట్టొడఁబడెఁగాక" 18-327

ఉంకువ : వి. అల్లుడు కన్యక కోసం మామగారి కిచ్చే శుల్కం.
"యింకనైతే బిగువూ యియ్యకొంటే తగవు
ఉంకువాయ మీకు సెలవుల నగవు" 20-233

ఉంగరపువేలు : (16) వి. అనామిక, చిటికెన వ్రేలి ప్రక్కవేలు.
"చెంగటఁబెండ్లాడుతాను శ్రీవేంకటేశుఁడు దానే
వుంగరపువేలు చూపి వొద్దికయ్యీని" 13-128

ఉంగిటఁగలుగు : (?)
"కుంగేటి భోగములకుఁ గొనచింత
వుంగిటఁగలిగె మాకు నోహో చింత" 4-48

ఉంగిటి : కపటం.
"పంగించి మా నెరులివి బారెఁడేసి ఆయ
వుంగిటిగా సారె నేల వుప్పతించే నంటారే" 9-210

ఉంగిటిబతుకు : కపటపు బ్రతుకు.
"వోడుపోయినట్టి వుంగిటి బతుకుల
యీడగిలఁబడే మేమెుకో" 10-5

ఉంగిటిమెచ్చులు : వి; బహు. పెదవుల మెచ్చులు, కపటపుమెచ్చులు, మెరమెచ్చులు, పైపై మెచ్చులు.
"కొంగువట్టితే వలపు కుప్పపడదూ!
నీ వుంగిటి మెచ్చులనే వుట్టిపడదు" 21-8

ఉంగిటిమేను : కపటపు శరీరము.
"కొంగువట్టి తియ్యగాను కోమలి మేను మరచి
వుంగిటి నీ మేని మీద నొరగున్నదా" 11-300

ఉంగిడి : పశురోగము (నాము) అని శ.ర. ఇక్కడ దాని గౌణార్థముగ బాధ, తొందర – అనవచ్చును అని సం.ప.స. కాని ఈ అర్థం అంతటా సరిపడదు.
"రంగుగ శ్రీవేంకటేశ రాజువలె నుండుగాక
వుంగిట నిన్నుఁగూడితే వురమెక్కించేవా" 26-6
"వుంగిటిగా నెవ్వతో నీ వురమున నెత్తి నాకె
యెంగిలిగందాలు నాపై నేల పూసేవు" 20-461
"వుంగిటి దీరఁగ సెలవుల నవ్వేనట కా" 20-459
"ఉంగిటిగా నాపె నేల వొరసేవు నీవు" 21-263 & 15-210
"ఉంగిటిగా రతుల ని న్నోలలాడఁ జేసెను" 29-275
"అంగడివారెల్లా నిన్ను నంటఁగాఁగిలించి రంటా
వుంగిటిగా నే నిన్ను నొత్తుకోలు సేతునా" 13-116

ఉంగిలి : కపటం.
"కొంగువట్టి తియ్యకుర కూచున్నదాని నన్ను
ఉంగిటి నేనోప నొళ్ళు నొచ్చీని" 11-265

ఉంచము : వి. విలాసం, ఉచ్చస్వరం, High note. క. ఉంచ = విలాసం. సం.ప.స. లో "ఉచ్చ' శబ్దమునకు 'ఉంచ' అని కన్నడ రూపమును కిట్టెల్ ఇచ్చినాడు. దీని తెలుగురూపము ఉంచము ; ఉంచమున – ఉంచాన కావచ్చును. హిందీలోని ఊంచ్ కూడ నిదే కావచ్చును. పెద్దగా అని అర్థము. 402 పాటలోని ఉంచవు కూడ ఉంచ+ అవు అని కావచ్చును" అని పేర్కొనబడింది. (13సం. 1.వ అని. 2.పు.) ఈ రెండర్థాలు సందర్భాను గుణంగా చెప్పుకోవచ్చును.
"ఉంచాన గతి (?) గతుల నూదేవు
తుత్తురుఁగొమ్ము
అంచలఁదాళము గూడె నదె వినవయ్యా" 13-207
"ఉంచపు నీ జంకెనల వొరయకు మమ్మును" 14-417
"ఉంచానఁ బయ్యెద జారనొగి విరులు గోసిటి
చంచని తా లేచి వచ్చి సరిఁగాఁగిలించెను" 9-67

"ఉంచముగాఁ బిలిచితే నూఁకొనుటే తప్పు
ఇంచుకంత మతిలోన నీసడించే చోటికి"
21-466

"అంచ తుంబరునారదాదు లదె
మంగళపాటకులు ఉంచానఁబాడేరు"
15-201 & 15-67

ఉంట : (ఉండు + ట) వి. ఉండటం.
"వురముపై నుంటే కాని వువిద ప్రాణము నీపై
గరిమల శ్రీవేంకటవిభుఁడు" 24-17

ఉంట : వి. ఉండ.
"గుబ్బలపై గందము గొప్ప వుంట సేసి యింత
వుబ్బుచు నిన్ను వేయఁగా" 12-430

ఉంటవిల్లు : (8) వి. ఉండవిల్లు, వడిసెల. రూపాం. ఉండవిలు, ఉండేలు. చిన్న పంగలకఱ్ఱకు చర్మపు వారో, తాడో కట్టి, దానిలో గట్టిగా ఎండబెట్టిన మట్టి ఉండలు పెట్టి పక్షులు మొ॥ వానిని కొడతారు. నేడు దీనిని 'ఉండేలు' అని అంటారు. పిల్లకాకి కేం తెలుసు ఉండేలు దెబ్బ" అని నానుడి.
"కోమలి నిన్నుఁబాసి కోవిలకూతలు విని
వేమరు కోపాన వుంటవింట వేసీని" 7-422
"ఉంటవింటఁ గప్పురాన నుబ్బి నన్ను నేసేవు"
5-72

ఉండఁబట్టు : (11) మాం; అ.క్రి. 'ఉండబట్టదా' అని నఞర్థకంగా ప్రయోగింపబడుతుంది. ఉండబట్టదా అంటే కాలక్షేపం కాలేదా ? ఊరకే ఉండలేవా అని అర్థం. ఈ అర్థంలో ఇది నేటికీ రా.సీ. వాడుకలో వినిపిస్తుంది.
"పట్టపుదేవుల భావ మెల్లా నీ సొమ్ము
వొ ట్టేల పెట్టుకొనేవు వుండఁబట్టదా" 18-307
"చిప్పలవంటి కన్నులు చేరడేసి కలవంటా
వుప్పటించీ దనకేమి వుండబట్టదా" 14-364

ఉండవి : క్రి. 'ఉన్నవి' కి గ్రామ్యరూపం. 'ఉండాయి' అని కూడా రా.సీ. వ్యవహారం.
"చేతిమీదనే వుండవి చేకొను నా మొక్కులెల్లా"
14-85

ఉండితే : (52) అస.క్రి. ఉంటే, ఉండినచో. అన్నమయ్య ఒక్కచోట తప్ప (25-436) అంతటా 'ఉండితే' అనే పదమే ప్రయోగించినాడు.
"మేరతో నుండితేనే మెచ్చనిదానవా" 26-481
"అడఁకువ నుండితే అలిగినదాననా" 26-481
"ముంగిట నుండితేఁజాలు మోహమెల్లా
రేఁగును" 27-190

ఉండినట్టే ఉండు : ప.బం; అ.క్రి. మార్పు లేకుండా ఉండు.
"యెడనెడఁ జేదు గాదు యింతలోనే తీపు గాదు
వొడలితోడవే యివి వుండినట్టే వుండును"
9-252

ఉండుండి : ప.బం. ఒక్కసారిగా.
"ఉండుండి చెలులఁ బిలిచే వొద్దికి నీవు
దండిగా నాతఁడు తానె తలుపు మూయఁగను"
14-384

ఉందాన(వు) : వి. ఉన్నదాన(వు) అనే అర్థంలో వాడబడిన వ్యావహారికరూపం. 'ఉందాన'(వు) అనే పదం వ్యస్తంగానే కాక ఉంచుకుందాన, పట్టుకుందాన మొ॥ సమస్తరూపాల్లో కూడా ప్రయోగింపబడింది. 'ఉందాన'తో పాటు 'ఉన్నదాన' అనే రూపానికి కూడా ప్రయోగాలు విరళంగా కనిపిస్తున్నాయి.
"ఒంటి నీ కెదురు చూచి వుందాన నేఁ
నింటిలోన సిగ్గున నుందానఁ జుమ్మీ" 7-531

ఉంది : 'ఉండు' ధాతువు అమ; ఏ.వ; క్రి. రూ. 'ఉన్నది'కి వ్యావహారికరూపం.
"ఉన్నతి రెప్పలతుది నుంది మోహము
ఓటలేక పెదవుల నుంది మోహము
ఒక్కటై దేహముమీఁద నుంది మోహము"
27-272

ఉంబడిపొత్తు : వి. ఉమ్మడిపొత్తు.
"వోపనన్నఁబోనీడు వుంబడిపొత్తుల చేతుల
మోఁపవచ్చీ నాకు చాల మొక్కినాను
మానఁడు" 26-149

ఉం(వుం)బళి : వి. పన్ను లేక అనుభవించే వస్తువు. (శ.ర.)
"జ్ఞానమే మాకు ధనము సర్వవేదములు సొమ్ము
పూనిన వైరాగ్యమే వుంబళి మాకు" 3-63
"యెంచి నడచేకాలమే యిందరికి నుంబళి
తెంచి మెచ్చుకుందు లిందు దెలుప నేమున్నది" 2-310
"పంచిన భూకాంతపతిఁ బాయక సేవించరో
వుంబళ్ళు వూళ్లు నిచ్చే వున్నతుఁడు నీతఁడే" 4-238

ఉంబళి : వి. పన్నులేని అగ్రహారాదికం.
"ఎంచి నడచేకాలమే యిందరికి నుంబళి" 2-310

ఉక్కఁబట్టు : *ప.బం; స.క్రి.* వదలు. (శ.ర.)
"వుక్కఁబట్టి వుట్టిమీఁద నునిచి రోలుదీసె
చొక్కి తా నెందున్నాఁడో చొప్పు ఇదే కంటిమి" 2-166

ఉక్కళము : వి. శత్రువులు ఎత్తిరావడాన్ని తెలుసుకోవడానికై ఉంచే కావలి, కోపురం.
"ఒక్కట మీ రిద్దరు అహోబలేశ
వుక్కళమై కాచుకుండహోబలేశ" 21-202

ఉక్కిపోవు : అ.క్రి. నశించిపోవు, గాలి లేక తపించు, నలిగిపోవు.
"ఆనకమై నవ్వవేమె అంగన నీ నగవులు
పూని నీ కుత్తికెలోన వుక్కిపోవుఁజుమ్మీ" 15-26

ఉక్కిస : వి. పొడిదగ్గు, దగ్గు, శ్వాసబాధ.
"వుమురఁబెట్టఁగ నట్టె వుక్కిస కూడా యేమి
తమకము చెల్లఁబెట్టి దగ్గరి రమ్మనవే" 8-57

ఉక్కుఁబదనులవారు : *వి; బహు.* ఉక్కువంటి వాడి గలవారు. (పదను = వాడి)

ఉక్కుగుబ్బలు : వి. ఉక్కువలె కఠినమైన స్తనాలు.
"చిక్కని చెమటల జేరులు వారఁగ
వుక్కుగుబ్బలను వొత్తీఁ జెలి" 16-429

ఉక్కుగోరు : వి. ఉక్కువలె వాడియైన గోరు.
"చెక్కులఁజెమట గారె శింగరి నీ
వుక్కుగోరు సోఁక నీకు వో శింగరి" 7-315

ఉక్కుమీరు : *ప.బం; అ.క్రి.* ప్రబలు, అతిశయించు.
"చక్కనివాఁడ మరి చంద్రసూర్యనేత్రుఁడవు
వుక్కుమీరి నీ వెట్లా నుండినా నమరును" 8-202

ఉక్కురాతి గుండె : వి. మిక్కిలి కఠినమైన హృదయం.
"ఊరకే కరఁగునా వుక్కురాతి గుండె నీది
సారెకు విన్నవించఁగా సమ్మతించితివి" 23-485

ఉగము : వి. ఆయువు, ఊపిరి, నిట్టూర్పు.
"వూరు దిప్పినట్టి యాస వుగము దిప్పిన యాస
చేరవచ్చి దైన్య మందించిన యాస" 4-456

ఉగాదిపండుగ : వి. నూతన సంవత్సరాది పండుగ, చైత్రశుద్ధ ప్రతిపదనాడు చేసుకునే పండుగ.
"వున్నతి నొక నిమిష ముగాదిపండుగ సేసె
తన్నుఁదానె తనలోని తమకానను" 11-184

ఉగ్గళించు(1) **:** 1. కౌఁగిలించు 2. పెంచుఁ (వా.ని.) నట్టువుఁడు కొలిపించు (శ.ర.)
"నిగ్గుదేర మెచ్చుకొంటా నీ నాటకసాల చూచి
వుగ్గళించి తాళములొత్తీ సతి" 29-26

ఉగ్గళించు(2) **:** స.క్రి. వచించు.
"ఒల్లనే సతులు దన్ను వుగ్గళించి పొగడఁగా
కొల్లలాడీ వలపులు కోడతిరునాళ్ళు" 14-240

ఉగ్గువ : (?)
"యెగ్గు లేదు తగ్గు లేదు యిఁక నీ దాసులలోన
వుగ్గువ లేని ప్రసాదమూనినది వొడల" 9-171

ఉట్టిఁగట్టు : స.క్రి. దూరంపెట్టు, అపహాస్యం చేయు.
"రారాదా యిఁకనైనా రమణి పానుపుపైకి
వూరనిచ్చి విరహము వుట్టిఁగట్టేవా" 7-401

"పట్టకింత మా చెఱఁగు బాఁపఁడా నాఁడె
వుట్టిఁగట్టితివి కులమో బాఁపఁడా" 6-90

ఉట్టిఁబెట్టు : స.క్రి. దూరంపెట్టు, వదలిపెట్టు.
"ఉద్దండపు నీ చేఁతలు వుట్టిఁబెట్టవయ్యా" 21-91

ఉట్టికెక్కు : ప.బం; అ.క్రి. కూలఁబడు. (పద.) రూపాం. ఉట్లెక్కు.
"ఉట్టికెక్కు నీ సిగ్గులు నో బావ" 17-231

ఉట్టిగొట్టు : ప.బం; అ.క్రి. గోకులాష్టమినాడు ఉట్టిని వేలాడదీస్తూ, లాగుతూ ఉండగా దానిని కొట్టు; చూ : ఉట్లుగొట్టు, ఉట్లపండగ.

ఉట్టిపై చెరలాటము : ప.బం. వి. నిప్పుతో చెలగాటం వంటిది. ఉట్టిమీద నిలచి ఏమాత్రం కదలినా కిందపడతారు.
"ఉట్టిపై చెరలాట మూరఁబొత్తుల కూడు
పట్టు చాలని కొమ్ము బహునాయకము" 1-71

ఉట్టివడు : ప.బం; అ.క్రి. అకస్మాత్తుగా వచ్చు.
"హరి ఉట్టివడి కావకున్న
నొచ్చెము దేహికి హరి" 3-369

ఉట్లపండుగ : (3) వి. గోకులాష్టమి (కృష్ణాష్టమి) పండుగకు జానపదుల వ్యవహారం. ఈ పండుగనాడు ఉట్లను వ్రేలాడదీస్తూ పైకి లాగుతూ ఉండగా వాటిని కొట్టుతారు. దీనిని బట్టి ఈ వ్యవహారం. నునుపైన స్తంభం కొనలో రూకలసంచి ఉంచుతారు. దానినెక్కి తీసుకోగలిగిన వ్యక్తిదే ఆ సొత్తు. కాని ఆతడు పైకెక్కుతూ ఉంటే నిరోధిస్తూ వసంతపు నీళ్ళు అతనిపై చల్లుతుంటారు.
"పచ్చిదేరుచు నుట్లపండు గాయను
గచ్చులకు గొల్లెతలు కాఁగిలించి పట్టఁగా" 3-150

ఉడయవరు : వి. శ్రీమద్రామానుజాచార్యులు; నిత్య విభూతి (వైకుఠం), లీలా విభూతి (సంసారం) ఈ రెండిటిని తన అధీనంలో ఉంచుకొన్న అధికారి అని అర్థం. ఒడయవర్ అనే ద్రావిడ పదంనుండి ఏర్పడ్డ పదం.
"ఉన్నతోన్నతుఁడు వుడయవరు
యెన్న ననంతుఁడే యీ యుడవరు" 15-220

ఉడయవర్లు : చూ : ఉడయవరు.

ఉడికినందుమీఁదట వుప్పు చల్లినట్లు : ప.బం; అ.క్రి. అసలే బాధలో ఉండగా మరింత బాధ పెట్టినట్లు.
"ఉడికినందుమీఁదట వుప్పులు చల్లినట్లాయ
యెడయెడ నీ చేఁతల కేమనేము నేము" 21-88 & 27-87

ఉడికిపడు : ప.బం; అ.క్రి. ఉలికిపడు.
"ఉడికిపడే విదేమే వూరివారితో నవ్వితే
విడువ కెవ్వరికైనా వేడుక లేదా" 11-324

ఉడిగట్టు : ప.బం; స.క్రి. ఒడిగట్టు. (?)
"ఒనర నీ రతులకు నుడిగట్టఁజేసినది
వెనువెంటఁదిరిగే నా వేడుకే కాదా" 27-106

ఉడిబడిపనులు : ప.బం; వి; బహు. చిల్లరపనులు, చిలిపిపనులు, (f.n) చిన్నాపెద్దా పనులు.
"పక్కనే నీ కుడిబడి పనులెల్లాఁ జెప్పిని
గక్కక నిన్నెంత యేలుకొన్నదో కాని" 29-406

ఉడిబడివారు : (ఉడి + బడి + వారు) ప.బం; వి; బహు. ఉపద్రవకరమైన పద్ధతి కలవారు. ఉడి =, to burst, to crack, to split, to break ఇత్యాదిగా కిట్టెల్. బడి - పద్ధతి. ఉపద్రవకరమైన పద్ధతి కలవారు కావచ్చు. తాత్పర్యార్థం దుర్జనులు, చిల్లరవారు.
"అడుగఁదగినవాఁడు అన్నిటా నుదారివాఁడు
వుడిబడివారి నేల నొల్లనివాఁడు" 22-121
"ఊరకే లోనౌదువా వుడిబడివారి కెల్ల
మేరమీరి యాపెనే మెచ్చవలెనయ్యా" 25-424

ఉడిబడి సుద్దులు : వి; బహు. చిల్లర సుద్దులు.
"ఉడిబడి నీ సుద్దులు వూరెల్లా నాడుకొంటే
తడయక నేనందు కుత్తర మియ్యఁగలనా" 19-227

ఉడివోవు : (ఉడిగి + పోవు) ప.బం; అ.క్రి. 1. నశించు 2. వ్యర్థమగు 3. విచ్ఛిన్నమగు 4. తొలగు (తె.వ్యు.కో.)
"వుడివోవు కోరికలు వొదుగదు కోపము

కడుఁదాకా నీ మహిమ కాదనరాదు" 3-200
"వుడివోని జవ్వనము వొడలిపైఁ బెట్టుకొని
పడఁతికి నలుకలు పాటించఁజెల్లునా" 16-26

ఉడుకు : వి. 1. అంతస్తాపం, విచారం 2. బాధ, పీడ 3. వేడి, ఉష్ణత.
"నెరజాణ విన్నిటాను నీ వేడ నేనేడ
వులిసినమీఁద నింక వుడుకులు నా" 7-302

ఉడుకులు గట్టు : *ప.బం; అ.క్రి.* మనస్తాపం కలిగించు, బాధలు కలిగించు, కోపాలు చూపు (?)
"ఊరకున్నవానిమీఁద నుడుకులు గట్టేమా"
14-27

ఉడుకెత్తు : *ప.బం; అ.క్రి.* బాధపడు, తాపం చెందు, వేడెక్కు.
"బత్తితోడ నీపై నాపె పక్కనఁ బన్నీరు చల్లె
ఒత్తిన విరహాన నీ కుడుకెత్తెను" 13-428

ఉడుపా : వి. కానుక.
"వుమ్మగిలి సింగారాలు వుడుపా వట్టుకున్నది
తమ్మిమోము సూడిదెగా దాఁచుకున్నది"
28-359

ఉడుబడి పనులు : చిల్లరపనులు.
"చెమ్మఁజెమటలతోడ చేసన్న సేసే నలల
పమ్మి మాకు నుడుబడిపనులు చెప్పేవు"
13-257 old

ఉడ్డగచ్చకాయలు : వి. ఒకానొక క్రీడ.
"వుదుటునఁబారిపారి వుడ్డగచ్చకాయలాడీ
ముదము దొలఁకఁగాను ముద్దుకృష్ణుఁడు"
4-172

ఉత్తరాలాడు : *ప.బం; అ.క్రి.* సమాధానాలు చెప్పు.
"నీడ నున్న రమణుని నింద లిందరాడఁగాను
యీడ నీ వుత్తరాలాడ కెందు వోతివే" 8-136

ఉత్తలము : వి. కలఁత, తారుమారు, తత్తరపాటు, బెదురు, భయం, త్వర, వేగిరపాటు, సంక్షోభం, పరితాపం.
"ఉత్తలాన నేడనైనా నుండుదువో యని
బిత్తరముగాఁబెట్టితి పెట్టరాని యాన" 5-60

ఉదటు : వి. నిఘంటువుల్లో కానరాదు. ఇది 'ఉదుటు' కావచ్చు. ఉదుటు అంటే ఉద్ధతి, పరాక్రమం, గర్వం, స్థైర్యం, అందం, అతిశయం. విణ. గర్వించేవి అని (ఆం.వా.)

ఉదయచందురుఁడు : వి. ఉదయించే చంద్రుఁడు. కేవల సంస్కృత పదానికి తద్భవంతో సమాసం. 19-80 & 7-223

ఉదారికాఁడు : (ఉదారి + కాఁడు) విణ. ఔదార్యం కలవాడు. ఉదారి శబ్దంపై స్వార్థంలో కా ప్రత్యయం; ఉదారుడనే అర్థంలో ఉదారి శబ్దం విలక్షణం. చూ : ఉదారివాఁడు.
"........ వొనరిన వరముల వుదారికాఁడు
చెల్లుబడి వీ(వాఁడు) గదే శ్రీవేంకటేశుఁడు"
23-92

ఉదారివాఁడు : (ఉదారి + వాఁడు) ఔదార్యం కలవాడు, ఉదారుడు, వింత ప్రయోగం.
"అడుగఁదగినవాఁడు అన్నిటా నుదారివాఁడు
వుడిబడివారి నేల నొల్లనివాఁడు" 22-121
ధర్మివాచకమైన 'ఉదార' శబ్దాన్ని ఉదారిగా మార్చి దానిపై వాడు అని చేర్చి ప్రయోగించడం వింత. చూ : ఉదారికాఁడు.

ఉదాసీనము : వి. ఉదాసీనత, ధర్మవాచకానికి బదులు ధర్మి వాచకాన్ని ప్రయోగించడం అన్నమయ్యకు అలవాటే.
"చీకాకుమై చూచి వుదాసీనము సేయనేర్తునా"
9-94

ఉదియగొను : *ప.బం; స.క్రి.* ఆరంభించు.

ఉదుటిహము : వి. వేదన కలిగించే ఇహలోకం.
"ఉదుటిహముఁ బరము నొక్కయందె తగులు
అదె శ్రీవేంకటపతి యంతరాత్మ తగులు" 1-471

ఉదుటు : వి. 1.ఉద్ధతి, పరాక్రమం, గర్వం, స్థైర్యం, అందం 2. ఉద్ధతం 3. సుందరం 4. అతిశయం విణ. గర్వించేది (ఆం.వా.)
"ఊర కేల దాఁచేవు వుదుటు నీ చేతలు
యే రీతి నీ వుండినాను యెవ్వ రేమనేరు"
19-285

"ఉదుటుల పోతరాలు వుడివోని కాతరాలు
అదన నన్నియు నీకు నమరీని నేడు " 28-80

ఉద్దండము : (28) వి. సాహసం, అఘాయిత్యం, 'క్రమశిక్ష' అనే అర్థంలో సారంగపాణి ప్రయోగం. 2-279

"బుద్ధులెఱుఁగుదు నంటా పొరుగుపోరచి యంటా
ఉద్దండానఁ జన్నులంటీనో యక్కరో వీఁడు "
7-96

"రట్టు సేసే నీ వుద్దండా లిట్టే ఇంతటా నిండె
నెట్టుకొని బాసడుగ నాతో నేల ఇఁకను " 13-535

ఉద్దండీఁడు : (4) (ఉద్దండము + ఈఁడు) వి. సాహసి, ఉద్దండుడు. "ఉద్దండ భావార్థమై మతుబర్థమున 'ఈడు' వచ్చుట వింత" అని సం.ప.స. కాని ఇట 'ఉద్దండ' అనే విశేషణవాచకంపై 'ఈ' స్వార్థంలో వచ్చినదని భావించాలి. మతుబర్థంలో కాదు.

"వుద్దండీఁడవు నీ వైతే వొంటి నున్నదాన నేను
అద్దో నీ వేమి సేతువో అత్తింటికోడలు " 27-557

ఉద్దగళలు : *వి; బహు.* పొడుగువెడల్పులు; ఇట అంతటను అని అర్థం.

"కూలిన తలలును గుజ్జుపుడెక్కలు
నేలపై కూరిన నెత్తురులు
వోలిఁజూడు డిదె వుద్దగళ లీ రణ
కేలిని విష్వక్సేనుఁడు గెలిచె" 2-108

పై కెగసిన కళలు అని సంపా.

ఉద్దగిరికృష్ణుఁడు : వి. నెల్లూరుజిల్లా ఉదయగిరి తాలూకా యే ఉద్దగిరి. ఈ గ్రామసమీపంలో ప్రాచీనమైన కృష్ణదేవాలయ మున్నది. ఇందు వెలసిన కృష్ణుడే ఉద్దగిరికృష్ణుడు.

"ఉవిదలాల చూడరే వుద్దగిరి కృష్ణుఁడు
నవకపు నెలవుల నవ్వుచున్నాఁడు" 3-235

"చూడ చిన్నవాఁడు గాని వీడు సుద్దులైతే వేవేలు
వింతలు సేసే వుద్దగిరి కృష్ణుఁడు"
21-278 & 16-432, 433

ఉద్దపు నడపులు : వి. చెప్పుతోడి నడకలు.

"ఉద్దపునడపుల లోపల నొయ్యన పాదము జారిన
నొద్దికతో నునుఁగౌఁగిట నొరసిన చందములు "
5-360

ఉద్దవిడి : *ప.బం; అవ్య; ద్రు.* 1. శీఘ్రంగా, వడిగా, వెంటనే 2. మిక్కిలి, అత్యంతం. రూపాం. ఉద్దవడి. 10-272(ఊర్ధ్వపిడి గాదగునని శ్రీరాళ్లపల్లి వారు పేర్కొన్నారు)

"వుద్దవిడి లంకఁజొచ్చి వుంగరము సీతకిచ్చి
అద్దివో రాము మెప్పించె హనుమంతుఁడు "
4-272

ఉద్దాలు : (5) *వి; బహు.* చెప్పులు.

"మెల్లనే వుద్దాలు మెట్టి మీరిన తురుము వెట్టి
తెల్లని ముత్యాలు గట్టి తిరుగకువే" 5-270

కుచ్చుటుద్దాలు అని శు.స.

ఉద్దాలువెట్టే యాపె : వి. చెప్పులందించే (చెప్పులు తొడిగే) సేవకురాలు.

"వుద్దాలువెట్టే యాపె వూడిగము సేయఁగాను
వొద్దఁగూచుండు మనుచు వొడివట్టేవు" 7-171

ఉనుకులు : 'ఉనికి'కి బ.వ; రూపం కావచ్చు.

"నిన్నటి వునుకుల నీ జాడలెల్లఁ గంటిమి
అన్నియు నాతో నీ వాడవలెనా" 23-592

ఉనుకొను : అ.క్రి. 'ఉండుకొను'కు రూపాంతరమేమో? విలక్షణప్రయోగం.

"వొడఁబరచఁగనేల వునుకొను చక్కనైతే
అడియాలములు మేను లమరుఁగాక" 27-332

ఉనుచు : స.క్రి. ఉంచు, పెట్టు.

"వుడివోక తారుమారై వునిచిన వుంగరాలు
తడఁబడీ వేళ్లను తా నెరఁగఁడా" 8-278

ఉనుచుకొను : స.క్రి. 1. ఉంచుకొను 2. నియమించుకొను 3. స్థాపించు, నెలకొల్పు; ఉంచుకొను అనే రూపానికి 'ఉనుచుకొను' అనేది విలక్షణరూపం.

ఉనుపుఁ జేఁతలు : *వి; బహు.* (?)

"పెనగుచు నీ విట్టి ప్రియములు నెరపేవు

వునుపుఁజేతల వూటుకూరి చెన్నరాయ" 16-24

ఉన్నకాలము : వి. వర్తమానకాలము.

"చన్నకాలమున నున్నకాలమున

నున్నవాఁడు యీ వుపేంద్రుఁడే" 3-289

ఉపకారుఁడు : విణ. ఉపకారం చేసినవాడు. 'ఉపకారి' అనడానికి బదులు 'ఉపకారుడు' అని ప్రయోగించడం విలక్షణం.

"నారాయణుఁడున్నతుఁ డచ్యుతుఁడుప

కారుఁడు శ్రీవేంకటవిభుఁడు" 3-529

ఉపజిహ్వ : వి. కొండనాలుక.

"వున్నతి నీ కడకు రాకున్న కాళ్ళు మరగాళ్లు

సన్నుతి సేయని జిహ్వ సరి నుపజిహ్వ " 2-450

ఉపద్ర : వి; రా.సీ; మాం. ఉపద్రవం, ప్రమాదం; 'ఏమమ్మా ఉపద్రా, ఏమిగతి' అని ఈనాడు రా.సీ. ప్రజల్లో వాడుకలో ఉన్నదని అ.సం.సా. రా.సీ.మాం. లో పేర్కొబడింది.

"కతకారి నిన్నుఁజూచి కడుఁ జలములెక్కినను

పతిభక్తిసేయంగ ఉపద్ర రాదు గదా" 3-10

ఉపమ : (24) వి. 1. ఉపాయం (2. పోలిక 3. పోల్చదగిన చంద్రాది 4. ఒక అర్థాలంకారం)

"సర్వేశ్వరా నీకు శరణు చొచ్చితిమిదే

వుర్విలోన నే మెంచే వుపమ లేమున్నవి "

3-159

ఉపమకెక్కు : అ.క్రి. నేర్పుకెక్కు.

"తానై శ్రీవేంకటేశ వొత్తగిలి పవ్వళించేది

వోవరిలో నిది యొక వుపమకెక్కె" 23-352

ఉపమించు : స.క్రి. పోల్చు.

"రపమై శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితివి

వుపమించి చూడనింతా నొక్కటే వలపు" 11-7

ఉపరతి : వి. పురుషాయితం అనే రతిభేదం.

"నీలమేఘమువంటి నీపై నా కుచగిరు

లోలి నుపరతియందు నొగి వాలె నేఁడు "

24-148

ఉపరిసురతము : వి. పురుషాయితమనే సురతభేదం.

"చక్కఁగా నీ దొడ్డ రాజసపు దొరతన మెల్ల

తక్కినా వుపరిసురతమే చూపీరా" 22-43

ఉపలాలించు : స.క్రి. ఉపలాలన చేయు.

"కొమ్మ గడు జవరాలు కోమలపుమేనిది

నెమ్మది నుపలాలించి నెయ్యము చూపరాదా "

29-307

ఉపారము : వి. 1. కానుక, ఉపాయనం 2. నైవేద్యపదార్థం (వ్యు.)

"పలుకుఁదేనియల నుపార మియ్యవే" 5-221

ఉప్పటెంచు : అ.క్రి. 'ఉప్పతించు'కు రూపాం. ఓర్వలేనితనం చేత ఆడిపోసుకొను, దృష్టి తాకునట్లు నుతించు. 5-56

ఉప్పడము : వి. అవబోధం, మేలుకోవడం.

"ఉప్పడమయి దేహమనే వూరఁ బెద్దచావడి

ఉప్పతిల్లి దేహి కొలువున్నపుడు " 2-124

ఉప్పతించు : (ఉప్పత + ఇంచు) ఓర్వలేనితనం చేత ఆడిపోసుకొను, దృష్టి తాకునట్లు నుతించు.

"ఉప్పతించి దూరఁగానె వొద్దఁ గూడుచుండి నాతఁడు

పిప్పిగట్టె సిగ్గులతోఁ బెనఁగేవే" 9-1

"చూచినవారెల్ల నన్నే సొరిది నుప్పతింతురు

మా చనవు చెల్లించి మన్నించరాదా" 18-19

"ఉప్పతించి మమ్ము నేల వోవలు వేసేవు "

26-208

ఉప్పతింపు : (2) వి. అపనింద, రద్ది, రట్టు, ఓర్వలేక నిందారోపణం చేయు.

"బద్దుల కాంతలకు వుప్పతింపులే మించెను "

27-481

ఉప్పమ్మఁగొందరు చిట్లు మోయఁగొందరు : నానుడి. పెద్దపనికి కొందరు - చిన్నపనికి కొందరు; కొందరు ఉప్పు అమ్మితే కొందరు చిట్టు (తవుడు కలిసిన నూక) అమ్ముతారని వాచ్యార్థం.

"జిగి నుప్పమ్మఁగొందరు చిట్లు

మోయఁగొందరు

నగు నీతో సరసమరగదు మాకును" 14-429

ఉప్పరాలు : (?)

"అప్పటి మానవే నీవు అతనిఁగాననివేళ
ఉప్పరాలై (?) అగ్గళ్ళు వురికినదానవా"
17-109

ఉప్పరాలెగయు : అ.క్రి. పైకెగయు, అతిశయించు.

"యెప్పటికెప్పటి సుద్దు లేమోయి నీపై
నుప్పరాలెగసీఁ జన్ను లేమోయి" 7-250

ఉప్పరిగె : వి. 'ఉప్పరిగ'కు వ్యావహారికరూపం. 1. పై అంతస్తు 2. సౌధం 3. మేడ.

ఉప్పవడము : (3) వి. మేల్కోవడం, అవబోధం. రూపాం. ఉపవడము అని శ.ర. ఒప్పువడము, ఉప్పడము. ఉప్పవడము - విశ్రాంతి చెందుట, సుఖశయనము అను నర్థమున తాళ్ళపాక వారి ప్రయోగము లున్నట్లున్నవని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాసియున్నారు. ఇది నిద్రకును, లేచి యుండుటకును నడిమి దశ కావచ్చు. పరుండి మేల్కొని యుండుట - వెన్ను వాల్చి - అనగా సుఖశయనమున విశ్రాంతి గొనుట" అని వేటూరి ఆనందమూర్తిగారు తెలిపినారు. (సం.వా; పద; భాషా. 434పు)

"ఉప్పవడము గావయ్యా ఉయ్యాలమంచము మీఁద
దప్పిదేరు తన మోముఁ దమ్మితోడ నిదె వీఁడె"
6-102

"దప్పిదేరు తనమోముఁ దమ్మితోడ నిదె వీఁడె
వుప్పవడముగఁ బాదాలొత్తరమ్మ" 5-338

ఉప్పు చింది యినుమడగు : ప.బం; అ.క్రి. కొంత నష్టమైనట్లు కనిపించినా దానివల్ల మరింత లాభం కలిగే సందర్భంలో ఉపయోగించే పలుకుబడి. 'ఉప్పాలికి ఇమ్మడి అయినట్లు' అని కూడా వ్యవహారం.

"ఉప్పు చింది యినుమడాయ నందురు"
16-547

"యెందువోయీ నింతలోనే
నుప్పు చింది యినుమడీఁగాకా" 9-128

ఉప్పులో కప్పురమేల : నానుడి. ఒక దానిలో దానికి సాటి గాని వస్తువు వుండడమనే భావాన్ని తెలియజేసే నానుడి.

"ఒప్పుగ నాకెను నన్ను నొకటి సేయఁబనిచీ
వుప్పులోఁ గప్పురమేల వొద్దమ్మా" 7-309

ఉప్పువేసి పొత్తు గలియు : (2) ప.బం; అ.క్రి. కొద్ది వస్తువును త్యాగం చేసి గొప్పలాభాన్ని పొందడానికి ప్రయత్నించు.

"వినరె మొటల నుప్పు వేసి పొత్తు గలసీని
పెనఁగి యెక్కడనైనా పెద్దబావఁగారు" 11-355

"పోనిపోని వుప్పువేసి పొత్తు గలియవచ్చీని
నేనోపఁగా యింతేసికి నిద్దుర వచ్చీని" 9-138

ఉప్పువేసి పొత్తు గూడు : (2) ప.బం; అ.క్రి. చూ: ఉప్పువేసి పొత్తు గలియు.

"కందువ లంటుచు నిన్ను కాఁగిట నించఁగాను
పొందుల నుప్పువేసి పొత్తు గూడేవూ" 11-423

ఉప్పువేసి పొత్తులు : ప.బం; వి; బహు. కొద్దిగా శ్రమపడి పెద్ద లాభాన్ని పొందడం.

"యీ లాగులే యిందరికి యీఁదులాడే నీటిలోని
వోలలాయ నిదివో నీ వుప్పు వేసి పొత్తులు"
21-340

ఉప్పాలి కినుమడగు : (4) ప.బం; అ.క్రి. కొంతనష్టమైనట్లు కనిపించినా దానివల్ల మరింత లాభం కలిగే సందర్భంలో వాడే పలుకుబడి. చూ: ఉప్పు చింది యినుమడగు.

"వులిపచ్చి వలపుల వుప్పాలి కినుమడైతే
ములుగములుగ నిట్టె వేఁగే నిపుడు" 20-478

"అప్పటికప్పటి మాటలంటి మింతే
వుప్పాలి కినుమడాయ నూరకే వుండవయ్యా"
9-168

ఉబ్బరి : (4) (ఉబ్బు + అరి) 1. పొగరుబోతు, గర్వి 2. సంతోషి (వ్యు; వా.ని.) పొగడ్తలకు పొంగిపోయేవాడు, ఏదైనా చేసేవాడు అని అ.సం.సా; రా.మాం. (పుట. 14)

"ఊరివారి నెల్లా మెచ్చే వుబ్బరికాఁడవు

కారణము లేకే వచ్చే గండికాఁడవు" 24-324
"గబ్బి నా నోరను నిన్నుఁ గరకు లెల్లా నాడక
ఉబ్బరివై తిట్టకేల వుండేవు నీవు" 22-345
"పట్టినాఁడు చక్రము ఉబ్బరి కాలనేమి మీఁద"
15-208
"గబ్బియైన యాటది గక్కనఁ గౌఁగిట నించు
ఉబ్బరియైన యాఁటది వొడివట్టును" 2-334

ఉబ్బరికత్తె: (ఉబ్బు + అరి = ఉబ్బరి; ఉబ్బరి + కత్తె) సంతోషం కల స్త్రీ, గర్వం కల స్త్రీ.
"గుబ్బలు నీ సారెలంటాఁ గూడి పట్టే వౌనంటే
వుబ్బరికత్తె యనుచు నుప్పటించరా" 12-399

ఉబ్బరికాఁడు: (5) వి. (ఉబ్బు + అరి = ఉబ్బరి; ఉబ్బరి + కాఁడు) గర్విష్ఠి, సంతోషి, పొగడ్తలకు పొంగిపోయేవాడు, ఏదైనా చేసేవాడు అని రా.మాం. (పుట 15)
"నవ్వులెన్ని నవ్వినాను నసుపు సేసుకొనీని
వువ్విళ్లూరి జడియఁ డుబ్బరికాఁడు" 25-305
"గబ్బి నా నోరను నిన్నుఁ గరకు లెల్లా నాడక
ఉబ్బరివై తిట్టకేల వుండేవు నీవు" 22-345

ఉబ్బరిచిత్తము: వి. గర్వం కల చిత్తం.
"వొగరు వీడెపుమదము వుబ్బరిచిత్తపు మదము
బిగియనేఁటికి నీకుఁ బ్రియమౌనో కాదో" 14-53

ఉబ్బరితనము: (ఉబ్బరి + తనము) వి. 1. సంతోషం, ఆనందం 2. గర్వం
"ఉబ్బరితనములకు వోపేవాఁడవు గనక
గొబ్బున నన్నేలి యీకెఁ గొలిపించితివి"
25-440
"నేరుపునఁ జెమటతో నిలువునఁ గొలువుసేసి
వూరఁబోసేఁ దమకము లుబ్బరితనానను"
28-104

ఉబ్బరిమందు ముద్ద: వి. చంద్రుడు. ఉబ్బుగా పైకి వచ్చిన ఓషధీశుడు, అమృతకిరణుడు అని వ్యుత్పత్తి.
"కూడపెట్టి దాఁచినట్టి కూడేటి బుద్ధి
ఓడక జలధిపాలి వుబ్బరిమందుముద్ద" 27-549

ఉబ్బసపోక: (ఉబ్బసము + పోక) వి. అలసిపోవడం.
"వుబ్బసపోక నేనే వుస్సురంటి నొకమాఁట
గొబ్బుననుఁ దనమీఁది కోపమా యిది" 19-507

ఉబ్బసపోవు: అ.క్రి. అలసిపోవు.
"వురుమున నీకెంత వుబ్బసపోకుంటెను
అరుదుగాఁ బడగసా లాడుదము రమ్మా"
21-344

ఉబ్బు: వి. 1. సంతోషం 2. ఆధిక్యం 3. విజృంభణం 4. ఉత్సాహం 5. ఉబ్బటం 6. వ్యాధివిశేషం 7. జనశ్రుతి 8. గర్వం
"గబ్బితనొలొద్దుఁ గాని కదిపి వినయముతో
వుబ్బురేఁ చూరక పాదాలొత్తఁ గదవే" 28-87

ఉబ్బుసగ్గులు: వి; బహు. హెచ్చుతగ్గులు. "కలిమి గలదని వుబ్బవలదు, కడగి లేదని సగ్గవలదు" అని అన్నమయ్య ప్రయోగం.
"యేతుల వుబ్బుసగ్గులు యిలమీఁద నాతనికి
చైతన్య మెప్పుడీతఁడు సింగారవిభుఁడు గాని"
3-114
"నెలవై ఉబ్బుసగ్గులే నిచ్చలు లోటును బాటు
బలువైన యాశే బడబాగ్ని" 2-56

ఉమరఁబడి: వేడిమి.
"అమరఁగ నంతలో వాయవ్యాస్త్రి మేయఁబోలు
వుమరఁబడి నిట్టూర్పులొగి రేఁగెను" 7-407

ఉమరఁబెట్టు: స.క్రి. మగ్గఁబెట్టు.
"జమళి నింతి చన్నుల సాములు సేయఁగరాదా
వుమరఁబెట్టి వలపు వొడి నించుకొనేవా" 7-401

ఉమి నాకే చవుతాలు: ప.బం; వి. 'ఉమ్మినాకి చవిచూచుట' అని సంపాదకులు భావించినారు. శృంగారం పరమావధి కాదనటం.
"వో యయ్యా యిదియెల్లా వుమినాఁకే
చవుతాలు
చాయల శ్రీ వేంకటేశు శరణను జీవా" 2-157
"లేవే నేఁబిలిచితే లెక్కసేసీనా తాను
చావివోయ వుమినాకి చవుతమా ఇఁక" 26-61

ఉమురుఁగూటము : (ఉమురు + కూటము) వి. ఈ పదం ఏ నిఘంటువుల్లోనూ లేదు. తమిళంలో ఉమరి, ఉమిరి అంటే నత్త కనుక దీనికి నత్త గుల్ల గుంపు అని అర్థం కావచ్చునని ఊహింపబడింది. (సం.ప.స. 14సం.) కాని ఈ అర్థం ప్రయోగాల్లో పొసగడంలేదు. 'ఉమురు' పదానికి ఉక్కబోయు అనే అర్థం పొసగుతుందేమో? ఉమురుఁగూటము అంటే ఉక్కబోసే కూటమి అని అర్థం. ఉమురు వెన్నెల అనే చోట కూడా ఉమురు అంటే ఉక్కబోయు అని అర్థం.

"ఉమురుఁగూటాన నా వొడిపట్టి పెనఁగేవు
చమురు చిందీ నోయి జగడగాఁడ" 7-474

"తమక మెటువంటిదో తలపోత వలపులు
వుమురు కూటములై వున్నవి లోలోనను"
14-448

"అమర శ్రీవేంకటేశ ఆపె నింతకుఁ దెచ్చితిమి
ఉమురుకూటపు నిన్ను నొడఁబరచేదా" 25-350

ఉమురువెన్నెల : వి. ఉక్కబోసే వెన్నెల; విరహులకు వెన్నెల ఉక్కగా ఉండడం సహజమే.

"వుమురువెన్నెలకు గాకూహింతు నిన్నుఁ బైకొన
భ్రమసి నీవే నేనని భావించి వూరకుందు"
12-190

ఉమ్మ : వి. 1. ఉక్క, వేడి 2. దుఃఖం.

"కొమ్మా నీ కురులు చూచి గుంపుఁదుమ్మెద లనుచు
ఉమ్మలూర మదిలోన నులికెనయ్యా"
10-2-105

ఉమ్మగాలి : వి. వేడిగాలి.

"ఉమ్మగాలి విసరఁగా నొంటి నే బండితి నింతే
అమ్మరో నీతోనే నలుగఁజుమ్మీ" 21-494

ఉమ్మగించు : స.క్రి. ఆవిరిచే ఉక్కవెట్టు, ఉక్కగానుండు.

"నిండుఁబరితాపమున నీలపు మఙలమేడ
నుండరాక దేహమెల్ల నుమ్మగించరాదా" 6-75

ఉమ్మడివయసు : వి. యౌవనం. (?)

"నమ్మికలలోనివే నానాఁటి వొడఁబాట్లు
ఉమ్మడివయసులోనే వొద్దికలెల్లా" 21-103

ఉమ్మదము : వి. ఉమ్మ, ఊష్మము, ఉక్కపోయడం.

"విడువదు మదము విరహమే ఉమ్మదము
జడిసే నా మేన నిదె సరినేమి సేతునే" 27-35

"కలువ కనుచూపులఁ జలువలు చల్లవే
తలపోఁత వుమ్మదాల దైవార నేఁటికే" 27-576

ఉమ్మల మోనము : వి. (?)

"వుమ్మలమోనానఁ బతికుండెఁగా నా నగవు
అమ్మరొ యాతఁడు మాటలాడినదాఁకా" 9-52

ఉయ్యాలగంభము : వి. తిరుమలలో స్వామి యెదుట ఏర్పాటుచేసిన ఉయ్యాలస్తంభం, డోలోత్సవం జరిగే ప్రదేశం కావచ్చు. ఇట తమకు కలిగిన సంతానాన్ని ఉయ్యాలలో వేసి స్తంభానికి కట్టి స్వామికి సమర్పించి మరల స్వామికి ధనమిచ్చి ఆ సంతానాన్నే కొనుక్కునే ఆచారం ఉండేదట. 5-172

"జనులు నమరులును జయలిడఁగా
ఘనుఁడదె వుయ్యాలగంభముకాడ" 1-320

ఉయ్యాలపిన్నది : వి. చిన్నవయస్సుగల బాలిక. ఉయ్యాలలో ఊగే వయస్సుగల బాలిక అని వ్యు.

"చెయ్యారాఁగూడిన శ్రీవేంకటేశుఁడే కదే
వుయ్యాల పిన్నదానవా వొదగె నీ చన్నులు"
29-261

ఉయ్యాలమంచము : (14) వి. గొలుసులు మొ॥ వాటి ఆధారంగా ఊగే మంచం.

"కొయ్యతనము నిట్టె కోనేటిరాయనిఁ గూడి
వుయ్యాలమంచము మీఁద నోయమ్మా"
5-328 & 6-102

ఉరికివచ్చు : అ.క్రి. పఱుగెత్తుకొనివచ్చు.

"ఇల్లురికివత్తురా యెవ్వరైన సవతులు
మెల్లమెల్లన నీవు మేకులేల సేసేవే" 7-431

ఉరిసిన పుండుపై పుష్పులు వెట్టు : (2) *ప.బం; అ.క్రి.* అసలే బాధపడుతున్నవారికి మరింత బాధ కలిగించు, గోరుచుట్టుపై రోకటి పోటు వంటిది.

"ఒప్పులర మా వురిసిన పుండ్లు
ప్పులు పెట్టించె నుద్ధవుఁడా" 5-56

ఉరిసినమీద ఉడుకులు : *ప.బం; వి; బహు.* (?)

"నెరజాణ విన్నిటాను నీ వేడ నే నేడ
వురిసిన మీఁద నింక వుడుకులునా" 7-303

ఉరిసినయందు (పుండు) పై నుడుకు చల్లు : *ప.బం.* అసలే బాధపడుతుండగా మరింత బాధ కలిగించు; గోరుచుట్టు పై రోకటి పోటు వంటిది. 'ఉరిసినపుండుపై పుష్పులు చల్లు' కూడా ఇటువంటిదే.

"పన్ని ఉరిసినయందుపై నుడుకు చల్లినట్లు
యెన్న మాతో మేకు సేసే విఁక నేలయ్యా" 9-33

ఉరుఁదాళ్లు : *వి; బహు.* పాలు పితికేప్పుడు ఆవుకాళ్లకు కట్టే తాళ్లు, బంధములు.

"ఉదుటుఁగాంక్షలలోని వురుఁదాళ్ళే కావా"

ఉరుకు : *అ.క్రి.* 1. పరుగెత్తు 2. వెలికివచ్చు 3. దుముకు, అతిశయించు.

"సుదతి నిన్నుఁ జూచె చూపులు" 21-391
"సంతసాన నిన్నుఁజూచి సరసమాడి నంతలో
దొంతుల కురుకఁడుగా దొరకొని మరుఁడు" 9-7

ఉరుటుఁబాయము : (ఉరుటు + పాయము) గట్టిప్రాయం, యౌవనం (?), పొంగువయసు.

"పరగ తురుము జారె పచ్చిపులకలు మీరె
వురుటుఁబాయము సతి కొమ్మదాయను" 26-4

ఉరుటు : *విశ.* దృఢమైంది, గట్టిది. క. ఉరట, ఉరటు, ఉరుటు, ఉంగరము, కంపితస్వరము అని వా.ని.

"ధరఁబశుపక్షి మృగాదులు తగతోఁబుట్టుగులు
వురుటగు మా దేహంబులు వుయ్యేలతొట్టెలలు"
"వురుటై యలమేల్మంగ నురమున నించుకొని
యిరవై శ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు" 2-231

ఉరుత : *వి.* 'ఉడుత'కు రూపాం. ఉఱుత అని శ.ర.

"నీకుఁ దొల్లే యలవాటు నిరుహేతుకపు దయ
జోక నురుత మెచ్చిన సులభుఁడవే కా" 3-451

ఉఱక : 'ఉఱు' ధాతువు వ్యతిరేకక్త్వార్థక రూపం; లక్ష్యపెట్టక.

"మఱియు సురతపుఁజెమటలు జొబ్బిలఁగాను
వుఱక నాపైఁ బూసేవు వుద్దండాలా వోరి"
11-373

ఉఱిమిచూచు : *ప.బం; స.క్రి.* కోపంతో భయపెడుతూ చూచు.

"కొప్పు జారెనంటేను కొచ్చి యేల నవ్వీనే
వుప్పతిలీఁ గళంటే వురిమి యేల చూచీనే"
28-126

ఉఱుట్లు : పరిభ్రమణములు.

"వెఱచి బ్రహ్మాదులు వేదమంత్రముల నీ
వుఱుట్లు గొనియాడేరో చక్రమ్మా" 1-183

ఉలికి కాలఁగ కొఱవుల జూడినట్లు : మొదటనే ఒకబాధలో ఉండగా మరల తీవ్రమైన మరొకబాధ కలిగినట్లు.

"యెలయించి యితఁడు నన్నేల యేఁచీనే
మలినమై దేహమెల్ల మఱచినఁ దలఁపించి
వులికి కాలఁగఁ గొఱవుల జూడినట్లు" 6-167

ఉలిపచ్చి : (5) *విశ.* కొంచెంపచ్చి; నులిపచ్చి అని కూడా వ్యవహారం.

"వులిపచ్చి తలపోఁత లుమ్మగిలి వుమ్మగిలి
చెలికిఁ జుట్టరికమై చిగిరించెను" 27-594

ఉలివచ్చి : (7) (ఉలి + పచ్చి) కొంచెం పచ్చి; ఉలిపచ్చి, నులిపచ్చి అని కూడా వ్యవహారం.

"యెలమి శ్రీవేంకటేశునిట్టె కూడినదాన
ఉలివచ్చి సేయకుంటే వొరయఁగఁజెల్లదా"
26-31

ఉలివెచ్చ : *విశ.* కొద్ది వెచ్చ.

"వొగిఁ బన్నీరు చల్లితే వులివెచ్చ దోఁచెఁగా
నగినగి ఆపె నీతో నాలిసేయఁగా"

ఉలుకు : అ.క్రి. 1. తపించు, తప్తమగు 2. అసూయపడు 3. మిరుమిట్లుగొను 4. పొర్లు
"ఉలుకుగాలి వంటిది వూరుపులది" 22-56

ఉలుకుట్టుఁజేతలు : వి; బహు. వెక్కిరింత చేతలు, వేళాకోళపు చేతలు. రూపాం. ఉల్లికుట్టు చేతలు.
"వులుకుట్టుఁజేతలకు నుస్సురంటా నున్న నాతో
యెలయించి నవ్వు నవ్వేవేరా నీవు" 11-384

ఉలుప : వి. కానుక, ఉపాయనం, గృహప్రవేశం చేసేప్పుడు ఇచ్చే బలి. రూపాం. ఉలుపా.
"కట్టరో కలువడాలు గక్కన వాకిళ్లను
పట్టరో వులుపలు శోభనద్రవ్యములును"
25-432

ఉలుపా : వి. ఉపాయనం, రాజాదుల కిచ్చే కానుక.
"ఉవ్విళ్లూరఁ దనమోవి వులుపా వట్టె" 21-228

ఉల్లి దిన్న కోమటి ఊరకున్నట్లు : లోకోక్తి; చెడ్డపని చేసినవాడు తన చెడ్డపనిని దాచుకోవడానికి ప్రయత్నించినట్లు – ఉల్లివాసన వస్తుందేమోనని మాట్లాడక నోరుమూసుకుంటాడనే అంశంపై వచ్చిన లోకోక్తి.
"ఉల్లిదిన్న కోమటూరక వున్నట్టు
జల్లెడ నావాలు జారిపోయినట్టు" 2-494

ఉవ్విళ్ళు : ఆశ. (త్వర, తహతహ)
"ఉవ్విళ్లవలె నోరూరించి పగటుల
నివ్వటిలుట పో నేరుపు విభుని" 13-88
"దవ్వుల సరసములు తగునా నీకు
వువ్విళ్లె మేన నొచ్చమున్నవానివలెను" 9-19

ఉవ్వు : అ.క్రి. చిప్పిలు.
"ఉలిపచ్చి మోవితేనె లువ్వుచు నువ్విళ్లూరె
మలసి నీ పతి నీతో మాఁటాడె నటవే" 28-89

ఉసురసురను : ప.బం. 1. మిక్కిలి బాధపడు, శోకించు 2. తాపంతో, కోపంతో వచ్చే నిశ్శ్వాసధ్వనికి అనుకరణం.
"వొట్టులు వెట్టుక లోలో నుసురసురనుకంటే
చుట్టరిక మే పాటైనా సుకము దక్కు" 22-519

ఉసురసురు : వి. తాపమునందగు నిశ్వాసధ్వనికి అనుకరణం. ఆపసోపం.
"కుమ్మరించి నీ యెదుట కుప్పలు వోసిని
వుమ్మగిలు కోరికలు ఉసురసురుఁగాఁకలు"
18-426
"వూటురేఁగెఁ జెమటలు వుసురసురులు రేఁగె
బూటకపుఁ జలమింతే బొంకనేలే యిఁకను"
14-359

ఉసురు : వి. తాపంతో వచ్చే నిశ్వాసధ్వనికి అనుకరణం.
"ముక్కున ఉసురులు చెక్కుల యసరులు"
9-91
"నవ్వుచు నీ కొంగువట్టి నా యింటికిఁ దీసితేను
వువ్విళ్లూర దిగులుతో నుస్సురనేవు" 13-434

ఉసురుగొను : సేదదీర్చు కొను.
"ఉగ్గున రేపల్లె వుసురుగొనేటి వాని
దగ్గరి తమకానఁ దడవీనయో" 5-261

ఉసురుతోడి సుఖము వుండిన పాటే చాలు : లోకోక్తి.
"బ్రతికి యుండిన సుఖములు బడయవచ్చు"
"జీవన్ భద్రాణి పశ్యతి" అని భావం.
"వుసురుతోడి సుఖము వుండిన పాటే చాలు
కొసరి జన్మములింకాఁ గోరనోప నేను" 3-7

ఉసురునూరుపు : (ఉసురు + ఊరుపు) ప్రాణవాయువు.
"వెస వీడుదోడాడే వీడెములఁ బచ్చిదేరి
వుసురునూరుపులతో నున్నాఁడు వీఁడె"
24-157

ఉసురుమాను : వి. ముష్టిచెట్టు.
"ఉసురుమానై పుట్టి వుండనైనవచ్చుఁగాక
విసువక వీరి వారి వేసరించవచ్చునా" 1-397

ఉసురెక్కు : ప.బం; అ.క్రి. (?)
"ఉసురెక్కఁగదె దీని యొరపు నూరుపుల
పొసఁగి వేంకటపతి పొందు దెలిపెడిని" 4-13

ఉస్సురను : (14) అ.క్రి. బాధపడు, శోకించు,

దుఃఖంతో వచ్చే నిశ్శ్వాసధ్వనికి అనుకరణం.

ఉస్సురస్సురను : *ప.బం; అ.క్రి.* 1. మిక్కిలి బాధపడు, శోకించు 2. తాపంతో వచ్చే నిశ్శ్వాసధ్వనికి అనుకరణం.
చూ: ఉసురసురను.

"సింగారపుఁదోటలోన చెలిని దవ్వులఁజూచి
అంగపుఁజెమట నుస్సురస్సు రనేవు" 7-146

ఉస్సురుస్సురను : బడలికతో నిట్టూర్పు పుచ్చు, మిక్కిలి బాధపడు, శోకించు.
చూ: ఉస్సురస్సురను.

ఊ

ఊఁకొను : స.క్రి. 1. అంగీకరించు, సమ్మతించు 2. కథాదులు, ఊఁ అంటూ విను ; అ.క్రి. ఊఁ అను.

"ఆఁకలు సేయక నీకు నట్టె నే లోనైతిఁగాక
వూఁకొననైన రతికి నుద్యోగము వుట్టునా"

11-59

ఊఁచడు వాఁచడు : సంకోచించడు అనే అర్థం లోని లోకోక్తి.

"ఆఁచి కాఁగిలించి కూడి అంగడిఁబెట్టీ సిగ్గులు
ఊఁచడు వాఁచడు సూడు వోయమ్మ తాను"

27-570

ఊఁటాడు : అ.క్రి. గట్టిగా కదలు, సంభ్రమించు .

"గుబ్బలచెమటల పయ్యెదకొనకొంగున
నల్లార్పుచు
ఉబ్బున గమనావస్థల నూఁటాడెద వేలే" 5-164

ఊఁటుకొను : స.క్రి. పొడుచుకొను .

"అండ నూఁటుకొన్న కాయలట్టె నేఁ బరాకైతే
పండెనంటాఁ బడదొబ్బి పట్టనియ్యఁడే" 7-420

ఊఁదు : (5) స.క్రి. నొక్కు, ఒత్తు, గిల్లు, అదుము, గుచ్చు, నాటు, ఆను, నిలుపు, మోపు.

"గుమితాన నవ్వు నవ్వి గోరనూఁదెను" 25-260

"కమ్మటి నీ కుచములు కడుఁబిసికె నంటాను
కుమ్మెలు వో నూఁదకువే కొనగోర నిపుడు"

29-137

ఊఁపె : వి. (?)

"లోపలికి వెలికిని లోఁగి యెడ తాఁకేటి
వూఁపెల ముక్కుకొన వుసురింతే తనవు"

15-187

ఊకొంటేఁబైఁడికత : *ప.బం; వి.* (?)

"ఊరకుండితే మేలు వూఁకొంటేఁ బైఁడికతౌను
బారపెట్టితే నలపు పచ్చిదేరె నందువు" 7-478

ఊకొను : ఊకొట్టు, 'ఊఁ' అను.

"వద్దనుండి ఊకొనేటివారు గలిగితే నీవు
సుద్దు లెన్నైనా జెప్పేవు సూటివడను" 17-223

ఊటచెలమ : *ప.బం; వి.* తఱుగనిది, చెలమలో నీరు వినియోగమయ్యే కొద్దీ తిరిగి ఊఱుతూనే ఉంటుంది.

"కందువ శ్రీవేంకటేశ కరుణించవయ్యా యింక
పొంది పూట చెల మాయఁ బుట్టుగుల సివము"

4-417

ఇందులోని పూఁట వూ(ఊ)ట కావచ్చు.

ఊటలెత్తు : అ.క్రి. ఊటలుగా స్రవించు, చెమ్మ కలుగు.

"యెలిమి శ్రీవేంకటేశ యెదురీఁత కాఁగిట
వులివచ్చి యానందాన నూటలెత్తును" 18-47

ఊటవట్టు : (ఊట + పట్టు) అ.క్రి. చెమ్మ కలుగు.

"ప్రేమముతోఁ గేదారి పెరిగి పండినపంట
తేమ రేఁగి ఊటవట్టె తిమ్మినాయఁడా"

4 అను 47

"వుద్దండాలు రాచకూఁతురు లోరిచి
యెట్టుండిరో
గద్దరివై వూరూరి కాఁపురాల వాఁడవు" 8-256

ఊటు : వి. వానచినుకులవల్ల కలిగిన చెమ్మ.

"ఊరనూర నూటు లాయ నువిద తమకములు
గోర గీర నేరులాయ కూరిములు" 29-402

ఊటుకూరి కోనేటిరాయఁడు : వి. ఊటుకూరుగ్రామంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి. చూ: ఊటుకూరి కోనేటిరాయఁడు.

"కోరికె లీడేరె నేఁడు కోనేటిరాయ ! ఇట్టె
కూరిముల వూటుకూరి కోనేటిరాయ !" 26-299

ఊటుకూరి చెన్నరాయడు : వి. అన్నమయ్య జన్మస్థలమైన రాజంపేట తాలూకాలోని తాళ్ళపాకకు అర ఆమడదూరంలో ఉన్న ఊటుకూరులో వెలసిన చెన్నరాయఁడు. అన్నమయ్యతాత నారాయణసూరి విద్యనభ్యసించడానికి వచ్చిన గ్రామ మిదియే. ఇది రాజంపేటకు పరువు దూరంలో తిరుపతి రోడ్డుపై ఉంది. ఊటుకూరు తమ బంధుగ్రామం కావడం వల్లా, సమీపంలో ఉండడంవల్లా తాళ్ళపాకవారు తఱచు ఆ గ్రామం పోతూ అందలి చెన్నరాయని దర్శిస్తూ సేవిస్తూ ఉండిఉండ వచ్చును.

"పెనఁగుచు నీ విట్టి ప్రియములు నెరపేవు
వునుపుఁజేఁతల వూటుకూరి చెన్నరాయ"
10-24

ఊట్లెత్తు : (ఊట్లు + ఎత్తు) *ప.బం; అ.క్రి.* ఊటలుగా స్రవించు.

"చెక్కులపై చెమటలు చిరుమోవి తేనెలు
వొక్కమాటే చెలరేఁగి మాట్లెత్తెనే" 18-11

ఊడిగకాఁడు : (3) (ఊడిగము + కాఁడు) వి. సేవకుడు, పరిచారకుడు, ఊడిగం (సేవ) చేసేవాడు.

"వెరవున నీ చెవిలో విన్నపాలు సేయుకంటే
ధర నీ వూడిగకాండ్లఁ దలపించు టెక్కుడు"
2-483

ఊడిగపుకాంత : (ఊడిగము + కాంత) వి. సేవకురాలు, పరిచారిక, ఊడిగం (సేవ) చేసే స్త్రీ.

"లలి నూడిగపుకాంతలను సన్నసేసుకొంటా
పొలసి నీవేఁగి రాఁగాఁ బొగడే రిందరును"
18-321

ఊడిగపుటాపె : (ఊడిగము + ఆపె) వి. పరిచారిక, సేవకురాలు.

ఊడిగపుటింతి : (ఊడిగము + ఇంతి) వి. సేవకురాలు, పరిచారిక.

"యిరుమేలా నూడిగపుటింతులు సేనాసేన
యెరవు లేక యిందరినెట్టు మన్నింతువయ్యా"
25-123

ఊడిగపుది : (ఊడిగము + అది) వి. సేవకురాలు, పరిచారిక, ఊడిగం చేసే స్త్రీ.

"వోప ననవలెనా వూడిగపుదాన నేను
చేపట్టి నట్టిల్లా నీకె చెల్లెఁగాక" 14-171

ఊడిగపువారు : (13) (ఊడిగము + వారు) *వి; బహు.* సేవకులు, పరిచారకులు, ఊడిగం చేసేవారు.

"లలి నూడిగపువారు తెలియ నిన్నడిగితే
పొలసి బొంకుచుఁ బతికి పూనుక వచ్చేవు"
14-83

ఊడిగపువెలఁది : (ఊడిగము + వెలఁది) వి. సేవకురాలు, పరిచారిక, ఊడిగం(సేవ) చేసే స్త్రీ.

"పంతమిచ్చి నా కేల బాసలు సేసే విప్పుడు
ఎంతవారా వూడిగపువెలఁదులు మనకు"
20-532

ఊడిగాలకాంత : *వి; బహు.* పరిచారిక, ఊడిగం చేసే స్త్రీ.

"అయ్యయ్యో పాపముగాక ఆదరించవచ్చునా
గయ్యాళిని వూడిగాలకాంతల నెందు" 17-27

ఊడిగాలవారు : (3) (ఊడిగాలు + వారు) సేవకులు.

"అప్పటప్పటికి నింతు లలిగి వుండేవేళ
కప్పురవిడే లూడిగాల వారిత్తురా" 17-174

ఊదు : (4) స.క్రి. నొక్కు, ఒత్తు. ఈ అర్థంలో అన్నమయ్య అర్థబిందురహితంగా కూడా ప్రయోగాలు చేసినాడు. చూ : ఊఁదు.

"చన్నుల నూదితేను సాదించినటులయ్యా
యెన్నికలిట్టివి నేనేమి సేతునే" 12-478

ఊరఁగతలు : (2) *వి; బహు.* ఊరిముచ్చట్లు.

"లలి నిన్నుఁ బెండ్లాడ లగ్గము పెట్టుకుండఁగ
బలిసి యేమి వినేవు వూరఁగతలు" 22-306

"తేనె గారే అధరపుతేనెలు నీ తలకెక్క

వీనులు వూరఁగతలు వినఁగూడీనా" 27-298

ఊరఁగూటము : వి. వేర్వేరు ఊర్లవారు ఒక ఊరిలో కలియుట ఊరఁగూటమని లాక్షణికముగ వాడినట్లున్నది. పరస్పరము సంబంధము లేని పదార్థములు ఒకచోట కలియుటకు ఈ వ్యవహారము ఆనాడుండిన దేమో! అని సం.ప.స. లో వివరింపబడింది.

"ఎక్కడి కెక్కడ మరుఁడేలికలు యిన్నిటికి
యిక్కువల నూరఁగూట మెట్టు గూడెనే" 23-44

ఊరఁగూటములవారు : వి; బహు. ఒకచోట చేరిన వేర్వేరు ఊర్లకు చెందినవారు.

"ఊరఁగూటములవారు వొద్ద నెంత వుండినాను
యేరా నీ వీఁపుమీఁద నెక్కి వుండఁగలరా"
23-313

ఊరఁజుట్టము : ప.బం; వి. స్త్రీలంపటుడు, వ్యభిచారి; ఊరికంతకూ చుట్టమని వాచ్యార్థం.

"యెగసక్కెపు శ్రీవేంకటేశ వూరఁజుట్టమవు
సొగిసి మమ్మేలితివి జోడుగాక మానేవా"
14-183

"ఊరఁజుట్టపు శ్రీవేంకటోత్తముఁడైన వానికి
యే రీతిఁ దమి రేగీ నేమి చెప్పేవే" 7-241

ఊరఁబసులు : వి; బహు. ఊరిపశువులు; పశువులు అనడానికి పసులు అనేది జానపదవ్యవహారం.

"కావించిన యల కామధేనువుల
కేవి యూరఁబసు లీడవునా" 3-350

ఊరఁబొత్తు : ప.బం; వి. అందరిసొత్తు.

"యీ సరినే శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
వోసరించితే బువ్వము వూరఁబొత్తు గాదా"
2-285

ఊరకున్నవాని మీద ఉడుకులు గట్టు : ప.బం; అ.క్రి. ఊరకున్నవాని మీద కోపం చూపు, బాధ కలిగించు.

"ఊరకున్నవానిమీఁద నుడుకులు గట్టేమా
దారతప్పక తనంత తా నుండరాదా" 14-77

ఊరకున్నవారికి వుడుకులు గట్టు : ప.బం; అ.క్రి. మౌనంగా ఉన్నవారికి బాధలు కలిగించు.

"ఊరకున్నవారి కేల వుడుకులు గట్టేవు" 17-335

ఊరకున్నవారి కూరోపదన్నట్లు : నానుడి; మౌనంగా ఉంటే కలహాలు రావన్నట్లు.

"ఊరకున్నవారి కూరోపదన్నట్లు
నేరనైతి నే నింక నిన్నేల కొసర" 19-540

ఊరగుంత : వి. రొచ్చుగుంట వంటిది.

"బంతి గాఁగ నెల్లవారుఁ బండేటి మంచ మూర
గుంతలో విరుగఁదోసి కూళఁడెవ్వఁడో" 5-154

ఊరదయివము : వి. గ్రామదేవత, చిల్లరదేవత. (వ్యు)

"చేరి యీతఁడే శిక్షించ రక్షించ
వూరదయివములు వొగి నితని సరా" 3-529

ఊరదోమటి : వి. (?)

"తొలఁగు సిగ్గుల నూరదోమటాయ వలపు
అలరి దొడ్డిపెంటల నామనాయ వలపు" 22-305

ఊరపొత్తు : అందరికీ అందుబాటులో ఉండేది.

"యీ సరినే శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
వోసరించితే బువ్వము వూరఁబొత్తు గాదా"
2-285

ఊరబావ : వి; ప.బం. స్త్రీలంపటుడు, ఊరందరికీ బావ అనే దానినుండి ఏర్పడిన పదబంధం.

"వోవల వలపు చల్లి వూరబావవైతివి
కావించి మమ్ము నేలి మగఁడవైతివి" 12-540

ఊరవదినె : వి; ప.బం. పురుషలంపట, వాడవదినెవంటి పదం.

"ఇది యేమె వీని గుణ మెటువంటిదే
వదలక నవ్వె నూరవదినెనా నేను" 10-2-89

ఊరవిందు : ప.బం; వి. జారుఁడు.

"సందడి వలపించి జవరాండ్ల వూర
విందవైన యట్టి వేడుకకాఁడ" 10-2-82

కార్యాలపట్ల ఊరందరినీ పిలిచి చేసే విందు :

"పచ్చిదేరీ నీ మాటలు బతుకవయ్యా

విచ్చనవిడిని వూర విందులాయ వలపు "

13-60

ఊరివారి యింతి : వి. జారిణి, కులట.

"ఊరివారి యింతి నన్ను వుద్దండపుఁదుటారాలఁ

బేరుకుచ్చి సొలయుచుఁ బిసాళించేవు" 5-3

ఊరుపుగాలి : (5) వి. నిశ్శ్వాసవాయువు.

"వొప్పగుఁ బ్రాణము లవి వూరుపుగాలి వెంట

యెప్పుడు లోని వెలికి నెడ తాఁకును" 1-434

ఊరులేని పొల(లి)మేర : *ప.బం; వి.* అసంభవం, లేనిది. ఊరే లేనప్పుడు ఆ ఊరికి పొలిమేర ఉండదుకదా! ఆధారం లేని వార్త అని సంపాదకులు (పీఠిక. 5.నం. 32 పు.) గ్రామో నాస్తి కుతః సీమా.

"ఊరులేని పొలమేర వొడలు మోచుకొని నేము

తేరదేహ మెక్కుకొని తిరిగేము" 1-73

"ఊరులేని పొలిమేర పెంపు లేని బతుకు

గౌరవంబు లేని ప్రియము కీ దయ నేటికే"

ఊరు వాడెడు చెలమ : *ప.బం; వి.* 1. వేశ్య, భోగం స్త్రీ 2. సులభగమ్యం, ఊరందరూ నీళ్ళు తెచ్చుకునే చెలమ అందరికీ అందుబాటులో ఉంటుంది.

"ఒడలిపై నీ చెమట వూరువాడెడు చెలమ

జడియు నీ తమకంబు సంతతగరు" 5-75

ఊరూరి కాపురాలవాఁడు : ప.బం. జారుడు.

"ఉద్దండాలు రాచకూఁతురు లోరిచి యెట్టుండిరో

గద్దరివై వూరూరి కాఁపురాలవాఁడవు" 8-256

ఊర్పుగాలి : *వి;* చూ : ఊరుపుగాలి.

"ఒక్క చిత్తమేల యౌను వూర్పుగాలి విసరఁగా

చిక్కి గుణత్రయము చేఁజెదరుఁగాక" 4-61

ఊళిగకాఁడు : (ఊళిగము + కాఁడు) వి. ఊడిగకాడు, సేవకుడు, పరిచారకుడు.

"జపితఁగాను, శాస్త్రిఁగాను, వుపదేశపు

గురువూళిగకాఁడ" 4-212

ఊళిగము : వి. ఊడిగము, సేవ.

"వీడెమిచ్చు తినే విన్నపాలెల్లాఁ జేసు

వూళిగపువేళనే వొడఁబరచె" 22-376

ఊసివాసులు : *వి; బహు.* నిఘంటువుల్లో కానరాదు. నిఘంటువుల్లో ఊసివాసము అనే పదం కనిపిస్తుంది. దానికి ఈర్ష్య, అసూయ, ద్వేషం అని అర్థాలు. 'ఊసువాసులు' కావచ్చునేమో! 'ఊసులు వాసులు' అంటే కాలక్షేపం కబుర్లు, గొప్పలు అని అర్థం. ఇది ఈ సందర్భంలో సరిపోతుంది. వ్యత్యాసాలు, ఈర్ష్యా ద్వేషాలు (ఊసివాసము = వ్యత్యాసము. బ్రౌన్) పుసి, హుసి = అబద్ధము అని కన్నడము. అదియే ఊసి యైనచో ఊసివాసులు = అసత్యములైన విలువలు కావచ్చును. ఊసివాసి ఏ.వ.

"వూడిగము సేసేవారు వూసివాసు లెంచరు

జోడై తమమేనులు సోఁకింతురు" 21-301

"ఊసివాసు లెంచక వొగి నన్ను వేఁడుకొనె"

21-390

"మన్నన గలుగువారి మాటలెల్లాఁ జక్కనే

వున్నవారి మాట లెల్ల నూసివాసులే" 14-377

"మన్నన గలుగువారి మాటలెల్లాఁ జక్కనే

ఉన్నవారి మాటలెల్ల నూసివాసులే" 14-377

ఊహాపోహలు : (ఊహ + అపోహ) ఆవశ్యకమైన దానిని తెచ్చుకొని అనావశ్యకమును వదలుట.

"కోరినట్టే నిన్నుఁగూడె కొమ్మాఁ గూడితివి నీవు

యీరీతి మీ వూహాపోహ లెవ్వఁడెఱుఁగు"

21-36

ఎ

ఎంగిలి : వి. పరస్త్రీ సంగమమనే అపవిత్రత.

"ఈకడ నముఁగూడి యెంగిలితోనే పోయి

వాకిట నాపెఁగూడి వచ్చితి విట్టే" 7-430

ఎంగిలించు : ఎంగిలి చేయు.

"మోసాన జలనిధికి మునినోరి యెంగిలినే

వూసివాసి నోరు తనవొద్ది యెంగిలించీనా"

22-17

ఎంగిలికిఁ జేతులొగ్గు : *ప.బం; అ.క్రి.* ప్రసాదానికి చేతులు చాచు, దాసోహమను.

"వేవేగ బిడ్డల పేర్లు విభునికిఁ బెట్టరో
వోవో యెంగిలికిఁజేతులొగ్గరో రక్షించీని" 7-11

ఎంగిలికి పొత్తుగూడు : చుంబనాది శృంగారచేష్టలకై జతగూడు.
"కాంతలమోవి తేనెలు కైకొనేటి వేళను
పొంతనుండి యెంగిలికి పొత్తుగూడ వలెను" 19-169

ఎంగిలి దేహము : వి. అన్య సంగమం చేసిన దేహం, అపవిత్రమైన దేహం.
"ఎంగిలి దేహముతోనే యీడకు విచ్చేసినాఁడు
యింగిత మెఱిఁగితి నన్నేల పిలిచీనే" 7-25

ఎంగిలినోరు : వి. ఎంగిలిగల నోరు, హేయమైన నోరు.
"కొంగువట్టి నిన్నుఁ జేరుకొన నైతినని దూరే
ఎంగిలినోరఁ బిలిచే దెగ్గు గాదా" 7-17
"ఎంగిలి నోరు వెట్టుక యే మాటలాడినాను
సంగతిగా నవి నేఁడు సత్యమయ్యీనా" 3-250

ఎంగిలిపొత్తు : *ప.బం;* వి. పరస్త్రీతో పొందు, అపవిత్రమైన పొందు , పంక్తిభోజనం, బంధుత్వం.
"పొంతనే నీ వెంగిలిపొత్తు గలపుకొంటివి
పంతాన నిందు కొగ్గించి భ్రమయించెఁగా" 7-34
"సంగతిగా నప్పటిని సారె విడెమిచ్చుకొంటూ
ఎంగిలిపొత్తు గల నీ నెంత చుట్టరికమో" 18-130
"ఎంగిలి పొత్తుకు వచ్చీ యేడనైనాఁ దమకించీ
అంగవించి సోబనపు టక్షత లిప్పించెనా" 18-487

ఎంగిలి పొత్తుల మాటలు : (?)
"రంగుగా నీవున్నచోటు రాతిరే వింటిమి నేము
యెంగిలి పొత్తుల మాట లీడనేలా" 9-231

ఎంగిలిపొత్తువారు : *ప.బం; వి; బహు.* బంధువులు.
"ఎంగిలిపొత్తువారము యిద్దరి యెడకు నేము
వుంగిట నే మే మనినా నోరుచుకోరయ్యా" 13-202

ఎంగిలిబూరెను కడుగు : *అ.క్రి.* వ్యర్థమైన పనిచేయు.
"కడుగఁగ నేటికి నెంగిలి బూరెట
కడవేయ నేల (?) నారాయణా" 3-257 & 2-494

ఎంగిలి బూరెను గడుగు : వ్యర్థ ప్రయత్నం చేయు.
"కడుగఁగ నేటికి నెంగిలి బూరెలు
కడ వేయనేల నారాయణా!" 3-257 & 2-494

ఎంగిలి మనుజులు : *ప.బం; వి; బహు.* నీచమానవులు, కక్కుర్తి గలవారు, విటులు.
"అంగనల రతుల యాసల నీదేటి
యెంగిలి మనుజుల కగ్గేది" 5-257

ఎంగిలిముద్దు : (?)
"ఎడుపించకు రేయమ్మా యెంగిలి ముద్దిచ్చేమంటూ
చూడఁచిన్నవానితోడ సుద్దులింతేలే" 22-70

ఎంగిలిసేయు : *ప.బం; స.క్రి.* దంతక్షతాదులచే స్పృశించు, బలాత్కరించు.
"అంగన విచ్చేసి నేఁడు ఆయమైన నీ మోవి
యెంగిలి సేసినదట ఇది నిజమా" 21-61

ఎండఁబడ్డ నీడఁగోరు : దుఃఖాన్ని అనుభవించినపుడు సుఖాన్ని కోరు.
"యెందు నెండఁబడ్డఁగాని ఇంపు నీడఁగోరఁడు
కందువ సంసారియైనఁ గాని మోక్షము గోరఁడు" 4-37

ఎండకన్ను : *ప.బం; వి.* కష్టము.
"ఎండకంట నీడకంట నేల చూచేవే యాతని" (ఆం.వా) 20-243
"యిది నీడకన్ను యెండకన్ను మరి
కదిసి నీయందె కలిగెనట" 1-415

ఎండకన్ను : వి. సూర్యుడు.

ఎండకన్ను నీడకన్ను నెఱుఁగు : *ప.బం; అ.క్రి.* సుఖదుఃఖాలను తెలియు.
"నిండురాజసముతోడ నీ వాతనివద్దనుండి

యెండకన్ను నీడకన్ను నెరిగే వటే" 8-110

ఎండకన్నువాఁడు : వి. సూర్యుడు.

ఎండకు నీడకుఁ దీయు : *ప.బం; స.క్రి.* (?)

"పండి పొల్లవోయీనా పట్టరాని మనసు
యెండకు నీడకుఁదీసి యింత కోపఁగలనా"
8-49

ఎండచూపు : వి. కోపపుచూపు.

ఎండనీడ కన్నులవాఁడు : సూర్యచంద్రులు కన్నులుగా గలవాడు.

"దుండగపు భూభారము తొలఁగదొబ్బ నీతఁడు
ఎండనీడ కన్నుల వాఁడిక నింతా మంచిది"
28-172

ఎండనీడ కన్నులు : *ప.బం; వి; బహు.* సుఖదుఃఖాలు.

"పండును గాయయునైన బలుపుల దొరవై
ఎండనీడకన్నులను యెలయించే విపుడు"
8-38

ఎండనీడ కన్నెఱుఁగు : *ప.బం; అ.క్రి.* కష్టసుఖాలు ఎరుగు, ఇల్లువెడలు.

"పండిన కెమ్మోవితోడ పైకొని నిన్నిటుగూడె
ఎండనీడ కన్నెఱఁగ విది యేమే నీవు" 14-584

ఎండపసపు : *ప.బం;* వి. అశాశ్వతం, నీరెండ పడి ఏర్పడే పసుపురంగు. పసుపు ఎండలో పెడితే రంగుమారుతుంది. అనడంపై కూడా ఈ పదబంధం ఏర్పడి ఉండవచ్చు. పసుపు కు పసపు అని వ్యావహారికరూపం.

"యిల నెండపసపాయ యింతుల ప్రియము లెల్ల
నలువంకఁ బురుషుల నడవడి చేతను" 14-264

ఎండమావి నీరు సేయు : *ప.బం; అ.క్రి.* అసాధ్యాన్ని సుసాధ్యం చేయు.

"ఎండమావి నీరు సేసేవేమే నీవు
అండనుంటేఁ గాక దవ్వులైతే నవి గావా"
26-200

ఎండమావుల నీ(రు)ళ్ళు : (4) *ప.బం; వి; బహు.* అసంభవమైనది, లేనివి, ఎండమావులు నీళ్లుగా కనిపించినా అందులో నీళ్లుండవు.

"ఎండమావుల నీరు ఏకతపు పొలయలుక
వండఁగ వండఁగ నట్లు వలపు లెల్ల" 7-231

"సతులతో నవ్వులు చందమామగుటుకలు
మతి తలపోఁత లెండమావుల నీళ్ళు" 2-268

"యెరవెల్లఁ బాసెదీఁక నేమి
మరలి వెదకు టెండమావుల నీళ్ళు" 9-154

ఎండమావులు తాగ దగ్గరఁబోవుట : *ప.బం;* వి. లేని వస్తువుకై ప్రయత్నించుట, నిష్ఫలమైన ప్రయత్నం చేయుట.

"దప్పికి నెండమావులు దాగ దగ్గరఁబోవుట
తప్పుఁజదువులలోఁ దత్త్వము నెంచుట" 2-49

ఎండలేని నాటి నీడ : *ప.బం;* వి. అసంభవం, లేనిది.

ఎండ లేని నీడ : *ప.బం;* వి. అసంభవం; ఎండ లేకుండా నీడ ఉండదు కదా!

"పండరంగినుండి వచ్చి పామరులనెల్ల మెచ్చి
యెండ లేని నీడలోన యెచ్చి యెచ్చి" 6-26

"కొండలలో నెలకొన్న కోనేటిరాయఁడు గూడె
యెండ లేని నీడ నీకు నితవేల ఆయనే" 6-44

ఎండలోని నీడ : *ప.బం;* వి. శ్రమను పోగొట్టేది.

"ఎండలోని నీడ యీ మనసు
పండు గాయసేయఁబనిలేదు" 1-337

ఎండలో నీడలు : *వి; బహు.* శ్రమను పోగొట్టేవి.

"ఎంచఁగ నెండలో నీడలు యెడనెడ
కూటములు" 1-1

ఎండుగలు : *వి; బహు.* 'ఎండుగులు' అనే పదానికి వ్యావహారికరూపం; ఎండబోసిన ధాన్యం.

"నవ్వులపండుగ లాయ ననుపు లెండుగ లాయ
యివ్వల చెంతతో పొందు లిఁక నెన్నఁడు"
7-575

ఎంతకంతే : (ఎంతకు + అంతే) ప.బం. తగినంత, మేరకు మేర.

"చెనక నేరుతు నంటూ చేతిగోరు దాఁకింతురా
యెనసే మగవానితో నెంతకంతే" 27-526

ఎంతకెత్తుకొను : ప.బం; అ.క్రి. ఎంతపని చేయు.
"ఎంతకెత్తుకొంటివి నీవేరా వోరి
చెంతల నవ్వు నవ్వేవు చెల్లురా వోరి" 11-373

ఎంత గుండె : ప.బం. చాలా ధైర్యం అనే అర్థంలో వాడబడే పదబంధం.
"అట్టి దొర యాతఁడు నిన్నడిగే మాటల కెల్ల
యెట్టైన నుత్తరమియ్యి వెంత గుండే నీకు"
11-171

ఎంతవడి కెంతవడి : (?)
"ఇంత యేఁతురా సతుల నెందాఁకను
యెంతవడి కెంతవడి యిప్పుడా నీ వలపు" 8-31

ఎందువంక : వి. ఏ పక్షం, ఏ వైపు.
"పుట్టుగు దూరితిమి పోరానియట్టి వేళ
కట్టఁగడ నెందువంకఁ గానమైతిమి" 3-344

ఎకదిగు : ప.బం; అ.క్రి. పైకి ఎక్కు – కిందికి దిగు.
"ఎకదిగఁగ కృషికుఁడెత్తు ఏతమై
అకటా కర్మము లాడించీని" 15-63

ఎకపోయు : ప.బం. 'ఎగపోయు'కు రూపాంతరం కావచ్చు. దుర్బోధచేయు, సూచించు (బ్రౌన్.; శ.ర)
"చాయలనే యెకపోసి సన్నల నింతేసేసి
యేయెడకుఁ బోనీవు ఇంతకంటె నేమే" 19-368

ఎకసక్కీఁడు : (ఎకసక్కెము + ఈఁడు) వి. మోసగాడు, పరిహాసం చేసేవాడు, అవమానించేవాడు.
"వికటించి మేనమామ వీటికేఁగి తానె చంపే
యెకసక్కీఁడు వీనితో నేఁటి చుట్టరికమే" 9-102

ఎకసక్కేలు : వి; బహు. ఎకసక్కెములు, మోసాలు, వంచనలు, పరిహాసాలు, వికటపుమాటలు, తిరస్కారములు, అవమానములు. ఎగసక్కేలు . ఏకసఖ్య శబ్దభవమా అని సంపా. (సం.ప.స. 16. నం.)
"ఒకతెపైఁ బెట్టి మాట లొక టొకటె యాడి
యెకసక్కే లకు, గల్ల లేల యాడేవు" 9-267

ఎకసక్యము : వి. 'ఎకసక్కెము'నకు రూపాం.
"ఒకటొకటే గడించే వూరకున్న యాకె మీఁద
యెకసక్యాలిఁక నేల యెరుగుదుమయ్యా"
29-350

ఎక్కడా : అంతటా.
"యిక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
ఎక్కడా జాణైన వాని నెలయించఁదగునా"
27-22

ఎక్కసక్యము : వి. చూ : ఎకసక్కెము.
"మొక్కుతే సారెకు నైనా మోపులై వేసట వుట్టు
యెక్కసక్యాలకుఁ బాదమేల పట్టేవయ్యా"
13-31 old

ఎక్కితే యేనుగ గుజ్జు : నానుడి; కొన్ని సమయాల్లో ఎంత పెద్దదైనా చిన్నదిగానే భావింపబడటం.
"యే లీలా గెలువరాదు యెక్కితే యేనుగ గుజ్జు
లోలోనె మమ్మునింత లోఁచి చూడనేఁటికి"
7-222

ఎక్కినవానికి ఏనిగె గుజ్జౌఁగదే : చూ : ఎక్కితే యేనుగ గుజ్జు, ఎక్కినవానికి ఏనుగు గుజ్జు.
7-239

ఎక్కినవానికి ఏనుగ గుజ్జు : సామెత; కొన్ని సమయాల్లో ఎంతో పెద్దదైనా చిన్నదిగానే భావింపబడడం, ఏనుగు ఎత్తైన జంతువే అయినా దానిమీద ఎక్కినవానికి అది పొట్టిగానే కనిపిస్తుంది కదా.
"ఇల్లిదె యెక్కినవాని కేనుగ గుజ్జను మాట
పొల్లవునా తన్నూరకే పొదిగేనేఁ గాక" 22-33

ఎక్కుకొను : (9) స.క్రి. ఎక్కు, ఎక్కు ధాతువుపై స్వార్థంలో కొనుధాతువు అనుప్రయుక్తమైన రూపం. ఇలాంటి రూపాలు కొన్ని రా.సీ. వ్యవహారంలో విలక్షణంగా కనిపిస్తాయి. ఉదా. ఉండుకో, వినుకో మొ॥
"శ్రీవేంకటేశ నీ దేవు లలమేలుమంగ
వోవల నడిగితే నీ వుర మెక్కుకొనెను" 19-112

"నిండువురమున నింతి నిలిపి శ్రీవేంకటాద్రి
కొండమీఁద నెక్కుకొన్న కోడెకాఁడే" 9-134

ఎక్కుడుకెక్కుడగు : *ప.బం; అ.క్రి.* మిక్కిలి గొప్పదగు.

"మర్మంబు శ్రీహరి నీ మఱఁగు చొచ్చినఁగదా
కూర్మిఁ దన జన్మ యెక్కుడు కెక్కుడౌట"
2-104

ఎక్కువతక్కువలు : (5) *ప.బం; వి; బహు.* హెచ్చుకుందులు, హెచ్చుతగ్గులు.

"ఇక్కువ లంటేటివేళ ఇద్దరము నిద్దరమె
యెక్కువతక్కువ లెంచ నిఁక నేల" 20-367

"ఎక్కువతక్కువలేవో యెఱుఁగ మిద్దరిలోన
వొక్కటై నీ వురముపై వున్న దిదె చెలియ"
22-112

ఎక్కువనేల : వి. ఎత్తైననేల.

"నిక్కము గొండల నీరు నేలకు వేగమె పారు
యెక్కువనేలపై నీరు యెక్కుడందుకు"
10-1-16

ఎగదిగఁజూచు : ప.బం. తత్తరపాటుతో చూడు.

"చిగురుటాసఁదగిలి చింతాజలధిఁ బడి
యెగదిగఁ జూడఁబోతే యెందుకు నెక్కినది"
3-313

"యిత్తల నదియును గాకే యెగదిగ నాతనిఁ జూచుచు
చిత్తిణిగుణముల చెక్కులు చెమరించే వేమే"
16-331

"ఎగదిగ నాతనిఁజూచుచు" 16-331

ఎగదిగనాడు : వెనుకముందులు మాట్లాడు.

"జగడాలు మానరాదా సరస మాడేటివేళ
యెగదిగనాడితే యెగ్గులున్నవా" 7-84

ఎగదిగపోతలు : *ప.బం; వి; బహు.* ఎగపోతలు, దిగపోతలు.

"మొగమును జూచేవు మోనానఁ దలవంచేవు
యెగదిగపోత లైతే నేడ చొచ్చేదే" 20-271

ఎగపోఁత : వి. పైకి పోయటం, తూర్పారబట్టడం, ప్రేరేపణ, దుష్ప్రోత్సాహం, (వ్యు.) ఎగఁబోత, పైకి వ్యాపించడం, సూచించడం, దుర్బోధచేయటం.

"కూరవండి కసవేరె గుణము లోలో నేల,
యేరా నిన్నుఁగూడి పోసే యెగపోఁతేల" 9-69

ఇట నిశ్వాసం, నిట్టూర్పు అని అర్థం కావచ్చు.

"యెలయింపుఁజెలులచే యెగపోఁత లేఁటికే"
17-40

ఎగపోయు : (3) *ప.బం; అ.క్రి.* పురి యెక్కించు, దుర్బోధన చేయు, ప్రేరేపించు, పురికొల్పు. (తాగు, ఆస్వాదించు) రూపాం. ఎగఁబోయు, 'ఎగసనఁబెట్టు'కు రూపాం.

"కలుపుగోలుగ నిట్టె కాఁగిలించి కూడేవు
పొలసి యెవ్వతె యెగపోసిరా నీకు" 26-492

"చెలిఁగొంగువట్టి తీసి చేయిమీదఁ జేయి వేసి
యెలమి వలపు రేఁచె నెగపోసి" 25-186

ఎగవు : వి. గర్వం.

"పొందుల మాటలాడితే పులకించవలెఁగాక
యిందరివలె నుండితే యెగవులే కావా" 17-63

ఎగసక్కీఁడు : (6) వి. 'ఎకసక్కీడు'కు వ్యావహారికరూపం. వంచకుడు, పరిహాసకుడు, వికటపు మాటలాడువాడు.

"వెగటుగా మా యక్క వింటే నిందు కేమనును
యెగసక్కీఁడవు సంగ తెఱఁగవుగాక" 25-137

"మొగము దప్పక చూచి మోవితేనె లానేవు
యెగసక్కీఁడవు నిన్ను నే మనేమయ్యా"
22-407

ఎగసక్కేలు : *ప.బం; వి; బహు.* ఎగతాళులు, పరిహాసాలు. రూపాం. ఎగసక్యాలు.

"యెగసక్కే లాడరాదు యెదురు మాటాడరాదు
నగ నోపుదుమా నీతో నయముగాను" 20-473

ఎగసక్యాలు : *ప.బం; వి; బహు.* పరిహాసాలు. రూపాం. ఎగసక్కేలు.

"యెక్కడైనా జేయి యెకసక్యాలు
తక్కినవారితోడ తచ్చన లెంచకయ్యా" 12-1

ఎగుసనఁబెట్టు : స.క్రి. పురికొల్పు.
"తగవులు చెప్పుతాఁ గాఁతాళము గొంత రేఁచుక
యెగుసనఁ బెట్టీ రేసులెవ్వతో యాపె" 11-77

ఎగ్గుతప్పులు : ప.బం; బహు. ఒప్పుతప్పులు, మంచిచెడ్డలు.
"వొగ్గి విడెమయ్యగాఁబో వొడలెల్లాఁ గాఁక వుట్టె
యెగ్గుతప్పులకు నోప ఇంట నుండేనయ్యా" 19-458
"సిగ్గువడి వుండేది చెలియకు నుచితము
యెగ్గుదప్పు లిందేల యెంచేవయ్య" 22-19

ఎగ్గుదప్పులు : (2) (ఎగ్గు + తప్పులు) వి. ఒప్పులు - తప్పులు.
"యెగ్గుదప్పు లేడవి యింత వలచిన నీకు
కగ్గు లేక యిట్లానె కలతువు గాక" 21-317

ఎగ్గులాఁడి : (ఎగ్గులు + ఆఁడి) నింద్యురాలు.
"సిగ్గరికత్తెకుఁగాని సెలవినవ్వులు రావు
యెగ్గులాడికిఁ గాని యీసు లేదు" 16-561
"సిగ్గరికత్తెకుఁగాని చెక్కిటి చెయ్యమరదు
యెగ్గులాడి గాని మరి యీసు నేరదు" 18-184

ఎగ్గులు సిగ్గులు : (3) ప.బం; వి; బహు. మానమర్యాదలు, సిగ్గుసంకోచములు.
"జవ్వనభారముచేత జడిసేటి విరహులు
యివ్వల నెగ్గులు సిగ్గు లెఱుఁగుదురా" 17-50
"దగ్గరి వద్ద నుండితే తరగదు నీ మేను
యెగ్గులు సిగ్గులుఁ దేరె నేఁటికోయి" 16-352

ఎగ్గుసిగ్గు : (6) వి; ప.బం. మానమర్యాద, సిగ్గు - సంకోచం.
"యెగ్గుసిగ్గు నెరఁగక యితఁడిట్టె నన్నుఁగూడె
వొగ్గి నానాళ్ళు సేసి వున్నదాన ననవే" 16-91

ఎగ్గుసిగ్గులు : (9) ప.బం; వి; బహు. మానమర్యాదలు, సిగ్గుసంకోచం.
"ఎగ్గుసిగ్గు లెరఁగవు ఇది యేఁటిదోయి బావ
వెగ్గళించేవు కలికివిద్యల బావ" 16-305

ఎ(య)చ్చరించు : స.క్రి. ఎచ్చరిక చేయు, జ్ఞప్తిచేయు, తెలుపు, ప్రోత్సాహపరచు.
"కొంచక భుజియించుమని కోరి
యచ్చరించవద్దు
పెంచిన తన యాఁకలే పిలిచి తెచ్చీని" 2-184
అన్నమయ్య 'ఎచ్చరిక' అనే పదాన్ని వాడినా ఎక్కువ పర్యాయాలు 'ఎచ్చరికె' అనే పదాన్నే వాడినాడు.

ఎచ్చరి : వి. హెచ్చరిక.
"అప్పుడు చూచేదివో అధికుల నధముల
తప్పక యెచ్చరి యిదే తలఁచవో మనసా" 2-117

ఎచ్చరికె : (12) వి. అవధానం, సూచన. రూపాం. ఎచ్చరికె, హెచ్చరిక.
"ఎచ్చరిక మఱవకు మిన్నిటా నమ్మ
విచ్చనవిడాయ నీకు వేడుకలమ్మా" 7-589
"అచ్చపు శ్రీవేంకటేశ ఆయమెరిఁగి కూడితి
వెచ్చారికతో నుండఁగ యిట్టె మైచ్చనైతిక" 9-251

ఎచ్చరు : అ.క్రి. 'ఎచ్చిఱు' అని సూ.ని. మేలుకొను అని అర్థము. ఎశ్చరు, ఎచ్చరు అని కన్నడరూపములు. అర్థమొకటే అని సం.ప.స. (13సం. 1అను. 2పు.) జాగ్రత్తపడు, ఎచ్చరికపడు, తేరుకొను, మేలుకొను, వృద్ధిపొందు.
"కలికాలమిన్నియును గందు విందుఁగాని మఱి
యెలమి వొక్కటినైన యెచ్చరలేను" 1-382
"పాయపు మదమో యిది పట్టినట్టి చలమో
యీయడ నింతటనైనా యెచ్చరవయ్యా" 13-37

ఎచ్చు : అ.క్రి. గొప్పనగు, అతిశయించు.
"నిచ్చలు శ్రీవేంకటేశ విధానము నీ భక్తి
యెచ్చినాఁడ నింతటా నీడేరే జన్మము" 6-172

ఎచ్చుకుందులాడు : (3) హెచ్చుతక్కువలు పలుకు.
"పచ్చిదేర నవ్వితేనే పట్టి వెనఁగుట గాక
యెచ్చుకుందు లాడఁగాను యెరవులే కావా" 26-411

"ఇన్నాళ్లు నెఱఁగనైతి నెచ్చుకుందులాడితినీ
వన్నెదీయ మెరసేది వనితా భూమిని" 7-27

ఎచ్చుకుందులు : (10) *వి; బహు.* హెచ్చుతగ్గులు.

"ఎచ్చుకుందు లిద్దరిలో నేమేమి గలిగినా
పచ్చివెచ్చి రతులలోపలఁ దేరీఁగాని" 24-80

ఎచ్చుకొందులాడు : అ.క్రి. ఎచ్చుకుందులాడు, ఎక్కువ తక్కువ పలుకు.

"నొచ్చనోవని నోరిలోనే వుండఁగాను
యెచ్చుకొందులాడ వచ్చేవేరా నీవు" 17-339

ఎజ్ఞము : (3) వి. 'యజ్ఞము'నకు జానపద వ్యవహారరూపం.

"భూమిసురలెజ్ఞములు పూని సేయుదురు బ్రహ్మ
కేమంత్రాలఁజేయు నతఁడెవ్వరిఁ గూర్చి"
15-314

ఎజ్ఞభాగాలు. 2-371

ఎటిపెటి : క్రి.విణ. ఎదురెదురుగా, సరికిసరిగా ఇత్యాది అర్థములు కావచ్చు. ఇంకను విచార్యము.

"పచ్చిగా నెటిపెటికిని బాగాలొత్తి యిచ్చుకొంటా
మచ్చిక లెంత చూపేవే మఱఁగునను" 23-64

ఎట్టకేలకు : క్రి.విణ. చివరకు, చాలాసేపటికి, అతికష్టంమీద.

"యెట్టకేల కిటు మాతో యేలాటాలాడితినే
పట్టినా నీ మనసున పంతపు నా సేవలు"
19-200

ఎట్టనెదుట : (2) క్రి.విణ. 'ఎట్టయెదుట'కు వ్యావహారిక రూపం. మిక్కిలి ఎదుట. ఇట 'ఎట్ట' శబ్దాన్ని ద్రుతప్రకృతికంగా వాడడం విలక్షణం.

"గుట్టున నన్నింతలోనే కూడై శ్రీవేంకటేశుఁడు
యెట్టనెదుట నా మోహమెంత సేసీ నన్నును"
12-341

"తక్కక నీ మోము చూడఁ దమకించీ నాతఁడు
నెక్కొని యెట్టనెదుట నిలుచుండవే" 29-163

ఎట్టనెదుర : ఎట్టయెదురకు వ్యావహారికరూపం. మిక్కిలి ఎదుట.

"అట్టె కోపించకుమీ అడిగే నే నొకమాట
ఎట్టయెదుర నున్నాపె యే మౌరా నీకు" 7-64

ఎట్లన్ : క్రి.విణ. ఎట్టులన్, ఏవిధంగా.

"పొదిగి యాడ కెట్లఁ బోదుమే నేము" 22-14

ఎట్లనో : ఏ విధంగానో 'ఎట్లో' అనడానికి వ్యావహారికరూపం.

"ఏమి సోద్యమిది యెంతయును వెరగాయ
ఈ మగువ విభుఁగలయు టెట్లనో యనుచు"
5-234

ఎడకాటము : వి. 1. తార్పుడు, వియోగం, ఎడబాటు 2. మఱుగు. ఎడకాటమనే ఈ శబ్దం ఏ నిఘంటువులోనూ కానరాదు. ఐతే ఎడకాడు, ఎడకత్తె అనే పదాలు తార్పుడుకాడు, తార్పుడుకత్తె అనే అర్థాల్లో కనిపిస్తున్నాయి. కనుక ఎడకాటము అంటే 'తార్పుడు' అనే అర్థాన్ని గ్రహించవచ్చు. 15 సం. పీఠికలో ఈ అర్థమే సూచింపబడింది. (పుట.8)

"ఎందునుఁ బొందని ఎడకాట మిదె యని
యిందిరనాథుని సేవించు మనసు" 15-117

ఎడగాళ్ళు : *వి; బహు.* మధ్యలో ఎడం కల కాళ్లు.

"తొక్కె యక్షకుమారునిఁ దుంచి యడగాళ్ల సంచి
నిక్కించెను తోఁక యెత్తి నింగిమోవను" 10-167

ఎడగొల్లకత్తె : వి. ఎడకత్తె అంటే దూతిక. ఎడగొల్లకత్తె అంటే గొల్ల దూతిక అని అర్థం చెప్పవచ్చు. గొల్లఎడకత్తె కు బదులుగా ఎడగొల్లకత్తె అని ప్రయోగించినట్లున్నది.

"ఎడగొల్లకత్తె యీపె యెవ్వతోయి
అడియాలాలెత్తీ నాతో నానతీవోయి" 16-589

ఎడతాఁకు : వి. బాధ (పద.) కలియుట, రాకపోకలు చేయుట.

"చెక్కులు నొక్కకురా చిత్తమెల్లాఁ జిల్లులౌ
తక్కరితనాల యెడతాఁకులే చాలు" 26-100

"ఎనయు నానలకు గుటి యెడతాఁకులే చెలియ
నునుపులకు గుటి సెలవినవ్వు లివియే" 7-35

ఎడతాఁకు: స.క్రి. చేరు, సంధించు, బాధపడు (పద.)

"ఎండలకు నీడలకు నెడతాఁకినాడు" 16-2-56

ఎడదవ్వులు: వి; బహు. మిక్కిలిదూరములు, హృదయమును తవ్వుటలు.

"చెంది సెలవులఁజిమ్మి చిఱునవ్వులు
యిందరిలో నీకు నవి యెడదవ్వులు" 26-319

ఎడపడు: ప.బం; అ.క్రి. ఆలస్యమగు, లోపం కలుగు (పద.)

"ఎడపడకందు కంటే నెక్కుడైన బంధము
కడునాసఁ బొరలించు కనకము" 3-361

ఎడపదడప: అవ్య. అడపాదడపా, అప్పుడప్పుడు.

"వెడఁగుఁదనము విడువలేదు వేదమైనఁ జదువలేదు
ఎడపఁదడప నిట్ల నీకు నేమి సేతువయ్యా" 5-67

ఎడపు: వి. శూన్యం, లేమి, ఎడఁబాపటం.

"యెదిరిఁ దన్నుఁ గానని యెడపుల గుడ్డికన్ను
మొదలఁదెఱచె నేమి మూసెనేమి" 1-456

ఎడపులవారు: వి. లేమి కలవారు (ఎడపు=లేమి) ఎడయు అంటే 'ఎడబాయు' అని అర్థం. "ఎడపు' అనేదాన్ని ఎడయు ధాతువు కృదంతరూపంగా భావిస్తే ఎడపు శబ్దానికి ఎడబాటు, విరహం అనే అర్థం రావచ్చు. అప్పుడు ఎడపులవారు అనేదానికి విరహిణులు అనే అర్థం చెప్పవచ్చు.

"ఎడపులవారము నేమే మెరుగుదుము మీ
తడబాట్లేమి గల్లా తనువు లెరుగును" 14-336

ఎడమాటలు: వి; బహు. సంధిమాటలు. ఎడ=స్థానం, అవకాశం, దూరం, గడువు, భేదం, విఘ్నం, వ్యవహారం, సంధి, దేవతానైవేద్యం.

"ఎడమాటలాడి యీ యినవంశుఁదేరఁ
గడు హనుమంతుడు గలిగెనే నీకు" అని రంగ.రా.

"తడబాటైన సిగ్గులు తనువుపై నుండఁగాను
యెడమాటల బీరాలు యిఁక నేడవే" 16-462

ఎడవాయు: (ఎడ + పాయు) విడిపోవు, దూరమగు. రూపాం. ఎడఁబాయు.

"ఇమ్ములఁ గలసితివి ఇందుకు లోనే నేను
యెమ్మెల కాతనితోడ యెడవాయఁగలనా"
23-415

ఎడసుద్దులు: వి; బహు. చూ: ఎడమాటలు.

"నవ్వులనె తనిసితి నయాలనే మొనసితి
యెవ్వరు నేమిచెప్పేరు యెడసుద్దులు" 11-62

ఎడాటము: విషయం; దీనికి ఆట అని కొందరర్థం చెప్పినారు. (శ.ర.) బ్రౌన్.

"కాంతల కన్నుసన్నల మెలంగుఁగదా మరు
నంబకంబు లాద్యంతము
లెంచి చూడ జవరాంధ్ర యెడాటములందు
శక్యమే" అని సారంగ. ప్రయోగం. 2-11

ఎడాడు: ప.బం. దూరంచేసి మాటలాడు.

"మాపుదాఁకా నేము మాటల నెడాడి
పైపై నూరకె బడలితిమి" 26-172

ఎడ్డ: వి. ఎడ్డెకు వ్యావహారికరూపం. ఎడ్డివాడు, తెలివి లేనివాడు, బుద్ధిహీనుడు, మోసగాడు. క. హెడ్డ, ఎడ్డ.

"నిన్నుఁ గొసరేటి యట్టి నేనే యెడ్డ నింతే కాక
యెన్నిమాటలాడినా నీ కేడ మొకదాకిరి" 7-457

ఎడ్డతనము: వి. మూర్ఖత్వం, తెలివిలేమి.

"నడపెడి యీ జగములన్నియును నటనలు నీవట తొలుతనే
యెడయక యిందే వినోదించెదవు
యెడ్డతనంబా నీకేమి" 8-257

ఎత్తలఁగొండలు: ఎత్తైనకొండలు. ఎత్తల్ అని ఎక్కడ అను నర్థమున కన్నడపదము గలదు. కాని, ఎందు అనే పదము ఈ వాక్యమందే యున్నది. కనుక పునరుక్తి అగును అని సం.ప.స. (14 సం.)

ఎత్తల : (ఏ + తల) ఎప్పుడు, ఎక్కడ. (తల = సమయం, చోటు)

"ఎత్తల నెవ్వతెనైనా నిన్నేమైనా నాడినాను
వుత్తరువు చెప్పే నేను వొద్దు నీకు వెరపు"

24-565

"ఎత్తలఁజూచిన నన్ను నెక్కువగా మన్నించె
హత్తి ఇంత బుజ్జగించి యాదరించవలెనా"

22-233

"ఎత్తల నేరిచితివో యిటువంటి బిన్నాణాలు
మత్తిలి నీవైతే నిసుమంతదానవు" 28-440

ఎత్తాదించుక : ఎత్తుకొని దించుకొని.

"చేతులు పైఁజాఁచఁగాను సిగ్గుపడవలసె
యేతువ లెత్తాదించుక యిందరిలోన" 8-254

ఎత్తినవారి చేతిబిడ్డఁడు : ప.బం. ఎవరు కాస్త మంచి మాట మాట్లాడితే వారివైపు ఉండేవాడు. ఒక పద్ధతిలో నడువక బహుముఖాల వర్తిల్లేవాడు.

"కాచే పూచే మాకులైన కడలకు దొబ్బేని
చేచేత నెత్తినవారి చేతిబిడ్డఁడు" 22-59

ఎత్తుకోలు : వి. కోరిక, యత్నం.

"యెలమి నీ వేడుకకు యెత్తుకొన్న యెత్తుకోలు
తెలిసినవాఁడ వీఁక దించవచ్చునా" 8-128

ఎత్తుదీయు : అ.క్రి. తఱుగుదీయు, బంగారుతూకమును తగ్గించడం.

"వన్నెకుఁబెట్టిన సొమ్ము వడి రాసి యెత్తుదీసె
మున్నిటివే వెనకాయ ముచ్చటాఁ దొలఁగదు"

2-4

ఎత్తుసేయు : దీనికి ప.పా. లో సమానమగు అనీ, తె.వ్యు.కో.లో కపటం పన్ను అనీ అర్థాలు ఉన్నాయి. ఐతే ఈ రెండర్థాలు ఇట కుదురవు. ఎత్తు అంటే ఉన్నతి కనుక ఇట ఎత్తుచేయు అనేదానికి గొప్పచేయు అనే అర్థం చెప్పుకుంటే సమంజసంగా ఉంటుందేమో.

"ఇంత నన్నెత్తుసేసితే ఇటు నిన్ను మెత్తుఁగాక
పంతమందరితో నాడ పగటా నాకు" 24-448

ఎదట : క్రి.విణ. 'ఎదుట' కు వ్యావహారికరూపం, ముందర.

"యెదట నున్నది చెలి యెక్కడ పరాకు నీకు
అది నీవద్దఁ గూచుండు మనఁగరాదా" 14-495

ఎదరొమ్ము : వి. ఎదురుఱొమ్ము, రొమ్ము నడిమి భాగం.

"పదర లేనైతిఁగాక పక్కనఁ బువ్వుల బంతి
ఎదురొమ్ము వేసితేను యేమనీనె యపుడూ"

11-502

ఎదిరించి ఉండు : అ.క్రి. ఎదురుగా ఉండు.

"ఎన్నడొకో బు ద్దెరిగి యీడేరేది జంతువులు
యిన్నిటా నీ మహిమలు యెదిరించి వున్నవి"

3-285

ఎదిరికి యినుమడిచేవానికి తనకు తగరమడువఁ దడువయ్యీనా : నానుడి; ఎదుటివాడికి కఠినమైన ఇనుము సరిచేసి ఇచ్చేవానికి మెత్తగా ఉండే తన తగరాన్ని సరిచేయడంలో ఆలస్యం జరుగదు. కష్టంకాదు. కష్టమైన పని చేయగలిగిన వానికి సులభమైన పని చేయడంలో సౌలభ్యమే ఉంటుందని భావం.

"ఎదిరికిన్మడఁచువాడు తనకుఁ దగరంబు
సఱచు టెంతటి భరమ్ము" అని నాచన సోమన.

ఎదుగా : క్రి.విణ. ఎక్కువగా, ఎదుగుగా. రా.సీ. వ్యవహారంలో ఈ అర్థంలో 'ఎదగా' అనే పదం ఉంది. ఎదుగు ధాతువు రూపం కావచ్చు. (సం.ప.స. 13 సం. 1 అను. 2 పు)

"ఎదురుగుదురు గాను యేల నవ్వీనే
యెదుగా తడవునుండి యేల నవ్వీనే" 13-48

"ఎదుగా సతుల దాను యేలేవాఁడు గాదా"

19-378

ఎదురాఁక : (ఎదురు + ఆఁక) వి. నిరోధం – అడ్డగింత అనే అర్థాల్లో జంటపదం, విఘ్నం.

"యెనయని జాగరాలు యెదురాఁకలు
కనుగొంటిని నీవీఁక రాఁగదవో చెలియా"

14-584

ఎదురు : స.క్రి. మార్కొను, ప్రతిఘటించు, ఎదురుపడు.
"అదే రాముడు సువేలాద్రిపై నిలిచె
ఎదిరితివి సీత యింక నేమమ్మా" 20-178

ఎదురు కట్ట(ట్టు)లన్ : (4) ఎదుటి ప్రదేశంలో, ముందటి ప్రదేశంలో. కట్టెదుట.
"ఒక్క మహాతేజంబెదురుకట్లఁ
గన్నులకు మిఱుమిట్లు గొన నిల్చినన్" అని శ్రీకాళ.మా. ప్రయోగం. 4-128
"నా యెదురుకట్టులనె నవ్వఁబొయ్యే వాపెతోడ
యీయెడ నప్పుడె యెంతకెత్తు కొంటివి"
11-321
"పైపై నెదురుకట్లఁ పంచదార వుండఁగాను
చేపట్టి యడిగితెచ్చి చేఁదు దిన్నట్లు" 6-103

ఎదురుగుదురుగా : (2) పరస్పరం నిల్కడగా.
"ఎదురుగుదురుగా నిది యేమే
పెదవులు గదలఁగఁ బెనఁగీఁదాను" 20-150
"మొదలఁదనపై నేను మోహము సేసినందుకు
ఎదురుగుదురుగాను యేమనీఁదాను" 27-266

ఎదురుత్తరము : (ఎదురు + ఉత్తరము) వి. ప్రత్యుత్తరం.
"మొదల నాతఁడె ముచ్చటలాడీ
యెదురుత్తరము నీ వియ్యఁగరాదా" 11-547

ఎదురుబడి : (2) వి. ఎదురుపాటు, ఎదురుపడుట, అభిముఖంగా రావడం.
"ఎలమి నాకెయు నీవు నెదురుబడి నుండి
సెలవుల నవ్వితివి సిగ్గులతోను" 19-297

ఎదురుబడు : అ.క్రి. ఎదురగు, ప్రతిఘటించు, ఎదురుగా వచ్చు.
"ఎదురుబడి సొలయ నింక నేలయ్యా
ముదముతోడ నీకు మొక్కేమయ్యా" 18-584

ఎదురుమాటాడు : *ప.బం; అ.క్రి.* అన్నదానిని కాదను, ప్రతిఘటించు.
"యెదురు మాటాడరాదు యేమని అడుగరాదు
కదిసి తనచే నెట్టు కత వినేనే" 26-391

ఎదురులుచూచు : *ప.బం; అ.క్రి.* 1. నిరీక్షించు 2. ముఖాముఖి చూచు.
"ఇంతి పానుపుపై నుండి యెదురులు చూచు నీకు
చెంత నీవున్నాఁడవని చెనకి నవ్వు" 22-530
"యెంతవొద్దు రాకుండినా నెదురులుచూతు నేను
చెంతనుండి పరాకైతే చే చాఁతు నేను" 23-74

ఎదురులేని మాట కదురువలెనే ఉండు : సామెత; ఎదురులేని మాట కఠినంగా ఉంటుందని భావం కావచ్చు.
"యెదురులేని మాట కదురువలెనే వుండు
పెదవిపై తేనెల ప్రియమేలే యింకను" 19-393

ఎదురెదురుకట్ల : *క్రి.విణ; ప.బం.* మిక్కిలి ఎదురుగా, మిక్కిలి ముందర.
"పొదిగి నేనుండఁగానే బూటకాలు సేసేవు
యెదురెదురుకట్ల నేరా నీవు" 20-410

ఎద్దు దన్నీనని గుజ్జము చాటుకేగు : ఒక బాధను తప్పించు కోవటానికి అంతకంటె పెద్ద బాధకు తలఒగ్గు.
"నీటుగ నెద్దు దన్నేనని గుజ్జము
చాటుకేఁగిన యట్టి చందమాయె" 1-203

ఎద్దుఁ బట్టిన సివము : *ప.బం; వి.* గంతులు వేయించేది. 11-3 భా 26 old.
"ఎద్దుఁ బట్టిన సివం బెఱుకమాలిన ప్రియము
లొద్దిక విహారంబు లుబ్బుఁ గవణంబు" 1-96

ఎద్దుబండి కంటి సంది : వి. అశాశ్వతం. బండి వెళ్లేప్పుడు దాని కంటి సందు కనబడదు.
"బుద్ధిలేని బుద్ధితోడ పొందుసేసుకొని
వచ్చి యెద్దు బండికంటి సంది నీఁగేము" 1-73

ఎద్దేమెఱుఁగు నడుకుల చవి : సామెత;
"ఆఁపఁగ నెద్దేమెఱుఁగు నడుకుల చవి మూట
మోపరివి నీకు నా ముదము ముద్దా" 1-87

ఎద్భావం తద్భవతి : "యద్భావం తద్భవతి" ఇందులోని యద్భావం 'ఎద్భావం' గా

ప్రయోగింపబడటం విలక్షణం. దేన్ని భావిస్తే అదిగా మారుతుంది అని అర్థం.

"ధరలో నెద్భావం తద్భవతనెఁగాన
హరిమయమే జగమంతాను" 2-435

ఎనగొను : అ.క్రి. ఈ పదం ప్రధాన నిఘంటువుల్లో కానరాదు. ఆం.క్రి.మ.దీ.లో పొందు అనే అర్థం చూపబడింది. ఇందుకు కు.సం. ప్రయోగం ఉదాహరించబడింది. 3.ఆ.

"ఎనగొని శ్రీవేంటేశు శరణమిటు
గని మన కుండిన గతి యిఁక నేది" 1-432

ఎనయు : అ.క్రి. 1. సరిపోలు 2. వ్యాపించు 3. కలుగు 4. కలియు 5. లభించు 6. ఒప్పు 7. మూఁగు 8. సంగమించు. స.క్రి. 1. పొందు 2. పోలు 3. తాకు 4. అనుభవించు, రతియందు కలియు 5. గ్రహించు.

"పెనఁగి పెనఁగి వట్టి బిగువులు బిగిసితే
ఎనసునా పొందులు యెరవులే కాక" 12-319

"చన్నులు గట్టిన యాపె చలపట్ట కేల మాను
యిన్నిటా నాపెకు లోనై యెనతువు గాక" 21-70

"యెంగిలిపొత్తు గలసి యెనసేకొరకుఁగాక
సంగతిగా మోవియ్యా రాజసమా నాకు" 27-146

ఎనుపోతుతో నెద్దు నేరు గట్టినట్లు : లోకోక్తి. సాటికానిదానితో సంబంధం కలుపు, తగని దానితో సంబంధం కలుపు. ఎద్దు మంచి బలమైన జంతువు. ఎనుపోతు కాదు. ఐనా ఈ రెండింటిని అరకకు కట్టితే దున్నడం సాధ్యం కాదు కదా!

"ఎనుపోతుతో నెద్దు నేరుగట్టినయట్లు
యెనసి ముందర సాగదేఁటి బ్రదుకు" 1-156

ఎన్నిక : (3) వి. 1. గణనం, లెక్క 2. సంకల్పం 3. అపకీర్తి, నింద 4. ఊహ, ఆలోచన 5. ప్రసిద్ధి 6. ఎన్నుకోవడం. విణ. కోరదగింది, తగింది, గణనీయం, శ్రేష్ఠం.

"ఎన్నికనామము లిటు నీవై యుండఁగ
యిన్ని నామములవా రిది యెవ్వరు" 1-93

ఎన్నికలకెక్కు : ప.బం; అ.క్రి. ప్రసిద్ధికెక్కు, గణనకెక్కు. రూపాం. ఎన్నికెకెక్కు.

"అన్నిటా నొక్కటియైతే నైనదేమి కానిదేమి
యెన్నికల కెక్కితేను యీడు జోడేది" 11-26

ఎన్నికి : (ఎన్ని + కి) ఎన్నింటికి (?)

"కేరడాన నంతలో గిలిగించేవు సందులు
యీరీతిఁ దప్పించుకొని యెన్నికొఁజెలియ"
23-267

ఎన్నికె : (15) వి. 'ఎన్నిక'కు వ్యావహారికరూపం. చూ : ఎన్నిక. అన్నమయ్య ఎన్నిక శబ్దాన్ని విరళంగానూ, 'ఎన్నికె' శబ్దాన్ని బహుళంగానూ ప్రయోగించినాడు.

"ఎన్నికెతో గోమంతమెక్కి జయము చేకొని
మన్ననతో మధురకు మరలినట్లు" 3-433

ఎన్నికెకెక్కు : (3) ప.బం; అ.క్రి. ప్రసిద్ధికెక్కు, గణనకెక్కు. 'ఎన్నికె' 'ఎన్నిక'కు వ్యావహారికరూపం.

"ఇన్నిటా జాణవు నీవు యెవ్వరు గుద్ది చెప్పు
యెన్నికె కెక్కిన నీ ఇంటిలోనివారము" 27-7

"నిన్నుఁజూచి వెరగయ్యీ నేఁడు మాకందరికిని
యెన్నికెకెక్కినవాఁడ వింత సేయఁదగునా"
27-71

ఎబ్బిడి : వి. ఈ పదం నిఘంటువుల్లో కానరాదు. అసహ్యం, తక్కువతనం.

"సరసము లాడఁగానే చవులు గానిపించుఁగాక
యెరపరికము లైతె యెబ్బిడి గాదా" 7-363

"ఎబ్బిడేల శ్రీవేంకటేశ యలమేల్మంగను
అబ్బురాన నన్నేలితి వతిజాణ ననరా" 12-399

ఎముకల యిల్లు : (3) ప.బం; వి. శరీరం, అస్థిపంజరం.

"యెవ్వారు నెఱఁగని యెముకల యింటిలో
పవ్వళింపుచున్న బ్రాహ్మఁడు" 1-209

ఎమున : వి. 'యమున'కు వ్యావహారికరూపం.

"సిసువవై యెమునలోని చీకటి నీ తప్పులా
యెసఁగిన నాతోడి యియ్యకోలుఁజాతలు"
7-259

ఎమ్మె: వి. 1. విలాసం 2. చక్కదనం 3. గర్వం.
"ఎమ్మెల నాలిమగని కిద్దరికిఁ దగునయ్యా
మమ్ముఁబోంట్ల నన్నిటా మన్నించుఁడీ అయ్యా"
20-334

ఎమ్మెకాఁడు: వి. విలాసవంతుడు, అందగాడు.
"నిలువరా యెమ్మెకాఁడ నీవు మమ్ముఁ జెనకక
కలసేవు వట్టి పొత్తు కానవా నిన్నును" 14-266

ఎమ్మెలకాఁడు: (ఎమ్మెలు + కాఁడు) వి.
విలాసవంతుడు, ఎమ్మెకాఁడు.
"యెమ్మెలకాఁడవు గావా యిందుకు రాజవు
గావా
దొమ్మికాఁడవైతే నీకు దూరుగట్టవలెనా" 20-550

ఎమ్మెలాడు: (ఎమ్మెలు + ఆడు) అ.క్రి.
విలాసములు చూపు.
"ఇందుకుఁగా నీ వేల యెమ్మెలాడేవు
అందరి ముందర నాపె నాఱడిఁ బెట్టెదరా"
21-177

ఎరఁగు: (108) ఎఱుఁగు కు వ్యావహారికరూపం.
తెలియు. 'అన్నమయ్య' ఈ రూపంతో పాటు
ఎఱగు, ఎఱుఁగు, ఎరుఁగు అనే రూపాలను
కూడా వాడినాడు. ఎఱఁగు అనే రూపాలే
అత్యధికం.
"చిత్తమెరఁగనియట్టి చెలిఁ జేరి కూకులును
వత్తులునై విరిగిన వాఁడెపో కూళ" 20-41

ఎరపరము: వి. ఎరపరికము నకు రూపాంతరం
కావచ్చు. కోపతాపం, (?) రోత, అసహ్యం.
"సొరిది నీపై నవి సోకి వచ్చెనో
యెరపర మే లానతీయవయ్యా" 13-178

ఎరపరికము: (10) వి. 1. అసహ్యం, రోత 2.
ఆశ్చర్యం, ఆసక్తి. రూపాం. ఎఱబఱికము
(వ్యు.) భేదం, అరమరిక. (ఎఱబఱికము =
రోత అని ఆం.ప.ని.)
"ఎరపరికపు పొందు లిపుడేఁటికే
కరుణ గలప్పుడే కనుపట్టీఁగాక" 14-299

ఎరవు: (30) వి. 1.విలక్షణం, వికృతం,
విపరీతం, అస్వస్థం 2. అన్యం, లాతి,
అపరిచితం, అజ్ఞాతం 3. చేబదులుగా తెచ్చినది
4. అశాశ్వతం, క్షణికం 5. తాత్కాలికంగా
ఉపయోగించు కోవడానికి తెచ్చిన వస్తువు .
బేధం:
"ఎరవు లే కిద్దరమూ నియ్యకోలై యుంట గాక"
12-248
"కరఁగించే నవఁగానె కాఁగిటఁ గూడి చొక్కె
యెరవు లేక చనవియ్యవే నీవు" 9-280
"ఎంతయినా మీలోన యెరవున్నదా
చెంతనున్న తీగెలె కా చిగిరించేవి" 7-84
"ఇయ్యకోలైన చోట యెరవులేల" 16-84
"మగఁడైన పిమ్మటను మరి యెరవేమిటికి
తగు సతులకు లోనై దక్కవలెను" 25-121
తాత్కాలికంగా ఉపయోగించుకోవటానికి
తెచ్చుకొన్నది:
"ఇంటిదాన నుండఁగా ఎరవు సతమా నీకు
పెంటవెట్టుక నావద్దఁ బ్రియాలు చల్లేవు" 9-269
"పట్టరాని తమితోడ బాఁతిపడే మింతేకాక
యెట్టు సేసినా నీకు యెరవు సతమయ్యీనా"
29-516
అన్యం:
"ఎరవుగాఁజూచేవు యేరా నీవు" 11-295
క్షణికం:
"సరసాన నీవు నవ్వు చల్లినయంతటనుండి
యెరవాయ నిద్దురలు యెనసేవో లేవో" 26-4
విలక్షణం, వికృతం, విపరీతం :
"పావనపు హరినామపఠన పుణ్యుల మెచ్చు
ఈవలావలి మూర్ఖుల కెరవయి తోఁచును"
15-277

ఎరవుచేయు: స.క్రి. ఉపేక్షించు, వేఱుచేయు,
పరాయిదానిగా భావించు (పద.) వేరుగా
చేయు, వేరుగా తలచు.
"ఎరవులు సేసుకొని యెగసక్కెమాడెనా
ఎరవులు సేసేనా యెగ్గులు నే బట్టేనా" 25-109
"ఒరసి సతి నీ తోవ నూరకే నటుండితేను

యెరవులు సేసుకొనే వేమే నీవు" 9-192
"శిరసు వంచుకొంటిని చెరఁగు నీవు వట్టితే
యెరవుసేయకు నన్ను నిదివో మొక్కేను"
7-534

ఎరవుల చెలి : వి. అన్యస్త్రీ.
"చేవదేరఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
యేవ లేల వచ్చెనోకో యెరవుల చెలికి" 11-66

ఎరవులది : (ఎరవులు + అది) వి. పరాయిది, అన్యురాలు.
"ఎరవులదానఁగాను యెంతైనా నే నీకును
సురతవిద్యల కెల్లా చుట్టమును సుమ్మీ"
19-250
"ఎరవులదానఁగాను యెగ్గు పట్టేదానఁగాను
చెప్పరే మీరైనా బుద్ధి చెలువునికి
ఇప్పుడెంత బజ్జగించీ నెరవులదాననా" 12-438

ఎరవులయాతఁడు : వి. అపరిచితుడు, అజ్ఞాతుడు, అన్యుడు, విపరీతుడు, తాత్కాలికంగా ఉపయోగించుకోవడానికి తెచ్చుకొన్నవాడు.
"యెరవుల యాతనికి యేమి విడె మిచ్చేవే
మరగించుకొంటేను మరి నీవే సతివి" 25-445

ఎరవులవాఁడు : (2) వి. ఇతరుఁడు, పరాయివాఁడు.
"వరుస దప్పితే నాడవారిమీఁది యానే సుమ్మీ
యెరవులవారమైతి మిఁక నేడ సుద్దులు" 7-28
"తెరమరగు సన్నలు తెగని యాసలు చూపు
ఎరవులవారి పొందులెంత లేదే తనకు" 12-234

ఎరవుల విషయాలు : వి. పరాయి విషయాలు.
"ఎరవుల విషయాల నేల పొరలవలె
జిగురువంటి బందాలఁ జిక్కనేల వలెను" 10-49

ఎరవుల సరసాలు : *వి; బహు.* (?)

ఎరవెరవు : (ఎరవు + ఎరవు) విణ. విలక్షణం, వికృతం, విపరీతం, అస్వస్థం.
"తరుణిలే వచ్చితిరి తానాడనున్నాడు
యెరవైరవై తా నేమనెనే" 7-329
"గరిమ మొక్క వచ్చిన కాంతఁగౌఁగిలించ కుంటే
యెరవెరవై తోఁచదా యెవ్వరికైనా" 7-386

ఎరికెత : వి. ఎఱికత, సోదెకత్తె. బండి 'ఱ'కు బదులు సాధురేఫం.
"వచ్చే మీఁది పని చెప్పేవా యెరికెత నీవు
వచ్చేది నా కాఁగిలేరా వంతుల నీకు" 23-109

ఎరివి : వి. త. కాలడం.

ఎరుఁగు : స.క్రి. ఎఱుఁగు, తెలియు. బండి 'ఱ' కు బదులు సాధురేఫం.
"సంగతెరుఁగునా" 18-445
ఈ అర్థంలో ఎరఁగు, ఎఱఁగు, ఎఱుఁగు అనే రూపాలు కూడా ప్రయోగింపబడ్డాయి.

ఎరుఁగుకొను : (2) స.క్రి. ఎఱుగుకొను, తెలుసుకొను, ఎఱుగు ధాతువుపై 'కొను' అనుప్రయుక్తం కావడం మాండలికం.
"మేకొని యాపె బలిమి మెరఇంచవలసితే
యేకతాననుండి సాము లెరుఁగుకోరాదా"
27-20

ఎరుకగు : అ.క్రి. తెలియు. ఈ మాండలిక పదం రా.సీ.లోనూ, తెలంగాణంలోనూ వాడుకలో ఉన్నది.
"అందపు శ్రీ వేంకటేశ అప్పటి నన్నుఁగూడితి
విందు నా రితాకు నీ కెరుకాయనో" 16-117

ఎర్లించు : (?)
"దిట్టలై ముచ్చటలుగా తీపులు మాటలాడేరు
యిట్టె తేనె గారీ నిప్పలెర్లించే పొద్దు" 8-176

ఎఱఁగు : (252) 'ఎఱుఁగు'కు వ్యావహారిక రూపం. తెలియు. చూ : ఎరగు. ఎరగు కన్నా ఎఱగుకు ప్రయోగాలు ఎక్కువగా ఉన్నాయి.

ఎఱఁగుకొను : ఎఱుఁగుకొను ; తెలుసుకొను. ఎఱుగు ధాతువుపై 'కొను' అనుప్రయోగం విలక్షణం.
"ఇంతి ప్రతాపము నీవే యెఱఁగుకొనేవు గాక
వింతలుగా వేరే నేము విన్నవించవలెనా"
29-248

ఎఱపరికము : (3) వి. రూపాం. ఎరపరికము, ఎఱబఱికము, రోత, అసహ్యం, ఆశ్చర్యం, ఆసక్తి, భేదభావం, అరమరిక.

"ఎఱపరికము లేల యెంతోసేవ్రూ

తఱవాతి పనులకుఁ దడవు గాదా" 12-39

ఎఱికత : వి. రూపాం. ఎఱుకత, ఎరికెత, సోదిచెప్పేది.

"ఎఱికెతనా నీకు యేమోయి మాపై

వొఱగుంటే నేమాయనో వోవోయి" 7-250

ఎఱికెత : వి. సోదె చెప్పే స్త్రీ, ఎరుకసాని .

"యెఱగవా మా గుట్టు యేమోయి మమ్ము

ఉఱక గుట్టరసేవు వోవోయి

యెఱికెతనా నీకు యేమోయి - మాపై

వొఱగుంటే నే మాయనో - వోవోయి" 7-250

ఎఱుఁగు : (16) తెలుసుకొను ; అన్నమయ్య ఈ అర్థంలో ఎక్కువగా ఎరఁగు, ఎఱఁగు అనే రూపాలనే వాడినాడు.

ఎఱుఁగుకొను : స.క్రి. తెలుసుకొను ; ఎఱుగు మొదలైన కొన్ని ధాతువులపై 'కొను' అనుప్రయుక్తం కావడం రా.సీ. మాండలికంలో కనబడే లక్షణం. ఉదా : "ఉండుకొను మొ॥

"ఈ రమణి తెలఁగు నీ వెఱుఁగుకోవయ్యా"

23-63

తెలియు ధాతువు పై 'కొను' అను ప్రయుక్తం కావడం ఉంది. కాని ఎఱుగు ధాతువుపై అను ప్రయుక్తం కావడం విలక్షణం.

ఎఱుక : (ఎఱుఁగు + క) 1. తెలివి, జ్ఞానం 2. స్మృతి 3. జోస్యం 4. గుర్తు, చిహ్నం 5. పరిచయం 6. సోదె.

"తాలిమిలో హరిఁదలఁచక యెఱుకెల్ల

గాలిఁబోవుట పూర్వకర్మశేషం" 1-113

ఎఱుక మఱపు : వి. తెలిసినది మరచిపోవడం, జ్ఞాపకం ఉంచుకోవడం - మరచి పోవడం.

"ఎఱుకమఱపు లేదా యెవ్వరికైనా

వొలుపున నెగ్గు లెంచకుండవలదా" 17-366

"అంది నిద్దిరించువాఁడ నటు మేలుకొనువాఁడ

బొందితో నెఱుకమఱపులకు నొక్కఁడనే" 3-497

ఎఱుకముడి విశ్వాసము : వి. ఈ పదం ఏ నిఘంటువులోనూ కానరాలేదు. జ్ఞానగ్రంథిపై విశ్వాసం, తత్వంపై నమ్మకం. 11-169

ఎఱుకలది : (ఎఱుకలు + అది) సోదె చెప్పే స్త్రీ, ఎఱుకత, ఎఱుకలసాని.

"తఱిఁ దనలోని మేలు తానె యెఱుఁగుఁగాక

ఎఱుకలదానివలె నెట్టు చెప్పీనే" 14-189

ఎఱుకలుసేయు : అ.క్రి. తెలియఁజేయు, చెప్పు,తెలుపు.

"తఱినిట్టి పనులెల్లా తగ నీ వెరఁగవలె

ఎఱుకలు సేసునా యిల్లాలు" 7-454

ఎఱుక లేదు : అ.క్రి. తెలియదు. రా.సీ.లోనూ, తెలంగాణంలోనూ ఇది మాండలికపదం.

"వలపు చెప్పఁగరాదు వయసుపైఁ బూయరాదు

ఎలమి నాతనికైతే నెఱుకలేదు" 16-278

ఎఱ్ఱశిల కనుమ : వి. ఇది రాజంపేట సమీపంలోని పోలి-అప్పరాజుపేట దగ్గర ఉంది. దీనికి కడియాల పల్లెకనుమ అని నామాంతరం. (క.అ.క.కీ.30 పు.)

"ఇది వో నీ కెమ్మోవి యెఱ్ఱశిల కనుమ

కదిసి లేఁజిగురులఁ గప్పుకొన్నది" 5-115

అన్నమయ్య ఈ కీర్తనలలో ఆరు కనుమలను పేర్కొన్నాడు. ప్రతికనుమ దగ్గర ఏ వైపుననో ఒకవైపున చెన్నకేశవస్వామి వారి ఆలయం ఉండడం విశేషం. ఈ కనుమలు షట్చక్రాకారంలో ఉన్నాయని, షట్కోణాంత్గతాలని పెద్దలంటారని మై.వేం.సు. గారి అభిప్రాయం. 5 సం. పీఠిక 39, 40 పు.

ఎలగోలు : వి. కలకలం, ముందు నడవడం, మొదటి ప్రసరణం, మొదట సటసటమని వచ్చు వాన. విణ. ముందు నడిచేది, మొదటిది.

"వలపుల దాడి వచ్చె వనితలారా మరుం

డెలగో లేయంగఁజొచ్చె నేలాగే" 6-15

ఎలయించు : స.క్రి. 1. పురికొల్పు, ప్రోత్సహించు 2. తీసుకొనిపోవు, ఆసక్తిపఱచు,

కలిగించు, పొందించు, ప్రవేశింపఁజేయు, చేర్చు (శ.ర.)

"వురియై తగులుఁ గర్మ మూడిచితే నూడును
యిరవైన హరిమాయ ఎలఇంపుచున్నవి"
4-474

"గుట్టుతో మంచితనాలే కోరి చూపవలెఁగాక
ఎట్టయెదుటనే వుండె ఇంత యెలయింతురా"
28-300

ఎలయింపు: వి. ఆసక్తిపరచుట, కౌఁగిలింత

"చలమా శ్రీవేంకటేశు సంగతి నీ వుండవో
యెలయింపుఁగోరికల కేల పారే వీఁకను" 4-14

ఎలయింపుకాఁడు: (ఎలయింపు+కాఁడు) వి. ఆసక్తి కలిగించే వాఁడు (ఎలయు = ఆసక్తిపడు), సంతోషింపజేసేవాడు, సొగసుకాడు, రంజకుడు.

"అచ్చుగా నా సరులంటీ నాసోదకాఁడు
యిచ్చటనే కాచుకున్నాఁ డెలయింపుకాఁడు"
18-105

ఎలయింపులాఁడి: (3) (ఎలయింపులు + ఆఁడి) వి. విలక్షణమైన ప్రయోగం. ఆసక్తి కలిగించే స్త్రీ, సొగసుకత్తె చూ: ఎలయింపుకాఁడు.

"అలమేల్మంగపతి నన్నలమె శ్రీవేంకటేశుఁ
డెలయింపులాఁడివి నీ వెంత నేరిచితివే" 29-33

ఎలుఁగించు: (ఎలుగు + ఇంచు) అ.క్రి. 1. కూయు 2. పిలుచు.

"సొలసితే నంతలోనే పొదిగి కాఁగిలించేవు
ఎలుగించితే తల యెత్తి చూచేవు" 20-175

ఎలుగిచ్చు: (2) ప.బం; అ.క్రి. 1. పిలుచు 2. పలుకు, మాట్లాడు, బదులుపలుకు.

"పలుకకుండఁగ నన్నుఁ బచరించి పచరించి
ఎలుగిచ్చి యాడేవెంత సేసేవయ్యా" 14-378

"ఎడనెడఁగోయిలలు యెలుఁగియ్యఁదొడఁగె"
16-37

ఎలుతగుబ్బలు: వి; బహు. వలుదగుబ్బలు, లావైన గుబ్బలు.

"ఎలుతగుబ్బలు నీకు మీదెత్తుక వున్నది
పలచని మోవి జన్నె వట్టుకున్నది" 28-359

ఎల్లందు: (ఎల్ల + అందు) అంతటా.

"ఉల్లము శ్రీవేంకటోత్తమ శరణని
యెల్లందుఁ దుదిపదమెక్కిరి గాన" 4-86

"నిను నెల్లయందుఁ బ్రోచు" అని ఉ.హరి.ప్రయోగం. పూర్వ. 5-162 చూ: భాగవత ప్రయోగం.

ఎల్లనాఁడు: (ఎల్ల + నాఁడు) ఎల్లప్పుడు.

"వల్లెతాట రోలఁగట్టువరచినను పరచినను
ఎల్లనాఁడు మానఁడింక నేమి సేతువే" 24-103

ఎవురు: వి. 'ఎవరు' కు రా.సీ. మాండలికరూపం.

"రాతిరిఁ బగలీతని రతికిఁ గాచుకుండిన
యీ తరుణీమణులలో ఎవురిఁబోలుదువే"
29-351

ఎశోద: (5) వి. 'యశోద'కు వ్యావహారికరూపం.

"యెశోద నీ బిడ్డ నేమందుము
రాశికెక్క మమ్ము రక్షించుమనవో" 23-331

"పెక్కువగా నుట్లలో బిందెలు నించిన నీవే
చక్కనెశోద బిడ్డకుఁ జాటేరు సుండీ" 1-256

"యిల దేవకికిఁ బుట్టి యెశోద కొడుక వైతి
వెలమి నీ సుద్దులకు నిదివో దిష్టాంతము"
16-327

"ఏమమ్మ వూరకుండే వెశోదమ్మా
యీ మేఁటి బాలకృష్ణు నేమరకువమ్మా" 26-50

ఎస: ఆధిక్యం, అత్యంతం (ఆం.ప.ని.) నానార్థ.

ఎసరు: విణ. విజృంభించు, అతిశయించు, మీరు, సందడించు.

"కసరుచు హరిమీఁది కాఁకల కోపముతో
యెసరుఁజెమట గోర యెమ్మెలఁబిమ్ముచును"
5-372

ఎసరెత్తు: (2) (ఎసరు + ఎత్తు) ప.బం; అ.క్రి. విజృంభించు, ఎసరుపెట్టు, అపకారం చేయడానికి ఒడిగట్టు, హాని చేయతలపెట్టు,

ఎత్తులువేయు, నష్టం చూపించు, బాకీ ఎగగొట్టు.
"వసంతము లాడుతానే వడి నిన్నుఁగాగిలించి
ఎసరెత్తంగా మోహా లింతులెల్లాను"
"కొసరుచు నాతోఁ గూటమి సేసే
యెసరెత్తకుమీ యింకాను" 5-277
"ఎసరెత్తుక లేల్లేవని తోలక
పసఁదన విధిఁగల పాటే సుఖము" 3-545
"తోడ నెసరెత్తి లేళ్లఁ దోలేటి యట్టివారు
యీడనే విందులు చెప్పె రియ్యకోవయ్యా"
7-264

ఎసరెత్తుకొను : *ప.బం; అ.క్రి.* ఎసరుపెట్టు.
"ఎసరెత్తక వెళ్ళేవని తోలక
పసఁదన విధి గలపాటే సుఖము" 3-545

ఎసవెట్టుకొను : *స.క్రి.* ప్రేరేపించు, పురికొల్పు, ఎక్కులు పెట్టు.
"యెసవెట్టుకొని సతులెంత పతిఁదిట్టినాను
కొసరులై తోఁచుఁగాని కోపము రాదు" 25-133

ఏ

ఏఁకట : వి. మిక్కిలి అపేక్ష, మిక్కిలి కోరిక, మిక్కిలి ఆశ.
"ఏఁకటతో శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
తూఁకువ సుమ్మీ పిఱుఁదు తొడ లెక్కమనేవు"
19-307
"ఎన్ని మాఁటలాడినాను యేఁకటలు వాయవు"
20-530
"అలరి మర్మములంటే యాఁకలు మరేఁటికే"
29-2 (అను.)
"ఆఁకలిగొన్నవానికి – నన్నముపై నుండినట్టు
యేఁకట వుండవలదా యీశ్వరునిపై" 15-46

ఏఁకరు : (22) *అ.క్రి.* మిక్కిలి కోరిక కలిగియుండు, ఉవ్విళ్ళూరు, భయపడు, కృశించు, దుఃఖాదులచే శుష్కించు. రూపాం. ఏఁకారు.
"మరిగి రతికిఁ బలుమరు నేఁకరేటి దాని
అరిది కోవిల వనాలందు నాడించకురే" 29-264

ఏఁకరుకొను : *అ.క్రి.* మిక్కిలి అపేక్షపడు, మిక్కిలిగా కోరు.
"కొద దీర మాఁట పలుకులు నీతో నాడెఁగదే
కదలక యిందుకే యాఁకరుకొంటా నుంటివి"
29-358

ఏఁకారు : (17) *అ.క్రి.* 1. ఉవ్విళ్లూరు, మిక్కిలి కాంక్ష గలిగి యుండు 2. బాధపడు, భయపడు. రూపాం. ఏకరు.
"ఎదురు చూచి చూచి యేఁకారితిని
యిదివో నీ విట్లానైతే యేమనఁగవచ్చును"
23-398

ఏఁగుఁబెండ్లి : (4) (ఏగు + పెండ్లి) వి. పెండ్లియైన తరువాత వధూవరులను ఊరేగించే ఉత్సవం.
"పైపై నీ కిదివో పల్లకి పెట్టెంపె నమ్మ
యీపొద్దే తమకు నేఁడేఁగుఁబెండ్లి" 7-55

ఏఁటనేఁట : (ఏటన్ + ఏటన్) ప్రతి ఏడు, ప్రతిసంవత్సరం.
"ఒప్పుగ శ్రీవేంకటాద్రి నున్నతిఁగోనేటిలోన
తెప్పరిల్లె నేఁటనేఁట తెప్పతిరుణాళ్ళు" 2-143

ఏఁట బుట్టెడువాఁడు : వి. వసంతుడు (?)
"ఏఁటఁబుట్టెడివాఁడు నేడు దెరువులై
వ్రూఁటాడెడివాఁడు నొనగూడి" 5-139

ఏఁటలువేయు : పద.పా.లో ఏటవేయు అనే పదానికి భారం వేయు అనే అర్థం చూపబడింది. చూపులు నిగుడ్చు అని తె.తె.ని.
"వేఁగి లేచి సంసారవిధులకే ఒడిగట్టి
యేగతిఁ నొసరి నీపై నేట వేసేము" 4-2
ఈ అర్థం క్రింది ప్రయోగంలో కుదరడం లేదు.
"గాఁఅపు నా గుబ్బలు గదలించి పైపై
నేఁటలువేసే నిది యేమే తాను" 16-81
ఇట 'ఏటలు' కు బదులు 'ఏఁటులు" అని గ్రహిస్తే సముచితమేమో! 'ఏటవేయు' అనే దానికి 'భారంవేయు' అనే అర్థం మాత్రం ఈ కింది కీర్తనలో పొసగుతుంది.
"వేగిలేచి సంసారవిధులకే ఒడిగట్టి

యే గతిఁగొసరి నీపై నేటవేసేము" 4-2

ఏఁటవెట్టు : ప.బం; అ.క్రి. భారంవేయు ; ఏటు = బలిపిల్ల – మేక అనే అర్థమున్నది. తద్వారా ఏట వేయు = బలియిచ్చు, మొక్కుబడి చెల్లించు తొలి అర్థం కావచ్చు. అర్థమింకనూ విచార్యమని పద.పా. ఏటవేయు, ఏటవెట్టు సమానార్థకములే కావచ్చు. గురిపెట్టు అని త.తె.ని.

"మాటలలో తీపులును మాయదారి చూపులును

యేఁటవెట్టి నడపితి విందాఁకాను" 19-394

"ఈటుతో శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి

యేటవెట్టే యీలాగు లేమి చెప్పేమయ్యా"

12-285

ఆనందమూర్తిగారు దీనికి చూపు నిగుడ్చు, దృష్టిని సారించు అనే అర్థాలను సూచించినారు.

"యేఁటవెట్టి పతితోడ మాటలాడి వేగిరాన

గాఁటపుటందెలు తన కరమునఁ బెట్టీనే" 20-121

సంపాదకులు దీనికి అతిశయించు అనే అర్థాన్ని ఊహించినారు. ఎత్తిపొడిచి, వ్రేలుచూపి ఇత్యాదులుగ తోచుచున్నది. ఎత్తులువేసి ఆడుటకు కావచ్చునా" అని సంపా. (25-64)

అతిశయించు :

"మాటలనే తేనెలూరీ మంతనాన నోరూరీ

యేటవెట్టే నీ మహిమ లెక్కడెక్కడ" 27-292

ఏఁటి : 'ఏమిటి'కి వ్యావహారికరూపం, ఏమిటి, ఏరకం, ఏది.

"జాలిఁబడి సంసారజలధిలో మునిఁగేటి

కూళఁడ నాకేఁటి తేఁకువ పుణ్యము" 1-286

"ఎక్కడి దురవస్థ లేఁటి దేహము లోనఁ

జిక్కి జీవుఁడు మోక్షసిరిఁ జెందలేఁడు" 1-106

ఏఁటికి : ఎందుకు.

"మతిలో నాతఁడుండఁగా మాయలు మా కేఁటికి"

4-13

ఇందులోని అరసున్న విచార్యం. నిఘంటువుల్లో ఈపదంలో అరసున్న కానరాదు.

ఏఁడు : వి. ఏఱు.

"నీటి నడు మడచితే నేఁడు రెండౌనా

యేటి కింక గొంకేవు యింతిఁ జేకోవయ్యా"

9-75

ఏఁపు : స.క్రి. 'ఏఁచు' ధాతువునకు ప్రేరణార్థకం, బాధించు.

"ఎదుట నీవుండఁగాను యేపే మరుఁడో

అదివో గుండె బెదరి అవ్వలి మోమైతి యంటా"

7-316

ఏఁపులఁబెట్టు : స.క్రి. బాధలఁబెట్టు. (ఏపు = సంతాపం, బాధ)

"కాఁపురాలు సేసేమని కాచుకున్నవారి నింత

యేఁపులఁబెట్టితే నిన్ను నెట్టు నమ్మే రిఁకను"

25-101

ఏకచిత్తము : (18) వి. ఒక్కమనస్సు, ఏకాభిప్రాయం, సంతృప్తి.

"ఏకచిత్తమైనపు డిన్నియు మరె(ర)య్యీఁగాని

నాకు నీ వేళకు నీ నవ్వులె చాలు" 9-110

నిశ్చింత, సంతృప్తి :

"నీకుఁ గట్టినట్టి తాళి నీ మారు సేసుకొని

యేకచిత్తమున నే నింట నుండఁగా" 11-587

ఏకతమాడు : అ.క్రి. రహస్యంగా మాట్లాడు.

"యిద్దరమేకతమాడె యీవేళ మనవద్ద

గుద్దిరాన నాపె వచ్చి కూచున్నది" 9-4

ఏకతవేళ : (2) (ఏకతము + వేళ) వి.

1. ఆలోచనవేళ, సంప్రదింపువేళ
2. ఒంటరియైనవేళ, ఏకాంతసమయం.

"దగ్గరి నీ వున్నపుడే తలఁచఁగాని

సిగ్గున నేకతవేళఁ జింతింతురా" 12-44

ఏకమగు : అ.క్రి. (?)

"యీకడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె

యేకమాయ సగినము యింటికిఁ బోవయ్యా"

18-519

ఏకరాజ్యము : వి. ఏకచ్ఛత్రాధిపత్యం గల రాజ్యం.

"ఇన్నిటా నీ వేకరాజ్య మేలుదుగాక
మన్నన కాంత వైతివి మరి యాలే వెలితి "
7-274

ఏకసమ్మతి : వి. ఒకేవిధమైన అభిప్రాయం, ఒక్క మనసు.
"ఏరీతిఁ జూచినాను యేకసమ్మతి లేదు
సారము దెలియరాని సంసారికి" 3-256

ఏకాంగవీరుఁడు : (6) వి. ఒంటరివీరుడు, అసహాయశూరుడు, ఎదురులేని వీరుడు.
"విలసిల్లె నేకాంగవీరుఁడితఁడు
చలమరి కోదండదీక్షాగురుఁడితఁడు" 4-514

ఏకాంగి : వి. 1. విరక్తుడైన విష్ణుభక్తుడు, పుత్రమిత్ర కళత్రాదులను పరిత్యజించి భగవత్కైంకర్యమే పరమ ప్రయోజనమని కావి వస్త్రాలు కట్టు కొని భగవత్కైంకర్యార్థం శరీరాన్ని, ప్రాణాన్ని, అర్థాన్ని తృణప్రాయంగా చూస్తూ విరక్తుడైన విష్ణుభక్తుడు.
(2. ఒంటరీడు)
"విరులు యేకాంగులు వినువీథిఁ జల్లఁగాను
గురుతరముగ మించీఁ గోడతిరునాళ్లు" 18-281

ఏకాంతమాడు : అ.క్రి. మంతనమాడు, రహస్యము లాడు.
"పిప్పియై మేని కస్తూరి బేట్లెల్లా రాలఁగాను
యిప్పుడే మేకాంతమాడే నింతి నీతోను "
17-149

ఏకాంతవీరుఁడు : వి. ఏకాంగవీరుఁడు (?), 'గట్టివీరుడు' కావచ్చు.
"భువిఁ గవచకుండలములతోఁ బుట్టినవాఁడు
వివరించ నేకాంతవీరుఁ డైనవాడు" 4-486

ఏకాంతి : వి. ఏకాగ్రత కలవాఁడు, విష్ణుభక్తుడు.
"ఏకాంతు లిరువంక నెదిరి కొలువఁగ సకల
లోకేశ్వరుఁడు మెరయఁగాను" 5-228

ఏకాత్మవాది : వి. జీవాత్మ పరమాత్మలకు భేదం లేదని చెప్పే అద్వైతమతస్థుడు.
"ఏకాత్మవాదులాల యిందుకేది వుత్తరము
మీకు లోకవిరోధమేమిటఁబాసీ నయ్యలాల "
2-253

ఏకారు : స.క్రి. 1. అవలంబము లేక తిరుగు 2. దైన్యంతో యాచించు (ఆం.ధా.మా.)

ఏకార్ణవమునాఁడు : ప్రపంచమంతా ఒకే సముద్రమైననాడు అంటే ప్రళయకాలం నాడని అర్థం.
"ఈతఁడాకుమీఁదఁ దేలె నేకార్ణవమునాఁడు
యీతఁడే పోరి మనకిందరికి దైవము " 2-470

ఏకు : స.క్రి. దూఱు.

ఏకోదకము : (ఏక + ఉదకము) అంతా జలమయమగుట.
"ఏకోదకముగ వటపత్రమున యీఁదేటి నీకంటే
దీకొని పలికినకాలంబుల కొనదేవుఁడు మఱి
వేఁడీ" 4-104

ఏకోనారాయణుఁడు : వి. నిత్యుఁడొక్కడే యైన నారాయణుడు. (ఏకః + నారాయణుడు)
"నీకంటేనితరము మరిలేదు నేనెవ్వరితో
భాషింతు
యేకో నారాయణుఁడవు నీవని యెన్నుచు
నున్నవి వేదములు" 4-103

ఏగించు : స.క్రి. ఊరేగించు.
"ఎలమితో వీదులెల్ల నేగించినారు" 11-61

ఏటల మాయలు : వి. అధికములైన మాయలు. (ఏట = అతిశయం, అధికం)
"నాటుకొన్న తమకము నాకుకు నొక్కపాటె
ఏటలమాయల యెరవేఁటికింక" 10-2-17
"నాఁటించే యింతి కోరిక యానకు వచ్చుఁగాక
ఏటతో చెలుల మింతే యేమిసేసే మిపుడు "
23-500

ఏటవెట్టు : (?)
"గూటిలో దవ్వులవాఁడు కొండేలెల్లా
నునుపంటా
యేటవెట్టి యేఁగినట్లే హీహీ నేము" 1-94

ఏటావలిగిలిగింతలు : ప.బం; వి; బహు. కానిపని, అసంభవం, వ్యర్థం. ఏటి యవతలినుండి యివతలికి చేతులు చాచి గిలిగింతలు పెట్టడం అసంభవం కదా!

అలభ్యములు, ఏటికి అటువైపున ఉన్న సంబరాల్లో పాల్గొనడం అసంభవం. ఇట ఏరు దాటకుండా ఆటంకంగా ఉందన్నమాట. ఉన్నా లేనివాటితో సమానమైన సుఖం.

"కదియక ఆడనుండే కత లేల చెప్పేని

కెదటుచు నేటావలిగిలిగింత లంటునా" 22-2

-ఏటి : ఎడి, ఎడులకు వ్యావహారికరూపం.

"నుడిగేటి" 2-104

ఏటినడిమి పైరు : ప.*బం;* వి. అశాశ్వతం, వ్యర్థం. ఏటినడుమ పైరు వ్యర్థమే కదా! ఏరువచ్చినపుడు కొట్టుకొని పొయ్యేదే కదా!

"దాకొని విష్ణుని తెలియని తెలువులు

తగ నేటినడిమిపైరులు" 2-235

ఏటిలో పైరు : ప.*బం.* అశాశ్వతం, వ్యర్థం, పంట ఎంత బాగా పెట్టినా ఏటిలో పంట ఎప్పుడు ఏరువచ్చినా కొట్టుకొని పోయేదే కదా!

"ఏ పనులు సేసినా నిటువలెనే పో

యీ పనికిఁ జొరనిపని యేటిలోపైరు" 1-364

ఏటేఁటివి : ఏవేవి, ఏమిటివి - ఏమిటివి, ఏవేవో.

"యేకతము చెప్పేనంటా నేటేఁటివో

పలికీని కాకు సేతురటవే కాంతలను" 13-47

ఏట్లపేడ : వి. తిరుపతినుండి తిరుమలకు వెళ్లేదారిలో పల్లవరాయ మఠానికీ, అవ్వచరి కోనకూ నడుమ ఉండే ప్రదేశ విశేషం.

"అక్కజంబైన పల్లవరాయ మటము అల
యేట్లపేడ గడవన్
చక్కనేగుచు నవ్వచరిఁగడచి ...."

1-227

ఏడ : (20) 'ఎక్కడ' అనే పదానికి వ్యావహారికరూపం. అన్నమయ్య 'ఏడ' అనే పదాన్ని ఎక్కువగా వాడినాడు. రా.సీ. లో నేటికీ ఈ పదానికే ఎక్కువ వాడుక. అన్నమయ్య ఎక్కడ అనే పదాన్నికూడా వాడినా అతి విరళంగా వాడినాడని చెప్పవచ్చు. ఆడ, ఈడ అనే పదాలు ఆం.మ.భా. లో కనిపించకున్నా 'ఏడ'కు మాత్రం ప్రయోగాలు కనిపిస్తున్నాయి. (III - 2 ఆ)

"ఏడ పని గలిగో మీరెక్కడో పోతావచ్చి

యీడ కాతఁడంపె నంటా యిచ్చలాడేరు"

14-251

ఏడకేడ : దానికీ దీనికీ సంబంధమే లేదనే అర్థంలో వాడబడే పదబంధం, పోలిక కందదని భావం.

"ఏడకేడ రుకుమిణి నెలయించి యింటికి

వేడుకతోఁ దెచ్చుకొంటివిగా నీవు" 13-502

ఏడకేడో : (2) ప.*బం.* దానికీ దీనికీ సంబధమే లేదనడం.

"కూడిన వేడుకలకు గుఱి గావచ్చుఁగాక

యేడకేడో వేడుకల కింపు పుట్టీనా" 12-368

ఏడది : ఎక్కడిది.

"ఆఁటదానిఁగంటే పతి ఆదరించనేవలె

వేఁటకానివలె నంటే వేడు కేడది" 1-227

ఏడలేని : విఐ. ఎక్కడలేని, విరళమైన.

"ఏమి నేరిచితివి (యే) లేల

వేమారు గొల్లెతలును విడిచిరి సిగ్గులు"

"ఏడలేని సుద్దులు" 27-250

ఏడిగట్టించు : స.క్రి. ఏడ్పించు (?) ఈ పదం నిఘంటువుల్లో కానరాదు.

"మొగము చూచి నా మొగమాట మిదియే కా

నగుతా నేమిటికైన నన్నేడి గట్టించెను" 12-52

ఏడుగురు బంటులు : వి*;* బహు. సప్తవ్యసనాలు.

"దంటతనంబునఁ దమయిచ్చఁ దిరిగాడు

బంటు లేడుగురు బలవంతులు" 1-61

ఏడుజానల మేను : వి. అత్యల్పశరీరం, ఏడుజానల ప్రమాణం కల శరీరం.

"యేడుజానల మేనిలో
నిందిరానాథుఁడున్నాఁడు
వేడుకతో నతనిని వెదకరో" 4-475

ఏడేడ : (ఏడ + ఏడ) ఎక్కడెక్కడ.

"నవ్వేతా నీవంత నాకు నీ మోవియ్యఁగాను

యెవ్వల నీ కేడేడ నా యెంగి లాయనో"

16-298

ఏడోనుండి : ఏడనుండో, ఎక్కడనుండో. ఇట సందేహార్థకమైన 'ఓ' అనేది నుండిపై చేరాల్సి ఉండగా ఏడశబ్దం మీద చేరడం విలక్షణం. ఇట్టి ప్రయోగాలు అన్నమయ్య సంకీర్తనల్లో ఐదారు కనిపిస్తాయి. ఉదా :- ఎవ్వతో చేఁతలు (ఎవ్వతె చేఁతలో) 19-333 మొ॥

ఏతరి : (ఏతు+అరి) వి. 1.ఉద్ధతుడు, గర్వి 2.నిరంకుశుడు, స్వేచ్ఛావిహారి 3.లోభి, దురాశ కలవాడు 4.క్రూరుడు, దుర్జయుడు, కుత్సితుడు. (వంచకుడని ఆం.ప.ని .)

"పాతకపు రాకాసి పల్లెలు చూరలు గొన్న
యేతరొపై నేరమి మా కేఁటి కిఁక నెన్న"

5-48 & 1-31

ఏతరికత్తె : (ఏతు + అరి + కత్తె) వి. చెడ్డది, గర్విష్ఠురాలు, నిరంకుశురాలు, లోభం కలది, దుర్జయురాలు, ఎదిరించి పనిచేసే గుణం కలది.

"ఆతుమలో మెలఁగేది అవుఁగాములు చూడదు
యేతరికత్తె గుణాలే యెఱుఁగము గాని" 24-377

ఏతరికాఁడు : (ఏతు + అరి + కాఁడు) వి. చెడ్డవాడు, క్రూరుడు, గర్వి, నిరంకుశుడు, లోభి, దుర్జయుడు.

"రాతిరి బగలు నిట్టే రతుల నోలాడుఁగాక
యేతరికాని కెంతైనా నెంగిలి గద్దా" 16-36

ఏతరితనము : (5) (ఏతు + అరి + తనము) వి. చెడ్డతనం, క్రూరత్వం, ఔద్ధత్యం, గర్వం, నిరంకుశత్వం, లోభం, దుర్జయం.

"ఏతరితనము నను యేల పరాకై వుండేవు
నీతో నవ్వినయట్టె నవ్వవయ్యా" 14-192

ఏతరిది : (ఏతు + అరి + అది) ఉద్ధతురాలు, గర్విష్ఠి స్త్రీ, నిరంకుశురాలు, స్వేచ్ఛావిహారిణి, లోభం కల స్త్రీ, దుర్జయురాలు, క్రూరురాలు.

"అతడెంత నీవెంత అవునే మేలు
యేతరిదానవు నీకు నెంచనున్నదా" 7-479

ఏతరివాఁడు : (2) (ఏతు + అరి + వాఁడు) 1. ఉద్ధతుడు, గర్వి 2. నిరంకుశుడు, స్వేచ్ఛావిహారి 3. లోభి 4. దుర్జయుడు, క్రూరుడు.

"ఆతనితో నేల పంతాలాడేవే నీవు
ఏతరివాఁడు గుట్టుతో నెడయఁగ నేర్చునా"

7-367

ఏతరీఁడు : (2) (ఏతు + అరి + ఈఁడు) వి. చెడ్డవాడు, క్రూరుడు, నిరంకుశుడు, లోభి, దుర్జయుడు.

"ఏతరీఁడ తిరువేంకటేశ నన్ను నేలితివి
ఏతులతో వలపించ నెంత కలికివిరా" 5-222

ఏతలన్ : (ఏ + తలన్) ఎక్కడ, ఎప్పుడు.

"ఏతలఁజూచినా నాకు నేడు గడయు నీవె
ఆతల నీతల నన్ను నాడుకొని కాచితి" 10-39

ఏతాయాతనఁబడు : (యాతన + యాతన + పడు) దుర్భరమైన యాతనపడు అనే అర్థంలో జానపద వ్యవహారం కాబోలు.

"యెందరో సంపదలకు లోనై
యేతాయాతనఁబడువారు" 2-138

'యేతాయాతన' అనే రేకుల్లోని రూపాన్ని సంపాదకులు 'యాతాయాతముల' కావచ్చునని సందేహించినారు. కాని ప్రకృతార్థానికి 'యేతాయాతనల' అనే పాఠమే యుక్తంగా కనిపిస్తున్నట్లుగా భావించవచ్చు.

ఏతు : (6) వి. 1. దంబం, డాబు, ఉద్ధతి 2. దోషం, లోపం 3. గర్వోక్తి, బడాయిమాట.

"యేతు నీకుఁ గలిగితే నెందైనాఁ జూపుదుఁగాక
ఆతని నావద్దఁ దిట్టే వదేమే నీవు" 11-312

"నీ తగులు చూపితివి నెగులెల్లాఁ బాపితివి
యేతు నీకు గనమాయ" 11-412

ఏతులది : (ఏతులు + అది) గర్వోక్తులు పలికే స్త్రీ, బడాయి మాటలది, ఉద్ధతురాలు.

"వేడుక నవ్వి వేసాల ప్రియాలు చెప్పి
యేడనైనా మేలమాడే యేతులదానవా" 27-539

ఏతులాఁడి : (2) (ఏతులు + ఆఁడి) వి. హెచ్చులాఁడి, ప్రగల్భాలు పలికే స్త్రీ.

"అవధరించవయ్యా ఆపె సేసే చేఁతలు
తివిరి చేతులు చాఁచీ దిట్ట యేతులాఁడి"
26-254

ఏతులాఁడిది : (ఏతులు + ఆఁడి + అది) వి. హెచ్చులాడి, ప్రగల్భాలు పలికే స్త్రీ.
"ఈతనిఁ జూడఁగదే యిన్నిటికి లోనైనాఁడు
ఏఁతులాడి దానితోడ నెంత మొకదాకిరే"
16-561

ఏతులాఁడు : వి. ప్రగల్భాలు పలికే వాడు.

ఏతులాడు : (ఏతులు + ఆడు) వి. ప్రగల్భాలు పలుకు.
"గాఁటపు శ్రీవేంకటేశ కడపలో నన్నుఁగూడి
యేఁటవెట్టే వంటిఁగాక యేతులే మాడితినే"
13-357

ఏతులు : (70) *వి; బహు.* బడాయిమాట(లు), గర్వోక్తులు, ప్రగల్భాలు, ఎచ్చులు, గొప్పలు.
"ఏతులఁజూపినందుకే యెదుటఁ దలవంచీని
చేతఁ జెక్కు నొక్కరాదా చెలఁగి యే మాయను"
13-182
"యేతులకు నవ్వితేను యెగ్గు లెంచఁబనిలేదు
యీతల నన్నుఁజూచి తానేల సిగ్గువడీనే"
16-64
'ఏతు' అనే పదం కన్నా 'ఏతులు' అన్న బ.వ. పదానికే ఎక్కువ ప్రయోగాలు ఉన్నాయి. తెలంగాణంలో ఈ పదం వాడు ఏతులోడు, వానికి ఏతు లెక్కువ, ఏతులకు పోతాడు మొదలైన ప్రయోగాల్లో ఇప్పటికీ బాగా వాడుకలో ఉన్నది.

ఏతువ : వి. ఈ శబ్దం నిఘంటువుల్లో కానరాదు. ఇది 'హేతు' శబ్దభవం కావచ్చు, కారణం, నెపం.
"యెచ్చరించి నే నేమైనా యేతువ లెత్తితినా
పచ్చి దేర నీవే నేగు పడేవు గాక" 19-206

ఏతువలెత్తు : చూ: ఏతువ. నెపము ఎత్తిచూపు. ఈ అర్థంలో నేటికీ ఏతువలెత్తి మాటలాడినాడు అనే వ్యవహారం ఉంది.
"యీవలా నావలా యేతువలెత్తీ నంటా
దేవుల కేల కొంకేవు దిట్టవాఁడవు" 26-578
"ఆతుమెల్లా నీవు నాతో నట్టె చెప్పితివంటా
ఏతువలెత్తి నీమీఁద యెమ్మె చూపీ నాపె"
21-285

ఏతువు : వి. హేతుశబ్దభవం కావచ్చు. అర్థం సరిపోతుంది. ఏతువలెత్తి మాట్లాడినాడు అనే వ్యవహార మీనాటికీ ఉన్నదట. నెపములెత్తి చూపుట అనే విశేషార్థంలో పై వ్యవహారం ఉందని సం.ప.స. (18 సం. 428 పు.)

ఏతువులెత్తు : ఉద్ధతి కలుగు.
"మలసి యేతువులెత్త మాటలాడవలెనా
వలచి నిన్నుఁబాయక వసమైనవానికి" 19-321

-ఏది : భావార్థంలో ధాతువులపై చేరే పదం. ఉదా :- కొసరేది 7-68, కలిగేది 2-176, అయ్యేది 2-175, వెలసేది, పొసేది, తలఁగేది, విడిచేది, బలిసేది, చెందేది, బదికేది 2-411 మొ॥ ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

ఏదు : (?)
"చక్కెర యేదుగా నైతే చవి మొగచాటు గాదా
వొక్కమారే యింత గద్దా వూరకుండవయ్యా"
7-108

ఏదు : (ఏద?) వి. 1. ఏకాగ్రత, అవధానం 2. విచారం, వ్యాకులత 3. మనసు.
"పెదవిపై సుద్దులు ప్రియముల బుద్ధులు
ఏదుగాఁ జదివితివి యిపుడు నీవు" 8-275
ఇందలి 'ఏదు'గా అన్న పాఠం 'ఏదగా' కావచ్చు.

ఏదుల తీఁట : వి. (?)
"ఏఁటిమాట యేదుల తీట
జూటికపువాని సుద్ది చెప్పకురే మీరు" 24-152

ఏదోపాదో : ప.బం. పాదపీఠికలో సంపాదకులు 'ఏటోపాటో' అని రేకు అని తెలిపినారు.
"తిలకింపఁ జందనము తేలో పామో
యెలమిఁ గోవిలకూఁత యేదో పాదో" 5-193

ఏనిగ: వి. 'ఏనుగు'కు వ్యావహారికరూపం. అన్నమయ్య 'ఏనిగ' తో పాటు ఏనిగె, ఏనుక, ఏనుగ, ఏనుగు అనే రూపాలనుకూడా వాడినాఁడు.

"ఎక్కినంతలోననే యేనిగ గుజ్జా
అక్కరై మా యింటికి రా కాతఁడట్టె వుండీనా" 21-89

ఏనిగె: (4) వి. 'ఏనుగు' కు వ్యావహారికరూపం. చూ: ఏనిగ.

"యేనిగె తొండాలఁబోలే ఇంతి తొడల మీఁదట
ఆనించేవు నీ పాదము లంత కోపేవా" 24-431

"ఏనిగె నడపు పాదాలు" 17-121

ఏనుఁగ: (16) 'ఏనుగు'కు వ్యావహారికరూపం.

"కడు మదించిన హంకారమనే యేనుఁగపై
యెడనెడ నెక్కి తోలీనదె జీవుఁడను" 3-386

ఏనుక: వి. 'ఏనుగు'కు వ్యావహారికరూపం. ఏనిగ.

"నునుపునడపుల యేనుకపెద్ద యడవి
చెనకు నట్టనడిమి సింహపుటడవి" 5-153

ఏనుగ: (7) 'ఏనుగు'కు వ్యావహారికరూపం. చూ: ఏనిగ.

"వీఁపునఁ గుచాలు మోఁపి వెలఁది
కౌఁగిలించఁగా
నేపున నేనుగ నెక్కె నిదె దేవుఁడు" 7-58

ఏనుగ చేతి చెఱకు: ప.బం; వి. త్వరలో నశించేది.

"తానూఁ జేతికి నీఁడు దగ్గరి తీసుకోరాదు
యేనుగ చేతి చెఱకే యీ మోహము" 19-407

ఏనుగ బిడ్డఁడు: వి. ఏనుగువంటి శిశువు, పెద్దబిడ్డ.

"దేవతలు జయవెట్ట దేవకి గర్భమునందు
యీవేళ నేనుగ బిడ్డఁడిదె జనించె" 22-92

ఏనుగవీధి: వి. పెద్దవీధి, రాజవీధి.

"శ్రీతిరుమలపతి శ్రీవేంకటపతి
ఏ తెరువేగిన యేనుగవీధి" 23-589

ఏనుగుతో ఏలాటాలు: ప.బం; వి; బహు. శక్తికి మించిన పనులు.

"నానాఁడు నిన్నుఁ దగిలే నాకే కాక
యేనుఁగుతో యేలాటాలు యెవ్వరి కేలోయి"
16-138

ఏనుగు దిన్న వెలగపంటి బేసము: ప.బం. తనకు తానే అదృశ్యమగునది. ఏనుగు తిన్న వెలగపండు లోని గుజ్జు అదృశ్యమై వట్టి వెలగపండు బయట పడుతుందని ప్రతీతి.

"సిరిదాఁబోయినఁబోవును
కరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ"
అని సుమతి శతకం.

"లలి నేనుగు దిన్న వెలఁగపంటి బేసము
వలెనే పోఁగలవెల్ల వడిఁదానే పోవురే" 2-140

ఏనుగునెక్కి దిడ్డదూరు: ప.బం; అ.క్రి. అసాధ్యమైన పనికి పూను, అనుచితమైన పనికి పూను.

"హరి నీకు నిచ్చునట అనుమానమేల
తెరలి యేనుగునెక్కి దిడ్డు దూరెదరె"

ఏ నోర అడుగు: ప.బం. ఏ ముఖంపెట్టుకొని అడుగు; అడగడానికి నోరు రాదని భావం.

"సేయరాని పాపములు సేసి వచ్చి యేనోర
నా యెడ నిన్ను వరములడిగేను" 4-2

ఏ నోరుపెట్టుక: ప.బం. ఏ ముఖంపెట్టుకొని, అడుగడానికి నోరు రాదని భావం.

"ఏ నోరు వెట్టుక నిన్ను నేమని కావుమందును
నే నిన్నుఁ దలఁచినది నిమిషమూ లేదు" 3-60

ఏ పొద్దు: (2) వి. అన్నిసమయాలు, ఎల్లప్పుడు.

"నెలఁతకు ఏ పొద్దూ నీ మీదిదే పరాకు" 7-428

ఏమందుకునైనా: (ఏమి + అందుకు + ఐనా) దేనికైనా, దేనికొఱకైనా, అందుకు అనే పదం దానికి అనే అర్థంలో మాండలికం.

"యేఁటికి నవ్వితివయ్యా యెఱఁగము నే మా
పని
నాఁటకుఁడవే మందుకునైనా వచ్చును" 23-208

ఏమని చెప్పు : *ప.బం; స.క్రి.* వర్ణింపసాధ్యం కానిదగు, చెప్పవీలు కానిదగు.

"ఎట్టు వలపించితివో యేమని చేప్పేది
చుట్టమ వన్నిటా నీవు సుదతికి నైతివి" 14-593

ఏమాట కేమాట : *ప.బం.* ఒకమాటకు ఒకమాట.

"ఏ మాఁట కే మాఁట యేలరా
నా మోము చూడవే నవ్వే నేను" 26-65

ఏమి గట్టుకొను : (19) *ప.బం; అ.క్రి.* ఏమి లాభం పొందినావు అనవసరంగా ఇతరులను బాధించడం తప్ప అనే సందర్భంలో ఉపయోగించే పలుకుబడి.

"ఏమి గట్టుకొంటివి నీ విందువంకను
కామించిన మే లొక్కటే కట్టుకొనరాదు" 27-94

ఏమిరే: సం.ప.స. లో దీని వివరణ మిట్లున్నది. "ప్రార్థనార్థక మ.పు; ఏక; బహు. లందు వు-రులపై వచ్చు చెప్పవే, చెప్పరే వంటి రూపము అన్యయముపై గూడ చేసినట్టు కానవచ్చుచున్నది లేక ఏమిరా అను పుం రూపమువలె, ఏమిరే స్త్రీలింగరూపమైన కావచ్చు ఈ వాఙ్మయంలో ఏమిరే అని పుం.రూపప్రయోగములును కలవు. సంబోధక 'రి'కి వ్యావహారికరూపమైన 'రే' లోని శేషభాగమైన నకారములు" ——— ఏమైనా ఇదొక విలక్షణప్రయోగమే.

"చెందమ్మి కన్నులవాఁడు చేతి పిల్లగోవివాఁడు
యిందు వచ్చెఁ గంటిరా ఏమిరే యమ్మా"
18-14

ఏమో సేయఁగఁబోగా నేమో అగు : *ప.బం. అ.క్రి.* ఒకటి చేయబోతే మరొకటి అగు.

"ఏమో సేయఁగఁబోగా నేమో ఆయ
యేమని చెప్పుదుఁ బను లిటువంటివే" 9-87

ఏరాలు : వి. 1. తోడికోడలు 2. సవతి.

"ఏరాలిఁ బొగడఁగా నేమీ ననముగాక
మీ రెంతేసి జాణలు మీకే తెలుసులే" 26-215

"అక్క యేమే చెల్లెలేమే అందులో భేదమున్నదా
నిక్కి యేరాండ్ల మైతే నేర మాయనా" 21-131

ఏరుగట్టు : అరకకట్టు (ఏరు = నాగలి)

"ఎనుపోతుతో నెద్దు నేరుగట్టినయట్లు
యెనసి ముంద సాగదేఁటి బ్రదుకు"

ఏరుగుడిచి కాలువఁ బొగడు : (4) నానుడి; ఒకదానివల్ల లాభం పొంది మరో చిన్నదానిని పొగడు.

"గరిమ నేరు గుడిచి కాలువఁబొగడఁబోతే
యెరవెరవే కాక యిత వయ్యీనా" 3-67

"ఈతని నెఱఁగకుంటే నిల స్వామిద్రోహము
ఘాతల నేఱుగుడిచి కాలువ పొగడుట" 3-536

ఏరు దాఁటిపోవు : *ప.బం; అ.క్రి.* తప్పించుకొని పోవు, దొరకకపోవు. (పద.)

"ఈరసపుసంసార మింగలము దగిలించి
యేరుదాఁటి పోయె నెటువంటి జాణే" 1-173

ఏరు నిద్దురవుచ్చు : (3) *ప.బం; అ.క్రి.* అసాధ్యమగు పనికి పూను. (నదిలో అలలు లేకుండ ప్రవహింపజేయు అని వాచ్యార్థం.)

"సగము సగము గొంకి సత్యము లెవ్వరితోడ
నిగిడించి మొక్కి యేరు నిద్దురపుచ్చీనే"
11-244

ఏరు నిద్రపుచ్చు : చూ: ఏరు నిద్దురపుచ్చు.

"గారవించి నన్నుఁగూడె కడు నిచ్చకము చేసి
యేరు నిద్రవుత్తురటే యింతలోఁదాను" 19-221

ఏరుపడు : (2) *అ.క్రి.* 1. తేటపడు 2. నిర్ణయింపబడు 3. బయటపడు 4. రూపుపడు, వేఱుపడు.

"యెడసి యీ గురుతిది యేరుపడ దిందాఁక
అడియాలము గంటిమి ఆనతేల వోయి"
11-112

ఏల : వి. ఏలపాట. నాయకాహ్వానం కలిగి, మ్లేచ్ఛ పరిభాషతో రాగమిళితమై, శృంగారాత్మకమైన పాట. దీనినే యా(ఏ)లపాట అనీ, యా(ఏ)లపదమనీ అంటారు. ఉదా :-

"మేడలెక్కి నిన్ను జూచి
కూడేననే యాసతోడ
వాడుదేరి ఉస్సురందురా వేంకటేశ

యాడనుంటి విందాకానురా" 13-223

ఏలపదము : వి. చూ : ఏల.

ఏలాట : వి. ఒకానొక ఆట.

"అక్కరతో నంతలోనె యాసల మాటాడుకొంటా
ఇక్కడ మీరెందాకా నేలాటాడేరు" 23-36

ఏలాటపువాఁడు : (ఏలాటము + వాఁడు) వి. పరిహాసకాడు, తచ్చనకాడు.

"ఆలించి శ్రీవేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
ఏలాటపువానివలె నట్టెపెనఁగేవు" 14-277

ఏలాటము : (11) (ఏల + ఆట) వి. పరిహాసం. ఇందలి 'ఏల' హేలా శబ్దభవం కావచ్చు.

"ఎప్పుడును దొరలతో యేలాటము లైనా మేలు
చప్పనైన నీచులతో సంగాతాలకంటెను"

"నను మన్నింతువు గాన నమ్మి కడఁగితిఁగాని
యెనసి యేనుగతోడ యేలాటమున్నదా"
20-114

ఏలాటాలాడు : (2) అ.క్రి. పరిహాసాలాడు.

"ఏడో సతులతో నీ వేలాటాలాడితి వంటా
ఆడరాని మాటలు నే నాడవచ్చునా" 26-597

ఏలికసాని : (2) వి. రాణి, దొరసాని, యజమానురాలు. రూపాం. ఏలికెసాని.

"ఎఱఁగవా ఆపె మాకు నేలికసాని యౌత
గుఱిసేసి నన్ను నేల గుట్టుతో మెచ్చేవే"
29-14 & 1-464

ఏలికె : (20) వి. "ఏలిక"కు వ్యావహారికరూపం, రాజు, ప్రభువు.

"ఏలికె గల బంటుకు యెక్కడిది విచారము"
2-237

అన్నమయ్య ఏలిక అనే రూపాన్ని కూడా వాడినా 'ఏలికె' అనే రూపాన్నే ఎక్కువ పర్యాయాలు వాడినాడు.

ఏలికెసాని : (3) రాణి, దొరసాని, యజమానురాలు. రూపాం. ఏలికసాని.

"ఐతివే ఏలికెసాని వందరికిని
నీతితో సవతులెల్ల నీకు లోనే యిఁకను" 13-151

ఏలినవాఁడు : వి. ప్రభువు, భర్త.

"యేలినవానితోడ యెగసక్కెమాడనేల
నోలిగాను తప్పక చూచుట గాక" 14-476

ఏళ్లవెంటనే చాళ్లు : (2) 'నాగేళ్ల వెంటనే చాళ్లు' 'నాగలి వెంటనే చాలు' అని సామెత. (ఏరు = నాగలి, మడక)

"అరయ శ్రీవేంకటేశ ఆపె నట్టే మెచ్చేవు
సారెకు నేళ్లవెంటనే చాళ్లునుఁ గావా" 17-182

ఏళ్ల వెనుకవే చాళ్లవుత : నానుడి; నాగళ్ల వెనుకనే చాళ్లు అని అర్థం. (ఏరు = నాగలి)

"విచ్చనవిడినే ఏళ్ల వెనక చాళ్లవుత
తచ్చి తచ్చి కాఁగిటిలోఁ దారుకాణాలాయను"
19-440

ఏవల : ఆవల, ఈవల వంటి శబ్దం కావచ్చు. ఎక్కడ అని అర్థం.

"నీవే మన్నించితేను నెలఁత నీ కంటెను
యేవలా వీసమంత యెక్కుడయ్యా" 25-217

ఏవూరి కేవూరు : నానుడి. సంబంధం లేనిదని భావం.

"సోవల నీ శరణము చొచ్చిన నాకు నివి
యేవూరి కేవూరు యేనాఁటి రుణము" 4-421

"వేవేగన రాని విభునితోడి పొందు
ఏ వూరి కే వూరు యే వూరే" 5-178

"రావెతానూ నేను రతి నే వూరి కే వూరు
కోవరము నిన్నుఁ బెట్టి కొంగువట్టీని" 9-138

ఏసపెట్టు : స.క్రి. ఆశపెట్టు. 'ఆస'ను ఏస గా ప్రయోగించడం యతి కోసమా? లేక 'ఆస' కు 'ఏస' జానపదుల వ్యవహారమా? ఆయాసపెట్టు (?) (ఏస = వక్రము, విజృంభణం అని ఆం.ప.ని.) లేదా విసిగించు, వేసట పెట్టు అని అర్థం కావచ్చు.

"చొప్పుగా నవ్వెనఁగాని చుట్టరికము నిండదు
యిప్పుడే యాతని నేల యేసపెట్టేరే" 7-39

ఐ

ఐతేఁగన : ఐతేకనక, ఐనచో.

"కడనుండి చూచే నీకుఁ గనికరమైతేఁ గన

బడి నన్నుఁగావు నీతో బలిమేలే" 2-519

ఐతేఁగనక : 'ఐనచో' అనడానికి వ్యావహారికరూపం.

"అడుగరే విభునివె యైతెఁగనక
విడువక మా యింటికి విచ్చేయమనవే" 8-261

ఐదుగురు : వి; బహు. ఈ సందర్భంలో పంచేంద్రియాలు అని అర్థం.

"బెదరి యైదుగురికిని భీతినొందుచుఁ గడు
జెదరంగఁజూతువే చిలుకా" 1-50

ఒ

ఒంటికాఁడు : విణ. (ఒంటి + కాఁడు)
1. ఒంటరివాడు, ఏకాకి 2. అన్యుడు 3. వియోగి (వి. ఏకచరము, పంది)

"ఒంటికాఁడు రాజు వుడుగక తమలోన
వొంటనీని మంత్రులొక యిద్దరు" 1-161

ఒంటిపడు : ప.బం. అసహాయురాలగు.

"ఉవిద విరహమున నొంటిపడె మన
కివల నీకెతో యిది యేపాటు" 23-597

ఒంటిమెట్ట వీరరఘురాముడు : కడప జిల్లా సిద్దవటం తాలూకాలోని ఒంటిమెట్ట గ్రామంలో వెలసిన శ్రీరామచంద్రుడు. ఒంటిమెట్టకు ఇప్పుడు ఒంటిమిట్ట అని వ్యవహారం. ఒంటడు, మెట్టడు అనే ఇద్దరు బోయిలు కట్టించిన కారణంచే ఇది ఒంటిమెట్ట అయ్యిందని స్థానికుల కథనం. ఇక్కడి స్వామి కోదండరామస్వామి.

"ఇందులోనే కానవద్దా యితఁడు దైవమని
విందువలె ఒంటిమెట్ట వీరరఘురాముని" 1-477

ఒంటు : అ.క్రి. అనుకూలించు, సరిపడు, గిట్టు; స.క్రి. అంటు, తాకు.

"దంటతనమున నిన్నుఁ దప్పక చూచినందుకు
వొంటుచు నిట్టూర్పుల వుసురనేఁగాక" 7-186

ఒండురులు : వి; బహు. ఒండొరులకు రూపాం. ఒకరికొకరు, పరస్పరం.

"సమదిష్టి నొండురులు సంగడివనాల నీడ
జమళి కాఁగిళ్లకు సమకూడేరు" 18-210

ఒందము : వి. 'ఒదము'నకు రూపాం. అవపాతం, ఏనుగు మొ॥ వాటిని పట్టేప్పుడు అవి పడటానికి తవ్వి మీద తేలికైన కఱ్ఱలను, కంపలను, ఆకులను పలుచగా కప్పి ఆపైన కొద్దిగా మట్టి పరచి నేలమట్టుగా చేసిన పల్లం.

"ఓపి సంసారమనే వొందముపై నడవఁగాను
కూపపుజన్మము పాలై కూయుచు
నున్నాఁడను" 15-58

ఒందిలి : వి. దుఃఖం, విచారం.

"అందుకే తల్లడమందీ నంతరంగము
వొందిలినే పవ్వళించివున్నాఁడు లోనను"
26-446

"కందువ నాపెతో నేఁడు కాపురము సేసేవంటా
ఒందిలిఁ దలుపు మూసుకున్నది చెలి" 7-339

ఒందిలి : విణ. దుఃఖం కలది, సంతాపంకలది.

"ఇందరము గంటిమి నీ విది గొనవా
ఒందిలి పానుపుమీఁద నున్నది గానవా"
19-363

గుట్టుగా :

"కందువ నన్ను నప్పటి గయ్యాళిఁజేసి నిన్ను
నొందిలి యేమాడిన నోరుచుకుందానవు"
24-461

ఒకటంటే ఒకటను : (3) ప.బం; అ.క్రి. మారు పలుకు, ఎదురు పలుకు, అన్నదానికి భిన్నంగా పలుకు.

"ఒకటంటే నొక టనేవోయి నీవు
వొక్కటైతే మన పొందు చక్కటాయఁ గదవే"
28-323 & 20-410

ఒకటి కినుమడగు : (3) ప.బం; అ.క్రి. ఒకటికి రెండింతలగు, ద్విగుణమగు, వృద్ధిచెందు.

"ఈరీతి వలపు లొకటి కినుమడాయ విభుఁడ
కోరికలు కోటానఁగోటి సతి కాయ" 24-5

ఒకటికి పది యగు : ప.బం; అ.క్రి. వృద్ధిచెందు.

"పట్టరాదు వొకటికిఁ బదియౌదువు
అట్టె నీ వన్నట్టె యవునౌఁ దలఁగరా" 24-77

ఒకమాట మీదఁ బెట్టి ఒకమాటలాడు : *ప.బం; అ.క్రి.* వ్యాజంతో - నెపంతో మాట్లాడు.
"వొకమాట మీదఁబెట్టి వొకమాటలాడేవు
వెకలివై కొంతగొంత వేరే నవ్వేవు" 21-113

ఒక్క కొలికికిఁదెచ్చు : *ప.బం; స.క్రి.* ఒకదారికి తెచ్చు.
"బలు భూమి దూరి వొక్క కొలికికిఁ దెచ్చినాఁడు
నిలచి యంతరిక్షము నిండి భేదించినాఁడు"
4-306

ఒక్కగాడిఁగట్టు : *ప.బం; స.క్రి.* కూడని వానిని ఒకచోట చేర్చే సందర్భంలో వాడబడే పలుకుబడి.
"పాడైన యెరుకతో బంధమోక్షము లొక్క
గాడిఁగట్టుట తెలివి గానకే కాదా" 4-16
"కాంతలనెల్లా నొక్కగాడిఁగట్టే వింతే కాక
మంతన మాడితేనే మర్మము గరగునా"
19-200
"బంధమోక్షము లొక్కగాడిఁగట్టేటి తెలివిగానకే కదా!" 11-2 భా 16

ఒక్క చిత్తమగు : *వి.* ఒక్కటగు.
"ఒక్కచిత్తమేల యౌను వూర్పుగాలి
చిక్కి గుణత్రయముచేఁ జెదరుఁగాక" 4-61

ఒక్కటంటే రెండను : *ప.బం; అ.క్రి.* గట్టిగా ఎదిరించు.
"వొక్కటంటే రెండనక వుండుదురా యెవ్వరైనా
మక్కువ ముందర చూచి మాటాడరా" 24-84

ఒక్కటివాఁడు : *విశ.* ఒకే నిశ్చితాభిప్రాయం కలవాడు.
"వొక్కటివాఁడు దానైతే వున్నచోటనే మేలు చేరు
పెక్కుబుద్ధులుఁ బోతేను పిరివీకౌను" 2-94

ఒక్కటులగు : (7) *అ.క్రి.* ఏకమగు, ఇష్టపడు.
"మంతనాన నిద్దరికి మనసులొక్కటు లైతే
పంతములాడఁగ మరి పని యేమే" 28-128

ఒక్కపారి : *అవ్య.* ఒక్కసారి. 'పారి' అనే పదం పర్యాయం అనే అర్థంలో వాడబడే మాండలికం. తెలంగాణంలో ఈ పదం ఎక్కువగా వాడుకలో ఉంది. ఉ.రా. (3-54) శు.స. (3-444) హరి. (ఉ) (10-304) శ్రీరామాయణం (5-2103) ఉరా. (6-39) రాజ.విజ. (3-84) కావ్యాలలో 'పారి' అనే పదానికి ప్రయోగాలు లభిస్తున్నాయి. ఇది 'పరి' కి రూపాంతరమేమో!
"యెగ్గెరఁగ కొక్కపారే యిద్దరిఁగూడ వచ్చేవు
కగ్గుదేర నిటువంటి కాకు గలదా" 13-158

ఒక్కమనసగు : (6) *ప.బం; అ.క్రి.* మనసులు కలియు, ఏకాభిప్రాయం కలుగు.
"ననిచి యశోదానందగోపులు దెంచేరు
వొనర నందరికి వొక్కమనసాయను" 23-538

ఒక్కమొగనాండ్లు : *వి; బహు.* ఒక్కమగనికి భార్యలైన పలువురు స్త్రీలు.
"ఒక్క మొగనాండ్లకు వొరటు లెందాఁకానే
వెక్కసపుఁ బొత్తు గూడి వేడుకతో నుందమే"
25-429

ఒక్కసమ్మతి : *వి.* ఏకాభిప్రాయం, ఇష్టపడటం.
"పెక్కుమతంబుల పెద్దలు నడచిరి
వొక్కసమ్మతై వొడఁబడరు" 3-348

ఒక్కసరిగా : *క్రి.విశ.* ఒక్కరీతిగా.
"అందరు నొక్కసరిగా నాడకు నీవు
మందలించి మమ్ము నిట్టె మన్నింతువు గాని"
27-90

ఒగరుఁదనము : *వి.* కటుత్వం, వగరుదనం.
"వొగరుఁదనముల నీ వొరటా యిది
యెగసక్కెపు నీ చేఁత లెందుకు సరివచ్చేనో"
20-451

ఒగరు : *విశ.* కటువు.
"ఒగరాయ నలుకలు వొడిని నిండె వలపులు
చిగురు మోవియ్యగదే సిగ్గు లేటికే" 27-138

ఒగరుతీపగు : *ప.బం; అ.క్రి.* బాధలే ప్రియమగు.
"పగటున మా ప్రాణము మా కిక
వొగరే తీపాయ నుద్ధవుఁడా" 15-56

ఒగరులాడు: అ.క్రి. ఆశించు. (పద.)
"మొగమోడితిఁ జాలదా మొక్కలీడ నియ్యెడకు
వొగరులాడ వచ్చేవు వోపము నేమిందుకు"
20-200

ఒగరెక్కు: అ.క్రి. ఒగరగు, కటువగు.
"ఉమ్మగిలి నా సరస మొగరెక్కి నిండఁబూచె
దిమ్ము రేఁగిన చలము తిప్పుకోకు మిఁకను"
11-80

ఒగ్గాలివాఁడు: వి. ఒగ్గిలువాడు, లోబడినవాడు, దాగినవాడు, స్వాధీనమైనవాడు. లేదా ఒక + కాలివాడు అని విడదీస్తే ఒక కాలివాడు, ఎప్పుడూ తిరిగేవాడు అనే అర్థం కూడా చెప్పవచ్చునేమో?
"ఒగ్గాలివాఁడు గదె వోయమ్మా
సిగ్గున నా కగవడె చిలుకచందమునా"
10-2-115

ఒగ్గు: అ.క్రి. ప్రకటమగు, సిద్ధపడు, వశమగు, లోనగు, ఒప్పుకొను, ఇష్టపడు, ప్రయత్నించు, లోబడు, సిద్ధమగు, చెవియొగ్గు, వ్యాపించు.
"తప్పక నీవు చూచితే తగులమితో నున్నది
వొప్పఁగఁ జేయివేసితే వొగ్గుచున్నది" 24-240
"దగ్గరి విన్నపానకు దరుణి గాచుకుండఁగా
వొగ్గక వుంటివి తడ వున్నదాఁకాను" 11-144

ఒచ్చము: (9) వి. 'ఒచ్చెము' కు రూపాం. కొఱత, న్యూనత, అవమానం, తప్పు, నైచ్యం,అపకీర్తి, కపటం.
"విచ్చనవిడినీ యాడీ వీఁడె కృష్ణుఁడు
వొచ్చము లేనివాడు వుద్దగిరికృష్ణుఁడు" 4-172

ఒజ్జళ్లు: వి; బహు. ఒజ్జలు, గురువులు, పంచాణంవారు, పురోహితులు; ఇట 'ఒజ్జలు' అనే బ.వ. రూపంపై మళ్ళీ బ.వ. ప్రత్యయం చేరడం విశేషం.
"పూవుల వాన గురిసె భూభారమెల్లఁ దీరె
వేవేగ నొజ్జళ్ళు వేళ చూడరో" 22-92

ఒట్టికొను: హత్తుకొను, తాకు.
"ఊపిరి మోచిననాఁడే ఒట్టికొంటి నాస లెల్ల"
3-83

ఒట్టు: అ.క్రి. కలుగు.
"వొట్టిన నీ కాఁగి లయోధ్యలోని పట్టము
నెట్టన శ్రీవేంకటేశ నీ దేవికి" 9-228

ఒట్టు: స.క్రి. పెట్టు, ఉంచు.
"అద్దలించి నేఁబెట్టిన ఆసలెల్లా నీ వాపె
వొద్దఁబోయి సూడిదెగా వొట్టుకుండేవా"
10-2-41
"ఒట్టుఁడి జాజులు పరపున వొరపెరఁగిన
చెలికత్తెలఁ
బెట్టుఁడి మరుబలములచే బెగ్గిలి పడకుండ"
5-352

అ.క్రి. పుట్టు, కలుగు:
"ఒట్టిన జీవులకొక బ్రహ్మ గలఁడు" 3-333
త్రాగు:
"వొట్టితే పాలునుఁ జల్లా నొక్కరీతి నుండును"
13-483
ప్రకాశించు:
"ఒట్టిన జవ్వనమున నువ్విళ్లూరేదానవు"
28-421
"అద్దలించి నేఁ బెట్టిన ఆసలెల్లా నీ వాపె
వొద్దఁబోయి సూడిదగా వొట్టుకుండేవా"
10-2-41

ఒట్టుకొను: ఒట్టు పెట్టుకొను.
"వొట్టుక నీవద్ద నుండి వూడిగాలు సేసేనంటే
నెట్టన నే నంతేసికి నేరుపరినా" 12-30
పుట్టు, కలుగు:
"ఒట్టుకొన్న జీవులు వొరలు చూడఁగఁజూచి
యెట్టు నీ వొరిచేవోయీ వేదన కిపుడు" 3-246
"కడలేక నాలుకకుఁ గన్న యాహారములెల్ల
వొడలిలోఁ బూటపూఁట వొట్టుకొనీనా" 4-316

ఒట్టువొర్లు: (?)
"చుట్టి నానాలోకములు చొచ్చి సిగ్గు గాదాయె
వొట్టువొర్లై చదివి నొబ్బుద్ధి గాదాయె" 15-303

ఒడగు: వి. (?)
"ఒకటొకటికిని వొడగాయ
సకలంబునకు సమరస మాయ" 28-485

ఒడబడికె: వి. 'ఒడఁబడిక'కు రూపాం. సమ్మతి.
"మనసులో నంతలో వొడబడికె
చేసి మలయుచు నీవే నిలుతువు" 8-240

ఒడయవరు: వి. "ఉదయవరు' కు రూపాం.
"తెంకినే వొడయవరై తిరుమంత్రద్వయమున
పంకమెల్లఁ బోఁగడిగె భాష్యకారులు" 1-162

ఒడలిలోపలి రోగము: *ప.బం; వి.* పైకి కనిపించనిది.
"ఒడలిలోపలి రోగ మొనరఁ బరితాపంబు
కడుపు లోపలిపుండు కడలేని యాస" 1-104

ఒడలు మోచు: *ప.బం; అ.క్రి.* దేహధారణం చేయు, పుట్టు.
"ఒడలు మోచినయది యొక యపరాధము"
2-519

ఒడలులేని వాఁడు: వి. అనంగుడు, మన్మథుడు.
"వొడలు లేని వాని కొక్కఁడే తండ్రాయఁగాని
తడయక పురుషోత్తముఁడితఁడే" 1-454

ఒడలోము: అ.క్రి. శరీర రక్షణ చేసుకొను, ఒళ్ళు దాచుకొను.
"జడిగొన్న గుక్కిళ్ళు చవిగొన్న యందాఁక
వొడలోముటలు మోహముడుగు నందాఁకా"
5-152

ఒడిఁగట్టు: అ.క్రి. సిద్ధపడు, పాల్పడు; ఏదైనా వస్తువును తీసుకొనేప్పుడు ఒడిని పట్టి అందులో తీసుకునే అలవాటుపై వచ్చిన పలుకుబడి. ఇది ఎప్పుడూ కూడనిదానికి ఒడబడు అనే అర్థంలో ఉపయోగింప బడుతుంది.
"పాపముఁ బుణ్యము పరఁగ నొకట నదె
వోపినవారలు వొడిఁగట్టెడిది" 4-218

ఒడి: వి. ఒడుపు, నేర్పు.
"ఊరకున్నా నెఱఁగడు వొడులు సాదించవచ్చీ
కేరి వొక్క రొక్కరమే గెలువఁగలేమా" 7-134

ఒడికట్టు: వి. కోకముడి (?), ఒడిప్రదేశాన కట్టే గుడ్డ, ఒడ్డాణం.
"ఒప్పి సరసమాడితే వొడికట్టు వదలెను"
23-176

ఒడివట్టు: (7) ప.బం. రొండిపట్టుకొను, నిలవేయు (పద.) ఎవరినైనా నిలవేసేప్పుడు రొండిలో చేయివేసి నడుమున పంచెను కట్టుకొన్న తావున పట్టుకొని ఆపుటపై ఈ పలుకుబడి వచ్చినది.
"వూరకున్నవారి నేల వొడివట్టి కూడేనే
యీరీతి శ్రీవేంకటేశుఁ డెంతటు సేసేనే" 19-178
"ఒడివట్టి తీసి పతి నొద్దికిఁ బిలువఁగాను
వెడవెడ పోఁకముడి వీడకుండునా" 19-88
కొంగువట్టు:
"కూడ నీవు రాఁగా నాపె తోడు చెలుల
రమ్మంటే నూడిగపువారి నేల వొడివట్టేవు"
12-401

ఒడుళ్ళు: *వి; బహు.* 'ఒడులు' అనే బహు. రూపంపై మళ్లీ బహు. ప్రత్యయం రాగా ఏర్పడ్డ రూపం. (ఒడి + లు = ఒడులు; ఒడులు = లు = ఒడుళ్లు) ఉత్సంగాలు, పిల్లలు కూర్చోవడానికి వీలయ్యే తొడ పైభాగాలు.
"వొత్తిలి నవ్వులు నవ్వి వొడుళ్లు నించేవారు
బత్తులు సేసేరు నీకుఁ బైకొనవయ్యా" 7-264

ఒడ్డాఁబెట్టా: ముందువెన్కలా - తారుమారుగ.
"ఒడిఒడి నీతో నొడ్డాఁబెట్టా మాటలాడేటి
పడఁతుల మేము వొడఁబరచేమా" 13-85
"వొడ్డాఁబెట్టా మాటలాడి వువిద జంకించఁగాను"
26-564

ఒడ్డాణము: వి. నడుము చుట్టు ధరించే స్వర్ణాదులచే చేసిన ఆభరణవిశేషం.
"కొనవేలి వుంగరము కుంచెవేసే యాపెది
కొనలు వొడ్డాణము గొడగాపెది" 7-432

ఒడ్డారపుమాటలు: *వి; బహు; మాం.* ఒయ్యారపు మాటలు.
"అడ్డము చెప్పగరాదు అవుగాదనరాదు నిన్ను
వొడ్డారపుమాటలకు నోపునా యీకె" 13-42

ఒడ్డారపువాడు: వి. 1. పోటీపడేవాడు 2. ప్రతిఘటించేవాడు 3. అసూయపడేవాడు, ద్వేషించేవాడు 4. వంకర మాటలాడేవాడు.

"అడ్డాలు చెప్పనివారి కట్టె వలతురు గాక
వొడ్డారపు వారికేల వొద్ది కొౌదురు" 21-207

ఒడ్డారము : (6) వి. 1. పంతం, పోటీ 2. అసూయ, ద్వేషం 3. ప్రతిఘటనం 4. వక్రోక్తి, వంకరమాట. త. ఒట్టారము. పగ (ఆం.ప.ని.)

"అడ్డమాడకువమ్మ నీ వాతనితోను
వొడ్డారమతఁడు నీతో నొనరించెనా" 11-448

"దొడ్డవాడైన వానికి దోసము లేదు
వొడ్డారాలేమి సేసినా వొద్దనే వారెవ్వరే" 25-46

ఒడ్డారములాడు : అ.క్రి. పంతములాడు, వంకరమాటలు పలుకు, వయ్యారాలాడు, వయ్యారాలుపోవు (అన్న.రా.సీ. మాం.)

"ఒడ్డారములాడదు వొడివట్టి తీసి నన్ను
వెడ్డువెట్టి వేడుకొంటే వేసర నేలే" 26-542

ఒడ్డారించు : (2) స.క్రి. ఎదిరించు, ప్రతిఘటించు, ద్వేషించు, వ్యతిరేకించు, సాహసించు, పలుకు, మాటాడు (వ్యు.)

"సిగ్గుపడ్డదానవు శిరసు వంచుకుండంగ
వొగ్గి పతితో నేల వొడ్డారించేవే" 26-366

ఒడ్డించుకొను : స.క్రి. తప్పించుకొను, వ్యతిరేకించు, విరోధించు, నిరాకరించు, ఒడ్డునట్లు చేయు.

"కప్పుచుఁ బయ్యెదకొంగు కడు నొడ్డించుకొనేవు
తప్పక చూచిన చూపు తాఁకె నటవే" 7-236

"వొక్కటైన చోటికి వొడ్డించుకొందురటవే
చెక్కు నొక్కించుకొంటివి చెల్వునిచేత" 26-274

"ఊరకె కొసరనేల వొడ్డించుకొననేల" 28-20

"పువ్వులనాతఁడు నిన్ను పూఁచి పూఁచివేయఁగాను
మువ్వంకా నొడ్డించుకొంటూ మొక్కేవేమే నీవు" 25-178

ఒడ్డుఁబొడవు : వెడల్పూ - పొడవూ.

"వాసి చూప నేమిటికి వనిత వొడ్డుఁబొడవు
సేసవెట్టఁగానే నీవు చెలిమి మెచ్చేవు" 18-287

ఒడ్డుకొను : అ.క్రి. ఎదిరించు, దాఁటు, పందెము వేయు, చాఁగఁజేయు, చక్కగా వినుటకు మొనయించు (నాచ.), తప్పుకొను, ప్రారంభించు, పూను.

"ననిచి కూడిన కాంత నవ్వనిదెల్ల నవ్వు
ఒనరి ప్రాణేశ్వరున కొడ్డుకోరాదు" 18-348

ఒడ్డెభాష : వి. ఓఢ్రదేశపు భాష. (ఒరియా భాష)

"వొగినొడ్డె భాషలాడి, వొడ్డెవాఁడ నైతిని
తెగి తెలుఁగాడనేర్చి తెలుగువాఁడ నైతి" 3-370

గజపతులు విద్యానగరాన్ని ఆక్రమించినపుడు అన్నమయ్య ఓఢ్రభాష (ఒడ్డెభాష) నేర్చుకొని ఉండవచ్చు.

ఒడ్డెవాఁడు : వి. ఓఢ్రదేశస్థుడు.

"ఒగి నొడ్డెభాషలాడి వొడ్డెవాఁడ నైతి" 3-379

ఒణికె వేసుకొను : వి. ఈ పదం నిఘంటువుల్లో కానరాదు. మొగము వ్రేలాడవేసుకొను.

"వొణికె వేసుక నే నూరకున్నా మానఁడే
సణఁగులాడఁగ వేరె సాకిరి వెట్టీనే" 9-146

ఒత్తడించు : స.క్రి. 'ఒత్తరించు' కు రూపాం. కావచ్చు. 1. వెడలగొట్టు, తోయు 2. ఉద్రేకపరచు (అతిక్రమించు, మించు) బాధించు, రాపిడిపెట్టు.

"ఏల వొత్తడించేరే యిన్నియు నయ్యీఁగాక
పోలిక లొక్కటే యెట్టు పొందుసేసేదే" 14-180

ఒత్తడించు : స.క్రి. పీడనం చేయు, రాయిడి చేయు, ఒత్తిడి చేయు, బాధించు. (ఒత్తడి = బాధ)

"ఏల ఒత్తడించేరే యిన్నియు నయ్యీఁగాక" 14-180

ఒత్తరించు : స.క్రి. అతిక్రమించు, మించు, వ్యాపించు, ఉద్రేకము కలుగజేయు.

"ఒత్తరించుకొని రాఁగా నువిద నిట్టే కూడితి
ఎత్తల శ్రీవేంకటేశ యెచ్చరింతుమా" 13-414

ఒత్తి మాటాడు : అ.క్రి. గట్టిగా మాటాడు.

"వూకొనకుండిన వొత్తి మాఁటాడేవు
బూక లింతేశేల మోవయ్యా" 24-172

ఒత్తు : వి. ఒత్తుకోవడంవల్ల కలిగిన ముద్ర, నొక్కు.
"వంకలైన వొత్తు లెల్ల వడిఁగాన వచ్చె నింక
బొంక నేమిటికిరా నీ బూమెలెల్లఁ గంటిమి" 5-84

ఒత్తుకోలు సేయు : వి. 1. ఆక్రమించు 2. అద్దుకొను. అ.క్రి. అతిశయించు, తోసుకొను.
"అంగడివారెల్లా నిన్ను నంటఁగాఁగిలించి రంటూ
ఉంగిటిగానే నిన్ను నొత్తుకోలు సేతునా" 13-116

ఒదకిలు : అ.క్రి. 'ఒదికిలు'కు రూపాం. పక్కకు ఒరుగు, ఒత్తగిలు.
"ఒయ్యారి బాగుగాను వొదకిలి కూచుండేవు"
28-552

ఒద్ద : వద్ద, దగ్గర;అన్నమయ్య 'ఒద్ద' తో పాటు 'వద్ద' అనే రూపాన్ని కూడా ప్రయోగించినాడు.
"ఒద్దఁ బండుండి యవ్వల
వొగిఁ జోటిచ్చుకుండేవు" 29-253

ఒద్దిక : వి. 1. ప్రేమ, అనురాగం, మైత్రి, చెలిమి 2. విధం 3. పోలిక 4. వినయం, నమ్రత 5. పూర్వాభినయం. ఒక వస్తువుకు సరితూగే రాయి మొదలైనవి, పడికట్టురాయి, విలాసం. విణ. అనుకూలం. రూపాం. ఒద్దికె.
"ఇల్లిదె శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
వొళ్లఁబెట్టిన సొమ్ములు వొద్దికెఁ గూడుండవా"
7-254
"ఒద్దిక తామరవిరి నొత్తేవు కన్నులు నీ
గద్దరి కన్నులకంటె కమలము ఘనమా" 5-2

ఒద్దిక మాటలు : *వి; బహు.* అనుకూలమైన మాటలు.
"వూరకుండఁగ నాతో వొద్దిక మాటలాడీని
కారణము లేని పొందు కద్దా బూమి" 26-45

ఒద్దికె : వి. చూ ఒద్దిక.
"తక్కక యహోబలానఁ దగ శ్రీవేంకటాద్రిని
వొక్కటై నిన్నుఁ బెండ్లాడి వొద్దికె చూపీని"
12-271

ఒద్దు : (4) క్రి.రూ. వద్దు (వలదు)కు వ్యావహారికరూపం.
"ఒనరి గోరనూదితే వొద్దంటూ వేడుకొనేవు"
29-343

ఒనగూడు : (2) అ.క్రి. 1. సిద్ధించు, నెరవేరు, ప్రాప్తించు 2. కలుగు, జనించు 3. కూడు, కలియు స.క్రి. సంభోగించు (వ్య.), ప్రాప్తించు.
"వొయ్యనె శ్రీవేంకటేశ వొనగూడితి వింతలో
యియ్యెడఁ గామిని విల్చి నిట్టె రావయ్యా"
7-111

ఒప్పనచేయు : స.క్రి. అప్పగించు, అప్పనముచేయు .
"అంచల నీ వంతర్యామి వైన యీ దేహము
పంచేంద్రియముల కొప్పన సేతురా" 3-55

ఒప్పనము చేయు : స.క్రి. అర్పణము చేయు .
"నీతితో శ్రీవేంకటేశ నీ పాలివాడఁగాన
జాతితో సర్వము నీ కొప్పనము సేసితిని"
9-154

ఒప్పులకుప్ప : *ప.బం; వి.* 1. సౌందర్యరాశి 2. బాలికల క్రీడావిశేషం.
"వొడికపు నెలఁతా వొప్పులకుప్పా
కడఁకల సతి రాఁగదవమ్మా" 28-192

ఒబ్బిడి : వి. 1. బాగు, నిశ్చింత, హాయి, స్వేచ్ఛ, ప్రత్యేకం అనే అర్థాల్లో ఇది మాండలికం. (చూ. అ.సం.సా ; రా.సీ.మాం. 18 పు.) (పొదుపు, పంటనూర్పిడి)
"ఒబ్బిడిగా నీ యింట నీ వుండితేనే చాలదా
గుబ్బల గర్వము నిన్ను గురించీ గాక" 18-278
"నిబ్బరపుఁజేతులను నిన్నుఁ గాఁగిలించి పట్టి
వొబ్బిడిఁ దా మెరసె నహోబలేశ" 21-202

ఒబ్బుద్ధి : (ఒక + బుద్ధి, ఒప్పు + బుద్ధి) ఒక బుద్ధి, మంచి తెలివి. విలక్షణమైన సంధి.
"చుట్టి నానాలోకములు చొచ్చి సిగ్గుగాదాయె
వొట్టు వొర్లై చదివి నొబ్బుద్ధి గాదాయె" 15-303

ఒమ్ము: (9) అ.క్రి. ఒప్పు, సరిపడు, అనుకూలమగు. (ఆ.ధా.పా.)

"నెమ్మిఁదరితీపు లేని నెలఁత యెంత మొక్కినా
వొమ్మ సమ్మతమై వుండదు వుప్పనై తోచు" 23-257

"సొమ్ములుఁ బెంచవు కన్నుఁజూపుల యమ్ములనే
వొమ్మదు నీ పొందు నాకు నొల్లమయ్యా" 5-121

ఒరగల్లు: (ఒరయు + కల్లు) వి. గీటురాయి, బంగారం మొ॥ వాటిని ఒరపెట్టే రాయి, నికషోపలం.

"మంచి చలువరాయనే మెచ్చుల వొరగంటిపై
నించినట్టి వేడుకల నీ దేహము" 10-295

ఒరగు: వి. 1. ఒరగుదిండు 2. వంపు విణ. వంపైనది. రూపాం. ఒఱగు. వంపు. విలాసం, సౌందర్యం, బాధ (ఆం.శ.ర.), లోపము. ఒరగు = crookedness.

"ఇంక నేఁటి బిగువు యేల నీకును
వంకలొత్త నొరగులై వాసిమీఁదను" 11-19

"నెఱతనము చూపి నీవు మా ఇద్దరిలోనా
వొఱగులు దిద్దేవు వువిద నీవు" 25-276

"మతిలేని నీ కుచాలు మెత్తని మొరగులమ్మా
ఆతనికి నీ కౌను వయ్యాళి బయలమ్మా" 26-102

"తగవు లిద్దరమును తమతోఁ దేరుచుకోఁగా
తెగి మాట వొరగులు దిద్ద వచ్చేవు" 13-538

ఒరగుఁబెరుమాళ్లు: వి. పడుకొనిఉన్న గోవిందరాజస్వామి. దిగువ తిరుపతిలోని గోవిందరాజస్వామి పడుకొని ఉన్న ఆకారంలో ఉంటాడు. ఒరగు అంటే దిండు అనే అర్థం కూడా ఉంది. గోవిందరాజస్వామి తలకింద ఉండే గుండ్రని దిండును స్థానికులు 'సేరు' అని అంటారు. సేరు అంటే ధాన్యాన్ని కొలిచే ఒక పరికరం. గోవిందరాజస్వామిని వెంకటేశ్వరస్వామికి అన్న అని అంటారు. వెంకటేశ్వరస్వామి తన పెండ్లికి కుబేరుని దగ్గర అప్పుగా తీసుకున్న ధనాన్ని కలియుగంలో తీరుస్తానని వెంకన్న ఒప్పందం చేసుకుంటాడు. అప్పుగా తీసుకున్న ధనాన్ని గోవిందరాజస్వామి సేరుతో కొలిచి కొలిచి అలసిపోయి ఆ సేరునే దిండుగా చేసుకొని నిద్రపోతూ అలాగే శిలగా మారిపోయినాడని స్థానికుల నమ్మకం. కనుక ఒరగు = దిండు తలకింద గల స్వామి అని అర్థం కూడా చెప్పవచ్చు.

"వొగి నొరఁగుఁబెరుమాళ్ల వునికి పట్టయి
వెలయు దిగువ తిరుపతి గడవఁగాను" 1-227

ఒరగోసుకొను: ప.*బం;* అ.క్రి. కత్తిదీయు, ధిక్కరించు. (పద.)

"వొడ్డిన గర్వాన నాతో వొరగోసుకొన్నది
సడ్డలాడి నీ వింత చనవు లిచ్చితివా" 10-2-52

ఒరటు: విణ. (తు) మూర్ఖపుపట్టు, ద్వేషం, మొండితనం, అహంకారం, గర్వం (క్ర) ఒరటు. విణ. మొండి, మొరటు. (వ్యు.)

"మక్కళంపు మంకులతో మాటలాడ రిద్దరును
వొక్కటై యుండుండి మీకు నొరటులు వచ్చెగా" 17-304

"ఒక్క మొగనాండ్లకు వొరటు లెందాఁకానే
వెక్కసపుఁ బొత్తుగూడి వేడుకతో నుందమే" 25-429

"చెప్పరాని తిట్టుదిట్టి చేయెత్తి మొక్కితేను
వొప్పు గొనవద్దా మఱి వొరట్లేమిటికి" 7-243

ఒరటులువట్టు: మూర్ఖపుపట్లు పట్టు.

"వూడిగాలు సేసేవార మొరటులు పట్టుదుమా
వేడుకఁగూడి బారము వేతుము గాక" 27-182

ఒరట్లు చూపు: మూర్ఖపుపట్లు చూపు.

"వుమ్మడి నుండఁగవచ్చు వొరట్లు చూపవచ్చు
కమ్మ కాఁగిలించుకుంటే కాదనఁగరాదు" 23-211

ఒరట్లువెట్టు: రాయిడిపెట్టు, అహంకారం చూపు.

"వొప్పి వొరట్లువెట్టి వూడిగాలు సేయించుక
దప్పిదేరించకు మోవిదండము నీకు" 14-108

ఒరతొమ్మిదిచాఁచు : (?)
"వొరకు నెత్తుకు సరివో బావ నీవె
వొరతొమ్మిది చాఁచావో వో మరదలా" 3-346

ఒరపరి : (ఒరపు + అరి) వి. సౌందర్యవంతుఁడు, ఒఱపరి (శ.ర.), ఉపాయశాలి, యోగ్యుడు.
"చెప్పఁగానె వుద్దండానఁ జెఱఁగు వట్టితి నిదె
వొప్పితి శ్రీవేంకటాద్రి వొరపరి బాలుఁడు" 20-154
"అలమేలుమంగ నీ వన్నిటా నొరపరివి
కలికి నీ వొళ్ళ నివి కంటిమే చెలియా" 28-279

ఒరపరితనము : (ఒరపు + అరి + తనము) వి. సౌందర్యం, ఉపాయం, యోగ్యత, గొప్పతనం.
"వెగ్గళించి యాతఁడెంత వేడుకకు నవ్వినాను
వొగ్గి గుట్టుతో నుండు టొరపరితనము" 24-288

ఒరపు : వి. విలాసాతిశయం, సౌందర్యం, యోగ్యత. (ఉపాయం, తంటా, దోషం, తాపం, ఆదుర్దా)
"ఎంచితే నొకటి కొక టెక్కుడాయ సింగారము
మించిన యీపె వొరపు మిక్కిలి సింగారము" 29-478

ఒరపులాడు : (?)
"ఒరపులాడక పోవె వోసి మాయ నాతోఁ
దొరలేవు నిను ముట్ట దోసము" 1-107old

ఒరపోలిక : వి. (?)
"ఇయ్యెంతి మురిపెము యెట్లుండెనే
ఒయ్యారముతో నొరపోలికనో యనఁగా" 5-123

ఒరయించు : స.క్రి. పరీక్షించు.
"ఇంతులు నిద్దరి నొరయించేవు శ్రీవేంకటేశ
ఇంతసేయఁగా నీకు నేమి వచ్చెను" 26-212

ఒరయు : స.క్రి. 1. రాచు, సంఘర్షణచేయు 2. పరీక్షించు 3. విచారించు 4. వెదకు. వి. విలాసాతిశయం, సౌందర్యం.
"మొగము చూచి నీ మోవినే యేల తిట్టేవు
పొగరే పులుసు గాదా ఒరయకు నీవు" 27-156
"పొంకపుఁ గాఁగిటిలో నీ పొందులు సతము చేరి
వుంకువఁ జొక్కించితివి వొరపు మరుఁగఁడా"
19-254

ఒరయు : అ.క్రి. 1. మూర్కొను, స్పర్ధచేయు 2. రాచు, సంఘర్షించు 3. నొక్కుడుపడు
"పాసివుండ దొరతురు పైకొని పెనఁగుదురు
వాసి నింతు రిట్లానే వలపు చల్లుదురు" 26-462

ఒరవు : వి. విధం, పోలిక, సామ్యం.
"సింగారించఁగానే ఆపె చేతికి లోనైతివి
వుంగరపువేలి గోరి కొరవైతివి" 21-274

ఒరిమ : వి. 1.స్నేహం, ఒద్దిక 2. ఆసక్తి 3. దయ, జాలి (వ్యు.), ఐకమత్యం, అనుకూలత. రూపాం. ఒరిమె.
"తొరలింపు మాటలును దొంతుల సరసములు
వొరిమతోఁ బచరించీ నొక్కమాఁటే" 13-195

ఒరిమె : (6) వి. 'ఒరిమ'కు రూపాం.
"ఎరవుగ మఱచైనా యెంచదు నేరాలు నిన్ను
వొరిమెతో మోనాన నుండుఁగాని" 23-180

ఒఱగులు దిద్దు : అ.క్రి. లోపాలు దిద్దు. (వంకలుదిద్దు)
"నెఱతనములు చూపి నీవు మా ఇద్దరిలోనా
వొఱగులు దిద్దేవు వువిద నీవు" 25-276

ఒఱటు : వి. 1. చెడ్డ ఆడది, దురదృష్టవంతుడు, చెడ్డ అలవాట్లున్న వ్యక్తి 2. దుర్మార్గుడు, క్రూరుడు, దుశ్శీలుడు.

ఒఱటువాఁడు : వి. మూర్ఖపు పట్టువాడు, మొండివాడు.
"వో వేడుక పుట్టవలసి విభుఁడు జూజాన నిన్ను
ఓడించెఁగాక నీతో వొరటువాఁడా" 21-206

ఒఱపు : విణ. 1. యుక్తం 2. ఒప్పైనది 3. పెద్దది
"ఒఱపు నీ మాటలకే వొడఁబడి తన మతి
కఱకరిఁ గరఁగీనా గామిడిగాక" 19-296

ఒఱిమ : వి. సాధురేఫ ముండదగిన రూపం. స్నేహం, ఐకమత్యం, ఆనుకూల్యం. (మిత్రత్వం – ఆంధ్రభాషార్ణవం)

"ఒఱిమ గలదానై వోరిచినా నెఱఁగవు
మఱి సరసమాడేవు మలసి నాయెదుట"
14-187

ఒట్టి(య) : (?)
"వొట్టియై ప్రకృతి వొరసి వేఁటలో
యిట్టివలెనే యెలయించీని" 3-224

ఒట్టిబాగులవాఁడు : వి. వెట్టిబాగులవాడు, తెలివిమాలినవాడు.
"వెట్టితనమున నిన్ను వేసరించేఁగాక నీవు
వొట్టి బాగులవాఁడవు వొద్దికయ్యేనా" 13-508

ఒల : వి. చెమ్మ, నెపము, మిష, సాకు.

ఒలగె : మెల్లఁగ అని అర్థం. కన్నడ సంబంధంతో వచ్చినది కావచ్చునని సం.ప.స.

ఒలపక్షపాతి : వి. పక్షపాతం కలవాడు.
"ఇంత వొలపక్షపాతి వెట్లైతివి
బంతినే నామీఁదఁగడు బత్తేసేసే విపుడు" 25-172

ఒలపక్షమాడు : పక్షపాతపు మాటలాడు.
"ఒలపక్షమాడకురే వువిదలాల పలుమారుఁ
బిలువఁగా బలుకరాదా మెలుతలాల" 21-314

ఒలపక్షము : (3) వి. పక్షపాతం.
"తప్పక చూడనేలే తానే సాకిరి చెప్పఁగా
అప్పటి నొలపక్షము లందుండెనా" 21-97

ఒలయు : అ.క్రి. 1. వ్యాపించు 2. ప్రవేశించు 3. కలుగు 4. కలియు, చేరు (శ.ర.) స.క్రి. చుట్టుకొను, కదియు.
"ఒలసి యచ్చువాసిన వురమే నా పీఠము"
12-273

ఒలలు వేయు : (2) అ.క్రి. వలలు వేయు, 'వల'కు 'ఒల' వ్యావహారికరూపం.
"అనుమానములకుఁగా అట్టె వొలలు వేసితి
వినుఁగాఁగలించితేనే నేర మాయనా" 7-263

ఒలవేయు : (4) అ.క్రి. 'వల'కు 'ఒల' వ్యావహారికరూపం. 'వలవేయు' శబ్దముయొక్క వ్యావహారికరూపం కావచ్చు నని సం.ప.స. (1-2 వు.)
"వొరటు జక్కవలపై వొల వేసెను" 19-278
"ఏమన్నాఁ దనకే చెల్లు నింతెకాక
వోముచు నాపై నేల వొలవేసీనే" 14-202

ఒలసి : 'వలచు' ధాతువు క్త్వార్థకరూపమైన 'వలచి'కి వ్యావహారికరూపం; ఇష్టపడి.
"ఒలసి శ్రీవేంకటేశుఁ డురముపై నిడుకొన్న
లలి మొక్కుటే మేలు యలమేల్మంగకు"
24-288

ఒలసితే : 'వలయు' ధాతువు చేదర్థకక్రియ; వలసితే అనే రూపానికి వ్యావహారికరూపం.
"మలసి రాలు దింటా మలిగండ్లననేల
ఒలిసితేఁ గైకొంట వొల్లకుంటే మానుట" 4-223

ఒలసీనొల్లని : (2) విణ. అంతగా ఇష్టపడని.
"వొలసీ నొల్లని పతి వొగిఁ కాఁగిలించుకంటే
సొలసి మాను గాఁగిలించుటే మేలు" 16-237

ఒలసినొల్లమి : వి. ఇష్టపడటం మరియు ఇష్టపడకపోవటం.
"చెలువల నంపె నిపుడు చేరవచ్చే ననుచు
వొలసినొల్లములకు వొరయఁ జోటేది" 20-568
"ఒలసి నొల్లములైనా వొద్దనే వుండుటగాక
తలఁగవచ్చునా మరి తరుణులకు" 26-521

ఒలసీనొల్లమి : (6) వి. అంతగా ఇష్టం లేకపోవడం.
"పలుమారు నాతఁడు బాఁతిపడి పిలువఁగా
వొలసీనొల్లమి నేల వూకొనేవే" 19-47

ఒలినిలయుఁడు : వి. (?)

ఒలిసీనొల్లక : క్రి.విణ. అంతగా ఇష్టం లేక.
"ఒలిసీనొల్లక యాల వూరకుండేవే" 19-387

ఒలుగులువారు : (4) అ.క్రి. 'ఒలుగులు' అన్న పదం నిఘంటువుల్లో కానరాదు. ఇది 'అలుగులు వారు' అన్న పదానికి రూపాంతరం కావచ్చు. 'అలుగు' అంటే చెరువుకు నీరు ఎక్కువైనపుడు అది పోవడానికి ఏర్పరచిన దారి; తూము అని అర్థం. అలుగులు పారడమంటే నీరు నిండి పారి వెళ్ళడమని

వాచ్యార్థం. అతిశయించు, అధికమగు అని భావార్థం

"జలనిధి యంతా మీరే చవిగొని చూచితేను
వొలుగులు వారఁగడు నుప్పులై వుండును" 26-477

'ఒలుగు' అంటే మిక్కిలిగా బయటికివచ్చు అని అర్థం. 'ఒలుకులు వాఱు' అనే పదం సూ.ని.లో కనిపిస్తుంది. 'ఒలుకులువాఱు' పదమే వ్యవహారంలో ఒలుగులు వారు కావచ్చునేమో! ఈ క్రింది ప్రయోగాలు పై రెండు తీరుల అర్థాలకు సమర్థకంగా ఉన్నాయి.

"చెలులము మమ్ము నేల సిగ్గులు వరపించేవు
వొలుగులు వారీ నవ్వు వొడిగట్టుకోరాదా" 27-277

"చలివాసె గొల్లెతలు సారె నిన్ను నెత్తుకోగా
వొలుగులు వారె మోహమూఁచి పాడఁగా" 21-83

"యెలమి శ్రీవేంకటేశు మోహరస
మొలుగులు వారుచు నుండిన రీతి" 24-183

ఒల్లఁగె: 'మెల్లగ'. కన్నడ సంబంధంతో వచ్చినపదం కావచ్చునని సం.ప.స. 26-427 పు.

"చేచేత శ్రీవేంకటేశ చేకొని నన్నేలితివి
లాచి మెచ్చినట్లా వొల్లఁగె మెచ్చరాదు" 26-480

పాదపీఠికలో సంపాదకులు ఈ పదాన్ని సూచించి అర్థం చూపలేదు. ఎందుకో?

ఒల్లనె: ఒల్లన + ఎ = తిన్నగ, శీఘ్రంగా, మిక్కుటంగా, అధికంగా.

"చల్లని నీ నామ ముచ్చరించని ద్రోహననే
వొల్లనే సంసారవార్ధి నోలలాడెను" 15-99

ఒళవు: వి. వీణాదండం, ప్రవాణం. (కీలు, దిటవు)

"తనువే ఒళవు తలయే దండెకాయ
ఘనమైన వూర్పులు రెండు కట్టిన తాళ్ళు" 3-467

ఒళ్లు: (84) 'ఒడలు'కు వ్యావహారికరూపం; శరీరం.

"సరిఁదీగె వంటి మేన జనియించిన చన్నులు
వొరసి పెనఁగితే నీ వొళ్లు నొచ్చీనా" 13-466

విభక్తులు పరంగా ఉన్నప్పుడు, సమాసంలోను అన్నమయ్య దీనిని 'ఒళ్లి'గా ప్రయోగించినాడు. ఉదా :- వొళ్లిమీద (16-102) 12-275, వొళ్లిపై (7-496) మొ॥ ఒళ్లిపనులు (19-524) మొ॥

ఒళ్లువేయు: శరీరాన్ని ఉంచు.

"పట్టిన చలముతో నేఁ బవ్వళించి వుండఁగాను
వొట్టుక దగ్గరి నామై వొళ్ళువేసీని" 11-586

"ఓపననఁగానే పో వొళ్లు వేసీని
తీపుల జంకించి నాపైఁ దేనె చల్లీని" 21-490

ఒవ్వు: (8) అ.క్రి. రూపు చెడు, సౌందర్యవిహీనమగు, గిట్టు, పొసఁగు, వీలుపడు.

ఒసపరి: వి. అందగాడు, అందగత్తె; విణ. అందమైన, ఉత్కృష్టము.

"కసరేమి లేక కౌఁగిట నీ విట్టె
ఒసపరి రీతి నుండంగ వద్దా" 6-120

ఓ

ఓఁక: వి. 1. పుల్లికలివె 2. వక్క

"వీఁకవింటి చెంచెతా వీఁచి కోసేవేఁటివే
వోఁకల విడేలు వో వొగరుగాని" 26-77

ఓఁకర: వి. పిత్తవ్యాధి మొ॥ వాటివలన కడుపులోనిది ధ్వనిపూర్వకంగా నోటిలోనికి రావడం.

"ఆఁకలీ నొక్కటె యటు జనించిననాఁడు
వోఁకరెన్నఁడో దాగివుండుఁ గొన్నాళ్లు" 4-296

ఓఁగునూతల: వి. కడపజిల్లాలో చిన దాసరిపల్లెకు సమీపంలో కొండలోయల నడుమగల ప్రదేశం. దీనికి వోనూతలకోన అనీ, వోగు నూతలకోన అనీ పేర్లున్నాయి. ఇక్కడ నరసింహస్వామి ఆలయం ఉంది. ఓగునూతుల అన్నపదమే వేయి నూతలగా మారింది. ప్రస్తుతం ఈ

క్షేత్రాన్ని వేయినూతలకోన అని వ్యవహరిస్తున్నారు. ఇక్కడి నృసింహస్వామిని అన్నమయ్య, చినతిరుమలాచార్యులు అనేక కీర్తనల్లో ప్రశంసించినారు.

"వోయమ్మ శ్రీవేంకటేశుఁడోగునూఁతులాడ నన్ను

చాయలకే కూడెఁబో వేసాలుసేసీని నన్ను" 21-490

"వోయమ్మ శ్రీవేంకటేఁశు డోగునూతులలోఁగూడె" 11-385

ఓగు: వి. కీడు. విణ. అశుభం, అప్రశస్తం.

"ఓగుల లంపటమున కోపికెంతైనాఁ గద్దు

యోగపు సత్కర్మాన కొకయింత లేదు" 1-467

ఓగునూతులౌభలేశుఁడు: వి. కడపజిల్లాలో చినదాసరిపల్లెకు సమీపంలో కొండలోయల నడుమ నృసింహస్వామి ఆలయం ఉంది. ఇక్కడున్న ఆలయంలోని శాసనాన్నిబట్టి ఓగునూతలపల్లె అహోబలేశ్వరానికై గండికోట సీమపాలకుడైన కార్యకర్త బాచరసు తాళ్లపాక తిరుమలయ్యగారి ఆజ్ఞ ననుసరించి దుర్గన్నయని వర్తనగా సమర్పించిన వివరంగల శాసనాన్నిబట్టి ఓగునూతలలోని స్వామిపేరు అహోబలేశ్వరస్వామి అని తెలుస్తుంది. ఈ ఓగునూతలే తరువాత వేయునూతలగా మారింది. (ఔభళేశుఁడు అహోబలంలో నెలకొన్న స్వామి, నృసింహస్వామి .)

"ఔభళేశ వోఁగునూతలౌభళేశ

శోభనము నీకు నాకు జోడుగూడెఁ గాదా" 26-3

"అల్లదిగో వోఁగునూతలౌభళేశు పెద్దకోన

వెల్లి పాలనీటి జాలు వెడలే సోన" 11-80 old

ఓజ: వి. 1. పూనిక, ఉత్సాహం, విధం, రీతి 2. నేర్పు 3. న్యాయం, ప్రకృతి, స్వభావం .

"చెనకఁ జూచినవేళ చేరి బాస లడిగేది

వొనరఁ దుచ్చపువారి వోజ లింతేకా" 25-373

"వెన్నలెల్లా దొంగిలి శ్రీవేంకటేశుడైనాఁడు

వున్నతిఁ దనకుఁ గల వోజే కదే" 21-172

ఓడఁగట్టిన దూలము: ప.బం; వి. విడిపోవక పెద్దవానిని ఒకనినే ఆశ్రయించి కష్టసుఖాలలో పాలు పంచుకొనేది, నిత్యసంబద్ధమై ఉండేది. ఓడకు కట్టిన దూలము ఓడపోయినట్లెల్లా పోతుంది. అది మునిగిపోతే ఇదీ మునిగి పోతుంది. అది గమ్యం చేరితే ఇదీ చేరుతుంది. అందుపై వచ్చిన నానుడి. అవినాభావ సంబంధం.

"ఓడఁగట్టిన దూలమై ఉపేంద్రుఁడా నీకుఁ

నూడిగాలు సేసేము ఉపేంద్రుఁడా" 17-232

ఓడతో దూలము: పబం; వి. అవినాభావ సంబంధంతో ఉండేది ; ఓడతోపాటే దానికి కట్టిన దూలం ఉంటుంది అని వాచ్యార్థం.

ఓడబేరము: వి. ఓడమీద చేసే వ్యాపారం, నౌకావ్యాపారం.

"నెమ్మది నోడబేరము నీతోడి మాట

పమ్మి కాచుకున్నవారి భాగ్యముల కొలఁది"

16-382

ఓడ మింగిన భూతము: వి. మత్స్యావతార రూపుడు. సముద్రంలో తిమింగలములనే పెద్దపెద్ద చేపలు ఓడలను మింగివేస్తాయి కదా!

ఓడ మింగెడి భూతము: వి. సోమకుని నిగ్రహించి వేదాలను ఉద్ధరించడానికి మత్స్యావతారంగా అవతరించిన భగవంతుడు.

"కినిసి వోడ మింగెడి భూతము

పునుక వీఁపు పెద్ద భూతము" 1-109

ఓడలు బండ్ల వచ్చు: (2) ప.బం. దేశకాలపరిస్థితులను బట్టి ఆధారాధేయాలు మారుతాయనే విషయాన్ని తెలిపే పదబంధం. నేలపై ఓడలు బండ్లపై, నీటిపై బండ్లు ఓడలపై వెళ్లక తప్పదుగదా! ఇట్లే బండ్లు ఓడల వచ్చును అనే పలుకుబడి కూడా.

"ఈడనే శ్రీవేంకటేశ యింతిఁ గూడితివి నీవు

వోడలు బండ్ల వచ్చు వుండవయ్య నీవు" 7-328

ఓడ విడిచి వదరిడు: ప.బం; అ.క్రి. ఓడను వదలి సొరకాయను గ్రహించడం (వదరు = సొరకాయ), శాశ్వతమైన రక్షణ ఇచ్చేదాన్ని వదలి రక్షణ లేనిదాన్ని గ్రహించడం,

సులభమైన ఉపాయం ఉండగా తెలిసి తెలిసి అనుమానాస్పదమైన దాన్ని గ్రహించడం.

"యింటివేలుపు వేంకటేశుఁ గొలువక పరుల

వెంట తిరుగుట వోడవిడిచి వదరిడుట" 1-104

ఓడుపడు : అ.క్రి. 'ఓటుపడు' కావచ్చు, అపజయపడు, కోలుపోవు.

"దొడ్డతనమేది యందు దొర యాడనున్నవాఁడు

వొడ్డి హరిఁగొలువక వోడుపడె జీవుడు" 2-13

ఓతడ : (ఓ + అతఁడ) ఓ మనిషీ!, వింత సంధి.

"ఊరికిఁ బోయెడి వోతఁడ కడు

చేరువ తెరు వేఁగి చెలఁగుమీ" 1-89

ఓదెడు : కొలత. (చేటెడు, మోపెడువంటి పదం) (ఓదె = ఓదియ, కోఁతకోసి చేనియందు అక్కడక్కడ నుంచెడు వెన్ను పోచల ప్రోగు - శ.ర.)

"బిగేసేవు గాక ప్రియురాండ్లు నిన్ను

వొగరులాడేది వోదెఁడు గాక" 17-152

ఓపికె : (2) వి. 'ఓపిక'కు వ్యావహారికరూపం, బలం, ఓరిమి.

"వున్నదేవునికి వోపికె గలుగుచోట

చెన్నగు విభుఁడ నీ చిత్తమింతే యిఁకను"

24-174

ఓపె : వి. నీచమిత్ర, స్త్రీ సంబోధనార్థకం, ఆపె, ఈపె మొ॥ పదాల సామ్యంవల్ల ఈ పదం ఏర్పడి ఉండవచ్చు. ఇట్లే ఓమె అనే పదం కూడా ఉంది. శృం.నై. 4-114

"అంది వాదులకు వచ్చే వదే మోపే

మందపసులు దవ్వేఁగె మమ్మ్మ విడవోపే" 7-11

"పేయ చొరఁగానె యిల్లు బెంబడిఁ జొచ్చితిఁగాక

ఆయెడ నన్నేల తిట్టే వదేమోపే" 7-11

ఓబ(బు)ళేశుఁడు : (ఓబళ + ఈశుఁడు) చూ: ఓబులేశుడు. అహోబలేశుడు, నృసింహస్వామి.

"ఓపము నీతోఁ బెనఁగ వోబళేశుఁడు

ఆ పని నే నెఱుఁగనా అయ్యో వోబుళేశుఁడా"

ఓబులేశుఁడు : (ఓబుల + ఈశుఁడు) అహోబల క్షేత్రాధిపతి యైన నృసింహస్వామి, 'అహోబల'కు 'ఓబుల' అనేది వ్యావహారికం.

"ఓబులేశుఁ డీ కాంత నొరసీఁగొంత

యీ బిగువు దన కేల ఇంతెఱఁగదా" 21-475

ఓబుళపుకొండ : వి. అహోబలపర్వతం, ఇది నృసింహక్షేత్రం, అహోబలం అనే దానికి ఓబుళం అనేది వ్యావహారికరూపం.

"గొంది నీవు వోబుళపుకొండలో వుండే వునికి

ఇందిరతో విన్నవించే నిదివో నేను" 21-476

ఓము : (9) స.క్రి. 1. రక్షించు, పోషించు, కాపాడు 2. బాగుచేయు, సంస్కరించు 3. అనుగ్రహించు 4. తాల్చు, వహించు 5. పురుడు, ఓర్చుకొను. 21-69

"పొల్లవోని పూవుల పుప్పొడి పోదిసేసేనే

వొల్లనన్నఁ బోదు దీని కోమరమ్మా చెలులు"

10-2-44

"వోముచు నెన్నాళ్లదాఁకా వోరుచుక వుందునే"

11-437

ఓరంత ప్రొద్దు : వి. దినమంతా, ఎల్లకాలం.

"వొప్పించె నాసలకు వోరంత ప్రొద్దునను

తిప్పించె కోరికల తిరిగి నలుగడల" 1-185

ఓర : వి. 1. హద్దు, మేర, మర్యాద (2. క్రీగంటి చూపు 3. పక్క, వైపు 4. అంచు 5. వాలుప్రదేశం)

హద్దు, మేర :

"సారెఁ జెలికత్తెల కాసలెల్లాఁ జూపుతానె

వోరలేక కూడితేనే వొడబాటా నాకు" 19-241

క్రీగంటిచూపు :

"ఓరతోడ నాపె సేసే ఉద్దండాలెల్లాఁ

బీరాన నీవు వచ్చి పెనఁగవద్దా" 11-44

ఓరగన్ను : (2) వి. క్రీఁగన్ను, ఓరచూపు.

"వొగరుఁ దీపుగా నీవు వోరగండ్లఁ జూచిన

మగటిమిఁబూసగొండిమాటలెల్లా నాడుదూ"

12-34

"సారెఁ దురుమొకచేతఁ జక్కఁబెట్టుకొంటానే

వోరగండ్లనే చూచె నొక లేమ" 17-344

ఓరవాకిలి : (ఓర + వాకిలి) సగం తెరచి ఉండే గృహద్వారం. (సూ.ని.) ఓర అంటే ఒరగినది, వంకరయైనది అని అర్థం కనుక ఓరవాకిలి అంటే సగం తెరచి ఉన్న గృహద్వారమని అర్థం. రూపాం. ఓరువాకిలి (వాచ.)

"ఓరవాకిలి సేసి వొంటి నీవు లోననుండి

రారమ్మన్నా నెదురుగా రావు గదవే" 27-183

ఓరసేయు : (ఓర + చేయు) పక్కకు ఉంచు, పక్కకు ఒరగించు.

"భారపు వేంకటగిరి బాఁపడా మమ్ము

నోరసేయక కూడితివో బాపఁడా" 6-90

ఓరికొట్టు : వి. ఓరి అనెడి నీచ, మిత్ర పురుష సంబోధన చేయడం. రాకొట్టు వంటిది.

"ఉద్దండాలకే కాదా వోరికొట్లను నిన్ను

పెద్ద బెట్టుగా నూరకె పేరఁబిలిచేది" 26-452

ఓరికొట్లు కొట్టు : (4) ప.*బం; అ.*క్రి. ఓరి అని నిందా పూర్వకంగా సంబోధించు.

"ఓరికొట్లు కొట్టేది వున్నట్లే సిగ్గువడేది

కోరిక సతులకివి గుణములే కావా" 20-237

ఓల : (2) వి. జలక్రీడ, జలక్రీడలు జరిపేసమయంలో 'పట్టుకో చూద్దాం' అని ఇతరులను ప్రేరేపించడానికి ఉపయోగించే శబ్దం. (నింద, నెపం, వ్యాజం)

"యీ లాగులే ఇందరికి యీఁదులాడే నీటిలోని

వోల లాయ నిదివో నీ వుప్పువేసి పొత్తులు"
21-340

ఓలమాసగొను : అక. తిరోహితమగు, మఱుగుపడు, వెనుదీయు, శ్రమ తీర్చుకొన నెంచు. (ఓలము = రహస్యస్థలం ఆం.ప.ని .)

ఓలవేయు : (3) అ.క్రి. నిందవేయు.

"ఓలవేసి వలపించి వోర సేయవద్దు గాక

వేళతో వచ్చి కూడితే వేడుకే కదే" 28-356

ఓలి : (2) వి. 1. ఉంకువ, కన్యాశుల్కం, పెండ్లికొడుకు పెండ్లిసమయంలో వధువు కిచ్చే ధనం. 2. వాక్యాలంకారంగా ప్రయోగింపబడే పదం.

"ఓలివెట్టి పెండ్లాడితి వొడఁబరచవలెనా

మేలుతోడిదాననై మెలఁగుదుఁగాక" 12-157

"కోలుముందై బ్రహ్మ యజ్ఞకుండలము లాహుతి గొని

వోలినుండే అది నీకు హోమము" 4-46

ఓవపుచ్చు : స.క్రి. తెలియజేయు, వివరించు, సరిపడునట్లు చేయు, తీర్పుచేయు, సమాధానపరచు.

"చేవదేర నీ దొంగచేఁత లెల్లా వీరు వారు

వోవవుచ్చే రివి వినసోపమయ్యా" 20-133

ఓవరి[1] : (2) వి. సభ్యత, నాగరికత, మర్యాద. (తె.వ్యు.కో.)

"శ్రీవేంకటేశ్వరునికి చెలి యలమేలుమంగ

వోవరిగా నెలకొని వురముపై నున్నది" 7-198

"ఓవరిగా నాతఁడు నిన్నురమునఁ బెట్టుకొంటే"
20-385

ఓవరి[2] : (23) వి. వాసగృహం (ఆం.భా.) లోపలి గది, చంద్రశాల (శ.ర.), అంతఃపురం, పడకటిల్లు. (పీఠిక)

"ఓవరిలోనికి వచ్చి వొరసి నీవే యడుగు

కావిరి నివ్వెరఁగులఁ గమ్ముకొని వున్నది" 8-38

ఓవలఁబెట్టు : ప.*బం; స.*క్రి. దూరంగా ఉంచు, బలవంతపెట్టు, ఇబ్బందిపెట్టు.

"వీడ కలమేల్మంగ శ్రీవేంకటేశ నీ కుండఁగా

వూడిగపువారి నెంత వోవలఁబెట్టితివి"

"ఈవలఁ జన్నులె గొప్ప లించుకంతె నెన్నడుము

వోవలఁబెట్టితే నంత వోరుచుకో నోపను" 18-534

ఓవల : (10) ఆవల (?)

"దేవుఁడవై ఇందరిలోఁ దిరుగాడుదువు గాని

ఓవల నాకైతే నీపై వున్నచోనే వున్నది" 26-28

"దావతి జలనిధి దాటినవారికి

వోవల మరియును వోడేలయ్యా!" 4-260

"ఓవలఁ బాలెల్లఁ దాగి వుబ్బి మదించీని

తావి బుజాల గోరికోఁతలు కోసిరి" 21-231

ఓవలకత్తె : (ఓవల + కత్తె) వి. ఉపాయశాలిని యైన స్త్రీ, తీర్పరియైన స్త్రీ.
"నీవుఁగూడి యిందుకుగా నిండుఁజుట్టాలఁ జేసేవు
వోవలకత్తెవు గదే వువిదరో నీవు" 18-440

ఓవలుసేయు : స.క్రి. దోషులను చేయు (మై.వే.సు.)

ఓవసేయు : అ.క్రి. 1. ఇబ్బందిపెట్టు 2. దోషముచేయు
"లావుల నీ మన్ననకొలఁదులవారము నేము
వోవసేసి మమ్ము నేల వొరసేవు విభుఁడా"
8-285

ఓశక్క : ఓసి + అక్క కు వ్యావహారికం.
"ఓపో అదేడ సుద్ది వోశక్క
కోపగించుకొందురటె గొబ్బున నోశక్క" 25-427

ఓసరించు : (6) స.క్రి. తొలగించు, అపసరిల్లఁజేయు, విడుచు, త్యజించు (పీఠిక)
"ఓసరించి నీ విభుఁడు వొద్దనె వున్నాఁడిదె"
17-331

అ.క్రి. 1. ఓసరిల్లు, తొలగు, అంతరించిపోవు 2. ఇష్టపడకుండు 3. వంగు (తె.వ్యు.కో.)

ఓసరు : అ.క్రి. తొలగు, అపసరిల్లు.
"ఓసరి యాతని నీడ దోసిటిలోఁగని నీరు
వాసిఁగాళ్లఁ జల్లుకోఁగా వడి నవ్వె కృష్ణుఁడు"
21-457

ఓసికొట్లు కొట్టు : (ఓసి + కొట్టు) వి. 'ఓసి' అని నిందాపూర్వకవాక్కులను పలుకు.
"వోసికొట్లు గొట్టి కంచుటుంగరాల చేయి
తీసేవు నీ చెల్లెతోడు తియ్యకురా నన్నును"
5-103

ఓహరిసాహరి : వి. తండోపతండంగా అని శ.ర., బ్రౌన్ : Backwards and forwards; అహమహమికతో, సాహంకారంగా అని సూ.ని. "అహమహమిక పేరు రహికెక్కు నోహరిసాహరి యనఁగను" ఆం.భా. 2-221. కొన్ని ఉదాహరణల్లో ఎడతెగక – అవిచ్ఛిన్నంగా అనీ, గుంపులు గుంపులుగా అనీ అర్థాలను చూపి ఉదాహరణలు చూపింది. బ్రౌన్ ఇచ్చిన ముందుగా వెనుకగా అనే అర్థమే పొసగునట్లున్నదని ఆ.మూ. (సం.వా; పద. భాషా. 437)
"అకట యీ జగతి నోహరిని సాహరిని
యొకఁడు నాతోఁ బోరనోపునే పోర"
పద. హోరాహోరిగా అనే అర్థమిచ్చింది. పై ఉదాహరణంలో అహమహమికతో, హోరాహోరీగా అనే అర్థాలే పొసగేట్లుగా ఉన్నాయి.

ఔ

ఔఁగాదను : (14) (ఔను + కాదు + అను), విమర్శించు, ఆలోచించు, అడ్డుచెప్పు.
"హత్తి వలచినదాన నౌఁగాదనఁగరాదు
తత్తరపు నా వయసు తన సొమ్ము గాదా"
26-249

ఔఁగాములు : వి; బహు. (అవు + కామి) మంచిచెడులు, సత్యాసత్యాలు, కష్టసుఖాలు, ఉచితానుచితాలు.
"చింతలన్నియు విడిచి సేసవెట్టేవారికి
యింతులలో నౌఁగాములు యిఁక నేడవే"
13-20

ఔఁగు : వి. భక్ష్యవిశేషం, అవుగు. 6-4

ఔత : (అగు + త) వి. కావడం, భావార్థంలో 'ట' ప్రత్యయం బదులుగా అగుధాతువుపై 'త' ప్రత్యయం. భావార్థంలో ఈ 'త' ప్రత్యయం చేరినరూపం అన్నమయ్యలో పెక్కుచోట్ల కనిపిస్తుంది. చూ : 5-69, 7-126, 441, 9-72, 53, 11-54, 13-399, 14-519, 395, 14-422, 16-417, 18-495, 349, 19-465 మొ॥ రూపాం. అవుత. అన్నమయ్య 'ఔట' అనే రూపాన్నికూడా అతివిరళంగా మాత్రమే వాడినాడు.
"అలమేలుమంగవార మౌట చాలదా" 27-439

ఔబళపుఁగొండ : వి. అహోబలంకొండ. కర్నూలు జిల్లాలో ఉన్న నృసింహస్వామి క్షేత్రం.

"పెదయౌబళపుఁగొండఁ బెరిగే నదే
వదలక కొలిచితే వరము లిచ్చీని" 4-309

ఔభళనారసింహము : వి. అహోబలక్షేత్రంలో వెలసిన నరసింహస్వామి.
"పరఁగీ నదివో గద్దెపై సింహము వాఁడే
పరమైన యౌభళనారసింహము" 4-415

ఔభళపు సింహము : (ఔభళము + సింహము) అహోబలం క్షేత్రంలో వెలసిన నరసింహస్వామి.
"నానాటికిఁ బెరగని నరసింహము
ఆనుక వరములిచ్చే నౌభళపుసింహము" 3-153

ఔభళేఁశుడు : (5) (ఔభళ + ఈశుఁడు) అహోబలక్షేత్రస్వామి యైన నృసింహస్వామి. అహోబలమునకు ఔభళము వ్యావహారికరూపం.
"సందించి వైశాఖశుద్ధచతుర్దశి శనివార
మందు సంధ్యాకాలమున నౌభళేశుఁడు" 4-310

ఔభళేశ్వరుడు : (ఔభళ + ఈశ్వరుడు) అహోబలంలో నెలకొని ఉన్న నృసింహస్వామి. ఔభళం అనేది అహోబలానికి వ్యావహారికరూపం.

క

కంకణదారాలు : వి; బహు. వివాహాది శుభకార్యాల్లో కంకణాలు కట్టుకునే దారాలు, ఇది వైరి సమాసపదం.
"కంకణదారాలు కట్టరో యిద్దరికిని
సుంకులఁ బెండ్లిపీటఁ గూచుండఁబెట్టరో" 14-365

కంకి : వి. కఠినుడు, దురుసుతనం కలవాడు.
"అందరి యెంగిలివైతి వాడికలకు లోనై
కందువరతులలోన కంకి వైతివి" 21-212

కంకిగ(గా) : (14) క్రి.విణ. వికృతంగా, నిండుగా, దట్టంగా. కంకి అంటే గింజ ముదిరిన ఎన్ను అని అర్థం. ఇక్కడ లాక్షణికంగా నిండుదనము అని అర్థము అని సం.ప.స. (14. అను. 348 పు.) బలవంతంగా (మాం.ప.కో; తె.అకా.)
"కంకిగాఁగ నెలయించి కౌఁగిటఁగూడితి నన్ను
వేంకటవిభుఁడ యిఁక వీడవయ్యా" 5-121
"వంకలచంద్రుల నించి వాడివెట్టఁగాక నీకు
కంకిగా రతులలో ఘాతేసేసునా" 8-112
"కంకిగ బహునరకంబులు చొచ్చితి
నింకా భయమది యెరఁగను" 3-317
"అంకెల శ్రీవేంకటాధిప కూడితి
కంకిగ నలయదు కాయంబిదివో" 27-263

కంకిసేయు : (3) అ.క్రి. దురుసుతనమాచరించు. కంకి = కండె (పర్యాయ) కంకి = జొన్న లోనగువాని యెన్ను (సూ.ని.)
"అంకెకు రాకున్నవేళ ఆడువారు మగవానిఁ
గంకిసేసి కన్నచోటఁ గాకుసేతురు"
"కంకి సేసి రతులను కాఁగిటఁగూడితి నిన్ను
యింకాఁ దనియ వేమోయి యెందాకను" 11-578
"తొడమీఁదఁ దొడవేసి దొరతనాలు చూపఁగా
కడఁగి నీ మోవి యాకె గంకిసేయఁగా" 27-443
"మంకు చూపవద్దు గాని మనసిచ్చి
యన్నిటాను
కంకిసేసి రతులను కాఁగిలించవచ్చును" 25-193

కంకు : అ.క్రి. గద్దించు, అదలించు, గదమాయించు, గదుము (పర్యాయ), సారము పీల్చు (మాండ)
"కంకి తన సుద్దులకు గక్కన నవ్వినదాన"

కంగనాడు : అ.క్రి. అబద్ధమాడు, బొంకులాడు, వంచించు (పద.) కిట్టెల్ నిఘంటువులో కంగు = displeasure, anger. కంగారు = to become angry or annoyed అని వివరింపబడింది. దీనినిబట్టి చూడగా 'కంగనాడు' కు గట్టిగా పలుకు, ఆగ్రహించి పలుకు అనే అర్థాలు కూడా క్రింది ప్రయోగంలో సరిపడుతున్నాయి.
"బంగారు మెఱగుచాయ పడఁతి నొకతెఁగూడి
కంగనాడేవు నాతో కానియ్యరా" 5-51

కంగాణించు : వ్యవసాయం, తదనంతరం కల్లం

పని చేయు, కంగాణమైంది అనడం వాడుక.
"యెడయని పయ్యెదనే ఇల్లారుగా బెట్టి
కడలేనిరతుల కంగాణింతువు రావయ్యా" 22-320

కంగు: (13) అ.క్రి. చలించు, కదలాడు, తూలు, కసరు, బిత్తరపోవు, తప్తమగు.
"కంగి నిలుచున్న దదే కంబముదండ" 11-487
"వెంగేన నిమ్మపంటను వేసెల వేసితి నంటా
కంగి మనికితపడి కరఁగీఁజెలి" 7-221
"అంగవించి కూడితిరి అట్టె శ్రీవేంకటేశ
కంగకిట్టె వుండరాదా కడు జంకె లేఁటికి" 20-531

కంగు: (8) వి. 1. సరిహద్దు 2. మడత 3. పక్షం 4. ఉప్పుబట్టీ లోని గీతపై పిల్లవాడు నిల్చొని ఇటూ అటూ దాటిపోకుండా కాయడం 5. జరీ మొ॥ వాటితో వంకరగా ఏర్పరచిన కన్ను.
"సంగడినున్న వారి సాకిరివెట్టి రావే
కంగు లేక తన బుద్ధి కైకొని రావే" 7-215
"పంగించ నీ నోరు బందెయెద్దు మోరాయ
కంగు లేక కదుపునఁ గలపఁగవలెనా" 7-185
"కంగు లేక వింటేను కత చెప్పవచ్చుఁగాక
వెంగేలుగా భావించితే వింతగాదటే" 22-329
"అంగనకు కర్పూర పారటము మాన మాటు
కంగు లేని యిప్పటి నీ కాఁగిలే మందు" 16-145

కంగుదేరు: (3) *ప.బం; అ.క్రి.* ఆరితేరు.
"సింగారించుకొనఁబోతే చీర గట్ట వచ్చీఁ దానె
కంగుదేరిన బిడ్డనిఁ గంటివో యమ్మా" 7-188
"చెంగటఁ బెనఁగుదురా చేతులెత్తి మొక్కితేను
కంగుదేర నన్నుఁజూచి కరుణించీఁగాక" 14-527

కంగువాయు: (?)
"కంగువాయ శ్రీవేంకటేశుఁడు నన్నుఁగూడె
అంగడినవ్వులలోనే ఆస మానీనా" 25-200

కంగువెట్టు: (3) (?)
"కంగువెట్టేనా నీతో కల్ల గుట్టు నీకేఁటికి" 27-286
"జంగిలిమాయలు సేసి జట్టి ఐనె నిన్ను నాపె
కంగు వెట్టుకోము నేము గరితెలము" 27-285
"కంగు వెట్టుకొని పాసికాఁకలఁ బొరలవద్దు" 27-581

కంచపుఁబాపములు: *వి; బహు.* కూటికోసం చేసే పాపాలు (?)
"కొంచెపరచు నా కోపముఁ గోసివేసి మరికదా
కంచపుఁ బాపంబులలోఁ గడతేరుటా" 10-4

కంచపుఁబెండ్లి: వి. సులభసాధ్యమైన వివాహం, వడ్డించిన విస్తరి వంటి ప్రయోగం కావచ్చు!
"యెంచఁగ శ్రీవేంకటేశ యిందిర నీ కూటములు
కంచపుఁబెండ్లి మీకుఁ గలిగెఁగా నేడు" 9-129

కంచపుఁబొత్తు: (3) వి. సపంక్తిభోజనం, సంబంధం, దగ్గరి చుట్టరికం.
"మంచిదే నీలోని గుట్టు మాకే యిన్నిటా అట్టు
కంచపుఁబొత్తుకు నీవే కైకొలుపరాదా" 19-341

కంచపుగాలి: వి. కూటిమీది మరులు.
"కంచపు గా లావటించే కలిమిలో వారమంతా" 9-49

కంచపుజన్మము: కేవలం భోజన దృష్టి గలిగిన జన్మము, తిండికోసమే పుట్టిన పుట్టుక, భోగార్థమైన జన్మము.
"పొంచి కామాంధకారము పుణ్యము
గానఁగనీదు
కంచపుజన్మపు చిక్కు గతి చూపదు" 3-30

కంచపు పంతపుది: వి. భోజనంమీది పంతం కలది.
"కంచపుపంతపుదానవు మా కతలాలకించ నేలె
యీ
పంచల మాయలు మాని పదరాదా" 9-100

కంచపుపొత్తు: (4) వి. సపంక్తిభోజనం, మిక్కిలి సన్నిహిత సంబంధం.
"మించి యెప్పుడును నేము మీవారమే
కంచపుపొత్తు గలసి కసిగాటు లేఁటికే" 19-434

కంచపుపొత్తు చుట్టము: వి. అతిసన్నిహిత బంధువు, జ్ఞాతి, పాలివాడు.

"మంచి మాటలాడినవాఁడు మరుగక
యాలమాను
కంచపుపొత్తు చుట్టము కాకు సేసీనా" 16-43

కంచపుమోవి : వి. వడ్డించిన కంచంవంటి పెదవి, అనుభవించడానికి అందుబాటులో నున్నది.

"వంచనతో నీవు నాకు వలచిన వలపెల్ల
కంచపుమోవియందే కానవచ్చెను" 7-581

"కంచపుమోవి యట్టే కానుక వట్టుకున్నది
అంచెలఁజేతులు చాచి అందుకొనవయ్యా"
29-222

కంచపురతి : వి. (?)

"యెంచఁగ శ్రీవేంకటేశుఁ డేలె నించుకే
కంచపురతి యొసఁగె కదుమకువే" 7-155

కంచపువిడెము : వి. ఎంగిలి విడెము .

"కంచపు విడెమిచ్చితేఁ గారమాటే తప్పు"
21-406

కంచపుసంసారము : వి. భోజనమే ప్రధానమైన సంసారము.

"ముంచిన జన్మదుఃఖములు దలపోయుట
కంచపుసంసారము గడుచుటే జ్ఞానము' 4-346

కంచము కాలఁదన్ను : ప.బం; అ.క్రి. ఆదరంతో పెట్టినదాన్ని తిరస్కరించు.

"పెంచేటి తలిదండ్రులు ప్రియమై వడ్డించఁగాను
కంచము కాలఁదన్ను సంగతియా బిడ్డలకు"
3-20

కంచముపొత్తు : (30) వి. సపంక్తి భోజనం, (పద.) బంతికూడు, దగ్గరి చుట్టరికం. (తె.జా.)

"కలయ మోవితేనె లొసఁగు కంచము పొత్తు
లెన్నండె" 17-20

"కంచముపొత్తుకొరకే కానుక చేతికియ్యనా
యెంచుకోక మఱచితివేమో కాక" 23-230

కంచముపొత్తు చుట్టము : వి. దగ్గరి చుట్టరికం.

"మంచి మాటలాడినవాఁడు మరుగక
యాలమాను
కంచముపొత్తుచుట్టము కాకుసేసీ" 16-43

కంచములోపలి కూడు కాలదన్ను : ప.బం. సిద్ధాన్నాన్ని కాదను.

"ముంచిన వేడుకతోడ మొక్కుట గాక
కంచములోపలి కూడు కాలఁదన్నేటికి" 1-497

కంచి : వి. మదరాసుకు సమీపంలో ఉన్న కంచి పట్టణం. మోక్షదాయకాలైన సప్తక్షేత్రాల్లో ఒకటి. ఇట వరదరాజస్వామి వెలసి ఉన్నాడు.

కంచిరాయఁడు : వి. కంచి క్షేత్రంలో వెలసిన స్వామి. వరదరాజస్వామి. (కాంచి యే కంచి)

కంచుఁగుత్తికల వారు : ప.బం; వి. హెచ్చుస్థాయిలో పలికే కంఠం కలవారు. కంచు ఖణేలు మని శబ్దిస్తుంది. అట్టి కంఠమని భావం. కంచుగొంతు.

"కంచుఁగుత్తికలవారి గానములఁ జొక్కిచొక్కి
కంచుఁబెంచు నాయెఁబో నా కడలేని గుణము"
1-40

కంచుఁగుత్తుక : (కంచు + కుత్తిక) ప.బం; వి. కంచుకంఠం, హెచ్చుస్థాయిలో పలికే కంఠం. కంచు ఖణేలుమని మోగుతుంది. అట్టి కంఠమని భావం. 1-401

కంచుఁబదను : ప.బం. చాలా పెళుసు (పద.) మిక్కిలి నిశితము, మిక్కిలి కఠోరము. కంచునకు పదును పెట్టితే అతిసునిశితంగా ఉంటుంది కదా! ఏ యింతకైనా విరిగి పోతుందని భావం. కంచు చాలా పెళుసైన లోహం. మెత్తనిది, మృదువైనది అని ఆం.శ.ర.

"కంచుఁబదనుల కాంతలు నేఁడిట్టే
వంచుకొన నీకు వసమా" 8-289

"కంచపదనువంటి మనసు కనుక వాడిందుకు
రాడే" అని క్షేత్రయ్య.

కంచుఁబెంచు నగు : (2) ప.బం; అ.క్రి. విరిగిపోవు (కంచు మట్టిపెంచు అగు అని వాచ్యార్థం)

"కంచుఁగుత్తుకలవారి గానములఁ జొక్కిచొక్కి
కంచుఁబెంచు నాయఁబో నా కడలేని గుణము"
1-401

"ఇంచుక వడి నీ విటు రాకుండిన
కంచుఁబెంచు నౌఁగాయ మిది" 24-51

కంచుఁ బెంచు సేయు : *ప.బం; స.క్రి.* విరుగునట్లు చేయు.
"వంచన లేక సుద్దులు వారివీరితోఁ జెప్పి
కంచుఁబెంచు సేసి అట్టె కాకుసేసే నదివో" 5-226

కంచుమాయ : *వి.* గట్టిమాయ(?)
"కంచుమాయఁ బొరలఁగా గాచితి శ్రీవేంకటేశ
కొంచిన యిన్నాళ్లు నా గుణమేఁటి గుణము"
2-428

కంచుమించు అగు : *ప.బం; అ.క్రి.* చెల్లాచెదరగు, చిందరవందరగు, అగోచరం (తె.జా.), అదృశ్యమగు (ఆం.ప.ని.)
"కంచుమించులగు గగనపునడుమిది
అంచగమనయే ఆదరువు" 24-53
"అంచెల విప్రవినోదై తిరిగేటివాఁడు
కంచుమించై తిరిగాడీఁ గానరటే మీరు" 24-112

కంచువంటి చూపులు : *వి; బహు.* కంచువలె మిక్కిలి పెళుసైన చూపులు.
"ముంచిన నీ నా సంది మొగమోటా
లుండఁగాను
కంచువంటి చూపు లేల కాఁడిపారీని" 16-363

కంచువంటి మెరుపు : (2) కంచువర్ణం కల మెరుపు.

కంటకమాడు : *ప.బం; అ.క్రి.* పరుషవాక్కులు పలుకు, మనసు నొచ్చునట్లు పలుకు.
"కంటకమాడఁగలేదు కసరుకొనఁగలేదు
నంటున నే నీతోను నవ్వరాదా" 24-594

కంటకములాడు : (3) *ప.బం; అ.క్రి.* పరుషోక్తులు పలుకు, దూషించు.
"ఇంటికి విచ్చేసె నాతఁడేమే నీవు
కంటములాడేది కాదే నీవు" 19-563

కంటకాలాడు : (2) *ప.బం; అ.క్రి.* చూ: కంటకములాడు.
"నంటున నిట్టె నవ్వు నవ్వకుంటే యాకెఁజూపి
కంటకాలాడకు చాలుఁగానీవయ్యా" 26-150

కంటమాల : *వి.* కంఠమాలకు వ్యావహారికరూపం. కంఠంలో ధరించే మాల. చూ: కంఠమాల.
"మంచివానివలెఁ గంటమాల మెడఁబెట్టితివి
పొంచి నన్ను మరగించే పూసలో వోరి"
17-383, 1-133 & 5-84

కంటము : వి. కంఠము, మెడ. 5-84

కంట వత్తివెట్టి కాచు : *ప.బం; స.క్రి.* నిద్రాహారాదులు మాని అతిశ్రద్ధగా రక్షించు, ఎల్లవేళల కండ్లు మూతలు పడతాయేమో నని వత్తులు వేసుకొని అనడం నేటికీ వ్యవహారంలో ఉన్నది.
"గంటవేఁటలో తగులు కాపురమా
కంట వత్తివెట్టి కాచే కాఁపురమా" 2-34

కంటసరి : (9) *ప.బం; వి.* మెడలో ధరించే బంగారు ఆభరణం. 'కంటెసరి' అని నేటి వాడుక. (పద.)
"అంగన కంటసరి నేఁడట్టె మెడ నున్నది
సంగతిగా నీ కదె లాంచనము గాదా" 19-15

కంటహారము : వి. 'కంఠహారము'నకు వ్యావహారికరూపం. మెడలో ధరించే హారం.
"ఆరయ నింత కంటహార మిదె కట్టుకొనె
హారమై తా నీకు నుండె ననఁబోలు" 17-259

కంటికి రెప్పవలె కాచు : *ప.బం; స.క్రి.* అతి జాగరూకతతో రక్షించు. 2-96

కంటు : (4) వి. 1. పగ, విరోధం (2. పగవాడు, శత్రువు) ఈ పదం నేటికీ తెలంగాణంలో వాడుకలో ఉన్నది.
"కంటు లేని యిలుదొర కక్కూరితి సేసితేను
ఇంటికాడ సతులెల్లా నిఁక దిద్దగలరా" 27-22

కంఠమాల : (2) కంఠంలో ధరించే హారం. చూ: కంటమాల.
"దేవు లలమేలుమంగ తెచ్చి కంఠమాల వెట్టి
శ్రీవేంకటేశ కాఁగిటఁ జిక్కించీ నిన్ను" 22-319

కంఠమాలిక : వి. కంఠంలో ధరించే మాల.
"యెక్కువై తడఁబడిన ఇంతి కంఠమాలికలు

చిక్కలు దీసుకొంటాను చిత్తగించేవు" 21-303

కండగట్టు : *ప.బం; అ.క్రి.* బలియు, కండపట్టు.

"కండగట్టుకొంటివా వేంకటరమణుఁడ దీన
బండుసేసితివి నన్ను బాపురా లోకానను"

12-62

"కండగట్టుకొంటేఁ జాలు కాదనేనా నేను"

11-227

"తాలిము లింతే నేలే తడవు సేయఁగనేలే
కాలము గడపఁగాను కండగట్టీనా" 20-317

కండగర్వము : (2) *ప.బం; వి.* బలగర్వం.

"యెచ్చరించి సారెసారె నిక్కువ లంటేవు నీవు
గచ్చుల నేమూ నొరయఁ గండగర్వమా" 27-25

కండతుండాలు : (కండములు + తుండములు) *వి; బహు.* ముక్కలు ముక్కలు.

"యేతుల రావణాసురుఁ డిటువంటివాఁడే కాఁడా
కాతరాన నొంటిఁజిక్కి కండతుండా లాయెను"

15-269

కండపట్టు : *ప.బం; అ.క్రి.* లావగు, బలిష్ఠమగు.

"సేస లెందాఁకా బెట్టినఁ జేతులు కండపట్టవు
వేసరక వలతువు వెలఁదులకు" 16-572

కండించు : *స.క్రి.* 'ఖండించు'కు వ్యావహారికరూపం.

"కొండవంటి దానవు కోరి చేయివట్టఁ గాను
కండించి యాడవచ్చునా కానీవయ్యా" 23-134

కంతుని కైతప్పు : *వి.* మన్మథ వికారము కావచ్చు అని సంపా.

"అంతలో వేదఁదట్టితే నాపె గోరు నిన్ను సోఁకె
కంతుని కై తప్పులాయ గక్కున నీ మేనను"

15-163

కందనవోలి గోపాలకృష్ణుఁడు : కర్నూలులో వెలసిన గోపాలకృష్ణుడు.

"కూడితి కందనవోలి గోపాలకృష్ణ
యీడనే శ్రీవేంకటాద్రి యిర వాయనా" 13-481

కందనవోలు కృష్ణుఁడు : *వి.* చూ : కందనవోలి గోపాలకృష్ణుఁడు. 23-323

కందికుడుము : *వి.* 'మంగళకరమైన విందు' అను నర్థమున వాడెనా అని పాదసూచికలో సూచింపబడింది.

"కన్నచోటనే నీకు కందికుడుము
విన్నప మిదె యింటికి విచ్చేయవయ్యా"

24-335

కందిగురుము : *వి.* కందికుడుము (?)

"అన్నిటికి నేరుతువు అవునయ్యా
కన్నదే కందిగురుమ కంటిమయ్యా" 23-130

కందుకుందులు : (3) *ప.బం; వి; బహు.* కళంకములు, బాధలు.

"విందువలె శ్రీవేంకటవిభుఁడు నన్నుఁ గలసె
కందుకుందులెల్లాఁ బాసె కానీవే ఇంక" 19-449

"కందువ శ్రీవేంకటేశ కౌఁగిటఁ గూడితి నన్ను
కందుకుందు నిఁక నేల కారణము గలదా"

14-406

కందువ : *వి.* నిఘంటువుల్లో ఈ శబ్దానికి చూపబడిన అర్థాలు; 1. సంకేతస్థలం 2. జాడ 3. ఋతువు 4. ఏకాంతము 5. చమత్కారము 6. ప్రదేశము 7. సామర్థ్యము 8. తెగ 9. నేర్పు 10. కులము 11. గుఱుతు (పర్యాయ; శ.ర.) 12. సామ్యం 13. విధం, క్రమం (ఆం.ప.ని.) *విణ.* ఏకాంతం, కపటమైన, సత్యంలేని, చిత్రమైన.

సంకేతస్థలం :

"చిందువందైన దానిఁ జెనకుమయ్యా నీవు
కందువ చెప్పంపి మీఁదఁ గలతు గాని" 7-28

"కందువ నాపై నిన్నుఁగాఁగిలించి తందులోననే"

11-88

నేర్పు, కౌశలం :

"కందువ గలుగుచోట కాఁపురాలు వేడుకలే"

12-295

ప్రదేశాలు, కళాస్థానాలు :

"చెంది నిన్నాతఁడు చెనకఁగా యేమే
కందువ లంటక కసరేవు" 7-269

"యెందాకా సిగ్గుపడే విప్పుడు నీవు
కందువ లెల్లా నంటి కౌఁగిలించరాదా" 12-177

కందువకూటమి : వి. ఏకాంతపు కూటమి, ప్రియమైన కూటమి.
"కందువ నీ కూటమి కాఁగిటికి గురుతాయ
యిందరు జెప్పె బుద్ధులేడ కెక్కును" 13-535

కందువగు : అ.క్రి. సమర్థమగు.
"ఇందరికి నభయంబు లిచ్చు చేయి
కందువగు మంచి బంగారు చేయి" 1-334

కందువజవ్వనము : ఆసక్తిని కలిగించే జవ్వనం.
"కందువ జవ్వనమునఁ గావరించి వున్నవేళ
యిందమంటా గందము నా కేల పూసేవే"
11-221

కందువనిధానము : *వి; ప.బం.* ముంగిటి నిధానం, అందుబాటులో నున్న నిధి, ఏకాంతమున నున్న నిధి.
"ఇందరిఁగాచిన నీవు యిట్టే నీవు నాకు
కందువ నిధానమవై కలవుగా నీవు" 4-350

కందువపనులు : *వి; బహు.* చిత్రమైన పనులు, కపటమైన పనులు, సత్యం లేని పనులు.
"కందువపనులు సేయఁగలవు నీ వేమైనా
అందాలు సేసుకరాను ఆపె గలదు" 7-69

కందువమచ్చములు : గుఱుతులైన మచ్చలు.
"కాయవు నీ ఘాతాలివి కందువమచ్చము లివి
యే యింతి సేసినవంటే యేమనేవు నీవు"

కందువమన్నన : ప్రియమైన మన్నన.
"మందెమేళమున నీతో మాటలాడితిమి గాక
కందువమన్నన చాలు కలకాలమెల్లను"

కందువవేళలు : ఏకాంతవేళలు.
"కాటుకకన్నులఁజూచి కందువవేళలు గాచి
చాటి చెప్పేఁగాక యిఁక జాగు లేలే" 8-3

కందువసంసారము : అసత్యమైన సంసారం, కపట సంసారం.
"కందువసంసారమందే కలదు మోక్షము" 4-72

కందువ సోబనాలు : ఏకాంతపు శోభనాలు.
"ఇట్టె శ్రీవేంకటేశ ఇంతి నిన్ను నిట్టె కూడె
గట్టిగాఁ జేకొనవయ్యా కందువ సోబనాలు"
21-188

కందువైన బిడ్డ : వి. చిత్రమైన బిడ్డ.
"అందరు సంతోసించేరు యశోదమ్మ వినవమ్మ
కందువైన బిడ్డనిఁ గంటివో యమ్మా" 7-188

కందువైన ముచ్చటలు : చాటూక్తులు, శ్లేషోక్తులు.
"కందువైన ముచ్చటలు కౌఁగిటిలో జెప్పేఁ గాక
గందమియ్యఁగానే యేల గరిసించేవు" 7-113

కంపమోపు : *ప.బం;* వి. బాధాకరమైన మోపు.
1-197

కంపు : వి. సుగంధం.
"సంపద గలాపె గూడి సరసము లాడుచు
కంపులే పూసేవు గానియ్యరా" 5-51

కంబసూత్రపు వేసాలవాఁడు : వి. బొమ్మకఱ్ఱకు కట్టిన దారాన్ని పట్టుకొని బొమ్మలను ఆడించేవాడు.
"జాడతో భూమెల్లా ముకుచాయనె
యేలినవాఁడు
వేడుకఁ గంబసూత్రపు వేసాలవాఁడు" 7-163

కంబసూత్రము : వి. బొమ్మల నాడించడానికి బొమ్మకఱ్ఱకు కట్టిన దారం.
"జాడతో భూమెల్లా ముకుచాయనె
యేలినవాఁడు
వేడుకఁగంబసూత్రపు వేసాలవాఁడు" 7-163

కంబాన వెళ్ళే దైవము : వి. నృసింహస్వామి, స్తంభంలో నుండి వెళ్ళిన దైవం.
"మనసునఁదలఁచితే మాటలఁబిలిచే నంటా
తనిసి కంబాన వెళ్లే దైవమవునా" 3-451

కంబాలాట : (కంబాల + ఆట) ఒక బాలికాక్రీడా విశేషం, నాలుగు స్తంభాలాట.
"గరిమఁ దొడలు ముట్టి కంబాలాట లాడేనంటా
పరఁగ నొడఁబరచీ పడుచా వీఁడు" 17-173

కంబుకంటి : వి. కంబుకంఠికి వ్యావహారికరూపం; స్త్రీ. శంఖంవంటి కంఠం కల స్త్రీ.

"యిందుముఖి కంబుకంటి యిన్నిటా నందమైనది" 28-363

కంబుకంఠి : వి. శంఖంవంటి కంఠం కలది, స్త్రీ.
"కంబుకంఠికిని కప్రపుబొట్టు వెట్టరే
అంబరమధ్యకును ఆరతులు యెత్తరే" 29-15

కంభం : ఒక గ్రామం పేరు.

కంభపు సూత్రమాడెడివాఁడు : వి. బొమ్మకళ్లకు కట్టిన దారాన్ని పట్టుకొని బొమ్మల నాడించేవాడు.
"కడు సోద్యములనే కర్మపుఁజేఁతలవాఁడు
అడరి కంభపుసూత్రమాడెడి వాఁడు" 4-352

కంభపుసూత్రము : వి. చూ : కంబసూత్రము. 4-352

కంభము : వి. స్తంభం.
"ఉదయాస్త శైలంబు లొనరఁగంభములైన
వుడుమండలము మోచె నుయ్యాల" 1-67

కంభమురాయఁడు : వి. కంభములో వెలసిన నృసింహస్వామి.
"కలిమికాంత తోడెక్కె గంభమురాయ
నీపై గలువదండలు వేసెఁ గంభమురాయ" 18-420
"కరుణించవయ్య మమ్ముఁ గంభమురాయ
పెరెదేవుని కాలువ పెద్దకంభమురాయ" 18-420

కంభారూళ్లు సేయు : స.క్రి. త్రిప్పులబెట్టు, కొలికికిదెచ్చు (?)

క : అనుబంధంగా చేరిన 'కొని' అనేదానికి వ్యావహారిక రూపం. ఉదా :- కూడుక (కూడుకొని), వహించుక (వహించుకొని), భావించుక (భావించుకొని) మొ॥

-క : అనుబంధంగా చేరిన 'కొని' అనే దానికి వ్యావహారిక రూపం; ఉదా : కూడుక - కూడుకొని, వహించుక - వహించుకొని, భావించుక - భావించుకొని మొ॥

కకపిక : అవ్య. నవ్వడంలో ధ్వన్యనుకరణపదం.
"వొకరొకరి మొత్తిరి హోరాహోరిగాఁగాను
కకపిక నవ్వుకొంటా కడనుండె నమ్మా" 26-157

కక్కరము : విణ. కర్కశం, కఠినం, మోటు.
"నిక్కి తుమ్మెదలవంటి నెరు లెల్లాఁ దెల్లనాయ
కక్కరమాయ మేను కాంక్షలూ నుడుగవు" 2-4

కక్కసపువారు : వి. కర్కశులు, కఠినులు.
"గక్కన మొక్కినవారిఁ గాఁగిట నింతురు గాక
కక్కసపువారి నేల కైకొందురు" 21-207

కక్కసపెట్టు : (2)స.క్రి. బాధించు.
"కక్కసపెట్టకురె కమ్మర విచ్చేసెఁదానె
మక్కువ గలుగుపాటి మన్నించనీవే" 9-61

కక్కసము : (7) విణ. కర్కశం, కఠినం. (కష్టం, కోపం, బాధ, క్రూరత్వం, కొరడా, వాడి) మోటుదనం అని సారంగధరవ్యాఖ్యానం.
"కక్కసమేఁటికి యాకెఁగాఁగిలించి కూడరాదా
మిక్కిలి శ్రీవేంకటేశ మెచ్చేవుగాని" 19-48
"వెక్కసపువలపుల వేడుక చెల్లించలేక
కక్కసాన దూరఁబోతేఁ గలఁగు మది" 12-317

కక్కసించు : (54) స.క్రి. 1. నొప్పించు, బాధించు 2. సంకటపఱచు.
"అక్కర గల విభుఁడు యాసిచ్చితేఁ జాలుఁగాక
కక్కసించనేల చెలికత్తియలను" 28-48
"శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁగూడఁగానే
కావరించి నీ వేల కక్కసించేవే" 19-156

కక్కసీఁడు : (3) (కక్కసము + ఈఁడు) వి. క్రూరుఁడు, కఠినుడు, కర్కశుఁడు.
"లక్కవలెఁ గరగె యీ లాగు చూచి నా మనసు
కక్కసీఁడ వయితివిగా కాంతలయెడకు" 14-412

కక్కురితిసేయు : కక్కుర్తిపడు, లోభపడు.
"ఇటమీఁది పనులకు యిట్టె వేగిరింతునా
కటకటా నేనెంత కక్కురితి సేతునా" 11-279

కక్కూరితి : (2) వి. రూపాం. కక్కురితి, కక్కుర్తి, కక్కూర్తి. 1. లోభం, ఆశ 2. ఇబ్బంది, కష్టం.
"ఇప్పటి కక్కూరితికి నెంత సేసీనే
కప్పుక వున్నారందరు కాఁతాళించరా" 7-542
"నెలవునఁ బానుపుపై నిన్నుఁ గసరుకొనఁగ

చలమా నీ కక్కూరితే జరపేవు గాక" 11-362

కక్కూరితితనము : వి. 1. ఆశ, లోభం 2. ఇబ్బంది. ఇట కక్కూరితి శబ్దంపై స్వార్థంలో 'తన' ప్రత్యయం.
"కక్కూరితితనమేల కడదాఁకాను
అక్కరతో నింత నిజమాడి బదుకరాదా" 8-172

కక్కూరితిది : (కక్కూరితి + అది) వి. లోభం కల స్త్రీ, ఆశాపరురాలు.
"కామించి నేఁ బదరితే కక్కూరితిదాన నౌదు
యీ మెలఁత లిద్దరును యెటిఁగుంటెఁ జాలును"
12-64

కక్కూర్తికాఁడు : (2) (కక్కూర్తి + కాఁడు) వి. లోభి, ఆశాపరుడు.
"చింతతో నే నుండఁగాను చిమ్మేవు నీ వేడుకలు
యెంత కక్కూర్తికాఁడ వేమోయి నీవు" 21-166

కగ్గు : (17) వి. 1. కళంకం 2. మాలిన్యం 3. సంతాపం, దుఃఖం 4. దోషం 5. కందు
"దగ్గరి కొలిచితే తనివి పుట్టీనా
కగ్గు లేని వేడుకతోఁ గాఁగిలించుకొనవే" 22-507
"వొగ్గి చేయి చాచవచ్చు నుద్దండాలు సేయవచ్చు
కగ్గు లేక వలచేది ఘనము గాని" 9-240

కగ్గు : (30) అ.క్రి. 1. వివర్ణమగు 2. నల్లఁబడు 3. కందు. సంకోచించు అనే అర్థం కావచ్చు.
"కగ్గక శ్రీవేంకటేశ కలసితివి
వొగ్గి విడెమియ్యఁ రాఁగా వొడివట్టేవు" 14-133
"దగ్గరియంతలో వచ్చి తానెంత వేడుకొనిన
కగ్గినట్టి తనలోని కపటాలు మానునా" 14-381

కగ్గు దీరు : (2) అ.క్రి. (?)
"సిగ్గులు వడరో యేమో చెనఁకులు నించఁబోతే
కగ్గుదీర చన్నులంటఁ గాఁగిలించవే" 13-429

కగ్గుదేరు : (10) అ.క్రి. కందుదేరు, నల్లబడు ?
"సిగ్గుతోడి చెలుములు చేర వెంటఁగారీని
కగ్గుదేరి మోము కళ కాదనే వేమే" 27-216

కచ్చక : వి. కచ్చకాయ, గచ్చకాయ.
"చూడగల వన్నియును చూడనీ యోగీశ్వరుఁడు
బూడిదలో కచ్చకయై పొరయఁడెందు" 2-374

కచ్చకాయల తిత్తి : ప.బం; వి. (?)
"కట్టిన చిక్కపు బుత్తి కచ్చకాయల తిత్తి
చుట్టిన పించెపుఁబాగు చుంగులసోగ" 5-96

కచ్చు : వి. ఆపేక్ష, గర్వం, పుష్పదళం, అక్షగమనం, సిగబంతి, కోరిక.
"ఇచ్చకమైతే మేలు యెంత నవ్వినా నేమౌను
కచ్చువుట్టి పెండ్లాడిన కాంతుని" 14-540

కచ్చు : స.క్రి. 1. కోరు, అపేక్షించు, నొప్పించు .
"యిచ్చ నా స్వతంత్రమంటా యిందునందుఁ బొరలుచు
కచ్చి నిన్నుఁదలఁచని కల్ల యింతే కాక" 15-173
"కచ్చుక శ్రీవేంకటేశ గందవొడి చల్లేవు
ఇచ్చకురాలఁ గొసరులిఁక నేఁటికయ్యా" 29-103

కచ్చుపెట్టు : (91) ప.బం; అ.క్రి. 1. పగబట్టు 2. ఎదిరించు, ఢీకొను, ప్రతిఘటించు 3. పట్టుదల వహించు (పద.) 4. కోరికపడు.
"కచ్చుపెట్టి వీనులకుఁ గతలెన్ని విన్నాను
అచ్చుతు కీర్తన వినేయందు సరి రాదు" 4-250
పట్టుదల వహించు :
"కచ్చుపెట్టి ధర్మజునిఁ గనలించెఁ గోపము
కొచ్చి కార్తవీర్యుని బురికొల్పెఁ గోపము"
15-304
కోరికపడు :
"మచ్చికతో మీరిద్దరు మాటాడుకోరాదా
కచ్చుపెట్టి నే వాకిటఁ గాచుకుండేను" 23-34
"మెచ్చితి నీ నేరుపులు మేనఁబులకలు నిండ
కచ్చువెట్టి నన్నుఁ గూడి కాఁగిలించఁగా"
13-177
మిషపెట్టు :
"కచ్చుపెట్టి నీకునట్టె కస్తూరిపూసీని" 23-137

కజ్జాయపుమోవి : వి. తియ్యనిమోవి.
"సరసములాడుకొంటా చవి చెప్పుతా నతఁడు

సరిఁగజ్జాయపు మోవి సొరె విచ్చీ నదివో"
20-21

కటకట : అవ్య. అకట, గడగడ.
"ఇటువంటిదాన నాకేఁటి యలుకే
కటకట తా రాఁగాఁ గాదనేనా నేను" 19-366

కటకేశుఁడు : కోనరాయుడు. (కటకము = కొండ నడిమిచోటు)
"కందువ శ్రీవేంకట కటకేశ నీవద్ద
నెందుఁ గటకేశ! భయమిఁక లేదు" 4-379

కటమర : వి. హనువు, చెక్కిలిమీఁది భాగం.
"ఎనుపుఁ గటమరలు నిటలలోచనము
నొనరఁగఁ గొలువైయున్నాఁడు వాఁడె" 2-113

కటారము : కఠోరశబ్దభవము కావచ్చునని పరిష్కర్తల సూచన, కాఠిన్యం.
"మంకు దీర్ప వసమా మది ఇంచు కుచముల
పొంకపుఁగటారమే మది ఇంచు కుచముల"
24-181

కటారికాఁడు : (కటారి + కాఁడు) వి. కత్తి గలవాడు.
"కక్కసించి పెనఁగేవు కటారికాఁడవా వోరి
నొక్కమాఁటే యింతయితే నోపరా నేను"
11-237

కట్టఁగడ : (3) (కడ + కడ) చిట్టచివర. ఇట ద్విరుక్తమైన కడశబ్దానికి ద్రుతప్రసక్తి లేనందువల్ల అర్థానుస్వారం చింత్యం.
"సొరిది తగుల మీరు చూపు చూచుకొన్నమీఁద
గరిమ నందరి చూపు కట్టఁగడే కాదా" 16-255

కట్టఁగడపట : (కడపట + కడపట) అవ్య. చిట్టచివర. ఇందలి అర్థానుస్వారం చింత్యం.
"గుట్టువిడిచి నవ్వినా గుణము చెప్పకున్నది
కట్టఁగడపటఁ బతి కన్నదే కానుపు" 22-44

కట్టకానికలు : ప.బం; వి; బహు. కట్నాలు - కానికలు.
"కడుఁదగవు చెప్పేవు కట్టకానికలు వెట్టి
అడిగితిమా నిన్ను నయ్యో నేఁడు" 10-2-77

కట్టడి : వి. (?)

కట్టణము : వి. వస్త్రం.

కట్టణి : వి. 'కట్టడి'కి రూపాం. నియమం, కట్టుబాటు.
"తగ వెఱఁగక నేనే తమకించితి నీమీఁద
జిగి నన్నింత కట్టణిఁ జేసెఁగా దైవమా" 11-393

కట్టికవారు : వి. 1. వెండిబెత్తంవారు, వేత్రహస్తులు 2. స్తుతిపాఠకులు.
"సిరులఁగట్టికవారు సేయరే బరాబరి
వరుస నాలవట్టాలవారెల్లా విసరరే" 24-268

కట్టికాపె : (కట్టిక + ఆపె) వి. వేత్రధరురాలు, ద్వారపాలిక.
"వేడుకతో నిన్ను వెల్లవిరిసేయరాదుగాక
వాడికఁగట్టికాపెను వలపించవా" 29-456

కట్టిగవారు : వి; బహు. వెండిబెత్తమువారు, స్తుతిపాఠకులు. రూపాం. కట్టికవారు.
"సందడించి చిలుకలు చదువఁజొచ్చె పద్యాలు
గొందినే కట్టిగవారై కోవిల లుగ్గడించె" 7-445

కట్టిన ఓడదూలము : ప.బం; వి. ఎప్పుడూ ఒకదాన్ని అనుసరించిపోయేది. ఓడకు కట్టిన దూలం ఎప్పుడూ దాన్ని అనుసరించే వెళుతుంది అనేదాన్ని బట్టి వచ్చిన పలుకుబడి.
"కట్టిన వోడదూలము కాయపు సంసారము
దట్టమైన ప్రాణులకుఁ దని వేడదయ్యా" 4-24

కట్టినకంకణము : ప.బం; వి. అందుబాటులోనున్న అమూల్యవస్తువు. కొంగుపసిడివంటి శబ్దం.
"పట్టినదే పంతమాయఁ బైకొంటి వవు లేరా
కట్టినకంకణమాయఁ గాంతలెల్లాను" 19-517

కట్టినముడుపు : ప.బం; వి. అందుబాటులో నున్న అమూల్యవస్తువు. కొంగుబంగారం వంటిది.
"కట్టిన ముడుపు వెంకటనిలయుఁడు" 4-350

కట్టిపెట్టు : (3) ప.బం; స.క్రి. 1. దాఁచు, చాలించు, మానివేయు 2. అప్పగించు

3. అణఁగఁగొట్టు 4. బంధించు 5. అంటుఁగట్టు, దాచు.
“కలసిన సంతోసము కట్టిపెట్టుఁజోటు లేక
నిలచి మోముకళలై నిండఁజొచ్చెను” 12-486
చాలించు:
“ఎందువొయ్యీ నేను తన ఇంటిలోనే వున్నదాన
కందువలేల తడవీఁ గట్టిపెట్టు మనవే” 22-357

కట్టివేయు: ప.బం. స.క్రి. 1. నిలుపుచేయు 2. బంధించు 3. నిర్మించు.
“అక్కరతోఁ జేసిన పుణ్యమే కట్టివేసునట
దిక్కుదెస యెవ్వరు యీదేహిఁ గరుణించను”
2-259

కట్టుఁగాలువ: వి. చెరువుకు నీళ్ళు వచ్చే కాలువ. 6-41

కట్టుఁజీర: వి. రోజూ కట్టుకునే చీర.
“కాంత మేను చెమరించి కట్టుఁజీర తొప్పఁదోఁగి
వింతగాఁ దొడలకాంతి వెలిఁబడెను” 7-388

కట్టుకొను: స.క్రి. 1. లాభపడు, పొందు, సంపాదించుకొను, తెచ్చిపెట్టుకొను 2. అనుభవించు (3. ధరించు, తాల్చు 4. బంధించుకొను 5. పెండ్లాడు)
“కట్టుఁగడ నూరకుండి కట్టుకొనే దే మున్నది
చుట్టాల సురభివై చొక్కించరాదా” 22-422
“మానలేక పైపై యెడమాట లట్టె యాడించఁగా
కానిమ్మని ఇఁక మరి కట్టుకొనే దేమి” 27-16

కట్టుగాచుకొను: (?)
“ఇట్టె తప్పు లెంచేనంటే నెంత లేదు
కట్టుగాచుకొఁని వూడిగము సేసేఁగాక” 23-225

కట్టుగాడి: వి. (కట్టు + కాడి) బంధమైన బండినొగ, ఎద్దు మొ॥ వాటిమీద ఉంచే బండి మొదలైన వాటి యుగము. (శ.ర.)
“పసిమిఁబాపమనేటి బందెలు మేసితివి
కసరి దేహపు కట్టుగాడి నుంటిమి” 4-227

కట్టుబండి: వి. వేటకొరకు వేటగాడు తయారు చేసుకున్న బండి.
“కాముఁడు జఘనమనే కట్టుబండిమీఁదఁ బెట్టి
దీమముతో వేటలాడీఁ దేరి చూడ వసమా”
24-195

కట్టుమట్టు: ప.బం; వి. 1. ఏర్పాటు, కట్టుబాటు 2. ఉనికిపట్టు, పశ్వాదులను కట్టే చోటు.
“మట్టు లేని శ్రీవేంకటమాధవా కట్టు
మట్టుతో మమ్ముఁగూడితి మాధవా” 15-236

కట్టుమట్టుసేయు: ప.బం. కట్టుబాటు చేయు, ఏర్పాటుచేయు.
“పట్టపగలాయ నీతో పంతాలాడే విట్టే
కట్టుమట్టులు సేసేదిఁక మరి యెన్నఁడే” 26-405
“కడల నిన్నాపై యెంత కట్టుమట్టు సేసేనో
జడిసెనేఁ దడవితే సన్నసేసేవు” 16-390

కట్టువగట్టు: వి. వెలుగుగట్టు, కంచెగట్టు.
“కట్టువగట్లు కందువకుచములు
వట్టు శ్రీవేంకటపతి మాయ” 3-299

కట్టు వదలిన క్రేపు: ప.బం. స్వేచ్ఛగా తిరిగేది. (కట్టు వదలిన దూడ అని శబ్దార్థం) స్వేచ్ఛావర్తనం కలది.

కట్నము కానికె: ప.బం; వి. కట్నం అనే అర్థంలో వాడబడే జంటపదం. కట్నము - కానికె రెండూ ఏకార్థకాలే.
“ననుపుల కూటము కట్నము కానికె
పొనుఁగు మోవి సోఁకులు బూమి కానికె”
23-450

కట్లు: వి; బహు. (?)
“వుమ్మడిఁగోతుల కూటము లుదధికిఁ గట్లువచ్చె
తమ్ముని బుద్ధి రావణుని తలవోయను”

కఠినము: వి. కాఠిన్యం. భావార్థంలో ధర్మివాచక శబ్ద ప్రయోగం.
“కలికి కుచాలు వ్రాసి కఠినము వ్రాయలేక
తలపోయఁదొడఁగెఁ బంతపువిభుఁడు” 23-590

కడఁగడలు: వి; బహు. చిట్టచివరలు.
“కద్దురా నీ సుద్దులు కడఁగడల వింటిమి

వద్దురా యింతేల మమ్మ్మ వల(బెట్టేవు" 26-487

కడకట్టు : అ.క్రి. ఏర్పాటుచేయు, కట్టడసేయు.
"ప్రణుతింపగ శ్రీవేంకటరమణుని బహుళ మహిమెల్లా
గణనకెక్క(గా పురాతనులు మును కడకట్టిన మతము" 1-451
"బడినే శ్రీవేంకటేశ పాయలే మిద్దరమును
కడకూ నీ చిత్తమింతే కడకట్టేనా" 22-27

కడగంట : వి. అంతమును చూచుట.
"పెఱుగగ(గ(బెఱుగ(గ(బెద్దలమైతిమి నేము
కఱకఱలే కాని కడగంట లేదు"

కడగడ : (కడ + కడ) కొట్టకొన.
"కాంతలనే కూడెనట కడగడ దొక్కెనట
పొంతల(దట్టుపుణు(గు పూయరే నే(డు"
19-335

కడగడ చోటు : (?)
"కాంత నీవు గల చోటు కలిమి గలుగు చోటు
కాంతునికి తరమెల్లా(గడగడ చోటు" 24-163

కడచను : *ప.బం; అ.క్రి.* 1. ముగియు, సమాప్తమగు 2. సొంతమగు, ఫలించు 3. చచ్చు, మరణించు 4. నశించు, పోవు 5. ఫలించు. స.క్రి. దాటు.
"నిన్నటి యా(కలి నేడూ నున్నది
కన్నదినంబే కడచనెను" 3-336
"పాయము గడచనదు పంతమింతో దప్పదు"
20-329

కడచూపు : వి. కడకంటి చూపు .
"చెడని జీవునకు శ్రీవేంకటపతి
కడచూపెన్న(డు గలుగును" 1-174

కడనరులు : (?)
"తల(చిన కొల(దే దైవము తన
కలుపుకోలు కొల(దే కడనరులు" 4-220

కడనుండు : *ప.బం; అ.క్రి.* స్త్రీలు మూడుదినాలు బయటనుండు, బహిష్టగు.
"నీకు గుణము లేదు నేడిన్నాళ్ళదాకా
కాకున బడుటకంటే కడనుంటే మేలురా" 20-19

కడప : వి. 1. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతానికి చెందిన జిల్లాకేంద్ర పట్టణం. ఇక్కడ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. (2. కడప, ఇంటిగడప, దేహం, ఇల్లు)
"చేరువ(గడపలోన శ్రీవేంకటేశ్వరు(డు
గారవాన నన్ను(గూడె(గాదనీ నేలే" 19-490

కడపరాయ(డు : వి. జిల్లాకేంద్రమైన కడపలో పాతకడపలోని శ్రీనివాసుని, అన్నమయ్య ఎన్నో కీర్తనల్లో వర్ణించినాడు. ఈ కడపనే దేవుని కడప అని అంటారు. చినతిరుమలాచార్యులు కూడా ఈ స్వామిని కీర్తించియున్నారు. వీరు స్వామిని కడపరాయడని, కడప శ్రీనివాసుడని, వేంకటాద్రి కడపరాయుడనియు కీర్తించినారు.
"కన్నులపండుగ లాయ కడపరాయని తేరు
మిన్నునేల శృంగారము మితిమీరినట్లు" 3-93
"ఆ(గుచు కడపరాయ(డై శ్రీవేంకటేశు(డు
వీ(గడు యీ వేసాలెట్టు వెలయించ వచ్చునే"
19-252
"కందము నీ గుణములు కడపరాయా తొంటి
కందువకు రా(గదోయి కడపరాయా" 18-472

కడపల : అవ్య. చివర.
"ఈ భవమునకు(జూడనేది గడపల తనదు
ప్రాభవంబెడలించి బాధ(బెట్టించె" 1-185

కడపు : స.క్రి. తొలగించు, పోగొట్టు.
"మరిగి నీ ముద్రలు మోచితిని మన్నించితి
కరుణతోడ నా యపరాధంబులు కడపు
కావుమనుచు" 2-299

కడబడు : ప.బం. పూర్తియగు, ముగియు.
"కనుగాక పుణ్యాలు కడబడెనా ?
తనువు లేదో చేతనము లేదో" 4-50-394

కడమ(లు)వెట్టు : స.క్రి. మిగుల్చు, కప్పిపుచ్చు.
"కలసి పెన(గీ నాపె కడమలేల పెట్టేవు
చెలిమికత్తెల సుద్ది చెప్పె నీకు" 7-516

కడమ : (38) 1. లోపం, న్యూనత, వెలితి . (శేషం, మిగులు, కడ, అంతం)

"నాయందుఁగడమ లేదు నమ్మించినవాఁడవు
చెయిమీఁదుగా నెట్టు సేసినా నీ చిత్తము"
20-511

కడమదొడమ: (9) ప.బం. "ఇది జంటపదం గా తోచుచున్నది. ఈనాటి వ్యవహారంలో కానవచ్చుట లేదు. మిగిలింది - తగిలింది, వచ్చింది - పోయింది ఇత్యాద్యర్థములలో వాడినట్లు తోచుచున్నది. 'మిగిలినది' అను నర్థమున కడమ శబ్ద మీనాటికిని వ్యవహారములో గలదు" అని సం.ప.స. (19 వాల్యూం) లో వివరింపబడింది. మిగిలింది అనే అర్థం ప్రకృతానికి సరిపోయే అర్థం.

"పన్ని కడమదొడమ పాలలో నూరిపోసిరి
సన్నల బుద్ధి చెప్పితే చక్కనుండేనా" 7-415

న్యూనత, కొఱత, మిగులు, శేషం అనే అర్థాల్లో జంటపదం.

మిగులు, శేషం:

"వున్నవెల్లాఁ జెప్పనేల నొకతెతో భోగించి
కన్నెలకెల్లా వడ్డించె కడమదొడమలు" 27-508

"జలజాక్షి పతిఁజూచి సగము మాటలఁ దిట్టి
ఎలమిఁ గడమదొడమెందు దాఁచీనే" 24-6

లోపములు, కొఱత, న్యూనత:

"కడమదొడమ లేవి కలిసినవారికి
వుడివోని రతులలో వొద్దికే కాని" 20-362

కడమలెంచు: ప.బం. అ.క్రి. కొఱతలెన్ను, లోపాలు ఎంచు.

"కని కానని యజ్ఞానజంతువను
కడమ లెంచ నిఁక గొలఁదేదయ్యా" 3-495

కడమవడు: అ.క్రి. మిగులు, కొదవపడు.

"తలఁచిన తలఁపులు తలకూడీఁగాక ఇఁక
కలిగిన నీ బత్తి కడమవడీనా" 26-297

కడలుగన్నులు: వి; బహు. కన్నులఁకడలు అనే బదులు కడలుగన్నులని విలక్షణ ప్రయోగం.

"కడలుఁగన్నుల నిద్ర కడుఁ గమ్ముకొనఁగాను
ఇదివో నిన్నుఁ గసరి యేల చూచేము" 24-330

కడలుడిపి నీరాడు: ప.బం; అ.క్రి. అసాధ్యమైన పనికి పూనుకొను, అలలను ఆపి స్నానం చేయు అని వాచ్యార్థం.

"కడలుడిపి నీరాడఁగాఁ దలచువారలకు
కడలేని మనసునకుఁ గడమ యెక్కడిది" 1-226

"సముద్రే శాంతకల్లోలే స్నాతుమిచ్ఛతి
మూఢధీః" అని సంస్కృత మూలం.

కడళ్లు: వి. బహు. అలలు. 'కడలు'కు బహువచనం.

"వొడిగట్టకుండవలె వొడిగట్టితే నాసలు
కడళ్లతో సముద్రము కడతేరనట్టు" 15-420

కడవ: వి. 'కడమ'కు వ్యావహారికమా? చూ: కడమ.

"కన్నుల సొలయుఁగాని కడవ మాఁటాడదు
చన్నుల నొరయుఁగాని జంకించదు" 28-452

కడవర: (4) వి. కడపల కావచ్చునని పాదపీఠిక. చివరిమితి, కడమ, అంతం. (చివరిసమయం)

"ముంతనీళ్లనే మునిఁగేటి బ్రదుకు
వంతఁ బొరలి కడవర లేని బ్రదుకు" 1-348

"కప్పిన యీ మాయలకు కడవరెందూ లేదు
తిప్పని హరిభక్తికిఁదిరుగు లేదు" 3-569

"చెలరేఁగి చెప్పితేను శేనాశేన ప్రియములు
వలపులకెందుఁ గడవర లేదే చెలియా" 12-308

కడవారు: వి. అన్యులు.

"కడవారు నవ్వేది కానవు గాక
గొడవల మమ్ముఁజూచి గుద్దిరములేఁటికే"
11-297

కడవేయు: స.క్రి. పారవేయు.

"కడుగఁగ నేఁటికి నెంగిలి బూరెలు
కడవేయ నేల నారాయణా!" 3-257

కడసారు: అ.క్రి. పూర్తిగా ప్రసరించు.

"కంటిమిగా నీ గుణాలు కడసారెను నేఁడు
నంటు నీవు సేయరాఁగా నవ్వువచ్చీఁ బనులు"
20-102

కడిఖండలు: వి. ముక్కలుముక్కలు.

"ఖరదూషణాదుల కడిఖండలుగ సేసె

సరుసఁగుంభకర్ణునిఁ జావవేసెను" 2-107

కడిగడి గండమగు : వి. ముద్దముద్దకు గండము ఏర్పడు, అడుగడుగుకూ గండమేర్పడు.

"కడిగడిగండమై కాలము గడిపేవు
కడుగఁగడుగ రొంపి కలియుగమా" 1-118

కడిగడియగు : (కడి + కడి) వి. ఆహారమగు.

"విడువక చేతిలో విష్ణుప్రసాదము
కడిగడి యైనది కానరుగాని" 2-10

కడితము : వి. (క.) నలుపురంగు పూసిన గుడ్డ, కవిలె, వహి.

"జిగిఁ గడితాన వ్రాసి చేతి కియ్యవలెనా
తగఁజేసే పనులెల్లా తా నెఱఁగఁడా" 26-288

కడితాసుచీర : వి. నల్లనిచీర, వస్త్రము .

"కడలేని మోహంబు గలవాని వలెనా
కడితాసు చీర నీవు కొసవోసి" 5-168

కడితొడుకుబందె : (?)

"కన్నవారి వేఁడేది కడితొడుకు బందె
కొన్నిట నేమి గొనేవు కొనవయ్య బందె" 4-208

కడియెత్తు : అ.క్రి. భోజనం చేయు, ముద్దయెత్తు .

"కల వెల్లా వడ్డించి కడియెత్తు మనఁగాను
అలమి మోవితేనియ లడిగేవు" 25-92

కడివోవు : (కడి + పోవు) ప.బం; అ.క్రి.
1. చెడిపోవు, పాడగు 2. వాసనపోవు, వాడిపోవు 3. తరుగు, తగ్గు (వ్యు.)

"కాయము కాయము గూడి కడివోని తమకము
చేయెత్తి సేసవెట్టితే సెలవయ్యీనా" 12-426

"కడివోని మాటలనే కప్పురపుఁబలుకులు
బడిబడి కానుక గాఁబట్టుకున్నది" 3-321

కడునంత : (కడు + అంత) మిక్కిలి యెక్కువగా, అంత ఎక్కువగా అని కావచ్చు.

"అగ్గలమై నీవు గడునంత నన్ను రేఁచితేను
తగ్గని నీ మే నన్ని దాయిమాను గాదా" 25-451

కడుపనులు : (?)

"అదియేమే గొల్లెతా అందుకేరా గొల్లఁడా
కదిసెఁగడుపనులు కల్ల గాదురా" 19-514

కడుపులోపలి పుండు : ప.బం. వి. పైకి కనిపించని బాధ. చూ : పేగులోపలి తీట.

"కడుపులోపలి పుండు కడ లేని యాస" 1-104

కడుపే చెరువగు : *ప.బం; అ.క్రి.* దుఃఖాతిరేకం కలుగు.

"పుడమిఁబుట్టితిని బుద్ధినెఱిఁగితిని
కడుపే చెరువవుత గానమయ్యా" 4-136

కడ్డాయము : వి. నిర్బంధం, బలాత్కారం, వర్తకులపై హెచ్చు వెలలేని వాటిని కొనుమని బలవంతం చేయడం. (వ్యు.) (త. కట్టాయం = తప్పక) రా.సీ.లో ఈ పదం వాడుకలో ఉన్నది.

"అంత కడ్డాయంగా మాట్లాడితే ఎట్లనప్పా, కొంచెం వ్యవధినివ్వు" "వాడు నన్ను బాకీ తీర్చి తీరాలని కడ్డాయం చేస్తున్నాడు".

"మానరే ఆతని నేల మండాడేరు
కానుక మా మొక్కులివి కడ్డాయము గాదు"
7-593

"ఇంత కడ్డాయపు పొందులేల మాకు
యెంతేసి వారలు నీకు నెదురు చూచేరో"
16-396

కణఁజము : (4) వి. 1. భూమిలో ధాన్యం నిలువ చేసే చోటు 2. పాతర. ఇందులో అరసున్న చింత్యం. అరసున్న లేకుండా కూడా ప్రయోగాలు ఉన్నాయి.

"చక్కెర బొమ్మయిన సతి నీ కాఁగిలి
గక్కన కణఁజముగాఁ గట్టి
పొదిగి శ్రీవేంకటేశ భోగపు నీ గురుతబ్బె
చదరాన మేని కణజాన నించవయ్యా" 14-73

"కంగిట్లతి కెల్ల కణఁజమైతిని
పంగెన మానిసి నింక పనికివచ్చేవా" 21-274

"కటి సొబగులు రతి కాణాచి కణజాలు
కుటిలకుంతలాలే కొమ్మల బాగు" 28-112

శృంగారసంకీర్తనలు 26 వ సం. విశేషానుబంధంలో గౌరిపెద్దివారు, కామిశెట్టి శ్రీనివాసులు గారు కణజముగా గట్టి = ధాన్యం పోసే గాదె అని వివరించడం సముచితం కాదనీ,

గాదె అనేది నేలమీద బద్దలతో చేసిన అల్లిన గాదె, లేదా మట్టితో చేసిన గాదె కానీ. కణజము అనేది నేలలో తవ్వి సిద్ధం చేసిన ధాన్యం ఉంచేది కణజం - కంజం అని ఆచార్య గంగప్పగారు వివరించినారు. (అ.సం.స. రా.సీ.మాం. 20 పుట) బ్రౌణ్యం a grain cellar అనీ, సూ.ని. ధాన్యాదులు దాచుకొను కొట్టు, గాదె 2. పాతర 3. గంగాళము అనే అర్థాలను పేర్కొన్నాయి.

కణుంగు : వి. లోహపు ధ్వనికి అనుకరణం.
"కనకపుమెట్టెలు కణుంగని వాఁగఁగాను
వనితె నీకెదురుగా వచ్చీ నెవ్వతో" 12-495

కత : (71) వి. 'కథ' కు తద్భవరూపం. వృత్తాంతం 2. చరిత్రము, కథ, చేష్ట, చర్య 3. లోకోక్తి (సూ.ని.) అన్నమయ్య 'కత' తో పాటు 'కథ' అనే పదం కూడా వాడినాడు (3-271) కాని ప్రయోగాలు విరళం.
"ఏమని విన్నవించేము యెందాఁకా నీతోను
కామిని సుద్దులుచెప్పఁగతలాయ నీకును" 25-467
"వెక్కసపు నీ కతలు విని విని వెగటయ్యీ
యెక్కడెక్కడ నీ పగటు యెవ్వరిఁ బోలుదునే" 29-351

కతకఱచు : (క)
"కతకఱచిన యీ కన్నులెదిటివే
మతిఁదోఁచీ నిఁక మఱఁగులు గలవా" 3-244
"వొనరించీఁ బ్రియములు వూడిగేలు సేయవచ్చీ
తనలోనె యెంతేసి కతలఁగఱచినది" 13-312

కతకఱపు : వి. కథలు నేర్పు.
"అతివ నీ వూరుల యరంట్ల యడవి
కతకఱపుల చిలుకల యడవి" 5-153

కతకారి : (21) వి. 1. నేర్పరి, గడుసరి, కథలు చెప్పడంలో నేర్పరి, (వ్య.) మాటకారి.
"సెలవుల నవ్వేవు చేతఁ బాపట దువ్వేవు
కలికితనాల నెంత కతకారివే" 29-27

కతకారి చేతలు : వి. గడుసరిపనులు.

కతకారితనము : (10) వి. నేర్పరితనం, గడుసుదనం, మాటకారితనం, కథాకథనంలోని నైపుణ్యం.
"కొత్తగొత్త మాటలను కూరిమి గొసరితేను
తత్తరపు కతకారితనములందురా" 12-421
"పతివద్ద నేఁడే నీవు పచరించేవు
కతకారితనా లెందు గడిఇంచుకొంటివే" 28-44

కతకారిది : (కతకారి + అది) గడుసరిది, నేర్పరిది, మాటకారిది, కథలు చెప్పడంలో నేర్పరిది.
"తతి శ్రీవేంకటేశుఁడు తగ నన్నుఁ గూడె నేఁడు
కతకారిదానివా చక్కటులు చెప్పఁగను" 7-397
"మతి నమ్మికైనది మర్మములు దడువదు
కతకారిదాని మాయ కానలేము గాని" 24-377

కతకారియాపె : వి. (కత + కారి + ఆపె) 1. కథలు చెప్పే స్త్రీ 2. నేర్పుగల స్త్రీ 3. గడుసరియైన స్త్రీ.

కతకారివాఁడు : వి. గడుసరివాడు, నేర్పరి, మాటకారి.
"అలమేలుమంగ నేను అన్నిటా శ్రీవేంకటేశ
కలసితి గుట్టేటికి కతకారివాఁడవు" 25-25

కతకుఁగాళ్లడుగు : (92) *ప.బం; అ.క్రి.* అసంభవమైనదాన్ని గురించి అడుగు. కతకు కాళ్లు ముంతకు చెవులుండవని పూర్తి పలుకుబడి.
"కదిసి చేప్పే కతకుఁగాళ్లడిగితిఁ గాక
యెదురు మాటాడ నీతో నెంతదానను" 11-460

కతకుఁగాళ్లు గలితే కలవు ముంతకుఁజెవులు : సామెత; కతకు కాళ్లు లేవు ముంతకు చెవులు లేవు అని భావం.
"కతకుఁగాళ్లు గలితే కలవు ముంతకుఁజెవులు
వెతలఁ బెట్టక కొంగు వీడరా నీవు" 17-334

కతకుఁగాళ్లున్న వా ? : అసంభవమనుట.
"బల్లిదునిచేత నుంటే పచ్చబూస మాణికమే
కల్లమాడ దొడ్డముద్ర కతకుఁగాళ్లున్నవా" 14-377

కతకుఁగాళ్లు ముంతకుఁ జెవులడుగు : *ప.బం;* *అ.క్రి.* అసంభవమైన దానిని గూర్చి విచారించు.

"ముంచి కతలకుఁగాళ్ళు ముంతకుఁజెవు లడిగేవు
అంచెల మోవి తిట్ల కందు కే మడిగేవు" 21-383

కతకుఁగాళ్లు మొలచు : *ప.బం;* *అ.క్రి.* అసంభవమైంది జరుగు.

"కాంతలాల కంటిరటే కతకుఁగాళ్లు మొలచె
యింత సేసే పతికంటే యిట్టే నేనే వెగటు" 17-349

కతకుఁగాళ్లు వచ్చు : *ప.బం;* *అ.క్రి.* అసంభవమగు.

కతకుఁగాళ్లేడ : (?) అసంభవం అనే అర్థంలో వాడబడే పలుకుబడి.

"పతిని సొలయనోప బడలనోప
కతకుఁగాళ్లేడఁ జెప్పి కలుచపెట్టకురే" 17-449

కతకు కాళ్లేడ : (?) అసంభవం అనే అర్థంలో వాడబడే పలుకుబడి.

"పతిని సొలయనోప బడలనోప
కతకుఁగాళ్లేడఁ జెప్పి కలుచపెట్టకురే" 17-449

కత చెప్పు : (2) *ప.బం.* విషయం చెప్పు.

"మునుకొని వొండొరులు మొగములు చూచుకోఁగా
కనుఁగొని ఇఁక నేమి కతచెప్పేవే" 28-375

కత నడపు : *ప.బం;* *అ.క్రి.* వ్యవహారం నడపు.

"ఎంత కత నడిపితి వేమి జోలిఁబెట్టితివి
చింతించ లోకములు నీ చేతివే కావా" 2-315

కతలకాఁడు : వి. జాణ, నేర్పరి, మాటకారి.

"యీయెడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కాయజకేలిఁగూడితి కతలకాఁడా" 28-221

కతలకారి : (3) వి. జాణ, నేర్పరి, మాటకారి, కథలు చెప్పడంలో నేర్పరి.

"కతలకారికిఁగాని కాఁతాళము గలుగదు
మతకరిగాని మర్మము లంటదు" 18-184

కతలాడుకొను : *ప.బం;* *అ.క్రి.* కథలు చెప్పుకొను, ముచ్చట్లు చెప్పుకొను.

"ఇరవై శ్రీవేంకటేశు నెద నీపై వున్నదంటా
కత లే మాడుకొనేరే కాంతలాలా" 18-38

కతలుసేయు : (4) వికారపుచేష్టలు చేయు.

"చిడుముడిఁగూడితివి శ్రీవేంకటేశ నన్ను
కడవారమా యేల కతలు సేసేవు" 27-358

కతుకున : కొరికేప్పుడు వచ్చే ధ్వనికి అనుకరణం, కటుక్కున.

"రతిరాజు నమ్ము లివి రంట దెప్పురపువేళ
కతుకున నాటుఁజేసు గవిశన నిడరే" 11-221

కత్తరము : వి. ఆయుధవిశేషం. (కవచం)

"కత్తరాలు చిమ్ముచుండెఁ గదలుచుండె
చిత్తజజనకుఁడైన శ్రీమూరితి" 4 అను 61

పై అర్థం ఈ క్రింది కీర్తనలో కుదరడం లేదు.

"రిత్తకు రిత్తయి యీరెంటి నడుమను జిక్కి
కత్తరపు రొంపిలోన కంబమైతిఁగాక" 4-44

కత్తికోఁత : *ప.బం;* వి. విపరీతమైన పోరు.

"చిత్తము రాఁ బతిమాలు చేసితే కడువేడుక గాక
కత్తికోఁతఁ గొసరితే కాంత యింపీనా" 17-341

కత్తులబోను : *ప.బం.* ప్రాణాంతకం, ఎటు కదలినా మెదలినా బాధించేది. 1-180

కదలు : (3) వి. 1. కదలిక, చలనం 2. ప్రయాణం, యాత్ర 3. ప్రయత్నం.

"కమలకును భూసతికి కదలు కదలుకు
మిమ్ముఁగౌఁగిలింపఁగఁ జేసు నుయ్యాల" 1-68

"కదలు కదలుకును కాంత వాలారుగోళ్ల
నదిమి యదిమి తన్ను నంటఁబట్టఁగ" 14-392

కదియు : *అ.క్రి.* 1. సమీపానికి వచ్చు 2. తగులు, తాకు *స.క్రి.* 1. ఎదిరించు 2. చేరు.

"కదిసి గాలి ముడియ గట్టరాదు
ఇదివో నా తలపోఁత యేమి సేతును" 27-530

కదిరి : వి. నృసింహస్వామి క్షేత్రమున్న గ్రామం. ఈ గ్రామం అనంతపురం జిల్లాలో ఒక తాలూకా కేంద్రం. ఖాద్రి అనేది దీనికి పౌరాణిక నామం.

ఖాద్రి అనే పేరుగల చెట్టునీడలో చీమలపుట్టలో లక్ష్మీనృసింహస్వామి యా విర్భవించినాడు కనుక ఆ గ్రామానికి ఖాద్రి అనే పేరు వచ్చినట్లు పెద్దల అభిప్రాయం.

"తన దాసునికొఱకు ధరియించె నీ రూపము
దినదిన వేడుకఁ గదిరి నారసింహము" 10-1-37

కదిరికాఁడు : వి. 'కదిరి' క్షేత్రంలో వెలసిన నృసింహస్వామి.

"కానమే నేమింత తాను కదిరికాఁడౌత
మోనాన నే నూరకున్న మోము చూచీఁదాను"
19-471

కదిరినారసింహము : వి. కదిరిక్షేత్రంలో వెలసిన నృసింహస్వామి. చూ : కదిరి.

కదిరినృసింహుఁడు : వి. అనంతపురంజిల్లా కదిరిలో వెలసిన నృసింహస్వామి. చూ : కదిరి.

కద్ది : వి. అనురాగం (క.కద్ది = కోరిక)

"బుద్ధులు చెప్పీఁ బొరుగులు మెట్టీఁ
గద్దులే తనకుఁ గలిగినవే" 16-215

కద్దు : క్రియ. 'కలదు'కు రూపాంతరం.

"కద్దు లేదనఁగ నేల కమ్మటిఁ దాను
యిద్దరి సతుల పొందూ నీడేర ననవే" 16-11

-కన : అవ్య. చేదర్థకములైన వచ్చితే, చిక్కితే మొదలైన శబ్దాలపై 'కనుక' అనే అర్థంలో వచ్చే పదం.

"యిారాదా ఆపె సొమ్ము లెత్తుకవచ్చితేఁ గన
యీ రీతి చనవు లిచ్చి యింతగాఁ బెంచితివి"
9-4

-కన : (9) కనుక అనే అర్థంలో వాడబడే పదం. 'కనక' కు రూపాంతరం. (?)

"సేస వెట్టిన చెలికి సేసినదెల్లాఁ జేత
ఆస యిచ్చి నీవు గన ఆదరించితే" 19-256

"పంతగాఁడవైతేఁ గన పడఁతుల నెల్లాఁ గూర్చి
చింత దీర తగవులు చెప్పించుకోరాదా" 26-221

ఇది కనుక వలె నామవాచకానికో, క్రియారూపానికో, క్రియాజన్యరూపానికో అనుబంధంగా చేరుతుంది. స్వతంత్రంగా మాత్రం దీనికి ప్రయోగం లేదు.

_కనక : (12) అవ్య. అ వాక్యాలంకారంగా చేదర్థకాలపై ప్రయోగింపబడే పదం. ఉదా :- తీసుకుంటేఁ గనక 9-4, ఎత్తుక వచ్చితేఁ గనక, జీతము చిక్కితేఁ గనక 9-4, కలిగితేఁ గనక 26-269, ఊరకుండితేఁ గనక 26-232, తప్పయితేఁ గనక 2-423, నిలుచుండితేఁ గనక 24-414, ఎగ్గు పెట్టితేఁ గనక 14-194, నిజమాడితేఁ గనక 11-278 నిన్నుఁ గనక.

కనక : (49) అవ్య. 'కనుక' కు వ్యావహారిక రూపం. కాబట్టి, కావున.

"దేవులు గనక నిన్నుఁ దిలకించి కాలుదొక్కె"
28-13

కనకకసిపుఁడు : వి. హిరణ్యకశిపుడు.

"గద్దెమీఁదఁగూరుచుండి కనకకసిపుఁ జెండీ
గద్దరి ప్రహ్లాదునిపై కరుణ నిండీ" 15-132

కనకగిరి : వి. రాయచోటి సమీపంలో ఉన్న గ్రామం కావచ్చునని వే.ఆ.మూ. ఊహ. ఇట నెలకొన్న నృసింహస్వామిని అన్నమయ్య రెండు కీర్తనల్లో కీర్తించినాడు. కడపజిల్లా రాయచోటి మండలానికి పూర్వం 'కనకగిరి' అని పేరుండేదట. (క.అ.క.కీ. 27పు.)

కనకగిరి నారసింహుఁడు : వి. రాయచోటి సమీపంలోని కనకగిరిలో వెలసిన నృసింహస్వామి. చూ : కనకగిరి.

"నంటునఁ గనకగిరి నారసింహా
వెంటవెంట నాకుగానే వేడుక సేసేవు"

కనకరాయఁడు : వి. కుబేరుడు, చిందనూరిలో వెలసిన స్వామి. చూ : 17-126

"అప్పఁడగు కెలవాడి అది కనకరాయఁడె
కప్పురము చల్లీ చక్కని సతులపైని" 5-14

కనకవసంతము : వి. బంగారు పండించే వసంతము అని అర్థం కావచ్చు. ఇక్కడ భోగాలే బంగారం.

"కనకవసంతము కామిని సరసము
ఘనమగు నీలపుగని కొప్పు" 29-77

కనకసతి : వి. లక్ష్మీదేవి.

"నగు శ్రీవేంకటేశ! కనకసతి పొందు గాదు

పొగడే సీతనైన నా పొందులు గాని" 7-119

కనకసింహము : వి. హిరణ్యకశిపుని సంహరించిన నృసింహుడు. నామైకదేశే నామగ్రహణమ్ (ఒక పేరులోని ఏకదేశాన్ని గ్రహించినపుడు నామాన్ని మొత్తం గ్రహించడం జరుగుతుంది) అనే న్యాయం చేత కనక శబ్దం చేత కనక కశిపు (హిరణ్య కశిపు) ను గ్రహిస్తే కనకసింహము అనే పదానికి హిరణ్యకశిపు పాలిటి సింహము - అనగా నరసింహస్వామి అని అర్థం చెప్పవచ్చును.

"శరణని బ్రతుకరో జనులార!

గరిమ మెరసె నిదె - కనకసింహము"

కనిగుడ్డు : కండ్లు ఉండీ చూడలేకపోవడం.

"కనిగుడ్డును నదె విని చెవుడును నదె

ననిచె జగత్తు నడచీ నదివో" 3-185

కనిగుడ్డు వినిచెవుడు : ప.బం; వి. కండ్లు ఉండీ చూడలేక పోవడం, చెవులు ఉండీ వినలేక పోవడం.

"కనిగుడ్డును నదె వినిచెవుడును నదె

ననిచె జగత్తు నడచీ నదివో" 3-185

కనీఁగానములు : (కని + కానమి) వి; బహు. చూడడం - చూడకపోవడం.

"కనీఁగానములకుఁ గక్కసించేనా నిన్ను

ఘనుడవు నీవైతే గబ్బితన మేలరా" 20-46

కనుకట్టు : ప.బం; వి. గారడీ, ఇంద్రజాలం, కండ్లకు కనబడకుండా చేయడం, మరపించడం, మోసగించడం.

"ఘటన మాయలెదుటఁ గనుకట్టై వుండఁగాను

అటమటపు విద్యలు అన్నియుఁ జూచేను"

4-190

కనుకూరిమి : వి. కన్నులపండుగ, నేత్రానందం.

"కనుకూరిమియో గయ్యాళితనమో

వెను తగిలేవు గోవిందుఁడా" 5-129

కనుకొను : (4) (కను + కొను) ప.బం. చూచు, కనుగొను కు వ్యావహారికరూపం.

"తాఁకక శ్రీవేంకటేశు దాసులైతేఁ జాలుఁగాని

కాఁక తీరు నిందరికిఁ గనుకోరో జనులు" 3-104

"కనుకొనవయ్యా ఘనుఁడ విన్నిటా నీవు

వినుకొనవయ్యా విభుఁడవు నీవు" 13-240

కనుగలుగు : ప.బం; అ.క్రి. జాగ్రత్త వహించు.

"కనుగలిగి శ్రీవేంకటనాథ కాతువె

కొనసాగి నిన్ను నే కొలిచి బతుకుట గాక"

10-59

"కనుగలిగి యరసి ననుందేటపడియెడు" భార; శాంతి.

"కనుగలిగి మెలంగ వెడలఁగా నెడ లేమిన్" శుక.

2-508

కనుదిష్టి : వి. కనుదృష్టి, దృష్టిదోషం.

"నెలఁతల కనుదిష్టి నెమలి చుంగులై యందె

వలఁబెట్టి చలపట్ట వద్దనవే" 9-97

కనుపెట్టుకొను : స.క్రి. 1. కాచుకొను, రక్షించుకొను 2. ఆలోచించుకొను 3. ఎదురుచూచు.

"కాంతలిందరును నిదే కనుపెట్టుకున్నవారు

యింతకుఁదాఁ జొచ్చితేను యెగ్గుపట్టరా" 7-542

కనుమాయ : వి. ఇంద్రజాలవిద్య.

కన్న ది కానుపు : ప.బం. వి. (?)

కన్న దే కందికుడుము : ప.బం. చూచిందే కందికుడుము, దొరికిందే గొప్పదనే భావం కావచ్చు. 'చూచినదే తిండి' 'కన్నదే గాతి' అనే పదబంధం కూడా ఇట్టిదే.

"గయ్యాళి రతిఁ గన్నదే కందికుడు మన్నమాట

నియ్యందే శ్రీవేంకటేశ నిజమాయె నేఁడు"

7-261

కన్నపెట్టు : ప.బం; స.క్రి. దొంగిలించు.

"వన్నెమాటల వలతువా నీవు నా మనసు

కన్నపెట్టంగఁగదా కడు బేలనైతి" 5-213

కన్న పోవుట : ప.బం; అ.క్రి. (కన్నము + పోవు) కన్నం వేయబడడం, కన్నంవేసి దొంగిలింపబడటం.

"ఎన్నాళ్లదాఁకఁ దానిట్టె వుండుట బుద్ధి

కన్నపోవుట పూర్వకర్మశేషం" 1-113

కన్నప్పుడే మొక్కులు కానకున్న(దక్కులు : *ప.బం; వి.* ఎదుట గౌరవించడం, చాటున నిందించడం.

"కన్నప్పుడే మొక్కులూను
కానకున్న(దక్కులును
పన్ని యింత సేయ నీకు(బగదాననా" 11-452

కన్నళవి : వి. ఉపేక్ష, గొడవ.

"ఇన్నాళ్లవలెనె యంటా నీపెకు వరుసియ్యక
కన్నళవిఁ గూడినదె కల్ల నావల్ల" 7-7

కన్నవారిదే కందికుడుము : అందినవానిదే వస్తువు.

"కన్నవారిదె కాదా కందికుడుమన్న మాట
యెన్న(డును(జెప్పంగ విని యెరఁగవోన్"

కన్నవిన్నవారు : *వి; బహు.* చూచినవారు - విన్నవారు.

"కన్నవిన్నవారెల్లా కాకుసేయరా
వున్నతు(డవైన నీ కీ వొచ్చము తేలయ్యా"
3-90

కన్నిగట్టు : *ప.బం; అ.క్రి.* తాడుగట్టు (పశువులకు, దూడలకు మెడకు తగిలించి కట్టే తాడును కన్నితాడని అంటారు)

"మన్ను దినియేటి దూడ
కన్ని మాను మంటా మొత్తిమొత్తి"
10-113 old & 3-502 old

గట్టి యెందాక(గాయవచ్చును" 1-208

కన్నులకెంపు : *ప.బం; వి.* కోపం.

"కాతరపుమాటలాడి కన్నుల కెంపెక్కించేవు"
11-447

కన్నులతుదలు : *వి; బహు.* అపాంగములు.

"కంటిమి మిమ్మందరిని కన్నుల తుదల నేఁడు
తొంటి వినుకులకు సంతోసమాయ నయ్యా"
13-106

కన్నుల నవ్వు : (6) *ప.బం; అ.క్రి.* కన్నులయందు నవ్వు కనబరుచు. (తిరస్కృతిని తెలుపు)

"కన్నుల నవ్వితే నేమే కపటాలు గంటేను ఆ
కన్నులనె కా(క చల్ల(గాదనేరా" 17-43

కన్నులనీళ్లు కుత్తుకవట్టు : *ప.బం; అ.క్రి.* డగ్గుత్తిక పడు.

"గొనకొని కన్నుల నీళ్లు గుత్తుక వట్టెడిని"
5-291

కన్నుల నొత్తుకొను : *ప.బం; స.క్రి.* కన్నులకద్దుకొను. ఇది ప్రేమాదరాలను సూచిస్తుంది.

"పొలఁతి నీ చిఱునవ్వు(బువ్వులాత(డు గోసి
కులికి కన్నుల నొత్తుకొనంగాను" 5-211

కన్నులపండుగ : (9) *ప.బం; వి.* నేత్రానందం, నేత్రపర్వం.

"కన్నులపండుగ లాయఁ గన్నవారికిందరికి
వెన్ను(డేగీ నిల్లిదివో వీథుల వీథులను" 4-178

కన్నుల మొక్కిన మొక్కు : వి. ఒక విధమైన నమస్కారం.

"కన్నుల మొక్కిన మొక్కు కాంక్షలకు
మూలము
విన్నపాలకు మూలము వినయములు" 13-383

కన్నుల మొక్కు : *ప.బం; అ.క్రి.* ఒకవిధమగు నమస్కారం చేయు.

"అడరి శ్రీవేంకటేశు(డ లమేల్మంగను నేను
కడలేక నన్ను నేలె కన్నుల మొక్కేను" 14-503
"కలికి యీ జవరాలు కన్నుల నీకు మొక్కితే
సెలవుల నవ్వితివి చెలరే(గి" 13-346

కన్నులవంటివారు : *ప.బం; బహు.* మిక్కిలి ముఖ్యులు.

"అన్నిటాను హరిదాసు లధికులు
కన్నులవంటివారు కమలజాదులకు"
16-170 old

కన్నులా నోరా విను : *ప.బం; స.క్రి.* అతి జాగ్రత్తగా విను.

"కన్నులా నోరా వినెను కాంత నీవు మాటాడ(గా
సన్నపు(జిరునవ్వులు జాలువార(గా" 9-184

కన్నులార్చు : ప.బం. రెప్పవేయు, సంజ్ఞచేయు .
"మన్నన కౌఁగిట నన్ను మరపించి యెక్కడికో
కన్నులార్చితివి వేంకటరాయ యోరి" 6-6

కన్నువేయు : (6) ప.బం; అ.క్రి. గాఢంగా చూచు, దృష్టిని ప్రసరింపజేయు, అభిలాష కలిగి ఉండు, కాముకతతో చూచు, ఆశించు, వలచు.
"కన్నువేసి మాటలాడె కమ్మని నవ్వులు
చిన్ననాఁడే నీ చలము చెల్లెనా నేఁడు నవ్వే"
19-472

కన్నెక : వి. 'కన్యక'కు వ్యావహారికరూపం.
"వొకరి రాజుఁజేసు నొకరి బంటుగఁజేసు
వొకరి కన్నెకల వేరొకరికి నమ్మించు" 1-458

కన్నెనాఁడు : (3) కన్యగా ఉన్నప్పుడు.
"కన్నెనాఁడే యతఁడూ నీకుఁ గన్ను వేసినాఁడు
యెన్నరాని బిగువు యింక యేల సేయ నీవు"
17-126

కన్నెపడుచు : వి. కన్య, పెండ్లికాని బాలిక .
"కన్నెపడుచైనదానిఁ గాఁగిట బిగింతురా
పన్ని పూవువలెఁ జేతఁబట్టుటగాక" 18-19

కన్నెవయసు : వి. యుక్తవయస్సు.
"కన్నెవయసుమీఁద నే ఘనజవ్వనము వచ్చె
విన్నకన్నచోట నేల వెరగందేవే" 20-262

కపిలెద్దు : వి. కపిలవర్ణం కల ఎద్దు.
"తడవి దేవరలను దామెర (న) లను గట్ట
గడఁగి మానిసిరూపు కపిలెద్దు" 4-74

కపురము : వి. కప్పురమునకు రూపాం. కర్పూరం.
"కంచువంటిది కుత్తిక కపురాలు పలుకులు
యెంచి మా మాటలు సోదించఁగనేలే" 21-532

కపురు : (9) వి. సొగసు, శోభ, కాంతి, అందం, రూపం.
"వృషమ నేరుతువె వొద్దికతో నాతఁడు
కపురుగా నవ్వు నవ్వి కరఁగించును" 7-66
"అందుకేమి దోసము అంతవాడ వౌదువయ్యే
గందము పూసినయట్టి కపురా యిది" 17-135
"లలనల జవ్వనాలు లక్కపూస కపురులు
నెలకొని సేసే బత్తి నీటిపై వ్రాఁత" 2-268

కప్పచిప్ప : వి. ఆలిచిప్ప, 'కౌచిప్ప' అని తెలంగాణంలో వ్యవహారం.
"జగము కప్పచిప్ప రజతభ్రాంతివలె నైతే
నిగమము లీ యర్థము నిలుపనేలా" 15-290

కప్పురకాపు : (2) వి. కర్పూరంతో అలదడం. రూపాం. కప్రకాపు.
"అంచలఁగప్పురకాపు అంగముల మెత్తుకొని
కొంచక నిలుచున్నాఁడు గోణముతోడను"
1 అను 6
"యెలమిఁగప్పురకాపు ఇదె చాతుకున్నవాఁడు
వెలలేనియట్టి పెద్ద వెండికొండవలెను" 20-406

కప్పురగంధి : వి. 'కర్పూరగంధి'కి వికృతిరూపం. కర్పూరపు వాసనవంటి వాసన గల స్త్రీ.
"కప్పురగంది నిన్నుఁగంటే నే తిట్టునని
అప్పుడే యీమాట నీతో నాడనా నేను" 14-159

కప్పురపలుకు : వి. కర్పూరం వలె చల్లనైన పలుకు.
"పడఁతి నీకుఁ గప్పురపలుకు గానుక యంపె
వడి నీ మాఁటలు నీకె వచ్చె నంటాను" 26-95

కప్పురపునవ్వులు : వి; బహు. తెల్లనినవ్వులు.
"కప్పురపు నవ్వుల కడపరాయ నాకుఁ
గప్పవోయి పచ్చడము కడపరాయ" 13-500

కప్పురములో నుప్పు గలుపు : ప.బం; అ.క్రి. అమూల్యమైన వస్తువును పాడుచేయు.
"చొప్పులెత్తి యాపె సుద్దులే యప్పటిఁ జెప్పీ
కప్పురములో నుప్పు గలుపఁగనేఁటికే" 28-432

కప్పురమే కారమగు : ప.బం; అ.క్రి. సానుకూలమైనదే ప్రతికూలమగు.
"కప్పురమే కారమాయ కదిసే మాటలు లేక
దప్పులెల్లాఁ దనివాయ దగ్గరి రాగా" 19-485

కప్పురాలు మాటలు కారాలు చేతలు : నానుడి; మాటలేమో మృదువైనవి చేతలేమో

కఠినమైనవి.

"కప్పురాలు మాటలు కారాలు చేతలు
యెప్పుడు మీ పొందులు సతు లెట్టు సేతురో"
27-472

కప్పూరబాగాలు : *వి; బహు.* కర్పూరం కలిసిన వక్కలు, తావిపోకలు.

"పడఁతులకుఁ గప్పూరబాగాలు నీవు పెట్టఁగా
నడుమ నుండిన నాకు నవ్వు రాదా" 7-376

కప్రకాపు : వి. కపురపుకాపు. కర్పూరంతో అలదడం.

"చంద్రుడు నీ మనసులో జనించె నటుగాన
చంద్రికలు కప్రకాపై సరినిండెను" 2-280

కప్రపుఁబడివారు : *వి; బహు.* నాయకుడిచ్చే కర్పూరానికి పాలివారు. నాయకుడు ఒప్పందమునకై నాయికకు కర్పూరమిచ్చుట. ఈ వాఙ్మయమున పలుచోట్ల కలదు. (చూ. సం.ప.స., సం. 13, పుట. 3) (పడి = దేవాలయంలో వంతుసేవ)

"కడు మేనవారమో కప్రపుఁబడివారమో
యెడయక ఇట్టె వీడే లియ్యవయ్యా" 13-112

కమనియ్యః *విణ.* 'కమనీయ'; మనోజ్ఞమైన.
"కమనియ్య యాగభాగకర్త" 4-144 ఇట్టిదే రమణియ్య = రమణీయ.

"రమణియ్యభూషాభిరామ నరసింహ" 3--513

కమ్మగట్టు పావురము : వి. జాబు కట్టే పావురం; పూర్వకాలంలో జాబులు పావురాలకు కట్టి దూరంలో ఉన్నవారికి అందజేసేవారు.

"తలఁచుకొంటేఁజాలు తా నాడ కేఁగునమ్మా
వొలసి కమ్మగట్టు పావురమువలె" 10-2-115

కమ్మటిన్ : (50) అవ్య. మరల, క్రమ్మర. (కమ్మర అనే పదానికి ఈ ఔపవిభక్తికరూపం విలక్షణం.)

"కాలు దొక్కకుర నీవు కమ్మటి నవ్వకు నాతో"
17-165

"పలికేవు కమ్మటిని పరాకు నయ్యేవు" 11-159

"కొమ్మచే నేమి సేయించుకొంటివయ్యా
కమ్మటిఁ దా మొక్కినట్టి కారణ మేమయ్యా"
28-6

కమ్మటీఁడు : (కమ్మటము + ఈఁడు) వి. స్వర్ణకారుడు.

"ఏ మందునే వీని మాయ నెన్నెనాఁగలవు
కామించి నన్ను నేలే కమ్మటీని చూడరే" 8-142

కమ్మర : అవ్య. మరల.

"గుజగుజఁబొయ్యేవు కొంకి కొంకి నీకు నీకే
గజరు నీ చేతలకు కమ్మరా నేమందురా"
21-510

కమ్మి : అ.క్రి. 'క్రమ్మి'కు వ్యావహారికరూపం.
1. వ్యాపించు, ప్రసరించు 2. కవియు, పైఁబడు 3. ఉబుకు 4. కలుగు, పుట్టు 5. అతిశయించు స.క్రి. 1. కలియు, కూడు 2. కప్పు, పొదుగు 3. ఆవరించు 4. మఱుగుపఱచు.

"అడరి రాదాయ నంటా నాపెతో నలుక లేల
కడు నీకు వేడుకైతే కమ్మి మొక్కరాదా" 11-584

కయ్యపుఁగూటము : వి. ప్రణయకేళి.

కయ్యపుటలుక : (కయ్యము + అలుక) వి. పోరులోని కోపం.

"పయ్యెద జారిన కట్టు భారంపు నొసలిపట్టు
కయ్యపుటలుక తిట్టు గలిగెఁగా నాకు" 5-272

కరఁగు : (8) వి. (ప్రేమాదులచే) కరగుట, పరవశమగుట.

"కాఁగిటిలోపలి నా కరఁగులట్లా నీవు
చేఁగదేరక నమ్మేనా శ్రీవేంకటేశ" 27-474

కరఁగుకొను : అ.క్రి. 1. (ప్రేమాదులచే) కరగిపోవు, పరవశమగు 2. ద్రవమగు, నీరగు, రూపంమారు 3. భస్మమగు.

"కురిసితివి నవ్వుల గురిగాఁబువ్వులవాన
కరఁగుకోవయ్య లోలో గట్టి మనసు" 7-527

కరఁచు : స.క్రి. కరగజేయు, ద్రవింపజేయు, మెత్తబరచు, రూపరజేయు.

"పట్టరాని వ్రతములు పట్టించి సేయించవచ్చు
గట్టి రాయైనాఁ గడుఁ గరఁచవచ్చు" 7-310

"చెంతనుండి యీకె సెలవుల నవ్వి
కాంత నీమనసు కరఁచెను" 26-518

కరక: వి. నల్లదనం విణ. నల్లని. ఉదా :- కరకగడ్డము.
"ప్రేమఁగరకజడలు పిరిఁది దిండ్లు దీరిచి
కామించి నవ్వీ వాఁడే కల్యాణవేదికను" 14-368

కరకర: ద్వేషం, క్రూరత (ఆం.ప.ని.)
"కాదనఁగా నౌననఁగా కరక రేమిటికే
మీఁదమీఁద జగడాలు మితిమీరీని" 10-2-70

కరకరి: వి. 1. ద్వేషం, స్పర్ధ, ఈర్ష్య, అసూయ 2. క్రౌర్యం 3. చలం, పట్టుదల 4. వెత
"కాదనఁగా నౌననఁగా కరకరేమిటే" 10-2-70
"మరలి చూచేదాని మాటలాడి దూరేదాని
గరిమఁగరకరైతే కాఁతాళించును" 24-572
"అరసి శ్రీ వేంకటేశ అట్టె నన్నేలితివి
కరకరి యేల చక్కటి నంటరాదా" 26-524

కరకరించు: అ.క్రి. 'కరికరి'కి నామధాతురూపం కావచ్చు. 1. స్పర్ధవహించు 2. పగబూను, వివాదపడు, క్రూరత వహించు.
"సరసములాడఁబోతే సరివలపులు చిక్కు
కరకరించఁగఁబోతే కాఁకలు రేఁగు" 23-466
"తరవులవారమా దవ్వునుండి రాకుంటే
కరికరించి పిలిచి కమ్మటి సాదించకు" 22-127

కరకరిసేయు: అ.క్రి. బాధకలిగించు, హింసపెట్టు, ఇబ్బందిపెట్టు.
"సరసములెల్లా నాడి సవతుల నెచ్చరించి
కరకరిసేతురా కాంతల నింత" 21-344
"కన్నుల జంకించరాదు కరకరి సేయరాదు
మన్నన గలదంటాను మాటిమాటికి" 28-336

కరకులాడు: అ.క్రి. కఠినోక్తులు పలుకు, పరుషవాక్కులు పలుకు.
"గబ్బి నా సోరను నిన్నుఁ గరకులెల్లా నాడక
ఉబ్బరివై తిట్టకేల వుండేవు నీవు" 22-345

కరజపువినయాలు: వి; బహు. గోరిగిచ్చులనే భక్ష్యవిశేషాలు (?)
"కరజపువినయాలు కాఁగిటిబువ్వాలు
సిరులతో విందువెట్టీ శ్రీసతి నీకు" 8-166

కరజపువినయాలు కాఁగిటిబువ్వాలు: ప.బం; వి; బహు. కొనగోటితో నమస్కారం, కౌగిలితో అన్నాలు, శుష్కప్రియాలు, శూన్యహస్తాలు అని భావం.
"కరజపువినయాలు కాఁగిటి బువ్వాలు
సిరులతో విందువెట్టీ శ్రీ సతి నీకు" 8-166

కరజము: వి. గోరిగిచ్చు (?)
"కరజపువినయాలు కాఁగిటిబువ్వాలు
సిరులతో విందువెట్టీ శ్రీసతి నీకు" 8-166

కరజములు: వి; బహు. గోళ్ళు.
"మునుకొని యిద్దరు మురిపెపు నడపుల
చెనకి కరజములఁ జెన్నుగను" 23-558

కరడి: ఇది వీణలోని భాగం (?)
"మనసే నీబద్దితాడు మరి గుణాలె జీవాళి
మొనసిన పుట్టుగే మూలమైన కరణి" 3-467

కరడు: వి. అల.
"కొండలవంటి కరళ్ళు కోరికె లెందు చూచినా
తండుముండుపడేవారే దాఁటలే రెవ్వరును"
2-56

కరత: (2) వి. దుశ్చేష్ట, దుండగం.
"కరఁగినట్టే కరఁగి కరతలెల్లా మొరఁగి
సిరులఁగూడదుఁగాక చింత లేలే" 8-3

కరతలాడి: (కరతలు + ఆడి) వి. దుశ్చేష్టురాలు, అందెవేసిన చేయి.
"పాఁగిన శ్రీవేంకటాధిపతి నన్ను నేమన్నా
కాఁగాదు యిదియెంత కరతలాడెందురు"
14-256

కరవట్నము: వి. కరపట్నం కావచ్చు. కరపట్నమంటే రేవుపట్టణం.
"కాంతల మానమనేటి కరవట్నాలకు దిగె
మంతనాన జీవుఁడనే మంచి మరకాఁడు" 3-388

కరవాలు: వి. కరవాలం, ఖడ్గం.
"వలరాజు కరవాలు వసంతుఁడనేటి కమ్మరి

పెలుచుగ వాడిపదను పెట్టినయట్టున్నది" 7-410

కరసాన: (2) వి. గంధం తీసే చిన్న సాన ; బాణాలకూ, రత్నాలకూ సానపట్టే చక్రంవంటి సాన.

"దరికొలుపకురే తలపోఁత దాలి
కరసాన కాఁకలఁగనలీని" 6-175

కరాళించు: అ.క్రి. 1. బొబ్బరించు 2. సకిలించు 3. మొరుగు 4. సాటియగు 5. మండిపడు స.క్రి. నిందించు.

"ఏల నాతోఁగరాళించి యిది (చేవిది) వో తప్పు(?)
యీలకూర కుప్పు చాల దిదివో తప్పు" 7-272

"బతిమాలించి మతులు భ్రమయించఁ జేసేవు
రతికేళినే కడుఁ గరాళించేవు" 7-170

కరాళి: భయంకరమైనది.

"వనిత నిండుజవ్వనగర్వమునకు
ఘనమగు ఘనమగు నీ రతి కరాళి" 7-292

కరికరించు: (2) స.క్రి. ఇబ్బందిపెట్టు, బాధించు, హింసించు.

"కరికరించఁగ రోలఁగట్టితే నప్పుడు మా
హరి గాఁడు గదా ఆడనున్న బిడ్డఁడు" 2-65

కరికరిఁబెట్టు: స.క్రి. బాధించు, హింసించు, (తె.వ్యు.కో.) ఇబ్బంది. (రా.మాం.)

"కరికరిఁబెట్టరాదు కాఁకల సొలయరాదు
తరుణి వినయానకే దయఁజూడరాదా" 26-531

"పొరలింపు మాటలాడి పొద్దు గడిపేవాని
కరికరిఁబెట్టఁగాను కలిగేదేమీ" 27-62

కరికుంభజఘన: వి. ఏనుగు కుంభస్థలాల వంటి పిఱుదులు గలది, స్త్రీ; ఏనుగు కుంభస్థలాన్ని స్త్రీల వక్షస్థలానికి ఉపమానంగా చెప్పడం ప్రసిద్ధం. కాని పిరుదుభాగంతో పోల్చడం విలక్షణం.

"అడరి శ్రీవేంకటేశుఁడాతఁడే నిన్నేలినాఁడు
కడఁగి యే లలసేవే కరికుంభజఘన" 26-351

కరిగమన: వి. ఏనుగు నడకవంటి మందమైన గమనం కలది, స్త్రీ, గజగమన.

"కరిగమనకును బాగాలు చేతి కొసఁగరే" 29-15

కరియమాణిక్కదేవుఁడు: వి. తిరుపతికి నలభై కిలోమీటర్ల దూరంలోని నగరి బొడ్డులో ఉభయ నాంచారులతో వెలసిన నిలువెత్తు అర్చామూర్తిని 'కరయమాణిక్క దేవుడు' అని వ్యవహరిస్తారు. కరియమాణిక్కం వరదరాజస్వామిగ వినుతికెక్కిన ఈ వేలుపును దర్శిస్తే ఆయురారోగ్యైశ్వర్యాలు చేకూరుతాయని భక్తుల విశ్వాసం. అనుభవసత్యం కూడా. గజేంద్రుని కాపాడిన వరదు డితడే యని, గజేంద్రమోక్షానికి సంబంధించిన గాథ ఇక్కడే జరిగిందని స్థానికులు కథలు చెప్పుకుంటారు. అన్నమయ్య పాటల్లో చోటుచేసుకొన్న వేలుపితడే అని నా విశ్వాసమని గౌరిపెద్దివారు తెలిపినారు. (శృంగార సంకీర్తనలు.27సం. విశేషాంశాలు 405 పు.)

"కైవశమై పాయలేను కప్పురవిడేలకు
నీవద్దనే కరియమాణిక్కదేవుఁడా" 27-145

కరివడు: అ.క్రి. నల్లబడు, కటివడు.

"రాఁగదవె అన్నిటాను రవ్వయితిమి
కాఁగిన కోఁకలచేతఁ గరివడె నిపుడు" 21-398

కరుకుపడు: అ.క్రి. 'కఱకుపడు'కు రూపాం. కఠినమగు.

"నగినగి నీతోను నను పు నటించఁగాను
అగడై కరుకుపడె అదిగో నీ చిత్తము" 21-80

కరుగు: వి. అచ్చుబోసిన బొమ్మ, పోతపోసే అచ్చు. రూపాం. కరువు.

"కప్పురపు కరుగువంటి చెలి నిన్ను మెచ్చె" 16-335

"అంచెలఁ జెనకఁగాఁనే మట్టే సిగ్గువడ నీవు
కంచునఁ గట్టి పోసిన కరుగులమా" 17-150

కరుగుగట్టు: మూసకట్టు, పోతపోయుటకై దిమ్మను తయారు చేయు.

"యిత్తల నీవెట్ట బొంది యెన్నఁడిఁక వడదేరు
కొత్తగా కరుగుగట్టి కోమలిఁ జేసితివా" 8-63

కర్తతనము : వి. కర్తృత్వం, కర్తగా ఉండే లక్షణం. విలక్షణమైన పదం.
"పని లేదు నిష్ఠూరపరుఁడు దానై వుండు
తనకుఁదానే కర్తతనమౌటఁగాన" 1-49

కర్తారుఁడు : వి. కర్త: ఈ అర్థంలో కన్నడంలో 'కర్తార' అనే శబ్దం వాడుకలో ఉన్నది.
"కర్మకర్తారుఁడని కడలేని పుణ్యముల
కర్మఫలములు దనకుఁ గైకొలుపఁగా" 1-293

కర్పూరకాపు : వి. కర్పూరంతో భగవంతుని విగ్రహాన్ని అలఁదడం.
"పోలింప కర్పూరకాపు పురుషోత్తమునికి
యే లీల నుండెనని యెంచి చూచితే" 4-177

కర్మవహి : వి. కర్మవిధి; ఇది 'కర్మమహి' కావచ్చునేమో? అని సంపాదకులు సందేహించినారు. అప్పుడు కర్మభూమి అని అర్థం.
"మహిలో సంసారపుసామ్రాజ్య మేలేవాఁడ నేను
యిహమునఁ గర్మవహి కెక్కితి నేను" 3-48

కర్మి : వి. కర్మ చేసేవాడు.
"తలకొన్న ఫలవాంఛఁ దగులకుండఁగఁ జిత్త
మలవరించుట కర్మియైన ఫలము" 1-223

కఱకరించు : స్పర్థవహించు, పగబూను, వివాదపడు, బాధించు, ద్వేషించు.
"కఱకరింపుచు నింతి కందువకు రమ్మని
చెఱఁగు వట్టి తియ్యకు చెమరించీని" 13-461
"ఎఱగవుగాక మీఁదటెత్తు నీవు
కఱకఱించి తిట్టితే కాదనఁగఁగలవా" 23-377

కఱకరిఁబెట్టు : స.క్రి. నిర్బంధపెట్టు, బాధపెట్టు.
"నెఱజాణతనముల నేరుపరి యాతఁడు
కఱికరిఁబెట్టకే కరఁగించఁదగవే" 22-514

కఱకఱ : వి. బాధ, ప్రయాస, పరితాపం.
"పెఱుఁగఁగఁబెఱుఁగఁగఁ బెద్దల మైతిమి నేము
కఱకఱలే కాని కడగంట లేదు" 3-352

కఱకఱిఁబెట్టు : స.క్రి. బాధపెట్టు.
"కఱకఱిఁబెట్టినాపె కాఁగిలించు కొనెనాపె
యెఱవులు చూపి నిన్ను యింత సేసెనా"
27-273

కఱకటి : వి. చూ: కరకరి.
"ఎఱిఁగించవలయు నిప్పుడిప్పుడే నీ
కఱకటి నిన్నియుఁ గసరకుమీ" 24-24
"కఱకటిఁగరఁగీనా గామిడి గాక" 19-296

కఱకటిసేయు : అ.క్రి. బాధ కలిగించు, హింసపెట్టు, ఇబ్బందిపెట్టు.
"యెఱిఁగించరే పతికి యీ సుద్దులెల్లాను
కఱకటి సేసితేను గయ్యాళి యందురు" 12-109

కఱకుపడు : ప.బం; అ.క్రి. కఠినమగు.
"మఱచి వూరకుండితే మనసే కఱకుపడు
యెఱుకఁదలిపెట్టితే నీడేరుఁ బనులు" 18-189

కఱకులాడు : ప.బం; అ.క్రి. కఠినోక్తులు పలుకు.
"వెఱకువయ్యా నిన్ను నే వేసరించను
కఱకులాడఁగ నేను గబ్బిదాననా" 12-18

కఱత : (15) వి. చెడ్డపని, దుండగం.
"కఱతల నేరుపులు కడకన్నుల నున్నవి
యెఱఁగము నీ వుపమ లే మనేవే యిఁకను"
14-29

కఱతల కలికి : వి. దుండుగురాలు, పోకిళ్ళమారి స్త్రీ. (కఱత = చెడ్డపని, దుండగం)
"ఎఱుఁగము నీ విపుడింత చేతువని
కఱతల కలికినిగా విభుఁడా" 6-3

కఱతలయోగి : ప.బం; వి. పరమపదం పొందిన యోగి. కఱ = తీరం (త) చివరిమెట్టు చేరినవాడని భావం.
"కఱతలయోగిని కర్మ మంటునా" 2-445

కఱతల యోగిని : వి. పరమపదాన్ని పొందిన యోగిని. (పద.) (కఱ = ఒడ్డు, తీరం)
"కఱతల యోగిని కర్మము లివంటునా
చుఱచుఱ జడునైతే జుట్టుకొనుఁ గాక"

కఱదలఁబెట్టు : వి. మాయమాటల్లోపెట్టు, కోరికల్లోపెట్టు. (కఱద = మాయమాట, వింతలు, బుద్ధి, కోరిక)

"మఱియేఁటి విన్నపము మాపుదాఁకాను
కఱదలఁబెట్ట కింకఁగావఁగదయ్యా" 7-447

కఱమి కఱిమి నమలు : కఱచి కఱచి నమలు.
"కఱమి కఱమి నమలు గంపల నురుగులు
యెఱఁగి దొంగిలె యీతఁడే కదవే" 4-288

కఱవిద్య : వి. కఱ్ఱవిద్య, కఱ్ఱసాము.
"కఱవిద్య బాఁపనిచేఁ గఱచె నేరుపులెల్ల
గుఱుతు బాఁపనిఁగనెఁగొడుకుఁగాను"

కలంతే : (కల + అంతే) ఉన్నంతే.
"పిలువక రానంటా పెనఁగీఁదా రమణుఁడు
వలపు గలంతే కాక వడి నెక్కు డౌనా" 27-32

కలకంటి : (4) వి. 'కలకంఠి'కి వ్యావహారికరూపం. అవ్యక్తమధురమైన కంఠస్వరం గల స్త్రీ.
"చలముకొను నలులకు సంపంగి పెనుగాలి
కలకంటిమేనికి కాపిడిన యట్లు" 5-339
"విందులు చేసే వేమరుఁబ్రియముల
కందువనవ్వుల కలకంటి" 26-450

కలగంప : (9) వి. కలగూరగంప, కూర శబ్దానికి లోపం. అనేక వస్తువులున్న గంప. విణ. అనేకం, పెక్కు.
"చెలఁగి పెక్కు చెలుల చీఁకటిమేడలోఁ బెట్టి
కలగంపగా విభుఁడ కలిసితివి" 17-179
"తలపోసే కాంతల చిత్తములకు నీ వయసు
కలగంపై పడిగము గతి యాయను" 25-358

కలగంపదేవతలు : *వి; బహు.* అనేక దేవతలు.

కలగంపపెండ్లిండ్లు : *వి; బహు.* అనేకములగు పెండ్లిండ్లు.
"కలగంపపెండ్లిండ్లు కన్నచోట నితవాయ
యెలమి శ్రీవేంకటేశ ఇదివో నీ సుద్దులు"
23-393

కలగంపవలపు : *ప.బం; వి.* సమృద్ధమైన వలపు, (తె.జా.) అమ్మజూపు వలపు, విలువలేని ప్రేమ, (పద.) అనుకోకుండా భాగ్యవశమున సిద్ధించిన వలపు అని వే.ఆ.మూ.
"కలగంపవల పాయ కాదా మరి
కల దెచ్చి పైవేసేవు కాదా మరి" 17-130

కలగన్న చోటికి గంప యెత్తినట్లు : నానుడి; అసత్యమైన దానిని నమ్మినట్లు ; భ్రమను ప్రమ (సత్యము) అనుకొని దానికై పరుగెత్తి నట్లు.
"కలగన్నచోటికి గంప యెత్తినట్లు
ఆలవు మీఱిన దెట్లనమ్మా" 5-64

కలగూరగంపగు : *ప.బం; అ.క్రి.* విషయసాంకర్యం కలదగు.
"కైకొని యిద్దరు నూడిగము నీకుఁజేయఁగాను
కాకువడి కలగూరగంపాయ నీ నోరు" 7-404

కలగూర వంటిది : వి. (?)
"కూడినవారికి రతి కొట్టినపిండి వంటిది
కూడనివారికి కలగూర వంటిది" 7-204

కలగూరవేడుకలు : *వి; బహు.* నానావిధములైన వేడుకలు.
"మలసి నిన్ను దూరెదమా మనసు నీ కందుండితే
కలగూరవేడుకలు గంపఁబెట్టవచ్చును" 18-291

కలపండ్లు : *వి; బహు.* (?)
"పలుమారు నీ మోవిపండు చవి చూపఁగాను
కలపండ్లు గోటరానఁగప్పెను వసంతుఁడు"
7-414

కలపుకోలుఁదనము : వి. కలుపుగోలుదనం, ఐకమత్యం, మైత్రి.
"వలపులు చల్లఁగాను వాసు లంత యేఁటికే
కలపుకోలుఁదనమే కందువ వో యగువా"
18-359

కలపుకోలు : (14) వి. 'కలుపుకోలు'కు వ్యావహారికరూపం. మైత్రి, ఐకమత్యం.
"కలపుకోలున చల్లగాలి మన్నించుఁగాని
మలయజమలఁదరే మందుగాను మేనను"
24-545
"కలపుకోలు గలితే కానుక లియ్యఁగవచ్చు
మెఱపున నియ్యకొంటే మెచ్చఁగవచ్చు"
14-582

కలబెరకు : పరస్పరం కలిసినది.

"వనిత కుచంబులు వనజంబులు హరి
కనుచూపు తామరలు కలబెరకై
ఎనసి చిక్కువడి యేరుపరచఁగరాక
నినుపు నివ్వెరగుల నిలిచి రిద్దరును" 21-456

"నలువునఁ జనుపక నాసిక మొకటే
కలసి కదంబపు కలబెరికాయ" 7-298

కలలోనఁగనియేటి కానుపు : *ప.బం; వి.* అసత్యం, అసంభవం. కలలో కనిపించినవన్నీ చూచినంతసేపే కాని అవి యథార్థం కావు అనే దానిపై ఏర్పడిన పదబంధం.

"చెలులు నవ్వేరని చెనకకున్నది గానీ
కలలోనఁ గనియేటి కానుపిదే" 20-352

"అది కలలోని కానుపయి" అని హరివంశ ప్రయోగం.

కలలో నింతులఁ గలయునట్లు : నానుడి; *అ.క్రి.* నిజం కానట్లు.

"కలలో నింతులఁ గలసినట్లనే
వెలిఁగాంతలతోడి వేడుకోలు" 4-381

కలలోని కాఁపిరాలు : *ప.బం; వి; బహు.* నిజం కానివి.

"అలరి నా నిద్దుర నాదెందుఁగాని సుఖమెల్ల
కలలోని కాఁపిరాల కతల పాలె" 2-1

కలలోని కాఁపురము : *ప.బం; వి.* నిజం కానిది.

"తలఁపులోపల నీవు దగ్గరితేనే చాలు
కలలోని కాఁపురముఁ గైవల్యమే" 4-128

కలలోని కాన్పు : ప.బం. అసంభవం, మిథ్య.

కలలోని కూటమి : *ప.బం; వి.* నిజం కానిది.

"పలుమారు సుద్దులనే భ్రమలఁబెట్టితి నిట్టె
కలలోని కూటములే కలిగినంతాను" 23-259

కలలోని రతులు : ప.బం; వి; బహు. అసంభవం, అయథార్థములు, నిజం కానివి.

"తలఁచి చూచితేనే తప్పులుఁ దారులె
కలలోని రతుల యాఁట వంటిది"

కలలోని సిరులు : ప.బం; వి. నిజం కానివి, అసంభవాలు.

"కలలోని సిరులెల్ల కనుకూర్కులే కాక
మెలఁకువఁజూడనవి మెరసీనా" 1-220

కలలోని సుఖము : (2) *ప.బం; వి.* నిజం కానిది.

"కలలోని సుఖమే కలియుగము వెన్న
కలిలో నెక్కడిదె కలియుగమా" 1-118

కలలోపలి సంభోగము : *ప.బం; వి.* నిజం కానిది. కలలో కనిపించేవన్నీ కొద్దిసేపే ఉన్నట్లుగా భాసిస్తాయి. అవి యథార్థం కావు అనడంపై వచ్చింది. 'కలలోని కాన్పు' మొ॥ వి ఇట్టివే.

"కలలోపలి సంభోగము ఘనమగు
సంపదలిన్నియు
వలలోపలి నిడిపరులు వన్నెల విభవములు"
2-133

కలవంటకములు : (కలపు + వంటకము) *వి;* బహు. నువ్వులపిండి మొదలైన వాటితో కలిపిన వంటకం, చిత్రాన్నం.

"కలవంటకములు పులుగములు
దుగ్ధాన్నములు
పలుదెరఁగులైన అప్పముల గములు" 1-138

కలశము లెత్తు : *ప.బం; అ.క్రి.* (?)

"కలి మెఱుంగని ఎందు కాంత వయసేకదా
కలశంబులెత్తెఁ దమకంబుమేడకు" 6-135

కలశాపుర వీరహనుమంతుడు : హంపిలో మాల్యవంతాని కెదురుగా నున్న కొండల అపత్యకల్లో ఒక చక్కని హనుమద్విగ్రహ మున్నది. సుమారు పదిఅడుగుల ఎత్తు విగ్రహం. దీనికి కళశాపురమాంజనేయులు అని నేటి వ్యవహారం. ఈతడే కళసాపురంలో వెలసిన హనుమంతుడు. చూ : కలశాపుర హనుమంతరాయడు. కలశాపురం అనే గ్రామం ఈ దేవళం చుట్టుపక్కల ఉండినదంటారు. కలశాపురానికి నేనడు కసాపురమని వ్యవహారం. (రా.అ.కృ.శ.తా.ప.భవి. పీఠిక. 9 పుట.) 4-525

"పంతగాఁడు మిక్కిలి బంటుతనమునను

అంతటాఁ గలశాపుర హనుమంతరాయఁడు" 3-503

చూ: కలశాపుర వీరహనుమంతుఁడు.

కలసిమెలయు: *ప.బం; అ.క్రి.* కలిసి ఉండు.

"అలమేలుమంగ భూమి యంబుజాలు చేపట్టిరి

కలసిమెలసేరు బంగారుమేడ లనఁగ" 3-517

కలసుఁజేయు: మందగూడు, మందగా ఏర్పడు (?)

"పొంది ఆవులు దూడలుఁ బొలానఁ గలసుఁజేసు

అందాకా నీవు మా యింటియాడ

నుండవయ్యా" 11-273

కలికిగాఁడు: (కలికి + కాఁడు) 1. దంట, నేర్పరి 2. అందమైనవాడు. 'కలికి' శబ్దంపై స్వార్థంలో 'కా' ప్రత్యయం.

"మానినుల పొందు లేల మాకుపడివుండ నేల

కానీవే బుద్దెరఁగఁడా కలికిగాఁడా" 9-159

కలికితనము: (13) కన్నడంలో కల్ (=నేర్పు) ధాతువు కృదంతరూపం కలికె - ఇదియే తెలుగులో ధర్మివాచకంగా 'కలికి' ఐనది. (కలికి + తన) 1. దిట్టతనం, గడుసుతనం, నేర్పు 2. మనోజ్ఞత.

"కలికితనాల నిన్ను గరఁగించ వసమా

బలిమితో నీ చిత్తము వట్ట వసమా" 28-568

కలికివాఁడు: వి. నేర్పరి, దంట. విణ. అందమైనవాడు, మనోజ్ఞమైనవాడు.

"పలుదూరులు బాలునిపైఁ జెప్పినట్టుండుఁగాని

కలికివాఁడమ్మ శ్రీవేంకటనాథుఁడు" 10-2-87

కలిగినాతఁడు: వి. కలిగి ఉన్నవాడు.

"ఎపుడు నాయెడ నీకు నిది వలెనా

కపటాలు నిజములు కలిగినాతఁడవు" 5-329

కలితి: క్రి.ప. కలిగితి, కలిగితివి, ఉంటి (వి).

"అందపు శ్రీవేంకటేశ ఆపెఁగూడి నన్నుఁగూడి

తిందులో మాయిద్దరికి నిటు గలితివిగా"

11-530

కలితే: (89) స.క్రి. కలుగు ధాతువుకు వ్యావహారికరూపమైన కలు ధాతువు చేదర్థకరూపం. కలిగితే, కలిగినట్లైతే అని అర్థం. రా.సీ.లో 'కలుగు' ధాత్వర్థంలో కలు ధాతువు ప్రయోగం ఉంది. సంకీర్తనల్లో ఈ రూపం పెక్కుచోట్ల ప్రయోగింపబడింది. అన్నమయ్య 'కలిగితే' అనే పదం కూడా వాడినా 'కలితే' ప్రయోగాలే ఎక్కువ.

"కన్నవిన్న నీ మతకము లే మైనాఁ గలితే

వున్నతిఁ దెలుసుకొమ్మా వూహించి నీవే"

18-530

"కలయికలు గలితే కపటాలన్నియుఁ బాసు

వెలినుండి నీ వేల వెంగెమాడేవే" 7-460

కలి దచ్చ వెన్నగు: *ప.బం; అ.క్రి.* అసాధ్యమైనది. సంభవమగు అనే అర్థంలో నిరసనగా అనే మాట. పెరుగు చిలికితే వెన్న పుడుతుంది గాని గంజిని చిలికితే రాదు కదా!

"నిలువు రాజస మేలే ని న్నాతఁడు గూడఁగాను

కలి దచ్చ వెన్నాయఁగద వమ్మా" 17-35

కలిమికాంత: వి. లక్ష్మీదేవి.

"కలిమికాంత తొడెక్కెఁ గంభమురాయ నీపైఁ

గలువదండలు వేసెఁ గంభమురాయ" 18-420

కలిమికామిని: వి. లక్ష్మీదేవి.

"కలిమికామిని తోడ కారుకమ్మిన పంట

మలయుచుఁ దమలోని మట్టిమానిపంట"

4-342

కలిమి లేని గర్వము: *ప.బం; వి.* నిష్ప్రయోజనం, వృథా.

"ఫలము లేనియట్టి పను లేలా కడు

కలిమి లేని యట్టి గర్వ మేలా"

కలిముదిరి మెడిదగు: (?)

కలియుగవైకుంఠము: వి. కలియుగంలో వైకుంఠసదృశమైన తిరుమలకొండ. శ్రీవేంకటేశ్వరస్వామి నెలకొన్న తిరుమలకొండకు పేరు.

"కలియుగవైకుంఠంబను నామము

గలిగి వెలయు మా కొండా" 15-460

కలుచపడు : (2) అ.క్రి. కలతపడు, క్షోభపడు.
"కక్కసించఁబోతేను కలుచపడు వలపు
వొక్కటై నీ వుండితేను వోజకు వచ్చీఁదానే"
29-47

కలుపడఁజేయు : స.క్రి. ఈ పదం నిఘంటువుల్లో కనిపించదు. ప్రకరణాన్ని బట్టి నివ్వెరపడునట్టుచేయు, మ్రాన్పడునట్లుచేయు, కలవరపడునట్లుచేయు ఇత్యాదిగ ఊహింపవచ్చునని సం.ప.స. (19 వాల్యూం. 10 పు.)
"ఏ మమ్మ యశోద మీ యింటికి నేము వచ్చితే
గాముకవంటి బిడ్డనిచ్చి కలుపడఁజేసితి" 19-481

కలుపు : పెరుగు, మిశ్రదధి.
"యేఁకట దీర నీకు నెందరు గలరని
వోఁకలపులుసు కలుపులఁ బుచ్చవలెనా" 5-1

కలుపు : పైరుతోపాటు మొలకెత్తే గడ్డి మొ॥
"కామక్రోధాదులనే కలుపు దవ్వి వేసి
వేమరు వైరాగ్యమనే వెలుగు వెట్టి" 9-20

కలుపుకోలు : (4) వి. మైత్రి, ఐకమత్యం. రూపాం. కలపుకోలు.
"చెలువుఁడ వీ మాటకు సిగ్గుపడే వదియేమీ
కలుపుకోలైన మేళగాఁడవు గావా" 7-151

కలుపుకోలుతనము : వి. ఐకమత్యం, మైత్రి.
"నిలిచి నే నింతలోనె నివ్వెరఁగుతో నుండితే
కలుపుకోలుతనాలు గలుగఁజేసినే" 25-112

కలుపుదీయు : క్రి.విణ. పైరులోని చెడు మొక్కలను తీసివేయు.
"వనము వెట్టినవాఁడు వాడకుండా నీరు వోసి
పెనచి కలుపుదీసి పెంచినయట్లు" 7-109

కలువకన్నులయమ్మ : వి. కలువలవంటి కన్నులు గల స్త్రీ, కువలయాక్షి.
"కలువకన్నులయమ్మ కాంతుని దిక్కుచూడవే
అలరుచు నీకు మొగమై యున్నాఁడు" 28-424

కలువకన్నులవాఁడు : వి. కలువలవంటి కన్నులు గలవాడు, కువలయాక్షుఁడు.
"గక్కన నిన్నుఁ జూడని కలువకన్నులవాఁడు
చొక్కిన నీ వదనచంద్రునిఁ జూచితేలెను"
28-570

కలువడము : (కలువ + వడము) వి. ఉత్సవాది సమయాలలో ధ్వజస్తంభాదులకు వ్రేలాడగట్టే బంగారు కలువపూదండ.

కలుషము : (5) వి. కాలుష్యం. ధర్మవాచకానికి బదులుగా ధర్మివాచకం ప్రయోగింపబడింది. అన్నమయ్యలో ఇట్టి ప్రయోగాలు అనేకం.
"అలరిన నాలో అంతర్యామివి
కలుషమెడయ ననుఁ గాతువు గావా" 3-474

కలుషించు : అ.క్రి. కలఁకఁబాఱు, కలఁతపడు.
"కలుషించే నాఁటి కడమెల్ల దిగవలె
అలుగనీ అలుగనీ అలుగనీవే" 5-276

కలుహారము : (2) వి. కల్హారమునకు వ్యావహారిక రూపం. సుగంధం కల కలువపువ్వు.
"కపటరాక్షసనేత్ర, కలుహారములు మోడ్చె"
4-465

కల్యాణవేదిక : వి. వివాహం జరిగే వేదిక.
"ప్రేమఁగరకజడలు పిరిఁది దిండ్లు దీరిచి
కామించి నవ్వీ వాఁడే కల్యాణవేదికను" 14-368

కల్ల : వి. ముండ్ల కంచె, ముండ్ల వెలుగు.
"మందావు కల్లలు - మావులెల్లా మొగ్గలు"
18-259

కల్లతనము : వి. 1. వంచన, మోసం 2. నేరం, తప్పు 3. చెడ్డతనం (వ్యా.)
"పాడిపంతాలు చెప్పేవు పక్కన శ్రీవేంకటేశ
యేడనైనాఁ గల్లతనా లెంచేరా నీమీఁదను"
26-488

కల్లనిజాలు : వి; బహు. సత్యాసత్యాలు.
"చెవి విన్నమాట లెల్ల శ్రీపతియై తోఁచీని
ఇవల కల్లనిజాల నేను" 4-228

కల్లపడు : అ.క్రి. 1. హానిపడు, భంగపడు 2. మోసపడు.
"బుద్ధు లెంచుకొను లోలో పోసరించి కల్లపడు
అద్దివో శ్రీవేంకటేశుఁడాడ నాడనె" 9-39

కల్ల మాడ దొడ్డ ముద్ర : (2) సామెత; చెల్లని కాసుకు పెద్ద ముద్ర, అసత్యమైన విషయానికి పెద్ద గౌరవమివ్వడం, నాణెం నకిలీదే అయినా దానికి ముద్ర మాత్రం పెద్దది అనే దాన్నిబట్టి వచ్చిన పదబంధం. 'చెల్లని కాసుకు గిల్టులెక్కువ" అని సామెత.
"బల్లిదునిచేత మంటే పచ్చఁబూస మాణికమే
కల్ల మాడ దొడ్డ ముద్ర కతకుఁ గాళ్ళున్నవా"
14-377

కల్ల లేదు పొల్ల లేదు : నానుడి. అసత్యమూ లేదు – వ్యర్థతా లేదు లేదా కల్ల – పొల్ల జంటపదం కావచ్చు.
"కద్దుకద్దు నీ మాట కల్ల లేదు పొద్దు లేదు
వద్దు వద్దు నీతోడి వాదులు నాకు" 9-73

కల్లాను : కలిగినను, ఉన్నను . 29-15
"ఎందరు చుట్టాలు గల్లా నింతకు మేలే
అందుకోలు వలపుల కంగవించీఁ గాక" 7-516
"మలసి నామీఁద మచ్చరమెంత గల్లాను"
11-307
"రాజసమెంత గల్లాను రాసి చేసుకొమ్మనవే
జాజుకొన మాయెడఁ బచరించనేల" 20-165
"ముంచి నవ్వులేవి గల్లా మూట గట్టుకొమ్మనవే
వంచి మాపై నేల చల్లీ వరుసఁదాను" 20-165

కళంకు : వి. 'కళంకము'నకు తద్భవం, రూపాం. కలంకు.
"ఒనర చంద్రునకు కళంకు గలిగిన
నుడుగక శైత్యము మానీనా" 15-258

కళబెళమను : తళతళమను, ప్రకాశించు.
"కట్టిన గింటెపుఁజీర గళబెళమనఁగాను
యిట్టె వచ్చి కానుక నీ కిచ్చీ నెవ్వతో" 12-495
"కట్టిన చెంగావిచీరఁ గళబెళ మనఁగాను
గట్టి కొప్పులో విరులు కడు బుగులుకొనఁగా"
28-441

కళవళము : వి. 1. నిద్ర, మోహం మొ॥ వాటివల్ల కలిగే కలవరింత 2. సంభ్రమం, తొందర 3. వ్యాకులత, క్షోభం.
"చెక్కు నొక్కేనా బుద్ధి చెప్పుటగాక
గక్కన నిందులకుఁగా కళవళ మేఁటికే" 21-469

కళుకు : వి. 1. కాంతి 2. పొడి 3. కిరణం (వ్యు.)
"అలరె నీ వీపునను అవి యెవ్వతెవో కాని
కళుకు వ్రాసినయట్టి కంకణాల వొత్తులు"
12-528

కళ్లు : వి. బహు. 'కడి'కి బహు. రూపం. ముద్దలు.
"సందడించి మరునాఁటి చవులకే కూడఁబెట్టు
పొంది మింగినకళ్ల పులుసరమెంచఁడు" 3-206

కవ : వి. ఇద్దరు; దేహమూ, జీవుడూ అని భావం (?)
"కవ నంతర్యామి కరుణాకరుఁడట
వివిధభంగులను వెదకఁగనేలా" 3-533

కవకవ : అవ్య. నవ్వడంలో ధ్వన్యనుకరణ శబ్దం. (పక్షులకూతకు ధ్వన్యనుకరణ శబ్దం, కోపంతో వచ్చే ధ్వనికి అనుకరణం.)
"కాతరించి పెనఁగేవు కవకవ నవ్వేవు
ఆతఁడేడ నీ వేళ అవునే నీవు" 29-341

కవకివ : ధ్వన్యనుకరణశబ్దం.
"కడు సకినల సజ్జ కవకివమనఁగాను
యెడపక నిన్నుఁగూడె నీకె ఇందాఁకా" 29-122

కవగూడు : (2) అ.క్రి. జతగూడు, రతికి కూడు, సంభోగించు.
"జవళి శ్రీ వేంకటేశ్వరుఁడల మేల్మంగను
కవగూడి నన్నిటాను ఘనుఁడే తాను" 12-118

కవడి : వి. రొమ్ము, అక్కు, వక్షస్థలం.
"కలికి చూపుల కాంక్ష కడు సందడించఁగాను
వలపు నీకుఁగాను కవడిఁబట్టుకున్నది" 12-286

కవడువాయు : అ.క్రి. బాధానివర్తి యగు అని ప.పా. ఇతర నిఘంటువుల్లో ఈ పదం కానరాదు. ప.పా. చూపిన బాధానివర్తి యగు అనే అర్థం గౌణమే కాని ముఖ్యార్థం కాదనీ కవడు + పాయు, కవడు-కవలు- జంట అని, (చూ: kittel కవడు – కవల్ – కవలు – a bifurneatun devided stake) రెండుగా వేరుపడినవారే కవలు అనీ వివరిస్తూ శ్రీ వేటూరి ఆనందమూర్తి ఈ పదానికి చీలిపోవు, వేరుగా అగు, జంటవాయు అనే అర్థాలను సూచించినారు. కవలువోవు అనే పదం కూడా ఇటువంటిదే.

"యివల శ్రీవేంకటేశుఁ డింతలో దిక్కయి కాఁచె
కవడువాసె జీవుఁడు కన్నవారిచేతను" 3-64

కవణము : (3) వి. ముద్ద, (కబళము) దాణా!

"వుబ్బుఁగవణము వంటి దున్నతపు నీ నవ్వు
గొబ్బున నప్పటి నిన్నుఁ గొసరనేల" 16-254

"కాదనక రతి నుబ్బుఁగవణము మేపెనో
నాదెస చూచి నీవు నవ్వులు నవ్వేవు" 17-180

కవిసెన : వి. గవుసెన, గలీబు, దిండుముసుగు.

"కాంతుల యద్దములను కవిసెనఁ బెట్టనేలే
వింతగాఁ దుమ్మిదపిండు విరియించ నేఁటికే"
7-182

కవుక : వి. కబళం, ముద్ద.

"బంతిఁగట్టి నురిపేటి పసురము లెడనెడఁ
బొంత నొక్కొక్క గవుక పుచ్చుకొన్నట్లు" 4-201

కవెల : వి. 'కవిలె'కు రూపాం. 1. పాతపుస్తకాల కట్ట (2. తూకం రాళ్లు వగైరా ఉంచుకునే సంచి)

"చెప్పితిఁబ్రియములు చిత్రగుప్తునకు
తప్పక కవెలలు దాచుమని" 15-375

కసరు : వి. 1. కోపం 2. దోషం 3. పొగరు, గర్వం 4. విజృంభణం 5. అతిశయం, గాలివాన 6. హెచ్చు, లాభం (వ్యా.)

"వద్దేలే కసరు వలవని కిసరు
పొద్దువొద్దులకుఁ జూపుల యసరు" 5-321

"ననిచి కూడినవారు నమ్మక ప్రియునిమీఁద
కనలి యాడిన మాట కసరౌనటే" 5-111

కసరులాడు : ప.బం; అ.క్రి. కోపపడు, ఘోషించు, చిరాకుపడు.

"పసిఁడిమంచముమీఁదఁ బవళించి యతనితో
కసరులాడెడి యట్టు గాదువో నేఁడు" 5-200

కసరులు చూపు : ప.బం; అ.క్రి. కోపం చూపు, గర్వం చూపు, అతిశయం చూపు.

"కసరులు చూపరాదు కాఁగిలించుకుంటేను
పొసఁగక యాఁపరాదు బూటకానను" 28-121

కసరెత్తు : అ.క్రి. విజృంభించు, ఉప్పొంగు.

"వసుధఁ జంద్రుడు నీలవర్ణుఁడేటికి నాయ
కసరెత్తి నునుఁగందు గలయఁగొనుఁబోలు"
1-332

"కప్పురపు మోవి వాడి కసరెత్తెఁ దేనెలు
దప్పిదేర మాటలాడి తగులఁగాను" 25-114

కసవు : వి. గడ్డి, చెత్త.

"గంట వాఁగకుండా నిండఁ గసవు దురిగి మా
యింటివారు నిద్దిరించ నిల్లు చొచ్చెను" 2-166

"కసవు కట్టలు వేసి కదా గోవులచేత
కొసరుచుఁబాలు పిండుకొనేది" 2-290

కసిగాటు : (9) వి. అపరిణతమైన అనుభవం, పైపై కాటు అని వాచ్యార్థం 2. దంతక్షతం. విశ. అల్పమైన.

"కసిగాట్ల వేంకటపతి కౌఁగిట రసము
లొలుక నేరము లెన్నుచును" 5-294

"కలసీకలియని మనసు కసిగాటు కంటేను
తలపులో నడియాస తమకమే మేలు" 24-83

కసివుచ్చుకొను : అ.క్రి. కోపగించుకొను, కోపియగు.

"యీ కడ శ్రీవేంకటేశ యిట్టు నన్నుఁ గూడితివి
వాకు కసివుచ్చుకుంటే వనితా భూమిని" 7-27

కసుఁగాటు : వి. లేతకాటు.

"పెనఁగే రమణునిఁ బ్రియమే సేతువుగాక
కనుచూపులలో నేలే కసుఁగాట్లు" 21-120

కసుఁగాయ : (కసురు + కాయ) వి. పచ్చికాయ.

"పచ్చితనానఁ దిరిగి పండవద్దా చిత్తము
గచ్చులఁదాఁ గసుగాయే కలకాలము"

కస్తిఁబడు : అ.క్రి. ఇబ్బందిపడు, కష్టపడు, దుఃఖపడు.

"ఆస్తికనాస్తికుఁడై తా నందెవ్వరివాడూఁగాక
కస్తిఁబడి వాలి వృథా కలహానఁ బొలిసె" 3-130

కస్తిఁబెట్టు : స.క్రి. దుఃఖపెట్టు, కష్టపెట్టు.

"యేవేళ నీ కితవాయ నింటి కిట్టె విచ్చేయు
కావించి నాయంత నిన్నుఁ గస్తిఁబెట్టఁ జుమ్మీ"
16-223

కస్తిసేయు : (కస్తి + చేయు) స.క్రి. దుఃఖం కలిగించు, కష్టపెట్టు, శ్రమపెట్టు.

"కాఁగిలించి నిన్ను నంత కస్తిసేయ నోపఁగాని
రాఁగిన నా వలపులు రాసులై వున్నవిరా"
11-200

కస్తురిబొట్టు : వి. కస్తూరి తో దిద్దుకున్న బొట్టు.

"నులివచ్చి చెమటల నుదుటికస్తురి బొట్టు
పెలుచుఁ గుచ్చల మీఁది పిరిచుట్టు" 16-569

కస్తూరి గీరునామము : వి. గోటితో గీటువలె పెట్టుకొనే కస్తూరిబొట్టు.

"కందువ మొసలిమీఁద కస్తూరి గీరునామము
యిందరిలో నీపె యెమ్మె లేమని చెప్పుదమే"
29-106

కస్తూరినామము : (5) కస్తూరితో దిద్దుకునే పొడుగు బొట్టు.

"కలికి రమణునికిఁ గస్తూరినామము వెట్టి
చెలరేఁగి తాఁజూపెఁ జెక్కుటద్దాలు" 19-404

"మెండుగఁ గస్తురినామమె నుదుటఁబెట్టినది
కొండలరాయఁడ నీకు గురియై తా నున్నది"
24-149

కస్తూరిబొట్టు : (14) వి. చూ : కస్తురిబొట్టు.

కా

కాఁక : వి. తాపం 1. బాధ 2. కోపం 3. విరహవ్యథ 4. తపస్సు 5. వేడిమి 6. జ్వరం.

"వెదకుతానే నిన్ను వెలఁది కాఁకలఁబొందె
యెదుటఁ బొద్దు వొడవకెండగా నేను" 7-402

కాఁకరించు : *n* వంచించు, బాధించు.

"దిమ్మరి జాణఁడవోరి తిరువేంకటేశ నన్ను
క్రమ్మర క్రమ్మరఁగూడి కాఁకరించే వేలరా" 6-8

కాఁకసేయు : అ.క్రి. 1. తపింపజేయు 2. బాధించు 3. వేడికలిగించు 4. కోపింపజేయు.

"నెలఁత చిత్తము కొద్ది నీ వెఱుఁగవా
కలయఁగవలెఁగాక కాఁకసేతురా" 13-11

కాఁకు : వి. 1. అవమానము 2. నింద.

"చిలుకలు మీ చేతలు సిగ్గులు దోఁచఁగనాడే
ఇలమీఁద నింత కాఁకు యెఱుఁగమమ్మా" 12-5

కాఁగలించు : (20) స.క్రి. 'కౌఁగిలించు'కు వ్యావహారికరూపం. దీనికి రెండు మూడు ప్రయోగాలు మాత్రమే కనిపిస్తున్నాయి.

"చీరలు నీ వియ్యఁగాను చేకొని కాఁగలించిరి"
7-537

కాఁగలి : వి. 'కౌఁగిలి'కి వ్యావహారికరూపం.

"గరిమ నా కోరినట్లు కాఁగలియ్యవయ్యా"
7-335

కాఁగిపడు : ఉద్రేకపడు, ఆవేశపడు.

"కవకవ నవ్వితేనె కాఁగిపడే విప్పు డిట్టె
తివిరి కాలు దాఁకితే తిట్టకుండేవా" 9-143

కాఁగిలించు : స.క్రి. 'కౌఁగిలించు'కు వ్యావహారికరూపం. అన్నమయ్య 'కౌఁగిలించు' అనే పదాన్ని కూడా వాడినా 'కాఁగిలించు' అనే వ్యావహారికరూపాన్నే చాలా ఎక్కువగా వాడినాడు.

కాఁగిలి : వి. 'కౌఁగిలి'కి వ్యావహారికరూపం. అన్నమయ్య 'కౌఁగిలి' అనే పదాన్ని వాడినా 'కాఁగిలి' అనే పదాన్నే ఎక్కువగా వాడినాడు.

"కాఁకలెంత విరివైనా కాఁగిలంత విరివౌను"
20-33

"కాఁగిట శ్రీవేంకటపతి కూడితి
వేఁగక యిచటనె యెనసి వుండరా" 20-37

కాఁజేయు : న.క్రి. అగునట్లు చేయు, నిర్వర్తించు.
"హరియే స్వతంత్రుఁడు అన్నిపనులు గాఁజేయు
పరుల ఉద్యోగాలు పనిలేవు" 9-164

కాఁడిన పోట్లలోన కత్తి గోసినట్లు : *ప.బం; అవ్య.* అనుభవిస్తున్న బాధకు తోడుగా మరో బాధ కలిగినట్లు. (నాటిన దెబ్బలచోట్ల మళ్లీ కత్తితో కోసినట్లు అని శబ్దార్థం.) 'కాలిన పుండ్లలోన ఉప్పులు చల్లు' ఇటువంటిదే.
"వేడుకలన్నియు మాని వేదనల నుండఁగాను
కాఁడిన పోట్లలోన కత్తిగోసినట్లు" 6-165

కాఁడిపారు : *అ.క్రి; ప.బం.* గరుపెక్కు.
"కన్నుల చూపులనె కాఁడిపారె మనసు
యెన్ని లేవు నీ సుద్దులేమి చెప్పేవిఁకను"
21-224

కాఁడు : *న.క్రి.* 1. నాటు, గుచ్చుకొను 2. స్థిరపడు 3. కమ్ము, సాంద్రమగు, దట్టమగు.
"కన్నులు గొప్పలంటాను కాఁడఁజూచుటే కాని
మిన్నక తల చుట్టిరా మించేది దలఁచము"
29-427 & 23-273

కాఁతాళము : (31) వి. ఈర్ష్య, కోపం, అధైర్యం. రూపాం. కాంతాళము. ఈర్ష్యతో పాటు 'క్షమం' అనే అర్థాన్ని కూడా ఆం.ప.ని. చూపింది. కోపంతో పాటు Rashness, hesteness, passion అనే అర్థాలను కూడా బ్రౌణ్యం చూపింది. శ.ర., సూ.ని. లలో ఈ పదం అర్ధబిందురహితంగానే చూపబడింది.
"మాటలాడ వచ్చుఁగాక మనసులో కాఁతాళము
మూటగట్టవచ్చునా ముందర దెచ్చి" 27-39

కాఁతాళించు : (58) *అ.క్రి.* ఈర్ష్యపడు, కోపపడు, అధైర్యపడు, వ్యాకులపడు.
"కన్నులఁదప్పక చూచి కాఁతాళించఁబని లేదు"
16-379
"ఏల రట్టుసేసేవు యిదేరా నీవు
కాలుదొక్కినదానితోఁ గాఁతాళించనేటికి"
14-565

కాఁదారి మాఁదారి పొద్దు : వి. మధ్యరాత్రి సమయం, నడురేయి. రూపాం. కాందారి మాందారి పొద్దు.
"నించిన యాసోదముతో నిద్దుర గంటిఁబెట్టక
మంచమెక్కేవు కాఁదారి మాఁదారి పొద్దు"
26-517
"నడిరేయి యనఁగఁ గాందారి మాందారి పొ
ద్దన సరిప్రొద్దన నద్దమరేయి" (ఆం.భా.1.94)
గాంధారి మాంధారి పొద్దు అని బ్రౌన్. (అనుబంధం)
"కాపుటూరి మంగలి రాజైతే కాపులంతా గడ్డాలు పెరిగి బాధపడ్డారట" అని సామెత.

కాఁపిరము : (11) వి. 'కాపురము'నకు వ్యావహారిక రూపం. 1. సంసారం 2. నివాసం.
"కైకొని నీవు నాతో కాఁపిరము సేతువంటూ
నీకుఁజేతులు చాఁచుట నేఁడా నేను" 21-34

కాఁపిరేలు : వి. 'కాపురాలు'కు వ్యావహారికరూపం.
"పుక్కిట లోకాలు చూపి బూమెలు సేతువుగాక
కక్కసించి మాతోడి కాఁపిరే లేలా" 11-268

కాఁపుటూరి మంగలోజు : కాపులున్న ఊరిలోని మంగలివాడు, అల్పుడు.
"కాఁపుటూరి మంగలోజు గడిమీఁది రాజుగాఁగా
కాఁపులెల్లాఁ బనిమాని కందినయట్టు"
4 అను. 31
"నిక్కము తన కబ్బెను గానుపు రిపుమిత్ర
మధ్య గణనకుఁ బొలమై" అని నృ.పు. ప్రయోగం. (4-157)

కాంచనదైత్యుఁడు : వి. హిరణ్యకశిపుడనే రాక్షసుడు.
"కాంచనదైత్యుఁడు దొరకాలువ నెత్తురు వార
చించెను గోళ్ల నరసింహదేవుఁడు" 2-228

కాంతాళము : వి. 1. ఈర్ష్య 2. తాలిమిలేమి 3. కోపం, (వాచ; సూ.ని.) వ్యాకులము మీద వచ్చే కోపము, అధైర్యం. తాలిమిలేమి (బ్రౌన్) 1. ఈర్ష్య 2. తాలిమిలేమి. (శ.ర.) రూపాం. కాఁతాళము.

"గాఁటపుఁబొరుగువారి కాంతాళపు పరాకున
మాటాడినా నీతోడ తూటాడనైతి" 12-42
"మనసు కాంతాళముతో మరి యెంత సేతువో"
అని క్షేత్రయ్య.

కాంతాళించు : అ.క్రి. కోపించు, ఈర్ష్యపడు, అధైర్యపడు.
"కళలు నిండే మోమంటే కాంతాళించేవు సుమీ
సొలసి నీకు దిష్టాలు చూపుమని" 12-154
"కలికి నా చేతులని కాంతాళించే వప్పటిని
యిలపై వుప్పు చిందితే యినుమడి గాదా"
17-182
"నీకు మోహించినవారు నిన్ను మరి దూరుదురా
కైకొను మనేవారు కాంతాళింతురా" 12-128

కాంతాళింపు : వి. కోపం, ఈర్ష్య, అధైర్యం.
"మరిఁగినమీఁద నేలే మరి చింతలూ
కరఁగినమీఁద నేలే కాంతాళింపులు" 12-134

కా : అవ్య. కదా అనే రూపానికి వ్యావహారికరూపం.
"సారెకు నా వలపు రచ్చలఁబెట్టేనని కా
పోరుచు నా చీర కాసె పోయుమంటివి" 7-126

కాకతాళనాయము : వి. కాకతాళీయ న్యాయము, యాదృచ్ఛిక సంఘటనను తెలియజేసే న్యాయం, కాకి వ్రాలగానే అప్రయత్నంగా తాటిపండు పడిన విధం.
"కాచి యిదే పసో నీకు కాకతాళనాయమో
ఆ చెంతే విచారింతు పండ కిటు రమ్మా"
20-207

కాకరి : 'కాకు' శబ్దంపై మత్వర్థం (కలవాడు, కలది అనే అర్థం)లో 'అరి' ప్రత్యయం రాగా ఏర్పడిన రూపం. కాకు శబ్దానికి సూ.ని.లో గాసి = బాధ (శ్రమ), తిరస్కారం, అనే అర్థాలు, బ్రౌణ్యంలో కలఁత, బాధ అనే అర్థాలు చూపబడ్డాయి. కనుక కాకరి అంటే బాధకలవాడు, అవమానం కలవాడు, కలత కలవాడు అనే అర్థాలు చెప్పవలసి ఉంటుంది. కాని ఈ అర్థాలు కాకరి శబ్దప్రయోగాల్లో సంగతమైనట్లుగా కనిపించవు. కనుక కాకు శబ్దానికి మాయ, వంచన అనీ, కాకరి అంటే మాయగలవాడని (= వంచకుడని) అనే అర్థాలు సం.ప.స. లో సూచింపబడ్డాయి. (16 వాల్యూం. 3వ అను. 4.27 పు.) తె. వ్యు.కో. లో ఒంటరి, ఏకాకి, వ్యర్థుడు అనే అర్థాలు ఇవ్వబడ్డాయి. కనుక కాకరి శబ్దానికి సందర్భానుగుణంగా అర్థాలు చెప్పవలసి ఉంటుంది.
వంచకుడు :
"యెచ్చట నీతో నవ్విన దెటువంటి యాఁటదైనా
గచ్చరేఁగి మిక్కిలి కాకరి గాకపోవునా" 16-533
"కాకరివై యసూయ కడరు బాలుఁడవైతి
నీకు నిది మెచ్చుగాక నెరి మాకుఁదగునా"
23-596
"కాకరివై దూరేవు గక్కున పోనంటా
పోకులఁబోక నీ వాపెఁబూఁట వెట్టరాదా" 8-197

కాకరిగుణము : వి. చిల్లరగుణం, వంచనగుణం.
"ఆకడ నీ వెవ్వతె మోములు చూచితివో వాని
కాకరిగుణము ఇందుఁ గలయగఁ బోలును"
16-133

కాకరిగొల్లెతలు : వి. మాయకత్తెలైన గొల్లస్త్రీలు.
"కాకరిగొల్లెతలు కాఁగిలించి వట్టేరు
యేకమైతిరి మీ గుట్టు లెరిగే సుండీ" 22-537

కాకరిచేఁతలు : వి. చిల్లరచేష్టలు అని ప.పా., మోసగాని చేతలు అనే అర్థం కూడ చెప్పవచ్చు.
"ఈ కాకరిచేఁతలకు లోకమువారు నగరా"
12-341

కాకరితనము : వి. వంచన, మోసం, కాపట్యం.
"కాకరితనముతోడ కతలేమి చెప్పేవే
తూకొని తమ్మఁబేంట్లు తుడుచుకోరాదా"
22-195
"నాకు నీవే మానతిచ్చినా సమ్మతించేఁగాక
కాకరితనాల నీతోఁ గాఁతాళించేనా" 27-568

కాకరిపనులు : వి. మోసపుపనులు, కపటపుపనులు, చిల్లరపనులు.
"యీకడఁబలుకుఁ బంతమెక్క నన్నుఁగూడితివి
కాకరి నీ పనులే లోకమున సమ్మతము" 24-90

కాకరి మతములు : వ్యర్థమైన మతములు, మాయమతములు.
"కాకరిమతములెల్ల గాలిఁబుచ్చి పరమిట్టే
పైకొనఁగఁ గరుణించె భాష్యకారులు" 1-162

కాకరివాఁడు : వంచకుడు, మాయగాడు, కోపశీలి.
"కాకరివాఁడవు మాతో గాలి ముడియగట్టేవు
చేకొని నీ చెలిమెట్టు చేసెరయ్య సతులు" 21-20

కాకరివిద్యలు : వి; బహు. మోసపు విద్యలు, వ్యర్థమైన విద్యలు.
"యేకడా మంచి గుణాలే యెన్నికకు నెక్కుగాక
కాకరివిద్యలకు లోకమువారు మెత్తురా" 16-9
"నీకితఁడు మేలువాఁడు నన్నిట్టె మన్నించినాఁడు
కాకరివిద్యల నేల కాఁతాళించేవే" 28-486

కాకరిశత్రువు : వి. మోసగాడైన శత్రువు.
"లోకులఁగోపింతుఁగాని లోని కామాదులనేటి
కాకరిశత్రులమీఁదఁ గతుఁగోపించ" 4-74

కాకరి సతి : వి. వంచకురాలైన సతి.

కాకరిసొమ్ము : వి. మోసపుసొమ్ము.
"ఆముకొన్న మగవాఁడ వాటదాన వయ్యేవా
యేమిటి కాకరిసొమ్ము ఇయ్యవయ్యా ఇఁకను"
26.404

కాకిజున్ను : వి. ఆకుల బూజుపై మంచు కురువగా ఏర్పడిన జున్ను వంటి తెల్లని మంచుముద్ద, ఉత్తుత్తి జున్ను; ఈ అర్థం రాళ్ళపల్లి, గౌరిపెద్ది వారి చర్చల్లో నిర్ణీతమైందిగా మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యంగారు తెలిపినారు. ఈ చర్చలో వీరుకూడా పాల్గొన్నారట.
"కాకిజున్ను జున్నులంటా గంపెడేసి తినిపించి
వాకొలిపి బాలులెల్లా వాపోవఁగ" 2-167

కాకిపైఁడిబొట్టు : (3) వి. పీతాభ్రకంతో పెట్టుకున్న బొట్టు.
"కాకిపైఁడిబొట్టు నీకుఁగడు ప్రియమా
ఆకుఁదొలసిదండ నీ కది బాఁతా" 19-418

కాకిబెగడ శీర : వి. అభ్రకపుచీర.
"కాకిబెగడ శీరను కాశవోసినాఁడు తాను
వాకిటికి వచ్చినాఁడు వలశితి ననవే" 11-93

కాకిభక్తి : ప.బం; వి. అల్పభక్తి, నీచభక్తి, దొంగభక్తి.
"దీపము వేటుమృగము తెగని యాసోదకాఁడు
దూపము కాకిభక్తి యెందును లేనివాఁడు"
15-378

కాకు : వి. దీనికి నిఘంటువుల్లో శ్రమ, బాధ; తిరస్కారం, అవమానం; కలఁత, అనే అర్థాలు లభిస్తున్నాయి. విశేషణంగా వాడినప్పుడు శూన్యం, వ్యర్థం, చెల్లాచెదరైన, కళావిహీనమైన, మాయ అనే అర్థాలని చెప్పబడింది.
"ఇంతులెల్లా విని యింక నేమందురు
కాంతుఁడవు ఇటువంటి కాకు గలదా" 13-158
"చిలుకలు మీ చేతలు సిగ్గులు దోఁచఁగనాడీ
ఇలమీఁద నింత కాఁకు యెఱుఁగమమ్మా"12-5
"యేకతాన నెందునైనా నియ్యకొనేఁగాని నిన్నుఁ
గాకుగా మందెమేళాలఁగప్ప నోపరా" 11-107

కాకుచే(సే)యు : (60) స.క్రి. 1. నిందించు, అవమానపఱచు 2. అణచు 3. బాధించు, హింసించు 4. వ్యర్థపుచ్చు 5. చీకాకుపఱచు.
"వినుమా ఆపెచేతనే వింతలుగఁగాకు చేసి
అనఁబోలుదువు నీవే ఆపెతో నేఁడు" 7-471

కాకుపడు : (3) అ.క్రి.వ్యాకులపడు, కలఁతనొందు (సూ.ని.) చీకాకుపడు, బాధపడు, అవమానపడు, వ్యర్థమగు.
"కన్నవిన్నవారిలో నెప్పుడు
కాకుపడకుమీ వో మనసా" 1-188
"కైకొని యిద్దరు మూడిగము నీకుఁజేయఁగాను
కాకుపడి కలగూరగంపాయ నీ నోరు" 23-164

కాచు (కొను): స.క్రి. ఎదిరి చూడు, వేచి ఉండు.
"ఎన్నాళ్ళనుండి కాచేవో యిందుకుఁగాను
వన్నెలఁజూడ వచ్చినవారిఁ జుట్టుకొనేవు" 22-177

కాచుకుండు: (కాచుక + ఉండు) ఎదిరిచూస్తూ ఉండు, వేచి ఉండు. (దీనికి అనేక ప్రయోగాలు ఉన్నాయి)
"చెంతనుండి యెందాఁకాఁ జేసేవే విన్నపాలు
కాంతలందరు వాకిటఁ గాచుకుండఁగా" 22-283

కాటారించు: మోసగించు, బాధించు, వ్యాకులపఱచు, భయపెట్టు.
"ఒఁల్లనివాఁడవై వుండి వొక్కొక్క నెపమువేసి
కల్లయలుకలుగాఁ గాటారించేవు" 11-281

కాటికె: వి. 'కాటుక'కు వ్యావహారికరూపం.
"కన్నుల కాటికెతోడ కసరకువే నా
వెన్నెలమోమునవ్వుల విసరేను" 20-89

కాటువోవు: ప.బం. గాయపడు, మచ్చపడు, గాటుపడు.
"వేడుకకు వెలలేదు వెన్నెలకుఁ గాటువోదు
ఆడ నీవే తన మాట కడ్డము లేదు" 7-226

కాడ: (7) కడ (= ఒద్ద, దగ్గర) అనే పదానికి మాండలిక రూపం. ఈ పదం రా.సీ. లోనూ, తెలం, లోనూ బాగా వాడుకలో ఉన్నది. గుడికాడ, బడికాడ, ఇంటికాడ మొ॥
"కొప్పెరల నెదురుగఁ గుంకుమపన్నీరు నించి
కుప్పెలఁజల్లులాడేరు కోనేటికాడ" 20-49
"కాఁగి భూపతిచెఱువుకాడ శ్రీవేంకటేశుఁడు
వీగకుండ రతి నన్ను వెలయించెఁదాను" 19-424
"కని యింటికాడ నిడి గానుగకాడా గసి
నినుఁజూచి నేరుచుకొనేరనే నేను" 19-383

కాడువడు: అ.క్రి. కలతపడు, ఆకులపడు, కలవరపడు, సంక్షోభించు, పాడగు; చెడిపోవు, స్మృతితప్పు అని ఆం.ధా.మా.
"కాడువడ్డ చిత్తమిది కలకాలము నిట్టే
ఆడికెలకు లోనై తనియకపోయ" 1-208

కాణాచి: వి. 1. చిరకాల నివాసస్థానం 2. ఆటపట్టు విణ. వంశపరంపరాగతమైన.
"నీవు నాతఁడునుఁగూడి నెమ్మది నిట్టె వుండితే
కైవసమై నీకెప్పుడూఁ గాణాచాయ నతఁడు" 28-164

కాణాచిది: (కాణాచి + అది) నివాసస్థానమైనది.
"బడినె శ్రీవేంకటేశ పాయకుండా మరపేవు
కడలేని మోహానకు కాణాచిదానవా" 11-52

కాతరపడు: అ.క్రి. భయపడు, తత్తరపడు, అధీరుడగు.
"చేతులు చాఁచక సిగ్గులు విడువక
కాతరపడితేఁగలదా రతి" 16-121
ఉత్సాహపడు:
"కాతరపడి నేను కర్తననుచుఁ జనులు
యీతలఁ జెప్పఁగఁ బూనే నిస్సిరో" 4-371

కాతరపుగుణాలు: వి; బహు. పిరికి స్వభావం.
"ఆతనివల్లఁ దప్పేది అరసి చూచేనంటే
కాతరపు నా గుణాల గతులింతే కాక" 7-500

కాతరపుజీవులు: వి; బహు. భయస్వభావులైన జీవులు.
"ఈ తగవే నాకు నీకు నెంచి చూచితే
కాతరపుజీవులకుఁ గలదా వివేకము" 3-97

కాతరపుది: (కాతరము + అది) వి. భయశీలురాలు, వెతనొందే స్త్రీ.
"ఎంత కాతరపుదని యెంచేవు గనక నీవు
సంతోసాన సారె నిన్ను జరతు సుమ్మీ" 12-75

కాతరపువాడు: (3) వి. భయశీలుఁడు.
"కాతరపువాఁడవు గజరు నీకుఁబట్టితే
నీతి యెఱిఁగినదాన నిన్నుఁగాదనేనా" 17-138

కాతరము: విణ. 1. భయశీలమైనది 2. పిఱికి 3. వ్యాకులం 4. చంచలం వి. ఉత్సాహం, భయం, తత్తరం, వ్యథ, చాంచల్యం (3-69)
ఉత్సాహం:
"కాతరాన మాయింటికిఁ గక్కనఁ బిలిచితేను

యేతులెంత సేసేనని యెట్టుండునో" 7-14
"వరుసతోఁ బోఁకముడి వదలినదీ నెంచదు
గరిమ సరసమాడే కాతరానను" 27-45
తత్తరము :
"అతఁడేమి నీవేమి అవుఁగాములిందులో నేమి
కాతరవుఁదమకము కలదె యిద్దరికి" 7-412
"కాతరపు మగవాఁడు కాదు గూడదనరాదు
యీతల నెవ్వతె విన్నా నేతువలెత్తేడరా"
26-560
చాంచల్యం :
"చేత మొక్కితేఁ జాలు శ్రీవెంకటేశుఁడు గాచు
కాతరాన సేవించని కడమే కాని" 3-169

కాతరించు : అ.క్రి. ఉత్సహించు.
"కాతరించి సారె సారెఁగడు సరసమాడేవు
అతనికి నీవు దొల్లి ఆలవా యేమి" 7-397
భయపెట్టు :
"చేతిలోనైన యట్టి శ్రీవెంకటేశ్వరుని
కాతరించరాదు మరి కాదనరాదు" 25-306

కాతరి : వి. కాతరము (భయం, ఉత్సాహం, తత్తరం, వ్యథ) కలవాడు, ఉత్సాహం కలవాడు.
"యేకతమాడి రమ్మనేవింతులము మొదలనే
కాతరి యాతఁడు చెనకకపోనీఁడే" 14-26

కాతరిదవు : వి. 'కాతరిది' అనే శబ్దంపై మ.పు ; నామ ప్రత్యయం చేరిన విలక్షణరూపం. కాతరిదానవు అంటే భయశీలురాలవు, ధైర్యంలేని దానవు అని అర్థం.
"ఇంత కాతరిఁదవౌట యెఱుగమయ్య
మంతుకెక్కితి విన్నిటా మంచివాఁడవయ్యా"
12-531

కాతరీఁడు : (14) (కాతరము + ఈఁడు) భయశీలుడు, వ్యాకులుడు.
"ఈతఁడు గుట్టు మానిసి యాతఁడు గంభీరుఁడు
కాతరీఁడు గాఁడు యేల కాఁకలు సేసేవే" 13-40
ఉత్సాహశీలుడు :
"చూతము నీ నేరుపు సుదతి యెదుట నేఁడు
కాతరీఁడ వీ గుట్టు కనుకొనవయ్యా" 18-376
"యెన్నేసి నవ్వులు నవ్వీ నెంతైనాఁబోనీఁడు
కన్నెలఁగంటేఁజాలు కాతరీఁడు" 12-408

కాతురపడు : అ.క్రి. 'కాతరపడు' కావచ్చు. అధైర్యపడు.
"కాతురపడి నేను కర్తనసుచుఁజనులు
యీతలఁజెప్పఁగఁబూనే నిస్సిరో" 4-37

కాదవునను : ప.బం; అ.క్రి. తిరస్కరించు - అంగీకరించు.

కాదుకూడదను : (25) వ.బం. వద్దను, నిర్బంధించు.
"ఏదైనా సుఖమే యిన్నిటా నీవు గలవు
కాదుగూడదని నిన్ను గక్కసించనేఁటికి" 4-478

కానిక : (26) వి. 'కానుక'కు వ్యావహారికరూపం.
"ఆపె యంపిన కానిక యవధరించితివా
చూపులఁదప్పక లెస్స చూచితివా" 24-468
అన్నమయ్య 'కానిక' తో పాటు 'కానికె' 'కానుక' అనే రూపాలను కూడా వాడినాడు. కానిక, కానుక, కానికె రూపాల దృష్ట్యా 'కానుక' ప్రయోగం విరళం.

కానికె : (27) వి. 'కానుక'కు వ్యావహారికరూపం. ఇది కాణికె, కాణ్కె అనే కన్నడ రూపాల ప్రభావంతో ఏర్పడి ఉంటుంది.
"ఇచ్చిన కానికెలోనే యితవెల్లాఁ దెలియదా
తచ్చి మా గుణము లేమి తలపోసేవు" 20-479

కానుగమానినరసింహము : వి. దిగువ, ఎగువ అహోబిల మార్గంలో వెలసిన నరసింహస్వామి, నవ నారసింహులలో ఒకరు. ఈ స్వామి కానుగచెట్టు కింద ఉండడం వల్ల ఈ స్వామికి కానుగమాని నరసింహుడు అనే పేరు వచ్చింది. ఈ స్వామి వరాహలక్ష్మీ నరసింహుడు.
"నాఁటి కానుగమానినరసింహము వీఁడె
మేఁటి వరాహపు లక్ష్మీనారసింహము" 4-182

కానుగుమాని నారసింహుఁడు : వి. చూ : కానుగమాని నరసింహము.

"మతిశాంతపు కానుగుమాని నారసింహా"
1-453

కానుపు[1]: (కను + పు) వి. చూపు, తలపు, జ్ఞానం. (ప్రసవం)
"గుట్టు విడిచి నవ్వినా గుణము చెప్పకున్నది
కట్టఁగడపటఁ బతి కన్నదే కానుపు" 22-44

కానుపు[2]: (కను + పు) వి. వీక్షణం, చూడడం, దృశ్యం.
"విన్నదే వినికి వివేకించిన చోట
కన్నదే కానుపు మరి గలయు చోట" 24-174
"అది కలలోని కానుపయి" అని ఉ.హ. ప్రయోగం. 7-99

కామధేనువు మాని యెద్దుఁ బిదుకు: *ప.బం; వి.* అమూల్య మైన ఉపయోగకరవస్తువు ఉండగా పనికిరాని వస్తువును ఆశ్రయించు. వ్యర్థమైన ప్రయత్నం చేయు.
"గద్దరి జీవుఁడు కామధేనువు మాని
యెద్దుఁబిదుకఁజొచ్చె నేది దెరఁగు" 4అను.65

కామలాపురం కంచిరాయఁడు: వి. కడప జిల్లాకు చెందిన కమలాపురంలో వెలసిన వరదరాజస్వామి. కమలాపురము కామలాపురంగా పేర్కొనబడింది. (కంచిరాయుఁడు = వరదరాజస్వామి)
"మూగుచుఁ గామలాపురమునఁ
గంచిరాయఁడవై
చేఁగదేర నేలితివి శ్రీవెంకటేశుఁడా" 26-162

కామిడి: విణ. చెడ్డ. (క. కామిణి = చెడ్డ)

కాయకము: వి. 1. ఈ పదం సాక్షాత్తుగ నిఘంటువులందు కానరాదనీ, ప్రకరణాన్ని బట్టి మాయ, అశాశ్వతము అనే అర్థాల్లో ప్రయోగించి నట్లున్నదని సం.ప.స. (2వ వాల్యూం. 378 పు.) లో చెప్పబడింది. ఈ అర్థం సముచితంగా ఉంది. తె.వ్యు.కో. కాయకాలు అన్నపదానికి బూటకాలు, కల్పనలు అనే అర్థాన్ని చూపింది. కాయకము అన్నపదాన్ని కూడా చూపి 1. జీవనోపాయం 2. సేవ 3. వృత్తి వ్యాపారం అనే అర్థాలు ఇచ్చింది. ఈ అర్థాలు ఇక్కడ కుదరవు.
"మాయమౌఁగొన్నాళ్ళకు
మానుషకృత్యములెల్లా
మాయముగానివి దైవికమహిమలెల్లా"
కాయకములే తమ కల్పితము లన్నియును
కాయకము గాక నిల్చుఁ గమలాక్షుమన్నన"
2-242
"కాయకము లందరునుఁ గార్యపరవశులే
పాయని నీ వకారణబంధుఁడవు" 2-306

కాయగంటివాఁడు: వి. కాయగాచిన కన్నులు గలవాడు, గుడ్డికన్ను గలవాడు.
"సేయరాని చేఁతలెల్లాఁజేసితి నేను నీ
గాయకంటివాఁడ నేను గతి చూపవయ్యా"
3-111

కాయగాచు: (4) *ప.బం; అ.క్రి.* ఎక్కువగా పనిచేయడం మొ॥ వాటివల్ల చేతులు మొ॥ వాటిపై చర్మం గట్టిపడి కాయవలె ఏర్పడు. (సంతానం కలుగు)
"కాంతలచేత నిన్నిటా కాయ గావఁబోలు మేను
యెంతైనా జంకించఁడు యిచ్చగించీనందుకే"
25-305

కాయదారి: వి. శరీరధారి, ఆత్మ.
"మాయలోనఁబుట్టేది మాయలోనఁ బెరిగేది
కాయదారులకు నెల్లాఁగలిగినదే" 2-9

కాయ పండుసేయు: *ప.బం;* అ.క్రి. పనిని సఫలం చేయు.
"సేయరాని చేఁతలెల్లాఁ జేయమని యే లనేవు
కాయ పండుసేసేదానఁగాను సుమ్మీ నిన్నును"
23-122

కాయపుఁజుట్టాలు: *వి; బహు.* దేహబంధువులు, జ్ఞాతులు.
"కాయపుఁజుట్టాలే నీకుఁగలిగేరు సుమ్మీ" 9-253

కాయసిద్ధి: వి. నిత్యయౌవనం.
"నెట్టిన నంజనగాఁడై నేల దవ్వించే మనసు
అట్టే కాయసిద్ధికిఁగా నాసపడేటి మనసు" 15-280 అని శు.స. ప్రయోగం.

కాయాటు : వి. ఈ శబ్దం ఏ నిఘంటువులోనూ లేదు. పనిచేయడం ద్వారా శరీరం కాయగాయటం (?) కావచ్చు లేదా గట్టిదనం కలది అని కావచ్చు.

"గాఁటపు సతులఁబొంది కాయాటైనవానికి
యేఁటికిఁ గరఁగీ గుండె యేమి చెప్పవే" 7-241

కాయాటుది : (కాయాటు + అది) వి. 18 సం. సం.ప.న. లో 'కాయాటుది' అనే పదవివరణలో 'కాయవాటు శరీరముగలది' అనుదాని వ్యావహారిక రూపానికి సంగ్రహరూపంగా కనిపిస్తుందనీ, కాయవాటు శరీరము అనేదానికి గట్టి శరీరమని వ్యవహారముననున్నదని వివరింపబడింది. (18 సం. 429 పు.) దీన్నిబట్టి గట్టి శరీరం కలది అని అర్థం చెప్పవచ్చు.

"మాయదారికిఁగాని మాటలు నోరికి రావు
కాయాటుది గాని రతికాక కోర్వదు" 18-184

కాయాటువడు : ప.*బం; అ.క్రి.* కాయగాచు ; చూ; కాయాటు.

"కాంతలఁబెక్కులఁబొంది కాయాటుపడె నీ మేను
యెంతవడ్డైనా నలయ దిదివో నేఁడు" 21-322

కాయో పండో : ప.*బం.* పని సఫలమో, విఫలమో అనే అర్థంలో వాడబడే పలుకుబడి.

"కలికి నీవందుఁబోయి వచ్చినట్టి పొరుగువని
రేయిఁబగలు నన్ను రేసుల నేఁచిన
పాయపు విభునికిఁబరిణామా" 17-509

కాయౌత పండౌత : (కాయౌట పండౌట) పని సఫలం కావడం, కాకపోవడం.

"ఆయమంటి వేగిరించినప్పుడే తనకుఁదానె
కాయౌతా పండౌతాఁ గనీఁగాకా" 11-160

కారణము : వి. సంబంధము.

"కాచుకొని వీనికి నాకూ గారణ మేమనక
యే చోటూ నీ రూపమే హరి యెదలో
నుండఁగదే" 2-295

కారపుబొంకులు : *వి; బహు.* కటువైనబొంకులు.

"కన్నుల జంకెలు గొన్ని కారపుబొంకులు గొన్ని
నిన్నటనుండి పడేము నీచేతను" 20-257

కారపుమాట : వి. కోపపుమాట, కఠినమైనమాట, విరసపుమాట.

"పలుకులు తేనియలు పైపై నాలికకొన
నెలమిఁగారపుమాఁట లేలవూరీనే" 16-244

కారించు : స.*క్రి.* 1. బాధించు, పీడించు 2. చంపు 3. పరాభవించు (వ్యు.)

"కారించి యిందుఁమీదను కాఁకలు
చల్లఁజూచేవు
గారవపు నీ దయ కానవచ్చెఁగా" 12-7

కారింత : వి. 1. బాధ 2. చంపడం 3. పరాభవం.

"యింత యేలే నాతోఁగారింతలు నీవల్లనే పో
సంతమైతినే వో వసంతకాఁడవా" 24-217

కారింపు : వి. బాధపెట్టడం.

"కలువ లేమిటికి కారింపు లాయనే
తలపోఁత లేఁటికిఁ దరవాయనే" 24-299

కారిమారసుతుఁడు : వి. నమ్మాళ్వారు, ఇతని తండ్రి కారిమారుడు.

"కారిమార సుతుని చక్కని మాటలకుఁ జొక్కి
చూరఁగా వేదాల గుట్టు చూపినవాఁడు" 1-121

కారుకమ్ము : అ.*క్రి.* దట్టంగా వ్యాపించు .

"కారుకమ్మఁ బచ్చడము గప్పినయట్టివాఁడవు
సారె సారె సిగ్గులెల్ల జరపఁగనేరవా" 26-325

కారుకొను : అ.*క్రి.* సందడిచేయు, వ్యాపించు, కమ్ము, అతిశయించు .

"సారెనిది మా యేలికసాని వింటేనేమి యను
కారుకొన్న జాణకాఁడు గదరె నేఁడితఁడు"
26-348

కాలఁ జేతఁ బేదగు : ప.*బం.* అన్నివిధాలుగా నిర్బలుడగు.

"జాతిగాఁగర్మపుసంకెళ్లఁ బడి కాలఁ
జేతఁ బేదైతివే చిలుకా" 1-50

కాలకాసు : వి. కాలికింది కాసు, ఏమాత్రమూ విలువలేనిది.

"నాలుకరుచుల యాస నాతుల కాఁకల యాస

కాలకాసు కైన బొంకు గరపే యాస" 4-456

కాలకాసు సేయకుండు : *ప.బం; అ.క్రి.* ఏమాత్రమూ విలువచేయకుండు .

"ఏలినవారికిఁబోదు యీడేరించఁదమ సొమ్ము
కాలకాసు సేయకున్న ఘనముగాఁజేతురు "
15-33

కాలగాలము : *వి.*కలకాలము, సర్వకాలాలు, అన్నికాలాలు .

"అదనెరిగి కాలగాలమున ఆతుమ శ్రీవేంకటపతికి
పొదిగి యాతనికి శరణని కొలిచిన పొందగు ముక్తికి యిది గీలు" 4-99

కాలవేలములు : *వి; బహు.* (?)

"అంచెల శ్రీవెంకటేశుఁడనే బోయనాయఁడు
పంచఁ గాలవేలముల బలు బోయనాయఁడు "
1-460

కాలాంతకుడు : *వి.* కాలాతీతుడు.

"హరికిఁబరమేశ్వరునకును శ్రీధరునకును గాలాంతకునకును
పరమ పురుషోత్తమునకును బహుబంధదూరునకు" 1-46

కాలానుభాగి : *వి.* (?) ఆయా సమయముల యందు అనుభవమునకు భాగమైనది, ఉంపుడుకత్తె అని తాత్పర్యము కావచ్చునని సం.ప.స. (2 సం. 379 పు.)

"పతిఁ బెండ్లాడిన యాలు పక్కనుండి నిద్రించితే
కొతికి కాలానుభాగిఁ గొనవచ్చునా " 2-214

కాలిగోరఁబోలు : *ప.బం; అ.క్రి.* దీనికి నఞర్థంగానే ప్రయోగం. ఏమాత్రమూ సరిపోదు. కాలిగోరితో పోలు.

"యేల కిందువడి మొక్కే వేమి బాఁతి నే నీకు
కూళ నింతేని కాలిగోరఁబోలను" 6-170

కాలితాఁకు : *వి.* పాదతాడనం, కాలితో తన్నుట .

"తగని యెవ్వనితో కాలితాఁకులు నీ మై నుండఁగ
బిగువు నా చన్నులొత్తు బిరుసాయఁగా"
11-181

కాలినపుండ్లలోన నుప్పులు చల్లు : *వ.బం; అ.క్రి.* మిక్కుటమైన బాధ కలిగించు, గోరుచుట్టు పై రోకటిపోటు వంటిది. కాలిన పుండుమీద కారంచల్లు ఇట్టిదే.

"కప్పినఁబోవు సేఁతలు కాలినపుండ్లలోన
నుప్పులు చల్లక తలరో సతులు" 5-33

కాలిమీఁదఁగాలువేయు : *ప.బం; అ.క్రి.* అట్టహాసంగా ఉండు, పనీపాటా లేకుండా ఉండు.

"కాలిమీఁదఁగాలు వేసి కడుఁదలవంచేవు
ఆలరి కేలికిని రమ్మనె నంటావు" 9-57

కాలీఁచపడు : *అ.క్రి.* కాలు బలహీనమగు, శక్తిహీనమగు.

"కాలీఁచపడఁగ వెక్కడికి నేఁగెడిని
పాలుమాలినయట్టి ప్రాణి" 1-201

కాలుదవ్వు : *ప.బం; అ.క్రి.* ఉత్సాహపడు, పురికొను, సిద్ధమగు .

"వాలుఁగన్నుదోయి మెఱుఁగు వల్లెవేసి వేసి రతికి
కాలుదవ్వ రమణి చల్లకడవతోడను" 5-162

కాలుదువ్వు : *ప.బం; అ.క్రి.* కయ్యానికి పిలుచు, తిరస్కరించు .

"కయ్యంపుఁగూటమికిఁగాలు దువ్వుచునెంతె
కొయ్యతనమునఁ దెచ్చుకొన్నదీ వలపు " 5-74

కాలుదొక్కినది : *వి; ప.బం.* పెండ్లాడిన స్త్రీ .

"కాలు దొక్కినదానితోఁ గాఁతాళించనేఁటికి "
14-565

కాలుదొక్కినవాఁడు : *ప.బం; వి.* పెండ్లాడిన వాడు.

"కాలుదొక్కినవాఁడిట్టె కరఁగించవలెఁగాక
తాలిమితో సారె సారెఁ దలపోఁత లేఁటికే"
25-18

కాలుదొక్కు : (20) *అ.క్రి.* యువతీ యువకులు కూడుకొను, వెంబడించు, పెండ్లిలో ఆచారంగా కాలుదొక్కు, ఎదురుపడు.

"యిరవై శ్రీవెంకటేశుఁడే నలమేలుమంగను

గరిమ నన్నుఁబెండ్లాడి కాలుదొక్కి నితఁడు"
29-324

పెండ్లాడు:
"కరఁగించినవాఁడవు కాలుదొక్కితే నేమాయే
వొరయ నీ గుణము వేరొక్కటయ్యీనా"
26-357

కాలుమీఁదఁగాలువేయు: *ప.బం; అ.క్రి.* ఠీవిగా కూర్చొను.
"కాలుమీఁదఁ గాలువేసి కరగించేవు యింత
మేలా నాతోడి సమేళములు" 5-242

కాలురులు: (కాలు + ఉరులు) *వి; బహు.* కాలిబంధాలు, యమపాశాలు.
"కన నా సంసారము కడ లేని భారమౌట
కనినాఁదొలఁగరాదు కాలురులు"

కాళాంజాపె: (కాళాంజి + ఆపె) *వి.* తమ్మపడిగము పట్టెడి దాసి, తమ్మ ఉమిసెడి పాత్రను పట్టెడి దాసి.
"దంటతనమున నీపై దప్పు వేయరాదు గాక
ఇంటికాడ కాళాంజాపె కియ్యేవా విడెము"
29-456

కాళాఁజి: *వి.* రూపాం. కాళాంజి, తమ్మపడిగము, తమ్మ ఉమ్మివేసేపాత్ర.
"కుచ్చులపై నుమిసేవు కోరి నీ తమ్మరసము
నెచ్చెలిచే నే కాళాఁజి నేఁబట్టఁగా" 8-239

కాళాంజి: *వి.* తమ్మపడిగము, ఉమ్మివేయు పాత్ర. రూపాం. కాళంజి.
"అమరాధిపులిడుఁడాలవట్టములు
కమలజ పట్టుము కాళాంజి" 1-12

కాళాంజిముదిత: *వి.*తమ్మపడిగము (తమ్మఉమిసెడి పాత్ర) పట్టెడి స్త్రీ.
"ముచ్చట నా కాళాంజిముదితఁ గాఁగిలించితి
వచ్చుగా నే రత్నపుగోడావలఁ గంటి" 10-2-91

కాళిక: *వి.* నల్లదనం.
"అంచలఁబరుసము లోహపుఁగాళికలనెల్ల
యెంచీనాఁ బసిఁడి గావించుఁగాక" 2-168

కాళ్ళాడు: (కాళ్లు + ఆడు) *ప.బం; అ.క్రి.* వెళ్ళుటకు మనసొప్పు.
"యీకడనేఁ జూడఁగానే యించుకంత దయలేక
కైకొని తోసి విచ్చేయఁగాళ్ళెట్లాడెరా" 11-249

కావరము: *వి.* 1. గర్వం, మదం 2. కొవ్వు.
"దైవమా నీ మాయ తలమొలెఱఁగనీదు
కావరపువిషయాల కట్లు వదలవు" 2-4
"కావరపు వనితలు" 25-286 "కావరపు జీవుఁడు" 26-578

కావరించు: (39) *అ.క్రి.* గర్వించు, మదించు, పొగరెక్కు, కావరం కలవాడగు.
"భావించ నింతి నీ పాలిటి దేవరాయనా
కావరించి మాట కతి కడవఁగఁజాలవు" 26-578

కావలించు: *స.క్రి.* 'కౌగిలించు'కు వ్యావహారికరూపం. ఈ అర్థంలో కౌగిలించు, కాఁగలించు, కాఁగిలించు అనే రూపాలను కూడా అన్నమయ్య ప్రయోగించినాడు.
"కావలించి నీ వేల కాఁతాళించేవే" 27-260

కావలికాఁడు: (కావలి + కాఁడు) రక్షకుడు.
"గాములు వారెడి పొద్దు కావలికాండ్లాల
జాము జాము దిరుగరో జాలి" 4-166

కావించు: *స.క్రి.* 'ఎఱుపుచేయు' కావచ్చు.
"చేవ దేరే నీ మోవి శ్రీవెంకటేఁశుడు నాఁడు
కావించి పచ్చడమిట్టె కప్పుకొంటిరి" 22-453

కావిరి: (6) *వి.* 1. నలుపు 2. పొగవంటి నల్లని పదార్థం.
"కావిరితో నీవెంత కాఁకదేరఁజూచినాను
మూవంకఁదమకమే ముంచీ నాకు" 11-573
"వేవేలు రతులచేత వెలయఁగా దిక్కులెల్ల
కావిరిమాని హృదయకమలము నించెను"
8-282
"శ్రీవెంకటేశుఁడే చెనకకవుండితేను
కావిరిఁగాఁగిలించేది గయ్యాళి గాదా" 14-550

కావిరినది: *వి.* 'కావేరినది'కి వ్యావహారికరూపం.
"దేవేంద్రసంపద దిక్కులకెక్కుడు

కావిరినది యొక కాలముది" 3-292

కావిరెక్కబొల్లిపిట్ట : *వి.* ఎరుపురెక్కల తెల్లనిపిట్ట.

"కావరపుఁబెనుఁబాము గట్టుమీఁద నెక్కి

కావిరెక్క బొల్లిపిట్టఁగైకొని యెక్కి" 17-230

కాశ: *వి.* 'కాసె'కు వ్యావహారికరూపం; 1. కాసెకోక, దట్టి 2. కచ్ఛభేదం, కుచ్చెల.

"తూపుచేత నంటితేనె తుత్తుమురై పారుదురు

రాపు నీలికాశ గంటే రణభీతి గొందురు" 3-186

"కుందనపు కాశతోడి గోవిందుఁడితఁడు

విందుల రేపల్లె గోవిందుఁడితఁడు" 4-180

కాశవోయు : (కాశ + పోయు) 'కాశెపోయు'కు వ్యావహారిక రూపం; వస్త్రాన్ని గోచివలె వెనుకకు చెక్కు.

"చెలఁగి తాఁగట్టినది చెంగావిదుప్పటియు

నిలువుగాశ వోయుటే నీ కానవాలు" 17-375

కాసుకునుఁగొరగాని : *ప.బం; విణ.* ఎందుకూ పనికిరాని.

"కాసుకునుఁగొరగాని గతిలేని పనికిఁ

గాలూద నీవేల కర్మమా" 5-187

కాసుచే(సే)యని పని : (8) *ప.బం; వి.* పనికిరానిపని, నిష్ప్రయోజనమైన పని.

"వోసరించి యెడ లేని వొట్టులు వెట్టుకోనేల

కాసుచేయని పనికి కల్లలాడేనా" 18-515

కాసుచేయు : *ప.బం; అ.క్రి.* పనికివచ్చు, ప్రయోజనకరమగు. దీనికి నఞర్థంలోనే ప్రయోగం.

"యీసునను నీవలన నెక్కువ కులములెల్ల

కాసుసేయకపోయెఁ గలికాలమా" 4 అను. 77

కాసువీసపుబ్రదుకు : *ప.బం; వి.* కొద్దిపాటి మాత్రమే విలువగల బ్రదుకు, అంతగా విలువ లేని బ్రదుకు.

"కల్లలోని బ్రదుకు కాసువీసపుబ్రదుకు

కల్లరిప్రాణాలు నమ్మి కట్టువీడెను" 4-460

కాసువీసము : *వి.* కొద్దిపాటి. (డబ్బు)

"రాసికెక్క యిందరిని రక్షించే దేవుఁడె

కాసువీసములపాటి కావ నోపఁడా" 10-1-42

కాసువీసములు : *ప.బం; బహు.* ఏ కొంతో డబ్బు. కాసు, వీసము అనేవి కొద్ది విలువగల నాణాలు. అధికము సారంగ. 119 పు.

"వేసదారి వనితలు వెంగెము లప్పటిఁజూపి

కాసువీసములకుఁగా గరగింతురు" 18-201

కాసుసేయు : *ప.బం; అ.క్రి.* పనికివచ్చు - దీనికి నఞర్థంలోనే ప్రయోగం.

"యీసునను నీవలన నెక్కువ కులములెల్ల

కాసుసేయక పోయెఁ గలికాలమా" 4 అను.77

కి

కింకపుకిసరు : *వి.* దృష్టిదోషం, రోగవిశేషం.

"కింకపుకిసరుచేత కీడైన దేహము

వంకవంక తెరువుల వడిసీని" 1-305

కింకము : ఈ శబ్దం నిఘంటువుల్లో కానరాదు. 'కింక' కు రూపాంతరమా? కింక (కిన్క) అంటే కోపం.

"కింకపు కిసరుచేత కీడైన దేహము

వంకవంక తెరువుల వడిసీని" 1-305

కింకరవర్తి : *వి.* కైంకర్యము (=సేవ) నందుండువాడు, కైంకర్యవర్తి అనడానికి కింకరవర్తి అనడం విలక్షణం. ధర్మవాచకానికి బదులు ధర్మివాచకం ప్రయోగింప బడిందన్నమాట. ఇట్టి ప్రయోగాలు అన్నమయ్య భాషలో సహజమే. సంపాదకులు ఈ పదానికి "కింకరాః ఇవ వర్తంతే ఇతి కింకరవర్తినః (కింకరులవలె నుండువారు కింకరవర్తులు) అని అర్థాన్ని ఊహించినారు. కాని ఈ సమాసం సాధ్యమా?

"కెలన మరియు నీ కింకరవర్తులు

తెలిసిన బ్రహ్మాదిదేవతలు" 3-581

కింకురువాణపుగెలుపు : *వి.* కింకరుల గెలుపు, సేవకుల గెలుపు. (కింకుర్వాణ = కింకురువాణ) కింకుర్వాణుడు =సేవకుడు, ఏమి చేయాలని విచారించేవాడు.

"వేంకటపతిఁదడవినదాఁక యీ

కింకురువాణపు గెలుపే సుఖము" 1-212

కిందిమీఁది పనులు : *ప.బం; బహు.* తలకిందులగు పనులు.

"క్రియ గూడె నిన్నిటాను కిందిమీది పనులెల్లా
జయమాయ మా యింటికి సరుగ రావయ్యా" 13-6

కిందుమీఁదగు : *ప.బం; అ.క్రి.* తలకిందగు, వ్యత్యస్తమగు.

"మనసున నెంచ నవే మఱఁగుల తెర ఆయ
ననుపు కిందుమీఁదాయ నవ్వు లేటికయ్య" 25-292

కిందుమీఁదుసేయు : *వ.బం; స.క్రి.* తలకిందులు చేయు.

"క్రియగూడ నిన్నుఁ గిందుమీఁదు సేసీ
ప్రియురాలిఁజూడు బీరాలు" 25-265

కిందెడు మీదెడు : కిందికి దిగినవి, మీదికి ఎక్కినవి (సంపా.)

"కోరి శ్రీవెంకటపతి కుక్షిలోనే లోకములు
ఆరయఁగిందెడు మీఁదెడై వున్నవి" 3-14

కిందేడు మీఁదేడు : *ప.బం;* వి. కింది ఏడు లోకాలు, మీది ఏడు లోకాలు. పూ.ము.

"కోరి శ్రీవెంకటపతి కుక్షిలోనే లోకములు
ఆరయఁ గిందేడు మీఁదెడై వున్నవింతే" 3-14

కిక్కిరించు : *స.క్రి.* 'కిక్కురించు'కు వ్యావహారికరూపం కావచ్చు. 'కిక్కురించు' అంటే 1. మోసగించు, వంచించు 2. ఓడించు, జయించు, పోగొట్టు ; *అ.క్రి.* తప్పించుకొని తిరుగు, నక్కినక్కి తిరుగు అని అర్థాలు. (తె.వ్యు.కో.) రూపాం. కికురించు = లాలనచేయు అని ఆం.ధా.మా.

"కిక్కిరించిన యాసలఁ గిందవేసి మోక్షము
నిక్కినిక్కి చూచేవారు నీ దాసులు" 1-493

"చుక్కలు మోవిఁబొడమె చూపులు గెంపు దడమె
కిక్కిరించిన కళలు గిజ్జిడిగొను" 12-389

"తక్కిన నా తమకము తనపైఁబొలియఁగాను
కిక్కిరించి నాపై దయ కెరలునే కదవే" 28-327

కిగ్గాడి : *విశే.* అల్పమైన, నీచమైన, పనికిమాలిన, సోమరి (వి. 1. కొరగానివాడు 2. సోమరి 3. అంబేద)

"కిగ్గాడి గుర్రాలు" 8-135

కిచ్చు : వి. 'చిచ్చు'నకు కన్నడరూపం. (సం.ప.స. 13 వాల్యూం. 3.పు.) నిప్పు.

"మెచ్చులుగ దడిబెముమీఁద నుంటే నే మాయ
కిచ్చు రేఁగి ముట్టి తమకించకుండఁగలవా" 13-66

కిటుకులాఁడి : (కిటుకులు + ఆఁడి) వి. మోసకత్తె, అకార్యాలు చేసే స్త్రీ.

"అటుగాని వుత్తమురాలైనది వోజతో నుండు
కిటుకులాఁడైనది కిందుపడి మెలఁగు" 7-255

కిట్టు : (5) *స.క్రి.* 1. సమీపించు, కదియు, చేరు 2. కవియు, తాకు 3. చంపు 4. సరిపెట్టు కొను (తె.వ్యు.కో.) అనుకూలించు (ఆం.ధా.మా.) సమీపించు, కదియు.

"కిట్టి శ్రీవెంకటేశుఁ గాఁగిలింతురటే
వొట్టుపెట్టుకున్నదాన వూరకే వుండుటగాక" 26-366

"బట్టబయ లీఁదేనని పంతము నీ కింత గత్తే
కిట్టి నా నడుము పిడికిటఁబట్టరాదా" 26-269

కితకుఁడు : *విశే.* 'కృతకుడు' అనే శబ్దానికి వికృతిరూపం కావచ్చు. కపటి.

"మతిలో వెత లేకుంటే మాననీ దీనిపట్టుకు
కితకుఁడవనే అపకీరితైనాఁ బుట్టదా" 7-430

ఈ పదం కితవుడైనా కావచ్చు. కితవుడంటే జూదరి, మోసగాడని అర్థం. పాఠం కోసం రేకులు చూడాలి.

కిన్నరమీంట్ల యాపె : వి. వీణను మీటే స్త్రీ.

"కిన్నరమీంట్ల యాపె గిలిగింతలు సేయఁగా
చిన్నదాన నాపై నేల చెయి చాచేవయ్యా" 7-161

కిన్నరమీటు : వి. వీణను మీటడం.

కిన్నెరకాయ : (4) వి. వీణకు బిగించే పెద్ద

ఎండుసొరకాయ, తుంబీఫలం. (కిన్నెర = ఒకవిధమైన వీణ)

"వెన్నెలతేటలు చూచి విసుగుచు వెళ్ళఁజల్లీ

కిన్నెరకాయల ముంచి కిమ్ములకును " 7-422

కిమ్ములన్ : (4) మాం. 'లోలోపలనే' అనే అర్థంలో 'కిమ్ములనే' అని నేటికీ వ్యవహారంలో ఉన్నదనీ, మెల్లగ, నిదానంగ, గుట్టుగ, రహస్యంగ కావచ్చునని సం.ప.స. (16 సం; పు. 427)

"కిమ్ములఁ దా నన్నీ నెరిగినని వున్నదాన

యెమ్మె లితరులవలె నెచ్చరించదు " 16-220

అన్ని ప్రయోగాల్లో 'కిమ్ముల(న్) అనే పదానికి పైన చూపిన అర్థాలు సమంజసంగానే ఉన్నాయి. ఐతే 15 వ సంపుటం పీఠికలో "కిమ్ముల విషయ కింకరుడై తా, నమ్ముడు వోయె నందులకే" అనే కీర్తనలోని కిమ్ము (కిము) శబ్దానికి సంకల్పమనే అర్థం సూచింపబడింది. 'కిమ్ము' అనే పదానికి విడిగా ఎక్కడా ప్రయోగం కనబడకపోవటం వల్లా, ప్రయోగాలన్నింటిలోనూ 'కిమ్ములన్' అనే ఉండటం వల్లా కిమ్ము అనే శబ్దాన్ని కాక 'కిమ్ములన్' అనే పదాన్ని గ్రహించడమే యుక్తంగా కనిపిస్తుంది. 'కిమ్ము' అనే పదానికి ప్రీతి అనే అర్థం సూ.ని.లో చూపబడింది.

"కిమ్ముల సిగ్గులు" 23-426

"కిమ్ముల యిల్లాలు" 12-27

మొదలైన చోట్ల ప్రీతిగల ఇల్లాలు అనే అర్థం చెప్పుకోవచ్చు.

కిమ్ముల సిగ్గులు : వి; బహు. ప్రేమతో కూడిన సిగ్గులు.

"కమ్ము శ్రీవెంకటేశుఁడ కాఁగిలింపించుకొంటివి

కిమ్ముల సిగ్గు లెంతేసి కెరలించితివో" 23-426

కిరుదు : విశ. తక్కువ, అల్పం, నీచం.

"ఘనమేమి కిరుదేమి కలవెల్లా నీ

తనువుగఁ దెలిసిన తత్త్వజ్ఞానికి" 10-48

"కిరుదురకం, దానికంటె ఇది కిరుదు " అనే మాండలిక ప్రయోగాల్లో పై అర్థమే కనిపిస్తుంది.

(చూ.అ.సం.సా.రా.సీ.మాం - పుట 21)

కిసరు[1] : అ.క్రి. పగగొను.

"నొసలెల్లఁ జెమరించి నున్నని చెక్కులఁజారె

కిసరి యెవ్వతె యలిగెనో నీతోను " 11-401

"ఉదుటున నడచిన వూర్పులు గిసరెను

యెదుటఁ జెలు లతని కే మనిరో" 24-138

కిసరు[2] : వి; మాం. 1. దృష్టిదోషం, అంటుసోకటం వల్ల పసిపిల్లలకు కలిగే దోషం (2. కోపవికారం, చూపోపమి, కనుకుట్టు) విశ. వాడి, పదను.

"సరసములాడె నాతో నటలెల్లా విడిచెను

కెరలెను నా మోహము కిసరు విడిచెనే" 21-390

"కింకల మాటలలోని కిసరులు మీ

వుంకువకాఁకలలోని వుసురులు" 7-296

వాడి, పదను :

"కిసరు కనుగొనల జంకెనలు విరసంబులా

రసము లొలికెడి మనోరతులు గాక" 5-126

కిసుకాటము : వి. కిసుక కృషిశబ్దభవం. మోటుతనం అని సం.ప.స. (14 సం. 349 పు.)

"అసు(స) దైవుండిన కన్నె నాదరింతురుగాక

కిసుకాటపురతుల గిజిబిజి సేతురా" 14-148

కీ

కీఁగన్ను : వి. 'కీఁగన్ను'కు వ్యావహారిక రూపం. కడగన్ను, కటాక్షం.

"కేరికేరి నవ్వేవు క్రీఁగండ్లఁజూచుకొంటా

యేరా లేదటరా యీమాట నీవు" 11-379

కీరితి : వి. 'కీర్తి'కి వికృతి రూపం.

కీరితి కట్టుకొను : అ.క్రి. కీర్తిని పొందు.

"కట్టుకో శ్రీవెంకటేశ కడుఁగీరితెల్లా నీది " 27-28

కీర్తనకెక్కు : ప.బం; అ.క్రి. ప్రసిద్ధికెక్కు.

"నిరతి శ్రీవెంకటేశ నీ కాఁగిటి లోపల

గరిమఁ గీర్తనకెక్కె కాంతసింగారములు " 26-363

కీలుగంటు : వి. కేశబంధవిశేషం, జారుముడి.

"ముదిత కురులనెల్లా ముత్యములు మాణికాలు
గుదిగుచ్చి కీలుగంటు గొన్నది" 9-79

కీలువట్టుకున్న యాపె : వి. పత్ని, పాణిగ్రహణం చేసిన స్త్రీ, పెండ్లాడిన స్త్రీ.
"కీలువట్టుకున్నయాపె కిలకిల నవ్వఁగాను
మూలనున్నయాపె తోడ ముచ్చటాడేవు"
26-561

కీస : వి. తక్కువ, అల్పం, కొంచెం .
"కగ్గులేనిదానికి కైవశమౌ బనులెల్లా
కిగ్గాడిదానికిఁ గద్దా కీసకాట్లు" 27-420

కు

కుంకుమగోళ్ళు : వి; బహు. ఎరుపురంగు గోళ్ళు.
"కుంకుమగోళ్ళతోడ కోరదౌడలతోడ
అంకెల రవిచంద్రనయనములతో
తెంకినసురలఁ గొట్టి ...." 4-157

కుంకుమరసాలు : వి; బహు. కుంకుమ కలిసిన నీటిబిందువులు.
"చలిమి బలిమిఁగూడే జంటలమీ చెనకులు
కొలఁది మీర జారీఁ గుంకుమరసాలు" 22-426
"గొప్పలైన చన్నులపై కుంకుమరసాలు గారీ
వొప్పుగ నీ జవ్వనాన సోలలాడె నటవే" 22-383

కుంచ : వి. 'కుంచె'కు వ్యావహారికరూపం. క. కుంచ, ఒక విధమైన చామరం, చమరీ మృగం వంటి మృగముయొక్క కుంచెవంటి తోక.
"చన్నులు గదలఁగాను సారెఁగుంచ విసరఁగా
నిన్నుఁజూచి కరఁగీని నివ్వెఅగ్గై యాతడు"
12-227

కుంచది : (కుంచె + అది) వి. కుంచెది, చామరం వీచే స్త్రీ.
"వొద్దనె నా కుంచదాని నొగిఁదోఁటలోఁ గూడఁగా
నిద్దపుఁ గేళాకూళి నీటిలోఁ గంటి" 10-2-91

కుంచము¹ : వి. కుంచె, చామరం.
"పుక్కిటి తమ్ములము గొబ్బున నీమైఁ జెదరఁగా
మిక్కిలి నవ్వఁ గుంచమే కాని విసరుచు" 25-52

కుంచము² : వి. మానవిశేషం.
"చేరికొల్చిన వారికిఁ జేపట్టుఁగుంచమవు
కోరి నుతించినవారి కొంగుపైఁడివి" 2-173

కుంచవేయు : (7) ప.బం; అ.క్రి. కుంచె విసరు, చామరం విసరు.
"చివ్వన రతికిఁ జెరగువట్టేయప్పుడు
నివ్వటిల్లఁ గుంచవేసి నీ వెంట రావా" 16-170

కుంచె : వి. చామరం.

కుంచెది : (కుంచె + అది) కుంచెతో విసరే స్త్రీ.
"అంటే నీ మాఁటలకు అడ్డమాడరాదు గాక
నంటునఁ గుంచెదానితో నవ్వవా నీవు" 29-456

కుంచెవేయు : (3) అ.క్రి. వింజామర వీచు.
"కోరి సిగ్గుపడి యాపె కుంచెవేయ వచ్చితేను
సారెకుఁబోకముడి జారించవా యపుడు"
7-1123

కుంచెవేసే ఆపె : వి. వింజామర విసరే స్త్రీ.
"కొద్ది మీర నది చూచి కుంచెవేసే ఆపె వచ్చి
వద్ద కూచుండుమనుచు వొడివట్టేవు" 7-171

కుంచెవేసేయట్టి యాపె : వి. వింజామర విసిరే స్త్రీ.
"కుంచెవేసేయట్టి యాపె కుచ్చలమీఁది మోచేత
అంచల నూదుకొనేవు ఆయాలుసోక" 7-117

కుందణపుఁగుత్తిక : వి. బంగారు కుత్తుక, మంచికుత్తుక.
"కుందణపుఁగుత్తికలో కునుకులే కతలైతే
పందెపురతులకివి పచ్చియై నిలువవా" 24-21

కుందణపు మేడ : వి. బంగారుమేడ.
"కుందణపు మేడలోన గూచుండి నవ్వు నవ్వి
అందుకొనీ వేడుకతో నౌభళేశుఁడు" 29-190

కుందణము : వి. కుందనము, బంగారము. ఇట 'ణ' కారప్రయోగం కన్నడప్రభావంవల్ల కావచ్చు.
"పురిగొన్న మదనాగ్ని పుటము దాఁకిన వలన
తరుణి దేహంబు కుందణమువలె నాయ"
5-237

కుందు : వి. తక్కువ, న్యూనత.
"ఇందుకే పో వెరగయ్యీ నేమందును
కుందు లేని నీ మహిమ కొనియాడఁగలనా "
2-31

కుంభిణీరమణుఁడు : వి. రాజు, ప్రభువు ; వ్యు. కుంభిని (= భూమి) కి రమణుఁడు (= భర్త) కుంభిని లోని 'న'కారం ణకారంగా మారడం విలక్షణం.
"ఆ రీతి శ్రీవెంకటేశుఁడలమేలుమంగఁ గూడి
కోరిన వరము లిచ్చీఁ గుంభిణీరమణుఁడు "
13-385

కుంభీపాతకము : వి. (?) కుంభీపాకము కావచ్చు. నరకవిశేషము.
"కడుఁగుంభీపాతకంబులు గొనరో
బడిబడినమ్మీఁ బాలిండ్ల" 1-42

కుక్కకాటుఁజెప్పుటేటు : ప.బం; వి. చెడుగుకు బదులు చెడుగే చేయడం (కుక్క కాటుకు చెప్పుదెబ్బ అని వాచ్యార్థం) చెప్పు + ఏటు అనే చోట టుగాగమం రావడం విలక్షణం.
"యెక్కువైన తిరువెంకటేశునిఁ దలఁచలేక
కుక్కకాటుఁ జెప్పుటేటై కూడె నిన్ని రోతలు "
1-206

కుక్కనోరి కళాసమగు : ప.బం; వి. పాడగు, భ్రష్టమగు. (కుక్కనోటి తోలు అగు అని వాచ్యార్థం)
"అక్కడ నా పాట్లువడి యిక్కడ నీ పాటుపడి
కుక్కనోరి కళాసమై కొల్లఁబోయ బతుకు " 1-90

కుక్కిమంచము : వి. తాళ్లు వదులై పల్లమైన మంచము.
"కలది కుక్కి మంచము కన్నవారెల్లాఁ బండేరు
తలెతో దొగ్గి నంబలి దావకూళ్లు" 1-370

కుక్షిఁబెట్టిపెంచు : ప.బం; అతి జాగ్రత్తగా పోషించు.
"నానాటికి నికేమి నమ్మితి మనేదేమి
పేని మమ్ముఁదన కుక్షిఁ బెట్టి పెంచఁగాను "
8-252

కుచ్చలు : (3) వి. 'కుచ్చెల'కు వ్యావహారికరూపం. 1. పింజె, మడత 2. పావడ, గాగర 3. పిడుకలు చొప్ప మొ॥ వాని ప్రోగు, రాశి.
"సంగతాయఁ గుచ్చలంటా సరుగ నొడివట్టేవు
చెంగటఁ గాకుసేతురా చెలువలను" 19-286
"అలమేల్మంగ పులకలంగమున నుబ్బఁగాను
బలిమిఁగుచ్చల జారి పచ్చిదేరెను" 7-388

కుచ్చితము : వి. 'కుత్సితము'నకు వ్యావహారికరూపం. నీచము, అల్పము, కాపట్యం, కౌటిల్యం, త. కుచ్చితమ్.
"వచ్చి వచ్చి నీతో వావులు చెప్పఁగా
కుచ్చితము లేమిటికి కోమలితోను " 13-131
విణ. నీచము, అల్పము, కపటము, కుటిలము
"పచ్చిదేరే మాఁటలూ బయలీఁతమాటలూ
కుచ్చితపు వెంగేల కొనమాటలూ" 13-391

కుచ్చితురాలు : (కుచ్చిత + ఆలు) కుత్సితురాలు, నికృష్టురాలు, నీచురాలు.
"ఏమి నేరుచుకొంటివే యెంత కుచ్చితురాలవే
జామువోయినా మానవు చలమే సాదించేవు "
11-324

కుచ్చు : స.క్రి. కూర్చు, చేర్చు, జతచేయు, ప్రియపడు (కోరుచు రూ.కుచ్చు)
"కూడినాడు సంతోసాన కుచ్చి నా కౌఁగిట
నేఁడు
కుచ్చి కౌఁగిలించుకుంటే గుఱుతులౌ (గాఁక)"
18-360
"కుచ్చి శ్రీవెంకటేశుఁడ గురుతేది అట్లైతే
యిచ్చఁగూడితివి గురుతెటు చూపవచ్చురా"
7-230
"యివ్వల శ్రీవెంకటేశ యింతినిట్టె కూడితివి
కువ్వని పేరై నీకు గురుతాయ నదివో" 14-430

కుచ్చుఁబులకల పూజ : వి. అయిరేణి కుండల పూజ, వివాహ సమయంలో ఐరేణి కుండలను ఐదురంగులతో అలంకరించి పంచవల్లవాదులు నింపి పూజ చేస్తారు.

కుటిలకుంతలి : వి. వంకర ముంగురులు గల స్త్రీ.

"ఇటువలెనుండు భాగ్యమేమని చెప్పఁగవచ్చు
కుటిలకుంతలి నిన్నుఁగోరి దక్కఁగొనెను"
28-461

కుటిలాలకి : వి. 'కుటిలాలక' సాధురూపం. వంకర ముంగురులు గల స్త్రీ.
"కుటిలాలకి మైఁబూసిన కుంకుమగంధపు రసములు
చిటిపొటి చెమటలఁ బెనఁగొని చిప్పిలి రాలఁగను" 5-79

కుట్టిచాతనివారు : వి; బహు. సం.ప.స. (2 వ సంపుటం) లో ఈ పదానికి పరిష్కర్తలు చేసిన వివరణం ఇట్లున్నది. "కుట్టిచాతనివారికి = తక్కువజాతి సాతానివారికి కావచ్చునేమో? లేక కుట్టి సైతాన్ అను క్షుద్రప్రయోగము చేయువారు కావచ్చు. మొదటి అర్థములో కుట్టిశబ్దము వట్టి విశేషణము మాత్రమే. 'చాత్తాదె' అనుపదము చాతాని, సాతాని అని వ్యవహారములో నున్నది. అది 'చాతని' అను ధాతుజ విశేషణముగ ప్రయోగించినట్లు ఊహింపవచ్చును. జాతితో తక్కువ వాడునై వైష్ణవము పుచ్చుకొన్న బిగువుతో అందరియొద్ద జంకుగొంకు లేక తిరుగువాడని తాత్పర్యార్థము కావచ్చు. కుట్టిసైతాన్ అను క్షుద్రప్రయోగము చేయువాడు కూడ తానూ పెద్ద మంత్రశాస్త్రవేత్తవలె అందరివద్ద జంకుగొంకు లేక తిరుగువాడు అను తాత్పర్యార్థము కూడ సరిపోవుచున్నది. ఈ రెండును పాటలోని ప్రధాన భావమునకు సరిపడుటలేదు" (సం.ప.స. 2 సం. 380 పు.)
"పట్టిన ముద్రుంగరపు ప్రధానికెదురులేదు
కుట్టిచాతనివారికిఁ గొంకు లేదు" 2-237

కుడిచికట్టు : ప.బం; అ.క్రి. జీవిక గడపు.
"పుడమికాధారము పురుషోత్తముఁడే
కుడిచి కట్టెడివారు కోటానఁగోటి" 4-183

కుడుపు : వి. 1. భోజనం 2. భోజనపదార్థం 3. జీవిక 4. విందు.
"సడిఁబడి కుడిచిన కుడుపెల్ల నినుము
గుడిచిన నీరై కొల్లఁబోయె" 1-124

కుత : వి. 'కుతి'కి వ్యావహారికరూపం కావచ్చు. 1. కోరిక 2. కస్తి 3. కుతిలపాటు.
"సతిలేని వానికి జరిగినదే యాలు
కుత దీరుటకు రచ్చకొట్టమే యిల్లు" 2-63
"ఇతరులయ్యాతని కిచ్చకము లాడితేను
కుత దీర మిమ్ము నిట్టె కోపించ నేలే" 20-369

కుతిలకుడుచు : (2) ప.బం; అ.క్రి. బాధపడు, కుతిలపడు.
"కుతిలగతి సేసె అటు గాడిద గూసె
కుతిలకుడిచి జనకుఁడు నోరుమూసె" 5-361

కుతిలపడు : ప.బం; అ.క్రి. బాధపడు, దుఃఖపడు, కాంతిహీనమగు.
"కుతిలపడు శూద్రకుని గొట్టెముచ్చుగఁజేసె
మతిమాలు కురురాజు మడుగు చొరఁజేసె"
5-760

కుతిలము : (4) వి. బాధ, దుఃఖం.
"కుతిలములును దారుణములును తృణీ
కృతములు సేయఁగ గుఱు తొకటే" 1-285

కుత్తిక : (9) వి. 'కుత్తుక'కు వ్యావహారిక రూపం. అన్నమయ్య కుత్తిక, కుత్తికె, కుత్తుక అనే మూడు రూపాలనూ వాడినాడు. కుత్తుక ప్రయోగం విరళం.
"పెదవినెత్తురు పేర్చి పెనుగోళ్ళఁజించుకొంటా
కొదలు గుత్తికలనుఁ గూసేరు జీవులు" 3-494

కుత్తికలోన పావురములు : ప.బం; వి. రతికాలంలోని కంఠస్వరం (?)
"మిగుల రతివేళను మెరసేఁదా మిన్నిటాను
పగటుఁ గుత్తికలోన పావురములు" 7-520 old

కుత్తికె : వి. 'కుత్తుక'కు వ్యావహారికరూపం.
"ఆనకమై నవ్వవేమె అంగన నీ నగవులు
వూని నీ కుత్తికెలోన వుక్కిపోవుఁజుమ్మీ" 9-26

కుత్తుక : వి. గొంతు, చూ :- కుత్తిక, కుత్తికె.
"బత్తి గలవానివలె ప్రాణము వోయినదాఁకా
కుత్తుక బిగించె నిట్టి కొత్త లెందుఁగలవా" 6-60

కుదురువంటి కైదువ : వి. చక్రము. (గుండ్రని

ఆయుధం అని వ్యు.)

"కొక్కరవంటి సంకము కుదురువంటి కైదువ
అక్కమీఁదికొక పూస అబ్బేఁదనకు" 27-393

కుదువు: వి. తాకట్టు (కుదువ అని తెలంగాణా వ్యవహారం.) శ.ర. లోను, బ్రౌన్ లోనూ కుదువ అనే పదమే ఉంది. కుదువు అనేది రా.సీ. వ్యవహారం కావచ్చు.

"వాడుక ఇంతికి కుదువుగా నన్నుండమనేవు
కూడి వాని విడిపించుకొనగ వసమా" 7-455

కుప్ప: వి. పోగు, రాశి.

"కుప్పగాఁ గుచ్చెల ఎడఁగొంగువట్టి తీసితేను
కొప్పు నెరులఁజెలి మైఁ గప్పుకొనెను" 17-176

"యీడుజోడై జుట్టరి కాలెనసినవారు తాము
కూడిమాడి వుండినదే గురుతులు గాక" 28-15

కుప్పలుఁదెప్పలు: (4) ప.బం; బహు. సమృద్ధి, ధారాళము, అసంఖ్యాకములు.

"కొమరెపాయమందుపై కుప్పలు దెప్పలు వాయ
ఇమడక వుపచారా లేమి సేతమే" 27-596

కుప్పలుగా గురియు: ప.బం; అ.క్రి. ఎక్కువగా కురియు.

"హృదయము జిల్లని కుప్పలుగాఁ గురిసీఁ
జెమ్మటా" 6-179

కుప్పళించు: అ.క్రి. కుప్పించు. కుప్పళించి ఎగిరాడు అని నేటికీ వాడుక. ఎగిరేటప్పుడు, దూకేటప్పుడు కుప్పళించి అనడం ఉంది అని అ.సం.సా.రా.మాం. (పుట.70)

"కుప్పళించెఁ దమకము కోరికలు దైవారె
నెప్పున శ్రీవెంకటేశ నీవు గూడఁగాను" 23-244

కుప్పవడు: అ.క్రి. కుప్పగా చేరు, సమూహంగా ఏర్పడు, రాసులు పడు.

"కుప్పవడ్డ యలకలు కుమ్మరింపుఁజెమటలు
చిప్పిలు మోవితేనెలు సేనాసేన" 19-479

కుప్పవెట్టు: స.క్రి. రాసులుపోయు.

"ఇచ్చకురాలవు నాకు నితఁడు విడెమియ్యఁగా
కొచ్చికొచ్చి వెంగెములే కుప్పవెట్టేవు" 25-201

కుప్పె: వి. కుప్పియ, గొడుగుమీదిగుబ్బ, బొగడ, సవరానికి ఉండే గ్రంథి, శిరోభూషణం, గాజుగిన్నె, బిరడా, కత్తి ఒర చివరి తొడుగు, ఎద్దు మొ॥ వాటి కొమ్ములకు తగిలించే ఇత్తడి మొ॥ వాటితో చేసిన గుబ్బ, మందుగుళిక.

"యెప్పుడు నీ మనసులో నింతిని మఱవకుండా
కుప్పెలువంటి చన్నులు గుఱుతుచూచుకో"
24-589

కుప్పెకటారము: వి. చివర అమర్చిన తొడుగు గల కత్తి. రూపాం. కుప్పె కటారము.

"ఇప్పుడు శ్రీవెంకటాద్రి నిరవై శంఖుచక్రాలు
కుప్పెకటారముఁ బట్టె గోవిందరాజు" 12-470

కుప్పెసవరము: (8) వి. మూలభాగంలో ఉండే ముడితో గూడిన సవరం, స్త్రీలు దీన్ని తమ శిరోజాలతో కలిపి కొప్పు వేసుకుంటారు.

"కొప్పు వట్టే వది యేమి గుట్టున నన్ను నీ
కుప్పె సవరమున్నదా కొయ్యకాఁడవు" 13-481

కుమారధార: వి. తిరుమలకొండపై గల తీర్థాలలో ఒకటి. కుమారస్వామి తారకాసురుణ్ణి చంపి పాపవిమోచనం కోసం తండ్రిని సలహా అడగగా శివుడు వేంకటాద్రికి వెళ్ళి అక్కడ పుణ్యతీర్థంలో స్నానం చేసి స్వామిని దర్శించుకొమ్మని సలహా ఇచ్చినాడట. అప్పుడు కుమారస్వామి తిరుమలకు వచ్చి ఆ తీర్థంలో స్నానం చేసి స్వామిమంత్రాన్ని జపిస్తూ తపస్సు చేయగా స్వామి ప్రత్యక్షమై నీ వీ పుణ్యతీర్థంలో స్నానంచేసి నా మంత్రాన్ని జపం చేసినందువల్ల ఈ తీర్థానికి నీ పేరు వచ్చేట్లుగా "కుమారధార" అనే పేరుతో పిలువబడుతుందని చెప్పి మాయమైనాడట. అప్పటినుండి ఈ తీర్థాన్ని కుమారధార అనే పేరుతో పిలుస్తున్నారని చెపుతారు.

"తా మహిఁ గోరికలిచ్చుఁ గుమారధారయు
పాండవసరసీ" 15 అను. 460

కుమ్మ: (?)

"ఆవల నీవల నోరఁ గుమ్మలుగ
నాడుద మీతనిఁ బాడుదము" 3-332

కుమ్మరదాసుడు: వి. శ్రీవెంకటేశ్వరస్వామి

భక్తుడు. ఇతని పేరు కురువరత నంబి. "కురుమ్బరుత్త నంబి అని సంప్రదాయ అకారాది అను ద్రావిడ నిఘంటువు" (466పుట.) కుండలను తయారుచేసి వాటిని అమ్మి జీవించేవాడు. పని ఒత్తిడివల్ల స్వామి దర్శనానికి ప్రతిరోజు వెళ్లేవాడు కాదు. స్వామిని పూజించుకోవాలని స్వామి బొమ్మను తయారుచేసుకొని ఇంటిలోనే పెట్టుకొని పూజించాలనుకొనేవాడు. ప్రతిరోజు కుండలు చేసిన తరువాత చేతికి అంటుకొని ఉండే మట్టితో పూలను చేసి వెంకటేశ్వరస్వామికి ఆ పూలతో పూజ చేసేవాడట. అతని భక్తికి ముగ్ధుడైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆ పూలను స్వీకరించేవాడట. ఆ మట్టిపూలు తిరుమలలోని శ్రీవెంకటేశ్వరస్వామి పాదాల దగ్గరపడేవట. తొండమాన్ చక్రవర్తి ప్రతిరోజు బంగారుపూలతో స్వామిని అర్చించేవాడు. కాని ఆ పూలు పక్కకు తీయబడి మట్టిపూలు స్వామి పాదాలదగ్గర పడిఉండడం గమనించిన అర్చకులు చాలా ఆశ్చర్యపడేవారట. ఆ విషయం తొండమాన్ చక్రవర్తికి తెలియజేయగా ఆయన కుమ్మరిదాసు దగ్గరకు వచ్చి అతని శిష్యరికాన్ని పొందినాడట. చూ : కురువరతనంబి.

"కుమ్మరదాసుడైన కురువరతనంబి
ఇమ్మన్న వరములెల్ల నిచ్చినవాఁడు" 1-151

కుమ్మరావమున చెంబు (గోరి) వెదకు : *ప.బం; అ.క్రి.* అనుచితమగు పనిచేయు .

"కుమ్మరావమున చెంబు కోరి వెదకనేల
నమ్మిన శ్రీపతిఁ గొల్చి బదుకరో ప్రజలు"

4-135

కుమ్మరింపువేడుకలు : *వి; బహు.* మిక్కుటమైన వేడుకలు.

"చిమ్మిరేగెఁ గదవే చెమటలెల్లా
కుమ్మరింపువేడుకల గుఱుతులాయ సుమా"

12-176

కుమ్మరికొక యేఁడు గుదియ కొకనాఁడు : *ప.బం; వి.* చిరకాలంగా శ్రమించి సాధించిన ఫలితాన్ని ఒకడు ఒక్కరోజులోనే నాశనం చేయడం.

"కుమ్మరికి నొకయేఁడు గుదియ కొకనాఁడేను
నమ్మి తలఁచిన విష్ణునామంబుచేత" 1-64

కుమ్మలాడు : *అ.క్రి.* ఇది 'కుమ్ములాడు' కావచ్చు. పొడుచు, నలియగొట్టు.

"గోవుల చన్నులు నోర గుమ్మలాడిన నీ మోవి
యీవల మా కియ్యఁగాను యెంగి లనేమా"

7-92

కుమ్ముడి : *వి.* 'కొమ్ముడి'కి వ్యావహారికరూపం లేదా కుఱు + ముడి = కుమ్ముడి కావచ్చు. చిన్నముడి. జుట్టుముడి, తుఱుము, వేనలి, సిగ.

"చెంత నీ పాదాలొత్తి సిగ్గునఁ గుమ్ముడి జారె
కాంతుఁడవు యింతటను కౌఁగిలించరాదా"

9-10

కుమ్మె : (8) *వి.* 1. పోటు, పొడుపు 2. గంటు, నొక్కు.

"కొమ్మలు పదారువేల గోపీనాథా!
కుమ్మెలాయ మో మెల్ల గోపీనాథ!" 26-187

కుమ్మెలువోవు : (2) (కుమ్మెలు + పోవు) *అ.క్రి.* గాయమగు, గంట్లుపడు, నలుగు.

"కమ్మటి నాపె యే రీతి కాఁగిట బిగించెనో
కుమ్మెలువోయి గుబ్బలు గురుతున్నవి"

28-286

కుయివోవు : (కుయి + పోవు) *ప.బం; అ.క్రి.* ఆర్తరక్షణకై పోవు, విడిపింపబోవు, రక్షకంగా పోవు.

"చేరి తమ వూరివారి చెఱవట్టుకొని పోతే
కోరి కుయివోయి తెచ్చుకొన్నట్టు" 2-5

కురివేరగు : *అ.క్రి.* (?)

"మచ్చిక నీవె కాఁగిలి మరువపు నవలాయ
కొచ్చి కాఁగిటిరతులు కురివే రాయ" 28-460

కురుఁబస : *వి.* కొద్దికాంతి, లేతకాంతి.

"వరుసఁ గంటపువ్రాలు వాసెఁగొనగోరనే
కురుఁబసల నీవు చెక్కులు గిల్లఁగా" 5-319

ఇట కురుఁబసల అనే పదానికి చెక్కులు అనే పదంలో అన్వయం.

కురుచబుద్ధి : వి. అల్పబుద్ధి.
"అరగునా దుర్బలున కరుదైన యన్నంబు
కురుచబుద్ధులను నరమిగొనుఁగాక" 1-242

కురువరతినంబి : వి. సంప్రదాయ అకారాది అను ద్రావిడాంధ్ర నిఘంటువులో కురుమ్బరుత్త నంబి అనీ, భీముడు నామాంతరమనీ ఉన్నది. (పు. 466) ఇతడే కుమ్మరదాసు ; చూ. కుమ్మరదాసు.
"కుమ్మరదాసుడైన కురువరతినంబి
ఇమ్మన్న వరము లెల్ల నిచ్చినవాఁడు" 1-151

కురువేరు చప్పరము : వి. వట్టివ్రేళ్ల చప్పరము.
"చలువైన కురువేరు చప్పరములోఁబన్ని
తలకొన్న వట్టివేళ్ల దడియుఁగట్టి" 7-444

కులకశోభనము : వి. కులాన్ని శోభింపజేసేది (?)
"కులకశోభనము కాకుత్స్థనామము" 15-43

కులకాంత : వి. పతివ్రత.
"చేకొని నన్నేలినాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
యీ కులకాంతలలో నీ వెవ్వరిఁబోలుదువే"
29-351

కులమునాలు : (2) (కులము + ఆలు) కులస్త్రీ, పతివ్రత.
"వలపు రచ్చల వేసేవారు గలరా
కులమునాండ్ల నింత గోరసేయవలెనా" 11-447

కులుకు : అ.క్రి. 1. వయ్యారంగా కదలు 2. శోభించు, ఒప్పు 3. మిక్కిలి సంతోషించు 4. ప్రకటమగు.
"కులికి నవ్వకువే కొప్పు వీడీని బెట్టు
పలుకకువే మోవి బయలయ్యీని" 5-83

కులుకులు : (2) విణ. అత్యల్పమైన, మిక్కిలితక్కువైన.
"కులుకులు దైవాలఁ గొందరను గడియించి
యెఱిఁగి నెఱఁగ నట్టె యేమి సేసేవయ్య" 3-314

కులుగు : అ.క్రి. మునుగు; 'ఘనీభవించు' కావచ్చునని సం.ప.స. (16-427 పు) కుర్గు = to shink అని కిట్టెల్.

కులువ : (?)
"ఏమే సంగతెరగ మింతిరో నీవు
ఆమె కులువ చరించ కయ్యో నీవు" 11-74

కుల్లు : అ.క్రి. బాధపడు (?)
"మేదరింటి లంజవోయి మేదినీశుఁ దగులఁగ
గోదిలి కువిటు లెల్లఁ గుల్లినయట్టు" 4 అను.31

కుళకము : వి. 1. చేదుపొట్ల 2. పుట్టి 3. ఒక క్రియతో ముగిసిన పద్యాల సమూహం. నిఘంటువుల్లోని ఈ మూడర్థాలు ఇట కుదరవు.
"కుళకమగు సాత్వికపు గుణమేడ నేనేడ
కలియుగంబిది యిందుఁగలవాడ నేను" 2-408

కువాడము : వి. 1. కపటచేష్ట 2. కాపట్యం 3. హాస్యం, పరియాచకం 4. వాహనం వీపుపై కప్పే చిత్రవస్త్రం 5. ఓర్వలేనితనం 6. కుత్సితపుపని రూపాం. కువాళము (కుత్సితమూ, కువాళమూ లేని వాడని రా.సీ.లో వ్యవహారం)
"కువాడానఁ జెప్పరాని గురుతు కన్నులఁజెప్పి
నివాళివలపు చల్లె నీమీఁద నాకె" 7-530

కువ్వ : (12) వి. కుప్ప, పాతర.
"గవ్వ వొరయవచ్చునా కక్కసించ నిఁక నేల
కువ్వగాఁ బోసిన తన కొలువులోదానను"

కువ్వలువడు : ప.బం; అ.క్రి. కుప్పగూలు, త్రెళ్లిపడు.
"ఇవ్వల నప్పటి నిన్ను నింటికిఁ బిలిచితేను
కువ్వలువడఁగ నాపె కోక వట్టి తీసేవు" 12-454

కువ్వవోయు : (కువ్వ + పోయు) అ.క్రి. రాశిపోయు.
"నవ్వులు సెలవులను నానవేసి నానవేసి
కువ్వవోసి వలపులు గురుతుమాటలను"
28-102

కువ్వసేయు : (కువ్వ + చేయు) అ.క్రి. రాశిచేయు.
"దువ్వటము కొంగంటేవు దూరిదూరె
కువ్వసేసే వేమే వాని కోరికోరి" 22-489

కుశీలికాఁడు : *విణ.* (కుశీలి + కాఁడు) చెడ్డస్వభావం కలవాడు.
"మచ్చిక బందిలివెట్టే మాయకాఁడ
కుచ్ఛితపు నేరుపుల కుశీలికాఁడు" 10-2-83

కుసిగుంపు : *ప.బం; వి.* శ్రమ, బాధ (శ.ర.), పగలు.
"కొసరి కొసరి నిన్ను గూడినట్టిదానను
కుసిగుంపు నీ వలపు గోర సేసేనా" 10-2-83
"కోరి తెచ్చుకొన్నవాఁడే కుసిగుంపుసేసితేని
కూరిమికిఁబెనఁగేది కూళగాదా" 14-550

కుసిగుంపు సేయు : *మాం.* బాధించు.
"కోరితెచ్చుకొన్నవాఁడే కుసిగుంపుసేసితేని
కూరిమికిఁ బెనఁసేది కూళగాదా!" 14-550

కుస్తరించు : 1. ఊరడించు, ఓదార్చు 2. తాల్చు, ధరించు 3. సేవించు 4. శాంతపరచు 5. లాలించు, బుజ్జగించు 6. లాలనకై చేతితో తట్టు 7. కప్పు 8. గుప్పించు 9. ఆజ్ఞాపించు 10. ఉల్లాసపెట్టు, సంతోషపెట్టు.
"కొసరి దూరేచోట కుస్తరించక తీరదు
పొసఁగిన రతివేళ బుజ్జగించక తీరదు" 22-91

కూ

కూఁకట : *వి.* 1. చుంచు, జుట్టు, సిగ 2. నెమలిజుట్టు. (వ్యు.)
"పిన్నవాడు నిద్రవోఁగ పెనచి కూఁకటతోడ
పన్ని లేఁగ తోఁకగూడ బంధించి కట్టె" 2-165

కూఁగు : *అ.క్రి.* క్రుంగు.
"పొద్దుపొడచుటయును
పొరిఁ గూఁగులు యెకాని" 7-37 old

కూక : *వి.* కేక, ధ్వని, ఆర్తనాదం.
"మెచ్చితేనె మేకులు మీరితేనె కూకులు
యిచ్చకొలఁది నడఁతు వేమందురా" 11-215
"వత్తునంటాఁ జెప్పంవేవు వడ దాకి కూకులును
వత్తులునై పోదుగాని వచ్చి యాడరాదా"
12-322 old

కూకటపాయము : పిల్లజుట్టు గల వయస్సు, లేత వయసు, శైశవం, బాల్యం.
"కాఁకల నెయ్యి గాఁచి గసివెట్టీ సారెసారె
కూఁకటపాయపు నీకు గొల్లెత" 27-503

కూకటవేరు : *వి.* తల్లివేరు; రూపాం. కూకటివేరు, ఆధారభూతం.
"ఆవలఁజూడఁగఁజల్లనైవుండుఁగాని
తేవలఁగూఁకటవేళ్లు తెగఁబారును మిగులా"
10-60

కూకులు వత్తులగు : *అ.క్రి; ప.బం.* కృశించు, బహిరంగపడు, ఎక్కువ కలత చెందు, ముక్కలు ముక్కలగు, చెదరు, తుత్తునియలగు. (అసహ్యపడు)
"రాకవుండిన విభుని రమ్మని పిలువఁబోతే
కూకులువత్తులే కాక కూరిమంటీనా" 14-299
పాండురంగ మాహాత్మ్యంలో ఈ పదబంధ ప్రయోగం కనిపిస్తుంది.
"అక్కొండొక బ్రహ్మచారి మదిఁగూకులు
వత్తులునై యసద్గతిన్" 5-244

కూకులు వత్తులగు : *ప.బం; అ.క్రి.* కలవరమొందు అని ఆం.క్రి.మ.దీ. చితికిపోవు, పొడిపొడియగు.
"చేకొని యొకతె యుంటె సిగ్గివడి వెళ్లి వచ్చి
కూకులువత్తులుగాను కూళదాననా" 11-189

కూగూగు : (కూగు + కూగు) గోగో అని అరచు; (కూగు = to cry aloud, to cry out కూగు - కూకు - a cry, a clamour, a shout తెలుగున నిది కూక అను రూపమున నున్నది - కూకపెట్టు (కిట్టెల్ పదకోశము) అని సం.వా. పద. భాషా ప్ర.వి. పుట. 441
"నెలఁతల దోఁచెనే నీళ్లాడఁగానే
కొలనిదరిని దొంగ కూగూగు
బలువైన వుట్ల పా లారగించేని
కొలఁది మీఱిన దొంగ కూగూగు" 6-55

కూచి : *వి.* 1. దండయాత్ర 2. యుద్ధవాద్యాన్ని వాయించడం 3. వాడిమి, పదును (నైశిత్యం, రణవాద్యం అని ఆం.ప.ని.)

కూచుండఁబెట్టు : (16) *స.క్రి.* కూర్చోబెట్టు.

"మెక్కు కానికె లొసఁగి పీటపైఁగూచుండఁబెట్టి
గక్కన నీ మనసెల్లఁ గరఁగించెను" 23-109

కూచుండు : అ.క్రి. కూర్చుండు. అన్నమయ్య ఒకటి రెండు చోట్ల మాత్రమే కూర్చుండు అనే రూపాన్ని వాడినాడు. తక్కిన చోట్లంతటా కూచుండు అనే రూపమే. వందకు పైగానే దీనికి ప్రయోగాలు ఉన్నాయి. ఈ రూపం ఆం.ధా.మా. లో చూపబడింది. (128 పు.)

కూచుండుకొను : *అ.క్రి; మాం.* కూర్చొను. రా.సీ. మాండలికంలో కొన్ని ధాతువులపై విలక్షణంగా 'కొను' అనుప్రయుక్తమై కనిపించడం సహజం.

"సంగడిఁగూచుండుకొంటూ సమ్మతులు సేసుకొంటూ
అంగజరతుల కెంత ఆస చూపేవే" 28-292

కూటువ : సాధనసంపత్తి.

"కూటువతో స్వర్గాదిలోకములఁ గోరి వెదకినాఁ గనరాదు"

కూటువవేళ : వి. సంభోగవేళ. (కూటువ = సాంగత్యం, కూటమి, సంభోగం, గుంపు ప్రోగు)

"ఏటికి వేగిరపడే విపుడు నీవు
కూటువవేళ నే నిన్నుఁ గొసరేఁగాక" 20-576

"మాటలఁదేటలు చల్లి మగువ లిద్దరిమీఁద
కూటువఁబాదాలు చాఁచి కొలువున్నాఁడు" 20-526

కూడఁగొట్టు : *ప.బం; న.క్రి.* ఇది 'కూడఁగట్టు' కావచ్చు. కూడ తీసుకొను, తనతో వచ్చేట్లు చేయు.

"వేడుక నాతని నింకా వేఁడుకొందువు గాక
కూడగొట్టు గాలి నేల కోపగించేవే" 29-202

కూడపెట్టు : *ప.బం; స.క్రి.* ఒకచోట చేర్చు.

"వేడుక నీ కైతేఁజాలు వేవేలు సతులను
కూడపెట్టి పెండ్లాడు కానివయ్యా"
"మొక్కుచు వైష్ణవులనే మునిసభ గూడపెట్టి
చొక్కుచు శ్రీపాదతీర్థ సోమపానము నించి" 2-148

కూడపెట్టుకొను : స.క్రి. ఒకచోట చేర్చుకొను, దాచు.

"కుచ్చితమే నీవైతేఁ గూడపెట్టుకొందు గాని
యిచ్చకురాల నేనైతే నింత పని కోపరా" 17-384

కూడపోయు : *ప.బం;* స.క్రి. కూడబెట్టు, రాశిచేయు.

"గోవిందనామ మొకటి కూడపోసిఁ
బుణ్యములు" 9-8

కూడామాడా నుండు : *ప.బం; అ.క్రి; మాం.* కలసిమెలిసి ఉండు. నేటికీ ఈపదం వాడుకలో ఉందని ప.పా.

"వాడూ నేనూ కూడామాడా కలిసి తిరిగినాము"
"కూడామాడా నుంటేఁ జాలు గోరఁ గీరితే నేమాయ
ఆడరా యేమైనా మాట లవుఁగాదనేనా" 23-481

కూడించు : స.క్రి. పొందించు.

"కులమెంత గలిగెనది కూడించు గర్వంబు " 8-222

కూడిమాడి ఉండు : *ప.బం; అ.క్రి.* కలసిమెలిసి ఉండు. నేటికీ ఈ పదం వాడుకలో ఉందని ప.పా.

"వాడూ నేనూ కూడామాడా కలిసి తిరిగినాము"
"కూడి మాడి వుండి నీతోఁ గోపగించితి ననేవు
వాడికె వారి నవ్వులు వచ్చీనా మాకు" 27-327

కూడిమాడు : అ.క్రి. పెనగు (?) సారంగ. 1-109 కలసిమెలసి వర్తించు, కూడివచ్చు.

"కూడిమాడి వుండి నీతోఁ గోపగించితి ననేవు
వాడికెవారి నవ్వులు వచ్చీనా మాకు" 27-327

కూడుకుండు : (కూడుక + ఉండు) అ.క్రి. కలిసి ఉండు.

"కూరిమిఁగొందరు నన్నుఁగూడుకుండినా మేలు
మేరతో విడిచి నన్ను మెచ్చుకున్నా మేలు" 3-15

కూడు చీర గాని చోటు : *ప.బం;* వి. ఏమాత్రమూ జీవిక లభించని చోటు. అన్నవస్త్రాలు లభించని

చోటని వాచ్యార్థం.

"కూడు చీరగాని చోటై కొరగాని పాటై

వాడివాడి వేసారితి వదలి వేసారితి" 1-88

కూడువేడయితే కూరపై చేచాచినట్లు : నానుడి; ఒకటి అనుకూలంగా లేకపోతే మరొకదానిని ఆశ్రయించు.

"గుక్కుచు కూడు వేడెయితే కూరపై చే చాఁచినట్టు

మక్కళింపు వెడమాయ మామీఁదనో వోరి"

17-451

కూతపెట్టు దవ్వు : *ప.బం; వి.* కూత వేస్తే వినబడేంత దూరం, కూతవేటుదూరం, కొంచెం దగ్గర, రాతివేటు దూరం మొ॥ ఇట్లాంటివే.

"కూతవెట్టు దవ్వె సుఁడీ కోరి పిలువ నేర్చితే

బాఁతి హరినామముండి పాలించే చోటు"

15-134

కూను : *క్రి.విశ.* నిండుగా, పూర్తిగా. (తె.వ్యు.కో.)

"కూను వంగి యింటింటఁ గోర నేల వేఁడ నేల

యీ నెపాన లోకమెల్లా నేలరాదా తాను" 2-415

కూపనరకము : *వి.* నరకకూపం, నరకమనే పెద్ద బావి.

"కూపనరకమునఁ గుంగి వెనకకు నే

బాప విధులనెల్లఁ బడితిఁగాని" 1-3

కూపములోని కప్ప : *వి.* బావిలోని కప్ప (కూపస్థ మండూకము) అని శబ్దార్థం. తానున్నచోటే సర్వమూ అని భావించేవాడు అని భావార్థం.

"పాపపుణ్యకర్మదేహి పసిరికాయపురుగు

కూపములోని కప్ప దుర్గుణబద్ధుఁడు" 15-378

కూపెట్టుసదువుల కొనల పేరిటివాఁడు : *వి.* వేదాంతములందు ప్రతిపాద్యుడు, విష్ణుమూర్తి. (కూపెట్టు సదువులు = వేదములు, వాటికొనలు = ఉపనిషత్తులు, వేదాంతం)

"కూపెట్టు సదువుల కొనల పేరిటివాఁడు

పూపకొడుకుఁగని బూము లేలేటివాఁడు" 24-13

కూబ : *వి.* గూబ, గుడ్లగూబ.

"చీఁకటిఁ బెడబాపేటి చేరువ సూర్యోదయము

చీఁకటి కూబలకైతే చిమ్మిరేఁచును" 15-136

కూరవండి కసవేరు : (6) *ప.బం.*

1\. సిద్ధాన్నముండగా గడ్డికోసం వేకారు, కూర ఉండగా గడ్డికోసం వెదకు, తగని పని చేయు. (పద.)

"యీ రీతి శ్రీవెంకటేశ ఇన్నిటా నీ శరణని

కూరవండి కసవేరఁ గోరీనా జీవుఁడు" 3-175

కూరాకుసే(జే)యు : *ప.బం.* 1. నలిపివేయు 2. బాధించు.

"కొప్పువట్టి తీసి నిన్నుఁ గూరాకు సేయఁగరాదు"

13-63

"చెలఁగి కూరాకుఁజేసేవు నీ

తలమీద నుండే తరుణిఁ బో నేను" 12-193

కూరాకు : *వి.* కూరగా వండుకునే ఆకు, ఆకుకూర.

"పోరుకుఁజాల కిందుకుఁ బుత్తెంచిన విడె మిదే

కూరాకువలె నాయ కోపవు నాచేతను" 7-213

కూరాడు : *అ.క్రి.* కూడి ఆడు.

"గచ్చకాయలాడే నిన్నుఁ గాఁగలించుకొని వట్టి

కొచ్చి కొచ్చి చన్నులనే కూరాడిరి" 21-231

కూరాడు : *వి.* కలి, ధన్యామ్లం పులియబెట్టిన కడుగునీరు.

"ఎదుట యశోద దెచ్చి యిట్టె చూపఁబోతేను

అదన నీరాళ్లఁ గూరాళ్లన్నియుఁ బాలైనది"

26-56

కూరిములు : (21) *వి; బహు.* 'కూరిమి' శబ్దానికి బహువచనం. కూరుములు అని సాధురూపం. అన్నమయ్య ప్రయోగించిన 21 రూపాలూ కూరిములు అనే. ప్రేమలు, అనురాగాలు.

"కూరిములే కదవమ్మ కోపమయ్యీని కడు

భారమైన పోటు గాదా పచ్చిదేరే పలుకు" 5-199

కూరుచుండు : *అ.క్రి.* కూర్చుండు. అన్నమయ్య 'కూచుండు' అనే రూపాన్నే పెక్కుచోట్ల వాడినాడు. ఒకటి రెండుచోట్ల మాత్రమే 'కూరుచుండు' అనే ప్రయోగం కనిపిస్తుంది.

"కొంకక నావద్ద నిట్టె కూరుచుండఁగా
సంకెలెల్లాఁ బాపి నిన్ను జాణఁ జేసె విపుడు "
20-440

కూరుసుండు : ప.బం. 'కూర్చుండు'కు జానపద వ్యవహారరూపం.
"కొండపడ మేడలలో గూరుసుండు మనవే
నిండు నెమలిగురులు నెత్తికెక్కెను" 11-93

కూళఁడు : వి. 1. మూఢుఁడు, అవివేకి 2. పిసినిగొట్టు 3. దీనుఁడు 4. క్రూరుడు 5. చెవిటి 6. పేదవాడు రూపాం. కూళ.
"వేళ లేదు జాడ లేదు వీనితోడదే పాటు
కూళఁడనై తిరిగేను గుణమేది నాకు" 3-457

కూళతనము : వి. 1. కక్కుర్తి, దైన్యం 2. పేదరికం 3. పిసినారితనం 4. తులువతనం 5. మూర్ఖత్వం.
"కూళతనమౌ బత్తి గొట్టమునఁ బెట్టఁబోతే
ఆలసించ కిఁక లేవే ఆకెతోఁ జెప్పుదము "
11-342

కూవ : వి. కువ్వ, రాశి, పోగు.
"శ్రీవెంకటేశుఁడు సేస శిరసుపైఁ జల్లితేను
కూవగాఁ గొప్పులో దాఁచుకొనేవేమే" 7-176
"కూవలై నీ మేన జాజుకొన్న పులకవిరులు
మోవ నితనిఁ గూడఁగా ముద మాయను"
24-236

కూవలు చేయు : ప.బం. రాసులగు.
"కూవలు చేసె వలపు గోవిందరాజు పిల్లఁ
గోవిలోనే మాటలాడీ గోవిందరాజు !" 19-261

కూహకము : వి. (?)
"వూహాపోహలు సారె వువిదతో నేవే
కూహకము లేల పతికొంగుపట్టి తియ్యవే"
41-144

కె

కెంపువ : ఎఱ్ఱనిది, ఎఱ్ఱన.
"కెలసి తన కన్నులను కెంపువగాఁ జేసేసీ నే
నెలఁత భీకరముగా నేఁడు నవ్వీనే" 6-22

కెచ్చురేఁగు : (2) అ.క్రి; ప.బం. విజృంభించు (?)
"ముచ్చటాడఁ గలిగెఁగా ముదిత నీ కొక్కతైనా
కెచ్చురేఁగి నాతో నలిగినవేళను" 23-48

కెదటు : అ.క్రి. నిఘంటువుల్లో ఈ పదం కనిపించదు. ఇది కన్నడపదం. To scatter, to expand ఇత్యాదిగా కిట్టెల్. దాని సన్నిహితరూపం కావచ్చు. వ్యాపించు, చెలరేగు ఇత్యాది. ఏటికవతల ఉన్నవారిని ఇవతల ఉన్నవారు గిలిగించితే అది అంత దూరము వ్యాపించునా అని కావచ్చు. (సం.ప.న. 22 సం.) ఎడమగుచు అనే అర్థం కూడా చెప్పవచ్చు.
"కదియక ఆడనుండే కత లేల చెప్పేని
కెదటుచు నేటావలి గిలిగింత లంటునా" 22-2

కెమ్ములన్ : 'కెమ్ములన్' అనేది నిఘంటువుల్లో కనిపించదు. ఇది 'కిమ్ములన్' అని కావచ్చు. మెల్లగా, గుట్టుగా, లోలోపల అని అర్థాలు.
"ఉమ్మడి నెవ్వతె గోరుకుండెనో నీ వెంట్రుకలు
కెమ్ములనే నా పిడికిటఁ జిక్కెను" 7-424

కెలను : వి. 1. పార్శ్వం, పక్క 2. సమీపం 3. దిక్కు.
"కెలనఁ జుట్టుకొనే తీఁగెలవంటి చేతులది
వులుకు గాలి వంటి వూరుపులది" 22-56

కెలయించు : స.క్రి. విజృంభింపజేయు, ఉత్సహింపజేయు.
"చొక్కుచుఁ గాఁగిట నించి సురతము చవి చూపే
యెక్కువల కెలయించే దెఱుఁగరాదా" 23-186

కెలయు : (31) అ.క్రి. 1. విఱ్ఱవీగు, గర్వించు 2. కేరు, చెలరేగు 3. వేడుకపడు, ఉత్సాహపడు 4. కసరుకొను, కోపపడు (శ.ర.) 5. విజృంభించు, వికటించు (వా.ని.) 6. గద్దించు.
"నిలువున నాతఁడు నినుఁగని నవ్విన
కెలసి బొమల జంకించితివి" 23-591 & 1-109
"దొరకొని కెలసేవు తోడివారు వినఁగానే
మరుతంత్రములలోని మదమా యిది " 23-465

కెలవాడి : వి. కిలాడి, టక్కరి.
"అప్పఁడగు కెలవాడి అదె కనకరాయఁడై

కప్పురము చల్లీ చక్కని సతులపైని" 5-14

కెలవు: వి. అనురాగం, వలపు, కూడిక, స్నేహం. (రతేచ్ఛ అని ఆం.ప.ని.) (వాంఛ అని వా.ని.)
"కెలవుతిట్ల నిన్ను కిందుపరచ నేఁటికి
సెలవి నే నవ్వి యాపె చిమ్మిరేఁచఁగా" 27-316
"మట్టపు మలపుల మట్టెల కెలవుల
కట్టెడి నడపుల దాటె నదే" 5-24

కెల్లునన్: క్రి.విణ. వేగంగా.
"పల్లించిన నీ పసిఁడి గరుడనిని
కెల్లున నీ వెక్కినయపుడు
ఝల్లనె రాక్షస సమితి" 1-92

కెల్లురేఁగు: అ.క్రి. విజృంభించు. (తె.వ్యు.కో.)
"కొల్లున నీతో నవ్వి కూడులు మేలు గాక
కెల్లురేఁగి నిన్ను విసిగించనేఁటికి" 14-27

కెల్లొత్తు: స.క్రి. పెల్లగించు (?)
"క్రియ నిసుక పాతర కెల్లొత్తు నీ మాయ
జయమంది వెడలఁగ జనులకు వశమా" 3-347

కెళంగు: వి. (?)
"మీరిన కెళంగు మిరియపుఁ దాళింపుఁ-
గూరలు కమ్మని కూరలును" 1-22

కెళవు: వి. పక్క, అపమార్గం, పార్శ్వం, దూరం.
"పరకాంతల భంగపరచకుంటే మేలు
దొరకొని కెళవులు దొక్కకుంటే మేలు"

కే

కేఁకరించు: (6) అ.క్రి; మాం. 1. కేకలువేయు 2. సకిలించేరీతిగా ధ్వనిచేయు, కటాక్షించు. స.క్రి. 1. మించు 2. గద్దించు.
"నిలచి నీవు నాతో నెయ్యములు చూపఁగాను
కెలననుండి తాను కేఁకరించీని" 18-563
ఇందులోని అరసున్న చింత్యం.

కేఁగన్ను: వి. కీఁగన్ను కావచ్చు. కడకన్ను, కటాక్షం.
"కేరి కేరి నవ్వేవు కేఁగండ్లఁ జూచుకొంటా
యేరా లేదటరా యీ మాట నీవు" 11-379

కేడించు: అ.క్రి. క్రీడించు, (?) చలించు.
"కేడించు గాలికిఁ గెరలిన పుప్పొడి
చూడ ధూళి యని వేడుకపడియె" 24-279

కేదము: వి. 'ఖేదము'నకు వికృతిరూపం, దుఃఖం.
"కేదమున నోడి గెలిచితినంటా నా
పాదమంటి తీసుకోరా బంగారు మట్టెలు" 6-163

కేదారి: వి. కేదారం, పంటపొలం.
"ప్రేమముతోఁ గేదారి పెరిగి పండిన పంట
తేమ రేఁగి ఊఁటువట్టె తిమ్మినాయఁడా"
4 అను. 41

కేనము: (5) వి. 1. మాయ, వంచన 2. న్యూనత 3. బడలిక 4. కొరత. విణ. సాటి, సమానం అనే అర్థాలు నిఘంటువుల్లో కనిపిస్తున్నాయి. అసూయ (ఆ.మూ.) ప్రభాకరశాస్త్రిగారు, వన్నెచోడుడీ పదాన్ని అసూయ మొదలైన అర్థాల్లో ప్రయోగించినాడనీ, కన్నడంలోనూ, తెలుగులోనూ ఆదికాలంనుండీ వ్యవహరింపబడుతున్న పదమనీ తెలిపినారు. (తెలుగు మెఱుగులు.90 పు.) కిటెల్ -కేణ = envy, grudge. 'కేన మేటికి' అని ప.యో.వి. ప్రయోగం.
"పూనిక లివన్నియును పొందినదాఁకానే కాక
కేనములు తొల్లిఁటివి కెరలించఁ దగునా"
13-169
"పూనిక లివన్నియును పొందినదాఁకానే కాక"
1-48
మానవల్లి వారు కు.సం. వ్యాఖ్యానంలో వట్టి గాంభీర్యము అనే అర్థాన్ని తెలిపినారు.

కేపులు: వి; బహు. ఇది 'కైపులు' కావచ్చునని గౌరిపెద్దివారి సూచన; ఉద్రేకాలు, పారవశ్యాలు, మత్తు, అందం.
"కేపుల నిన్ను నుతించి గెలిచె నారదుఁడు హరి
పైపై నిన్నుఁదిట్టి శిశుపాలుఁడు వీఁగెను హరి"

కేరడము: వి. తిరస్కారం 1. ఎగతాళి 2. ఉపేక్ష 3. తిరస్కారపు మాట 4. వక్రోక్తి.

"పవళించుమని నిన్నె బలిమిసేసితిఁ గాక
తవిలి కేరడముతో తన్ను నే నవ్వితినా" 26-499

కేరడములాడు: అ.క్రి. వక్రోక్తులాడు, హాస్యమాడు.
"కేరి కేరి నవ్వేది కేరడములాడేది
నేరుచుకొంటివి నాలో నీ కేలే నొరట" 26-97

కేలువట్టుకున్న యాపె: వి. పాణిగ్రహణం చేసిన స్త్రీ, పెండ్లాడిన స్త్రీ.
"కేలువట్టుకొన్న యాపె కిలకిల నవ్వఁగాను
మూలనున్నయాపెతోడ ముచ్చటాడేవు"
26-561

కేళాకూళి: వి. క్రీడాసరస్సు.
"చిప్పిలేవు చెమటలఁ జెలియ కాఁగిలే నీకు
కుప్పళించి మంచి కేళాకూళి ఆయఁగదరా !"
21-296
"చెంగట నాపె యెంగిలిచేతితో నుండుట గని
సంగతిగాఁగేళాకూళి జలకమాడితివి" 14-592

కేవడము: వి. (సూ.ని.) ఒక విధమైన డాలు, ఖేటక భేదం.
"సొరిది శేషుని పెద్ద చుట్టు పెనుఁగేవడము
సిరి దొలఁక నొకచేతఁ జిత్తగించి"
4 అను 38. & 5-210

కై

కైకొంట: వి. కైకోవడం, గ్రహించడం.
"ఆపదలు లేని సుఖ మదియె పో విరతి
వోపితేనే కైకొంట వొల్లకుంటే మానుట" 4-223

కైకొలుపు: (3) స.క్రి. సమ్మతింపజేయు, ధైర్యంచెప్పు, కైకొనునట్లు చేయు.
"కాదనేదానఁగాను కైకొలిపే దానఁగాను
గీదపోరి యేల సాకిరి గోరేవు" 27-192

కైతప్పు: ప.బం; అ.క్రి. పొరబడు.
"కానీ కానీ యందుకేమి కైతప్పినా
సానఁబట్టి నీ గుణము జవదాఁటనిచ్చీనా"
20-263

కైతప్పు: వి; ప.బం. పొరపాటు, ప్రమాదం, (వ్య.) చేతిపొరపాటు. (వ్య.)
"కంతుని బలఁగము లివివో కైతప్పొ నే మన్నా
సంతంబయ్యిన మీఁదట సందింతువుగాని"
22-34

కైదివ్వె: వి. కరదీపిక.
"కానవచ్చిన పనికిఁ గైదివ్వెలిఁక నేల
తానే యెఱుగుఁగాక తతిఁబోరనేలే" 20-568

కైపు: వి. మదం, విజృంభణం అని సామాన్యార్థం. కపటం, మోసం అనేవి విశేషార్థాలు.
"బత్తితోడఁ గొంగువట్టి బలిమి సేసినందుకు
చిత్తిణి వంటాఁ గైపుసేయఁడు గదా" 18-229

కైపుసేయు: అ.క్రి. విరక్తిగొను.
"కైపుసేసి యిన్నిటాను గడచి శ్రీవేంకటేశు
నోపి శరణని మనే దొక్కటే సుండి" 4-108

కైమీరు: అ.క్రి; ప.బం. నిఘంటువుల్లో ఈ పదం కానరాదు.
"నాములెక్కఁ బంతములు నాలిసేయ నిఁకనేల
కైమీరినందు కతనిఁ గాఁగిలించుకొనవే" 9-237
"నీ మనసే పట్టి నేను నెరవేరుదుఁగాని
కైమీరి చేఁతలు సేసి గయ్యాళించను" 27-504

కైయొత్తు: (కై + ఒత్తు) వి. చేష్ట.
"ఆపదలు సంపదలు అందులోని మకరాలు
కాపురపు లంపటాలే కైయొత్తులు" 2-56

కైరవడి: వి. తాంబూలవస్తువులతో చేసిన గుళిక. చూ: కైరవడి నాళము.

కైరవడి నాళము: వి. తాంబూలంతో కూడ ఉపయోగించు కోవడానికి కాచు లోనైన వస్తువులు చేర్చి చేసిన ఉండ గల నాళం, కాచు వడియం, దీని పొగను పీల్చు నాళము, కవిరిఉండ గల నాళం.
"కైరవడి నాళమున గాంతపై నీ వూదితేను
వూరక నీపైఁ దమ్ముల ముమిసె నాపె" 7-124

కైలాగు: (7) వి. చేయూత, ఊత.

"మితిమీరి సోబనాలమీఁద నీవు నడవఁగ
నతఁడు కైలా గిచ్చీ నదిగో వమ్మా" 7-589

కైలాటము : వి. 1. మోసం 2. ప్రమాదం 3. కలహం 4. నమస్కారం విణ. కుత్సితమైన.
"కన్నుగీటాపెకు నాకుఁ గైలాటాలు వెట్టఁగాను
కన్నవిన్న వారెల్లాఁ బొగడకుండేరా" 10-2-50

కైలాటాలువెట్టు : (4) అ.క్రి. కలహాలు పెట్టు, జగడాలు పెట్టు.
"గరిమ నిద్దరిసంది కైలాటాలు వెట్టితివి
వరవాత నింతేసి కావలెనా నీకు" 13-478

కైవశము : (6) వి. అధీనం రూపాం. కైవసము.
"దేవలోక మొక్కటే దేవేంద్రు లెందరో
కైవశమై యేలఁగ నొక్కరిదీ గాదు" 2-172

కైవారించు : స.క్రి. మొక్కు, పొగడు.
"వందిమాగధులు గైవారింపఁదన దివ్య
మందిరోపాంత ఘనమార్గమునఁ
గోనేటిముందటను" 5-228

కైవాలు : (కై + వాలు) ప.బం; అ.క్రి. 'క్రైవాలు'కు వ్యావహారికరూపం. 1. ఒఱగు, పడు 2. గతించు, కడచు 3. పశుపక్ష్యాదులు కిందికి దిగు 4. ప్లానమగు, వాడు.
"కాయపు సుఖములు గంపల నున్నవి
పాయమే కైవాలి పండెనదె" 3-336
'క్రైవాలు' అనే రూపం కూడ ప్రయోగింపబడింది. 6-4 old

కొ

కొంకి తెచ్చి ముడిగొంటె కుఱుచ : ప.బం; వి. చెడిపోయి సరి చేసుకుంటూ కూర్చుంటే ఉన్నది తక్కువై పోతుంది అనుట. దారాన్ని తెంచి తెంచి ముడివేసినట్లైతే కురుచై పోతుంది కదా! 8-175

కొంకు : అ.క్రి. 1. సంకోచించు, వెనుదీయు 2. భయపడు, జడియు 3. సిగ్గుపడు. (వ్యా.)
"పొత్తుకు నీవు రమ్మంటేఁ బొలిఁతి దా సిగ్గువడి
చిత్తములోఁ గొంకికొంకి చెక్కుచేఁబెట్టి
బత్తి గలితేఁ జేయివట్టి తియ్యరాదా" 11-584
"నిరతి శ్రీవేంకటేశ నీ మరఁగు చొచ్చి నేఁడు
గురుని యానతిచేతఁ గొంకులెల్లాఁ బాసె" 3-8

కొంకుఁగొసరు : వి. భయం, సంకోచం అనే అర్థాల్లో జంట పదం. వెనుదీయడం.
"అంకెల గుబ్బలనొత్తి అంతలోనే వేఁడుకొనే
కొంకుఁగొసరెఱఁగని కొమ్మలము" 23-33
"తలకొని బుజ్జగించి దండఁగూచుండఁ బెట్టుకో
కులికి నవ్వఁగ కొంకుకొస రెల్ల మానెను"
13-236

కొంకుగొసరు : వి; ప.బం. భయం, సంకోచం అనే అర్థాలలో జంటపదం, వెనుదీత.
"తలకొని బుజ్జగించి దండఁగూచుండఁ బెట్టుకో
కులికి నవ్వఁగ కొంకు గొసరెల్ల మానెను"
13-236

కొంగు : అ.క్రి. 1.సంభోగమిచ్చు, కొంగుపఱచు 2.ఒఱగు.
"అంగపువాసనకుఁగా అండకు రాకుండ నేల
కొంగి శ్రీవెంకటేశ కూడితి నేను" 23-492

కొంగుఁబాలు : (కొంగు + ప్రాలు) వి; ప.బం. కొంగులోని అక్షతలు.
"కొంగుఁబాలు గదవె పూఁట పూఁట నీ సిగ్గులు
అంగన ని న్నేలేవాఁడు అతిభాగ్యవంతుఁడే"
28-505

కొంగుపసిఁడి : ప.బం; వి. కొంగుబంగారం, సులభంగా అందుబాటులో నున్న అమూల్య వస్తువు, కొంగుపైఁడి.
"కడలేని యట్టి వాసి కమ్మిన తంగేటిజున్ను
గుడిగొన్న శీలము కొంగుపసిఁడి" 13-308

కొంగుపైఁడి : (6) వి; ప.బం. కొంగుబంగారం, అందుబాటు లోని అమూల్య వస్తువు, సులభంగా పొందదగింది. చూ. కొంగుపసిఁడి.
"యీ రీతి తచ్చనలు యిద్దరికీఁగలదే
కోరినట్టి యాపె నీకు కొంగుపైఁడి కాదా" 27-445
"కోరి నుతించినవారి కొంగుపైఁడి

కొలచినవారల కొంగుపైఁడితఁడు" 9-130

కొంగుబంగరువు: వి. కొంగుబంగారం, అందుబాటులోని అమూల్య వస్తువు, సులభంగా పొందదగింది. చూ. కొంగుపసిఁడి.

"కోరిన కోర్కియు కొంగుబంగరువు
సారె విష్ణుదాస్యము లోకములకు" 1-439

కొంగుభత్యము: వి; ప.బం. కొంగున ముడుచుకొనే బత్తెం, ధాన్యరూపమైన కూలి, వినాయకుని చేట, కొంగుబత్తెము (వ్యు.) సాధారణంగా కూలిగింజలను కూలీలు కొంగులో పోసుకునే ఇండ్లకు వెళతారు. దానిపై వచ్చిన పలుకుబడి.

"ప్రేమవు నీ యధరమే పెట్టరాని జీతము
కోమలి నీ తమ్ములమే కొంగుభత్యము" 5-206

కొంగుముడియ: వి. కొంగుముడి, వశవర్తియైనది, ఇష్టమైనది, అందుబాటులో నున్నది.

"కొచ్చి మీ నవ్విన నవ్వే కొంగుముడియగా నెంచి
కచ్చుపెట్టి తమితోడఁ గాచుకున్నది" 26-382

కొంగురొక్కము: వి. చేతిలోని ధనం. కొంగుబంగారం వంటి శబ్దం. ఈవలసిన డబ్బు. పూర్వకాలంలో ధనాన్ని కొంగులో కట్టుకునేవారు. అందుపై వచ్చిన పలుకుబడి.

"కొలఁది పుణ్యపాపాలే కొంగురొక్కములు పెట్టి
వెలదెంచి బేరమాడ వేగిరమే రారో" 3-170

కొంగులపసిఁడి: ప.బం. చూ. కొంగుబంగారము, కొంగుపసిడి.

"కారణమితఁడే కలిగిన దైవము
కోరినవారల కొంగులపసిఁడి" 4-261

కొంగులొడ్డు: (కొంగులు + ఒడ్డు) ప.బం. సిద్ధమగు, కొంగుపఱచు, సంభోగసుఖ మిచ్చు, రతికి సిద్ధమగు. దీనికి నీచకార్యాలకు లోబడు అనే అర్థంలోనే వాడుక.

"వేల నా మట్టె లుండఁగా విభు నేల పట్టేవే
కూళతనముల కేల కొంగులొడ్డేవే"

కొంగువట్టు: (2) అ.క్రి; ప.బం. (కొంగు+పట్టు) దేహి అను, స్త్రీని బలాత్కరించు. (వ్యు.)

"చెంతనుండి యీతఁడే చేరి కొంగువట్టె నంటా
పంతా లేల దుస్సేవే పలుమారును" 8-496

కొంచపడు: అ.క్రి; ప.బం. న్యూనపడు, అల్పత్వంచెందు.

"కొట్టఁగొన కెక్కించుఁ గోరి మొదలికి దించు
మట్టు లే దింతింతని మరియు నీ మాయ"
3-540

కొంచపు నడుము: (కొంచెము + నడుము) కొంచెపు నడుము, సన్నని నడుము.

"కొంచెపు నీ నోరి కేలే కొండలంతలు మాటలు
కొంచపునడుమే కాదా కుచగిరులానును" 7-38

కొంచము: (3) వి. 'కొంచెము'నకు వికృతరూపం.

"సొంపుల నీ యిచ్చకాలు చుక్కలకంటె గనము
గరపెన నీ గుణమె కొంచము గాని" 9-89

కొంచముసేయు: ప.బం; స.క్రి. తక్కువచేయు, వంచించు, మోసపుచ్చు.

"పెంచినఁబెరుగును పెను యింద్రియములు
కొంచము సేసినఁ గుందును" 4-12

కొంచించు: అ.క్రి. 1. సంకోచించు 2. తగ్గు 3. మందగించు 4. భయపడు 5. కొసరు.

"అంతలోనె దోసము గాదందుకేమీఁ గొంచించక
సంతోసానఁ జెప్పవయ్యా చల్లఁగా వినేము"
28-385

"మంచముమీఁదికిఁదీసి మన్నించి అంతలోనె
కొంచించి నిద్రవోఁబోతే కొల దాఁకదా" 8-33

కొంచు: అ.క్రి. 1. సంకోచించు, సంశయించు 2. మందగించు 3. భయపడు కొసరు. (తె.వ్యు.కో.)

"కొంత నిలుపఁగరాదు కొంచేవు వొక్కమారే
యింతాఁదీరిన మరి యేమి సేసేవే" 22-83

"కొంచుమాయఁ బోరలఁగాఁ గాచితి శ్రీవెంకటేశ
కొంచిన యిన్నాళ్లు నా గుణమేఁటి గుణము"
2-428

"కొంచక పాసి కూడిన గొల్లెతలే చేప్పేరు
నించి మా నోరులు నిండా నేము చెప్పవలెనా "
14-193

కొంచెపడు: (3) ప.బం; అ.క్రి. అల్పత చెందు, న్యూనపడు (వ్యు.) రూపాం. కొంచెపడు.
"పాలు మావి వుండినాను పరివోవుఁగాలము
కూళ గోష్టి నుండినాను కొంచెపడుఁగాలము "
15-270 & 11-2భా.17

కొంచెపడు: అ.క్రి. తక్కువపడు, అవమానపడు, సన్నగిల్లు.
"గాటమైన సంపదల కడలేని పుణ్యల
కోటికి పడగెత్తక కొంచెపడనా" 5-202

కొంచెపుదేవునికి కొండంత పత్తిరి: సామెత; చిన్నవిగ్రహ రూపంలో ఉండే దేవునికి ఎంతోపత్రి సమర్పిస్తాం. విలువగలిగినది చిన్నదే ఐనా గొప్పగౌరవం అని భావం.
"కొంచెపు దేవరకును కొండంతపత్తిరి వలె
ముంచుకొని వున్నదిదె మోచి గర్వము "
15-226

కొంటఁబోవు: (5) ప.బం; స.క్రి. తీసుకొనిపోవు.
"దొంతుల కడవలోన తొరలి దాఁచినపెద్ద
పొంతకూటికుండఁ గొంటఁబోయె నెవ్వఁడో "
4-57అను. & 5-155
ఈ మాండలికపదం రా.సీ.లోనూ, తెలంగాణంలోనూ వాడుకలో ఉన్నది.

కొంటవచ్చు: (2) స.క్రి. తీసుకొనివచ్చు 'కొంటబోవు'కు వ్యతిరేక రూపం.
"పెనగొన్న తన విభు పెదపెద కన్నుల
గొనకొన్న పొందులెల్లఁ గొంటవచ్చె నిపుడు "
5-205
"కొలఁది లేని సొమ్ములు కొంటవచ్చె నీకు నిట్టె "
11-359

కొండంత: ప.బం; అవ్య. అత్యధికం.
"కొచ్చి కొచ్చి యొక కొండంత కనకము
వెచ్చపుఁబోకకు వెలయడిగినట్లు" 3-574

కొండంత కనకము వెచ్చపుపోకకు వెల ఇడినట్టు: ప.బం; అవ్య. కొద్దిపాటి ప్రయోజనం కోసమై అమూల్యమైన వస్తువును వెచ్చించినట్లు.
"కొచ్చికొచ్చి యొక కొండంత కనకము
వెచ్చపుఁబోఁకకు వెలయిడినట్లు" 9-285

కొండగొను: అ.క్రి; ప.బం. గ్రహించు, పొందు, తీసుకొను.
"దండిగా శ్రీవెంకటేశ తగనిన్నుఁగూడితి
కొండగొంటి నీఁక నాకుఁ గొప్పువెట్టవయ్యా "
14-358
"పారవైచిన పుల్లాకు బండికల్లె మించినట్లు
కోరినీ ముద్రలు మోచి కొండగొంటి నిదివో "
3-466
"కొండగొన్న సుఖమెల్లఁ గొల్లలాడుదువుగాక
బొండుమల్లె పానుపుపైఁ బొరలఁగ నేఁటికే"
4-28 old
'కొండగొని పో' అని రా.సీ.మాం.

కొండదవ్వి ఎలుకఁబట్టు: ప.బం; అ.క్రి. ఎంతో గొప్ప ప్రయత్నం చేసి చిన్నపాటి ప్రయోజనాన్ని సాధించు.
"ఎంత వెట్టిఁ గొండదవ్వి యెలుకఁబట్టెద నేను
పంతపు శ్రీహరి నా భ్రమ వాపవే" 4-344

కొండదవ్వుట యెలుక గోరి పట్టుట: ప.బం; వి. గొప్ప ప్రయత్నం చేసి కొద్దిపాటి లాభాన్ని మాత్రమే పొందడం.
"కొండదవ్వుట యెలుక గోరి పట్టుట దీన
బండాయ సంసారబంధము" 1-321

కొండదవ్వుట యెలుక పట్టుట: ప.బం; వి. చూ: కొండదవ్వి ఎలుకఁబట్టు.
"కొండదవ్వుట యెలుక కోరి పట్టుట దీన
బండాయ సంసారబంధము" 1-321

కొండము: వి. గుండం (తె.వ్యు.కో.)
"వలపుల రేనికి చెంగలువల కొండము చొర
మొక్కిడి
అలులకు పూఁదేనియ సోయగములు
మెయికొనుడి" 5-352

కొండలంత: ప.బం; క్రి.విణ. మిక్కుటమైన, అత్యధికమైన.

"కొండలంత కోరికలు గొచ్చి నినుఁగూడి నంటె
అండనే చనుగొండ లడ్డమాయను" 26-193

కొండలంత: విణ. అత్యధికమైన, లావైన.

"కొండలంతలు చన్నుల కొమ్మ నిన్నుఁగూడఁగాను
అండ శ్రీవేంకటేశ పాయఁగఁ గలవా" 27-18

కొండలకేగు: ప.బం; అ.క్రి. అడవులకేగు, అనాథమగు, రక్షకుడు లేని దగు, శూన్యమగు.

"కొఱమాలెను నిజమంతయు కొండలకేగెను సత్యము
మఱుగయి పోయెను వినుకులు మతిమాలెను తెలివి" 1-63

కొండల కోనేటి వాఁడు: వి. ఏడుకొండల్లో నెలకొన్న కోనేటి రాయడు, శ్రీవేంకటేశ్వరస్వామి.

"కోపము శాంతము లేని కొండల కోనేటివాఁడు
పాపముఁబుణ్యము లేక బదికినవాఁడు" 5-216

కొండలతిమ్మడు: వి; చూ: ఏడుకొండల్లో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి. 4-352

కొండలతిమ్మయ: వి. ఏడుకొండల్లో వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి. (తిరుమల + అయ్య = తిమ్మయ్య)

"కొండని యడిగిన వరము లొసఁగు మా కొండలతిమ్మయ"

కొండల నునుపులు: ప.బం; వి; బహు. పైపై మెఱుగులు, నిజం కానివి.

"కొండల నునుపులు కొనకొన మమతలు
అండల కేగిన నదవదలు" 1-24

కొండలపొడవులు: (2) ప.బం; వి. అత్యధికములు.

"కొండల పొడవులు కోరిక లింతికి
నిండుఁగుచములై నెరిఁబెరిగె" 7-306

కొండలప్ప(డు): వి. ఏడుకొండలస్వామి, వేంకటేశ్వరస్వామి.

"వుండి నీ శరణ మను వూఁతగొని యెక్కితిని
కొండలప్ప! నీ వనేటి కొనఫలము కొఱకు" 4-200

కొండల మొయిలు మేసినట్లు: ప.బం. మబ్బులు కొండలపై ఎక్కువగా పారాడినప్పుడు అది చూచి గ్రామీణులు 'కొండ మొగిలి మేస్తావుంది, వానకు బలమబ్బా' అని అంటారు. ఈ వాడుక ఇప్పటికీ రా.సీ.లో ఉన్నది. ఈ అర్థంలో ఈ పలుకుబడి నిచట మాండలికంగా ప్రయోగించి ఉండవచ్చు. (సం.ప.స. 19 సం. 19 పు.)

"కులికి సతిఁగలియుచో గురియుఁజెమటల జడికి
మెలఁగి కొండల మొయిలు మేసినట్లాయ" 19-559

కొండలరాయఁడు: తిరుమల కొండలకు స్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి.

"నిండుఁబాయము గాయము నీ సొమ్ము
కొండలరాయఁడ నీవే గురి యింతే కాక" 26-26

"కొండలరాయఁడు కోనేటి తిమ్మయ్య
కొండ తలనెత్తి గుఱుతైనవాఁడు" 12-234

కొండలు పెరుగు: ప.బం; అ.క్రి. ఎక్కువగు, కొండలుగా పెరుగు.

"కోరేటి కోర్కెలు కొండలు పెరుగు" 8-50

కొండవంటి: విణ. అత్యధికమైన, గొప్పదైన.

"కొండవంటి యాస చేత కూళదాన నైతిని" 11-51

"కొండవంటి దొర" 26-532

"కొండవంటి సంతసాన కొల్లున నవ్వవయ్యా" 16-184

కొండవింటివాఁడు: వి. శివుడు, కొండ విల్లుగా కలవాడని వాచ్యార్థం.

"కొండవింటివాని గుత్తగొనినయట్టి
కొండుకపాయపుఁగూతురు తండ్రి" 5-235

కొండవేలు: ప.బం. సం.ప.స. (21 సం; 386) లో ఈ పదం ఈ విధంగా వివరింపబడింది. "వ్యవసాయదారుడు దున్నీ దోకీ కొటారు చేసి

గాదెలు నింపిన తర్వాత కడపట సిద్ధించెడి ఫలముగా ప్రకరణము బట్టి తెలియచున్నది. వ్యవసాయదారుల సాంకేతిక పదమా! అనిపించు చున్నది. నిఘంటువులలో కానరాలేదు. కొత్త పంట వచ్చినవెంటనే కొండవేలుపునకు నివేదించే పద్ధతి. వ్యావహారికంలో 'కొండవేలు' అయి వుండవచ్చును. అట్టిది ఇంకేదైనా కావచ్చు. తెలుగు వ్యుత్పత్తి కోశంలో దీనికి సమృద్ధి అనే అర్థం చూపబడింది. ఈ అర్థం సముచితంగానే కనిపిస్తుంది.

"యిచ్చట శ్రీవెంకటేశుఁడిన్నిటాను నేరుపరి
కుచ్చి కుచ్చి రతిసేయఁ గొండవేలానాయ"
21-156

కొండసెల: వి. కొండచరియ. పలుకు రాయి కావచ్చునని సంపా.

"పేటలుగ నవే నీకు యితవు లైతేఁ గనక
పొలసి మొగళ్ళెక్కి పూవులు గోయరాదా"
27-374

కొండసేయు: (3) ప.బం; స.క్రి. గొప్పచేయు, పెద్దదిగా చేయు, కొండంత చేయు.

"అండనున్నాపెఁ జూడక ఆవల వేరొకాపెను
కొండసేసి సారె సారెఁ గొనియాడేవు" 26-392

కొండాటము: (2) వి. 1. అన్యచింత లేక ఒకదానియందు మనస్సు లగ్నం చేయడం 2. స్తుతి, పొగడ్త (వ్యు.) సంతోషం. (నీ.శ.)

"కొండుక బాలులతోడ గోవిందరాజు వుట్టు
కొండాటముగఁగొట్టె గోవిందరాజు" 19-261

కొండించు: అ.క్రి. కొండెములు చెప్పు, కొండెము శబ్దమునకు అపురూపమైన ధాతు రూపమని సం.ప.స. (16 సం. 426 పు.)

"కొండవేల నెత్తినట్టి గోవిందా నిన్నుఁ
గొండించేరు యశోదకు గోవిందా" 16-325

కొండించు: స.క్రి. కొండాడు, స్తుతించు.

"నరహరి యచ్యుత వో నారాయణా
గురుఁడు నిన్నుఁ గొండించెఁ గోరి నే వింటి"
3-489

కొండిపీట: వి. కొక్కిగల పీట.

"తట్టి పాఁకఁబోతేను బయలెల్ల బందీలె
కొట్టుఁ గొనకెక్కితేను కొండిపీఁట" 19-93

కొండుక: విణ. చిన్నవాడు, వివేకహీనుడు . (వ్యు.)

"రెండు చేతుల యిద్దరికిఁ గాఁగిలిచ్చి యిచ్చి
కొండుక జమళిపెండ్లికొడుకవు నైతివి" 7-183

కొండుక పాయము: వి. బాల్యం.

"కొండుకపాయపువారి కొడివేలుంగరమవు
అండనే మెడఁగిలే హారమవు" 14-68 & 6-102

కొండుకవయసు: (2) వి. 1. కొండికవయస్సు, చిన్నవయస్సు 2. బాల్యం.

"కొండుకవయసు కొమ్మ గుబ్బలపైఁ బ్రేమపు
టెండ దాఁకి పులకలు నెన్ను వెళ్లఁగా" 5-118

కొండుక శిశువు: వి. కొండిక శిశువు, చిన్న బాలుడు.

"కొండగొడుగుగా గోవులఁగాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్ళో" 5-98

కొండెగోడి: వి. చాడీలు చెప్పేవాడు.

కొండెగోడితనము: (4) వి. చాడీలు చెప్పే స్వభావం. (ఇది కొండెగీడితనమా?) "ఇట 'గోడి' మత్వర్థంలో వచ్చిన ప్రత్యయం.

"ఉండనీరా యీ పాటి వూరకే నన్ను
కొండెగోడితనాలకుఁ గోపమెల్లా వచ్చును"
14-395 & 7-59

కొండో నుయ్యో: ప.బం. ప్రాణం తీసుకోవటానికి ఏదిగతో! నుయ్యో కొండో అని రుక్మాం. లో ప్రయోగం. (5-131)

"కొండో నుయ్యో కుమతులాల
తండుముండు తట్టుముట్టు తాఁకైనఁ గనుఁడీ"
1-160

కొం(డ(గొం(డ: కొం(డ అంటే మళ్లించి దున్నిన చాలు అని అర్థం.

"గొంటరి సతుల పొందు కొం(డ(గొం(డ వేయేసి
అంటేవు మా కుచములు అప్పటి నీ విపుడు"
14-45

కొంతపుఁజూపులు: *వి; బహు.* కుంతము వంటి చూపులు, తీక్ష్ణమైన చూపులు.
"ఎంత చన విచ్చితివో యీపె నీపై వెదచల్లీ
కొంతపుఁజూపుల చూడికుడుతనాచారు"
23-369

కొంతపు కనుఁగొనలు: *వి; బహు.* కొంతము (= ఈటె, బల్లెం) వలె తీక్ష్ణమైన కనుఁగొనలు.
"ఇంతి కన్నీ రొలుక నిట్లుఁజదివె
కొంతపు కనుఁగొనల కోపమును చదివె" 5-319

కొంతపుచూపులు: *వి; బహు.* కుంతము. (= ఈటె, బల్లెం వలె తీక్ష్ణమైన చూపులు)
"దొంతులువెట్టీఁ దోడనె వలపులు
కొంతపుచూపుల కోమలి" 26-450

కొంతము: (2) వి. ఈటె, బల్లెం.
"పంతమాడేవాఁడవు బడిబడి రానేల
కొంతపు నీకు బత్తి గొట్టానఁ బెట్టితిమా" 26-166

కొంప: వి. ఇల్లు.
"పంపుడుదయ్యమై బాధవెట్టెడు యీస
కొంపలోన నుండరానీఁ గోరవా" 1-187

కొక్కు: వి. పందికొక్కు.
"యింటిలోనఁ గొక్కు దెచ్చి యిరవుగఁ బెట్టుకొంటే
దంటయై గోడలు వడఁ దవ్వ కేల మాను"
1-476

కొక్కెర: వి. పెద్దకొంగ.
"ఇల నరులఁ గొలుచుటెందో కోకలు వేసి
బలు కొక్కెరలవెంటఁ బారాడుట సుండీ" 3-169

కొచ్చికొచ్చి: (63) కుచ్చికుచ్చి.
"కొచ్చికొచ్చి పారేనా కొనగొన చన్నులను
తచ్చనకు నదిమితే తమకించేవు" 7-568

కొచ్చిచూచు: (3) స.క్రి. కుచ్చి చూచు.
"వుంగరము చూతమని వొయ్యనే వేలు వట్టితే
కొంగువట్టి యీపె నింత కొచ్చి చూచేవు"
18-151

కొచ్చు[1]**:** (10) స.క్రి. కుచ్చు, గుచ్చు. 'క్రుచ్చు'కు వ్యావహారిక రూపమా? జతచేయు, కూర్చు.
"కొచ్చరో మనుజులార మీరే కథలు
యిచ్చీని శుభములు యివి యెల్లకాలము"
1-338
"అచ్చపు శ్రీవెంకటేశు నలమి కౌఁగిటఁబట్టి
కొచ్చి కూడేవేళ అలుకుడు సేసేస" 12-525

కొచ్చు[2]**:** (40) స.క్రి. తొలగించు, తొలగు. బ్రౌన్: కొచ్చు = to cut, away, up or to pieces.
"కొచ్చరో మనుజులారా కోరికె లెల్లను మీకు
కోపమెల్ల గలిగిన కొచ్చి శాంతమిచ్చుటకు"
7-196
"యిచ్చకములే సేసి యింతి నిన్నుఁ జెనకఁగా
కొచ్చకుమీ మేనంటూ గుట్టు సేసేవు" 8-127
"పచ్చడము గప్పినంటా పడఁతులు తొడలపై
కొచ్చేవు నీ మునివేళ్ళు గోవిందరాజా" 23-204
ఈ ధాతువు అంతటా 'కొచ్చి' అనే క్త్వార్థరూపం లోనే ప్రయోగింపబడింది.

కొటారు: వి. ధాన్యాదిరాసు లుండే చోటు.
"కొండలంతలు చన్నులఁ గొటారుకుప్పలు వేసె
పండెఁగట్టుకొమ్మనవే పైఁడిచీర వరచి" 21-156

కొట్టఁగొన: (కొన + కొన) మిక్కిలి కొన. ఇట అరసున్న విచార్యం. ఇది తమిళసంప్రదాయమేమో!
"నిగ్గుల మునులతోడ నీ చదివే వేదములు
సిగ్గుల కొట్టఁగొనల చేఁగదేరీరా" 22-43
"కొట్టఁగొన కెక్కించుఁ గోరి మొదలికి దించు"
3-540

కొట్టము: వి. గుడిసెవలె వేసుకున్న ఇల్లు.
"రచ్చకొట్టాలలోనుండి రాగాన నీలలు వెట్టీ
గచ్చులు సేయుచు కోటిగాఁడు కృష్ణుఁడు"
27-550

కొట్టానఁబెట్టు: స.క్రి. తిరస్కరించు, తీసి పారవేయు, తీసుకుపోయి కొట్టంలో పెట్టు.

"పొత్తుల కూటమి నీకే పుణ్యము గట్టుదు గాక
బత్తి గొట్టాన బెట్టేటి పంతము నా కేలా" 26-179

కొట్టాము: వి. చావడి, శాల.
"గురుతరమగు పెద్ద కొట్టాములోపల
తిరుమైన పెనుమాయఁ దెరగట్టి" 1-163

కొట్టినపిండి: *ప.బం; వి.* బాగా తెలిసినది, ప్రహతమైనది.
"కూడినవారికి రతి కొట్టినపిండివంటిది
కూడనివారికి కలగూరవంటిది" 7-204

కొట్టు: వి. దెబ్బ, కొట్టడం.
"కొట్లు గొట్టుచు గోపాళులుఁ దాను
అట్లు తోడనే యారగించీని" 23-331

కొట్టువడు: *అ.క్రి.* 1. దెబ్బతిన్నట్లు లేచు 2. దైన్యం పొందు 3. వ్యయమగు 4. నికృష్టమగు.
"కోపపు శాంతము (?) చేతఁ గొట్టువడ్డప్రాణికి
తాపపు కర్మపువెట్టి తప్పించుకోవచ్చునా" 4-88

కొట్నాలు దంచు: *ప.బం; అ.క్రి.* ధాన్యం దంచు.
"కూరిమి విషయములకొట్నాలు దంచేము"
3-487

కొట్లాడు: *అ.క్రి.* దెబ్బలాడు, కలహించు.
"వేడుకకాఁడవు నీవు వెలఁదులఁగంటేను
కూడుక వత్తువు గాని కొట్లాడవు" 7-504

కొట్లుగొట్టు: *స.క్రి.* దెబ్బ కొట్టు – ఇట మొదటి 'కొట్లు' నామవాచకం. రెండవది ధాతువు. తిట్టు తిట్టు, నవ్వు నవ్వు, చదువు చదువు ల వంటిది.
"కొట్లుగొట్టుచు గోపాళులుఁదాను
అట్లు తోడనే యారగించీని" 23-331

కొడము: వి. రూపాం. కొడమ. చేపలను పట్టడానికి ఒడ్డే సాధనం, వల. (ముఖభాగంలో కట్టు లేదా మధ్యలో వలవలె అల్లిక కలిగిన ఊతవంటి చేపలుపట్టే సాధనవిశేషం.)
"పెట్టించె ఆసలను పెడకొడములఁ దన్ను
తిట్టించె నిజద్రవ్యదీనకులచేత" 1-185

కొడి: వి. 1. దీపశిఖ 2. దీపశిఖ నుండి వెలువడే పొగ 3. దీపంవత్తి మొ॥ దగ్ధాగ్రం – కాలిన చివర 4. లక్షణం, చిహ్నం, స్వభావం 5. జెండా (వ్యు.)
"కొడి మిగిలిన నా గోళ్లివి కడు వాఁడి
బడిబడి నీవాని బలమింతే కాని" 24-43

కొడితీఁగె: వి. ఆకుపచ్చని పూలు పూచే ఒకరకం తీగె.
"కొడితీఁగె వంటిది నా కోరిక గాఁబోలును
అడరి నీ పొందుల నల్లుకొనీని" 23-309

కొడిదెడు: (కొడిదిలి + ఎడు) ఇది 'కొడిఁగెడు' అని పొరపాటుగా ముద్రింపబడిందా? *విఱ.* చేరెడు.
"కొడిఁదెఁడు మొగమాపె కోమలపు మేనియాపె
అడరి నీవు తన్నుఁ బెండ్లాడితి వనె" 28-511

కొడిమ: వి. నింద 'కొడిమె'కు వ్యావహారిక రూపం. 1. అపనింద 2. అసత్యం 3. పాపం, దోషం 4. దురవస్థ 5. కష్టం.
"చిడిముడి మరినేమి సిగ్గులు మోవనాడినా
కొడిమ లెన్ని యతనిఁ గోపించరాదు" 24-500

కొడిమలు గట్టు: *ప.బం; అ.క్రి.* చూ: కొడిమెలు గట్టు.
"పడఁతు లెందరినైనా బడిఁబెట్టుక రా నీవే
కొడిమలు గట్టి తన్నుఁ గోపగించనీఁకను"
24-595

కొడిమె: (5) చూ: కొడిమ.
"కోరి వూరకున్నవారి కింతేసి
కొడిమె లేఁటికి వచ్చీరా" 19-403

కొడిమెలు గట్టు: (8) *అ.క్రి.* నిందించు, దూషించు, అపనిందలు వేయు.
"కొడిమెలు గట్టుదురు కోపములు చూపుదురు
తడవినంతటిలోనే తప్పులు వట్టుదురు" 19-83

కొడివేలుంగరము: వి. (కుడివేలుంగరమా?) చిటికెనవేలు ఉంగరం.
"కొండుకపాయపువారి కొడివేలుంగరమవు
అండనే మెడఁదగిలే హారమవు" 14-68

కొడిసాగు : (4) ప.బం; అ.క్రి. కొనలు సాగు, కొనలుదేరు, వర్ధిల్లు.
"వుడుగని వెలుపటి వుద్యోగమువలె
కొడిసాగేటి మితి కోరికలు" 4-373
"కొడిసాగి కోరికలు గుంపులుగా నల్లుకొనె
అడియాస లేల విడె మందియ్యవయ్యా"
28-296

కొడ్డువో : (కొడ్డు + పో) 'గొడ్డుపో' (గొడ్డు + పో) కావచ్చు.
"బిడ్డడంటా నమ్మి యెట్టువెట్టు కొన్నారిందుకంటె
కొడ్డువో మేలు యిట్టి కొత్త లెందుఁగలవా" 6-60

కొణిక : వి. కొంకి, కాలిమడిమపై భాగం.
"కొప్పులోని సంపెఁగలు కొణికెలవెంట జారీ
విప్పక ముడుచుకోవే వేగఁదురుము" 23-46

కొణిదెడు : (కొణిదిలి + ఎడు) విణ. బొటనవేలు కాక తక్కిన నాలుగువేళ్లు వంపగా ఏర్పడిన చేర, కొణిదిలి అంత ప్రమాణంకల, చేరెడు, కంకెడు.
"ముందుముందె మోవితేనె ముంచిముంచి అంది యిచ్చె
అందీ కొణిదెఁడుమోవి అతివ" 23-220

కొత : వి. ఇది కొంత లేక కొత్త కావచ్చు.
"యితఁడు శ్రీవెంకటేశుఁడేలె నలమేల్మంగను
చతురత నీవూఁగొత సాదించగలవే" 29-464

కొతుకు : అ.క్రి. జంకు, సంకోచించు, వెనుదీయు.
"పతిఁ బెండ్లాడిన యాలు పక్కనుండి నిద్రించితే
కొతికి కాలానుభాగి గొనవచ్చునా" 2-214

కొత్త చెమట : అప్పుడే ఏర్పడిన చెమట.
"హత్తి వుండే చెలులైనా నట్టె తుడుమరు గాక
కొత్త చెమటలెల్లాఁ జూచి కొమ్మలెల్లా" 20-307

కొత్తలు : వి. నాణెములు, డబ్బులు.
"ముడుపులు జాళెలు మొగిదల మూటలు
కడలేని ధనము కొత్తలును" 1-346

కొత్తలు సేయు : (?)
"ఏల కొత్తలు సేసేవు ఇప్పుడే నాతో
మేలు తోడిదాన నౌత మిక్కిలి నెఱఁగవా"
25-15

కొత్తవయసు పడుచు : వి. ముగ్ధ.
"కొత్తవయసు పడుచు గోరికొన సోకింతురా
పొత్తుగ లాలన సేసి పొందులు గాక" 18-19

కొత్త వెంట్రుకల గుబురుల గంతి : కొత్తవెండ్రుకల గుబురుగల మాంసపుముద్ద.
"కొత్తవెంట్రుకల గుబురుల గంతికి
పొత్తుల సంసారభోగము గలిగె" 2-251

కొత్తెన : వి. సంకోచం, జంకు. ఇది 'కొత్తైన' (కొత్త + ఐన) అని కూడా కావచ్చు.
"చిత్త మాతనిమీఁద చేయి చెలియమీఁద
కొత్తెన గమనంబు కొనవేళ్లమీఁద" 6-133

కొదుకు : అ.క్రి. భయపడు, జంకు, మాటలు నమలు. (వ్య.)
"అదిగో వేసరుమనీ నండనే కూచుండవే
కొదికి వట్టి గుట్టున గుబ్బతిలనేఁటికే" 22-334

కొద్దిఁబడు : అ.క్రి. కొంచెపడు.
"చద్దికి వేఁడికప్పటి జాణతనాలాడేవు
కొద్దిఁబడవు పనులు గోవిందరాజా" 9-174

కొనకెక్కు : (9) అ.క్రి; ప.బం. పైకెక్కు, వర్ధిల్లు, ఉన్నతినందు.
"సిబ్బితిపడఁగనేల చింతలఁ బొరలనేల
గొబ్బున మొదలి నీరు కొనకెక్కదా"
4-448 & 1-260
"యెనసిన శ్రీవేంకటేశుఁడే యింతా
కొనకెక్కిన నిజకోవిదునికిని" 4-406

కొనకొన మమతలు : వి; బహు. పైపై మమతలు, కృత్రిమమైన మమకారాలు.
"కొండల నునుపులు కొనకొన మమతలు"
1-24

కొనగోరి గీఁతలు : వి; బహు. నఖక్షతాలు.
"వెలయాలిచేతలు వింత బయలింతలు

కొలఁదివెట్టరు కొనగోరిగీఁతలు" 17-111

కొనగోరి గుఱుతులు : *వి; బహు.* నఖక్షతాలు.
"గుబ్బలపై కొనగోరి గుఱుతు లంటిన చోటు
లబ్బురమై మృగమద మంటినది చూడవే"
5-165

కొనగోరి చెనకులు : *వి; బహు.* కొనగోరి గుర్తులు.
"మేలు మేలే యితఁడు నేర్చును మెచ్చితి నన్నిటా నీతని కూఁటిమి
కోలుముందై యిటులఁగోర్పులు కొనలుసాగ నిదేఁటిదే"

కొనగోరి తాఁకులు : (5) *వి; బహు.* నఖక్షతాలు.
"వెల్లిగొను సురతపువేళ మరపుల యింపు
కొల్లలాడుటే కొనగోరి తాఁకులు" 1-189

కొనగోరి రచనలు : *వి; బహు.* నఖక్షతాలు.
"కొప్పెరగుబ్బలమీఁది కొనగోరిరచనల
కప్పురము మెత్తిమెత్తి కడు నలసితివి" 5-273

కొనగోరివాతలు : *వి; బహు.* నఖక్షతాలు.
"చేసినదెల్లా నీపై చెలి చేసినది చేఁత
వాసినవి కొనగోరి వాఁతలు నివి" 8-53

కొనగోరిసొమ్ములు : *వి; బహు.* నఖక్షతాలు.
"అమ్మరొ శ్రీవెంకటేశుఁడన్నిటా నన్నుఁగూడె
కుమ్మరించె నాపై కొనగోరిసొమ్ములు" 9-122

కొనగోరి సోఁకులు : *వి; బహు.* నఖక్షతాలు.

కొనగోరొత్తులు : *వి; బహు.* నఖక్షతాలు.
"విందుల మోవుల యావులు వీపున నానిన కుచములు
పొందుల కొనగోరొత్తులు పొలఁతికి నీ కమరె"
7-131

కొనగోళ్లతాఁకులు : వి. నఖక్షతాలు.
"కొనబు కొనగోళ్లతాఁకులవి మేఁని నొప్పులా
ననుపులకు నుబ్బుఁగవణములు గాక" 5-126

కొనచూపు : (2) వి. అపాంగం, క్రీగంటిచూపు.
"కొనచూపు దెలుపైన కొప్పు గడు నలుపాయ
నినుపుఁజీకటికి వెన్నెలకు సరియే" 17-544

కొనచెమట : వి. (?)
"కొనచెమట జవ్వాదిఁగూడి చెక్కుల జార
అనుఁగుఁజేయి పయి వేయుటది గదా వలపు"
21-519

కొననాలికె : వి. నాలుకకొన.
"యిదే హరినామము యదే కొననాలికె
వదలక తలఁచితే వైకుంఠము" 15-206

కొనపరిది : (కొనపరి + అది) వి. ఈ శబ్దమపురూపమైనది. అర్థము విచార్యము. 'గుణవంతురాలు' కావచ్చు అని సం.ప.స. (16 సం.) లేదా ఇది గొనబరిది (గొనబు + అరి + అది) కి రూపాం. కావచ్చు. గొనబు అంటే మనోజ్ఞత. గొనబరి = మనోజ్ఞుడు, గొనబరిది = మనోజ్ఞురాలు. ఈ అర్థం కూడా ఇక్కడ యుక్తంగానే ఉంటుంది.
"తనువులిద్దరికిని తతినెపుడు నొకటె
కొనపరిదానఁగాన కూడితి నిన్ను" 16-334

కొనబు : ఇది 'గొనబు' కావచ్చు. గొనబు అంటే విలాసం, సొగసు. శ్రావ్యమైన, మంజులమైన, పరిమళంకల, మధురమైన, లేత (వ్యు.ప.కో.) అని అర్థాలు.
"ననిచె నా చెలిఁగంటే నంటు సేతువా నీవు
కొనబైన నా రాక కోరుదువా యెపుడు" 25-44

కొనబుఁదనము : వి. అందం, సొంపు, విలాసం.
"కొనబుఁదనాన గోరికొన చూపీ పెండ్లిసేసు
కొనవలెనని నీకుఁగోమలి" 25-182

కొనబుకాఁడు : (4) వి. అందగాడు, సొగసుకాఁడు, విలాసవంతుడు.
"కొనబుకాఁడవు నీవు కొమిరె వయసు నేను
పనిలేక వొంటి నుంటేఁ బైకొనేదా" 20-140

కొనబుతనము : వి. చూ : కొనబుఁదనము. మనోజ్ఞత, సొగసు.
"కొనబుతనాన మరి గురులెన్ని యుండినాను
చనవుసేసుక మోవి చవిగొనెను" 23-502

కొనబువాఁడు : వి. మనోజ్ఞుడు, సొగసుకాడు.
"చెనకి యింకేల వాఁడు శ్రీవెంకటేశుఁడు సాదు

కొనబు వాఁడితఁడిట్టె కూడుమని చెప్పరే"
27-27

కొనమొదలు: (2) *వి; ప.బం.* సంపూర్ణత, ఆద్యంతాలు. ఇది తీగెలు మొదలగునవి పెరిగేప్పుడు కొనలు సాగుటను బట్టి వచ్చిన పలుగుబడి. తీగెసాగు.

"ఘనుఁడగు శ్రీవేంకటపతి గావఁగ

కొనమొద లేర్పడె కొంకే లేదు"1-492

కొనలంటులు: (కొనలు + అంటులు) *వి; బహు.* విస్తరి కుట్టేప్పుడు ఒక ఆకునుండి ఇంకో ఆకుకు విడాకులు తగిలించి ఒకరు కుడతారు. ఆ పూర్తి కుట్టుపని మరొకరు చేస్తారు. అంటులు వేయడమనీ, కొనలంటించడమనీ దీనికి వ్యవహారం ఉంది. ఈ విడాకు కొన మొదలు కుట్టి ఉండడంవల్ల కదలకుండా ఉంటుంది. తరువాత పని సులభం. ఆ విధంగానే ప్రకృతం రెండు భావాలు తగులుకొని వీడ రాకున్నవి అని భావం కావచ్చు.

"కనుచూపు తనమీఁద కడునాస రతిమీఁద

కొనలంటులాయ నా గుణ మేఁటిదే" 22-32

కొనలుఁబారు: *ప.బం; అ.క్రి.* వర్ధిల్లు, వ్యాపించు, చిగురొత్తు.

"అన్నిటా సమ్మతించేవే ననలుఁగొనలుఁ బారు

యెన్నేని చెప్పఁగవచ్చు నింతుల వలపులు"
22-492

కొనలు సాగు: (3) *అ.క్రి.* వృద్ధిచెందు, తీగెసాగు.

"కొనలుసాగీ నన్నిటి కూటువ గూడుకొన్నట్టి

అనంతుఁడొక్కటే మించీ నాదిమూరితి" 2-499

కొనవాండ్లు: *వి; బహు.* 'కొనవాఁడి'కి బహువచనరూపం. కొనలో ఉండే వాడితనాలు. గుణవాచకమైన వాఁడి శబ్దానికి 'వాండ్లు' అనే బహువచనరూపం విలక్షణం.

"కొమ్మా నీ కుచములివి కొనవాండ్లా యింత

యెమ్మె లేల నీకు నందుకేమి వోదురా" 17-75

కొనవాఱు: *ప.బం; అ.క్రి.* కొనవేయు, చిగురించు.

కొనవేయు: (2) *ప.బం; మాం.* అప్పుడే పుట్టిన మేక, గొఱ్ఱె మొ॥ జంతువుల పిల్లలను తల్లి చనుబాలకు అందించు.

"అప్పటి వొలసీనొల్ల నట్టి వలపు నీమీద

నిప్పుడె కొనవేసేది యేటి బ్రదుకు" 14-302

"ఇక్కువ నున్నవారము ఇచ్చాడఁగలముగాక

గుక్కక వట్టి వేడుక కొనవేయఁగలమా" 23-411

కొనాడు: (కొని + ఆడు) *స.క్రి; ప.బం.* 'కొనియాడు'కు వ్యవహారరూపం. ప్రశంసించు.

"అచ్చపు శ్రీవెంకటేశుఁడంతలోనె నన్నుఁగూడె

కొచ్చి తన గుణాలు నేఁగొనాడ నా వసమా"
18-124

"ఇంత చక్కఁదన మిఁక నేమని కొనాడుదును"
10-28

(కొనేడు అనే రూపంకూడ ఉన్నది.)

కొనికెలు: *వి; బహు.* మోకాలిచిప్పకు లోతట్టు రెండుపక్కలా ఉండే ఎముకలు. రూపాం. కొంకి.

"కొప్పునఁబెట్టిన సేస కొనికల జారఁగాను

కప్పి పయ్యెదతో నేమి గయ్యాళించేవే" 4-300

-కొను: కొన్ని ధాతువులపై చేరే అనుబంధ ధాతువు. ఉదా:- ఆనందించుకొను. (ఆనందించు అని అర్థమే)

"అంది శ్రీవెంకటేశుఁడ ఆనందించుకొన్నది

ఇందుముఖి చాలఁజిక్కి ఇంపు చూపరాదా"
27-50

కొనుకవచ్చు: *స.క్రి; ప.బం.* కొనుక్కొని వచ్చు, వెల యిచ్చి తీసుకొని వచ్చు.

"చెంగటి నప్పటి నీవు సేవలు సేయవచ్చేవు

అంగడిఁగొనుకవచ్చి తటవే యీ వలపు"
22-259

కొనుకొను: కొనుక్కొను.

"కూరిమిఁగాలు చాఁచేవు కొనుకొంటి వా వోరి

వూరకె పతికిఁ బతి వోపనా నేను" 11-237

కొనుట వెగ్గళము తినుట అల్పము : *ప.బం;* సంపాదించడం ఎక్కువ - అనుభవించడం తక్కువ.

"కొనుట వెగ్గళము దాఁదినుట యల్పము మీఁదు
గనుట వినుటలే కదా కడ చన్నభవము" 1-49

కొనేడు : *స.క్రి; ప.బం.* 'కొనియాడు'కు వ్యావహారిక రూపం కావచ్చు.

"బట్టువలె గొనేడఁగా బగ్గడెనవు గదా" 28-190

కొన్నకోలు : వి. కొనుగోలు, క్రయము .

"మన్ననలు దనవంక మరి యింతకంటే నేవి
కొన్నకోలై యిఁక నేమి గొంగువట్టీ నన్నునూ " 11-546

కొన్నది కోలగు : *ప.బం; అ.క్రి.* కొన్నదే అధికమగు, కొన్నదే పెద్దదగు .

"కొన్నది కోలైనందుకు కొలఁదివెట్టఁగ నేల
చిన్ననాటి సుద్దులకు సిగ్గులేల" 13-347

కొన్నదే కోలు : (2) *ప.బం; వి.* కొన్నదే అధికము.

"కొన్నదే కోలుగాక కొంకుకొసరున్నదా
మున్నీటివలె నేనే మొక్కుటగాక" 17-264

కొన్నేసి : కొన్నిసార్లు.

"కన్నతండ్రి బాలునిఁ జంకంబెట్టి దించితేను
కొన్నేసి విలుచు ముద్దు గునిసినట్టు " (?) 2-455

కొప్పుగులుకు : (?)

"యెప్పుడో తిరువెంకటేశుఁడు కౌఁగిటఁగూడి
కొప్పుగులుకుచు దెచ్చుకొన్న దీ వలపు " 5-74

కొప్పుచీకట్లు : *ప.బం.* కొప్పు నల్లదనాలు.

"కప్పురపుఁబల్కు లెన్ని గాదెఁబోసేవే
కొప్పుచీఁక ట్లెంతేసి కూడఁబెట్టేవే" 29-32

కొప్పెర : వి. వెడల్పు మూత గల పాత్రవిశేషం, కాఁగు, తలపుట్టె, కమండలం.

"కప్పులు దేరేటి కస్తురి చంకల
కొప్పెరగుబ్బల గొల్లెత" 5-92

"కొలచి బ్రహ్మాండముల కొప్పెరలో నర్థము
యిల నిహపరముల కెక్కె నర్థము " 2-3

కొప్పెరగుబ్బలు : *వి; బహు.* కాగులవంటి స్తనాలు.

"కొప్పెరగుబ్బలమీఁది కొనగోరి రచనల
కప్పురము మెత్తిమెత్తి కడు నలసితివి " 5-273

కొమరాఁకలు : (2) *వి; బహు.* అందపు కట్టుబాట్లు లేక మేరలు.

"కన్నులఁజూచి నప్పటి కాకలు
అన్నిటాఁజెలికిఁ గొమరాకలు " 25-295

కొమరాకమానిపండు : (కొమరు + ఆఁక + మాను + పండు) వి. యౌవనం నిలుపుకొన్న మానిపండు కావచ్చు. (సం.ప.స. 22-521)

"యెఱిఁగెఱిగి నా మోవి కేఁటికి నోరూరేవు
మఱుఁగేల కొమరాఁకమానిపండు " 22-521

కొమరె : (2) వి. అప్పుడే యౌవనం పొడమిన స్త్రీ, జవ్వని.

"ఈయేడే కొమరెనైతి యెక్కుడైన గరితెను
చేయి వచ్చి సుద్దు లేమి చెప్పేవయ్యా" 28-312

కొమరెపాయపువారు : *వి; బహు.* యౌవనంలో ఉన్న స్త్రీలు, యువతులు.

"కొమరెపాయపువారు కొచ్చికొచ్చి పెనఁగితే
జమళిఁ గైకొంట గాక సటలేటికి " 8-57

కొమరెపాయము : వి. అప్పుడప్పుడే పొడుముతున్న యౌవనం.

"సమరతి మనసులు సరిఁ దులఁదూఁగితేను
కొమరెపాయములకు గురుతెట్టు వెట్టేమే" 22-236

కొమరెమదము : *వి.* యౌవనమదం.

"కొమెరమదానఁ జొక్కి కోపించినా నెఱఁగదు
తమితోడఁ బట్టుమీ పదను వచ్చేవలపు" 7-71

కొమరెవయసు : *వి.* యౌవనం.

"జమళిసిగ్గుల నాడఁజాలక సతులనంపుదురా
కొమెరవయ సిదే చేతికబ్బెను కొంకనేమిటికే " 17-124

కొమరెవయసుది : (కొమరెవయసు + అది) వి. యౌవనం కల స్త్రీ, యువతి.

కొమరేపాయము : వి. అప్పుడప్పుడే పొడముతున్న యౌవనం. (కొమరె = అప్పుడే పొడమిన స్త్రీ జవ్వనం)
"కొమరే పాయమెంత కూడినాను మోపు గాదు
తమి యెంత రేఁగినా చేతనుఁ బట్ట వస గాదు" 12-246

కొమారికము : వి. 'యువతి' అనే అర్థంకల కొమిరె శబ్దానికి 'కొమరు' ఆదేశమౌతుంది. (కొమిరె + ఆలు = కొమరాలు) కొమరు శబ్దానికి మనోజ్ఞత అని అర్థం. దానికి స్వార్థంలో ఇక ప్రత్యయం చేరి 'కొమరికము' అని ఏర్పడుతుంది. కొమరికమే కొమారికమై ఉంటుంది. మనోజ్ఞత అని అర్థం.
"కోరినట్టి చెల్లెఁగా కొమారికములెల్ల
సారెకు రేపల్లెవాడ సందులలోన" 14-278
"సిరుల శ్రీవెంకటేశుఁ జెందఁ బోలించినందుకు
మరుని కొమారికపు మన్ననలు మించెను" 29-291

కొమ్మిమాకు : వి. ఒకానొక చెట్టు.

కొమ్మిమాకు నీడలు : ప.బం; వి. ఇందలి కొమ్మిమాకు కొమ్మమాకు కావచ్చునేమో ! కొమ్మలు గల మాకు నీడలు అని అర్థమా ? లేక కొమ్మిమాకు వృక్ష విశేషమా ?
"గుత్తమైన మేడలు కొమ్మిమాకునీడలు
కొత్త సున్నపుటిండ్ల కొర యాల మాకును" 11-344

కొయ్య : (2) వి. మూర్ఖుడు.
"చయ్యన విటుఁడవై యే జాడలఁ దిరిగినాను
కొయ్యవు నీ వని దూరే గుణమా నాది" 14-499

కొయ్యకలిచూపులు : వి; బహు. (?)
"నెయ్యపుఁజుట్టరికాలు నీకే నేరిపినదె
కొయ్యకలిచూపుల కసరులను" 29-7

కొయ్యకాఁడు : వి. మూర్ఖుడు, మొద్దు, గడుసుకాడు, వంచకుడు, కఠినుడు, అసాధ్యుడు, శూరుడు.
"కొప్పువట్టే వది యేమి గుట్టున నన్ను
నీ కుప్పెసవరమున్నదా కొయ్యకాఁడవా" 13-481

కొయ్యగాఁడు : వి. 'కొయ్యకాఁడు'కు రూపాం.
"కోరి నేరా లెంచనేలే కొయ్యగాండ్లతోడ
వోరుచుకుండే టస్సురుసురే మేలు" 11-458

కొయ్యతనము : (15) వి. 1. దుష్టచేష్ట 2. దౌష్ట్యం, మూర్ఖత్వం.
"కొయ్యతనాలు నీ కేల కోరినా మగఁడితఁడు
చెయ్యెత్తి చూపి యేల చెలులకుఁ జెప్పవే" 14-516

కొయ్యతనాలది : వి. దుష్టురాలు, మూర్ఖురాలు.
"ఇయ్యకొంటి నిఁక నీ యిచ్చా యను
కొయ్యతనాలదాననా కొసరితిఁగాక" 19-2

కొయ్యతనాలాడు : అ.క్రి. దుష్టచేష్టలు చేయు.
"ఇయ్యకొని నట్టివాఁడు ఇట మీఁదెఱఁగడా
కొయ్యతనాలాడకురే కోపగించీని" 19-580

కొయ్యది : (కొయ్య + అది) దుష్టురాలు, దుడుకుది, పౌరుష్యం కలది.
"కలసి పరమపదఘనుడు శ్రీవెంకటేశు
కొలఁదెఱఁగక వుండఁ గొయ్యదాననా" 13-495

కొరకొర : వి. 1. విరోధం, ద్వేషం. 2. కోపం.
"సరసము నీతోడ నాడే చనవరి సతులతో
కొరకొర వెట్టుకొని కోపగించేనా" 16-236

కొరకొరయగు : అ.క్రి. చెలరేగు, కోపంతో చిరచిరలాడు.
"చిలుకలు కొరకొరై చిమ్మిరేఁగఁ బలికినా
చెలరేఁగి తాఁబెట్టిన సేసలు నా కున్నవి" 12-270

కొరమాలు : ప.బం; అ.క్రి. పనికిమాలు.
"విరసపు భావముల వినికిచే వీనులెల్లా
గొరమాలె మాకు నేఁటి కులాచారము" 4-312

కొరముట్టు : వి. పనిముట్టు, సాధనం. కొఱముట్టు అని శ.ర.
"కొరముట్టు బండియైన కూలఁగాలఁ దన్నీని
యిరవై పాములమడు గీఁదఁ జొచ్చీని" 22-59

కొరయు: అ.క్రి. తొలఁగు.
"కొచ్చినఁ గొరయవు కోపములు
గచ్చుల గుణములు గల నాళ్ళు" 4-343

కొరవిదయ్యము: వి. ఒక పిశాచం, కొరవిరూపంలో కనిపించే దయ్యం.
"కోమలి చందురుఁడనే కొరవిదయ్యముఁ
దీమస మింతయు మాని దిగు లందెను" 24-76

కొరిమె: వి. దోషం.

కొఱకొఱ: వి. 1. విరోధం, ద్వేషం 2. కోపం 3. కోపాదులలో ఊర్పులవల్ల కలిగే ధ్వనికి అనుకరణం.
"కొఱకొఱ లెల్ల దీరె కొచ్చికొచ్చి చూచితేను
యెఱుఁగని దేది యింతి యేమి సేసునయ్యా"
7-544

కొఱకొఱఁబెట్టు: (?)
"మెఱసి పెనఁగవచ్చీ మిక్కుటపు రతులను
కొఱకొఱఁబెట్టఁగదే గొల్లకొసరు" 7-489

కొఱత: వి. 1. తక్కువ, లోపం 2. దోషం, తప్పు, శేషం, అవమానం.
"చెఱఁగు మాసినవేళ చేరి ముట్ట వచ్చేవు
కొఱతంటా వద్దంటేఁ గోపగించేవు" 11-262

కొఱ్ఱు: వి. 1. ముల్లు 2. శూలం 3. మేకు 4. కాలుతున్న కఱ్ఱ 5. ఇంద్రధనుస్సు 6. ముళ్ళు తగిలి గుడ్డలో ఏర్పడ్డ చిరుగు.
"యెక్కువగా వినోదాన కితఁడు తే రెక్కితేను
యెక్కిరి దైత్యులు కొఱ్ఱు లందఱుఁ గూడి" 3-92

కొల: (5) *వి; మాం.* 1. వైరం 2. దోషం 3. పాపం, కసటు 4. హింస 5. బాధ. (వ్యు.)
"ఈతనిఁగొలిచితేనే యిన్ని గొలలునుఁ దీరు
చేతనఁబెట్టు పుణ్యాలు చేరువనే కలుగు" 2-57

కొలఁగా: క్రి.విశ. ఎక్కువగా, అధికంగా.
"చల్లగా శ్రీవెంకటేశు శరణంటి మిదె మేము
కొల్లగా మీ రెల్ల మమ్ము గుఱిగా వర్ధిల్లరో"
1-441

కొలఁగులు: *వి; బహు.* 'కొలను'కు బహువచన రూపమైన 'కొలఁకులు'కు వ్యావహారికరూపం కావచ్చు. సరస్సులు.
"కొంత నీ కృపారసము కొలఁగులై
ముంచఁగాను
వింతగాఁగలువ లట్టె వికసించెను" 19-378

కొలఁదిఁబడు: అ.క్రి. తక్కువపడు, న్యూనమగు.
"దంటలై నాచేతఁ దలపించుకొనఁగ
దొరకొంటవింక నిది నీకు కొలఁదిఁబడునా"
6-38

కొలఁదిపాటు: వి. తక్కువ కావడం, న్యూనత.
"ఎన్నఁదిఁక యేది గొలఁదిపాటు
వున్నతపు మాయలకే వొడిగట్టవలసె" 3-440

కొలనిదోఁపరి: వి. శ్రీవెంకటేశ్వరస్వామి, కొలనును దోచుకున్నవాడు.
"కొలనిదోపరికి గొబ్బిళ్ళో యదు
కులస్వామికి గొబ్బిళ్ళో" 5-98

కొలము: (3) వి. 'కులము'నకు వికృతిరూపం.
"చెలిమి విడువలేక చెయివ్రాఁత యిచ్చెఁగాక
కొలమున నేమి తక్కువవాఁడా" 10-2-68

కొలమునాలు: (2) (కొలము + ఆలు) వి. కులస్త్రీ.
"కొలమునాలఁ గనక కోరి సేవ సేసేఁగాక
అలపు చూపితి నప్పుడే ఆయాలంటేఁ దగవా"
9-308

కొలికి: వి. కంఠస్వరం (?) బ్రౌన్. కొలికి - In poetry కొలికి means voice as kark and ABA declare that చిలుకలకొలికి is the same as శుకవాణి sweet voice.
"మనసు గోరికల కళ మర్మములఁ బూజించె
గొనకొన్న రతుల చేఁగొలికి పూజించె" 6-80

కొలిమిగూటిలో సూదులమ్ముట: వి. సూదులు తయారుచేసే కొలిమి గూటిలోనికే సూదులమ్మబోవుట - అనగా పని లేని పని, వ్యర్థమైన ప్రయత్నమని భావం.
"కొమ్మ చూడవే కొలిమిగూటిలో

నమ్మెడి సూదులె యదె వీఁడు" 5-123

కొలుచు: వి. ధాన్యం.

"గాదెల కొలుచు వో నీ గాథలు

ఆ దెస నీ దెస నే మంత కోపఁగలమా"

9-116 & 1-130

కొలుచుండి పొల్లు కడఁబడు: ప.బం; అ.క్రి. మేలిమి మిగిలి పనికిరానిది దూరమగు. తూర్పెత్తి నపుడు ధాన్యపు గింజలు మిగిలి పొల్లు దూరమగు అని వాచ్యార్థం.

"చెంది వీచే గాలొకటే చేని పంటానొకటే

పొందిగట్టు కొలుచుండి పొల్లు కడఁబడును"

3-14

కొలుపిడి: (?)

"యిలమీఁద తమ సొమ్ము లెవ్వరివద్ద నుండినా

తలపిడి కొలుపిడి తగిలినట్టు" 2-5

కొలువుకాంత: వి. చెలికత్తె, దాసి.

"చేయి మాటుసేసుక యా చెలిదిక్కే చూచేవు

యీ యెడఁ గొలువుకాంత లందరిలోన"

14-394

కొలువుడుబంటు: వి. సేవచేసే బంటు, ఇష్టమైన సేవకుడు.

"కొచ్చిన శ్రీవేంకటేశు కొలువుడుబంటు నింతే

పచ్చి యింద్రియాలకెల్లాఁ బంపుసేసేను" 2-427

కొలువుపతిమె: వి. ఆస్థానంలోని ప్రతిమ.

"కొలువుపతిమె లెల్లా గోడచేరుపులె కాక

కలయిక రతులకుఁ గారణ మేమి" 8-212

కొలువుసేయు: అ.క్రి. సభచేయు, సేవచేయు.

"కొలువు సేసేనంటా కొప్పు దువ్వితివి గాని

ఇలఁ గాఁగిలించుకొంటే హీనమా నీకు" 18-535

కొల్చిపోయు: ప.బం; స.క్రి. వెచ్చించు.

"సొరిది లోకములెల్లాఁ జొచ్చి కాలగతులను

పొరి నాయుష్యముఁ గొల్చి

పోయుచున్నారయా" 2-266

కొల్చు: వి. 'కొలుచు'కు రూపాం. ధాన్యం.

కొల్లఁబోవు: అ.క్రి. పాడగు, వ్యర్థమగు.

"అక్కడ నా పాట్లువడి యిక్కడ నీ పాటుపడి

కుక్కనోరికళాసమై కొల్లఁబోయ బతుకు" 1-90

"కడుపు నిండదు కన్నూ దనియదు

కడగి లోని యాకలియుఁ బోదు

సడిబడి కుడిచిన కుడుపెల్ల నిను ము

గుడిచిన నీరై కొల్లఁబోయె" 1-124

కొల్లకత్తె: (కొల్ల + కత్తె) వి. కొల్లపెట్టే స్త్రీ, దోపుడుకత్తె. (వ్యు.)

"ఇల్లాలి చేతలా యివి యెల్లాను

కొల్లకత్తెవలెఁ బుచ్చుకొంటివి వుంగరము"

26-406

కొల్లకాఁడు: (కొల్ల + కాఁడు) వి. కొల్లగొట్టేవాఁడు, కొళ్ళగాడు.

"చెల్లునా నీ కీ పనులు చెన్నకేశా

కొల్లకాఁడ వౌర గండికోటచెన్నకేశా" 20-50

కొల్లవట్టు: స.క్రి; ప.బం. కొల్లగొట్టు.

"గుట్టునఁ గోరిక లెల్లం గొల్లవట్టె" 5-188

కొల్లున: (7) క్రి.విశే. గొల్లున.

"కొల్లున నీతో నవ్వి కూడుట మేలు గాక

కెల్లురేఁగి నిన్ను విసిగించనేఁటికి" 14-27

కొసరికె: (కొసరు + ఇకె) వి. 1. వాంఛ, కోరిక, ప్రార్థన 2. విజృంభణం 3. సంకోచం 4. లోపం 5. సంశయం 6.అనులాపం 7.పెచ్చు. (వ్యు.)

"దెసల సజ్జనులకు తిరమైన పుణ్యము

కొసరికె కంసుని గుండె దిగులు" 17-144

కొసరు: స.క్రి. అపేక్షించు, కోరు, ప్రార్థించు, ఆస్వాదించు, అనుభవించు.

"అతనిఁగొసరకురే అందేమున్నది

ఆతుమలో సరివచ్చె నందేమున్నది" 7-466

కో

కోఁచక: 'కొంచక'కు రూపాం. కొంచు = సంకోచించు.

"పూఁచిపట్టి యీ యింతిఁ బొగడరమ్మా

కోఁచక మేఘములోని కొమ్మెఱుఁగువలెను"

20-218

కోఁడికోఁడి : మఱలమఱల (?)
"పెనఁగేవు వలపులు వేఁడివేఁడి
గునియుచు మొక్కేవేమే కోఁడికోఁడి" 22-489

కోఁడికోఁడి చూపులు : వి; బహు. కొనచూపులు, క్రీగంటి చూపులు; ఇందులోని కోఁడి శబ్దం కోటి శబ్దభవమో, కొండికి రూపాంతరమో కాగలదని సం.ప.స. (13 వాల్యూం. 1.అను. 3 పు.)
"కోఁడికోఁడి చూపులను కొమ్మలు చూడఁగాను
నాఁడునేఁడు వొక్కరీతి నవ్వునవ్వీని" 13-128

కోఁడు : (?)
"కోఁడి నన్ను లోనుసేసుకొని నీ యిచ్చఁదిరిగి
ఆఁడుజాతి కిదే చాలు అంటె వారోరుతురా"
8-246

కోఁతవేఁత : ప.బం; వి. పంటకోయడం – కొట్టడం (గింజ రాలేట్లు)
"బూతాల పొంగటికే పొడమిన పంటలెల్లా
కోఁతవేఁత చూచుకొని కోరుకుంటారు" 3-464

కోక చాకిఇంటవేసి కొక్కిరాల వెంటఁబోవు : ప.బం; అ.క్రి. ఒకచోట వస్తువు నుంచి మరొకచోట వెదకు. వ్యర్థ ప్రయత్నం చేయు.
"కోక చాకియింట వేసి కొక్కిరాల వెంటబోతే
ఆకడ పురుషార్థము నందీనా జీవుఁడు" 3-175

కోకిలవాణి : వి. కోకిల కంఠంవంటి కంఠం గల స్త్రీ, స్త్రీ.
"చెలరేఁగి యాదరించీ జెలువునిఁజూడవమ్మా
కులుపుమట్టెల రాణి కోకిలవాణి" 29-159

కోకో : కొనుము కొనుము, గ్రహించుము గ్రహించుము.
"కోక లేల దీసితివి గోవిందుడా నీకు
కోకో ఇదివో మొక్కు గోవిందుఁడా" 20-3

కోగిల : (2) వి. 'కోకిల'కు వ్యావహారికరూపం. (?) క. కోగిలె. చూ : కోవిల.
"వనము గోగిలవైతి వామనా నీకు
వనితలు బాఁతి వామనా" 15-244

కోటరము : వి. కోడంత్రం, కోడటికం.
"జంతలైరి లోలోనే సారె నిన్ను ముద్దాడఁగా
కొంతయినా నత్తలకు కోటరాలు సేతురా" 21-83

కోటా : వి. కోట, గానానుకూలమైన దీర్ఘం.
"వెలియానలనే దండు విడిసిన కోటా
గులుగై యింద్రియములు కొల్లగొన్నకోటా"
2-84

కోటానఁగోటి : (21) (కోటి +కోటి) వి. అత్యధికం, పెక్కులు, అసంఖ్యాకం.
"ఈ రీతి వలపులొకటి నుమడాయ విభుఁడ
కోరికలు గోటానఁగోటి సతికాయ" 17-513

కోటారు : కొటారు. చూ : కొటారు.
"కోరువంచరో కోటారు
అరసి మనసా అంతరాత్మకు" 1-387

కోటి : వి. గొప్ప, అమూల్యం.
"చెప్పనేలే ప్రియములు సారెసారె
గొప్పు దువ్వినదే నాకుఁ గోటి గాదా" 14-172

కోటికిఁబడగలెత్తు : ప.బం; అ.క్రి. కోటీశ్వరుడైనట్లు జెండా ఎత్తుకొను, ధనాఢ్యుడగు, ఘనుడగు. 'కోటి' ధనం సంపాదించగానే తచ్చిహ్నంగా పాముపడగ మాదిరిగా ఒక ధ్వజ మెత్తే ఆచారం ఉండి ఉంటుంది. ఆవిధంగా వచ్చిన పలుకుబడి.
"కోటికిఁ బడగలెత్తి కుచములు నీకుఁజూపీ
జూటుఁదనములు మాని చూడవయ్యా"
29-319

కోటికిఁబడగెత్తు : (4) ప.బం. అ.క్రి; చూ :కోటికిఁబడగలెత్తు.
"చేటెఱుంగని కూన చెలి చిత్తమే కదా
కోటికిని బడగెత్తెఁ గోరికలను" 6-133

కోటికిఁబడిగెత్తు : (2) ప.బం; అ.క్రి. చూ : కోటికిఁబడగెత్తు.
"కోరి నీవాడిన మాటకుఁగోటికిఁబడిగెత్తి
గారవానఁ బానుపుపైఁ గాచుకున్నది" 26-382

కోటికి ఒకతె : ప.బం; వి. ఎంతోమందిలో ఒకతె, అతి విరళం.

కోటికిబడెగెగా : పూర్వం కోటిధనం ఉన్నవాడెల్లా ఒక ధ్వజం కట్టేవాడు. అదే కోటికి పడిగె
"మేటియైన గొంతిదేవి మేనల్లుఁడీతఁడా
కోటికిఁబడెగెగాను కొండ యెత్తెను" 4-6

కోటికొండలు : వి; బహు. అత్యధికం, ఇబ్బడిముబ్బడి.
"నిండుఁగొలువులో నాతో నీవు నవ్వినది నాకు
కొండంత పెద్దరికము కోటికొండలు" 16-286

కోటిసేయు : (13) ప.బం; అ.క్రి. అమూల్యమగు, మిక్కిలి విలువచేయు.
"కూరిమే కలిగితేను కొసరి తిట్టిన తిట్టు
కోరినట్టే యిద్దరికిఁ గోటిసేసు" 17-399

కోడతిరునాళ్లు : వి; బహు. వసంతోత్సవాలు. త. కోడై, కోడె = ఎండకాలం, వేసగికాలం, గ్రీష్మకాలంలో జరిగే ఉత్సవాలు. కోడతిరునాళ్లు తిరుపతి శాసనాలలో పేర్కొనబడ్డాయి. ఇవి వేసవిలో వెన్నెల రాత్రుల్లో జరుపబడే ఉత్సవాలు.
"చెప్పరాని మహిమల శ్రీవెంకటేశ్వరుఁడు
కుప్పళించీ వాసనలఁ గోడతిరునాళ్లు" 18-281

కోడికూతనోరివాడు : వి. ఇంద్రుడు; అహల్యకోసం వెళ్ళినపుడు ఇంద్రుడు కోడి రూపాన్ని ధరించి కోడివలె కూసినాడు.
"కోడికూఁత నోరివాని కుఱ్ఱతమ్ముఁ డైనవాఁడు
బూడిద పూసినవాని బుద్ధులవాఁడు" 5-295

కోడికూతనోరివాని కుఱ్ఱతమ్ముఁడు : వి. వామనుడు. (కోడికూత నోరివాడు = ఇంద్రుడు; ఇంద్రుని చిన్నతమ్ముడు వామనుడు; ఇంద్రుడు అదితి కశ్యపుల పుత్రుడు; వామనుడు కూడ అదితి కశ్యపుల పుత్రుడే. కనుక వామనుడు ఇంద్రునికి తమ్ముడే కదా!)
"కోడికూఁతనోరివాని కుఱ్ఱతమ్ముడైనవాడు
బూడిద పూసినవాని బుద్ధులవాఁడు" 5-295

కోడి కూసినందాకా : ప.బం; క్రి.విణ. తెల్లవారుజాము వరకు.
"కోడి కూసినందాకా సాగుడుఁగతే చెప్పితివి
వీడె మిప్పించుకొనను వేళ యేది" 14-169

కోడిగము : వి. విలాసచేష్ట, వంచన, కొంటెతనం, పరిహాసం.

కోడియెరుకలు : వి; బహు. (?)
"వాడికె నొండొరులము వలచిన వలపులే
కోడి యెరుకలు సేసి కొనవచ్చేరు" 8-14

కోడెకాఁడు : (18) (కోడె + కాఁడు) వి. విటుడు, పల్లవుడు, యౌవనానికి పూర్వదశలో నున్నవాడు, యువకుడు.
"కోడెకాఁడయితే నేమి గురుతులుండితే యేమి
జోడుగూడి నా మొగము చూచెగాఁ తాను"
29-210

కోడెగత్తె : వి. (కోడె + కత్తె) యువతి, యౌవనానికి పూర్వదశలో నున్న స్త్రీ.
"కోడెకత్తెవు కొమ్మా నీకు నేఁ జెప్పితి
రూడితోనే చేఁతలే నేరుచుకోవే చెలియా"
22-522

కోడెతనము : వి. 1.పడుచుతనం 2.జాణతనం 3.విటత్వం.
"వేడుక నేఁజేసితేను వెంగెమందురా
కోడెతనమెల్లా నాపై గురి సేసేవారా" 20-548

కోడెతనాలుసేయు : అ.క్రి. విటత్వం జరుపు.
"వేడుకకాఁడైన యట్టి విభుఁడు గాక
కోడెతనాలు సేసీని గోలవాఁడా యీతఁడు"
24-596

కోడెవయసు : వి. యౌవనం, పడచుదనం.
"కోడెవయసు కొమిరె లేమల
వాడికకు దేను వసమా"
"కోడెవయసున నింతి కోరికల నిండినది" 8-28

కోడెవయసుది : (కోడెవయసు + అది) యువతి.
"గొప్పైన కన్నులదాన కోడెవయసుదాన
చిప్పిలు గళలదాన సింగారిదాన" 29-409

కోతి కొమ్మ తప్పఁబారునా : సామెత; (?)
"ఎఱుఁగుకోలేని జీవి యెడ్డగాక గుటి
నెంతయినాఁ గోతి కొమ్మ దప్పఁబారునా"
15-154

కోన చెన్నరాయఁడు : కడపజిల్లా కడప తాలూకాలోని నంది మండలానికి దక్షిణంగా పాలకొండ పర్వతంలోని కోనలో చక్కని ఊటలుగల కోనలో వెలసిన చెన్నకేశవస్వామి. ఈ స్వామిని పాలకొండరాయడు అని అంటారు.

"మిక్కిలి నేరుపరివి మేలు మేలోయి
గుక్కని వలపుల వో కోనచెన్నరాయఁడా"
10-2-19

"నేనొకటి సేయఁగాను నీ వొకటి సేసేవు
కోనచెన్నరాయఁడ నీ గుణమింక మానవు"
11-423

కోనతిరువేంగళేశుఁడు : కడపకు దక్షిణంగా నాలుగుమైళ్ల దూరంలో ఉండే పాలకొండ కోనయే కోన కావచ్చు. అక్కడ నెలకొన్న తిరువేంకటనాథుడు. ఇతనిని పాలకొండ రాయుడు అనీ, కోన చెన్నకేశవుడు అనీ అంటారు.

"వీడెమిచ్చీఁ గోన తిరువేంగళేశుఁడై వచ్చి
కూడెను శ్రీవేంకటాద్రి కొండమీఁదఁజూడవే"
8-142

"వేఁగిరమా కోన తిరువేంగళేశ నిండెఁ
దేగపు వలపు కోనతిరువెంగళేశ" 26-182

కోనాడు : స.క్రి. కొనియాడు (?)

"కోటులైన వేదములు కోనాడి విన్నందులోన
నోటి విన్నపము లొక్క నువ్వుగింజంతే" 8-42

కోనాలగొంది : వి. మిక్కిలి ఇరుకైన చీకటి మూల. రూపాంతరం. కోణాలగొంది.

"పానుపుమీఁదటఁ దాను పవళించి వున్నవాఁడు
గోనాలగొంది నిదె గోవిందుఁడు" 18-414

కోనేటప్ప : (కోనేటి + అప్ప) కోనేటిరాయడు, శ్రీవేంకటేశ్వర స్వామి.

"దిమ్మరి కోనేటప్పని తిరువేంకటపతిఁ గూడిన
కొమ్మకు మీఁదటి యాసల కోరిక లేటి వొకో"
5-292

కోనేటి తిమ్మఁడు : వి. చూ : కోనేటి తిమ్మయ్య.

"దిమ్మరివి కోనేటితిమ్మ నీపైఁ బ్రియము
కుమ్మరించని దేటి కోర్కిరా వోరి" 5-45

కోనేటి తిమ్మయ్య : వి. కోనేటిరాయడు, తిరుమల లోని కోనేటివద్ద వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి. (తిరుమల + అయ్య = తిమ్మయ్య)

"కొండలరాయఁడు కోనేటితిమ్మయ్య
కొండ తలనెత్తి గుఱుతైనవాఁడు" 12-234

కోనేటి తిమ్మినాయఁడు : వి. కోనేటి తిరుమలనాయడు, తిరుమలలో కోనేటివద్ద వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి.

"తెలిసి కోనేటి తిమ్మినాయఁడు చొచ్చె
బలిసె యీ కోట భయమేల" 1-61

కోనేటిపతి : వి. తిరుమలలోని కోనేటికి విభుడైన శ్రీవేంకటేశ్వరస్వామి.

"కొండలను నెలకొన్న కోనేటిపతి వనఁగ
నుండవలెనను నీకు నోపలేనవక" 1-200

"కోపకత్తె నా నిన్ను కొసరుచు జంకించఁగ
వోపి నీతో నవ్వుతానే వుండుదుఁగాక" 18-587

కోనేటిరాయఁడు : వి. శ్రీవెంకటేశ్వరస్వామి. తిరుమలలోని పవిత్రమైన కోనేటికి (పుష్కరిణికి) ప్రభువు.

"అండనే శ్రీవేంకటాద్రి నలరి నన్నేలితివి
కొండలలో నెలకొన్న కోనేటిరాయ" 26-299

కోనేటివాఁడు : వి. శ్రీవేంకటేశ్వరస్వామి, తిరుమలలోని కోనేరు (స్వామి పుష్కరిణి)కు విభుఁడు. 5-216

కోనేటివిభుఁడు : వి. కోనేటిరాయడు, తిరుమలలోని కోనేటివద్ద వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి.

"విటవరుఁడ కోనేటివిభుడ నీ
వెటు దొలంగిన దేహమెట్టు నిలుపుదురా"
5-121

కోనేరమ్మ : వి. పద్మావతి (కోనేరప్ప = వేంకటేశ్వరుడు)

కోపకత్తె : వి. కోపస్వభావంకల స్త్రీ.

"మల్లాడే కోపకత్తెను మట్టుకు దేవచ్చు గాని

చల్లజంపులాడినైతే సాధించరాదు" 23-107

కోపము ముక్కుమీఁద నుండు : *ప.బం; అ.క్రి.* తొందరగా కోపం వచ్చు.

"దూరఁబోతే కోపము దారకు ముక్కుననుండు
వూరకే తోడుక రారే వొడఁబరచేనూ" 11-168

కోపముసేయు : స.క్రి. కోపించు.

"తప్పక చూచినందుకె తగఁగోపము సేసుక
కొప్పు దువ్వినఁ గసరుకొనేవేమే" 11-306

కోపు : (1) వి. దిక్కు, పార్శ్వం, (కోపు = ఒయ్యారం ఆం.ప.ని.) పక్షం, బలగం, సమయం, నిమిత్తం, విధం, సుందరం, ధనురగ్రం, నాట్యం, తీర్పు, అందం, సారంగ. నిడివి. (బహువచనం నమస్కారాలు ఆం.ప.ని.) (విధము అని ఆం.ప.ని.)

"కోపులఁగప్పురధూళి గుప్పరే యీతనికి" 19-335

"చూపుల కొలఁదివే సొంపైన కాంక్షలివి
కోపులిందుకు నీవు గొణఁగుకొన నేలే" 24-177

కోపులు : *వి; బహు.* మాం. నిలుకడ లేని పోకడలు, దంభాలు. విసురుమాటలు మొ॥ అర్థాల్లో వాడబడే మాండలికం. కోపులు వడొద్దు అనీ ఈనాటికీ వ్యవహారం.

"కోపుల వెనుక నన్నుఁ గూడేవుగాని,
పో పో యెందు పోయేవో పోయి రారాదా" 26-11

కోమటిండ్లపొరుగు : *ప.బం; వి.* ఇబ్బందిని కలిగించేది.

"ముద్దు ముద్దు సేసి నిన్ను మోవఁబెంచి మీ తల్లి
పొద్దువొద్దు కోమటిండ్ల పొరుగాయ బ్రదుకు" 9-73

కోమటిమేనరికము : (3) *వి; పబం.* తప్పనిసరిగా జరిగేది. కోమట్లు మేనరికాన్నే ఎక్కువగా ఇష్టపడతారు. మేనరికాన్నికాక ఇతరసంబంధం చేసుకున్నా మేనమామ గోత్రంవారినే కోరుకుంటారు.

"నాననీవే వలపులు నాకుఁదనకుఁ గోమటి
మేనరికమైనట్టు మెచ్చు గావలెను" 22-110

కోమటిసాకిరి : *ప.బం; వి.* ఉభయవాదులకూ పనికిరాని సాక్ష్యం, ఎటూ చెందని సాక్ష్యం.

"యేమని విన్నవించేము యెవ్వరినిఁ గాదనేము
కోమటి సాకిరులాయ గొబ్బున మా మాఁటలు" 27-203

కోమటి సాక్ష్యము : చూ : కోమటిసాకిరి.

కోమలపువాఁడు : వి. చక్కదనం కలవాఁడు, సౌందర్యం కలవాడు.

"మోము వంచుకొని నిన్ను ముద్దరాల నేమి సేసే
కోమలపువాఁడవు నీ గుణ మింతే కాక" 27-232

కోమలికము : వి. సౌందర్యం, చక్కదనం.

"కూడేటి సంతానములు కొనగోళ్లై వాండ్లెక్కు
పాడితోఁ గోమలికము పాదాల నిండె" 19-342

కోయరాని కోరికెలు : *వి; బహు.* తుంచరాని కోరికలు.

"యీ యెడ శ్రీవెంకటేశుఁడేతెంచి తా
నన్నుఁగూడె
కోయరాని కోరికలు కొలఁది నుండీనా" 7-20

కోయిల : (2) వి. కోకిల.

"వాయెత్తి చిలుకేల వదరీనె పలుమారు
కోయిలలు దామేల గొరగీనే" 5-191

కోయిలకాలు : *వి; బహు.* సజ్జ, జొన్న, వరి వంటి పైర్లు కోయగా నేలలో మిగిలిన మొదళ్ళు. ఇవి చేనిలో పండిన పంట స్థితిని సూచిస్తాయి. రూపాం. కొయికాలు, కొయలకాలు, కొయ్యలు, కొయ్యలకాళ్లు, కోలెలు

"చేయారఁ దన మేని చిన్న లివె చేని పంట
కోయిలకాలే చెప్పఁ గోప మేటి కనవే" 26-139

కోరకొప్పు : వి. పెద్దకొప్పు.

"కోరకొప్పు వంగీ నది కూడ ముడుచుకొనవే
నీరువలెఁ గరఁగుతా నివ్వెరఁగు లేఁటికి" 16-565

కోరికె : (46) వి. 'కోరిక'కు వ్యావహారికరూపం. అన్నమయ్య 'కోరిక' అనే రూపాన్నికూడా వాడినా 'కోరికె' అనే రూపాన్నే ఎక్కువగా వాడినాడు.

కోరు : (2) వి. 1. భాగం, పాలు, వంతు, కౌలు

2. రాజాదులకిచ్చే ధనేతరమైన వస్తురూపమైన కప్పం. 3. తాకట్టు 4. అంచు.

"కొమ్మల జవ్వనములు కోరువట్టేవా
కమ్మర మా కోరికలు గాదెఁబోసేవా" 7-302

"కలిమి మీఱి చన్నులు కనకపురాశు లాయ
కొలచి కోరు గొందువు కొటారుకు రావయ్యా" 22-320

కోరో: తీసుకొండి అని ప్రార్థించడం.

"గొల్లవారి పిల్లఁగోవి కోరో చల్లా" 6-109

'కోరో' చల్ల యనుచు మెరుఁగు
గుచముల దరమెట్టి నడవ
కోరో కోరో రారో కోరి విడేలు
సారె సారె నిందరికిఁ జాటితిమి సుండి" 12-61

కోర్పులు: *వి; బహు.* (?)

"మేలు మేలే యితఁడు నేర్చును మెచ్చితి
నన్నిటా నీతని కూటమి
కోలుముందై యిటులఁ గోర్పులు కొనలుసాగని
దేఁటిదే" 28-51

కోలగాచి పందె మాడుట: వి. సం.ప.స. లో దీని వివరణం ఇట్లా ఉంది. "ఇదియొక పలుకుబడిగా తోచుచున్నది. జాతీయములన్నీ తాత్పర్యార్థ ప్రధానములు. ఒకహద్దు చేసి దానిని దాటకుండ నియమించుట దీని తాత్పర్యము. ఒక గీతనుగాని కఱ్ఱనుగాని హద్దుగా చేసికొని దానిని దాటకుండా (చెడుగుడు వలె) ఆడునట్టి క్రీడావిశేషమందు జాతీయముగ ప్రయోగించినట్లున్నది.

"మేలయ్యా మచ్చములు నీ మేనఁ జూప నెన్ని లేవు
కోలగాచి పందెమాడఁ గొంకేరు గాక" 18-401

కోలదనివెట్టు: *ప.బం.* (కోల = దీర్ఘము, దని = ధ్వని) దీర్ఘముగా శబ్దించు - ఇట స్తుతిచేయు కావచ్చు.

"కూడఁగూడ గురుతులు కొనగోరి చెనకులు
మేడఁగోలదనివెట్టే మిట్టి చతురతలు" 29-11

కోలాటము: వి. చేతి కోలలతో తాళం వేస్తూ పాడుతూ చుట్టూ తిరుగుతూ ఆడే ఒక ఆట.

"కాంతలు వలయపు కంకణరవముల
నంతంతఁ గోలాట మాడఁగను" 19-343

కోలుపడిగెలు: *వి; బహు.* పెద్దపడగలు ; పడగలు అనేదానికి పడిగెలు జనవ్యవహారరూపం కావచ్చు.

"గొడుగులనీడను కోలుపడిగెల తోడ
యెడనెడవాడల నీ వేగి రాఁగాను" 18-73

కోలుపడు: అ.క్రి. కోలుపోవు, పోగొట్టుకొను, తగ్గు.

"ఇందరి బుద్ధులు యీశ్వరేచ్ఛకు సరి రావు
గొందినున్న మానుషము కోలుపడెంతైనా" 2-94

కోలుముందు: (45) ప.బం. మున్ముందు, మిక్కిలి ముందు, మొట్టమొదలు. ముందుపడి పుచ్చుకొనుట అను నర్థము కావచ్చును. 'అహమహమిక' అని సం.ప.స. (13 వా. 1 అను. 3 పు.)

"నాలి సేసి పానుపుపై నవ్వులు నవ్వేవు నీవు
కోలుముందైన మీఁదఁ గొంక నేటికే" 8-100

"మేలము లమరెఁగా మీకు మీకును
కోలుముందుగా పొందు గూడె వినవయ్యా" 13-207

కోవయ్యా: (5) (కో + అయ్యా) తీసుకోవయ్యా.

"కొంచెపు వెన్నెలలివె కోవయ్యా కానికె" 5-35

కోవరము: *విణ.* అధికమైన (వ్యు.), గాఢమైన, అధికమైన.

"కోవరపుసంపదల కోరేటి జీవుఁడా
శ్రీవెంకటేశుని సేవ గోరరాదా" 15-133

కోవరివాఁడు: వి. (?)

"చలికిఁ గోవరివాని సరుస బా వాయఁగాని
పలుదేవతలకెల్లఁ బ్రాణబంధుఁడితఁడే" 1-454

కోవిల: వి. 'కోకిల'కు వ్యావహారికరూపం. అన్నమయ్య ఒకటి రెండు చోట్లతప్ప అంతటా 'కోవిల' అనే రూపాన్నే ప్రయోగించినా దీనికి సుమారు నూట ఇరవైకి పైగా ప్రయోగాలు కనిపిస్తున్నాయి. ఒక్క చోట మాత్రం కోయిల

అనే ప్రయోగం, మరోచోట కోవెల అనే ప్రయోగం చోటుచేసుకున్నాయి. మరోచోట 'కోగిల' అనే రూపం కనిపిస్తుంది.

కోవిలకుంట్ల గోపాలకృష్ణుడు : వి. కోవిలకుంటయే కోవిలకుంట్ల కావచ్చును. కోవిలకుంట కర్నూలు జిల్లాలో ఒక తాలూకా కేంద్రం. ఇట వెలసిన స్వామియే కోవిలకుంట్ల గోపాలకృష్ణుడు.

"విడువని పొందులతో విఱ్ఱవీఁగే నీకు నేల

కొడిమె కోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా"

10-2-26

కోవెల : వి. 'కోకిల'కు రూపాం.

"అందపుఁగోవెలవలె ఆకు కొరికి నీ కిచ్చీ

చెంది పొత్తుల వీడెము సేయరాదా" 12-177

పగటుఁ గోవెలలు 6-7, కొమ్మకోవెల 16-551, గండుఁగోవెల 17-147, ఉంచపుఁ గోవెల 14-388, పాటల కోవెలలు 16-489, ఆమని కోవెల 17-418 "కోవెల కూఁతలకు నొక్క వింత నెఱప" అని య.చ.ప్రయోగం. (2-50)

కోవో : క్రి. తీసుకొమ్ము, గ్రహించుము . (బహువచనంలో కోరో అని రూపం .)

"నారాయణుని శ్రీనామ మిది

కోరినవిచ్చీఁ గోవో మనసా" 4 అను. 73

కోసువానిపల్లె : వి. కడపజిల్లా జమ్మలమడుగు తాలూకాలో కోసనేపల్లె అనే గ్రామం ఉంది. ఈ గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఉంది. ఈ గ్రామానికి హరిహరపురమనే పేరు కూడా ఉంది. కోసనేపల్లె యే కోసువానిపల్లెగా మారి ఉంటుందేమో?

"కోసువాని పల్లెలోనఁ గూడి శ్రీవేంకటనాథ

తోసిపోవైతివి యింత దొరలకుఁ జెల్లునా"

10-2-71

"పతివైన కోసువానిపల్లె శ్రీవేంకటనాథ

గతియై కూడుండమన్నాఁ గాఁగిట నుండేవు"

10-2-75

కౌ

కౌఁగిలి : (54) వి. వక్షఃస్థలం, ఱొమ్ము, బాహువుల మధ్యభాగం. అన్నమయ్య 'కౌఁగిలి' అనే పదాన్ని వాడినా, 'కాఁగిలి' అన్న వ్యావహారిక రూపాన్నే ఎక్కువగా వాడినాడు.

"కడు నెంత పెరిగినా కౌఁగిటిలోనే చన్నులు"

12-423

కౌఁగలించు : (6) స.క్రి. ఆలింగనం చేసుకొను ; దీనికి కాఁగలించు, కాఁగిలించు, కౌఁగిలించు అనే రూపాలు కూడా కనిపిస్తున్నాయి.

"అంది నీ చేతులుఁ దీగెలవి వొక్కసరందురు

కందువనరడునవి కౌఁగలించవు" 7-266

కౌఁగిలించు : (10) స.క్రి. ఆలింగనం చేసుకొను.

"వీఁపునఁ గుచాలు మోపి వెలఁది కౌఁగిలించఁగ

నేపున నేనుగ నెక్కె నిదె దేవుఁడు" 7-58

అన్నమయ్య ఈ పదాన్ని అతివిరళంగా వాడినాడు. ఎక్కువగా కౌఁగలించు, ఆతరువాత కాఁగలించు అనే రూపాలనే వాడినాడు.

కౌస్తుభమణి వురమువాఁడు : శ్రీమహా విష్ణువు. కౌస్తుభమణి వక్షఃస్థలంలో కలవాడు.

"పెద్దకిరీటమువాఁడు పీతాంబరమువాఁడు

వొద్దికఁ గౌస్తుభమణివురమువాఁడు" 7-116

క్రా

క్రాఁగు : తపించు, వేడెక్కు.

"కయ్యపుఁగాఁకలఁ గ్రాఁగినతావూ

ఒయ్యన పైపై నుడికీనె" 6-86

క్రి

క్రితకము : విఱ. కృతకమునకు వ్యావహారికరూపం.

"క్రితకంబువిషయముల గెలు పెరఁగరాదు"

1-303

క్రియగా : క్రి.విఱ. ఉపాయంగా(వా.ని.) విలాసంగా, రీతిగా, కర్తవ్యంగా.

"నియతము మా కిదె నీ పాదములె గతి

క్రియగా మ మ్మేల కింక లుడుపవే" 3-420

క్రియాభాషాంగము : (?)

"పాటి నా కర్మమే క్రియాభాషాంగము
ఆటకాఁడ నింతె నేను అవధారు దేవ" 2-150

క్రిష్ణుఁడు : (2) *వి.* 'కృష్ణుడు'కు వ్యావహారికరూపం.

"వన్నెలఁ గ్రిష్ణుఁ డింటింటి వాకిటఁ బొంచీని"
24-267

క్రు

క్రుమ్ముడి : *వి.* క్రొమ్ముడి, వదులుముడి.

"క్రుమ్ముడి జారినవాఁడు కోమలి చిమ్మనంగ్రోవి
చిమ్మెడి పన్నీటమోము చెమరించువాఁడు" 6-5

క్రొ

క్రొచ్చిపారు : (?)

"క్రొచ్చి పారె గుబ్బచన్నుఁగొండల చెమ్మటనీరు" 6-16

ఖ

ఖండతుండములు : *వి; బహు.* ముక్కలు ముక్కలు.

"ఖరదూషణాదుల ఖండతుండములు సేసె
అరుదుగా వాలి నొక్క యమ్మున నేసె" 29-196

ఖండమండెఁగలు : *వి; బహు.* పులకండము మరియు గోధుమపూరి. (ఖండము = పులకండము ; మండెగ = గోధుమపూరి)

"అరిసెలు గారెలు నవుగులును
కరిజికాయలును ఖండమండెఁగలు" 6-4

ఖా

ఖారవుఁదురుము : గంపెడుకొప్పు. (ఖారము, ఖారి = పుట్టిగంప.)

"వూరికే వద్దఁగూచుండి వొళ్ళిమీదఁ జెయి వేసి
ఖారవుఁదురుము వట్టి భ్రమయించుఁగా"
16-102

గ

గంగ : *విశ.* పెద్ద; *క్రి.విశ.* బొత్తిగా.

గంగచిప్ప : *ప.బం; వి.* పెద్ద ముత్యపు చిప్ప. (a large white cockle shell అని బ్రౌన్)

గంగబా(వా)యిలి : *వి.* ఒక ఆకుకూర.

గంగబాన : *వి.* హరిజనులు వాడే అరివేణి బాన.

గంగమైలావు : *వి.* నలుపు - పసుపువర్ణం కల ఆవు. (వ్యు.)

గంగ్యావు : (గంగి + ఆవు) *వి.* సాధువగు ఆవు, గంగిగోవు, విలక్షణమైన సంధిరూపం.

"విడివిడి చేతులతో విద్యముల యాటవాఁడు
అడవిఁగాచేటి గంగ్యావులవాఁడు" 24-112

గంగ్యావులవాఁడు : *వి.* సాధుగోవులు గలవాఁడు. చూ : గంగ్యావు.

"విడివిడి చేతులతో విద్యముల యాటవాఁడు
అడవిఁ గాచేటి గంగ్యావులవాఁడు" 24-112

గంటగటుక : *వి.* గంట కొఱ్ఱల గటుక.

"దేవ నీ దయ యెంతునో దివ్య సులభమెంతునో
కావించి గంటగటుక కాచుకుండే విదివో" 2-38

గంటవేఁట : *వి.* రాత్రిపూట ఆడే ఒకరకం ఆట. ఇందులో దీపాలు, చిరుగంటలు ఉపయోగిస్తారు. (వ్యు.) ఒకరకం వేట అని శ.ర.

"గంటవేఁటలో తగులు కాఁపురమా
కంటవత్తి వెట్టి కాచే కాఁపురమా" 2-34

గంటి : *వి.* 1. గాయం, క్షతం 2. దుఃఖం 3. రంధ్రం. (వ్యు.)

"గరిమ నీ చెలిమనసు గంటిలేనిది గనక
వరుస లోలో మెఱుఁగువలెనె దాఁగీని" 24-1

"శ్రీవేంకటేశ నీ చేఁతే కాకుండితే
మోవితేనెకు గంటి మొదలఁ గలిగెనా" 24-3

గంటిపడు : *అ.క్రి.* 1.గాయపడు, కాటుపడు. 2.కన్నమేర్పడు.

"తుమ్మెదలు బెదరెను దొండపండు గంటివడె"
7-384

గంటివెట్టు : (?)

"గంటివెట్టి వాసులకు గుట్టుతో నేనుండఁగాను
అంటిముట్టి చేయివట్టే వంతేసి వలెనా" 20-357

గంటుగట్టు : అ.క్రి. డబ్బు, నగలు మొ॥ వాటిని మూటగట్టు. (గంటు = మూట)

"ఏలే నిష్ఠూరము అంత యేమి గట్టుకొంటి విందు
గాలిఁబోయే వాసనలు గంటుగట్టె నందురా"
19-436

గంటువేయు : స.క్రి. ముడివేయు.

"గంటువేసి పోఁకముడి గట్టిగాఁగట్టినయట్టు
వొంటి గాకుండా నాతని వొడిఁగట్టనేరవా" 8-97

గంటెసాలాడు : అ.క్రి. గెంటసములు కు 'గంటెసాలు' వ్యావహారికరూపం, పరుషవచనాలు పలుకు, అక్షలితోక్తులు పలుకు. (వ్య.)

"కారములుగా నిన్ను గంటెసాలాడఁగ నేల
పేరడైతేఁదమకము పెడరేఁచీ గాక" 23-262

గంటెసాలు : వి; బహు. పరుషోక్తులు.

గండబేటము : వి. ప్రేమ. (వ్య.)

గండవరగోపాలుఁడు : వి. నెల్లూరుజిల్లా కోవూరు మండలం లోని గండవరమనే గ్రామంలో వెలసిన గోపాలకృష్ణుడు. గండవరంలో వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, నరసింహస్వామి, ఉదయ కలేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి.

"లాలనుచు నూచేరు లలన లిరుగడల
బాల గండవరగోపాల నినుజాల"

గండస్తలి : వి. చెక్కిలిభాగం. ఇట స్థలులు అనడానికి బదులుగా స్తలులు, అనే ప్రయోగం జానపద వ్యవహారానుగుణం.

"వెలఁది నిన్నుఁ బిలిచె విడెము చేకొనుమని
సెలవుల నవ్వు గండస్తలులు మోవ" 7-411

గండికాఁడు : (గండి +కాఁడు) (1) నేర్పరి 2. దొంగ. (వ్య.)

"మెండగు నీ చుట్టమో మెలుత నీ పొరుగాపో
గండికాఁడ నీకు నబ్బె గంటిఁగా యీ మేలు"
26-581

"యిన్నిటా శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
పన్నిన గండికాఁడను భళిరా మెచ్చితిని" 11-41

గండికొట్టు : స.క్రి. దొంగిలించు.

"వివరించి మా మొర విచారించఁదగఁదా
కవకవ నవ్వి గండికొట్టుకొంటివా" 11-250

గండికోట చెన్నకేశవుఁడు : వి. కడపజిల్లా జమ్మలమడుగు సమీపంలో మైలవరం మండలంలోని 'గండికోట' గ్రామం ఎంతో పురాతనమైనది. ఇక్కడ వెలసిన దేవుడే గండికోట చెన్నకేశవుడు. ఇప్పు డీ దేవాలయం చెన్నకేశవుడు లేక చిన్నబోయింది. అన్నమయ్య కాలంలో ఈ కేశవుడు ఎన్నో వైభవాలతో తులదూగి ఉండవచ్చు.

"ఇరవై శ్రీవెంకటాద్రి యిది యంటూఁగూడితివి
గొరబుచేఁతల గండికోట చెన్నకేశవా" 27-314

"కొల్లకాఁడ వేర గండికోట చెన్నకేశవా" 20-50

గంతి : వి. కంతి, బొప్పి. (వ్య.)

"గంతివంటి గుణమింతే గాలి వంటి ప్రాణమింతే
యింత రట్టు సేయ నిందు నెడ మున్నదా"
4-453

గందపుటోవరి : (గందము + ఓవరి) చందనపు గది.

"గందపుటోవరిలోనఁ గప్పురంపుటింటిలోన
యిందుముఖి పవ్వళించు నింతలోనే లేచును"
5-172

గందపు బొట్టు : (2) వి. గంధంతో పెట్టుకునే బొట్టు.

"చెదరెను ముంగురులు చిట్టి గందపుబొట్టు
సుదతి నవ్వులనెంత చొక్కెవయ్యా" 27-532

గందము : (14) వి. 'గంధము'నకు వ్యావహారిక రూపం. చందనం. అన్నమయ్య పెక్కు చోట్ల గందము అని అల్పప్రాణదకారంతోనే ప్రయోగాలు చేసినాడు.

"గందము నీవు చల్లఁగా కాంత సరసమాడఁగా
చందమాయ మీ చేఁతలు సరికి బేసి" 25-181

గంపఁగమ్ము : స.క్రి; ప.బం. కప్పిపుచ్చు, దాఁచు.

"చెప్పరాదు చూపరాదు చిత్తములో తమకము
కప్పిన జవ్వనమిది గంపఁగమ్మ వచ్చునా" 18-305

"నీ వలమేల్మంగవు నిన్నేలె శ్రీవేంకటేశుఁ
డీవల మదనచిన్నలే గంపఁగమ్మేవే" 29-360

"వలపేమి గంపఁగమ్మ వచ్చునా యెందైనా" 10-2-90

గంపంతదురుము : వి; ప.బం. లావైన కొప్పు.

"గంపంతదురుము తోడి గబ్బిచూపుఁగన్నుల
గుంపెన గుబ్బలది మేకులు సేయఁగా" 5-145

గంపఁబెట్టు : (2) ప.బం; స.క్రి. దాచు.

"వాటముగా నవ్వఁగదే వలపులు చల్లి నీవు
గాఁటపు నివ్వెరఁగేల గంపఁబెట్టేవు" 29-142

గంపకెత్తుకొను : ప.బం; స్వీకరించు, పొందు.

"అడరి శ్రీవేంకటేశ అట్టె నన్నుఁగూడితివి
కడలేని వలపులు గంపకెత్తుకోరయ్యా" 29-526

గంపకొప్పు : వి; ప.బం. లావుపాటి కొప్పు. చూ : గంపంతదురుము.

"చెంపల లప్పలు నిండఁ జెరిగిన కప్పురపు
గంపకొప్పుల సతుల ఘనుఁడాతఁడు" 5-5

గంపగమ్ము : ప.బం; స.క్రి. దాచు, కనిపించకుండా చేయు.

"నీ వలమేలుమంగవు నిన్నేలె శ్రీవేంకటేశుఁ
డవల మదనచిన్నలే గంపఁగమ్మేవే" 29-360

గంపనమ్ము : ప.బం; స.క్రి. బయటపెట్టు, రట్టుసేయు.

"చంపవచ్చిన కర్మసంగ్రహంబగు బుద్ధి
గంప నమ్మక తన్నుఁగాచెనా" 1-187

గంపమోపు కోరికల కాలము : వి. యౌవనం, మిక్కుటమగు కోరికలుండే కాలమని వ్యు. (వ్యు.)

"లంపటమే సహజము లలిదేహధారులకు
గంపమోపు కోరికల కలకాలము" 8-32

గంపమోపు కోరికలు : మిక్కుటమగు కోరికలు.

గంపలకెక్కు : ప.బం; అ.క్రి. సమకూడు.

"చెలిమి చెమటలు నిండుసేయఁగఁ జేయఁగాను
కలిమి గంపలకెక్కు కైకొంటేను" 28-450

గంపలనించు : ప.బం; స.క్రి. కూడబెట్టు, సమకూర్చు.

"చిన్నదానవైతేనేమి చేఁతలన్నీ నేరుతువు
పన్నుకొన్న సుద్దులు గంపలనింతువుగాని" 29-229

గంపలనుండు : ప.బం; అ.క్రి. సమకూడు.

"కాయపు సుఖములు గంపల నున్నవి" 3-336

గంభీరము : వి. గాంభీర్యము.

"కాంతకును గుట్టు గుట్టు తోడి గంభీరమే
సొమ్ము" 7-217

గక్కదలు : (కదలు + కదలు) 'గ్రక్కదలు'కు వ్యావహారికరూపం. మిక్కిలి కదలు.

"కాంతుఁడ నే నెంతాడినా గక్కదలవు నీవు
యెంత రాతిగుండెవాఁడ వేమి చెప్పేది" 8-175

గగనపు కోరికలు : వి; బహు. అరుదైన కోరికలు, దుర్లభమైన కోరికలు.

"భగవన్నామ నిజపారిజాతము గలుగ
గగనపు మా కోరికలు ఫలించె" 15-70

గగనపునడుము : వి. మిక్కిలి సన్ననైన నడుము అనే అర్థంలో వాడబడిన ఆలంకారిక ప్రయోగం. (గగనం = ఆకాశం లాగా శూన్యమైన నడుమని అర్థం.)

"కంచుమించులగు గగనపు నడుమిది
అంచగమనయే ఆదరువు" 24-53

గగ్గుత్తిక : వి. ఇది డగ్గుత్తికయా? గద్గదస్వరం.

"కూటమై నోరికిమాట కొంత దోఁచవలదా
యేటికో గగ్గుత్తిక నన్నింతసేసీఁగాక" 17-62

గగ్గులకాడగు : (3) అ.క్రి. చెల్లా చెదరగు, కలతపడు.

"పరచి గగ్గులకాడై పారరో దానవులు
మురవైరి పంపులవె ముందరోసేవ లవె" 2-79
(గగ్గు = సంతోష గద్గదము, సంకోచించుట అని ఆం.ప.ని., గగ్గులకాడు గావించు = చంపు అని ఆంధ్ర భాషార్ణవం.)

గచ్చకాయలాట : వి. బాలికలు గచ్చకాయలతో ఆడే ఒకరకపు ఆట.
"యెడ యెఱిఁగి యా మీఁద యిల్లు ముంగిలెఱుఁగకె
వెడ గచ్చకాయలాట వెట్టిగాదా" 15-67

గచ్చకాయలాడు : అ.క్రి. గచ్చకాయలతో ఆట ఆడు.
"గచ్చకాయలాడే నిన్ను గాఁగిలించుకొని వట్టి
కొచ్చికొచ్చి చన్నులనే కూడాడిరి" 21-231

గచ్చు(లు)సేయు : (3) ప.బం; అ.క్రి. మాయ(లు)చేయు, విలాసములు చూపు.
"పచ్చిమాటలాడేవు బయకాఁడా
గచ్చులు సేతురా నీవు కాతరీఁడా" 26-420

గచ్చులఁబెట్టు : స.క్రి. మాయలఁబెట్టు.
"మెచ్చేవంటా నుంటిఁగాని మేకులకు మాటలాడి
గచ్చులఁబెట్టేది యెరఁగలేనైతి" 27-98

గచ్చులకొడిమెలు : వి; బహు. అసత్యపు అపనిందలు.
"మచ్చిక నీ మీఁదిది మరొకతెపై వేసి
గచ్చుల కొడిమెలేల కట్టేవే ఆతనికి" 14-338

గచ్చుల వినయములు : వి; బహు. కపటవినయాలు.
"యిచ్చకమాడుదురుగాని యియ్యకొంటిఁబోరా
గచ్చుల వినయములు గాక మానీనా" 9-42

గచ్చులసిరి : వి. మాయలాడి లక్ష్మి.
"గచ్చుల సిరి మోహాన కమలాన వేయఁగాను
తచ్చి రుక్మిణి పూవులదండ వేయకుండునా" 8-286

గచ్చులాడి : (గచ్చులు+ఆడి) డాంభికురాలు, మాయలాడి.

గచ్చులు : (29) వి; బహు. 1. దంభములు, డాబులు 2. కపటాలు, అబద్ధాలు, మాయలు, విలాసాలు, శోభ. అబద్ధాలు అనే అర్థంలో ఈపదం ఈనాటికీ వ్యవహారంలో ఉన్నదని సం.ప.స. (16 వాల్యూం. అనుబంధం)
"కొచ్చినఁ గొరయవు కోపములు
గచ్చుల గుణములు గల నాళ్లు" 4-343
"యిచ్చకమాడుదురు గాని యియ్యకొంటిఁబోరా
గచ్చుల వినయములు గాక మానీనా" 9-42
"ఇచ్చట శ్రీవేంకటేశు నెనసితివి రట్టేల
గచ్చుల నీడేల పొత్తు కలదె యిద్దరికిని" 7-412
బంగారము, సున్నము మొ॥ వాని పూత:
"అచ్చపు టుంగరముల అందెలుఁ బాయవట్టాలు
గచ్చుల ముంజేతుల కంకణసూడిగేలది" 9-79

గచ్చులు సేయు : అ.క్రి. మాయలు చేయు, నటనలు చేయు.
"మచ్చికకు వెలలేదు మాటలకుఁ దుద లేదు
గచ్చులేల సేసేవే కాంతుని తోను" 23-340

గచ్చువిచ్చగు : కార్యవైకల్యమగు.

గజకరపుఁదొడలు : వి. ఏనుగు తొండాల్లాంటి తొడలు, వింతరూపం.
"మఱి గజకరపుఁ దొడల నటిచిఁ బగడపులతలు
అఱంట్లందముగాక అందుకేలా" 23-347

గజదంతపరీక్ష : ప.బం; వి. అవసరం లేనిది, తగని పని; గజములకు దంతములున్నవా లేవా యని పరిశీలింపబోవడం తగని పని అని భావం.
"నిర్మితము నీవింతె నెరసు లెంచఁగనేల
ధర్మమందునిక గజదంతపరీక్షేటికే" 5-322
"సరి గజదంతపరీక్షలు చూడనెంతవాఁడ
ధర శ్రీవేంకటేశుఁడ దాసుఁడ నీకు" 15-124

గజనరసింహుఁడు : వి. గొప్పనరసింహుడు.
"కనకపుకాశవాఁడు గజనరసింహుఁడు" 25-183

గజబ(భ)జించు : స.క్రి. కలవరపడుచు,

కలతపరచు, గడబడచేయు.
"కంచు మట్టియల రవంబు గజబజింపఁబదము దా
టించు గబ్బి నడపు నడచు మించు గుబ్బలాఁడివి" 5-24

గజబలియు: అ.క్రి. మిక్కిలి బలియు. (గజదొంగ లోని గజ వంటిది)
"కాంత కుచంబులు ఘనదుర్గంబులు
కాంతి జక్కవలు గజబలిసె" 24-123

గజబిజ: *వి; ప.బం.* 1. తమకం, ఉద్రేకం 2. క్షోభం, కలత 3. ఖ్లానత 4. పీడ 5. అల్లరి 6. సందడి.
"త్రిజగములు నితఁడే దిక్కై కాచీ నిదె
గజబిజ లింక నుడుగరో రాక్షసులు" 15-156

గజబెజ: *వి; ప.బం.* గందరగోళం. రూపాం. గజిబిజి.
"త్రిజగాన నాతనిఁ జేరిన దాసులిదె వీరె
గజబెజ లిఁక నుడుగరో రాక్షసులు" 2-487

గజభజించు: అ.క్రి. కలవరపడు, కలతపడు.
"కట్టిన నీ దువ్వ(ప్ప)టము గజభజించఁగనీ
దిట్ట మాటలివి మాకుఁదెలియవు గదే" 19-570
"కంచుమట్టియుల రవంబు గజభజింపఁబదముదా
టించు గబ్బినడపు నడచు మించుగుబ్బలాఁడివి" 5-241

గజభజింపు: స.క్రి. "గజిబిజింపు"కు రూపాం. కలవరపెట్టు, కలతపెట్టు.
"గజభజింపుచు వచ్చి కాచుక నుతించేటి
ద్విజమునిసంఘముల దేవసింహమా" 2-363

గజరు: వి. ఉదుటు, మదం, కోరిక, కామం.
"చన్నులేల పిసికేవు బుజమేల గీరేవు
ఇన్నేసి నీ గజరుల కేమందును" 19-240
"కూనైన నాటి నీ మదమెల్ల దిగవలె
కలికైన నాటి నీ గజరెల్ల దిగవలె" 6-345 old
పూలగుత్తి, చేతికి వేసుకునే పూలకంకణం:
"పందెపు శ్రీవెంకటేశ పడుచు లేడ యిట్టి యా
సందడి నీ గజరులు చల్లేవు గాక" 25-368
పులకలు, నలిగిపోవుటలు:
"నిజము నెరపరాదా నేఁడు మాతోను
గజరులు దెలిసితే కాఁతాళించేవు" 18-323
మదము:
"కంటకము నా కున్నదా గజరుఁగాంతలఁ బొంది
అంటుకొని నా మేను అలమేవుగాక" 13-410
ఈ పదం గదురునకు రూపాంతరం కావచ్చును. దుర్గంధమని యర్థము. గజరుఁ గాంతలనగా చెంచు, గొల్ల మొదలగు జాతుల స్త్రీలు కాగలరు. అని సం.ప.స. (13 సం. 1 అను. 3 పు.) కాని ఈ అర్థం కన్నాపైన పేర్కొన్న అర్థాలే సముచితంగా ఉంటాయేమో!

గజరుఁజేతలవాఁడు: వి. ఉదుటు చేతలవాడు.
"తక్కక గజరుఁజేతలవాఁడు నీ మగఁడు
యెక్కడా లేనిదా యందు కే మాయనే" 18-7

గజరుఁదనము: వి. కోరిక, కామము, మదం
"కందువ మర్మములంటి గజరుఁదనముల చూపి
యెందరితో నవ్వు నవ్వి యెలయించేవు" 19-78

గజరుచేతలు: వి. ఉదుటుచేతలు.
"గుజగుజఁబొయ్యేవు కొంకి కొంకి నీకు నీకే
గజరు నీ చేఁతలకు కమ్మరా నే మందురా" 21-510

గజస్నానము: ప.బం; వి. వ్యర్థం, నిరర్థకం, ఏనుగు బాగా నీళ్లలో మునిగినాపైకి వచ్చి తిరిగి ఒళ్లంతా దుమ్ము చల్లుకుంటుంది. అందుపై ఏర్పడిన పలుకుబడి.
"గరిమల నచ్యుతు వినని కథలు భువి
గజస్నానములు" 2-235

గజ్జలపేరు: వి. గజ్జెల హారం.
"దొంగిలి గజ్జలపేరు తొలఁగఁబెట్టఁగఁబోతే
వెంగలితనమె కాక వినకమానేరా" 1-45

గజ్జలు : వి. 'గజ్జెలు'కు వ్యావహారికరూపం.
"అందిన కటిహస్తము నభయహస్తమువాఁడు
అందెల గజ్జలఁ బాదా లమరువాఁడు" 7-116
"గజ్జల గరుడునిపై కలికి విభునిఁగూడి
ముజ్జగములఁ దిరిగి మొగి నలసితివి" 5-273

గటియించు : స.క్రి. 'ఘటియించు'కు వ్యావహారికరూపం. కలిగించు.
"గటియించి శ్రీవేంకటపతి నీ దాసు
లిటువలె ఘనులైరిదివో నీ కృపను" 4-366

గట్టిపీట : వి. బల్లపీట.
"కలసి నీవద్ద నేను గట్టిపీటపైఁ గూచుండి
మొలబంటి యాయరా యిమ్ముల వలపు"
8-190

గట్టిరాళ్లతో మలిగండ్లేరు : నానుడి; అనుచితమగు పనికిపూను.

గట్టివాయ : వి. గట్టి నోరు గలవాడు, ధూర్తుడు.
"శాంతుఁడవో గట్టువాయ జాణతనమో యిట్టె
మంతుకెక్కించే నామీఁది మన్ననో యిది"
8-175

గట్టివాయి : (గట్టి + వాయి) వి. మాటకారి, (గట్టి నోరుగలది అని వ్యుత్పత్తి) ధూర్తుడు. రూపాం. గట్టువాయి
"గట్టివాయి వౌదువు గద్దరీఁడ వౌదువు
యిట్టి కాని కిచ్చితిమి యిఁక రావయ్యా"
14-109

గట్టివాయితనము : వి. గయ్యాళితనం, ధూర్తత్వం.
"కన్నెముద్దరాలు నీతో గట్టివాయితనము దా
సన్నల చాయలనే చలపాదిఁజేతురా" 25-199

గట్టువా : వి. ధూర్తురాలు.

గట్టువాయ : ఇది 'గట్టివాయి' కావచ్చు. చూ : గట్టివాయి.
"యిట్టె శ్రీవేంకటేశుతో నెన్ని మాఁటలాడేవే
గట్టువాయవై నోరఁగాయ వేయక" 22-270
"యెంత గట్టువాయ యిది యేడఁ గలిగె నీకు
యింతి యెందుండి వచ్చెను యెవ్వతెయ్య"
12-431

గట్టువాయతనము : (13) వి. ఇది గట్టివాయితనము కావచ్చు. గయ్యాళితనం, ధూర్తత్వం.
"ఎంత గట్టువాయతన మి దేమే వీఁడు
అంతకంత కేమన్నా నస మీఁదే వీఁడు" 11-182

గట్టువాయవాఁడు : వి. ఇది గట్టివాయవాడు కావచ్చు. గట్టినోరుగలవాడు, గయ్యాళివాడు, ధూర్తుడు.
"ఎంత గట్టువాయవాఁడ వేమి చెప్పేది
కాంతసేవలల్లా నీవు కనుగొనరాదా" 14-587

గట్టువాయి : (3) ఇది 'గట్టివాయి' కావచ్చు. చూ : గట్టివాయి. ధూర్తుడు, ధూర్తురాలు.
"పొలసి నీవు నన్నుఁ బూవులను వేయఁగాను
కలఁగక వుండితేనే గట్టువాయినా" 23-516

గడకుఁగట్టిన పాఁత : *ప.బం;* వి. చంచలమైనది, కట్టెకు పైన కట్టిన గుడ్డ గాలికి ఎప్పుడూ కదలుతూనే ఉంటుంది అనే దానిపై వచ్చిన పలుకుబడి.
"గడకుఁగట్టిన పాఁతగతి దోచే మనసు
అడుసులోపలి కంబమై తోచె మనసు" 1-337

గడసాము : *వి; ప.బం.* వెదురుగడపై చేసే సాము.
"బీరపు సాములు మాని పెద్ద గడసాము నేర్చి
తోరపుఁబగతు లెల్ల దొమ్మరు లైరి" 2-246

గడాట : (గడ + ఆట) దొమ్మరులు ఆడే ఒక ఆట.
"గడాటాడె వానిం గంటె కన్నవారికి వేడుక
అడుగడుగు ప్రయాస మటు వానికి" 15-286

గడిచీటి : (3) వి. గడి = సీమ, పొలిమేర, సరిహద్దు అని సూ.ని. గడిచీటి అంటే ఒక హద్దు పూర్తి అయిందని తెలిపే చీటి. 1. ఈనాడు ఉద్యోగవిరమణకు ముందు ఆ విషయాన్ని తెలియజేస్తూ పంపే చీటి వంటిది.
2. రహదారిపత్రం, విడుదల పత్రం.
"గడిచీటి వాపవు సరమేదో చూపవు

గడిచీటియును నీవు కలియుగమా" 1-118

గడిదేరు : *అ.క్రి; ప.బం.* ఆరితేరు, నైపుణ్యాన్ని సంపాదించు, సమర్థుడగు. మట్టు మర్యాదలు లేకుండు. సారంగ; 35

"గక్కన నట్టనడుమ గడిదేరె నింతలోనె
యెక్కడెక్కడి పనులు యెటువచ్చునో" 23-572

గడియకుడుక : *వి.* గడియలు తెలియడానికి చిల్లు పొడిచి ఉంచిన గిన్నె. అది ఒక్కసారి మునిగితే ఒక గడియ అని లెక్క కట్టేవారు. రూపాం. గడెకుడుక.

"ముంచి హోమములు సేసి మునులు సంభ్రమమున
అంచెల గడియకుడుక కట్టిపెట్టిరి" 25-432

గడియారపు నీరు : *వి.* గడేరపు కడవలోని నీరు, హరిజనులు పెండ్లిండ్లలో కంకణం కట్టి పెట్టే చిన్నకడవ.

"కలికి మెయి చెమటల గడియారపు నీరెక్క
తెలిసిగ్గులనే పెండ్లి తెరవేసెను" 18-179

గడిరాజు : *వి.* వీరుడు, శత్రురాజు.

"గడిరాజుబదు కాయె కడ లేని మనసు
నడివీదిపెస రాయె నయమైన మనసు" 1-337

గడిరాజుబదుకు : *వి.* అస్థిరం. (గడిరాజు = శత్రురాజు)

"గడిరాజు బదుకాయె కడలేని మనసు
నడివీదిపెస రాయె నయమైన మనసు" 1-337

గడుసుకాఁడు : (2) (గడుసు + కాఁడు) *వి.* గడుసరి, మొండివాడు, అసాధ్యుడు, కఠినుడు, వంచకుడు

"వొడిలోన దాఁగె నదే వొప్పగించవే సింహము
గడుసుకాఁడ కా దది నడు మింతేరా" 7-230

గడుసుపడు : (3) *అ.క్రి.* 1. మొండికెత్తు, మొండితనముదాల్చు 2. ధీరుడగు. గట్టిపడు.

"కమ్మర నీకేఁగూడి గడుసుపడినందుకు
చిమ్మిరేఁగి ప్రియములు చెప్పఁగరాదా" 26-470

"పెక్కుమాట లాడితేను బండబాఱు చప్పనౌను
కక్కసించితే వలపు గడుసుపడు" 18-191

గడె : (6) *వి.* రూపాం. గడియ, తలుపుకు అడ్డంగా వేసే కఱ్ఱ.

"పొనిగి గడె దెరచి బుద్ధులు నేఁజెప్పితేను
పని గలవానివలె బాగా లిచ్చేనే" 29-470

"కాతరాన నీవు లోన గడెవెట్టు కుండఁగాను
యీతలఁ జెప్పమైతి మిందాఁకా నమ్మా"
16-172

గడెకుడుక : *వి.* రూపాం. గడియకుడుక, కాలాన్ని కొలిచే కొలపాత్ర.

"అంచల సూర్యచంద్రులనే గడెకుడుకల
ముంచి కొలచి పోసీని మునుకొని కాలము"
2-172

గడేరమువారు : *వి; బహు.* గడియారానికి సంబంధించిన వారు, గడియలను తెలిపే యంత్రానికి సంబంధించిన వారు.

"పానిపట్టి నెత్తమాడే పరాకై వున్నవాఁడు
పూని గడేరమువారు పొంచి యెచ్చరించరే"
24-136

గడేలు : *వి.* పంచాంగవివరాలు.

"వేదపారాయణలతో వెసఁజూచెఁ గపిలను
గాదెల లెక్కలడిగె గడేరాలు వినెను" 7-473

గడ్డపెరుగు : *వి; ప.బం.* గట్టిగా తోడుకున్న పెరుగు.

"కారేటి జున్నులు గడ్డపెరుగులు
వారాలు వట్టేటి వైపులును" 8-51

గడ్డము : (3) *వి.* గద్దువ, చిబుకం.

"నెప్పున వాలారుగోళ్ళ నీ గడ్డ మాపె యెత్తితే
దెప్పరాన వేరొకతె దిక్కు చూచేవు" 14-85

గడ్డము వట్టికొసరు : *స.క్రి; ప.బం.* దీనంగా బ్రతిమాలు.

"పులక శిరసు వంచుకుండఁగా నా వాఁడి గోర
గుఱిగా గడ్డము వట్టి కొసరితేనే" 17-382

గడ్డము వట్టి వేడుకొను : *స.క్రి; ప.బం.* దీనంగా బ్రతిమాలు.

"వేమరు గడ్డమువట్టి వేడుకొని పిలువఁగా

ఆముకొని నన్నే లప్పుణడిగేవు నీవు" 14-491

గడ్డాయము: (2) వి. బలాత్కారం. రూపాం. గడ్డెము.

"చెనకి గడ్డాయముగాఁ జేసిన బాసలెల్ల

అనువుగా నడవఁగ నల్లాడఁబడెనా" 10-2-63

గడ్డివయసు: వి. అల్పకాలపు వయసు.

"బొడ్డుతామెరలోన గడ్డివయసు పెద్ద

బిడ్డఁ గన్నట్టివాఁడు పిన్నవాఁడు" 4 అను. 36

గడ్డెము: వి. గడ్డాయం, ఖడ్డాయము, బలాత్కారం (వ్యు.) బ్రౌణ్యం లో ఈ పదానికి see కడ్డాయము అని ఉంది. కడ్డాయమునకు బ్రౌణ్యం లో compulsion, force, exaction, forcing people to pay the price set up on articles వడ్ల గడ్డాయము, ఉప్పు కడ్డాయము అని కలదు.

"ఎంత చులుకఁగఁ జూచేవయ్యా నీవు

కొంత నీపై వలపులు గడ్డెము వేసీనా" 25-309

"జిడ్డు దేర నీ వేల చేతులు పైఁజాచేవు,

గడ్డెము వొద్దని నీకుఁగమ్మ లంపనా" 21-168

గణికె: వి. (?)

"చూపరాని సంసారమే సూత్రపుగణికె

కోపుల నాలికెలోనఁ గుచ్చినట్టి తాడు" 3-467

గతచన్న పితరులు: వి; బహు. గతించిన పితరులు; గత, చన్న అనేవి ఇట సమానార్థకాలు.

"గతచన్న పితరు లక్కడ నెవ్వరో

హితవై యిప్పటి పుత్రు లది యెవ్వరో" 4-382

గతచన్న వేదాలు: వి; బహు. అపహరింపబడిన వేదాలు.

"గతచన్నవేదాలు కమలజునకు నిచ్చి

అతని కరుణచేత నన్నియుఁగని" 1-162

గతజలంబుల అడ్డకట్టు: ప.బం; అ.క్రి. నిరర్థకం, వ్యర్థం, గతజలసేతుబంధనం.

గతజలముల కట్టగట్టు: ప.బం; అ.క్రి. నిరర్థకం, వ్యర్థం. నీరంతా పోయిన తరువాత కట్టగట్టడమని వాచ్యార్థం.

గతజలసేతు బంధనం: ప.బం; వి. నిరర్థకం, వ్యర్థం. (నీరంతా పోయిన తరువాత సేతువును నిర్మించడం వ్యర్థమే కదా!)

"అన్నియు నిన్ని వెనక ననఁగా నేమి

చెన్నుమీరె గతజల సేతుబంధాలు" 9-154

గతమగు: అ.క్రి; ప.బం. మరణించు.

"అనంతుఁడు శ్రీవేంకటేశుఁడు జనియించె

ఘనశిశుపాలాదులు గతమైరి" 4-20

గతముసేయు: ప.బం; స.క్రి. 1. పారఁద్రోలు 2. చంపు.

"కదిమి దుష్టులను గతముసేసితివి

త్రిదశులఁ గాచిన దేవుఁడవు" 28-490

గతిగా: క్రి.విణ. ఉపాయంగా.

"గతిగా శ్రీవేంకటేశ కలిసితి విటు నన్ను

యితవరి యిది యెంత యిచ్చకురాలనరో"

11-447

గతిలేని కూటికిఁగన్నదే కూడు: సామెత; గతిలేనప్పుడు దొరికిందే గొప్ప.

"పతి లేని భూమికి బలవంతుఁడే రాజు

గతిలేని కూటికిఁగన్నదే కూడు" 2-63

గతుగతుకు: (గతుకు + గతుకు) నాకి తాగడం.

"యీవల వాన గురిసి యే రెంతబంటి వారినా

కావరపు జీవునకు గతుగతుకే" 2-33

గతులు: వి. నాట్యప్రక్రియలు (?)

"వొగి శ్రీవేంకటగిరినుండి వచ్చి మాడుపూర

గుత్తము నెగసెగసి గతుల కిటు లాడేవా" 3-179

గత్తము: వి. ఎరువు, గొర్రెపెంట అని తె.వ్యు.కో.

"హత్తుకొని మోహంబులను ప్రధానుల యెదుట

గత్తంపు మొగసాలఁగల దించవలసె" (?) 4 అను. 27

గదరుఁబిల్లి: వి. (?)

"కమ్మని మా మయిపూఁత గదరుఁబిల్లుల గబ్బు

యెమ్మెల మా పట్టుచీర యేపెనార" 5-121

గదరుకొను: తిరస్కారంతో కోపపడు, కోపగించుకొను, కసరుకొను, చీదరించుకొను. (ధర్షించు అని ఆం.ధా.మా.)

"కన్నుల దప్పక చూచి గదరుకొన వేమే
మన్నన నాతో సరి మన్నించు డనుచు " 9-99

"యెదురాడేనా నేను యేమని తాఁజెప్పినాను
గదరుకోఁజోటేది కటకటా" 26-167

గదుములు గట్టు: *అ.క్రి; ప.బం.* బొప్పులుగట్టు, నెట్టులుగట్టు; ఇది కదుములు గట్టు అనుదానికి వ్యావహారికరూపం కావచ్చు. కదుము = దెబ్బ తగిలినచోట రక్తం పేరుకొని వాచే వాపు (తె.వ్యు.కో.)

గద్దరి: (6) విణ. 1. పొగరుగల 2. దుష్టం 3. నిపుణుడు 5. నేర్పుకత్తె 6. దిట్ట 7. దట్టమైన (వ్యు.) గడుసైన (బ్రౌన్) నేర్పరి,గడుసరి.

"గద్దరివై నన్ను శ్రీవేంకటనాథ కూడితివి
అద్దో పరిచారకురా లందుకు నోపుదునా"
10-211

గద్దరికన్నులు: (2) *వి; బహు.* దిట్ట (నేర్పుగల) కన్నులు, గడుసుకన్నులు.

"ఇద్దరి కిద్దరే సరి యీడుకు జోడుకుఁదగు
గద్దరికన్నులఁ జూడఁగలిగెఁగా మనకు" 24-125

గద్దరికాఁడు: (2) (గద్దరి + కాఁడు) వి. నేర్పరి, నిపుణుఁడు, గర్వి, పొగరు గలవాఁడు (వ్యు.) గడుసువాడు (బ్రౌన్)

"కలికి గుట్టుతోడిది గద్దరికాఁడవు నీవు
వలసినట్టు సేసితే వద్దనేవా రెవ్వరు" 29-510

గద్దరితనము: (2) (గద్దరి + తన) వి. పొగరు, ధైర్యం, నేర్పు, గడుసరితనం, తుంటరితనం.

"పెద్దరికానఁ జెలియ పీట మీఁదఁగూ
గద్దరితనాన నీవు కాఁతాళించేవు" 25-262

"ఇద్దరుఁ గూడుండుతే నేకచిత్తమౌఁ గాక
గద్దరితనా లింతేసి కడుఁ దగదయ్యా" 20-421

గద్దరివాఁడు: వి. 1. నేర్పరి, నిపుణుడు, గడుసరి

"గద్దెమీఁద నున్నవాఁడు కరుణా నిధైనవాఁడు
గద్దరివాఁడు గదె యీ ఘనుఁడు వో చెలియ"
28-435

గద్దరీఁడు: (4) (గద్దరి + ఈఁడు) వి. నేర్పరి, నిపుణుఁడు, గడుసరి, దిట్ట.

"గట్టివాయ(యి) వౌదువు గద్దరీఁడ వౌదువు
యిట్టె కాని కిచ్చితిమి యిఁక రావయ్యా"
14-109

గద్దెన: వి. 'గద్దన'కు రూపాం. గద్దింపు.

"పంతమాడి నీ మోవిఁ బచ్చిసేఁత సేసితేను
కాంత నేల దూరేవు గద్దెనతోను" 19-153

గద్దెపీఁట: (4) వి. ఎత్తుగా ఉండే పీట, బల్లపీట.

"అద్దమ రేతిరికాడ నాతఁడింటికి విచ్చేసె
గద్దెపీఁట పెట్టరే కాంతలాల" 28-29

గద్దెరాతి కనుమ: వి. ఇది నేడు 'సుద్దరాతి కనుమ' అనే పేరుతో వ్యవహరింపబడుతుంది. ఇది తాళ్ళపాక సమీపంలో ఉంది. (చూ: ఎఱ్ఱశిల కనుమ)

"కలికి నీ పిఱుఁదనే గద్దెరాతి కనుమ
మొలనూళ్ల లతలనే ముంచుకొన్నది" 5-115

గన: (4) అవ్య, 'కనుక'కు వ్యావహారికరూపం. ఈ 'గన' తెలంగాణామాండలికంలో 'గిన' అనే రూపంలో ప్రయోగంలో ఉంది. నేను గిన. (= నేను గనుక)

"కడు ముద్దరాలు గన కక్కసింప నోపదు "
11-101

గనము: (17) విణ. 'ఘనము"నకు వ్యావహారికరూపం. గొప్పది.

"కలగూరా వల పేమి గనముగాఁ గొసరఁగ
పలుకుఁబంతము నొకపాటి గావలదా" 25-226

గనమె: వి. 'గనిమె' కావచ్చు. మడికి చుట్టు ఏర్పడ్డ చిన్న కట్ట, గట్టు (శ.ర.) రూపాం. గెనెము.

"ఘనమైన పిరుదుపై కట్టేవు మొలనూళ్ళు
గనమెలు జవ్వనాన కొనరించేవా" 13-93

గన్నెర: వి. 'గన్నెరు'కు రూపాం. గన్నేరు అనే పూవు.

"సంపెంగనూనె యంపేవు సారెసారె నందుతోనె
అంపవైతి గన్నెరలు అప్పుడైనాను" 5-87

గబుక: వి. కబళం.
"చిబికివేసిన గింజ చేతఁబట్టఁగ నేల
గబుక కెంగిలిబూరె గడుగఁగ మరి యేల"
2-494

గబ్బి: విణ. 1. గర్వి, దుష్టుడు 2. నిక్కినది, నిగిడినది 3. గొప్పవాడు, ఘనుడు 4. ధీరుడు. వి. 1. గాంభీర్యాన్ని బట్టి కుక్కకు పెట్టినపేరు. 2. కపటం, దుష్టత్వం.
"శ్రీవేంకటేశ నిన్నుఁ జెనకితే గబ్బి నౌదు
యీ విధాన నా పొందు నీ కితవైతేఁ జాలునూ"
12-64
"నెట్టన నిన్ను రమ్మంటే నిండు రాజసమందురు
గట్టిగా నే వచ్చితేను గబ్బి నందురు" 20-574

గబ్బికుత్తికె: వి. ఘనమైన కుత్తికె.
"మంచముపై నిద్దరము మంతన మున్నంత వడి
కంచువలె వాఁగెను నీ గబ్బికుత్తికె" 11-562

గబ్బిటౌళికాఁడు: వి. రూపం స్పష్టంగా లేదు. బింకంకల విటుడు అని కావచ్చు.
"పలచని కొనగోరి బదనికలు సోఁకించి
కళలు రేఁచి చొక్కించే గబ్బిటౌళికాఁడు"
26-362

గబ్బితనము: వి. గర్వం, పెద్దతనం, ధైర్యం, కాపట్యం, దుష్టత్వం.
"కాంతలకుఁ బతులతో గబ్బితనమే వన్నె
కొంతపుఁ జూపుతోడి మంకుఁదనమే వన్నె"
21-254
"కన్నెపాయపుదానికి గబ్బితనమే ఘనము"
13-508

గబ్బిది: (గబ్బి + అది) గర్వం కల స్త్రీ, అభిమానం కల స్త్రీ, ధీరురాలు, గొప్పది.
"సిగ్గువడవుగదా! చెలులఁ దారుకాణించే
కగ్గి కల్ల కోరువని గబ్బిదానను" 11-585

గమ్య: వి. బంగారు లోనగువాని సాగదీసిన కమ్మి. బంగారుగమ్మి + ఔగాక = బంగారు గమ్మ్యౌఁగాక అని విలక్షణమైన సంధి.
"బలిమి నీలానకు బంగారుగమ్మ్యౌఁగాక
నెలవై శ్రీవేంకటేశ నీలము గమ్మ్యౌనా" 7-372

గరగరని: విణ. చక్కని, నునుపైన, రుచ్యమైన, చక్కనైన, పరిశుభ్రమైన.
"గరగరని కురులతో కస్తూరివాసనలు
విరితావులతోడ విసరఁగాను" 5-54

గరగరిక: వి. 1. విధం 2. నైర్మల్యం 3. చక్కదనం 4. సింగారం, అలంకారం 5. శృంగారరసం (తె.వ్యు.కో.) విణ. 1. సుందరమైన 2. పరిశుభ్రమైన 3. ఒప్పులు 4. అందములు, శోభలు. (పర్యాయ.)
"నెరవుగ శ్రీవిష్ణుభక్తి నిలుకడైన మిరకదా
గరగరికలనె శ్రీవేంకటనాథునిఁ జేరుటా" 10-4
"గరగరికలన్నియును కలసినందాఁకా
విరసంబులన్నియును విసుగునందాఁకా"
1-249

గరగరికె: వి. 'గరగరిక'కు వ్యావహారికరూపం. చూ: గరగరిక.
"సరుగున మేలుకొని సరసపుఁగౌఁగిట
గరగరికెల నన్నుఁ గలసీని" 5-338

గరడి: వి. ఇది 'గరిడి'ఐ ఉంటుంది. సాముచేసేచోటు.
"కలఁచకున్నా భోగాలు తనువుతోఁబెనఁగీని
చెలరేఁగి 'గరడి'లో జెట్లవలె" 2-331

గరబు: వి. ఇది 'గరవు' కావచ్చు. 'గరవు' అంటే కానుక. గరవు = To draw the whole forwards oneself; to take any or seize all. సర్వాకర్షణ అని కిట్టెల్. అదియే గరబు కావచ్చు. కౌగిలింతతో సర్వము నాకర్షించుట అని ప్రకరణ భావమునకు సరిపోవు చున్నది. (సం.ప.స. 22 సం.)
"కసరుల నానాగరబులు నమ్మి
పొసఁగ నీ కాఁగిట బోయతి" 22-90

గరవము: వి. గర్వమునకు వ్యావహారికరూపం. 'ర్వ'లో మధ్య అకారాగమం. నిఘంటువుల్లో గరువము అనే రూపమే కాని గరవము లేదు.

గరి: వి. రెక్క.

"కొండపడ మేడలలో గూరుసుండు మనమే
నిండునెమలిగరులు నెత్తికెక్కెను" 11-93

గరి: విశ. వాడి. వి. వాడిమి.

"గరుడఁడే తనకును గరియగు బాణము"

"కక్కసించీ మరునంప గరులు
యిక్కువఁ జెయిచాఁచర యివె కుచగిరులు"
7-390

గరించు: స.క్రి. 'గర్హించు'కు వ్యావహారికరూపం. నిందించు.

"చన్నులు గట్టులంటాను సారె గరింతుము గాని"
29-427

గరిడీ: వి. అభ్యాస స్థానం, సాము చేసే చోటు.

"కరఁగించకు మనసు కడపరాయ నాకు
గరిడీ నీ కాఁగిలి కడపరాయ!" 18-403

గరితె: వి. 'గరిత'కు వ్యావహారిక రూపం, పతివ్రత, రాణి, భార్య.

"రాసికెక్కిన గరితె రవ్వ సేసి మాటాడదు
మూసినముత్తెమువలె ముచ్చటలే యాడును"
23-49

గరితెతనము: వి. పాతివ్రత్యం.

"పోటి గరితెతనాన బువ్వము గలయవచ్చె
చోటిచ్చి తొడపైఁ బెట్టి సుద్దు లడుగవయ్యా"
29-118

గరిపడు: అ.క్రి. గరుకగు, కలియబడు, ఢీకొను, స్పర్ధించు, గడ్డకట్టు; తగుల్కొను, చిక్కువడు అని వేటూరి ఆనందమూర్తి. 444 పు.

"మూలనున్న నిట్టూర్పు ముంగిట నేల వేసేవే
గాలిగొట్టై యధరము గరిపడీని" 7-44

గరిమె: వి. 'గరిమ'కు రూపాం. గొప్పతనం, లావుదనం, (విధం, రీతి) అన్నమయ్య 'గరిమ' అనే రూపాన్ని కూడా వాడినాడు.

గరివడు: అ.క్రి. కరుకుపారు, మోటువారు కావచ్చునని సం.ప.స. వ్యర్థమగు. చిక్కువడు, తగుల్కొను.

"గరివడ్డ పెసరు కందువకొసరు
యెఱిగిన పనులే యేమిటికి" 23-476

"తెలిసియుఁ దెలియని తెగదీ చిక్కెమిటా!
కలకాల మిందుననే గరివడే బ్రదుకు" 3-398

"తిరువేంకటాద్రిపై దేవునిఁ గొలువక
గరివడే భవ మెల్ల కర్మశేషం" 1-113

గరివడు = గడ్డకట్టు అని సూ.ని. (ఇక్కడ గరివడునకు గూడ దాని గౌణార్థమైన శుష్కమైన అనుట తగును అని సం.ప.స. 13 వా. 3పు.) కాని ఇది సరి కాదని 'గీతలు పడు' అనే అర్థమే సరియైనదని గంగప్పగారి అభిప్రాయం. (ఆ.సం.పా. రా.మాం. పుట 73) దీనికి ఉదాహరణంగా ఈ కింది కీర్తనను ఉదాహరించినారు.

"యేకటతో నుండేటి ఇచ్చకపురమణుని
కాకల నీవు నవ్వితే గరివడదా
వీకతో నీ నాయకుని వెసఁ జన్నులనొత్తేవు
తేకువ నాతని మే నొద్దిక గాయగాయదా"
26-322

గరివడు: నిలిచిపోవు. (వ్యు.) తగుల్కొను, చిక్కువడు అని వేటూరి ఆనందమూర్తి. 444 పు. గడ్డకట్టు అని సూ.ని.

గరివి: వి. 'గర్వి'కి వ్యావహారికరూపం. గర్వం కలవాడు.

"ముంపు నే గరివినైనా మొదల వినయి వాఁడు
పెంపునఁ దానెవచ్చీఁ బిల్వరే వాని" 11-188

గరిసించు: (44) అ.క్రి. 'ఘర్షించు'కు వికృతి కావచ్చు. ఎదిరించు సూ.ని. కరిసించు అని గ్రహించి ఘృష ధాతుభవము = ఎదిరించు అను అర్థమిచ్చినది. అని సం.ప.స. 13 వాల్యూమ్ 3 పుట.

"కనుఁగొంటే సవతులు గరిసించకమానరు"
23-447

ఆం.క్రి. మ. దీ. లో ఈ పదానికి అతిశయించు, జయించు అనే అర్థాలు చూపబడ్డాయి.

గరుడఁడు: (5) వి. గరుడుఁడు, డకారం మీది అకారానికి ఉత్వం రాకపోవడం విశేషం. నన్నెచోడుడు కూడా ఈ రూపాన్ని ప్రయోగించినాడు.

"ఇటు గరుడని నీ వెక్కినను
పట పట దిక్కులు బగ్గనఁ బగిలె" 1-92

గరుడగంభము: (3) వి. గరుడస్తంభం, తిరుమలలో గరుడకంబము, ప్రస్తుతం బేడిఆంజనేయస్వామివారి వద్దనున్న స్తంభం.

"గరుడగంభమువద్ద గల శ్రీవేంకటపతి
వరుస సేవించరో వర మిచ్చీని" 15-180

"గరుడగంభముకాడ కడుఁబ్రాణాచారులకు
వరములొసఁగీని శ్రీవల్లభుఁడు"
3-511 & 1-320

"గరుడగంభము కాడ కాసుకొక్క వరమిచ్చి
గడియించఁదెలిసె మీ సంపద" (శేషాచార్యుల వ్రాతప్రతి)

గరుడపచ్చఁబూస: వి. పచ్చవన్నెల మాణిక్యం.

"కాంతుల మూఁడు లోకాల గరుడపచ్చఁబూస
చెంతల మాలో నున్న చిన్ని కృష్ణుఁడు" 9-288

గరుడాచలము: వి. శ్రీవెంకటేశ్వరస్వామి నెలకొన్న సప్తగిరులలో ఒకటి.

"గరుడాచలంబనఁగా శ్రీవేంకటశైలంబనఁగా
గిరులకు నేలికెయగు ననంతగిరి దా నీగిరి
యనఁగా" 15-160

గరుడి: వి. గరుడుడు. (శ.ర.)

"ఆపె గరుడిఁ జదివినటువంటి మాఁటలు
రాపుల నిదివో నేఁడు రచ్చకెక్కెను" 21-351

గరుపా(టు)రు: ప.బం. అ.క్రి. గగుర్పాటు చెందు, మీదికి తూలిపడు.

"మందలించి యా డేడ మడుగులు చొచ్చితివో
యిందు నీ మై గరుపారె నిటువలె గలదా"
11-332

"వింటే మేను గరుపారీ వినోదపు నీ సుద్దులు"
21-125

"మందలించి యా డేడ మడుగులు చొచ్చితివో
యిందు నీ మై గరుపారె నిటువలెఁ గలదా"
11-332

గరువతనము: వి. గర్వం. 'గరువ' శబ్దంపై స్వార్థంలో తనప్రత్యయం.

"తరుణులు నీతో జాణతనములాడఁగా
గరువతనాన మాటకారివైతివి" 10-2-36

గరువము: వి. గర్వం అనేదానికి వికృతిరూపం.

"సొరిది గుబ్బల నొత్తి చొక్కించవలెఁగాక
గరువానఁ గూడితేను గరివడదా" 23-70

గరువించు: అ.క్రి. గర్వించు.

"కాంత నితరుల కింద గరువించు కంటె (?) మతిఁ
జింతఁగందుచు నలయు సిలుగె మేలు" 5-212

గలభి: వి. అల్లరి, గలభా, గొడవ.

"వెలఁది పాటవాడఁగా వింటా నున్నాఁడాతఁడు
గలభి సేయకురే కాంతలాల" 23-2

గళబెళము: వి. (?)

"వొప్పుగ నుయ్యాలమీఁద నూగుకొంటా నుంటిరి
కప్పుకొంటిని రెంటెము గళబెళము" 23-15

"అరిమురి గళబెళమను పయ్యెదతో
విరుల నే లతని వేసేవే" 28-98

గళువు: వి. గడువు (?)

"పెంచక పెరగే నవె పెనుఁజీకటితీగెలు
అంచె నీ యారచి కత కారు నెల్లు గళువు"
29 అను. 11కీ.

ఇందులో ఈ పదం మూడుసార్లు ప్రయోగించబడింది.

గవాక్షి: వి. గవాక్షము, కిటికీ. గవాక్షము అనుటకు బదులుగా 'గవాక్షి' అని ప్రయోగించడం విలక్షణం.

"తొలఁగక గవాక్షుల తొంగిచూచెనో నిన్ను
వెలినుండే తనెలుఁగు వినుపించెనో" 27-516

గవిశన : వి. 'గవుసెన'కు వ్యావహారికరూపం;
1. వీణ, విల్లు మొ॥ వాటిని తొడిగే గలీబు
2. నిండు ముసుగు.
"రతిరాజు నమ్ములవి రంట దెప్పరపువేళ
కతుకున నాఁటుఁజేసు గవిశన నిడరే" 11-221
"కంతువిండ్లు నా బొమ్మలు గవిశెన తన మేను
పొంత నెంచి చూచుకొంటే పొందులే కదే"
7-562

గవుక : (2) ఇది 'గవుత' కావచ్చు. ప్రా. గవత్త. అంటే కసవు, తృణం, పశువులు మేసేగడ్డి అని అర్థం. 'గవత్త' కు గవుత వికృతి రూపమై ఉంటుంది.
"పట్టి దున్నే యెద్దుఁదెచ్చి బంతి గట్టి నురిపితే
నట్టె గవుక మేసి మల్లాడినట్లు"
"బంతి గట్టి నురిపేటి పసురము లెడనెడ
బొంత నొక్కొక్క గవుక వుచ్చుకొన్నట్లు" 4-201

గసిక : వి. 1. బాణం 2. శలాక 3. తవ్వుట కనువుగా కొన చెక్కిన కొయ్య. (శ.ర.)
"గద్దెరాతి కొండ వింట గసికయై చెలఁగ నేర్చు
సుద్దులెల్ల మందులనఁగ సొంపు మిగుల
నేర్చును" 5-233

గా

గాఁటము : (8) 1. కష్టం 2. కాఠిన్యం (తె.వ్యు.కో.) వి.ణ. 1. సాంద్రం 2. అధికం 4. గట్టి 5. కష్టమైన.
"గాఁటాన శ్రీవేంకటేశ కలిసితి విట నన్ను"
14-31
"గాఁటమాయఁ గోరికల కలగలపు" 29-447
కఠినమైన :
"ఏఁటికి వేగిరించేరే యింతులాల
గాఁటపుదొర యాతఁడే కరుణించీఁగాక" 27-582

గాజుఁబదనులవారు : *వి; బహు.* గాజు వాడితనం కలవారు. (పదను = వాడి)
"యీ జాడ శ్రీవేంకటేశ యేలి తలమేల్మంగను
గాజుఁబదనులవారు కాంతలు సుమ్మీ" 29-270

గాజుగట్టు : అ.క్రి. రంగు మాఱు.
"కప్పురమే తిని మోవి గాజుగట్టఁగా
కప్పిన పారిటాకులు కళబెళమనఁగాను"
22-210

గాటారించు : స.క్రి. ఊరించు కావచ్చు.
"తేటపడ నింతి నిన్ను తిట్టు తిట్టదుగాని
గాటారింపుమాటలనే కల్లలాడెను" 25-312

గాటారింపు : వి. ఊరించడం (?)
"కూటమికి గురి లేదు కోరికకు కొద్ది లేదు
గాటారింపు లేలే శ్రీవెంకటేశుతోను" 23-341

గాత్రము : వి. ఇది గాఁటము కావచ్చు. గాటాన = మిక్కిలిగా, గాఢంగా.
"యీటున శ్రీవేంకటేశ యే నలమేల్మంగను
గాత్రా(టా)న నన్నేలితివి గరిసించనేలా"
26-268

గాడ : వి. మోహం; అది గాడ పట్టిందని వాడుక. 'గాఢ' శబ్దభవం కావచ్చు.
"అలిగితే నీతోడి అంకకత్తె నందువు
యెలమి నీతోడి గాడ కేమి సేతురా" 25-213
మాండలిక పదకోశం కూడా మోహమనే అర్థాన్నే సూచిస్తుందనీ, ఇది గాఢ శబ్దభవమన్నా ఎక్కువదనము అర్థము కావచ్చును అనే పరిష్కర్తల అభిప్రాయం సరికాదని గంగప్ప గారి అభిప్రాయం. (ఆ.సం.పా.స. రా.మాం. పుట. 27)
"యేడఁజూచి నను బుణ్య మెక్కు డాయ నని
నమ్మి
గాడలెల్లాఁ బాసితిమి కర్మమా" 4-332

గాడఁబెట్టు : స.క్రి. క్షోభపెట్టు.
"కూడిన సంతోసము కోమలికి నుండఁగాను
గాడఁబెట్ట నేల శ్రీవేంకటేశుఁడవు" 23-482

గాడిగుంజ : వి. గొడ్లకు మేత వేసే స్థలం. కొట్టంలో పశువులకు మేత వేయడానికి ఏర్పరచిన అర - ఈ చోట పాతిన గుంజ.
"కావించి కల్పవృక్షము గాడిగుంజగాఁ బాతి
ఆవల దుర్మదదేహి అజ్ఞాని అవుటా" 15-71

గాడిదె : వి. 'గాడిద'కు వ్యావహారికరూపం.

"కాయకపుగాడిదెకు కవణమువెట్టి మరి
వీయపు చుట్టాలెల్ల వీడువెట్టరో" 3-461

గాడిపట్టు : వి. 1. గాడిదగ్గర పశువులను కట్టివేసే చోటు 2. నివాసస్థలం 3. కొట్టు (వ్యు.)
"అంత యేల వొరసేవు అప్పటి నన్ను
కాంతలను నీ మోవి గాడివట్టు గాదా" 25-451

గాణ : వి. పాటకాఁడు, పాటకత్తె, గాయకుడు, గాయకురాలు.
"జాణల మిద్దరమును చనవునఁ బెనఁగితే
జాణలు మెరసిన కాతర మందురు" 20-445

గాత : (8) వి. కథ, గాథ కు వికృతిరూపం.
"గాతల తమ పొందులు కవెల వ్రాసుకొ నీవే
జాతిగా తమకేనేను సాకిరయ్యేదానను" 14-36

గాతలాడు : *ప.బం; అ.క్రి.* దెబ్బలాడు.
"మేలు గలవాఁడు గాన మేనదాన వంటా నిన్ను
కాలుదొక్కఁగా నేల గాతలాడేవే" 13-361

గాతసేయు : (3) ప.బం. గొడవచేయు.
"ఆతఁడిచ్చిన చనవే అన్నిటా నీకు
గాతసేయ కింతట మొక్కఁగరాదా నీకు" 7-136

గాతి : వి. 'ఘాతి'కి వికృతిరూపం, దెబ్బ, గాయం.
"ఓ యమ్మ నీ గాతికి నోరుచునా యెవ్వతైనా
పాయలు వడినఁబోదు పట్టకు మా చెఱఁగు"
21-322

గాదము : వి. పైరులోని కసవు, ఆకు, కలుపుమొక్క, గడ్డితోపాటు మొలచి పెరిగే పిచ్చిమొక్కలు.
"గక్కునఁ బైరు విత్తఁగా గాదము మొలచినట్లు
చిక్కిన కర్మములెల్లాఁ జెలగెఁ గాక" 2-170

గాదిలి : వి.ణ. ప్రేమపాత్రమైన. వి. 1. ప్రేమ, కూర్మి 2. భర్త 3. చుట్టం.
"గాదిలి శ్రీవేంకటపతి కాఁగిట
సేదలు దేరను చెలియకును
మోద మిప్పుడుగా మొనకొనె మనకును
యే దెస నుంటిమి యిందాఁకాను" 23-598

గాదెఁబోయు : (21) స.క్రి; ప.బం. ఒక్కచోట చేర్చు, కూడఁబెట్టు.
"కట్టఁగడ వావులెల్లా గాదెఁబోయవచ్చునా
దట్టమైన నీ యాసలు తలఁగించవచ్చునా"
26-417

గాదెలఁగొలుచు : *ప.బం; వి.* అసంఖ్యాకం, అందుబాటులో ఉన్న అపూర్వభాగ్యం. కొంగుబంగారం వంటి మాట.
"అమృతమథను మహిమదె మా గాదెల
కొలుచు" 14-51

గాదెలఁబోయు : (3) *స.క్రి; ప.బం.* కూడఁబెట్టు.
"తాటించి పేనఁగ మనతరములా యీతఁడు
తేటల నేరుపులు గాదెలఁబోసీని" 23-500

గాదెలలెక్కలు : *వి; బహు.* ధాన్యపు లెక్కలు.
"వేదపారాయణలతో వెసఁజూచెఁ గపిలను
గాదెల లెక్క లడిగె గడేరాలు వినెను" 7-473

గాబు : *వి; మాం.* పిచ్చిమొక్క, కలుపు.
"ఏ బలిమి నమ్మి వెర, పెరగరు దేహులాల
గాబువలెఁ బెరిగేరు కాలము మీ చుట్టమా" 4-28

గామిడి : విణ. 1. దుష్టమైన 2. గయ్యాళి అయిన 3. బలిసిన 4. శ్రేష్ఠమైన; సూ.ని. దీనిని గ్రామణీ శబ్దభవంగా చూపింది.
శ్రేష్ఠమైన :
నేమంత నేరుతుమా నేరుపులు తనతోను
గామిడిసతులయందే కనుఁగొనుమనవే"
26-228

దుష్టమైన :
"గామిడి మాయే కర్త యిందుకును
సోమరి మమ్మంటఁజోటేది" 4-254
"గోమున నీ సుద్దులకు గొల్లెత లెట్టోరిచిరో
గామిడివిద్యలకెల్లా ఘనుఁడవు గావా" 23-525
"గామిడిదాని తల్లి విటకంటకి యి ల్లెడలింప"
అని విప్ర. ప్రయోగం. (3-42)

గామిడిచేఁతలు : *వి; బహు.* పెద్దపనులు.
"ఏమి దలఁచుకొంటివి యేమిపని సేసితివి

గామిడి నీ చేఁతలకు కాంతాళాలు రేఁగవా"
7-430

గామిడితనము : వి. శ్రేష్ఠత్వం. (దుష్టత్వం, గయ్యాళితనం. వ్య.)
"మోముదప్పక చూచేది ముందట నిలుచుండేది
గామడితనా లీమెకుఁ గంటివా వోయి" 16-6

గామిడిది : (గామిడి + అది) వి. గయ్యాళిది, దుష్టురాలు, శ్రేష్ఠురాలు.
"గామిడి దొక్కొక్కతె కనలించుకొనుఁగాని
కామినుల మోములు కళదేరేవే" 16-576

గామిడివాఁడు : (గామిడి + వాఁడు) వి. దుష్టుఁడు, ధూర్తుఁడు.
"గాలిగొట్టై తిరిగిన గామిడివాఁడో యమ్మ
గోలవలె నుండుఁగాని కోడెకాఁడమ్మా" 22-69
"సన్న లూరకె సేసేవు సందులకు లాచేవు
కన్నవారెల్లా నిన్ను గామిడివాఁడనరా" 28-297

గాము : వి. 1. పిశాచం 2. సూర్యాది గ్రహం 3. విరహబాధ 4. తాపం.
"ఏమరించి యింటివారి నెడపి నే రాఁగాను
గామైన బిడ్డ యేడ్చెఁ గదలనీక" 5-324

గాముల మోచిన గంప : *ప.బం; వి.* ప్రమాదకరం. (వ్య.)
"పాము చెలిమి రంపపుసంసారము
గాముల మోఁచిన గంప యిది" 1-180

గాములు వారెడి పొద్దు : వి. చీకటిపడే సమయం.
"గాములు వారెడి పొద్దు కావలికాండ్లాల
జాము జాము దిరుగరో జాలి" 4-166

గాయగంటివాఁడు : వి. కాయగాచిన కన్ను గలవాడు.
"సేయరాని చేఁతలెల్లాఁ జేసితి నేను నీ
గా(కా)యగంటివాఁడ నేను గతి చూపవయ్యా"
3-311

గాయగంట్లు : *వి; బహు.* గాయములు (= క్షతములు) అనే అర్థంలో జంటపదం. (గంటి. ఏ.వ.)
"హత్తి గాయగంట్ల కాని అంతేసి నేరరు
యిత్తల నెట్టు వూకొందు నిట్టె నవ్వేఁగాకా"
11-358

గారడించు : *అ.క్రి.* మాయచేయు.
"కమ్ముకొన్న యింద్రియాలు గారడించఁగా జీవుఁ
డెమ్మెలఁ దొరలక మరేల మానును" 10-8

గారబము : వి. గారవము, గౌరవం, గొప్పతనం, ప్రేమ.
"కోరి యాపై నిన్ను నిట్టె కూడి కెంగేలు పట్టఁగా
గారబానఁ గంకణము కట్టేవు నీవు" 12-508

గారవించు : *స.క్రి.* గౌరవించు, ప్రేమించు.
"చేరి చేరి నీ మేని చెమట దుడిచితేను
గారవించెంతలో నెంత కాఁగిలించేవు" 28-66

గారాపుతనము : వి. గారవం, ప్రేమ, వాత్సల్యం.
"కూరిమిఁగాఁగిట నీవు కూడేటివేళ యాపె
గారాపుతనమునఁ గలసీ నిన్ను" 22-575

గాలపువేఁట : *వి; ప.బం.* చేపల వేట.
"పంచల నందరికిని పాయరాని పొందులకు
కంచపుఁబొత్తులే కావా గాలపువేఁటలు" 21-226

గాలప్పుడు : గాలి వచ్చినప్పుడు.
"తొడరి గాలప్పుడు తూర్పెత్తక తాను
విడిచి మఱచిన వెనక వెదకి తేఁగలదా" 1-449

గాలప్పుడు తూర్పెత్తు : *ప.బం; అ.క్రి.* గాలివచ్చినప్పుడు తూర్పారబట్టు, అవకాశమున్నపుడే కార్యమును నెరవేర్చు.
"తొడరి గాలప్పుడు తూర్పెత్తక తాను
విడిచి మఱచిన వెనక వెదకి తేఁగలదా" 1-449

గాలిఁబుచ్చు : *ప.బం; అ.క్రి.* వ్యర్థం చేయు.
"కాకరిమతము లెల్లఁ గాలిఁబుచ్చి పరమిట్టే
పైకొనఁగఁ గరుణించె భాష్యకారులు" 1-162

గాలిఁబోవు : *ప.బం; అ.క్రి.* వ్యర్థమగు, తొలగు, నశించు.
"తాలిమిలో హరిఁదలఁచక యెఱుకెల్ల
గాలిఁబోవుట పూర్వకర్మశేషం" 1-113
"అంగనలు దిట్టితేను ఆయములు గరఁగేవే

కంగి మగవాని తిట్టు గాలిఁబొయ్యేదే" 17-21

"నాలుకను మంచి హరినామ మొక టుండఁగా

గాలిఁబోయెటి వూరగాథ లేల" 3-187

గాలింపుచక్రము : వి. శోధించేచక్రం.

"వాలిన మాధవుఁడంటే వసంతుఁడవా ! కాదే

గాలింపుచక్రము చేతఁగలవాఁడ నేనే" 21-487

గాలికూటిపేరి గట్టు : వి. శ్రీవేంకటేశ్వరుని నివాసమైన శేషాద్రి ; (గాలికూడు = సర్పం, ఆదిశేషుడు) అతని పేరుతో ప్రసిద్ధమైన కొండ శేషాద్రి అని వ్యుత్పత్తి.

"గాలికూటిపేరిగట్టు మీఁదటి వాఁడ

నేల సోద్యము పేరి నెలఁతయె నిన్ను మెచ్చె "

10-117

గాలికూటిపేరిగట్టు మీఁదటివాఁడు : వి. వెంకటేశ్వరస్వామి; శేషాద్రిపై నెలవున్నవాడని వ్యుత్పత్తి. చూ : గాలికూటి పేరి గట్టు. (గాలికూడు = సర్పం, ఆదిశేషుడు ; అతనిపేరుతో ప్రసిద్ధమైన కొండ శేషాద్రి అని వ్యుత్పత్తి.)

"గాలికూటిపేరిగట్టు మీఁదటివాఁడ

నేల సోద్యముపేరి నెలఁతయె నిన్ను మెచ్చె "

10-2-117

గాలికూటివాఁడు : వి. పాము (ఇట కాళియుడు) గాలి ఆహారంగా తీసుకునేవాడని వ్యుత్పత్తి.

"గాలికూటివాని మెట్టి గాలిరాకాసునిఁ గొట్టి

గాలిబిడ్డ తమ్ముని సంగడినాడె నితఁడు" 7-87

గాలిగలట్టే తూరుపెత్తు : *ప.బం; అ.క్రి.* గాలి ఉన్నపుడే తూర్పారబట్టు, అవకాశం ఉన్నపుడే పనులు నిర్వర్తించు. చూ : గాలప్పుడు తూర్పెత్తు.

"చెలియా మఱవకువే చెప్పితి బుద్ధి

తొలుతే గాలిగలట్టే తూరుపెత్తు మందురు"

23-17

గాలి గలట్టే తూరుపెత్తుమనుట : నానుడి ; అనుకూలతను బట్టి ప్రవర్తించడమనుట.

"చెలియా మఱవకువే చెప్పితి బుద్ధి

తొలుతే గాలిగలట్టే తూరుపెత్తు మందురు"

23-17

గాలిగలప్పుడే తూర్పు : *ప.బం; వి.* గాలి ఉన్నప్పుడే తూర్పారబట్టడం.

"గాలి గలప్పుడే తూర్పు గాక

యేలి నన్నుఁగూడెనే నిరవైనదాఁకను " 22-95

గాలిగొట్టు : *ప.బం; వి.* 1. గాలికి తిరిగేవాడు, ఆకతాయి 2. హీనం 3. నిందావాచకం. నిఘటువుల్లో ఈ పదం కానరాదు.

"గాలిగొట్టై తిరిగిన గామిడివాఁడో యమ్మా"

22-69

"మెలుత నెరిఁదురుము మేఘమువంటిది

అలరు గాలిగొట్టది గాదు" 26-137

గాలిదాగువాఁడు : వి. సర్పం. ఇట ఆదిశేషుడు అని అర్థం.గాలిని తాగేవాడు, వాతాశనుడు అని వ్యుత్పత్తి.

"పాలివారియింటి పిన్నవాఁడై తిరిగినాఁడు

గాలిదాగువానిమీఁదఁ గాలు సాఁచినాఁడు"

6-156

గాలిదిను పెనుబాము : వి. ఆదిశేషుడు, గాలిని ఆహారంగా తినే పెద్దపాము.

"మోలనున్న నిట్టూర్పు ముంగిట నేల వేసేవే

గాలిగొట్టై యధరముగ గడివడేని" 7-44

గాలిదెచ్చి ముడియగట్టు : *ప.బం; అ.క్రి.* అసాధ్యమైన పనికి పూనుకొను.

గాలి దెచ్చి ముడియగాఁ గట్టు : *ప.బం; అ.క్రి.* అసాధ్యమైన పనికి పూనుకొను, గాలిని మూటగా కట్టు.

"అల గాలి దెచ్చి ముడియగాఁ గట్టరాదట

వెలయఁగాలము గంటువేయరాదట" 2-262

గాలినె పోవు : *ప.బం; అ.క్రి.* వ్యర్థమగు. చూ : గాలిఁబోవు.

"బాలనాటి పుట్టు గిది భ్రమయో నిజమో

గాలినె కాలముఁ బోయ కత లాయను " 4-407

గాలిపడగ : *ప.బం; వి.* రూపాం. గాలిపడిగె. గాలిపటం.

"కన్నచోట్ల గాలిపడగవై నీవు
పన్ని మా దీవెన నిట్టె బదుకవయ్యా" 17-13

గాలిపడిగె : *ప.బం; వి.* రూపాం. గాలిపడగ. గాలిపటం, పిల్లలు గాలిలో ఎగురవేయటానికి కాగితం మొ॥ వాటితో కట్టిన పటం.

"కామిని యెవ్వతో లోన గాలిపడె గాడించఁగా
కామించి యానందాన గరఁగితివి" 25-104

గాలిబిడ్డ : వి. హనుమంతుడు, గాలి కుమారుడు.

"గాలికూటివాని మెట్టి గాలిరాకాసునిఁ గొట్టి
గాలిబిడ్డ తమ్ముని సంగతి నాడె నీతఁడు" 7-87

గాలిబుడియలు : *వి; బహు.* గాలిబుడగలు.

"గాలిబుడియలు గట్టి కలికితనాలు చూపి
ఓలిగొంటివి గదే వుదుటున నీవు" 28-554

గాలిమంటపము : వి. దేవాలయం ముఖద్వారం వద్ద ఉండే మంటపం.

"పురిగొనంగ నిన్నుఁబాసి పొద్దు గడపలేక కెరలి
సరుగ గాలిమంటపమున సాము
శాయఁదొడఁగెను" 28-4 & 17-541

గాలిమండపము : వి. దేవాలయం ముఖద్వారం వద్ద ఉండే మంటపం. చూ : గాలిమంటపము.

"అల గాలిమండపమునందు నిద్దిరించఁగానో
పొలసి నిట్టూరుపుల బుసకొట్టే విపుడు" 7-414

గాలి ముడిగట్టు : ప.బం. *అ.క్రి.* వ్యర్థమైన పని చేయు, అసాధ్యమైన పనులు చేయు.

"గట్టువాయతనమున గాలి ముడి గట్టితివి
వట్టి యపకీర్తి గద్దా వనితలతోడను" 14-558

గాలి ముడియగట్టు : *ప.బం; అ.క్రి.* వ్యర్థమైన పనిచేయు, గాలి మూటగట్టు.

"కాకరివాఁడవు మాతో గాలి ముడియగట్టేవు
చేకొని నీ చెలి మెట్టు చేసిరయ్యా సతులు"
21-20

గాలిమూట : వి. శరీరం, ప్రాణవాయువుతో నిండిన మూట.

"గాలిమూటఁ జిక్కితిమి కన్నచోటే తొక్కితిమి
ఆలించి యేమిటి వారమయ్యేమో కాని" 3-532

గాలి మూటగట్టు : *ప.బం.* అసాధ్యమైన కార్యాలు చేయు.

"కతకారితనాలనే గాలి మూటగట్టేవు
రతి మొయిలు లేని వాన రప్పించేవు" 29-464

"గాలి ముడిగట్టినట్టు కాయము మోచితిమి"
3-556

గాలిమూట చిక్కు : *అ.క్రి.* శరీరధారియగు. (శరీరాన్ని గాలిమూట అని వేదాంతులంటారు.)

"గాలిమూటఁ జిక్కితిమి కన్నచోటే తొక్కితిమి"
3-532

గాలిరాకాసుఁడు : వి. (?) 7-87

గాలి లేక తూరుపెత్తు : *ప.బం.* వ్యర్థప్రయత్నం చేయు. గాలిలేనపుడు ధాన్యాన్ని తూర్పార బట్టడం వ్యర్థప్రయత్నమే కదా!

"నీ రతికిఁ జేయిచాఁచి నిట్టూర్పుల నిండెఁ జెలి
కోరి యాస గాలి లేక తూరుపెత్తెను" 7-402

గాలివీడు : వి. కడపజిల్లా లోని ఒక మండలకేంద్రం. పాకాల - ధర్మవరం రైలుమార్గంలోని కురబలకోట రైల్వేస్టేషన్ కు 25 కి.మీ. దూరంలో ఉంది. ఇట ఒక పాడుబడిన ప్రాచీన దేవాలయం ఉంది. ఇందులోని మూర్తి శ్రీవేంకటేశ్వర స్వామి. అన్నమయ్య ఇక్కడి స్వామిపై ఒక కీర్తన రచించినాడు.

"గాలివీటి కాపురానఁ గసుగందగా
కోలుపుచు దినమూ నీ కొండమీఁది నాయకులు
తేలుపర చేరుగనే తిమ్మినాయఁడా" 4-41

గావుపట్టు : *స.క్రి.* నాశంచేయు, చంపు.

"ఏవంకఁజూచినా యిట్లనే ధర్మంబు
గావుపట్టితివిగా కలికాలమా" 1-206

గాసి : వి. 1. వ్యథ 2. శ్రమ *విణ.* 1. వ్యర్థమైన, పనికిమాలిన 2. నష్టమైన.

"గాసి బంధమేల మానుఁ గాముఁడు లో
నుండఁగాను
వేసలు సంసారమై వెన్నడించుఁగాక" 4-61

గాసిఁబడు : *అ.క్రి.* కష్టపడు, బాధపడు.

"ఉన్నతోన్నతబుద్ధి నొనగూర్పకది దేహి

కన్నచోటికిఁ బఱపి గాసిఁబడెఁ బ్రాణి" 1-159

గాసిఁబెట్టు : స.క్రి. కష్టపెట్టు, శ్రమపెట్టు, బాధించు. (గాసి = బాధ, కష్టం.)
"మక్కువ నీవు చూపఁగా మాటలాడితిఁ గాక
కక్కసమై తోఁచితేను గాసిఁబెట్టీనా" 27-84

గాసిచేయు : స.క్రి. కష్టపెట్టు, బాధించు.
"ఏల మము గాసి సేసే రింకా మీరు
కాలముతో నిలిచెను కైవల్యపదవి" 6-145

గి

గింటెపుఁజీర : వి. జమిలి పోగుల నేతచీర.
"కట్టిన గింటెపుఁజీర గళబెళ మనఁగాను
యిట్టె వచ్చి కానుక నీ కిచ్చీ నెవ్వతో" 12-495

గింటెలనవ్వులు : (గింటెము = విణ. దట్టమైన 2. అధికమైన – వ్యు. (బ్రౌన్) దట్టమైన నవ్వులు.
"కంటకములాడ నిన్ను ఘనుఁడ నేనోప నోప
గింటెల నవ్వులలోన గిలిగింతలా" 7-303

గిండి : వి. సన్నని మెడ గల చెంబు.
"గిండివట్టే యాపె కుచగిరులపై నొరుగక
అండనే చల్లని పన్నీరారగించేవు" 13-317

గిండివట్టే యాపె : సన్నని మెడగల చెంబును పట్టుకొనే స్త్రీ.
"గిండివట్టే యాపె కుచగిరులపై నొరుగక
అండనే చల్లని పన్నీరారగించేవు" 13-317

గిజిగాఁడు : వి. పక్షివిశేషం, పచ్చపిట్ట.
"హెచ్చి గిజిగాండ్లు సయిత మెంతో గూఁడువెట్టి
తెచ్చి మిణుగురుఁబురువు దీపమువెట్టు" 3-468

గిజిగిజిగా : క్రి.విణ. నలగిపోయేట్లుగా.
"జంటైన చుట్టరికాన సహాయము నెరపితే
గెంటక నా చీర గిజిగిజిగాఁజేసితివి" 25-215

గిజిగిజిసేయు : స.క్రి. నలగి పోవునట్లు చేయు, కలవరం కలిగించు.
"ఎంత గిజిగిజిసేసే వింతిని నీవు
మంతనానఁజేయరాదా మఱి చేతలెల్లను"
23-153

గిజ్జడి : వి. షడ్రుచులు కలగలిసిన అన్నం, చిత్రాన్నం (పులిహోర), కదంబం అనే అన్నం.
"కలయవే మా పొత్తు కలికీ – వోరి
కలగలపు గిజ్జడి గాదటరా" 7-484

గిజ్జిడి : వి. చూ : గిజ్జడి.
"తానేలి వేఁడుకొనీనే తడిసీఁ జెమట చేయు
ఆని విరహాన గిజ్జిడై వుందానను" 7-467

గిజ్జిడిగొను : ప.బం. (?)
"చుక్కలు మోవిఁబొడమె చూపులుఁగెంపు దడమె
కిక్కిరించిన కళలు గిజ్జిడిగొనె" 12-389

గిటగిట : అవ్య. పండ్లు గీటడంలోని అనుకరణం.
"గుటగుటరవములు కుత్తికఁ గులుకుచు
గిటగిటఁ బండ్లు గీఁటుచును" 1-68

గిడిబిడి : వాద్యవిశేషం.
"కిన్నెర మీఁటఁగాను గిడిబిళ్లు వాయింతురా
పన్ని నీవు సుతిగూడి పాడుటగాక" 18-416

గిరవు : 1. కానుక, ఉపాయనం 2. కుదువ, తాకట్టు.
"గరిమ నా హృదయాకాశమునఁ దలఁచుటే
గిరవై యబ్బినయట్టి ఖేచరత్వము" 2-258

గిరవుపెట్టు : వి. 1. కానుకగాపెట్టు 2. కుదువబెట్టు, తాకట్టుపెట్టు.
"గిరిగుచములవిగో కేశవా నీకు
గిరవుపెట్టుకున్నదాన కేశవా" 14-233

గిరువు : స.క్రి. ముడుచు.
"మూఁతులే గిరువంగ మోము నొచ్చీనంత
బాఁతి మీఱఁ బకపక నవ్వకురా" 6-103

గిఱికొను : అ.క్రి. వ్యాపించు, పారు, స్థిరపడు, అతిశయించు, కమ్ము, చుట్టుకొను, ఆవరించు, కప్పు.
"గిఱికొన మన్నించి కోరితి బొందుదుఁగాక
యెఱఁగించితి నిన్ను యేమి సేసేదిఁకను"
20-598

గిలిగించు : స.క్రి. గిలిగింతపెట్టు, గిలిగింత కలదానినిగా చేయు.

"సిరసు వంచితి నింతే చేతుల మొక్కితి

కెరలి నన్నేల గిలిగించ నింతే తాను" 11-146

గిలుకొట్టు : స.క్రి. 'గిలకొట్టు' కావచ్చు; 1. వేళ్లతో చిలుకు 2. కలుపు, రంగరించు 3. వేళ్లతో పుణుకు. (వ్యు.)

"చెలఁగి తపసు చేసే చిత్రకూటగిరి కాదు

గిలుకొట్టు నా కుచగిరులు కాని" 7-119

గీ

గీటించు : స.క్రి. పళ్లు కొఱుకు, కన్నుగిలుపు.

"మాయలాడవచ్చుఁగాని మర్మములు నాఁటితేను

గీటించి మీఁదటఁ బెల్లగించరాదు" 24-328

గీదపోరు : అ.క్రి. ఒకే వేధింపు వేధించు.

"కాదనేదానఁగాను కైకొలిపేదానఁగాను

గీదపోరి యేల సాకిరి గోరేవు" 27-192

గీరు(ఱు)దిరుమణి : వి. గోటితో గీరి తీర్చే తిరుమణి. (తిరుమణి = తిరుమన్ను, వైష్ణవులు నొసట నుంచే ధవళమృత్తిక .)

"తిద్దిన నొసలి గీరుఁదిరుమణి గానరాఁగా

కొద్దిఁజిగుళ్లు వెళ్లిన కొప్పుతోడ

అద్దపు నెమ్మోము చూపి అతని మైగరఁగించి

ముద్దుమోమిచ్చి మోహమున ముంచితివె చెలియా" 17-378

గీరునామము : వి. గోటితో గీరి తీర్చెడి బొట్టు, గోఱుబొట్టు, గోఱునామము .

"కెంపు గనుగవ మీర గీరునామము జార

తెంపుతోడ నున్న దదె తెలివా ?" 27-152

గీరులుకొను : అ.క్రి. పడు, గీతలు కలుగు.

"గీరులుకొనీ సొమ్ములు కాఁగిలించకువే"

29-457

గు

గుంగిలి సరసాలు : వి; బహు. పచ్చిసరసాలు (?)

"గుంగిలిసరసాలకు కొంతైనా మరఁగు వద్దా

సంగతి గాదని నీతో సన్నసేసే నదివో" 3-102

(గుంగిలి = వ్యర్థము అని జాస్తి. తా.అ.సం.భా.వి. 90 తె.వ్యు.కో.

గుంగిలిసేయు : స.క్రి. నిఘంటువులో ఈ పదం కానరాదు. పరిహసించు, నవ్వులపాలు సేయు కావచ్చు.

"ఇంగిత మే నెరఁగ నింతుల గోడునకేల

గుంగిలిసేయక కూడవయ్యా ఆపెను" 27-255

గుంటిమీఁదటి వాన : ప.బం; వి. నిలువనిది, అస్థిరం, ఉండనిది. పర్వతంమీది వాన అని వాచ్యార్థం.

"గుంటిమీఁదటి వాన కొనబు సరసవుటాన

వెంటవెంట తోడినీడ వేడ్క తగులు" 7-231

గుంటిమీఁది తోడఁబుట్టు : ప.బం. పార్వతి, కొండమీది (కైలాసం మీది) తోబుట్టువని వాచ్యార్థం.

"మింటిమీఁది కంటిచూపు కంటలేని కూడు నీకు

గుంటిమీది తోడఁబుట్టు గొల్లవారి కలిమి" 5-297

గుండు : వి. 1. గుండ్రని పెద్దరాయి 2. పర్వతం.

"కొండపొడవులైన ఘోరవానరబలము

గుండుగా వారిధి దండఁగూడ బెట్టి" 4-503

గుండు : విణ. గుండ్రని.

"దిండుకట్టి యాసలు తీగెలు సాగేకాలాన

గుండుఁజేతుల తీగెలు కొమ్మ కొప్పు నిదివో"

28-476

గుండుగండఁడు : వి. గర్వాన్ని అణచినవాడు, వీరుడు.

"మారీచబాహుమద మర్దన తాటకాహర

క్రూరేంద్రజిత్తుల గుండుగండా" 2-220

గుండె గరఁగు : ప.బం; అ.క్రి. దయ కలుగు.

"దండ నేనే వుండఁగాను దయదలఁచితిగాక

గుండె గరఁగి నీయంతఁగూడితివా" 11-376

గుండె రాయి అగు : ప.బం; అ.క్రి. గుండె కఠినమగు, దయాహీనుడగు .

"కొండవంటి దొర దాను గోవిందరాజు తన

గుండె రాయి గాదా తొల్లి గోవిందరాజు" 25-307

గుండె రాయి సేసుకొను : *ప.బం; అ.క్రి.* అతికష్టంగా గుండెనిబ్బరం చేసుకొను.
"వండ వండ నట్లాయ వలచిన వలపెల్ల
గుండె రాయిసేసుకొంటేనుఁ గొసర నేమున్నది"
8-50

గుండెలోని అమ్ము : వి. మిక్కిలి బాధను కలిగించేది, హృదయశల్యం.
"తటి నీ మనసును దలఁచినట్లుండు
గుటిగా నదివో నాకు గుండెలోని అమ్ము"
11-247

గుండెవగులు : (గుండె + పగులు) మిక్కిలి భయం కలుగు.
"చిత్తరుపటముమీఁదఁ జెలియ నెమ్మోము వ్రాసి
గుత్తపుఁజందురుఁడని గుండెవగిలె" 17-511

గుండెవట్టు : అ.క్రి. ధైర్యం తెచ్చుకొను.
"వెక్కసపు శార్ఙము వెస చేతఁబట్టఁగాదు
పక్కున గుండెవట్టిరి బ్రహ్మాదులు" 15-163

గుంతదోషము : వి. ఇతరులకు చెడుపు చేయదలచిన వాఁడు, ఎవరికి చెడుపు చేయ దలచినాడో వారి ఇంటిలో గుంత తీసి ఏదో ఒక వస్తువు పాతిపెడతారట. దానివలన కలిగే దోషం (?)
"బూ(పూ)తకి జంపినవాఁడే బూతకి వాకట్టు రక్ష
పాతాళానఁగూర్మమైన పతి గుంత దోషరక్ష"
6-54

గుంపించు : (6) అ.క్రి. (ఈర్ష్యచేత వికారపు మాటలాడు అని ఆం.ధా.మా.) విజృంభించు, కుప్పవేయు, అతిక్రమించు.
"ఇంపు గలిగిన చోట నెగ్గులు వట్టఁగనేల
గుంపించి మీరేల ఆడుకొనేరే సవతులు"
18-214
"గుంపించినదానఁగాను గొణఁగినదానఁగాను
తెంపున నేరా నన్ను దీకొనేవు" 27-178

గుంపెన : వి. విజృంభణ (ఆం.ప.ని.) గంతు, పోటు, దెబ్బ.
"వోపి సరి వెనుగుదు రొట్టెల్లాఁ బెట్టుదురు
పైపై గుంపెనలే కాని పల్లదాలు గావు" 28-303

గుంపెనలాడు : అ.క్రి. గునిసియాడు, నర్తించు, కులుకు.
"ఊరకుండవుగా ఓసి మాయ నిన్ను
జేరఁబిలువము గుంపెనలాడేవు"
113 భా 41 & 1-11

గుక్కు : అనుమానించు, తొట్రుపడు, మాటలు మొ॥ తడుముకొను.
"గుక్కక మనసు నేఁడు కోరక వుండఁగలేదు
తక్కి బ్రహ్మప్రళయానఁ దా నెట్లుండెనో" 3-428
"గుక్కక మూడులోకాలు గొలిచితివని నీకు
మొక్కుదురు పరులకు మొక్కకుండరు" 4-251

గుక్కొను : అ.క్రి. 'గుదిగొను'కు రూపాం. కావచ్చు. మూటకట్టుగా కూలబడు.
"నిక్కి చూచితే నెంత నీటు చూపేనందువో
గుక్కొని నాలో నేనే గుట్టుతో నుందానను"
22-425

గుగురుఁజిగురు : వి. గుబురుగా నున్న చిగురు, దట్టమైన చిగురు.
"గుగురుఁజిగురునకు కుత్తికె కోవిలఁజూపు
పొగరుఁజంద్రపుమోము పున్నమ
మారుకుఁజూపు" 9-82

గుగురుగా : క్రి.విశే. నిండుగా, గుబురుగా.
"గుగురుగాఁ బులకించె కొప్పువిరు లటు చిందె
సొగసి బిగయనీకుఁ జోటేదే యిఁకను" 19-359

గుజగుజఁబోవు : *ప.బం; అ.క్రి.* గుసగుసలాడు, రహస్యంగా మాట్లాడు.
"గుజగుజఁబొయ్యేవు కొంకికొంకి నీకు నీకే
గజరు నీ చేఁతలకు కమ్మరా నేమందు రా"
21-510

గుజగుజలాడు : *ప.బం; అ.క్రి.* గుసగుసలాడు, గోప్యంగా మెల్లగా మాట్లాడు.
"ఆలోచించి గుజగుజ లాడుకొంటి మనుచును
పాలించేవు నీ వేడ పొంచు వింటివయ్యా"
13-235

గుజగుజలు : *వి; బహు.* గుసగుసలు, గజిబిజి తొక్కటాలు.
"నిజమరి నంటూ వచ్చి నిలుచున్నాఁడాతఁడు
గుజగుజ లే లాతని గుణము చూచుకోవే"
13-251

గుజ్జనఁగూడు : (2) ప.బం. చూ : గుజ్జనగూళ్లు.
"గుజ్జనఁగూడు వండెనే కోమలి నేఁడు
గొజ్జు వెన్నెలబాయిటఁ గొమ్మలుఁదాను"
10-2-101

గుజ్జనగూళ్లు : (3) *ప.బం; బహు.* బాలికలు బొమ్మలు పెట్టి ఆడుతూ చిన్న గురిగీలలో వండే వంటకం, గుజ్జుతో సమానంగా ఉండే వంటకం. (గుజ్జు + ఎన + కూళ్లు) 2. బాల్యక్రీడావిశేషం.
"కూరిమి నెసరుపెట్టి గుజ్జనగూళ్లు వండి
వేరు లేని మాటలనే విందువెట్టేవే" 14-363

గుటుక : *వి.* 1. ఒకసారి నోట పోసుకొని మింగే నీళ్లు మొ॥ వాటి కొలది. 2. ఒక్కసారిగా మింగటం. (వ్యు.)
"ఘటన శ్రీవేంకటేశ కైకొంటి నిన్నట్లానె
గుటుకల మోవీవయ్యా కొసరుగా నీవు"
18-552

గుట్టు ఇచ్చు : *ప.బం; అ.క్రి.* రహస్యం చెప్పు, రహస్యం అందజేయు.
"ఇంతులకు నింత గుట్టు యిత్తురా నీవు
పంతము మెరసేయట్టి బలువుఁడవు" 23-354

గుట్టు చేసుకొను : *ప.బం; అ.క్రి.* మోసం చేయు, రహస్యంగా ఉంచు.
"గుట్టు చేసుకొందురా కోరి నే నీకు మొక్కఁగా
నెట్టన నీవే నవ్వుట నేరుపు గాదా" 18-337

గుట్టుతో వాఁడు : *వి.* గుట్టుగలవాడు.
"గుట్టుతోవాఁడవు నీవు కూడితి వంటూ నేను
రట్టు సేసితిని మోవి నెట్టన నిన్ను" 18-328

గుట్టుపడు : *అ.క్రి.* రహస్యమగు.
"అట్టె శ్రీ వేంకటేశుఁడలమేలుమంగను
గుట్టుపడ నన్నుఁగూడెఁ గోరి మెచ్చఁగదవే"
25-108

గుట్టువాఁడు : *వి.* రహస్యం కలవాడు.
"గుట్టువాఁడ వంటూఁ గొసరితి
యిట్టి నో వంటేది యెఱఁగముగ" 9-13

గుట్టువెట్టు : *ప.బం; స.క్రి.* రహస్యంగా ఉంచు.
"మాటలాడి మాటలాడి మంతనాన సన్ననేనే
నేఁటికి గుట్టువెట్టెనో యెంత మర్మమో" 20-211

గుట్టుసేయు : (గుట్టు + చేయు) *అ.క్రి.* రహస్యంగా ఉంచు, మోసం చేయు.
"నేరుపుతో బత్తి గడు నీమీఁదఁ జేయఁగాను
యారీతి గుట్టు సేసే నిది జాణతనమా" 23-544
"నీ వల్ల దోసము లేదు నేనే వయోమదమున
సేవలు సేయక గుట్టు సేసితిఁగాని" 25-322

గుట్టె : *వి.* ఇది 'గుట్టు' కావచ్చు.
"యెట్టకేల కాపె నీతో నిటు మాటలాడఁగాను
గుట్టెతోడ నీవేల కొంకఁజూచేవు" 25-350

గుడిగొను : (18) *అ.క్రి.* వ్యాపించు (పద., వ్యు.ప.కో.) క్రమ్ముకొను, పరివేష్టించు, చుట్టుకొను అని వేటూరి ఆనందమూర్తి.
"కడుఁజెమటకు చల్లగాలి యింపు
గుడిగొన్నఁ కాఁగిటికి కూటము లింపు" 24-551
ఇట పరివేష్టించు, చుట్టుకొను అనే అర్థం యుక్తం.
"గుడిగొన్న యేఱెంత కొంకరవంకర లైనా
పుడమికి లోఁగొనక పోవుటయ్యా" 2-507
వ్యాపించు :
"గుడిగొని యాతని మై గురుతులెన్నుండినాను
చిడిముడి నిచ్చకమే సేయవే యాతనికి"
28-253

గుడిమీఁది తరువు : *ప.బం; వి.* ప్రమాదకరం (?)
"తడిపాఁత మెడఁగోత తలఁపు విషయాసక్తి
గుడిమీఁదితరువు అలకులము (అలుగులము) ప్రాణులకు" 1-104

గుడిశ : *వి.* 'గుడిసె'కు వ్యావహారిక రూపం.
"గుడిశలోన నొక కుక్కిమంచమున
వొడలు సగమునను వుండెడిదింత" 4-242

గుడుసువడు: అ.క్రి. శూన్యమగు, హీనమగు, తగ్గు.
"ఎడమపురి వెట్ట పరహితవివేకములోన
గుడుసువడెఁ జదువు మెరుగులువారెఁ జలము"
1-315

గుడ్డము: వి. 1. కొండ 2. చేను 3. చేనిపంపు.
"గుడ్డముపై నున్న కోనేటిరాయని
నడ్డగించుకొంటి వత్తయ్యా" 5-313

గుడ్డికన్ను తెఱచెనేమి మూసెనేమి: వ్యర్థం, నిష్ప్రయోజనం అనే అర్థంలో వాడబడే లోకోక్తి. (గుడ్డికన్ను తెరచినా ఒక్కటే మూసినా ఒక్కటే అని వాచ్యార్థం.)
"యెదిరిఁ దన్నుఁ గానని యెడపుల గుడ్డికన్ను
మొదలఁ దెఱచె నేమి మూసె నేమి" 1-456

గుత్తగొను: అ.క్రి. సొంతం చేసుకొను, గుత్తగా పుచ్చుకొను.
"కొండవింటి వాని గుత్త గొనినయట్టి
కొండుక పాయపుఁ గూతురు తండ్రి" 5-235

గుత్తము: (3) విణ. బిగువైన, కచ్చితమైన, కఠినమైన.
"చిత్తము నీరై కరఁగి చెమటలై వెళ్లఁ జొచ్చె
గుత్తపు వయసు చనుగుబ్బ లాయను" 28-395
"హత్తుకొని మోహంబులను ప్రధానుల యెదుట
గుత్తంపు మొగసాలఁ గలదించవలసె"
4 అను 27

గుత్తి: వి. అనంతపురం జిల్లాలోని 'గుత్తి' తాలూకా గ్రామం. ఇది రఘురాముడు వెలసిన క్షేత్రం.
"సౌమిత్రిసహోదర దశరథరామా
చేముంచి గుత్తిలో వెలసిన రఘురామా" 3-499

గుదిగుచ్చు: స.క్రి. 'గుదిగ్రుచ్చు'కు వ్యావహారికరూపం; ఒకచోట చేర్చు, ఒకగుదెకు - సూదికి గ్రుచ్చు.
"కొచ్చి కొచ్చి తమకము గుదిగుచ్చవలెనా"
7-480

గుదిగొను: ప.బం; అ.క్రి. 1. అతిశయించు (2. దట్టమగు, స్థూలమగు 3. తడబడు 4. మూటకట్టుగా కూలబడు)
"గుదిగొను హరిభక్తుల కోట్లలో
వెదకు నొకఁడు శ్రీవేంకటపతి" 4-1-3
"కదిసిన రుద్రుని గర్వ మడఁచితివి
గుదిగొని దివిజులు కొలుచుట యెట్టు" 8-236
"ఉదుటైన యింద్రియాల - నొడిసి వంచుకొనుట
గుదిగొన్న తనలో - కోరికెలుడుగుట"

గుద్దిచెప్పు: ప.బం; గట్టిగా చెప్పు, బల్ల గుద్ది చెప్పు అని ఇప్పటికిని వ్యవహారం.
"ఇన్నిటా జాణవు నీకు యెవ్వరు గుద్ది చెప్పేరు
యెన్నికె కెక్కిన నీ యింటిలోనివారము" 27-73

గుద్దిరము: (4) వి; బహు. ఈ పదం నిఘంటువుల్లో కానరాదు. "కుద్రగేడితనము అని కన్నడ వ్యవహారం. Envy - అసూయ అని కిట్టెల్, క్షుద్రశబ్దభవము కావచ్చు" అని (సం.ప.స. 16సం 428 పు.)
"నీవు నన్ను మన్నించఁగా నెలఁతలు గుద్దిరాన
వేవేలు నాడుకొంటే విననోపను" 16-381
"కడవారు నవ్వేది కానవు గాక
గొడవల మమ్ముఁజూచి గుద్దిరము లేఁటికే"
11-297

గుద్దులాట: ప.బం; వి. జగడం, తగవు, యుద్ధం.
"ఇద్దరికిఁబోరువెట్టి యేమి చూచి నవ్వేవయ్యా
గుద్దులాట వెలిగాను కోపగించీ నీపై" 13-372

గునిమగు: అ.క్రి. (?)
"తచ్చితేను పెరుగులో తానే వెన్న వొడమదా
కుచ్చి కౌగిలించుకుంటే గునిమయ్యా నతఁడే"
29-426

గునియు: అ.క్రి. 1. నర్తించు, ఆడు 2. చలించు 3. కులుకు 4. చెదరు 5.గొణగు 6. బాధపడు (ఆందోళించు. ఆం.ప.ని.)
"ముద్దుటుంగరంబుల కరములతో
ముద్దులు గునియుచు మొక్కిరి నీకు" 5-214

గునిసాడు : (గునిసి + ఆడు) అ.క్రి.
గునిసియాట = విలాసచేష్ట అని ఆం.ప.ని.
ఎగురుతూ ఆడు, గెంతుతూ ఆడు.
"గోవింద హరిగోవింద గునిసియాడుదం బిటు రారో" 3-109

గుబ్బతిలు : (3) అ.క్రి. 1. అతిశయించు 2. ఉడుకు 3. పరితపించు 4. మండు 5. ఉప్పొంగు 6. పొంగు.
"గుక్కకొంటా వలపులు గుబ్బతిలే వది యేమే
చక్కెరమోవి చూపి సన్న సేయఁగాను" 29-407

గుబ్బలాఁడి : (గుబ్బలు + ఆఁడి) వి. గుబ్బలు = లావైన స్తనాలు కల స్త్రీ, గుబ్బెత, యువతి.
"రాకుంటె మానుఁగాక రంతులేటికె
వేకపు గుబ్బలాండ్ల విటుఁడాతఁడు" 5-5

గుబ్బలికొండ కనుమ : వి. నందలూరు దగ్గరనున్న కనుమ. దీనినిప్పుడు 'లంజెకనుమ' అని వ్యవహరిస్తారు. చూ : ఎఱ్ఱశిల కనుమ.
"పంతపు నీ గుబ్బలే గుబ్బలికొండకనుమ
మంతనాల కనుమాయ మగువ నీ పతికి"
5-115

గుబ్బున : క్రి.విణ. శీఘ్రంగా. (శ.ర.)
"గుబ్బున నెవ్వతో నిన్నుఁగూడని
వుడుకునకుమ
గుబ్బ లొత్తె నని నీవు గుంపించేవు గాక"
13-525

గుమిగట్టు : అ.క్రి. అధికమగు, చాలామంది ఒకచోట గుంపుగా చేరు.
"గుట్టువేఁచె మదనుఁడు గుమిగట్టెఁ గోరికలు
అట్టయితి నీ చేత లాఅడికెక్కెఁగదరా" 8-122

గుమితము : వి. "గుంభిత" శబ్దభవము కావచ్చును. కన్నడము – గుమిత, రహస్యవార్త, ఆడుకోలు (వదంతి) అని అర్థం" అని సం.ప.స. 13 వాల్యూం 4 పుట.
"గుమితాన రేపుమాపుఁ గోసి రాపించఁగనేల
సముకాన దాని నన్ను జగడించ విడరా"
11-227

గుమ్మడికాయంత : ప.బం; వి. మిక్కిలి పెద్దదైన.
"గుమ్మడికాయంతముత్తెము" 17-241

గుమ్మడికాయలన్న బుజాలువట్టి చూచుకొను : సామెత; ఎవరో ఏదో అనగా అది తనను గూర్చే అని భావించేవారి యెడ ఉపయోగించే పలుకుబడి – దీనికి ఆధారమైన కథ. ఒకచోట గుమ్మడికాయల దొంగతనం జరిగిందట. అందరినీ చేర్చి రాజుగారు దొంగతనాలు చేస్తే చేసినారు, బుజాలమీదే పెట్టుకోవాలా అన్నాడట. అనగానే అసలు దొంగతనం చేసినవాడు బుజాలు తడిమి చూచుకున్నాడట.

గుమ్మడికాయలన్న సుద్ది : ప.బం; వి. గుమ్మడికాయల దొంగంటే భుజాలు వెదుక్కున్నట్టు అనే సామెత.
"గుమ్మడికాయలన్న సుద్ది దడవితే
పన్ని నేఁడు నీ బుజాలు పట్టి చూచుకోకురా"
17-79

గురిగింజపేరు : వి. గురిగింజల హారము.
"కోమలి గుబ్బలమీఁది గురిగింజపేరు
నీ మెడ వేసుకొంటివి నేరుపుతోను" 26-404

గురిగింజ సరిదూగు : ప.బం; అ.క్రి. చిన్నదగు.
3-519 old

గురిగి : వి. ఒక రకపు చిన్న మట్టిపాత్ర, చిన్న చెంబు వంటిది.
"గుబ్బల మెఱుఁగుల గురుగులలోపల
నుబ్బ నానఁబాలొగి నించి" 6-63
"గోమున సేవంతిపువ్వు గురుగులలోపల
యేమరక పూఁదేనె నెసరువెట్టి" 10-2-101

గురు(ఱు)తుపడు : (2) ప.బం; అ.క్రి. గుర్తు తెలియు, విదితమగు, తెలియు.
"పొదుగుకొన్న దిదే కర్మమె యందురు
పొడచూపుట లే దెక్కడను
యెదిటిది మాయాకల్పితమే యట
యెట్లు గురుతుపడు మాకును" 15-403

గురుమ[1] : వి. పెద్దరికము, తేజము ఇత్యాది అర్థములు కావచ్చును. చూ : 25 పీఠిక 12

సం. 'గరిమ' శబ్దవికారం కూడా కావచ్చు. కురుమై luster, Brightness అని తమిళ నిఘంటువు.

"గట్టిగాఁ దెలుసుకుంటే కన్నదే కందిగురుమ" 2-276

గురుమ²: వి. విత్తు, గింజ. (బ్రౌన్)

"పొన్నలలో వేగఁ బొద్దుపోనీవే యిఁక
కన్నదే కందిగురుమ కానీవే యింక
అన్నిటికి నేరుతువు అవునయ్యా
కన్నదే కంది గురుమ కంటిమయ్యా" 23-130

"చుట్టి వరిగురుమతో జొన్నగింజ సరిదూఁగు
తెట్టలై మేలొకటి తీలొకటి కాయ" 3-14

గురుమంత్రము: వి. గొప్పమంత్రం, గురువు ఉపదేశించిన మంత్రం.

"మగువమాటలే గురుమంత్రము నీకు
వెగటు దీర నివి విన్నవించ దాయనా" 13-360

గురులు: *వి; బహు.* గొప్పలు (?) భారము. (బ్రౌన్)

"ఇమ్ముల నన్నేలితివి ఇంతలోనే
కుమ్మరించితే రతులు గురులాయ నీకు" 27-15

గురులువేయు: భారం వేయు.

"గుట్టుతోడ నవ్వు నవ్వి గురు లేల వేసేవు
పట్టరాదా నీ తొళ్ళి పాయము నేఁడు" 28-269

గుజ్జమువంటి కొడుకు: వి. సాహసికుడైన కొడుకు.

"విచ్చనవిడినె తడువు విడిచి పారెడిని
రచ్చలనె యింత గుజ్జమువంటి కొడుకు
దిచ్చరీఁడై యిట్లు దిరువేంకటేశ్వరుండు
నిచ్చనిచ్చలును గడుఁబెచ్చు వెరిగీని" 6-62

గులగులలు: *వి; బహు.* ముక్కలు ముక్కలు, పొడిపొడి.

"పట్టి పిసుక నిఁక బనిలేదు
గుట్టు దెలిసితే గులగులలు" 3-137

గులిమి కొలుచు: గరిసె (బొట్ట) లోని ధాన్యం.

"గులిమికొలుచు దీరఁ గుడువనియ్యక కొత్త
కొలుచు మీఁదమీఁదఁ గొలవఁగా" 1-168

గులుగు: వి. కులుకుదనం. (మోహం, కామవాంఛ అని రా.సీ. మాం. పుట 286)

"వెలి యాసలనే దండు విడిసిన కోటా
గులుగై యింద్రియములు కొల్లగొన్న కోటా" 2-84

గుల్ల: వి. శంఖం.

"గుల్లసేతఁబట్టి కొండపై నిలుసుండి
వల్లెవాటువేసి వరములిచ్చెను" 24-13

గుల్ల గుల్లే రాయి రాయే: నానుడి; విలువలేనిది విలువలేనిదే, విలువగలది విలువగలదే. శంఖం శంఖమే రాయి రాయే అని శబ్దార్థం.

"గుల్ల గుల్లే రాయి రాయే గురియెంత వేసినాను
అల్ల నాఁడే అడియాస లవి యేల విడుతు" 4-83

గుల్లసంకుఁజక్రములు: బోలుగా ఉన్న శంఖం మరియు చక్రం.

"గుల్లసంకుఁజక్రముల గోవిందుడు
గొల్లవారింటఁ బెరిగె గోవిందుడు" 9-257

గుల్లసంకుదుబ్బ: వి. (?)

"గుల్లసంకుదుబ్బను కొలచి పోయిమనేవు
యిల్లిదె యిప్పుడె మా యింటికి రావయ్యా" 7-474

గుళగుళ: అవ్య. కురవడం లోని ధ్వన్యనుకరణశబ్దం.

"ఫళఫళ వీరవిభవరసరుధిరము
గుళగుళ దిక్కుల గురియించితివి" 1-85

గుళిగ: వి. ఘుటిక, ఉండ, గుళిక. (వ్య.)

"చప్పుడుగా పన్నీటను జలకములాడే వేల
గొప్ప నవరసముల గుళిగైనాఁడు" 17-499

గూ

గూఁటవేయు: ప.బం; స.క్రి. కుదుటపఱచు. (పద.)

"గుట్టునఁ బయ్యదలోన గూట వేసుకుండఁగాను
తొట్టుకున్న పాయానకు దోసము రాదా" 25-268

గూటఁబెట్టు : ప.బం; స.క్రి. కుదుటపఱచు. (పద.)

"ఎఱిఁగిన పనులకు నేల గుట్టుసేసేవు

గుఱి లేని కోరికలు గూటఁబెట్టేవా" 19-72

గూటవేయు : ప.బం; అ.క్రి. కుదుటపరచు.

"కోరి యంతలో గురుఁడు గూటవేసె మనసు"

4-335

గూన : వి. బాన, పెద్ద కుండ, లోతుఉన్న కుండ, ఇండ్లపై కప్పే కప్పు.

"కుత్తుకబంటిదాఁకా గూనలో పాలెల్లాఁ దాగె

యెత్తుకవున్నాఁడు మొగ మిందుదాఁకాను"

20-450

గూళెపుసతులు : వి; బహు. గూడెపుసతులు, (?) గొల్లపల్లెలోని సతులు కావచ్చు.

"గోలయై వేల గొండెత్తె గోవిందుఁడు

గూళెపుసతులఁదెచ్చె గోవిందుఁడు" 9-257

గె

గెంటసము : వి. పరుషవాక్యం, న్యూనతపఱచు మాట, నిష్ఠురోక్తి, కట్టెవిరుపు మాట, స్ఖలితోక్తి. విణ. తీక్ష్ణమైన, వాడియైన.

"గెంటసంబులను కెలసేవూ

నంటున నాతఁడు నవ్వఁగనూ" 24-245

గెంటసాలాడు : అ.క్రి. పరుషోక్తులు పలుకు, పరిహాసములాడు.

"నంటున నాతఁడు నీతో నగఁగానే వేరెవేరే

గెంటసాలాడే వేలే వెంగెములుగాను" 11-213

పద. లో ఈ పదానికి హాస్యమాడు, న్యూనతపరచు మాటలాడు అనే అర్థాలు చూపబడ్డాయి.

గెంటు : (3) వి. చలనం. (శ.ర.)

"గెంటులేని వేంకటగిరిమీఁదను వాఁడె

పెంట పెట్టుకున్నవాఁడు పెండ్లికొడుకు" 5-186

"నంటుమీఱి సెలవుల నవ్వులేల వుమిసేవే

గెంటులేని కన్నులను కెంపు లెక్కేని" 7-44

"అరుదుగ గెంటు లేని ఆచారవంతుఁడఁ గాను

హరి నీ కరుణ నాపై నంటు టెట్లయ్యా" 3-181

గెత్తు : (?)

"చిత్తజు నమ్ములు శిరసున ముడువఁగ

గెత్తుకెట్ల దాఁకెనో గాని" 24-9

గెర : వి. (మాం.) గీత, అవధిని తెలియజేసే గీత.

"గెర వ్రాసితినట యాకె ఇంటికి నేఁగకుండా"

23-401

గెరదాటు : అ.క్రి. అవధి దాటు.

"వెగ్గళమై గెరదాఁటే విచారమేలే" 20-135

గెరసు : వి. గెర, గీత, అవధిని తెలియజేసేగీత.

"గెరసు దాటకువోయి కేశవా మంకు

గెరలించేవు వలపు కేశవా" 14-233

గేస్తురాలు : (గేస్తు + ఆలు) గృహస్థురాలు, కులస్త్రీ, భార్య.

"నయగారి మాటలెల్ల నాకుఁగా నేరిచితివి

క్రియలెరుఁగు కొంటివి గేస్తురాండ్లకు" 27-531

గొ

గొంగ : వి. శత్రువు. (సంహారకుడు, చావు)

"వెంట రాకు మని కృష్ణు వెరపించి యశోద

వొంటి మందలో గొంగ వున్నాఁడనె" 4-258

గొంజ : వి. గొడ్డుటావు.

"గొంజ సుకృతములు కుమ్మరించి హరి

రంజించెను సర్వజనులకు" 4 అను 43

గొంజెగొడుగు : వి. దేవుని గొడుగు, ఆతపత్రం ప.బ.పా. ఆతపత్రమని అర్థమిచ్చినది. గొంజెగొడుగులు చిన్నవి కాక పొడుగాటి స్తంభములపై నిలచినవి. ఆ గొడుగు కంబమును ఆలయపరిచారకులు నడుముకు చుట్టిన గుడ్డల మోపున బొడ్డుకడ ఆనించుకొని నిలుపుదురు. "గుంజగల గొడుగు గుంజగొడుగు. అదే గొంజ గొడుగయినదా!" అని వేటూరి ఆనందమూర్తిగారి అభిప్రాయం.

"వింజామరలును విసనకఱ్ఱలును

గొంజెగొడుగులే కొండెల్లా" 1-119

గొంటరి : (గొంటు + అరి) వి; విణ. 1. కఠినుడు,

దుష్టుడు 2. దుష్ట మైన 3. దిట్ట. (వంచకుడని ఆం.ప.ని.)
"జంటై కూడితి నింతలో సరుగ శ్రీవేంకటేశ
గొంటరివై యాపె వీణె గోరనేమి మీటేవు"
22-306
"గొంటరై యిందుకు నాపె కోపగించినాఁ గోపించీ
అంటిముట్టి సరసము లాడకురా యిఁకను"
7-451

గొంటరితనము : (2) వి. 1. కాఠిన్యం 2. దుష్టత్వం 3. దిట్టతనం.
"గొంటరితనాన నీవు కొంగు వట్టుకొని పతి
నింటికి రప్పించుకోఁగా నేలంటినా" 18-190
"వెంటనే చుట్టరికాలు వీరెల్లాఁ జెప్పఁగాను
గొంటరితనాన నేను గొరబుసేసేనా" 26-342

గొంటరియాపె : (గొంటరి + ఆపె) వి. 1. కఠినురాలు 2. దుష్టురాలు 3. దిట్ట.
"నంటు సేసుకొని నీతో నయముననే నవ్వి
గొంటరియాపె యేల కోపగించీని" 25-254

గొంటరివాఁడు : విణ. 1. కఠినుడు 2. దుష్టుడు 3. దిట్ట.
"అంటిముట్టి చనుగవలందు గురుతులు నించీ
గొంటరివాఁడు గదమ్మా గోవిందదేవుఁడు"
29-55

గొంటి : (?)
"పాముపుట్ట గొంటిమీఁది పడుమటి తెరువు
చీమకదొంతరలోని చిన్న తెరువు" 1-244

గొంటు : విణ. నేర్పరి, దుష్టుడు, వంచకుడు.
"గొంటవై శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
దంటతనమున నవి తలఁచుకో నీవు" 11-11

గొంటుఁదనము : (గొంటు + తనము) 1. కాఠిన్యం 2. దుష్టత్వం 3. వంచన 4. నైపుణ్యం.
"రట్టుగాను నీవు మాటలిట్టె నాతో నాడఁగాను
గుట్టుతోడ నుండితేనే గొంటుఁదనమా" 23-516
"ఇంటిలోన ఆపెను నేమంటివో కాని
గొంటుఁదనమున నట్టె కూచున్నది" 20-421

గొంటుతనము : చూ: గొంటుఁదనము.

గొంటెత : (2) (గొంటు + త) వి. 'గొంటు'కు స్త్రీలింగరూపం. 1. కఠినురాలు 2. క్రూరురాలు 3. వంచకురాలు 4. దుష్టురాలు 5. దిట్ట.
"గొంటెత యెవ్వతోకాని కొద లేని తమకి తా
నంటఁగాక నిన్నుఁగూడె నదిరిపాటునను"
5-149

గొంతిదామెర : వి. ఒక నోము.
"కొమ్మ చలిమందులకు గొంతిదామెర నోమె
కమ్మదావులకు మును గౌరినోమె" 5-127

గొందిసంది : సందిగొంది, సంది మరియు మూల. (గొంది = మూల)
"మందలించఁజాలఁగాక మనసు నొచ్చీ నంటా
గొందిసంది తన మేని గురుతు లెల్లా" 25-23

గొజ్జంగ : గొజ్జంగి కావచ్చు. 1. పెద్ద చేమంతి 2.పచ్చపువ్వుల మొగలి.
"కొప్పుదువ్వి నీ కాతఁడు గొజ్జంగులు ముడువఁగా
అప్పుడే గోరుదాఁకె నంటూ ఆడేవే" 25-442

గొట్టు : వి. 1. దౌష్ట్యం 2. అల్లరి 3. మూర్ఖత. (వ్యు.) (బాధ - సారంగ.)
"యిట్టె శ్రీవేంకటేశ నీ వెనయఁగ
గొట్టు గెలిచి సిగ్గునఁ బొదలీని" 27-264

గొట్టెవాటు : వి. (?)
"కొట్టేటి వుట్లకింద గోవిందా నీతో
గొట్టెవాటై పెనఁగేరు గోవిందా" 16-325

గొడఁగు : అ.క్రి. 1. ఎదుటివారికి స్పష్టంగా వినబడకుండా నోటిలో ఉచ్చరించు, గొణఁగు 2. కూయు 3. కసరు 4.ఆడు, కసరు.
"గొడఁగుచును బొమ్మలనె గొబ్బునను గోపించి
అడఁగి తలవంచె నీ వపు డేమి సేసితో" 9-124

గొడగు : (5) వి. 'గొడుగు'కు రూపాం.
"గొడగు వట్టినవానిఁగోరి యడిగిన తలఁపు
తడఁబడక విప్రులకు దానమిడు తలఁపు" 1-356

గొడవకాఁడు : వి. గొడవ చేసే స్వభావం కలవాడు, కలహశీలుడు.

"అడియాసల నూరకే అండనుంటి మంతెకాక

గొడవకాఁడితఁడు కూడనీఁడు పదవే" 14-271

గొడసెటి జిహ్వ : (?)

"ఘనమగు కోరలు కరాళవదనము

చెనకుచు గొడసెటి జిహ్వాయును" 2-113

గొడియకట్లు : *వి; బహు.* గొడియ, గొడె అంటే నేరం చేసినవాని చేతులకు వేసే బంధనసాధనం, దానితో వేసే బంధనాలు.

"కొనఁ బుణ్యపాపాలే గొడియకట్లు రెండు

కొనిరి నీ దాసులే కోరిన తప్పు దండము"

4-208

గొడుగుమట్టి : వి. కడపమండలంలోని ఒక గ్రామం. ఇది చెన్నరాయడు వెలసిన క్షేత్రం.

"చిత్తగించు నీవాపెను చెన్నరాయ!

యీపె చిత్తిణి గొడుగుమట్టి చెన్నరాయ!"

27-328

గొడుగుమట్టి చెన్నరాయఁడు : వి. కడపమండలంలోని గొడుగుమట్టి గ్రామంలో నెలకొన్న చెన్నరాయడు.

"చిత్తగించు నీ వాపెను చెన్నరాయ! యీపె

చిత్తిణి గొడుగుమట్టి చెన్నరాయ!" 27-328

గొడ్డలి నానఁబెట్టు : ప.బం. వ్యర్థమైన ప్రయత్నం చేయు.

"మేనె దాఁచేవు మెస్తిర గొడ్డలి

నానంబెట్టేవు నయముననే" 6-58

గొడ్డలివంటి చిత్తము : వి. కఠినమైన మనస్సు.

"నానితేఁ గొంత వలపు నయమౌఁగదే - (వోరి)

నానునా గొడ్డలివంటి నాదైన చిత్తము" 7-484

గొడ్డువోవు : (2) ప.బం. 1. పౌరుషహీనుడగు 2. గొడ్రాలగు 3. వ్యర్థమగు.

"వెడ్డువెట్టి కూడెను శ్రీవేంకటేశుఁ డింతులను

గొడ్డువోని వరముల గోవిందరాజు" 26-126

గొడ్డేరు : (4) వ్యర్థం, దండుగ, ఆశ్రయం లేకుండా.

"అడ్డగించుకొంటివి నా కప్పులనాఁడ వా వోరి

గొడ్డేరు నీ కొద్దిగాదు కోపము నాకు" 11-237

"బొడ్డునఁబుట్టిన పూఁపనితే నిన్ను

గొడ్డేరు తెస్తినే కోడల" 12-312

"జిడ్డులేని హరికథ చవి లేకుండిన నిట్టే

గొడ్డేరే గొడ్డేరే గొడ్డేరే సుండి" 5-373

గొణఁగులు : *వి; బహు.* గొణుగుటలు.

"ఆడేవి గొణఁగులు అమ్మేవి సణఁగులు

యీడనే మా పొందు నీకు నితవయ్యీనా"

14-204

గొదలు : అ.క్రి. కొదలు (= తడబడు) అని కన్నడము. సంకోచించు అనే తాత్పర్యార్థమిందులో కానవస్తుంది. 'ఇంత గొదుల్తా వేమిరా, కొతుకుతావేమిరా' అని వ్యవహారం ఉంది. (సం.ప.స. 14 సం.)

"నంటున నే నెంతైన నాకుఁగా వగవనీ

గొంటు చందమునకే గొదిలేనమ్మా" 14-389

గొనకొను : రూపాం. కొనకొను 1. సమ్మతించు 2.ఉద్యమించు 3. అతిశయించు 4. సంభవించు 5.నెలకొను 6. బయలుదేరు.

"మనసులో తలపోఁత మరి యేమీ నెంచదు

గొనకొన్న రతికేళి కొల దెంచదు" 26-380

గొనబు : వి. మనోజ్ఞత, సొగసు, విలాసం. విణ. 1. సొగసైన 2. పరిమళంకల 3. మధురమైన 4. మృదులమైన, లేతనైన.

గొబ : వి. గుహ, గొంది.

"వుండనియ్యక జీవనోపాయమున మమ్ము

కొండలను గబల తతిగొని తిప్పు ఫలము"

1-200

గొబ్బనన్ : క్రి.విణ. గొబ్బున, శీఘ్రంగా.

"అలుమేలుమంగనై అయవరు లంటఁగా

బలిమి వేడుకల గొబ్బనఁ బదనాయ" 18-554

గొబ్బిపాటలు : వి. మార్గశీర్షమాసంలో యువతులు, బాలికలు ఇండ్లముందు గుంపులు కట్టి వలయాకారంలో తిరుగుతూ చప్పట్లు కొడుతూ పాడేపాటలు. ఈ పాటల్లో 'గొబ్బిళ్ళో' అనే పదం ఆవృత్త మౌతుంది.
"కొలనిదోపరికి గొబ్బిళ్లో యదు
కుల స్వామికిని గొబ్బిళ్లో" 5-98

గొబ్బిళ్లు : వి. గొబ్బిపాట, బాల, బాలికా క్రీడావిశేషం, నమస్కారం.
"కొలనిదోపరికి గొబ్బిళ్లో యదు
కుల స్వామికిని గొబ్బిళ్లో" 5-98

గొరబుగా : క్రి.విణ. వింతగా, అల్లరిగా.
"గొరబుగా మగనాండ్లఁ గొప్పువట్టి తీసేవు
నెరుసు లేనివారిపై నిందవేతురా" 14-177
"గొరబుగా నవ్వితేను కోపగించుకొనక
సరిగా నీవు నవ్వితి చాలదా ఇది" 19-379

గొరబుమాటలు : *వి; బహు.* వింతమాటలు, అల్లరిమాటలు.
"కొప్పు వెట్టఁగా సతిని గొరబుమాట లాడేవు
చెప్పరాని సేఁత యేమి సేసే నని" 16-214

గొరబుసేయు : (23) గొరబు = గోరబు, గోరగు అని కన్నడము a clock made of leaves of grass అని కిట్టెల్. వికారవిశేషము ఇత్యాది కావచ్చు అని సం.ప.స. 22 సం లో సూచింపబడింది. దీనిని బట్టి వేటూరి ఆనందమూర్తి గారు ఈ పదానికి వింతసేయు, వింతగ ప్రవర్తించు అనే అర్థాలను ఊహించినారు. (సం.పా.ప; భా.ప్ర.వి. 446, 447 పు.) తా.పె.కృ.ప.ప. అన్న గ్రంథంలో దీనికి అల్లరి సేయు అనే అర్థం చెప్పబడింది. సందర్భానుగుణంగా వింతసేయు, అల్లరి చేయు అనే రెండర్థాలు చెప్పుకోవచ్చు.
"గుట్టుతోడిదాన నన్ను గొర బేల సేసేవు"
28-297
"గుట్టుతోడ నున్న నన్ను గొరబేల సేసేవే"
25-90
"గొంటరితనాన నేను గొరబుసేసెనా" 24-882
"గొరబుసేయకు మమ్ము గుట్టున నుండగ
నిమ్ము" 25-402
"గొరబైన ఉంగరాలు" (18-323)
"గొరబుమాట" (16-314)
అనే చోట్ల గొరబు శబ్దానికి 'వింత' అనేఅర్థం సముచితంగా ఉంటుంది.

గొరబైన ఉంగరాలు : *వి; బహు.* వింత ఉంగరాలు.
"గొరబైన వుంగరాలు కొంకక నీ వేళ్ల నివె
యిరవాయఁ బనులెల్లా నేల లోఁగేవు" 18-323

గొరసరాయఁడు : వి. చూ : గొరిశరాయఁడు.
"అట్టె గొరసరాయఁడాయగా నీ వలపు
నట్టుక కంబము మాటు నవ్వులాయ వలపు"
27-390

గొరియలలోన పులి చొచ్చినట్లు : నానుడి; బలమైన వ్యక్తి బలహీనులపై పడినట్లని భావం.
"పొదరి గొరియలలోన పులిచొచ్చినట్లాను"
1-64

గొరిశరాయఁడు : వి. వరాహమూర్తి. (గొరిసె = కాలిగిట్ట; కాలిగిట్టలు గలది వరాహం) రూపాం. గొరసరాయఁడు.
"ఆతురాన గొరిశరాయడికి నోపఁగలేరు
చేతిగోరు మీటితేనే ఛిన్నభిన్న మవుదురు"
3-186

గొరుపులు : *వి; బహు.* (?)
"చిప్పిలె నిట్టూరుపులు సిగ్గు లివె గొరుపులు
యిప్పుడిట్టె యీ సతి నేమి సేసితో" 9-137

గొల : వి. గెల; పండ్లు, కాయలు మొ॥ వాటి గుత్తి, వరుస.
"బెట్టుగా నొకచేతఁ జూపెడి తన ప్రతాపము
పట్టుకున్నాఁడొక చేతఁ బండ్లగొల" 3-232

గొల్లకత్తె : (గొల్ల + కత్తె) వి. గొల్లస్త్రీ.
"ఎంత యెడ గొల్లకత్తె వేమే నీవు
జంతవై వలపులట్టి చవులు గొనేవు" 18-112

గొల్లకొసరు : *ప.బం; వి.* 'గొల్లసుద్ది' వంటిది కావచ్చు.

"చెల్లుబడి వావి చెప్పి శ్రీవేంకటేశుఁడు గూడె
కొల్లున నవ్వఁగదవే గొల్లకొసరు" 7-489
"మెఱసి పెనఁగవచ్చీ మిక్కుటపు రతులను
కొఱకొఱఁ బెట్టఁగదే గొల్లకొసరు" 7-489

గొల్లచల్ల: వి. పుల్లనిచల్ల (?)
"పోపో నీ గొల్లచల్ల పుల్లనే కాదా" 19-505
"గొల్లచల్ల పుల్లన గున్నచింత చల్లన
వొల్లనె మా పొందులకు నోపుదువా" 7-209

గొల్లజాణతనము: వి. వ్యతిరేకలక్షణంచే తెలివిలేనితనం అని అర్థం. (?)
"గొల్లజాణతన మెల్ల కోరి నీయందే కంటి
పెల్లుగా పదారువేల పెండ్లెట్లా నాడితివో" 16-119

గొల్లదోమటి: వి. గొల్లవాని అన్నం అని శబ్దార్థం. (దోమటి = అన్నం) అనుభవింపరానిది అని భావం. కంబళిలోని గొల్లవాని అన్నం తినడానికి వీలులేనిది కదా! గొల్లవారి మడ్డితనము (?)
"గొల్లదోమటాయ నేఁడు కోరి నీతో సరసాలు
చల్లవేఁడి సేసుకొంటే చాలు లేవోయి" 24-161

గొల్లమంకు: (2) *వి; ప.బం.* మిక్కుటమగు మంకు, మూర్ఖత, మొండి పట్టు.
"కడఁగి మావంటివారిఁగై కొనేవా గొల్లెతలు
బెడసు గొల్లమంకుతోఁబెంచిరి నీ గుణము"
11-509 & 16-82

గొల్లమంకుది: (గొల్లమంకు + అది) మిక్కుటమగు మంకు, పట్టుదల గలది, మొండిపట్టు గలది.
"కూర వండి కస వేరే గొల్లమంకుదాననా
నేరిచి బతికేననే నీ దేవిఁగాక" 20-559

గొల్లముంజు: వి. గొల్లల తలవెండ్రుకలలో చెమటవల్ల చేరిన మురికి, తలమడ్డి. (ముంజు = తలవెండ్రుకలలో చెమట వల్ల చేరిన మురికి, తలమడ్డి.)
"అందముగ నిన్ను వారి యంగములు సోఁకితేను
విందువలె గొల్లముంజు వేయకుండీనా" 15-172

గొల్లలెక్కలాడు: *ప.బం; అ.క్రి.* లెక్కలు సరిగా తెలియకుండా అవతలివారిని ఇబ్బందిపెట్టు.
"చిల్లర చెమటలతోడ చిక్కని వూర్పులతోడ
గొల్ల లెక్కలాడేవు కోప మేఁటికే" 9-117

గొల్లు: ఇది 'గొల్ల' కావచ్చునేమో!
"గొల్లు వెన్నదొంగిలఁగ గోవిందా నిన్ను
కొల్లున నవ్వేరు వీరె గోవిందా" 16-325

గొల్లు: వి. కలకల ధ్వని.
"కూటమిలో గొల్లవారి గొల్లు నీకు నితవాయ"
23-391
"గొల్లువేసి యలకల కొప్పుననే ముడిచిన
మల్లెపూవు లేల నీకు మనసాయ నిపుడు"
5-152

గో

గోఁతము: వి. ఒకవిధమైన చిన్న గోనె.
"గోమునఁ గాగిలించేవు గోఁతమా మేను"
23-217

గోటారించు: (2) స.క్రి. సం.ప.స. (21 నం) లో దీని వివరణమిట్లున్నది. "బాధపెట్టు, పైకొను అను నర్థములలో గోడాడించు శబ్దము వ్యవహారములో నున్నది. ఇదే గోడాడు శబ్దముగా నిఘంటువులలో నున్నది. ఈ యర్థములోనే గోటారించు శబ్దము గోటాడించు అని కొన్ని ప్రాంతములలో కలదు. అదియే ఇది కావచ్చును".
"పాటించి ఇంతి చెల్లెలిఁ బట్టి తెచ్చి నాయకుఁడు
గోటారించి భంగించఁగా కొమ్మ వేఁడుకొనెను"
21-142 & 21-149

గోటారించు: అ.క్రి. తె.వ్యు.కో. లో గోటరించు అనే పదం ఉంది. గోటారించు అనే పదం లేదు. గోటరించుకు 'గోండ్రించు' అనే అర్థం చెప్పబడింది.
"పాటించి ఇంతి చెల్లెలిఁ బట్టి తెచ్చి నాయకుఁడు
గోటారించి భంగించఁగా కొమ్మ వేఁడుకొనెను"
21-142

గోడఁబూసిన సున్నము: *ప.బం; వి.* ఉపయోగించుకునే వీలు లేనిది, వ్యర్థమైనది.

"గోడఁబూసిన సున్నము కూడఁబెట్ట నేరనోప
ఆడుకోలు మాట దప్పు నని యెంచేనా"
19-427

గోడకడుగు : ప.బం; అ.క్రి. వ్యర్థమైన పనికి పూను.

గోడ గడుగఁగఁ బోతేఁ గొనదాకా రొంపే : బురదతోనే కట్టిన గోడను ఎంత కడిగినా బురద బురదే ఔతుంది. గొంగడిలో వెండ్రుకలు ఏరినట్టు వంటి మాట.

"గోడ గడుగఁగఁ బోతేఁగొనదాఁకా రొంపే
ఆడుకోలు తర్కవాదా లటువంటివే" 3-568

గోడచేర్పు ప్రతిమ : ప.బం; వి. అప్రధానుడు, వ్యర్థుడు, పనికి రానివాడు, ఉత్సవవిగ్రహం వంటివాడు.

"అలరి పెరసతుల నంటఁగా నివ్వెఱఁగంద
బలువైన గోడచేర్పు ప్రతిమలనూ" 17-150

గోడపై సున్నము : (2) వి. తిరిగి రానిది, వ్యర్థమైనది.

"నీడలోపల యెండ నెలకొన్న బంధంబు
గోడపై సున్నంబు కొద లేని యెఱుక" 1-104

గోడమీఁది సున్నము : (3) ప.బం; వి. ఉపయోగించుకో వీలు లేనిది, తిరిగి రానిది, అశాశ్వతం.

"గోడమీఁది సున్నమైతి కొండలరాయా
కోడెవయసు వో నీకు కొండలరాయా" 17-360

"గోడపై సున్నంబు గీఁకినఁ బనికిరాదు"
నీ.శ. 71

గోడమీది మన్ను : వి. ఉపయోగించుకునే వీలు లేనిది. చూ: గోడమీది సున్నము.

"మానని పుంటికి మందుమంతరము లేని సంది
గోనెబట్టినట్టి బంక గోడమీఁది మన్ను" 15-462

గోడ లేని చిత్తఱువు : ప.బం; వి. ఉండనిది, ఆధారం లేనిది, మూలం లేనిది, అసంభవం.

"వేడుకకు వెల లేదు వెంగెమాడేదానఁ గాను
గోడలేని చిత్తఱువు కొసరేనా నేను" 29-448

గోడ లేని చిత్రము : ప.బం; వి. ఉండనిది, అసంభవం.

"గోవిందునికటు మొక్కని మొక్కులు
గోడ లేని పెను చిత్రములు" 2-235

చూ: గోడ లేని చిత్తఱువు.

గోడాడు : అ.క్రి. బాధపడు, దుఃఖించు, విలపించు, గోడువెట్టు.

"తలపోఁత బ్రాఁతె తలఁపులకుఁ దమ
కొలఁదెఱుంగ నియతి గోడాడఁగా" 1-41

గోణము : వి. (గోణము. త.) కౌపీనం, గోచి.

"కొప్పు చక్కఁబెట్టుకో గోణము చక్కఁగట్టుకో
అప్పటి మేను గిజిగిజియై వుందురా" 21-424

గోణాము : వి. 'గోణము'నకు రూపాం. గోచీ.

"అంచలఁ గప్పురకాపు అంగముల మెత్తుకొని
కొంచక నిలుచున్నాఁడు గోణాముతోడను"
17-532

గోద : వి. వెద, కొద.

"మనసులోపలి వేద మాటలలోపలి వూద
కనుఁగొనలనే గోద కానరాదా" 20-253

గోదము : వి. 'క్రోధము'నకు వికృతి కావచ్చు. కోపం.

"పాదాలు సేవసేసితే పైపై నిందరితోడాను
గోదాన చెప్పేవు బెట్టి గుద్దితినంటా" 21-73

"కేవలనువర్ణముపై సరళాదేశము వీరిలో అపురూపము. పూర్వపాదాంతనువర్ణము పక్క బిందువు ప్రమాదమున తొలగెనా" అని సంపాదకులు. (21 సం; 50 పుట)

గోదిలి మోహము : వి. 'గోదిలి' గూఢ శబ్దభవంగా కనిపిస్తుందనీ, అర్థమూ అదే కావచ్చునని సం.ప.స., గూఢమైన మోహం.

"ఆదట జలకమార్చేనంటా నొరసుకొనేవు
గోదిలిమోహాన నెంత గుబ్బతిలేవే" 18-112

గోదిలు : (5) శ.ర., తె.వ్యు.కో. మొ॥ నిఘంటువుల్లో కానరాదు. నిరాదరించు, బాధపడు అనే అర్థాలు చెప్పవచ్చు. గోదరిల్లు (= బాధపడు) అనే పదానికి రూపాం. కావచ్చు.

"ఆదరించేవారితోడ నంటి పొందవలెఁగాక

"గోదిలేటి మగవాని కొంగు పట్టవచ్చునా" 11-274

"మేదరింటి లంజ వోయి మేదినీశుఁ దగులఁగ
గోదిలు విటులెల్లఁ గుల్లినయట్టు" 4-31

గోనాలగొందులు : (2) *ప.బం; వి; బహు.* సందిగొందులు (కోణాల గొందులు = మూలల్లోని సందులు) (కోణాల గొంది = మిక్కిలి ఇరుకైన చీకటిమూల అని తె.వ్యు.కో .) చూ. పాండు. 5-296

"తెలిసితి నీ పొందులు తేరవిదురు విందులు
నలి నుట్లు గొట్టిన గోనాల గొందులు" 29-509

గోనెఁబట్టిన బంక : (2) *ప.బం; వి.* గట్టిగా పట్టుకొని వదలనిది, జిగురువలె వదలనిది. గోనెసంచికి పట్టిన జిగురు గట్టిగా అంటుకొని తీయడానికి వీలులేకుండా ఉంటుంది కదా !

"మానని పుంటికి మందుమంతరము లేని సంది
గోనెఁబట్టిన బంక గోడమీది మన్ను" 15-462

"వాన చేతకములవలె నాయ మనసు
గోనెఁబట్టిన బంక గుణమాయ మనసు" 1-337

గోనెమీఁది తౌడు : *ప.బం; వి.* వదలనిది, తీయరానిది, గోనెసంచికి అంటుకుపోయిన తౌడును తీసుకోలేము కదా!

"కూరిమి సేసితి నేను కొంగువట్టినాఁడు తాను
కోరుకో నీవే సిగ్గు గోనెమీఁది తౌడు" 25-381

గోపాలకిసునరాయఁడు : వి. 'గోపాలకృష్ణరాయడు' అనడానికి జానపదవ్యవహారం.

"రారా గోపాలకిసునరాయ నీ వదె గొల్ల
వారి మగువల సూవు(పు) వల్లెవేయఁగా" 5-15

గోపాళులు : *వి; బహు.* గోపాలశబ్దానికి బహువచనరూపం. గోపాలురు, గొల్లవారు.

"కొట్లు గొట్టుచు గోపాళులుఁ దాను
అట్లు తోడనే యారగించీని" 23-331

గోమంతము : వి. గోమంతపర్వతం. (వాచ)

"యెన్నికతో గోమంత మెక్కి జయము చేకొని
మన్ననతో మథురకు మరలినట్లు" 3-433

గోము : (4) వి. 1. గారాబం, అతిలాలనం, శ్రమ ఎరుగనితనం 2. గౌరవం 3. గర్వం, మదం, పొగరు 4.విధం 5. వికాసం 6. సౌకుమార్యం 7. గుట్టు.

"యేమి వొడఁబరచేవు యేల నిలుచున్నాఁడవు
గోమున నావద్ద నిట్టే కూచుండరాదా" 12-19

గోరంటగోళ్లు : *వి; బహు.* గోరంటాకు పెట్టుకోవడం వల్ల ఎఱ్ఱబారిన గోళ్లు.

"జీరల బుజాల కేలే చెమటలు నీ
గోరంట గోళ్ల కేలే కొనవాండ్లు" 5-125

గోరఁబోవుటకు గొడ్డలి : *ప.బం; వి.* సులువుగా నెరవేరే పనికి చేసే పెద్ద ప్రయత్నం, ముందే జాగ్రత్తపడితే సులువుగా అయ్యేపనికి ఆలస్యం చేస్తే మహాప్రయత్నం కావలసి రావడం.

"నారాయణ నీ నామమహిమలకు
గోరఁబోవుటకు గొడ్డలి దగునా" 3-573

గోరగించు : అ.క్రి. ఉదయించు, మొగ్గదొడుగు ; భయంకరమగు.

"కోపములిద్దరిలో గోరగించీఁ జూడరే
పైపైనె జవరాలు పంపెడి నింతులను" 5-8

"కూరిమి వేంకటపతిఁ గూడిన తమకమున
గోరగించీ నదివో చకోరముల పిల్లలు" 5-331

గోరడి : (2) వి. గోటినొక్కు, నఖక్షతం.

"గోరడి నన్నేలకొని గుంపించి పైకొను కాక" 26-397

గోరనూదు : (9) స.క్రి. గోరితో నొక్కు.

"నెమకి గోరనూఁదితే నేరము లెంచఁగరాదు
ప్రమదానఁ జే చాఁచితే పంతమాడరాదు" 26-500

గోరపడు : (5) అ.క్రి. బాధపడు (వా.ని.), ఆశపడు, విసుక్కొను, రోతపడు.

"గోరపడి గడించేవి కోట్లకొలదులు
తారితూరి నోటికిఁ దగ్గంత కాదు" 3-538

గోరపెట్టు : స.క్రి. బాధపెట్టు (ఆశపెట్టు, విసుగు కలిగించు)

"నేరుపునంజన్నియ్యంగ నెత్తురెల్లఁ దాగి తాగీ
గోరపెట్టి చంపె నిట్టి కొత్త లెందుఁగలవా" 6-6

గోరము : వి. ఘోరమునకు వికృతిరూపం, భయంకరం (ఆపద అని ఆం.ప.ని .) ఉదా :- గోరపు వెన్నెల, గోరపు రుధిరము 4. అను 2

"అలవోక తెలువులును అబ్బురపు మరపులును
కొలఁదిమీరులు మిగుల గోరమని కాక" 5-356

"చిత్తమెల్లా నిగిరించెఁ జెక్కులెల్లాఁ జెమరించె
కొత్తవలపు సతికి గోరమాయను" 26-4

గోరవంక : వి. 'గోరువంక'కు వ్యావహారికరూపం.

"బెట్టి మాటలాడుమంటూ పెంపుడు నా గోరవంక
గొట్టఁబోయీ బోఁదే కోలఁ గుచ్చి తానను" 17-34

గోరసేయు : అ.క్రి. బాధించు, దుడుకు సేయు, ఆగడము సేయు.

"చక్కని శ్రీవేంకటేశ సమ్మతిఁ గూడితివి
చిక్కిన సతులు గోరసేయరా నన్ను" 20-12

"వలపు రచ్చల వేసేవారు గలరా
కులమునాండ్ల నింత గోరసేయవలెనా" 11-447

"కులికి మమ్మేల యింత గోరసేసేవయ్యా" 11-50

రోతపడు :

"కొమ్మల సణుఁగులకు గోరసేసేవారె కాక
సమ్మతించి మెచ్చుమెచ్చే జాణ లెవ్వరు" 11-16

ఆగడముసేయు :

"కోడెతనమున నింత గోరసేయనేఁటికి" 23-403

గోరాటలు : (గోరు + ఆటలు) వి. గోరితో ఆటలు.

"గుఱుతైన యతనిపై గోరాట లదె నీకు
అరుదైన ప్రియమాన మాతనికిని" 6-89

గోరాదిగొను : (గోర + ఆది + కొను) అ.క్రి. ఘోరమైన మనోవ్యాధి పొందు కావచ్చు.

"ఏమోయి మాతోనే యేల గోరాదిగొనేవు
దీమువలె నున్నవారి దీకొనేవు" 21-49

గోరిచేఁతలు : వి; బహు. నఖక్షతాలు.

"మొగము చూచిన లోలో ముసుగు వెట్టుకొనేవు
చిగురు గోరిచేఁతలు చెక్కులంటెనో" 7-509

గోరితాఁకులు : వి; బహు. నఖక్షతాలు.

"కందువ శ్రీవేంకటేశుఁ గలసిన మర్మము
గొందినె యీతని గోరిగురుతులె పో" 9-126

గోరి మదనరేకలు : వి. నఖక్షతాలు.

"కోపములకు గురి నీ గోరి మదనరేకలు
చేపట్లకు గుఱి నీ చెట్టాపట్టాలే" 20-302

గోరిరేకలు : వి; బహు. నఖక్షతాలు.

"గట్టి గోరిరేకలు కంతు ముద్రరేకలు
తొట్టిన యీ కౌఁగిలిరతుల లోఁగిలి" 12-266

గోరివాత : వి. నఖక్షతం.

"చేసినా అంగన నీకు చేసన్న లెల్లాను
వ్రాసెనా చెక్కుల గోరివాత లెల్లాను" 7-515

గోరివెచ్చు : వ.బం; విణ. గోరువెచ్చు, కొద్ది వేడి గల.

"కదియఁగాఁ జన్నులు కాయమెంత వొత్తునో
గుదిగొనఁ గాంతునటే గోరివెచ్చ కౌఁగిటా" 13-353

గోరిసోఁకులు : వి; బహు. నఖక్షతములు.

"తెరమాటున నుండే తేటలమాటలు చవి
సురతపువేళ గోరిసోఁకులు చవి" 7-49

గోరుచు : అ.క్రి; మాం. కొంచెము కొంచెము గోకిగోకి చేర్చు. బాధపడు అని కూడా ఉంది.

"నేరుపుతోఁ జెప్పినట్టె నేము నిట్టె సేయఁగాను
గోరిచీని వలపులు గోవిందరాజు" 25-308

గోరుచుట్టుపై రోకటిపోటు : వ.బం; వి. ముందే బాధ భరింపలేక ఉండగా దానిపై మరింత బాధ ఏర్పడే సందర్భంలో ఉపయోగించే పలుకుబడి.

"కాఁకల నడుము చిక్కెఁగదె గోరుచుట్టుపై
రోఁకటిపో టాయ నమ్మరో తరుణి" 5-238

గోరుపడము : కంబళి. (నల్లనిది)

"కొత్తకోక నల్లనైతే గోరుపడ మనలేవు" 5-152

గోరువోవు: ప.బం; అ.క్రి. మొక్కపోవు, తప్పిపోవు, పొల్లుపోవు.
"మాట గోరువోయీ నంటా మౌనాన
నీటున ముచ్చటాడక నేమానరా నుందువుగాని"
17-78

గోరూఁదు: (3) ప.బం; అ.క్రి. నఖక్షతం చేయు, గోరుతో నొక్కు.
"అన్ని రతులకు లోనై అట్టే చొక్కించఁగాను
చన్నులేల గోరూఁదేవు సారెకు నన్ను" 8-183

గోరొత్తులు: (6) (గోరు + ఒత్తులు) వి; బహు. నఖక్షతాలు.
"తావుకొన్న వలపులు తారుకాణలైన చోట
కావరపు గోరొత్తులు కమ్మఁబూవుతాఁకులే"
13-198

గోల: వి. కష్టం, ఇబ్బంది.
"ఈతనిఁ గొలిచితేనే యిన్ని గోలలునుఁదీరు
చేతనంబెట్టు పుణ్యాలు చేరువనే కలుగు" 2-57

గోలతనము: (3) వి. ముగ్ధత్వం, బేలతనం.
"అమితపు గోలతనా లాసలెల్లా రేఁచునా"
22-185

గోలవాఁడు: (గోల + వాఁడు) వి. అమాయకుడు, తెలివి మాలినవాడు.
"వేడుకకాఁడైనయట్టి విభుఁడు గాక
కోడెతనాలు సేసీని గోలవాఁడా యితఁడు"
24-596

గోళిగ: వి. 'గోడిగ' కు రూపాం.ఆడుగుఱ్ఱం.
"యెక్కే గుఱ్ఱము గోళిగ నెనసి పైకొంటే రౌతు
తక్కక దానిఁ జీకటితప్పు గొనవచ్చునా" 2-214

గోవజవ్వాది: వి. గోవానుండి వచ్చిన సంకుమదం.
"గొల్లెతల కేలరా గోవజవ్వాది నీకు
చెల్లుఁగాక యెటువలెఁ జేసినా నన్ను" 5-103

గోవరుదనము: వి. గోవర్ధనము. (గోవర్ధన పర్వతం) అనేదానికి జానపదవ్యవహారరూపం.
"గోవరుదన మెత్తిన గోవిందుఁడీతఁడు
గోవులఁగాచినయట్టి గోవాళుఁడు" 28-492

గోవాళవిద్యలు: వి; బహు. యౌవనవిద్యలు.
"ఒక్కటికి నురి గట్టే వొంటికి దాయిగట్టే
వెక్కువ గోవాళవిద్య లీడఁజేయవలెనా" 24-31

గోవాళితనము: వి. యౌవన చేష్టలు, విట చేష్టలు.
"గోవులఁగాచి యలసీ గోవిందుఁడు
గోవాళితనాలు సేసీ గోవిందుఁడు" 18-414
"విట నామధేయమౌ విటకాఁడు, వేడుకకాఁడు, బొజుగు, ననుపుకాఁడు, లంజకాడనఁగ, నివియుగాక గోవాళ్లనఁ గా నొక్క శబ్దంబు గలదు బహుత" ఆం.భా. 2-116 దీనిని గోవాళుడని ఏకవచనంగా వాడటం విశేషం.
"యీ వేళ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
గోవాళుఁడ తలఁచుకో గొల్లవారి పొందులూ"
23-114

గోవాళుఁడు: వి. యౌవనవంతుడు, విటుడు.
"తావు లొక్కటిగాఁ జేసి వన్నెకాఁడవై తిరిగి
గోవాళుఁడ వైతివి గోవిందరాజా!" 18-516

గోవాళు: వి. యౌవనం కలవాడు, అమాయకుఁడు, పసివాడు అనే అర్థాలుకావచ్చు (?)
"గోలవై యజ్ఞఫలము లిచ్చితివి
గోవాళు సేసేటి పనులివియా" 3-277

గోవిందరాజు(లు): వి. దిగువతిరుపతిలో వెలసిన గోవిందరాజస్వామి. ఇట ఆలయంలో స్వామి శ్రీరంగనాథస్వామివలె పడుకొని ఉంటాడు.
"చాటుచు నవ్వులు నవ్వి సన్నలు కన్నులఁజేసి
వేఁటలాడీ వలపు గోవిందరాజు లిదివో" 20-526
"తెంకిని శ్రీవేంకటాద్రి దిగువ తిరుపతిలో
కొంకక వరములిచ్చే గోవిందరాజా" 1-478

గోసనాస: వి. ఘోషణ, ఊరంతా గుప్పుమనుట అని పద.
"గోసనాసఁబతినేమీఁ గోసరకురే" 28-36
"గోసనాసతోడ మరి కొప్పు దువ్వనేల నన్ను"
19-234

"యితరులెరఁగఁగానె యిచ్చిన నీ బాసలు
తతి సవతులకు సదా గోసనాసలు" 7-392
"చెల్లని చేఁతలు మీరు సేసేరు గాక
గొల్లెతలు హరితోడ గోసనాస యేఁటికే" 22-70
"గోసనాసగా వేడుకొన నేలయ్యా" 27-120
"బాసలే నిజములైతే తగవుకుఁ బనిలేదు
గోసనాసగాఁబతిని గుంపించవచ్చునా" 28-470

గోసనాసగొను : ప్రకటితమగు (?)
"గోసనాస గొనకుంటె గుణవంతుఁడౌనె" 11-89

గోసనాసచేయు : అ.క్రి. ప్రకటనచేయు, చాటించు, ఘోషించు.
"వేసరించి వెడ్డువెట్టి వెక్కసానఁ బెనఁగుచు
గోసనాస చేసి యేల గోరసేసేవే" 14-138
"ఆసల నెవ్వతైనా నంటక నీవుండలేవు
గోసనాస చేసి నిన్నుఁ గోపించఁజాలను" 17-96
"మాసటీలా మీ రేమైనా మగిడి మగిడి నేఁడు
గోసనాస చేసి యేల కొంచేవు నీవు" 26-529
"యీ సరి శ్రీవేంకటేశుఁ డిందరిఁగూడిన మీఁద
గోసనాస సేయఁబోతే కోప మేలే నీకు" 11-313
"ఎంత గోసనాస సేసేవేల మమ్ముఁ గొసరేవు"
19-95
"వాసికే బతికేవారు వనితలెల్లా
గోసనాస సేతురా కొండవంటి దొరవు" 13-283

ఘ

ఘంటాకర్ణుఁడు : వి. పిశాచనాథుడు, కుబేరుని బంటు. శ్రీకృష్ణుని నామసంకీర్తనంచే ఈతడు శ్రీకృష్ణుని దయకు పాత్రుడై పిశాచరూపాన్ని వదలి దివ్యరూపం పొందుతాడు.
"యిచ్చెను వాయుజునికి యిటమీఁది
బ్రహ్మపట్ట
మిచ్చల ఘంటాకర్ణుని కిచ్చెఁ గుబేరత్వము"
4-255

ఘటముగ : క్రి.విణ గాటముగా.
"నూటొక్క ఋషు లిడిన నూటొక్క
సంతలందు
ఘటముగా సోదించి కనుకొండో" 15-113

ఘడన : వి. 'గడన'కు రూపాం. ఇందులో 'గ'కు బదులు 'ఘ' వాడడం విలక్షణం. సంపాదన.
"కాయము మోచితి ఘడన గడించితి
చేయారఁ బుణ్యము సేసితినా" 3-156

ఘడియించు : స.క్రి. గడియించు కావచ్చు. సంపాదించు.
"పలు లంపటములఁబడి
ఘడియించేటి బహుధన మిది యేల" 4-102

ఘనురాలు : వి. గొప్పస్త్రీ. (వింతప్రయోగం)
"ఎంతైనా నాతఁడు నీకు నెక్కుడు గాదా
కాంతుఁడు మన్నించఁగానే ఘనురాలవైతివి"
19-26

ఘో

ఘోరకుడుచు : ప.బం; అ.క్రి. కష్టదశ అనుభవించు.
"ఘోరకుడువఁగఁ ద్రిశంకుని నంత్యజునిఁ జేసె
వీరుఁడగు నలుఁబట్టి విద్రూపుఁజేసె" 1-134

చ

చంకగుదియ శరణార్తి : ప.బం. నమ్మదగనివాఁడు, తగని ప్రవర్తన కలవాడు. పైకేమో అభయం కోరుతూ వచ్చినట్లు నటిస్తున్నా నిజంగా కొట్టడానికి కఱ్ఱ తీసుకొని వచ్చినట్లు అని భావం. చూ : చంక దుడ్డు శరణార్థి. ఇట శరణార్థి (శరణు కోరేవాడు) అనేది 'శరణార్తి' అని వాడబడింది.
"చంకగుదియ యిదే శరణార్తి నేనిదే
తెంకి నా భావము దేవుఁడే యెరుఁగు" 3-389

చంకగుదియ శరణు : ప.బం. నమ్మదగనివాఁడు, తగని ప్రవర్తన గలవాడు. చూ :
చూ : చంకగుదియ శరణార్తి.
"అలరి చంకగుదియ నట్టే శరణనేటి
నిలుకడయిన మాట నిజమాయ నీకు" 7-560

చంకగుదె శరణార్తి : చూ : చంకగుదియ శరణార్తి.
"జవ్వనాన చంకగుదె శరణార్తిఁ దనకేల

వువ్వెళ్లూరించక నన్ను నుండనీరాదా" 20-83

చంకదుడ్డు శరణార్తి : ప.బం. నమ్మదగనివాడు, అయోగ్యమైన ప్రవర్తన గలవాడు.
చూ : చంకగుదియ శరణార్తి.

"సాకిరి చంకదుడ్డు శరణార్తి రెండు నేల
మేకొని యీ మాట వింటే మెత్తురా నిన్నును"
4-203

చంకలెత్తి మొక్కు : ప.బం. చేతులెత్తి మొక్కు.

చంగనన్ : క్రి.విణ. చంగున, వేగంగా.

"చంగనఁ బొగడరాదు సారెసారె నన్ను నీవు
వెంగెమో నిజమో యంటా విచారించేవు"
27-248

చంగు : అ.క్రి. చెంగు, వెనుదీయు.

"చంగని పాపజాతిని సారె నీవు మొక్కఁగాను
వుంగిటి గొనఁదిట్టి వూరకే నిన్నును" 16-120

చంచలపడు : అ.క్రి. చాంచల్యమునొందు, చంచలుడగు.

"చంచలపడఁగవద్దు సారెసారెఁ గోరవద్దు
పొంచుకున్న దైవమే బుద్ధులు నేర్పిని"
15-273 & 3-336

చంచలము : (20) చాంచల్యం, ధర్మవాచకానికి బదులుగా ధర్మివాచకప్రయోగం చేయడం అన్నమయ్యకు అలవాటు.

"పెక్కు చంచలము పెనచుక తిరుగక
వొక్క సుఖంబౌ టురుసుఖము" 3-545

చంచలించు : (4) అ.క్రి. కదలు, చలించు, చాంచల్యం పొందు.

"పొంచి పొంచి యాపె నన్ను పూవులను
వేయఁగాను
చంచలించి యట్టె నీవు సన్నసేసేవు" 19-139

చంచు(లు) : (17) (?)

"పొంచి వేరొక్కతె నిన్ను బొమ్మల జంకించితే
చంచులఁబాడినందుకే సతమై కరఁగుదురు"
6-105

"చంచల మోవి చూపి సన్నచేసేవు" 7-117

"చంచున నూరకుండితే సమ్మతించె నందురు
వంచిన చేయెత్తితేను వచ్చేననే నందురు"
17-41

చండ : వి. పోట్లాట. (త. శండై)

"చలము సాధించె వాడై చండకు
వచ్చియుండఁగా
తలవంచు కొమ్మనేవు తగునే నీకు" 17-24

చండి : (3) వి. మొండితనం, క్రూరత్వం, తీవ్రత, తీక్ష్ణత.

"చలపాది దొక్కటె చండితోడ నుండుఁగాని
లలనల మనసులు లక్కవంటివి" 21-576

"నిండుకొని శ్రీవేంకటనిలయుఁడు నన్నుఁగూడె
చండితోడ నీ వేమి సాదించేవే" 28-156

చండిగా : క్రి.విణ. తీవ్రంగా.

"పండే వాతని పక్కను బంగారువంటి నీ మేను
చండిగాఁ గాకలు సేసీఁ జాలు నుండఁగదవే"
26-320

చండిచేయు : అ.క్రి. మొండికి వేయు, మొండికెత్తు.

"చండిచేసి పెనఁగడు సన్నలనే మోవి చూపె
నిండుఁగాగిటఁగూడఁగా నివ్వెరఁగేలే" 26-542

చండితనము : (3) వి. మూర్ఖపుపట్టు, మొండితనం, క్రూరత్వం. (వ్యు.)

"వుమ్మగిలుఁజెమటతో నుడివోని పంకెనలు
సమ్మతించక వినేటి చండితనాలు" 12-328

చండిపారు : ప.బం. మూర్ఖత్వంతో ప్రవర్తించు, చండివడు వంటిది. తెల్లఁబాఱు, వెలవెలఁబాఱు – మొదలైన వానివలె ఇక్కడకూడా పారు – అగు, పరిణమించు, వర్తించు అనే అర్థాన్ని ఇస్తుంది. లేదా ఈ పదం చండిపోరుకు పొరపడిన వ్రాతకూడా కావచ్చు.

చండిపెట్టు : (21) అ.క్రి. మొండికి వేయు, కోపించు, ప్రతిఘటించు, కోపగించు, కలహించు.

"దండనే కూచుండఁగాను తప్పక చూచితిఁగాక
చండిపెట్టి వెంగెముగా సాదించితివా" 27-107

చండిపోరు : అ.క్రి. మొండికెత్తు.
"సతినీవు పొందైతే సగఁబాలిదాన నేను
అతనితో చండివోరే యట్టిదాననా" 23-415

చండివడు : (10) అ.క్రి. మొండికెత్తు (పద.), కోపపడు.
"చెక్కులు నీవు నొక్కఁగా సిగ్గులెల్లాఁ దొలఁగెను
చక్కఁగ నీవు మెచ్చఁగ చండివడెను" 21-221

చండివెట్టు : చూ : చండిపెట్టు.
"దండనే నే వుండఁగాను దయఁజూడవలెఁగాక
చండివెట్టి పెనఁగుతా సాము సేతురా" 18-534

చండిసేయు : (23) మొండిచేయు, మొండికెత్తు, కోపించు.
"చన్నుఁగొండలనే వొత్తి చండిసేయ నేఁటికే
యెన్నికతో వేడుకొంటే నియ్యకొనీఁగాక" 28-324
(సం.ప.స. 14 సం. 350 పు.) 25-14

చందనపుకొండ గాలి : వి. మలయమారుతం. (చందనపుకొండ = మలయపర్వతం)
"చందనపుకొండ గాలి చాయ నీ వూర్పు
చందమామ పోలిక సకియ నీ నెమ్మోము" 28-182

చందమామ గుటుకలు : (11) ప.బం. అలభ్యం, దొరకనిదానికై ఆశపడి నోరూర్చు కోవటం, వట్టి ఆశ, చందమామ గుక్కిళ్ళు. చందమామను చూచి గుటకలు వేయటం, పిల్లలకు చందమామను చూపుతూ వట్టి చేతులతో తినిపించగా తినునట్లు వారు నటింతురని సూ.ని. సరియని తోచదని, గుటకలు వేయుటయే ఇక్కడ అని పద.
"అంది వెన్నెలనవ్వుల అల్లంతఁజల్లితే
చందమామ గుటుకలంటా జాలిగొనేవు" 12-502

చందమామ పిల్లలు : *వి; బహు.* నఖక్షతాలు, గోరిగీతలు. అర్థచంద్రాకారంలో ఉండేవని వ్యు.
"చన్నులపై నిండినవి చందమామ పిల్లలు
పన్నీటి కాలువలు పారీఁ జెక్కులు" 28-447
ఈ అర్థంలో క్షేత్రయ్య 'చందురు పిల్లలు' అని ప్రయోగించినాడు.
"సందిట నున్నయీ చందురుపిల్లలు"

చందము : (3) వి. అందము. చందములోని చకారం లోపించగా ఏర్పడ్డ పదమే అందము.
"చందపు శ్రీవేంకటేశ చన్నులొత్తి కూడితివి
పందెములు గొంటినా పదరితినా" 23-488

చందురులు : *వి; బహు.* నఖక్షతాలు.
"జాడల నా చన్నులపై చందురులఁజూడవయ్యా
యేడలేని చలముల ఇంత సేసితి" 23-394

చంద్రకళలు : *వి; బహు.* నఖక్షతాలు.
"నాటుకొని (కొనీ) చెక్కులపై నవచంద్రకళ లుండఁగాను
గాటపుఁగస్తూరెంత కడు మెత్తేవే" 18-7

చంద్రగోళి : వి. చంద్రపుగిన్నె, అంచు లేని గుండ్రమైన గిన్నె, పక్షులు నీరు తాగడానికీ, మనం చేతులు కడుగుకోవటానికీ అందులో నీరు ఉంచుతారు.
"క్షాళనోచితచంద్రగోళి యనఁగ" పాండు - 5-24

చంద్రవంకబొట్టు : వి. చంద్రవంక ఆకారంలో ధరించే ఒకరకపు బొట్టు.
"కట్టిన బొమ్మలపట్టు కన్నె చంద్రవంకబొట్టు
మెట్టిన పాదాలమీఁద మెరసేగుట్టు" 16-82

చంద్రవంకలు : (13) *వి; బహు.* నఖక్షతాలు.
"పతి కంఠమునఁ జంద్రాభరణము వెట్టియే
సతి చంద్రవంకలంటా సాదించీని" 26-113

చంద్రాభరణపు సొమ్ములు : *వి; బహు.* కంఠాభరణ విశేషములు.
"గక్కనఁగాగిట నిమ్ముఁగలసి యీ మానిసి
చొక్కి చంద్రాభరణపు సొమ్ములు వెట్టె" 21-415

చంద్రాభరణము : (2) వి. కంఠాభరణ విశేషం.
"అంది నీ కంఠమునఁ జంద్రాభరణము వ్రాసి
సందేహించి చూడఁజాలక పొగులును" 17-433

చంద్రులు : *వి; బహు.* చంద్రాకారమైన నఖక్షతాలు.

"చన్నుల చంద్రులు నిక్కె సమరతు లివె
దక్కె మనసెల్లాఁ గంటిమిఁక మన్నించవయ్యా"
27-502

చక్కటి : వి. చోటు, చెంత, వైపు, దిక్కు, ఎదురు, సూటి.
"చాయల నే పొద్దూ మోము
చక్కటిఁగొలువుసేసి
పాయరాని చుట్టమవై పనిగొంటివే" 23-91

చక్కుముక్కు : విణ. చిందరవందర. (పద.)
"వొక్కరిఁగొలిచి తిట్టు కొడిగట్టే దెల్లాను
చక్కుముక్కు నాలికపై చవికింతే కా" 2-69

చక్కుముక్కు సేయు : ప.బం; స.క్రి. చిందరవందర చేయు. (పద.)
"యెక్కడి పగయొకో ఇంద్రియాలు నన్నుఁబట్టి
చక్కుముక్కుసేసి యెంచి సాదించీని" 2-105

చక్కురము : వి. 'చక్రము'నకు జానపదవ్యవహారం.
"నిక్కె చేతులు సంకుఁజక్కురాలై వున్నవి"
7-218

చక్కురవర్తి : వి. చక్రవర్తి అనడానికి జానపదవ్యవహారం.
"దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి
రమ్మన్నచోటికి వచ్చి నమ్మినవాఁడు" 1-151

చక్కెరదీబలు : వి; బహు. చక్కెరదిబ్బలు.
"చతురతఁబిరుఁదులు చక్కెరదీబలంటా
తతిగొని యంటీని దామోదరకృష్ణుఁడు"
17-206

చక్కెరపెదవులు : వి; బహు. తియ్యనిపెదవులు.
"చక్కెరపెదవులతో సకియ మాఁటాడవే
నెక్కొని సుద్దు లడిగీనీ రమణుఁడు" 28-424

చక్కెరబొమ్మ : వి. మనోజ్ఞురాలు, చక్కెరబొమ్మ వలె ఇష్టమైంది.
"మానైన చక్కెరబొమ్మలు మేనుదీగెలు
లేనగవు మెఱుఁగులు లేఁతవెన్నెలలు" 6-33

చక్కెరమోవిది : (చక్కెరమోవి + అది) తీయని పెదవి గల స్త్రీ.

చక్రపుబిల్ల : ఆడుకునే ఒక బిళ్ల.
"అరసి నా పిరుఁదిది ఆడే చక్రపు బిల్లంటా
సరుసఁబట్ట నిమ్మనీ సన్నమా వీఁడు" 17-173

చక్రాంకితాలు : వి; బహు. శ్రీవైష్ణవులు ఆచార్యునిచే తప్తముద్రచే వేయించుకునే విష్ణువు ఆయుధమైన చక్రపుగుర్తులు. ఇవి వేసుకున్నవాడే శ్రీవైష్ణవుడు.
"చక్రాంకితాలు వ్రాతలు చక్రాంకితాలే వహికక్కే
ముద్రలు" 3-415

చట్టి : వి. మూతి వెడల్పుగా ఉండే చిన్న మట్టిపాత్ర, అటిక, చిన్నకుండ.
"వుట్లమీఁద నున్న పాలు
వెన్నా చట్లతోడనే సాదించీ" 23-331 & 1-122
"బలు హిరణ్యాక్షుఁడు ప్రహ్లాదుని బట్టి
జలధి వేసిన నీరుచట్టై తేలె" 4-372

చట్టుపడు : ప.బం; అ.క్రి. నశించు, అణఁగు.
"చట్టుపడఁదోలె నాఁడు సముద్రాలపైఁ దేరు
ముట్టుగాఁదోలెను పౌండ్రకునిపై నదే తేరు"
6-110 old

చట్టురాతినార : వి; ప.బం. అతికష్టసాధ్యం. చట్టురాతిపై నార తీయడం అసాధ్యమని వాచ్యార్థం.
"చుట్టరికము సేయుచు సూడువట్టఁగ రాదు
చట్టురాతినారిది విచారించుకోవయ్యా" 23-231

చట్రాత నారొలుచు : ప.బం. అసాధ్యమైన కార్యానికి పూనుకొను. (చాపరాతిపై నార ఒలుచు అని వాచ్యార్థం.)
"సడఁగులు చల్లి చల్లి చట్రాత నారొలిచేవు
తడయక సిగ్గులనే దడి గట్టేవు" 29-464

చతురతనము : (చతుర + తనము) వి. చాతుర్యం, నేర్పు. కేవలతత్సమశబ్దంపై 'తన' ప్రత్యయం చేర్చి ప్రయోగించడం విలక్షణం.
"చతురతనంబుల సందడిసేయఁగ
యితవగు కాఁగిట నెడ మీరైరి" 24-88

చతురుఁదనము : వి. చతురత్వం, నేర్పు. రూపాం. చదురుఁదనము.

"పదరి సంసారమనే బహురూపమే కాని
చతురుఁదనాన నందు సమర్థుఁడఁగాను" 2-255

చతురులాడు : ప.బం; అ.క్రి. ఛలోక్తులాడు, ఎగతాళి మాటలాడు. చతురులు అనే పదం ఎగతాళిమాటలు, ఛలోక్తులు అనే అర్థాల్లో మాండలికంగా ప్రసిద్ధమని అధోజ్ఞాపిక - 26 సం 368 పు.
"చతురులాడేచోట జగడాలు పనిలేవు" 26-530

చదరంగము : (3) వి. ఒకవిధమైన ఆట, Chess.
"యితవు గాకుంటే నానతియ్యరాదా వొకమాట
చతురతనాడీఁ గాని చదరంగమైనను" 23-418

చదురంగము : (16) వి. ఒకవిధమైన ఆట, Chess. ఇది చతురంగమునకు తద్భవరూపం. చదరంగమని వాడుక.
అన్నమయ్య సంకీర్తనల్లో మూడుచోట్ల మాత్రమే 'చదరంగము' అనే పదం కనిపిస్తుంది. తక్కిన చోట్లెల్లా చదురంగమే.
(22-194, 23-438, 29-4)

చదురము : వి. చతురస్రమైనది, చదరమునకు వ్యావహారికరూపం, చదునైనది.
"తుద నిదె సుఖమును దుఃఖము తోలును
గింజయి ముదురుక
చదురము వలయము తోఁచీ సంసారఫలము"
1-482

చదురాఁడి : (చదురు + ఆఁడి) వి. నేర్పుకత్తె, చదురు శబ్దం చతుర శబ్దభవం. దీనిపై 'ఆఁడి' రావడం విశేషం. చతురంగా మాట్లాడే స్త్రీ.
"వుదుటన నవ్వుతాను వోరచూపులు
చూచేవి(ది)
చదురాఁడు లైనవారి సహజమిది" 13-79

చదురాలు : (6) (చదురు + ఆలు) చతురతగల స్త్రీ, చతురురాలుకు తద్భవంగా కనిపిస్తుంది.
"వోజతోడ చదురాలు వోవరిలో నుండఁగాను
రాజసానఁబచ్చిదేర రతిఁగూడేవు" 28-24

చదురుఁడు : వి. 'చతురుడు'కు తద్భవం. నేర్పరి, సమర్థుఁడు.
"అదనెరిఁగి తిరువేంకటాధీశ పొందితివి
చదురుఁడవు నినుఁబాయజాల దొకమారు"
5-70

చదురుఁదనము : (8) (చతుర + తనము) వి. నేర్పరితనం, సామర్థ్యం, చతురత్వం.
"చదురుఁదనము రాజసము గలవాఁడంటివి
యెదటికిఁదానెప్పుడెపుడు వచ్చీనే" 28-49

చదురుంబదురు : ప.బం. సల్లాపాలు
"అదనూఁబదనూ నెఱిఁగి అండనుంటేఁ జాలు
చదురుఁబదురు నొక్క సమ్మతౌనే" 17-32

చదురులాఁడి : (చదురులు + ఆఁడి) వి. నేర్పుగల స్త్రీ, చతురురాలు, చతురోక్తులు మాట్లాడునది.
"చక్కని జాణవు నీవు చదురులాఁడి యాపె
పక్కన మిమ్మొట్టు వొడఁబరచేము" 27-77

చదురులాడు : (5) వి. చతురోక్తులాడు, పరిహాసమాడు.
"చేరి నన్నుఁదానె కూడె శ్రీవేంకటేశుఁడు
సొరెకుఁబొగడేఁగాక చదురులాడేనా" 27-521

చదురులు : వి; బహు. చతురోక్తులు.
"చలివేఁడి సటకాఁడ చదురుల జాణకాఁడ
మొలకనవ్వులతోను మొక్కేమయ్య" 11-57

చద్ది : వి. నిన్నటి అన్నం, చల్లటి అన్నం.
"తెలతెలవారఁగానే తెఱవమొగము చూచి
వలపు చద్దిఁగట్టుక వచ్చితివి" 24-592

చద్దికన్ను : వి. చల్లనికన్ను.
"ముద్దులాఁడికొడుకుచేత ముజ్జగములు
దిప్పనేర్చు
చద్దికంట వేఁడికంటఁ జక్కుఁజూడ నేర్చును"
5-233

చద్దికర్మములు : వి. పూర్వకర్మలు, సంచితకర్మలు.
"నిద్దిరించువాని చేతి నిమ్మపంటివలెనే
చద్దికర్మములు తానే జారితే జాలె" 1-431

చద్దికి వండిన వంటలు : ప.బం; వి; బహు. (?)
"అద్దములోపలి నీడలు అందరి దేహరూపులు
చద్దికి వండిన వంటలు జంటఁగర్మములు"
2-133

చద్దికి వేడికి : పొద్దునా - మధ్యాహ్నమూ.
"ఇద్దరి గుణంబులివి యింతులాల
చద్దికిని వేడికిని సంగడించీని" 24-1
"చద్దికి వేడికి వచ్చి సనకాదులు పాడేరు" 1-311

చద్దికూటిమీద ఉమిసినట్టు : నానుడి; పనిని చెడగొట్టడమని అర్థం.

చద్దికూళ్లపొద్దువేళ : వి. అంబటివేళ, చద్దన్నం తినే వేళ.
"చాలునిఁక నిద్దురలు చద్దికూళ్ల పొద్దు
వేళాయ నా తండ్రి వేగ లేవే" 3-543

చద్దిగురుతులు : వి; బహు. ఉదయం కనిపించే (నక్షత్రాది) చిహ్నాలు (?)
"ఇద్దరుఁగూడి యున్నపు డెరఁగడాయనో కాని
చద్దిగురుతులకే సాధించీ నిపుడు" 11-153

చద్దిజగడాలు : వి; బహు. పాతజగడాలు.

చద్దిమూఁట : ప.బం; వి. అవసరానికి పనికి వచ్చేది, అనుభవింపక తప్పనిది. (చద్దిఅన్నం కట్టిన మూట అని వాచ్యార్థం.)
"వొద్దనే పెక్కుగాలము పూనిన పురాకృతము
చద్దిమూఁటై యనుభవించఁగఁ జేసీ మానదు"
3-216

చద్దివలపు బేరాలు : వి; బహు. వేడి తగ్గిపోయిన ప్రేమవ్యవహారాలు.
"పెద్దరికా లాకె తోడ బెరయించేవా వోరి
చద్దివలపు బేరాల జట్టికాఁడ రారా" 5-145

చద్దివేఁడి : పొద్దునా, మధ్యాహ్నమూ.
"చద్దివేఁడి కింక నిట్టె చవిగొంటి నేను" 24-81

చద్దివేడిపొందు : వి. పాత మరియు కొత్త సంగమం.
"గద్దించి చెక్కు నొక్కితే కాఁగలించి విడువఁడు
చద్దివేఁడి వీని పొందు చాలు (ల?) నమ్మనేను"
7-283

చద్దివేడి రతులు : వి; బహు. పాత మరియు కొత్త రతులు.
"చద్దివేడి రతులలో సరసాలింతే" 21-252

చద్దివేడి వలపు : వి. పాత మరియు కొత్త ప్రేమ.
"నిద్దరించి నీవు నాకు - వొద్ద నుండఁగల గంటి
చద్దివేఁడి వలపాయరా" 8-223

చద్దిసంసారము : ప.బం. వేడితగ్గిన సంసారం.
"చద్దిసంసారమున సరుస సుఖదుఃఖములు
యెద్దు యెనుపోతునై యేకంబు కాదు" 1-486

చనవరి : (4) (చనవు+అరి) వి. ప్రేమతోగూడిన స్వేచ్ఛ గల(ది)వాడు, స్నేహితు(రాలు)డు.
"సంగడిఁగూచుండితేనే చనవరి వైతివా
అంగాలు సోఁకించితే నొయ్యారి వైతివా"
23-100

చనవరికత్తె : (చనువు+అరి+కత్తె) వి. చనవు (ప్రేమతోగూడిన స్వేచ్ఛ) గల స్త్రీ, స్నేహితురాలు.
"చనవరికత్తెలము జగడాలాడుదుమా
చెనకి నీకే ప్రియాలు చెప్పేము కాక" 27-182

చనవరితనము : (చనవు + అరి + తనము) వి. అధికారం (చనవు = అధికారము అని శ.ర.) (చనవరి = రాజుకడ నుండు ఒకానొక ఆంతరంగికుడైన ఉద్యోగి, రాజపురుషుడు - ఆం.శ.ర.) చనవు = అవకాశము అని.వా.ని. అని సంపా. 24 సం. 228 పు. చనవు గలిగి యుండటం, స్నేహం.
"చనవరితనమున సాధించుకంటెను
వినయముతో విభుని వేఁడుట మేలు" 24-338

చనవరిది : వి. (చనవు + అరి + అది) చనవుగల స్త్రీ, ఆప్తురాలు, స్నేహితురాలు.
"ఇంచుకంతా శ్రీవేంకటేశు మీరేనటవే
వంచనసేయని చనవరిదాన నేను" 7-341

చనవరివారు : వి; బహు. చనువుగలవారు, ఆప్తులు.
"చనవరివారము సరికిబేసికి మిమ్ము
పెనఁగులాడించేమా బీరముతోను" 16-33

చనవిమనవులు : (2) వి; బహు. చనవుతో కూడిన మనవులు.
"చలమొ పలమొ చనవిమనవు లింక
గలిగిన పోటే చాలుఁగా నీవయ్యా" 26-7

మనవిపోలికతో 'చనువు'ను చనవిగా వాడినట్లున్నది.

చనిగె: వి. సలిగె (?)

"పాపపుణ్యాలిరువంక పైఁడివెండి మనుసులు
పైపై గుత్తికె మేటిపై చనిఁగె" 3-467

చనుగొంగు: (చను + కొంగు) వి. వక్షస్థలంపై ఉండే కొంగు, ముంగొంగు.

"చనుఁగొంగు జారెనంటాఁ జక్క దొబ్బవచ్చేవు
చనవున నన్నిటాను జాణవా నీవు" 11-158

చనుపకము: వి. 'చంపకము'నకు వ్యావహారికరూపం, సంపెంగ.

"కలికి నాసిక చనుపకము తావికి కురుల
అఱలు వోకుండ వల లమరించుగతిని" 7-413

చనుమానము: (3) వి. 1. స్నేహం, దయ 2. అధికారం, పెత్తనం (తె.వ్యు.కో.) చనవు (సారంగ.)

"ఘనుఁడ శ్రీవేంకటేశ కలిసితి విద్దరిని
చనుమానాలిచ్చి మమ్ము సరిగాఁబెంచేవు"
13-117

చనుముక్కు: వి. చనుమొన, చూచుకం, కుచాగ్రం, చనుమోము.

"జక్కవలఁబోలిన చనుముక్కులు
ఇక్కడ నిన్ను నాటితే నేమి సేసేవిఁకను" 27-79

చనులచంద్రులు: వి; బహు. అర్ధచంద్రాకారం గల నఖక్షతాలు.

"చనులచంద్రులు నిక్కె సమరతులివె దక్కె
మనసెల్లాఁగంటిమిఁక మన్నించవయ్యా"
27-502

చన్నకాలము: వి. గడిచినకాలం, భూతకాలం.

"చన్నకాలమున నున్నకాలము
నున్నవాఁడు యీ వుపేంద్రుఁడే" 3-289

చన్నమన్నవారు: ప.బం; వి. బహు. అందరూ. (చనిపోయినవారూ, బ్రదికి ఉన్నవారూ)

"ఎన్నఁగ సంసారధర్మ మిదివో మోక్షము చూప
చన్నమన్నవారికెల్లా సాధనము గాదు" 3-205

చన్నిచ్చు: (చన్ను + ఇచ్చు) ప.బం. తల్లి శిశువుకు పాలిచ్చు.

"నేరుపునంజన్నియ్యంగ నెత్తురెల్లఁ దాగి
గోరపెట్టి చంపె నిట్టి కొత్తలెందు తాగఁగలవా"
6-60

చన్నీళ్ళకు వేన్నీళ్లు దోడు: ప.బం; వి. ఒకదానికొకటి తోడుగా ఉండడం.

"ఒకరికొకరు దాపు వోపనంటేఁబోదు యిఁక
వెకలి చన్నీళ్ళకు వేన్నీళ్ళు దోడు" 5-14

చపచప: విణ. వ్యర్థం, రసహీనం. 'చప్పచప్ప'కు రూపాం. (పర్యాయ.)

"ఘనుఁడ శ్రీవేంకటేశ కరుణ యింత గాకున్న
చనవరితనానకు చపచప నందురు" 25-153

చప్పు: వి. తొడ.

"చప్పలు వట్టుక సన్నపుబాలుని
నుప్పరమెత్తకురో యమ్మా" 5-97

చప్పట: వి. వేళ్లు చాచిన అరచేయి (తె.వ్యు.కో.), చఱపు, చతురస్రం.

"చప్పటై నీ వీఁపుమీఁద చన్నులట్టె వొరయఁగా
కొప్పు నీకేమి దువ్వీని కొలువులోను" 17-149

చప్పన ఉప్పనను: ప.బం; అ.క్రి. ఏదో దోషాన్ని - లోపాన్ని ఆరోపించు.

"చప్పన వుప్పనను చు జగడాలు దియ్యక
అప్పుడే విడెమిచ్చె నది చాలదా" 23-118

చప్పనుప్పన: విణ; ప.బం. చప్పన, ఉప్పన.

"చాటువ (నీ) గుణములు చప్పనా నుప్పనా
నాయ
బూటకాన నీవెంత బుజ్జగించేవయ్యా" 14-116

చప్పరమంచము: వి. పందిరిమంచం.

"చప్పరమంచముపై నీ సరుసఁ బెట్టుకొనేవు
చిప్పిల నెవ్వతె నీతోఁ జెందియున్నదో" 29-22

చప్పరమాళిగ: వి. గృహాంగణంలోని మాళిగ, గది.

"చప్పరమాళిగెలోన సరిఁబవళించే నీకు
నప్పుడే తాఁదొడ చాఁచీ నదిగో వమ్మా" 7-589

చప్పరమాళిగె : వి. పందిరి వేసిన మేడ.

"వొప్పుగు దోమతెరలో నున్నదో కాక
చప్పరమాళిగెలోన సరి వొంటి నున్నదో"

19-432

చప్పుచాడుసేయు : ప.బం; అ.క్రి. సారాన్ని పీల్చి పిప్పిచేయు. శప్పుచ్చవట్ అనే తమిళపదానికి నిస్సారము, నిస్సారభూమి, చవిటినేల అని అర్థం. చప్పుచాడు దాని వికృతరూపం కావచ్చునని సం.ప.స. (14 వా. 350 పు.)

"ఉన్నతిఁ దలవంచుక వుండఁగానె మోవితేనె
సన్నలఁబరచి చప్పుచాడు సేసితివి" 14-94

చప్పుచారు : వి. సారాన్ని పీల్చగా ఏర్పడిన పిప్పి.

"దప్పిదేరి నీ మోవి దగదొట్టీ నిందువంక
చప్పుచారై యలసేవు చాలుఁ జాలునిఁకను"

27-301

"మక్కువ మగనితోడ మంచి మాటాడుదువు గాక
చక్కెరమోవి నేలే చప్పుచారులు" 21-120

చప్పుచారుసేయు : చూ: చప్పుచాడు సేయు.

"జంగిలి పదారువేలఁ జప్పుచారు సేసినట్టి
యెంగిలిపొత్తులవాఁడు యేమి చూచీనే"

21-160

చప్పుడించు : అ.క్రి. 'చప్పిడించు' అని ముద్రింపబడింది. చప్పుడించు కావచ్చు. చప్పుడుచేయు, ధ్వనిచేయు. విలక్షణమైన క్రియారూపం.

"చెప్పరాని మనసులోని సేసుకొంటి బాసలెల్లా
చప్పి(ప్పు)డించ కాపె నాతో సన్నసేసెను"

23-226

చబుకుసేయు : ప.బం; స.క్రి. కొరడాతో కొట్టు. (పద.)

"ఎగసిన గరుడుని ఏపున ధా యని
జిగిదొలఁక చబుకు చేసినను" 1-92

చమట : వి. 'చెమట'కు వ్యావహారికరూపం.

"మూఁగుచు శ్రీవేంకటేశ ముంచి మనవంటివారు
తోఁగుఁజమటలచేత దొమ్మ యౌటఁగాదు"

27-157

చమరించు : అ.క్రి. 'చెమరించు'కు వ్యావహారికరూపం. చెమట కలదగు.

"కందువ మై చమరించి – గందపొడి చల్లుకొని
పొంద నిన్నుఁ దలఁచితిరా వెంకటేశా !" 7-223

చమరు : స.క్రి. 'చమురు'కు వ్యావహారికరూపం. రాచు, పూయు. (తె.వ్యు.కో.)

"వీడిన నా తురుమున విరులు నిండా ముడిచె
వాడుదేర మోమున జవ్వాది సమరె" 27-538

చమరుకొను : అ.క్రి. పూసుకొను, రాచుకొను.

"ఒప్పుగ జవ్వాదిచేత వొక్కింత చమరుకొని
కప్పి నీవైనా కీలుగంటు వేయరాదా" 13-323

చమురుదీసిన దివ్వె : ప.బం; వి. ఆరిపోయిన దీపం, చంచలం, వెలుగు లేనిది.

"జమునోరిలో బ్రదుకు సంసారము చూడ
చమురు దీసిన దివ్వె సంసారము"

చమ్మాళిగలు : (3) వి; బహు. రూపాం. సమ్మాళిగలు, సంబాళిగలు, చమ్మాళిగెలు ; పాదుకలు.

"కనకపుఁజమ్మాళిగలు మెట్టి యల జ
వ్వని గర్వమున నిట్టె వచ్చి వచ్చి" 5-93

చమ్మాళిగెలు : వి. చూ: చమ్మాళిగలు.

"కమ్మర నాసలతోడ కారేటి చెమటతోను
చమ్మాళిగెలు వట్టిన సతిఁజూచి" 21-17

"జమళిముత్యాలతోడ చమ్మాళిగ లిడరో
రమణికి మణుల నారతు లిత్తురో" 5-73

చయ్యాటము : వి. రూపాం. సయ్యాటము, సహక్రీడ.

"సరసమాడేవు నీవు చన్నుల నొత్తి నాపె
యిరవైన మీ చయ్యాటా లెట్టు దెలుసు" 28-352

చర : వి. చెర కావచ్చు. చెరసాల, నిర్బంధం.

"పంచభూతాలకుఁ జర బ్రదికేటి బ్రదుకెల్ల
యించుకంత దయఁజూడ నిఁక నెవ్వరో" 4-202

చరమశ్లోకము : "అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః" అన్న భగవద్గీతా శ్లోకం.

"కాచే నన్న చరమశ్లోకము నాకుఁబూఁటకాఁపు
చూచి నీ వేడ నుండినాఁ జూపి ఇచ్చీని"
15-419

చరమార్థం : వి. స్వప్రయత్నాలన్నింటినీ వదలివేసి ఆత్మ సమర్పణ చేయడం.

"ఆనతిచ్చె దొల్లె యాత డది చరమార్థమందు
మేని దోసమెల్ల చాపి మేలొసఁగే నసుచు"
3-521

"చరమార్థమందు నీవు చాటితివి గాన
ఇరవిది నమ్మితి నా కెదురెందు లేదు" 3-462

చరిత : (3) చరిత్ర. చూ : సరిత.

"అప్పటినుండి నీవు ఆపెతోనే మాటాడేవు
చొప్పుగ నీ చరితలు చూచి వెరగయ్యీని"
22-173

చరిసేయు : *ప.బం; స.క్రి.* ఇది నేతవృత్తికి సంబంధించిన పదం. పడుగును గంజివేసి కుంచెతో దారాలన్నింటినీ నిడుపుగా ఒకదానికొకటి కలియకుండా గట్టిపడేట్లు చేయు (చరి = గంజి) సరిచేయు అని నేటి వ్యవహారం.

"పంచభూతము లనెడి పలువన్నె నూలు
చంచలపుగంజి వోసి చరిసేసి" 1-275

చలనచిత్తుఁడు : వి. చపలచిత్తుడు.

"కలదట మునులకుఁ గడు రాగద్వేషాలు
చలనచిత్తులము మా జాడ యిఁకనేది" 3-124

చలపట్టు : అ.క్రి. పగబూను.

"చలపట్టితేఁ జాలు సర్గమేమి బాఁతా
చలివేఁడి నాలికపై సత్యములో నున్నాఁడు" 2-7

చలపదము : వి. 'చలపాదము'నకు వ్యావహారిక రూపం (?) గర్వం, మాత్సర్యం.

"ముక్తికి శ్రీవేంకటేశ మూలము నీ పాదములు
సక్తులయి నమ్ముటగాక చలపద మేటికి" 1-497

చలపాదము : వి. గర్వం, మాత్సర్యం; చలము, చలపాది, చలపాదితనము సహజములు కాని చలపాదము విలక్షణరూపమే.

"చదివితి ననియెడి చలపాదమింతే కాని
అదన నందులోని అర్థమెఱఁగ" 2-255

చలపాదితనము : (14) వి. పట్టుదల, మాత్సర్యం.

"చెలఁగి - పతి ముట్టితే చేతికి లోనౌట గాక
చలపాదితనమే జవరాలికి" 18-195

చలపాదివాఁడు : (7) వి. మాత్సర్యశీలుఁడు, పట్టుదల కలవాడు.

"ఉప్పనై నే జంకించితే తెమలవేమిటా నీవు
యెట్టి చలపాదివాఁడ వేమి చెప్పేది" 8-175

చలమరి : (చలము + అరి) వి. మాత్సర్యశీలుఁడు.

"తెలియక వూరక తిరిగేము
చలమరి కగునా సంతతసుఖము" 1-432

చలమరితనము : (చలము + అరి + తనము) వి. మాత్సర్య స్వభావం, పట్టుదల.

"పిలువఁగఁ బిలువఁగ బిగిసేవు పతితోను
చలమరితన మేలే సతికి" 25-38

చలమరిది : (2) (చలము + అరి + అది) వి. మాత్సర్యశీలం గల స్త్రీ.

"చలమరిదానఁగాను సరిదానఁగాను" 20-408

చలమరివాఁడు : (చలము + అరి + వాడు) వి. మాత్సర్యం కలవాడు, పట్టుదల కలవాడు. (వ్యు.)

"చలమరివాఁడవు చనవేల యిచ్చితివి
వలవఁగ నాడే నీవు వద్దనరాదా" 13-479

చలముకొను : (3) *ప.బం; అ.క్రి.* చలపట్టు, పట్టుదల వహించు, పగపూను.

"వలరాయఁడపుడు తన
వాఁడిపువ్వుటమ్ములను
చలముకొని మిమ్ము ముంచక మానునా"
5-211

చలమో పలమో : *ప.బం.* మంచో చెడో.

చలిగొను : *అ.క్రి.* చలి వైచు.

"మలసి యంతేసి దిమ్మరితిట్లు దిట్టేవు
చలిగొనఁ బన్నీరు చల్లెనంటా నీపెను" 26-230

"చలిగొనీ నంటాను సరియ నీ పచ్చడము
నిలువుగప్పులు గప్పీ నీతో నటు" 27-291

చలిదీరు: అ.క్రి. సంకోచం తీరు.
"జవ్వనపు మేనుబ్బి చలిదీరె సిగ్గులు
రవ్వలుగాఁగూడఁగాను రతివేళను" 21-114

చలినెల: వి. శిశిరర్తువు.

చలిమంచికాలాలు: *వి; బహు.* మంచి చలికాలాలు. ఇలా విశేషణాన్ని మధ్యలో చేర్చడం అన్నమయ్యకు సహజమే.
"చలిసిగ్గులెల్ల ముంచె పులకలమంచు ముంచు
చలిమంచికాలాలు సతికి నేఁడే" 19-519

చలిమందులు: (13) *వి; బహు.* శీతలోపచారాలు. విరహంలో నున్న నాయిక తాపాన్ని పోగొట్టడానికి చేసే శీతలోపచారాలు.
"తలపో తలచేతఁ దతిగొన్న విరహము
చలిమందులచేత జడిసీనా" 13-248
'నా కీ చలిమందులేమిటికి' అని కావ్యా. ప్రయోగం. (2-79)

చలిమి: (15) వి. 'చెలిమి'కి వ్యావహారికరూపం, స్నేహం.
"చలిమి నీతఁడే చూపె శరణాగతి" 2-372
"చలిమీ బలిమీ సాదించీనా
యెలమి నిన్నాళ్లదాఁకా నెందుండై తాను"
26-41

చలిమిరించు: అ.క్రి. చల్లఁబడు.
"చల్లని నీ ప్రియముల చలిమిరించెను మేను
యిల్లిదె కారపువీడెమియ్యేఁదగదా" 17-293

చలివాపు: *ప.బం; అ.క్రి.* సిగ్గుసంకోచాలను తొలగించు, బుజ్జగించు, భయాన్నితీర్చి బుజ్జగించు అని ఆం.ధా.మా.
"చలివాపి ఆపె నిడ సరిబేసు లాడుకొంటూ
కలిసితివిటు నన్ను కాదా మరి" 17-130

చలివాయు: (11) (చలి+పాయు) అ.క్రి.సిగ్గుసంకోచములు పోవు, జంకుపోవు.
"చలివాయఁ బొగడితే సారె మెచ్చే వేమే"
26-584

"పలుమారు గురుసేవఁ బరఁగఁగా బరఁగఁగా
చలివాసి యాత్మవిజ్ఞానము బొడచూపు"

చలివుట్టు: (చలి+పుట్టు) అ.క్రి. జంకుపుట్టు, భయంపుట్టు.
"రవళి మగవానితో రారాపులఁబొందు సేసే
సవతి గలిగితేనే చలివుట్టును" 14-547

చలివేఁడి: వి. సుఖదుఃఖాలు. (?) (శీతోష్ణాది ద్వంద్వాలు)
"ఎవ్వరి భాగ్యం బెట్టుండునో
జవ్వనభారము చలివేఁడాయ" 27-252
"చలివేడిఁబొరలకే - సర్వేశుపాదాల కింద
తలకొన్న తన్నుఁదానే తలఁచఁగవలెను" 2-198

చలివేఁడినాలిక: ద్వంద్వప్రవృత్తి గల నాలుక.
"చలపట్టితేఁ జాలు సర్గమేమి బాఁతా
చలివేఁడినాలికపై సత్యములో నున్నాఁడు" 2-7

చలివేఁడివిందులు: (?)
"జవరాలిపొందులు చలివేఁడివిందులు" 2-7

చలివేఁడిసటకాఁడు: ఎల్లవేళలా మోసం చేసేవాడు (?)
"చలివేఁడిసటకాఁడ, చదురుల జాణకాఁడ
మొలకనవ్వులతోను మొక్కేమయ్య" 11-57

చలివేండ్లు: (చలి + వేఁడి) చలి మరియు వేఁడి. వేఁడి శబ్దానికి 'వేండ్లు' అనే బహువచనరూపం విలక్షణం.
"కిన్నెరమీట్లలోని గిలిగింతలూ నీ
సన్నల చాయలలోని చలివేండ్లు" 19-412

చలిసేయు: (చలి + చేయు) అ.క్రి. జంకు కలిగించు, సిగ్గు కలిగించు .
"యెంగిలైన నీవే కావా యెంత రతిఁగూడినాను
సంగతిగా మాకు నెట్టు చలిసేసేవు" 25-299

చలువకు వేఁడికి సరికి సరి : ఒకదాని కొకటి సరి.
"ఆలయపథ్యమున కౌషధము గొనుట
చలువకు వేడికి సరికి సరి" 4-213

చలువరాయి: వి. చంద్రకాంతమణి.
"మించి చలువరాయనే మెచ్చుల పొరగంటిపై

నించినట్టి వేడుకల నీ దేహము" 10-2-95

చలువలోపలి వేఁడి : *ప.బం; వి.* సుఖంలోని దుఃఖం.

"చలువలోపలి వేఁడి సంసారము చూడఁ
జలపూతబంగారు సంసారము" 1-199

చల్ల : *వి.* చల్లదనం.

"ఒల్లని సతులమాట నొప్పులునుఁ దప్పులవు
చల్లని చూపులయిన చల్ల వేఁడవు" 24-115

చల్లఁగా బతుకు : *ప.బం; అ.క్రి.* సుఖసౌఖ్యాలతో జీవించు.

"చల్లఁగా బతుకవయ్య జాణతనాలు నేర్తువు
యెల్లచోట నీఁకఁ దప్పు లెంచేమా నిన్ను"
26-251

చల్లఁజేసుకొను : *స.క్రి.* చల్లార్చుకొను, మనసున కూరట కలిగించు.

"నిన్ను నాకె మారుగా మనసున నిలుపుకొని
చెన్నుఁమీరఁగాఁక చల్లజేసుకొను" 7-146

చల్లచాడి : *వి.* చల్లకుండ, రూపాం. చల్లచాడె.

"మూయకువే చల్లచాడి ముచ్చుగొల్లెతా వోరి
పోయవే పోవో మా చల్లపులు సేల నీకు" 6-113

చల్లచాడె : (6) *వి.* చల్లకుండ.

"వాడికగా నొండొరులు వావెడుగనేల చల్ల
చాడె దించుకొన్నప్పుడే సతతమాయను" 14-6

చల్లజంపు : *వి.* చల్లగా గొంతుకోయడం, తడిగుడ్డతో కుత్తుక కోయడం వంటిది. ఇట చల్లఁజంపు అని అరసున్న లేకపోవడం విలక్షణం. చల్లగా గొంతుకోసేవాడు. భయంకరుడు అని ఆం.ప.ని.

"చల్లజంపు భువిలోన చాపకింది వెల్లువని
యెల్లవారు నాడేది యెన్నికకు వచ్చేను"
14-305

"భయంకరునకు చల్లజంపన జెల్లెను సారసాక్ష"
(ఆం.ప.ని.)

చల్లజంపు దిప్పకాయ : *వి.* ఒకతిట్టు, చల్లగా గొంతు కోసేవాడు, భయంకరుడు, అల్లరివాడు, కొంటెవాడు.

"చందనపుఁగొండఁ బుట్టి చల్లజంపుదిప్పకాయ
అందివచ్చి రేఁచకుండా నడ్డుపెట్టమనవే"
19-327

చల్లజంపులాఁడి : *వి.* చల్లగా గొంతుకోసే స్త్రీ, క్రూరురాలు.

"మల్లాడే కోపకత్తెను మట్టుకుఁదేవచ్చుఁగాని
చల్లజంపులాడి నైతే సాదించరాదు" 23-107

చల్లదుత్త : *వి.* చల్లకుండ. (దుత్త = చిన్న మూతి గల కుండ)

"చల్లదుత్త లంటాను చన్నులపైఁజేయి చాఁచి
కొల్లగొంటిని మానము కోమలుల నెల్లను"
19-76

చల్లుఁగూటము : *వి.* జలక్రీడ.

"వెల్లవిరి శ్రీవేంకటేశ మన
చల్లుఁగూటమే సంకేసెను" 24-16

చల్లులాడు : *ప.బం; అ.క్రి.* జలక్రీడలాడు.

"భవనాశిలోని నీరు పైఁజల్లులాడుకొంటాను
నవకపుసిరులను నవ్వుకొంటాను" 4-511

చల్లువలపుబేరము : *ప.బం; వి.* మాటలతో మాత్రమే ఆగిపోయే ప్రేమ . (ఆం.శ.ర.)

"వెల్లిగా నన్నుఁగూడితి వేంకటేశుఁడా వోరి
చల్లువలపుబేరాల జట్టికాఁడా రారా" 5-145

చల్లువెదలాడు : *ప.బం; స.క్రి.* వెదజల్లు, విత్తు.

"సరులు చన్నులమీఁదఁ జల్లువెదలాడఁగాను
విరులకొప్పునుండి వెస రాలఁగా"
"చాటువైన వరములు చల్లువెదలాడుచు"
11-2 భా-69 old

"లంపటము ఘనమైన లక్ష్మీకటాక్షములు
సంపదలు తోడనే చల్లువెదలాడు" 1-358

చల్లువెదలు : (2) *వి.* విత్తనాలను మడిలో పిడికిలితో ఎత్తి చల్లే చల్లకం.

"కల్లగాదు నా మాట కదిసి చూడఁగదయ్య
చల్లువెద లిద్దరికి సగఁబాలు సుమ్మీ" 13-431

"వాడల వాడలనెల్లా వనితలమీఁద నీకు

వేడుకవలపు చల్లువెదలాయను" 13-473

చవి : వి. 1. ఉప్పు 2. అనుభవం, ఆస్వాదం 3. రుచి 4. సౌఖ్యం 5. ఆశ, తీపి 6. ప్రేమ, అనురాగం విణ. ఇంపైన, ప్రియమైన, రుచిగల (వ్య.)

"కోమలులు మీఁదమీఁద కోపగించినాఁజవి
దీమసానఁ బెదవులఁ దిట్టినాఁ జవి" 7-65

చవిగొన్న కూరలకు మేలుంగీడు కొనియాడు : ప.బం. తిన్న ఆహారాన్ని గూర్చి చింతించడం, వ్యర్థమని భావం.

"చాలుఁజాలు నాఁడే చవిగొన్న కూరలకు
మేలుంగీడు గొనియాడ మీఁదమీఁదను" 5-331

చవిచదువులు : వి; బహు.నామవిద్యలు, శృంగారవిద్యలు.

చవిచారము : వి. రుచివైనము, ప్రేమవైనము.

"చవిచార మెఱఁగవా జాణ నందువు
యివి యెల్ల నాపెకు నీ విచ్చిన చనవులే"
21-101

చవిచేయు : ప.బం; అ.క్రి. రుచించు.

"చవిచేసుక యిటు జరగెదము
జవదాఁటకురో సంసారులార" 3-542

చవియగు : ప.బం; అ.క్రి. తగు.

"నగినవారితో మారు నగంబాడి యెవ్వరికి
జగడించేవారితోడ చవిగాదు గాని" 3-156 old

చవిసేసుకొను : (2) ప.బం; అ.క్రి. రుచిచూచు, అనుభవించు.

"దొంతిఁబెట్టి యీ బత్తి తోడఁదోడ దాఁచుకొని
సంతోసించి సంతోసించి చవిసేసుకోవయ్యా "
29-272

చవులిచ్చు : ప.బం; అ.క్రి. ఇష్టం కలిగించు.

"అలమేలుమంగ నీ వభినవరూపము
జలజాక్ష(క్షు) కన్నులకు చవులిచ్చెనమ్మా"
5-160

చవులుకొను : ప.బం; అ.క్రి. రుచిచూచు.

"తివిరి మోవిసన్నలఁ దేనియలు గురిసీని
చవులుకొనుచు నీవు చన వియ్యవయ్యా"
28-349

చవులుగొను : అ.క్రి. 1. రుచిచూచు 2. అనుభవించు 3. పానంచేయు 4. తిను.

"భ్రమఁబడి మాయపుఁబడతుల తమ్ములు
నమలి చవులుగొనె నా జిహ్వ" 1-56

చా

చాఁగలమట్టి చెన్నుఁడు : వి. కర్నూలుజిల్లా చాగలమట్టిలో నెలకొన్న చెన్నకేశవుడు, రూపాం. చేగలమట్టిచెన్నుడు.

"కందువఁ గూడితివి చాఁగలమట్రి చెన్నుఁడవై
అందపు శ్రీవేంకటేశ అరుదా నాకు" 17-12

చాకిమణుగులు : ప.బం; వి; బహు. అస్థిరాలు (చలువచేసి మడత పెట్టిన వస్త్రాలు కొద్దిసేపటికి మడతలు చెరగిపోయి మామూలు అవుతాయి కదా!)

చాటువ : (3) వి. ప్రసిద్ధి, ఉదాహరణం, దృష్టాంతం.

"చాటువ నీ గుణములు చప్పనుప్పనా
బూటకాన నీ వెంత బుజ్జగించేవయ్యా" 14-116

చాటువకెక్కు : ప.బం; అ.క్రి. ప్రసిద్ధికెక్కు.

"మాటలెల్లా మంచివే మనసు లెనసితేను
చాటువకెక్కు పొందులు సమ్మతించితే" 28-571

చాడికాఁడు : (చాడి + కాఁడు) కొండెములు చెప్పేవాడు.

"వాడిక శ్రీవేంకటేశ వనితఁగూడితి విట్టె
చాడికాండ్ల బ్రతుకు సతములయ్యీనా" 14-305

చాడిచెప్పు : అ.క్రి. ఒకరిపై కొండెం చెప్పు.

"చనవున నీ ముఖచందురుని వంక నీ
చనుజక్కువలె పో చాడిచెప్పీని" 5-281

చాడె : వి. కుండ. (ద్రవం)

"వీది వీదిఁ బాలువెన్న వెసఁ గొల్లలాడినాఁడు
ఆ దెసఁ జాడెలు నిండి అట్టె వున్నవి" 18-29

చాతు : స.క్రి. ధరించు, సమర్పించు.

"తామెరకొలనువలెఁ దగఁ దిరుచేల చాతి" 14-

చాతుకొను : స.క్రి. ధరించుకొను .
"మగువకాంతులు నిన్ను మచ్చికతో నొరయఁగా
సొగసుగాఁ జాతుకొన్న సొమ్ము లాయనో "
23-498

చాతుపడి కైంకర్యము : వి. భగవంతుని విగ్రహానికి వివిధ సుగంధద్రవ్యాల లేపనం చేసే సేవ.
"సకలకర్మానుష్ఠానముల యితని
కిచ్చుటఁ జాతుపడి కైంకర్య మిదియే" 2-132

చానపి : వి. చానిపి, పేడనీళ్లు .
"చిక్కి విత్తొకటి వెట్ట చెట్టొకటి మొలచునా
అక్కర చానపి చవి అడుగ నే మున్నది "
15-154

చానిపి : వి. పేడనీరు, పేన్నీళ్ళు, కల్లాపి .
"చానిపిఁజవి వేడితేఁ జప్పనైనట్టి
చానిపిలోపలఁ జవి గలదా" 3-430

చాపకింది నీరు : *ప.బం;* వి. తెలియకయే ఆపద తెచ్చునది, మెల్లగా అంతటా వ్యాపించునది. చూ : చాపకింది వెల్లువ.
"పాపముఁబుణ్యము పైపైఁగూడుకొని
చాపకిందినీరు సంసారము" 3-105

చాపకింది వెల్లువ : (2) వి. తెలియకయే ఆపద తెచ్చునది. మెల్లగా అంతట వ్యాపించునది. చాపకింద నీరు పోసినప్పుడు ఆ నీరు పైకి కనిపించదు. కాని కిందినుండి అంతటా వ్యాపించును.
"చల్లజంపు భువిలోన చాపకిందివెల్లువని
యెల్లవారు నాడేది యెన్నికకు వచ్చెను "
14-305

చాపకూడు : *వి; ప.బం.* కులగోత్రాల నిర్బంధం లేకుండా కలిసి భుజించే కూడు, దొడ్డికూడు . (మాం.)
"బూటకపుసురలతోఁ బున్నమ కప్పురమున
కూటువగాఁ జాపకూడు గుడిచినవాఁడు" 6-43

చాయకత్తె : (2) (చాయ + కత్తె) వి. వన్నెకత్తె, వన్నెలాఁడి.
"చాయకత్తైనదానికి సాదించి పోరఁగూడదు
చేయివట్టి తియ్యఁగదే చెనకి యీతనిని "
24-528

చాయకాఁడు : (7) (చాయ + కాఁడు) వన్నెకాఁడు .
"ఆయములు సోఁక మాటలాడి యంత కొసరిన
చాయకాఁడవె కాక సమ్మతించేవా " 11-45

చాయకుఁదెచ్చు : *ప.బం; స.క్రి.* దారికితెచ్చు, మాట వినేట్లు చేయు .
"యీయెడ శ్రీవేంకటేశ యేలితివి నన్నూ నిట్టె
చాయకుఁదెచ్చినది యీ సరసమే కాదా "
27-106

చాయకు వచ్చు : (3) *ప.బం; అ.క్రి.* దారికివచ్చు, మాట విను .
"సేయఁగల చేఁతలెల్లా సెలవు సేసితేఁజాలు
చాయకు వచ్చి తానే సతమయ్యీని " 28-30

చాయ నల్లనివాఁడు : వి. నల్లని చాయ గలవాడు.
"శరధి గట్టినవాఁడు చాయనల్లనివాఁడు
యిరవై సుగ్రీవాదుల నేలినవాఁడు" 3-233

చాయపాటు : *వి; ప.బం.* సైగలు మొ॥ వాటితో మొఱఁగు, అన్యాపదేశం .
"చాయపాటై నన్నుఁగూడి సరిమేను మరచితే
నేయెడ నారతి చేఁత లెచ్చరించవా" 24-10

చాయపాటుఁదనము : వి. అన్యాపదేశంగా పలుకడం.
"ఇంతి చనవు చెల్లించు యెగ్గులుపట్టకు నీవు
సంతసించి మెచ్చుటే చాయపాటుఁదనము "
20 (26) 460

చాయపాటువారు : *వి; బహు.* సైగలు మొ॥ వాటితో అన్యాపదేశంగా పలుకువారు (?)
"పాయరాని యట్టివారు భ్రమసి లోనయ్యేరు
చాయపాటువారెల్లా చక్కనుండేరు"
25 (31) 406

చాయలాడు : అ.క్రి. వన్నెలు చూపు .

"మాయదారి యాటది నేమములు
చూపఁగవచ్చు
చాయలాడే యాఁటది సన్నసేసును"
12 (18) 334

చాయవాటు : వి. చూ : చాయపాటు, మెఱుగు.
"వియ్యము లుపొంగెను కందువులఁజెనఁకఁగా
చాయవాటు సతులెల్లా జంట సేయఁగలరా"
25-363

చాయ సందైతే చావడి చంకఁ బెట్టుకున్న మాట : సామెత; కొద్ది అవకాశం లభిస్తే చాలు పెద్దానికే ఎసరుపెట్టడ మన్నమాట.
"చాయ సందైతే చావడి చంకఁబెట్టుకొన్నమాట
యీ యెడ నీ యందె వున్నదిఁక నేఁటి
మాటలు" 9-272

చాయ సేసుకొను : (16) *ప.బం; అ.క్రి.* ఋజుభావం కల్పించుకొను.
"చాయసేసుకొని నీతో సరసము లాడితేను
ఆయము లే లెత్తీని అప్పటిఁదాను" 25-254
(చాయ = మరుఁగు) మరుగు చేసుకొను.
"సంగతి గాదని నేము చాయసేసుకుండితేను
అంగడివేసి తానే ఆనవెట్టుకొనీని" 14-554

చారువాకము : వి. పిడివాదము, మొండివాదము.
"జాతులకు నీ వాడెటి చారువాకా లింతే కాక
ఆతలి నిన్నుఁ గొసరనంత పొందులా" 11-503

చాలు : వి. వరుస, రీతి, వంశము, సంప్రదాయము, సాలు
"అందరికిఁగల చాలే యంగనలాల
పొందుసేయవలెఁగాక పోరాడ నేఁటికే" 26-443

చాలుకొను : (27) అ.క్రి. వరుసకట్టు, వరుసగా ఏర్పడు.
"తోలియాడీఁ దిరుతేరు దుష్టులెల్ల నణఁగఁగ
చాలుకొని శిష్యులెల్ల జయవెట్టఁగ" 4-178

చాలుమానిసి : *ప.బం; వి.* సమర్థుఁడు, ముఖ్యుడు (పద.)
"యేలికయై మన్నించు నిష్టుఁడై బుద్ధిచెప్పు
చాలుమానిసియై యంచలఁదిరుగు" 2-417

చాలుమూల : వి. క్రమవిధానం, పద్ధతి, దారిడొంక.
"చదరపు సరసాలు చాలుమూల నడవఁగా
గుదిగొన్న నగవు లగ్గువాయను" 14-276

చాళికుఁడు : వి. (?)
"నవ్వుచుఁ జాళికుఁడు తనాచారి (?) ముడిచిన
పువ్వులెట్టు ముడిచితి పొంది దొరవు" 17-415

చావివోయ : (?) చవి (= రుచి) పోయెను అని అర్థం కావచ్చు. 'చవి' లోని అకారం ఛందోనుగుణంగా, సంగీతానుగుణంగా దీర్ఘం కావచ్చు. ఏమైనా "చావివోయ వుమినాకి చవుతమా ఇఁక" అనే వాక్యంలోని పదాలస్వరూపం బోధపడడం లేదు.
"లేవే నేఁ బిలిచితే లెక్కసేసీనా తాను
చావివోయ వుమినాకి చవుతమా ఇఁక" 26-61

చి

చింక : వి. జింక.
"వడి నడవుల జింకవంటిది నా మనసు
బడిబడిఁ బట్టఁబట్టఁ బారీఁగాన" 2-395

చింకచూపులు : *వి; బహు.* జింకచూపులు, చంచలమైన చూపులు.
"లంకెలఁదాఁ జేసినట్టి లచ్చనలు చూచుకొంటా
చింకచూపుల నుండఁగఁ జేసినట్టు సేయనీ"
20-351

చింకబెదరులాఁడి : వి. జింకవలె బెదరు స్వభావం కల స్త్రీ.
"చంకల బంగారు చల్లి మెఱుఁగుల
చింకబెదరులాఁడి శిన్నెకా" 5-261

చించు : స.క్రి. చంపు, వధించు.
"యితఁడా తాటకిఁ జించె యీ పిన్నవాఁడా
ఆతల సుబాహుఁగొట్టి యజ్ఞముఁగాచె" 1-474

చింతకాయకజ్జము : వ్యర్థం, (తె.జా.) ఉపయోగించుకో వీలులేనిది అని పద; తె.వ్యు.కో.
"పడఁతుల వేడుకలు పచ్చి వడఁగండ్లగుళ్ళు

కడుమోవితీపు చింతకాయకజ్జము" 2-268

చింతకాయకజ్జాయము : (3) వి. గుజ్జుగ చింతపండు రసంలో ఉప్పు, కారం వగైరాలు వేసి పుల్లలకంటించి యెండించి రుచిరుచిగ చిబుకుట నేడును కలదు. దీనినే చింతకాయకజ్జాయమని అంటారు. సులభసాధ్యమని అర్థం. 5-214

"చింతకాయకజ్జాయము చెలువునితోడి పొందు" 28-579

పాం.మా.లో ఈ ప్రయోగం కనిపిస్తుంది.

"చింతకాయకజ్జాయము చేరి యిసుమంత వుంటే

అంతటనే నోరూరు నందరికిని" 3-293

చింతకుంట కంభమురాయఁడు : వి. కడపజిల్లా పొద్దుటూరు, జమ్మలమడుగు తాలూకాల్లో చింతకుంట పేరుగల గ్రామాలు రెండున్నాయి. చింతకుంట్ల అని నామాంతరం. త్రిభువన మల్లిదేవరాయలవారి ప్రధానియైన అణ్యణచోళ మహారాజు లానాడు రాజ్యమేలే పెద్దన చోళమహారాజుల వారి నగరిలో చింతమ్మ అనే బోనకత్తె కుంట కట్టించి నామకరణం చేసిందని స్థానికచరిత్రగా మెకంజీకైఫీయత్తు 1119-62 సాక్ష్యమిస్తుంది. అలాగే ఒక అత్త చింత పోగొట్టడానికి కోడలు కట్టించిన ఊరనీ మరొక ఐతిహ్యం. జమ్మలమడుగు లోని ఈ గ్రామమందలి చెన్నకేశవస్వామికి కంభంరాయడని పేరు. కంభంరాయ అనేపదం సాధారణంగా నృసింహస్వామిని సూచిస్తుంది. చింతకుంటలో ప్రస్తుతం చెన్నకేశవాలయం ఉంది. అన్నమయ్యకాలంనాటికి అక్కడ కంభంరాయుడు ఉన్నాడేమో! లేదా ఈ ఊరి ప్రాంతంలో మరో కంభంరాయని గుడి ఉందేమో! ఈ విషయం ఇంకాస్త పరిశీలించదగ్గ అంశం. దేవాలయంలోని ఒక స్తంభాన్ని కంభంరాయనిగా స్థానికులు భావిస్తున్నారు. తా.అ.సా. తెలుగునాడు 40 పు.

"ఘనుఁడవు చింతకుంటకంభమురాయ మముఁ

గనుఁగొని రక్షించు కంభమురాయ" 23-209

చింతపులుసు : వి. చింతపండుతో చేసిన పులుసు.

"సొరిది చింతపులుసు చూచితే నోరూరును

వరుసలం జవిగొన్నవాఁడు గాఁడు" 15-266

చింతలువంతలు : చింతలు; చూ: చింతవంతలు.

"చింతలు వంతలు లేవు చేకొన్నవారికి

వింతలుగా నవ్వు నవ్వే వేడుకే కాని" 20-362

చింతలు సిలుగులు : *ప.బం; వి; బహు.* కష్టాలు.

"అంతయుఁజూచిన హరి సంకల్పమే

చింతలు సిలుగులు జీవులవి" 3-126

చింతవంతలు : *వి; ప.బం; బహు.* 'చింతలు' అనే అర్థంలో వాడబడే పదబంధం.

"చింతవంతలిఁక నేల చెలుల దూరఁగ నేల

దొంతులరతులే నీకుఁ దోడాయఁగా" 19-402

చింతామణి చేతిలో నుండగా గాజుపూస మెచ్చు : *అ.క్రి.* అమూల్యమైన వస్తువును కాదని మామూలు వస్తువును కొనియాడు.

"సిరులఁ జింతామణట చేతిలో నుండఁగా

సరి గాజుఁబూస మెచ్చఁగ నదేమిటి" 3-187

చింతాయకుఁడు : (3) వి. ఏ నిఘంటువుల్లోనూ ఈ పదం కానరాదు. చింతలను పోగొట్టేవాడు, ఆపన్నివారకుడు అని వే.ఆ., విలక్షణమైన పదం.

"చింతాయకుఁడగు హరి చిత్తములో నుండఁగాను

వింతవింత విచారాల వెట్టి మాకేలా" 3-190

చింతించిన చింత : *ప.బం; వి.* ధ్యానించిన ధ్యానం.

"తిరముగ నినుఁ జింతించిన చింతే

నిరతము ముక్తికి నిధి గాదా" 1 సం. 20 పు old

చిందనూరు : ఈ గ్రామం ఎక్కడిదో తెలియడం లేదు. రాయలసీమ జిల్లాలోని గ్రామం కావచ్చు. ఇక్కడ వెలసిన స్వామి శ్రీవేంకటేశ్వరుడు. అన్నమయ్య ఈ స్వామిని దర్శించి ఒక కీర్తన పాడినాడు.

"చిందనూరిలోన నీకు చేయి చాఁచె నితఁడూ

మందెమేళె మేలె వాని మానలేవు నీవు" 17-126

చిందరవందర : వి. ఛిన్నాభిన్నం.
"పందెము సేసేనంటా పాపట దువ్వేనంటా
చిందరవందర చేసి సిగ్గు విడిపించీనే" 17-39

చిందువందు : (6) చిందరవందర.
"చిందువందైనదానిఁ జెనకకువయ్యా నీవు
కందువ చెప్పంపి మీఁదఁగలఁతు గాని" 7-28

చిందువందుర : ప.బం; వి. చిందరవందర.
"పెట్టిన కస్తూరిబొట్టు బెరసి నీ కురులతో
నట్టునిట్టుం జిందువందురై యుండంగా" 6-142

చిందుసేయు : అ.క్రి. వ్యాపించు.
"చల్లు మా వూరుపుగాలి సమరతివేళల
వుల్లమెల్లఁజిందుసేసు నోపుదునా" 11-251

చింద్రికె : వి. ఇది 'చంద్రిక'కు రూపాం. వ్యవహారంలో 'చెంద్రికె' అయి వ్రాతలో పొరపాటున 'చింద్రికె' అని పడినదేమో. అర్థమూ అదే అని సం.ప.స. (22 సం. 390 పు.) కాని 'చి' యతిస్థానంలో ప్రయోగింపబడటం గమనించాలి.
"చిన్ని పులకలు చూచి చింద్రికెమోవి చూచి
సన్నల నిన్నాడవారు సారె నవ్వరా" 22-39

చిక్కపుబుత్తి : 1.చిక్కములోని చద్దిఅన్నం. 2.చిక్కపుబుట్ట. (చిక్కము = దారంతో అల్లిన సంచి)
"కట్టిన చిక్కపుబుత్తి, కచ్చకాయల తిత్తి
చుట్టిన పించెపుఁబాగ చుంగుల సోగ" 5-96

చిక్కిన : విఴ. తక్కిన.

చిక్కినవి : వి; బహు. తక్కినవి, మిగిలినవి.
"వుప్పరిగలోన నుండి వువిద నిన్ను రమ్మని
చెప్పి రమ్మన్నది యింతే చిక్కిన వెరఁగము"
11-293

చిక్కుఁజీరు : ఇవి జంటపదాలు. (చిక్కు = సంకటపెట్టుట, చీరు = కోపించుట) తమిళము. చిక్కుజీరు శబ్దమును అరసున్న లేకుండ సూ.ని. బహు. తార్పర్యార్థములతో చూపినది. 'చప్పుచాడు' వంటిది. అని సం.ప.స. (13 సం. 350 పు.) ఈ పదాన్ని సూ.ని. ఈ విధంగా వివరించింది.

చిక్కు(లు)జీరు : (చిక్కు + జీరు) వి. తుత్తుమురు. విఴ. జీరువాలయినది. (సం.ప.స. 14 సం.) ఇవి జంట పదములు. (చిక్కు = సంకటపెట్టడం, చీరు = కోపించడం) చిక్కుజీరు శబ్దమును అరసున్న లేకుండ సూ.ని. బహుతాత్పర్యార్థములతో చూపినది. 'చప్పుచాడు' వంటిది. ఆవృతము.
"గక్కనఁ గలసితి నీ కాఁగిట నేను
దక్కితి శ్రీవేంకటేశ దయగంటిని
చిక్కుఁజీరు నింటివారు సేయనీ నన్ను
మొక్కలానఁగీడు నిన్ను ముట్టుకున్నఁ
జాలును" 14-356

చిగురుఁగొమ్మ చేఁగలగు : అ.క్రి. మొలకలోనే చేవదేరు.
"చింది చింది యెత్తఁబోతే చేరి మాపుదాఁకాఁ
బట్టు
చెందితేఁ జిగురుఁగొమ్మ చేఁగలవు నయ్యా"
18-194 & 23-260

చిగురుఁగొమ్ము : వి.చిగిరించిన లేఁతకొమ్ము, అప్పుడప్పుడే మొలచు కొమ్ము. 3-308

చిగురుఁజేవయగు : ప.బం; అ.క్రి. బలహీనమైనది బలవంతమగు, మృదువైన వస్తువు కూడా చేవ కలది యగు.
"చిగురుఁజేవయగు శ్రీవేంకటేశుఁడు
అగువరము లొసఁగు నటుగాన" 4-333

చిగురుఁబెదవులది : వి. పల్లవాధరకు దేశ్యపదం, చిగుళ్లవలె మృదువైన పెదవులు గల స్త్రీ.
"చిగురుఁబెదవులది చిన్నారి పాదములది
నిగనిగమేనిది నీకే తగును" 22-526

చిగురుచింతలు : వి. చిగిరించే చింతలు.
"చిగురుచింతల చేఁజెక్కు చేరిచిన చేయి
పగటున నేఁడు చెట్టపట్టఁగఁ బాలాయఁగా"
19-442

చిగురుమేఁతకాఁడు : వి. కోకిల; చిగుళ్ళు మేతగా కలది అని వ్యుత్పత్తి.

"చిగురుమేఁతకాండ్లెల్ల చెలఁగి మావికొమ్మలెక్కి
మగువమీఁదఁ గూఁత రేఁచి మరునిఁగూడిరే"
5-315

చిగురుమేనిది : (చిగురుమేను + అది) వి. చిగురువలె మృదువైన శరీరం కల స్త్రీ.
"చిగురుమోవిదాన చిగురుమేనిదాన
చిగురు చిత్తముదాన చెప్పేదేమి" 20-592

చిగురుమోవిది : (చిగురుమోవి + అది) వి. చిగురువలె మృదువైన పెదవి గల స్త్రీ .
"చిగురుమోవిదాన చిగురుమేనిదాన
చిగురు చిత్తముదాన చెప్పేదేమి" 20-592

చిగురులోపలి చేఁగ : వి. కఠినమైనది. (విజయ) చిగురులోనే ఏర్పడ్డ చేవ.
"చిగురులోపలి చేఁగ చెప్పరే మీరు
ఇగురులోపలి నిప్పు నిలుపరాదె" 19-421

చిగులు : అ.క్రి. ఈ పదం ప్రధాన నిఘంటువుల్లో కనిపించదు. వృద్ధిపొందు, విజృంభించు, ఉద్రేకించు కావచ్చు.
"చిగులుతా మమ్ము నింత సేయ
నేర్చినవాఁడవు
యెగనెక్కెవు మా కోపా లిముడుకోఁజాలవా"
11-364
"నగనే యాతఁడు నీ నటనకుఁ దగినట్టు
చిగులుతా సారెసారెఁ జెప్పినట్టు సేయఁగా"
11-329

చిచ్చ(చ్చు)ర(అ)కోల : వి. నిప్పు గల కోల, ఆగ్నేయాస్త్రం.
"పచ్చిదేరు నగ్గి బగబగ మండేటి
చిచ్చరకోలల చేఁతల
వెచ్చియు వేవని వేదనఁ బొరలుచు
అచ్చపుటాసల నలసీ తరుణి" 5-204

చిటకము : వి. శ.ర.లో చిట్టకము అనే పదం ఉన్నది. దీనికిది వ్యావహారికరూపం కావచ్చు. శృంగారచేష్ట, లీల (కపటం) అని అర్థాలు.
"చిటకానఁ జెనకియు చేతులును దనివోవు
వూటువగూడి గోల్లకొన నుంది మోహము"
27-272

చిటికె : వి. నెటిక, చేతినడిమి వేలును బొటన వేలుతో చేర్చి చేసే ధ్వని. (బాలక్రీడావిశేషం)
"తవిలి యొకతెపై పాదము నీవు చాఁచఁగాను
తివిరి వేళ్ళ చిటికె దియ్యవచ్చీ నీకును" 7-174

చిటిపొటి : ప.బం; *విణ.* మిక్కిలి అల్పమైన, చిన్నచిన్న.
"చిటిపొటి యలుకల చిందువంద్దై యుండుకంటె
తటుకునఁ దెగువైన తలపోఁతే మేలు" 24-98

చిటుక : వి. 'చిటికె'కు రూపాం. చూ : చిటికె.
"మెలుపున వద్దనుండి మేను విసుకనేరుచు
తిలకించి చిటుకలు దియ్యనేరుచు" 18-176

చిటుకురను : క్రి.విణ. చిటుక్కని మోగు.
"విటతనముల వాని నే మారుఁ గొసరరాదు
చిటుకురంటే సేవ సేయవలెఁ గాని" 23-182

చిట్టంటుఁజెమట : వి. నఖదంతక్షతాది విలాసచేష్టల వల్ల కలిగే చెమట.
"చిట్టంటుఁజెమటలతో సిగ్గువడేవు నీవు
దట్టమైన పాయపు మదములా ఇది" 25-58

చిట్టంటుఁదనము : వి. నఖక్షతాది శృంగారచేష్టల లక్షణం.
"అట్టె నీవద్ద నుండిన యద్దము చూడుమంటేను
చిట్టంటుదనాల నీకు సిగ్గు లేమిటికి" 28-66

చిట్టంటుఁబులకలు : *వి; బహు.* శృంగారపుపులకలు.
"గుట్టుతోడ నిలుచుండి కొలువుసేసి యందాకా
చిట్టంటుఁబులకలను చిమ్మిరేఁగేవే" 28-462

చిట్టంటు : వి. శృంగారం.
"పుట్టినదే నగ్నత్వము బూతో బండో
యెరఁగము
చిట్టంట్ల వాచవులగు జీవుల మ్రింగెదము"
3-340

చిట్టంటుచేఁతలు : ప.బం; *వి; బహు.* నఖక్షతాది బాహ్యశృంగారచేష్టలు, హొయలు, విలాసచేష్టలు.
"జట్టిగొనెర నిన్ను జవరాలు
చిట్టంటుచేఁతల జెలఁగితివపుడు" 5-326

చిట్టంటులు: *వి; బహు.* చిలిపిచేష్టలు, నఖదంతాది క్షతములు.

"మొనసి చెలులతోడి ముసగసలు
చెనకుల కొనగోరి చిట్టంటులు" 28-526

చిట్టకపుకాంతలు: *వి; బహు.* శృంగారచేష్టలుగల కాంతలు, కపటంకల కాంతలు .

"పట్టలేక నీ వాడిన పంతము దప్పినాఁడంటే
చిట్టకపుకాంతలలో సిగ్గు గాదా నీకు" 14-370

చిట్టకము: (6) వి. 1. శృంగారచేష్ట 2. లీల 3. కపటం (శ.ర.) 4. పరిహాసం 5. మోసం 6. ఆట. రూపాం. చీటకము.

"చిట్టకాన కింకా నేమి సేయుమనేరే" 11-314

చిట్టకీఁడు: (చిట్టకము + ఈఁడు) పరిహాసమాడువాడు, కపటి, బూటకీడు.

"చిట్టకీనివలెఁ దాను చిన్న చేఁతలెల్లాఁ జేసీ
మెట్టు దెలియఁగవచ్చు నెఱఁగనే నేను" 23-470

చిట్టిబొట్టు: *వి; బహు.* చిన్నబొట్టు, ముత్తైదువలు అక్షతలు మొ॥ వాటితో ధరించే బొట్టు, దృష్టి దోషపరిహారంకోసం ధరించే చిన్న బొట్టు . (వ్యు.)

"చెదరు గందమునకు చిట్టిబొట్లు నోమె" 5-127

చిట్లు: (చిట్టి + లు) వి. చిన్న కొలపాత్రలు, గిద్దెలు.

"జిగి నుప్పమ్మాఁగొందరు చిట్లు
మోయఁగొందరు
నగు నీతో సరసమరగదు మాకును" 14-429

చిడిపి: *విశ.* అల్పము, క్షుద్రము.

"చిడిపిరాయి చింతామణి చేయు" 2-282

చిడిపిరాయి చింతామణి చేయు: *ప.బం.* మామూలు వస్తువును ఒక విలువైన వస్తువుగా చేయు. చిన్న మామూలు రాయిని విలువైన చింతామణిగా చేయు అని వాచ్యార్థం. 2-182

చిడియు: *అ.క్రి.* కందు, చిరాకుపడు .

"బడి విభీషణునిఁ జేవట్టితే రక్కసులెల్లా
విడిసి మల్లెవట్టిరి శ్రీవెంకటరామా" 4-281

చిడుక్కని: అల్పధ్వనికి అనుకరణం .

"పలుమారు వుట్లపండుగను,
చిలుకు చిడుక్కని చిందఁగను" 5-57

చిడుముడి: వి. 'చిడిముడి'కి వ్యావహారికరూపం, తొట్రుపాటు, చీకాకు, కోపం, ఈర్ష్య, సంభ్రమం, వ్యాకులత, తొందర.

"నడుమ శ్రీవేంకటేశ నన్నేలితి విపుడట్టె
చిడుముడిఁ గదిమితే సిగ్గుపడేవు" 18-323

చిడుముడివడు: *అ.క్రి.* కోపపడు, తొందరపడు, తొట్రుపడు, నిరాసక్తంగా ఉండు, కలతచెందు, చీకాకుపడు, భయపడు.

"అదరి శ్రీవేంకటేశుఁడట్టె నిన్నుఁగూడఁగాను
చిడుముడివడి నవ్వఁ జెల్లునే నీకు" 14-286

చితుకెక్కు: *అ.క్రి.* తొక్కుడుపడు, నలుగు, పగులు.

"వొప్పుగ మేనులు వొరయఁగ మీకును
చిప్పిలుఁజెమటల చితుకెక్కె" 11-12

చిత్తడి: వి. 1. మిక్కిలి తడి 2. చిత్తకార్తె వాన.

"తమ్ములపు రసము చిత్తడిగాఁ గురియుచు
చిమ్మిరేఁగ రాగము నించితివిగా నీవు" 5-116

చిత్తడిచెమట: వి. మిక్కిలి చెమట.

"చిత్తరుపటము చూచి చెలి లోలో దలపోఁచి
చిత్తడిచెమటతోడ సిగ్గువడెను" 7-398

చిత్తణి: (2) వి. 'చిత్తిని' అనే స్త్రీ జాతికి చెందిన స్త్రీ. స్త్రీజాతి భేదం.

"సెలవుల నవ్వితేను చిత్తిణి ఇదెనునో
సొలసి పాదా లొత్తితే జాలురెనునో" 23-9

"యెక్కువతోఁ దిరువేంకటేశుండ నిన్నుఁగూడి
చెక్కునొక్కి కౌగిలించె చిత్తణి యెవ్వతెరా" 6-42

చిత్తము చిల్లులగు: *ప.బం; అ.క్రి.* మనస్సు కకావికలగు.

చిత్తము చిల్లులువోవు: *ప.బం; అ.క్రి.* మనసు వికలమగు.

"చేరి మాటలాడఁగానే చిల్లులువోయఁ జిత్తము"
23-410

చిత్తము వచ్చినట్టు: మనస్సుకు తోచినట్లు, ఇష్టంవచ్చిన రీతిగా.

"సేయవయ్యా నీవు నీ చిత్తము వచ్చినట్లలాను
యీయెడ నీ మతకము లెట్టు గాఁగలదా" 8-32

చిత్తమువచ్చు: (2) అ.క్రి. ఇష్టమగు, ఇష్టపడు.
"చిత్తము వచ్చినపుడు చేకొని మన్నించనీ
తత్తరము తనమీఁదఁ దరవువెట్టితిని" 16-220

చిత్తరి: వి. వర్షాకాలం, (సూ.ని.) చిత్తడి.
"చనవు నీ వొసఁగఁగా జంకించితే నేమి
తని వంది రతులు చిత్తరిఁ జేయరాదా" 27-484

చిత్తరుపటము: (2) వి. చిత్రపటం, బొమ్మ గీసిన పటం.
"చిత్తములోని రూపు చిత్తరుపటాన వ్రాసి
హత్తి కాఁగిలించుకొను నంగన నిన్ను" 16-284

చిత్తరుపతిమ: (3) వి. చిత్రపటంలోని బొమ్మ.
"చిత్తరుపతిమవంటి చెలికిఁ బ్రాణము వచ్చె
హత్తి నీవు చేచేత నంటఁగాను" 16-335

చిత్తరువాఁతపటము: వి. చిత్రంలో రాసిన పటం, వ్రాతలో రేఫం లోపించింది. ప్రాత, క్రొత్త శబ్దాల్లోలాగా రేకులు వ్రాయబడిన కాలంలో రేఫ లోపించిన 'వాత' వాడుకలో ఉండి ఉంటుంది.
"చెలి నీ యింటఁ బెట్టిన చిత్తరువాత పటము
కొలఁదితో నాపె మునిగోడ నున్నది" 14-466

చిత్తరువ్రాత: వి. నిశ్చలంగా ఉండేది.
"అందీనందని బొందులు ఆమనికాలపుఁ బొల్ల
చెందియుండని రతి చిత్తరువ్రాఁత" 17-187

చిత్తశాంతము: వి. చిత్తశాంతి.
"చీకాకుపడిన చిత్తశాంతము సేయ
లేక కానీవు బహులీల నన్ను, కాకునేసెదవు"
1-24

చిత్తాఇత్తము: వి. చిత్తాయత్తము, చిత్తమునకు అధీనం.
"ఎట్టు దలఁచినాఁ జిత్తాఇత్తమై వున్నాఁడవు"
3-524

చిత్తానఁబెట్టు: ప.బం; స.క్రి. మనస్సులో ఉంచు.
"చిత్తానఁబెట్టకుమీ మాట శ్రీరమణ మరవకు"
2-337

చిత్తారు: వి. 'చిత్తరువు'కు వ్యావహారికరూపం.
"గోడలేని పెద్దకోరిక చిత్తారు
వాడుచు లోలోనె వ్రాసేఁ దరుణి" 5-204

చిత్తాహరి: వి. చిత్తమందున్న హరి (?), చిత్తహరి సాధురూపం, గాన సందర్భంలో అకారం దీర్ఘమై ఉంటుంది.
"చిత్తాహరి నా దిక్కు చేకొని యవలోకించవే
యిత్తల సంసారవార్ధి యీఁదుచున్నాఁడ" 2-106

చిత్తిణిది: (చిత్తిణి + అది) వి. చిత్తిని జాతికి చెందిన స్త్రీ.
"చిత్తిణిది యని కాకుసేయవా నీవు" 13-444

చిత్తిణివాఁడు: వి. ఐంద్రజాలికుడు, మోసగాడు.
"చిత్తిణివాఁడనకురే శ్రీవేంకటేశుఁడు
యెత్తుక యీరేడు లోకా లేలీని బిడ్డఁడు" 5-218
"చెప్పనా నే నప్పుడే చిత్తిణివాఁ డితఁడని
చిప్పిల నెందో పొందుసేసి వచ్చెను" 13-3

చిత్తిణివిద్యలు: వి; బహు. ఇంద్రజాల విద్యలు, మాయ విద్యలు, మోసపు విద్యలు.
"చిత్తిణివిద్యల నేల చిమిడేవే" 18-174
"చిత్తిణివిద్యలు మానఁజెప్పరమ్మ శిర
సెత్తి యెవ్వరిని జూడఁడెటువంటి వలపో"
6-125

చిత్రగుప్తుని లెక్కలు: ప.బం; వి; బహు. ఒకపట్టున తేలని లెక్కలు, తప్పుడు లెక్కలు.
"యెడరై నీ మంత్ర జపమెంచుకొన్నయపుడే
కడుఁ జిత్రగుప్తుని లెక్కలు గడచె" 3-12

చిత్రపలక: (2) వి. చిత్రఫలకం, చిత్రాలు గీసే పలక.
"పొద్దువోక నీ రూపు పూఁచి చిత్రపలకపై
కొద్దిమీర వ్రాసి పరాకున నుండఁగా" 27-109

చిత్రపుపటము: వి. చిత్రపటం, బొమ్మ గీసిన పటం.
"చెంది తన రూపు వ్రాసిన చిత్రపు పటము
కందువగా నీవు లెస్స కనుఁగొంటివా" 28-263

చిని: చిన్న.

"చెనకి దశముఖుని చేతులుఁ దలలును
చినకండలు గోసిన యతఁడు" 4 అను 40

చినికండలు : *వి; బహు.* చిన్నముక్కలు.
"చెనకి దశముఖుని చేతులు దలలును
చిని కండలు గోసిన యతఁడు" 4 అను 40

చినుకు లేని చిత్తడి : *ప.బం; వి.* అసంభవం. చినుకు లేని వర్షాకాలం ఉండదుకదా!
"తనిసితి నుండ నీవే తన వలసినయట్టు
చినుకు లేని చిత్తడి సిగ్గు లేలే యిఁకను" 19-393

చినుమయము : *వి.* చిన్మయము ; 'న్మ'లో నకారమకారాలకు మధ్యలో అకారాగమం.
"చినుమయపు బ్రహ్మము చిక్కించి మాయ గప్పితే
ననుపమపరిశుద్ధ మనఁగనేలా" 15-290

చిన్నఁబోయ : *అ.క్రి.* చిన్నబోయెను ; పోయెన్ మొ॥ భూతకాలిక - ఏకవచనరూపాలను అన్నమయ్య ఎక్కువగా 'పోయ' ఇత్యాదిగానే వాడినాడు. కళావిహీనమగు, అవమానంతో మొకం చిన్న చేసుకొను.
"లలిఁగొప్ప గొప్పగాని లాచి మోము చిన్నఁబోయ
బలిమి చూపఁగ నీతోఁ బంతకత్తెనా" 11-118

చిన్నపడు : *అ.క్రి.* చిన్నబోవు (?)
"సగము సాయనంపి సడిఁబెట్టి విడిశిన
బగిడికాఁడు సిన్నపడునటె వీఁడు" 5-378

చిన్నెక : *వి; బహు.* చిన్నక్క (?)
"శ్రీవేంకటేశ్వర జిగి నీ మహిమలు
సేవించగలరా చిన్నెకలు" 13-78

చిబికివేయు : (?)
"చిబికివేసిన గింజ చేతఁబట్టఁగ నేల
గబుక కెంగిలిబూరె గడుగఁగ మరియేల" 2-494

చిమడఁబెట్టు : *స.క్రి.* ఉడికించు, కలతపెట్టు.
"చింతచే నీ మనసు చిమడఁబెట్టేవు" 5-203

చిమిడించు : *స.క్రి.* బాధించు, బాగా ఉడికించు, వేడెక్కించు, కాల్చు.
"చెమటవుట్టఁ జెనకి సిగ్గున నున్నాఁడవు
చిమిడింతురా మనసు చెలియకును" 7-401

చిముడు : *అ.క్రి.* అమితంగా ఉడుకు, అమితంగా ఉడికి ముద్దగు, చెడు, పాకం చెడు, కాలు, తప్తమగు, బాధపడు, చితికిపోవు.
"చెనకి నే మాటాడితే చిమిడీ వలపులు" 14-41
"చెదరని వలపులు చిమిడితేఁ గొర యౌనా
పదను దప్పకుండాను పాలింతువు గాక" 8-17

చిమ్మనఁగోవి : *వి.* చిమ్మనగ్రోవి, జలక్రీడయందు నీళ్ళు చిమ్మెడి గొట్టము, శృంగము.
"చిమ్మనఁగోవులఁ జిమ్మి చేతఁ జూప బాగాలు
పమ్మి పచ్చడము కొంగుపట్టవోయి" 29-24

చిమ్మనగోవాటలు : (చిమ్మనగోవి + ఆటలు) *వి; బహు.* చిమ్మనగోవితో ఆడే ఆటలు.
"చిలుపచెమట లెల్లా చిమ్మనగోవాట లాయె" 23-573

చిమ్మిరేఁగు : *అ.క్రి.* మిక్కిలి విజృంభించు.
"విన్నపములిఁక నేల వేడుకో నేల
చిన్ననాటి సిగ్గు లెల్ల చిమ్మిరేఁగె నిఁకను" 11-62

చిమ్మిరేఁచు : (3) *ప.బం; అ.క్రి.* చెలరేఁగునట్లు చేయు, విజృంభింపజేయు మొ॥ భావచ్ఛాయల్లో ప్రయోగింపబడే పదబంధం.
"మోవరాని మోపయి ములుగనియ్యదు మమ్మి
చేవ సంసారముపైఁ జిమ్మిరేఁచీని" 3-352

చిమ్మిలిబొమ్మ : *వి.* నువ్వుపప్పు, బెల్లమును కలిపి దంచిన ముద్దతో చేసిన బొమ్మ.
"కావరాన నీవు గూడి కౌఁగిటనే పిసికేవు
శ్రీవేంకటేశుఁడు చిమ్మిలిబొమ్మ" 7-97

చిమ్ముఁగాగిలి : *వి.* (చిమ్ము = మీటు, ఆడించు, విక్షేపించు)
"తమ్మితూఁడులను తను బిగిసితిఁబో
చిమ్ముఁగాఁగిలని చెలఁగీని" 20-258

చిమ్ముఁజీకటి : *వి.* చిమ్మచీకటికి రూపాం. దట్టమైన చీకటి.

"ముమ్మాటికి నీ బాసలే నమ్మి వున్నదాన నేను
కుమ్మరించరా నీ కరుణ వేంకటేశ,
చిమ్ముఁజీకటెల్లఁ బాయను" 7-223

చిమ్ములఁగొలువువారు : వి; బహు. ఊడిచే కొలువు చేసేవారు.
"చిమ్ములఁగొలువువారు సిగ్గున లోని కేగిరి" 9-278

చిమ్ముల సేవ : వి. సమ్మార్జనం చేసే సేవ, తుడిచే సేవ.
"నెమ్మది శ్రీవేంకటేశ నీవు గూడితివిగ నన్ను
చిమ్ముల నీసేవ నాచేఁ జేయించుకోవయ్యా" 11-396

చియ్యను : (ఛీ + అను) ప.బం; అ.క్రి. 'ఛీ' అను, అసహ్యించుకొను.
"నెయ్యపుహేయము నిచ్చలుఁ గడిగెద
చియ్యని రోయను సిగ్గూఁబడను" 2-283

చిరిఁజెమటలు : వి. 'చిఱుఁజెమటలు' అనే దానికి వికృతిరూపం.
"చిరిఁజెమటలతోడి శ్రీవేంటేశుఁడ నేను
మెరసె నీ నా పొందు మితిమీరి యిపుడు" 28-58

చిఱుతవాఁడు : వి. బాలుఁడు, చిఱుతప్రాయపు వాడు.
"చిఱుతవాఁడవై నీవు చీరలు దొంగిలుకొని
కొఱతలు మాన్పితివి గోవిందరాజ" 18-516

చిలిమి : వి. ఇది 'చలిమి' అయి ఉంటుంది. యతి స్థానం దీనికి సమర్థకం, చలిమి చెలిమికి వ్యావహారికం కావచ్చు. స్నేహం.
"చలిమి బలిమి సాదించీనా
యెలమి నిన్నాళ్లదాఁకా నెందుండై తాను" 26-41

చిలుకకువలె బుద్ధిచెప్పు : ప.బం; అ.క్రి. మిక్కిలి గారాబముతో నీతి బోధించు.
"చిలుకకువలె బుద్ధిచెప్పినఁగానలేక
పలుమారుకే తోఁజుఁ బాడేవుగా" 1-350

చిలుకచదువు : ప.బం; వి. అర్థం తెలియని చదువు.
"తెలిపే గురుఁడుండఁగ తెలియగనేరవు
చిలుకచదువు లేలో జీవుఁడా" 10-1-14

చిలుకపదాలు : వి; బహు. భగవంతుడు చిలుక రూపంలో ప్రత్యక్షమై రామాయణ మహాభారతాలను గానం చేసినాడనీ, మళయాళకవి యళుత్తచ్చన్ ఆదివృద్ధి పద్ధతిలోనే వ్రాసినాడని అంటారు. 'చిలుక' శబ్దానికింత ప్రాధాన్యం ఉండడం వల్ల 'చిలుకా' అనే సంబోధనతో పదకవులు పదాలను రచించినారు. వీటినే చిలుకపదాలని అంటారు. ఉదా :-
"జీవాతుమై యుండు చిలుకా – నీ
వావలికి పరమాత్ముఁడై యుండు చిలుకా" 1-50
తమిళంలో ఈ పదాలను 'కిళిపాట్టు' అంటారు.

చిలుకపలుకులది : వి. చిలుకవలె మనోహరమైన పలుకులు గల స్త్రీ.
"అలివేణి జవరాలు అన్నిటానుఁ జక్కనిది
చిలుకపలుకులదీ చెలియ" 28-363

చిలుకపలుకులు : ప.బం; వి; బహు. చిలుకపలుకుల వంటి మనోజ్ఞమైన మాటలు, విన్నమాటలు, స్వఆలోచనా రహితములైన మాటలు, అర్థజ్ఞానం లేని మాటలు.
"పడతి నోరఁ జిలుకపలుకులు వెడరేఁగె
తడవి కొప్పునఁ దుమ్మిదలు మూఁగెను" 28-249

చిలుకలకొలికి : (3) ప.బం; వి. చిలుక కంఠంవంటి మధురకంఠం కల స్త్రీ, సుందరి. (కొలికి = కంఠం)
"చిలుకలకొలికీ సిగ్గులు వడనేటికే
పలుకఁగదవే నీ పతితోను" 7-114

చిలుకలతెర : వి; ప.బం. చిలుకబొమ్మలు గల తెర.
"చిలుకల తెర యేల చేరి కట్టించె నడుమఁ
జిలుకలు వాత రొట్లు (?) చిమ్మిరేఁచును" 14-214

చిలుకవోటు : వి. చిలుకగాటు.
"పలుమారు వనములోఁ బాయక వుండఁగానో
చిలుకవోట్లు మోవిఁ జెలరేఁగెను" 12-414
"మొలకనవ్వు నవ్వుచున్న ముదిత ముద్దుమోవి
చిలుకవోటు చూచి సన్నసేయ నెట్లు వచ్చురా"
5-136

చిలుకు : వి. బాణం, బాణాగ్రం.
"చలివాసి నీ సుద్దులు సకులతోఁ జెప్పఁగాను
చిలుకునఁ బయ్యదఁ దీసే విదేమయ్యా"
12-494

చిలుకుఁజూపులది : వి. బాణాగ్రాల్లాంటి వాడిచూపులు గల స్త్రీ.
"చిలుకుఁజూపులదాన సిగ్గరితనాలదాన
పలుమారు నెంత వొడఁబరచేవయ్యా" 29-476

చిలుకుఁదేరు : అ.క్రి. (?)
"చిలుకుఁదేరెను మోవిఁ జిందీ ననుచు నీవు
పలుకవదేమే పతితోను" 27-176

చిలుకుగాలము : వి. కొలికి గల గాలం.
"నలినాక్షిరూపు మనసునఁ దలఁచఁబోతే
చిలుకుగాలమై తోఁచెను మరుఁడు" 18-157

చిలుకుగుబ్బలి : వి. మందరపర్వతం.
"వెల లేని వేదములు వెదకి తెచ్చిన చేయి
చిలుకు గుబ్బలికిందఁ జేర్చు చేయి" 1-334

చిలుకుగోరు : బాణాగ్రంవలె వాడియైన గోరు.
"చిలుకుగోళ్ల నన్నుఁ జెనకుచు నీ పజ్జ నా
నలు వెట్ట వచ్చేవు నారసింహుఁడా" 10-218

చిలుపాలు : వి. చిఱువాలు, బాగా మీగడ గట్టునట్లు ఇగురఁ గాచినపాలు అనవచ్చు.(సం.ప.స.) చణ్వాలి, చీళ్వాలు, శిరుపాల అని తమిళం. జున్ను అని తెలుగు.
16-77
"జిడ్డు గాకుండ చిలుపాలుఁ దేనె
తెడ్లతోఁ దినీ దేవి దేవి" 23-331

చిల్లర : వి. 1. చెడ్డపని. (2. సత్రకాయబాపతు 3. చింతపండు, మిరపకాయ మొ॥ సరకు 4. చిలుకు)
"పల్లదమాడితినటె పైఁడివంటి మాటనైన
చిల్లరే మానఁడాయ శ్రీవేంకటేశ్వరుఁడు"
25-478

చిల్లరచెమట : వి. చిరుచెమట.
"చిల్లరచెమటతోడ చిక్కని వూర్పులతోడ
గొల్లలెక్కలాడేవు కోపమేఁటికే" 9-117

చిల్లరపని : వి. 1. వ్యభిచారం 2. చిన్నచిన్నపని.

చిల్లరమనుజులు : వి; బహు. అల్పులైన మనుష్యులు.
"దేవుఁడు గారణము తెలిసినవారికెల్లా
జీవుఁడు గారణము చిల్లరమనుజులకు" 1-470

చిల్లాపొల్లు : వి. చిందరవందర.
"చిల్లాపొల్లాయ నీ మెయి జెమట ముత్తెములెల్ల
పెల్లురేఁగి నీవె చక్కఁబెట్టుకొనరాదా" 17-158

చిల్లుకడవలో దీపము : ప.బం; వి. చంచలం.

చిల్లున : క్రి.విఠ. చిమ్ముట మొ॥ వానియందు ప్రయోగించే అనుకరణశబ్దం.
"వెడలెఁజిల్లున వాని వేఁడి నెత్తురు నింగికి
పొడివొడి యాయ శత్రుభూషణము లెల్లను"
4-513

చిల్లుల కడవలోపలి దీపము : ప.బం; వి. అస్థిరం, నిలుకడ లేనిది.
"తెలియఁజిల్లుల కడవలోపలి దీపమువలెనే
అలరి వెలిఁగిడి చూడఁజూడఁగ హరిప్రపంచపు
మాయ" 4-115

చిల్లో యంటే పొల్లో యను : ప.బం; అ.క్రి. ఒకటి అంటే దానికి బదులుగా మరొకటి అను.
"చిల్లో యంటే పొల్లో యని సిగ్గు విడిచినవాఁడు"
11-235
"పోపో చిల్లో యంటె పొల్లో యనేవు
యీపాటిదానవేట యెఱుగమే నిన్ను" 17-49

చివచివ : అవ్య. తొందరగా.
"చివచివ నీటికడవలోని నీరై

కవకవ నవియుచుఁ గారీని" 1-124

చివన: క్రి.విశ. 'చివ్వన'కు రూపాం.శీఘ్రంగా.

"జవళిఁగెమ్మోవులు సన్నలఁ జూపుకొంటాను

చివన నిందిర నంటె శ్రీ నరసింహుఁడు " 4-511

చివ్వన: (2) విశ. శీఘ్రంగా, తొందరగా.

"చివ్వన నాతఁడు నిన్నుఁ జేయివట్టి తీసితేను

రవ్వగా నేల చెప్పేవే రమణులతో" 14-546

చిహ్న: వి. చిహ్నము, 'ము' విభక్తి లేని రూపం. ఈ రూపం శివకవుల్లో సాధారణం.

"జిగి నిన్నుఁగూడెనటె శ్రీవేంకటేశుఁడు

నిగిడి రతిచిహ్నాలు నిలువెల్లా నిండెను" 28-39

చీ

చీఁకటి ఏరై పారు: ప.బం. చీకటి దట్టంగా వ్యాపించు.

చీఁకటికూబ: వి. చీకటిగూబ, చీకట్లో తిరిగే గుడ్లగూబ.

"చీఁకటి బెడబాపేటి చేరువ సూర్యోదయము

చీఁకటికూబలకైతే చిమ్మి రేఁచును" 15-136

చీఁకటిగొను: అ.క్రి. చీకటిపడు. 'చీకట్లుగొను' అని కళా. ప్రయోగం. 4-89

"తలఁపే చీఁకటిగొంటే తగ దన నెట్టు వచ్చు"
28-580

చీఁకటితప్పు: (14) ప.బం; వి. వ్యభిచారం, జారత్వం.

"చేరి గొల్లెతలు నీతో చీఁకటితప్పు సేసితే

ఆరితేరి నవ్వితివి అది దగవా" 11-39

"పుడికి సతిఁ గైకొంటి పురుషోత్తమా

పొడమెఁ జీకటితప్పు పురుషోత్తమా" 2-283

చీఁకటిదవ్వు: (6) ప.బం; అ.క్రి. వ్యర్థప్రయత్నం చేయు. అంధకారంలో కొట్టుమిట్టాడు. చీకటిలో వెదకడం వ్యర్థప్రయత్నమే కదా!

"జీవులు నిన్నెఱుంగక చీఁకటిదవ్వఁగ నేల

శ్రీవెంకటేశ్వర నిన్ను సేవించేదే నేరుపు" 6-53

వ్యర్థాలోచనలు చేయు:

"చీకటి ద్రవ్వెద వేలె?

చీంకి నశ్రులుక వదేలె" 6-53

"కడలేని యాస చీకటి ద్రవ్వుకొనుట"

"కలకాలము చీకటిద్రవ్వుకొనెడి

వలల భ్రమల నెవ్వరు పడరిట్లా" 1-260

"చీకటి ద్రవ్వమగ నిధానమబ్బె" 5-118

"కడు మమతవలన చీకటి దవ్వఁగలిగె" 1-129

చీఁకటిదొడ్డి: వి. వెలుతురు లేని దొడ్డి.

"కలసిన కాఁగిలి కామశాస్త్రపుదొడ్డి

చెలఁగే పరవశము చీకటి దొడ్డి" 16-69

చీఁకటి ద్రవ్వు: (3) ప.బం; అ.క్రి. వ్యర్థప్రయత్నం చేయు, నేరాలు వెదకు (తె.వ్యు.కో.), వ్యర్థాలోచనలు చేయు.

"కలకాలము చీఁకటి ద్రవ్వుకొనెడి

వలలభ్రమల నెవ్వరు వడరిట్లా" 1-260

"చీఁకటి ద్రవ్వెదవేలే చీటినఁ బలుక వదేలే"

4-53 old

చీఁకటిపడు: ప.బం; అ.క్రి. చీకటియగు.

"విడువవు భవముల వెంటవెంటనే

చిడుముడిఁ జిత్తము చీఁకటిపడెను" 3-50

చీఁకటిపాలగు: ప.బం; అ.క్రి. వ్యర్థమగు, పాడగు.

"చిందరాని నా బుద్ధి చీఁకటిపాలాయె" 3-50

చీఁకటిపొద్దు: వి. చీఁకటి సమయం.

"నీ నెలవెఱఁగక నెమకిరొ తాము

తోనే చీఁకటిపొద్దున వచ్చితి" 16-290

చీఁకటిభూతము: వి. నల్లని రూపంగల భూతం. తామస ప్రవృత్తిగల వరాహమని భావం. హిరణ్యాక్షుణ్ణి సంహరించడానికై భగవంతుడు వరాహావతారాన్ని ధరించినాడు.

"కనలి కవియు చీఁకటిభూతము" 1-109

చీఁకటిమాను: వి. తమాలవృక్షం.

"సొలసి చీఁకటిమాను చుక్కలతో మాటాడఁగా

ఏల మెరుఁగుఁజంద్రుఁడు వెన్నెల గాసె" 7-435

చీఁకటివడు: ప.బం; అ.క్రి. నిస్తేజమగు, శూన్యమగు, సాయంత్రమగు.

"విడువవు భవములు వెంటవెంటనే
చిడుముడిఁ జిత్తము చీకటి వడెను" 3-50

చీఁగు : (?)
"చీఁగక కూడితి నన్ను వేగమె శ్రీవేంకటేశ
తోఁగి సేసవెట్టితేనే తోదోపు లేలరా" 20-46

చీకటితురుముది : (చీకటితురుము + అది) వి. చీకటివలె నల్లనైన కొప్పు గల స్త్రీ.
"చీకటితురుముదాన చేరకు నన్ను
చీకటి నల్లనిమేని చెలువుఁడను" 5-350

చీకటిని దవ్వుకొనుట : *ప.బం; వి.* ఎప్పటికీ పూర్తికాని శ్రమ.
"ఎడతెగని మమత వేయఁగరాని పెనుమోపు
కడ లేని యాస చీకటి దవ్వుకొనుట"

చీకురువాయి : వి. గబ్బిలం, చీకురాయి, ఇలకోడి, చిమ్మట.
"సాకిరి వయసు సంసారము గోరు
చీకురువాయులు జాతిమాను గోరు" 4-102

చీటకపు చెంచెత : వి. (?) శృంగారలీల గల చెంచెత, కపటురాలైన చెంచెత. (చిట్టకము యొక్క రూపాంతరం చీటకము)

చీటకపు చెమట : వి. శృంగారలీలకు సంబంధించిన చెమట.
"చీటకపుచెమటలు చిట్లు గందాలట
మేటి దొరఁ బిలువరే మెరసేనటా" 11-183

చీటి : వి. చిట్టీ అనే హిందీ పదానికి వికృతి.
"మాటలెన్నిలేవు నీవు మంతనాన నాడేవి
చీటు లెన్ని లేవు నీవు వ్రాసి చేతికిచ్చేవి"
23-353

చీటికిమాటికి : (21) ప.బం. మాటిమాటికి, ప్రతిచిన్నదానికి, అల్పవిషయాలకు.
"చీటికి మాటికిఁ జెనకేవే వట్టి
బూటకాలు మాని పోవే బావ" 5-163

చీమంత : (చీమ + అంత) *ప.బం; విణ.* కొద్దిపాటి.
"చీమంత మాటైన చెవిలో నీకు బోధించు
కోమలి నీ కిన్నాళ్ళకు గురుతాయఁగా" 11-482

చీమకదొంతర : వి. చీమలబారు, (ఇట ఇది నూగారుకు ప్రతీకగా చెప్పబడింది) చీమలదొంతర?
"చీమక దొంతరకొన సింహపుఁగొదమ వాలె
యేమని పొగడవచ్చు నింతి సింగారములు"
26-363

చీమ దుమ్ము : (?)
"మోసపోతి ననేల మురుగవగవనేల
చేసుఁగాక పుణ్యాలు చీమ దుమ్మెనా" 4-50
అను.

చీమలు మై వాకినట్లు : నానుడి; మిక్కిలి బాధను, చీదరను కలిగించినట్లు.
"చీమలు మై వాకినట్టు చిమ్మిరేఁగె వలపు"
5-324

చీరకొంగు మాయు : *ప.బం; అ.క్రి.* ముట్టగు.
"మూసేవే గుబ్బలఁ గొంగు మురిపెంపుగొల్లెతా
మాసినది చీరకొంగు మందకేఁగనియ్యరా" 5-72

చీర చిక్కు : (2) *ప.బం; అ.క్రి.* గర్భం ధరించు, నెలలు నిండినకొద్దీ కడుపు పెరుగడం వల్ల చీర తక్కువపడడం అనే దానిమీద వచ్చిన పలుకుబడి.
"యిందరితో నీ మాఁట యేమని చెప్పుదునమ్మ
చెంది యీ క్రిష్ణుఁడు చీరచిక్కించెను" 11-258

చీరికిఁగైకొను : *ప.బం; స.క్రి.* లక్ష్యపెట్టు.
"కలుషరౌద్రదుఃఖముల కించుకా
కలఁగను చీరికిఁగైకొను" 2-181

చీరుమూరగు : *అ.క్రి.* చిందరవందరయగు.
"సారె సారెఁ జెలరేఁగి సరసము లాడఁగానో
చీరుమూరై మేనెల్ల జీరలాయను" 18-135

చీరుమూరాడు : *ప.బం; అ.క్రి.* చిఱుముఱ్ఱాడు, చిందఅవందఅ చేయు, పెనగులాడు, చీల్చిచెండాడు.
"మూరెడుగొప్పుతోడి ముద్దరాలికి
చీరుమూరాడీ వలపు చిత్తగించవయ్యా"
24-404

"చేరువ సంతోషమబ్బె శ్రీధరా
చీరుమూరాడీ(?) దమి శ్రీధరా" 15-245

చీరుమూరుగా : *క్రి.విశే.* (చీఱుమూఱు = confusion తాఱుమాఱు. ill treatment) అని తమిళం. అడ్డమాకలు లేక అని ఛాయార్థం.
"చేరి విన్నవించవే సిగ్గువడ నీ కేఁటికి
చీరుమూరుగా వలచినదానవా" 18-31

చీలమండ : వి. కాలిమడమలకు రెండు ప్రక్కలా ఉండే కీలు, గుల్ఫం.
"చింతలు చెక్కులబంటి సిగ్గులు పెండొళ్లబంటి
మంతనాలన్నియుఁ జీలమండలబంటి" 23-536

చు

చుంగు : వి. రూపాం. చెంగు, అంచు, కచ్ఛభేదం, కుచ్చె.
"చుంగుల పించెపుగూడ చుట్టుఁబాగతోడ" 6-26

చుంచు : (?)
"ముంచినది విరహము మోచినది జవ్వనము
చుంచునఁ బతి నేమని సొలసేనే" 20-219
"ముంచిన నీ చెక్కులద్దముల మించులు
పంచమోవి చుంచులు బింబపుటంచులు"
13-155 old

చుంచు : పిల్లజుట్టు.
"మంచానకుఁ దియ్యకుమీ మరి తురుము చెదరి
చుంచుల మా యత్తవారు చొప్పు వట్టేరు"
26-169

చుంచుఁబాపము : వి. బలమైన పాపం.
"పొంచి సింగారపు భోగములుడిగిన
చుంచుఁబాపములు సుకృతములే" 1-371

చుంచుల కళ : వి. పిల్లజుట్టుల కళ.
"మంచి నీ కరములను మఱుఁవెట్టు కోకువే
చుంచుల నీ మెయికళలు చూపేదే మేలు"
12-493

చుంచుల చుట్టము : వి. చెంచువారి చుట్టము.
"చుంచుల నా చుట్టములో సూడుబంటవో నీవు
అంచల నన్నియు నాయ నప్పటి నంటకురా"
11-228

చుంచుల మోవి చవి : (?)
"పొంచి మరెవ్వతో నిన్నుఁ బొందుఁగా మాఁకునఁ జేసి
చుంచుల నీ మోవి చవి చూడఁబోలును" 7-275
"ముంచిన నీ చెక్కులద్దముల మించులు
పంచ మోవి చుంచులు బింబపుటంచులు"
7-155

చుంచులహరి : 1. చెంచువారి హరి. పిల్లజుట్టుగల విష్ణుమూర్తి, బాలకృష్ణుడు.
"యెంచఁగ నేటికి యింద్రియ మహిమలు
చుంచుల హరి నీ సూత్రము లివియే" 4-264

చుక్కబొట్టు : (8) *ప.బం; వి.* చుక్కరూపంలో పెట్టుకునే బొట్టు.
"చుక్కబొట్టు పెట్టికొని సుదతి నీ పాదాలకు
మొక్కి యంటించెను తన ముద్రగాను" 12-427

చుక్కలరాజు : వి. చంద్రుడు, చుక్కలకు ప్రభువు.
"చూడమ్మ అల్లవాఁడే చుక్కలరాజు
వేడుకలు వెదజల్లే వెన్నెలరాశి" 27-549

చుక్కలరాయఁడు : వి. చంద్రుడు, నక్షత్రాలకు అధిపతి.
"చక్కని వదనమది సారెకు నీ వెత్తఁగాను
చుక్కలరాయఁని సూటి దరిగె" 17-300

చుక్కలలో చంద్రుఁడు : *ప.బం; వి.* ఎందరిలోనో ప్రధానుడు.
"నిక్కి దేవుళ్లు ముత్యాల నీపై సంతమాడంగా
చుక్కలలో చంద్రుఁడవై చూపట్టితివి" 7-169

చుక్కలు మోవఁబెరుగు : *ప.బం; అ.క్రి.* మిక్కిలి ఉన్నతంగా పెరుగు.
"చుక్కలు మోవఁ బెరిగి సూర్యుఁడు దా నైనాఁడు
చిక్కు బాతాళము దూరి శేషుఁడైనాఁడు" 4-167

చుక్కలు లెక్కించినట్టు: *ప.బం.* అసాధ్యమైన పనికి పూనినట్లు.

"చూడఁగ మా జన్మములు, చుక్కలు లెక్కించినట్టు
వుక్కనఁ గర్మములకు నొడిగట్టితిమి" 3-556

చుక్కలు లెక్కించినట్టు : *ప.బం.* అసాధ్యమైన పనికి పూనుకొన్నట్లు.

"చుక్కలు లెక్కించినట్టు చూడఁగ మా జన్మములు
వుక్కనఁ గర్మములకు నొడిగట్టితి(మి?)" 3-556

చుక్కలూరి చెన్నుఁడు: *వి.* కడపజిల్లా చుక్కలూరు గ్రామంలో నెలకొన్న చెన్నకేశవుడు.

"యిక్కువతోఁ గొలువు సేయించుకొంటా నున్నాఁడు
చుక్కలూరి చెన్నునిఁ జూడరమ్మ చెలులు" 29-2

చుక్కలెంచుకొను : *ప.బం; అ.క్రి.* అసాధ్యమైన పనికి పూనుకొను.

"దిమ్మరివిభునితో డీకొనే వాదు లేల
యిమ్ములఁ జుక్కలైనా నెంచుకొనేఁగాక" 7-247

చుట్టపుఁబగ: *ప.బం; వి.* జ్ఞాతివైరం. 5-199

చుట్టపువరుస: (19) *ప.బం; వి.* బంధుత్వం, చుట్టపురీతి.

"చుట్టపువరుస మిమ్ముఁజూచి నేరవలెను" 23-200

చుట్టపువిరోధము: *వి.* జ్ఞాతివైరం, పాలిపగ (?)

"ఎట్టుఁజేసినఁజేసె నేమి సేయఁగవచ్చు
చుట్టపువిరోధంబు సూనాస్త్రుచెలిమి" 1-104

చుట్టపుసూడుది: (చుట్టము + సూడు + అది) బంధుత్వం కల శత్రురాలు, జ్ఞాతివైరం కలది.

"వెట్ట చేతలాడినైనా వీఁకకుఁ దేవచ్చుఁగాని
చుట్టపుసూడుదానిఁ జొక్కించరాదు" 23-107

చుట్టము: *వి.* బంధువు అని సామాన్యార్థంలో ప్రయోగం. కానీ రాయలసీమలో చుట్టము, చుట్టమురాలు అనే పదాలకు ఉంచుకొన్నది, ఉంపుడుగత్తె అనే అర్థంలో వాడుక ఉన్నది.

బంధువు :

"నీవంటి చుట్టము నాకు నిండు నిధానము గాదా
పూవుల నీ పాదము పూజింతుగాక" 27-34

ఉంపుడుగత్తె :

పాయని చుట్టమువలె పక్కఁబండి యాతని
మాయలఁ బెట్టేవేమే మాటిమాటికి" 28-576

చుట్టరికపుఁదనము : (చుట్టము + ఱిక + తనము) *వి.* బంధుత్వం, చుట్టరిక శబ్దంపై స్వార్థంలో తన ప్రత్యయం.

"చుట్టరికపుఁదనాలు చూపులలో నవ్వులు
గుట్టునఁ జేకొంటివి కొంకనేలే నీకును" 24-361

చుట్టరికేలు : *వి; బహు.* 'చుట్టరికము' శబ్దానికి బహు.వ. రూపం.

"సుదతికి నీకును సూటుల చూపులవల్ల
కదిసెఁజుట్టరికేలు కతలేఁటికి" 19-188

చుట్టాలసురభి: *ప.బం; వి.* ఆదరణ చూపువాఁడు, బంధుప్రియుడు, చుట్టాలకు ఆశ్రయమైనవాడు, చుట్టాలకు కామధేనువు వంటివాడు.

"చుట్టాల సురభి తాను చొక్కులనేల పెట్టీనే
గుట్టుతోడ నా కాఁగిటఁ గూడుఁగాక" 29-326

"నీవూ నాపె చుట్టాలవుత నే నది యెఱఁగనా
యీవల నాముందర నీవెంత పచారించేవు" 28-514

చుట్టాలు పక్కాలు : *ప.బం; వి.* బంధువర్గం అనే అర్థంలో వాడబడే పలుకుబడి.

"అంచెలఁజుట్టాలు పక్కా లాడుకొనేరు" 26-169

చుట్టుఁగైదువ : *వి.* చక్రాయుధం, గుండ్రని ఆయుధమని వ్యు.

"వాఁడె శ్రీవేంకటేశుఁ డనేవాఁడె వీఁడు
వాఁడి చుట్టుఁగైదువ వల చేతివాఁడు" 1-121

చుద్దులు : *వి; బహు.* సుద్దులు, ముచ్చట్లు.

"చెయివట్టి చెయివట్టి చెలి చుద్దులు చెప్పఁగా

యేయడ పరాకు నీకు నేమయ్యా" 29-390

చుప్పనాతి: (6) వి. 'శూర్పణఖ'కు జానపదుల వ్యవహారం.

"చెలఁగి చుప్పనాతి గర్వమడఁచి
దైత్యసేనలఁ జంపిన రాఘవా" 1-392

చురచురన్: క్రి.విశ. కోపంతో.

"వెరగంది వున్నదాన విభునేమీ ననలేక
చురచురఁ బంతాలాడీ చోద్యమయ్యీనే" 25-20

చురుచూండ్లు: (చూండ్లు + చూండ్లు) వి; బహు. మిక్కిలి కాల్చుటలు.

"చూచిన మోహపుఁ జూపులఁ జురుచూండ్ల కెడమియ్యని
రాచటికపు నెరజాణఁడు రసికుండాతఁడె పో"

1-229

చుల్లరపుటాగడాలు: (చుల్లరము + ఆగడాలు) వి; బహు. హింసతో కూడిన ఆగడాలు, బాధతో కూడిన ఆగడాలు, దుడుకుతనంతో కూడిన ఆగడాలు.

"చుల్లరపుటాగడాలు చూపఁబోతే గంపనిండా
పెల్లు మాణికాలున్నవి బేలుపోయ మాఁటా"

26-156

చుల్లరవెట్టు: స.క్రి. బాధపెట్టు, హింసించు.

"చుల్లరవెట్టుఁజేతలఁ జొక్కనాథుఁడు
వుల్లముతో నీ నెలఁదలూరి చొక్కనాథుఁడు"

10-2-20

చుల్లరి: విశ. బాధించు నట్టి, కఠినమైన, దుడుకుతనం కల.

"పల్లదపు రుద్రుఁడును బాణుని వాకిలిదొక్కి
చుల్లరి రాక్షసమూక సురసుర సుక్కె" 4-365

చుల్లరితనము: వి. దుడుకుతనం.

చుల్లరీఁడు: (చుల్లరము + ఈడు) వి. బాధించువాడు, హింసించువాడు.

"చుల్లరీఁడవై యెందైనా జొరఁబారేవు కెరలి
పల్లటీఁడవై పడుచుపనుల దిరిగేవు" 13-170

చువ్వన: క్రి.విశ. శీఘ్రంగా, చివ్వన.

"యెవ్వతె కస్తూరిబొట్టో ఇదె నీ నొసలనంటె
చువ్వన నద్దములోన చూచుకోవయ్యా"

21-239

చూ

చూడు: స.క్రి. దహించు, కాల్చు.

"ఒప్పుదువో యింక కొరవులంజూడేవు నా
కొప్పు లెఱుంగవు యింక నొగిలించే వేలరా" 6-8

చూపఁజెప్పఁగలుగు: ప.బం; అ.క్రి. మాటకూ, కంటికీ గోచరుడగు.

"చూపఁజెప్పఁగల భక్తసుజనుఁడవు మాకు"

2-60

చూపరి: వి. ఈ పదం చూచేవాఁడు, చూడబడేవాడు, చూడదగ్గవాడు మొ॥ అర్థాల్లో ప్రసిద్ధం. కాని ఇక్కడ ప్రకరణాన్ని బట్టి 'చూరగా రాలే పొడి' అనే అర్థంగా కానవస్తుందని సం.ప.స. (21 సం, 387 పు.)

చూపుడుఁబూట: ప.బం; వి. పూటకాపు, పూటపడిన వాఁడు, ఒకరికి బదులుగా మరొకరిని పూటవెట్టి అప్పు తీసుకోవడం అలవాటు. అవసరమైనపుడు ఋణగ్రస్తుణ్ని చూపించడానికి అచ్చుకొన్నవాడు, ఆ ఋణగ్రస్తుడు పాటిపోయి కనబడనిచో వాడీయవలసిన సొమ్ము తానే యివ్వడానికి పూచీ పడినవాడు, ప్రతిభువు, జామీను ఉన్నవాడు. (ఆం.శ.ర.)

"కోపుల రాజులనెల్ల కొలిచి కొన్నాళ్లు మేను
చూపుడుఁబూటవెట్టి సొగిసి నేను" 4-142

చూపులకొనలు: వి; బహు. అపాంగములు.

"చూపుల కొనలనుండు చొక్కులమాకుమ
తీపుల మోవిపైఁ గారు తేనియలు" 28-555

చూమరలు: వి; బహు. (?)

"కాముని యమ్ములకు చక్కని గుటి నీ వని
చూమరల నిందరికీఁ జూపి చెప్పినట్లు" 17-159

చూమరసేయు: (చూమర + చేయు) అరమరసేయు.

"ఏమి సేసితివో చెలి ఇంత నీకు మోహించె

చూమరసేయక ఇంతిఁజూతువు రావయ్యా"
27-595

చూర(ఱ)కాఁడు : వి. కొల్లకాడు.
"గక్కన శ్రీవేంకటాద్రిఘనుఁడు కౌగిటను
చొక్కులఁబెట్టెడి నిన్ను చూరకాఁడు కృష్ణుఁడు"
5-270

చూర(ఱ)గొను : దోచుకొను, కొల్లగొను.
"నీవు నిర్మించినవే నీకే సమర్పణ సేసి
సోవల నీ కృపయెల్లఁ జూరగొంటిమి" 3-49

చూరాడు : ప.బం; స.క్రి. చూరనాడు, కొల్లగొను. (వ్యర్థంచేయు)
"సుదతుల సిగ్గులు చూరాడి" 10-2-82

చూఱలుగొను : చూ: చూరగొను. 4-35

చె

చెంగు : అ.క్రి. పాము, తొలఁగు, చలించు, విసర్జించు, విడుచు.
"అంగన నీకు నేఁడు అప్పణ ఇయ్యఁగఁబోలు
చెంగక మాయింటికి విచ్చేసేవటే" 20-209
ఎగరడం మొ॥ వాటిలో అనుకరణం :
"కొంగువట్టి తీసినాను కూరిమిఁజేకొందుఁగాక
చెంగి చెంగి పానుపుపై సిగ్గువడఁగలవా" 17-67

చెంచలము : వి. చాంచల్యం, చంచలత్వం, ధర్మవాచకానికి బదులు ధర్మివాచక ప్రయోగం. 'చంచలము' కు బదులు 'చెంచలము' అని ప్రయోగించటం ఉచ్చారణానుసారి కావచ్చు. లేదా యతి మైత్రికోసం కూడా కావచ్చు.
"చంచలము లేటికిచ్చుటఁ జేతికి లోనైతే" 27-228
"మానదు కోపము మతి చెంచెలమును
కాని కర్మమిది కలదాఁకా" 4-449

చెంచెలుఁడు : వి. చంచలుఁడు.
"మట్టుపడి యొకచోట మ(న)సెందు నిలువదు
యిట్టె చెంచెలుఁడ నాకు నెన్నడో నిశ్చయము"
4-361

చెండు : స.క్రి. ఖండించు.
"చెండిన రావణు శిరోమాలికల
దండల పూజల తఱచుగను" 2-516

చెండుకొను : స.క్రి. ఖండించు.
"అక్కడివారినే నీవు అటు చెండుకోరాదా
మక్కువతో నీవేల మాకు మొక్కేవయ్యా"
17-465

చెంత నిండు చెరువుండ చెలమలేల : సామెత; కోరుకున్న వస్తువు పెద్దదే లభించగా చిన్నవస్తువును కోరుకుంటామా అని భావం.
"యింతలోని పనికిఁగా యిందునందుఁ జొరనేల
చెంత నిండుచెరువుండ చెలమలేలా" 1-466

చెంద్రికదట్టి : వి. సింధూరవర్ణపు దట్టి.
"చెక్కుల జవ్వాదితోడ చెంద్రికల దట్టితోడ
చొక్కమైన మాణికపు సొమ్ములతోడ" 29-2

చెంద్రుఁడు : వి. చంద్రుడు, 'చెంద్రుడు' అనడం ఉచ్చారణానుగుణం కావచ్చు.
"రెప్పలెత్తి చూడనేర్చె రేసీఁ జెంద్రునందు పగలు
గొప్ప సూర్యునందు నింకఁ గొత్త నేర్వనేఁటికే"
2-387

చెంబుమీఁది కనకపుఁబూత : ప.బం; వి. పైపై మెఱుఁగు, అశాశ్వతం.
"శ్రీకాంతునిపైఁ జేయని భక్తులు
చెంబుమీఁది కనకపుఁబూఁత" 2-235

చెకోరము : వి. చకోరపక్షి, 'చెకోరము' అని 'చె' కారంతోడి ప్రయోగం ఉచ్చారణానుసారి కావచ్చు.
"బంతిఁ జెకోరములఁ దప్పక చూచే నీ రీతి
కాంత కన్నులతోఁ దారుకాణ వచ్చెనా" 7-75

చెక్కిట చేయిడుకొను : ప.బం; అ.క్రి. ఆశ్చర్యపడు, చింతించు.

చెక్కులతోడి చింతలు : చెక్కిట చేయి వేసి చేయు చింతలు.
"చేవదేరి చెక్కులతోడి చింత లివే" 20-352

చెట్టపట్టాలాడు : ప.బం; అ.క్రి. సరసాలాడు. (చెమ్మచెక్కలాడు)

"చేలలంటి గోపికల చెట్టపట్టాలాడితివి
యాలీల మాఁడుపూరిలో యిట్లాడేవా" 3-179

చెట్టవట్టు: ప.బం; స.క్రి. పెండ్లిచేసుకొను.
"చేయివేసి చెట్టవట్టి సిగ్గు నీ కొప్పగించె
చాయల నీకిది యైనా సమ్మతా నేఁడు" 19-472

చెట్టాపట్టాలు పట్టు: ప.బం; అ.క్రి. చేతులు చేతులు కలుపుకొను.
"పడచులు నేను చెట్టాపట్టాలు పట్టుకాడఁగా
నడుమనే నన్నుఁజూచి నవ్వితివి గదరా"
20-45

చెట్టుకట్టు: ప.బం; అ.క్రి. స్థిరపడు, వర్ధిల్లు.
"చెప్పరాని రతులను చెట్టుకట్టు వలపు" 18-228
"వుడివోదే కాలము వొకతతి రావద్దు
చెడని శ్రీహరిభక్తి చెట్టు కట్టితేను" 3-300

చెట్టునఁచేటెడు: ప.బం. మిక్కిలి అధికం.
"ముట్టి తేనె ముయివో నీ మొక్కులు
చెట్టునఁజేటఁడు వో నీ చిక్కులు" 9-116

చెట్టులమందులు: వి; బహు. మూలికారూపములైన మందులు.
"చెట్టుల మందులు దెచ్చి చిలుకల కిచ్చేవేమే
పట్టిన వసంతుని పంటలు గావా" 22-217

చెడనాడు: ప.బం; స.క్రి. నిందించు.
"ఇట్టునట్టుఁదిరిగాడి యేమైనా జెడనాడి
పెట్టరంటాఁ బోయరంటాఁ బెక్కులాడి"

చెతురుఁడు: వి. 'చతురుఁడు' అనడానికి వ్యావహారికరూపం.
"అతివ గుట్టున నున్న దండాఁకాను
చెతురుఁడ వికనైన సంగడి కేఁగరాదా" 26-50

చెదరు: వి. చెదరడం.
"తిలకపు మోమునకుఁ దేంట్ల రానీక నీ
యలకల చెదరె పో యదలించేని" 5-281

చెనకులు: వి; బహు. నొక్కులు.
"అలరు చెనకులచే నంగములు జీరలాయె
మలసి యిందుకు నిఁక మంత్రమేదో" 3-356

చెన్నకేశుఁడు: వి. 'చెన్నకేశవ' శబ్దంలో వకారం లోపించగా మిగిలిన శబ్దం. వ్యావహారికరూపం.
"చెల్లునా నీ కీ పనులు చెన్నకేశా
కొల్లకాఁడ వౌర గండికోట చెన్నకేశా" 20-50

చెన్నుఁడు: (3) వి. అందమైనవాఁడు.
"అన్నిటా శ్రీవేంకటేశుఁ డాదరించి నిన్నుఁగూడె
చెన్నుఁడంటూ నితనిఁ జెలితో మెచ్చేవే" 8-171

చెప్పంపు: (3) (చెప్పి + అంపు) స.క్రి. ఒకరి ద్వారా వర్తమానం పంపు.
"యెప్పుడు వచ్చునో మా యింటికిఁ దాను
చిప్పిలఁ గాంతలచేత చెప్పంపినాడు" 12-150

చెప్పల్లి: వి. కడపజిల్లా కమలాపురం తాలూకాకు దక్షిణదిక్కుననున్న పెద్దచెప్పల్లి గ్రామం.
7-307

చెప్పల్లి శ్రీ వెంకటరాయఁడు: కడపజిల్లా కమలాపురం తాలూకాకు దక్షిణదిక్కున ఉన్న పెద్దచెప్పల్లి గ్రామంలో వెలసిన చెన్నకేశవుడు. చెప్పలి అనే పేరుగల వ్యక్తితో ఈ ఊరు వెలసినట్లు స్థానికుల చరిత్ర.
"ఆగి కూడితివి నన్ను అలసితి రతులలో
వీగేవు చెప్పల్లి శ్రీవేంకటరాయ" 7-307

చెప్పుడుబుద్ధులు: (2) వి; బహు. ఇతరులు బోధించిన బుద్ధులు.
"చెప్పుడు బుద్ధులకును చేయెత్తి మొక్కేఁగాక
తప్పులు నేఁబట్టేనంటే తానా యెదురు" 25-459

చెప్పుడుమాటలు: వి; ప.బం; బహు. చాడీలు.
"చెప్పుడుమాటలు చెప్పుకొనుట గాక
చెప్పినట్లుఁ దాము సేయ రెవ్వరును" 1-230

చెమట చిత్తిడిది: (చెమట చిత్తిడి + అది) చెమట వాసన కలది.
"చిఱునవ్వుతో నుందాన చెమటచిత్తడిదాన
యెఱుఁగుదు వన్నియును యేమి బాఁతి నేను"
14-130

చెమ్మఁజెమటలు: (6) (చెమటలు + చెమటలు) వి; బహు. మిక్కిలి చెమటలు, ముచ్చెమటలు.
"కమ్మి శ్రీ వేంకటపతి గక్కున నన్నుఁగూడి

చెమ్మఁజెమటల నన్నుఁ జెక్కులేల నొక్కేవే"
14-345

చెమ్మటూరు : వి. సమ్మటూరు కావచ్చునేమో?
"యేపున శ్రీవేంకటేశ యేలఁగా ఇల్లాలనైతి
యీపై చెమ్మటూరఁ జూపేవేమి బాఁతినేను"
23-256

చెయి : వి. 'చేయి'కి వ్యావహారికరూపం.
"చింతలెల్లఁ బెడబాసె, చెక్కు చెయి దియ్యవమ్మ" 11-113

చెయిచాచు : *ప.బం; అ.క్రి.* అడుగుకొను, కోరు.
"చేరి శ్రీవేంకటేశుఁడు కోరి నాకు విడెమీఁగా
పోరచివారు చెయిచాఁచఁ బొసఁగునటే" 18-247

చెయివేయు : *ప.బం; అ.క్రి.* చేతితో ముట్టుకొను, కొట్టు, పనిలో సహాయం చేయు.
"ఎందరు లేరు నీకు నేనేమి బాఁతెయ్యా
అంది నాపైఁ జెయివేసేవు అట్టె కానీవయ్యా"
14-378

చెయ్యార : (9) *ప.బం; క్రి.విశ.* సంతృప్తిగా, చేతులార.
"పయ్యద కొంగేమిటికే పట్టితియ్య వచ్చేవు
చెయ్యార నానతీవయ్యఁ జేసే నూడిగములు"
22-337

చెయ్యి మీఁదగు : *ప.బం; అ.క్రి.* అధికుడగు.
"నీ చెయ్యే మీఁదాయె నీకుఁ జెల్లురా నిన్ను
యేచి వలపుల బయలీదించనైతిరా" 11-331

చెయ్యొగ్గు : (చెయ్యి + ఒగ్గు) అ.క్రి. దోసిలిపట్టు, అంజలించు, ప్రార్థించు.
"నాకు నాకే సిగ్గయ్యీని నన్ను జూచుకొంటేను
చేకొని నీవె మన్నించఁ జెయ్యొగ్గే గాని" 4-2

చెరకు పండిన పండు : *ప.బం; వి.* మిక్కిలి తీయనిది(?) (అసంభవం)
"చిక్కెను నాకుఁదొల్లి చెరకు పండినపండు
పెక్కుమారులు మీరు పెనఁగేరు గాని" 18-269

చెరకు పిప్పి చవిగొను : *ప.బం; అ.క్రి.* వ్యర్థమైన పనికి పూనుకొను.
"చెయ్యార నాతని కొప్పుసేయని భోగములెల్ల
చయ్యన చెఱకుపిప్పి చవిగొనుటా" 15-75

చెరకు పోలికి వెదురు నమలుట : *ప.బం.* అతి కఠినమైనదానిని సులభసాధ్యం చేయడం.
9-151

చెరపు : వి. చెరవ సంబంధియై యుండవచ్చు. 'తళిగె' లకు పర్యాయపదం. ఈ పదం నేటికీ తిరుమలపై వాడుకలో నున్నదట. (పీఠిక. 15 సం. 11 పు.)
"దినసంభ్రమములతో దేవదుందుభులు మ్రోఁయ
తన చెరపులు పైపై దాసులు సేయ" 15-189

చెరిత : వి. 'చరిత'కు వ్యావహారికరూపం.
"ఏడకేడ నీ చెరిత లేమీని పొగడవచ్చు
యీడులేని మహిమల యినవంశరామా"
4-274

చెరితము : వి. చరితము, చరిత్రము.
"ఏడకేడ నీ చెరిత లేమని పొగడవచ్చు
యీడులేని మహిమలయిన వంశరామా"
4-274

చెరిత్రము : వి. 'చరిత్రము' అనడానికి వ్యావహారికరూపం.
"అరుదు నీ చెరిత్రము హరి నేని దియే తలఁచుకొని" 2-321

చెరువుముయ్య మూకుడడుగు : సామెత; అసాధ్యమైన పనికి పూనుకొను, పెద్దపనికి చిన్నసాధనాన్ని అడుగు.
"అయ్యయ్యో భూమిమీఁద నన్నియుఁగంటిఁ జెరువు
ముయ్య మూకుడడిగేటి మూఢులు గలరుగా"
11-181

చెఱఁగు మాయు : *ప.బం; అ.క్రి.* బహిష్ఠు అగు, దూరముండు.
"సిరులతోఁ జెఱగు మాసినదానిఁ జేరరాకు
సొరిది నల్లంత నుండి చూతువు గాని" 7-28

చెఱఁగు మాసినది : *ప.బం; వి.* ముట్టైనది, బహిష్టైనది.

"చేరి నన్ను నంటకురా చెఱఁగు మాసినదాని
అరసి మాఁట చెప్పరా అల్లంతనుండి" 20-9

చెఱకుఁబిచ్చె : (చెరకు + పిచ్చె) వి. చెరకుముక్క, చెరకుఒర.

"చెలరేఁగి యాపె మోవి చెఱకుఁబిచ్చె
యంటాను
చలువగా వేడకతోఁ జవిగొనేవు" 22-191

చెఱకునఁబండు : ప.బం. అపురూపమైనది, అసంభవం.

"చేవ లేక యిటు చెఱకునఁబండై
భావంబిటువలె పరగెను నేఁడు" 15-63

చెఱకునఁబండు వండినట్లు : ప.బం. చెఱుకే తియ్యనిది. దానికి పండు పుడితే ఇంకెంత తియ్యగా ఉంటుందో అనే దానిపై ఏర్పడ్డ పలుకుబడి. ఇలాంటిదే బంగారానికి తావి అబ్బినట్లు అనేది. చెఱకుకు పండ్లు లేకపోవటం ప్రసిద్ధం. అసంభవ విషయం చెప్పడం. (విజయ)

"చనవై శ్రీవేంకటేశు శరణను టొక్కటే
పనివడి చెఱకునఁబండు వండినట్లు" 4-80

చెఱకున పండున్నట్టు : ప.బం. అపురూపంగా.

"చేముంచి శ్రీవేంకటేశ చెఱకున పండున్నట్టు
కామించి నీ వురమెక్కి ఘనురాలినైతిని" 11-51

చెఱకు పండిన పండు : ప.బం; వి. అపురూపం, అతిమధురం.

చెఱువుకు మూకుడు మూయు : ప.బం; అ.క్రి. అసంభవమైన పనికి పూనుకొను.

"అందాలు నేమెరిఁగితే ఆయములు దాఁచేవు
గొందినే చెఱువుకు మూకుడు మూసేవే" 7-206

చెలప చెమటలు : (7) వి; బహు. చెలమ యందు నీరూరినట్లు ఊరే చెమటలు. "చెలమ శబ్దము యొక్క సామాసికవిశేషణరూపము చెలప అగునేమో" అని సం.ప.స. 13 వా. 4 పుట.

"వలపు నీపై నించె వడిఁబులకలు వెంచె
చెలపచెమట లవె చెక్కున ముంచె" 9-121

చెలిమికత్తె : (చెలిమి + కత్తె) వి. చెలికత్తె, సఖురాలు.

"ఎలమిఁ గేళాకూళిలో నీదులాడిన నేర్పులు
చెలిమికత్తెలతోడఁ జెప్పుకొందునా" 22-245

చెలిమికాఁడు : (చెలిమి + కాఁడు) మిత్రుడు.

"చెలిమికాఁడ నీవేల సిగ్గువడేవు యేమో
వెలఁది విన్నవించీని వినరాదా" 19-214

చెలియించు : అ.క్రి. 'చలియించు'. చలించు. యతి కోసం 'చ' కారం 'చె' గా వాడబడి ఉండవచ్చు. లేక ఉచ్చారణానుసారి కావచ్చు.

"చేతనుఁడై సర్వగతుండై చెలియించడేమిటను"
2-419

చెలువరాయఁడు : (చెలువము + రాయఁడు) వి. అందగాడు.

"అంతలోనే పైకొని అధరపుఁదేనెలిచ్చి
చెంతఁ జొక్కించితివిగా చెలువరాయా" 23-456

చెలువరి : (చెలువము + అరి) వి. అందగాడు, సొగసుకాఁడు, ప్రియుడు.

"వొక్కటి మాఁటల నొడఁబరచి నా
చెక్కు నొక్కకువోయి చెలువరీ!" 10-2-21

చెలువుఁడు : వి. అందగాఁడు, ప్రియుడు, భర్త.

"చలము సాదించకువే సారె సారెను
చెలువుఁడు వేడుకొని చెక్కు నొక్కీని" 14-151

చెల్లఁబెట్టు : (2) స.క్రి. నశింపజేయు. (తె.వ్యు.కో.)

"చెల్లఁబెట్టేవు సుద్దులు చింత యేఁటికే" 26-472
"చేసిన నీ చేఁత లెల్లాఁ జెల్లఁబెట్టేకొరకే
మూసి దించి కాఁగిలించి మొక్కితి నీకు"
21-190

చెల్లఁబో : ప.బం. ఆక్షేపం మొ॥ అర్థాల్లోనూ, ప్రశంస, సంతాపం మొ॥ అర్థాల్లోనూ ఉపస్కారకమైన పదం.

"చింతతో ధరించరాదు చెల్లఁబో మేనైనఁ బోదు
ఇంతటఁ జెలులకైన యెఱుక లేదు" 5-267

చెల్లఁబో : అవ్య. ప్రశంసాద్యర్థాల్లో ఉపయోగింపబడే అవ్యయం.

"చెల్లఁబో తపసు వండి జడవేలయ్యా
కొల్లగా వలపు లమ్మీఁ గొనుకొనవయ్యా"
26-400

చెల్లని మాడకు దొడ్డ ముద్ర : ప.*బం;* వి. వ్యర్థమైనది. చెల్లని నాణేనికి పెద్దముద్ర వేసితే మాత్రం ఏం ప్రయోజనం అని భావం. పనికిరానిదానికి ఆర్భాటమెక్కువ, చెల్లని పైసకు గీతలెక్కువ అనే సామెత వంటిది.

"చెల్లని మాడకు దొడ్డ ముద్ర వేసిన
బల్లిదాన దొడ్డ దొడ్డ బాసలెల్లఁ జేసేవు" 24-71

చెల్లపిళ్ళులు : వి. ముద్దుబిడ్డలు. (త.సెల్వం = అందం, పిళ్ళ = సంతానం)

"తల్లిదండ్రి గలవారు తమ లేము లెఱఁగక
చెల్లపిళ్ళలై యాటలఁజెందినయట్టు" 3-54

చెల్లాటము : వి. ఉత్సాహంతో ఆడటం, చెర్లాటం, క్రీడ.

"నెలకొన్న ఇంటిలోన నెమళ్లతో నేమాడేవు
చెలి హంసవంటి దీపె చెల్లాటా లాడరాదా"
23-327

చెల్లినంతా చేత : ప.*బం;* వి. పట్టినదే పంతం, ఆడిందే ఆట వంటిది.

చెల్లుబడితనము : (చెల్లు + బడి + తన) వి. సాగుబడి, సాగుపాటు, అధికారం, దక్షత.

"వెల్లవిరై గద్దెమీఁద వెస నీవుండఁగా నాపె
చెల్లుబడితనమునఁ జెనకీ నిన్ను" 14-575

చెల్లెతోడు : చెల్లెసాక్షిగా, ఒకరకమైన ప్రమాణవాక్యం.

"ఒసికొట్టు గొట్టి కంచుటుంగరాల చేయి
తీసేవు నీ చెల్లెతోడు తియ్యకురా నన్నును"
5-103

చెవిఁబట్టు : ప.*బం;* అ.క్రి. వినబడు.

"సొలసి సొలసి నీకు సుద్దులెల్లాఁ జెప్పి పంపే
చెలియమాటలు నేఁడు చెవిఁబట్టెనా" 16-562

చెవులఁబెట్టు : ప.*బం;* స.క్రి. సావధానంగా విను.

"వన్నెలమాటలు చెవులఁబెట్టక
వాసి విడువకుమి వో మనసా" 1-188

చెవులపండుగ : (6) ప.*బం;* వి. వినుటకు ఇంపైనది, శ్రోత్రపర్వం, కర్ణపర్వం, సంతోషం సూ.ని., శ.ర., బ్రౌన్‌లలో లేదు.

"చెప్పేరా నీ కొక సుద్ది చెవుల పండుగగాను
ఇప్పుడొకతె వెదకె నిందాఁకా నిన్ను" 19-432

చెవులు చిల్లులగు : ప.*బం;* అ.క్రి. వినడం దుర్భరమగు.

"చెప్పకువే వాని సుద్ది చెవులెల్లాఁ జిల్లు లయ్యీ"
9-102

చే

చేఁకట : వి. హస్తభూషణావిశేషం.

"చేరి యాల పట్టేవు నా చేకట
యేరా యెంత లేదు నీ యేఁకట" 7-389

చేఁగలమర్రి చెన్నుఁడు : వి. కర్నూలు జిల్లాలో మండలకేంద్రమైన చాగలమర్రి గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి. ఈ స్వామిపై అన్నమయ్య ఆరు కీర్తనలు చెప్పినాడు. చాగలమ్మ అనే గ్రామదేవత మూలంగా ఈ గ్రామానికి చాగలమర్రి అనే పేరు ఏర్పడిందని కథ.

"ఇచ్చలోనిదాన నేను ఇన్నిటా నీకు
గచ్చు లేమిటికిరా చాగలమర్రిచెన్నుఁడా"
19-162

చేఁతకు చేఁత సేయు : ప.*బం;* వి. మారుకు మారు చేయు.

"చేఁతకుఁ జేఁత సేసితే చిక్కు లెన్నైనాఁ గలవు"
18-91

చేఁతలాఁడి : (చేఁతలు + ఆఁడి) వి. చేయు ధాతువు భావార్థక కృదంత రూపమైన 'చేఁత' అనే శబ్దం బహువచన రూపమైన 'చేఁతలు'పై ఆఁడి ప్రత్యయం వచ్చి చేతలాడి అనే రూపం ఏర్పడుతుంది. 'చేఁతలు కల స్త్రీ' అని అర్థం. ఇట్లే వేసాలాఁడి అనే పదం కూడా.

"చేరి యంటుకొంటేనే చేఁతలాఁడి వైతివా

దారకాన దక్కఁ గొనఁ దగుఁగాక పతిని"
24-104

చేకట్టు: వి. చేతి ఆభరణం.
"అంచితపుఁ జేకట్లు హస్తముల ధరియించె
యెంచఁ జిగుళ్లుఁ దామర లెనసినట్లు" 18-138

చేకానిక: వి. చిన్న బహుమతి.
"ఆకెఱుఁగు నీవూ నెఱుఁగు దదియె మాట
చేకానిక నీకిమ్మనె చెలియ నన్నిపుడు" 7-112

చేకానికె: వి. చిన్నబహుమతి; 'కానికె' కానుకకు వ్యావహారికరూపం.
"చన్నులు నేల మోవ సాగిలి మొక్కి రావే
వున్నతిని చేకానికె వొద్దఁబెట్టి రావే" 7-215

చేకానుక: వి. చిరుకానుక.
"చెయ్యి చాఁచఁగదయ్య చేకానుకొకటి ఇచ్చె
ఆయ మెరిగెంత ముదమందేవో కాని" 7-216

చేకూడు: ప.బం; అ.క్రి. చేకూరు, సిద్ధించు.
"భామ నీ నోమిన నోము ఫలము చేకూడెను
ప్రేమతో నిన్నీతఁడు పెండ్లాడెను" 28-155

చేకొను: స.క్రి. 1. గ్రహించు 2. ఆదరించు 3. జయించు.
"చేకొని వెల్లా విరులు సేయఁగాక" 23-518

చేకొలదిది: (చేయి + కొలది + అది) వి. అందుబాటులో నున్నది.
"చేకొలఁదిదానఁ గాన సిగ్గులు వడితిఁగా"
16-345

చేగడియ: వి. చేతితో తీసుకోదగిన గడియ
11-176

చేగదేఱు: అ.క్రి. చేవదేరు, గడిదేరు.

చేగమీరు: అ.క్రి. చేవదేరు, గడిదేరు.
"చేగ మీరిన కోపము చెలులకుఁ జెల్లుఁగాక
భోగములో బిగువులు పురుషుల కేటికి"
16-204

చేగలమట్టి చెన్నుఁడు: వి. చూ: చాగలమట్టి చెన్నుడు.

చేచేత: (45) క్రి.విశే. స్వయంగా (పద.)
"చేచేతఁగూడి దయసేయవలెఁ గాక
చేరి నేఁ జేచేతఁ జేయని పాపమేది" 4-119

చేటకాళ్ల భూతము: వి. త్రివిక్రముడై మిక్కిలి పెద్దవైన అడుగులతో భూమ్యాకాశాలను ఆక్రమించిన భూతము. (వామనావతారము)
"కాళ్లు చేటకాళ్ల మించిన భూతము" 1-109

చేటకాళ్లు: వి. మిక్కిలి వెడల్పైన కాళ్లు.
"చేటకాళ్ల మించిన భూతము
పోటుదొరల పెద్దభూతము" 1-109

చేటవేలుపు: వి. చేటలోపెట్టి తిప్పుతూ ఆరాధించబడే దేవత.
"అరుదు నీ కింతైతే నందువొయ్యే పనులకు
వెరవుతోడఁ జేటవేలుపులఁ జూడరా" 11-212

చేడవెట్టు: బాగానీరుపెట్టు. సేఱు = బురద(త.)
"బొడ్డుచెర్ల బొమ్మిరెడ్డి పొలమెల్లఁ జేడవెట్టి
గుడ్డనుండి పైరువిత్తి కాచుకుండఁగా"
4 అను. 41

చేతకము: వి. చాతకపక్షి; 'చా' బదులు 'చే' ప్రయోగింపబడటం విలక్షణం.
"వానచేతకములవలె నాయ మనసు
పండుగాయ సేయఁబనిలేదు మనసు" 1-337

చేతన: వి. బుద్ధి.
"ఈతనిఁ గొలిచితేనే యిన్ని గొలలును దీరు
చేతనఁబెట్టు పుణ్యాలు చేరువనే కలుగు" 2-57

చేతనగు: ప.బం; అ.క్రి. చేయుటకు సమర్థుడగు, శక్తమగు.
"చేతనైతే మీరు పతిఁజేకొని లోఁగొనరాదా
ఘాతల నందరి సొంపు గానవచ్చీఁ గాని"
13-424

చేతనము: వి. చైతన్యం; ధర్మవాచకానికి బదులుగా ధర్మివాచకప్రయోగం విలక్షణం.
"ఆతుమలోనుండి యలరి నీ వొసఁగిన
చేతనమున నిన్ను జెలఁగి చేరనైతి" 1-31

చేతన్యము: వి. చైతన్యము; ఈ అర్థమున చేతన్యమనే పదం విలక్షణం.

"చేతన్యమీతనిది సృష్టి యీతని ఘటన
ఆతుమ శ్రీవేంకటేశుఁడంతర్యామి" 3-264

చేతికబ్బు : *ప.బం; అ.క్రి.* దొరకు.
"కొమెరవయసుదే చేతికబ్బెను కొంకనేమిటికి "
17-124

చేతికి చేయే దిష్టము : నానుడి; ద్రవ్యం మారకం వల్ల కలిగే నష్టం, వట్టం.
"చేసినట్టి చేతలెల్లా చేతికిఁ జేయేదిష్టము
యీతల నీ సన్నలింకా నేల సేసేవు " 27-147

చేతికి వచ్చు : *ప.బం; అ.క్రి.* వశమగు, లభించు.
"చింతించఁ జింతించఁ జేతికి వచ్చె మనసు
అంతలో శ్రీ వేంకటేశుఁడంది కాచెను " 4-219

చేతిది : (చేతి+అది) *ప.బం; వి.* చేతిలోనిది, అధీనమైనది.
"చలివాయ లాలించేది చనవులు చెల్లించేది
నెలకొని మన్నించేది నీ చేతి దిఁకను" 18-43

చేతినిధానము : *ప.బం; వి.* అందుబాటులో ఉన్న అమూల్య వస్తువు.
"చేతినిధానము శ్రీవేంకటపతి
యేతలఁజూచిన నిందరికి" 2-43

చేతిపైఁడి : *ప.బం; వి.* అందుబాటులో ఉన్న అమూల్యవస్తువు, కొంగుబంగారం వంటి పదం.
"వెక్కసానఁ జేతిపైఁడి వెలవెట్టి కొనవద్దు
చిక్కులెల్లాఁ బాపెటి సంజీవి వున్న దిదివో "
10-1-54

చేతిమీఁద చేయివేసి చెప్పు : *ప.బం; స.క్రి.* ప్రమాణం చేసి చెప్పు.
"చేతిమీఁదఁ జేయివేసి చెప్పే నీకుఁ బ్రియములు
నాతిరో నీ వితనితో నవ్వే నవ్వవే" 28-482

చేతిమీఁదికి వచ్చు : *ప.బం; అ.క్రి.* సమీపించు.
"చెప్పరాని నా చింత చేతిమీఁదికి వచ్చె
తప్పక నన్నేమి చూచి తడవేవయ్యా" 19-475

చేతిమీద చేయివేయు : *ప.బం; అ.క్రి.* ప్రమాణం చేయు.
"చేతిమీఁదఁ జేయివేసి చెలి నిన్ను మెచ్చి మెచ్చి
యేతులకు నవ్వు నవ్వె నేఁటికో కాని " 18-501

చేతిలోనివాఁడు : *ప.బం; వి.* అధీనంలో ఉన్నవాఁడు, వశంలో ఉన్నవాడు.
"అదన మన్నించఁగానే ఆసఁ జేచాఁచితిఁ గాక
చెదరక నాఁడే నాకుఁ జేతిలోనివాఁడవు" 3-269

చేతిలో నుండు : *అ.క్రి; ప.బం.* సులభంగా లభించు, స్వాధీనమై ఉండు.
"యీతల నేర్పరులకు నిందే యిహపరములు
చేతిలో నున్నవి యిది చింతించరో జనులు "
3-104

చేతిలో మాణికము : (3) *ప.బం; వి.* అందుబాటులో నున్న అమూల్యవస్తువు, 'మాణిక్యము'నకు మాణికము వ్యావహారికరూపం.
"యీవేళ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చేవదేరిన వలపు చేతిలో మాణికము " 27-105

చేతివాఁడు : *వి.* అధీనుడు.
"యింతటి దైవమవు నిన్నింక నెందు వెదకేను
చెంత శరణాగతుల చేతివాఁడవు" 3-18

చేతులొక్కరియందు చిత్తమొకరియందు : నానుడి; మనసు ఒకచోట - చేత ఒకచోట.
"ఆతఁడెట్టు యిదియెట్టు అందరూ నెఱిఁగినదే
చేతులొక్కరియందు చిత్తమొకరియందు "
15-148

చేతెడు : *విణ.* చేయి ప్రమాణంకల.
"తనకు నాకెంత దవ్వు దగ్గరఁ జేతెడు గద్దు
మొనసి నా కాలు దన్ను మోఁచె ననీని " 21-412

చేదివ్వె : *వి.* దీపం, కరదీపిక.
"చేదివ్వె తెచ్చిన నా చెలి చన్నులమీఁద
నా దెననేమో వా(వ్రా)సితి నౌనా వోయి"
26-334

చేదీపము : *వి.* చేతిలోని దీపం, కరదీపం.
"యేఁకట శ్రీవేంకటేశుఁడు వాపెను
చీఁకటి వాసెను చేదీప మేలే" 20-226

చేనిపంట కోయిలకాలే చెప్పీ: సామెత; పంటకోయగా భూమిపై మిగిలిన ధాన్యపు కణ్ణలను కొయిలకాలు అని అంటారు. తెలంగాణా ప్రాంతంలో వీటిని కొయ్యలు అని అంటారు. ఆ కొయిలకాలను గమనిస్తే చేనిలో ఎంత పంట పండిందో ఊహించుకోవచ్చునని భావం. అంటే ఒక వస్తువు కనబడకపోయినా దానికి సంబంధించిన మరో వస్తువుచే దాన్ని ఊహించడమన్నమాట.

"చేయారఁదన మేని చిన్నెలివె చేనిపంట

కోయిలకాలే చెప్పఁ గోప మేటికనవే" 26-139

చేనిమ్మపండు: ప.బం; వి. స్వాధీనంలో ఉన్నవాడు - ఉన్నది, వశంలో ఉన్నవాడు - ఉన్నది.

"క్రమ్మర నిదె వెంకటేశ నీ చే

నిమ్మపండైన నీ బంటు" 41-67

చేపట్టుఁగుంచము: (4) ప.బం; వి. (అభీష్టకామ ప్రదాయి అని ఆం.ప.ని "క్షోణిఁదెనుఁగున చేపట్టు కుంచమన, నభీష్టకామప్రదాయికి పేరు జెల్లె" 3-1-29) ఈ పదానికి శ.ర.లో ఎవ్వరేది కోరినను దానిని నెరవేర్చువాఁడు అనీ, సూ.ని.లో 'చేతిలోని కుంచము వంటివాడు, ఎవరేది కోరిన అది యిచ్చువాడు" అనీ చెప్పబడింది. శ.ర.కారుడు "చేపట్టు కుంచమక్షీణ రంగదభంగ శృంగారశాస్త్ర ప్రసంగలోలుఁడమ్మహారాజ దేవేంద్రుఁడుఁ చేపట్టుఁ గుంచమైన చెలువు నొకనిఁ జేపట్టి" అనే శు.స. (1. ఆ.) పద్యభాగాలను ఉదాహరించాయి. కాని దీపాల వారు తమ సాహిత్యసమీక్షలో ఈ పదం అర్థాన్ని గురించి ఈ కిందివిధంగా చర్చించినారు. "చేతిలోని కుంచము ఎవరేది కోరినా అది ఇచ్చునది కాదు. అట్టి గుణము దానికి లేదు కావున సూ.ని. చెప్పిన వ్యుత్పత్త్యర్థము సరియైనది కాదు. చేపట్టుకుంచము ను నుడికి చేతపట్టుకొనుట కనువైన (చేతిలో నిముడునట్టి) కుంచము, అని అవయవార్థము. ప్రాభవాదులచేత మహోన్నతుడయ్యును - సులభుడైనవాడు అని ఆ అర్థమునుబట్టి యేర్పడు భావము. అది యేలాగంటే - కుంచము ఆకారము చేత చాలా పెద్దది. అది శేరువలె చేతకరవునది కాదు. అంతేకాక ధనముగాని, ధాన్యముగాని విస్తారముగా పట్టునది. (14 శేర్లు = కుంచము) కావున మిక్కిలి బరువు కూడాను. అందువల్ల ఆకార విపులతచేత, ద్రవ్యభారముచేతను కూడా కుంచము చేపట్టున కందుట అసంభవము. అందెనేని ఆశ్చర్యజనకమును, ఆనందదాయము నగు విశేషము. అట్లే ప్రాభవాదులచేత నున్నతుడైనవాడు, ఆశ్రితులకు సులభుడగుట అరుదు. సులభుడయ్యేనేని అది గొప్పవిశేషము. ఆశ్రిత సులభుడైన మహారాజుకు - చేపట్టు కుంచముతో పోలిక. కాబట్టి సూ.ని. చెప్పిన అవయవార్థము, భావము గూడా తప్పే. చేపట్టుకుంచము - చేతిపట్టున ఇముడు కుంచము - (ఔపమ్యవాచకము) ఆశ్రిత సులభుడని భావము అని చెప్పుట ఒప్పు" .... కనుక దీనికి వశుడు, సులభుడు అని అర్థం చెప్పడమే ఉచితం. వా.ని. ఈ అర్థాలనే చూపింది. అందుబాటులో ఉండి కోరిక తీర్చే అమూల్యవస్తువు. (వ్య.) చేతికి లోనైన కొలపాత్ర, పరాధీనుడు ఛాయార్థము కావచ్చు. (సం.ప.స. 19నం.) ఎవరేది కోరినా దానిని నెరవేర్చు వాడు (?)

"చేపట్టుఁగుంచమవై చేరి ఇట్టె నాతోను

కాఁపురము సేయవోయి గండికోటకేశవా"

18-367

చేపట్టు: ప.బం; వి. కొట్లాట, చేయి పట్టుకొని గుంజులాడడం.

"సరసాలు ముదిరితే సారెఁ జేపట్లకు వచ్చు

దొరలఁజేఁబట్టఁబోతే దూరు వచ్చును" 11-438

"చేపట్లు కావచ్చునా మీలో మీకు" అని క్షేత్రయ్య

చేపట్టు: ప.బం; స.క్రి. గ్రహించు, పెండ్లియాడు, అవలంబించు.

"చేపట్టి తీదీపులను చేయిదాఁకుఁ గాలుదాఁకు

ఆపె మాట మాటగానె ఆడరా నాతోను" 11-155

చేపడు: అ.క్రి. 1. దొరకు 2. అగు, కలుగు 3. వశమగు 4.పట్టువడు.

"చేపడిన మాత్రమున చేటులేని పదవుల
యేపున నెవ్వరున్నారో యెరుఁగరయ్య" 3-134

చేమకూర శైత్యాలు : *ప.బం; వి; బహు.* అసంభవాలు (పద.) పైకి తోచునదే కాని అనుభవానికి వచ్చేది కాదు అని అర్థము చెప్పుట సమంజసము. (వే.ఆ.మూ.) తలమున్కలువలె, పూర్తిగా పనిలో దిగి అనే అర్థంలో ప్రయోగించినట్లున్నది అని. (సం.ప.స. 16 సం.)

"చెలువపు విషయాలు చేమకూర శైత్యాలు" 2-268

చేమపూవు కడియాలు : *వి; బహు.*ఒకరకపు చేతికడియాలు.

"చేమపూవు కడియాల చేయి" 4 అను 20, 5-148

చేమిరివెట్టు : *అ.క్రి.* పాలలో తోడుపెట్టు.

"చెంతఁబంటెడు పాలలో నొక చల్లబొట్టు చేమిరి వెట్టినట్టు
అంతటికిని శ్రీహరి శరణాగతి యది యొక్కటే నాకు" 4-77

చేముంచి : ఈ పదం నిఘంటువుల్లో కానరాదు. బుద్ధిపూర్వకంగా, నిజంగా, ప్రమాణంగా, యథార్థంగా అనే అర్థంలో ప్రయోగించినట్లున్నది. సత్యమును ప్రమాణపూర్వకముగా వాక్రుచ్చ వలసినపుడు సలసలకాగు నూనెలో చేతిని ముంచియు, విషసర్పాదులున్న కుండలలో చేతి నుంచియు, ఎఱ్ఱగా కాల్చిన యినుప కడ్డీలను చేతితో ముట్టియు ప్రమాణము చేయుట ఆనాటి ఆచారముగా తెలియుచున్నది. దానిమీద చేముంచి = ప్రమాణము చేసి, సత్యముగా అను నర్థమున ఈ ప్రయోగ మేర్పడినట్లున్నది" అని శ్రీ వేటూరి ఆనందమూర్తిగారి అభిప్రాయం. (సం.వా, పద. భాషా.వి, 449 పు.)

"కామాంధకారము నీకుఁ గన్నులఁ గప్పివున్నది
చేముంచి నీ వుద్దండానఁ జెనకవద్దా" 17-140

"చేముంచి గుత్తిలో వెలసిన రఘురామా" 3-499

"నా మనసే చక్కనైతే నాకుఁ బ్రత్యక్షము గావా
చేముంచి నేరమేమి చేసితినో కాక" 2-175

చేముంచు : *ప.బం; అ.క్రి.* అధీనంతప్పు, చేయిదాటిపోవు.

"అడుగవే చేముంచే దెప్పుడో యిప్పుడో" 7-31

"ఏమే నమ్మితిఁ గదే యింకా నేల దాఁచేవు
చేముంచితివేమో నాకుఁ జెప్పవే యీ కతలు" 23-24

"చూమరల రావని సొలసితి మింతే కాని
చేముంతు వనుచు సంతోసించితిమి నాఁడే" 29-404

చేముట్టు : (60) *స.క్రి.* చేయి వేయు, స్పృశించు, చేతితో ముట్టు.

"చేముట్టి యాతని నీవే చెనకఁగరాదా" 18-546

"చేముట్టి సరసమాడి చెక్కునొక్కి వేఁడుకొందు
నేమముతో జొక్కించనేరను నేను" 28-592

చేయార : *క్రి.విఖ.* చేతులార; తనివితీరా, మనసార, కడుపార, కన్నులార వంటి ప్రయోగం. మనఃస్ఫూర్తిగా.

"చేయార నీవే యింత సేసినవాఁడవు మరి" 13-403

"పాయమెల్ల సంసారముపాలే పడితిఁగాని
చేయార నీసేవ నేఁ జేసుట లేదు" 3-60

సోరార :

"ఏమని చేయార నీ బంటునని చెప్పుకొనేను" 10-9

చేయి : (3) 'చేయు' ధాతువుకు లోట్ మ.ప; ఏ.వ. రూపమైన చేయుము అనడానికి వ్యావహారికరూపం.

"వన్నెగా నీ సొమ్ము నీవు వలసినట్టు సేయు
ఎట్టు సేసినాఁజేయి యేమనఁగఁగల నిన్ను" 27-28

చేయిచాచు : *ప.బం; అ.క్రి.* ఒకరిని యాచించు, వేకారు.

"పాయపుమదముతోడఁ బట్టి నేఁబెనఁగఁగాను

సేయరాని పనులకు చేయిచాఁచేవు" 26-434

చేయి చేసుకొను : *ప.బం; అ.క్రి.* తన్ను, కొట్టు అని పద. కాని అన్నమయ్య చేతితో స్పృశించు, తట్టు అనే అర్థంలో వాడినట్లుగా కనిపిస్తుంది.

"చెనకి చేయి చేసుకొంటే సిగ్గుపడవలెనా"
20-151

చేయిచ్చు : (3) (చేయి + ఇచ్చు) *ప.బం; అ.క్రి.* ఆసరాయిచ్చు, సాయపడు. (పద.)

"నవ్వునవ్వి ఆపె దిక్కు
నాఁటఁగఁజూచేయప్పుడు
అవ్వల నీకుఁ జేయిచ్చి అండనుండనా"
16-170

చేయి మీఁదగు : *ప.బం; అ.క్రి.* తాను ఇచ్చేవాడగు.

"పాయక శ్రీవేంకటేశ పైకొని కూడితి నన్ను
చేయి మీఁదాయఁ బనులు సేయవయ్య
చేఁతలు" 27-218

చేయిమీఁద చేయి వేయు : *ప.బం; అ.క్రి.* స్పృశించు, తాకు.

"చేయిమీఁదఁ జేయివేసి చెక్కు నొక్కేవు విభుని
చాయల నాతఁడింతేసి చనవిచ్చెనా" 18-468

చేయి మీఁదై వుండు : *ప.బం; అ.క్రి.* చూ: చేయి మీఁదగు.

"యీయెడ శ్రీ వేంకటేశుఁడెరిగెనా మీ భావము
చేయి మీఁదై వున్నదాన చెలఁగరే ఇపుడు"
27-519

చేయి ముంచి చేయు : *ప.బం.* బుద్ధిపూర్వకంగా చేయు.

"చేయవలసినప్పుడే చేయి ముంచి చేసేఁగాక
యీయెడ నుండియుఁ బంతాలేలే నీకు"
11-160

చేయిముంచు : చేయికలుపు ?

"ముందే యెఱుఁగవలె మోచి వచ్చే పనులు
చెంది చేయిముంచితేను సిగ్గు లేద నుండును"
25-291

చేయిముట్టు : (?)

"నరులెల్లఁ జిక్కువడి చల్లు వెడలైన వివే
సిరుల నిన్నెంతాపె చేయిముట్టెనో" 11-401

చేయివేయు : (3) *ప.బం; అ.క్రి.* అనురాగంతో ప్రియురాలి పై చేయి విసరు.

"వెన్నెలబాయిటఁ జేయివేయఁగా నప్పటి నీకు
కన్నుల నే మొక్కనా కడుఁదమకమున" 19-49

చేరఁడేసి కన్నులు : *వి; బహు.* చేర అంటే కొద్దిగా వంచబడిన చేయి. ఆ ప్రమాణం కల కన్నులని అర్థం. చారెడు అని వ్యవహారం.

"చేరఁడేసి కన్నులఁ జెలి నిన్నుఁ జూచెను
కోరి నీకు వలచి ఇక్కువ నున్నది" 22-205

చేరుగొండి : *వి.* చెడ్డది, చేరివచ్చినది (వాచ.) తగులాటకత్తె (చి.ని.) అని శ.ర., చేరవచ్చిన భార్య (బ్రౌన్) 18-241

చేరుగొండితనము : *వి.* తగులాటము, కామసంబంధము, జారత్వము.

"చేరుగొండితనముల చెలిమికత్తె వౌదువు
యీరు దియ్యఁ బేను వచ్చు నితఁడు నా
మగఁడు" 18-241

చేరుముత్యాలు : *వి; బహు.* హారంలోని ముత్యాలపేట లోని ముత్యాలు. (చేరు = హారము యొక్క పేట, సరము, క్రోవ - సూ.ని.)

"చేరువఁ గాఁగిటిలోనఁ జెమరించే నిది యేమె
చేరుముత్యాలు నిటునటుఁ జిందునట్టు" 9-120

చేలపచ్చలు : *ప.బం; బహు.* ఆకర్షకములు. చేలపచ్చదనాలు అని వాచ్యార్థం.

"అచ్చలాన నీవు చూపే ఆసలందరికిఁజేల
పచ్చ లాయ నిదివో నీ బయకారిచేఁతలు"
21-340

చేలాగు : (3) *ప.బం; వి.* చేయూత, చేయిచ్చి లాగుకొనుట కావచ్చు.

"కామధేనువు వచ్చె కనుఁగొనుటకై నీకు
శ్రీమహాదేవి నీ చేలాగు కదివో" 2-436

చేవదేరు : *ప.బం; అ.క్రి.* బలపడు, సత్వం కలదగు.

"ఆవటించి నాపై యాస లదేల పెట్టుకొనేవు
చేవదేరే నీ వలపు చిత్తజుఁడెరగఁడా" 29-9 అను

చేవల్లకు : (5) ప.బం. సమీపానికి, చేతివైపుకు.
"చేవల్లకు వచ్చి యాపె చేరి విడె మియ్యఁగానే"
29-463
"నీవల్ల నింతేసి నివ్వెరగందితి
చేవల్లకు రావే చేప్పేను నేను" 23-174

చేసు : (4) 'చేయు' ధాతువు తద్ధర్మార్థక ఏ.వ; క్రియారూపం.
"యేమైనాఁ జేసునాపె
యెమ్మెలెరఁగని దాపె" 23-253

చేసుక : (2) 'చేసుకొని' అనడానికి వ్యావహారికరూపం.
"చుట్టముఁ జేసుక తన్ను సుద్దులెల్లా నడిగితే
పెట్టుకుండె నెపాలంటా బీరాలెంచీనె" 8-230

చేసుకొంట : వి. చేసుకోవడం. (తలపోయుట, పశ్చాత్తాప పడుట అని సంపా.)
"ఇంతలోనె యెచ్చరేది ఇంతలో మోసపోయేది
చెంత వలసినట్లు జేసుకొంట దేహికి" 3-349

చేసుకొను : ప.బం; స.క్రి. పెండ్లాడు.
"చేసుకొన్న రమణుఁడు చేతికి లోఁగాకుండితే
వేసరించి కొసరేది వీరిడి గాదా" 14-550
"చేసుకొన్నయట్టివాఁడు చెప్పినట్టే సేసుఁగాక
మూసిదాఁపిరము లేలే మొరఁగు లేలె" 11-90

చేసుకొన్న మగఁడు : (2) ప.బం; వి. తాళికట్టి పెండ్లాడిన మగడు.
"చేసుకొన్న మగఁడవు చిత్తము కొలఁది ఇఁక
రాసికెక్కె నా పంతము రవ్వేసేయ నేఁటికి"
20-355

చేసుట : వి. 'చేయుట'కు జానపద వ్యావహారికరూపం.
"తన పుణ్యస్థలములు దైవము కొసఁగుట
పనివడి యతనిపై భక్తి చేసుట" 3-212
"చెప్పినట్టల్లా మరి చేసుట గాక" 12-164

చేసూటి : (5) వి. చెప్పినట్లుగా, చేతితోచేసే సంజ్ఞ, చేతిగురి, చేతితో చూపించే లక్ష్యం.
"చేసూటి కెల్లా వచ్చి చెలగించవలెను" 16-442
"చేసూటికి లోనై చేతువుగాక" 14-580

చేసూటి మగఁడు : వి. చెప్పినట్లు వర్తించే మగఁడు.
"సేసవెట్టి పెండ్లాడి చేరి నిన్నలమేల్మంగ
చేసూటి మగనిగాఁ జేసుకొనెను" 14-552

చై

చైతన్యుడు : వి. చైతన్యం కలవాడు, చైతన్యవంతుడు లేదా చేతనుడు అనేది సాధురూపం.

చొ

చొకటాలు : వి; బహు. 'సొగటాలు' కు రూపాం. ఒక ఆట, పగడసాలాట.
"మంతనములే యాడితి మాపుదాఁకాఁదనతోను
వింతగాఁ జొకటాలాడి వేగించితి" 23-28

చొక్కిలి : వి. చొట్ట, నొక్కు.
"మొలకల నవ్వులు మొక్కిళ్ళు
సొలపుల వేడుకలు చొక్కిళ్ళు" 28-419

చొక్కుఁదనము : వి. పారవశ్యం, మోహం.
"జోడుజోడు గూడదాయ చొక్కుఁదనము
మానదాయ" 1-186

చొక్కుమందు : వి. మత్తుమందు.
"కందువమై చమరించి గందవొడి చల్లుకొని
పొంద నిన్నుఁ దలఁచితిరా - వెంకటేశా!
అంది చొక్కు మందులాయిరా" 7-223

చొతుకు : వి. 'చొదుగు'కు రూపాం. చెమ్మ, తడి.
"తటుకున లోలోఁదనువు లంటఁగా
జొట జొటఁ జెమటలు చొతుకులాయ" 18-554

చొదుకు : వి. చూ: చొతుకు.
"పొదలిన వీడెపుఁబుక్కిళ్ళో తమ
చొదుకుక చెమటల చొక్కిళ్ళో" 5-31

చొప్పువేయు : (?)

"కొప్పువిరులు రాలఁగ కొమ్మ నీతోడఁ బెనఁగి
చొప్పువేసె నీవు దన సొమ్ముగాను" 12-427

చో

చోటుచేయు: *ప.బం; అ.క్రి.* స్థానమిచ్చు.
4-157 old

చోడుముట్టు: *స.క్రి; అ.క్రి.* వ్యాపించు, నసాళమునంటు.
"వీడియు వీడని తురుములోని విరులు వెల్లనె రాలఁగాను
చోడుముట్టుచు వీనుల జవ్వాది సొరిది జారఁగా" 27-589

చౌ

చౌక: వి. చులకతనం, తిరస్కారం, లాఘవం.
"కైకొని యీ మాయలు నీ కల్పితమై వుండఁగాను
చౌక లేకనే వేరే సంకల్పించితిని" 1-427

చౌకళించు: స.క్రి. కుప్పించు.
"సందడిలోపలనే సంగడి దేరులు నిల్పి
కందువతో చౌకళించి కాగలించేరు" 18-138

ఛా

ఛాంగుభళా: అవ్య. ప్రశంసార్థకం, ఛాంగురే, బాపురే.
"చక్కని తల్లికి ఛాంగుభళా
చక్కెరమోవికి ఛాంగుభళా" 5-10

ఛాయాపహారము: వి. పూర్వకవుల కవితల్లోని భావాన్ని యథాతథంగా అపహరించడం. నీడను దొంగిలించడం అని వాచ్యార్థం.
"అమరఁగ ఛాయాపహారము నేసుక
తమ మాట గూర్చితే దైవము నగడా" 2-494

ఛి

ఛిన్నభిన్నము: విఙ. చెల్లాచెదరైనది.
"ఆతురాన గొరశరాయడికి నోపఁగలేరు
చేతిగోరు మీటితేనే చిన్నభిన్నమవుదురు"
3-186

జ

జంకె: వి. జంకెన, బెదరింపు, కోపంతో కూడిన చూపు.
"జంకెలు బొమ్మలఁగాని చలములోపల లేదు
వంకలు దీరుచవయ్య వడిఁగురులు" 20-532

జంకెన: వి. బెదరింపు.
"సరసము నేరిచితే జంకెనలైనా సుఖమే
తరితీపు లెరిఁగిన తరుణులకు" 21-22
"పొందినదాఁకా నింతే పొరపొచ్చము లెల్లాను
సందుసుడి నీ కేలే జంకెనలు" 21-23

జంకెనచూపు: వి. బెదరింపుచూపు.
"జంకెనచూపులు సరసపుమాటలు
లంకెలఁ బెట్టీ లలితాంగి" 16-388

జంకెనబొమ్మ: వి. బెదరింపు కనుబొమ, కోపం ప్రకటించే కనుబొమ.
"సన్నలనే యాసరేఁచి జంకెనబొమ్మలు వంచి
అన్నువతోఁ గొసరీని అలమేలుమంగ" 7-21

జంగ: వి. పాదం, పంగ, పిక్క, తొడ, అశ్వప్లుతగతి విశేషం.
"పసలుగా జంగవెట్టి పండ్లగుత్తి చేతఁబట్టి
అసురల నెల్లఁగొట్టీ హనుమంతుఁడు" 4-272

జంగాళము: వి. నిడువాటు. (శ.ర.)
"జంగాళమై చేలఁదూగి జడిగొనీఁ జెమటలు
చెంగట నెచ్చరికగాఁ జెప్పరే చెలులు" 17-398

జంగిలి: వి. స్వల్పబుద్ధి అని సూ.ని., సమూహ సామాన్యమని కన్నడం. మోటుది, అనాగరికం, గోసమూహం, పశువులమంద, మృగసమూహం.
"జంగిలికేల తెచ్చేవు సారెకు నీవూ మా
ముంగిటికి వచ్చితే నే మొక్కులు మొక్కేము"
20-8
"జంగిలిలో నీతోడ సరసము నాడీఁగాక
అంగమంటి ఇంతసేయ నరుహమా ఇతఁడు"
27-135
"పెనఁగి జంగిలిలోనఁ జేరుకొనవలెనని

వొనర నొక్కతె నీ వురమెక్కె నిదిగో" 13-62
"జంగిలిలోనే నిన్ను చండి సేతునా" 13-116

జంగిలికడుపు: వి. అల్పపుకడుపు.
"సరసములాడితేను జంగిలికడుపులోన
దొరలితే నది కడుదోసమనీ సుమ్మీ" 8-249

జంగిలికాంత: *వి; గొల్లస్త్రీ.*
"జంగిలికాంతల నెల్లా సంగతులెంచక నీవు
యెంగిలి సేసేవు మోవి యేకముగాను" 7-185

జంగిలికృష్ణుడు: వి. ఆలమందలోని కృష్ణుడు.
"పాలు దనపైఁ గారఁగా పడఁతులు నవ్వఁగాను
గేలికి లోనాయను జంగిలికృష్ణుఁడు" 9-173

జంగిలికొసరులు: *వి; బహు.* గొల్లకొసరులు.
"అంగమాయ శ్రీవేంకటాధిపతి ఇందువంక
జంగిలికొసరులెల్ల చాలుఁజాలు నీఁకను"
27-301

జంగిలిగా: (3) మోటుగా.
"అంగన వొకతెట నీవాసపడి పెనఁగఁగా
జంగిలిగా వేరొక్కతె కొంగువట్టీని" 25-466
"కొంగువట్టుకొని నిన్ను గొసరితినంటాను
జంగిలిగా దూరి యేల సాధించీని" 23-406

జంగిలిగోపికలు: *వి; బహు.* ఆలమందలోని గోపికలు.
"జంగిలిగోపికల సంగాతాలు నీకు
సంగడి బండికండ్లాయ సంగాతాలు" 22-138

జంగిలితిట్టు: వి. మోటుతిట్టు, క్రూరంగా తిట్టే తిట్టు.
"కొంగువట్టి తియ్యఁగాను కోపగించి నే నిన్ను
జంగిలితిట్టు దిట్టితే సంతోసమా నీకు" 25-176

జంగిలిదూరులు: *వి; బహు.* అల్పపునిందలు.
"జంగిలిదూరులు దూర జంకెనబొమ్మలు చూపి
వెంగెములనే సడివేసేము నేము" 19-185

జంగిలిపదారువేలు: పదహారువేల గోపికలు.
"జంగిలి పదారువేలు చనవిత్తురా" 20-485

జంగిలిమనుజుఁడు: వి. అల్పమానవుఁడు.
"జంగిలిమనుజునకు సరుసఁబాప మే చవి
అంగవించవలదంటే నగ్గలమౌను" 3-290

జంగిలిమాయలు: *వి; బహు.* అల్పపుమాయలు.
"జంగిలిమాయలు సేసి జట్టిగొన (నె?) నిన్ను నాపె
కంగువెట్టుకోము నేము గరితెలము" 27-285

జంగిలివలపులు: *వి; బహు.* సమూహంలోని ప్రేమలు. (జంగిలి = సమూహం)
"సంగడిజాణతనాలు సతులెల్ల నాడఁగాను
జంగిలివలపు లేల చల్ల వచ్చేవూ" 11-3

జంగిలివాఁడు: వి. పశువుల కాపరి, గొల్లవాడు. (అల్పుడు)
"వూరి పసులను మేపి వొప్పగించి యిండ్లకు
చేరి జంగిలివాఁడు నిశ్చింతుడై వుండు" 15-424

జంగిలివిడేలు: *వి; బహు.* (?)
"సరుసఁ గూచుండేఁగాని జంగిలివిడేలలోన
వొరిమెకుఁ జేయి చాఁచ నోపరా నేను" 11-214

జంగిలివేసాలు: వి. అల్పపు నటనలు.
"సంగతిగా మొక్కనా సరసము లాడనా
జంగిలి వేసాలిటు చల్లేవు గాక" 25-264
"సంగతిఁ గొప్పెల వీడె సతిచేయి దాఁకకుంటే
జంగిలివేసాలు నాతో చవిగాదు నీవు" 20-24

జంగిలిసటలు: *వి; బహు.* అల్పపుమోసాలు.
"అంగడిఁబడెను వాదు లతివకు నీకుఁబోదు
జంగిలిసటలు మాతోఁ జాలు రారాదా" 26-177

జంగిలిసతులు: (6) *వి; బహు.* గొల్లెతలు, గోపికలు.
"జంగిలిసతుల నీవు సారెసారె మెప్పించగా
అంగడిఁబడీనవె నీ అన్నమాటలు" 8-151

జంగిలిసరసములు: *వి; బహు.* మోటుసరసములు, అల్పపు సరసములు, గుంపులోని సరసాలు.
"కొంగువట్టి తియ్యకువే గురిగా నీవు
జంగిలిసరసములు చవి పుట్టీనా" 25-200

జంగిలిసవతులు : *వి; బహు.* అల్పపుసవతులు .
"వుంగరాలు నాకు నిచ్చి వొడఁబరతచితి వంటా
జంగిలిసవతులకు సరి నెచ్చరించీని" 13-155

జంటఁగర్మములు : (?)
"అద్దము లోపలినీడలు అందరి దేహపురూపులు
చద్దికి వండిన వంటలు జంటఁగర్మములు"
2-133

జంటచవులు : *వి; బహు.* దాంపత్యపు రుచులు, సంభోగములు, రెట్టింపైన రుచులు .
"జంటచవులు పుట్టించి చనవు లిప్పించితివి
ఇంటనే సంతోష మిచ్చే నేమి సేతునే" 14-49

జంటలుసేయు : (?)
"అరసి శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
సారె నన్నేలి యాపెను జంటలుసేసేవు" 24-262

జంతతనము : వి. గయ్యాళితనం, దుష్టత్వం .
"సంతడిగితే నాపెకు జంతతనమౌను"
24-253, 28-142 & 29-45

జంతమాటలు : *వి; బహు.* గయ్యాళిమాటలు, అంకులాడి మాటలు .

జంధ్య(ద్య)ము : వి. జందెము .
"కుచ్చివాని పేగులు జంద్యములుగ
విచ్చి వేసుకొనె విష్ణుసింహము" 3-239

జంధ్యా(ద్యా)లు : (3) *వి; బహు.* జందెములు అనడానికి వ్యావహారికరూపం.
"పేగుల జంద్యాలు వేసి పెంచపు నమలిపురి
పాగఁగాఁ జుట్టిన నా బాఁపనయ్య వీఁడివో"
5-254
"వెక్కసపు జంధ్యాలుగా వేసుకొన్నాఁడు"
(4-505)
అనే పాదంలో జంధ్యాలు అనే ప్రయోగం కనిపిస్తుంది.

జంపు : (1) వి. ఆలస్యం, జాగు, తూగు, నిద్రమత్తు .
"యింపులు నెఱఁగము యెగ్గులు నెఱఁగము
జంపులనిదురే సకలసౌఖ్యము" 2-465
ఆలస్యం, జాగు :
"ఘనుఁడ శ్రీవేంకటేశ కలిసితి మింతలోనె
చనవుల రతులలో జంపులు మరున్నవా"
7-260
"జంపు సేయక చెప్పరే సతులు మాకిపుడు"
13-152
"సరసమాడే యప్పుడు జంపులకు పని లేదు"
26-395
సంభాషణలు :
"వట్టి జంపులిఁక మాతో వద్దు వద్దయ్యా" 29-51
అనుశాసనం, ఆజ్ఞ :
"చలము సాదించితివా జంపులు నడపితివా
నలువంకఁ జూచి యేల నవ్వులు నవ్వీనే"
25-40

జంపు : విణ. స్నిగ్ధం, నున్ననిది .
"జంపైన గుబ్బలనొత్తే సాదించి నేఁ దనుదూర
నింటికాడ ననుఁగూడె నిట్టె కానీవే" 14-478

జంపుగొల్లెత : వి. నిద్రమత్తు గల గొల్లెత, ఆలస్యం చేసే గొల్లెత . 6-113

జంపువలపు బేరము : *ప.బం; వి.* కాలహరణం చేసే ప్రేమ వ్యవహారం. 5-145

జక్కవకుచ : వి. చక్రవాకాలవంటి కుచములు గలది.
"జక్కవకుచ గనక సరిఁదాపరవి మేలు
నిక్కి వెల్లని మేని వెన్నెలఁ గూడదు" 24-120

జగడగాఁడు : (జగడము + కాఁడు) వి. కలహశీలుడు, జగడాలమారి .
"తగవులేమి కెదిరి ధనమే తన సొమ్ము
జగడగానికి విరసమే కూడు" 2-63

జగడపు చనవులు : *వి; బహు.* ప్రణయకలహాలు .
5-274

జగడాలగంప : *ప.బం; వి.* రచ్చలాడు వ్యక్తి.
4-105

జగడించు : (25) అ.క్రి. కలహించు, జగడమాడు.

"జగడించవద్దు గాక చనవు గలుగుచోట
సగము చూపులు చూచి సాదించరాదా" 21-171

జగద్రోహి: వి. గొప్పద్రోహి.
"అరయ జగద్రోహి నౌదు నైనా నీ నామము
గరిమె నుచ్చరించఁగఁ గరఁగకపోదు" 1-501

జగబిరుదు: వి. "వీరాధివీర బిరుదముండినా అనాథ వలె ఆక్రోశించువాడు" అని పద. కాని ఈ అర్థము అన్నమయ్య ప్రయోగంలో యుక్తంగా కనిపించదు. సమర్థురాలు, దిట్టతనం కలది, గొప్ప శూరురాలు.
"జక్కవచన్నుల జగబిరుదా
మొక్కఁగదవే మొగనికి నిపుడు" 29-306

జజ్జరించు: అ.క్రి. భయపడు. 'దద్దరిల్లు' కు వ్యావహారికరూపం కావచ్చు.
"దండి శ్రీవేంకటపతి దాడి ముట్టె నదెయిదె
బండుబండై జజ్జరించి పారరో దైతేయులు"
2-79

జట్టి: 1.బేరం 2.ధనాది నిమిత్తమైన జగడం. (జట్టి= బానిస. నీ.శ.21)
"జట్టిఁదన దండనల్లా సంసారమై చూపు" 4-244
"జట్టి మిమ్ము ధ్యానించి సాయుజ్యమందుట కంటె
అట్టే నీ నామఫల మందు టెక్కుడు" 2-483

జట్టి: వి. 'జెట్టి'కి వికృతిరూపం కావచ్చు. శ్రేష్ఠుడు.
"జట్టి శ్రీ వేంకటేశుఁడు శరణంటేనే కాచె
యిట్టె యింతటివారు యెవ్వరును లేరు" 3-344

జట్టికాఁడు: (జట్టి + కాఁడు) వి. 'జెట్టికాడు' కు వికృతి పదం కావచ్చు. జెట్టి (శ్రేష్ఠుడు) శబ్దంపై స్వార్థంలో 'కా' ప్రత్యయం.
"దిట్టవు శ్రీవేంకటేశ తెగువింత లేకుండితే
జట్టికాఁడ నీకు నేను సతమవుదునా" 24-110

జట్టికాఁడు: వి. 1.వర్తకుడు (2.కొనేవాడు 3. ఓడనడిపేవాడు 4. జూడమాడేవాడు)
"పెద్దరికాలాకె తోడ బెరయించేవా వోరి
చద్దివలపుబేరాల జట్టికాఁడ రారా" 5-145

జట్టిగా: క్రి.విశ. సాటిగా, సమానంగా. (తె.తె.ని.)
"జట్టిగాఁ గౌగిటఁ గూడి సమరతిఁ గొసరితే
తిట్టులు తిట్టుదురా తెఱవలను" 27-67
"జట్టిగా మీ ముందరను సరివిడేలు వెట్టితే
నట్టనడుమ నూరకె నవ్వు నవ్వేవేమే" 26-584

జట్టిగొను: (44) స.క్రి. వశపఱచుకొను.
"పాయపు మదములేల పచారించేవు
చాయలా సన్నలా నిట్టె జట్టిగొనరాదా" 19-217
"జట్టిగొన్న దాసులకు శాంతసింహము
పట్టపు శ్రీవేంకట యౌభళనారసింహము"
4-415
"చల్లని మాటలాడి జట్టిగొనవలెఁగాక
చెల్లుబడి గలదంటా చెనకుదురా" 27-55

జట్టిబేరగాఁడు: వి. వెలయిచ్చి సరుకులు కొనే బేరగాడు, గుత్త వ్యాపారస్థుడు.
"ఇట్టె కూడినందుకును యిచ్చగించవలెఁగాక
జట్టిబేరగానివలె సటలేఁటికే" 8-96

జడధిలోపలి యీఁత: *ప.బం; వి.* అసాధ్యమైన పని, ప్రమాదకరం.
"సరిబెట్ట గటకటా సంసారము చూడ
జడధిలోపలి యీఁత సంసారము" 1-199

జడను: వి. జాడ్యం, సోమరితనం.
"పాలిపడి నిన్నుఁజేరి పట్టి కొలచినవారి
జాలిపాటు తొలగించి జడనువాపి" 4-328

జడల బింకపుభూతము: వి. తండ్రి ఆజ్ఞచే అరణ్యవాసంలో జడలు దాల్చిన వీరుడైన రాముడు.
"గాటపుజడల బింకపుభూతము" 1-109

జడిగొను: అ.క్రి. అతిశయించు, ఎక్కువగు, నిరంతరమగు
"జడిగొన్న రతులలో సరసము లాడితేను
వెడవెడగాఁ గొంకే వెగటా యిది" 25-355

జడియు: అ.క్రి. ప్రకటమగు.
"కడుఁబుణ్యాలను పాపకర్మలను సరిగావ

జడియు శ్రీవేంకటేశ్వరు నామమొకటే" 2-1

జడివట్టు: అ.క్రి. ముసురుపట్టు. (పట్టుపట్టు) (పద.)

"జవ్వనము తతివచ్చె జడివట్టు నవ్వులెల్లా" 20-571

"వలచిన వలపులు వడియుచుఁ జెక్కులను
జలజలఁ జెమటలై జడివట్టె నదివో" 7-319

జడ్డు: (3) వి. 1. జడను, అలసత, మాంద్యం 2. కష్టం, బాధ 3. తగులం, అనుబంధం 4. పారవశ్యం, తగులం.

"జిడ్డు లేని జీవాత్మ సర్వసమమే" 15-48

జడ్డుపడు: అ.క్రి. జడతనొందు, మాంద్యమునొందు.

"వొడ్డుకోఁగా నీ వేల వూరకే కాఁగలించేవు
జడ్డుపడీఁ దమకము సటలేఁటి కననా" 21-168

జడ్డువాఁడు: వి. సోమరి, జడుడు, మందుడు.

"పాయపుమద మెవ్వతె పంచనుండెనే యిన్నాళ్ళు
చాయలు నన్నెరఁగని జడ్డువాఁడు తాను" 8-159

జత్తాఇత్తమగు: అ.క్రి. సిద్ధమగు (పద.) వ్యు.

"జత్తాఇత్తమై యుండరే సకియలాల
చిత్తముగా నూడిగాలు సేయరే యిందరును" 52-242

జన్నె: వి. దేవతాకార్యనియమం, నియమం (సూ.ని.) (నోము, వ్రతం) ముడుపు.
1. దేవతాదులనుద్దేశించి యథేచ్ఛగా విడిచిన ఆవు లేక ఎద్దు. 2. దేవతాదులను ఉద్దేశించి ఎత్తి ఉంచిన స్వేచ్ఛానువర్తిని యైన వస్తువు. 3.నియమం.

జన్నెపట్టుకొను: ప.బం; అ.క్రి. మీదుకట్టు, నియమంగా ఉండు, దేవతాదులనుద్దేశించి యేదోనొక వస్తును నెత్తియందుంచు.

"పలచని మోవి జన్నెపట్టుకున్నది" 26-359

"సంతతము నా వయసు జన్నెపట్టితి నీకు
యెంతైనా నా విన్నప మీడేరించవయ్యా" 9-270

"జవ్వాది యెత్తినది తన
జవ్వనమే జన్నెవట్టినది" 5-316

జమళి: వి. జంట, కవ.

"అమరుల జన్మములు నసురల జన్మములు
జమళిఁబుట్టినంతలో సరియౌనా" 2-44

జమళిపాన్పు: వి. జంటపాన్పు, ఇద్దరు పడుకోవడానికి వీలైన పాన్పు, Double Bed.

"జమళిపాన్పు మీద సరసాన నాపె నన్ను
దమి రేఁచిననాఁడు తాఁ గాదా" 26-558

జమునోరిలో బ్రదుకు: ప.బం; వి. ప్రమాదకరం.

"జమునోరిలో బ్రదుకు సంసారము - చూడ
చమురు దీసిన దివ్వె సంసారము" 1-199

జయంతి: వి. పుట్టినరోజు.

"పురాణపురుషుఁడు భువి నవతరించెను
సిరుల జయంతి నేఁడు సేయరో పండుగలు" 12-383

జయలిడు: ప.బం; అ.క్రి. జయజయధ్వానాలు చేయు.

"మొక్కరే మొక్కరే మీరు ముందే జయలిడి
దక్కి శ్రీవేంకటేశుఁడే తానైన దేవునికి" 2-379

జయలువెట్టు: ప.బం; అ.క్రి. జేజేలు పలుకు.

"సంతతము నందరును జయలువెట్టఁగ నీకు
కాంతలిక వేరి నిన్నుఁ గాదనేరా" 8-286

జయవెట్టు: జేజేలు పలుకు.

జరపు: వి; బహు. కాలయాపనం, కాలం గడపటం.

"పాయపువారమట పండి పొల్లవోయీనా
చాయల మెలఁగవోయి జరపు లేమిటికి?" 20-587

"జరపులనే పొద్దువోయ" 19-108

జరపులఁబెట్టు: (?)

"గురుతై సేవ సేసేము కుచములు గట్లు
జరపులఁబెట్ట కిక సతినైతి నీకును" 19-249

"ఆసపడ్డవారిని అలయింతురా
పోసరించి యేల జరపులఁబెట్టే విఁకను" 19-108

జరయు : స.క్రి. కూడు, చేరు (?)

"ఎన్నెన్ని మేళ్ళు గలవో యింకా నాపెవల్ల

సన్నసేసి యేకతాన జరయవయ్యా" 23-328

జఱ(ర)యు : (35) స.క్రి. నిందించు, సమీపించు, వాగు, అధికంగా మాట్లాడు అని జాస్తి. ఈ పదం జరయు, జఱయు అని రెండు రూపాల్లో ప్రయుక్తం. ఇది ఏ నిఘంటువులోనూ కానరాదు. బండి ఱా తో గూడిన ఈ అర్థంలోనే జఱి, జఱె అనే కన్నడ ధాతువు ఉందని సం.ప.స. (13 వా.) లో చెప్పబడింది. ఈ అర్థం అన్ని ప్రయోగాల్లో కుదరటంలేదు. ముసలియగు అనే అర్థం కొన్నిచోట్ల కుదురుతుందా? నీతి శతకంలో ముసలియగు అనే అర్థంలో జరయుధాతురూపమైన 'జరసి' ప్రయోగింపబడింది. దీనికి రాయు అనే అర్థం కూడా చెప్పవచ్చు.

"గుట్టున నీ వాకెవద్దఁ గూచుండఁగా నెచ్చరించి

అట్టుగాఁ జన్నులనే జఱసీ నొకతె" 18-425

"జరసి పతివ్రతాజనకాముఁడు గాక

వాడిమిన గరఁగొండీడు గాక" (9 ప.)

"యెఱుఁగడా తా నేమైనా యేల నన్ను జరసీని

మెఱసే తన గుణాలు మెచ్చుకొందుఁగాకా" 12-277

"తమకించి పైకొంటేఁ దప్పులు వెదకరాదు

సముకానఁ గొసరితే జరయరాదు" 26-500

జఱయు :

"జఱయుచు వచ్చి వచ్చి చనవులెల్లా నొసఁగి

మెఱసి తొరలనాడీ మఱేమందు నిఁకను" 13-530

జఱపు : వి. (?)

"మఱవకురా నీ మాఁటలు యీ

జఱపులలోనే సరి చూపేను" 24-12

జఱపులఁబెట్టు : (?)

"జఱపులఁబెట్టఁగానే సరివొద్దులాయను

మఱి పచ్చడము గప్పి మన్నించరా" 23-495

జలజపువదన : వి. పద్మముఖి, విలక్షణసమాసం.

"జలజపువదనకు చాయలకన్నులు

జలజపురేకులు సహజములే" 7-298

జలజముపేరిట సతి : వి. పద్మావతీదేవి. జలజము (పద్మము) పేరుగల సతి అని వ్యుత్పత్తి.

"బలిమి మరుని పేరి పండు చేఁబట్టి

జలజముపేరిటి సతి నిన్నుఁజూచె" 10-2-117

జలధిలో వానలు : *ప.బం; వి; బహు.* వ్యర్థమైనవి. సముద్రంలో పడే వానలు వ్యర్థమే కదా!

"కెరలి మీఁద మిక్కిలి నీ సేవలు

వరుస జలధిలో వానలు" 3-403

జలపూఁత బంగారు : *ప.బం;* వి.అశాశ్వతం (పోతబంగారం, పూతగా పూసిన పూసిన బంగారం ఎప్పటికీ ఉండదు కదా!) వెండి - బంగారముల నీటి మొలాము. రూపాం. జలపోతబంగారు.

"చలువలోపలి వేడి సంసారము - చూడ

జలపూతబంగారు సంసారము" 1-199

జలపోత : వి. స్వర్ణలేహ్యము.

జలములోనున్న చంద్రుని నీడ : *ప.బం;*వి. చంచలం.

జలసూత్రపువాడు : వి. ధారాయంత్రం నడిపేవాడు, అటూ ఇటూ నీరు రావడానికి రెండు బానలలోనికీ వదలిన తాడు గలవాడు.

"జడిగొని మొదలఁ దా జలసూత్రపువాఁడు

వెడమాయలుగ బారివిద్యలవాఁడు" 4-352

జలుక : వి. 'అలుక'కు జంటపదంలో వాడినపదం.

"అలుకేది జలుకేది ఆకె యింటనున్న నన్ను

సొలసి చూచిన మారు చూడనా నేను" 9-32

జల్లి : వి. 1. సవరము 2. చామరము 3. కర్ణాభరణవిశేషం 4.జాలరు 5. కొప్పుపై నుంచుకొను ఆభరణవిశేషం 6.చమరమృగము 7. కుచ్చు 8. తోకకుచ్చు.

"మించిన జల్లి యొకటి మీఁద నుండు దొడ్డవెల్ల

చంచుల సన్నములెల్లా సందులఁగారు" 4-267

జల్లెడలో పోఁకలు : *ప.బం; వి; బహు.* స్థిరంగా, స్పష్టంగా కనిపించేవి.
"జల్లెడలో పోఁకలు మా సంగాతాలు
యెల్లవారు నెఱిఁగిరి యీ సంగాతాలు" 22-138

జవకట్టు(కొను) : అ.క్రి. జతపఱచు, కూర్చు, పొదుగుకొను, స్వాధీనం కావించుకొను, భద్రపరచుకొను.
"భవరోగములు వీడి పారఁగఁ బెద్దలు మున్ను
జవకట్టికొనిన నిచ్చలమైన మందు" 1-237

జవళిన్ : (23) వి. 'జమలి'కి రూపాం.జంటగా, జమలిగా.
"జవళిఁజన్నుమొనలు సారె సారెఁదాఁకఁగాను"
22-355

జవ్వనగర్వము : వి. యౌవనగర్వం. విలక్షణ సమాసం. 5-54

జవ్వనధర్మము : వి. యౌవనధర్మం.
"యెప్పుడు జవ్వనధర్మ మెఱఁగనివాఁడవా"
27-444

జవ్వనపాయపు సతి : యౌవనవయస్సులో నున్న స్త్రీ.
"జవ్వనపాయపు సతి చలము సాదించితేను
యెవ్వరు బుద్ధులు సెప్పేరింక మరి" 7-448

జవ్వనపాయము : వి. యౌవనవయస్సు.
"జవ్వనపాయముతోడ జారినతురుముతోడ
యెవ్వతెసో కూడివచ్చి యీడనున్నాఁడే"
29-193

జవ్వనపుఁబోడి : వి. 'జవ్వనపు పోడిమి' కావచ్చు. పోడిమిలోని 'మి' వర్ణానికి సమాసంలో లోపం.
"నవ్వుల ముత్యాలు రాలీ నలినాక్షిచేఁతలను
జవ్వనపుఁబోడి చిందీ చన్నుఁగవను" 28-3

జవ్వనపువాఁడు : (3) వి. యౌవనంలో ఉన్నవాడు.
"జవ్వనపువాఁడవు నీ సరివారము నేము
దవ్వులనుండి మొక్కితే దగ్గరఁ బిలిచేవూ"
11-499

జవ్వనభారము : (2) వి. యౌవనభారము - వింత సమాసం.
"తిన్నని నా మోవినిండా తేనెలే వూరించితివి
పన్నిన నా జవ్వనభారమెల్లా నీది" 24-307

జవ్వనభావము : వి. యౌవనభావం.
"జలజవదన మేని జవ్వనభావాలు సోఁకి
పొలుపొంద నీ బొడ్డు పూవక పూచెను" 7-82

జవ్వనమదము : (15) వి.యౌవనమదం. విలక్షణసమాసం.
"చెలియకుఁ జెమటలు చెక్కులఁ గారీ
మలయుచు జవ్వనమదమువలె" 28-400

జవ్వనసామ్రాజ్యము : వి. యౌవన సామ్రాజ్యం.
"కొప్పు దువ్వి నీవు కొనగోరు సోకించితేను
అప్పుడే జవ్వనసామ్రాజ్యము చెలరేఁగెనూ"
12-102

జవ్వాదివంకి : వి. జవ్వాదితిత్తి.
"పక్కన నాతఁడు నవ్వీ భావించి చూడవమ్మా
చక్కని చంద్రవదన జవ్వాదివంకి" 29-159

జా

జాగు : వి. ఆలస్యం, జంపు.
"ఈ గతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁగూడితి నీ
జాగులు చుప్పనాతికే చల్లి చూపరాదా" 20-592

జాజర : వి. ఒకరకం పాటలో వాడబడే ఊతపదం, జాజర అనే ఊతపదం కల ఒకరకపు జానపద గేయం.
"జగడపుఁజనవుల జాజర
సగినలమంచపు జాజర" 5-274
"చల్లువలపులచేత జాజరకాడేవారము
వుల్లము గరఁగ నిన్ను నొరసేటి వారమా"
24-413

జాజర : (2) వి. 1. వంచన 2. హోళీనాడు జరిగే రంగుల ఉత్సవం.
"నిలుచున్నదిదె చూడు నీ వేల సిగ్గుపడేవు
వలపుల జాజరకు వాసివంతు లెంతురా"
24-351

జాజరకాఁడు : (17) వి. మోసగాడు, దొంగ, వేషములు కట్టి ఆడేవాడు. (న.శ.), తస్కర శబ్దభవ మనిపించుచున్నది అని సంపాదకులు 27-334 f.n. ఉన్న బలమునంతా దోచుకునే వాడని తాత్పర్యార్థం. వేడుకకాడు (?)
"సన్నపుగాలిఁ జూచి జాజరకాఁడనఁగాను
విన్నవించేమా నేము వెలఁదికిని" 27-334

జాజరకాలము : వి. వసంతకాలం (?)
"వింత జాజరకాలము వేడుకతోఁ దలఁపించె
సంతోసపు చిరునవ్వు చల్లులాడరయ్యా" 18-8

జాజరజాజ : వి. జాజరపాటల్లో చివర చేర్చే ఊతపదం.
"చల్లరే హరిపై జాజరజాజ
చల్లఁగా సరసపు జాజరజాజ" 28-319

జాజరపాట : (3) వి. జాజర, జాజర అనే ఊతపదం ఆవృతమయ్యే ఒక జానపద గీత విశేషం. శ్రీనాథుడు "జాదుర జాదురంచు మృదు చర్చరి గీతులు వారుణీరసాస్వాద మదాతిరేకములఁ జంద్రిక గాయఁగ దక్షవాటికా ...." అనే భీమఖండ పద్యంలో (5-102) ప్రసక్తమైన పాట ఇదేనేమో!

జాజరమాటలు : వి. మోసపు మాటలు.
"చల్లని మెల్లని జాజరమాటలు
చెల్లఁబో యెందాకఁ జెప్పేనే" 4-38

జాజరలాడు : (3) ప.బం. జాజరపాటలు పాడుతూ ఆడు.
"జవ్వనము రాసివోసి జాజరలాడినట్టు
చివ్వన సరసమాడి చేనకీని గోళ్ళను" 13-503

జాజరలాడు : అ.క్రి. మోసములు చేయు, వంచనలు చేయు .
"కాంతుఁడిదె నీ కొరకే కాచుకున్నాఁడు
సంతోసము లెక్కలేదు జాజరలాడేవు" 29-142

జాజరలోవాఁడు : వి. మోసగాఁడు.
"సంతలోని జాణవు జాజరలోవాఁడవు
వింత లేదు నాకు నీకు విన్నపమిదయ్యా"
7-209

జాజరాడు : (5) జాజరపాట పాడుతూ ఆడు.
"పొదలె నిండుఁగళల పున్నమ నేఁడు
అదను దప్పక జాజరాడుదువు రావయ్యా"
29-434

జాజు : వి. జాజి.
"జాజు జాజే కాక దిరిశపుఁబువ్వౌనా
నీ జాడెంతయిన నీవు మానేవా" 5-368

జాజుకొను : (1) అ.క్రి. ఎఱ్ఱబడు.
"మొక్కలానఁజివురులు మోవిమీఁద జాజుకొనీ"
22-356

జాజుకొను : (2) అ.క్రి. 'జాదుకొను'కు రూపాం.ఉద్భవించు, దట్టమగు, తఱుకుకొను.
"సారె సారెఁ బులకలు జాజుకొని మేనుల
యీ రీతి మీ తమకము లెఱఁగించీ నవియె"
22-277

జాజుజాజే కాక దిరిశపుఁబువ్వౌనా : సామెత; (?)
5-368

జాడగా : క్రి.విశ. ఉపాయంగా, సైగగా, యుక్తంగా.
"వేడుకతోనే మాట వినే దెఱుఁగుదును
జాడగా బొమ్మలనే పైఁ జంకింతుఁగాను"
20-353

జాడుపడు : విఫలమగు (జాడు = గింజపట్టని జొన్నకఱ్ఱ) విరళమగు.
"యీడులేని శ్రీవేంకటేశ్వరుఁ గొలిచితేను
జాడుపడ్డ పనులెల్లా సఫలమౌను" 14-42

జాణఁడు : (7) వి. నేర్పరి, రసికుఁడు. రూపాం. జాణ.
"చలమేల వద్దు వద్దు జాణఁడవు యీ పొద్దు
యెలుగెత్తి విన్నవించే ఇంటికి రారాదా" 26-336

జాణ : వి. నేర్పరి, రసికుడు, రసికురాలు ; చూ : జాణఁడు.
"చాపలాన నీవే కడుజాణవు గావోయీ" 13-50

జాణకత్తె : (3) (జాణ + కత్తె) వి. నేర్పుకత్తె, ప్రౌఢురాలు, రసికురాలు.

"ఔనే జాణకత్తెవు అన్నిటా నీవు
యేనిగె గుజ్జొగదే యెక్కెనవారికిని" 7-239

జాణకాఁడు: (10) (జాణ + కాఁడు) వి. నేర్పరి, ధూర్తుఁడు, రసికుడు.
"ఎటువంటి జాణకాఁడే యీతఁడు
చిటుకలు వేసీని సెలవి నవ్వులను" 13-90
"సరసురాలవు నీవు జాణకాఁడాతఁడు
సరవు లిద్దరికిని సమకూడెను" 29-316

జాణతనము: (జాణ + తనము) వి. నేర్పరితనం, రసికత్వం, ప్రౌఢత్వం.

జాణతనాలాడు: అ.క్రి. చతురోక్తులు పలుకు, ధూర్తత్వం చూపు.
"చన్నులంట వచ్చేవు జాణతనాలాడేవు
ఇన్నేసి చేఁతలకు నీకే మౌదునోయి" 28-297

జాణరాయఁడు: వి. మిక్కిలి నేర్పరి, మిక్కిలి ప్రౌఢుడు.
"చలము సాధించకురా జాణరాయ నీకు
మొలకచన్నులనాఁడే మొక్కితి నేను" 14-19

జాతి(గా): (7) క్రి.విశ. ఉత్తమం (గా), శ్రేష్ఠం (గా), సొగసు (గా), ఒప్పు. (గా)
"జాతిగా మా తోడుతను సరసమాడకుమని
చేతుల నెవ్వతైనా లచ్చెనవెట్టెనో" 10-2-32

జాతికర్త: కులకర్త, కులపెద్ద (?)
"ఏతులమాటలాడి యిట్టె నవ్వించే వతని
జాతికర్తవా నీవు జాణతనా లాడను" 7-397

జాతినాలిక: వి. మేలైన నాలుక.
"జాతినాలిక వొకటే చవులు కోటానఁగోటి
రీతి హరినామ ముచ్చరింప వేళ లేదు" 2-461

జాతియ్యము: వి. 'జాతీయము'నకు రూపాం.
"నిరతి హేమవర్ణాకె నీవు పీతాంబరుఁడవు
సరవి నిద్దరికొక్క జాతియ్యము" 20-201
"ఎటువంటి జాతియ్యమో యేరుపరచఁగ రాదు
కుటిలకుంతలులాల కొమ్మఁ జూడరమ్మ"
16-37

జాతియ్యాహారాలు: వి. తమ జాతికి సంబంధించిన ఆహారాలు.
"కోరి పక్షుల కొరులు గూండ్లు వెట్ట నేరిపిరా
సారె జాతియ్యాహారాల చవి నేర్పిరా" 2-333

జాతుర: వి. జాతర శబ్దానికి వ్యావహారికరూపం. శక్తి ఉత్సవం, ఉత్సవం.
"కాంతల నెన్నడుముల కఱవు దీఱ
దొంతిమోవిబోనాల జాతుర సేయవయ్యా"
13-137 & 6-149

జాతులఁబెట్టు: (?)
"గాఁటముగ నాపన్నులు కన్నవారితోఁ జెప్పి
చాటుచు సారె సారె జాతులఁబెట్టీని" 23-362

జాతులు: వి; బహు. ఈ పదం మామూలు అర్థాల్లోకాక ప్రకరణాన్ని బట్టి సైగలు, ఎగతాళి ఇత్యాద్యర్థాలు గలదిగా తోస్తుందని సం.ప.స. (11 సం. 387 పు.)
"కాతరాన నీవు నాకు గందపుబొట్టు వెట్టఁగా
జాతులు సేసేరు సారె సారెఁ జెలులు" 21-355
"యెరవులవారితోడ యెమ్మెలు చెప్పుకొంటేను
సరి సవతు లెల్లాను జాతులు సేయరా" 29-341

జామటనుండి: జామునుండి, జాము శబ్దము యొక్క ఔపవిభక్తికరూపం.
"గోముననే పొద్దు నీకుఁ గొలువులు సేయఁగాను
జామటనుండి యిట్టె సంతోసించేవు" 18-10

జామెక్కు: ప.బం; అ.క్రి. సమయం అతిక్రమించు. 6-25

జారతనము: వి. జారత్వం.
"సౌరుచి మెచ్చుల జాజరజాజ
జారతనంబుల జాజరజాజ" 28-319

జారించు: స.క్రి. జారజేయు, జారునట్లుచేయు, తొలగించు. (వ్యు.)
"పొంచి నా చన్ను లంటేవు పోకముడి జారించేవు
నించే నీ పొందులకు నేనూఁ బైకొనరా" 7-185

జారుఁగొప్పు: వి. కొనముడి (పద.), దువ్వుముడి, జారుచుండే ఒకరకపు కొప్పు.

"చనవు నా కిచ్చినది జారుఁగొప్పు దువ్వినది
తనివోని యాసలకు తరవాయఁ గదవే" 14-252

జారు: (3) వి. జారడం, స్రవించడం.
"పయ్యెద జారులవల్ల భావము గరఁగీఁగాని"
14-591
"పెనఁగిన రతికేళి పెంజెమట జారులు
పెనఁగొని యెక్కడివే ప్రియుఁడు నీకెవ్వఁడే"
14-274
"కలికికరముల చక్కని గోరులు
నిలువున మొలనూలి నీవి జారులు" 28-537

జారుదురుము: వి. జారుకొప్పు, కొనముడి, దువ్వుముడి.
"సారెఁజారుదురుము నిలిపి చనుమొనలఁ దాకించి
నోరికొట్ల దన వుదుటు చూపి" 17-65

జాఱువడు: అ.క్రి. తొలగు, చ్యుతమగు.
"మాఱుమో మదేఁటికి మంకుఁదన మేఁటికి
జాఱువడనే నవ్వితే సంతసించవలదా" 7-43

జాలి: వి. ఆశ, బాధ.
"ఆలించు పాలించు ఆదిమపురుష క్షమ
జాలిదీర నీకే శరణు చొచ్చితిమి" 4-338
"గాలపు టెఱ్ఱలఁగంటే కమ్మి నీటిలో మేలు
జాలి నాపసలఁ జిక్కి చావకుండీనా" 4-66

జాలిఁబడు: అ.క్రి. 1.కనికరించు, దయచూపు 2.దుఃఖపడు, కష్టపడు.
"జాలిఁబడ్డ చెమటల సరితెప్ప లెక్కేవే" 7-44
"వట్టిజాలిఁబడుకంటే వచ్చినంతే చాలు" 1-114
దుఃఖపడు, కష్టపడు:
చదివి చదివి వట్టి జాలిఁబడు టింతే గాని
యెదుట నిన్నుఁ గానఁగ నితరుల వశమా"
4-121

జాలిఁబెట్టు: స.క్రి. దుఃఖపెట్టు, కష్టపెట్టు, బెదిరించు.
"వలవ నేర్చినవాఁడు వట్టి జాలిఁబెట్టడు
పలుకనేర్చినవాఁడు బాసదప్పఁడు"
7-382 & 300

జాలిదీరన్: క్రి.విణ. బాధతీరగా.
"ఆలించు పాలించు ఆదిమపురుష క్షమ
జాలిదీర నీకే శరణు చొచ్చితిమి" 4-338

జాలిపాట: వి. జాలిపదం ఊతపదంగా ఉన్నపాట. ఈ పాటలో రెండో పాదాంతంలో జాలోజాలి అని ప్రతిచరణంలో చివర జాలి అనే మాటలు ఊతపదాలుగా కనిపిస్తాయి.
"మితిమీరెఁ జీకట్లు మేటి తలవరులార
జతనము జతనము జాలో జాలి
యితవరులార వాయించే వాద్యాలకంటే
నతిఘోషములతోడ ననరో జాలి" 4-166

జాలిపాటు: వి. దుఃఖం, కష్టం. (కనికరం, దయ)
"పాలిపడి నిన్నుఁజేరి పట్టి కొలచినవారి
జాలిపాటు తొలఁగించి జడను వాపి" 4-328

జాలె: వి. బొంగరపుతాడు.
"చాలుఁజాలు నున్నవెల్లాఁ జాలదా యిది
జాలెలా నిందునే పోసెఁ జాలదా యిది" 19-379

జాళె: వి. నాణేలు పోసుకొనే ఒకరకపు సంచి.
"ఇంకా నిట్లానె గడియించుకొనవయ్య ధనము
సంకె లేక చిత్తమనే జాళెఁ బోసుకొందువు"
23-355
"దవ్వులనుండి యేమి తరితీపుసేసేవు
జవ్వనము చిందకుండా జాళెఁబోయరాదా"
14-63

జి

జిగురుగండె: వి. జిగురుచుట్టిన కండె (కండె = దారపు చుట్ట), వేటలో పక్షులను పట్టుకోవడానికి ఉపయోగించే జిగురు (బందన) రాసిపెట్టి తయారు చేసిన దారపు చుట్ట, ఉచ్చు, త్వరగా వదిలించుకోలేనిది. ఈ పదం తాళ్ల.ప.లో 'చిగురుగండె' యని చూపబడింది. బ్రౌన్: జిగురుగండె = N.S. bird lime, జిగురుగండెలు - limed twigs to catch birds.

"తగల కుండఁగవలె తగిలితే భోగములు
జిగురుగండెఁ బక్షులు చిక్కినట్లు" 15-420

జిగురు చుట్టిన కండె : వి. జిగురు = వేటలో పక్షులను పట్టుకోవడానికి పుల్లలు మొ॥ వాటికి బందన పూసి తయారుచేసిన దారపుచుట్ట.
"చిఱునవ్వు నీ పలుకు జిగురుచుట్టినకండె"

జినుగు : వి. జిలుగు, అల్పము, మందము .
"నినుపు విరహమున నివ్వెరఁగై నేఁడు
జినుగాయఁదాలిములు చిత్తగించు చెలిని"
24-78

జిన్నులు : వి; బహు. 'మీఁగడలు' కావచ్చును .
"చొక్కమైన కొప్పెరల జున్నులు జిన్నులును
చిక్కిన విడుతురా చిన్నబిడ్డలు" 5-253
ఈ కీర్తనలో పాల నుండి ఏర్పడే నేయి, వెన్న, పెరుగు మొదలైన పదార్థాలు పేర్కొబడడం వల్ల 'జిన్ను'కు మీగడ అనే అర్థం ఊహింపబడింది.

జిబ్బడాయి : వి. గబ్బిలం, జిబ్బటీ.
"నిక్కి మేక ఆకుమేయు నిండ నదే తపమా
చిక్కి తలకిందు వేలే జిబ్బడాయి సిద్ధుఁడా"
15-56

జిరుకు : వి. 'జీరుకు' కు రూపాం. జారటం .
"సందడించి పైపైఁ జల్లలమ్మఁగా
చిందుచు నీ మేన జిరుకులాయ" 18-554

జిలిబిలితనము : వి. కొద్దితనం, మాంద్యం. 'జిలిబిలి సిగ్గు' అని ప్రయోగం.
"చెలఁగి చెలఁగి నీవు చేతలెల్లాఁ జేయఁగాను
జిలిబిలితనముతో సిగ్గుపడీని" 23-413

జీ

జీటకపువాఁడు : వి. జాణడు, జిత్తులమారి .
"ఏఁటిమాట యేదులతీట
జీటకపువాని సుద్ది చెప్పకురే మీరు" 24-152

జీతముసేయు : ప.బం. జీతమిచ్చు (వ్యు.), ఉద్యోగం చేయు.
"నరయక నరసేటి నల్లతెల్ల జల్లివాఁడ
యిరవై జీతముసేసి యేలుకోవే శ్రీహరీ !"
15-39

జీనువ : వి. పక్షివిశేషం, లిక్కువపిట్ట .
"సుదతి వుండిన యింటిచుట్టూఁ దిరుగునమ్మా
చెదరిన మతితోడ జీనువవలెను" 10-2-115

జీర : వి. గీర, రేఖ. (శ.ర.)
"జీర మేన నున్నందుకే శ్రీవేంకటేశ్వరుని
నేరము లెంతు రటవే నెట్టుక నీవు" 13-516

జీరవారు : రేఖ ఏర్పడు .
"చేరి నను నిపుడే జీరవారఁదీసెఁదాను
మేర నే నందుకుఁ దా మీకుఁ జెప్పరాదా"
14-436
"మొనసి శ్రీవేంకటేశు నెదురుగాఁ గొసరేవు
చెనకితే మేనిమీఁద జీరవారె నటవే" 7-236

జీరుకుబండ : వి. జారుడుబండ, బాలక్రీడావిశేషం.
"మేరమీరె కోరికల మిసిమి చూడకు మవి
జీరుకుబండలోయి చిత్తమా" 10-1-12

జీరువారు : అ.క్రి. 1. ప్రసరించు, వ్యాపించు 2. జారు 3.వేలాడు (జీరుకు ..... బండలు)

జీలుగుబెండగు : వి. బయలగు, చాలా తేలికగు.
"సోకి నీ సింగారాలే చొప్పులెత్తి ఇయ్యఁగాను
జీలుగుబెండాయ గుట్టు సిగ్గుపడవలదా"
23-365

జీవము : వి; మాం : మేక మొదలైన జంతువు .
"తనివోక జీవము తలకాయ నంజుడు
పనివడి తిన్న తిన్న బ్రాహ్మఁడు" 1-209

జీవాతుమ : వి. జీవాత్మ, సమాసంలో కూడా ఆతుమ శబ్దప్రయోగం.
"జీవాతుమై యుండు చిలుకా నీ
కావలికి పరమాత్ముఁడై యుండు చిలుకా" 1-50

జీవాలు : వి; బహు. పశువులు (అడవిజంతువులు), మేకలు, గొఱ్ఱెలు .
"సిడిదల లియ్యవద్దు జీవాలఁ జంపవద్దు
బడిబడి పగ్గాలఁబారవద్దు" 4 అను. 62

జు

జుంజు : వి. జుట్టు.
"వన్నెమేన జుంజు రేఁగె వాడు మోవి గడు
మాఁగె" 9-137

జుంటీగకత : వి. (?)
"భూమెల్ల మేసినా నాఁబోతుకు బందె లేదు
నేమపుఁబ్రసన్నునికి నింద లేదు
యీ మేర శ్రీవేంకటేశ్వరుని శరణని
సోమరి కర్మ మంటితే జుంటీగకతవును"

జుట్టవేలు : వి. చూపుడువేలు, తర్జని. రూపాం. జుట్టనవ్రేలు, జుట్టివ్రేలు, జుట్టెనవ్రేలు, జుత్తనవ్రేలు, జుత్తెనవ్రేలు.
"గుట్టున మనోరథాలు గోరుకొంటా
ముక్కుమీఁది
జుట్టవేలితో నున్నది చూతువు రావయ్యా"
19-102

జుట్టుడేశడుగులాపె : వి. జానెడేసి అడుగులు గల స్త్రీ.
"జుట్టెడేశడుగులాపె సోయగపుఁజేతులాపె
చుట్టరికపువావు లెంచుకొమ్మనె నిన్నును"
28-511

జుట్టెఁడేసి పాదాలాపె : వి. జానెడేసి అడుగులు గల స్త్రీ.
"పట్టెఁడేసి గుబ్బలాపె బాగాలిచ్చీ నీకు
జుట్టెఁడేసి పాదాలాపె సురటి వట్టే" 16-558

జుట్టెడు : (జుట్టు + ఎడు) విణ. చాపబడిన బొటన వ్రేలికి, చూపుడు వ్రేలికి మధ్య కొలత ప్రదేశం, జానెడు.
"జుట్టెడు యినుమునమ్మి సొరిదినొక్కఁడు
భూమి
గట్టిడి భయములెల్లఁ గడవఁగాను" 1-429

జుట్టెడేసి పాదముల జోటి : వి. జానెడేసి పాదములుగల స్త్రీ.
"జుట్టెడేసి పాదముల జోటి నీవద్దికి రాఁగా
పట్టెడేసి చన్నులపై పయ్యెద జారె" 24-458

జుణుఁగు : (3) అ.క్రి. భయాదులచే ఒదుగు, సందేహించు, మఱుగుపడు, దాగుకొను, జంకు, వెనుదీయు, తప్పించుకోజూచు. రూపాం. జునుగు.
"గుట్టుతో మెలఁగేవారు కొసరఁగ నేమిటికి
చుట్టములైనవారు జుణుఁగనేల" 24-346

జునుగు : (6) చూ : జుణుగు.
"చుట్టము వరుసలెంచి చూచి నీతో నవ్వేగాక
అట్టునిట్టు జునిగేవు ఆస గలదా?" 19-308

జుఱ్ఱుసేయు : స.క్రి. తాగు, జుఱ్ఱున తాగు.
"రీతి జిగురువంటిది రేకలు నీ మేన నివే
జాతిచన్నుల నెట్టొత్తి జుఱ్ఱుసేసేవే" 8-231

జూ

జూజగాఁడు : (జూజము + కాఁడు) వి. జూదగాడు, మోసగాఁడు.
"సొగసి నీ వెంతేసి జూజగాఁడ వైనాను
తగులు విరి పందేలు తరుణు లాడుదురా"
23-517

జూజమాడు : (12) అ.క్రి. జూదమాడు.
"కడఁగి జూజమాడితే గడచీని కాలము
నడుమ వేఁటలాడితే నడచీని కాలము" 15-270

జూజము : వి. జూదం, మోసం.
"వేడుక వుట్టవలసి విభుఁడు జూజాన నిన్ను
నోడించెఁగాక నీతో వొరటువాఁడా" 21-206
అన్నమయ్య జూజమనే పదాన్నే బహుళంగా వాడినాడు. జూదమనే పదం ఒక్కసారి మాత్రమే ప్రయుక్తం. (24-485)

జూజరి : (జూజము + అరి) వి. జూదగాఁడు, మోసగాఁడు.
"శ్రీవేంకటేశ నీవు చేరి కూడఁగానె కాని
సోవలుగా మొరఁగితే జూజరి నేను" 9-3
"దున్నెవానికి మనసు తొలుతఁ జాలుపై నుండు
పన్ని జూజరికి నాటపై నుండును" 15-377

జూజాలాడు : (23) జూదములాడు, అబద్ధములాడు.

"చుట్టిచుట్టి యాపె నాతో జూజూలాడి యోడఁగాను
రట్టుగా నెత్తులు చెప్ప ఇట్టె వలెనా" 25-8

జూటరి : (10) (జూటు + అరి) వి. మోసగాఁడు, జిత్తులమారి. (జూటు = మోసం; శ.ర.)
"చూడవే యప్పటి నేనే జూటరి నట
జాడలు తాఁగట్టిన పచ్చడమే యెరుఁగు" 11-246

జూటరితనము : (2) (జూటు + అరి + తనము) వి. మోసగానితనం.
"జూటరితనాల నన్ను సుద్దులెన్ని యడిగినా
మాటలు వెలుచుకొని మచ్చరించేనా" 7-588

జూటరిది : (జూటరి + అది) వి. వంచకురాలు, అబద్ధాలు చెప్పే స్త్రీ.
"అట్టే శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
చుట్టమై నిన్నుఁగూడె జూటరి దందురా" 12-421

జూటరివాఁడు : వి. మోసగాఁడు, వంచకుడు.
"చూపనా నేనపుడే జూటరివాఁడితఁడని
దాపుగా మై గుఱుతులు దాఁచుకొనెను" 13-3

జూటుఁదనము : (జూటు + తనము) వి. మోసం, వంచన.
"చుట్టమవై మొక్కేనంటే జూటుఁదనమై యుండు
గుట్టున నుండేనంటే సిగ్గులై యుండు" 28-584

జూటుఁదనములవాఁడు : వి. మోసగాఁడు.
"జూటుఁదనములవాఁడు సుదతులు నవ్వితేను
పాటించి యారజమని పచ్చిసేసును" 17-254

జూటు : వి. మోసగాఁడు, జిత్తులమారి.
"అన్నిటాను కడు జూట వౌదువే నీవు
సన్నలాతఁడు చేసితే జంకించేవు నీవు" 25-178
"చూడరమ్మ చెలులాల! జూటితఁడు" 20-452

జూటుది : (జూటు + అది) వి. మోసకత్తె, వంచకురాలు.
"కైకొని నలమేల్మంగ నెదపై నుండఁగాను
జోకతోఁ జెనకే వేమే జూటుదానవే" 29-408

జూబులకొప్పు : వి. చలించే వెండ్రుకల కొప్పు. (జూబులు = చలనములు నీ.శ. 71) గుత్తులకొప్పు.
"చుట్టుకొన్న వెంట్రుకల జూబుల కొప్పువాఁడ
వెట్టి మా యిల్లువరుస వెదక నేమిటికి" 9-57

జె

జెడ : వి. 'జడ'కు వ్యావహారికరూపం. ఉచ్చారణానుకూలమైన రూపం.
"చొల్లెపుజెడ వీపున సోయగమై వేలఁగాను
చిల్లరవుట్లు గొట్టీఁ జిన్నబాలుఁడు" 21-386

జెడగట్టు : *ప.బం; అ.క్రి.* జడగా రూపొందు, జడగట్టు. ఇట 'జెడ' అనే ఎత్వ సహితరూపం నిర్ధారక ప్రయోగం.
"చిగురుఁబాదాల నిగ్గు జెడగట్టెనో అప్పటి
తగి యల్లదె తులసిదండవలె నున్నది" 7-218

జెలనిధి : వి. 'జలనిధి'కి వ్యావహారికరూపం. ఉచ్చారణానుకూలమైన రూపం.
"నిండు జెలనిధి గట్టి నిగిడి లంక సాధించె
అండనే రాముఁడు నరుఁడనవచ్చునా" 4-503

జే

జేగురుఁదొడి : వి. (జేగురు + తొడి) ఎఱ్ఱని అలంకారం. (తొడి = నగ, అలంకారం)
"కుంకుమ మా కిపుడు జేగురుఁదొడి నుదుటికి
బింకపుఁదిట్లె మా ప్రియములు" 5-121

జేడుమోహము : వి. (?)
"వేడుకలే వేఁలు వీడు దోడాడే చోట
జేడుమోహపువిభుఁడ చిత్తమింతే యిఁకను" 24-174

జొ

జొత్తుఁబాపములు : *వి; బహు.* దట్టమగు పాపములు.
"నెత్తురు జలదుర్గాన నిలచినవాఁడ నింతే
జొత్తుఁబాపములు యేల చోటడిగేరు" 3-334

జొత్తు[1]: వి. ఎఱుపు, కృత్రిమ రక్తం.
"చిత్తము నొచ్చీనంటాఁ జెప్పఁ గాకీ నా మోవి
జొత్తు లద్దములోనైనాఁ జూచుకోరాదా" 20-307

జొత్తు[2]: వి. జుట్టు.
"చిత్తములోపలి మాట చెప్పి సిగ్గువడి యదె
జొత్తువలెఁ జెమరించె సుదతి మేను" 26-27
"చిత్తరువు వ్రాసి చెలఁగి వచ్చె నొళ
జొత్తు మాని యిటు చూపరుగా" 12-38

జో

జోఁక: వి. సౌందర్యం.

జోక: వి. 1. సామ్యం 2. బాగు 3. జత 4. విధం 5. ఉత్సాహం 6. మొత్తం 7. స్వరూపం 8. వేడుక.
"వాకిటఁ గాచుకున్నది వచ్చినదాఁకా నీవు
జోకతోడుత నెదురుచూచీ రావయ్యా" 14-492
జత:
"ఆకడ నావుఁ గొంటే నావు వెంట దూడయును
జోకలఁగొన్నట్టివారి సొమ్మే కాదా" 2-441

జోకవాఁడు: వి. జతగాఁడు.
"జోడు సేతమా మొగము సొరిదిఁ జంద్రునికిని
జోడుగాదు దిన మొక జోకవాఁడు" 27-579

జోగిలు: అ.క్రి. తూగు.
"కన్నులార్చ కంత నీవు కడు నేల జోగిలేవు
కన్నెల మదాలు నీపైఁ గప్పెను నేఁడు" 27-352

జోడుకోడెలు: వి; బహు. జంటకోడెలు, జంటయెద్దులు, జతకాండ్లు, సమానులు.

జోడువెట్టు: (?)
"వేరు లేని మహిమల వేంకటేశుఁడతని మై
చూరగొంటి వప్పుడేమి జోడువెట్టుకుండెనా"
5-171

జోతాలు: వి; బహు. దండాలు. (జోత = నమస్కారము - సూ.ని)

జోలి: (2) వి. 1. విషయం, సంగతి 2. గాథ 3. సంబంధం 4. కార్యం, పని 5. వెరవు 6. రీతి 7. ముచ్చట 8.భార్యాభర్తల సంబంధం 9. వూను. (వ్యు.కో.)
"వలవని జోలింక వద్దనరే! తన
తలఁపులోన నేఁదగిలితిని" 20-206

జోలిఁబెట్టు: అ.క్రి. అనవసరమైన విషయాలు చెప్పు, భాషించు, ముచ్చటపెట్టు.
"పోలికవలని వేరూపులు పూచిన కొలఁదులే పూఁపలు
జోలిఁబెట్టక పతిఁ జొక్కించవే" 29-424
"ఎంత కథ నడిపితి వేమి జోలిఁ బెట్టితివి
చింతింప లోకములు నీ చేతివే కాదా" 2-315

జోలికాఁడు: వి. సంబంధం కలవాడు.
"సాలు సాలు మాటలు సక్కనుండవు
జోలికాఁడ మమ్ము నేల సొలసేవు" 17-127

జోలినిత్యాలు: వి; బహు. (?)
"అట్టయిన సత్యాలాఅడి జోలి నిత్యాలు
యిట్టివె నేరుచుకొంటి విపుడు నీవు" 8-275

జోలిమొక్కులు: వి; బహు. మొక్కు.
"చుట్టి చుట్టాతఁడు నన్ను (నిన్ను) జూడవలె నంటానే
యిట్టే జోలిమొక్కులు మొక్కే వేలే చలము"
7-57

జోలిసేయు: (5) స.బం; అ.క్రి. సంబంధం పెట్టుకొను.
"ఇరవైన శ్రీవేంకటేశ నీ రతుల నేను
మరిగి మెచ్చితిఁగాక మరి జోలిసేతునా"
20-214

జ్వా

జ్వాలానరసింహము: వి. ఎగువ అహోబలానికి మూడు మైళ్ళదూరంలో ఎత్తైన ప్రాంతంలో నెలకొన్న స్వామి. నవనారసింహుల్లో ఒక స్వామి.
"సతతప్రతాపరౌద్ర జ్వాలానారసింహో" 1-453

డ

డంబు: వి. దంభం, దర్పం, మానావమానములు.

"మాని డంబు విడుచుట పూని హింసకు
జొరక యోరుపు గలుగుటయు" 4-346

డా

డాగు: వి. చిహ్నం, లాంఛనం.

"కోరి మా భుజముల డాగులు
మోచుకున్నారము
ధారుణిలోపల మమ్ము దయఁజూచుఁ గాక" 6-101 old

"గుట్టున అయిదు ప్రాణాలకు డాగు వెట్టేము
వట్టి దేహముల విడుఁబట్టు లివిగో" 15-128

డి

డింగరీఁడు: (డింగరి + ఈఁడు) 1. సేవకుఁడు 2. భక్తుఁడు.

"యే విధులఁ బడలేక యిటు నీకె శరణని
దేవులతో విఙ్ఞవీఁగే డింగరీఁడవు" 15-222

త

తంగివచ్చు: అ.క్రి. ఆగివచ్చు.

"ఎవ్వఁడో వీఁడేల తంగివచ్చి
నవ్వీనవ్వీ నాతోనే" 5-176

తంగు: అ.క్రి. ఆగు. (వ్య.)

"తంగని శ్రీవేంకటేశ తలఁపు చెప్పె నన్ను
బొంగుచుఁగూడి యిట్టె పోవనేవయ్యా" 7-312

తంగెటఁబెట్టిన జున్ను: వి; ప.బం. అందుబాటులో నున్నది. తంగెడు చెట్టు ఎత్తు తక్కువ. అందులోని తేనెతెట్టె చాలా అందుబాటులో ఉంటుంది. అందుపై వచ్చిన పలుకుబడి.

"తళుకు మోవితీపు తంగెటఁబెట్టిన జున్ను
తలఁచుకో ఆపెఁబాసి దరిఇంచఁ గలవా" 19-244

తంగెటిజున్ను: వి; ప.బం. అందుబాటులో నున్న అమూల్యవస్తువు, సులభసాధ్యం, సులభగ్రాహ్యం, సులభంగా చేయగలిగిన పని.

"వన్నెల మాటల వాకిటి తంగెటి
జున్నుకు వడగాలి సోఁకినది" 5-354

తంగేటిజున్ను: (5) వి. అందుబాటులో ఉండే అమూల్య వస్తువు. చూ: తంగెటఁబెట్టిన జున్ను.

"తనివోని తమకము తప్పక కన్న ధనము
కినియని వలపు తంగేటి జున్ను" 17-187

తంగేటిపై జున్నులు: ప.బం; వి; బహు. చూ: తంగేటి జున్ను.

తంగేడుజున్ను: ప.బం; వి.అందుబాటులోఉండే అమూల్య వస్తువు. చూ: తంగేటి జున్ను.

"తరుణి పలుకులె తంగేడుజున్ను
బెరసేటి విన్నపము పెల్లిచెట్టు" 23-318

తండు: అ.క్రి. ఇవ్వవలసిన ధనాన్ని వెళ్ళి అడుగు, (శ.ర.) బాకీలు వసూలు చేయు, చందాలు అడుగు.

"కొండల శ్రీవేంకటాద్రిఁ గోరి నన్నుఁ గూడె
తండిన వలపువాఁడు కానే కాఁడా"

24-142, 650 old

తండుముండు: వి. తొట్రుపాటు, (పద.) దుందుడుకుగా ముందుకు దూకడం. ఈ పదం గడ్డీ గాదము, పిల్లాజెల్లా వలె జంటపదంగా తోస్తుందనీ, ఇంకను అర్థము విచార్యము అని సం.ప.స. 2-380 పు.

"కొండో నుయ్యో కుమతులాల తండుముండు
తట్టుముట్టు తాఁకైనఁ గనుఁడీ" 1-160

"కొండవంటి యాసతోడ కోరక తా నుండితేను
తండుముండై లంపటాలు తగిలీనా తనకు"

10-30

తండుముండుపడు: ప.బం. దుందుడుకుగా ముందుకు దూకు. తడబడువారు అని ప్రకరణముతో తోచుచున్నది అని సం. స. (2సం. 380 పు.)

"కొండలవంటి కరళ్ళు కోరికె లెందు చూచినా
తండుముండు వారు పడేవారే దాఁట
లేరెవ్వరును" 2-56

తండుమోఁడు : వి. తండుముండు, తడబాటు, తికమక.

"మెండు కానవలెఁగాని మించి వారి వలలకు
తండుమోఁడై చిక్కుకొని తలవంచు టరుదా"
21-71

తంపి : వి. కలహం.

"తంపి నీ చుట్టరికము తామెరకంటె దంపర
యింపు నీ వలపె యారడిన్నిటిలోఁగాని" 9-89

-త : ప్ర. భావార్థకప్రత్యయం. ఉండుత, మాటాడుత, పొగడుత (పొగడుట) మొ॥

"కొప్పు వీడు తెలిఁగదు కొంగు జారు టెఱుగదు
బొమ్మల జంకించితేనే పూఁచి మాటాడుత"
26-13

"సంగడిఁ గూచుండితేనే సమరతి యౌత గాతా
జారుత" 26-123

తకపికలగు : అ.క్రి. కిందుమీదగు.

"ప్రకృతి కాతుమ దాను పరమాత్ముఁడాతఁడు
తకపికలై మరియఁ దనకేల" 3-132

తకపికలుగ : క్రి.విఞ. కిందుమీదు అయ్యే రీతిగా, తారుమారుగ.

"ప్రకటించి రమ్మనుచు పాదాలు పట్టునా ఆపె
తకపికలుగాను ముందట పట్టఁబోలు" 9-267

తకమక : వ.బం; వి. తికమక కావచ్చు. (కలత, తొట్రుపాటు, అంగముల అస్వాధీనత)

"సకల పురాణములు చాటి నినుఁబొగడఁగా
తకమకలుగా నల్పార్థము చెప్పఁదగునా"
10-1-58

తక్కరించు : అ.క్రి. టక్కరితనం చూపు, మోసగించు. తక్కరి శబ్దంపై ఏర్పడిన నామధాతువు.

"తక్కరించె నిన్నటి తగవరి తానె కాఁడా
మక్కువైనా చిలుక మానీనా గుణము"
10-2-118

తక్కరితనము : (6) (తక్కు + అరి + తనము) వి. మోసం, మాయ.

"తక్కరితనాల యెడతాఁకులు" 26-100

"చెక్కులు నొక్కకురా చిత్తమెల్లాఁ జల్లులై
తక్కరితనాల యెడతాఁకులే చాలు" 26-100

తక్కరివిద్యలు : వి; బహు. మోసపువిద్యలు.

"తక్కరి నీ విద్యలే దంటఁజేసెఁగాక నన్ను
గక్కనఁ దొల్లి కయ్యాన కాలుదవ్వేనా" 10-2-37

తక్కు : వి. టక్కు, మోసం, విలాసచేష్ట, కులుకు.

"కన్నప్పుడే మొక్కుటాను కానకున్నఁ
దక్కులును" 11-452

తక్కరీఁడు : (తక్కు + అరి + ఈఁడు) మోసగాడు.

"తక్కరీఁడు తనచేఁత మనసే యెరుఁగు"
26-235

తక్కుఁదనము : వి. టక్కరితనం, మోసం.

"ఎవ్వరు సాకిరి చెప్పిరివే నీ తక్కుఁదనాలు
వువ్విళ్ళూరేటి బాస లొల్లరా నేను" 20-259

తక్కులఁబడు : అ.క్రి. మోసపోవు.

తక్కులఁబెట్టు : స.క్రి. చిక్కులలో పెట్టు, మోసపుచ్చు.

"తక్కులఁబెట్టక ఇంతట రావయ్య" 23-361

"మక్కువ సేసితిఁగాన మానలేము గాక నిన్ను
తక్కులఁబెట్టఁగ మాకుఁ దగవేది" 11-521

తక్కులుఁదెక్కులు : (తక్కులు + తెక్కులు) వ.బం. మోసాలు అనే అర్థంలో జంటపదం. టక్కులు టెక్కులు. ఇట తక్కులు దెక్కులు అని కావచ్చు.

"తక్కలఁదెక్కులు నాడి తగులఁదీసుక నా
యిక్కవ లంట (టే?) నంటే నియ్యకొనరా"
24-23

తగ : వి. నిఘంటువుల్లో ఈ పదం కానరాదు. ఇది 'దగ' కావచ్చు. దగ అంటే దప్పి, తాపం, బాధ, ఆయాసం, అలసట అని అర్థాలు.

"గనివంటిది యీ సంసారము
తనిసి తప్పినాఁదగ లేదు" 1-492

తగవరి: (తగవు + అరి) వి. తీర్పరి, న్యాయాధిపతి. విశి. న్యాయశీలుఁడు.
"ఎటువంటి తగవరి వేమోయి నీవు
ఇటువంటివాఁడవా యేమోయి నీవు" 21-256

తగవు: (2) వి. 1. యుక్తత 2. న్యాయం 3. కలహం 4.వివాహాదుల్లో ఇచ్చే కానుక 5. తీర్పు 6. మేలు 7. రీతి విశి. తగిన.
"ఎప్పుడూ నావాఁడవే యెంత వొడఁబరచేవు
తప్పు లేదు నీవల్ల తగవు నీ చేతిది" 14-477

తగవు: వి. న్యాయం, నీతి.
"కులకాంతలకుఁదమ గుణములతోనే పతి
తలఁపులో మెలఁగుటే తగ వింతే కాకా" 18-27

తగులమి: వి. అసక్తత, నిస్సంగత్వం.
"తగులమి గలిగితే తలఁపు గలుగుఁగాక
మొగము చూడకుండితే మోహ మే డుం డునే" 25-28

తగులవేసుట: వి. పాడుచేయడం.
"తక్క రి జాణతనాలే తగులవేసు ట గాదా
ఇక్కు వఁ బే రడుగుటే ఇంపు రేఁచఁగాదా" 26-107

తగులాయము: (11) వి. తగులాటం, సంబంధం, కామసంబంధం. తె.వ్యు.కో. లో సంబంధి, కావలసినవాడు అనే అర్థాలు చూపబడ్డాయి. కాని ఇక్కడ తొలి అర్థాలే పొసగుతున్నాయి.
"తప్పక చూచితేనే తగులాయములు వుట్టు
చిప్పిలఁగ నవ్వితేనే చిత్తములంటు" 28-451

తగులు: వి. బంధం, సంబంధం.
"దైవముతోడిదే తన తగులు సంబంధం
జీవుఁడిది యెఱిఁగితే చిక్కనీదు తగులు" 2-204
"ఇంటికి రానివాఁడవు యేడనైనా నవ్వనేల
వెంటనే మాతో తగులు విడువరాదా" 7-45

తగులువిరికాఁడు: వి. సంబంధం కలిగించే మన్మథుడు (?) (విరికాఁడు = పుష్పములు కలవాడు, మన్మథుడు)
"వగల శ్రీవేంకటేశ్వరు మాయ లీ వలపు
తగులు విరికానివలెఁ దగిలించు వలపు" 3-401

తగులు విరితనము: వి. తగులుతనము, విరియు (= విడియు) తనము కావచ్చు. సందర్భానుసారంగా తగులుట = చేరుట, విరియుట = విడియుట లేక తగులు యొక్క విరి (= వికాసము) దానిపైన తన వర్ణకమూ కావచ్చు. రాగము హెచ్చిన తనము అని అర్థము. (సం.ప.స. 18 నం 430 పు.)
"తనివోని యాసలతో తగులువిరితనాన
పెనఁగులాడుతా నీపైఁ బ్రేమమూ చల్లీని" 18-4

తగులువిరులాడు: పరస్పరం స్పృశించేట్లుగా పూలతో ఆడు.
"తచ్చనకాఁడవు నీవు తగులు విరులాడేవు
నచ్చుల గొల్లెతలెట్టు నమ్మిరయ్య నిన్నును" 21-20

తగులై ఉండు: అ.క్రి. సంబధించి ఉండు.
"తానును ఆ పరిణామంబులకు
తగులై వుండును యీతఁడు" 3-306

తగ్గుముగ్గు(లు): (4) *ప.బం; వి.* హెచ్చుతగ్గు(లు), 'మొగ్గు' ముగ్గుకు వికృతిరూపం కావచ్చు.
"తగ్గుముగ్గులైన వేళ తలఁచినవారెల్ల
సిగ్గుఁబాటే కాక తమ్ముఁ జేరవచ్చేరా" 1-210
"దయగలవాఁడవు తగ్గుముగ్గు లెరఁగవు"

తగ్గుమొగ్గు: (11) *ప.బం; వి.* హెచ్చుతగ్గులు, తక్కువ - ఎక్కువ. (మొగ్గు = హెచ్చు)
"వొగ్గి తానేమి సేసినా నూరకే యమరుఁగాక
తగ్గుమొగ్గు లేని నాకు తమకించవచ్చునా" 23-199

తచ్చన: (19) వి. 1. కపటం 2. పరిహాసం, గేలి 3. సాకు 4. మోసం 5. అసత్యం.
"యిచ్చట శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
తచ్చన లేక యేలెఁదలఁపు లీడేరెనూ" 12-252

తచ్చనకాఁడు: (7) (తచ్చన + కాఁడు) వి. మోసగాడు, కపటి.
"తచ్చనకాఁడవు నీవు తగులు విరులాడేవు
నచ్చుల గొల్లెత లెట్టు నమ్మిరయ్య నిన్నును" 21-20

తచ్చు : (24) స.క్రి. 'త్రచ్చు'కు వ్యావహారికరూపం, మథించు, సానఁబెట్టు.

"తచ్చి తలపోసుకునీఁ దగ జీవుఁడు" 2-58

సానఁబెట్టు :

"తచ్చి తచ్చి వింటినారి దనుజులనెల్లాఁ జెండె

పచ్చిదేఱ వేంకటాద్రి పానుపుఁగాఁ బండె" 5-48

ఈ ధాతువు ఎక్కువ ప్రయోగాల్లో 'తచ్చి' అని క్త్వార్థకంగానే ప్రయోగింపబడింది. ఒకచోట మాత్రమే 'తచ్చిన' (తచ్చిన నీ కరములు) అని భూతకాలిక విశేషణంగా కనిపిస్తుంది. (9-92) కొన్నిచోట్ల ఈ అర్థాలు సరిపడడం లేదు.

తటుకున : క్రి.విశ. తటుక్కున, శీఘ్రంగా, వెంటనే.

"తటుకున నీ కీరితి వొగడుదురు తలకొని

యిందరును" 2-297

"ఘటన శ్రీవేంకటేశ కౌఁగిటఁ గూడితివాకె

తటుకున మీకె కావ ధర నేది వలపూ" 17-102

తట్టు : అ.క్రి. గట్టిగా కొట్టు, తాడించు.

"తట్టెడి నీ మట్టెల మోఁతలు చూపవలసి

పట్టుఁ బట్టఁగానే వుప్పరిగెక్కేవు" 5-248

తట్టుపడు : అ.క్రి. బాధపడు (శ.దీ.) వెనుకబడు. (వ్యు.)

"ఘనుఁడ శ్రీవేంకటేశ క్రమ్మర నీ కృపచేతఁ

దనిసి యే విధులను తట్టువడనైతి" 2-27

తట్టుపుణుఁగు : (తట + పుణుగు) వి. కరగి బెత్తికలు కట్టిన ప్రశస్తమైన పునుగు. (పునుగు = పునుగుపిల్లి వలన లభించే గంధద్రవ్యం)

"తట్టుపుణుఁగు శిరిసుమీఁద దైలువారనంటి

నొసలఁ

బట్టవెట్టు కోరి నన్నుఁ బట్టనెట్టు వచ్చునా"

5-136

తట్టుపునుఁగు : వి. తట్టి యెత్తిన మేలైన పునుగు. (పునుఁగు = ఒకానొక సుగంధద్రవ్యం)

"ఇంద్రనీలపు గనుల యిలధరుఁడవు గాన

తంద్రలేని యాపె చూపే తట్టుపునుఁ గాయను"

2-280

తట్టుపులుగు : వి. గరుత్మంతుడు (తట్టు = వాహనం, పులుగు = పక్షి) 12-197 old

తట్టుముట్టు : (4) వి. తొట్రుపాటు.

"గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి

తట్టుముట్టు లేనిదే తగ నిజభక్తి"

2-469 & 1-160

తట్టుముట్టువడు : (తట్టుముట్టు + వడు) తొట్రుపడు.

"దక్కనివి గోరనేల తట్టుముట్టువడ నేల

చిక్కినంతకే సంతసించరాదా" 4-426

తట్టువడు : (4) (తట్టు + పడు) తొట్రుపడు, సక్తమగు, వెనుకబడు, ఆగు, డీలుపడు, నిస్సత్వమగు. బాధపడు. (శ.ర.)

"ముట్టుకొన్న యింద్రియాల ముదిసి ముదిసి

రాఁగా

తట్టువడి తన మేను తానే మరచె" 2-380

తడతాఁకులు : (4) వి; ప.బం. నిఘంటువుల్లో ఈ పదం కానరాదు. తాకులు + తాకులు = తడతాఁకులు కావచ్చు. తాఁకు అంటే వేసట, అడ్డు, బాధ, గాయం అని అర్థాలు. మిక్కిలి బాధలు, మిక్కిలి తొట్రుపాట్లు అనే అర్థం చెప్పవచ్చు. తె.జా.లో దీనికి కష్టాలు అనే అర్థం చూపబడింది.

"జడిసి వుండిన నీతో చనవు చెప్పుటకంటే

తడతాఁకులఁ బొరలే తడవకు మమ్ము" 11-327

తడమారి : (?)

"కడలేని సాహసాల గట్టి వాయివాఁడమ్మా

తడమారి ఇందరిలో తాటఁగట్టమ్మ" 22-69

తడిపాఁత మెడగోఁత : ప.బం; వి. తడిగుడ్డతో గొంతులు కోయడం, మెత్తగా ఉంటూ ద్రోహం చేయడం, నయవంచన చేయడం.

"తడిపాఁత మెడఁగోత తలఁపు విషయాసక్తి"

1-104

తడియొత్తు : వి. తడి తుడుచుకునే గుడ్డ.

"యెఎడయని యాకె పయ్యెద కొంగే

తడియొత్తు

అడియాలపు మజ్జన మవధరించవయ్యా"
18-558

తడియొత్తులాపె : (తడియెత్తులు + ఆపె) వి. స్నానం చేసిన తరువాత శరీరంమీది తడిని తుడుచుకోవడానికి కావలసిన గుడ్డలను అందించే స్త్రీ.

"పడఁతి చెమట నీకు పన్నీటి జలకాలు
తడియొత్తు లాపె యందపు గుబ్బలు" 29-538

తడిసూడు : (5) ప.బం; వి. తడిబుత్తు, తడి తుడుచుకునే బట్ట.

"అన్నిటా నిన్నుఁ గూడి ఇంతి జలకమాడితే
కన్నెలము తడిసూళ్ళు కడు నొత్తఁగా" 23-387

"తరుణికి జిలుగారుఁ దడిసుడు లిచ్చి" అని చిన్నన్న ప.యో.వి. లోని ప్రయోగం.

తడిసూళ్ల ఒత్తులు : వి; బహు. తడిని తుడవడానికి పొడి గుడ్డలతో ఒత్తడాలు .

"మెల్లనె నీవు రూపుల(?) మించుల రవలు రేఁగి
వొల్లనె తడిసూళ్ల వొత్తు లాయను" 7-137

తతి : (13) వి. సమయం, యుక్తసమయం, అదను. క.త. (తతి = సమయం)

తతికాలము : (4) వి. యుక్తసమయం .

"యేలితి శ్రీవేంకటేశ యీడేరించేవు గాక
కాలమెల్లాఁ గోరఁగాను కలిగేదేమి" 23-494

"చెట్టుల కెవ్వరు బుద్ధి చెప్పేరు తతికాలానఁ
బుట్టి కాచి పూచి నిండాఁ బొదలుమని" 2-45

తతిగొను : ప.బం; అ.క్రి. 1. సమయం కనిపెట్టు 2. మందవేయు, అధికమగు, కుప్పపడు .

"తతిగొని యేమఱక తలఁచఁగవలెఁగాక
హితవై నీ నామ మున్నదిఁక నేల చింతా"
15-281

"తతిగొన్న నీ వలపు దాఁచి పెట్టవచ్చునా"
29-494

"దగ్గరినయంతలోనే తతిగొనె నూరుపులు"
20-468

"తనువెల్లాఁ బులకించె తతిగొనెఁ జెమటలు
యినుమడించెఁ దమకమే సేతునే" 27-27

తతిదప్పు : అ.క్రి. అదనుతప్పు .

"తారి చూడకుండితే నిమిషములోననే
తతి దప్పెనా వయసు" 22-76

తతిమీరు : అ.క్రి. సమయందాటు .

"యిప్పుడై నా నామాట కియ్యకొంటేఁ జాలుఁ గాక
తప్పిపోయీనా వలపు తతి మీరీనా" 11-471

తతి లేదు మతి లేదు : (?)

"తగులఁ బెట్టేనంటే తతి లేదు మితి లేదు
పగటు లాడఁగరాదు పట్టినదే పంతము" 8-296

తతివచ్చు : ప.బం. యుక్తసమయం వచ్చు .

"తగులాయ వాపులు తతి వచ్చె జవ్వనము
యెగసక్కెలకు నేల యెడమాఁట లాడీనే"
29-243

తత్తరపువాడు : (తత్తరము + వాఁడు) వి. తొట్రుపాటు గలవాడు.

"కొత్తగా శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
తత్తరపువాఁడవా దయ ఇదిగాక" 20-556

తత్తరీఁ(ఁడు : (తత్తర(అ)ము + ఈఁడు) వి. ఆకులపాటు గలవాడు, తొందరపాటు గలవాడు.

"వొత్తి శ్రీ వేంకటేశుఁడు వొడివట్టి నన్నుఁగూడె
తత్తరీఁడు మాట చెప్పె దగ్గరి రమ్మనవే" 8-57

తదియ్యులు : (4) వి; బహు. 'తదీయులు'కు వ్యావహారిక రూపం, శ్రీవైష్ణవ పారిభాషికపదం - భాగవతులు. (అతనికి = భగవంతునికి సంబంధించినవారని వ్యుత్పత్తి .)

"చెంతలఁ దదియ్యుల చేతి యనుజ్ఞ వడసితి
సంతతం శ్రీ వేంకటేశు శరణము చొరరో" 1-148

"ఇట్టి బ్రాహ్మణ్యమొక్కడు యిన్నిటిలోన
దట్టమై తదియ్యులకె తగును బ్రాహ్మణ్యము"

"వెదకవో చిత్తమా వివేకించి నీవు
అదన దదియ్యసేవ అంతకంటె మేలు" 3-415

తద్విష్ణోః పరమం పదమ్ : ఋగ్వేదం విష్ణుసూక్తంలోని వాక్యం. వైకుంఠం విష్ణువుకు పరమమైన స్థానమని అర్థం.

"వైకుంఠపతి నిన్ను వడిఁగానవలెఁగాక
పైకొని తద్విష్ణోః పరమై యుండఁగను " 15-223

తన చిత్తము నా భాగ్యము : నానుడి; 'ఆయన దయ నా అదృష్టం' భారమంతా ఆతనిదే అనే సందర్భంలో వాడబడే పలుకుబడి, 'నీ చిత్తము నా భాగ్యము' అని కూడా ప్రయోగం.

"యెడమాటలాడే నంటే యెందాఁకాఁ
దిరుగవచ్చు
నడుమఁ దన చిత్తము నా భాగ్యము " 7-160

తన నా సంది పొందు : వి. మనిద్దరిమధ్య పొందు.

"తఱితోడ నేకతాన తన నా సంది పొందులు
మఱవక యడిగెనా మంచితనాన" 29-130

తనివోని : విశే. తనివి పొందని.

"తనివోని కోరికలు తగులాయములు సేయు "
12-255

తనుతువు : 'తనియుదువు' అనే గ్రాంథిక రూపానికి వ్యావహారికరూపం.

"చలాన నే నలిగితే జడిసేవా నీ వేమైనా
తలపోఁతనైనాఁ గొంత తనుతువు గాక" 24-592

తపస్యుడు : వి. తపస్సు చేసినవాడు.

"పెక్కు తపస్యులు పెద్దలు"

తపారము : వి. రూపాం. తప్పరము, ఒక విధమైన కుళ్ళాయి.

"చుట్టుఁదపారవు చుంగుల నడుమను
పెట్టితి వింపున ప్రియసతిని" 6-91

తప్పఁబారు : ప.బం. తప్పి పరుగెత్తు.

"తఱుఁగుకోలేని జీవి యెడ్డ గాక
గుఱితంయినాఁ గోఁతికొమ్మ దప్పఁబారునా"
15-154

తప్పకచూచు : స.క్రి. తదేకంగా చూచు, నిశ్చలంగా చూచు, (వ్యు.) విధిగా చూచు. (ఆం.క్రి.మణి.)

"తప్పక చూచితేను తలవంచుకొందురా
చెప్పినట్టెల్లా నీవుసేయఁగదవే" 29-10

తప్పితారి : అ.క్రి. రూపాం. తప్పిదారి. పొరపాటుగా, దైవవశాన, ఒకవేళ, పొరపడి, చెదరిపడి, గురితప్పి.

"తప్పితారి నీ చన్నులు తగ నా చేయి దాఁకితే
ముప్పిరి నాపై బొమ్మలు ముడివెట్టేవే" 17-2

తప్పితారు : అ.క్రి. పొరపాటగు.

"తప్పితారిన పనికి తగ నేమి సేయవచ్చు
చిప్పిలనేఁ గంటినయా సిగ్గువడ నేఁటికి"
26-209

తప్పుఁదెరువు : వి. తప్పుదారి. (వ్యు.)

"ఏలా యీ యనుమానము లింతి మనంబునఁ
బాయని
తాలిమి తప్పుఁదెరువన దాఁగెఁ గదో యమ్మ"
5-306

తప్పుఁదోపు : వి. తప్పుగా దోచుకోవడం, కొల్లగొట్టడం. (వ్యు.)

"తారుమారు తాఁకుసోకు తప్పుఁదోపు లన్నియు
వోరపారు లేని వెల్ల వొక్కటెకా నిజము" 1-149

తప్పుదారు : ఇది తప్పిదారు యా? తప్పిఁదారు అంటే ప్రమాదపడు అని అర్థం.

"తడసి యొక్కొకవేళ తప్పుఁదారుఁగాక నీవు
కడదాకా నీ పంతమే కైకొంటివి" 24-50

తబ్బిబ్బుచేఁతలు : వి; బహు. వ్యత్యస్తమైన చేఁతలు, పొరపాటు చేతలు.

"గబ్బితనాన నీ వొళ్ళఁ గలిగినయట్టి యా
తబ్బిబ్బు చేఁతలేఁటివో తలఁచుకోవయ్యా"
20-366

తమకించు : (తమకము + ఇంచు) అ.క్రి. త్వరపడు, తొందరపడు, ఉత్సహించు, యత్నించు, జంకు, మోహించు.

"తెరలోనుండఁగా గుట్టు దెటుసుకొనుంటేను
తరకానివలె నేల తమకించేవే" 13-126

తమకి : (తమకము + ఇ) వి. లోభి, స్వార్థపరుడు (శ.ర.) (తమకము = ఉత్సాహము, ఉత్కంఠ, కాంక్ష, మోహం. శ.ర.) త్వర కలవాడు.

"నే నెంత తమకినైనా నీకు నోరువకపోదు "
20-114

తమ్మ: వి. నమలి పుక్కిటపెట్టుకొన్న తాంబూలపు ముద్ద.
"యెవ్వతె తిట్టు దాఁకెనో యిదె నీకు నీ నా తమ్మ
పవ్వళించివుండఁగా పైఁబడెను" 7-424
"నాఁటఁగ నాపైఁ దిట్టుతా నా తమ్మ నీపైఁ బడితే
పాటించి తుడువనైతిఁ బంత మియ్యనైతి" 12-42

తమ్మపడిగము: వి. తాంబూలం ఉమ్మి వేసే పాత్ర. రూపాం. తమ్మపడిగె.
"పతివదనము తమ్మపడిగ మాయ నీకు" 9-106

తమ్మి: వి. తమకం, మోహం. (పద్మం, పద్మవ్యూహం)
"గక్కన నలమేల్మంగ కాఁగిలించుకొనఁగాను
తక్కక నీ కపుడెంత తమ్మి పుట్టెనో" 21-261

తమ్మిచేతుల నాతి: వి. తామరలవంటి చేతులు గల స్త్రీ.
"ననిచి తమ్మిచేతులనాతి విడెమియ్యవే" 28-424

తమ్మిబొడ్డు: వి. బొడ్డులోని తామెరతూడు.
"పోలింప నీదు తమ్మిబొడ్డుకంటెఁ బొడవున
కాలు దొక్కి నిలచెను కమలాలయ" 11-164

తమ్మిరేకుగన్నులు: వి; బహు. తామరరేకులవంటి కన్నులు.

తమ్మిలోని మగువ: వి. లక్ష్మీదేవి (తామర నిలయంగా కల స్త్రీ అని వ్యుత్పత్తి) అలర్మేల్మంగకు, కమలాలయకు తెనుగుపదం.
"తమ్మిలోని మగువతో ధరణీధరుఁడా
మిమ్ము నే నమ్మితి నాకు మీరే గతి" 3-438

తమ్మివాటు: వి. తామరతో వేయు దెబ్బ.
"రమ్మనరే చెలులాల రమణుని నీడకు
తమ్మివాట్లకు నేలే తనివోని సిగ్గులు" 14-514

తరకసము: వి. అమ్ములపొది, తూణీరం. (తరకస. మూ (వ్య.) రూపాం. తరకసా)
"పదిలముగ నిరువంక పసిఁడిపింజల యంప
పొదుల తరకసము లొరవులు నెరపఁగ" 5-210

తరకాఁడు: (3) వి. ఈ పదం నిఘంటువుల్లో కానరాదు. ఇది తరికాడు కావచ్చునేమో! తరికాడు అంటే మథించేవాడు, చిలికేవాడు అని అర్థం. (తరవుకాడు = నిర్బంధించేవాడు)
"మనసనే మోపు నెమ్మది నీకు నప్పగించితి
ఘనదుఃఖముల తరకాండ్లేలయ" 15-111
"తరుణి కూటమి గంటే దప్పిదేర్చనే వలే
తరకానివలె నుంటే తమి యాడది" 7-227
"తెరలోనుండఁగా గుట్టు దెలుసుకొనుంటేను
తరకానివలె నేల తమకించేవే" 13-126

తరతమ్యము: వి. 'తారతమ్యము'నకు వ్యావహారికరూపం కావచ్చు.
"దగ్గరి కొలుతు నా తరతమ్య మెంచుకోను
సిగ్గువడ నిట్టే నిన్నుఁ జేరి పాడుదు" 2-323

తరపువెట్టు: ప.బం. (?)
"పాటించి శ్రీవేంకటేశ పాయము తరపువెట్టి
మేటి పంతములు చూపీ మేలమాడరా" 19-215

తరవాతి పనులు: (8) (?)
"తరవాతి పనులింకఁ దనకో నాకో" 7-301

తరవాయి: వరుస.
"పురుషజంతువులెల్ల పొంచి యాఁడుజంతువుల
తరవాయిగొని వెంటఁ దగులు గాని" 4-134

తరవాయిగొను: స.క్రి. వెన్నంటు, వరుసబెట్టు
"పురుషజంతువులెల్ల యాఁడుజంతువుల
తరవాయిగొని వెంటఁ దగులుఁగాని" 4-134

తరవు: వి. నిర్బంధం, ప్రేరణ.
"జవ్వనమే తరవైతే సకు లేమి సేతురే
ఇవ్వల మీరేల నేరాలెంచుకొనేరే" 28-426

తరవులువెట్టు: ప.బం; అ.క్రి. ఇది తరువులు పెట్టు కావచ్చు, నిర్బంధాలు పెట్టు.
"సాహసభూతము మన హింసలకే చూపించి జేయి
దాహపుటాసలు వెనకముందరల తరవులు వెట్టీని" 2-300

తరితీపు : వి. 1. మోహం, వలపు 2. కీర్తి, సంతోషం 3.తమకం, తహతహ 4. బాధ 5. అపేక్ష, అతిశయం, చెలిమి, కోరిక, శృంగారచేష్ట. (అపేక్ష అని ఆం.ప.ని .)
"ఇన్నిటా శ్రీవేంకటేశ! యేలితివి వేడుకతో
యెన్నేసి తరితీపుల నింపు పుట్టించేవయ్యా !" 27-532

తరితీపులఁబెట్టు : స.క్రి. సంతోషపెట్టు, వలపించు, బాధపెట్టు.
"చూపట్టుఁగాంతలనెల్లాఁ జొక్కించి చొక్కించి తరి
తీపులఁబెట్టీ నిదే తిరువేంగళనాథుఁడు" 18-229

తరితీపుసేయు : స.క్రి. 1. సంతోషపెట్టు, వలపించు 2.బాధపెట్టు 3. గర్వించు. (తరితీపు = ధృతి ఉపేక్ష - ఆం.ప.ని.)
"దంటతనముల నెంత తరితీపుసేసేవే" 26-548
"తలవంచుకోనేల తరితీపు సేయనేల
పలికితే నీతో మారు పలుకగవలదా" 14-475
సంతోషపెట్టు, వలపించు :
"తప్పక చూచుకొంటా తరితీపు చేసుకొంటా
అప్పటి మేకులు సేసీ నంగన నీతో" 14-587

తరివట్టుకొను : అ.క్రి. అవకాశాన్ని జారవిడుచుకోకుండా కాచుకొను . (F.N 23 సం, 215 పు.)
"తలఁప మోవితేనె తరివట్టుకున్నది
పిలుపు మానె రావయ్య పెనఁగక ఇపుడు" 23-321

తరివెన్న : వి. అప్పుడే తీసిన వెన్న, హైయంగవీనం.
"తిరిగి కవ్వపుఁ గొలదిక్కఁ గాగిలించి పట్టి
తరివెన్న వెట్టుమనీ తగునే యీ కృష్ణుఁడు" 16-420

తరువరివాఁడు : (తరువు+అరి+వాఁడు) నిర్బంధించేవాఁడు, బాధించేవాఁడు (తరువు = ఈయవలసిన ధనాధికము నిమ్మని చేయు నిర్బంధము), నిర్బంధము సూ.ని.
"తాలిమి యించుకా లేని తరువరివాఁడమ్మ
ఆలరీఁడు నీ బిడ్డఁడదె బుద్ధి చెప్పరో" 22-69
ఈ పదం తఱువలి కావచ్చు. తఱువలి అంటే ఉద్ధతుడు (వ్యు.) గౌరిపెద్దివారు దీనికి ఉత్తరువు కలవాడని, ఉత్తరువులతో లేక ఆత్రముతో నితరుల నుపద్రవపరచు వాడని భావమని చెప్పినారు. (22 సం. పీఠిక 7 వ పుట.)

తరువలి : వి. తరుణవయస్కుడని సం.ప.స. (13వాల్యూం)
"ఘనయాచకునకు కనకమే బ్రహ్మము
తనువే బ్రహ్మము తరువలికి" 1-457

తఱఁగరితనము : వి. దళారితనం.
"ఎఱుఁగుదు మిందరము నీ వలపు
తర(ఱ) గరితనముతో దాఁచ నేమిటికే" 21-357

తఱగరివాఁడు : వి. బేరగాడు, జట్టిగాడు 'తఱుగరి'కి వ్యావహారికరూపం.
"తఱగరివానివలె తచ్చితచ్చి మాఁటాడేవు
యెఱఁగవా నా గుణ మింతకతొల్లి" 23-170

తఱచు : వి. బాహుళ్యం, ఆధిక్యం .
"మానాపతులము నీ మర్మములెత్తేమా
తానకపునిట్టూర్పుల తఱచులే సాక్షి" 13-15

తఱమీ : (?)
"తఱి నా హృదయము తగ వికసించిన
తఱమీ నజ్ఞానతను మదినాకు" 1-447

తఱవాత : క్రి.విశ. 'తరువాత'కు వ్యావహారికరూపం. వ్యావహారికంలో బండి ఱ ఉండడం విశేషం.
"ఎఱఁగక కొసరితి నెడ్డనయ్యా తఱవాత
నన్నియును తానే వచ్చీనయ్యా" 14-236

తఱవు : (?)
"తఱవు రతికి రేఁచె తనువెల్లా నెచ్చరించె
వొఱపైన కొనగోరు వొప్పదా యేమి" 19-470

తఱి : తరువాత, అదను, తెరపి, అవకాశం, సమయం, ఈడు, వయస్సు, సమీపం.
"తఱి నిహపరము లితని దాసులిచ్చిరి" 3-99

అదను :
"తటితో నా మాఁట తానే తలఁచుకొమ్ము నీవే" 20-135

తలఁజుట్టు : పబం; స.క్రి. బలవంతంగా అంటగట్టు.
"పలు లంపటములచేఁ బడుట దుఃఖంబులు
తలఁజుట్టుటే కాక తనకేమి కలదు" 1-150

తలఁబాలు : (తలన్+ప్రాలు) తలంబ్రాలు, వివాహ సమయంలో వధూవరులు ఒకరి తలమీద మరొకరు పోసుకొను మంగళకరమైన పసుపు కలిపిన బియ్యపుగింజలు.
"తెలినవ్వు సిగ్గులనే తెరలు వట్టించితివి
తలఁబాలు వోసితివి తమకము" 27-179

తలకిందగు : ప.బం; అ.క్రి. తారుమారగు, వ్యత్యస్తమగు.
"కోవిల పలుకదు కొమ్మా విలతల
దైవిక మిదివో తలకిందాయ" 5-44

తలకిందుగ పడు : ప.బం; అ.క్రి. తలకిందులగు.
"బలువునఁ బారంగ మోహపుపాశము తన మెడఁ
దగిలిన తలకిందుగఁ బడు టెల్లను తన కిది
ప్రియమౌనో" 1-306

తలకూడు : అ.క్రి. 1. సిద్ధించు, నెరవేరు 2. కలుగు, సంభవించు.
"గుణములెల్ల నిర్గుణముకాక
తలకూడదు శాంతంబు" 1-451

తలకెక్కు : (తలకు+ఎక్కు) ప.బం; అ.క్రి.1.ముమ్మరించు, అతిశయించు 2. మనసుకు అంటు, బోధపడు.
అతిశయించు :
"కలసినప్పటికి కడదొడమ లేక
తలపోఁత వలపులు తలకెక్కును" 17-399
"తడవుగా నవ్వఁగాను తలకెక్కె వలపులు
యెడయక యిందులో నీ వెందుకయ్యేవే" 22-511

తలకెత్తుకొను : (తలకు + ఎత్తుకొను) ప.బం; స.క్రి. నెత్తిన వేసుకొను, భారం వహించు.
"వసముగాని పని వడిఁ దలకెత్తుక
అసురుసురు గానిదది సుఖము" 3-545

తలకొలుపు : స.క్రి. లగ్నంచేయు.
"తలఁచేటి తలఁపులు ధరణిధరుపై
తలకొలుపుదురా తదీయులు" 1-402

తలగడ : వి. తలకింద ఎత్తుగా ఉంచుకునే దిండు. (పడుకునేప్పుడు తల ఉంచుకునే దిక్కు, తల ఉంచుకునే ప్రదేశం.)
"మొలనూలిగంటలాపె ముంచి నీ పాదాలు గుద్ది
తలగడ వెట్టి మోముతావి నలయ" 22-187

తలగడబిల్ల : (2) వి; ప.బం. దిండు, మెత్త చూ : తలగడ.
"తరుణి గుబ్బలు నీకు తలగడబిల్లలుగా
నొరగుకొన్నాఁడవు వుబ్బున నీవు" 18-139

తలగాచు : స.క్రి. రక్షించు.

తలగుండుగండ : వి. చూ : తలగుండుగండఁడు.
"సోదించు మారీచుని తలగుండుగండ" 4-3

తలగుండుగండఁడు : (2) వి; ప.బం. శత్రువు, భయంకరమైనవాఁడు, ప్రాణాంతకుడు.
"ఘోరరావణుని తలగుండుగండఁ డీతఁడు
వీరాధివీరుఁడైన విష్ణుఁడీతఁడు" 28-503
"దావతి నరకాసురు తలగుండుగండఁడు
శ్రీవేంకటాద్రిమీఁదఁ జెలఁగే కృష్ణుఁడిదివో" 17-144

తలతల : ప.బం. తలకు, ఒక్కొక్కరికి. (పద.)
"పులకలే చూపేవు పొంది కరఁగితినంటా
తలతల అందు కేమి తగదా నేఁడు" 11-356

తలతిక్క : వి. పట్టిన పట్టు వదలక పోవడం.

తలదీసుకొను : ప.బం. మిక్కిలి పరితపించు.
"తవిలి నవ్వితే నే తలదీసుకొనేవు" 13-169

తలదోఁక : ప.బం; వి. మంచీ చెడ్డా, ఒక పద్ధతి.
"కలవోసినను(నీవు)ట్ల కడ యేలె?
తలదోఁక యేరువడె తగులింక నేలె" 22-30

తలదోఁకలేని : *విణ; ప.బం.* ఒక పద్ధతి లేని, ఒకరీతి లేని, మొదలు తుద లేని.
"తలదోఁక లేని చిత్తమున వలపులఁబొరలు
పొలఁతులింతకు మున్ను పుట్టరో చనరో"
5-356

తలనీలాలు : *ప.బం; వి; బహు.* తలవెండ్రుకలు.
"తలపోఁత లన్నియును తలనీలాలై నించి
చెలిఁగప్పుకొని పెనుఁజీఁకటు లాయను"
12-434

తలపట్టు : *వి.* తలనొప్పి వచ్చినపుడు తలకు వేసుకునే మంచిగంధం మొ॥ వాటి పట్టు.
"తలపట్టుతో నుందాన దగ్గరకు రాకురా
తలపట్టి నీమీదఁ దగులాయెనే" 15-48 old

తలపిడి కొలుపిడి : *ప.బం.* ఈ పదానికి సంపాదకులు సం.ప.స.లో (2 సం.381 పు.) ఈ విధమైన వివరణ ఇచ్చినారు. "తలపిడి, కొలుపిడి – ఈ పదముల కర్థము నిఘంటువులలో కానరాలేదు. సొమ్ము శబ్ద సాహచర్యంతో నే నిట్లూహించుచున్నాను. దండలు మొదలైనవి చేయించునపుడు, ఇన్ని పిళ్ల (పిడుల) కొలత అని చేయించుట నేటికిని సంప్రదాయము. అట్లు చేయించిన సొమ్మును ఎవరైన దొంగిలించి, వారివద్ద పట్టు పడినచో తలపిడి = తొలుత చేయించిన పిళ్ళకొలత, కొలుపిడి = (ఇప్పుడా సొమ్మును పట్టుకున్నప్పుడు) కొలువగా వచ్చిన పిళ్లకొలత ఒకటేఐనచో ఇది నా సొమ్మే అని నిర్ధారించి తీసుకొనునట్లు అనే అభిప్రాయము తోచుచున్నది. ఈ శబ్దమింకను విచార్యము.
"యిలమీఁద తమ సొమ్ము లెవ్వరి వద్ద నుండినా
తలపిడి కొలుపిడి తగిలినట్టు
తొలుత పంచేంద్రియపు దొంగలవద్ద నున్నాఁడ
వెలయ నీ సొమ్మనుచు విడిపించుకొనవే" 2-5

తలపువ్వువాడని : *విణ.* కొంచెంకూడా శ్రమ పొందని.
"తలపూవాడని తరుణినే నేను
నే నలరుఁ జవికలోన యాకెనే కదే" 6-105

తలపూవాడని తరుణి : *ప.బం.* సుకుమారురాలైన స్త్రీ. 6-105

తలపోయు : *ప.బం.* రెండు కొలపాత్రల కొలత సరిచూచు. ఇది రేనాటి ప్రయోగం.
"పొంకాన నదె తలపోసేవు నాతోను
పంకించక నీ కన్నియుఁబోఁజు చూపేఁజుమ్మీ"
14-89

తలమరకాఁడు : *వి.* ప్రధాననావికుఁడు.
"సరిఁ బాపపుణ్యముల సరకులు నించుకొని
దరిచేరె జీవుఁడనే తలమరకాఁడు" 3-388

తలము : *వి.* చేతుల కిందిభాగం. (కాళ్లకింది భాగం)
"వెలనుండి కలఁకలు వెదకేవు మాఁటలకు
తలములు సోకించి తమకించేవు" 27-554

తలము : *వి.* తావు, ప్రదేశం. (శక్తి)
"తల మేల కుల మేల తపమే కారణము
యెలమి హరిదాసులు యే జాతియైన నేమి"
15-285

తలమునుకలు : *ప.బం; అ.క్రి.* అధికం, అతిశయించినది.
"మొనసి చెమటఁదలమునుకల నీటిలోన
పనివడి నీకుఁదపము చేసీని" 7-380

తలమొల : (3) *ప.బం; వి.* మొదలూకొనా; తలాతోకా అన్నట్లు.
"దైవమా నీ మాయ తలమొ లెఱఁగనీదు
కావరపువిషయాల కట్లు వదలవు" 2-4
"తలమొల యెఱుఁగక తఱి నిద్రించేవేళ
వెలి నోళ్లెఱఁగనిది వెట్టి గాదా" 15-67

తలమోఁపు : *ప.బం; వి.* ఎక్కువ, మోపెడు. (పద.)
"తండోపతండములై తలమోఁపులు పనులు
చండిపెట్టి పనిగొను సంసారము" 3-111

తలమోచు : *ప.బం; అ.క్రి.* శిరసావహించు, నెత్తిన పెట్టుకొను (భక్తిశ్రద్ధలతో), ఒప్పుకొను.

"తలమోచి కాఁపురము ధాన్యములు గూడపెట్టు
యిల సంసారము దనకిఁక నెంత గలదో" 3-468

తల రాయి యగు : *ప.బం; అ.క్రి.* బాధాకరమగు. (పద.)
"తల రాయిగాఁగ నెందరికి మొక్కెడిని
తెలివిమాలిన యట్టి దేహి" 1-201

తల ఊాయిసేసుకొను : *ప.బం.* ఎన్నికష్టాలు వచ్చినా ఎవరేమన్నా నిర్వికారంగా ఉండు.
"తలచిన వేళ నెంతవడి నేఁ గోపించినాను
తలఊాయి సేసుకొని తగులుదుగాక" 11-553

తలలూఁచు : *ప.బం; అ.క్రి.* ఆశ్చర్యపడు.
"ఇంతవాఁడవు గాకున్న యేది దూరతనము
వింతకు తలలూఁచేరు వీధికట్టువారలు" 13-171

తల లేదు తోక లేదు : నానుడి; మొదలేదో తుద ఏదో తెలియనంత కలగాపులగంగా ఉందనే అర్థంలో వాడబడే పలుకుబడి. (పద.)
"తల లేదు తోక లేదు దైవమాన మాయలకు
తెలిసియుఁ దెలియక తిరిగేము నేము" 4-368

తలలోఁ బూరిగట్టు : *ప.బం.* అపవాదు కలిగించు.
"తగ వెఱఁగవద్దా తమకించి చెనకేవు
మగువల తల నేల మహిఁ బూరిగట్టేవే" 18-247

తలవంచుకొను : *ప.బం; అ.క్రి.* లొంగిపోవు, అవమానపడు.
"నీ వేల సిగ్గుపడేవు నెట్టన దలవంచుక
భావించి భావించి నన్నుఁ బైకొని మెచ్చీని"
8-34

తలవంపు : *వి; ప.బం.* అవమానం.
"తలవంపులే చెప్పీ దగ నీ సుద్దులెల్లా
పలికే యానతి చెప్పీ బలునిందలు" 26-506

తలవయ్య : క్రి.ప. తలచుమయ్య.
"తలవయ్య మమ్ము నేల తడవేవయ్య" 11-167

తలవాకిటికి తెచ్చు : *ప.బం; స.క్రి.* అవసానదశకు తెచ్చు.
"తెలిఁగనున చూపు దీని చేతలనె పో
తలవాకిటికిఁ దెచ్చెఁ దరుణి ప్రాణములు" 6-135

తలవాకిలి : *వి; ప.బం.* ఇల్లు మొ॥ వాటి ప్రవేశద్వారం, ముఖద్వారం, ఇంటి వెలుపలి స్థలం.

తలవీడు మొలవీడు : *ప.బం; అ.క్రి.* తలమీది వెంట్రుకలూ, మొలమీది బట్టా వీడిపోవు.
"తల వీడి మొల వీడి దంతపుటోవరిలోన
అలమి నాపెయు నీవు నట్లుండఁగా" 20-500

తలవెంట్రుకలందరు : *ప.బం; బహు.* అసంఖ్యాకులు.
"తలఁచి మొక్కే సురలు తలవెంట్రుకలందరు
తలఁచి వరము లడిగేవారలు
తలవెంట్రుకలందరు వారే" 3-538 & 2-301

తలారికము : వి. అధికారం, రక్షణ.
"ఈల గద్దమూఁకలోన యించుక కోడిపిల్లకు
మూలమూలలఁ దలారికములు చెల్లునా"
10-33

తలుపుమాటుది : (తలుపుమాటు + అది) వి. తలుపుచాటు స్త్రీ, ఇంటివ్యవహారాలు మాత్రమే తెలిసిన స్త్రీ.
"తలుపుమాఁటుదాన తలవంచుకుండితేను
బలిమి గల దేవులు పంతములు మానునా"
18-340

తలె : వి. పళ్లెం, తళియకు రూపాం. రా.సీ.; తెలం. ప్రాంతాల మాండలికం.
"కలది కుక్కిమంచము కన్నవారెల్లాఁ బండేరు
తలెతో దొగ్గి నంబలి దావకూళ్లు" 1-370

తల్లికిఁగలుగు ముద్దు దాదికున్నదా : సామెత; బిడ్డమీద తల్లికుండే ప్రేమ దాదికి ఉండదుకదా! అని భావం.
"తల్లికిఁగలుగు ముద్దు దాదికున్నదా
బిల్లరప్రియము లేలో చెప్పేము గాకా" 15-98

తవరులు : *వి; బహు.* (?)
"వెంట నీకె తవరులు వేరె వచ్చు టెఱుఁగము
యింటికిఁ బిలుచుకొంటి యేడకేడో నేను"
17-59

తవుడు దిండి కడబాల లేల : వ్యర్థమనే అర్థంలో వాడబడే నానుడి. తవుడునే ఆహారంగా తీసుకునేప్పుడు వంటవాళ్లెందుకు? అనవసరమే కదా!

"కగ్గు లేక గుల్ల గుల్లే కాక మరి రాయవునా

అగ్గమై తవుడు దిండి కడ బాల లేల" 15-154

తవ్వి కట్టుకొను : ప.బం; స.క్రి. దాచుకొను (పద.), తనకై మిగుల్చుకొను, నెత్తిన వేసుకొను, అనుభవించు.

"జవ్వనము మోఁచేదియు సరి ముదిసేదే కాని

తవ్వి కట్టుకొనేది దాఁచేదేది" 2-271

తవ్వి తలకెత్తుకొను : ప.బం; అ.క్రి. అనుభవించు, సంపాదించు, ఒరగఁబెట్టు, పెద్దగా కూర్చు (పద.) మేలుచేయు, లాభం కలుగజేయు. (తె.జా.)

"రవ్వలనే నిన్ను నిట్టి రతిసేసిన వలపు

తవ్వితలకెత్తుకొంటే తరుణే భూమిని" 7-27

"తవ్వితలకెత్తేవు నీ తగవులు మాకును

వువ్విళ్లూర మా మనసు వొడఁబడీనా" 23-121

తష్టి : వి. (?)

"నష్టి లేదు నడచేది నడవక మానరాదు

తష్టి గట్టుకొంటిఁగాక తా మానఁబొయ్యీనా"

4-197

తహ : వి. సమ్మతి, అంగీకారం, (వ్య.) తమకం, వ్యసనం, ఉత్కంఠ, వేగిరపాటు, అజ్ఞానం.

"ఇల నీ దాస్యంబిది యొకటే సిలుగుల భవముల

జిలుగు మాన్పనదె చిత్తము తహ దీర" 2-376

తహతహ : వి. తమకం, వ్యసనం.

"విన్నదాకా తహతహ విడువదేమో కాని

పన్ని సిగ్గువడైతే పచారించ నిన్నును" 26-398

తా

తాఁకనాడు : ప.బం; అ.క్రి. మనసు నొచ్చేట్లు పలుకు.

"దంటమాటలనె నన్నుఁదాఁకనాడేవు వోరి

జుంటితేనె తీపులెల్లఁ జూరలాడేవా" 5-3

తాఁకుసోఁకు : వి; ప.బం. ఆటంకం (?)

"తారుమారు తాఁకుసోఁకు

తప్పుఁదోపులన్నియు

వోరపారు లేనివెల్ల వొక్కటెకా నిజము" 1-149

తాఁటతూఁటలు : వి; ప.బం. మోసాలు (తె.తె.ని.) (తాఁట = వంచన. వాచ.)

"తాఁటతూఁటలూ నేల తా వచ్చినట్టే వత్తము

పాటించిన నా వలపు పండి పొల్లయ్యీనా" 7-20

-తా : (77) 'తూ' అనే శత్రర్థంలో వాడబడే మాండలిక రూపం. ఉదా :- నవ్వుతా 11-515, చల్లుతా 7-596, మొక్కుతా 13-307 మొ॥. అన్నమయ్య అంతటా 'తా' అనే శత్రర్థకరూపాన్నే వాడినాడు.

-తా : తాళద్యోతకమైన శబ్దం (?)

"శిన్నెక తేవే శెలువుని తా

వెన్నలు సవిగొను వెన్నుని తా" 5-268

తాకుఁజేయు : ప.బం; అ.క్రి. అడ్డుకొను, మార్కొను.

"కొండలవంటి చన్నులు కుమ్మెలుగాఁ దాఁకుఁజేసు

అండనేల కాఁగిలించే వతివా" 26-320

తాచు : స.క్రి. 1. తన్ను, పాదతాడనం చేయు 2. అదుము, అణగఁదొక్కు 3. తాకఁజేయు 4. కొట్టు.

"మరిగితి నలమేల్మంగను నేనూడిగపు

తరుణుల తొడలపై తాచరాదా పాదాలు"

18-557

"యేచి కోపించకతొల్లె యింతిచే సేవ చేయించి

తాచి నీ కాఁగిట నీవు తమి రేఁచవయ్యా"

11-486

తాటకి : (2) వి. 'తాటక'కు వ్యావహారికరూపం, తాటక యనే రాక్షసి.

"రాముఁడుదయించె దశరథునికిఁ దమ్ములతో

గామిడైన తాటకిని ఖండించెను" 4-476

తాటతూఁటలు : ప.బం; వి; బహు. అతుకులపనులు.
"ఏఁటికయ్య మాఁటలు యింకా తాఁటతూఁటలు
యీటువెట్టుకొని నన్ను నే మనేము నేము "
9-233

తాటలుఁదూటలు : ప.బం; వి; బహు. మోసాలు, వ్యత్యాసాలు. (ఆం.ప.ని.)
"ఆఁటదాని యానవేరే అంతరంగాన నుండఁగా
తాఁటలఁదూటలఁ బెట్టి తనియించవలెనా"
14-379
"పోరచి వో రమణుఁడ పొందుదాఁక వినయాలె
తారుకాణ లటుమీఁదఁ దాఁటలుఁదూఁటలునే"
26-87

తాటించు : (2) స.క్రి. 1. కొట్టు 2. మీటు 3. ఒకదానితో నొకటి తాకించు, వాయించు, కలిపికొట్టు 4. చిందులు తొక్కు 5. కోపాదులచే దౌడ లొకదానితో ఒకటి కొట్టు, అప్పళించు 6. పొడుచు 7. కదల్చు 8. ఆలోచించు 9.తాపడంచేయు.
"యీటున శ్రీవేంకటేశ యింతి నిట్టే యేలితివి
తాటించు నీ రతులను దైవారీని" 27-30
"బబ్బిలికాయల రవములు పదనూపురములఁ గెలయఁగ
తబ్బిబ్బుగ నునుపాదము తాటించెద వేలే"
5-164

తాటిమాని నీడ : ప.బం; వి. లేనిది, అతిస్వల్పమైనది.
"రతులలో మాటలు రావిమాని పువ్వులు
తతి విరహపుకాఁక తాటిమాని నీడ" 2-268

తాటోటు : వి. మోసం, వంచన, టక్కుటమారం. (పద.)
"తక్కరి గాదు ఆపె తాటోటుఁగాదు
పెక్కువేసెసి పొగడే యెంత గలదు" 16-183

తాటోటుకాఁడు : విఐ. మాయావికాఁడు, మోసగాఁడు.
"తప్పులే కూడైనట్టి తాటోటుకాఁడవు నీతో
యిప్పుడు నమ్మి నీ పొందులెట్టు నేఁజేసితిరా"
7-10

తాడుపడు : (13) అ.క్రి; ప.బం. బంధితమగు, నిస్సారమగు. తాటిచెట్టువలె నిర్భయంగా నిల్చు - మ్రాన్పడు వంటిది అని సం.ప.స. (13 - 317) కృశించు, దారమగు.
"తాడుపడ్డ మనసుకు దైవము విష్ణుఁడే యని
పాడి కొలిచిరి తొల్లి బ్రహ్మాదులు" 13-317
"వీడనాడ జాలక నే వీడె మిచ్చేఁగాని నీకు
తాడుపడె నీ మనసు తమకానను" 20-130

తాడుపై తపసు : (2) అసాధ్యమైన పని, కష్టసాధ్యం. తాటిచెట్టుపై తపసు అని వాచ్యార్థం.
"పాడి చెప్పేనని వచ్చి పక్షపాతమాడరాదు
తాడుపై తపసు నీవే తలుచుకోవయ్యా" 23-231
"తాడుపై తపసు తమ ధనము ప్రాణులకు"
1-104

తాడుపొడవు : ప.బం. అధికం, మిక్కిలి.
"యీడనె శ్రీవేంకటేశుఁడేలె నన్ను
తాడుపొడవు గర్వము తన కేలే" 23-270

తాడుమీది తపసు : వి; ప.బం. అసంభవం, కష్టసాధ్యం. చూ : తాడుపై తపసు.
"యీడనె నన్ను శ్రీ వేంకటేశ కూడితి
తాడుమీది తపసులు తడవకుమీఁక" 27-209

తాడు లేని కట్టు : వి; ప.బం. అసంభవం, తాడు లేకుండా కట్టు కట్టడం ఉండదు అనే దానిపై వచ్చిన పలుకుబడి.
"గోడలేని చిత్తరువు కొలచీనందే
తాడులేని కట్టు వట్టి తగు లేలే యిఁకను"
19-393

తానకపుఁగానుకలు : వి. స్థిరమైన కానుకలు.
"తానకపుఁగానుకలు దక్కెనో దక్కదో" 23-53

తానకపు కతలు : వి; బహు. చమత్కారపు కథలు.
"సోనగా మై చెమరించి చొక్కేయట్టుగాను
తానకపు కతలెల్లాఁ దలఁచుకోవయ్యా" 23-136

తానకపుజపములు : వి; బహు. స్థిరమైన జపాలు, నైష్ఠిక జపములు (?)
"ఆనుక శ్రీవేంకటేశ అలమేల్మంగ పతివి
తానకపుజపములే తగ మీకు నుతులు" 2-272

తానకపుభోగములు : వి; బహు. చిరంగా ఉండే భోగాలు.
"నానాముఖములు పుణ్యము లెల్లాను
తానకభోగములై తగిలించీని" 4-154

తానకపువేదములు : వి; బహు. శాశ్వతమైన వేదములు.
"యీ నాలుకే కాదా యిందరినిఁ బొగడేది
తానకపువేదములు తడవీఁగాక" 4-44

తానకము : (15) వి. నిఘంటువుల్లో దీనికి పాదు, ఉనికిపట్టు, మల్లయుద్ధంలో జెట్లు నిలబడటం లోని భేదం, వినయాభినయం, దండప్రణామం, తులామానంలో దాళా సరిపుచ్చడానికి ఉపయోగించే రాయి, పడికట్టురాయి, ఒక తరహా పాటు అనే అర్థాలు ఉన్నాయి. వీటితోపాటు చమత్కారం అనే అర్థం లూడా తె.తె.ని. లో చూపబడింది. స్థానం అనే అర్థానికి స్థిరం అనే అర్థం ఉంది కనుక దీనికి స్థిరమైన అనే అర్థం కూడా చెప్పవచ్చు.
"తానెంత నేనెంత తగుల నేమాడీనే
తానకమయిన తన దయలోనిదానవు" 28-382
ఇట స్థిరమైన అనే అర్థం సరిపోతుంది.

తానము : వి. 'స్థానము'నకు వికృతిరూపం.
"వీనుల నిండాక నేను విని తల యూఁచనా
తానాలు దిద్దీని యట్టే దండ నిడికొనుచు"
17-188

తాప : (5) వి. మెట్టు, మణి, రత్నం, నిచ్చెన, ఎక్కడానికి దిగడానికి వీలుగా కట్టిన నిర్మాణం.
"కైవల్యమునకుఁ గనకపుతాపల
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై" 1-117
"తక్కక శ్రీహరిభక్తి తాపలు సేసి యెక్కిరి
చక్కఁగా వైకుంఠము సనకాదులు" 1-490
"తాప లేక మేడ లెక్కఁ దలఁచేము" 1-65

తాపపుండ్రములు : వి; బహు. చక్రాంకనములు మరియు ద్వాదశపుండ్రములు, ఇవి శ్రీవైష్ణవ సంస్కారాలు.
"యెంచఁ దాపపుండ్రనామహిత
మంత్రయాగమని
పంచసంస్కారము చెప్పే పాంచరాత్రధర్మ
మిది" 15-113

తాప లేక మేడ లెక్కఁదలఁచు : ప.బం. అసాధ్యమగు పనికి పూనుకొను, మెట్లు లేకుండానే మేడలెక్క దలచడమని వాచ్యార్థం.
"తాపలేక మేడలెక్కఁ దలఁచేము" 1-65

తాపి : వి. తాపికత్తె. (సూ.ని.లో ఈ పదానికి సంకేతస్థలమని అర్థం చెప్పబడింది. కాని ఈ అర్థం ఇక్కడ పొసగదు.)
"తీపుల మాటలఁ బోదు తేటల వెన్నెలఁ బోదు
తాపియై నిన్ను బోదించేదానిఁ గంటేఁగాని"
11-355

తాపికత్తె : (తాపి + కత్తె) సంధానం చేసే స్త్రీ, కుట్టని. (శ.ర.)
"బాపుబాపు నేఁజేసిన భాగ్యమెట్టిదో
తాపికత్తెఁ జేసి నన్ను దయఁ జూచితివిగా"
27-479

తాపికాఁడు : (తాపి + కాఁడు) తార్పుడుకాడు, విటీవిటులను తార్చేవాడు, సంధానకర్త.
"చెల్లెలి నెత్తుకపోను సెలవిచ్చే మరఁదికి
కొల్ల తాపికాఁడు కాని గుణమేఁటిదే" 14-201

తాపితనము : (తాపి + తనము) తార్పుడు, సంధానం చేయడం, కుట్టనీత్వం.
"కడనుండి నవ్వుకొంటా గలపే వొకరొకరిఁ
దడవక మానవే నీ తాపితనాలు" 29-462

తాపు : స.క్రి. అదుము, నొక్కు, తగులుకునేట్లు చేయు. (శ.ర.)
"శ్రీపతి పంపిటు సేసితి మింతే
తాపి మమ్ముఁ దగులఁదగవేది" 4-254

తామర : పద్మం, అన్నమయ్య 'తామెర' అనే పదాన్నే ఎక్కువగా వాడినాడు. 'తామర' పదం అతివిరళం.

"తామరల విరులపైని తగు శాలిగర్భములు
ఆ మీఁద నరఁటులును అంగజులేరు" 26-362

తామరతంపము : *ప.బం;* వి. పరంపరాభివృద్ధిగా అభివృద్ధిచెందేది, అభివృద్ధి.
"అరిది విశ్వకుటుంబియైన వీనికి మొక్కరో
పరఁగ దామరతంపముగాఁ జేసీని" 15-180

తామరలోని కాంత : వి. లక్ష్మీదేవి.
"గట్టిగఁ దామరలోని కాంత మానితినని
గుట్టుదీర నానవెట్టుకొనక నిన్నొల్లను" 6-166

తామరాకగు : *ప.బం;* అ.క్రి. సుకుమారమగు.
"ఆకడఁ దామరాకైనందుకు నెగడవెట్టి
వాకిటఁదన్ను నాగినా వగపు పోదు" 17-30

తామరాకునీరు : *ప.బం;* వి. అస్థిరం, చంచలం.
2-445

తామసించు : (2) అ.క్రి. ఆలస్యం చేయు, జాగు చేయు.
"ఏమమ్మా మగువా నీ వింత సేతురా
తామసించనేఁటి కిఁక దయఁజూడవమ్మా"
24-198

తామెర : (30) వి. 'తామర'కు వ్యావహారిక రూపం. అన్నమయ్య పెక్కుచోట్ల 'తామెర' పదాన్నే వాడినాడు.
"తామెరలవంటి వేమో తరుణి నీ కన్నులు ఆ
తామెరలే మరునికి తగ బాణాలు" 19-523

తామెరకన్నులది : వి. తామరల వంటి కన్నులు గల స్త్రీ, పద్మాక్షి.
"తామెరకన్నులదాన తామెరచేతులదాన"
20-592

తామెరకొలను : వి. తామరకొలను.
"తామెరకొలనువలెఁ దగుఁ దిరుచేల చాతి
కోమలు లిద్దరుఁ దాను కుచ్చళ్లు వోసి" 14-368

తామెరచేతులు : *వి; బహు.* పద్మమువంటి చేతులు.
"తామెరచేతులఁ దగఁ బూజించీ
నామని సన్నల నతివ" 26-189

తామెరతొట్టె : వి. (?)
"తామెరతొట్టెలలోన తగిలి తా నుండుఁగాన
తామెరకన్నులఁబోలి తనరినది" 22-64

తామెరపాకు : (తామెర + ఆకు) వి. తామరాకు.
"తామెరపాకుల నీరు తగనందు నంటునా"
2-445

తామెరమోముది : (తామెరమోము + అది) తామరలవంటి ముఖం కల స్త్రీ, పద్మముఖి.
"తామెరకన్నులదాన తామెరచేతుల దాన
తామెరమోముదాన తడవే దేమి" 20-592

తాయిమక్కళాలు : (2) *వి; బహు.* (తాయి = తల్లి, మక్కళ్ = బిడ్డలు) తల్లీబిడ్డలు (దోబూచులు, దాగుడుమూతలు) ఇది కన్నడపదం.
"ఆయ లేరే యేమి చెప్పే రాతని సుద్దులు నాకు
తాయిమక్కళాలే కాక దయ గద్దా తనకు"
17-303

తారము : వి. నాలుగుకాసుల రాగినాణెము.
"తనుఁగొలువ కూడితే తారము వెట్టఁడేలిక
పెనఁగి కొలువకున్నఁ బెట్టు దేవుడు" 15-52

తారవిద్య : వి. కాళి మొదలైన దశమహావిద్యలలో ఒకటి.
"తారవిద్యఁ గంటిమి, తగిలి నాసాగ్రమందు
మేరతో ద్రిష్టి నిలిపి మేలుఁబొందుట" 1-452

తారసము : వి. తలపాటు, ఎదుర్కోవటం.
"తార వలచినయపుడె తరుణి రతుల
తారసము లెట్లుండు తగవు లెట్లుండు" 6-27

తారు(ఋ) : అడఁగు, మఱుగు, దాగు, మరుగున పడి వెళ్ళు, నక్కుతూ పోవు, చొచ్చు, ప్రవేశించు, కృశించు, చెడు
"నేరమి సేసినవాఁడు నిక్కపుటేలికఁ గని
తారి తారి యిందునందు దాఁగినయట్టు" 3-107

తారు : సమీపించు.
"అరసి నేనడుగఁగ నన్యులిచ్చే యీవులు
తారి పూర్వకర్మాది దైవమే యిచ్చీని" 2-440

తారు :
"తారి బియ్యము దంచితే తవుడు
వెళ్లకుండునా" 7-194

తారు : వ్యాపించు, పుట్టు.
"తారి తారి పయ్యెదెల్లాఁ దడిసెఁ జెమటల"
14-43

తారుకాణ : 'తారకాణ'కు రూపాం. దృష్టాంతం, నిదర్శనం, ప్రమాణం.
"చెప్పఁగదె మీ సుద్దులు చెవులార వినేము
తప్పక వలపులెల్లా తారుకాణ వచ్చేనా" 26-351

తారుకాణ సేయు : సత్యమని చూపు, రుజువుపరచు. (వ్యు.)
"యెంత సేసినాఁ దనపై యిట్టే నిందలు మోపీనా
కాంతల దెచ్చేల తారుకాణ సేసీనే" 29-357

తారుకాణించు(కొను) : తారకాణించు, నిరూపించు, దృష్టాంతము చూపు, మూదలించు.
"ఎక్కడికిఁ బోనందువు యెవ్వతె నంట నందువు
గుక్కక తారుకాణించుకొందుఁగాని రావయ్యా"
13-436
"ఆ రీతి నీవు దొరవు ఆఁటదాన నేనింతే
తారుకాణించఁగరాదు తలఁపులో వలపు"
26-262

తారుమారు : *అ.క్రి; ప.బం.* తారుమారగు.
"కూరుములు గొసరుతా గోరఁజెమట చిమ్ముతా
తారుమారై వలపుల తన్నుఁ దానెఱుఁగదు"
17-181

తాలముచేయి : (2) వి. తాళపుచెవి, బీగము.
"ఏల లోఁగి నేల వీఁగీ నేల మొక్కినే
తాలముచేయి ఉన్నది తన చేతఁగాదా" 28-408

తాళుకొను : అ.క్రి. మాం. ఆలసించు. తెలంగాణంలో కొంచెం 'తాలి' రా అనే వ్యవహారం ఉంది.
"కాల మక్షయము సేయ కర్మము ఫలించజేయ
తాళుకొని మరపించ దలపించ
పొలుపడి శ్రీవేంకటపతియై వేదాలు చెప్పే
యేలిక యొకానొక యీశ్వరుఁడు గలఁడు"
2-319

తాళ్లపాకన్నమాచార్యులు : వి.తిరుపతి వేంకటేశ్వరస్వామిపై సుమారు ముప్పై రెండు వేల సంకీర్తనలు రచించిన తొలి తెలుగు వాగ్గేయకారుడు.
"ఆముకొన్న తాళ్లపాకన్నమాచార్యులు
వేమరు మెచ్చిన శ్రీవేంకటనిలయా" 2-24

తావళించు : (తావళము = అవకాశము అని సూ.ని.) ఇక్కడ అవకాశం చూచుకొని, యథావకాశంగా, ఆలస్యంగా అనే అర్థాలు కావచ్చునని సం.ప.స. (16-429 పు.)
"కోవరపు రాకాసులఁ గొట్టిన వొరటువాఁడు
తావళించి వొరసేనా తనతో నేను" 21-3
"నీవు విచ్చేశుండఁగాను నే లోన జలకమాడి
తావళించి వచ్చుదాఁకా దడవాయఁగా" 16-259

తావికొను : స.క్రి. వాసనచూచు, రుచిచూచు. కు.సం. లో ఈ ప్రయోగం ఉంది. వ్యాఖ్యలో ఈ పదానికి అటునిటు పొలయించు అనే అర్థం ఇవ్వబడింది.
"కావికన్నుల నాతనిఁ గమ్మటి నాఁటఁజూచేవు
తావికొని యెంత గబ్బితనమే నీది" 21-268

తావిబెల్లములో పంచదార చల్లుట : *ప.బం; వి.* గుణాధిక్యం కలిగించటం.
"నీవు మాటలాడినట్టె నేనూ మాటలాడితేనూ
తావిబెల్లములోఁ బంచదార చల్లుట" 25-311

తావు : వి. ఆశ్రయం.
"కావించి కోరికలిచ్చే కామధేనువా
మమ్ము తావై రక్షించేటి ధరణీధరా"

తావుఁగుంటెన : వి. అందుబాటులో నున్న కుంటెన. (కుంటెన = తార్చువాడు, తార్చేది)
"శ్రీవేంకటపతిఁ జెందెటి యాసలు
తావుఁగుంటెనలఁ దనిసీనా" 9-113

తావుకొను : *ప.బం; అ.క్రి.* 1.నెలకొను 2.ఉండు 3.కుదిరిక, కలిగియుండు 4.తాళు, ఓర్చు

5.తాల్చు, వహించు 6.చిత్తస్థైర్యంతో ఉండు, వసించు.

"తావుకొని యెప్పుడూఁ దనవాఁడౌటే భాగ్యము

యే వనితల నేరుపు లిఁకనేమి చెప్పేరే" 24-274

తావుగా: క్రి.విణ. (?)

"తావుగా రమించితి తగులంత గలదా" 9-168

"శ్రీవేంకటేశ నేను జిగి నలమేల్మంగను

తావుగాను రమించితి తగులింత గలదా" 9-166

తావుదావులు: (తావులు + తావులు) మిక్కిలి సువాసనలు.

"పూవువలె నిద్దరము పొందులు సేసేటి వేళ

తావుదావులు మోవక తప్పించుకొనేనా"

13-246

తాసు: (22) వి. త్రాసు (రేఫ లేని రూపం) తరాజు, తూకం వేసే సాధనం, తుల.

"తాసున వేసి చూచితే తనకేమి బాఁతే" 19-479

"వలపు దూఁచే తాసువలె నైతి" 7-183

పాము:

"తాసువలె పెనఁగుచు తలమొల యెఱఁగము

సూసకపుఁబెండ్లి మిమ్ముఁజూచి నేరవలెను"

23-200

"తాసువలె పెనఁగీని తరితీపు సేసేని

మూసినముత్యమువలె మొక్కుమొక్కీ నీకును"

19-255

తి

తిక్కవట్టు: (తిక్క+ పట్టు) ప.బం; అ.క్రి. తిక్కరేఁగు, పిచ్చిపట్టు.

"తిక్కవట్టి నాకు నాకే దేవతలకెల్లా మొక్కి

వొక్కరివాఁడఁగాకుందు వుస్సురనుకొంటాను"

3-98

తిక్కు: (2) అ.క్రి. తిరుగు, మెసలు, మిగులు.

"తిక్కుముత్తేల కుచ్చుల తిరుతేరు

తెక్కుల ప్రతాపించీ దిరుతేరు" 4-320

తిక్కుముక్కులు: వి; బహు. దిక్కుమొక్కులు, అండదండలు. (వ్యు.)

"దిక్కెవ్వరు యీ తీదీపులలో

దిక్కుముక్కులకు దేవుఁడె కాక" 1-81

తిట్టపెట్టు: (తిట్టము +పెట్టు) తిట్టము = చిత్రం గీయడానికి ముందు రేఖలతో వేసుకునే స్థూలాకారం, దాన్ని వేయు. "పట్టకు నీ వంతేసి బలిమిసేసి

తిట్టపెట్టి నీవు దిద్దిన దానఁగానా" 25-205

"దిట్టము చేసి కావచ్చు. ఈ వస్తువు స్వభావము ఇట్లా అని నిర్ణయించటం. 'తిద్దు' నకు 'దిద్దు' ప్రయోగము ఈ వాఙ్మయమున ఎక్కువగ నుండుటచే దిట్టమును తిట్టముగ వ్యవహరించిరేమో యని నా ఊహ" అని సంపాదకులు (సం.ప.స. 2-381)

"చెట్టుల కెవ్వరు బుద్ధిచెప్పేరు తతికాలాన

బుట్టి కాచి పూచి నిండాఁ బొదలుమని

గుట్టుతో జైతన్యమే గుణము లన్నిటికి

తిట్టపెట్టి రచించిన దేవుఁడింతే కాక" 2-45

తిట్టము: వి. చిత్రప్రారంభంలో రాసే స్థూలాకారం. Sketch క. తిట్ట.

"బేడిదపుఁ బెద్దలెల్లాఁ బెట్టిన తిట్టములంటా

యీడుకుఁ జేసేఁగాక యిందేమి గలదు" 2-74

"ఇట్టె శ్రీవేంకటేశ యేలితి విందు వంకనే

తిట్టపు మా గురు నుపదేశమెగ్గుడు" 2-483

తిట్టువాటు: ప.బం; వి. అపవాదు, నింద (పద. వ్యు.) రూపాం. తిట్టుపాటు.

"కోపగింతువట నీవు కోరి నే నోరువవలెనా

దీపించ నన్నిటా నీకుఁదిట్టువాటని కాక" 7-138

తిట్లాడు: (తిట్లు + ఆడు) ప.బం. వాక్కలహమాడు, తిట్లతో కయ్యంపెట్టుకొను, కొట్లాడు.

"పెనఁగుచు నొండొరులు ప్రియములు నటించఁగా

జయమంది తిట్లాడే చలమెల్లఁ బాసె" 21-381

తిత్తిదేహము: వి. తోలుతిత్తి వంటి దేహం.

"మత్తిలి యీతనికంటే మరి లే దితరములు

తిత్తిదేహపు బ్రదుకు తెలిసేటివారికి" 1-502

తిద్దు: స.క్రి. దిద్దు 'ద'కారానికి బదులు 'త'కార ప్రయోగం. తీర్చు, చక్కబరచు.
"బుద్ధులెవ్వరు చెప్పిరి పుట్టినట్టి మెకాలకు
తిద్ది చన్నుదాగి పూరి దినుమని" 2-45

తిద్దుపడు: ప.బం; అ.క్రి. దిద్దుపడు, శిక్షణపొందు.
"తీపుల నీ పాలఁజిక్కి తిద్దుపడె నీ గుణమెల్ల
మోపుగా వలచితిమి మొక్కేము నీకు" 27-292

తిద్దుబడి: వి. దిద్దుబడి, సవరించడం, శిక్షణ. (వ్యు.)
"పొద్దొక బై రూపము పొదలేటి యీ వయసు
తిద్దుబడి గుజ్జుము హత్తిన గుణము" 4-24

తిద్దువడు: అ.క్రి. దిద్దువడు, శిక్షణపొందు.
"తిద్దువడె నీ గుణాలు తేటతెల్లమిగను" 19-224

తినఁదిన వేమెల్లాఁ దీపైనట్టు: ప్రయత్నం చేస్తే ఏదైనా సాధ్యమైనట్లు.
"వెనకఁదలఁచుకొంటే విజ్ఞానములే పెక్కు
తినఁదిన వేమెల్లాఁ దీపైనట్టు" 4-80

తిప్పకాయ: వి. శుంఠ, కొంటెవాడు, ఒకతిట్టు. (పద.)
"విప్పక పయ్యెద నెరివిరుగకుండాఁ గప్పె
దిప్పకాయ దీని గుట్టు తెలియరే చెలులు"
12-355

తిప్పదీరగు: అ.క్రి. బాధల హద్దు అగు. (త్రిప్పు = బాధ, తీరుల = హద్దు)
"దెప్పరపు భవములఁ దిప్పుదీరైతి మిదె
కప్పుకొని కావఁగదో కర్మమా" 4-332

తిప్పదీరాడు: ప.బం; స.క్రి. తీర్చిదిద్దు. (పద.)
"జగదేకహితములుగ సరసతలు సౌఖ్యములు
దిగులు వాయఁగ నితఁడు దిప్పదీరాడు" 1-358

తిప్పపెంటలు: వి; బహు. (తిప్ప = కొండ అని ఆం.ప.ని.) తిప్ప = దిబ్బ, పెంట = చెత్త చెదారం. దిబ్బల్లాగా ఉన్న చెత్తాచెదారం.
"మక్కువ నింతా నమృతమయమైనఁ గోడికి
తెక్కులఁ దవ్వఁబొయ్యేది తిప్పలపెంటలే" 2-33

తిప్పిటిమూతులవారు: వి; బహు. తిరుగుడు మూతులవారు.
"తిప్పిటిమూతులవారు దేహము దాఁచేటివారు
చెప్పఁబోతే పస లేదు చెల్లఁబో సంసారమా"
17-323

తిప్పుఁదీరులాడు: ప.బం; స.క్రి. తీర్చిదిద్దు.
"కప్పి రెండు దునుకలు గూడినవాని
తిప్పుఁదీరు లాడే దేవుఁడు" 1-111

తిప్పుదీరాడు: ప.బం. చూ: తిప్పుదీరులాడు.
"జగదేకహితములుగ సరసతలు సౌఖ్యములు
దిగులు వాయఁగ నితఁడు దిప్పుదీరాడు" 1-358

తిప్పుదీరులాడు: ప.బం; స.క్రి. తీర్చిదిద్దు.
"కప్పి రెండు దునుకలు గూడినదాని
తిప్పుఁదీరులాడే దేవుఁడు" 1-111

తిమురు: (6) అ.క్రి. గర్వించు, త్వరపడు, ఒళ్ళు విరుచుకొను, అతిశయించు, విజృంభించు.
"తమకింటి నీ కతఁడు తమ్ములము వెట్టితేను
తిమురుచుఁ గోపింతురా దేవుళ్ళవొద్ద" 14-546

తిమ్మట: వి. 1.తిరగడం (2.ఆపద (శ.ర.) 3.వర్తనం 4.పరివర్తనం 5.జరగడం 6.విపత్తు 7.కాయకష్టం) నడవడి.
"తెంపరాని ఆస లివి తిమ్మటే బోధించుఁగాక
కంచపు నీ దివ్యనామకతలు బోధించీనా"
15-174

"దిమ్మరివై నీవు కడుఁదిరిగే తిమ్మటలకు
యెమ్మెలు మెరసెనంటే యెంత లేదు" 23-225
"దెప్పరాన నీవు లోలోఁదిరిగే తిమ్మటలకు
యిప్పటి మా యలుకలు యేడకెక్కును"
9-224

తిమ్మటి: వి. (?)
"అచ్చమైన జ్ఞానికి నంతా వైకుంఠమే
చెచ్చెరఁదన తిమ్మటే జీవన్ముక్తి" 4-264

తిమ్మప్ప: (తిరుమల+అప్ప) తిరుమలమీది తండ్రి, శ్రీవేంకటేశ్వరస్వామి, తిరుమలస్వామి,

కన్నడ వాగ్గేయకారుడు పురందరదాసు తన సంకీర్తనల్లో వేంకటేశ్వరస్వామిని తిమ్మప్ప అని పేర్కొన్నాడు. తిరుపతి సమీపంలోని తొండవాడలో ముందు తాను కట్టించిన వేంకటేశ్వరస్వామి దేవాలయానికి తాళ్లపాక చిన్నన్న తిమ్మప్ప దేవాలయమని నామకరణం చేసినాడు.

తిమ్మరాయఁడు : వి. తిరుమలరాయడు, తిరుమలేశుడు, శ్రీవేంకటేశ్వరస్వామి. (తిరు + మల = తిమ్మ)

"దిమ్మరి మాటలాడీనే తిమ్మరాయఁడు
కొమ్మని వరము లిచ్చీఁగొండలరాయఁడు"
20-186

తిమ్మరిపట్టు : ప.బం; అ.క్రి. తిమ్మిరివట్టు.

"మితిలేని రతులఁ దిమ్మరివట్టె దేహాలు
మతివఱచె నిందుకు మందేదొకో" 3-356

తిమ్మినాయఁడు : వి. తిమ్మనాయడు, తిరుమలనాయడు, తిరుమలేశుడు, శ్రీవేంకటేశ్వరస్వామి.

"ఒక్కడవె లోకాన కొడయఁడవు నీవె
దిక్కుగా నెవ్వరు లేరు తిమ్మినాయఁడా" 4-41

తిరముకొను : అ.క్రి. బలపడు, స్థిరపడు, కుదురుకొను.

"పయ్యెదంటి కొసరితి భామను శ్రీవేంకటేశ
తియ్యఁగానె నిన్నుఁగూడె తిరముకోవయ్యా"
20-508

"వరములెల్ల సారెఁ గన్నవారికెల్ల నిచ్చి యిచ్చి
తిరముకొనెను బలిమితోడ దేవటవె వీఁడు"
17-438

తిరుకచ్చినంబి : వి. కంచి నుండి తిరుమలకు వచ్చిన భక్తుడు. కంచి వరదరాజస్వామివారికి వింజామర కైంకర్యం చేసేవాడు. భగవంతునితో సాక్షాత్తుగా మాట్లాడగలిగిన మహానుభావుడు. రామానుజులవారికి భగవద్రహస్యాలు చెప్పినవాడు. వరదరాజాష్టకం ఈతడు రచించిందే. (కచ్చి = కంచి, నంబి = నమ్మినవాడు, భక్తుడు) స్వామి ఈతనిని రెండు పర్యాయములు తిరుమలకు రప్పించుకొన్నాడట.

"కంచిలోన నుండఁ దిరుకచ్చినంబిమీఁదఁ
గరుణించి తనయెడకు రప్పించినవాఁడు"
1-151

తిరుకొడి యెక్కు : అ.క్రి. పవిత్రమైన దీపకళిక వెలుగు.

"తిరుకొడి యెక్కె నదె దేవుని కల్యాణానకు
గరుడపటముపె (పై) డి కంబమందును"
25-432

తిరుగుతిమ్మటలు : వి; బహు. తిరుగుటలు అనే అర్థంలో జంటపదం (?)

"చెలఁగి నే మును సేసిన చేఁతలుండఁగా
మలసినేఁ దిరుగుతిమ్మటలుండఁగా" 1-182

తిరుణామము : (తిరు + నామము) వి. వైష్ణవులు నుదుట నిలువుగా పెట్టుకునే బొట్టు (ఇందులో తిరు శుభార్థకం. నామము = బొట్టు)

"తెలుపు మణుఁగులిచ్చి తిరుణామము వెట్టి
నిలుచుండఁగానే మీరు నివాళు లెత్తరే" 22-242

తిరుణాళ్లు : (తిరు + నాళ్లు) వి. దేవుని ఉత్సవాలు; తిరునాళ్లు అని శ.ర.

"హరుఁడ పోయి రా, అజుఁడ నీవును బోయి
రా
తిరిగి రా మీఁదటి తిరుణాళ్లకు" 1-368

తిరుతేరు : (2) వి. పూజ్యమైన రథం, తిరు శ్రీ శబ్దార్థకం.

"పురుషులలో నెల్లా పురుషోత్తముఁడు వాఁడె
తిరుతేరుమీఁద నేఁగీ దేవదేవోత్తముఁడు"
26-119

"తిరువీథు లేగీని తిరుతేరు
తిరుపు గొన్నట్లాను తిరుతేరు" 4-320

తిరునాళ్లు : చూ : తిరుణాళ్లు.

"వెలయ నిండుమహోత్సవంబు లిన్నియు
నితని విభవంబు లెసఁగు తిరునాళ్లు నాకు"
2-132

తిరుపండికాపు : వి. తిరుమణికాపు, వైష్ణవులు నొసట తిరుమణితో నామములు దిద్దుకోవడం.

"ఇయ్యలమేల్మంగ కాంతులెత్తే తిరుపండికాపు

గయ్యాళి మదరాగము కస్తూరికాపు"

తిరుపట్ల మదనగోపాలుడు : తిరుపట్లలో నెలకొన్న స్వామి మదనగోపాలుడు. చిత్తూరు జిల్లాలో పుదిపట్ల, వెల్లపట్ల మొదలైన ఊర్లున్నాయి. కాని తిరుపట్ల అనే గ్రామం లేదట. ఇతర రాయలసీమ జిల్లాలలోనూ ఈ గ్రామం లేదట. ఈ గ్రామం ఎక్కడుందో పరిశీలించాలి.

"సంగతిగ సకలసంపదలు నీ వేళ

మంగళము తిరుపట్ల మదనగోపాల"

తిరుపణి : వి. భగవంతునికి జరిగే కైంకర్యం.

"తిరుపణి మణఁగెను తిరుగరా దెవ్వరికి

మరల నెలు గియ్యరో మగపారి" 15-118

తిరుపతి : వి. ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లాలో ప్రసిద్ధమైన శ్రీవేంకటేశ్వరస్వామి క్షేత్రం. 108 దివ్య తిరుపతుల్లో ప్రధానమైనది.

"తిరుపతిలోనను తిరమై శ్రీవేంకటాద్రిఁ

గురిసీ వరము లెల్ల గోవిందరాజు" 13-168

తిరుపళచ్చి : వి. తిరుప్పళ్లి విళుచ్చి, భగవంతుని నిద్రనుండి మేల్కొల్పడం. తొండరప్పొడియాళ్వారు (విప్రనారాయణుడు) చెప్పిన శ్రీరంగనాథుని మేలుకొలుపు స్తోత్రం.

"వేకువఁ దిరుపళచ్చి విష్ణునికిఁ జేయరో

ఆఁకటి కొదిగినట్టి ఆరగింపులు" 3-298

తిరుపు : వి. గిరగిర తిరుగుట.

"కందువ తిరుపతి వేంకటపతి మెచ్చఁగ

అందపు తిరుపుల నలమేల్మంగ" 5-24

"తిరుపై యవ్వలవ్వలఁ దిరుగుచుండేటి వేళఁ

దిరిగినట్లు నుండు దిక్కులెల్లాను" 2-75

"తిరుపై యవ్వలవ్వలఁ దిరుగుచుండేటి వేళఁ

దిరిగినట్లనుండు దిక్కు లెల్లాను" 2-75

తిరుపుఁగైదువ : వి. భ్రమించే ఆయుధం, విష్ణుమూర్తి చక్రాయుధం.

"బిరుసైన దనుజుల పీచమణఁచినట్టి

తిరుపుఁగైదువతోడి దేవుఁడు" 5-244

తిరుపుగొను : ప.*బం;* అ.క్రి. తిరుగు, గిరగిర తిరుగు, వ్యాపించు, తిరిగి అడ్డగించు.

"తిరుపుగొని కమ్మటి తీఁగెచేఁతు లటు చాచి

పరఁగ నంగరంగవైభవము మెరసీని" 24-555

తిరుమంగయాళువారు : వి. పన్నిద్దరాళ్వారులలో ఒకరు, పరకాలయోగి.

"తీరని వేడుకతో తిరుమంగయాళువారి

ఆరడి ముచ్చిమికూటి కాసపడ్డవాఁడు" 1-121

తిరుమంత్రద్వయము : వి. తిరుమంత్రము ('ఓం నమోనారాయణాయ' అనే అష్టాక్షరి మంత్రము) మరియు ద్వయము (శ్రీమన్నారాయణచరణౌ శరణం ప్రపద్యే, శ్రీమతే నారాయణాయ నమః అనే మంత్రములు) చూ: ద్వయము.

తిరుమంత్రము : (4) వి. శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఆచార్యునివలన ముముక్షువు గ్రహించే మహామంత్రాల్లో ఒకటియైన 'ఓం నమోనారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్రం, నారాయణమంత్రం. దీనినే మూలమంత్రమని కూడ అంటారు.

"తిరుమంత్రమే నన్నుఁదెచ్చి నీ సొమ్ముగఁజేసె

యెరవులేక కాచుకో యిందులకైనాను" 15-16

తిరుమజ్జనము : వి. దేవతావిగ్రహాలకు చేసే అభిషేకం, తిరుమంజనమని కూడా వ్యవహారం.

"తిరుమజ్జనపువేళ దేవునికి నిదివో

పరఁగ నారదాదులు పాడరో యిందరును"

7-473

తిరుమణి : (తిరు + మన్ను) వి. శ్రీవైష్ణవులు నొసట ఉంచుకునే తెల్లని మృత్తిక, పుండ్రము.

"కాతరపునుదుటికిఁ గల తిరుమణి గురి

పాతకపు నావలనఁ బట్టకుమీ నేరము"

4-266 & 2-57

తిరుమణికాపు : వి. వైష్ణవచిహ్నమైన నామధారణ క్రియ.

తిరుమలగిరి పట్టణము : వి. తిరుమలకొండ మీది పట్టణము, ఎగువ తిరుపతి.

"దేవుఁడా నా దేహమె నీకు తిరుమలగిరి
పట్టణము
కావింప హృదయపద్మమె బంగారపుమేడ"

15-406

తిరుమలదేవర: వి. తిరుమల కొండకు దేవుడైన శ్రీవేంకటేశ్వరస్వామి.

"పాపనీటికింద సతిఁ సంకఁబెట్టుక
తీపుల తిరుమలదేవరైనాఁడే" 24-13

తిరుమలదేవుఁడు: వి. తిరుమలలో వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి.

"దేవశిఖామణి తిరుమలదేవునిఁ దలఁచినఁ
బాయక
భావించిన యీ కామినిభావము లోపలను"

5-138

తిరుమలనంబి: వి. శ్రీవేంకటేశ్వరస్వామికి అభిషేకకైంకర్యం చేసే భక్తుడు. తిరుమల తిరుపతి మెట్లదారిలో ఒక చింతచెట్టు కింద తిరుమలనంబి రామానుజులవారికి ఒక సంవత్సరకాలం రామాయణాన్ని చెప్పినాడట. ఆ సమయంలో తిరుమలనంబికి మధ్యాహ్నంపూజ స్వామికి తప్పిపోతుందనే బాధ పీడించేదట. అతని బాధను గమనించిన స్వామి తన పాదముద్రికలను ఆ ప్రదేశంలో అనుగ్రహించినాడట. వాళ్ళు ప్రతిరోజూ వాటికి పూజ చేస్తూ వచ్చినారు. తరువాత కొంతకాలానికి ఈ పాదాలు హరిజనుల పూజకోసం ప్రత్యేకించబడ్డాయట.

"మచ్చిక దొలఁక తిరుమలనంబితోడుత
నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాఁడు" 1-151

తిరుమాళారు: వి. లక్ష్మీదేవి దగ్గర అభ్యర్థిస్తున్న విష్ణువు.

"తీరె నీ యలుకలెల్లా తిరుమాళారు
తీరని మోహము తోడి తిరుమాళారు" 17-405

తిరుమిక్కిళ్లు: (?)

"ఆలాగువాఁడ నేనని చిలుకజోడుల
వాలు తిరుమిక్కిళ్లకు (?) వడి నిల్చేవా" 7-181

తిరుమేను: వి. పూజ్యమైన శరీరం, శ్రీవైష్ణవుల వ్యవహారంలో పూజ్యార్థంలో శబ్దానికి ముందు 'తిరు' అనే పదం చేరుతుంది. తిరు అంటే శ్రీ అని అర్థం.

"యింతలో సల్లనుండఁగ యిందరు నీ
తిరుమేను
పొంతనట్టే నీలాద్రిఁ బోలునందురు" 7-522

తిరువందికాపు: వి. తిరువందిక్కాప్పు (త) ఈ పదానికి ఆచార్య సర్వోత్తమరావుగారు తమిళ నిఘంటువులో "తిరుమలైయిల్ ఎళుందరుళి ఇరుక్కిన్ఱ వణక్కు తిరువింది క్కొప్పు సమర్పిక్కై కాగ" అనే దివ్యప్రబంధ వ్యాఖ్యానం ఉదాహరించి ceremonial rules for everting the evil at the close of daily worship or festival in a temple అని వివరణ ఇచ్చినారనీ, దిష్టితీయడమని అర్థం చెప్పవచ్చునని వివరించినారు. (తి. అ. నం ; 47 పు – పీఠిక)

"కప్పురపు టారతుల ఘనచందనముతోడ
తెప్పల ధూపముల తిరువందికాపుతో" 24-209

తిరువాముడి: (4) (తిరు+వాయ్+మొళి) అనే తమిళ పదానికి వికృతిరూపం, తమిళంలో ఉన్న తిరువాయి మొళి అనే పేరు గల దివ్యప్రబంధం. (శ్రీయుతమైన నోటిమాట అని శబ్దార్థం) ద్రావిడవేదం. ద్రవిడవేదమగు నాలాయిర దివ్యప్రబంధంలో ఒక భాగం. నమ్మాళ్వారు పాయించిన వేయి పాశురాలు. తిరువాయి = పవిత్రవాక్కు, మొళి = మాట. ద్రవిడవేదం – విష్ణుస్తోత్రాలు 1000 సంకీర్తనలున్న గ్రంథం.

"చదివేరు వైష్ణవులు సారెఁదిరువాముడిదె
కదిసి శ్రీసతి ముందే కాచుకున్నది" 3-484

తిరువాముడి మంటపము: వి. తిరుమల స్వామివారి ఆలయంలో తిరువాయి మొళి అనే దివ్యప్రబంధాన్ని చదివే మంటపం.

"వేళవేళఁ బొత్తులను విందు లారగించుకొంటా
వాలి కొలువుండేఁ దిరువాముడి మంటపాన"

14-368

తిరువాయిమొళి : వి. ఆళ్వారులు ప్రవచించిన గ్రంథాలను, సూక్తులను దివ్యప్రబంధమని అంటారు. అట్టి ప్రబంధములలో తిరువాయి మొళి ఒకటి. ఇది నమ్మాళ్వారుచే చెప్పబడింది. చూ : తిరువామొడి.

తిరువారాధన : వి. శ్రీవైష్ణవ సంప్రదాయంలో భగవంతునికి సమర్పించే షోడశోపచారాలతో కూడిన ఆరాధనం. 'తిరు' తమిళపదం. 'శ్రీ' కి సమానార్థకం. మంగళకరమైన, శ్రేష్ఠమైన అని అర్థం.

"నేనే మెరిగి సేసేనో తిరువారాధన

ఆని మున్నిట బ్రహ్మరుద్రాదులు సేయఁగలేరు" 2-273

"తిరువారాధన వేళ తిరువందికాపువేళ

అరిది యప్పాలు నన్నాలారగించు వేళ" 24-119

తిరువారాధనము : (తిరు + ఆరాధనము) వి. శ్రీవైష్ణవ సంప్రదాయంలో భగవంతునికి సమర్పించే షోడశోపచారాలతో కూడిన ఆరాధనము.

"నే నేమెరిగి సేసేనో తిరువారాధన

అని మున్నిట బ్రహ్మరుద్రాదులు సేయఁగలేరు" 2-273

తిరువీథి : (తిరు + వీథి) వి. దేవు డూరేగే వీథి, మాఁడవీథి, దేవాలయం చుట్టూ ఉన్న వీథి.

"దేవకామిను లాడరో దివ్యదుందుభులు మ్రోసే

దేవుఁడు కోనేటిదండఁ దిరువీథి మెరసే" 12-4

"తిరువీథుల మెరసీ దేవదేవుడు

గరిమల మించిన సింగారములతోడ" 7-192

తిరువుమురువు : ప.బం; వి. తికమక కావచ్చునని, ఈ అర్థంలో శకటరేఫంతో ఈ జంటపదం తమిళ నిఘంటువులో ఉందని సం.ప.స. (15నం.)

"తిరువుమురువు సేసే దిమ్మరీఁడవు

పరుగుపెక్కు విద్యల బయకాఁడవు" 1-12

తిరువెంగళప్పఁడు : వి. తిరుమలలో వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి. చూ : తిరువెంగళేశ్వరుడు.

"పట్టిన చలముతోడఁ బైకొనీని

దిట్టగదే పేరువళి తిరువేంగళప్పఁడు" 16-365

తిరువెంగళేశ్వరుఁడు : వి. శ్రీవేంకటేశ్వరుడు. తిరువెంగళగిరికి స్వామి అని వ్యుత్పత్తి. 'వెంకట'కు 'వెంగళ' తమిళశబ్దం.

తిరువేంకటపతి : వి. శ్రీవేంకటేశ్వరస్వామి.

"మొగమున బిత్తరిచేఁతలు మును లేనివి చెలి కబ్బెను

మగువయు (కు?) తిరువేంకటపతి మమతల పరిణతులు" 5-352

తిరువేంకటము : వి. పవిత్రమైన వేంకటాచలం.

"తిరువేంకటమున దినపెండ్లి గల

తరుణుల పతికినిఁ దలఁబాలో" 17-443

తిరువేంకటేశుఁడు : వి. శ్రీవేంకటేశ్వరస్వామి. (తిరు = శ్రీ)

"తిరువేంకటేశుఁ బొందితి నంటినా యతని

దొరతనము నా గరిమ దోఁచనీదు" 5-113

తిలకించు : (3) అ.క్రి. ప్రసన్నతనొందు. (వా.ని.)

"తిలకించి యిటు నన్ను దిష్టించి చూచీని

బలిమికాఁడన్నిటాను పంతమాడేనా" 24-255

"తిలకించి యిద్దరును తెర వేసుకొనరాదా

వలవని జోలి యీడ వద్దు వద్దు ఇఁకను" 26-290

తిల్లగోవిందరాజు : వి. తమిళనాడు లోని ఆర్కాడుజిల్లా చిదంబరక్షేత్రానికి తిల్లై అని పేరు. ఇది తిల్లమొక్కల అడవిగా ఉండెనట. అక్కడ వెలసిన గోవిందరాజస్వామి. తమిళులు ఈ స్వామిని తిల్లైసిత్రంబలం అని వ్యవహరిస్తారు.

"అమ్మలాల అక్కలాల అతివలాల

దిమ్మరిగదవే వీడు తిల్ల గోవిందరాజు"

"సారె వలపందరాపై జల్లుచున్నాడు

తీరుగా సరసమాడి తిల్లగోవిందరాజు" 13-334

తిల్లగోవిందుఁడు : వి. చూ : తిల్లగోవిందరాజు.

తివియు : స.క్రి. (మరలు, వెనుదీయు) లాగు, పైకితీయు.
"వఱతఁబోయెడివాని వడిఁదీయవలెఁగాక
దరివానిఁ దివయఁగఁ దానేలా" 1-18

తీ

తీఁగనవ్వు : తీగవలె సాగే నవ్వు, మందహాసం.
"తెల్లని మేనితోడ తీఁగనవ్వులతోడ
చల్లని గంధముల వాసనలతోడ" 7-129 old

తీఁగమేను : వి. తీగెవంటి శరీరం.
"చిమ్మల నీ చెమటలఁ జేయవే మజ్జనము
దిమ్మరి నీ మురిపెపు తీగమేనికి" 5-221

తీఁగెఁబోసినట్లు : ప.బం. తీగె పారినట్లు.
"మొగిఁ జంద్రముఖి నురమున నిలిపెఁ గనక
పొగరువెన్నెల తీఁగెఁబోసినట్లుండె" 17-485

తీఁగెమాటలు : ప.బం; వి; బహు. తీగవలె సాగే మాటలు.
"తీగె మాటలాడుకొంటా జేరి సన్నసేసుకొంటా
బాగుగా నెవ్వతో నీ పక్కనున్నది" 2-363

తీఁగెయెలుఁగు : వి. సన్ననిగొంతు, హీనస్వరం.
"తేనెలుగార మాఁటాడీ తీఁగె యెలుఁగులు
కానుకిచ్చి నీ మనసు గరఁగఁజేసె" 29-226

తీఁగెలువారు : ప.బం; అ.క్రి. తీగెవలె వ్యాపించు, వ్యాపించు, వర్ధిల్లు.
"మలసిన కోరికలు మతిలోఁదీఁగెలువారీ
వలపుల చెమటల వానలను" 18-110

తీఁగెలుసాగు : (2) ప.బం; అ.క్రి. అభివృద్ధిచెందు, వ్యాపించు.
"తెలిగన్నులఁజూచితే తీఁగెలుసాగ నవ్వితివి"
6-18

తీఁగెసాగు : (2) ప.బం; అ.క్రి. కొనసాగు.
"తెరలోనికిటు వచ్చి తీఁగెసాగ మాటలాడి
వొరసేవే రమణుని వూరకే నీవు" 26-250

తీఁట : వి. ఉద్రేకం, దురద.
"మరిగించి మరఁగున మాట లేలాడించేవు
తెర దియ్యవయ్య అంత తీఁట గలితే" 11-189

తీఁటతీగె : (2) వి. దురదను కలిగించే తీగె, కసింద.
"తీఁటతీగెలు సొమ్మంటా దేహమునిండాఁగట్టి
తీఁటకుఁగాక బాలులు తెగి పోపోఁగా" 2-167

తీఁడు : స.క్రి. నులిపెట్టు, మెలిపెట్టు, తిప్పు.
"తీఁడేటి మీసాలతోడి దేవదేవసింహము" 3-153

తీఁదీపులు : వి; బహు. (తీపులు + తీపులు) (మిక్కిలిబాధలు) మిక్కిలి మాధుర్యములు.
"తీపులధనములు మీఁది మీఁదనే
తీదీపులు రేఁచీని" 2-300

తీగెసంసారమత్తులు : వి; బహు. తీగెవలె వ్యాపించే సంసారంలో మదించి ఉన్నవారు.
"తీగె సంసారమత్తులు తెలియక వీరివలె
వేగినంతా నయ్యేమంటే వెరవులఁబడవు" 3-119

తీదీపు : (తీపు + తీపు) ప.బం. మిక్కిలి బాధాకరం.
"సంచితపుఁగర్మము జననలయములట
ముంచిన తీదీపే గాక మోదమున్నదా" 4-129

తీదీపులు పెట్టు : మిక్కిలిబాధలు పెట్టు, తీపులనే పదం తెలంగాణంలో శరీరావయవాల నొప్పులను తెలిపే పదంగా వాడుకలో ఉన్నది.
"దేవా! పంచేంద్రియాలు తీదీపులనుఁబెట్టే
నీవే నా యెదలోను నిండుకుండఁగా" 15-5

తీదీపుసేయు : ప.బం. మిక్కిలి బాధపెట్టు.
"తిప్పితిప్పి నా యాసలు తెగి వైష్ణవధర్మానఁ
దెప్పలఁ దేలకుండాను తీదీపు సేసె" 3-80

తీపులఁబెట్టు : ప.బం; స.క్రి. కుతూహలపెట్టు, తమకింపజేయు.
"తీపులఁబెట్టితి నీవే తిరుగనాడఁగ నేల
శ్రీపతి విన్నిటాను నీ చిత్తమింతే కాక" 26-26

తీపులమాటలు : వి; బహు. తియ్యనిమాటలు.
"తీపుల నీ మాటలకు తేరకొన నిన్నుఁజూచి
ఆఁపరాక మెచ్చి మెచ్చి అలముకొనీని" 22-174

తీపులు : వి; బహు. మధురపదార్థాలు, తియ్యనివి.
"తీపులుండఁగాఁ జేదు తిననేటికయ్యా" 23-197

తీపులెక్కు : చవులూరు.
"తేనెల మోవిమాట తీపు లెక్కె వుండుఁగాక
వీనులకు యేమాడిన వింత దోచీనా" 20-411

తీపులోఁగారములు : వి; ప.బం. మంచిలో చెడులు.
"తీపులోఁ గారములేల తెలుపరే విభునికి
యేపునఁ జనవులిచ్చి యేలుకొనుఁగాక"
12-455

తీరుగడ : వి. సమాప్తి, ముగింపు, తెరిపి, పూర్తి. తు. తీర్గడె.
"జగడమునఁబోలె నలసతలేని మమత దను
తెగి వేఁచనే కాని తీరుగడ లేదు" 1-307

తీలు : వి. అణగటం, తగ్గటం (వ్య.) కీడు, చెఱుపు (ఆ.మూ.), ఎక్కువ(తనం), స్తబ్ధం అని 15 సం. పీఠిక.
"మేలు లేదు తీలు లేదు మించీని హరిమాయ"
2-78
"తీలుగా వచ్చితే దేవుని దూరును
యేలో నాఁడే యిది యెఱుఁగడా" 15-53

తీలుగా : నశించేట్లుగా.
"తీలుగా రావణునిఁ జంపి తెగి లంక సాధించి
కాలిన సేనలఁగూడి వచ్చెనటమ్మా" 19-495

తీలుపడు : (2) ప.బం; అ.క్రి. 1. దుర్బలమగు, నిస్సత్వమగు 2. నశించు 3. తగ్గు 4. అణఁగు.
"ఏల నన్ను వేడుకొనే విటు నీవే నేఁగాన
తీలుపడనేర నేను తెలిపే కాని" 26-56

తీలుపఱచు : స.క్రి. అణచు, తగ్గించు.
"కొలుపుచు దినమూ నీ కొండమీఁది నాయకులు
తీలుపరచేరు గదే తిమ్మినాయఁడా" 4 అను. 41

తీవరించు : స.క్రి. త్వరపెట్టు, తొందరపెట్టు అ.క్రి. కోపపడు, చిరాకుపడు.
"సేవలెల్ల సేసేవు చెక్కులేల నొక్కేవు
తీవరించి మాటలాడ దేవరవు గావా" 21-252

తీసిపెట్టయినచోటు : వి. (?)
"ఆసలకు నడియాల మంపీ నచటనుండి
తీసిపెట్టయినచోట తెలుపచోటేది" 20-568

తీసిపెట్టుగాని : వి. తీయుటకు, పెట్టుటకు వలనుపడని లేదా తొలగించుటకు సాధ్యపడని అను అర్థమున నీ ధాతుజ విశేషణము ను క్త్వాంతముతో కూర్చి ప్రయోగించినట్లు న్నది.
"బాసికపుసతులపై పాదాలు చాచుకున్నాఁడు
తీసివెట్టుగాని తమిఁదిల్లగోవిందరాజు" 19-96

తీసు : స.క్రి. తీయును.
"పట్టినందుకెల్లాఁ దీసు పాపమే చవులుసేసు
నిట్టపిడిఁ బోనీదు నీ మాయ" 3-540

తీసుట : వి. తీయు ధాతువునకు వ్యావహారిక, భావార్థకరూపం. తీయడం.
"అందంద మాటలాడే అలబలము చూడక
కందువఁ దెర దీసుటే కల్ల నా వల్ల" 7-7
"తప్పక చూచినదే తగులఁదీసుట గాదా
అప్పుడే యాకె నిన్ను నదలించెనా" 26-13

తు

తుంటతనము : (తుంట + తనము) వి. దుష్టత్వం, అల్లరి. (వ్య.)
"తుంటతనమున నన్ను దూరనాడ నేలే మరి
గెంటి యంతలోనే తాను కిందుపడనేలే"
19-356

తుండించు : స.క్రి. ఖండించు, నరుకు, ముక్కలు చేయు. (వ్య.)
"యెలమి జక్రాయుధున కెదురా దానవులు
తొలఁగ కెందుఁ జొచ్చినఁ దుండించుఁగాక" 3-1

తుందుడుకు : (5) ప.బం; వి. 1. మనోవ్యథ 2. కంపచలనం 3. సంతాపం 4. కలత 5. సంక్షోభం 6. మోసం 7. ఉత్కంఠ 8. అతిశయం 9. తొందరపాటు.
"నిందలేక యేపొద్దు నిన్నే కొలచి పొగరు
దౌర్జన్యానఁ

తుందుడుకు నీ మాయ తొలఁగిపోయీనా"
2-354

తుకతుకలు : ప.బం; బహు. 1. ఉడకటం, కాగటం, నవ్వటం మొ॥ వాటిలో అయ్యే ధ్వనికి అనుకరణం. 2.కోపం 3. సంతాపం 4. ఉడుకుబోతుతనం 5. ఈసు, అసూయ . (వ్యు.)

"వొకరు రక్షంచఁగా వేరొకరి పాలైన నాకు
తుకతుకలే కాక దూరఁగఁ జోటున్నదా" 2-410

తుచ్చమాడు : (తుచ్చము + ఆడు) ప.బం; అ.క్రి. తుచ్ఛమైన మాటలు పలుకు .

"యిచ్చకమాడుదుఁగాని యీసడించ నెన్నఁడును
తుచ్చమాడకుండా నానతూరి పెట్టీనే" 8-8

తుచ్చములాడు : (తుచ్చములు + ఆడు) ప.బం; అ.క్రి. నీచపుపలుకులు పలుకు, అల్పపు పలుకులు పలుకు.

"తుచ్చములాడక తొల్లె తొయ్యలిచే మొక్కించి
మచ్చికగాఁ గిందుపడి మాటలాడవయ్యా"
11-486

తుచ్చెముసేయు : స.క్రి. నీచముసేయు < తుచ్ఛము.

"నెచ్చెలులు నీవలె నేరనివారా యేమి
తుచ్చెముసేయుట కడు దోసమని కాక"
21-393

తుటారము : వి. 1. నింద, తిట్టు 2. దిట్టతనం, దార్ఢ్యం 3.పరుషవచనం, నిష్ఠురోక్తి 4. దీట్టమైన, దృఢమైన, ధైర్యంకల 5. అతిక్రమణం, తుచ్ఛవచనం .

"ఊరివారి యింతి నన్ను వుద్దండపుఁదుటారాలఁ
బేరుకుచ్చి సొలయుచుఁ బిసాళించేవు" 5-3

తుటారములాడు : (తుటారములు + ఆడు) అ.క్రి. తిరస్కరించు, నిరసించు (పద.) నిందావాక్యములు పలుకు, నిష్ఠురోక్తులు పలుకు.

"తొలుత నిన్నింతేసి తుటారములాడినాను
బలిమి వెనక నీకుఁ బంతమియ్యదా" 13-243

తుటారాలాడు : చూ : తుటారములాడు .

"ఆకడ నెవ్వతో నిన్ను నట్టె తుటారాలాడఁగ
యీకె సన్నసేసి మాన్పె ని దెఱఁగవా" 23-448

తుటారించు : స.క్రి. నిందించు, తిరస్కరించు, అతిక్రమించు. చూ : తుటారము.

"యెవ్వతెకో యీకె యంటా యెంతేసి తుటారించితి
చివ్వన నిందుకుఁగాను చిన్నఁబోకుమీఁకను"
7-352

తుత్తుమురగు : (తురుము + తురుము) ప.బం; అ.క్రి. పొడియగు, ముక్కలుముక్కలగు .

"తూపు చేత నంటితేనే తుత్తుమురై పారుదురు
రాపునీలికాశ గంటే రణభీతి గొందురు" 3-186

తుత్తురుఁగొమ్ము : చూ : తుత్తురుకొమ్ము .

తుత్తురుకొమ్ము : వి. ఊదినపుడు 'తుత్తురు' అని ధ్వనించే వాద్యవిశేషం. తూఁతకొమ్ము, పిల్లనగ్రోవి, మురళి .

"పొంకపు తుత్తురుకొమ్ము పొలుపైన నీ సొమ్ము
వేంకటనగము చాయ విట్టలరాయ" 5-96

తుదకెక్కు : (17) (తుదకు + ఎక్కు) ప.బం; అ.క్రి. గట్టెక్కు .

"పూనిన శ్రీవేంకటేశ కొంటి నీకు శరణని
తోనే యా రెండు గడచి తుదకెక్కేఁగాక" 4-44

"ఎదురు చూచితిమి యిందాఁకా నీకు
తుదకెక్కఁ బనులు సంతోసమాయ నిపుడ"
29-207

తుదనాలికె : వి. నాలుక తుది భాగం, నాలుకకు నాలికె వ్యావహారికరూపం.

తుదమీఱు : ప.బం; అ.క్రి. అతిశయించు, అధికమగు .

"చుట్టుఁగన్నిటికి చూపుఁజాతకములివె
కొట్టి యిఁకమీద నవి తుదమీఱఁగలవా" 7-1

తుదమొదలు : వి. ఆద్యంతాలు .

"చెదరిన నీ (యీ?) కురులు సేసకొప్పున విరులు
తుదమొద లెఱఁగరు తొలఁగదే" 19-510

తుదిపదాలు : వి. చివరి పదాలు.
"కమ్మిక తమకములు ఘనముగఁ బుట్టించీ
దొమ్ముల నీ కాఁగిటి తుదిపదాలు" 22-490

తుదిమీఱు : అ.క్రి. మితిమీఱు, అతిశయించు.
"కోవిదులమను దొరల కులరాణివాసములు
త్రోవలనె లంజలై తుదిమీరిరి" 4 అను. 77

తుదిముట్టు : ప.బం; అ.క్రి. 1. చచ్చు, ముగియు 2. కడచు, కడచను 3. దృఢమగు 4. నెఱవేరు.
"నగు శ్రీవేంకటపతి నన్నే రక్షించినదాఁక
మొగడై యెరుక తుదిముట్ట రాదాయను" 2-80

తుప్పుడు : వి. తుప్పు, చిలుము, ఇనుముకు పట్టిన మలినపదార్థం.
"తొలఁగఁదోసి తుప్పుడు తోడనే లోహంబు
వెలయ బంగారు గావించినగతి" 1-182

తుమురు : వి. పొడి, సూక్ష్మఖండం.
"దిట్టయై యేనుగులచే దీకొలిపినవాటి
నట్టె కొమ్ములు తుమురై పోయను" 4-372

తుమ్మలూరి చెన్నుఁడు : వి. తుమ్మలూరులో వెలసిన చెన్నకేశవుడు.
"చిగురుమేని తుమ్మలూరి చెన్నుఁడా శ్రీవేంకటేశ
తగ పంతమిచ్చితే (తేనే) దక్కి మెచ్చితిఁ గాక"
24-179

తుమ్మిద : (92) వి. తుమ్మెద, అన్నమయ్య తుమ్మిద అనే పదాన్నిపెక్కు చోట్ల వాడినాడు. తుమ్మెద అనే పదం విరళంగా వాడబడింది. అన్నమయ్య కాలంలో తుమ్మిద అనే పదానికే జనంలో వాడుక ఉండి ఉంటుంది.
"గతిగూడ గుంపుకట్టి కాఁపురము సేసీ నవే
మితిమీరి శిరసుపై మేఁటి తుమ్మిదలు" 2-286

తుమ్మెదపదాలు : వి; బహు. తుమ్మెదా! అనే పదం పాదాంతంలో కల పాటలు. ఉదా :
"తొల్లిటివలెఁగావు తుమ్మెదా యింకా
నొల్లవుగా మమ్మునో తుమ్మెదా!" 6-9
అన్నమయ్య తన కీర్తనల్లో ఒక్క తుమ్మెద పదాన్నే చెప్పినాడు.

తురీయభక్తి : వి. హరిదాసులను సేవించడం.
"అతిసాహసాల పూజ అది రాక్షసభక్తి
అతని దాసుల సేవే అదియే తురీయభక్తి"
2-469

తురులు : వి. వాద్యవిశేషం.
"మురదనుజుని పెద్ద మొదలి యెముకఁదీసి
తురులూదరే తుత్తు తుత్తు తుత్తుత్తు" 1-120

తులసిపెద్దదండలవాఁడు : వి. పెద్ద తులసిదండలు గలవాడు.
"నిక్కి చూచినట్టివాఁడు నిన్నటిమొన్నటివాఁడు
తక్కక తులసిపెద్దదండలవాఁడు" 7-595

తూ

తూఁకువ : వి. ఇందులో అరసున్న లేదు. తూకం, బరువు, భారం (వ్య.)
"వేఁకపు నీ(నా) గుబ్బలతో వెలయ నీ మనసారా"
"తూఁకువ కాపె చన్నులు తూఁచి చూడుమా"
25-53

తూఁగుబడు : తూలిపడు, సిద్ధపడు.
"తూఁగుబడి నన్ను నీవు తోడుతనే కూడితివి"
19-509

తూఁట : వి. 1. చెరకు 2. ఖండం, ముక్క.
"తూఁట మోవి గంటైతే దోసమా యేమి"
19-475

తూఁటతాటలు : వి; బహు. తుంటరి మోసములు.
"చాటి కూడినదానవు జడియగ నేమిటికి
తూఁటతాఁటల దాఁచకు తోరపు నీ వలపు"
23-340

తూఁటరి : (తూఁట + అరి) వి. తుంటరి, దుష్టుడు. (క్రూరుడు అని ఆం.ప.ని.)
"కూటమే నాదిగాక గురుతులు సోకించేటి

తూఁటరివి నీవు గావా దొరసాని విపుడు" 8-101

తూఁటరితనము : వి. తుంటరితనం, దుష్టత్వం.
"నీటున నా సిగ్గుదేర నీవు తోపులెత్తి యెత్తి
తూఁటరితనముతోడ తోడాడవయ్యా" 24-133

తూఁటవిలుతుఁడు : (తూఁట + విలు + తు) వి. తుంట విలుకాఁడు, చెఱకు విల్లుగా కలవాడు, మన్మథుడు.
"మాఁట నీతో నాడక మనసెట్టుండీరా నాకు
తూఁటవిలుతునిఁ గొంత దూరుదుఁగాక"
14-360

తూఁటు : వి. 1. కనుమ 2. రంధ్రం.
"పూడెను జలధులు పారిఁ గోపించిన
తోడ బ్రహ్మండము తూఁటాయ" 4-17

తూంట్లు : (2) వి; బహు. రంధ్రములు ; ఏ.వ. తూఁటు.
"ఏడుమడుకల చర్మ మింతయునుఁ దూంట్లై
గాడఁబెట్టుచుఁ జీము గారఁగాను" 1-77

తూకొను : (2) (తూకము + కొను) అ.క్రి; ప.బం. తూకము చేయు కావచ్చు అని సం.ప.స. (18 సం. 431) ప్రయత్నించు, సమకట్టు.
"యీకడ నన్ను మన్నించి యింటికిట్టె వచ్చే వంటా
తూకొని నీ రాకలకెదురుచూతును" 11-480
"తూకొని మాటలెల్లాను దొంతులువెట్టేవు గాక
ఆకెతోడ నేకతము లాడవా నీవు" 18-173

తూగుమంచము : (2) వి. తూగుటుయ్యెల. 'తూఁగు' అరసున్న లేకుండ ప్రయోగం, స్త్రీలు విలాసంగా ఊగటానికి ఏర్పరచిన ఉయ్యాలమంచం.
"తూగుమంచ మెక్కుకొని తొయ్యలి లేవదంటా"
11-552

తూరినంతే వాకిలి : ప.బం; వి. వెన్నకొద్దీ నెయ్యి వంటిది.
"వేడుక శ్రీవేంకటేశ వెన్నకొద్దే నెయ్యా
తోడ రాఁగా వలపులు తూరినంతే వాకిలి" 8-200

తూరిపారు : అ.క్రి. తప్పించుకొని పోవు.
"తొరలఁగ సొలసితే తూరిపారు (?)
మర్మములు" 12-479

తూరు(ఱు) : అ.క్రి. చొచ్చు, ప్రవేశించు. (ఇందులో శకటరేఫం ఉండాలి)
"ఎదుటఁ గాంతల జాడ యేపాటి మన్నించినాను
తుదకెక్క కుండుదురా తూరి యెంతైనాను"
16-190
"తొల్లె శ్రీవేంకటేశ్వర! తూరి నాలో నున్నాఁడవు
చల్లగా నీ చనవిచ్చి జరుపుట గాక" 3-167
"యిచ్చకమాడుదుఁగాని యీసడించ నెన్నఁడును
తుచ్చమాడకుండా నాన తూరొపెట్టీనే" 8-8

తూరుపెత్తు : (11) (తూరుపు+ఎత్తు) ప.బం; స.క్రి. వెదజల్లు, విడుచు, ధాన్యాదులను పొట్టు పోయేట్లు చేతులతో పైకి ఎత్తి గాలికి పోయు. (ఎగురగొట్టు, నిందించు, బాధించు .)
"దుమ్ము లెగయఁగ వలపు దూరుపెత్తీఁ జెలియ
నుమ్మగిలుచున్న నిట్టూరుపులను" 28-1
"కుంతనము లేమాడేవే మచ్చికఁ జెలులతోను
దొంతరనవ్వు లెంత తూరుపెత్తేవే" 29-411

తూఱితూఱి : అనేక పర్యాయాలు, మాటిమాటికి. ఇందులో సాధురేఫమే ఉండదగును .
"మీఱి మీఱి జంకించఁగా మిక్కుటమాయఁ దగులు
తూఱి తూఱి నవ్వఁగాఁ బొత్తులు గలసె"
28-579

తూఱిపాఱు : ప.బం; అ.క్రి. 1.వ్యాపించు 2.తప్పించుకొని పోవు .
"తూఱిపాఱి తెలియకే దొడ్డమేలు రాఁగా రాఁగా
ఆఱడిబెట్టను నేను అంకెకత్తెఁ గానీ" 13-41

తృ

తృణము మేరువు సేయు : ప.బం; అ.క్రి. చిన్నదానిని పెద్దదిగా చేయు.
"యెలమి నే నుపకార మెవ్వరికిఁ జేయలేను

మెలఁగి నీవే తృణము మేరువు సేయుదువు "
8-45

తృణావర్తుఁడు : వి. కృష్ణుని చంపడానికి కంసునిచే పంపబడ్డ రాక్షసుడు. ఇతడు సుడిగాలి వలె వచ్చి కృష్ణుని పైకెగురగొట్టగా కృష్ణుడు బరువైనాడు. ఇతని భారంతో రాక్షసుడు కింద బడ్డాడు. అప్పుడు కృష్ణుడు వానిని సంహరించినాడు. భాగ.

"గాలి తృణావర్తునికి కాలయమదండము
పేలరి మద్దులకును బిరుదుకుఠారము " 15-191

తె

తెంకాయ : (7) (తెన్ + కాఁయ) వి. కొబ్బరికాయ.

"నినుపు తెంకాయకు నీరు నించితిమా " 1-400

తెంకాయపాలు : (తెన్ + కాఁయ + పాలు) వి. కొబ్బరికాయ లోని నీరు.

"తేనెలు జున్నులు తెంకాయపాలును
ఆనవాలు వెన్నట్లును" 6-4

తెంకి : (18) వి. ఉనికి పట్టు, స్థానం, ఇల్లు, గుడి. (తె.వ్యు.కో.)

"పొంకముగా నేరకుంటే పూనుక నీవే వచ్చి
తెంకినుండి మాతోనుదీకొనఁగరాదా " 25-8

"తెంకికి వచ్చుదాకా సాదింపుజూపులే చవి
మంకు దీరుదాకా నెడమాటలే చవి" 20-22

తెందేపలు : (తేపలు + తేపలు) ప.*బం; వి;* బహు. అపారములు, సమృద్ధులు.

"కోరినవి యెన్ని లేవు కోరఁగల వెన్ని లేవు
తీరని సంపదలతో తెందేపలు " 3-9

తెక్కలికాఁడు : (తెక్కలి + కాఁడు) వి. వంచకుఁడు, దొంగ, అపహర్త.

"దిక్కిందరికి నైన దేవుఁడు కడుఁ
దెక్కలికాఁడైన దేవుఁడు" 1-111

తెక్కు : వి. ఉబ్బు, పొంగు, పడుచుదనపు టెక్కు, గర్వం.

"గక్కన రావది యేమే ఘనుఁడు నవ్వుతా నిన్ను
తెక్కులనె చేయివట్టి తియ్యఁగాను " 11-310

తెగఁజేయు : స.క్రి. ఖండించు.

"చిగురాకు నా మోవి చిత్తజు నడిదమట
తెగుఁజేసు నీవంత దిష్టించకురా" 9-86

తెగవేయు : స.క్రి. నఱకు.

"మొరసి పుట్టుగులల ముచ్చుఁ బౌజుల కురికి
తెరలి నడుములకుఁ దెగవేసి" 2-25

తెగిన : విణ. ఖండింపబడిన, నశించిన.

"తిలకింపఁగ నాహారంబునకును
తెగిన కొలుచులవి యెన్నెన్నో
యిలపైనే బ్రదికిన కాలము యెంతని
వ్రాసెనో చిత్రగుప్తుఁడు" 6-189

తెగిన గాలిపడగ : ప.*బం;* వి. దారీతెన్నూ లేనిది, నీతినియమాలు లేనివాడు, స్వేచ్ఛావర్తనం కలవాడు.

"కన్నచోట్లఁ దెగిన గాలిపడగవై నీవు
పన్ని మాటివేన నిట్టె బ్రదుకవయ్యా" 5-563 old

తెగుదారి : (తెగువు + దారి) వి.
1. వందాన్యురాలు 2. దాత వదాన్యుడు
3. సాహసికురాలు, సాహసికుడు. (పద.)

"అడ్డాక లేడవి అన్నిటాఁ దెగుదారివి
ఒడ్డారాన నెట్టుండినా వొరపే నీకు" 21-328

తెగుదెంపు : వి. 1.తీర్పు 2.సాహసం 3.ఫలితం, సంబంధం తెగిపోవడం. (పద.)

"లంపటము విరియించ లావు చాలక తుదిని
దింపనొక కొంతైన తెగుదెంపు లేదు " 1-178

తెట్టఁదెరువు : ప.*బం;* వి. తెట్టతెన్ను, నడివీథి, ఘంటాపథం. (పద.)

"తెట్టఁదెరువున నే దిక్కులవారు చూడఁగ
చుట్టుకుండుటెట్లు చంద్రసూర్యలోకములా "
15-353

తెడ్డు చవులెఱుంగునటయ్యా : సామెత; తెడ్డుకు వంట రుచితెలుస్తుందా ?

తెడ్డువంటివాఁడు : వి. లోపలా బయటా ఉండేవాడు, ఇద్దరిపక్షాల ఉండేవాడు.

"తెఱఁగొప్ప రెంటికిని తెడ్డువంటివాఁడ నింతే
పఱచుఁగర్మములాల పట్టకురో మమ్మును"
1-464

తెప్పతిరుణాళ్లు : *వి; బహు.* తెప్పోత్సవం, స్వామిని తెప్పపై ఉంచి కోనేటిలో తిప్పే ఉత్సవం.

"అప్పుడు పదారువేలంగనల చెమటల
తెప్పలఁదేలిన తెప్పతిరునాళ్ళు"
6-143 & 2-143

తెప్పలఁదేలుకొను : *అ.క్రి.* తేలు, రా.సీ. మాండలికంలో కొన్ని ధాతువులమీద కొను చేరుతుంది.

"దేవులుఁ దానుఁ దెప్పలఁదేలుకొని
వోవరిలో సంతోసాల నొనరుకొని" 28-493

తెప్పలకోనేటమ్మ : వి. తిరునాళ్ల సందర్భంలో తెప్పలు గల కోనేరు తల్లి.

"దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ
వేవేలు మ్రొక్కులు కోకపావని నీకమ్మా" 7-192

తెప్పి(ఱ)రన్ : *క్రి.విణ.* ఆదమరవగా, నిశ్చింతగా.

"తెప్పిర సురటి వీచితే జంకింతురా
కొప్పుగా నాపె రూపు వాగర వ్రాసినది" 7-371

తెమ్మ : (3) వి. తడి, ఆర్ద్రత, చెమ్మ ; రూపాం. తేమ (రాశి). తెమ్మల్ అనే శబ్దానికి కన్నడంలో గుంపు అని అర్థం. ఈ అర్థమే ఇక్కడ సరిపోతుందని సం.ప.స. గుంపు, అధికం (పద.)

"కమ్మరఁదన వేళలు గాచుకున్నారము నేము
తెమ్మలుగఁ దన నేర్పు తేటపడీ నిఁకను"
14-161

"తెమ్మలుగ నందరికి తెలుపవయ్యా నీ సుద్ది"
20-498

"చిమ్మి చిమ్మి నీ యింటికి చేతులే చాఁచీని
తెమ్మల ఆ సన్ననీవు తెలుపవంటా" 20-187

తెయిఁదెరువు : వి. ఉపాయం?

"మంచుఁబులకల చాటు మగనాలి గుబ్బలు సో
ధించి చూచే వేర తెయిఁదెరువునను" 6-96

తెరఁకువ : వి. 1. వివేకం, తెలివి 2. ఉపాయం, వెరపు.

"తెగువలు వుట్టితేను తెరఁకువాఁ బుట్టును"
13-59

తెర(ఱ)చి రాజను : *ప.బం; స.క్రి.* తోసిరాజను.

"తిరముగ ధ్రువునికి దివ్యపదంబిచ్చి
తెరచి రాజన్నట్టి దేవుఁడు" 12-243

తెరచిరాజు : *ప.బం.* అడ్డుతొలగించు.

"తిరముగ ధ్రువునికి దివ్యపదంబిచ్చి
తెరచిరా జన్నట్టి దేవుఁడు" 5-243

తెరచీర : వి. 1. తిరస్కరిణి, యవనిక 2. వేట సాధనంగా ఉపయోగించే యవనిక, అడ్డువల.

"పరిమళము లతఁడు పైపైఁ బూయఁగ బూయగ
తెరచీరఁ దుడిచీని తీసి తీసి యదివో" 17-326

తెరదీయు : *ప.బం; అ.క్రి.* బయల్పరచు.

"పొరుగువారెల్ల పొరచి చూచిరి
తెరదీసె నిదె తెగనానలు" 17-106

తెరనాటకము : వి. తెరకట్టి ఆడే తోలుబొమ్మలాట మొదలైనవి, వీథినాటకం.

"ఒక్కటి తరువాత వేరొకటై కాచుకుండు
చక్క దెరనాటకము సంగతి సంసారము" 3-111

తెరమరుగుదినాలు : *ప.బం; వి; బహు.* మాయలో పడిన రోజులు.

"తెరమరుగు దినాల దేవుఁడ నీ కల్పితమే" 3-8

తెరమరుగుమెకము : వి. కానరాని ప్రమాదం.

"ఇరవైన యట్టుండు యెఱఁగనీ దీ మాయ
తెరమఱుఁగు మెకమువలెఁ దిరుగు నీ బ్రదుకు"
1-486

తెరళ : వి. ముద్ద; కన్నడం లో తెరళ అంటే గుండ్రటిముద్ద అని అర్థం.

"దేవుని ప్రసాదము తెరళ లందుకోరో
యీవేళ నారగించె యీశ్వరేశ్వరుఁడు" 15-189

తెరువుఁబోవు : *ప.బం; అ.క్రి.* జోలికి పోవు. ఈ మాండలిక పదం తెలంగాణంలో కూడా వాడుకలో ఉంది.

"ఎలమి నా చింతతోడ ఎవ్వరి తెరువుఁబోక
తలవంచుకుండఁగాను తడవుదురా" 13-378

తెరువుపెసరు : *ప.బం; వి.* దారిలోనుండు పెసరచేను పంటను ఆ తెరువున వచ్చిపోయే తెరువరులు ఎవరో కోసుకొని పోతూ ఉంటారు కనుక చేను యజమానికి దక్కేది కొంచెమే. ఒకవస్తువును నమ్ముకొని ఉండేవానికి దక్కేది కొద్దిమాత్రమే అనే భావంలో వాడే పదబంధం.

"చిఱునవ్వు నీ పలుకు జిగురుజుట్టిన కండె
తెఱవలకు నీ మోవి తెరువు పెసరు" 5-75

తెరువువచ్చు : (7) *ప.బం; అ.క్రి.* 'జోలికివచ్చు'. ఈ మాండలికపదం తెలంగాణంలో కూడా వాడుకలో ఉంది.

"ఇంతలో నీ తెరువురా మందు కేల కోపము
తిట్టుదుఁ జుమ్మీ నా తెరువు వచ్చితేఁగన"
11-302 & 15-375

తెలివి : *వి.* పుట్టుకతో వచ్చిన వివేకం. (నేరుపు = అభ్యాసంతో కలిగిన లోకజ్ఞత)

"చిప్పిలఁజెనకితేను చిరునవ్వు నవ్వవద్దా
నెప్పునఁదెలివి గల నేరుపరిదానికి" 25-83

తెలివినిద్రలు : *వి; బహు.* మెలకువ మరియు నిద్ర.

"తెలివినిద్రలు గల దేహమా నీ
పొలము పంచభూతాల పొత్తు దేహమా" 1-416

తెలుఁగుఁగాంబోది : *వి.* ఒకానొక సంగీతరాగం.
12-493

తెలుఁగువాఁడు : *వి.* తెలుగుమాట్లాడేవారి జాతికి చెందినవాడు.

"వొగి నొడ్డెభాషలాడి వొడ్డెవాఁడనైతి
తెగి తెలుగాడ నేర్చి తెలుగువాఁడ నైతి" 3-379

తెలుకపిండి : *వి.* గానుగపిండి, తెలిక (తెలక, తెలగ) పిండి.

"ఆని కస్తూరి నల్లనంటెఁ దెలుకపిండి
యీ నెపాన నల్లనంటె నే మందునే" 9-58

తెలుకపిండి కస్తూరి చేయు : *ప.బం; అ.క్రి.* మామూలు వస్తువును ఎంతో గొప్పవస్తువుగా చేయు.

"దిక్కు లెఱుఁగఁగఁ గష్టదేహిని నన్నుఁదెచ్చి
గక్కునఁ దెలుకపిండి కస్తూరి సేసె" 1-282

తెలుసుట : (2) *వి.* 'తెలియుట'కు వ్యావహారిక రూపం.

"ఏమీ ననఁగఁజాల మింత నిన్ను
దీమసాన నీకు నీవే తెలుసుట గాక" 23-296

తెల్లనాకులు : *వి; బహు.* లేత తమలపాకులు.

"పట్టితివి పిడికిట బాగాలూ దెల్లనాకులు
నెట్టనఁ జెవిఁ బునుఁగు నిండా నించుకొంటివి"
29-135

తెల్లనివెల్లా పాలను : *అ.క్రి.* అమాయకత్వంతో ప్రవర్తించు.

"పరఁగఁ దెల్లనివెల్లాఁ బాలంటూ నుండకురా
గరిమె శ్రీవేంకటేశ కాఁగిటఁగూడితి నిట్టె" 11-214

తెల్లవారించు : *స.క్రి.* తెల్లవారేట్లు చేయు, కాలం గడుపు.

"యెగసక్కెల నేమీ నెఱఁగనిదాన నన్ను
తెగరాని బాసలిచ్చే తెల్లవారించితివి" 27-98

తెల్లవారు : *ప.బం; అ.క్రి.* 1. వ్యర్థమగు 2. క్షీణించు 3.మందగించు 4. తెల్లనగు 5. ముదియు.

"తెలుసుకో యిఁక నీవు తెల్లవారె నీ మాట
బలువుఁడ వీ రెంటి పంతము నీ చేతిది" 20-60

"గుట్టున శ్రీవేంకటేశ కూడితివే నన్నునిట్టు
దిట్టతనపు మా రతి తెల్లవారకుండీనా" 12-16

తెవులుపడు : *అ.క్రి.* వ్యాధితుడగు, రోగపడు.

తెవ్వని కాలము : *వి.* (?)

"చివ్వని నా లోకములు చేరి కాలము గడపు
తెవ్వని కాలము నిద్రాఁ దెలివినై ముంచును"
2-346

తే

తేఁకువ : *వి.* 1. బింకం, బెట్టు 2. భేదం 3. భయం, జంకు 4.సందేహం 5. మర్యాద 6. ఓర్పు 7. వివేకం 8.ఉత్సాహం 9. ధైర్యం 10. దృఢసంకల్పం 11. ప్రసిద్ధి 12. హద్దు 13.పూర్ణత 14. దర్పం 15. విధం, రీతి.

"కాఁకల విటుల చూపు కాంతలపై నుండినట్లు
తేఁకువ నుండవలదా దేవునిమీఁదటను" 15-46
"తేఁకువతో నీవు నన్ను దిష్టించి చూడవలసి
పోఁకపూఁబాల వేసితి పొంచి వోరుచుకొమ్మీ"
29-362

తేఁటల చూపులు : వి; బహు. ప్రసన్నమైన చూపులు.
"తేఁటల చూపులు చూచి తీపులు పైఁబడనిచ్చి
నాటించీ గోరు నీపై నాలికత్తె" 26-254

తేకుటాకు : (తేకు + ఆకు) వి. టేకుచెట్టు ఆకు, ఉత్తమజాతి కలపనిచ్చే ఒక టేకుచెట్టు.
"ఇంపుల వెలఁగపండ్లిందవయ్య కానికె
గుంపుఁదేకుటాకు మరఁగున నున్నవి" 5-35

తేగరాయడు : వి. త్యాగం కల రాజు.
"వరవసంతములరాయ వనితల విటరాయ
గురుతైన తేగరాయ కొండల కోనేటిరాయ"
2-459

తేజము : వి. ఒప్పు.
"తిట్టఁగవచ్చునా నిన్ను తేజాన నన్నుఁ గూడితే
యిట్టె శ్రీవేంకటేశ యెనతుఁగాక" 25-394

తేజరాసి : వి.'తేజోరాశి'కి అన్నమయ్య యథేచ్ఛప్రయోగం.

తేజిగుఱ్ఱము : వి. గుఱ్ఱం అనే అర్థంలో వాడబడే జంటపదం. తేజి, గుఱ్ఱం - ఈ రెండూ సమానార్థకాలే. ఉత్తమాశ్వమని కూడా కావచ్చు.
"దిట్టయైన చిత్తమనే తేజిగుఱ్ఱమునకు
వొట్టుక రేవంతుఁడ వుపమింప నీవు" 2-274

తేను : స.క్రి. తెచ్చుటకు.
"వంకకు సంజీవని దేను వాయుజుని పంపినట్టు
వేంకటాద్రిపొంతనుండ వేగ మమ్ము నంపవే"
3-432
"ఘనకిరీటము దేను గరుడని నంపినట్టు
అనుఁగుఁగపుల నిండ్ల కంపినట్లు" 3-432

తేనెపండు : వి. పెదవి?
"ప్రియమైన తేనెపండు బేఁటులెత్తీ నూర్పులను
దయతోడ నీ యింతి దండ చేరవయ్యా"
27-175

తేనెపెదవులాపె : వి. తియ్యని పెదవులు గల స్త్రీ.
"తలకొని తేనెపెదవులాపె విలిచీని
పలుమారు నూఁకొని పలుకవయ్యా" 29-13

తేనెమోవి : వి. తియ్యని పెదవి.
"యీ నెపాన శ్రీవేంకటేశ యింతిఁగూడితివి
తేనె మోవెఱుఁగుఁ గాని తెగువ యెఱఁగదు"
23-469

తేనెలోపలి యీగ తెఱగు : ప.బం. ఇబ్బందిలో చిక్కుకోవటం, బయటకురాలేని స్థితి, తప్పించుకోలేని స్థితి.
"తేనెలోపలి యీఁగ తెఱఁగాయ మనసు" 1-337

తేప(లు) : వి. తడవ(లు), పర్యాయం(ములు)
"పైపై శ్రీవేంకటేశ పచ్చిమోవి సోఁకి కదా
తేపలైన రతుల నీ దేవినై వుందాన" 7-439

తేప : వి. తెప్ప, పడవ.
"పాపా లడఁపఁగ భవపయోధులకు
తేపై యున్నాఁ డితఁడిదే యీతఁడు" 1-117
"శ్రీపతి యొక్కఁడే శరణము మాకును
తేప యితఁడె మఱి తెరఁగేది" 3-573

తేపగా : క్రి.విణ. వరుసగా.
"ఆపెతో నన్నియుఁ జెప్పె దదెఱఁగను
దేపగాఁ దన గుణాలు తెలిసెఁగా నాకునూ"
12-60

తేరకత్తె : (తేర + కత్తె) వి. సంబంధం లేని స్త్రీ, అన్యురాలు, పరస్త్రీ, విటురాలు.
"యీరీతి శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
తేరకత్తెల నే గతి దిద్దేమో నేము" 27-319

తేరకాఁడు : (4) వి. 1. పరపురుషుడు 2. విటుడు 3.కొత్తవాడు 4. సంబంధం లేనివాడు 5. అన్యుడు.
"తెట్టఁదెరువున నేల తేరకాఁడా
యెట్టువలసిన నయ్యా నింటికి రావయ్యా"
7-474

తేరకాడు : క్రి. (తేరకు + ఆడు) వృథాగా మాట్లాడు, ఊరక మాటాడు.
"సారె నింటి కాంతలను చలము సాదించనేల
తేరకాడు మగువలు దేశములో లేరా" 25-391

తేరకు : మాం. ఊరకే.
"వూరకే యెప్పుడో పాదాలొత్తించుకొంటి వంటూ
తేరకే వేసాలు సేసీ దిక్కులని నాపై" 26-285

తేరకొను : ప.బం; అ.క్రి. తదేకదృష్టి కలిగి ఉండు.
"సారెఁ జుట్టి పట్టితివి జారిన పయ్యదకొంగు
తేరకొన నిది యేమో తెలిసెనె నేను " 11-222

తేరపనులు : వి; బహు. శ్రమలేని పనులు .
"మేర మీరే వేరా మెల్లనే తొల్లె
తేరపనులకునుఁ దెగువేలే" 26-65

తేరు : వి. రథం.
"కదిసి చుక్కలు మోచే కనకాద్రివలెను
తిరిగి తిరిగినదె దేవదేవుని తేరు" 4-55

తేరువీథి : వి. రథమును ఊరేగించే వీథి, రథ్య .
"తేరువీథి నల్లవాఁడే దిమ్మరై సతులఁ బిల్చి
నే రమ్మనీ చీకటింట్లో విట్టలుఁడు" 17-289

తేర్పాముడి : శ్రీవైష్ణవులకు పవిత్రమైన "తిరుప్పావై" దివ్యప్రబంధము.
"రాగమునఁ దేర్పాముడి రంతుసేసి చదువఁగ
జాగుతోడ నారగించె సర్వలోకేశ్వరుఁడు"
15-189

తేవ : వి. ఉత్సవవిశేషం (శ.ర.), తెప్పోత్సవం.
"తావున శ్రీహరిదాసుల సంపద
తేవల నెన్నఁడుఁ దీరనిది" 3-292
సమూహం :
"తేవల నిట్టూర్పులకు తీగె నవ్వె మరఁగు
యీ విధాలు గంటి నాతోనీఁక నేల మరఁగు "
9-127

తొ

తొంగిడు : అ.క్రి. మోకాళ్ళపై పాకు.
"చెంగట నిద్దిరించేటి చెలువంపు గొల్లెతల
దొంగిడుచు వచ్చి వచ్చి తొడలంటీనే" 19-174

తొంటిపొందు : ఇది తొంటిపొందు కావచ్చు. ముందటి పొందు.
"వెక్కసించేమి నవ్వేవే విరులనేల రువ్వేవే
తక్కక నీ తొంటిపొందు తలపించుకొంటాను "
29-224

తొంటివినుకులు : వి. వేదాలు, తొలుతగా విన్నవి అని వ్యు.
"కంటిమి మిమ్మందరిని కన్నుల తుదల నేఁడు
తొంటి వినుకులకు సంతోసమాయ నయ్యా "
13-106

తొండకు వెలుగు సాకిరి : సామెత; తెలియని సాక్ష్యం, అస్పష్టమైన సాక్ష్యం. (వెలుగు = పొలమునకు చుట్టూ వేసే కంచె)
"అవ్వలఁదొండకు వెలుగు సాకి రంతేకాక
యెవ్వ రెఱుఁగుదురు మీ యిద్దరిలో పనులు"
20-376

తొండమాంజక్కురవర్తి : వి. ఒకప్పుడు తిరుమలలోని పుష్కరిణి దగ్గరలో ఒక చింతచెట్టు ఉండేదట. దానికింద శ్రీ వేంకటేశ్వరస్వామి స్వయంభూవిగ్రహం తొండమాన్ చక్రవర్తికి దొరికిందట. అప్పుడు స్వామి తొండమానునితో నేను నీ ఇంటివాడనయ్యాను. కాబట్టి నా కొక ఇల్లు, గోశాల, కోశాగారం, ఏడు ద్వారాలు, మూడు ప్రాకారాలను రాతితో కట్టించి దానికి రాగి, బంగారాన్ని అలంకరించి తనకు ఇవ్వాలని కోరినాడట. అందుకు తొండమాన్ చక్రవర్తి అంగీకరించి స్వామివారికి దేవాలయాన్ని నిర్మించినాడట.
"దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవా మడు" 1-151

తొండమారేగుళ్ల గోపీనాథుడు : వి. తొండ మారేగుళ్ళలో వెలసిన శ్రీకృష్ణుడు . ఈ తొండమారేగుళ్ల గ్రామం ఎక్కడ ఉందో గమనించాలి.
"కొండల శ్రీవేంకటాద్రి గోపీనాథా

పొందు తొండమారేగుళ్ల దొర గోపీనాథా"
26-187

తొక్కు : (1) వి. తొక్కుడు, సమ్మర్దం.
"తొక్కిన పాదపుఁదొక్కు తుదకెక్కెను" 11-106
"ఇందరిలోఁ గూడితివి యిట్టె శ్రీవేంకటేశ
సందడించీఁబాదముల సరసపుతొక్కులు"
7-390

తొక్కు : (1) వి; మాం. పచ్చడి, ఈ పదం తెలంగాణంలో కూడా వాడుకలో ఉంది. ఉదా :- మామిడికాయ తొక్కు మొ॥
"చింతకాయతొక్కు చూచితేనే నోరూరు
యెంతకెంత దవ్వు యేడకేడ సూత్రము" 2-234

తొక్కుడువడు : ప.బం; అ.క్రి. 1.ఒత్తిడినొందు 2.తొట్రుపడు 3.అదుముడుపడు.
"తోడఁదోడ నైతేను తొక్కుడువడీఁ బంతము"
13-408

తొక్కుతొక్కులాడు : (తొక్కులాడు + తొక్కులాడు) ప.బం. మిక్కిలి ఎగురులాడు, మిక్కిలి గంతులు వేయు (వ్యు.), మిక్కిలి తొందరపడు (పద.) రాయలసీమలో ఈ అర్థంలో ఎక్కువగా వినిపిస్తుంది.
"ఆ రీతుల దొక్కుతొక్కులాడఁగా గాలు దాఁకెనో
సారె నందుకేమి దోసము గాదు రావయ్యా"
24-418

తొక్కుమెట్టు చెమటలు : వి; బహు. తొక్కు, మెట్టు అనే రెండు ధాతుజవిశేషణాలు అతిశయార్థంలో ప్రయోగించినట్లున్నదని సం.ప.స. (18 సం. 431 పు.) పెల్లుబ్బి వచ్చు చెమటలు కావచ్చు.
"మక్కువలు చల్లుకొంటా మాఁటలాడఁజూచి
తొక్కుమెట్టు చెమటలఁ దొప్పఁదోఁగీని" 18-258

తొక్కుమెట్టుసందడి : ప.బం; వి. (?)
"మిక్కిలి విచ్చి చెప్పితే మేడివంటి బోనమిది
తొక్కుమెట్టు సందడెల్ల తోఁదోపులే కావా"
21-192

తొక్కులఁబడు : ప.బం; అ.క్రి. కష్టాల పాలగు (పద.)
"ఎక్కడ నున్నారో సురలెవ్వరు భూమికి దిక్కో
తొక్కులఁబడె జీవుఁడు దుండగీలచేతను" 3-64

తొక్కులాడు : (2) ప.బం. ఎగురులాడు, గంతులువేయు, తొందరపడు. ఈ అర్థం రా.సీ.లోను, తెలం, లోను ఎక్కువ ప్రచారంలో ఉన్నది.
"తక్కుల మొన్న నా మఱఁదలితోడ నీవు వోరి
తొక్కులాడితివి చాలు గట్టకురా" 6-134
"తోడ నద్దము చూడఁగాఁ దొక్కులాడ వచ్చేవు"
14-184

తొక్కువడు : (తొక్కు + పడు) నలుగు.
"కొప్పుఁగడుఁ జిక్కువడె కుచములు తొక్కువడె
అప్పటి నేమిసేసితి వయ్యో అయ్యో" 9-137

తొట్టిన : విణ. పరిపూర్ణుడైన.
"తొట్టిన సుజ్ఞానికి దుఃఖము లేదు
గట్టియైన మౌనికి కలహమే లేదు" 2-307

తొట్టు : అ.క్రి. నిండుకొను, పరిపూర్ణుడగు.
"తొట్టిన సుజ్ఞానికి దుఃఖము లేదు
గట్టియైన మౌనికి కలహమే లేదు" 2-307

తొట్టు : వి. సంబంధము.
"చుట్టమవై వున్నాఁడవు చూచినవారికిఁజూడ
తొట్టు దీరిచేవు యింత దోసమేల యిఁకను"
14-198

తొట్టు : స.క్రి. స్పృశించు, ప్రాపుగొను, మొదలుకొను, మెండుకొను.
"తొట్టి నిన్ను దగ్గరినా దూరమున నుండినాను
పుట్టించి నీ గర్భములోఁ బొదలించకుండవు"
3-387
"గుట్టున వేంకటేశ కూడితివి నన్ను నిట్టె
తొట్టి నిన్ను వెంగమాడే దోస మేల యిఁకను"
16-198

స్రవించు, ప్రవహించు :
"నిండిన తమకమెల్లా నిలువునఁ దొట్టఁగాను"
12-286

వ్యాపించు, నిండుకొను :

"ముక్కున నూరుపుదొట్టె, మోమెల్లా వాడు
పుట్టె" 21-491

తొట్టుకొను: అ.క్రి. వ్యాపించు, ఎక్కువగు, ఉబుకు (వ్యా.) చూ: తొట్టు.

"తొడరి నీకైతే నిద్ర తొట్టుకొనెఁగా" 21-506

"తొట్టుకొన్న సవతుల తొడుసు లేల" 20-468

"పట్టపుదేవులు గద్దు పనులెల్లాఁ జక్కనాయ
తొట్టుకొంటివయ్య మేలుకొమ్ము నీకును"
23-489

తొట్లె: వి. 'తొట్టెల'కు వ్యావహారికరూపం.

"వసుదేవుఁడెత్తెను శ్రావణబహుళాష్టమిని
పసగాఁదొట్లె నూఁచి పాడఁగలిగె" 4-27

తొడపై తొడవేయు: ప.బం; అ.క్రి. ఏమాత్రం పని చేయకుండా హాయిగా ఠీవి చూపు. చూ: తొడమీద తొడ వేయు.

తొడమీఁద తొడవేయు: ప.బం; అ.క్రి. ఏమాత్రం పని చేయకుండా హాయిగా, ఠీవిచూపు ; ఈ అర్థంలో కాలిమీద కాలువేయు, కాలిమీద కాలు తీయకుండా అనే పదబంధాలు కూడా వాడుకలో ఉన్నాయి. డాబుగా ఉండు, సంభోగింపబూను.

"తొడమీఁదఁ దొడవేసి దొరతనాలు చూపఁగా
కడఁగి నీ మోవి యాకె గంకెసేయఁగా" 28-443

"తొడమీఁదఁ దొడవేసి తొరలించి వలపులు
జడివానలుగ నీపైఁజల్లీ సరసము" 28-472

తొడమె: వి. 'తొడిమె'కు వ్యావహారికరూపం. చూ: తొడిమ.

"తుంచి తమలపాకుల తొడమెలు నీ మీఁద
ఇంచుకించుకె వేసె నిందరుఁజూడ" 7-62

తొడయెక్కు: ప.బం; అ.క్రి. సంభోగింపబూను.

"కమ్మటి గర్వమున నాగడము లాడి యతని
దొమ్మిసేసి పెనఁగుతా తొడయెక్కేవు" 26-406

తొడలసాము: వి. రతిక్రియ.

తొడసు: వి. 'తొడుసు'కు వ్యావహారికరూపం. 1. సంబంధం 2. చిక్కు 3. దోషం 4. విసుగు.

"యెక్కడ దిష్టి దాకునో యిందుకే చింతించి
నీకు
గక్కన నేడ తొడసు గలిగెనో తాను" 12-507

"చెంతల నీతని సేవకులకు మరి
దొంతికర్మముల తొడసిఁక నేలా" 4-324

తొడిఁబడు: అ.క్రి. 1. తొట్రుపడు 2. చిందు, చెదరు 3.చలించు 4. ఇటునటుపర్చు, వ్యాపించు 5.తొందరపడు, శీఘ్రంగాపోవు 6. బాధపడు (సారంగ.) 1. పూర్తిగా 2. ఊతపదంగానైనను గ్రహించవచ్చునని సాహిత్య సమీక్ష. 368 పు.

"తొడిఁబడ మద్దులు భూమిపైఁ గూలఁగ
దొబ్బి యఘాసురునిఁ జంపితివి" 3-277

తొడికిపట్టు: స.క్రి. ఒడిసిపట్టు, అంకించిపట్టు.

"పగలఁగోపము పాపమువలె నలుక చాఁచఁగ
పగటుతోడఁ దొడికిపట్టఁగ నేరుతునా" 17-268

తొడిమ: (3) వి. 'తొడిమె'కు వ్యావహారికరూపం కావచ్చు. పూవు మొ॥ వాటి తలలో ఉండే కాండం, వృంతం.

"పనివి తొడిమ నూడి పండు తీఁగె నంటదు"
2-288

"వొడిసి తొడిమ వండి వూడిన ఫలములు
అడరి క్రమ్మర నందు నంటఁబోయీనా"
15-129

తొడుకు: (2) వి. 1. దొంగమేత 2. ఆవు.

"తొడుకు మేయఁగరాదు తూర్పెత్తితేఁ
బొల్లువోదు
బడినే శ్రీహరి భక్తి పంట వండితే" 3-230

తొడుకు: (5) స.క్రి. 1. పట్టు 2. ఒడిసిపట్టు 3.ఒడియు 4.గ్రహించు అ.క్రి. తెగించు, సాహసించు 5. త్రాగు, గ్రహించు.

"దొమ్మికాఁడ గొల్లెతలఁ దొడికిన యలవాటు
ఇమ్ముల నెవ్వరిఁ గన్నా నేల మానునయ్యా"
14-32

"నే మటువంటివారమా నీ వెరగవింతే
దోమటి యెందైనానుఁ దొడికేవు గాక" 14-32

"బాలుడ శ్రీవేంకటేశ పయ్యదేల తొడికేవు
పాలు దొలఁకీ నోయి పంతగాఁడ" 7-474
"తోడనె వెన్నదుబ్బలు తొడుకనేల వచ్చీని
వేడుకకాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు" 7-134

తొడుసు : వి. 1.సంబంధం 2.చిక్కు 3.తప్పు 4.అన్యాయం 5.బాధ, పరితాపం 6.విసుగు 7.చెప్పులకు, కాళ్లకు అంటుకొన్న బంకమట్టి.
"పెంచఁగాఁ బెంచఁగాఁ దిమి పెనుఁదొడుసు వంటివి
నించ నించ సిగ్గులు వన్నెలవంటివి"
"వసముగాని ధనంబు వట్టి తొడుసు" నీ.శ. 54

తొడ్డవాఁడు : విణ. ఘనుఁడు, మంచివాడు.
"తొట్టెల పాపఁడ వింతె తొడ్డవాఁడ వూచల
పట్టి నా తొడలమీఁదఁ బవ్వళించేవు" 6-54

తొత్తుఁకాఁడు : (తొత్తు + కాఁడు) దాసుడు, విటుడు.
"నీవు నాకుఁ గాణాచి నే నీ యాధీనము
తోవల పరధర్మపు తొత్తుకాండ్లేలయ్యా" 15-111

తొప్పఁదోగు : (3) (తోఁగు + తోఁగు) ప.బం; అ.క్రి. మిక్కిలిగా మునుగు, మిక్కిలి తడియు.
"తొప్పఁదోగె నొసలి కస్తూరి బేఁటులు రాల
ముప్పిరిగొన సారెకు మొక్కెఁగా నీకు" 22-187
"కప్పకురో చెఱఁగు వేంకటరాయ చెమటలఁ
దొప్పఁదోఁగి యెవ్వతో పొందులకు నేఁగితివి" 5-52
"చివ్వన మై చెమరించి చిత్తడి చెమటతోడ
దువ్వటపుఁబయ్యెదెల్లాఁ దొప్పఁదోఁగెను" 7-144

తొప్పఁదోచు : ప.బం; స.క్రి. ముంచు.
"తొప్పఁదోఁచి యిందరిలో దొరఁజేతు నిన్నును" 20-202

తొప్పర(ఱ)లాడు : అ.క్రి. క్షోభపడు.
"తుమురుగ దనుజులఁ దోలి తొప్పరలాడె
అమరఁగ గెలిచితి నందువు" 10-2-107

తొఋకకవిత్వాలు : వి; బహు. నిస్సారమైన కవిత్వాలు.
"తొఋకకవిత్వాల దోషాలఁ బొరలితే
దిబుకార నవ్వఁడా దేవుఁడైనాను" 2-494

తొమ్మిదిగంతల మేను : వి. తొమ్మిది రంధ్రాలు గల శరీరం.
"తూడరి మోచినమోపు తొమ్మిదిగంతల మేను
కడుసందిఁ గట్టినది కర్మపుఁదాడు" 15-83

తొరలు : ఎదుర్కొను, తొడరు.

తొరుగు : అ.క్రి. 'తొరగు'కు రూపాం. 1. జారు, గళితమగు 2. పడు, రాలు 3. కురియు 4. ప్రవహించు స.క్రి. విడుచు.
"పిడుగులు దొరిగెను పెనుగాలి విసరె
తొడిఁబడి బాణము దొడిగినను" 4-518

తొర్లుఁబూట : వి; ప.బం. పూటలలో ఒకవిధమైనది. (పద.)
"ఏపున సంసారమున ఇది గాక కమ్మటాన
దాపుగ తొర్లుఁబూట తగిలించుకొంటిని" 4-142

తొఱలింపుఁ గోరికలు : వి; బహు. పుట్టే కోరికలు.
"చిరునవ్వు లూరకే సెలవి నణఁచేగాని
తొఱలింపుఁగోరికలు తూరిపారీని" 16-490

తొఱ్ఱపెసలు : వి; బహు. బోలుపెసలు, లోపల అంతా రంధ్రంగా ఉండే పెసలు.
"మిఱ్ఱుఁబల్లములకుఁ దెచ్చి మెరసి భూతజాలములకు
దొఱ్ఱపెసలు గొలచినట్టి దోస మేల పాయును" 1-171

తొఱ్ఱపెసలు గొలుచు : ప.బం; అ.క్రి. వృథాప్రయత్నం చేయు, వృథాప్రయాసపడు.
"మిఱ్ఱుపల్లములకుఁ దెచ్చి మెరసి భూతజాలములకు
దొఱ్ఱపెసలు గొలచినట్టి దోసమేల పాయును" 1-171

తొలఁగా : క్రి.విణ. తొలగగా. ('గ' లోపించిన రూపం)
"కన్నులఁ జూచుచు నందరితోనేఁ

గాదని తొలఁగా నొల్లను" 1-463

తొలతొల : నిఘంటువుల్లో ఈ పదం కానరాదు.

"వలపు చల్లుదుఁగాని వాడిక నే నొల్లనయ్య

తొలతొల యింతేసి లోఁతుకు నే వెరతురా"
21-508

తొలరో : తొలగరో : క్రి.ప. ఇందులోని 'గ' లోపించింది. 'కలితే' అనే పదంకూడా ఇట్టిదే.

"దోసము దోసము తొలరో శ్రీహరి

దాసానదాసుల దగ్గరక" 1-241

తొలసి : వి. తులసి.

"ములువాడి కొనగోళ్లు ముంచి కొప్పు దువ్వి దువ్వి

తొలసితో మొల్లలట్టే తురిమీఁ జూపును"
19-404

తొలసిదేవి : వి. తులసీదేవి.

"నేను తొలసిదేవిని నీ పాదాలు పూజింపించి

ఆనుక తా విఙ్ఞవీఁగే నాపెకేమి" 27-435

తొలసిపూస : వి. తులసిపూస.

"తొళసిపూసల పెద్దపేరు" 6-170

తొలియాడు : అ.క్రి. (?)

"దొమ్మిసేసి తుమ్మిదలు తొలియాడ వైరులా

నమ్మించి బాస దప్పిన నాథుఁ డింతె కాన"
10-49

తొలిసమరుతాడు : అ.క్రి. మొదటిసారి ఋతుమతియగు.

"మొలకవలపులే మొదలు సేసుకొని

తొలిసమరుతాడితే దొరసితివి" 19-171

తొలుకరించు : అ.క్రి. వర్షించు.

"తొలుకరించె వనితపై నిదె నేఁడు

చెలువుఁడ వింతట విచ్చేయవయ్యా" 20-101

తొలుకరికాలము : వి. వర్షకాలం.

"బలువుగా నప్పటిని పన్నీట వసంతమాడి

తొలుకరికాలమువలె నుంటివి" 26-389

తొలుతరాళ్లువేసి తోడ పూవులవేయు : *ప.బం;* అ.క్రి. మొదట అవమానించి తరువాత గౌరవించు.

"తొలుత రాళ్లువేసి తోడఁబూవులు వేయఁగ

కలదా అందేమైన కానీవే తాను" 26-143

తొలులు తొమ్మిదగు తోలుతిత్తి : వి. శరీరం, నవరంధ్రాలు గల శరీరం.

"తొలులు తొమ్మిదగు తోలుఁదిత్తికిని

పిలువఁగఁ బేరునుఁ బెంపునుఁ గలిగె" 2-251

తొల్లిటితిత్తి : వి. ముందుజన్మలోని శరీరం.

"పారీ ముందటి భవపాశములు

తీరీఁదొల్లిటి తిత్తిలో పుణ్యము" 3-46

తొల్లిటిదొంగ : వి. శ్రీకృష్ణుడు, పూర్వకాలపుదొంగ అని వ్యుత్పత్తి.

"యెల్లయినా వేంకటేశుఁడిదె

తొల్లిటిదొంగ వచ్చె దోబూచి" 5-227

తొల్లె : ముందు, వ్యతిరేక క్త్వార్థకాలమీద సాధారణంగా చేరే 'ముందు'కు బదులుగా అంతటా, ఇంతకు, అంతకు మొ॥ పదాల మీద 'తొల్లె' పదమే కనిపిస్తుంది. 'తొలుత' కూడా అక్కడక్కడా కనిపిస్తుంది. వినకతొల్లె, పిలువకతొల్లె, తలచకతొల్లె మొ॥

తొళశమ్మ : (తొళసి + అమ్మ) తులసమ్మ.

"చింత దీరఁ దొళశమ్మ శిరసుపై నుండఁగాను

వంతుకు న న్నలమేవు వడ్డిబేరమా" 21-87

"సింగారపుఁదొళశమ్మ శిరసుపై నుండఁగాను

ముంగిట నెవ్వరికోయి మోహించేవు" 21-282

తో

తోఁకచిచ్చు : *వి; ప.బం.* 1. తోఁకలాగా దీర్ఘంగా వ్యాపించి ఉండే నిప్పు 2. నిప్పులు తగిలించిన పిడుకల వరుస.

"వేఁకపుఁగోపము నేఁడే విడువమంటే నేల విడు

తోఁకచిచ్చయిన యాసఁ దుంచినఁగాక" 1-204

తోఁకచుక్క : వి. జ్వాలామయమైన తోక ఉన్న చుక్క, ధూమకేతువు. (అరిష్టసూచకం)

"చీఁకటిలోపల మించు చిన్ని చిన్ని వెన్నెలలు

తోఁకచుక్కలై చూడఁ దొంగలించీనే" 5-334

తోఁగు : అ.క్రి. తొంగు.

"సరిఁగొండ లెక్కుకొని సరసము లాడుకొంటా
సొరిదిమోములు తోఁగి చూచుకొంటాను"
4-511

తో: వెంటనే.
"నీవు మాటలాడఁగాను నెలఁత తో మాటలాడీ
యేవేళ నీవాపె నేమంటివో" 20-531

తోకు: అ.క్రి. తూగు. (తోగు కావచ్చు. తోఁగు అంటే మునుగు)
"తొయ్యలి యెవ్వెతైనాఁ దోకినా నవ్వేటి నీవు
యియ్యెడ నే మొక్కినాను యేవగించేవు"
10-2-5

తోజుఁబాడు: అ.క్రి. వంతపాడు.
"చిలుకకువలె బుద్ధి చెప్పినఁ గానలేక
పలుమారుకే తోజుఁబాడేవుగా" 1-350

తోటకూరవంటిది: వి. త్వరగా వాడిపోయేది. (మార్దవం కలదని భావం.)
"సూటికిఁ రాకున్న సొలతురు మలతురు
తోటకూరవంటి నన్ను దూరుసేసేవా" 14-241

తోడంటు: (3) వి. పెరుగు తోడుకోవడానికి పాలల్లో వేసే మజ్జిగ, చేమిరి.
"పగటునఁ బెనఁగితే పట్టి సాములు సేసేవు
బిగువులు తోడంటి పేరఁబెట్టిరా" 25-384

తోడంటుపె(వె)ట్టు: (2) అ.క్రి. పెరుగు కావడానికి పాలల్లో మజ్జిగవేయు.
"పేరని పాలఁదోడంటు పెట్టితేను పేరునా" 7-254
"ఆసలు తోడంటువెట్టి యట్టె కాఁగలించీ నిన్ను
సేసవెట్టితివి ఇఁకఁ జెనకవయ్యా" 28-439

తోడఁబెండ్లి కూఁతురు: (2) వి; ప.బం. పెండ్లిలో పెండ్లి కూతురుకు తోడుగా ఉంచే చిన్న పెండ్లికూతురు.
"తోడఁ బెండ్లికూఁతురవా తొయ్యలి నీవు
బేడుకోలవై సందడిఁ బెండ్లాడవచ్చేవు" 29-352

తోడట్టు: తోడ, తో.
"యెంతకెంత యేమయ్య నిన్నే మాకూఁ
జెనకఁగ
బంతివారి తోడట్టు పాలించేవు గాక" 21-201

తోడనే: వెంటనే.
"తోఁగిన చెమటలార తోడనే శ్రీవేంకటేశు
రేఁగి నవ్వించుటగాక రిచ్చవడేదా" 8-61

తోడినీడ: వి; ప.బం. 1. తోడునీడ 2. విడువక వెన్నంటి ఉండేది 3. సహాయకమైనది.
"ఇక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నిక్కి తా నెనసి తోడినీడ నీ కాయను" 22-398

తోడు: 'తోడుబోతు' అంటే చేతబడి. నాలుగు వీథులు కలిసేచోట నిమ్మకాయలు మొదలైన తీసివేసిన వస్తువులు పారబోస్తారు. వాటినెవరైనా తొక్కితే వారెండిపోతారు. దీనికి వైద్యంలేదు. ఈవిధమైన చేతబడే తోడుకావచ్చు.
"యిలఁ దోడుదొక్కితేను
యెండించకుండునా(?)
చెలుల యిండ్లకుఁ బోతే చిక్కించకుండునా"
3-278

తోడుకవచ్చు: స.క్రి. తీసుకొనివచ్చు.
"చూతమువో తన మోము సొమ్ము లేమి
దెచ్చీనో
దూతిక యిక్కడికే తోడుకరావే" 23-20

తోడుతోడుత: క్రి.విణ. అతిశీఘ్రంగా, వెనువెంటనే.
"వూడిగము సేసె నన్ను వొగిఁదొడపై నిడక
తోడుతోడుత నీవిట్టే దొరఁజేసేవు" 25-319

తోడుదొక్కు: అ.క్రి. చేతబడి తొక్కు. దీనికి సంపాదకుల వివరణమిట్లున్నది. "చేతబడికి తోడుబోతు అని రా.సీ.లో వ్యవహారము కలదు. ఆ తోడుబోతు చేసి నాలుగువీథులు కలిసేచోట నిమ్మకాయలు, అక్షతలు, బొగ్గులు, వెంట్రుకల చుట్ట వగైరా తీసివేసిన పదార్థములు పారబోయుదురు. దాని నెవరైన తొక్కితే వా రెండిపోవుచుందురు." దీనినే తోడు శబ్దము తో వాడినాడా? (అధోజ్ఞాపిక - 3 సం. 185 పు.)
"యిలఁ దోడుదొక్కితేను యెండించకుండునా
చెలుల యిండ్లకుఁబోతే చిక్కించకుందురా"
3-273

తోడునీడ : (8) *వి; ప.బం.* చూ : తోడినీడ.
"అంది శ్రీవేంకటేశ నన్నంతలోఁగని కూడితి
నిందలేక నీకు తోడునీడనై నే నుండనా"
16-170
"కమ్మిన నీ కనులును కలువపూవులును
నెమ్మదిని వొక్క తోడునీడ లందురు" 13-266

తోతో : (3) *క్రి.విశ.* తోడుతో అనేదానికి రూపాం. వెంటబడి, వెంటనే.
"వో తరుణి యేసిన వాఁడుండఁగ మమ్మేమి సేయు
తోతో నీకును నాకు దొమ్ములింకానా" 26-12

తోతోయ : తోయము అంటే తడవ (శ.ర.) దాని ద్విరుక్తరూపం. మాటిమాటికి అని అర్థం.
"నీతిలేని మంకుదాన నీవు చెప్పిన పనులు
తోతోయ నీ పాదమునఁ దోసితిగా నేను"
16-120

తోదోపులాడు : *ప.బం; అ.క్రి.* మిక్కిలిగా ఒకరినొకరు తోసుకొను, (పద.) ప్రవేశించు.
"తుమ్మెదలే తురుమై తోఁదోపులాడఁగాను
నమ్మితిఁ జీకటితోడి నడ్డమేఁటికే" 7-166

తోదోపులు : (తోపులు + తోపులు) *ప.బం; బహు.* మిక్కిలిగా ఒకరి నొకరు తోసుకొనుటలు.
"తోదోపుల నీ తొడపైఁ దొడవేసె" 28-139
"చీఁగక కూడితి నన్ను వేగమె శ్రీవేంకటేశ
తోఁగి సేస వెట్టితేనే తోదోపు లేలరా" 20-46

తోపుతిత్తి దాఁపురాలు : *ప.బం; వి; బహు.* కొలిమితిత్తితో సమానమైనవి.
"తొలుతే మా కాఁపురాలు తోఁపుతిత్తి దాఁపురాలు
తిలకించి మా వొడి సోదించకువయ్యా" 11-344

తోపునూకుడు : వి. తోసివేయడం.
"తోపునూకుడైనవారి తోడి సుద్దులిట్లానే
చాపలానఁ దనునేఁ గొసరఁబని లేదే" 13-485
"తోపునూకుడుగ తొలఁగఁ జూచితే
నీపైఁ బుక్కిటి నీ రుమిసె" 13-234

తోపునూకుడుసేయు : *అ.క్రి.* త్రోసివేయు.
"తోపునూకుడు సేయవు దొరవు ఇన్నిటా నీవు
చాపలపువారివలె జరయఁగగలదా" 13-42

తోయపుంగురులు : *వి; బహు.* అందమైన కురులు, గుంపుగా నున్న కురులు.
"తోయపుంగురులతోడఁ దూగేటి శిరసు చింత
కాయలవంటి జగడములతోడ" 6-1

తోయపుగుబ్బలు : *వి; బహు.* జతగా గుండ్రంగా నున్న స్తనాలు.
"తోయపుగుబ్బల చన్నుదోయి మీద వాఁడొత్తిన
పాయపుఁ జంద్రుల జూచి భ్రమసితి నమ్మా"
5-46

తోయపునిట్టూర్పు : వి. వింతనిట్టూర్పు.
"పాయపు మదముల పరవశము చెప్పిన
తోయపునిట్టూర్పు తొట్టీని" 22-105

తోరణకట్టు : (తోరణము + కట్టు) *అ.క్రి.* తోరణం కట్టు, (వశపఱచుకొను, తిరస్కరించు) తోరణములు కట్టు, అలముకొను.
"యింతలోనే తాను నీ యౌవనరాజ్యమెల్ల
రంతులలోఁ జిగురున తోరణకట్టినట్లు" 17-159

తోరణగంభములు : (తోరణము + కంభములు) *వి; బహు.* పుష్పమాలాదులు కట్టడానికి గృహాదులకు వెలుపల రెండువైపులా నిలిపిన స్తంభాలు, తోరణకంభములు.
"తొలఁకు నీ హస్తములే తోరణగంభములు
చెలి రాజ్యమే నీవు శ్రీవేంకటేశుఁడా" 21-152

తోరము : *విశ.* 1. స్థూలము, లావు 2. అధికం 3. దట్టం 4. బలంకలది 5. ఎదిరింపరానిది 6. పొడవైన 7. గొప్పదైన 8. పెద్దదైన 8. చక్కని 9. సుందరమైన.
"తోరపు నీ కన్నుల యేతులె చూపవలసి
సారెకు చూపులఁబగ చాటే వాతనిని" 5-248

తోలిబొమ్మ : వి. తోలుబొమ్మ.
"పాలుపోసి పెంచిన నా పాలి వేంకటేశ నే
తోలిబొమ్మఁ జుమ్మీ కాతువుగాని దైవమా"
1-286

తోలు(దిత్తి : (తోలు + తిత్తి) వి. శరీరం.
"నేలా(దడియదు నీరూ(దివియదు
తోలు(దిత్తికే కొల(ది దొరకొన్నమాయ" 3-303

తోలుకవచ్చు : స.క్రి. తొడ్కొనివచ్చు, తీసుకొనివచ్చు.
"ముందు నే(జేసిన కర్మములు దోలుకరా(గాను
అంది మర(గు(జొచ్చితి నందుకే నీకు" 4-484

తోలుతిత్తి : వి. శరీరం. చూ: తోలు(దిత్తి.
"ఏల వచ్చీ యేల పోయీ నెందుండీ(బ్రాణి
తోలుతిత్తిలోన(జొచ్చి దుంకదూరనా" 1-299

తోలుదేహి : వి. శరీరధారి, ప్రాణి.
"నేమముతో నడచేటి నేరుపేది మా వల్ల
దీముతో మోచిన తోలుదేహులము" 3-249

తోలుబొంత : వి. శరీరం.
"తోలుబొంత గట్టుకొన్న దొరనింతే నన్ను నీవు
కూళసంసారమా యేల కొసరేవు" 3-334

తోలుబొక్క : (తోలు + పొక్క) వి. తోలురంధ్రం, శరీరరంధ్రం.
"తోలుబొక్కలోన(జొచ్చి తూలేటి యాకలిచేత
పాలుమాలి యిందరికి బంటుబంటవై" 1-215

తోళసిపూస : వి. తులసిపూస.
"తోరమైన ముత్యాల తోళసిపూసల పెద్ద పేరు
దన వురముపై(బెట్టినవా(డు" 6-170

తోసును : 'తోయును' అనడానికి వ్యావహారికరూపం.
"యెక్కడిది వివేకమెవ్వరు గెలిచినారు
చక్క(బొడ వెక్కించు చరి(దోసును" 3-398

త్ప్రి

త్ప్రివి : వి. శిశువు చేసే ధ్వనికి అనుకరణశబ్దం.
"ఆ(గి పాలజలధిలో నందమైన పెను(బాము
తూ(గుమంచము శిశువు
త్ప్రివిత్ప్రివిత్ప్రివి" 5-220

త్రా

త్రాణ : వి. గౌరవం, మర్యాద, బలం, శక్తి, జాగరూకత, మెలకువ.
"విన్నపము లి(క నేల వేగినంతాను
మన్నించకి(క నుంటే మఱి యేది త్రాణ" 8-62

ద

దంగుడు(బంతములు : *వి; బహు.* అలవాటైన పంతములు.
"అంగవించి శ్రీవేంకటాధిపు(డు నను(గూడె
దంగుడు(బంతములాడ(దన కేటికే" 21-502

దంగుడుబియ్యము : వి. దంచు అనే ప్రేరణార్థక క్రియారూపానికి 'దంగు' అనేది మూలరూపం. 'దంగు' అనే రూపం ఈ నాటికీ 'బియ్యం దంగినాయ్' ఇత్యాది వ్యవహారాల్లో వినవస్తుంది. దంచిన బియ్యమని అర్థం. (దంగు ధాతువునకు దంగుడు అనేది భావార్థకరూపం)
"చెంగలించి వెస(జేతులు విసరుచు
దంగుడుబియ్యముగా దంచీ మాయ" 1-130

దంచనపురాయి : వి. ఫిరంగిగుండు.
"మాయనుగ్గులు సేయ మాధవుని దంచనపు
రాయివో వైరాగ్యరచన జీవులకు"

దంచనున్న రోలిపిండి : *ప.బం; వి.* సిద్ధంగా ఉండేది.
"పొంచిన యాసలవెంట(బొరల(బోయెదమింక
దంచనున్న రోలిపిండి తల(పాయ బతుకు" 1-90

దంచిదంచి చెప్పు : *ప.బం; స.క్రి.* గట్టిగా నొక్కి చెప్పు.
"పంచమహాపాతకాల బారి(బడ్డ చిత్తమిది
దంచిదంచి చెప్పినాను తా(కి వంగీనా" 1-287

దంట : వి. జంట, యుగ్మం.
"దంటయైన చెమటలచే(దడిసిన పచ్చడము
అంటించి చేతికియ్య గా నందుకు నవ్వు రాదా" 7-376

దీనికి పచ్చడము అనే పదంతో అన్వయం.

దంట : వి. సమర్థుఁడు.
"దంట శ్రీవేంకటేశుఁడు తా నలమేలుమంగను
జంటాయ మీరవచ్చునా చవులు సోదించవా"
11-507

దంటతనము : (26) (దంట + తనము) వి.
1. నేర్పరితనం, సామర్థ్యం 2. దిట్టతనం
3. గయ్యాళితనం 4. ప్రౌఢత్వం 5. ధైర్యం.
"కంటి లేవే చెలియా కతకారి నీ చేతలు
దంటతనమున నింకా తారుకాణించ నేలే"
29-329
"దంటతనంబులు తగు తగురా" 21-459

దంటవయసువాఁడు : వి. ప్రౌఢవయస్కుడు.
"నంటున శ్రీవేంకటేశ నా మతక మెఱఁగవు
దంటవయసువాఁడవైతే తప్పొప్పు లేదా"
21-367

దంటవాయువు : వి. జమళివాయువు, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అనెడి జంటవాయువు లేక బలమైన ప్రాణవాయువు.
"ముంటిపై సుఖమందుట ముక్కున నూరుపు వట్టి
దంటవాయువు గెలువఁ దలఁచేదెల్లా" 2-49

దండగట్టలు : వి; బహు. చీలకట్టలు, చెదరిపోకుండా కళ్ళంచుట్టూ వేసే కట్టలు.
"బడినింద్రియముల బంతులు నురిపి
కడురతుల దండగట్టలతో" 1-387

దండ-దాపు : ప.బం; వి; దరి-దాపు, ఆధారం.
"తన నిజభక్తియె దండయుదాపును
మనసు నిలుపుటే మరి శుభము" 4-173

దండదాయి : వి. తోడునీడ. చూ : దాయిదండ.
"చెక్కిటఁబెట్టిన చేయి చిత్తములోనికి
తక్కిన సిగ్గులెల్లా దండదాయి" 19-380

దండయుదాపును : ప.బం; వి. జంటపదం. ఆధారం, దరిదాపు.
"తన నిజభక్తియె దండయు దాపును
మనసు నిలుపుటే మరి శుభము" 4-173

దండవారు : వి; బహు. పక్కనున్నవారు.
"తన తలఁపుతో రతి దండవారితోఁ జెప్పఁగ
తనువునఁ బులకలు దట్ట మాయను" 26-525

దండవెట్టు : ప.బం; అ.క్రి. కొట్టు, నమస్కరించు. (పద.)
"దండవెట్టె నల్లవాఁడె దైవాలరాయఁడు
దండి నెట్టెపుఁజట్ల తపారచుంగులవే" 2-487

దండి : విణ. గొప్ప.
"దండి విభుఁడవు నీకుఁ దగదయ్యా" 26-91
"దండి నీ వినయములు తరితీపులే" 21-435
"దండిసిగ్గుతోఁ జెలి తలవంచితే నేమాయ"
27-324

దండిగా : క్రి.విణ; ఎక్కువగా, సమృద్ధంగా, గొప్పగా అనే అర్థంలో వాడబడే రా.సీ. మాండలికం.
"దండిగా నే పొద్దూను తపము సేసీ నీకు
మెండుకొన్న కరుణతో మెలుఁతఁ
జూడవయ్యా" 22-205

దండె : దండియ. తంబుర, వీణ, దండాకారంలో ఉండే ఒక వాద్యం.
"జీవునికి దండె సేసినవాఁడవు నీవు
వావాతి మాటలే నీపై వన్నెపదాలు" 3-467
జీవునికి కరణకళేబరాదుల నిచ్చినవాడని అర్థం.

దండెకాయ : వి. వీణె ఉండే బుఱ్ఱకాయ, కిన్నెరకాయ.
"తనువే ఒళవు తలయే దండెకాయ
ఘనమైన వూర్పులు రెండు కట్టిన తాళ్లు"
3-467

దండెన : వి. 'దండన'కు రూపాం. (?) శిక్ష.
"కప్పురపు మేడలోనఁ గదసే నీ రమణుని
దెప్పరపుమేననే దండెన వేయరాదా" 21-144

దండెము : వి. 1. వస్త్రములు ఎండవేయడం మొ॥ వాటికై అడ్డంగా కట్టేకఱ్ఱ. 2. గరిడి

సాధనాల్లో ఒకటి 3. వీణె, కిన్నెర 4. దండాకార వాద్యం 5. తంబుర 6. పల్లకీలో బొంగు 7. తాసుకోల మొ॥ (వ్యు.)
"పలుకుఁజిలుకకు మోవిపంజరపు దండెంబు
నలిఁగుంతలములు కాణాచి పెనుఁగొప్పు"
27-591

దంతపుటిల్లు : (3) (దంతము + ఇల్లు) దంతముతో నిర్మించిన ఇల్లు. చూ: దంతపుటోవరి.
"దారకానఁ గొంగువట్టి దంతపుటింటికిఁ దీసి
మేరగదె వెట్టుకొంటి మేలు మేలునే" 20-217

దంతపుటోవరి : (6) (దంతము + ఓవరి) దంతంతో నిర్మించిన లోపలిగది, చంద్రశాల, శిరోగృహం, చలువకోసం నీటిమధ్యలో నిర్మించిన దంతపు భవనం.
"దంతపుటోవరిలోన తానే పని నుండఁగానో
కొంతనేఁ బిలిచితే నూఁకొనెఁగా తాను" 9-83

దంతపుమేడ : వి. దంతంతో నిర్మించిన మేడ.
"బంతి నెదురురేవుల పైకొని లోఁతరసేవు
దంతపుమేడకు నిట్టె దాఁటి రావయ్యా" 25-536

దంతియాన : వి. దంతి (= ఏనుగు) నడకవంటి నడక గల స్త్రీ.
"తమతోడ నీపె ముందె దంతియాన గనక యీ
సమయాన మదములు జారినట్లున్నవి"
20-218

దంతెనపుఁజేయి : వి. పెద్దదూలంవంటి చేయి.
"చేరి నిన్నుఁ బూజించని చేయి దంతెనపుఁజేయి
తారి నీకు మొక్కనట్టి తలయే పెడతల" 2-450

దంతెనాలకోట : వి. పెద్ద దూలాలతో కట్టిన కోట. (దంతెనము = పెద్దదూలం వ్యు.)
"తలవాకిలి దంతపుతలుపుల కోటా
తలిరుఁజేతుల పెద్ద దంతెనాల కోటా" 2-84

దంతెనాలు : వి; బహు. మిద్దెంటింటికి అడ్డంగా వేసే పట్టెలు.

దందు : (?)
"యిందుకే శ్రీవేంకటేశ యిదే గోపికలున్నారు
దందువంటి రాజసపుదాన నీకుఁ బ్రియమా"
8-220

దందుపసరము : వి. ఇది 'దండుపసరము' కావచ్చు. గుంపులోని పసరము (?) ద,డ లకు ప్రాస.
"సందుసుడి వలపుల సదమదమై వుండఁగా
దందుపసరము వలె తానేల వచ్చీని" 7-237

ద, ఇంద : రా, (దీనిని) తీసుకో.

దక్కఁగొను : స.క్రి. లోగొను.
"చిత్తమెల్లా దక్కఁగొనె సిగ్గులు ముంగిటవేసె"
5-28

దక్కిళ్లు : వి; బహు. లాభాలు < దక్కు.
"అలమేల్మంగకు నా వేంకటపతి
తలఁపు లొసంగిన దక్కిళ్లో" 5-31

దగ : వి. 1. పిపాస, దప్పి 2. ఆయాసం 3. తాపం.

దగదొట్టు : (4) మాం; అ.క్రి. దప్పిగొను, దాహముగొను. దగ = తాపం, దప్పి, (శ.ర., ఆం.ప.ని.) అలసట. (వ్యు.)
"కడుఁ జెనకఁబోతేను కంకణాలు వాఁగఁజొచ్చె
తడవి తిట్టఁగఁబోతేఁ దగదొట్టెను" 22-511
"జగములో వారిఁజూచి సారె సారె
నాసలనె పెనుదవ్వు దగదొట్టె నీకుఁదొల్లి"
9-42 old
"దగదొట్టఁ జని రెట్ట వడఁగొట్టె నుడు
వీథి బెళగువ్వ నొక్కయణుజు" మనుచరిత్ర 4 ఆ.

దగ్గరించు : అ.క్రి. సమీపించు. (శ.ర.) దగ్గర శబ్దంపై ఏర్పడిన క్రియారూపం.
"తగవులు చెప్పెనటా దగ్గరించి మా వలపు
తగిలించుకొంటివిగా తక్కరికాఁడా" 11-589
"నిలువుటద్దము లోని నెలఁత నీడరూపు
చెలువుఁడు దగ్గరించినఁ జెలి నగెను" 23-600

దగ్గరు : అ.క్రి. సమీపించు.
"మేరతో దగ్గరు తానె మెచ్చె నిన్నిట్టా నీక

ఆదివృద్ధి రతి నీ వెరుఁగుదు నధికుఁడవు"
11-101

దడిగట్టు : అ.క్రి. ఇంటినిగాని, గుడిసెనుగాని రెండు భాగాలు చేస్తూ తడక అడ్డం కట్టు .
"పడఁతి వినయముల బయలువందిలి వెట్టె
తడబాటుసిగ్గు లను దడిగట్టెను" 28-463

దడిబెము : వి. 'దడిబము'నకు రూపాం. పఱుపు మెత్త, తల్పం, శయ్య . (బ్రౌన్)
"మెచ్చులుగ దడిబముమీఁద నుంటేనే మాయ
కిచ్చురేఁగి ముట్టి తమకించకుండఁ గలవా"
13-66

దధిబాండుగంప : వి. పెరుగు కుండలుగల గంప .
"కాదనక దధి బాం(డు)డ గంపకిందీగినవాఁడ
నీదెస శ్రీవేంకటేశ యిందుకుఁ గొంకేవా"
25-160

దప్పము : వి. సాంద్రత, బెట్టు, బలుపు, లావు .
"దప్పము చెడినవాని తరుణి కాఁగిటఁ జేర్చి
అప్పటిప్పటికి నుస్సురనినయట్టు" 1-240

దప్పికి ఎండమావులు దాగ దగ్గరబోవు : వ్యర్థప్రయాసపడు .
"దప్పికి నెండమావులు దాగ దగ్గరఁబోవుట
తప్పుఁజదువులోఁ దత్త్వము నెంచుట" 2-49

దప్పికి నెయ్యి దాగు : (2) అ.క్రి. నిష్ప్రయోజనమైన పని చేయు. (దప్పి కలిగినప్పుడు నేయి తాగితే దాహం తీరకపోగా దప్పి అధికమవుతుంది అనే దానిని బట్టి ఏర్పడిన పలుకుబడి.)
"చిప్పిలు మోవి చేకొంటే చింత దీరెఁగదవె
దప్పికి నెయ్యి దాగు తగవరి తాను" 7-72

దప్పికి నేయి దాగినట్లు : నానుడి; చూ : దప్పికి నెయ్యిదాగు. 1-1

దప్పిదేరు : (3) *ప.బం;* సంతృప్తి చెందు, తనివితీరు.
"దప్పిదేరే మోముతోడ దగదొట్టి వున్నాఁడవు
యిప్పుడిట్టి యీపె నిన్ను యేమి చేసెనో"
27-31

దయఁజూచు : (2) *ప.బం;* స.క్రి. కరుణించు, కటాక్షించు.
"తడవి నే మొక్కఁగాను దయఁజూచితివి నీవే
చిడుముడి నింత రట్టుసేతురా వోయి" 23-346

దయదలచు : (4) *ప.బం;* స.క్రి. కరుణించు, అనుగ్రహించు.
"గొప్పలాయఁజన్నులు కొనగోరు గుఱుతాయ
దప్పిదేర మమ్ము దయదలఁచరాదా" 27-198

దయదలపు : వి. 'దయదలచు' అనే క్రియ ప్రసిద్ధం. దయదలపు అని నామవాచకంగా ప్రయోగం విలక్షణం. కరుణించడం, అనుగ్రహించడం.
"చేచేత నీ దేవులను శ్రీవేంకటేశుఁడవు
తాచియున్నదాన దయదలఁపు నీ చేతిది"
18-297

దయవెట్టు : (2) (దయ + పెట్టు) *ప.బం;* అ.క్రి. అనుగ్రహించు, దయచూపు.
"యీ దెస శ్రీవేంకటేశ యీ సమ్మందాననే నన్ను
నీ దయవెట్టి రక్షించు నెమ్మది భూరమణా"
3-127

దయసేయు : *ప.బం;* అ.క్రి. 1. దయచూపు, అనుగ్రహించు 2. వచ్చు 3. వెళ్ళు 4. ఇచ్చు.
"గోరపడక నాయంత గుట్టున నే నుండఁగాను
చేరి దైవమైన దయసేయకుండీనా" 14-120

దయిలువారు : అ.క్రి. పొంగిపొరలు, అతిశయించు, ఒప్పు; చూ : దైవారు, దైలువారు.
"మచ్చిక దయిలువార మన్నించుమనియెఁ జెలి
అచ్చమైన నీ దేవుల ననియెఁ జెలి" 28-331

దయివము : వి. దైవము, దేవుడు.
"సిరి వురమున నించి శ్రీవేంకటేశుఁడయి
శరణాగతులఁ గాచే సతమయిన దయివము"
1-422

దయివారు : విఙ. అతిశయించు, పొరలిపాఱు. రూపాం. దైవాఱు.

"బయట నవ్వులు మరీఁ బైపై నవ్వీనాపె
దయివారుఁజూపులఁ గాఁతాళించీ నాపె"
23-328

దయ్యపువాఁడు: వి. భూతమైనవాడు.
"కన్నెలు ముద్దాడఁబోతే గంటి సేసి మోవులెల్ల
తన్నుఁ గానట్టున్నాఁడు దయ్యపువాఁడమ్మా"
10-2-87

దరదరి: 'దరిదరి' కావచ్చునేమో? ధైర్యవతి (?)
"దరిదరిఁగాక నే దగ్గరి కూడఁగఁబోతే" 11-498

దరిదాపు: ప.బం; వి. దిక్కుమొక్కు, సమీపం, అంతూపొంతూ, హద్దు, ఆశ్రయము, రక్షకుడు.
"దరిదాపు ఇతఁడేకా తగవెనుక వేసుకో" 3-417
"దాసవర్గములకెల్లా దరిదాపు మీరె కాని
వాసికి నెక్కించరాదా వసుధలో మమ్మును"
3-267
"సారెకు సంసారం బను జలనిధులీడుచు
నలసిన
వారికి నిఁక దరిదాపగువాఁడిఁక నెవ్వఁడొకో"
1-353

దరిద్రదుఃఖము: వి. దారిద్ర్యదుఃఖము.
"తగఁదా స్వతంత్రుఁడైతే దరిద్రదుఃఖము లేల"
2-419

దరిద్రము: వి. దారిద్ర్యము, ధర్మవాచకానికి బదులు ధర్మివాచకం వాడబడింది.
"వైపగుఁ గాణాచి గలవాఁడు దరిద్రము బాసి
పైపై సంపదలతో బ్రదికేనటా" 3-375

దరిద్రహతపు నిధానము: వి. ఇట దరిద్రశబ్దం భావార్థకం. కనుక దారిద్ర్యంచే హతమైన నిధి అని అర్థం చెప్పవచ్చు. 'హతము' అనే శబ్దాన్ని సామాన్య నపుంసకశబ్దంగా గ్రహించాలి.
"చింతాతిమిరముఁ జెరిచేటి సూర్యుఁడు
అంతట దరిద్రహతపునిధానము" 4-16

దరిశనకానికె: వి. 'దర్శన' అనేపదానికి 'దరిశన' వికృతిరూపం. దర్శనం అంటే కానుక. కనుక ఇది కానుక అనే అర్థంలో జంటపదమని భావించాలి.

దరిశనము: వి. దర్శనం, దర్శించడం.
"దరిశనములు మిము నానావిధులను
తలఁపుల కొలఁదుల భజింతురు" 2-393

దరిసించు: స.క్రి. 'దర్శించు'కు వ్యావహారికరూపం. కానుకగా ఇచ్చు. (సారంగ. 127 పు.)

దరుశనము: వి. 'దర్శనము' అనడానికి వ్యావహారిక రూపం, దర్శించడం.
"పరమభాగవతపాదాంబుజముల
దరుశనమే నా స్నానము" 1-51

దళ్ళాలితనము: వి. మోసగాని లక్షణం, దలారితనం.
"వెల్లవిరి నింత యాల వెనకముందరి పాటు
దళ్ళాలితనము మాని తల వంచుకోరాదా"
10-31

దవ్వుచుట్టఱికము: వి. దూరపు చుట్టరికం.
"తలపోసి అదియును దవ్వుచుట్టఱికమని
యిలఁదేరి మీఁద నేఁగీ నిందిరావిభుఁడు" 1-424

దా

దాఁచఁబెట్టు: స.క్రి. దాచు.
"వెన్నుఁడ నన్నునిట్టె విడెము దెమ్మనేవు
యెన్ని దాఁచఁబెట్టితివి యేరా నీవు" 10-2-99

దాఁపిరము: (4) వి. దాపురము, మఱుగుపుచ్చడం, గోపనం, దాచిన సొమ్ము.
"అలరి మాచేత నీకు నంపిన యెడమాఁటలు
తలపోఁత ధనానకు దాఁపిరము సుమ్మీ"
27-498

దాఁపురము: (4) వి. 1. నిధి, నిక్షేపం
2. దాచుకోవడం, సంచయం చేయడం
3. రహస్యం 4. దాచినసొమ్ము (సూ.ని.)
5. ప్రాప్తి, లాభం, పొందు.
"చన్నులను దాఁపురాలు సరసానఁ గాఁపురాలు
పన్నుక యెంత సేసేవే పతితోను" 28-80

"దాఁపుర మేల సేసేవు తరుణితో నిందాకా
కాఁపురము సేయవా కంటిలో నేను" 24-582

దాక: వి. ఒకానొక తీగె, వెడల్పు నోరుగల అటిక. బోగిణి; వై. ద్రాక్ష.

"ఆకెతోడ మాటాడితి వంటానే పో
దాకతోడఁ గంకణానఁ దాకచేసెను" 17-143

దాకాలు: వి. ఎడమకాలు. (దా = దాపలయొక్క లుప్తశేషం)

"దాకాల మోఁకాల దాటించెఁ గొందరి
ఆకాశవీథినుండి హనుమంతుఁడు" 3-302

దాకొను: అ.క్రి. దాగుకొను, ఇతరులనుంచి చాటుచేసి తప్పించుకొను, సంభవించు, ప్రయత్నించు.

"వాకిట నేమి సేసేవు వనిత నీకు మేలుది
దాకొని నీ వొడఁబాటు తప్పకువయ్యా" 29-355

"నీకంటే ముందు కప్రము నెలఁతకు మీఁదుకట్టి
దాకొని మిగిలించేల ధరియించేవు" 13-506

దాగిలిముచ్చిములు: వి. బాలక్రీడావిశేషం, దాగుడుమూఁతలు.

"చావులుఁ బుట్టుగులాడెడి సరి
దాగిలిముచ్చిములు" 1-445

"దాగిలి ముచ్చిములాడే దాయగాఁడవైన నిన్ను
తోఁగి చూచెట్టు నీరతి దొమ్మికి లోనైతిరా" 7-10

దాగిలిముచ్చులు: వి. బాలక్రీడావిశేషం, దాఁగిలి మూతలు, దాగుడుమూఁతలు రూపాం. దాగిరి ముచ్చులు.

"తరుణి తురుము నీకు దాగిలిముచ్చులాడ
నిరవాయ రమణుఁడ యిదివో నీకు" 23-573

దాడింబపూవు: వి; దానిమ్మపూవు.

"దాడింబపూవుల వన్నె తళుకుఁబయ్యెద
కొంగు వేడుకతో వల్లెవాటు వేశి" 6-42

దాడివోవు: (దాడి + పోవు) అ.క్రి. దండెత్తు.

"చూడరో చూడరో నేఁడు సురలార నరులార
దాడివోయి దనుజుల దండించి తా వచ్చె"
3-512

దాతపుదైవతము: వి. శుద్ధదైవతము.

"శ్రీతరుణీశ శ్రీవేంకటపతి సేవారతి నిను నే భజియించెద
దాతపుదైవమ వైననుఁ గావుము తలఁచెద
మిదియె తత్వంబు" 4-450

దాతపుదైవము: వి. పవిత్రమైన దైవము.

"దాతపు దైవమవైననుఁ గావుము
తలఁచెద మిదియే తత్వంబు" 4-450

దాతుమాతు: వి. ధాతువు మరియు మాతువు; ధాతువు అంటే గేయం, మాతువు అంటే వాక్కు. పదకవితలు ధాతుమాతువులతో కూడినవి."వాఙ్మాతురుచ్యతే గేయం ధాతు రిత్యభిధీయతే" అని లక్షణం.

"ఆతని మాటకు మీరు నందాలు చెప్పేరుగాక
దాతుమా తెటెఁగి యింకా తగవేఁటి తగవే"
17-399

దాదాత: (13) ప.బం; వి. ఈ పదం ఏ నిఘంటువుల్లోనూ కానరాదు. "ఆయా స్థలాల్లో గట్టిగా, ఇంచుమించు ఇత్యాది అర్థములయందు ప్రయోగించినట్లు కానవచ్చు చున్నది ఇంకను విచార్యము" అని సం.ప.స. (2 వా. 382 పు.) లో పేర్కొనబడింది.

"యీదెస శ్రీవేంకటేశ యిన్నియు మాని కొందరు
దాదాత నీ శరణని దాసరులైరి" 2-246

"వేదతో వెన్నవట్టి నేయి వెదకఁబోయిన యట్టు
దాదాత నా తెలివి యితరుల నడిగేను" 2-518

దాపు: 1. రక్షణ. (2. సమీపం)

"పైకొని చక్రాయుధుఁడే మా దాపు
భయములిన్నిటాఁ బాసితిమి" 3-371

"శరణాగతులకు సరి దాపెవ్వఁడు
యిరువుగ శ్రీపతి యెవ్వఁడు" 4-403

దాపుదండ: (11) ప.బం; వి. తోడునీడ, తోడు, సహాయం. (దాపు = ఆశ్రయం, దండ = రక్ష) రూపాం. దండదాపు.

"తమితోడ వైష్ణవులు దాపు దండై వుండఁగాను

తెమలి తీర్థాలెల్లా ద్రిష్టించవలెనా" 3-219
"చదివించి బుద్ధులిచ్చి చైతన్యమైనవాఁడు
పొదిగి నా దాపుదండై బోధింపఁడా" 7-243

దామెనకట్టుగా గట్టు : వి. బందెవేయు. ఎద్దులు మొదలైన పశువులను జంటలు జంటలుగా కట్టు.
"పామరపు టింద్రియాలబారిఁదోసితివి నన్ను
దామెనకట్టుగాఁ గట్టి తత్వమా నీవు" 2-59

దామెనకోడెలు : *వి; బహు.* దామెన అంటే పెక్కు తలుగులు (పలువులు) గల నిడివి త్రాడు అని శ.ర. ఇట్టితాడు గల కోడెలు, బందెవేసిన కోడెలు.
"పాముఁ బట్టీఁ బట్టరమ్మ పసిబిడ్డఁడే మెఱుఁగు
దామెనకోడెలఁ గొట్టీఁదానే వీఁడు" 26-50

దామెనతిట్లు : *వి; బహు.* దామెన అంటే పెక్కుతలుగులు గల అని శ.ర. కాని ఈ అర్థం ఇక్కడ సరిపోదు.

దామెనప్రియాలు : *వి; బహు.* బంధమైన ప్రియాలు (?)
"ఏమంటే నేమంటి నింతే కదే
దామెనప్రియాలు నేరఁ దనకేలే యలుక"
20-315

దామెనవేట : వి. అక్కడక్కడా దామెనలు అమర్చి వేటాడేవేట.

దామెనసంసారము : వి. బంధమైన సంసారం.
"ఏమిసేతు దైవమా యెన్నఁడు గరుణించేవో
దామెనసంసారములోఁ దట్టువడీ మనసు"
2-105

దామెరకొలను : వి. తామరకొలనుకు వ్యావహారికరూపం.
"దామెరకొలనిలోన దప్పిదేర నీఁదుతాను
దోమటిరతుల లోలో దొరసితివి" 17-179

దాయకపాయక : (2) ప.*బం;* దగ్గరికిరాకుండా - దూరంపోకుండా.
"దాయకపాయక తలఁచుకొంటివా
యీయెడ నా కాన తియ్యవయ్యా" 23-508

దాయగత్తె : (దాయ + కత్తె) వి. శత్రురాలు, జ్ఞాతి, సగోత్రురాలు.
"దాయగత్తైన యాఁటది తగిలి పెనఁగవచ్చు
పూయక దూలైనాఁటది పొంచులే వినుము"
12-33

దాయగాఁడు : (10) (దాయ + కాఁడు) వి. 1. జ్ఞాతి 2. శత్రువు.
"కాయములు సోఁకితేనే కరఁగకమానీనా
దాయగాఁడింతే తాను తలవే నీవు" 20-244

దాయము : (4) వి. 1.పాచికలు గవ్వలు మొ॥ వాటియందలి పందెం. 2.గవ్వలాట 3.విపత్తు 4.పంచుకోదగిన తండ్రి సొత్తు 5.ఈవి 6.అరణం 7.కట్నం 8.ఉల్లికుట్టుమాట, (శ.ర.) 9.స్వచ్ఛత, శుద్ధి.
"చాయలకె మాటలాడీ సన్నలకె పాటపాడీ
దాయముగాఁ జూడరే సంతసపుఁజూపు" 9-213

దాయి : వి. పెంపుడుతల్లి. (దాకలి)
"బాయిటఁ జెలులతోడ పచారించి నీతోడ
దాయిగాఁగఁ బవళించీఁ దనకెంత చెల్లునో"
21-185

దాయికొను : అ.క్రి. సమీపించు (?)
"దాయికొని రమణుఁడు దగ్గర గూచుండితే
పాయక అవ్వలిమోమై పవ్వళించేవు" 7-24

దాయిగట్టు : (?)
"ఒక్కటికి నురిగట్టే వొంటికి దాయిగట్టే
వెక్కువ గోవాళవిద్య లీడఁ జేయవలెనా" 24-31

దాయిదంటగు : ప.బం. ఇది 'దాయిదండగు' కావచ్చు. దాయి= (క. = తల్లి, త. తాయి = తల్లి) తల్లి, దండ = ప్రాపు, రక్షణ; తోడునీడ అని అర్థం కావచ్చు. 'దాయి' ధాత్రీ శబ్దభవమని కిట్టెల్. దాయిదండ అంటే తల్లివలె రక్షకురాలని అర్థం కావచ్చు. (సం.ప.స. 16సం. 429 పు.)
"తరుణుల కీపాటి దాయిదంటైన జాలు
గరిమెలన్నియుఁ దొల్లె కైవశమైనవి" 16-404

దాయిదండ : (9) చూ : దాయిదంట, తోడునీడ.

'దాయి' ధాత్రీ శబ్దభవమని కిట్టెల్. దాయిదండ అంటే తల్లివలె రక్షకురాలని అర్థం కావచ్చు. (సం.ప.స. 16 సం. 428 పు.)

"పాయపు శ్రీవేంకటేశ పచ్చిగా గూడితి
దాయిదండై వుండుమేల తడబడ నిపుడు"
21-424

దాయిమాను : వి. రూపాం. దాతిమాను. కర్రపనివాడు ఉపయోగించే బల్ల, చాకలి ఉపయోగించే రాయి. (వ్యు.)

"అగ్గలమై నీవు గడునంత నన్ను రేఁచితేను
తగ్గని నీ మే నన్నిటా దాయిమాను గాదా"
25-457

దారకపుఁదనము : వి. బాల్యం.

"దారకపుఁదనాల నే దండ నుండి బిగేసేవే
బీరము లింకా నెన్ని పెంచేవో కాని" 28-576

దారకపు(నీ) చేత : పిల్లచేష్ట, బాల్యచేష్ట.

"చేరఁడేసి కన్నులాపె చేరి నిన్నుఁ జూడఁ గాను
దారకపు నీ చేతలు దాఁచఁగలవా" 27-18

దారకపువారు : వి; బహు. (?)

"దారకపువారికి దండితనా లేఁటికి
చేరవచ్చి బుద్ధులెల్లా జెప్పలేనే చాలదా"
25-296

దారకము : (5) వి. 1. దారకము అనే శబ్దానికి మజ్జిగలో అన్నం పిసికి అన్నం తీసివేసిఁ జ్వరం తగ్గిన వారికి తాగించేది. 2. కొర్ర అంబలిని చిక్కగా కలిపిన గంజి. 3.ఆహారం అనే అర్థాలు ఉన్నాయి. ఇవి ఇక్కడ కుదరవు.

"చేరి నన్నునేలినాఁడు శ్రీవేంకటేశుఁడు తొల్లె
దారకపు నీ బోఁటికి దక్కునా యీతఁడు"
29-457

దారకుఁడు : వి. బాలుడు.

"వీరి వారి మాటలకు వెఱపింత గలవాఁడు
దారకుఁడై వుండుఁగాక దగ్గరి రా నేఁటికే"
19-508

"అరయ శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
దారకుఁడ వింతేసేయఁ దగవే కాదా" 21-129

దారకురాలు : (దారకు + ఆలు) వి. బాలిక.

"చేరి పాయనట్టివాఁడు సిగ్గులెల్లా రేఁచనీవే
దారకురాలనై తన్నుఁ దగదనేనా" 28-180

దారగట్టు : ప.బం. 'దారముగట్టు'కు వికృతిరూపం కావచ్చు. దారముగట్టు అంటే తాళిగట్టు, పెండ్లిచేసుకొను అని అర్థాలు.

"మొగసూటి వలపూ మోహపు రమణి నవ్వూ
తగవుతో మదనుఁడు దారగట్టెను" 20-517

దారణ : వెల, క్రయం (శ.ర.)

దారణలు : వి; బహు. సాహసాలు.

"కంటిమి నీ సుద్దులెల్ల కడపరాయ
ఇంటింట దారణ లెక్కనేమి చేప్పేదయ్యా"
13-68

దారతప్పు : (15) ప.బం. (దార = విధము, రీతి, సరి, మార్గము, మర్యాద) రీతి తప్పు, క్రమము తప్పు.

"దారతప్పి మగవాఁడు తన యిచ్చఁదిరగాడి"
11-177

"మీరైనా బుద్ధిచెప్పరే మెలుఁతలాల
దారతప్పనివానికి తగవు లౌనటవే" 26-409

దారాసుద్దపు మాటలు : వి; బహు. ధారాశుద్ధి గల మాటలు కావచ్చు.

"దారాసుద్దపు మాఁటలు తాఁకనాడి మదనుని
నారసాలు సేయకు నారసింహుఁడా" 10-2-18

దారితప్పు : అ.క్రి. సరియైన మార్గం తప్పు.

"దారి తప్పినందుమీఁద దగ్గరి రాఁబనిలేదు
సారెకు నన్నుఁ బిలిపించకు మనరే" 11-277

దావకూళ్ళు : వి; బహు. దొంగతనపుకూళ్ళు (దావ = దొంగతనం. బ్రౌన్.) లేదా 'దోవకూళ్లు' అని కావచ్చు. మాండలికంలో 'దో' దా గా మారి ఉంటుంది.

"కలది కుక్కిమంచము కన్నవారెల్లాఁ బండేరు
తలతో దొగ్గినంబలి దావకూళ్ళు" 1-370

దావతి : (13) వి. శ.ర., పర్యాయ, బ్రౌన్, సూ.ని. ల్లో ఈ పదం కానరాదు. పద. లో దావతిపడు అనే పదం ఉంది. దానికి అత్యాసక్తి

చెందు అనే అర్థం చూపబడింది. త్వర, ఆరాటం, ఆయాసం, అత్యాసక్తి అనీ. ఈ దావతే నేటి దావంతం కావచ్చు అని పద.

"శ్రీవేంకటపతి చేఁత జీవులము
దావతి నితరము తగు లేలా" 4-214

దావతి: విణ. ఉద్ధతమైన.

"దావతిజలనిధి దాటినవారికి
తోవల మరియును వో డేలయ్యా" 4-260

దావతిఁబడు: చూ: దావతిపడు.

"ఏవీ నుపాయాలు గావు యెక్కువ భక్తేకాని
దావఁబడక యిది దక్కితే సుఖము" 2-49

దావతికర్మము: (2) దుఃఖకరమైన కర్మము.

"దైవముపై భక్తిలేక తనకు నెన్నాళ్ళుండే
దావతికర్మపు పాటు తనకుఁబోదు" 1-505

దావతికుడుచు: *ప.బం; అ.క్రి.* దుఃఖపడు, ఆయాసపడు, ఆరాటపడు.

"దావతికుడువక తప్పులఁ బొరలక
భావము సంతసపఱచుట తెలివీ" 15-77

దావతిజలనిధి: వి. ఉద్ధతమైన సముద్రము .

"దావతి జలనిధి దాఁటినవారికి
వోవల మరియును కోడేలయ్యా" 4-260

దావతిపడు: (9) అ.క్రి. అత్యాసక్తి చెందు అని పద. ఈ పదానికి త్వరపడు, ఆరాటపడు, ప్రయాసలకు గురియగు, శ్రమపడు అనే అర్థాలుకూడా చెప్పవచ్చునేమో! కిట్టెల్ నిఘంటువులో దావతి (దావంత) శబ్దానికి "labour, toil, pains, exertion, trouble, grief, అనీ, దావతిపడెను అనే పదానికి to cause or give trouble అనీ, దావతిమాడు పదానికి to exert one self, to take pains అనీ అర్థాలు చూపబడ్డాయి. పద. లో దీనికి 'అత్యాసక్తి చెందు' అనే అర్థం ఉంది. కానీ దీనికి త్వరపడు, ఆరాటపడు, ఆయాసపడు అనే అర్థాలు పొసగుతున్నాయని ఆనందమూర్తిగారు పేర్కొన్నారు. (సంకీర్తన. భాషా. 452 పు.)

"శరణన వెరవయ్యా సామజముఁ గాచినట్టు
వరుస దావతిపడి వచ్చేవంటా" 15-25

"భావించి మొక్కక వేరె బద్ధులైన జీవులను
దావతిపడుచు నేల తగిలేవో మనసా" 3-196

దావతిమనసు: వి. ఆసక్తి గల మనస్సు, ఆరాటము గల మనస్సు.

"దావతిమనసు తన కర్మమూలము
వేవేలైనా విడువఁగ వశమా" 3-296

దావతిరాజసాలు: *వి; బహు.* దుఃఖాన్ని కలిగించే రాజసాలు.

"యీవల నీ దాసుఁ డయ్యేది ఘనముగాని
దావతిరాజసా లంతటా నున్నవి" 3-201

దావతిలంపటాలు: *వి; బహు.* ఆసక్తిని కలిగించే లంపటాలు, ఆర్తాన్ని, దుఃఖాన్ని కలిగించే లంపటాలు.

"భావించి నీ దాసులనే భజించుమంటివి గాక
దావతిలంపటాలలోఁ దడఁబడుమంటివా"
10-40

దావతిసంసారము: వి. ఆసక్తిని (దుఃఖాన్ని) కలిగించే సంసారం.

"దైవమును నొల్లము ధర్మమును నొల్లము
దావతిసంసారముతో తగులే కాని" 3-58

దావతిసుఖము: వి. దుఃఖాన్ని కలిగించే సుఖం, ఆసక్తిని కలిగించే సుఖం.

"దావతిసుఖమిల దారి దెలిసియు
నేవగించలే మేమొకో" 10-5

దాష్టీకము: వి. ధృష్ట శబ్దభవమైన ధార్ష్టికమనే భావార్థకానికి వ్యావహారికరూపం కావచ్చు. పొగురుబోతు తనం అని అర్థం. 'దార్ష్టీకం' అనే ప్రయోగం కూడా ఉంది.

"అమర శ్రీవేంకటేశ! అట్టె నన్నుఁ గూడితివి
సముకాన నీకెంత సంగడి దాష్టీకము"
18-143

దాష్టీకుఁడు: వి. 'ధృష్టుఁడు'కు తద్భవరూపమైన 'ధార్ష్టికుడు'కు వ్యావహారికరూపం. పొగరుబోతు.

"పట్టకుమా చన్నులు పైపై బెరిగేపొద్దు
అట్టె దాష్టీకుఁడ వైతే నౌదువుగాని" 28-270

దాసరితనము : వి. భక్తిలక్షణం.
"దాసరితనమువల్లఁ దగ నారదాదులైరి
వాసి నిందెవ్వరెక్కుడొ వడి నెంచుకొనుఁడీ"
15-379

దాసరిపల్లె : వి. ఈ పేరుతో ఉన్న గ్రామం కడపజిల్లా జమ్మలమడుగు, కమలాపురం మండలాల్లోనూ, కోలారు సమీపంలోనూ ఉన్నట్లుగా తెలుస్తుందనీ, కానీ ఈ రెండుచోట్ల రఘురాముని ఆలయం లేదని అన్నమయ్య దర్శించిన దాసరిపల్లె ఎక్కడిదో తెలియదనీ డా॥ దాశెట్టి శివప్ప పెర్కొన్నారు. (తా.అ.సా. తెలుగునాడు – 103 పు.)
"శ్రీవేంకటాద్రిమీది శ్రీరామచంద్ర
యీవల దాసరిపల్లె నిరువుకొని మీ
సేవకుల మమ్ము నేలే శ్రీరామచంద్రా" 3-157

దాసానదాసుఁడు : (2) వి. దాసానుదాసుడు అనడానికి వ్యావహారికరూపం, దాసులకు దాసుడు, వైష్ణవుల వ్యవహారంలో దీనికి ఎక్కువ వాడుక.
"మరిగి యలమేలుమంగ మగఁడవు నీవందురు
ధర నన్ను నీ దాసాన(ను?) దాసుఁడందురు"
18-246

దాసానుదాసి : వి. దాసులకు దాసి.
"దంటనై యాతని దాసానుదాసినై
వొంటినుండెద నేమి నొల్ల నో యయ్య" 1-235

దాసానుదాస్యము : వి. దాసులకు చేసే దాస్యం.
"ఏవిధమును నేఁటికి నా కిఁక యెందెందని తగిలెద నేను
దైవికమగు నీ దాసానుదాస్యము దక్కినదే నాకు" 1-384

దాసి : (2) వి. దాసుఁడు, స్త్రీవాచకమైన 'దాసి' పదానికి 'దాసురాలు' అని అర్థం. కాని ఇట దాసుడని పుంలింగార్థంలో వాడబడింది.
"కేశవ నీ దాసినైతి గెలిచితి నన్నిటాను
యీ శరీరపు నేరా లిఁక నేలా వెదక" 2-482
"తక్కక శ్రీవేంకటేశ తప్పులెల్లాఁ జేసివచ్చి
యిక్కడ నీ దాసినైతి నింకఁ దోయరాదు"
1-501

దాసోఽహము : (దాసః + అహమ్) వి. దాస్యం. (నేను దాసుణ్ణి అని వాచ్యార్థం)
"నీ ముద్రలూ నొల్లరు నీ దాసోఽహము నొల్లరు
కామించి నీమీఁది భక్తి కడు నొల్లరు" 3-52

దాహము : వి. వేడి, తాపము.
"వూహల నా భోగమెల్లా వొళ్లఁబట్టె నంటానుంటే
దాహముతోడ నినుము దాగిన నీ రాయఁగా"
3-41

ది

దిండు : వి. అతిశయం. (తలగడ, దట్టి, చుట్ట, గోడదీపం)
"యెండగాసే బయటనే యెక్కువ వెన్నెల గాసే
దిండు రేయిఁబగలొక్క దినమైనట్టు" 4-93

దిండుకొను : అ.క్రి. అలింగనాదులతో కలుసుకొను.
"దిండుకొని పానుపుపై తెల్లవారు లెరుగరు
నిండుకున్నారు రతుల నేరుపులఁదాము"
7-441

దిందువడు : అ.క్రి. అజ్ఞానం మాసిపోవు అని సంపా.
"కందువ నీ దేహి కనియుం గానఁడు
దిందుపడ (?) నొరులు తెలిపెడి దేది" 3-120
"కందువ శ్రీ వేంకటాద్రి ఘనవరము లొసఁగె
దిందుపడ్డ లోకులకు ద్రిష్టమిదే కాదా" 3-345

దిక్కమెకము : వి. ఇది దిక్కమొకము గావచ్చు. వెఱ్ఱిగల మృగము, భయాదులవల్ల దిక్కు తోచక పారిపోయే వాడు, కాందిశీకుడు, మొండిపట్టు పట్టు.
"చిక్క డెంతయిన మోక్షమార్గమున
జీవుఁడిందుకే లోలుఁడు
దిక్కమొకమువలెఁ గిందికిమీఁదికిఁ దొప్పెడు
గర్మము దేహమును" 3-88

దిక్కరించు : (4) స.క్రి. ధిక్కరించు, లెక్కచేయకుండు, తిరస్కరించు;

వ్యవహారంలో 'ధ' 'ద' గా మారింది.
"చెక్కు నొక్కఁగా నీతోసెలవి నవ్వితేఁగాక
దిక్కరించితే వోజకుఁ దేగలమా" 23-411

దిక్కుదెస : (8) మాం; వి. రక్షకుఁడు, ప్రాపు, ఆధారం, అండదండ.
"దేవ నే నీ యాధీనము దిక్కుదెస నాకు నీవే
సేవ సేయకుండినా రక్షించ నీకు భారము"
2-214

దిక్కుప్రాణము : ప.బం; వి. రక్షకమైన ప్రాణం.
"దేవుడవై పూజలొందు దిక్కు ప్రాణమౌదువు
కావలసిన నట్టౌదు కామించినట్లు" 15-142

దిక్కుముక్కులు : ప.బం; వి; బహు. శరణం అనే అర్థంలో జంటపదం.
"దిక్కెవరు యీ తీదీపులలో
దిక్కుమొక్కులకు దేవుఁడె కాక" 1-81

దిక్కుమొక్కు : ప.బం; వి. గతి, ఆశ్రయం అనే అర్థంలోని జంటపదం. 2-82

దిగఁగారు : ప.బం; అ.క్రి. రక్తం స్రవించు.
"కాముని యేట్లదిగఁగారేటి దేహాలు
దోమటి తమ బదుకే దొడ్డదనేరు" 2-261

దిగఁబోయు : అ.క్రి. కిందికి వ్యాపించు. (దిగఁబోత కిందికి వ్యాపించుట – శ.ర.)
"అట్టడి మొదలినె యాఅడి కింకఁ లోఁగీనా
తిట్టులును దీవెనలు దిగఁబోసుఁగాక" 11-92

దిగపోత : వి. దిగువకు వ్యాపించడం.
"మొగమునఁ జూచేవు మోనానఁ దలవంచేవు
యెగదిగపోఁత లైతే నేడ చొచ్చేదే" 20-271

దిగవిడుచు : ప.బం; స.క్రి. వదలిపెట్టు. (వ్యు.)

దిగుళ్ళు : వి; బహు. దిగులు శబ్దానికి బహువచనరూపం.
"శశి వొడచె అలసంబులు గడచె
దిశల దేవతల దిగుళ్ళు విడిచె" 5-361

దిగువతిరుపతి : వి. తిరుమల కొండ కింది తిరుపతి పట్టణం. ఇట గోవిందరాజస్వామి ఆలయం ఉంది.
"వొగి నొరగుఁబెరుమాళ్ల వునికిపట్టయి వెలయు
దిగువతిరుపతి గడవఁగాను" 1-227

దిగువపట్టణము : వి. దిగువ తిరుపతి (?)
"మగటిమి గల హనుమంతరాయ
దిగువ పట్టణములోని దేవ హనుమంతరాయ"
2-250

దిగ్గుడి : వి. 'దిగ్గుడు' కావచ్చు. తక్కువ.
"ఈటువెట్టితే నితరు లిందుకంటే దిగ్గుడి
నాటుకొని యెట్టుండేది నానాలోకములా"
15-353

దిగ్గుడు : వి. న్యూనత, తక్కువ.
"గక్కున మీలో మీరు కాఁగిలించుకొన్నమీఁద
దిక్కులవారి కాఁగిలి దిగ్గుడేకాదా" 16-255
"సరి నీకు మనసు దాఁచఁగరాదు గాక
తెరవేసి కూడితేను దిగ్గుడా యేమి" 7-383

దిగ్గుడుకు దిగ్గుడు : ప.బం. చాలా తక్కువ.
"శ్రీవేంకటేశ్వర నీసేవే ధ్రువపదము
దేవతాంతరమెల్లా దిగ్గుడుకు దిగ్గుడు" 3-201

దిచ్చ(రి)భోగము : వి. మాయ భోగము. (జూదం)
"నిక్కినిక్కి నీళ్లలో నీడ చూచినట్లానే
దిక్కుల కర్మఫలము దిచ్చభోగములు" 15-59

దిచ్చరి : వి. దిమ్మరి, 'దిక్చారి'కి వికృతి కావచ్చు, వ్యభిచారిణి, మాయలాడి.
"కచ్చువెట్టి వలపాడిఁ గట్టుకొన్నవాఁడవు
దిచ్చరివై మమ్ము సమ్మతించఁజేయనేరవా"
26-213

దిచ్చరికోపము : మాయకోపం.
"దిచ్చరికోపము మాని తెర దియ్యరాదా
చొచ్చి వచ్చి రమణుఁడు చూచీ నిదే" 13-49

దిచ్చరితలపులు : వి; బహు. మాయతలపులు.
"మచ్చికసేసిన చెలి మాటలాడక మానీనా
దిచ్చరి నీ తలపులు దెలిసీఁగాక" 8-294

దిచ్చరిపనులు : మాయపనులు.

"పచ్చిదేరే మేనితోడి పాయపువిభునిఁ గంటి
దిచ్చరిపనులన్నియుఁ దేరీ (రె?) నేఁడు" 13-7

దిచ్చరిమనసు : వి. చంచలపు మనసు, మాయమనస్సు.

"చంచలపుఁగనుదోయి సతుల బారికిఁ జిక్కి
చంచలమందెను నా దిచ్చరిమనసు" 1-401

దిచ్చరివాఁడు : (దిచ్చరి + వాఁడు) వి. వ్యభిచారి, మాయలాఁడు. చూ : దిచ్చరి, దిమ్మరి.

"పచ్చిదేరనిచ్చేవు బాసలెవ్వరికినైన
దిచ్చరివాఁడవు నీకు దేవుళ్లు బాఁతా" 13-18

దిచ్చరీఁడు : (దిచ్చు + అరి + ఈఁడు) దిచ్చు శబ్దంపై స్వార్థంలో అరి, ఈ ప్రత్యయాలు, వ్యభిచారి, మాయలాడు.

"పచ్చిపాలు దాగ మరిగి పసులగాసె నిన్నాళ్ళు
దిచ్చరీఁడు వీఁడు మంచి దేవరటనే వీఁడు"
17-438

దిట్టతనము : (2) (దిట్ట + తన) వి. 1. ధైర్యం 2. శక్తి, సామర్థ్యం 3. చాతుర్యం 4. మహిమ.

"గుట్టుతో ముందర పతి కొండవలె నుండఁగాను
దిట్టతనమున నేల తిట్టు దిట్టేవే" 25-446

దిట్టవాఁడు : వి. సామర్థ్యం కలవాఁడు, ధైర్యశాలి, చాతుర్యం కలవాఁడు.

దిట్టించి చూచు : స.క్రి. దృష్టించి చూచు, జాగ్రత్తగా చూచు.

"చెలియ సిగ్గులతోడఁ జిత్తరువు వ్రాసి కొంకి
నిలిచి తను దిట్టించీ నీవు చూడఁగా" 12-465

దిడము : విణ. 'దృఢము'నకు వికృతిరూపం, గట్టి. దిడము అనే పదం సాధువు కాదనీ, దృఢము లేక దిటము అని ఉండవలెననీ, 'డ'కారప్రాసకోసం దిడము స్థిరము చేయబడిందనీ 15సం. పీఠికలో చెప్పబడింది. (పుట.14)

"కడుఁజింతైతే నీవు గలవని వుందుఁగాని
దిడముగా నా బుద్ధి తిప్పఁగలేను" 15-396

దిడు(డ)వు : వి. ఇది 'దిటవు' కావచ్చు. దిటవు, అచంచలుడు, స్థిరుడు, శక్తి, ధైర్యం. ప్రాసకోసం 'ట' 'డ' గా ప్రయోగింపబడిందేమో!

"దిడువై శ్రీహరి నీవు తిద్దితే నేమో కాని
వెడఁగు నా గుణమిది విడువ దెంతయినా"
15-121

"అడరి వైరాగ్య ధనమార్జించ నోపినా
దిడువై జితేంద్రియ స్థిరుఁడాతఁడు" 2-452

దినకొత్త : వి. నిత్యనూతనం, ప్రతి దినమూ క్రొత్తగా ఉండేది. (వైరిసమాసం)

"కోపములైతేను కోటానఁగోట్లు
దీపనము లైతేను దినకొత్తలు" 4-307

దినదినకొత్త : (2) ప్రతినిత్యమూ కొత్తగా ఉండేది.

"అనరాదు వినరాదు ఆతని మాయలు నేఁడు
దినదినక్రొత్తలాయ ద్రిష్టమిదే మాకు" 2-167

దినదిన బెంబడి : బెంబడి బెందడికి రూపాంతరమా? బెందడి = గచ్చు, గార అని" అని సంపాదకులు.

"వద్దు వద్దు వలపులు వాఁటములు సేయక
తిద్దుకో మా గుణము దినదిన బెంబడి" 23-396

దినదిన సుద్దులు : వి; బహు. ప్రతి నిత్యపు మాటలు.

"కంచపుపొత్తు గలిసె కడలేని నీ సుద్దులు
దించరాని మోపులాయ దినదిన సుద్దులు"
29-189

దినపెండ్లి : వి. నిత్యకల్యాణము, ప్రతినిత్యమూ జరిగే పెండ్లి. (ఇది వైరిసమాసం)

"తిరువేంకటమున దినపెండ్లి గల
తరుణుల పతికినిఁ దలఁబాలో" 17-443

దినమత్తులు : వి; బహు. నిత్యమత్తులు.

"ఘనసిద్ధగంధర్వులు కడ గానలేరట
దినమత్తులము మా తెలివేఁటిది" 3-124

దినములు దొబ్బు : ప.బం; అ.క్రి. దినములు గడుపు, దినములు నెట్టు.

"పనిగొంటే జవ్వనము బంగారువంటిదె పో
దినములు దొబ్బితే వన్నె దీసుఁగాని" 8-59

"తుంచరాదు నీ మదము దొబ్బరావు దినములు
యించుకంతె నా సిగ్గు యేమి సేతురా" 8-122

దినలెక్కలు : *వి; బహు.* ప్రతిదినపు లెక్కలు. ఇది వైరిసమాసం.
"దినలెక్క లూరుపులు తెచ్చితెచ్చి వొప్పించఁగ
యెనలేని జన్మముల కెవ్వరు గురి" 4-302

దినసంత లెక్కు : *ప.బం; అ.క్రి.* ఎక్కువగు, సమ్మర్దమగు. (వ్యు.)
"కొనేవారుఁ దినేవారు కూడికూడి మూఁకలై
దినసంత లెక్కె నిది దేహులాల రారో" 3-170

దిబుకార : *క్రి.విణ.* సశబ్దంగా. (దిముకు - మృదంగశబ్దం)
"తొబుక కవిత్వాల దోషాలఁ బొరలితే
దిబుకార నవ్వెడా దేవుఁడైనాను" 2-494

దిబ్బలువెట్టు : *ప.బం.* కుప్పపోయు.
"దిబ్బలువెట్టుచుఁ దేలినదిదివో
ఉబ్బునీటిపై నొక హంస" 1-16

దిబ్బాలు : *వి.* తిన్నెలు.
"కలిసితి నేను శ్రీవేంకటపతి నిపుడని
తొలుత నీ చనుదిబ్బాలు దొడికేఁ గాని" 7-181

దిబ్బెము : *వి.* దీపము.
"ఇంత చాలదా నీకు యిసుక దిబ్బెములంటా
రంతులుగాఁ గడు నేల రాఁపుసేసేరే" 9-210
"కలిగినది యొక్కటే కమలాపతి సేవ
తెలుప కొంగిచ్చేను దిబ్బెము దొడికేను" 1-442

దిబ్బెముదొడుకు : *అ.క్రి.* ప్రమాణంచేయు.
"కలిగినది యొక్కటే కమలాపతిసేవ
తెలుప కొంగిచ్చేను దిబ్బెము దొడికెను" 1-442

దిమ్మరితనము : (3) *వి.* భ్రమ, మత్తు.
"దిమ్మరితనము గొంత దిట్టరాజసము గొంత
యెమ్మెకాఁడ వైనాఁడ వేమి సేతు నయ్యా"
19-219

దిమ్మరితిట్టు : *వి.* మత్తు కలవాని తిట్టు.
"మలసి యంతేసి దిమ్మరితిట్లు దిట్టేవు
చలిగొనఁ బన్నీరు చల్లెనంటా నీపెను" 26-230

దిమ్మరివాఁడు : (2) *వి.* మత్తెక్కినవాఁడు, భ్రాంతుడు.
"దిమ్మరివాఁడవు నీవు దీకొని సన్నసేసితే
అమ్మరో గరితలకు నాగడాలు దగునా" 21-238

దిమ్మరివిద్య : (2) *వి.* భ్రమగల వాని విద్య.
"సమ్మతించి యిన్నిటాను చనవు చెల్లించితేను
దిమ్మరివిద్యలఁ గూడి తెర వేసేవు" 27-300

దిమ్మరీఁడు : (దిమ్మరి + ఈఁడు) దిమ్మరి పై స్వార్థంలో 'ఈ' ప్రత్యయం. భ్రమ కలవాఁడు, మత్తెక్కినవాఁడు.
"దిమ్మరీఁడయిన వాఁడు తిరుగ మాటాడవద్దా
దొమ్మి నా గబ్బితనముతోడ వినుఁగాని"
25-184

దిమ్ము : (3) *వి.* 1. మదం 2. మత్తు 3. సమూహం, గుంపు.
"యెమ్మెల నీవిటు నన్ను నెంత వొల్లకుండినాను
దిమ్ముల నీ పతి ననే తేజము లేదా" 24-184
సమూహం, గుంపు :
"దిమ్ముల యాసలు రేఁచి తేనెలు మోవి నూరించె
యెమ్మెల జవ్వన భారమెట్టు మోచేవే" 17-324

దిరిశపుఁబువ్వు : *వి.* దిరిసెన పువ్వు.
"జాజు జాజే కాక దిరిశపుఁ బువ్వొనా
నీ జాడెంతయిన నీవు మానేవా" 5-368

దిరిశము : *వి.* దిరిసెన.
"అద్దమరాతిరి గాకె అదె దిరిశము పూచె
సుద్దులెల్ల మాని చెలి జూడవయ్యా" 26-91

దివము : *వి.* పగలు, దినం. (ఆకాశం, అడవి, స్వర్గం)
"దివములు సరియే దినరాత్రులును సరే
యీవల సుఖదుఃఖాలు హెచ్చుకుందు లేలయ్యా" 3-422

దివెపంజులు : *వి; బహు.* దివిటీలు. 4-166 old

దివ్యపదము : *వి.* కైవల్యం, మోక్షం.

దివ్వెత్తుఁబొద్దు: (దివ్వె + ఎత్తు + పొద్దు) వి. సాయం సంధ్యాసమయం, దీపంపెట్టే సమయమని వ్యుత్పత్తి.
"దివ్వెత్తుఁ బొద్దుదాఁకా తిరిగివచ్చి యింటిలో
వువ్విళ్ళూరుచు నసురుసురై వున్నాఁడు"
8-189

దివ్వెన: వి. 'దీవెన'కు రూపాం. ఆశీర్వాదం.
"నవ్వులనె వొకమాట నటనల నొకమాట
దివ్వెనల నొకమాట తిట్టేవేమే" 8-73

దివ్వెయెత్తు: ప.బం; అ.క్రి. దీపంపెట్టు, కాపురం నిలబెట్టు.
"దివ్వె యెత్తిన ఫలము దేవర దింతె కదవె"
1-89 old

దివ్వెలపండుగ: వి. దీపావళి పండుగ.
"తానకమాయ నిదిగో తగు దివ్వెలపండుగ
పాని నీ కరుణఁజూచే పచ్చిచూపులు" 9-88
"దివ్వెల పండుగో యనన్" అని కొరవి గోపరాజు ప్రయోగం. సిం.ద్వా.

దివ్వెలెత్తు: (దివ్వెలు+ఎత్తు) 1. దీపాలు పెట్టు 2. ప్రమాణం చేయు.
"ఎవ్వరి మాటలు నేనేల వినేను
దివ్వెలెత్త నియ్యవయ్య తేనెలు నించేను"
27-206

దివ్వెలెత్తుఁబొద్దు: (6) వి. సాయంసంధ్యా సమయం, దీపాలు పెట్టే సమయమని వ్యుత్పత్తి. చూ: దివ్వెత్తుఁబొద్దు.
"రవ్వలాయ నీ చేతలు రాజసమే నెరపఁగా
దివ్వెలెత్తుఁబొద్దులకు తిరమాయఁబనులు"
7-575

దిష్టదైవము: వి. దృష్టదైవము, కనిపించిన దైవం, భాగ్యదేవత.
"దేవశిఖామణివి దిష్టదైవమవు నీవు
నావల నీ బంట నాకు నెదురింక నేది" 3-418

దిష్టపు జన్మము: భాగ్యపుజన్మము.
"ఆవల నా కర్మమున కాచార్యుఁడే గురి
దేవ నీ శరణు గురి దిష్టపు జన్మానకు" 4-224

దిష్టపు నాలిక: వి. అదృష్టం కలిగిన నాలుక (?)
"పరమపదమే గురిపట్టిన వ్రతమునకు
తిరుమంత్రమే గురి దిష్టపు నాలికకు" 4-224

దిష్టపు పదార్థము: వి. కనిపించే పదార్థం.
"తీపు వలెనే వుండు దిష్టపుఁబదార్థాలు
మేపుగొంటే మీసాలమీఁద తేనెౌను"

దిష్టపు మన్నన: వి. భాగ్యపు కానుక, కనిపించే కానుక.
"తేఁటలఁ గతలు చెప్పి దిష్టపు మన్ననలిచ్చి
యీటునఁ గోపము దీర్చె నిదివో విభుఁడు"
11-500

దిష్టపు రతి: వి. అదృష్టపురతి.
"రెప్పవేసే యంతలోనే రేసులెక్క నీ మనసు
తెప్పలఁదేలఁగరాదా దిష్టపు మీ రతులు"
19-485

దిష్టము: (62) విణ. ఉపదిష్టము, చూడబడినది. వి. భాగ్యం, 'దృష్టము'నకు వికృతిరూపం.
"చేప్పేటివారిచేత దిష్ట మాయ నదె
నెప్పున నింత కాఁగిట నీ వుండఁగా" 16-362
చూడబడినది:
"తెల్లనికన్నుల తేట దిష్టమైన యా చెమట
చెల్లఁబెట్టుకొని యాపె చింత వాపగలవా" 8-4
"అనుమానించఁగ నేలా అవిగో నీ చేఁతలు
దినదినకొత్త లెల్లా దిష్టమాయ మాకు" 28-286
"యీవేళ శ్రీవేంకటేశుఁ డింతియుఁ గూడఁగాను
దేవిదేవరవలె దిష్టమాయ నిదివో" 19-370
"యేపున గోనాలగొంది నిద్దరు మేలమాడఁగ
దీపమేల తెచ్చేవే దిష్టము చూడ" 17-178

దిష్టసంపద: (2) వి. అదృష్టసంపద లేదా భాగ్యసంపద.
"భోగించవయ్యా మంచి భోగములెల్ల
తీగెసాఁగిన మోహము దిష్టసంపదాయను"
23-498

దిష్టాంతము : (3) వి. 'దృష్టాంతము'నకు వికృతి రూపం. నిదర్శనం.
"ఇందరికి నీవె గుఱి యిదివో దిష్టాంతము
కందువతోఁ జేయవయ్య కాపురములూ"
17-142

దిష్టించి చూచు : (22) స.క్రి. జాగ్రత్తగా చూచు.
"తేరకొని నా దిక్కే దిష్టించి చూడఁగాను
మేరమీరి నా పంతము మెరసేదేమి" 27-10 సం

దిష్టించు : (6) స.క్రి. 'దృష్టించు'కు వికృతిరూపం. చూచు.
"సరసము లాడఁగానే సరి వయసు వోయీని
తెరమరఁగిఁక నేల దిష్టించరాదా" 19-330
"వుమ్మ పన్నీటి చెమట నుసురనుకొంటూ
దిమ్మరేఁచీ వలపులు దిష్టించరాదా" 26-122

దిష్టించుకొను : స.క్రి. 'దృష్టించుకొను'కు వికృతిరూపం. చూచుకొను.
"తిలకించి సారె సారె దిష్టించుకోఁడా తాను
నెలవై పెద్దరికాలు నెరపీఁ దా నీడను" 18-560

దిష్టి: వి. దృష్టిదోషం.

దిష్టిదాఁకు : (8) *ప.బం; అ.క్రి.* దృష్టిదోషం తగులు.
"కడు దిష్టిదాఁకకుండా కప్పేవు పై పచ్చడము
తడయక లోలో నెంత తగులాయమో" 24-291
"తేరకొనఁ జూచితేనే దిష్టిదాకె నంటాను
కోరి కొంగువట్టేవు కొమ్మను నీవు" 18-62

దిసంతులాడు : *ప.బం; అ.క్రి.* నిందలాడు, దూషించు.
"అక్కున నా చన్నులు నీ కచ్చులుగా నొత్తితేను
తెక్కులుగా నిన్ను నెంత దిసంతులాడుదురో"
18-260

దీ

దీకొను : (5) అ.క్రి. ఉత్సహించు, పూనుకొను స.క్రి. ఎదిరించు, ఢీకొను, అంగీకరించు .
"రట్టుసేసి యిదిగాక గుట్టున నవ్వేనంటే
దిట్ట యిది యన్నానను దీకొందుఁ జుమ్మీ"
25-394

దీనకపుఁదనము : వి. దైన్యము (?)
"మోనాన శ్రీవేంకటేశ మోవి పిప్పిసేసితివి
దీనకపుఁదనమేల తిరమైన చోట" 24-600

దీనకుఁడు : వి. దీనుడు, ఆశగలవాడు.
"పెట్టించె ఆసలను పెడకొడములఁ దన్ను
తిట్టించె నిజద్రవ్యదీనకులచేత" 1-185

దీపనము : విణ. రగులుగొల్పునట్టిది, ఆకలి నివృత్తి చేయునది, ప్రేరేపించునది.
"దీపనపు జంతువునుఁ దెచ్చి పావనుఁజేసితి
చేపట్టి నన్ను రక్షించు శ్రీవేంకటేశుఁడా" 3-37

దీపము వట్టి నూతఁబడు : *ప.బం; అ.క్రి.* వ్యర్థమగు పని చేయు.
"వున్నతి దీపము వట్టి వొగి నూతఁబడనేల
పన్ని నీ దాస్యము గల్గ బహుకర్మ మేల" 3-413

దీపాళిపండుగ : వి. దీపావళి పండుగ, దీపావళికి 'దీపాళి' జానపదవ్యవహారం.
"తివిరి వేగుదాఁకా దీపాళిపండుగ సేసె
జవకట్టి నినుఁబాసి జాగరాలను" 11-184

దీమపువిజ్ఞానము : (దీమము + విజ్ఞానము) దీమునకు రూపాం. మృగాదులను వశం చేసుకోవడానికి వేటకాడు ఏర్పాటు చేసుకొన్న ఎరకు సంబంధించిన జ్ఞానం.
"ఏమియుఁ జేయఁగవద్దు యింతలోనె మోక్షము
దీమపువిజ్ఞానమే దివ్వెత్తు ఫలము" 1-430

దీమసము : (15) వి. 1. ధైర్యం 2. ఉపాయం 3. మర్యాద. (సారంగ.)
"దీమసాన నీ దాసుల ద్రిష్ట మెరుఁగుట గాని
యీ మేర నీ దైవిక మెరిఁగే వారెవ్వరు" 2-303
ఈ అర్థంలో తాళ్లపాక తిరుమలాచార్యుల శృంగారదండకంలో ప్రయోగం ఉంది.
"దీమసం బింతయున్ లేదు సంతాప మింతేటికే"

దీము : వి. 'దీమము'నకు రూపాం. మృగాదులను వశపరుచుకోవడానికి వేటకాడు

ఏర్పాటు చేసుకొన్న పశువు లేదా పక్షి, బోనులోని ఎర, ఎర ఉంచిన బోను, గృహం, ఇల్లు.

"అంచవంటి నడలది అంగజు దీము వంటిది
మించుదీగెవంటి దలమేలుమంగ" 28-228

"రామ రామ రామ కృష్ణ రాజీవలోచన నీకు
దీమువంటి బంటు ననే తేజమే నాది" 15-26

దీముప్రతిమ : కృత్రిమమైన బొమ్మ, మాయ బొమ్మ. దీము = పక్షిమృగాదులను పట్టుటకై వేటకానిచే పంపబడిన పక్షి, మృగము లోనగునది. (శ.ర.)

"ఏమి చెప్పేదిది యీశ్వరమాయలు
దీముప్రతిమకును త్రిజగము గలిగె" 2-251

దీముభోగము : దీము (వేటకాడు పక్షి మృగాదులను పట్టుకోవడానికి ఎర కోసం పంపబడిన పక్షి, మృగం మొ॥) వలె ఆశపెట్టే భోగాలు.

"వెట్టి దెలిసి రోఁకట వెసఁ జుట్టుకొన్నట్టు
యిట్టి దీముభోగముల నెనసేము" 3-174

దీవిసంకు : దీవిలోని శంఖం.

"పూవు గట్టిన జవ్వాది పూసితే వాసన లేదు
దీవిసంకు ముత్యమైతే తెలిసెఁగాని" 16-293

దీవె : వి. దివ్వె, దీపం < దీవియ.

"ఎలమి నీ రాకల కెదురులు చూడఁగాను,
వెలయఁగ దీవె లేకే వెలుగు గాన్పించెను"

17-402

దీవెత్తుఁబొద్దు : (దీవె + ఎత్తు + పొద్దు) ప.బం. దీపం పెట్టే సమయం, సాయంసంధ్యాసమయం.

"యీరీతి నింత గలితె యింటికైనాఁ దోడి తేవె
తీరపు మీ ముచ్చటలు దీవెత్తు బొద్దాయను"

11-190

చూ : దివ్వెత్తుఁబొద్దు, దివ్వెలెత్తుఁబొద్దు.

దీవెనె : వి. 'దీవెన'కు రూపాం. ఆశీర్వాదం.

"తిట్టులు గొన్నని దీవెనె గొంతని
నెట్టుకొనిదే నీ పూజ" 3-320

"యెప్పుడు నీ దీవెనె యిదె నన్ను మన్నించుట
కప్పి వలపెల్ల నొక్క గాడిఁ గట్టవద్దురా" 11-214

దీవెపంజు : వి. దివిటీ.

"దీమనపు పారివార దీవెపంజులు చేఁబట్టి
యేమరక మీలో మీరు యియ్యరో జాలి"

4-166

దు

దుంక : రంధ్రం.

దుంకదూరు : రంధ్రంలో దూరు.

"ఏల వచ్చి యేల పోయీ నెందుండీఁ బ్రాణి
తోలుతిత్తిలోనఁ జొచ్చి దుంకదూరనా" 1-299

దుంపవెంట్రుకలు : వి; బహు. జడలు గట్టిన వెండ్రుకలు, గడ్డల్లాంటి వెండ్రుకలు.

"దుంపవెంట్రుకల దొడ్డతురుము గల
గుంపెననడపుల గొల్లెత" 5-92

దుత్త : వి. చిన్న కుండ.

"ఆలదొడ్డివారము నేమంతేసి యెఱిగము
పాలదుత్త దుత్తెడేసి పట్టవయ్య వలపు" 7-180

"చెంబెడు దుత్తెడు చెరవెడు బిందెడు"

(అప్ప. 572)

దుత్తెడు : విణ. చిన్న కుండెడు.

"జిడ్డుదేరి దుత్తెఁడు చిత్తములోని రతులు
తెడ్డెడేసి మోవితీపు తెలుసుకోవయ్యా" 7-209

దుత్తెడేసి : కుండెడేసి.

"ఆలదొడ్డివారము నే మంతేసి యెఱిగము
పాలదుత్త దుత్తెడేసి పట్టవయ్య వలపు" 7-180

దున్నని నేలను విత్తినట్లు : నిష్ప్రయోజనమైన పని చేసినట్లు.

"తలపులు చక్కఁగాక దైవముఁదలఁచఁబోతే
వెలి దున్నని నేలను విత్తినట్లు" 15-106

దుబ్బ : వి. పాత్రవిశేషం. (క. దుబ్బ = మట్టికుండ)

"తోడనె వెన్నదుబ్బలు తోడుక నేల వచ్చిని
వేడుకకాఁడు శ్రీవేంకటేశుఁడు" 7-134

దుబ్బెడేసి : (దుబ్బ + ఎడు + ఏసి) దుబ్బ= పాత్ర విశేషం, దుబ్బెడేసి = ఆ పాత్ర విశేషమంత పరిమాణం.

"గొల్లెతల మెఱఁగము గొప్ప జాణతనములు
చల్ల దుబ్బెఁడేసి చల్లేము వలపు" 7-180

(చల్ల)దుబ్బెడేసి : (చల్లదుబ్బి + ఏడి +ఏసి) ఇది దుత్తెడేసి కావచ్చు, కుండెడేసి (దుబ్బి = చల్లదుత్త, చల్లకుండ, దుబ్బి - కన్నడం)

"వెలవెట్టని వలపు, వెసచల్లదుబ్బె(త్తె) డేసి
సొలసి గొల్లెత లెల్లాఁ, బోసిరి నీకు" 15-89

దుమ్మలు : ఇది దుమ్ములు కావచ్చు. ధూళులు.

"పోటు మీరిన యసురపురము లన్నియుఁ జొచ్చి
వీటిబుచ్చి దుమ్మలుగా వేసినవాఁడు" 6-43

దుమ్ము తూరుపెత్తు : అ.క్రి. దుమ్ము వెదఁజల్లు, చెడఁదిట్టు, దూషించు. (పద.)

"ఇంతే మరేమి లేదు యిందుమీఁదను
దొంతులకర్మాలు దుమ్ము దూరుపెత్తుట" 1-398

దురదుర : (2) అవ్య. శీఘ్రంగా, వేగంగా వెళ్లడంలోని అనుకరణ.

"దురదురఁ బారితేఁగా తురుమెల్లా నిదె జారె
గరిమల నిట్టే కీలుగంటు వేయరాదా" 14-553

దురాపేక్ష : వి; 'దురపేక్ష' అనే పదానికి వ్యావహారికరూపం. చెడ్డకోరిక.

"తెగి దురాపేక్షఁ బడ తివియ గతి లేదు గన
పగగొన్న వగల కూపములఁ బడవలసె" 1-221

దులాలు : వి; *బహు.* దూలాలు.

"చూడ చూడఁ బౌజులాయ సుదతి కనుచూపులు
వోడఁగట్టు దులాలాయ వొడఁబాటులు" 29-402

దువాళపుతిరుపు : వి. పరుగుతో గంతుతో తిరుగుట (దువాళము = అశ్వముల ప్లుతగతి, సమవేగం. తిరుపు = నడక)

"వరుస పూర్వదువాళపు తిరుపుల
హరిఁగరఁగింపుచు నలమేల్మంగ" 5-24

దువ్వటపుఁబయ్యెద : విలువగల సన్నని వలెవాటు.

"చివ్వన మై చెమరించి చిత్తడి చెమటతోడ
దువ్వటపుఁబయ్యెదెల్లాఁ దోపఁదోగెను" 7-144

దువ్వటపు చీర : వి. విలువగల సన్నని వస్త్రం.

"దువ్వటపు చీర యిది తొల్లే కడు నునుపు
పువ్వువలె జారీ నిట్టె పోపో విడవోయి" 17-120

దువ్వటము : వి. విలువగల సన్నటి వస్త్రం.

"దువ్వటపుఁబయ్యెదపైఁ దోఁగిన తట్టుపుణుఁగు
పువ్వటమ్ము బాసటమై పొక్కె నేమి సేతునే"
5-267

దువ్వు : వి. 'దువ్వు' ధాతువు కృదంతరూపం. దువ్వట.

"పాపటదువ్వులు పయ్యెదమాఁటులు
పైపై నెటువలె పనుపడెనే" 29-340

దుష్టుఁదనము : (దుష్టు + తనము) దుష్టత్వం, చెడ్డతనం.

"పెరుగుతోడఁ బెట్టిరి దుష్టుఁదనము
పెరుగఁబెరుగ నాఁడె ప్రియురాండ్లెల్లా" 7-415

దూ

దూఁటు : స.క్రి. పొడుచు, కుమ్ము. (సూ.ని.)

"పీఁటమీఁద గూచుండి ప్రియములు చెప్పి చెప్పి
దూఁటి చన్నుల నొత్తెను తొలుతాతని" 8-140

దూతికె : (2) దూతిక, దూతి; దూతిక అనడానికి దూతికె అని ప్రయోగించడం కన్నడప్రభావం వల్ల కావచ్చు.

"కాతరాన నీ గుణాలు కడుఁగడుఁ గొసరీని
దూతికెవలెనే మాట దొమ్మిసేసెనో" 8-92

దూప : వి. దప్పి, తాప శబ్దభవం. ఇది మాండలికపదం. తెలంగాణంలో కూడా వాడుకలో ఉన్నది.

"పోపో యిదేడ సుద్ది పొద్దువోదా తనకు
దూపకు నేయి దాగేటి దూరు గాక" 11-505

దూపకు నేయి దాగు : ప.బం; అ.క్రి. ఆశించిన

ఫలితం లభించకపోగా దానివలన మిక్కిలి బాధ కలుగు.

"దూపకు నేయి దాగేటి దూరు గాక" 11-505

దూపిలు: (2) అలసట పొందు, దప్పికపొందు.

"దూపిలేవు నీ చేతకుఁ దొరలకుందాన నంటా
చాపలాన నీ వాపెను సమ్మతింపించరాదా"
18-197

దూరగు: (దూరు + అగు) అ.క్రి. దూరమగు. దూరమనే శబ్దం కన్నడంలో 'దూరు' అనే రూపంలో ఉన్నది.

"తుద మీఁదేదానీనా దూరై యెంత దిరిగినా
మదమునఁ దానే మారుమలసీఁగాక" 13-136

దూరతనము: (దూర + తనము) దూరంగా ఉండే లక్షణం.

"ఇంతవాఁడవు గాకున్న యేది దూరతనము
వింతకు తలలూఁచేరు వీదికట్టువారలు" 13-171

దూరశ్రవణము: దూరంనుండే శబ్దాన్ని వినడం.

"మంచి పరమహంసనామము ప్రాణులచే వింట
చంచుల వినేటి దూరశ్రవణము" 2-258

దూరించుకొను: స.క్రి. నిందింపజేసుకొను, తిట్టించుకొను.

"రారే ఆతని నేల రవ్వ సేసేరు
దూరించుకోఁడు వచ్చి సంతోసపెట్టీ నిపుడు"
8-41

దూరు(ఋ)(లు)గట్టు: అ.క్రి. 1. నింద(లు) ఆపాదించు 2. తగవు(లు) పెట్టు.

"యెమ్మెలకాఁడవు గావా యిందుకు రాజవు
గావా
దొమ్మికాఁడ నైతే నీకు దూరు గట్టవలెనా"
20-550

"వలవేసి సతిమీఁద వట్టి దూరులుగట్టకు
నిలువుఁబతిమవలె నీ ముందర నున్నది"
27-195

దూరు(ఋ)కెక్కు: (దూఋకు + ఎక్కు) ప.బం; అ.క్రి. నింద పొందు.

"దూరుకెక్కిరి నీచేత తొల్లే గొల్లెతలెల్లా
యీ రీతి విద్యలు నీకు నింకా నెన్ని గలవో"
12-226

దూరుకట్టుకొను: ప.బం; అ.క్రి. నిందపొందు.

"కటకటా వట్టి దూరుకట్టుకొందురా
సటలు సేయఁగ నేలే జవరాలికి" 27-48

దూరుసేయు: స.క్రి. నిందించు.

"సూటికిఁ బతి రాకున్న సొలతురు మలతురు
తోటకూరవంటి నన్ను దూరుసేసేవా" 14-241

దూలతనము: వి. కండూతి, దురద.

"నియ్యంత నే నేరనా నీవే బత్తి గలవా
పుయ్యక దూలతనాల పోరకువే ఇపుడు"
27-260

దూళి: వి. 'ధూళి' శబ్దానికి జానపద వ్యవహారరూపం. అన్నమయ్య వాడిన పదాల్లో మహాప్రాణాలు ఎన్నో అల్పప్రాణవర్ణాలుగా వాడబడటం కనిపిస్తుంది.

"నుదురెల్ల జెమరించె నూఁగు దూళిమేనితో"
26-10

దూసకము: ప్రసిద్ధమైన శబ్ద రత్నాకరాది నిఘంటువుల్లో ఈ పదం కానరాదు. దూషకము కావచ్చు. దూషణం, నిందించడం అని అర్థం కావచ్చు.

"వట్టి దూసకములేల వాదులేల నాకిఁక
దట్టముగ నీకు మంచిదాననై వుండేను" 20-350

దె

దెత్తి: వి. పిశాచం, భూతం.

"తత్తరించి తలఁచక దవ్వువోయి పరులకు
దెత్తివై యేల నోళ్లు దెరిచేవో మనసా" 9-196

దెత్తిగొను: అ.క్రి. (?)

"నెత్తికన్ను మానినవాని పెండ్లికి
దెత్తిగొన్నయట్టి దేవుఁడు" 1-111

దెప్పరము: వి. (1.దుష్టవచనం 2.ఆపద 3.అతిశయం 4.విధం, రీతి) విణ. 1.విషమమైన 2.అధికమైన 3.ఆపత్కరమైన, కష్టదాయకమైన.

"దెప్పరపు నీ బాస తెలిసేకొఅకుఁగాక
చప్పుడుసేయకుండాన జడిసి వుందాన"
14-100

"దెప్పరపువయసే దిమ్మురేఁచ దొరకొంటే
కొప్పులోని విరులైన కొంతములై తోచును"
29-589

దే

దేవగన్య : వి. దేవకన్య. 'క' కారం 'గ' కారంగా మారడం జానపద వ్యవహారానుగుణం.

"తనలోనె తలపోసి తప్పక చూచేవేళ
వనితను దేవగన్య యనవచ్చును" 9-56

దేవతాంతరాలు : (దేవతా + అంతరాలు) *వి; బహు.* ఇతరదేవతలు.

"తప్పుఁదెరువుల దేవతాంతరాలు(లఁ)
దడవకు వో వోయి జీవుడా" 10-1-3

దేవపట్టు : వి. దేవతల నివాసస్థానం. (వైరిసమాసం) యక్షరాక్షసాదులుండే స్థలం కావచ్చు నని సంపాదకులు.

"తేలుగాని పాముగాని దేవపట్టయినఁగాని
గాలిగాని ధూళిగాని కాని యేమైనా
కాలకూట విషమైన గక్కన మింగిననాటి
నీలవర్ణుఁడే మా నిజదైవము" 1-214

దేవరలేని పూజ : *ప.బం; వి.* వ్యర్థం, నిష్ప్రయోజనం.

"వట్టి జోలితో నూరక దేవర లేని పూజవంటిది
వొట్టుక ఫలములు లేని పంటలకు వొడిగట్టే
యటువంటిది" 2-320

దేవరహస్యము : వి. ఎవ్వరికీ తెలియగూడని రహస్య విషయం.

"నీ చిత్తమాపె యెఱుఁగు నీ వెఱుఁగుదువు
యేచి నీ దేవరహస్యా లెవ్వఁడెఱుఁగు" 21-36

దేవరాహుత్తరాయఁడు : వి. శ్రీవేంకటేశ్వరస్వామికి గల బిరుదు. (రాహుత్తుఁడు = గుఱ్ఱపురౌతు)

"వొట్టుకొని దేవరాహుత్తరాయ బిరుదు నీదే
కిట్టి రాతిగుఱ్ఱము నెక్కితివి గాన" 2-142

దేవరొజ్జలు : *వి; బహు.* శ్రేష్ఠులైన గురువులు, దేవతాగురువులు.

"దేవరొజ్జ లొకవంక దిక్కులలోఁ బొలగూడు
దీవెనతో నారగించి తీపుమరిగి" 2-70

దేవళ్ళు : వి. వేలుపులు, దేవతలు.

"చూడఁజిన్నవాఁడు గాని సుద్దు లెన్నైనాఁగలవు
వీడుదోడైన దేవళ్లు విట్ఠలేశుఁడితఁడు" 29-479

దేవుఁడిచ్చినా పూజరి వరమీడు : అసలువాడు అనుగ్రహించినా అంతకు కిందివాడు కానివ్వడనే పట్ల ఉపయోగించే పలుకుబడి.

"పొసఁగ దేవుఁడిచ్చినా పూజరి వరమీఁడు
విసిగి నే విడిచినా విడువరు లోకులు" 3-220

దేవులచెరువు : వి. కోనేరు, స్వామి పుష్కరిణి. (కోన్ = ప్రభువు, స్వామి; కోనేరు = స్వామి పుష్కరిణి) చిత్తూరు జిల్లాలో ములకల చెరువు మండలంలోని గ్రామం. దీనికి దేవుల్చెరువని వ్యవహారం. ఇది తిరుపతి గుంతకల్లు రైలు మార్గంలోని బత్తులాపురం రైల్వేస్టేషన్‌కు ఇదు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఉండినట్లుగ అన్నమయ్య పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ ఊళ్లో చెరువు సమీపంలో నాలుగు దేవాలయాలున్నాయి. కానీ వాటిలో వేంకటేశ్వరస్వామి ఆలయం లేదు. ఐతే గ్రామ నామం దేవుళ్ల చెరువు కావడం వల్లా, ఇప్పటికీ నాలుగాలయాలు ఒకే ఊళ్లో ఉండడం వల్లా, పూర్వం ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండి ఏ కారణంవల్లనో శిథిలమై ఉండవచ్చునని ఊహించవచ్చు. (చూ: తా.అ.సా.లో తెలుగునాడు - 104 పు.)

"ఏవంక నేరిచితివో యింతేసి నీవు
దేవులచెరువు యేలే తిరువేంకటేశా" 23-217

దేవులతనము : వి. దేవీత్వం, రాజ్ఞీత్వం, రాణిగా ఉండటం. అన్నమయ్య పట్టపురాణి అనే అర్థంలో దేవులు (దేవి శబ్దానికి బహువచనరూపం) అని వాడడం కనిపిస్తుంది.

"కందువఁ బాన్పుపైనుండి కాఁపురాలు సేసేవు
చెంది దేవులతనము చెల్లునే నీకు" 26-244

"దేవులతనమున తెఅవ నిన్నొరసు
శ్రీవేంకటేశుఁడ చింతించకు" 23-207

దేవులమ్మ: (దేవులు + అమ్మ) వి. పట్టపుదేవి, భార్య. దేవీ శబ్దానికి 'దేవులు' బహువచన రూపం. ఇట బహువచనం గౌరవార్థకం. దేవియైన అమ్మ, లేదా అమ్మ యైన దేవి.

"దేవులమ్మ యిందిర మాదిక్కై విన్నవించరాదా"
"దేవులమ్మ విలిచీనీ దేవుని రమ్మనరే
ఆవల నెవ్వతెకు లోనాయెనో యని" 5-8

దేవులసాని: (2) వి. పట్టపుదేవి, పట్టపురాణి.

"దండితోడ నూడిగపుదాన నయ్యే నంటే నేల
చండిపోరి నీ దేవులసానిఁ జేసవయ్య" 11-504

దేవులు: (120) *వి; బహు.* 'దేవి' శబ్దానికి బహువచన రూపం. ఇది గౌరవసూచకమై ఏక వ్యక్తిపరంగా 'నేను నీ దేవులు', ఇత్యాదిగా వాడుకలో నిల్చి బహుత్వార్థాన్ని పోగొట్టుకున్నది. భార్య, పట్టపురాణి, దేవి. అన్నమయ్య 'దేవి' అనే ఏకవచన ప్రయోగానికి బదులు అంతటా 'దేవులు' అనే పదమే ప్రయోగించినాడు. దీనికి సుమారు 120 ప్రయోగాలు కనిపిస్తున్నాయి.

"యిట్టె నీ దేవులు చేతికిచ్చిన యీ కానుక
జట్టిగొన్న కాఁగిలే లంచము లాయను" 22-451

దేవుళ్ళు: (26) *వి; బహు.* 'దేవి' శబ్దానికి బహు.రూపమైన దేవులు శబ్దానికి బహువచనరూపం. భార్యలు, పట్టపురాణులు అని అర్థం. చూ: దేవులు.

"వొరయచు నీ దేవుళ్లు వూడిగాలు సేయఁగాను
కరుణతో నీ వాకెను కాఁగిలించేవు" 26-408
"ఇద్దరు దేవుళ్లుఁదాము నెదురుదేరులమీఁద
కొద్దిమీర నిమ్మపండ్లఁ గుచ్చి చిమ్మేరు"
18-138
"నాలి నిద్దరు దేవుళ్లనడుమ నిలుచుండి
కైలాటాలు చల్లీ నదె కనుఁగొనల" 14-368

దేశమువారు: స్థానికులు.

"తెలిపించుకొనవే దేశమువారి చేతనే
కులికి సోకు నా కొంగేల పట్టీనే" 11-239

దేశాంత్రులు: *వి; బహు.* 'దేశాంతరులు' (ఏక. దేశాంతరి) కు వ్యవహారరూపం. పరదేశపువారు.

"అగణితంబైన దేశాంత్రుల మఠంబులును
నధికమై చెలువొందఁగాను" 1-227

దేహరము: వి. దేవగృహం.

"లింగము లేని దేహరములు లెక్కలేని
ప్రియములు"

దేహాతుమ: వి. దేహాత్మ. దేహరూపంలో ఉన్న ఆత్మ. అన్నమయ్య ఆత్మశబ్దాన్ని అంతటా 'ఆతుమ' అని ప్రయోగించినాడు.

"పరఁగ యోనిసంభవమగు దేహాతుమ
పెరిగి యందుకే ప్రియపడును" 4-404

దై

దైతతనము: *వి; మాం.* గయ్యాళితనం, జగడాలమారితనం (దైత = గయ్యాళి, జగడాలమారి)

"నీతితో నడవఁగాను నిన్ను దూరేనా నేను
దైతతన మెవ్వరందో తలఁచుకో పనులు"
27-440

దైన్యపడు: అ.క్రి. దీనస్థితిలో నుండు.

"చిక్కి దైన్యపడఁగాను చెలఁగి ఖండించరాదు
చక్కగా నా ద్రోహులు సైరించరాదు" 2-434

దైలు: వి. ఈ పదం నిఘంటువుల్లో కానరాదు.

"యీలీల శ్రీవేంకటేశుఁడిటు తానే నన్నుఁగూడె
దైలతోనేఁ గొసరేనా తనతో నేను" 21-3

దైలువారు: అ.క్రి. దైవారు, పొంగిపొరలు, అతిశయించు, ఒప్పు.

"యెంతని చెప్పేనేను యేమని వినేరు మీరు
సంతతము దైలువారి చల్లు వెదలాడేనే" 12-287
"తమి రేఁచఁగా వలపు దైలువారఁగా నవ్వి
సమరతికిఁ బెనఁగీ సమ్మతించవయ్యా" 12-357
"తలవంచే నిన్నుఁజూచి దైలువారెనా చెమట
చెలరేఁగి ఆపె నిన్నుఁ జేసే చేఁతకు" 8-128

దైలువాఌ: *ప.బం; అ.క్రి.* అతిశయించు.

"తమి రేచఁగా వలపు దైలువాఱఁగా నవ్వి
సమరతికిఁ బెనఁగీ సమ్మతించవయ్యా" 12-357

దైలువోయు: ప.బం. (?)
"మొగము నేను చూచితే మోసులువార నవ్వేవు
తగు వసంతపు నీట దైలు వోసేవే"
"మొగము నేము చూచితే మోసులువార
నవ్వేవు
తగువసంతపు నీట దైలు వోసేవే" 7-206

దైవారు(ఱు): (దైలు + పాఱు) అ.క్రి.
1. పొంగిపొరలు 2.అతిశయించు 3. ఒప్పు.
"మనసు మర్మాలు సోఁక మాటలు నిన్నాడేదెల్లా
తనివోని కోరికల దైవారుతాఁగాదా" 12-293

దైవారు: వి; ప.బం. 'దైవాఱు' ధాతువుకు
భావార్థక కృదంతరూపం. ఒప్పుట,
అతిశయించుట.
"యెలమి శ్రీవేంకటేశ యీకె మన్నించఁగాను
తలపోఁత కళలతో దైవారులు వారీని" 12-429

దొ

దొంగరికము: (దొంగ + ఱికము) వి. దొంగతనం,
చౌర్యం.
"సుద్దులే దొంగరికాలు మద్దులు విఱిచి వాఁడు
సుద్దులు మద్దులుఁ జెప్పి చూపరో హరిని"
17-445

దొంగల ధర్మాసనము: అన్యాయానికి స్థానం.
"ధీరత చెడి తాను జీవుఁడు తెలియక
నేరకయుండిన
ధారుణిలోపల దొంగల ధర్మాసనమాయె"
1-72 & 1-189

దొంగలసానికనుమ: వి. ఇది సిద్ధవటం తాలూకా
ఓబుళందగ్గర ఉన్న కనుమ. (చూ:
ఎఱ్ఱశిలకనుమ)
"కాంత నీ చిత్తమే దొంగలసానికనుమ
యింతటి వేంకటపతి కిరవైనది" 5-115

దొంగాడు: అ.క్రి. 'తొంగాడు'కు
వ్యావహారికరూపం. దోగాడు; బిడ్డ నేలపై
చేతులు మోపి మోకాళ్లతో నడచు,
దాగుడుమూతలాడు. నిఘంటువుల్లో ఈపదం
కానరాదు. ఇది 'తొంగాడు' కూడా కావచ్చు.
"అల్లన దొంగాడవయ్య హరి కృష్ణ" 28-495
"చలపాదిగొల్లెతల చనుగొండలతోడుత
తులఁదూచీ దలపులు దొంగాడు కృష్ణుఁడు"
26-278

దొంగు: అ.క్రి. మఱుఁగుపడు.
"చెంగలించి చేతులెత్తి చెలఁగుచును వీఁడె
దొంగిదొంగి తిరిగీని తోలరమ్మా" 5-257

దొండి: వి. రంధ్రం.
"చక్కిలాల కుండలెల్లా చలాన దొండ్లు వొడిచి
దిక్కన దోఁటికోలల దీసెనమ్మా" 4-161
"పండ్లు గాయలును బానలు వీదుల
దొండ్లుగాఁ జేసి దొబ్బిదొబ్బి" 23-331

దొండివోవు: ప.బం; అ.క్రి. చిల్లుపడు,
తూటుపడు. (తె.వ్యు.కో.)
"ఆసలచే వేగేది నీకెంత వేడుకైతేఁ జాలు
దోసమా నాపై వణకు దొండివోయీనా"
12-255 old

దొండెము: వి. (?)
"తుత్తుమురై కోరికెల దొండెము రేఁగఁగఁ జొచ్చె
జొత్తుల వెరగుపడి చూచీఁబుట్టుగులు"

దొండ్లువోవు: అ.క్రి. చిల్లులుపడు.
"గొందిమున్నఁ బోనీక కోలలు చాఁచి చాఁచి
పొందుగ దొండ్లువోవఁ బొడిచీ మీ బాలుఁడు"
21-386

దొంతరకొండ: వి. రాళ్లు వరుసగా ఒకదానిపై
నొకటిగా నున్న కొండ.
"అగ్గమై శ్రీవేంకటేశుఁడలమేలుమంగఁగూడె
తగ్గు లేని మొత్తపు దొంతర కొండవలెను" 4-55

దొంతరకొడుకు: వి. (?)
"వంతుకు యశోదకు నవ్వుల నందగోపునికి
దొంతరకొడు కైనాఁడు తొల్లి వీరే పుణ్యులో"
2-509

దొంతరచుట్టరికము : వి. పరంపరగా వస్తున్న చుట్టరికం.
"ఇంతలో శ్రీవేంకటేశ యెనసి మీరుండఁగాను
దొంతరచుట్టరికానఁ దొప్పఁదోఁగే వలపు" 7-421

దొంతరతామెర : వి. పరంపరగా అనేకదళాలతో వికసించిన తామర .
"చెంతఁజెక్కునఁ బెట్టిన చేతితోడ నుండఁగాను
దొంతరతామెర ఆయఁదొయ్యెలి మోము"
14-150

దొంతరనేరుపులు : వి. అధికమైన నేర్పులు .
"ఇంత గలితే నీవు మా ఇంటికి వచ్చేవేళ
దొంతర నా నేరుపులు తోడు చూపేఁగాని"
23-460

దొంతరబాసలు : వి; బహు. వరుస బాసలు .
"వింతవారు నవ్వేరని వెరపు మానితేఁ బోనీ
దొంతర నీ బాసలకు దోసమైనా ముట్టదా"
7-430

దొంతరబోనము : వి. వరుస భోజనము .
"వనితా కౌఁగిట రతి వాడనిపువ్వు
తనివోని మోవి దొంతరబోనము" 23-318

దొంతరమాటలు : వి; బహు. పరంపరగా వచ్చే మాటలు .

దొంతరమెచ్చులు : వి; బహు. మెప్పుల పరంపరలు .
"రంతుల శ్రీవేంకటేశ రతుల మమ్మేలితివి
దొంతరమెచ్చులు మెచ్చ దొడ్డవారమా" 13-65

దొంతరవలపు : వి; బహు. అధికమైన వలపు .
"దొంతరవలపు చల్లి దోమటి దోడుకవచ్చీ
యెంత గద్దో చుట్టరిక మీపెకు నీకు" 28-471

దొంతర విద్యలు : వి; బహు. విద్యల పరంపరలు, అనేక విద్యలు .
"చెంతల పరుసవేది చేతిలోనే వుండఁగాను
దొంతరవిద్యలతోడి దోవ మాకేలా" 3-190

దొంతరవేడుకలు : వి; బహు. వేడుకల పరంపరలు .
"చింత యేమి సేసేనే శ్రీవేంకటేశుఁగూడితే
దొంతర వేడుకలెల్లా దొరకీఁగాక" 29-431

దొంతిఁబెట్టు : (5) స.క్రి. ఒకదానిమీద ఒకటి వరుసగా పేర్చు
"ఇంతయు నీ మాయామయమే గతిఁ
దెలియఁగవచ్చును
దొంతిఁబెట్టిన కుండలు తొడరిన జన్మములు"
2-133

దొంతి : (2) ఒకదానిపై ఒకటిగా పేర్చిన వస్తువుల వరుస, పరంపర .
"దొంతులాయఁ గూరిములు దూరులాయ
నేరములు
వంతులు వాసులు నింక వద్దనవే" 9-109

దొంతికర్మములు : (2) వి. అధికమైన కర్మములు, వరుస కర్మములు .
"చెంతల నీతని సేవకులకు మరి
దొంతికర్మముల తొడసిఁక నేల" 4-325

దొంతిపులకలు : అధికమగు రోమాంచములు .
"దొంతిపులకలు రేఁగఁ దొడతొడ వెరగందీ
చెంత నీవు సేసినట్టి చేసన్నలు దలఁచి" 18-470

దొంతిబోనాలు : వరుస బోనాలు .
"వంతులు వెదకుదువు వాసికిఁ బెనఁగుదువు
దొంతిబోనా లివిగో పొత్తుల నుండరాదా"
26-435

దొంతిమదము : అధికమైన మదం .
"అంతట నరగొర లన్నియుఁ దీరెను
దొంతిమదములకుఁ దుద లేదాయ" 7-295

దొంతివిషయములు : అధికమైన విషయాలు .
"దొంతివిషయములాల దొరలాల
చెంత మీఁదటిబుద్ధి చెప్పరో మాకు" 2-407

దొంతివెట్టు : (3) వరుసగా పేర్చు .
"నవ్వుల దొంతివెట్టితి నడుమంత్రమున నీవు
కువ్వగానేల చూపేవే కూరాకు మోవి" 7-431

దొంతివేసాలు : వి. అధికమైన వేషాలు .
"ఎంత వేగిరకాఁడవు యేమోయి

దొంతి వేసాలిట్టె వెన్నతోడఁ బెట్టరా" 25-384

దొంతులకర్మాలు : *వి; బహు.* వరుస కర్మలు.
"ఇంతే మఱేమి లేదు యిందుమీఁదను
దొంతులకర్మాలు దుమ్ము దూరుపెత్తుట"
1-398

దొంతులకెక్కు : *అ.క్రి.* వరుసకెక్కు.
"అలమె శ్రీవేంకటేశుఁడంటిన మావొడఁబాటు
తొలుత మీ నవ్వులెల్లా దొంతులకు నెక్కవా"
7-41

దొంతుల బుద్ధులు : అధికమైన ఆలోచనలు
"మంతనాన నీవు నాకు మనసిచ్చి
యుండఁగాను
దొంతుల బుద్ధులు యేమి దోచే నీకు" 11-108

దొంతులయాసలు : వరుస ఆశలు
"చెంత మాటలఁ దనిసి చేయివేయఁ గోరుదు
దొంతుల నా యాసలకు తుద యెందు లేదు"
19-447

దొంతుల వేడుకలు : అధికమైన వేడుకలు.
"దొంతుల వేడుకలను తొల్లె తా మోలలాడిరి
యింతలోనఁ జల్లారిన యీ చవింతే కాక"
11-505

దొంతులువెట్టు : (3) ఒకదాని మీద ఒకటి పేర్చు.
"వింతవింత మాటలు వేడుకతో పాటలు
దొంతులు వెట్టేరు నీవై తొయ్యలు లెల్లా" 14-76

దొగ్గినంబలి : అర్థం విచార్యం. (పద.)
"కలది కుక్కిమంచము కన్నవారెల్లాఁ బండేరు
తలెతో దొగ్గినంబలి దావకూళ్లు" 1-370

దొడ్డ తోలుఁగోట : *వి.* శరీరం. (వ్యు.) పెద్ద తోలు గల కోట అని వ్యుత్పత్తి.
"తొమ్మిది గవనులైన దొడ్డతోలుఁగోటా
కొమ్మల చవుల మూల కొత్తళాల కోటా" 2-84

దొడ్డిఁబెట్టు : *ప.బం; అ.క్రి.* దొడ్డిని తోలు.
"మాడలవలె సతుల మారుపెల్లాడేవు
తోడ నిట్టె యెందటిని దొడ్డిఁబెట్టేవో" 11-41
"నాముకొన నాతనితో నవ్వు నవ్వవచ్చుఁ గాక
దోమటిగా సిగ్గులెల్ల దొడ్డిఁబెట్టవచ్చునా" 25-138

దొడ్డికట్టుది : (దొడ్డికట్టు + అది) గొల్ల స్త్రీ కావచ్చు. దొడ్డికట్టు వాడకట్టువంటి పదం. దొడ్డికట్టు = పశువులకొట్టం కలది - గొల్ల స్త్రీ.
"ఇంతులు నీకు బాఁతా యెంత సేసేవు
దొంతిఁబెట్టేవు ప్రియము దొడ్డికట్టుదాన" 21-87

దొడ్డిపట్టు మానినుల దొమ్మికాఁడు : గొల్ల పల్లెలలోని గోపికలను అల్లరి పెట్టువాడు, శ్రీకృష్ణుడు.
"దొడ్డిపట్టు మానినుల దొమ్మికాఁడా
అడ్డములేని చేఁతల యాతఁడవా నీవు" 24-59

దొడ్డిపట్టు మానినులు : *వి.* గొల్లపల్లెల్లోని గోపికలు.
"దొడ్డిపట్టు మానినుల దొమ్మికాఁడా
అడ్డము లేని చేఁతల యాతఁడవా నీవు" 24-54

దొడ్డివాఁడు : *వి.* గొల్లవాఁడు.
"పిసికితే నవ్వులఁ బేరి పెరుగులై
దొసఁగుల కపటపు దొడ్డివాఁడవా" 12-447

దొడ్డు : 'దొడ్డ'కు రూపాం. గొప్పది.
"ఆడ నీ వదినెయైతే ఆపె నీకు దొడ్డుగాక
యీడుజోడు సవతులు యింత కోపఁగలరా"
26-245

దొడ్డుగొంచము లెంచు : *ప.బం; అ.క్రి.* హెచ్చు తగ్గులు ఎన్ను. 'కొంచెము' అనే రూపానికి బదులు 'కొంచము' అని ప్రయోగించడం వ్యావహారికతాలక్షణం.
"సరవితో దొడ్డుగొంచము లెంచవు
సరుసఁగూచుంటేఁ జాలు చలపట్టి కూడుదువు"
23-444

దొడ్డెడు : దొడ్డినిండా ఉన్న.
"దొడ్డెడు పసులఁ గాచి దొరవు నే డైతివి
జడ్డుగొల్లెతలఁ బొంది జాణ వైతివి" 12-540

దొబ్బు : (14) *మాం; స.క్రి.* తోయు, కోస్తాంధ్రలో దీనికి అశ్లీలార్థంలో ప్రయోగం ఉంది.

"దొబ్బిన చేతులనే దోసిలించి మొక్కి నాకె
అబ్బురా లేటికి విడె మందియ్యవయ్యా"
20-366

"కాయమంటి నిన్నాతఁడు కలయఁగ రాఁగాను
చేయివట్టి దొబ్బేవు చెలఁగి నీవు" 13-174

గడపు :

"పూరకే దినదినాల యుగాలు దొబ్బితిఁగాని
నేరిచి వివేకము నిలుపనైతి" 3-283

"తుంచరాదు నీ మదము దొబ్బిరావు
దినములు
యించుకంతె నా సిగ్గు యేమి సేతురా" 8-122

దొమ్మ : వి. అవయవవిశేషం.

"నమలెడు నానాచవులకు నానావిధభక్షణములు
కమలిన దుర్గంధపు శాకమ్ములు దొమ్ములును"
1-151

దొమ్మి : వి. పెనగుట.

"అంచెల శ్రీవేంకటేశుఁ డాతఁడిదె నిన్నుఁగూడె
మంచపు దొమ్ములలో మంకులిఁక నేఁటికే"
20-370

దొమ్మికాఁడు : (దొమ్మి+కాఁడు) వి. జగడీఁడు, అల్లరికాఁడు, సందడి యుద్ధం చేసేవాఁడు, దౌర్జన్యం చేసేవాఁడు.

"కొమ్మ తీరునఁ గుదురైన కోట
దొమ్మికాండ్లైదుగు రుందురు" 1-61

"దొమ్మికాఁడ గొల్లెతలఁ దొడికిన యలవాటు
ఇమ్ముల నెవ్వరిఁ గన్నా నేల మానునయ్యా"
14-32

దొమ్మికాంతలు : వి. జగడించే స్త్రీలు.

"కమ్మటి నవ్వితివంటా కన్ను గిరిపితివంటా
దొమ్మికాంతలతోడఁ బొత్తు గలతురా" 7-361

దొమ్మిచేయు : అ.క్రి. దౌర్జన్యంతో ఒకరిమీద ఒకరు పడు, దౌర్జన్యం చేయు.

"తొలమంటే కాఁగిలించి దొమ్మిసేసేవు
జలకమాడేటివేళ సంగడికి వచ్చేవు" 11-262

దొమ్మినవ్వులు : వికటపు నవ్వులు, వికటాట్టహాసాలు.

"నమ్మి శ్రీవేంకటేశ్వరు నన్నుఁ
గూరుచుమంటేను
దొమ్మినవ్వులు నవ్వేవు దొరవౌదువే" 26-383

దొమ్మిపూజ : వి. అందరూ ఒకేసారి కలసి చేసే పూజ.

"పారి నా పాదాలమీఁదఁ బూవులెల్ల రాలఁగాను
దొరతనానకు రాఁగా దొమ్మిపూజ లాయఁగా"
11-600

దొమ్మివాఁడు : వి. అల్లరివాఁడు, దౌర్జన్యం చేసే వాఁడు.

"సొమ్ములు నించుకోఁగానే సొలియుచుఁ దిట్టేవు
దొమ్మివాఁడ వౌదుఁగాని తొలరా నీవు" 14-362

దొమ్మిసరసము : వి. సందడి సరసం.

"చిమ్మి రేఁగినటువలె సేసినదే చేఁతగాక
దొమ్మిసరసములోన తొలఁగఁ జోటున్నదా"
24-351

దొమ్ముల కర్మములు : వి. జగడపు పనులు, కష్టాలు కలిగించే పనులు.

"నెమ్మది శ్రీవేంకటేశ నీ చిత్తమే కాక
దొమ్ముల కర్మము లివి తోయవచ్చునా" 1-397

దొరకత్తె : (దొర + కత్తె) దొరసాని, గొప్పది.

"తోడివారిలో నన్ను దొరకత్తెఁ జేసేవేళ
ఆడ వచ్చి బుద్ధిచెప్పి అడ్డగించవలదా" 25-33

దొరకాలువ నెత్తురు : వి. దోరకాలువ నెత్తురు కావచ్చు అని సంపాదకులు. ఎఱ్ఱనైన కాలువ నెత్తురు.

"కాంచనదైత్యుఁడు దొరకాలువ నెత్తురు వార
చించెను గోళ్ల నరసింహదేవుఁడు" 2-228

దొరకోలు : వి. లభించడం, చిక్కడం, సంభవించడం, పూనిక.

"తొలఁగక నన్నుఁగూడి దొరకోలు సేసుకొని
చెలఁగీ శ్రీవేంకటాద్రి చిన్న బావఁగారు" 11-355

దొరదొంగ : వి. దొరవైన దొంగ.

"వెరవున్నా (వున?) దన విధము దాఁచుకొని
దొరదొంగ వచ్చె దోబూచి" 5-227

దొరపాటివాడు: వి. దొరతో సమానమైనవాడు, ప్రభుతుల్యుడు.

"దొరపాటివాఁడాతఁడు దొమ్మిసేతురా
తరుణులాల మీరు తరవు పెట్టుదురా" 13-24

దొరముని: వి. ఆదివన్ శఠకోపుడు; అన్నమాచార్యుల వారికి అహోబిలంలో నరసింహమంత్రాన్ని ఉపదేశించిన గురువు.

"చూడుఁ డిందరికి సులభుఁడు హరి
తోడునీడయగు దొరముని యితఁడు" 1-117

దొరవాఁడు: వి. దొర, రాజు, సేనానాయకుడు, గొప్పవాడు

"అడరి తెరమాఁటున నానలువెట్టే ఇంతిఁ
దొడికి పట్టుదురా దొరవాఁడవు" 21-285

దొర్లాడు: స.క్రి. అనుభవించు, తిరస్కరించు, కలియు.

"విన్నపాలు వినేనే వీఁడు దొర్లాడేనే
యిన్నిటాఁదా శ్రీవేంకటేశ్వరుఁడే" 12-156

దొసకులు: (2) వి. దొసగులు, కష్టాలు.

"రసముబ్బ నవ్వులను రాసివడీ మొక్కులను
దొసకులేమని దూరే నిన్ను" 23-315

దో

దోఁగిపోవు: ప.బం; అ.క్రి. ఒరసికొని పోవు.

"వున్నతి దొలఁగ వాని వొళ్లెల్లా దోఁగిపోయ
కన్నెలార యీ కృష్ణునిఁ గంటిరటరమ్మ" 2-165

దోఁగు: అ.క్రి. దోగాడు, పాకు.

"మచ్చిక దోఁగెడు తాను ముద్దులు విరిచినాఁడు
పిచ్చిలఁ బూతకి చన్ను పీరిచినాఁడు" 3-235

దోబూచి: వి. చిన్నపిల్లలు ఆడుకునే ఒక ఆట. బూచి అంటే భూతమని అర్థం. వ్యవహారంలో బూచిగాడు, దొంగ అనే అర్థాలు ఉన్నాయి. చిన్నపిల్లలు ఏడుస్తున్నప్పుడు వారిని భయపెట్టి ఏడుపు మాన్పించడానికి, అదిగో బూచి, అద్దో బూచి అంటూ చెప్పే పదమే 'దోబూచి' అయి ఉంటుంది. తల్లులు సాధారణంగా తమ కండ్లకు అడ్డంగా చేతులుంచుకొని బూచీ అంటూ ఉన్నటులుండి కండ్లు తెరచి ఏడుస్తున్న బిడ్డల ఏడుపు మాన్పించి ఆశ్చర్యపరుస్తుంటారు. ఇలాంటి ఆటను దోబూచి అని, దాగిలిముచ్చులాట అని అంటారు. అన్నమయ్య ఈ పదాన్ని ఉపయోగిస్తూ కొన్ని పాటలు రాసినాడు. వాటిని 'దోబూచి పాటలు' అంటారు.

"బండి విరిచి పిన్నపాపలతో నాడి
దుండగీఁడు వచ్చె దోబూచి"

దోమటి: ఈ శబ్దానికి సూ.ని. వాచస్పత్యం, శ.ర. నిఘంటువులు అన్నం అనే అర్థాలు పేర్కొన్నాయి. నిఘంటువులు 'దోమటి' అనే 'టి' వర్ణంతో కూడిన పదాన్నే ప్రథమాంతంగా గ్రహించినట్లు భావించవచ్చు. కాని తె.వ్యు.కో. 'దోమడి' శబ్దాన్ని ప్రథమాంతంగా గ్రహించి 'వివాహ విందుభోజనమ'నే అర్థాన్ని సూచించి "దొడ్డమేక పొలగూడు దోమటి దొడికినాడు" (6-43) అనే అన్నమయ్య ప్రయోగాన్ని ఉదాహరించింది. దీనిని బట్టి దోమటి అనేది దోమడి శబ్దానికి ఔపవిభక్తి రూప మని భావించాలి. కాని అన్నమయ్య 'దోమటి' శబ్దాన్నే ప్రథమాంతంగా గ్రహించిన ప్రయోగాలు కూడా కనిపిస్తున్నాయి. ఉదా :-

"తోడులు నీడలు నొక్క దోమటాయను" 7-273

"తొట్టిన వలపులెల్ల దోమటాయను" 21-308

అంతేకాక అన్నమయ్య 'దోమ(టులు)ట్లు' అనే శబ్దాన్ని పెక్కుచోట్ల ప్రయోగించినాడు. ఉదా :-

"తోడనే రతులకు దోమటులాయను" 29-258

"గోమున శ్రీవేంకటేశుఁ డిట్లానే
కూడి దోమట్లు గలయఁ గలిగితే" 28-149

"మటి యేఁటి సుద్దులు మమ్మడిగేవు నీవు
మెఱసి మీ యిక్కువలు మించెను దోమట్లై"
8-174

పై ఉదాహరణవల్ల 'దోమటి'యే ప్రథమాంత రూపమనీ, దోమడి కాదని స్పష్టమౌతుంది. శృం.సం. 28 వ సంపుటం పీఠికలో శ్రీ కామిశెట్టి

శ్రీనివాసులు గారు దోమడి అంటే ఉత్సవ విందు అని తెలిపినారు. (పుట. 35) ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు ఈ పదం అర్థాన్ని చర్చిస్తూ ఈ కింది ప్రయోగాలను బట్టి ఇది ఔపవిభక్తికముగా తోచుచున్నది. కాని ప్రథమాంత రూపమునకు ప్రయోగములు కానరావు అని తెలిపినారు. (తా.క.ప; భాషా.వి; పుట 451) వారు చెప్పినట్లు 'దోమడి' అనే ప్రథమాంత ప్రయోగం కానరాదు. కాని పైన చెప్పబడినవిధంగా దోమటి అనే శబ్దమే ప్రథమాంతంగా వాడబడడంవల్లా, దోమట్లు అని బహువచనాంతంగానూ ప్రయోగాలు ఉండడం వల్లా 'దోమటి' శబ్దాన్నే ప్రాతిపదికంగా భావించవలసి ఉంటుంది. గౌరిపెద్ది సుబ్బరామశర్మ గారు శ.ర; సూ.ని; ఇచ్చిన అన్నము అనే అర్థం ఇక్కడ సరిపోదని 'దోమటి' శబ్దానికి మడ్డితనము, మొరటుతనము, దొమ్మి వంటివి కావచ్చునని సూచించినారు. (సం.ప.స. 24 నం. 431 పుట) బ్రౌన్ నిఘంటువులో దోమటి, దోమడి అనే రెండు శబ్దాలను చూపి దోమటి శబ్దానికి food, అన్నము అనీ, దోమడి శబ్దానికి a marriage feast attended by certain ceremonies and which only married people whose partners are alive can join అనే అర్థాలు చూపబడ్డాయి. దోమటిశబ్దం విశేషణంగాకూడా వాడబడింది. దీనికి సందర్భానుగుణంగా 'కపటస్వభావం కల' అనే అర్థం యుక్తంగా కనిపిస్తుంది.

"సాము సేసి సేసి మా చన్నులేల పిసికేవు
దోమటి బూతకి మీఁద తొడుకఁగ రాదా"
20-592

"దోమటి రాక్షసులు" 2-208

దోమడి : వి. వివాహపు విందుభోజనం. 4-423

దోయడు : (2) (దోయి + ఎడు) విఙ. దోసెడు, అంజలి ప్రమాణంకల. (విచిత్రమైన ప్రయోగం)
"దోయఁడు చేతుల మొక్కి తూఁగుజెమటలతోడ
సోయగపుఁజూపులఁ జూచి చొక్కిని" 16-528
"దూపిలిన రతితోడఁ దోయఁ(యె)డు చేతులతోడ
యేపున నున్నాఁడ విపు డేమయ్య విట్ఠల"
5-201

దోసకారి : (3) విఙ. తప్పు చేసినవాడు.
"యీ సుద్దులకె కా నే నీయింటికి రాను వెఱతు
దోసకారి చెలికత్తెతోడి తెచ్చేఁగాని" 7-2

దోసాలుగట్టు : (3) అ.క్రి. నేరాలు మోపు, తప్పులు అంటగట్టు.
"యింతులచే మొక్కించి యేల దోసాలు గట్టేవు
చెంతల నేమి చెప్పిన సేసే నయ్య నీకు" 14-439

దోసిటిపాలపెండ్లి : వి. దోసిటి పెండ్లిపాలు కావచ్చు. దోసిలి నించుకున్న పెండ్లి తలంబ్రాలు కావచ్చు. అవి చల్లడానికి అర్హములు.లేక దోసిటిపాల = దోసెఁడు తలంబ్రాలు గల, పెండ్లిన్ = వివాహంలో అనైనా కావచ్చు.
"దోమటిసతులతోనే దోసిటిపాలపెండ్లి
నీ మీఁదఁ జల్లఁగానీ చిత్తమిఁకను" 25-190

దోసిలించు : స.క్రి. దోసిలిగా చేర్చు, అంజలిగా కూర్చు.
"తూలెటీ నెరులతోడ దోసిలించి మొక్కఁగాను
పాలుపడి దోసానకు భయమేల పుట్టదు" 8-292

దోహళజ్ఞుఁడు : వి. (?)
"కంతుని తోట పూఁదీగె గాలి యనే దోహళజ్ఞు
డంతటఁ బుట్టించఁ జేసినటువలె నున్నది"
7-410

ద్రా

ద్రావిడము : వి. తమిళభాష.
"వరుసతో విణ్ణాపఁజివారు తాళములంటుచు
సొరిఁబొరి ద్రావిడానఁ బొగడఁగాను" 18-281

ద్రి

ద్రిష్టపు మాయలు : వి; బహు. పైకి కనిపించే మాయలు.

"తిరుగకుమీ విజ్ఞాన మా ద్రిష్టపు మాయలకును లోఁగి
సరి లే దితని పాదసేవకును సనకాదుల బ్రదుకే"
సాక్షి 2-41

ద్రిష్టపు విరోధము : వి. పైకి కనిపించే విరోధము .
"తెలియనా ఇంద్రియాలు దిష్టపు విరోధ మౌట
తెలిసినాఁబోఁగువలెఁ దెంచరాదు" 3-362

ద్రిష్టము : (19) విణ. చూడబడింది .
"యిది మునుపె నీ చిక్కు యిందుకు ద్రిష్టంబొక్కటె
తుదఁదొల్లె నీ దాసులు గలరు తుదఁదొల్లియే నీవుఁ గలవు" 2-121

ద్రిష్టవరదుఁడు : విణ. ప్రత్యక్షంగా వరాలను ఒసగేవాడు .
"దేవ శ్రీవేంకటేశ్వర నీవు ద్రిష్టవరదుఁడవగుట
తావైన నీ కోనేటిదండ నొసఁగేయందే కంటిమి"
2-321

ద్రిష్టాంతము : (4) వి. 'దృష్టాంతము'నకు వ్యావహారిక రూపం. నిదర్శనం.
"ఇదివో ద్రిష్టాంతము యిచట మాయందే కంటి
యెదిరితే వెనకముందింతాఁ బెడరేచును" 7-194

ద్రిష్టించు : (3) స.క్రి. 'దృష్టించు'కు వికృతిరూపం, చూచు .
"తమతోడ వైష్ణవులు దాపుదండై వుండఁగాను
తెమలి తీర్థాలెల్లా ద్రిష్టించవలెనా" 3-219

ద్రిష్టి: (2) వి. 'దృష్టి'కి వికృతిరూపం . చూచు.
"నే మెటుల నుండినాను నీకేమీ
వేమరు మా మీఁది ద్రిష్టి విడువవు నీవు"
11-557

ద్రిష్టిగోచరము : విణ. దృష్టిగోచరం .
"దేవుఁడై పూజ గొను ద్రిష్టిగోచరమై
శ్రీ వేంకటాద్రిమీఁద సిరులొసగు" 2-417

ద్రిష్టిదాకు : (2) అ.క్రి. దృష్టి దోషం కలుగు .
"ఆలకించి చూడఁబోతే ద్రిష్టిదాఁకే నందువు
పలికితేనే బహుభాషి దందువు" 7-485

ద్రిష్టిమంత్రము : వి. దృష్టిదోషం పోవడానికి వేసే మంత్రం .
"ఘాతఁగరుణాకరుఁడై కరుణ దృష్టివాఁడే
మా తరతరము ద్రిష్టిమంత్రము రక్ష" 4-54

ద్రో

ద్రోణము : వి.(?)
"కమ్మటి బుసకొట్టేవు గరిడా నా జవ్వనము
దొమ్మిఁబట్టి తీసేవు ద్రోణమా జడ" 23-217

ద్వ

ద్వయము : వి. ద్వయమంత్రం.
"శ్రీమన్నారాయణచరణౌ శరణం ప్రపద్యే"
"శ్రీమతే నారాయణాయ నమః" అనే ఈ రెండు మంత్రములు. ఇవి క్రమంగా తిరుమంత్రంలోని నమః, నారాయణాయ అనే రెండు పదాలకు అర్థాన్ని వివరించడంవల్ల వీటికి ద్వయమంత్ర మని వ్యవహారం. పపన్నులగు వైష్ణవులకిది ముఖ్యమైనది. దీనికి మంత్రరత్నమని పేరు.
"తదియ్యగురుప్రసాదపురోడాశమిచ్చి
కొదదీర ద్వయమను కుండలంబులు బెట్టి"
2-148
"వెతలేని వీరల సాత్వికమే బ్రాహ్మణ్యము
తతి ద్వయాధికారులే తప్పరు బ్రాహ్మణ్యము"
2-486

ద్వా

ద్వాదశనామములు : వి. (1) శ్రీమహావిష్ణువు యొక్క ప్రసిద్ధమైన పన్నెండు పేర్లు. అవి.
1. కేశవుడు 2.నారాయణుడు 3. మాధవుడు
4. గోవిందుడు 5.విష్ణువు 6. మధుసూదనుడు
7. త్రివిక్రముడు 8. వామనుడు 9.శ్రీధరుడు
10. హృషీకేశుడు 11. పద్మనాభుడు
12.దామోదరుడు. (2) వైష్ణవులు మేన ధరించే పన్నెండు ఊర్ధ్వపుండ్రాలు.
"తావుగ దేహమందు ద్వాదశనామములకు
పావిపోని సంకల్పమే శరణాగతి" 5-324

ద్వాసుపర్ణ : ద్వా సుపర్ణా అనే మంత్రం. "ద్వా సుపర్ణా సయుజా సఖాయా, సమానం వృక్షం

పరిషస్వజాతే, తయోరేకః పిప్పలం స్వాద్వత్త్యనశ్నంశ్చాన్యః అభిచాకశీతి" అనే జీవాత్మ పరమాత్మలను గురించిన ఋజ్మంత్రం. (2.3.17) ఇది అనేక ఉపనిషత్తుల్లో కూడా ఉన్నది. ఎప్పుడు కలిసి ఉండే, పరస్పరం స్నేహం కలిగి ఉండే ఆత్మపరమాత్మ రూపమైన మంచి రెండురెక్కలు గల పక్షులు శరీరమనే ఒక వృక్షము పైననే కూర్చుని ఉన్నాయి. ఆరెండింటిలో ఒకటి (జీవాత్మ) కర్మతో గలిగిన శరీరం అనే చెట్టుయొక్క పండును బాగా తింటుంది. రెండోపక్షి (పరమాత్మ) ఆ కర్మలనుండి దూరంగా ఉంటూ అంటే ఫలాన్ని అనుభవించకుండా కూడా సంతోషంగా వెలుగుతుంది" అని దీని భావం.

"నిండిన యీ జీవులు నీవేయన వెఱతును
దండనే బద్ధులు వీరు ద్వాసుపర్ణ వున్నది గాన" 2-121

ధ

ధనుర్మాసము: వి. శ్రీవైష్ణవులకు అత్యంత విశిష్టమైన మార్గశీర్షమాసం.
"పులుగాలు పచ్చళ్లు బోనము వెట్టినదిదే
వెలయు ధనుర్మాసవేళయు నిదే" 3-484

ధర్మదార: వి. యుద్ధం పూర్తి అయిందని సూచించడానికి ఊదే బాకా.
"ఈడనే ధర్మదార మీ కిఁకనైనాఁ బట్టవో" 2-40

ధర్మపుణ్యము: (2) వి. ధర్మము, పుణ్యము, ద్వంద్వసమాసమైనా బహువచన ప్రత్యయమైన 'లు' చేరనిరూపం.
"చేరి ధర్మపుణ్యము నీ చేతిదిగాక
యీరసాన నిందరిలో నేమనేదిరా" 13-63

ధవళము: వి. ధవళగీతం. ఇది ఒక మంగళగీతం. జయ శబ్దాన్వితంగా ఉండడం, ఆశీర్వాదాత్మకంగా ఉండడం, వివాహసమయంలో పాడబడడం, షష్ఠ్యంతంగా ఉండడం ధవళలక్షణంగా భావించవచ్చు.
"కమలారమణికిఁ గమలాక్షునకు
మమతల జయజయ మంగళము
అమరజననికిని అమరవంద్యునకు
సుముహూర్తముతో శుభమంగళము" 1-448

ధా

ధావతి: వి. త్వర, ఆరాటం, ఆయాసం.
"ధావతులేఁటికి మానుఁదనుభోగాలుండఁగాను
మోవరాని చింతలతో ములుగుఁగాక" 4-61

ధావతి: వి. ప్రేమ, భయం, అత్యాసక్తి.
ప్రేమ:
"ధావతిఁదలిదండ్రులు తమ బిడ్డల తనువులఁ బంకములంటనను
యే విధముల నీరార్చి వెంతురటు ఇన్నిట నీవే గతి నాకు"3-392
భయం:
"భావించి చక్రమీతఁడు పట్టితే నసురలెల్ల
ధావతితోడుతను పాతాళము వట్టిరి" 7-220

ధావతి: విశ. దుడుకైన.
"ధావతికర్మము-తప్పఁదీసినా
దైవము గావక తలఁగినా" 4-60

ధావతియాసలు: వి; బహు. ఆరాలుపెట్టే ఆశలు.
"గోవిందుఁడ నినుఁ గొలువఁగనేరకే
ధావతియాసలఁ దగిలితిని" 3-182

ధ్రు

ధ్రువపట్టము: వి. స్థిరమైన స్థానము.
"కట్టెను ధ్రువపట్టము కమలజుకంటే మీఁద
కట్టె విభీషణునకు లంకారాజ్యము" 4-255
"శ్రీవేంకటేశు దాసులు చేసినదెల్లా సృష్టి
యేవంకా ధ్రువపట్టమే ఇటువారికి" 3-119

ధ్రువమండలము: వి. ధ్రువనక్షత్ర విశేషము గల మండలము.
"వుదయాస్త శైలములు వొక జంగగాఁజూచె
అదివో ధ్రువమండల మందె శిరసు" 4-509

న

నంగతనము : వి. సాహసపు పని చేసి తెలియనట్లుండే స్వభావం, నంగనాచితనము .
"అంగజు శరమువంటి అతివె నీకు
నంగతనమిది యాల నవ్వనమ్మా" 26-112

నంజుపంటి పాము : వి. విషపుకోరలు గల పాము. (నంజు = విషం)
"నల్లని నా యారు యిది నంజుపంటి పాముట"
3-375

నంటు : (35) వి. స్నేహం (స్నేహితుడు, సంపర్కం, తాకుడు, బంధువు, ఆసక్తి, శ్రద్ధ, నాణెము, నాణ్యత, నాగరికత.)
"నంటున శ్రీవేంకటేశ నామ తక మెరగవు
దంట వయసువాఁడవైతె తప్పొప్పు లేదా"
21-367
"నంటున నీవు నవ్వఁగా నడుమ నీకోజ
జంటయైన పతినేల జంకించేవే వీడే" 25-129

నంటుమాటలు : వి; బహు. స్నేహపుమాటలు .
"నవ్వులకు నీతోను నంటుమాట లాడితేను
రవ్వగాఁ జెప్పేవు తోడిరమణులతో" 25-210

నంటువాడు : వి. స్నేహితుడు .
"పానుపుపై నీవు నన్నుఁ బాయకుండితేఁ జాలు
నానారతుల నాకు నంటువాఁడవే" 20-489

నంటువావి : వి. స్నేహపు సంబంధం.
"కంటిమి నీ జాడలెల్ల కడు దిష్టమాయను
నంటువావులు ముమ్మడి నాఁగు కిచ్చేవు"
23-355

నంటుసేయు : (11) అ.క్రి. స్నేహంచేయు .
"నగే వంతలోనె నిన్ను నంటుసేసుక
సొగసి యాపె గుట్టు సోదించరాదా" 28-442

నందలూరు : వి. నెందలూరు కావచ్చు. 20-175

నఖచంద్రులు : వి; బహు. నఖక్షతాలు . (అర్ధచంద్రాకారంలో ఉండే గోటి గుర్తులు)
"తప్పక నఖచంద్రులు తనువులపై నించఁగా
విప్పుచు చిరునవ్వుల వెన్నెలలు గాసెను"
18-187

నగజవరదుఁడు : వి. విష్ణుమూర్తి (నగజము = గజం, నగంలో = పర్వతంలో, జ = పుట్టింది అని వ్యుత్పత్తి) గజేంద్రునికి వరమిచ్చినవాడు.
"నగధర నందగోప నరసింహా వో
నగజవరద శ్రీ నారసింహా" 1-259

నగరి : వి. చిత్తూరు జిల్లాలోని తాలూకా కేంద్రం. ఇట నృసింహస్వామి దేవాలయం ఉంది.
"నగరిలో గద్దెమీఁది నరసింహము వీఁడె
నగుచున్న జ్వాలానరసింహము" 4-182

నగళ్ళవారు : వి; బహు. అంతఃపురాల్లోనివాళ్లు .
"విచ్చనవిడియైనట్టి వేడుక నగళ్ళవారు
అచ్చమైన నీ సేవ సేయ నందమౌనయ్యా"
29-115

నగవుసేయు : అ.క్రి. నవ్వు .
"తగవెరిఁగినవాఁడు తారుకాణించఁగ నాతో
నగవుసేసుక నన్ను నమ్మించరాదా" 11-244

నగవు సేసుకొను : అ.క్రి. నవ్వు .
"నగవుసేసుకొని నలినాక్షి గోరంటితే
తగవులఁబెట్టే వేల తరుణులతో" 23-351

నచ్చికలు బుచ్చికలు చేయు : స.క్రి. మాటలతో బేలు పుచ్చు, నమ్మికలు చేయు అని తె.జా.

నచ్చు : (6) వి. 1. బాధ 2. ఆలస్యము, మాంద్యము .
"నచ్చు నా మనసెట్టు నమ్మించేవు" 12-3
"వచ్చితివి వలచి మా వాకిటికి నీవు నేఁడు
నచ్చులఁబురసతులు నవ్వకుండేరా" 27-249

నచ్చుకొట్టు : (8) అ.క్రి. బాధపెట్టు .
"కొచ్చి చూడ దొరకొంటి కొద్దివెట్ట వచ్చునా
నచ్చుకొట్టి మర్మాలెల్లా సాటుఁగాక" 29-529
"విచ్చనవిడాయ నీకు విభుఁడింటికి రాఁగాను
నచ్చుకొట్ట నేల యిఁక నవ్వఁగదవే" 29-78

నచ్చుకొను : స.క్రి. ఇష్టపడు, ఇట 'కొను' అనుబంధక్రియ చేరడం విశేషం.

"మచ్చికతోడుత నీవు మాటలాడఁగాఁజూచి
నచ్చుకొని కొంతగొంత నవ్వీ నాపె" 13-76

నటన : వి. నటించుట, కృత్రిమప్రవర్తన.
"అటుగననే రోయఁగఁదగవా
నటనల శ్రీహరి నటమింతే" 2-71

నటము : వి. నటనము ; నట్ ధాతువుపై భావార్థంలో అచ్‌ప్రత్యయం రాగా ఏర్పడిన విలక్షణ ప్రయోగము.

నట్టింటి వైరము : వి. అందరికీ తెలిసిన శత్రుత్వం. 2-72
"వెట్టిమోపరిలాగు వెఱ్ఱివోయిన వోక
నట్టింటివైరంబు నగుఁబాటుబ్రదుకు" 1-71

నట్టుకొట్టు : (11) అ.క్రి. సంకోచించు, సందేహించు, వెనుదీయు, ఆలస్యంచేయు. స.క్రి. అడ్డుకొను, నిరోధించు. 26సం. పీఠికలో దీనికి 'వివరించు' అనే అర్థం సూచించినారు. (పుట 9) ఈ అర్థం అంత సమంజసంగా కనిపించదు.
"నిట్టూర్పు నించినది నిండాఁ జెమరించినది
నట్టుకొట్టి ఆకెఁగొంత నవ్వించరాదా" 26-70

నట్టుకొను : (3) అ.క్రి. నెలకొను (పద.) తావు విడువక ఉండు (ఆం.ధా.పా.), నివసించు.
"నట్టుకొన్న రెండువేలు నాలుకల శేషుఁడు
నెట్టన హరిఁబొగడ నేరుపరి శేషుఁడు" 3-365

నడగొండ : (నడ + కొండ) వి. నడక గల కొండ.
"నానావర్ణముల నడగొండవలెను
దానవారి తే రదె తగ తిరువీథుల" 4-55

నడచే కాలము : వి. వర్తమానకాలం.
"యెంచి నడచేకాలమే యిందరికి నుంబళి
తెంచి యెచ్చుకుందు లిందుఁ దెలుప నేముంది" 2-310

నడపు : (3) (నడచు + పు) నడక.
"నునుపు నడపుల యేనుక పెద్ద యడవి
చెనకు నట్టనడిమి సింహపుటడవి" 5-153

నడమ : 'నడుమ'కు వ్యావహారికరూపం.
"కడుఁగాంక్షలు నా సొమ్ము కర్మములు
నడమ నంతర్యామివి నాకు నీవు" 3-200

నడిమిగోపురమాడ : నడిమి గోపురం దగ్గర. గోపురం దగ్గర అనే అర్థంలో గోపురమాడ అని ప్రయోగించడం విలక్షణం. ఇట్లే 'నీడ దిరుగని చింతాడ' అనే ప్రయోగం కూడా.
"చేరువయై కృపసేసీ నిదివో
కూరిముల నడిమిగోపురమాడ" 2-320

నడిమిగోపురము : వి. తిరుమల లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం మూడుగోపురాల్లో రెండవది.
"చేరువయై కృపసేసీ నిదివో
కూరిముల నడిమిగోపురమాడ" 1-320

నడివీదిపెసర : (2) ప.బం; వి. నడివీధిలో నుండే పెసర. నిలువనిది. నడివీధిలో నుండే పెసరు పంట ఆ వీధిన వచ్చిపోయే వారికే చెల్లుతుంది. కాని చేను గలవానికి దక్కేది కొద్దిమాత్రమే. నిరర్థకమన్నమాట
"గడిరాజు బదుకాయ కడిలేని మనసు
నడివీదిపెసరాయె నయమైన మనసు" 1-337

నడుకొత్తు : (నడుకు+ఒత్తు) అ.క్రి. అందరికీ లభ్యమయ్యేది అని తె.వ్యు.కో., నిర్భయుడగు అని వావిళ్ల. సరిగా ఉన్నట్లు లేదు. ఇంకా విచార్యం అని పద.
"యెడయక శ్రీవేంకటేశ యీకెఁ గూడితివి
నడుకొత్తి నిచ్చకల్యాణమువలె నున్నది" 7-464

నడుమంతరము : వి. మధ్యకాలం.
"వడిఁజంకించేనంటా వచ్చి నీ మాటలు విని
నడుమంతరాలనే నవ్వె నిపుడు" 21-241

నడుమంతరములవారు : వి; బహు. మధ్యకాలంలో వచ్చినవారు.
"నవ్వే దెఱఁగడు నడుమంత్రములవారు
చివ్వనఁ దనలోని సిగ్గువడవలదా" 20-47

నత్తు : అ.క్రి. తడబడుతూ మాట్లాడు
"అత్తి శ్రీవేంకటపతి ఆదరించి కూడితివి
పొత్తు నత్తుఁ గూడె నిఁక బూటకమేలయ్యా" 26-7

న దైవం కేశవాత్ పరమ్ : విష్ణుమూర్తి కంటే పరదైవం లేదు అని అర్థం.
"వాదుల 'న దైవం కేశవాత్ పర'మని తొల్లి
వేదవ్యాసులనిన విభుఁడీ హరి" 15-237

ననుచు : (2) అ.క్రి. ప్రీతిచెందు, ఇష్టపడు, ప్రియమగు.
"మనసు వచ్చితే మాటాడుటే మేలు
ననుచకున్న మోనము మేలు" 7-16
"ననుచనిచోటను నంటు సేయఁదలఁచితే
అనుమానమె కాని అమరిక రాదు" 7-366
2. వృద్ధినొందు, అతిశయించు :
"ఘనబంధమోక్షులకుఁ గారణమిఁక నెవ్వరు
ననిచిన జ్ఞానాజ్ఞానములే కాక" 2-174

ననుపు : వి. ఇంపు, అతిశయం.
"పెనఁగులాడుతా నీతో బిగిసేదాననా
ననుపులసరసాల నవ్వితిఁగాక" 16-444
"ననుపుగాని పొందు నవ్వించ వసమా
అనఁగపెనఁగుమని యందురుగాక" 27-189
2. అనురాగం :
"ననుపు గలిగితేనే నవ్వు లింపులౌ గాఁక
మనసొకచోట నుంటే మరి యేఁటికే" 14-484

ననుపుకత్తె : (ననుపు + కత్తె) వి. ప్రియురాలు, విటురాలు.
"ఏమే విచారించే వెంతవని గద్దు నీకు
నాములు వార నవ్వేటి ననుపుకత్తెలము"
27-195

నప్పు : స.క్రి. నడపు, ప్రవర్తింపుజేయు.

నప్పుట : వి. సరిపోవడం.
"కపటము లేఁకనేల కన్నుల నప్పుటగాక
యెపుడును నావంటి యిల్లాలికి" 12-36

నమకచమకాలు : వి; బహు. రుద్రదేవతాకములైన మంత్రాలు.
"నమకచమకహిత నారసింహా వో
నముచిసూదనవంద్య నారసింహా" 1-259

నమలిపురి : వి. 'నెమలిపురి'కి వ్యావహారికరూపం, నెమలిపింఛం.
"పేగుల జంద్యాలు వేసి పించపు నమలిపురి
పాగగాఁజుట్టిన నా బాఁపనయ్య వీఁడివో" 5-254

నమలీక : (నమలి + ఈక) వి. నెమలి యీక
"కొప్పు గేదఁగులు మాకు కొన నమలీకలు
గొప్ప ముత్యాలివి మాకు గురిగింజలు" 5-121

న మే భక్తః ప్రణశ్యతి : భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన వాక్యం. నా భక్తుడైనవాడు నశించడు అని అర్థం.
"న మే భక్తః ప్రణశ్యతి" యను మాట
అమోఘమై నీ వానతియ్యఁగా" 15-45

నమ్మికె : (2) వి. నమ్మకం (క. నంబికె)
"చుట్టమైనవాఁడు తన చోటికి నమ్మికెగాక
వెట్టివాఁడు సతమౌనా వేగినంత తాను" 15-446

నయగారము : వి. విలాసం, ప్రియవాక్యం, మనోజ్ఞత, అలంకారం, మంచితనం, మృదుత్వం.

నయగారి : (4) వి. మృదుత్వం కలవాడు, మృదువుగా మాట్లాడేవాడు.
"చిన్న చెక్కులమీఁదటి చెనకులు కొనగోర
మిన్నక చిమ్మినెంత మేఁటినయగారి" 29-524

నయగారితనము : (9) వి. మృదుత్వం, మృదువచనం.
"నియతిఁబరపు చూచి నీవని పాదము చాచు
నయగారితనాల సన్నలు సేసి కొందరు"
28-521

నయగారిమాటలాడు : అ.క్రి. మృదువైన మాటలు పలుకు.

నయగారివాడు : (4) వి. మృదుత్వం కలవాడు, మృదువుగా మాట్లాడేవాడు.
"నయగారివాని మతి నాఁటదు నిష్టూరము
క్రియగూడఁ దనకు మొక్కితి ననరే" 25-250

నయమెక్కు : అ.క్రి. వృద్ధిచెందు. (వ్యా.)
"మోనమున నుండనేలే మొకము వంచఁగనేలే

నానఁబెట్టితే వలపు నయమెక్కీనా" 20-317

నరకమే కురియు : ప.బం; అ.క్రి. ఎక్కువగా కష్టాలువచ్చు.

"దరి చేరుటా లేదు తగులు లేదు

నానాఁడు నరకమే కురిసీని నా బ్రదుకు" 3-110

నరమిగొను : (?)

"అరగునా దుర్బలున కరుదైన యన్నంబు

కురుచబుద్ధులను నరమిగొనుఁగాక" 1-242

నరమృగదేవుడు : వి. నృసింహస్వామి, నరమృగముల రూపాలుకల దేవుడు.

"చెనకి యహోబలాన శ్రీవేంకటాద్రిమీఁద

ననిచె శ్రీ మహాలక్ష్మి నరమృగదేవుని" 9-217

నరుమగు : అ.క్రి. నలినలియగు.

"నసికొట్లఁ గోడెచేత నరుమాయెను

శిశువింతయు" 12-238 old

నఱకము : వి. నరకము. బండి 'ఱ' విలక్షణం.

"నెఱి నఱకములో నాని తివియుఁ గొన్నాళ్లు

తఱవాయి తెలుసుకో దానికేమి" 3-331

నఱుజు : వి. చిన్నది, అణువు.

"గురిగా నేఁ బాడఁగాను కొనగోరఁగిలిగించి

నఱుజుగా నెలవుల నవ్వింపించీనే" 23-50

నలఁకువ : వి. ఆపద, కష్టం, శ్రమ, బాధ.

"ఇల దుర్గుణముల కీ జన్మంబున

నలఁకువ సేసేఁబో నా వ్రాఁత" 1-189

నలినలిగా : క్రి.విణ. నుజ్జునుజ్జుగా.

"తలవంచుకొని నీ దగ్గర నే నుండఁగానే

నలినలిగా నన్ను నవ్వించేవా" 21-154

నలినలిసేయు : ప.బం; స.క్రి. నుజ్జు నుజ్జు చేయు.

"నలుగడఁజూచి చూచి నరహరి మోవి

నలినలి సేతురా నరహరి" 7-229

నలిరేఁగు : ప.బం; అ.క్రి. విజృంభించు.

"సొలసి సొలసి నిన్నుఁ జూచిన యీ చెలిచూపు

నలిరేఁగి నీ మతిలో నాటకుండీనా" 9-200

నలుమడి : (నలు + మడి) వి. నాలుగింతలు. (ఇనుమడి వంటిది)

"మెచ్చితిమి నీ కూటమి మీఁదమీఁద మేలాయను

పెచ్చురతి నలుమడి బేరమాడేవు" 23-355

నలువు : వి. 1. ఒప్పిదం 2. సామర్థ్యం విణ. ఒప్పిదమైన.

"పలుప్రియములు చెప్పి పదివేలగా నీకు

నలువునఁదనమారు నన్నే మొక్కుమనేను" 27-520

"చెలఁగి పాపములు మించినవేళ హరి

నలువు నామోచ్చారణంబు గలుగుమీ" 2-416

నల్లఁదెల్ల : నల్లదనం - తెల్లదనం(?)

"నలువైనా కన్నులందు నల్లఁదెల్ల గలిగిన

నెలకొని మెచ్చు మెచ్చ నీకుఁబోదుగా" 23-507

నల్లఁబూసలు : వి; బహు. నల్లపూసలు. కొందరు ముత్తైదువలు గ్రుచ్చి మెడను గట్టుకునే చిన్న నల్ల గాజుపూసలు. (శ.ర.)

"చేరి చేరి యేఁటికిఁ జేసేవు బాసలు

నారుకొనఁగట్టితివి నాకు నల్లఁబూసలు" 18-531

నల్లఁబ్రజ : వి. ఆటవికజనం, కిరాతులు, సైన్యంలోని బోయవారు. వీరంతా కాయకష్టం చేయడం వల్ల నల్లగా ఉంటారు కనుక వీరికి నల్లఁబ్రజలనే వ్యవహారం వచ్చి ఉంటుంది.

"కాముఁడు గురు లేయఁగా కడనుండి నల్లఁబజ

దోమటి నెఱుకరాను తొడఁగినట్లుండె" 23-157

"నల్లప్రజలు లక్షకున్ను నెలనెలకు తప్పక సంబళం

దిద్దుమని వొక కర్ణీకం యేర్పాటు చేశి" అని రాయవాచకప్రయోగం. (31 పు. 3 లైను)

"పార్శ్వభాగముల నల్లప్రజ గ్రుమ్ముకొనన్ - - - జెంచు

పాళెగాఁడమ్మను జేంద్రుకొల్వునకు - - - వచ్చె" అని శు.స. ప్రయోగం.

నల్లతిండి : వి. చిరుతిండి.

"నల్లతిండౌ మరి మీఁద మరగితే రోఁతతా

వుల్లమిచ్చే వేంకటేశు వొద్ది కిటువంటిది" 1-189

నల్లతెల్ల జల్లివాఁడు : వి. నలుపు తెలుపు రంగు గల కుచ్చు గలవాడు.

"అరయ నరసేసి నల్ల తెల్ల జల్లివాఁడ

యిరవై జీతముసేసి - - - - -" 15-39

నల్లదీవి : వి. జంబూద్వీపం.

"తిరముగ నల్లదీవిఁ దెచ్చిన యర్థ మిదివో

విరజ వోడరేవున వెళ్ళినర్థము" 2-3

నల్లబల్లి చెన్నుఁడు : వి; చూ : నల్లబల్లి చెన్నకేశవుడు.

"నల్లబల్లి చెన్నుఁడా నవ్వేవు సారె సారె

ఇల్లిదె చూతువుగాని యిందు రావోయి" 24-161

"నగు శ్రీవేంకటగిరి నల్లఁబల్లిచెన్నుఁడా"

నల్లబల్లి చెన్నకేశవుఁడు : (3) వి. కడపజిల్లా నల్లబల్లి అనే గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి. ప్రస్తుతం ఆలయం పునాదులు తప్ప మరేమీ లేవు. స్థానికుల అభిప్రాయం ప్రకారం ప్రధానాలయం పూర్తిగా పాడుబడిపోయిందట. కొన్ని వందల సంవత్సరాలుగా వృథాగా ఉన్న ఈ మధ్యప్రదేశంలో ఇల్లు కట్టుకున్నారు. అన్నమయ్య నల్లబల్లి చెన్నకేశవునిపై ఐదు కీర్తనలు చెప్పినాడు.

"చేకొనుమీ నల్లబల్లి చెన్నకేశవా

యీకడ నీ కిన్నిటి మొక్కేను స్వామి" 7-534

"నల్లబల్లిచెన్నుఁడా నవ్వేవు సారె సారె

ఇల్లిదె చూతువుగాని యిందు రావోయి" 24-161

నల్లముసుఁగు భూతము : వి. నీలాంబరధారి యైన బలరాముడు.

"జూంటరి నల్లముసుఁగు భూతము" 1-109

నల్లెడంత : (నల్లె + ఎడు + అంత) జానెడంత, నాలుగు అంగుళాల పరిమాణమంత .

"నడుమ నే నల్లెఁడంత నాలికెవాఁడ నింతె

వుడివోని సుద్దులెల్లా నుగ్గడించేను" 2-427

నల్లెడ : వి. కడుపులో మేతపొట్టకు పైన ఉండేది, నెండె, అది వాచి ఊపిరితిత్తులకడ్డం పడి శ్వాస ఆడక పశువు చనిపోతుంది.

"పొదలుచు మృత్యువు పందివోటై నల్లెట నాడఁగ

పదిలముగాఁ గింకరులను చొప్పరులఁ బరవిడిచీ" 1-298

నల్లెడు : విణ. జానెడు (నల్లె = జేన అని శ.ర.)

"పూని నల్లెడునాలికలో నుండు శ్రీవేంకటేశుఁ

డానుకొని బత్తితోడ నటు నిల్పిరో" 4-475

అని తిక్కన ప్రయోగం. (ద్రోణ. 5-317)

నల్లెడేసి గోళ్లాపె : వి. జానెడంత గోళ్లుగలిగిన స్త్రీ.

"నల్లెడేసి గోళ్లాపె ననుపులు నీకుఁజేసీ

ముళ్ళెడేసి నవ్వులాపె మోము చూపీని"

16-558

నవకము : (2) వి. మృదుత్వం.

"నవకమై లాలించితే నవ్వులు నవ్వనేరుచు

నివిరి ఇంకా నేమైనా నేరుపు మీ దెక్కును"

22-186

నవనారసింహుడు : వి. తొమ్మిదిరూపాల్లో దర్శనమిచ్చే అహోబల నృసింహస్వామి. ఆ తొమ్మిది రూపాలు : 1. జ్వాలా నరసింహుడు (ఎగువ అహోబలానికి మూడుమైళ్ళదూరంలో ఎత్తైన ప్రాంతంలో నెలకొన్న స్వామి.) 2. వీర నరసింహుడు. (ఈ స్వామి కొండపై ఒక గుహలో చక్రాకారంగా కొండనీటిధార అడుగు భాగంలో ఒక అరుగుమీద పదిభుజాలు కలిగి ఉన్నాడట) 3.యోగానంద నరసింహ స్వామి. (చిన్న అహోబలానికి ఆగ్నేయదిశలో రెండుమైళ్ల దూరంలో వెలసిన స్వామి.) 4.కానుగుమాని నరసింహస్వామి. (దిగువ, ఎగువ అహోబల మార్గం మధ్యలో వెలసిన స్వామి. కానుగమాను కింద ఉండటంవల్ల కానుగమాను నరసింహుడుగా ప్రసిద్ధుడైనాడు.) 5.మట్టెమళ్ల నరసింహస్వామి. (పెద్ద అహోబలానికి నాలుగు మైళ్లదూరంలో ఉన్న మట్టెమళ్ల అనే ఊరిలో బీభత్సమూర్తిగా వెలసిన స్వామి.) 6.భార్గోటి నరసింహస్వామి. (చిన్న అహోబలానికి సుమారు మూడుమైళ్ళ దూరంలో భార్గవతీర్థం అనే క్షేత్రం ఉంది. అక్కడికి సమీపంలో ఒక

కొండపై ఈ స్వామి వెలసి ఉన్నాడు.) 7. ప్రహ్లాద నరసింహస్వామి. (ఎగువ అహోబలంలో శ్రీ నరసింహస్వామికి ఉగ్రస్తంభానికి మధ్యలో వెలసిన స్వామి .) 8. లక్ష్మీనరసింహ స్వామి. (శ్రీ వరాహస్వామి సన్నిధికి ఎగువగా సుమారు రెండుమైళ్లదూరంలో ఉన్న స్వామి.) ఈ స్వామికి మాలోల నరసింహస్వామి అనే వ్యవహారం ఉంది. మాలోలుడంటే లక్ష్మిప్రియుడని అర్థం. 9.వరాహనరసింహస్వామి. (ఎగువ అహోబలం నరసింహస్వామి ఆలయానికి వెళ్ళే దారిలో భవనాశని తీరం ఒడ్డులో వరాహరూపుడై దర్శనమిస్తుంటాడు. "జ్వాలాహోబల మాలోల క్రోడకారంజ భార్గవాః, యోగానంద చ్ఛత్రవట పావనా నవమూర్తయః" అని నవనారసింహులను పెద్దలు కీర్తించినారు.

"నవనారసింహా నమో నమో
భవనాశితీర యహోబలనారసింహా" 1-453

నవ్వుఁబాటు : వి. నగుఁబాటు, నవ్వుల పాలగుట.
"ఘనుఁడ శ్రీవేంకటేశ కైకొంటివి ఇంతిని
నను పు చెలుల పొందు నవ్వుఁబాటు సుమ్మీ" 19-483

నవ్వులకైనా : ప.బం. ఏమాత్రమైనా, కొద్దిపాటియైనా, పరిహాసానికైనా .
"నవ్వులకైనాను నా మాఁట మీరని నిన్ను
యెవ్వతెరా నిన్ను నింతగాఁ జేసినది" 10-2-97

నవ్వులు చేయు : ప.బం; స.క్రి. పరిహసించు, అపహసించు .
"ఎవ్వరినైనను యీవ్రాఁత నను
నవ్వులు సేసెఁబో నా వ్రాఁత" 1-233
"నవ్వుసేసుకొంటేనే నానును వలపులెల్ల
చివ్వనఁ గోపించుకొంటే చేరుఁగూళతనము" 21-257

నవ్వులుమియు : ప.బం; అ.క్రి. నవ్వులు వెదజల్లు.
"నంటు మీఱి సెలవుల నవ్వులేల వుమిసేవే
గెంటు లేని కన్నులను కెంపులెక్కేని" 9-44

నవ్వులు సేసుకొను : ప.బం; అ.క్రి. అపహసించు, నవ్వులపాలుచేయు. (వ్య.)
"నవ్వులు సేసుకొనక నాతులతో జగడించి
పువ్వుమొన వాడి సేసే పురుషుడూఁ గలడా" 7-54

నస : వి. 1. దురద, ఉపద్రవం, కామం .
"పసతో శ్రీవేంకటపతి నన్ను నిటు గూడె
నస చేసి నాతోనె నవ్వీనటా" 11-183

నసకాఁడు : వి. కామోద్రేకం కలవాడు.
"కన్నెలు దన్నెత్తుకొంటె కాఁగిటి చవులు చూపీ
యెన్నిట తా నసకాఁడె యీ కృష్ణుఁడు" 11-121

నసగొంటు : వి. కామోద్రేకము కలవాడు .
"చెనకనేమో మీపై చేతులు చాఁచఁగ నీదే
ననిచి వుండరే మీరు నసగొంటు వీఁడు" 25-365

నసికాట్లు : వి; బహు. కామోద్రేకపు కాట్లు .
"బెట్టుగాఁగాఁగిట నిన్ను బిగియించుకొంట గాక
నట్టుకొట్టి మోవిమీది నసికాట్లా" 7-303

నా

నాఁగు : వి. ధాన్యమునకు వడ్డిగా ఇచ్చు ధాన్యము .
"నాగులెల్లఁ దీర మాచనవోలి చెన్నుఁడవై
మూఁగితి శ్రీవేంకటేశ మోవి యిచ్చేఁ గాక" 21-495

నాఁగువారు : (11) ప.బం; అ.క్రి. వృద్ధిచెందు, అతిశయించు, వడ్డివాఱు వంటి శబ్దం.
"చేఁగదేరఁగూడితివి శ్రీవేంకటేశు నిట్టె
నాఁగువారు మీ గుణాలు నమ్మ నెట్టు వచ్చునే" 22-103

నాఁగేలు : (3) వి. 'నాగలి'కి మాండలికరూపం.
"వేవేలు దొడ్లకాడ వెలుఁగులు వెట్టిపెట్టి
కేవల మితనికి నాఁగేలూ వొకటే" 21-156

నా౽టకీ౽డు : (నాటకము + ఈ౽డు) వి. నాటకమాడువాడు, నటనలు చేసేవాడు. ఇందులోని అరసున్న పొరపాటేమో ?
"నాకెంత ప్రియము చెప్పీ నా౽టకీ౽డు
కైకొని పొదిగీ నట్టే కాతరీ౽డు" 13-501

నా౽టకు౽డు : (7) వి. నాటకీ౽డు, కపటోపాయాలు పన్నేవాడు, నటనలు చేసేవాడు.
"యే౽టికి నవ్వితివయ్యా యెఱగము నే మా పని
నా౽టకుడ వే మందుకునైనా వచ్చును" 23-208

నా౽టించు : (4) స.క్రి. నాట౽జేయు, నాటు, ఒత్తు.
"ఏ౽టికిఁ జేరీ నే మిత౽డు
నా౽టించు రతి నన్నేలె" 5-100
"నా౽టించేవు చన్నులను నవ్వేవు సెలవులను
యే౽టికే యీ పగటులు ఇరుదెసలా" 27-169

నా౽టు౽జేయు : (2) స.క్రి. పాతుకొనునట్లు చేయు.
"రతిరాజు నమ్ములివి రంటదెప్పరపు వేళ
కతుకున నా౽టు౽జేసు గవిశన నిడరే" 11-221

నాకు నాకే : స్వయంగా, ఇతరుల ప్రమేయం లేకుండా.
"నన్ను౽జూచి నాకునాకే నవ్వు వచ్చీని
మిన్నక నా జవ్వనమే మేరలు మీర౽గను"
28-367

నాగముపేరిటి నా౽తి : వి. గజలక్ష్మి(?)

నాగవల్లిపెండ్లి : వి. పెండ్లిలో నాలుగవరోజు జరిగే తంతు.
"సతికి నీ కూటమి సారె నాగవల్లి పెండ్లి
మతకపురతులకు మానని జిడ్డు" 23-327

నాగవల్లి సోబనము : వి. నాగవల్లి శుభకార్యము.
"నంటుతోడి సరసాలు నాగవల్లి సోబనాలు
పెంటలైన సమరతి పెట్టిన పే౽(పీ౽)ట" 19-199

నాగవెల్లి : (2) వి. 'నాగవల్లి'కి వ్యావహారికరూపం. పెండ్లిలో నాల్గవరోజు జరిగే ఒక శుభకార్యం. 'నాకబలి'కి వికృతిరూపం.
"నే౽డే నాగవెల్లి నే౽డే యిల్లునింపులు
వో౽డిమి గోవిందపతి భోగించీ నిదివో" 20-558

నాగవెల్లి కట్నాలు : వి; బహు. నాగవెల్లి సందర్భంగా పెట్టే కట్నాలు ; చూ : నాగవెల్లి.
"చందనకావులు నీకు సరిగట్ట నంపె నమ్మ
యిందు నాగవెల్లి కట్నా లింతలోనే వచ్చెనా"
7-55

నాగశయనపువా౽డు : వి. విష్ణుమూర్తి, సర్పశయనంపై పవ్వళించేవాడు.
"నాలుగు చేతులవా౽డు నాగశయనపువా౽డు
బేలు౽దనమున సరి పెన౽గేనా" 21-3

నాచారి : వి. దేవత, అమ్మవారు. రూపాం. నాంచారు, నాచ్చారు, నాచ్చియార్.
"తల్లి దండ్రి దాత గురువు తానై యైన నాచారి
వల్లభుండు నాకు మేలువంటి దాయ జన్మము"
1-186 & 1-121

నాచారు : వి. దేవత, అమ్మవారు (స్త్రీ) రూపాం. నాచారి, నాచ్చారు, నాంచారు.

నాచు౽బాము : వి. పసరికపాము (వ్య.)
"నాలు కనియెడి గుహను నాచు౽బామది యొకటి
గాలి అనృతపువిషము గ్రుక్కుచుండ" 3-426

నాచు : వి. దొంగ. (బ్రౌన్)
"యేచి నీవు నవ్వితే నదేమని యడుగనేల
నాచుల మారుకు మారు నవ్వుటిలింతె కాక"
9-104

నాచుబొమ్మచారితనము : వి. దొంగ బ్రహ్మచర్యం.
"చూచితేనే దోసమా నే చొక్కి యెదుట నుండ౽గా
నాచుబొమ్మచారితనము దప్పీనా" 26-68

నాటకపు౽బ్రియము : కృత్రిమపు ప్రేమ.
"యే౽టికిరా తిరువేంకటేశు౽డ బొంక౽గ నీ

నాటకపు(బ్రియముతో నన్నుఁ గలసితివి" 5-357

నాటకపుది : (నాటకము + అది) మాయలాడి, కపట ప్రవర్తన గల స్త్రీ, ఇందులో అరసున్న విచార్యం.
"యేఁటికయ్యా నీవు మాతో యేలాటాలాడేవు
నాఁటకపుదాననా నవ్వేదానఁగాక" 12-278

నాటకపు మతములు : *వి; బహు.* బూటకపు మతములు, మోసపు మతములు .
"గాఁటపు శ్రీవేంకటేశుఁగని కొలిచినఁజాలు
నాటకపు మతములు నవ్వులలోనివే" 4-235

నాటకపుసతి : వి. బూటకపు సతి, మోసపు సతి
"నాటకపు సతులు నయగారాలు సేసీనా
యీఁటెల పోట్లేకాక యింత కోపేనా" 11-213

నాటకము(లు) నడపు : (2) *ప.బం; అ.క్రి.* వ్యవహారం నడపు . (నిందార్థం)
"తనతమే నిజమైతే తనివి గలుగునా
ననుపుగా నాఁటకము నడపీఁగాక" 22-6

నాటకము : (5) వి. నటన, కపటప్రవర్తన, వంచన.
"నగవౌతా నెరఁగము నాటకమో యెరఁగము
తగవు నన్నడిగేవా తరుణి మాట" 14-395
"నాలి సేసి నాఁటకము నడపఁగ వద్దుగాక
మనసారా మాటాడితే మంచిదే కదే" 28-356

నాటకములాల! : *వి; బహు.* మాయోపాయాలు పన్నేవారా!
"ఏఁటికి నెవ్వరి పొందు యిస్సిరో ఛీ ఛీ
నాటకములాల ఛీ ఛీ నమ్మితిఁగా మిమ్మును" 1-95

నాటకసాల : (5) వి. నాటకశాల, ప్రేక్షాగారం .
"అలరి నాటకసాల యాలలు చూచెనంటా
వెలయ నేడెంతలేసి వెంగేలాడేవే" 28-466

నాటకాలు : (3) *వి; బహు.* నటనలు, కపటప్రవర్తనలు.
"నమ్మి కడుగ వెరతు నాటకాలకు వెరతు
యిమ్ములఁదనకునే మోహించితి నిదే" 14-387

నాటికి నాడు కొత్త నేటికి నేడు కొత్త : నానుడి; నిత్యనూతనమైనది, Everfresh.
"నాటికి నాఁడు కొత్త నేటికి నేఁడు కొత్త
నాటకపు దైవమవు నమో నమో" 2-85

నాటిమాట నాటికగు : నానుడి; అప్పటిమాట అప్పటికఅగు.

నాటుఁజూపు : వి. గట్టిగా చూచే చూపు.
"నాటుఁజూపే కలిగితే నవ్వులు రాకుండునా
మేఁటి లాసయిచ్చినట్టి మేర కింతేకాక" 22-26

నాదించు : *అ.క్రి.* శబ్దించు.
"ఈ దెస నీ భావమయ్యో యెదుటి చందురునందు
నాదించే కన్నులు తన నలుపు లెంచీనా" 22-17

నానఁబాలు : *వి; బహు.* నానబియ్యం, నానబెట్టిన కొత్త చేరుడు బియ్యం. కోతల సమయంలో చేలవద్ద చేసే బొమ్మదేవర సమయంలో, నానబెట్టిన సజ్జలు లేదా బియ్యం, బెల్లం కలిపినవి పిల్లలకు, పెద్దలకు పంచి పెడతారు. ఇవే నానబాలు. "నానబాలు పెట్టమంటే ఏసేను సజ్జలన్నా" డన్నది సామెత. (రా.మాం.)
"ఎగసక్కేఁడవు నిన్ను నేమి చెప్పేము
నగితేనే సెలవుల నానఁబాలు చూపేవు" 7-156

నానుకొను : *అ.క్రి.* చాలాకాలముండు .
"మొగము చూచేనంటే ముప్పిరిగొనీ సిగ్గులు
నగితే మందెమేళాలు నానుకొనీని" 27-535

నానుడిబాసలు : *ప.బం; వి; బహు.* చూ: నానుడిమాటలు.
"మానకురా యిటు మాటాడీని
నానుడిబాసలు నమ్మితిని" 2-57

నానుడిమాట : *వి; ప.బం.* 'నాడు'కు సంబంధించిన నుడి నానుడి. నానుడులు, పలుకుబళ్ళు, జాతీయములు అన్నీ ఒక జాతికి చెందినవే. ఒక సీమయందు వాడుకునే మాట అనవచ్చు. 'నానుడి' కి అనుబంధంగా మాట సామాన్యంగా ప్రయోగింపబడింది. నానుడియైనమాట అని అర్థం.

"సరిగాడు వీఁడనవలదు జగమున రాజు
వలసినది దేవులు
యిరవుగ నందరు లోకములోపల యిది
నానుడిమాట" 2-298

నా భాగ్యము నీ చిత్తము : (2) *ప.బం;* నా అదృష్టం – నీ దయ, భారమంతా నీదే అనే సందర్భంలో వాడబడే పలుకుబడి. 'నీ చిత్తం – నా భాగ్యం' అనే వాడుక కూడా ఉంది.
"ఎవ్వరిఁబోలుదు నేను యిందరిలోన
నివ్వటిల్ల నా భాగ్యము నీ చిత్తముగాక" 18-276

నాము(లు)వారు : *ప.బం; అ.క్రి.* నామురోగం వచ్చినట్లు నాలుక పిడుచ కట్టు.
"ఏమే విచారించే వెంతవని గద్దు నీకు
నాములువార నవ్వేటి ననుపుకత్తెలము"
27-195
"నామువారఁ గల్లలాడి నాలిక గొంత పాపము"
3-327

నాము : *వి.* విషం (జొన్న లోనగువాని కొయ్యగాలున చిగిరించిన మొలక – దీనిని తింటే పశువులు చనిపోతాయి.) అసూయ, పొగరు (నాఁము బొగరు అని క.చౌ.), ధాన్యం అప్పుగా ఇచ్చి ధాన్యరూపంగా తీసుకునే వడ్డీ.
"యిది పుణ్య మిది పాప మెట్టని తెలిసేమయ్యా
అదన నన్నపు నామే యన్నువట్టెను" 4-253
"నాములాయఁ గదవే నీ నవ్వులు
కామించి యాతని మోము కళలెక్కను"
12-176

నాముకొను : *అ.క్రి.* నామురోగం వచ్చినట్లు నాలుక పిడుచ కట్టు.
"నాముకొన నాతనితో నవ్వు నవ్వవచ్చుఁగాక
దోమటిగా సిగ్గులెల్ల దొడ్డిఁ బెట్టవచ్చునా"
25-138

నాములుగా : *క్రి.విణ.* అధికంగా, అసూయగా.
"యేమి చేసి వచ్చినాను యెదురాడఁజాలనే
నాములుగా సెలవుల నవ్వుదుఁగాని"

నాములెక్కు : *ప.బం; అ.క్రి.* అధికమగు.
"నాములెక్కి నీ సిగ్గు నవ్వులై వెడలఁజొచ్చె"
28-395

నాముువలపు : *వి.* అధికమైన వలపు.
"ఏమి మాయ సేసితివో యెవ్వఁడెఱుఁగుర
నిన్ను
నాముువలపుఁదలకు నాకు నెక్కెరా" 24-130

నాముువేయు : *ప.బం; అ.క్రి.* 1. అధికమగు.
"తా నొకటి నే నొకటి తలపోఁత ఇన్నాళ్లు
నానాట మోహములు నాముువేసీఁగాక" 26-61
"జవ్వని పువ్వువంటిది సడిఁబడ నోపదు
నవ్వితేనే వసివాడి నాముువేసును" 14-99

నాయఁడు : *వి.* నాయకుఁడు, ప్రభువు, శ్రేష్ఠుడు, కొందరి పేర్ల చివరలో ఉండే బిరుదు.
"దొమ్మి సరసాలాడితే దొరతనాలు సెల్లునా
వుమ్మడినే సక్కనాయ నుండవయ్యా
నాయఁడా" 17-128

నాయంత నేనుండు : *ప.బం; అ.క్రి.* ఎవరిజోలికి పోకుండు.

నాయగాఁడు : *వి.* 'నాయకుడు' శబ్దానికి వికృతరూపం.
"నాయగాఁడవు గనక నమ్మించవలశో
యీ యెడ నిట్టె నీవు నన్నేలుకొనే విధమో"
26-203

నాయమాడు : *అ.క్రి.* న్యాయం పలుకు, న్యాయం చెప్పు.
"యింటికి రమ్మని నిన్ను యిటు నటు
కొంగువట్టి
నంటు చూపితిఁగాక నాయమాడేనా" 16-318

నాయము : (35) *వి.* న్యాయమునకు వికృతిరూపం.
"మగువ గుణము లెంచి మరి నీ గుణము లెంచి
నగుమా వోరిచీ నాపె నాయమైన పనికి" 7-488

నాయాలు వెట్టు : *ప.బం; అ.క్రి.* పంచాయితీ పెట్టు.

నారణి : *వి.* తీఁగె.
"కేరడమైన కిన్నెరలో యీ

నారణి ముట్టుచు నలుగడను" 5-283

నారసము : వి. బాణం.

"దారాసుద్దపుమాటలు తాఁకనాడి మదనుని

నారసాలు సేయకు నారసింహుఁడా" 10-2-18

నారాయణాష్టాక్షరము : వి. 'ఓం నమో నారాయణాయ' అనే ఎనిమిది అక్షరాలు గల మంత్రం.

"జతనమై ప్రహ్లాదుఁడు చదివినట్టి చదువు

గతిగా నారాయణాష్టాక్షర మిదియే" 4-33

"ఆదికాలపు వైష్ణవులందరి నోటి చదువు

గాదిలి నారాయణాష్టాక్షర మిదియే" 4-33

నారికడపుఁగాయ : వి. నారికేళపు కాయ, కొబ్బరికాయ, టెంకాయ.

"కమ్మటి చన్నుల నారికడపుఁగాయలు గాచె

పమ్మి మోవి తేనెల పంటలు పండెను" 18-152

నారికడపుఁగాయకు నీరు వచ్చినయట్లు : *ప.బం; క్రి.విణ.* తెలియకుండా వచ్చినట్లు, స్వయంగా వచ్చినట్లు.

"అల నారికడపుఁగాయకు నీరు వచ్చినయట్టు

తలఁచి రాఁగల మేలు తన్నుఁదానే వచ్చు రే"
2-140

నారికళపుఁగాయ : నారికేళపుకాయ, కొబ్బరికాయ.

"అంది నారికళపుఁగాయకుఁ బైనె కట్టిగాక

కందువలోనూ నట్టి గట్టి యయ్యీనా" 9-75

నారుకొను : (45) మొలకలెత్తు. (నాఱు = నాటడానికి గాను తఱచుగా విత్తులు పోయగా మొలచిన మొలకలు) శకటరేఫకు బదులుగా ఇట సాధురేఫమే కనిపిస్తుంది.

"నారుకొని యాతఁడు నాతో మాటలాడకుండ

నేరిపితి బుద్దులు నీవే కాన" 14-231

2. లోపలనే స్వల్పరూపమున నిలిచిపోవు (వ్యు.)

"మేర మీరె నా వేడుక మెరసెను నీ చలము

నారుకొనెఁ గోరికలు నాకు నీకును" 27-72

"వూరకే నన్నేల యింకా నొడివట్టేవు

నారుకొన్న సతులు శేనలు గారా" 16-250

నారుపోయు : *అ.క్రి.* నాటుటకు ఒత్తుగా విత్తనాలు చల్లి మొలకలు మొలిపించు.

"నలువంక వలపులు నారువోయవలెనా"
13-220

"నారువోసినట్టు నేము నవ్వు లిట్టె నవ్వుకోఁగా

దూరుగాని నీ వేటికి తోడు నవ్వేవే" 21-59

నాలి : వి. పరిహాసం, కపటం, వేళాకోళం, (తె.వ్యు.కో.) అల్పకృత్యం.

"నవ్వులు నవ్వఁగరాదు నాలి నూరకుండరాదు

యివ్వలి నీతో సరస మెటుఁబోరాదు" 11-404

నాలిఁబడు : *అ.క్రి.* నగుబాటున పడు.

"అనరే యీ మాఁటే మీరు ఆతనితోను

ననుపు చూపితే నవ్వు నాలిఁబడదా" 21-407

నాలిక : (27) వి. 'నాలుక'కు వ్యావహారికరూపం. అన్నమయ్య నాలుక, నాలికె అనే పదాలను కూడా ప్రయోగించినాడు.

నాలికత్తె : (6) (నాలి + కత్తె) వి. మోసకత్తె.

"అవ్వలి నీ రమణుని నాఁడఁగలవెల్లా నాడి

నవ్వితిననే వవునే నాలికత్తెవు" 26-317

నాలికను ముక్కంటుకొను : *ప.బం; అ.క్రి.* ఒట్టుపెట్టుకొను.

"చూతము నీ నిజమెల్ల సొరిది నేఁడందులోనే

ఆతల నాలికను ముక్కంటుకొనరాదా" 3-142

నాలికాఁడు : (13) (నాలి + కాఁడు) వి. మోసగాఁడు, వంచకుఁడు, అల్పుఁడు, మందుఁడు, నీచుఁడు, కుత్సితుఁడు.

"వాలుకరెప్పలు వంచినమాత్రములోనె

నాలికాఁడ నీ తనువు నాఁటె ననేవు" 11-363

"చన విచ్చి శ్రీవేంకటేశ్వరుఁడు తానె నన్నేలె

ననుపు తానెంత సేసీ నాలికాఁడు" 13-501

నాలికూళలు : వి. కుత్సితపు మూర్ఖులు, కుత్సితపు క్రూరులు.

"మాయలు నేర్చినవారు మహిలోన జాణలు

నాయాలు నడచేవారే నాలికూళలు" 11-86

నాలికె : (24) వి. 'నాలుక'కు వ్యావహారికరూపం. అన్నమయ్య నాలుక, నాలిక అనే రూపాలను కూడా ప్రయోగించినాడు.

"అరిది దుర్భాషల నలవడ్డ నాలికె
హరినామములయందు నలవడదు" 4-325

"సత్తెపు నాలుకెల్ల చవులకమ్మితిఁగాని
మత్తిలి నీ కీర్తనము మరపుటా లేదు" 3-60

నాలితనము : (7) వి. కాపట్యం, వంచకత్వం, కుత్సితపుపని, అల్పత్వం, నైచ్యం, మాంద్యం.

"నాలితనాననే నీవు నాతులను వలపించి
వేలసంఖ్యలను లోన వేసుకొంటివి" 21-374

నాలిమగఁడు : వి. కుత్సితపు మగడు.

"ముచ్చటలాడఁగవలె మొగము చూడఁగవలె
మచ్చరమేటికి నాలిమగనికి" 26-253

నాలిమొగదాకిరి : వి. (?)

"మేలములాడఁబోతే మీఁదఁజెయి వేయవలె
నాలిమొగదాకిరైతే నాయంత నే నుండవలె" 7-5

నాలివనిత : వి. కుత్సితపు వనిత, కపటపు వనిత.

నాలివెంగేలు : వి; బహు. కుత్సితపు వ్యంగ్యపు మాటలు.

"నవ్వులకయినా నీతో నాలి వెంగేలాడదు
యివ్వలి మోమై విడెమిచ్చుఁగాని" 23-180

నాలిసంసారము : వి. పాడుసంసారం, నీచపుసంసారం.

"నాలిసంసారము బ్రహ్మ నాఁటనుండి జేసేఁగాని
మేలిమి మోక్షముతోన మెలఁగనైతిని" 3-283

నాలిసేయు : అ.క్రి. కుత్సితపు పనిచేయు (కూలినాలి చేయు అనే పదంలోని నాలి ఈ అర్థంలోనే) పరిహాసంచేయు, వేళాకోళంచేయు, వంచనచేయు, అల్పత్వం చూపు.

"మేలములు పచరించి మేనెల్లాఁ జెమరించి
నాలిసేసి యంతలోనే నవ్వులు నవ్వేవు"
22-209

"నాలిసేసి పానుపుపై నవ్వులు నవ్వేవు నీవు
కోలుముందైన మీఁదఁ గొంకనేఁటికే" 8-100

నాలుక కొనలనె నాను : ప.బం; అ.క్రి. ఎప్పుడూ గుర్తుండి పోవు.

నాలుక కొన వేదమై నిలుచు : ప.బం; అ.క్రి. నోట్లో నాను, ఎప్పుడూ గుర్తుండిపోవు.

నాలుక చవులకమ్ము : ప.బం; అ.క్రి. రుచులకు లోబడు.

"సత్తెపునాలుకెల్ల చవుల కమ్మితిఁగాని
మత్తిలి నా కీర్తనము మరపుటా లేదు" 3-60

నాలుక తుదనుండు : ప.బం; సర్వదా నోట నాట్యమాడు.

"నాలుకతుదనే యీతఁడుండఁగా
నలుగడ నెవ్వరి వెదకేము" 3-371

నాలుకబెల్లాలు చూపు : ప.బం; అ.క్రి. మాటలోనే తీపి చూపు, నోటిమాటలతో మరపించు.

"వేలువెట్టి యిమ్ముగొనె వెనకనే చాలదా
నాలుకబెల్లాలు చూప నాయము గాదమ్మా"
26-148

నాలుకలోన బెల్లాలు యెదలోనఁ గత్తులు : నానుడి; మాటల్లో తీపి - హృదయంలో క్రౌర్యం.

"నాలుకలోన బెల్లాలు యెదలోనఁ గత్తులు
నెట్టుకొని నీవలె నేరనే నేను" 19-383

నాసికము : (9) వి. నాసిక, ముక్కు ; 'ము' వర్ణకంతో 'నాసికము' అనే రూపం విలక్షణం. శైవకవుల్లో ఈ రూపం ఎక్కువగా కనిపిస్తుంది. నాసిక అనే రూపాన్ని కూడా అన్నమయ్య ఒకచోట ప్రయోగించినాడు. (చూ. 7-413)

"నలినాక్షి కన్నులనడుమ నీ నాసికము
చెలఁగి యమరెనె వో చెలులాల" 7-405

ని

నించు : స.క్రి. నింపు.

"నించేవు కాఁగిటను నిన్నుఁజూచి నవ్వితేను
మంచముపైకిఁ దీసితే మన్నించేవు" 8-40

నించుకొను : స.క్రి. నిండించుకొను, ఆవరించుకొను, ముంచుకొను, ఉంచుకొను, కలుపుకొను, చేర్చుకొను
"నీకు మొక్కఁగాఁ గాఁగిట నించుకొంటివి గాక
దాకొని రతికి నీవు తమకించితివా" 14-506

నిండిన చదువులు : వి; బహు. వేదాలు, నిండుచదువులు, పూర్ణవిద్యలు.
"నీటఁగలిసినట్టి నిండిన చదువులు
తేటపరచినట్టి దేవుఁడు" 5-244

నిండుకుండ : ప.బం; వి. గంభీరుఁడు, గంభీరురాలు.
"ఏల నాతో నానవెట్టే వెవ్వ రేమనిరి నిన్ను
నీలో నే నొకతనై నిండుకుండ నైతినా " 14-440

నిండుకుండు : (3) (నిండుక + ఉండు) అ.క్రి.
1. తనివి చెంది ఉండు 2. ఖాళీయగు
3. వ్యాపించు 4.అతిశయించు (పద.)
5. సంతోషించు.
"నిడివి హరిఁగొల్చితే నిండుకుండుఁగాలము "
15-270
"అట్టి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను గూడి
నెట్టన పైఁడిమేడలో నిండుకుండగా" 9-191

నిండుజెఱకునఁ బండు నిలుచు : ప.బం; అ.క్రి. అదనపు అతిశయం కలుగు.
"అండ నిందుమీఁదనే పాటైన నీవు నవ్వితేను
నిండుఁజెఱకునఁ బండు నిలుచుట గాదా"
14-334

నిండునిధానము : (4) ప.బం; వి. అందుబాటులో నున్న అమూల్యవస్తువు.
"నీ వంటి చుట్టము నాకు నిండునిధానము గాదా
పూవుల నీ పాదములు పూజింతుఁగాక" 27-34

నిండుబండికిఁజేట : ప.బం; వి. (?)
"వేసరకు వీడేల యనకుము విడువ నిన్నింక
శరణు జొచ్చితి
నీ సరెవ్వరు లేరు వెదకిన నిండుబండికిఁ
జేటవేఁగా" 2-35

నిండురొంపిలో కంబము : ప.బం; వి. అస్థిరం.
"అండ సరసము నే నాడినట్టే యాడేవు
నిండు రొంపిలో కంబము నీ వలపు " 27-340

నిందలాడు : (2) (నిందలు + ఆడు) అ.క్రి. నిందావాక్యాలు పలుకు.
"నీ గుఱు తెఱఁగలేక నిందలాడిరి చెలులు
యీగతి నేఁటికి వంచే వెత్తవయ్యా శిరసు "
19-211

నిందలుగట్టు : (4) ప.బం; అ.క్రి. నిందలు మోపు, నిందలు వేయు.
"మందెమేళములు నేర మనసు సోదించ నేర
నిందలు గట్టఁగనేర నిన్నుఁజూచి" 22-206

నికలంకుఁడు : వి. నిష్కళంకుడు, కళంకం లేనివాడు.
"ఒకటంటే వొకటని వొట్టు లేల పెట్టేవు
నికలంకుఁడవే యైతే నీ కేల వెఅపు " 20-410

నిక్కిడి : వి. ఉన్నతి, నిక్కుట.
"కయ్యపుఁగౌగిటఁ గలికి రచనలను
నెయ్యపుఁబులకల నిక్కిళ్ళో" 5-31

నిక్కిళ్లు : వి; బహు. నిక్కుటలు, నిటారుగా నిలవడాలు. 'నిక్కిడి'కి బహువచనరూపం.
"కయ్యపుఁగౌగిటఁ గలికి రచనలను
నెయ్యపుఁబులకల నిక్కిళ్లో" 5-31

నిక్కుఁగొప్పు : వి. వెండ్రుకలను పైకి దువ్వి కూర్చిన కొప్పు.
"నెమ్మదిఁదాను నాకు నిక్కుఁగొప్పు వెట్టీని
యెమ్మెలదాననా నేను యేమైనాను " 29-455

నిక్కెము : (5) వి. 'నిక్కము'నకు వ్యావహారిక రూపం. నిజం, నిశ్చయం, యథార్థం, సత్యం.
"యెమ్మెలెల్ల దక్కె నేఁడు యేవంక చూచితేను
నెమ్మది మా యింటికి నిక్కెము రావయ్యా "
13-6

నిగరము : వి. కాంతివిశేషం. (బిల్ల, విణ. శ్రేష్ఠమైన, పెద్ద, గొప్ప)
"నిగరాలు బాసలు నెరుసలు మాయలు
మగువలు నీకే యెట్టు మరుపుదురో" 27-472

నిగ్గులు చల్లు : కాంతితో వికసించు .
"మలయు చెక్కుల నవ్వుల నవ్వు మకరకుండముల
నలర నిగ్గులు చల్లే యాతఁడు" 1. సం. 31 పు.

నిచ్చఁబండుగ : వి. నిత్యకల్యాణం జరిగే పండుగ.
"నిచ్చఁబండుగలు సేసే నెలఁత ఇదివో నేఁడు
తచ్చిన పులక పూవుదండలతోను" 24-145

నిచ్చఁబెండ్లి : వి. నిత్యకల్యాణం.
"కొచ్చి శ్రీవేంకటేశుఁడ కూడితివి అందుకేమి
నిచ్చఁబెండ్లాయను లోనికి నేఁగరాదా" 8-165

నిచ్చకల్యాణము : (10) వి. నిత్యకల్యాణానికి వికృతిరూపం.
"ఇచ్చగించి నావద్ద నేకతాన నీ వుండితే
నిచ్చకల్యాణము లిట్టే నెరవేరెను" 21-394
"ఎలమితోఁ దిరువేంకటేశు కౌఁగిటఁగూడి
లలితాంగి నిచ్చకల్యాణంబు నోమె" 12-127

నిచ్చకల్యాణి : వి. నిత్యకల్యాణంగా వర్ధిల్లినది .
"నెట్టనఁ బెక్కిండ్లవిందు నిండుకొన్న యాఁకలి
వొట్టి నిచ్చకల్యాణి కామోద్రేకము" 4-24

నిచ్చకొత్తలు : (4) వి; బహు. నిత్యనూతనాలు .
"వినయముతో రెప్పలువేయక చూచి తాను
నినుపులై మమతలు నిచ్చకొత్తలు" 22-155

నిచ్చన : వి. 'నిచ్చెన'కు వికృతిరూపం.
"నిచ్చనలవంటివి నా నిండుఁగోరికలు నీకు
హెచ్చిన వలపు తలకెక్కఁ జేసేయందుకు"
11-414

నిచ్చనిచ్చ : అవ్య. ప్రతినిత్యం, ఎల్లప్పుడు.
"నిచ్చ నిచ్చ వాదు లేల నీ చిత్తము
యెచ్చుకుంద లాడనేల యింకా నీ చిత్తము"
19-364

నిచ్చనిచ్చ(లు) : (5) ప్రతినిత్యం. (నిత్య శబ్దానికి 'నిచ్చ' వికృతిరూపం)
"నిచ్చనిచ్చ సోబనాలు నెల మూడుసోబనాలు
హెచ్చె నీకు నింతలోనె ఇవి గదవయ్యా"
20-412
"దిచ్చరీఁడై యిట్లు దిరువేంకటేశ్వరుండు
నిచ్చనిచ్చలును గడుఁ బెచ్చువెరిగేని" 6-62

నిచ్చనిచ్చ కొత్తలు : నిత్యనూతనాలు .
"అమ్మలాల అక్కలాల అవిగో వింత సుద్దులు
నెమ్మది వింటిరటే నిచ్చనిచ్చ కొత్తలు" 29-321

నిచ్చన్ : అవ్య. ఎల్లప్పుడు, ప్రతిదినం; దీనిని ద్రుతాంతంగా ప్రయోగించడం విలక్షణం.
"నిచ్చన్ గూడియున్నారము" 11-513
"తచ్చి తాఁగలప్పుడే దైవము నెఱఁగఁడు
నిచ్చ నాచార్యునివల్ల నేఁడెఱిఁగె" 2-380

నిచ్చపంట : ప.బం; వి. ప్రతినిత్యమూ వచ్చే ఫలితం.
"యెన్నడు కలఁగనట్టి హితుఁడవు నీవె
పన్నినట్టె వుండె నిచ్చపంటా నీవె" 10-186

నిచ్చపండుగ : వి. నిత్యం జరిగే పండుగ, నిత్యోత్సవం.
"నిచ్చపండుగలు సేసె నీతోడి మాటలనె
నెచ్చెలి యల్లంతనుండి నిన్నమాపె" 11-184

నిచ్చపెండ్లి : (2) వి. నిత్యకల్యాణం .
"నిచ్చపెండ్లి యెంత లేదు నీకు నేము సేసవెట్టి
మచ్చిక చల్లేముగాక మాకొఱకు" 27-475

నిచ్చపెండ్లికూతురు : వి. ప్రతినిత్యమూ పెండ్లికూతురు అయిన స్త్రీ.
"యిమ్ముల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నెమ్మి నీ రతి వెలసె నిచ్చపెండ్లికూతురా"
12-78

నిచ్చపెండ్లికొడుకు : వి. నిత్యమూ పెండ్లి కొడుకైన వాడు, నిత్యమూ సుఖంగా ఉండేవాడు.
"నిచ్చపెండ్లికొడుకుతో నిష్ఠురము చెల్లునా
ఇచ్చకములే యాడవే ఇప్పుడే నామారు"
27-545

నిచ్చలము : వి. 'నిశ్చలము'నకు వికృతిరూపం.
1.నిశ్చయం 2. నిశ్చలం 3. నిర్దోషం
4. నిరంతరం.

"నిచ్చలాన మోవితేనె నీ వియ్యఁగాను
"భవరోగములు వీడి పారఁగఁ బెద్దలు మున్ను
జవ కట్టికొనిన నిచ్చలమైన మందు " 1-237

నిచ్చళము : వి. నిశ్చలము. 'ణిచ్చల' ప్రాకృతం.
"ఇచ్చకపుమాటల యెలఇంచేవు మమ్ము
నిచ్చళపుసరసము నెరపే వందు " 25-259

నిచ్చళించు : అ.క్రి. నిశ్చలంగా ఉండు.
"నెలవై శ్రీవేంకటేశ నిచ్చళించ నెట్టువచ్చు
కులికెటి నీ వలపుకొలఁదె కాక" 11-140

నిచ్చసోబనాలు : వి; బహు. నిత్యసోభనాలు.
"కమ్మిక యెందరినైనాఁ గాఁగిలించి కూడేవు
యిమ్ముల నిచ్చ సోబనాలితవే నీకు" 26-475

నిజపట్టు : (4) (నిజము + పట్టు) వి. సత్యమని నమ్ము.
"ఊరకే వున్నాఁడదె వోపిక చూపఁగవద్దా
నేరుపున నా మాట నిజపట్టుఁగాని" 25-184

నిజపొంతువులు : వి; బహు. (?)
"ఇన్నియుఁగూడెను యింతికిని
నిన్నటి మాటలు నిజపొంతువులు" 23-597

నిజమరి : (11) (నిజము + అరి) సత్యశీలుడు.
"ఆనలేల పెట్టుకొనీ నంతలోనె లేదంటా
నేనిట్టే యిందుకు తన్ను నిజమరి అనేనా "
11-201

నిజమరితనము : వి. సత్యశీలత.
"తప్పని నీ నిజమరితనము మెచ్చేఁగాని
చెప్పే నీ యేకతములు చెవియొగ్గ నోపరా "
21-508

నిజము నిష్ఠూరము : (5) ప.బం. సత్యమెప్పుడూ కఠోరంగానే ఉంటుందనడం. వాడుకలో నిజమంటే నిష్ఠూరం అని ఉంది. నిష్ఠురము అని సాధురూపం.
"నెప్పున మాతోడి పొందు నిజము నిష్ఠూరము
తప్పులు నేఁ బట్టితేను తా నోపఁగలడా" 7-465

నిట్టచరులు : వి; బహు. ప్రవాహాలు కల లోయలు.
"సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ"
3-471

నిట్టచూపు : వి. నిటారుచూపు.
"లక్కవంటి మనసులో లలి నిట్టచూపుతోడ
నక్కరలెల్లాఁ జల్లే వౌనయ్య నీవూ" 16-431

నిట్టతాడు : వి. నిలువుగా ఉన్న తాటిచెట్టు.
"వెట్టగా రావణురొమ్ము విరుగఁ జేతనే గుద్దె
నిట్టతాడువంటివాఁడు నీ బంటు" 1-69

నిట్టనీలుగు : (నీలుగు + నీలుగు) అ.క్రి. విఱ్ఱవీఁగు, ఒళ్ళు విఱిచికొను, బిఱ్ఱబిగియు.
"నీవు గాఁగిలించుకోఁగా నిఱ్ఱనీలిగి వుంటేను
యీ వనిత గర్వియని యేమందువో" 20-394

నిట్టపిడిమేనిది : వి. నిఘంటువుల్లో ఈ పదం కనిపించదు. ప్రకరణాన్ని బట్టి 'నిలువైన పిడివంటి శరీరము కలది' అని తోచుచున్నది. సౌందర్యము లేకుండుట దీనిలో అభివ్యక్త మగునేమో అని సం.ప.స. (19 సం.) పిడికిలి లోకి అందిన నిటారైన శరీరం గలది. (?)
"పట్టి తెచ్చిన చెరలు పదారువేలుండఁగాను
నిట్టపిడి మేనిదాన నే నేల నీకు " 19-435

నిట్టపిడిసేయు : ప.బం. (?) 4-64

నిడివిఁబెట్టు : స.క్రి. దూరమున నుంచు.
"తడవఁగఁదడవఁగఁ దప్పించుకోఁజూచేవు
నిడివిఁబెట్టుదురా నెలఁతలను" 7-76

నిత్తెపు జ్ఞానము : వి. స్థిరమైన జ్ఞానము.
"మత్తుఁడై వుండేదే మనుజుని స్వభావము
నిత్తెపు జ్ఞానమిచ్చేది నీ స్వభావము " 3-515

నిత్తెము : (13) వి. 'నిత్యము'నకు వికృతిరూపం, ప్రతిదినం, ఎల్లప్పుడు, స్థిరం.
ప్రతిదినం :
"నిత్తెము నిదురలోన నేఁగలలు గనేనాఁడు
యెత్తి యీ కాఁపురము లివి యెందునుండెనో "
15-49

స్థిరం :
"హత్తి నీ నామమనే అమృతము గలవారు

నిత్తెమైన పదవుల నిలుతురయ్యా" 2-309
"పొత్తుల మగువలము పూనుకొని వచ్చితేను
నిత్తెమైన అలవాటు నిన్ను సోకిరాదా" 27-458

నిత్యకొత్తలు : *వి; బహు.* నిత్యనూతనాలు, ఎప్పటికీ కొత్తనైనవి ; వైరిసమాసం.
"ఆతుమ తొల్లిటిదే అంతరాత్మ తొల్లిటిదే
నీతితో యీ దేహములే నిత్యకొత్తలు" 3-104

నిత్యశూ(సూ)రులు : *వి; బహు.* ఇది నిత్యసూరులు కావచ్చు. అనంత గరుడ విష్వక్సేన శంఖ చక్ర గదా ఖడ్గ శార్ఙ ఘంటాది నిత్య నివాసం కలవారు.
"అదివో శ్రీవేంకటేశుఁ డక్కున నలమేల్మంగ
అదివో నిత్యశూరులు ఆళువారులు" 2-111

నిది : *వి.* నిధి. అన్నమయ్య మహాప్రాణవర్ణానికి బదులు అల్పప్రాణం వాడడం పెక్కుచోట్ల కనిపిస్తుంది.
"నిదుల శేషాచలము నిక్కి పైపైఁ బొడచూపె
యిదివో కొలువున్నాఁడు
హృదయాంతరాత్ముఁడు"16-1-11

నిదినిధానాలు : *వి; బహు.* నిధులు అనే అర్థంలో జంటపదం.
"నిదినిధానాలవలె నిచ్చ వానపడలను
సదమదమై నవ్వీని చతురత మెఱసి" 28-35

నిద్దర : *వి.* 'నిద్దుర'కు వ్యావహారికరూపం.
"పొలయలుక నిద్దరలు భోగించ దొరకొంటి
అలర వడి మేల్కొనవె అఖిలేశ్వర" 6-173

నిద్దిరించు : (8) *అ.క్రి.* 'నిద్రించు'కు వికృతిరూపం.
"నిద్దిరించువాని చేతి నిమ్మపంటివలెనే" 4-414

నిద్దిరించువాని చేతి నిమ్మపండు : *ప.బం; వి.* జారిపోయేది, నిలువనిది.
"నిద్దిరించువాని చేతినిమ్మపంటివలెనే
చద్దికర్మములు తానే జారితే జారె" 1-431

నిద్దురఁగంటఁబెట్టు : *ప.బం; అ.క్రి.* నిద్రపోవు.
"అర్ధమరాతిరి వోయ నమ్మలాలా - అయ్యో
నిద్దురఁగంటఁబెట్టదు నిన్నటనుండి" 5-32

నిద్దురించువాని చేతి నిమ్మపండు : *ప.బం; వి.* తెలియకుండానే జారిపోయేది.
"నిద్దురించువాని చేతి నిమ్మపంటివలెనే
బుద్ధితోఁగర్మములు గొబ్బున జారిపోవును"
4-414

నిధినిక్షేపములు : *వి; బహు.* నిధులు అనే అర్థంలో వాడబడే జంటపదం.
"ఘన నిధినిక్షేపము లిచ్చేటి
వుపకారబంధువుఁడీశుఁడు" 2-392

నిధినిధానము : *వి.* నిధి అనే అర్థంలో జంటపదం.
"వంచుక శ్రీవేంకటేశ వారివారి బ్రదుకులు
నించి నీవే యైతివి నిధినిధానమవై" 2-358

నినుపు : (2) *విశే.* సమృద్ధము *వి.* జలపూరము.
"నినుపుఁదెంకాయకు నీరు నించితిమా
వొనర వేమునఁజేదు నించితిమా" 1-450

నిప్పంటే నోరువొక్కు : *ప.బం.* మిక్కిలి వేడియగు.
"చెప్పనీవే నావంక సేసిన కల్ల లేమయినా
నిప్పంటే నోరు వొక్క నేరదుగదే" 17-46

నిప్పటి : *వి.* నిప్పట్టు (నిప్పు + అట్టు) కు రూపాం. ఆకులు మీద కప్పి నిప్పులో వేసి కాల్చెడి భక్ష్యవిశేషం. (రాయలసీమ మాండలికంలో నిప్పట్టి అంటే అరిసెలు, అతిరసాలు అని అర్థం.)
"నెలకొన్న పిండెంత నిప్పటీ నంతే"

నిప్పుల నేయి పోయు : *ప.బం.* వర్ధిల్లఁజేయు.
"తలఁచకుండఁగవలె తలఁచితేఁగామాదులు
పొలుచు నిప్పుల నేయి పోసినట్లూ" 15-420

నిప్పులమీఁదఁజల్లిన నూనెలు : *ప.బం; వి.* శాంతిపరచక వృద్ధి చేసేవి, భగ్గున మండేవి.
"నిప్పులమీఁదఁ జల్లిన నూనెలు
నిగిడి తనివి లేనివి యాసలు" 1-1

నిప్పులమీద నేయి చల్లు : *ప.బం; అ.క్రి.* ప్రజ్వలింపజేయు, అత్యధికం చేయు.
"ఒప్పదు మానుపరమ్మ ఉప్పతిలఁ బలుమారు

నిప్పులమీఁదటఁ దెచ్చి నేయి చల్లీఁ దరుణి"
6-163

నిమిష మేడగు: ప.బం; అ.క్రి. కాలము కష్టమై గడచు.

"భ్రమయించే విట్టే పదిమారులు
నిమిష మేడాయె నీచేత నాకు" 6-103

నిమ్మపంట వేసితే రాత వేయు: ప.బం. ఉపకారం చేసినవారికి అపకారం చేయు అనే అర్థంలో వాడబడే పదబంధం.

"రెప్పలెత్తి చూచేవు రేసులు నీ కేల పుట్టె
తిప్పి నిమ్మపంట వేసితే రాత వేతురా" 16-355

నిమ్మలము: (5) వి. మాం. క్షేమం, నిశ్చింత, నెమ్మది.

"నీ మగని తోడితెచ్చె నిమ్మలాన నుండవే"
26-534

"సమ్మతి నీతోడ సరసమాడేటి వేళ
నిమ్మలాన నా మోముచూడ నీవు మఱచితివా"
22-172

నియ్యంత: (నీ + అంత) నీఅంత. వింత త్రికసంధి.

నియ్యందు: నీయందు అని అర్థం. వింత త్రికసంధి. నియ్యాజ్ఞ (నీ + ఆజ్ఞ) కూడా ఇటువంటిదే.

"యియ్యెడ నేమరిపాటు ఇటు నాకు ముడిచితి
నియ్యంత నీవేఱఁగవు నిన్నింక నేమందును"
24-336

నియ్యాజ్ఞ: (నీ + ఆజ్ఞ) వి. నీ ఆజ్ఞ. వింత సంధి.

"నియ్యాజ్ఞ దేహము నే మోఁచితి నింతే
యియ్యెడ విజ్ఞాన మేల యియ్యవయ్యా"
1-412

నియ్యాన: (నీ + ఆన) నీ ఆజ్ఞ. వింత సంధి.

"నియ్యానకు భ్రమసితినటరా" 16-121

నియ్యిచ్చ: (నీ + ఇచ్ఛ) నీకోరిక. వింత త్రికసంధి. నియ్యాజ్ఞ, నియ్యందు మొదలైనవి ఇలాంటివే.

"నియ్యిచ్చ తెలిసెదె పో నివ్వెరగు నీకు నిండె
అయ్యెడనుండి పాయవు అయ్యో
నాయకుఁడా" 19-497

నియ్యెడ: (నీ + ఎడ) నీపై అని అర్థం. వింత త్రికసంధి. నియ్యాజ్ఞ మొదలైనవి ఇలాంటివే.

"మొగమోడితిఁ జాలదా మొక్కలీఁడ
నియ్యెడకు
వొగరులాడ వచ్చేవు వోపము నేమిందుకు"
20-199

నిరాభారి: వి. 'నిరాబారి'కి వ్యావహారికరూపం. ముని. (శ.ర.) నిరాహారి

"జవనమందినయప్పుడు
దేహి సన్యాసికంటే నిరాభారి" 1-440

నిరుఁబేద: వి. నిఱుపేద, మిక్కిలి పేదవాఁడు. అరసున్న చింత్యం.

"దిన మహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
వొనర నిరుఁబేదకును నొక్కటే అవియు" 2-385

నిరుమోహి: వి. 'నిర్మోహి'కి వికృతరూపం. మోహం లేనివాడు.

"నీవంటి గుండె లేదు నిరుమోహి నేఁగాను
కావరించి చూచి యింకాఁ గన్నుల కాఁకారదు"
14-360

నిరుహరణము: వి. 'నిర్హరణము'కు వికృతరూపం. మధ్యలో ఉకారాగమం; తొలగించేది.

"పరమపదంబును భవనిరుహరణము
పరమాత్మ చింతే ప్రపన్నులకు" 1-439

నిరుహరణుఁడు: వి. 'నిర్హరణుఁడు'కు వికృతరూపం. మధ్యలో ఉకారాగమం; తొలగించేవాడు.

"కలిదోషనిరుహరణ కైవల్యాకర హరి
తలఁచినవారిది నేరుపు" 4-259

నిరుహేతుకము: (10) విణ. 'నిర్హేతుకము'కు వికృతరూపం. మధ్యలో ఉకారాగమం. కారణం లేనిది.

"నీకుఁ దొల్లే యలవాటు నిరుహేతుకపు దయ

జోక నురుత మెచ్చిన సులభుఁడవే కా" 3-451

నిర్గుణాయ గుణాత్మనే: నిర్గుణుడూ, గుణాత్ముడూ ఐన విష్ణువు.

"అగణిత స్వతంత్రుఁడవు గాన అల వాల్మీకి ఇట్టిట్టనకే
అగు నిర్గుణాయ గుణాత్మనే యని ఆనతి ఇచ్చుటే" 2-412

నిర్భరుఁడు: వి. పెద్ద, గొప్పవాడు.

"నించిన దైవము నమ్మిన నిర్భరుఁడయిన
యెంచుక యే మార్గంబుల నెట్టుండిన నేమి" 2-55

నిర్మాల్యపు దండ: వి. భగవంతునికి ధరింపజేసి తీసిన మాల. ఇది శ్రీ వైష్ణవులకు పరమపవిత్రము.

"మంచి నిర్మాల్యపుదండ మంగళసూత్రము నాకు
కాంచనపు రాసి నీ చక్కనిరూపు నా మతికి" 3-393

నిలచిన కాలము: వి. ఉన్నంత కాలము, బ్రతికినంత కాలము.

"యెలిమి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
నిలిచిన కాలమెల్లా నీ సేవే చేసితి" 2-215

నిలుగు: వి. ఒళ్లు విఱుచుకోవడం.

"కలిసి శ్రీ వేంకటేశుఁ గాఁగిలించుకొందుఁగాక
నిలుగుల మేన నేలే నిండు సిగ్గులు" 21-120

నిలుచుకొను: (2) అ.క్రి. నిలబడు; రాయలసీమ వ్యవహారంలో కొన్ని ధాతువులపై 'కొను' అనుబంధం చేరడం సహజం.

"నిలుచుకున్నది తానే నిలువననే సిగ్గు
మెలుపున నెటువలె మెదలఁగవచ్చును" 3-225

నిలువ నీడలు గలుగు: *ప.బం; అ.క్రి.* ఆశ్రయమేర్పడు.

"మలసి యితఁడొకనాఁడు వొడమఁగఁగదా యిందరికి
నిలువనీడలు గలిగె నిధినిధానములై" 1-116

నిలువిచ్చు: *ప.బం.* నిలువుదోపిచ్చు.

"ఎవ్వతెరా నిన్ను నెలయించి తన
జవ్వనము నిలువిచ్చి జట్టిగొన్నది" 5-67

నిలువు: వి. చెయ్యి పైకెత్తుకొని నిలుచున్న పురుషుని పరిమాణం, అంతస్తు, ఎత్తు, ప్రమాణం, కొలది, పొడుగు.

"ఏడు నిలువుల పైఁడిమేడ మీఁదినుండి నన్నుఁ
జూడ వేడుకైన మించుఁ జూపులాఁడి" 5-63

నిలువుఁగస్తురిబొట్టు: వి. కస్తూరితో నిలువుగా పెట్టుకొను బొట్టు.

"నిలువుఁగస్తురిబొట్టు నిండుచెమటఁ గరఁగ
కులికి శ్రీవేంకటేశ కూడె నిదె యవురా" 17-482

నిలువుఁగొప్పు: వి. నిలువుగా ముడిచే ఒక రకపు కొప్పు.

"మంతనపుఁగోరికల మట్టు మీరి చూడఁగానే
వింతైన నిలువుఁగొప్పు వీఁపుమీఁద వ్రాలెను" 29-537

నిలువుఁగొలువు: (2) వి. నిలువు జీతం, నిలుచుండి చేయు సేవ.

"నిలువుఁగొలువు సేసి నిన్నుఁ గడు నెలయించీ" 28-162

నిలువుఁదురుము: వి. నిలువు కొప్పు, నిక్కుడు కొప్పు.

"నిలువుఁదురుముతోడ నీవు కపటాలు చూసి
అలరి పంతాల చూప నాతఁడింత నేరఁడా" 27-303

నిలువుఁబతిమ: వి. నిలువు ప్రతిమ, ఎత్తైన ప్రతిమ.

"వలవేసి పతిమీఁద వట్టి దూరులు గట్టుకు
నిలువుఁబతిమవలె నీ ముందర నున్నది" 27-193

నిలువుకు నిలువు: పూర్తిగా.

"నిలువుకు నిలువే నిన్ను నేరాలెంచేనా
వెలి నెంత నవ్వినా నవ్వితివి గాక" 21-61

నిలువుగోణము: వి. నిలువు కౌపీనము, నిలువు గోచీ (గోణము = గోవణము యొక్క రూపాం. గోవణము = కౌపీనం)

"నిలువుగోణము గట్టి నిలుచుండి పన్నీట
జలకమాడే నదే సర్వేశుఁడు" 13-363

నిలువున నూరు పండు : *ప.బం; అ.క్రి.* సమృద్ధిగా కలుగు, నేత్రపర్వంగా జరుగు, దిట్టంగా కలుగు, నిట్టనిలువున పరిణతస్థితికి వచ్చు.

"చెలరేఁగే ముంజేతిచిలుకవో వలపు
నిలువున నూరు వండేటి మొలకవో వలపు"
13-212

నిలువున ముంచు : *ప.బం; స.క్రి.* పూర్తిగా నష్టం కలిగించు, గొప్ప ఆపద కలిగించు.

"వలెనని శ్రీవేంకటపతి వడదేరిచి ననుఁగూడెను
నిలువున ముంచెను మరపులు నేరము
లెంచకురే" 17-40

నిలువునామము : వి. నిలువుగా పెట్టిన బొట్టు.

"కలికి కస్తూరిబొట్టు కాంతుని నొసలి నంటె
నిలువునామము పైపై నెలఁత కంటె" 20-309

నిలువు నూరువండు : *ప.బం.* సమృద్ధిగా కలుగు, నేత్రపర్వంగా జరుగు.

"నిలువు నూరువండీని(?) నిచ్చలు నీ
దేహమైతే
వొలిసీ దుఃఖములకు నోరువలేదు" 3-248

నిలువు నూరూఁబండు : (9) *ప.బం; అ.క్రి.* సమృద్ధిగా కలుగు, నేత్రపర్వంగా జరుగు, దిట్టంగా కలుగు. (*విణ.* దిట్టమైన.)

"వెలయ నాతఁడె నిన్ను వెల్లవిరిగాఁగూడె
నిలువు నూరూఁబండె నీ కేలె వెరవూ" 11-335
"నీ మై గురుతులు నిండె నిలువు నూరువండె"
28-86

ఈ పదానికి 'మనిషి పొడవే నూరు విధములైన పంటలు పండుతుంది' అని అర్థమా? అని సంపా. 3 సం. 168 పు. f.n.

నిలువుల మేడ : వి. ఎత్తైన మేడ, పెక్కు నిలువుల (మనుష్యప్రమాణాల) ఎత్తు గల మేడ.

"నిలువులమేడలో నిలుచున్నాఁడిదె
పిలువవే రమణునిఁ బ్రేమముతోడ" 20-321

నివాళిపాట : వి. తమిళంలో 'నీదువాళి' అంటే 'చిరాయువై వర్థిల్లుము' అని అర్థం. ఈ అర్థంలో మంగళాశాసన పురస్సరంగా పాడే పాట. 'మంగళహారతి' కి నివాళి అనేది పర్యాయపదం. కనుక మంగళహారతి ఇచ్చేప్పుడు పాడే పాట అని భావించవచ్చు. 'దిష్టి తీయుటకై పారాణిపళ్లెము నెత్తుతూ పాడేపాటలే నివాళిపాటలు' అని డా॥ వేటూరి ఆనందమూర్తిగారు అభిప్రాయపడ్డారు. అన్నమయ్య కీర్తనల్లో నివాళిపాటలు రెండు కనిపిస్తున్నాయి. వీటిలో నివ్వాళి లేక నివాళి అనేపదం ప్రయుక్తమౌతుంది. ఉదా:-

"నెలత మోమునకు నీ కనుచూపులు
నిలువున ముత్తెపు నివాళి
కొలఁదికి మీరిన గురుకుచములకును
తొలకు నీ మనసు దువాళి" 7-292

నివ్వరిముల్లంత : *ప.బం.* అతిసూక్ష్మమైనది, అతిస్వల్పమైనది, నివ్వరిగింజ ముల్లంత.

"నిలువెల్లా నెంచుకొంటే నివ్వరిముల్లంత లేను
బలువుఁడ నీవైతే బ్రహ్మాండము" 3-45

నివ్వరిముల్లు : నివ్వరిగింజ కొన, అతి స్వల్పమైనది.

"నిలువెల్లా నెంచుకొంటే నివ్వరిముల్లంత లేను
బలువుఁడ నీ వైతే బ్రహ్మాండము" 3-45

నివ్వెఱఁగుఁదనము : వి. 1. మిక్కిలి భయం 2.దుఃఖాదుల వల్ల కలిగే నిశ్చేష్టత 3. భ్రాంతి 4. అత్యాశ్చర్యం.

"నీ మనసులోని వెల్లా నీ వెరుఁగుదు నాకు
నేమ మాయ నిన్నుఁగూడి నివ్వెఱఁగుఁదనము"
20-97

నిశ్చయతాంబూలము : వి. వివాహం నిశ్చితమైనపుడు వధూవరుల పక్షంవారు పరస్పరం వక్కాకులు మార్చుకోవడం.

"నీవు వెట్టిన విడెమె నిశ్చయతాంబూల మాయ
వేవేగ సింగారించుక విచ్చేయవయ్యా" 16-549

నిశ్చింతము : (3) వి. నిశ్చింత, నిమ్మలము.

"ఆతఁడే యజమానుఁడు ఆదినారాయణుఁడు

ఆతని బంట్లము మాకు నన్నిటా నిశ్చింతము "
2-237

నిష్ఠూరపుఁదనము : (నిష్ఠూరము + తనము) వి. చూ : నిష్ఠూరము.
"అవ్వలఁదమ చేత లవి చూచుకోరు
నివ్వటిల్లీ నేఁడు నా నిష్ఠూరపుఁదనము " 20-97

నిష్ఠూరము : వి. 'నిష్ఠురం'అనే దానికి వికృతరూపం. ఏదేని ఒక మేలు చేయునపుడు ఎదుటివారినుండి కలిగే బాధ, అపవాదం.
"కూడినమీఁదను కొసరేలే
ఆడకు నిష్ఠూర మప్పటివలెను" 14-369
"పైకొని నీవు బాసలు సేయఁగనేల
నీకు నిజమే కలితే నిష్ఠూరమేల" 13-347

నిష్ఠూరము కట్టు : అ.క్రి. దోషము ఆరోపించు.
"కాంతమీఁద నిష్ఠూరము కట్టకువయ్యా
వింత లేదఁ జేసీని విచారించవయ్యా" 21-31

నిష్ఠూరాలాడు : అ.క్రి. నిష్ఠురోక్తులు పలుకు.
"ఇంగితాన నిష్ఠూరా లెన్నఁడూ నాడఁడాతఁడు
అంగనలాల నా మాట లటువంటివా" 13-456

నిష్ఠూరము : వి. కాఠిన్యం, పారుష్యం. నిష్ఠురత అనేది సాధురూపం.
"హత్తిన నీ గుండెవంక నవి రాఇకొనెఁగాని
నిత్తెపుఁగోమలులము నిష్ఠూరము చూపము "
27-452

నిష్ఠూరములాడు : అ.క్రి. నిష్ఠురోక్తులు పలుకు.
"నెట్టుకొని వొకవేళ నిష్ఠూరము లాడినాను
అట్టె ప్రియము చెప్పుదు రంతలోననే " 12-524

నిష్ఠూరి : కఠినోక్తులు పలుకువాడు.
"నేనంత నిష్ఠూరిఁగాను నీయెడకు
కానున్న పనులే నీపై గట్టి యాయఁజుమ్మీ "
27-505

నీ

నీ చిత్తము నా భాగ్యము : (9) నానుడి. నీ దయ నా అదృష్టం.
"నీ చిత్తము నా భాగ్యము నే నెంతటివాఁడను
యేచి నీవు రక్షించేదే యెక్కుడు పుణ్యమింతే"
2-263

నీచు : వి. నీచుడు, వృద్ధాదిగణంలో చేరిన 'నీచ' శబ్దానికి పుంలింగంలో పాక్షికంగా 'డు' లోపం విధింపబడింది. కాని ఈ పదమిక్కడ స్త్రీలింగంలో కనిపిస్తుంది. ఇది విశేషమే.
"యెక్కువ శ్రీవేంకటేశుఁడిటు నా వంటి నీచుఁ
బక్కనఁ గాచెను యిట్టి పరులూఁగలరు"
14-341

నీట ముంచు పాల ముంచు : (4) ప.బం. రక్షించినా, శిక్షించినా నీవే దిక్కు అనే సందర్భంలో వాడబడే పదబంధం.
"నీట ముంచు పాల ముంచు నీ చిత్తమిఁకను
యీటగు నీ పతిభావమిది గలది" 9-39

నీటిపేరి పాన్పు : వి. సముద్రశయనం.
"పొరి నీటిపేరి పాన్పున శ్రీవేంకటేశ
విరిమీఁది బిడ్డ పేరి వెలఁది నిన్నుఁగూడె"
10-2-117

నీటిపై వ్రాఁత : ప.బం; వి. అస్థిరం, నిలువనిది, నమ్మరానిది.
"లలనల జవ్వనాలు లక్కపూసకపురులు
నెలకొని సేసే బత్తి నీటిపై వ్రాఁత" 2-268

నీటిలోని ముల్లు : చూ : నీళ్లలోని ముల్లు.
"నీటిలోని ముల్లువంటి నీ గుణము దెలియ
యేటఁబెట్టి హెచ్చుకుందు లెంచనోప" 27-518

నీటిలో వ్రాఁత : ప.బం; వి. అశాశ్వతం.
"గరిమె నివి లేకున్నఁ గలకాలములుఁ జేయు
నిరతంపుఁదపమెల్ల నీటిలో వ్రాఁత" 1-364

నీడకన్ను : ప.బం; వి. సుఖం.
"యెండకంట నీడకంట నేల చూచేవే యాతని
పండువంటి మోవి చూచి పాలార్చీ నిన్నును"
20-243

నీడ దిరుగని చింత : వి. తిరుమలలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ మహాద్వారం దాటిన తరువాతి ప్రదేశంలో ఉన్న చింతచెట్టు. ఇది అతి విశాలమై ఉండడం వల్ల దాని నీడ

తిరిగే స్థితి కనిపించదట. ఈ చింతచెట్టు శేషాంశమట. సేవాక్రమం, వేంకటాచల మహాత్మ్యం, పరమయోగి విలాసం – ఈ గ్రంథాల్లో దీని ప్రస్తుతి ఉన్నది. ఇది నేడు కానరాదు.

"బడిబడి నొసఁగుచు(ను?) బ్రాణచారులకు
కడిమి నీడదిరుగనిచింతాడ" 1-320

నీడరూపు: వి. ప్రతిబింబం.

"నిలువుటద్దములోని నెలఁత నీడరూపు
చెలువుఁడు దగ్గరించినఁ జెలి నగెను" 23-600

నీడలోని (లోపలి) యెండ: *ప.బం; వి.* అసంభవం.

"నిద్దురలో తెలివంటా నీడలోని యెండంటా
వుద్దువుద్దులై లేని వొద్దిక నున్నారము" 1-199

"మిత్తివలెఁ జెలరేగి మీఁదఁ గాసే యెండకంటే
నెత్తిమీఁది చిచ్చు గాదా నీడలోని యెండ" 5-199

"నీడలోపలి యెండ నెలకొన్న బంధంబు
గోడపై సున్నంబు కొద లేని యెఱుక" 16-2-38

నీడలోపలి యెండ: *ప.బం; వి.* అసంభవం, అంతర్గతంగా ఉండేది. (?)

"నిడుపులోపలి కురుచ నీడలోపలి యెండ
వడి మంచి తరువు విడువని తమకము" 6-70

నీడవంటివాఁడు: *ప.బం; వి.* ఎల్లప్పుడూ వెంటనుండు వాడు.

"యీడనె శ్రీవేంకటేశుఁడిట్టె నన్నుఁగాచెఁగా
నీడవంటివాఁడ నేను నేరు పింక నేదో" 3-354

నీడవెట్టు: *ప.బం; అ.క్రి.* ఆశ్రయమిచ్చు.

"దట్టపుఁదమకపు మై దావానలానకు
నిట్టూరుపులె పో నీడవెట్టీని" 5-281

నీడానెండావలె నుండు: *ప.బం.* సుఖదుఃఖాల్లాగా ఉండు.

"నిగ్గుల వయోమదము నీడా నెండావలె నుండు
యెగ్గులెంచాఁ బని లేదు ఇంటికి రావయ్యా" 21-58

నీ తలనే వేఁగెనా: నానుడి; నీ తలనే పొద్దుపొడిచిందా? అని శబ్దార్థం. నీదే ఆధిపత్యమా? నీ వనుకున్నట్టే అన్నీ అవుతాయా? మొదలైన అర్థాల్లో ప్రయోగింపబడుతుంది. నీతోనే ప్రపంచమంతా ఉందా? నీ నుదుటనె పొద్దు పొడిచిందా ? అని కూడా వ్యవహారం.

"నీ తలనే వేఁగెనా నిన్ను దూరఁబని లేదు
జాతిఁబుల్లఁదీఁగెలకు సారె నలుగుదురు" 7-50

"బగ్గడికిఁ గాని పట్టిపంతము లీడేరవు
వెగ్గళించ నీ తలనే వేఁగె నటవే" 18-184

"నీ తలనే వేగెనా నెట్టుకొన్న వలపులు" 7-514

నీమయము: వి. నీతో నిండినది, సంస్కృత పదాలపై చేరాల్సిన మయ(ట్) ప్రత్యయం నీ అనే తెలుగుపదం మీద చేరడం విలక్షణం.

"జగమంతా నీమయము సర్వం
విష్ణుమయంబు గాన" 2-387

నీరగు: (నీరు (నివురు) + అగు) బూడిద అగు, భస్మమగు.

"మనసులో పాపబుద్ధి మరియెంత దలఁచినా
నినుఁదలఁచినంతనే నీ రౌను" 3-377

నీరాటిరేవు: (నీరాట + రేవు) వి. స్నానంచేసే రేవు.

"నీరాటిరేవులఁ బొంచేనమ్మా నిక్కనిక్కి తానె
చూచేనమ్మ
వేరులేక యెట్టు దగ్గరుదము
గోవిందకృష్ణరాయని" 10-2-111

నీరాడు: *అ.క్రి; ప.బం.* స్నానం చేయు.

"నీరాడే చోటులెల్ల నిలచీ వీఁడు" 16-555

నీరాడు: వి. కాగు.

"నీరాటిలోనఁ దన నీడ చూచి బాలుఁడంటా
రారమ్మని పిలిచి రాకుండఁగా" 17-95

నీరాడు వచ్చి ముంతఁజొచ్చు: నానుడి; కాగువచ్చి ముంతలో ప్రవేశించు, అసంభవమగు.

"యేడగా నాకునిట్టె యిచ్చకాలాడేవు నీ

రాడువచ్చి ముంతచొచ్చె రారాదా లోనికి" 8-214

నీరాడు వచ్చి ముంతచొచ్చు : *ప.బం; అ.క్రి.* పెద్దవస్తువు చిన్నవస్తువులో ప్రవేశించు. నీరాడు = కాగు వచ్చి ముంతలో ప్రవేశించు అని వాచ్యార్థం.

"యేడగా నాకు నిట్టి యిచ్చకాలాడేవు నీ
రాడు వచ్చి ముంతచొచ్చె రారాద లోనికి" 8-214

నీరార్చు : *ప.బం; స.క్రి.* స్నానం చేయించు.

"దావతిఁ దలిదండ్రులు తమ బిడ్డల తనువులఁ బంకము లంటినను
యే విధముల నీరార్చి పెంతు రటు యిన్నిట
నీవే గతి నాకు" 3-392

నీరుకొద్ది తామర : *నానుడి;* చూ: నీరుకొద్ది దామెర. నీరు ఎంతవరకుంటే తామర అంతవరకు ఉంటుంది. పిండికొద్దీ రొట్టె వంటిది. ఎదుటి శక్తిసామర్థ్యాలకు తగినట్లు, ఎదిరి హృదయాన్ని తెలుసుకొని తదనుగుణంగా ప్రవర్తించడం.

"యీరీతి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నీరుకొద్ది తామరాయ నేడు మెచ్చవయ్యా" 24-458

నీరుకొద్ది దామెర : *ప.బం; వి.* నీరు ఎంతవరకుంటే తామర అంతవరకు ఉంటుంది. పిండి కొద్దీ రొట్టె వంటిది. ఎదుటి శక్తిసామర్థ్యాలకు తగినట్లు, ఎదిరి హృదయాన్ని తెలుసుకొని తదనుగుణంగా ప్రవర్తించడం.

"మాటిన నీరుకొద్ది దామెర యింతె యెంచి చూడ
జాలివిడిచి దేవుని శరణను జీవుఁడా" 2-157

నీరుకొలఁది తామర : (2) చూ: నీరుకొద్ది తామర.

"నెలకొన్న దెఱఁగవా నీరుకొలఁది తామర
చెలియరో నే నేమని చెప్పనే నీకు" 12-423

నీరుకొలఁది తామెర : (3) *ప.బం; వి.* చూ: నీరుకొద్ది తామర.

"నీ వలనఁ గొరతే లేదు మరి
నీరుకొలఁదిఁ దామెరవు" 2-393

నీరుగప్పిన నిప్పుక : *ప.బం;* నివురు గప్పిన నిప్పు, లోపల శక్తి కలిగి పైకి కనిపించనిది.

"తారి యెవ్వారికిఁ గానరాకుండ"

నీరుచిచ్చు : *వి.* 1. బడబాగ్ని 2. నీటిదాహం.

"నీరధిలోఁబుట్టినట్టి నీరుచిచ్చైన పూవు
నూరిపోసినట్టి పాముసోరిలో కడి" 7-324

నీటిదాహం:

"నెట్టన వేసవిలోన నీరుచిచ్చు గొనెఁ దీగె
పట్టి విచారించకుంటే బాపమయ్యా" 26-91

నీరుబుగ్గ రాతి బరణిపెట్టు : *ప.బం; అ.క్రి.* శక్యంకాని పనికి పూనుకొను ; నీటిబుగ్గను రాతి బరణిలో పెట్టడం సాధ్యం కానిదే కదా!

"పొంచి పొంచి యిందుకుఁగా పొడిఁబడ నేటికి
పంచ నీరుబుగ్గ రాతి బరణిఁ బెట్టనేలా" 10-1-56

నీరుబుగ్గ వంటిది : (3) నీటిబుడగవలె చంచలమైనది, వర్ధిల్లునది. వి. గెలుపువారి పక్షం వహించేది.

"నీరువంక తుంగవలె నిన్ను నిట్టె భోగించఁగా
సారపు తరితీపులు చప్పనాయను" 21-80

నీరువంకతుంగ విధము : (12) *ప.బం; వి.* నవనవలాడేది, వర్ధిల్లేది.

"కదిసి చేకూరితేను ఘనమై హర్షించు
వెద నీరువంకతుంగవిధమాయ మనసు" 4-417

నీరువంకపొలము : *ప.బం; వి.* నిగనిగలాడేది, వర్ధిల్లేది.

"నిండినట్టి మడుగుల నీరువంక పొలము
కొండలు మోచినపెద్ద గొబ్బరపుఁబొలము" 4-52

నీరువట్టు : *వి; ప.బం.* దప్పియగు, ఎండిపోవు.

"నీరువట్టైతే నేయి చేతికివచ్చి మరి
అవ్వలదఁ బన్నీరిచ్చితే అనువౌనా తాను" 26-143

నీఋపైఁ గోపాలు చూపు : *ప.బం.* బలవంతునిపై కోపాలు చూపు.

"వేటే నే మూరకుండిన వెంగెమే కాదా
నీఋపైఁ గోపాలు చూప నీయంతవారమా" 7-17

నీలములు: వి; బహు. నీలాలు, వెండ్రుకలు. 'తలనీలాలు' అని వ్యవహారం.
"తలనీలములు దించి తగువారి సిరులు
తలకెత్తి యనుచు వింతల యెమ్మెకాఁడు"

నీలాలకొండ: వి. నీలమణుల కొండ.
"గురుతైన నీలాల కొండవలె నీవు నీవు
జరుగుచునున్నారు జయమేమి గడమా"
14-386

నీలాల పెండెము: వి. నీలపు మణులు పొదిగిన కాలి ఆభరణం.
"చేరి కాఁగిటఁగూడి శ్రీవేంకటేశుఁడు మెచ్చి
పేరు కల నీలాలపెండె మిచ్చెను" 23-462

నీలిబిడ్డఁడు: వి. నల్లనిబిడ్డడు, బాలకృష్ణుడు.
"ఓయమ్మ నీలిబిడ్డఁడోయమ్మ
యీ యెడ యశోద నీవెట్టు గంటివమ్మ" 22-69

నీలిమచ్చవురము: వి. శ్రీవత్సలాంఛనం కల వక్షస్థలం.
"నిక్కిన కర్ణములవె నీలిమచ్చ వురమదె
చుక్కల మొలపూసల నొక్కరూ పదె" 2-379

నీళ్లతీఁగలు: ప.బం; వి; బహు. (?)
"నీళ్లతీగెలు నిగుడఁగ నోర
నుచ్చిళ్లు గమ్మఁగ నెట్లుండితివో" 1-68

నీళ్లలోని ముల్లు: వి. పైకి కనబడని ప్రమాదం, తెలియ రానిది, బాధించేది. నీళ్లలో పడిన ముల్లు రూపు కానరాక నీటిలో అడగి అడుగున పడిపోవును. కప్పువడిపోవుట అని తె.జా. (119 పు.)
"అల్ల నీళ్లలోని ముల్లయినది యిది
యిట్టులనుచు నిశ్చయింపరాదు"
అని సారంగ. 2-255

నీళ్ళలో నీడ: ప.బం; బహు. సత్యం కానిది.
"నిక్కి నిక్కి నీళ్లలో నీడ చూచినట్లానే
దిక్కుల కర్మఫలము దిచ్చ భోగములు" 15-59

నీళ్లాడు: (నీళ్లు + ఆడు) ప.బం; అ.క్రి. స్నానంచేయు.
"దరిఁ జీరలు వెట్టి బిత్తలే నీళ్లాడఁగాను
సరసమాడకుండునా చంకఁ బెట్టుక" 14-455

నీళ్లాడు: (4) ప.బం; అ.క్రి. స్నానం చేయు.
"నెలఁతల దోఁచీని నీళ్లాడఁగానే
కొలనిదరిని దొంగ కూగూగు" 6-56

నీళ్లు నములు: ప.బం; అ.క్రి. బదులు చెప్పలేక తికమకపడు, సంకోచించు.
"నీవు నీళ్లు నమలితే నిండెను వేదములు
యీవలఁ దలెత్తితేనే యింద్రపదవులు మించె"
2-156

"నీళ్లే నమలేవు నీలోనె సన్నల
వేళ్లే చూపేవు వెలుపలికి" 6-58 & 2-156

నీవి: వి. పందెమొడ్డిన ధనం.
"తనుఁదానె చేరె హరి దధివిభాండకునకు
కొనకెక్కఁబోయి నీవి కొంచవడెఁదొల్లి" 2-94

నీ వేపూరో తా నేపూరో: ప.బం. పరస్పరం సంబంధం లేనివారు అనే అర్థంలో వాడబడే పదబంధం.
"నిట్టచూపులతోడ నీ మొగము చూచీ నాపె
వొట్టి నీ వేపూరో తా నేపూరో కాని" 18-15

ను

-నుంటి: ప్ర. 'నుండి' అనే పంచమీవిభక్త్యర్థంలో వాడబడే ప్రత్యయం.
"పొదిగిన మా యిద్దరికిఁ బొత్తుల నీ వాడనుంటే
యిదివో వలపు చల్లే వెరఁగనా నేను" 14-437

నుక్కిళ్లు: వి; బహు. 'నొక్కిళ్లు'కు వ్యావహారికరూపం. నొక్కిడికి బహు. రూపం. నొక్కడాలు.
"మొలకలే నగవుమోముల గోళ్ల
నులిమేటి వదనపు నుక్కిళ్లో" 5-31

నుచ్చిళ్ళు: వి; బహు. ఉమ్మనీరు, నురుఁగు, ఫేనం. (శ.ర.)
"నీళ్లతీగెలు నిగుడఁగ నోర ను
చ్చిళ్ళు గమ్మఁగ నెట్లుండితివో" 1-68

నుడుగుల వడ్డివాఁడు: వి. వాయాడి, ఎక్కువగా మాట్లాడేవాడు, వదరుబోతు.

"శ్రీవేంకటాద్రిమీఁది సేఁతల యేతులవాఁడు
వావాత నుడుగుల వడ్డివాఁడు" 22-69

నుడుగులు దప్పినా నోము ఫలమిచ్చు : సామెత; ఒకటి రెండు పొరపాట్లు జరిగినా చేసిన మంచిపనికి ఎప్పుడూ ఫలితం ఉండు.

నుదుట వ్రాసిన వ్రాత : *ప.బం; వి.* అదృష్టం.
"నుదుట వ్రాసిన వ్రాఁత నూఁటికి నీ తిరుమణి
యెదురేది మాకు నేఁడు యేఁడులోకాల" 3-580

నుయ్యో కొండో : *ప.బం.* ఏది గతో అని భావం.
"నిక్కము నాతని కింక నేనేలే నీవు
నొక్కకువే నా చెక్కు నుయ్యో కొండో" 5-341

నురుగు : *వి.* పొడి.
"నువ్వులుఁ జిటిబెల్లాలు నున్నని చిమ్మిలులు
నువ్వుటిడియునుఁ జిన్నినురుగులును" 1-256

నురుగులు : (2) *వి.* భక్ష్యవిశేషం.
"చక్కిలాలు నురుగులు సతులు దాఁచినవెల్ల
అక్కరఁ గైకొంటివట అది దగవా" 11-39

నులిగురులు : (నులి + కురులు) *వి; న.* చిక్కులు పడిన వెంద్రుకలు.
"తరుణి నినుఁబెడఁబాసి తపముశాయఁగఁ
దొడఁగె
విరహంపు నులిగురుల విరిజడలతో" 7-290

నులిపచ్చి : (2) *విణ.* కొద్దిపచ్చి.
"యెలమి శ్రీవేంకటేశు నిట్టె నేఁగాఁగిలించితే
నులిపచ్చితో నేల చన్నుల నొత్తేవే" 18-70

నులివాఁడి : *విణ.* కొద్దివాఁడి.
"వలపించినవాఁడవు వంకలానే రుతువు
నులివాఁడి గోరఁజెక్కు నొక్కఁగనేల" 20-485

నువ్వుగింజంత : *విణ.* మిక్కిలి కొద్ది.
"కోటులైన వేదములు కొనాడీ నిన్నందులో నా
నోటి విన్నపము లొక్క నువ్వుగింజంతే" 3-42

నువ్వుటిడి : (నువ్వు + ఇడి) *వి.* భక్ష్యవిశేషం.
"నువ్వులుఁజిటిబెల్లాలు నున్నని చిమ్మిలులు
నువ్వుటిడియునుఁ జిన్నినురుగులును" 1-256

నుసికిలు : *అ.క్రి.* నిఘంటువుల్లో ఈపదం కానరాదు. జారు, అంటీ అంటనట్లుండు.
"చెనఁటి యే పుణ్యమైన జేయని
యోగేశ్వరుఁడు
నూనె గొల్చిన కుంచమై నుసికిలును"
8-375 old

నుసుగు : *అ.క్రి. మాం.* తిరస్కరించు, తొలగించు.
"నొసలి వ్రాసిన వ్రాలు నుసిగితే మానీనా
కొసర జగము నాకే కొత్తలయ్యీనా" 3-7

నూ

నూఁగురులు : *వి; బహు.* సన్నని కురులు.
"నున్నని గోరు దీసి నూఁగురుల కొప్పు దీసి
యిన్ని నే రట్టుసేసితే నేమి సేసేవే" 8-83

నూఁగులెక్కు : మృదువగు (?)
"అన్నియుఁ జక్కనయ్యీని అందుకేమి
లేవయ్యా
నున్నని వలపే కాదా నూఁగులెక్కఁగాక"
21-174

నూఁటికి నొక్క నూలిపోగే యగు : (2) *ప.బం.* నూరు అపరాధాలను ఒకనూలుపోగు సమర్పించి తొలగించుట అగు.
"ఎన్నియైనాఁ జేయనీవే యింత చాలదా నాకు
నున్నఁగా నూఁటికి నొక్క నూలిపోగే కాదా"
14-349

నూఁతులు తవ్వఁగబోతే బేతాళములు పుట్టె : నానుడి; మంచి చేయఁబోతే చెడు జరుగు. చూ: నూతిలోనే బేతాళములు పుట్టు.
"నూఁతులు దవ్వఁగబోతే బేతాళములు పుట్టె
కాఁతాళపు లోకులాల కంటిరా యీ సుద్దులు"
2-8

నూకు : *స.క్రి.* తోయు, గెంటు.
"నాకుఁ జెప్పరె వలపు నలుపో తెలుపో
నూక పోవఁగరాదు నుయ్యో కొండో" 5-193

నూటికొక్కటే నూలిపోగని : సామెత; నూరు అపరాధాలను ఒకనూలుపోగు సమర్పించి తొలగించుకోవడం.

"నూటికొక్కటే నూలిపోగని
కూటువలెఁ గైకొనుటేఁకఁ గాక" 20-226

నూతి కొలఁది చేఁతాడే యెరుఁగు : సామెత; కొన్నింటికి సంబంధించిన వివరాలు కొందరికే తెలుసు అని భావం.

"చేరువ నూతి కొలఁది చేఁతాడే యెరుఁగుఁగాక
సారె మిమ్ము నంత మాకు సాధించ నేఁటికి" 20-376

నూతిలోనే బేతాళాలు పుట్టు : నానుడి; అ.క్రి. మంచికి పోతే చెడు జరుగు, నీళ్ళకోసం పోతే అందులోంచి దయ్యం లేచి వచ్చిందనడం.

"దవ్వుగా మాటలాడేవే తగునటవే జోలి
దవ్వుకు నూతిలోనే బేతాళాలు పుట్టీని" 17-283

నూనెఁ గొలిచి కుంచము నుసికిలినట్లు : (?)

"పూని హరిఁ జేతులారాఁ బూజించుటొకటే
నూనెఁగొలిచి కుంచము నుసికిలినట్లు" 4-80

నూనెకుంచము : వి. నాలుగు మానికల ప్రమాణంకల నూనె పాత్ర.

"అన్నియు వింటానే అట్టే వాసన గొంటానే
వన్నెల నూనె కుంచమువలె నున్నాఁడు" 2-232

నూరిటికి రుణ మొక నూలిపోగు : *ప.బం; వి.* చూ: నూటికొక్కటే నూలిపోగని.

"తీరుచు నతఁడే దినకర్మంబది
నూరిటి రుణ మొక నూలిపోఁగునా" 9-170

నూరిపోయు : (2) *ప.బం; అ.క్రి.* లేనిపోని మాటలు బోధలు చేసి ఎదుటి వారిపై నెపం మోపు.(పద.) ఊరికే బోధలు చేయు, బాగుగా బోధించు.

"పూసగుచ్చినట్టు చెప్పి బుద్దులెల్లా నీకు నూరి
పోసేఁగా చెవిలోనను పొద్దు నీకును" 19-109

"వాలిక చూపులు నీకై వంచె నొక్కమాటె నేఁడు
పోలికలు నాఁడె నూరిపోసితివేమో" 26-201

నూరునిండు : *ప.బం; అ.క్రి.* ఆయుర్దాయం తీరు, చనిపోవు.

"పటుకున దెగె దైత్యభామల మెడతాళ్లు
మటుమాయదైత్యులకు మఱి నూరు నిండెను"
4-520

"నోవితోఁడఁ గంసునికి నూరునిండెఁ జూడఁగానె
భూమికెల్లా నోర నూరి పోసినవాఁడు"
11-3-55 old

నె

నెంజరి : వి. నెంజిలి కావచ్చు. నెంజిలి అంటే మనోవ్యథ అని అర్థం.

"చిత్తము నెంజరి దీర శ్రీవేంకటేశ నన్ను
హత్తించిరి మేలు అయ్యో మీరు" 26-86

నెంజిరివి : (2) 'నెంజెరివి' కావచ్చు. మనస్తాపం.

"అగడుఁజేఁతలు సేసి యమరఁ జెప్పేవాని
నిగిడి పంగించక నెంజిరివి దీరునా" 26-376

నెంజిలి : వి. మనోవ్యథ, ఖేదం, విచారం.

"కూరిమి నా పతి నిట్టె కుచములఁ గుమ్మినాను
తీరదు నా నెంజిలి దీని కేమి సేతువే" 17-30

నెంజెరివి : (నెంజి + విరివు) ఎదలోని తాపం, మనోవ్యథ అని తమిళం. అదియే ఇది కావచ్చు నని. (సం.ప.స. 14-352 పుట.)

"కోమలపువాఁడంటాఁ గొంకి యున్నదానఁగాక
నేమాన నేమి సేసినా నెంజెరివి దీరునా" 14-170

నెగులు : వి. బాధ, దుఃఖరూపమైన విచారం.

"నే నిదె నీ విదె నెగు లేలే, నానాఁడౌ
తగులాయ నవ్వులింకా నేలే" 20-260

"ధీరత వేంకటగిరిదేవుడైన వానికి నా
నేరుపెల్లిఁ జూపక నా నెగులేల తీరునే" 5-47

నెటికలు దీయు : *ప.బం; అ.క్రి.* వేళ్ళసందులను విఱుచు.

"సిగ్గులు వడుతా నీ చేతి నెటికలు దీసె
అగ్గమై నీలోని యాయాలు ముట్టెనో" 12-359

నెట్టన : *క్రి.విశ.* 1. అవశ్యం 2. తప్పక 3. మిక్కిలి అధికంగా 4. తెగించి, సాహసించి 5. నిజంగా 6.న్యాయంగా 7. అనాలోచితంగా 8. చక్కగా 9. నిండుగా, సమృద్ధంగా.

"నెట్టన సూర్యులోని నెలకొన్న తేజమా

గట్టిగాఁ జంద్రునిలోని కాంతిపుంజమా" 2-329

నెట్టుకొను : (2) *ప.బం; అ.క్రి.* 1.కడగు, పూను 2.చెలరేగు 3.అభినివేశం కలిగి ఉండు 4.పట్టుపట్టు 5.స్థిరపడు 6.నివసించు 7.అతిశయించు 8.కలుగు. (తె.వ్యు.కో.)

"నేరుపుగలయందుకు, నెట్టుక మాటాడవలె
వోరుపుగలయందుకు వొడఁబడి వుండవలె"
28-199

నెట్టెము : *వి.* 'నెట్టియము'నకు రూపాం. చుట్టకుదురు, గుండుపాగ.

"జట్టిగొన్నవాఁడవు చన విచ్చినవాఁడవు
నెట్టెపు మోహపు గురి నీవే నాకు" 7-567

నెడుమధ్య : *మాం.* నడమధ్య, రెండింటికీ నడుమ, ఇద్దరికీ నడుమ.

"యేచి రెంటికి నెడ మధ్య మీ మేను
తాచి వొకఁడే గురి తానాయ నాత్మ" 2-386

నెత్తిఁబెట్టుకొను : *ప.బం; స.క్రి.* గౌరవించు, ఆదరించు.

"నెలకొని యే పొద్దు నెత్తిఁ బెట్టుకొందువు
వలపుల నోము నీకు ఫలియించె నయ్యా"
13-80 & 11-225

నెత్తికెక్కు : (నెత్తికి + ఎక్కు) *ప.బం; అ.క్రి.* తగని పెత్తనం చెలాయించు, మిక్కిలి చనవు ప్రదర్శించు. కూడని వారిని గౌరవిస్తే ఇక నీ మాట వినక నీపైనే పెత్తనం చెలాయిస్తారు అనే సందర్భంలో ఉపయోగించే పలుకుబడి.

"సలిగె గద్దంటాను సారె నెత్తికెక్క రాదు
పిలిచే వంటా నీతో బిగియరాదు" 23-234

నెత్తికెత్తుకొను : *ప.బం; స.క్రి.* పైన పెట్టుకొను, గౌరవించు.

నెత్తిమీఁది చిచ్చు : *ప.బం; వి.* సన్నిహితమైన ఆపద, నిత్యబాధాకరం.

"మిత్తివలెఁజెలరేఁగి మీఁదఁగాసే యెండకంటే
నెత్తిమీఁది చిచ్చు గాదా నీడలోని యెండ"
5-199

నెత్రుపట్టము : *వి.* నెత్తురు కూడు వంటిది, రక్తపాతం వల్ల గెలిచిన ప్రాభవం.

"ఆసపడి వరదాన మడిగిన పొలము
బాసలతోఁ గడు నెత్రుపట్టమైన పొలము" 4-52

నెప్పు : *వి.* నేర్పు, కౌశలం, ఉపాయం, (తె.వ్యు.కో.) స్థైర్యం.

"నెప్పున మా యింటికి నీవు రానివాఁడవా
అప్పటినే చుట్టాల మాటాడుతా నీకుండిరో"
7-342

నెమలిగరులు : *వి.* నెమలి యీకలు.

"కొండపడ మేడలలో గూరుసుండు మనవే
నిండు నెమలిగరులు నెత్తినెక్కను" 11-93

నెమ్మళ్ల వ్రాసిన చీర : *వి.* నెమళ్ళు చిత్రింపబడిన చీర.

"పన్నుకొని మేఘానకుఁ బరిణామ మవుఁగాని
చిన్న నెమ్మళ్ల వ్రాసిన చీర గట్టరే" 24-545

నెయ్యపు చేతలు : *వి; బహు.* స్నేహపుపనులు.

"నెయ్యపు నీ చేతలకు నీతోఁ బెనఁగఁగాను
చయ్యన గొప్పతురుము జారె నిట్టెకాక" 7-186

నెరఁతనీఁడు : (నెరతనము + ఈఁడు) *వి.* నెరతనము గలవాఁడు, నేర్పు గలవాడు.

"నెరతనీఁడవు నీవు నేరనిదాన నేను
పొరసి నన్ను నడపే పుణ్యము నీ చేతిది"
27-240

నెరజాణఁడు : *వి.* మిక్కిలి నేర్పరి, వగలమారి.

"పలికి బొంకనివాఁడు పంతగాఁడు తానన్నిటా
నిలువు నూరు వండేటి నెరజాణఁడు" 13-374

నెరయన్ : *క్రి.విణ.* పూర్తిగా.

"నెరయ రూపములెల్ల నీ రూపమే కా
నరయని యది నా యపరాధము" 1-271

నెరవాది : *వి.* సమర్థుడు, శక్తిమంతుడు (తె.వ్యు.కో.) ఈ పదం పుష్పవతి, రజస్వల అనే అర్థాల్లో కూడా ప్రయుక్తం. సూ.ని. లో నెఱవాది, అనే శకటరేఫయుక్త పదానికి నేర్పరి, జాణ, సమర్థుడు అనే అర్థాలు ఇవ్వబడ్డాయి కానీ ఈ అర్థం ఇవ్వబడలేదు. అయితే అన్నమయ్య దీన్ని సాధురేఫయుక్తంగానే రెండర్థాల్లోనూ ప్రయోగించినాడు.

"ఇయ్యకొంటి గానీవె యిందుకేమి
నెయ్యపు మాటలకెల్లా నెరవాది తాను" 7-72
"నెరవాది వైతేను మరుపుకోవలెఁ గాక
తెరవ నీ నేరుపెల్లాఁ దేటపడీఁ గాక" 28-78
"అట్టి నెరవాదివి నీ వలమేలు మంగవు
నెట్టన నీ రమణుఁడు నిన్ను మెచ్చీ నిందుకు" 28-123
"వచ్చి వచ్చి యాపె నెరవాదిఁ జేసినవాఁడవు
నిచ్చలును గొనియాడనేరవా నీవు" 26-213
"కలువరేకులవంటి కన్నుల నాడె చూడఁగా
నిలుచున్నది యెదుట నెరవాదై తాను" 26-213

నెరవాదితనము : (నెరవాది + తనము) వి. సామర్థ్యం, నేర్పు.
"మురిపెము లెల్లా నీ ముందరనే పచరించు
నెరవాదితన మెంత నేరుచునో తాను" 28-459

నెరవేసాలు : *వి; బహు.* (?)
"నిగ్గుల నిక్కి చూచితినే నింటిలోని కేఁగితి
వెగ్గమంతకు నెరవేసా లేలే" 26-5

నెరసు : వి. దోషం, చిన్న తప్పు, లోపం .
"నిర్మితము నీ దింతే నెరసు లెంచఁగనేల
ధర్మమందు నింక గజదంతపరీ క్షేటికే" 1-497

నెరుస : వి. 'నెరసు' కావచ్చు. నలుసు, దోషం, కళంకం, తప్పు, గౌండ్లవాడు కత్తులు నూరే పొడి.
"నిగరాలు బాసలు నెరుసలు మాయలు
మగువలు నీకే యెట్టు మరుపుదురో" 27-472

నెఱజాణఁడు : వి. చూ : నెరజాణఁడు. 16-179

నెఱతనము : (1) వి. కుశలత, జాణతనం, ధర్మం, న్యాయం, వైశాల్యం, శక్తి, సామర్థ్యం , నేర్పరితనము, నిండుదనము .
"నెఱతనములు చూపి నీవు మా ఇద్దరిలోనా
వొఱగులు దిద్దేవు వువిద నీవు" 25-276
"నెఱతనాలూరకె నెరపుచు యిట్టె
చిఱునవ్వు నవ్వేవు చెలువరా" 10-2-21

నెఱవు : వి. హెచ్చు, సమృద్ధి.
"వెఱవకు మనసా విష్ణుని యభయము
నెఱవుగ నెదుటనె నిలిచినది" 3-276

నెలదలూరి చొక్కనాథుఁడు : వి. కడపజిల్లా రాజంపేట తాలూకాలో కోడూరు దగ్గర నందలూరు గ్రామం ఉంది. ఇట బాహునదీ (చెయ్యేరు) తీరంలో చొక్కనాథస్వామి ఆలయం ఉంది. తాళ్ళపాకవారు పేర్కొన్న నెలదలూరి చొక్కనాథుడు నందలూరి చొక్కనాథుడే కావచ్చును. ఈ ఆలయం నిర్మాణంలో ప్రత్యేకత కలదనీ, సూర్యోదయ సమయంలో సూర్యకిరణాలు స్వామివారిపై పడతాయని ప్రశస్తి. ఈ ఆలయం పురాతనమైనది. నెందలూరు అని సంపా.
"చుల్లరవెట్టుఁజేఁతల చొక్కనాథుఁడు
వుల్లములో నీ నెలదలూరి చొక్కనాథుఁడు" 10-2-20

నెలవరి : (నెలవు + అరి) వి. 'నెళవరి'కి రూపాం. 1.కాపురం ఉండేవాడు 2. పరిచయం కలవాడు 3. గుట్టుతెలిసినవాడు
"వాసుదేవ నీవు నెలవరివి మగుడ నేల
యీసరి నీవద్దనుండే యె(నె)ట్టినఁ
జేయవయ్యా" 4-43

నెలవుకొను : *ప.బం; అ.క్రి.* 1. ఉండు 2. ప్రకాశించు 3.స్థిరపడు 4. నెలకొను 5. వ్యాపించు 6. కీర్తికలుగు.
"యీతల శ్రీవేంకటాద్రి నిటు విజనగరాన
నీతితో నెలవుకొని నెగడితివి" 4-274
"అలమేలుమంగ నురమందు నెలవుకొలిపి
తలకొన నంతటా బూదండలు వేసి" 23-376

నెలవుకొలుపు : *స.క్రి.* 1. నిలుకడగా నుంచు 2. నిలుపు.
"తొలఁగఁదోసి జగములెల్లఁ దొల్లిటట్ల
బహువిధముల
నెలవుకొలిపి దొంతివేర్చ నేర్చుఁగాన
యీతఁడు" 5-231

నెల్లిచెట్టు : వి. మాం. ఉసిరికచెట్టు .
"పెల్లిచెట్టు మందు గాదు పెద్ద కొండలెక్కి తెచ్చే

నెల్లిచెట్టు చవిగాక నేమేల మీకు" 19-435

నెల్లూరి శ్రీవేంకటనాథుఁడు: వి. జిల్లాకేంద్రమైన నేటి నెల్లూరులో వెలసిన వేంకటనాథుడు.

"చేరవచ్చి నెల్లూరి శ్రీవేంకటనాథుఁడిట్టె
యీ రీతినె ననుఁగూడె యిందిరనా నేను"

10-89

నెళనెళన: అవ్య. విరవడంలో జరిగే ధ్వనికి అనుకరణశబ్దం.

"నెళనెళన విరిచె నిక్కి వాని యెముకలు
పెళపెళ నారిచి పెచ్చుపెరిగె హరి" 4-513

నెవ్వ: వి. దుఃఖం, లేమి, దారిద్ర్యం.

"నెవ్వ దీర నిదె నిను విశ్వరూపుఁ
డెవ్వల నవి శ్రుతులెంచీఁ గాక" 4-418

నే

నే: వి. నేయి.

"గోమున హేయపు గుండకూడు నించితినట
గామిడి నేగారే తిత్తిఁ గానోపనా" 1-169

నేఁతబేహారి: వి. నేఁతనేసి బట్టలు సిద్ధంచేసి వాటిని అమ్ముకునే వ్యాపారి.

"వాడల వాడల వెంట వాఁడెవో వాడెవో
నీడనుండి చీరలమ్మే నేఁతబేహారి" 1-275

నేగారే తిత్తి: వి. నేయి కారే తిత్తి (?)

"గోమున హేయపుఁ గుండకూడు నించితినట
గామిడి నేగారేతిత్తిఁ గానోపనా" 1-169

నేతిబీరకాయ: వి; ప.బం. సార్థకం కాని పేరు, డాంబికమైనది, ఒకరకం బీరకాయను 'నేతి బీరకాయ' అని అంటారు. కాని అందులో నేయి ఏమాత్రమూ ఉండదు. నేతి అనే పదానికిక్కడ సార్థకత లేదుకదా! పేరుకు తగినట్లుగా ప్రవర్తించని వారిపట్ల వాడే పదబంధం.

"నేతిబీరకాయ నెట్టనఁ గర్మబంధము
బూతు చిల్లి నేస్తమెప్పుడును మనసు" 15-325

నేతిబీరకాయ నేయి: సార్థకం కానిది.

నేమము: (6) వి. 'నియమము'నకు వికృతి రూపం.

"బలు నీ నేమము చూచి ప్రత్యక్షమయితి నీకు
అలమి నీ కాఁగిటనే అనుభవించవయ్యా"

7-265

నేమస్తుఁడు: వి. 'నియమస్థుఁడు'కు వికృతిరూపం. నియమంలో ఉన్నవాడు.

"ఇట్టె వదలితేను యెందైనాఁ బారు మనసు
కట్టుక నీమస్తుఁడైతే కైవసమై యుండును"

2-341

నేమినా తప్తముద్రాం ధారయేత్: నేమి అంటే లక్షణయా చక్రమని అర్థం. చక్రంతో వేడి ముద్రలను వేయించు కోవాలి అని భావం.

"మును నేమినా తప్తముద్రాం ధారయే'త్తని
వెనువెంట శ్రుతి యదె వెల్లవెరి సేసీని" 2-485

నేము: (23) వి; బహు. 'నేను' కు బహువచనరూపం. మేము.

"కడనుండి నే మేల కరఁగేమో నేము" 3-9

"నేము నీవారమె యిందు నెరుసు లేవి
చే మీఁదయిన మీఁద చెప్పనేల పనులు" 7-69

నేరుపరివాఁడు: వి. నేర్పరి.

"నీటుతోడివాఁడవు నేరుపరివాఁడవు
యేటికైనా వెరవవు యీడా నాడను" 8-250

నేరేడుఁబండులమ్ము: (?)

"ముచ్చట నేమడిగితే మెఱఁగు మొఱఁగు మాటలాడేవు
వంచించి యాల నేరేడుఁ బండులమ్మేవే" 7-206

నేర్పుఁదనము: (నేర్పు + తనము) వి. నేర్పు. భావార్థకంమీద మళ్ళీ భావార్థకప్రత్యయం.

"గుట్టుతోడ నున్న సతి గొల్లునను నవ్వించి
నెట్టనఁ గాఁగిలించుటే నేర్పుఁదనము" 20-460

నేలకు మంటికి: ప.బం. భూమికీ ఆకాశానికీ ఏకంగా.

నేల మిన్ను నొకటగు: ప.బం; అ.క్రి. భూమ్యాకాశాలు ఒక్కటగు.

"నేలమిన్ను నొకటై నిలుచున్న రూపుతోడ
పాలువడి మెరసీని ప్రత్యక్షదైవము" 4-359

నేలసోద్యము పేరిటి నెలఁత : వి. భూదేవి.
"గాలికూటిపేరి గట్టుమీఁదటివాఁడ
నేలసోద్యముపేరి నెలఁతయె నిన్ను మెచ్చె"
10-2-117

నేవళము : వి. నిగనిగలాడే, ఏపుగా పెరిగిన (మణులు గుచ్చిన హారం - ఆం.ప.ని.)
"నేవళపు నీ యూరు నీలాహిఁబోలితేను
యీవల మేను మెఱుపునేల పోలెనే" 24-204

నేస్తకాఁడు : (నేస్తము + కాఁడు) వి. మిత్రుడు, స్నేహితుఁడు.
"ఘటన నెవ్వతె నేస్తకాఁడ వైతివయ్యా
అటమటా లెల్లా దిద్ది అప్పుడే వేసరితి"
23-506 & 29-23

నేస్తగత్తె : (3) (నేస్తము + కత్తె) వి. స్నేహితురాలు. రూపాం. నేస్తగత్తె.
"పొరుగుపోరచి వచ్చి పొలసీ నీ నేస్తగత్తె
గరిమ నీ పచ్చడము గప్పఁగరాదా" 26-267

నేస్తము : (2) వి. చెలిమి, స్నేహం.
"నను నేలితివి ముందే నంటున శ్రీవేంకటేశ
నిన్నుఁజెనకీ దానూ నేస్తము గాబోలు"
"నెలఁతకు మగనితో నేస్తమే మంచిది గాక
అలుకలు నెరపితే నట్టే విసుగరా" 7-363

నొ

నొక్కిళ్ళు : వి; బహు. నొక్కుళ్ళు, అదుముటలు.
"నును గోరికొనలు నొక్కిళ్ల
పొనుఁగని తములము పుక్కిళ్ల" 28-419

నొగులు : వి. కీడు, హాని, బాధ, కష్టం, కోపం, విరోధం, పగ, దుఃఖం, విచారం, ఇడుము, ఆపద. (వ్యు.)
"పుక్కిటి తమ్ములమిడి పొదిగొన్న కాఁగిటిలో
నొక్కినఁగాని నా నొగు లేల తీరునే" 5-147

నొడుగు : (8) స.క్రి. 'నుడుగు'కు రూపాం. పలుకు.
"నీవల్లఁ గొరత లేదు నీ పేరు నొడిగితే
శ్రీవేంకటేశ యిట్టె చేరి కాతువు" 3-18

నొప్పులుసేయు : ప.బం; అ.క్రి. బాధించు.
"పొడపుఁజందురుఁడు నొప్పులుసేయు విరహులను
పెడమొకము చేసి నొప్పించేవు" 6-111

నొసలివ్రాలు తుడుచు : ప.బం; అ.క్రి. నొసటి వ్రాత మార్చు, విధిని మార్చు.
"తుడువఁడా కపటదైత్యుల నొసలివ్రాలు" 1-126

నొసలు బత్తుఁడు నోరు దోఁడేలు : ప.బం; వి. పైకి సాధువుగా కనిపించే క్రూరుడు. గోముఖ వ్యాఘ్రం, పయోముఖ విషకుంభం వంటిది.
"తులఁదూఁగ నొసలు బత్తుఁడు నోరు దోఁడేలు
మెలఁగిన యట్టయితే మెచ్చునా దేవుఁడు"
15-225

నో

నోడలఁబెట్టు : స.క్రి. (?)
"వీడెము నా చేతికిచ్చి విందుల మోవియ్యఁగాను
నోడలఁబెట్టి పతికి నోరూరే వేమే" 26-471

నోరికతలు : వి. నోరిమాటలు, పైపై మాటలు, నిజంకాని మాటలు.
"కప్పురాలు నీ నోరికతలె కావా" 7-332

నోరునిండా నుతియించు : ప.బం; స.క్రి. మనసారా స్తుతించు, తృప్తిదీర స్తుతించు.
"అరసి పెద్దల నన్ని నడుగుచుండవలె
నోరునిండా నుతియించవలెను" 8-228

నోరునిండా మాట్లాడు : ప.బం; అ.క్రి. బాగా (తృప్తిగా) మాట్లాడు.
"నోరునిండా మాటలాడె నుడుగరాదందరిలో
చేరి పతి నడుగరే చెలులాల"

నోరుసేయు : ప.బం; అ.క్రి. ఎక్కువగా మాట్లాడు, గట్టిగా కేకలు వేయు.
"పంతమాడి పగచాటి బలిమి నోరుసేసేవు
యింతలోనే నేఁడు నీకు నివి గొత్తలా" 16-373

నోరూరించు : ప.బం; అ.క్రి. ఆశకలిగించు.

నోరూరు: (3) ప.బం; అ.క్రి. తిన బుద్ధివేయు, అనుభవింప కోరిక కలుగు, ఆశ పుట్టు, తినదగిన వస్తువు కనబడినప్పుడు నోటిలో నీరూరడం సహజం. దానిపై వచ్చిన పలుకుబడి.

"నొక్కుచు మో వియ్యఁగానె నోరూరెను" 8-159

నోరెత్తు: ప.బం; అ.క్రి. మాటలాడు.

"ఎందును నీ కతఁడు నోరెత్తకుండ మంత్రాలు
మందులు నేరుతువుగా మా యమ్మా" 5-359

"పడఁతి నోరెత్తితేను పగడాలే రాసులయ్యీ
యెడపు నిన్నుఁదిట్టితే నేమాయనయ్యా"
20-167

నోళ్లు దెరచు: ప.బం. అత్యాశపడు, మాటలాడు.

"యే కొఱఁతని యిఁక నాసపడుచు
నే మెవ్వరికి నోళ్లు దెరచెదము" 9-82

నోవి: (3) 1. నొప్పి 2. బాధ 3. వ్యాధి.

"భావంబు తలపోఁత బతి మెట్టిదో కాని
నోవి దోఁపనిచోట నొచ్చెద ననవలసె" 5-255

ప

పంకించు: దీనికి నిఘంటువుల్లో ఈ కింది అర్థాలు చెప్పబడ్డాయి. 1.బురదగ చేయు 2.సరిచేయు (సూ.ని.) 3.రుద్దు, చరుము 5.నూనె మొ॥ జుట్టుకు పట్టించు, రాచు, వాటిని బురదలాగా పట్టించు, అంకితమొనర్చు, (తె.వ్యు.కో.) 6.చలించు, భయపడు 7.సరిచేయు, హెచ్చుతగ్గులు కాకుండా చేయు 8.ఊగించు, ఊపు. పై అర్థాలు ఈ కింది కీర్తనల్లో సరిపోవడం లేదు. గౌరవించు, పెద్దగ చూచు అనే అర్థాల్లో ప్రయోగించినట్లున్నదనీ, 'నిన్నెవరు పంకిస్తారురా' ఇత్యాది వ్యవహార మీ నాటికీ ఉందనీ, తలపంకించు లో గూడ దీని తాత్పర్యమే అగపడుతుందని సం.ప.స. (16 సం. 429 పు.)

"వీడెము నీ చేతికిచ్చు విఱ్ఱవీఁగితేఁదనకు
తోడి సతులు పంకింతురా యిపుడు" 16-4

పంగించు: (35) స.క్రి. కోపించు, ఆగ్రహించు, చిడముడి పడు, వెనుక చేసిన పొరపాట్లను చూపి ఏడిపించు, దెప్పు, ఎత్తిపొడుచు అను అర్థముగ తోచుచున్నదని సం.ప.స. 16 సం.

"పలుమారు నిన్ను నింత పంగించేదాననా
తలఁగక సేవసేసేదానఁ గాక" 14-157

"యిదివో శ్రీవేంకటేశ యీకె నెట్ట యేలితివి
పదిమారులు నిన్నుఁ బంగించఁదగునా"
14-586

ఇది మాండలికపదమనీ, బలే పంగిస్తాడు, నీ పంగెనలు నాకెందుకు ఇత్యాది జనవ్యవహార మీ నాటికీ ప్రసిద్ధమే అనీ భంగించు శబ్దభవం కావచ్చుననీ సం.ప.స. చెప్పబడింది. (16సం. 429 పు.)

"రవ్వగా నా పొకవేళ రాజసముతో నలిగి
యెవ్వరి ముందరనైనా యిట్టె పంగించదా"
16-258

పంగు: వి. భయం.

"పొంగుచుఁ దూరుపెత్తంగఁ బొలివారె నివ్వెరగు
పంగుల గోరువట్టు నీ భాగ్యము కొలఁదయ్యా"
11-442

పంగెన: (14) వి; మాం. ఎత్తిపొడుపు, హేళన, పట్టుదల, బింకం, (మోసం అని పీఠిక) శ.ర.లో, ఆం.ప.ని; ఆం.భా.మ. లో అవపాతం, ఓదం అనే అర్థం చూపబడింది. కాని ఈ అర్థం ఇక్కడ కుదరదు. పట్టుదల, సంకోచం, ద్రోహి అనే అర్థాల్లో శృం.శ. (తాళ్లపాకవారిది) లో ప్రయోగాలు కనిపిస్తున్నాయి.

"పంగెన కోపుదువా గోపాలకృష్ణ
కొంగు వట్టే వదేమోయి గోపాలకృష్ణ మా"

"పంగెనగాఁ బ్రియములు పదివేలు చెప్పఁగాను
యెంగిలి నీ మోవి యేల యియ్య ననేవే"
16-358

"యింగితపు శ్రీవేంకటేశ ని న్నెనసె
పంగెన సురతపు వల్లవాధరి" 26-293

పంగెము: (8) వి. ఈ శబ్దం సూ.ని. మొదలైన ప్రసిద్ధనిఘంటువుల్లో ఎందులోనూ

కనిపించదు. ఇది 'భంగము' నకు వికృతి పదమా? అప్పుడు దీనికి 'భంగపడుట' అనే అర్థం చెప్పవచ్చు. ఈ క్రింది కీర్తనపాదాల్లో ఈ అర్థం కొంతవరకు పొసగుతుంది.

"పాయపుమదములకు పంగెమైనవాఁడు
యీయెడ నీవాఁడనని యెట్టు గొలిచేనయ్యా" 2-480

"ఆవల నిశ్చలబుద్ధి అది యేడ నే నేడ
భవము చంచలమనసు పంగెమే యెపుడు" 2-408

ఆనందమూర్తిగారు ఈ పదానికి స్వాధీనం, సంబంధం అనే అర్థాలు సూచించినారు. (సంకీ.వా. 456 పు.) ఈ అర్థములుకూడాపై ప్రయోగాల్లో పొసగుతున్నాయి.

పంచచెట్టు మందు గాదు : సామెత; పెరటిచెట్టు మందు గాదు అని అర్థం. చూ: పెల్లిచెట్టు మందు గాదు.

"వంచకువే శిరసు వలవని నెరుసు
పంచచెట్టు మందుగాదు పలుకు లింకేలే" 20-233

పంచబంగాళమగు : *ప.బం; అ.క్రి.* చెల్లాచెదరగు, అదృశ్యమగు

"పారరో యసురులు పంచబంగాళమై
పారిరి దానవులెల్లా పంచబంగాళమైరి" 4-21

పంచబేరములు : *వి; బహు.* శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఐదు ప్రతిమలు. 1. ధ్రువమూర్తిబేరం (మూలవిరాట్టు) 2.కౌతుకబేరం (భోగశ్రీనివాసమూర్తి పంచలోహ విగ్రహం) 3. స్నపనబేరం (ఉగ్రశ్రీనివాసమూర్తి పంచలోహ విగ్రహం) 4. ఉత్సవబేరం (ఉత్సవమూర్తి మలయప్పస్వామి) 5. బలిబేరం (కొలువు శ్రీనివాసమూర్తి; పంచలోహ విగ్రహం)

"పరఁగి నీ ముందరను పంచబేరములుండఁగా
గరిమఁ జక్రము నీకుఁ గాపై వుండఁగా" 2-364

పంచమవేదము : *వి.* ఐదవవేదం. పరమ ప్రామాణికం.

"పంచమ వేదము నీకు పడఁతి మాటలెల్ల
సంచుల నెవరిమాట చవులయ్యీని" 16-142

పంచమహాపాతకాలు : ఐదు మహా పాపాలు. అవి 1.బంగారాన్ని దొంగిలించడం 2. సురాపానం 3.బ్రహ్మహత్య 4. గురుపత్నీ సంగమం 5. స్త్రీ హత్య.

"పంచమహాపాతకాలే పట్టుకొనే యింద్రియాలు
పంచమహాపాతకాలే బారిఁదోయకేల మాను" 4-18

పంచలఁదోయు : *స.క్రి.* పారఁదోలు, పాడుచేయు.

పంచల సంసారము : *వి.* దీనమైన బ్రతుకు. 3-288

పంచసంస్కారములు : *వి; బహు.* తాపం, పుండ్రం, నామం, మంత్రం, యాగం – ఇవి వైష్ణవులకు విధింపబడిన సంస్కారాలు, ఇవి పొందిన వైష్ణవులు పరమైకాంత్యస్థితిని పొందగలుగుతారు.

"తాపః పుండ్రం తథా నామ
మంత్రో యాగశ్చ పంచమః
అమీ పరమ సంస్కారాః పారమైకాంత్య
హేతవః"

"యెంచఁ దాప-పుండ్ర-నామ-మహిత-మంత్ర
యాగమని
పంచసంస్కారములు చెప్పె పాంచరాత్రధర్మ
మిది" 15-113

పంచామృతము : *వి.* ఆవుపాలు, నేయి, పెరుగు, చక్కెర, తేనె అనే ఐదు మధురపదార్థాలను, కలిపిన పదార్థం. దేవాలయాదుల్లోనూ, శుభకార్యాలలోనూ ఇది వినియోగింపబడుతుంది.

"పంచామృతములతోడ పన్నీట మజ్జనమాడె" 7-473

పంచారూఢిపత్రము : *వి.* పంచాయితీనామా వంటి పత్రం, పత్రం వ్రాసినవాడు, వ్రాసియిచ్చేవాడు, ముగ్గురు సాక్షులు – మొత్తం ఐదుగురు ధ్రువీకరించే అప్పుపత్రం.

పంచరూఢిపత్రమే వ్యవహారంలో పంచారూఢిపత్రం కావచ్చు. పంచ + ఆరూఢి పత్రం కూడా కావచ్చు.

"ఎలమి నందుకు సాక్షి యిరుమేలా నున్నవారు
బలిమిఁబంచబాణాలు పంచారూఢిపత్రము" 23-455

పంచేంద్రియపదిలములు : *వి; బహు.* పంచేంద్రియముల యొక్క నిర్భయమైన పనులు కావచ్చు. వైరిసమాసం.

"కడుపు నిండితే ఘనమై నిండును
బడిఁబంచేంద్రియపదిలములు (?)" 4-213

పంజు : వి. 1. కరదీపం, దివిటీ 2. రత్నం 3. ఒకవిధమైన కర్ణభూషణం 4. ఒకవిధమైన బాణసంచా.

"వుదయచందురుఁ జూచి అదె నీ పంజని సవి
యెదురుకోనే వచ్చితిరా" 7-223

"వెలయ నీ పంజుల వెలుఁగు చూచి అంతలో
పులకాంకురాలచేతఁ బొదలుచునున్నది" 14-593

పంటకెక్కు : *ప.బం; అ.క్రి.* ఫలోన్ముఖమగు.

"పంటకెక్కి పాలవెల్లిఁబండిన పాలపండు
తొంటి గొల్లెతల మోవి దొండపండు" 7-284

పంటపండు : (7) *ప.బం; అ.క్రి.* అదృష్టం ఫలించు.

"పంటపండే జవ్వనము ఫలియించే కాలమున
పంటమోవి యింతికి ఫలియించెను" 28-476

పంటి : *వి.* కడవ, కుండ.

పంటెడు పాలలో నొక చల్లబొట్టు చేమిరి పెట్టినట్టు : *ప.బం;* మంచి ఎంత ఉన్నా చెడగొట్టడానికి కొంచెమే చాలు అన్నట్లు, పాలు ఎన్ని ఉన్నా చేమిరి ఒక్క బొట్టు చాలుగదా!

"చెంతఁబంటెడు పాలలో నొక చల్లబొట్టు చేమిరి వెట్టినట్టు
అంతటికిని శ్రీహరి శరణాగతి యిది యొక్కటె నాకు" 4-77

పండబడేవి : *వి; బహు.* పండుకునేవి. స్వార్థంలో 'పడు' అను ప్రయోగం.

"యిల నేఁబండఁబడేవి యీశ్వర నీకు
మొక్కులే" 2-201

పండరంగి : వి. మహారాష్ట్రలోని పండరిపురం.

"పండరంగినుండి వచ్చి పామరులనెల్ల మెచ్చి
యెండలేని నీడలోన యెచ్చి యెచ్చి" 6-26

పండరంగినాథుఁడు : వి. పాండురంగక్షేత్ర నాథుడైన విఠ్ఠలుఁడు.

"రసికుఁడవౌదు పండరంగినాథా నీ
పసలఁ జిక్కితిమిదె పండరంగినాథా" 11-127

పండరంగిరాయఁడు : వి. పాండురంగక్షేత్రస్వామియైన విఠలుడు. 7-219 old

పండరంగి విఠ్ఠలుడు : వి. మహారాష్ట్రలోని పండరిపురక్షేత్రంలో వెలసిన విఠ్ఠలుడు.

"చలువ నీ మోవితేనె చవి గొన్న యందాకా
పలుకులు చాలించు పండరంగివిఠ్ఠలా" 21-513

పండరిరమణుఁడు : పండరిక్షేత్రానికి అధిపతి యైన విఠలుడు.

"పండరిరమణ రామ బలరామ పరమపురుష
చండభార్గవరామ శరణు శరణు" 4-321

పండినపంటలు : *ప.బం; వి; బహు.* ఆనందదాయకములు.

"పండిన పంటలు పరమాత్ముని విరిఁ
బండయి తిరిగిన బడలికలు" 1-24

పండిన పసిఁడి : *ప.బం;* వి. అబ్బిన మహాభాగ్యం, అబ్బిన మహాసంపద, మిక్కిలి ఆనందదాయకం.

"అండనున్న హరి నాత్మఁదలఁచిన
పండిన పసిఁడే బ్రతుకరో ప్రజలు" 1-101

పండి పొల్లపోవు : *ప.బం; అ.క్రి.* చేతికి వచ్చినది నోటికి అందకపోవు, పంట పండి కూడా వ్యర్థమై పోయిందనడం.

"పండి పొల్లవోయీనా పట్టరాని మనసు
యెండకు నీడకుఁ దీసి యింత కోపఁగలనా" 8-49

పండిరాసులగు : *ప.బం; అ.క్రి.* ఎక్కువగు.

"పండిరాసులాయెఁ గీర్తిప్రతాపములెల్ల" 1-3 old

పండుండు : (2) (పండి + ఉండు) అ.క్రి. పడుకొని ఉండు.

"పని నీకుఁ గలిగితే పానుపుపైఁ బండుండవే" 24-273

పండు : (4) అ.క్రి. పడుకొను, శయనించు. అన్నమయ్య అంతటా 'పండు' అనే రూపాన్నే వాడినాడు కాని నేటి 'పడుకొను' అనే రూపాన్ని వాడలేదు. తెలంగాణంలో ఎక్కువగా పండుకొను పదమే వాడుకలో ఉంది.

"అక్కరతో నలిపార నాలవట్ట మిడఁగాను
పక్కఁ బండుమని యెంత బాఁతిపడేవు" 28-275

"కదిమి వొత్తఁగరాదు కాలు చేయి వేయరాదు
పదపడి నేనెట్టు పక్క బండేనే" 26-391

పండు గాయసేయు : *ప.బం; అ.క్రి.* ఎక్కువదానిని తక్కువచేయు.

"ఎండలోని నీడ యీ మనసు
పండు గాయసేయఁ బనిలేదు మనసు" 1-337

పండుజవ్వని : వి. నిండుజవ్వని.

"పండుగలు గాఁగ నిట్టొ బాపురె శ్రీవేంకటేశ
పండుజవ్వనిఁ గూడితి పవ్వళించరాదా" 11-372

పండ్లగెల : వి. పండ్లగుత్తి.

"యెడమచేతఁ బట్టి నిదివో పండ్లగొల
కుడిచేత రాకాసిగుంపుల గొట్టె" 4-167

పంత(క)గత్తె : (14) (పంతము + కత్తె) వి. ప్రతిజ్ఞ చేసిన స్త్రీ, పట్టుదల గల స్త్రీ, పౌరుషం కల స్త్రీ, పోటీపడే స్త్రీ.

"చెచ్చెర నింకా నీవు సేసినట్టె సేతుఁ గాక
పచ్చితిట్టు దిట్ట నీతో పంతగత్తెనా" 27-227

పంతగాఁడు : (12) (పంతము + కాడు) పోటీ చేయువాడు, ప్రతిజ్ఞ చేయువాడు, పౌరుషం కలవాడు.

"పంతగాఁడయితే నేమి బయలీఁదించితే నేమి
యింతేసి నమ్మికలు నా కిచ్చెఁగా తాను" 29-210

పంతగారితనము : (పంతము + గారి + తన) వి. పౌరుషశాలిత్వం.

"పంతగారితనమునఁ బదరే వదేమి నీవు
మంతనాన నెవ్వతెచే మాటఁబడినావో" 24-582

పంతగారివాఁడు : (2) (పంతము + గారి + వాడు) వి. పంతగాడు, అందగారి శబ్దంవంటిది. 'పంతగాడు'కు పంతగార అని కన్నడం.

"పంతగారివానిని పచ్చిగా నాడఁగరాదు
అంతరంగమైనవాని నణఁచరాదా" 23-182

పంతగారిసతి : (పంతము + గారి + సతి) పంతకత్తె 'గార' అనేది కలవాడు, కలది అనే మత్వర్థంలో చేరే కన్నడప్రత్యయం. అందగార మొ॥ ఇట్టి రూపాలే.

"పంతగారి నిన్నుఁబట్టినదెల్లాఁదప్పె" 23-539

పంతనాలు -పొంతనాలు : వి. ప్రాతికూల్యాలు - ఆనుకూల్యాలు (?)

"పవ్వళించే వేమే నీ పంతనాలో పొంతనాలో
యివ్వల శ్రీవేంకటేశుఁ డెడ మియ్యఁగా" 11-341

పంతపుది : (పంతము + అది) పంతకత్తె.

"పంతపుదానికిఁగాని పల్లదము లెల్ల రావు
జంతకుఁగాని కడుఁ జలము లేదు" 16-561

పంతపువేసాలు : *వి; బహు.* మొండివేషాలు.

"పంతపువేసాలు మాని పయ్యె దెడలించరాదా
చెంత శ్రీవేంకటేశ్వరుఁడు చేయి చాఁచీని" 13-49

పంతమిచ్చు : *ప.బం; అ.క్రి.* ప్రతిజ్ఞచేయు, కానీ యీ వాఙ్మయంలో అంతటా పట్టుదల వదలు, తప్పు అంగికరించు ఇత్యాద్యర్థాల్లో ప్రయోగించినట్లు కనబడుతుందని సం.ప.స. (16 సం. 430 పు.)

"పంతమాకె కిప్పించి నీ పాదాలకు మొక్కించి
సంతోసాలు రేచిరి యీ సతుల కెల్ల మీకు" 16-34

"పన్ని నీతో నలిగిన ఫలమెల్లా నేఁగంటి
ఇన్నిటికి నీకుఁబంతమిచ్చేము కోవయ్యా" 19-475

పంతమో పాడో : ప.బం. పట్టుదలో పాడో. విసుగును తెలిపే పదబంధం.
"పంతమో పాడో తనకు బాలకి నన్నింత సేయ
రంతులఁదానూ రాఁడు రానివాఁడు గాఁడు" 20-220

పంతాలు సానఁబట్టు : ప.బం; పంతాలు తీక్షంచేయు.
"మానవయ్యా మాతోడి మందెమేళాలు
సానఁబట్టేవు పంతాలు సతులపై నేలయ్యా" 20-59

పందదనము : (పంద + తనము) వి. పిరికితనం, సోమరితనం. రూపాం. పందతనము.
"యెందైనను యీ మనసు
పందదనంబునఁబారీఁగాక" 10-1-10

పందిలివెట్టు : (3) ప.బం; అ.క్రి. కప్పిపుచ్చు, పైకి అందంగా కనబడునట్లు చేయు, చల్లఁబఱచు.
"మచ్చికఁ బందిలివెట్టే మాయకాఁడ
కుచ్చితపు నేరుపుల కుశీలికాఁడ" 10-2-83

పందెగాఁడు : (పందెము + కాఁడు) పందెంవేసే వాడు, పెద్ద శ్రేష్ఠుడు. పందెకాడు అని సూ.ని.
"ఎందాకా మూసిమంతనా లేల సేసేవు
పందెగాఁడవై నీవే పడితళించరాదా" 25-8

పందెమాడు : (2) అ.క్రి. ప్రతిజ్ఞచేయు, చలవట్టు, పంతమాడు.
"పందెమాడుతా నున్నాఁడు పతివీఁపునఁ జన్నులు
సందడి నేల వొత్తేరే సతులెల్లా" 14-481

పందెముమోచు : ప.బం; అ.క్రి. పందెము వేయు.
"పరఁగ నాపెమీఁద పందెము మోఁచెనంటా
సొరిది నీ వేల వచ్చి సూడువట్టే విపుడు" 17-222

పంద్యాలు : వి; బహు. పందెము శబ్దానికి బహువచనరూపం. పందెములు, పందాలు.
"చొక్కపు రతులనే జూజములాడీ నాపె
వెక్కసమేల పంద్యాలు వేయవయ్యా" 29-223

పంపుడుఁజిలుకలు : వి; బహు. పెంపుడు చిలుకలు. 'పెంపుడు' అనడానికి బదులుగా 'పంపుడు' అని ప్రయోగించడం యతికోసం కావచ్చు.
"పలికి మటాడఁగాను పంపుడుఁజిలుకలంటూ
నిలువున వెరగంది తలవంచుకొంటిని" 7-316

పంపుడుచెలి : వి. అరణముగా పంపబడ్డ చెలి.
"పంపుడుచెలుల మింతే పలుకవిదేమమ్మా
చెంప జారిన తురుము చెరుగుకోవమ్మా" 19-468

పంపుడుదయ్యము : వి. ఇతరులపైకి ప్రయోగించే భూతం.
"పంపుడుదయ్యమై బాధవెట్టెడు యా
కొంపలోన నుండ నీఁగోరీనా" 1-186

పంపుడుదేవత : వి. (?)
"యింపుల శ్రీవేంకటాద్రి నిరవై వున్నాఁడు వీఁడె
పంపుడుదేవతలతో బ్రతి లేని దైవము" 4-359

పంబు : అ.క్రి. అతిశయించు, విజృంభించు, ఒప్పు, వ్యాపించు.
"అంబరాన నున్న ధ్రువు నజ్ఞానమెల్లఁ బాపె
పంబి నీచేత నుండిన పాంచజన్యము" 3-434

ప(పె)లుచుఁదనము : వి. పౌరుష్యం, వైరస్యం. యతిని బట్టి ఇట 'పెలుచుఁదనము' అని గ్రహించవలెను.
"పెలుచుఁదనాన రతిఁ బెనఁగులాడుకొంటాను" 24-447

పక్కలించు : అ.క్రి. నిఘంటువుల్లో ఈ రూపం కనిపించదు.
"కడు వేకువను లేచి కన్నులు పులుముకొంటా
కడు పక్కలించి యాఁకలయ్యీ నవి" 16-420

పక్కులుగట్టు : అ.క్రి. కురుపు మానుతూ పైన గట్టిపడు.
"పక్కులుగట్టెను మోవి పైకొనెఁ గన్నులకావి
తక్కన నాతో నిఁక తా నే మనీనే" 25-20

పక్కెర: వి. ఏనుగుకు తొడిగే కవచం, జీడా.
"తొక్కిన పాపములవె తోడనే శ్రీవేంకటాద్రి
పక్కెర నరసింహపు ప్రళయనరసింహునికి "
2-379

పక్కొమ్మ: (పక్క + కొమ్మ) వి. పక్కనుండే కొమ్మ, ఉపశాఖ, రెమ్మ.
"వేవేలు పక్కొమ్మలు వెసఁబెట్ట నేరిపిరా
యేవలఁజూచినా నీ మహిమ అంతే గాక "
2-333

పక్షులు పారెడిపొద్దు: వి. సాయంకాలం
"బాయటఁ బెట్టకురే పక్షులు పారెడిపొద్దు
వో యమ్మ బాలులకు నొప్ప దందురు " 5-247

పగటు: (50) వి. 1. ప్రకాశం, ప్రాకట్యం 2. కాంతి, శోభ 3.సౌందర్యం 3. విధం, రీతి 4. విప్రలాపం 5. వైరం (తె.వ్యు.కో.) 6. మురిపెం 7. గర్వం (బ్రౌన్) 8. ద్వేషం.
"గాటపుఁగస్తూరి బొట్టెక్కడ మాయకుండా
మొక్కె
జూటరి దీని పగటు చూడరే వో చెలులు"
12-355
"జగమెల్లా మాయయైనా సరి నీకే శరణంటే
పగటున నదే తపఃఫలమౌను" 2-351

పగటుఁదనము: వి. 1. మనోజ్ఞత 2. ఉద్ధతి. (తె.వ్యు.కో.)
"పగటుదనాలు సేసి పంతము చూపేనా"
29-296

పగటుచీకటి: వి. నల్లనివాడు, పగలే చీకటి.
"కల్పించు నంతటి నలుపు అనడం
సిరి దొలంకెడి వగటు చీకటా యితఁడేమి"
1-25 old

పగటులాడు: స.క్రి. దూషించు.

పగడవాతెర: (7) వి. పగడం వంటి పెదవి.
7-221 old
"పొగరుఁగెమ్మోవి గిరుపుల నగవులాఁడి నీ
పగడవాతెర దెరచి పలుకవమ్మా" 5-181

పగడసాలు: (10) వి. 1. పాచికలు, సారెలు గల సొగటాల పలక 2. జూదపు పలక 3. పాచికల ఆట 4. నెచ్చెలులాడే ద్యూతం 5. ఇష్టజనద్యూతం. (త. పగటైచ్చాలై)
"పాడితోఁబందెము వేసి పడగసాలాడఁబట్టె
ఆడనే పరపుమీఁద నలపారే దేవుఁడు" 8-208
"పగడసా లాడుదువు పక్కన నవ్వింతువు
మొగముచూ పితనికి మొక్కఁగదవే" 17-158

పగపాడు: (2) పగవాడా?
"మిగతాఁ గామినులెల్లా మేలిలోని వారు గాక
పగపాడే యేమైనా పంతము నెరపను " 14-545

పగలుచీకటి: వి. నల్లనివాడు.

పగవట్టు: (పగ + వట్టు) ప.*బం;* అ.క్రి. వైరంపూను, ద్వేషించు.
"పోడిమిఁ బగవట్టేవు పున్నమచందురుమీఁద
నేఁడే యీతని పాదాలు నీవు పట్టుకోరాదా"
26-331

పగసే(చే)యు: (పగ + చేయు) అ.క్రి. శత్రుత్వం వహించు.
"ఊరకున్న నన్ను నేల వుడికించవచ్చేవు
చేరి నీకు యెంత పగసేసితినో కాని "
11-265 & 11-230

పగిడికాఁడు: (2) (పగిడి + కాఁడు) ధనం కలవాడు, కానుకలు గలవాడు. (వ్యు.)
"బదుకవయ్యా ఇంత పగిడికాఁడ వైతివి
పదరి వొకరికొకరు పైకొనఁగాను " 23-185
"వెల లేని వలపుల వేడుకకాఁడ
పలుసరసంబుల పగిడికాఁడ" 23-471

పగిడివెట్టు: వి. అధికంగా ధనం ఇచ్చు.
"సం.ప.స.లో పగిడి = పరిహాసము, వెక్కిరింపు అని తమిళము" అని వివరిస్తూ ఈ పదానికి పరిహసించు, వెక్కిరించు అనే అర్థాలు సూచింపబడ్డాయి.
"తెగువ నీవలె నాకు దేవ రియ్యాఁడాఁగాక
పగిడివెట్టి నవ్వితేఁ బదరవా నీవు" 14-245

పగులించు : స.క్రి. పగులగొట్టు.
"పక్కన బ్రహ్మాండము బగులించె బెనువేల
వెక్కసపు దైవమైన విష్ణుని నెఱఁగరా" 3-535

పచరించు : ప్రసరించు.

పచారము : (4) వి. నడవ, నటన, అంగడి (ఆపణము అని ఆం.ప.ని.)
"విచారించుకోవు గాక వెనకముందు
పచారాలవలె బట్టబయటఁ బెట్టుదురా" 27-460
'పచారించు' అనే పదానికి పలుకు, చెప్పు అనే అర్థాలున్నందువల్ల 'పచారము' అనే మాటకు పలుకు, మాట అనే అర్థం కూడా చెప్పవచ్చు. ఈ కింది సంకీర్తనపాదంలో ఈ అర్థం పొసగుతుంది.
"విచారించు హరి నా విన్నప మవధరించు
పచారమే నాది గాని పనులెల్లా నీవే" 2-1
"చెలియరో నీ మగఁడు చెప్పినట్టు మెలఁగఁగా
పలు పచారము లేలే భాగ్యవంతురాలవు" 28-283

పచారించు : స.క్రి. 1. ప్రసరింపఁజేయు 2. చేయు 3.పుట్టించు 4. కలిగించు 5. ప్రకటించు 6. చూపు 7.తిరస్కరించు 8. పంతమువట్టు 9. నడపు. 'పచరించు'కు రూపాం. 1. చాచు, చాపు 2. సవరించు, సిద్ధపరచు 3.చేయు, పడునట్లుచేయు 4. ఉపాయం నెరపు 5.అభినయించు 6. బాణంవేయు 7. లగ్నంచేయు. అ.క్రి. ప్రవర్తించు, మెలగు, విహరించు, చూపు.
"కులికి కులికి కొనగోరి గురులు సోఁకఁగ
పలురతుల చవులు పచారించీని" 13-121
"యిన్నిటా శ్రీవేంకటేశ యిందే ఎనసేముగాని
పన్నిన మీ వలపులు పచారించరయ్యా" 26-497

పచ్చ : వి. పసిమి కావచ్చు. (సంపా.)
"పాయపు నీ జవ్వనము పచ్చ గందీనని నీవు
చేయిచ్చి దగ్గర వేమే శ్రీవేంకటేశు" 27-176

పచ్చగందు : అ.క్రి. పసిమి కోల్పోవు. (ఎండిపోవు)
"పాయపు నీ జవ్వనము పచ్చగందీనని నీవు
చేయిచ్చి దగ్గరవేమే శ్రీవేంకటేశు" 27-176

పచ్చగరికె కాలము : ప.బం; వి. అశాశ్వతం, కొంతసేపు మాత్రమే ఉండేది.
"పచ్చగరికెకాలము ప్రపంచములో బ్రతుకు
తచ్చి చూచెటి సూత్రము తన జ్ఞానము" 4-24

పచ్చదోరణము : (3) వి. పచ్చతోరణము.
"బంతెనఁగూళ్లు నేఁడు పచ్చదోరణాలు నేఁడు
చింతదీర భోగించి చిత్తగించవయ్యా" 20-343

పచ్చని అలము : వి. తులసి కావచ్చు. F.N.
"కూరిమి నీవే దక్కించుకొంటిఁ వడవులవెంట
చేరి పచ్చని అలమై శిరసు నిండితివి" 27-407

పచ్చనిదెల్లా పసిఁడి : ప.బం. తెల్లనివెల్లా పాలు వంటిది.
"సారెకు దిక్కులనుఁ బచ్చనిదెల్లాఁబైడైతే
కోరి యవి యెంత సేసుకొనరాదు" 24-21

పచ్చలకడియము : వి. పచ్చలు (మరకతాలు) తాపిన కడియం.
"ఇచ్చకములు సేయఁగా యీతఁడే అందుకుమెచ్చి
పచ్చల కడియము లప్పటి నిచ్చెను" 23-462

పచ్చలమేడ : వి. మరకతమణులు తాపిన మేడ.
"విచ్చనవిడైనఁగాని వెలయవు కోరికెలు
పచ్చలమేడలోనఁ బవ్వళించరయ్యా" 13-420

పచ్చలు : వి; బహు. నాణెములు, రూకలు.
"తచ్చన తరితీపుల తగవరివాఁడవు
పచ్చలాయకట్టే లాబపువాఁడవు" 19-17

పచ్చారు : అ.క్రి. 1. పచరించు, ప్రవర్తించు 2. విహరించు 3. పచారు, అనవసరంగా అటునిటు తిరుగు.
"పలుమారుఁ దన్ను చూచి పచ్చారుకంటేను
తలవంచుక తన ముందర నుండుతే మేలు" 12-109
"ముచ్చట మాటలఁ గడు మోహముపైఁ జల్లితేను

పచ్చారుచుఁ జెలులేల పచ్చి సేసేరే" 9-198

పచ్చి: వి. శృంగారాదిరసస్ఫురణం, రసంపైకి స్ఫురించడం, ఆఱడి, బూతు.

"బడినున్న మాకైతేఁ బచ్చి దోఁచెఁబనులు
అడరి శ్రీ వేంకటేశ ఆడికె కెంతోపుదువో"
14-401

"పచ్చితోడ తనమీఁది పాటలెల్లాఁ బాడఁగాను
పచ్చడము కొంగు నాపైఁ గప్పెను" 23-462

పచ్చికస్తూరి: వి. మిక్కిలిగా నూరిన కస్తూరి.

"పచ్చికస్తూరి నుదుటఁ బట్టువెట్ట నేఁటికే
మచ్చిక నీ రమణుఁడే మన్నించీ గాక" 19-466

పచ్చిగా: (2) క్రి.విశ. బహిరంగంగా, మఱుగులేక.

"పచ్చిగా పానుపుమీఁద పాదము లొత్తినందుకు
కుచ్చితివిగా కాఁగిట గురుతుగా నన్నును"
26-237

పచ్చిగాఁజేయు: స.క్రి; ప.బం. ఆఱడిచేయు.

"పరపుపై నిన్ను నేను పచ్చిగాఁజేసనంటే
యిరవుగా వేడుకొనేవేమి సేతును" 8-28

పచ్చిగా నాడు: ప.బం; అ.క్రి. బూతుగా మాట్లాడు.

"నెట్టన శ్రీవేంకటేశ నీకుఁదన నేర్పు చెప్పి
బట్టబయలుగా దిట్టి పచ్చిగా నాడుదురా"
28-13

పచ్చిగాలి: వి. చల్లగాలి.

"పడఁతికి నీ రాక పచ్చిగాలియై వీఁచె
చిడుముడిఁగోరికలె చిగురించెను" 19-464

పచ్చిగొంటులు: వి. (?)

"పాయపు వెరఁగుల పచ్చిగొంటులమ్మీ
చేయారఁగ వెల సేయవమ్మా" 22-90

పచ్చి గొంతా వెచ్చి గొంతా: స్పష్టంగా కొంత, అస్పష్టంగా కొంత.

"మచ్చిక నాతఁడు నేఁడు మా యింటికి
వచ్చెనంటా
పచ్చి గొంతా వెచ్చి గొంతాఁబలికే వేమే"
11-194

పచ్చిచేయు: ప.బం; స.క్రి. ఆఱడిచేయు. (పద.)

"ముచ్చట నీవును నేనును మోహించిన
చేఁతలెల్లా
పచ్చిచేసెఁ జెలులతోఁ బైపై నాపై" 20-540

పచ్చిజవ్వనము: (3) వి. నిండు జవ్వనం.

"ఇచ్చకములాడరే యింతులాల
పచ్చి జవ్వనమింతలో పదను దీసేనా" 7-20

పచ్చితనము: (పచ్చి + తనము) వి. శృంగారాది రసస్ఫురణం, రసంపైకి స్ఫురించడం.

"మెచ్చిరే యందరూఁ దన మేకులెల్లాను
పచ్చితనమెల్లా బంగారాయనే" 23-467

పచ్చితిట్టు: (3) వి. బూతుతిట్టు.

"మలసి మలసి నీతో మంచిమాట లాడఁగాను
తిలకించి చూచి పచ్చితిట్టు దిట్టనేఁటికి" 28-354

"పయ్యెదపైఁ జెయివేసి పచ్చితిట్టు తిట్టితేను
నెయ్యమునఁ గరఁగితి నిదేమో కాని" 9-147

పచ్చిదేరు: (27) అ.క్రి. పచ్చియగు, బూతుగానుండు, ఆఱడియగు.

"పక్కనఁజూచిన చూపు పచ్చిదేర వలపించు
నెక్కొన్న రతులలో నేరుపులివి" 28-288

పచ్చినవ్వు: వి. మఱుగు లేని నవ్వు.

"పయ్యెద మఱఁగుననే పచ్చినవ్వు నవ్వనేల
చయ్యనఁగూడి మోవి చవి చూపవే" 12-382

పచ్చినెత్తురు: వి. చిక్కని నెత్తురు.

"పగగొని మానక పచ్చి నెత్తురెప్పుడును
తెగికొనుఁ దానె త్రిత్తి తిత్తి తిత్తితి" 1-170

పచ్చిపాపాలు: వి; బహు. ఘోరమైన పాపాలు.

"పచ్చిపాపాల రొఁచ నీ ప్రసాదమే చాలు
యెచ్చుకుందు వుపాయాలు యిఁక నేల వెదక"
7-243

పచ్చిపాలలోని వెన్న: ప.బం; వి. అంతటా వ్యాపించి ఉండేవాడు, అంతర్లీనంగా ఉండేవాడు.

"పచ్చిపాలలోని వెన్న పరమాత్ముఁడు

బచ్చనవాసిన రూపు పరమాత్ముఁడు" 1-410

పచ్చిమాటలాడు: (2) *ప.బం; అ.క్రి.* బూతుమాటలాడు.

"పచ్చిమాటలాడి ఇంతి భావము గఁరఁగఁజేసి
ఇచ్చట సిగ్గులెల్లా బాయిటవేసేవు" 26-387

పచ్చివడగండ్ల గుళ్లు: *ప.బం; వి.* అస్థిరములు, అశాశ్వతములు, మంచుగడ్డలతో కట్టిన గుళ్లు స్థిరంగా ఉండవుగదా!

"పడఁతుల వేడుకలు పచ్చి వడగండ్లగుళ్లు
కడుమోవి తీపు చింతకాయ కజ్జము" 2-268

పచ్చివెచ్చి: (9) *ప.బం; విణ.* అపరిపక్వమైన, ఉచ్చిపచ్చి.

"పగడపు మోవివంటి పచ్చివెచ్చి కొండ"
19-519

"నిచ్చలుఁగోరినయంతే నిజమైన లోకము
పచ్చివెచ్చి చదువుల భ్రమయఁగ నేలా" 4-220

"పచ్చివెచ్చియై యుండు పడఁతులకెల్లాను
యెచ్చినీ వాడినట్టి యియ్యకొంటిగాక"
23-423 old

పచ్చివేఁడి: *వి.* మిక్కిలివేఁడి.

"నగవులోపలి యలపు నంపైన పొలయలుక
పగటులోపలి వెరగు పచ్చివేఁడి" 6-70

పచ్చివొళ్లు: *వి.* రక్తాదులచే ఆర్ద్రమైన శరీరం, చీము నెత్తురులచే కూడిన దేహం. (?)

"పచ్చివొళ్లు మోచితిమి పాపమెల్లాఁ జేసితిమి
హెచ్చిన మీఁదటి సుద్దు లేఁటివో కాని" 3-532

పచ్చిసింగారము: *వి.* బట్టబయలు శృంగారం.

"మచ్చికతో నేలనయ్య మదనసామ్రాజ్యలక్ష్మి
పచ్చిసింగారాలచేత బండారాలు నిండెను"
19-281

పచ్చిసేఁతలు: *ప.బం; వి; బహు.* ఆఅడి చేతలు, చాటులేని చేతలు, బూతుచేతలు.

"పయ్యెదచెరఁగు జారఁ బచ్చిసేత లిన్నియును
ముయ్యఁజూచీ నిటువంటి మోహమెందుఁ
గలదా" 5-328

"పచ్చిసేతలు చెక్కిళ్లపై నీ కేడవిరా" 5-222

పచ్చిసేయు: (58) (పచ్చి + చేయు) ఆరడి చేయు.

"చెలితో మాటలాడఁగ చెక్కులెల్లాఁ బులకించె
పలుమారు నిందరిలోఁ బచ్చిసేతురా" 20-131

"భజన మెరయ నన్నుఁ బచ్చిసేసేవు ఇంత
గజరుఁజేతల కోపఁగలనా యిఁకను" 5-243

పటవాళి చీరలు: నిలువుగనో, అడ్డముగనో పట్టెలు గల చీర, పద.లో పటాపటి చీర అనీ, పట్టెపటీ చీర అనీ, పటాపటీ చీర అనీ పేర్కొనబడింది. ఇది పేకకు ఒక రంగు, పడుగుకు మరొక రంగు పెట్టి నేసిన ఒకరకం గళ్లచీర. ఇదే పటావళి చీర కావచ్చు.

"కుటిలంపుఁజేఁతలు కుచ్చులుగాఁగట్టి
పటవాళిచీరె లమ్మే బలుబేహారి" 1-275

పటుకున: *క్రి.విణ.* తటాలున.

"ఇట మీఁడి కడమెల్లా నిఁక నీవు దీర్చవయ్యా
పటుకునఁ జెలి నీకుఁ బాలు వెట్టీ నిదిగో" 20-95

పట్టఁబట్టఁగానే: పట్టగానే, పట్టగానే.

"తట్టెడి నీ మట్టెలమోఁతలు చూపవలసి
పట్టఁబట్టఁగానే వుప్పరి గెక్కేవు" 5-248

పట్టదేవి: *వి.* పట్టపుదేవి, పట్టపురాణి.

"పట్టదేవైన నేను పానుపుపై నుండఁగాను
మట్టుమీరి పెనఁగఁగ మర్మములు దాకును"
20-328

పట్టంపుదేవులు: *వి.* పట్టపురాణి.

"యెరవులో సతులెల్ల యీడుజోడు వచ్చేరా
తిరమైన వట్టంపుదేవులకును" 21-214

పట్టపగటి వెలుఁగు: *ప.బం; వి.* స్పష్టంగా కనిపించేది.

"పట్టపగటి వెలుఁగు పరమాత్ముఁడు
యెట్టనెదుటనే వున్నాఁడిదె పరమాత్ముఁడు"
1-410

పట్టపగలు చీఁకటె పంటపండు: *ప.బం; అ.క్రి.* పట్టపగలు మిక్కిలి చీకటి యగు.

"వట్టివేసఁగిని గాలివానలు గురియఁగఁజొచ్చె

పట్టపగలు చీఁకటిపంట పండెను" 24-560

పట్టపుతొయ్యలి: వి. పట్టపుదేవి, పట్టమహిషి, పట్టపుదేవి, పట్టపురాణి.

"గారవించి నేఁడు శ్రీవేంకటేశ నన్నేలితివి
దూరఁజూచీ నీ పట్టపుతొయ్యలులుఁదాను"
26-285

పట్టపుదేవి: (2) వి. పట్టపురాణి.

"గుట్టుతోడ లోలోనే గుబ్బితిల్లివున్నాఁడవు
పట్టపుదేవి నిన్నెంత పనిగొనెనో" 27-31

పట్టపుదేవుఁడు: వి. పట్టాభిషిక్తుడైన రాజు.

"గట్టిగా శ్రీవేంకటాద్రి కమలాదేవితోడి
పట్టపుదేవుఁడే కాక పరులిఁకఁగలరా" 2-98

పట్టపుదేవులు: (36) వి. పట్టపుదేవి, పట్టపురాణి. ఇట ఏకవచనార్థమే అయినా బహువచన రూపాన్ని ప్రయోగించడం విశేషం. విడిగా కూడా అన్నమయ్య దేవి అనే అర్థంలో 'దేవులు' అని బహువచనాంతంగాకూడా ప్రయోగించినాడు.

పట్టపుదేవుళ్లు: వి; బహు. పట్టపురాణులు. ఇట దేవులు (దేవి శబ్ద బహువచనరూపం) శబ్దంపై మళ్లీ బహువచన ప్రత్యయం.

పట్టబద్ధము: (2) వి. పట్టాభిషేకం.

"కాంత వురమే నీకు కందువ సింహాసనము
పంతపు కూటములే పట్టబద్ధము" 25-318

వైష్ణవులు నుదుట ధరించే పట్టెవర్ధనాలు, పుండ్రము:

"అనువై నీకు మొక్కుగ నంటిన నొసలి మన్ను
పనివడి నాకు పట్టబద్ధమ" 3-393

పట్టమెక్కు: ప.బం; అ.క్రి. రాజ్యాభిషిక్తుడగు.

"ఎక్కెను ధ్రువుఁడు పట్టము యిదివో నిన్నుఁగొలిచి
చిక్కెను నీ శరణాగతి నేఁడు శ్రీవైష్ణవులచేతను"
4-217

పట్టమేలు: ప.బం; అ.క్రి. రాజ్యమేలు.

"నమ్మితే నితఁడే మన్ననఁగాచు
ఇమ్ముల ధ్రువునిఁ బట్ట మేలించినట్టు" 4-336

పట్టరాని జవ్వనము: వి. వశంలో లేని యౌవనం, నిండు జవ్వనము.

"పట్టరాని జవ్వనము పరసిపోవే ముదిమి
నెట్టుకొల్పి వుబ్బుడఁచీ నీ మాయ" 2-180

పట్టరాని వయసు: వి. యౌవనం.

"పట్టరాని వయసున బయలీఁదవచ్చునా
వట్టిన నవ్వులెల్లా నానఁబెట్టవచ్చునా" 26-417

పట్టవర్ధనము: వి. 'పట్టెవర్ధనం'అనే దానికి వ్యావహారిక రూపం. పట్టెనామం, మగవాళ్లు మిక్కిలి వెడల్పుగాను, దళముగాను పట్టెవలె తీర్చిన నొసటిబొట్టు.

"అట్టే కొందరు మతములన్నియు నేకమని
పట్టవర్ధనము నెత్తిఁబెట్టి చూపిరి" 2-270

-పట్టి: అన్నంతక్రియలపై హేత్వర్థంలో చేరే ప్రత్యయం.

"ఈతఁడే ముక్తి దోవ యీతఁడే మా యాచార్యుఁ
డీతఁడు గలుగఁబట్టి ఇందరు బదికిరి" 3-183

పట్టితే పసిఁడి రాలు: ప.బం; అ.క్రి. చేపట్టినదెల్లా సఫలమగు, పట్టినదెల్లా బంగారమగు.

"పట్టితే పసిఁడి రాలీ బచ్చనసంసారము
గుట్టు దెలియఁ బ్రాణము కూటిచేతిది" 3-248

పట్టినదెల్లాఁబైడి: ప.బం; వి. అదృష్టం కలిసి రావడమనే సందర్భంలో వాడే పదబంధం. చూ: పట్టినదెల్లా బంగారు.

"పండెను నీ తపమూ పట్టినదెల్లాఁబైడి
అండనే నన్నుఁగూడితివా యను పని" 21-328

పట్టినదెల్లా నీడేరు: ప.బం; అ.క్రి. చేపట్టినదెల్లా ఫలవంతమగు, సర్వమూ అనుకూలమగు.

"భాగవతులైనవారు పట్టినదెల్లా నీడేరు
చేగదేర వారలు సేసినదే చేఁత" 3-119

పట్టినదే కందిగురుమన్న కత: నానుడి; (?)

"గరిమఁ బట్టినదే కందిగురుమన్న కత
ఇరవు చూపనేల ఇంటికి రారాదా" 25-378

పట్టినదే చలము: ప.బం; వి. పట్టిందే పంతం.

"పట్టుఁబట్టఁ బాములాయ పంతపుఁ గోరికె లెల్ల

పట్టినదే చలమైతే పలుక నేమున్నది" 8-50

పట్టినదే పంతము : *ప.బం.* పట్టినదే పట్టు.

"పట్టినదే పంతమా పడఁతిఁ బిలువరాదా" 17-328

పట్టినదే వ్రతము : *ప.బం.* పట్టినదే పంతం వంటిది.

"పట్టినదే వ్రతము పడఁతులకుఁ జలము
అట్టి పతులకుఁ జేయక పోరాదు" 18-205

పట్టినవారి చేతి బంగారము : *ప.బం; వి.* అందుబాటులో నుండి కోరినవారి కోరికలు తీర్చేది.

"నెట్టనఁదలఁచేవారి నిండు నిధానమవు
పట్టినవారి చేతి బంగారమవు" 9-219

పట్టినవారి చేబిడ్డ : *ప.బం; వి.* సులభంగా స్వాధీనమయ్యేవాడు. కొందరు చిన్నబిడ్డలు తమను పిలిచినవారందరి దగ్గరకు పోయి వారి లాలనకు పాత్రులౌతారు. దీనిపై వచ్చిన పలుకుబడి.

"పట్టినవారి చేబిడ్డ పరమాత్ముఁడు
బట్టబయటిధనము పరమాత్ముఁడు" 1-410

పట్టినవెల్లా బంగారములు : *ప.బం; వి.* అదృష్టకాలమనే సందర్భంలో వాడబడే పలుకుబడి. అనుకున్న వన్నీ సానుకూలం కావడం.

"యిట్టె యిన్నియు నీకెకు నితనికి
పట్టినవెల్లా బంగారములు" 24-45

పట్టిపట్టి చూచు : *ప.బం; స.క్రి.* మిక్కిలి జాగ్రత్తతో చూచు.

"అట్టడివి మిగులాను ఆతిగుండెవాఁడవు
పట్టిపట్టి చూచి యేల బ్రమసేవయ్యా" 14-175

పట్టుఁబస : *వి.* పట్టులోని సారం.

"వలపు దెలిపి నిన్ను వంచుకొనఁజూచితేను
పలచనే కాని మరి పట్టుఁబస వున్నదా" 16-413

-పట్టు : (25) ఒక కార్యాన్ని మొదలిడి, అందులోనే నిమగ్నమగు, ఒక కార్యంలో ఉన్ముఖుడై అందులోనే నిమగ్నమగు అనే అర్థంలో ధాతువుపై చేరే అనుబంధక్రియ. దీనికి భూతకాల క్రియారూపంలోనే ప్రయోగం.
ఉదా:- చూడనె(నే)పట్టె, చేయనె(నే)పట్టె మొ॥

"కన్నులఁజూడనెపట్టె కాఁకలు సేయనె పట్టె" 6-115

"సరసమాడనేపట్టె చవులు చూడనేపట్టె
ఇరవై పతితో పొందులెప్పుడే నీకు" 28-236

పట్టుగొమ్ము : (2) *ప.బం; వి.* ప్రాపు, ఆశ్రయం, ఆధారం, ఊతకోల, ఉనికిపట్టు.

"పట్టుగొమ్ము యా పడఁతి దేహలత
గట్టిగా శ్రీవేంకటపతికి" 24-45

పట్టుపగటి వెలుగు : *వి.* మిక్కిలి ప్రకాశవంతంగా ఉండేవాడు. 'పట్టుపగటి' అనేది పట్టపగటి కి వ్యావహారిక రూపమా!

"పట్టుపగటి వెలుఁగు పరమాత్ముఁడు
యెట్టయెదుటనే వున్నాఁడిదె పరమాత్ముఁడు" 1-410

పట్టెమంచము : (5) *వి.* నవారుతో అల్లిన మెత్తటి మంచం.

"యెట్టు మొక్కెదవె చెలి యిందాఁక
పట్టెమంచముమీఁదఁబవళించి నీవు" 5-184

పట్టెము : *వి.* 1. ఖడ్గం, కృపాణం 2. కోల 3. ఆయుధం, ఆయుధవిశేషం.

"మోవితేనియలను గమ్ముకొని యాసగించేవు
భావజుని చిగురాకుఁ బట్టెమున్నది" 26-407

పట్ణము : *వి.* మాం. పొట్లం; రా.సీ. వ్యావహారికరూపం.

"తనువిది మూలమంత్రంబులు దాకొని
యుండిన పట్ణము" 3-340

"చెప్పనేల నీ సుద్దులు చెల్లుబడై వుండఁగాను
కప్పిన పట్ణాలు వారు గందమిత్తురా" 18-374

పతన : (2) *వి.* చదవడం. పఠనం అని అమహదేకవచన ప్రత్యయరహితంగా 'పఠన' అని వాడడం విలక్షణం.

"కరివరదుని పేరు గలసిన తిట్లతో
పరదేవతల మంత్రపఠనలు సరియా" 2-405

నరసింహశతకంలో 'పఠన' అనే ప్రయోగం కనిపిస్తుంది.

"పరమమగు వేదాంతపఠన దొరకియు సదా

హరిభక్తి లేని సన్యాసికంటె" 1-318

పడఁతితనము: (పడఁతి + తనము) వి. స్త్రీత్వం.

"వసము గాక నీతో వాదులడు వఁగ లేదు

పస ఇంతే కలది నా పడఁతితనము" 27-186

పడఁదొబ్బు: స.క్రి. పడద్రోయు.

"అండ నూఁటుకొన్న కాయ లట్టె నేఁబరాకైతే

పండెనంటాఁ బడఁదొబ్బి పట్టనియ్యేఁడే" 7-420

పడగ: వి. 1. టెక్కము 2. పాముపడగ. (3. స్త్రీ కర్ణభూషణావిశేషం.)

"తేరుపడగ లవే తెల్లగొడుగు లవే

తోరణంబు లవే సారథి వాఁడే" 12-402

పడగె: (5) వి. 'పడగ'కు రూపాం. టెక్కం. (పాముపడగ, స్త్రీ కర్ణభూషణావిశేషం)

"కూరిమి మట్టములు గోపురంబులును

తేరుపడగెలే తెరువెల్లా" 1-119

పడపు: వి. 1. వ్యభిచారం చేసి చేసే ఆర్జనం 2. ఆర్జితవిత్తం, సంపాదన, ఆర్జనం.

"ఎన్నటి కెన్నటి సుద్దులిఁక నేఁటికి తమ

కన్నెనాఁటిపడపులు కంటివిగా కొత్తలు" 16-323

పడిగము: వి. 1. తములము ఉమిసే పాత్ర 2. కాళాంజి పళ్లెం (క. పడిగ, త. పటిక్కమ్)

"పమ్మిన నవ్వులకెల్లా పడిగమ వైతివి" 21-274

"తలపోసే కాంతల చిత్తములకు నీ వయసు

కలగంపై పడిగముగతి యాయను" 25-398

పడిగాలుపడు: (పడి + కాపులు + పడు) ప.బం; అ.క్రి. ఇది 'పడిగాపులు' కావచ్చు. దర్శనార్థమై పంచలు కాయు, నిరీక్షించియుండు.

"పడిగాపులు పడియున్న ప్రాణాచారముల

పడఁతుల నధములఁ బాలించితి" 1-280

పడిగె: (7) వి. 'పడగ'కు వ్యావహారికరూపం.

"వేయి పడిగెలతోడ వెలసిన శేషుఁడు

చాయమేని తళుకువజ్రాల శేషుఁడు" 3-365

"పడిగె నాఁబడగ నాస్ఫుట దనరారు"

ఆం.భా. 1-148

పడిగెపుది: (పడిగెము + అది) వి. ఉమ్మి ఊసే పాత్ర పట్టుకుని వచ్చే స్త్రీ.

"వింతలుగ నిన్నంత వేసరించఁజాల నన్నా

పంతానఁ దమ్మ వెట్టేవు పడిగెపుదాననా" 21-87

పడిగెము: వి. 'పడిగము'కు వ్యావహారికరూపం. 1. తముల ముమ్మివేసే పాత్ర 2. పాత్ర 3. తాంబూలం అని సారంగ.

"పాయపుమదాన నీ పడిగెము పట్టేదాన

రాయడించి నిన్నింత రవ్వసేసేదాననా" 25-222

పడితళించు: (4) స.క్రి. ఈ పదం ఏ నిఘంటువుల్లోనూ కానరాదు. చరచు, కొట్టు. జూదమాడునపుడు కిందవేయుటకై పాచికలను చేతనుంచుకొని యిటునటు తిప్పు అనే అర్థం ఎక్కడినుండో గ్రహించినాను.

"పందెగాఁడవై నీవే పడితళించరాదా" 25-8

అన్ని ప్రయోగాల్లో పై అర్థం సరిపడడంలేదు. బహుశః ఈ పదం 'పరితళించు' కు రూపాంతరం కావచ్చునేమో! 'పరితళించు' అంటే సూ.ని.లో విచారించు, ఆలోచించు అని అర్థాలు చూపబడ్డాయి. ఈ అర్థం కొన్ని ప్రయోగాల్లో కొంతవరకు యుక్తంగానే ఉంది.

"పాయని చుట్టరికాలు పడితళించఁగవచ్చు

చాయల నీ గురుతులు సరివచ్చి వున్నవి"

7-216

"పందేలాపెతో నాడఁగా పడితాళించితి గదే"

28-348

"పట్టి విడిచిన మాట పడితాళించె నిదివో"

24-146

లేదా 'పటితళించు'కు రూపాంతరం కావచ్చునేమో! 'పటితళించు' కు అప్పళించు, చప్పటించు, చమరు, చఱచు, తట్టు, దబ్బడించు, ఆస్ఫాలించు, ఆస్ఫోటించు అనే అర్థాలు చూపబడ్డాయి. కొన్ని ప్రయోగాల్లో ఈ అర్థాలు కుదురుతున్నట్లుగా కనిపిస్తుంది.

"పంతపు సవతులము పడి తళించుకొంటేను
కొంత గొంత నీవు నవ్వుకొంటా నుండరాదా "
23-329

"బంతినే యిందరిలోనాఁ బడితళించము గాని "
పడితరమునకు రూపాంతరమా? వ్యావహారికమా! పడితరము = భాగ్యము, వంతు, దాని ఛాయార్థముగ వరుసలేర్పాటు చేసుకొనుట కావచ్చు నని సం.ప.స. (23-329)

"పంతపుసవతులము పడితళించుకొంటేను
కొంత గొంత నీవు నవ్వుకొంటా నుండరాదా "
23-329

పడిత్తళ్ అంటే తమిళంలో పరవశము అని అర్థం. అదియే ఇది కావచ్చును. పరవశించు అనీ అర్థం.

"పరవుపై నీవు నేను పడితళించినఁగాక
సరుగ నీ వేల వోజకు వచ్చేవు" 22-345

పడితాళము: పారవశ్యం.

"బడిబడి రతులలో పడితాళాలు
కడఁగి సరసాలలో గబ్బితనాలు" 29-387

పడితాళించు: (3) స.క్రి; చూ: పడితళించు.

"బంటు బంటుతనమా పడితాళించవచ్చీని
దంటఁజేసితివి నీవే తరుణి నింతేసి " 25-254

"పట్టివిడిచిన మాట పడితాళించె నిదివో "
24-146

పడిదె(ద)ము: వి. రూపాం. పడిదియము. ద్రవరూపమగు భక్ష్యవిశేషం, (శ.ర., సూ.ని.) ద్రవరూపమగు వ్యంజన విశేషము, a certain decoction అని బ్రౌన్.

"అప్పడంబులు, వడియములు, దాలింపులు
పలుచని నును వెచ్చ పడిదెములును "
అని జైమినిభారతం (3 ఆ)

"పడిదెంబులాకవాల్ పరిపక్వ ఫలములు " అని కవిరా.

"బిసకిసలయముల వరుగులుఁ
జిరుగడములు బడిదెములు" అనీ కాశీ. 7-185

కానీ జయప్రభగారు తమ అన్నమయ్య పదపరిచయంలో నూనెలో వేచే వస్తువు. అప్పడం, వడియం, బజ్జీ ఇలాంటిది అని అర్థం చెప్పినారు. జైమినిభారతంలో పడిదెములకు వాడిన 'పలుచని' అనే విశేషణం ఇది ద్రవరూపమైన భక్ష్య విశేషమనే ఊహను సమర్థిస్తుంది. 5-163

"వింతబొమ్మ జంకెనలే వేఁడి పడిదాల విందు
అంత సేసీ నీ దేవి యారగించవయ్యా " 21-529

పడుక: వి. 'పడక'కు రూపాం.

"పాలవెల్లి కూఁతురుఁ జేపట్టి పెండ్లాడఁగాను
పాలసముద్రము నీకుఁబడుకాయను " 7-82

పడుచఁడు: వి. పడుచువాఁడు.

"పాలదొంగవై గొల్లపడుచఁడవైతి వంటా
పాలజలనిధిలోనఁ బడఁతి వుట్టె" 20-5

పడుచుమాట: వి. బాలుని మాట.

"పడుచు మాటనకా ప్రహ్లాదునకు
పొడచూపె నాదిపురుషుడు" 1-394

పడుచులాట: వి. పిల్లచేష్ట.

"తహతహలఁగర్మబంధములఁదగిలినయపుడే
అహహ దేహికిఁ బడుచులాటవో బదుకు " 1-473

పడుమటజాము: వి. అపరాహ్ణము.

"పంతము లాడఁగానే పడుమట జామాయ
మంతనమాడే కొద్దికి మద్దేనమాయ " 14-145

పడెగ: వి. పడగ.

"మేటియైన గొంతిదేవి మేనల్లుఁడీతఁడా
కోటికిఁ బడెగెగాను కొండ యెత్తెను " 4-6

పడెచ్చు: వి. 'పడచ్చు'కు వ్యావహారికరూపం? కంసాలి పనిముట్టులలో ఒకటి. ఏదైనా రూపం తొలిచి దానిలో బంగారం వేసి కొడితే ఆరూపు పడేట్లు తయారు చేసిన అచ్చు. (పడియచ్చు = ప్రకృతి ముద్ర సాధనం అని ఆం.ప.ని.) పోతపోయు దిమ్మె.

"ఎనలేక చూచేవు యేపొద్దు నాపెమోము
గొనకొని లక్కఁబడెచ్చున వేసుకోవయ్యా "
18-61

"బచ్చెనరూపులు పెక్కు పడెచ్చుల వేసినట్లు
నిచ్చల నినుచున్నది నీ మాయ" 2-180

పడెడు: (పడి + ఎడు) రెండు సోలల పరిమాణం కల.
"మిగిలిన దీక మీఁదట దేహికి
అగపడు నొక పడెడన్నంబు" 3-557

పతి: ప్రతి, బదులు, మారు.
"సన్నపు బొమ్మల జంకెన చీఁకటి
పన్ని నీవేటికి పతి జల్లేవు" 26-189

పతిజ్ఞలాడు: (పతిజ్ఞలు + ఆడు) 'ప్రతిజ్ఞ'కు వ్యావహారిక రూపం. పంతములాడు, బాసలుచేయు, బిరుదులాడు, సమ్మతులాడు.
"చూడరే యీతని మాట సుదతులాల
పాడిపాడి నాతో నెంత పతిజ్ఞలాడీని" 14-479

పతిన: వి. ప్రతిజ్ఞకు వ్యావహారికరూపం.

పతిమ: (5) వి. 'ప్రతిమ'కు వికృతిరూపం. (క. పతిమె) ప్రతికృతి, బొమ్మ.
"నీ రూపు పతిమ" 4-112
"బంగారుపతిమవంటి పడఁతి నీ మైఁదీఁగె
ముంగిటవేయక యిట్టె ముయ్యవే తరుణి"
6-120

పతిమాటలాడు: అ.క్రి. ఎదురు మాటలాడు, బదులుగా మాటలాడు.
"సతినంటా నీవు నాతో జాణతనాలాడితేను
పతి మాటలాడే నా బాసగొనేనా" 27-265

పతిమె: (3) వి. ప్రతిమ, ప్రతికృతి, బొమ్మ. (క. పతిమె) చూ: పతిమ. అన్నమయ్య ప్రతిమ అనే అర్థంలో పతిమ, పతిమె అనే రెండు రూపాలనూ వాడినాడు.
"బతిమితోడుతఁబైెడి పతిమెఁగైకొంటివి
రతికెక్క నీ చలము రామచంద్ర" 19-165

పతివాది: వి. 'ప్రతివాది'కి వ్యావహారికరూపం. మాఱుపలికేవాడు, విరుద్ధంగా పలికేవాడు.
"ఎదుట మా కల్లా నిజ మేరుపరచఁగ వచ్చి
అదె పతివాది వయ్యే వప్పటి నీవు" 11-287

పతివెట్టు: (2) ప.బం. రక్షణయిచ్చు.
"సతమై శ్రీవేంకటేశ సతులయినవారి
పతివెట్టవలెఁ గాక పచ్చిసేయవలెనా" 17-80

పత్రసాలము: వి. ఈ పదం ప్రసిద్ధమైన తెలుగు నిఘంటువుల్లో కానరాదు. సాలపత్రము కావచ్చు. ఋణపత్రమని అర్థం. కన్నడంలో సాలం అంటే ఋణం అని అర్థం.
"మొలచు జనలోకమునకు నుదుట వ్రాసే
బలుఁడ నీచే నేఁ బత్రసాలమందుకొంటి" 4-421

పదకము: కంఠాభరణవిశేషం.
"పెట్టుకొన్న పదకము పెద్ద అడపమాపెది
నెట్టన నీ సింగారాలు నే నెరఁగనా" 7-432

పదము: వి. సంకీర్తన, కీర్తన. (కాలు, శబ్దం)
"పదములు చెప్పుతాను పాడి యా
యర్థములెల్లా
సుదతులకెల్లాఁ జెప్పి చూపును సుండి" 26-384

పదరు: అ.క్రి. 1. తొందరపడు 2. తహతహపడు 3.కోపించు 4. క్షోభించు 5. చలించు 6. మత్సరించు 7.పలుకు 8. ప్రేలు 9. దంభాలు పలుకు 10. కూయు 11.అరచు 12. దడ, వణకు. అప్పకవి దీనిని శకటరేఫ యుక్తంగా గ్రహించినాడు. శ.ర.లో సాధురేఫ సహితంగానే ఉంది. నిర్ధారక ప్రయోగాలు లేవని సూ.ని.
"పదరుచు లేచి నీ పంజని యెదురేఁగు
ఉదయచందురుఁడని వూహించఁడు" 13-142
వి. 1. త్వరితోక్తి 2. పలుకు, మాట.
"చాయల సన్నల పదరులు సరిఁదెర కాల్చిన
నేర్పులు
పాయని నీ వూడిగముల పడఁతుల కమరె"
7-131
"సిగ్గుతో నవ్వుటకుంటే చిమ్ముదిట్టులే ఇతవు
బగ్గన నీకు మొక్కేము పదరకుమయ్యా"
26-132

పదారంగుళాల ప్రాణము: వి. శరీరం సాధారణంగా పదహారు అంగుళాల పొడవు

వుంటుందని అంతపొడవు గల శరీరమనే అర్థంలో వాడబడింది.

"లచ్చనఁ బదారంగుళాల ప్రాణమింతే
కుచ్చి కాలపుదినాలు గొలచీని" 2-427

పదిఁబది(గా) : (2) మాం. తప్పక, సరిగా, ఖండితంగా, పదిగా, (పదికి పదిమార్లు అని వాచ్యార్థం.) "పదీపదిగా చెప్పినానని చెప్పు" అని రాయలసీమ వాడుక. రూపాం. పదియుఁ బదియుఁ గాను, పదింబది.

"పదిఁబదిగా నీ నోము ఫలియించె నిపుడు"
22-249

పదిటిలోపల పదనకొండు (పదునొకం?) : *ప.బం;* సర్వ సామాన్యుడు, అందరితోపాటు ఒకడు. అంతయినప్పుడు మరికొంచెమైతే ఏమి ? అని భావం. తెగింపు ; రూపాం. పదుగురిలో పదునొకడగు.

"పదిటిలోపల నేము పదనకుం (దునొకం)డు
యెదుట నుండఁగాఁగాక యెంత లేదు" 13-467

పదియుఁ బదియుగాను : *క్రి.విణ; ప.బం.* తప్పక, సరిగా, ఖండితంగా.

"పదియుఁబదియుగాను పతి నీకె వలచెను
పొదిగి నీ రమణుని భోగించవమ్మా" 26-89

"ఏఁటిదే మా వలపు యింతా నీదే వలపు
రోఁటితేఁ బదియుఁ బది రొక్క మాయ వలపు"
27-390

పదిలించు : పదిలపరచు.

పదివేలు : *ప.బం;* అదృష్టం, భాగ్యం, అమూల్యం.

"యిచ్చకాన నీకు నాకు నేఁటి మొగమోటమింక
వచ్చినదే పదివేలు వాదులాటే చాలును"
11-579

పదివేలు వచ్చు : (2) *ప.బం; అ.క్రి.* కావలసినదంతా సంతృప్తికరంగా వచ్చు.

"పోపో యింకా నేఁటికి పొద్దువోదా
పైపై నీకు మొక్కేము పదివేలు వచ్చెను"
16-201

పదుమనాభుఁడు : వి. పద్మనాభుడుకు వ్యావహారికరూపం. విష్ణుమూర్తి. 'ద్మ' లో మధ్య ఉకారం చేరింది.

"పాటిగంపనీళ్లు నించేవు పదుమనాభ
బాటలాయె నీ గుట్టు పదుమనాభ" 15-247

పద్దేలు : *వి; బహు.* 'పద్యాలు'కు వ్యావహారికరూపం.

"నాడొడి మాటనె నా పే రేలడిగేవు
చేడెలపైఁ బద్దేలు చెప్పుదువో నీవు" 10-2-34

పద్మణి జాతి : వి. పద్మిని యను స్త్రీ జాతి విశేషం. ఇట 'న' కారానికి బదులు 'ణ' కారాన్ని ప్రయోగించడం విలక్షణం.

"సారెకు నతనితో చల్లలమ్మెడిని
భారపుటలపుల పద్మణిజాతి" 5-92

పనికివచ్చు : *ప.బం; అ.క్రి.* ఉపయోగపడు.

"అనుమానమైనందుకు అన్ని యాసలు వెట్టిన
పనికివచ్చునో రాదో భావించరాదు" 11-394

"భావించి యెవ్వతెకైనాఁ బనికివచ్చేవా నేఁడు
నీ వోజ నిలుచుఁగాక నేర్పులు వచ్చీనా" 25-24

పనిగొను : *ప.బం; స.క్రి.* 1. వశపఱచుకొను 2. ఆజ్ఞాపించు 3. సేవింపజేసుకొను 4. పూనుకొను 5. సేవించు 6. నడపు *అ.క్రి.* అతిశయించు, విజృంభించు.

"తడఁబడి మాటాడేవు తలఁపెక్కడి పరాకో
బడిఁబెట్టు కెవ్వతైనా పనిగొనెనో" 23-261

పనిపాటలు : వి. పనులు అనే అర్థంలో జంటపదం.

"చిమ్ముచు నాతఁడు నేమించిన పనిపాటలలో
వుమ్మడిఁజేసేటి వట్టి వూడిగాలే కాక" 2-484

పనిపూని : *ప.బం;* అదేపనిగా, పనిమీద

"పనిపూని కరముతో పాంచజన్యము వట్టి
అనిశముఁ గరుణించీ నాదినారాయణుఁడు"
3-523

పనిమంతుఁడు : (పని+మంతుఁడు) వి. పనిలో నేర్పు గలవాడు. పని అనే దేశ్యశబ్దంపై సంస్కృత సమాసాలపై చేరదగిన మతుప్

ప్రత్యయం రావడం వ్యాకరణనియమ విరుద్ధం. ఈ పదం తెలంగాణంలో ఎక్కువ వాడుకలో ఉంది. చిన్నన్న కూడా ఈ పదాన్ని ప్రయోగించినాడు.

"కొనగోరు నిన్ను సోఁకె కూటములందె కలిగె

పనిమంతుఁడవు వొడఁబాటు లేల" 27-311

"కనకాంబరుని మెచ్చుఁగను పనిమంతు"

అ.చ. 27 పు.

పనిమాలిన: *విణ.* ఉపయోగం లేని, పనికిరాని.

"పనిమాలిన యీ పలు లంపటముల

తనువు వేఁచు టెంతటి పని యిట్లా" 1-260

పనిమాలిన పని: (2) *ప.బం.* లాభంలేని పని.

"పనిమాలిన పనికి భ్రమతువు నీవును

అనిశము మీ సుద్దులే ఆడుకొనే రిందరు"

25-79

పనిమాలు: *ప.బం; అ.క్రి.* అనవసరమగు.

"పనిమాలిన యీ పలులంపటముల

తనువు వేఁచు టెంతటి పని యిట్లా" 1-280

పనిలేదు: *క్రి.రూ.* లాభం లేదు, ఉపయోగం లేదు.

"నిజమాడరా నాతో నీకు నీవే

బజనచెడ్డ వలపు పనిలేదు రా" 19-529

పనిలేదు పాటలేదు: (2) *ప.బం;* ఏమాత్రం పనిలేదు అనే అర్థంలో వాడబడే పదబంధం.

"తనకేమే సారె సారెఁ దడవీ నన్ను

పనిలేదా పాటలేదా పంతగారివాఁడు" 29-96

పనిలేని పని: (10) *ప.బం; వి.* లాభంలేని పని, వ్యర్థమైన పని.

"పనిలేని పనికి పరుల సొమ్ములు దెచ్చి

నినుపుగా నా కిచ్చేవు నీ చిత్తము కొలఁది"

27-245

పనిలేని పనిది: *వి.* నిష్ప్రయోజనమైన పనులు చేసేది.

"పనిలేని పని దాపె పంతము లొల్లని దాపె"

23-253

పనిలేని పాట: (2) *వి.* నిష్ప్రయోజనమైన పని.

"వట్టి యాసలనే యిటువలెనే పోయిన్నాళ్లు

బట్టబయలీఁదితిమి పనిలేని పాట" 1-218

పనిలేని పిలుపు: *వి; ప.బం.* ప్రయోజనం లేని పిలుపు.

"పనిలేని పిలుపు బయలీతవలపు

వొనర నెంత సేసినా వొల్ల నొల్లనే" 26-211

పనిలేవు: *ప.బం; క్రి.రూ.* ప్రయోజనం లేనివి.

"మనసునఁ బుట్టిన మంకుఁగామక్రోధాలు

పనిలేవు తనకంటేఁ బాపమంటదు" 2-228

పనివడు: *ప.బం; అ.క్రి.* 1. పనికలుగు 2. పూనుకొను 3.యత్నించు 4. కోరు 5. వాక్యాలంకారం 6. సాహసించు 7. పనికల్పించుకొను 8. అక్కరపడు.

"పనివడింటికి వచ్చి పరాకు సేసుకుండఁగ

కనుదాఁకా మంచము సంగడి నున్నది" 25-81

పనివనిగా: *క్రి.విణ.* పనిలోపనిగా.

"అప్పుడే బలిమి సేసేవందుకేమి

చిప్పిలఁ బనివనిగాఁ జెప్పర నాతో" 11-155

పనివాటలు: (పని + పాటలు) *ప.బం; బహు.* పనులు అనే అర్థంలో వాడబడే జంటపదం.

"చిమ్ముచు నాతఁడు నేమించిన పనివాటలలో

వుమ్మడిఁజేసేటి వట్టి వూడిగాలే కాక" 2-484

పనివి: ఇది పనికి కావచ్చు. పనుకు ధాతువు క్త్వార్థకరూపం. 'కోపించి' అని అర్థం. పనుకు (?)

"అనలము శీతో భవ యన నేరిచిన సీత

పనివి (పనికి?) రావణ హతో భవ యన నేరదా"

15-263

పనుపడు: *అ.క్రి.* అలవాటుపడు, పూను.

"అనయముఁ దిరువేంకటాధీశ్వరుని

పనుపడి తనలోఁ బాడుచును" 1-130

పన్న(బన్నపందిలి: (?)

"పన్నఁబన్న పందిలాయ బయలు

నిన్ను నాపెఁ జూచుకొంటె నేరము లే మున్నవి"

8-50

పన్నగపు దోమతెర : వి. ఆదిశేషుని రూపంలోని దోమతెర.

"విన్నపాలు వినవలె వింతవింతలు
పన్నగపు దోమతెర పై కెత్తవేలయ్యా" 6-25

పన్నారుకాఁగులు : వి. పన్నారులు = చిన్నపిడుతలు, కాగులు =పెద్ద మట్టిపాత్రలు.

"కతలుగా పన్నారుకాఁగులలో
సతులపై సేసలు చల్లీ వాఁడే" 14-456

పన్నారు దొంతులు : వి. బాలికలాడుకునే చిన్న పిడుత (గురుగు)ల దొంతులు. (బ్రౌన్. పన్నారు = A pot or vase)

"పన్నారు దొంతులెక్కి బానల పెరుగునేయి
చెన్నుమీర నారగించి చేరి నవ్వీని" 24-267

పన్నిద్దరు : (పన్ + ఇద్దరు) వి. పన్నెండుమంది.

"చెంగట నాళువార్లు చేరి పన్నిద్దరు గొల్వ
సంగడిఁ దాఁగొలువిచ్చీ జయనరసింహము"
11-375

పన్నిద్దరు ఆళువార్లు : వి. పంద్రెండుమంది ఆళువార్లు. (ఆళువారు = ద్రావిడప్రబంధకర్త యగు విష్ణుభక్తుడు) వీరిని దివ్యసూరులనియు, నిత్యసూరులనియు వ్యవహరింతురు. వీరు : 1. పూదత్తాళ్వారు (భూతయోగి) 2. పొయిగైయాళ్వారు (సారయోగి) 3. పేయాళ్వారు (మహాయోగి) 4. తిరుమలీశాళ్వారు (భక్తిసారయోగి) 5.నమ్మాళ్వారు (శఠకోపయతి) 6. మధురకవి 7.కులశేఖరాళ్వారు 8. పెరియాళ్వారు (విష్ణుచిత్తుడు) 9.ఆండాళ్ (గోదాదేవి) 10. తొండరడిప్పొడి యాళ్వారు (భక్తాంఘ్రిరేణువు) 11.తిరుమంగైయాళ్వారు (పరకాల యతి) 12.తిరుప్పాణాళ్వారు (యోగివాహయతి)

పన్నిన దొంతులపై నొక్క గుదియపెట్టు : ప.బం. ఎన్నో మంచిపనులు చెఱుపుటకు ఒక్క చెడ్డపని చాలు ననుట.

పన్నుకొను : 1. ఒప్పు కలుగు 2. గట్టిపడు 3. కలుగు 4.పుట్టు 5. జాగరూకత కలుగు 6. నిశ్చయమగు 7.అతిశయించు 8. కమ్ముకొను 9. ధరించు 10. పెట్టుకొను 11. చేసుకొను 12. సిద్ధంచేసుకొను.

"ఎన్నఁటికి జీవుఁడిక నీడేరేది
పన్నుకొనేటి చింతలే బలిసీఁగాని" 2-188

"పన్నుకొన్న వేడుకలు పచరించీఁగాని" 12-81

"పన్నుకొన్న వలపులు పసలబారిఁబడితే
వెన్నెలలు గాసినాను వెట్టయై తోఁచు" 28-589

"యెన్నికసేసుకొంటివి యింతగా మన్నించితివి
పన్నుకొన్న నీ కరుణే పదివేలు నాకు" 12-485

"పన్నుకొంటి సంపదలు పంచభూతాల లోనైతి
యిన్నిటా నీ పంపుననే యిఁకనో బుద్ధి" 3-270

పబ్బు : అ.క్రి. 'ప్రబ్బు'కు వ్యావహారికరూపం. 1. పెరుగు, వర్ధిల్లు, అతిశయించు 2. వ్యాపించు, పర్వు 3. నిల్చు 4.సంధిల్లు, కూడు.

"వుబ్బున నీవు గోరనూఁదినది నెఱఁగదు
పబ్బనది యెటువంటి పరాకో నీమీఁదను"
12-439

పమ్మిని : ఇది 'పమ్మిన' కావచ్చు. అతిశయించిన అని అర్థం.

"కుమ్మరావమునఁ జెంబు కోరి వెదకనేల
పమ్మిని(న) శ్రీపతిఁగొల్చి బదుకరో ప్రజలు"
4-135

పమ్ము : (13) వి. అతిశయం.

"బొమ్మల జంకించుతాను పొంచి యాసలు వెట్టుతా
పమ్ముఁజూపు పంతాలు పచారించుతా" 23-40

పమ్ము : అ.క్రి. 1. అతిశయించు 2. విజృంభించు 3. కలుగు. స.క్రి. 1. కవియు 2. నిర్మించు 3. కత్తి మొ॥ విసరు 4.వర్ణించు 5. అంచులు మడిచి కుట్టు.

"వుమ్మడి మెడనూళ్లు వుయ్యాల సరపణులు
పమ్మి శ్రీ వేంకటేశ నీ భావమే భోగము" 9-299

"ఉమ్మడి పంతాలు వొక్కరొక్క రాడుకొంటేను
పమ్మి అవి దిద్ద నీ పాల నుండును" 21-210

పయికొసరు: వి. ఏదైనా వస్తువు కొన్న తరువాత అదనంగా ఉచితంగా అడిగే వస్తువు.

"దయతో నాపె నేలి మంతనమాడితి విందాకా
భయము దీర్చితి విట్టె పయికొసరా నేను" 21-72

పయిపచారములు: వి; బహు. (?)

"పవ్వళించి మాతో పని పయిపచారము లింతే
నివ్వటిల్లు నీతో పొందు నే నెఱఁగనా" 27-168

పయిరుసేయు: అ.క్రి. సాగుచేయు, పైరుచేయు. 13-83

పయ్యరగాలి: (3) వి. పైరగాలి, దక్షిణపుగాలి, చల్లగాలి. రూపాం. పయరగాలి, పైరగాలి.

"బలువూరుపులు దాఁగె పయ్యరగాలి రేఁగె
కులుకుమాట లణఁగె కోవిలలు గొణఁగె" 22-29

పయ్యాడించు: ప.బం; స.క్రి. సం.ప.స. లో ఈ పదానికి ఈ విధమైన వివరణ కనిపిస్తుంది. పయ్య = విభాగము అని కన్నడము. పయ్య + ఆడు = వేరుపడు; పయ్యాడించు = వేరుపరచి కావచ్చును. 547వ పాటలో పయ్యాడితే అను పలుకుబడి గలదు. అక్కడ కూడ నీ యర్థము సరిపడును.

"ఆలరీఁడ రుక్మిణిఁ బయ్యాడించి తెచ్చి నలవాట
పొలిమి (మీ)తో నంటుఁగాక పోనిచ్చుటయా" 14-32

పయ్యాడినవారు: (పయి + ఆడినవారు) వి; బహు. వేశ్యలు.

"పయ్యాడినవారి చేతి బాగా లందుకో నీవే
యియ్యకోలై ఆకు మడిచిచ్చేఁగాని"

పయ్యాడు: (6) వేరుపడు, ఆవహించు. చూ: పయ్యాడించు.

"పయ్యాడి యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
వొయ్యనే రతుల న న్నోలలారిచీనే" 29-470

పయ్యాడువారు: ప.బం; బహు. వేశ్యలు.

పరఁదు: వి. పద్దు, లెక్క. (వ్యు.)

"నరహరి కరుణే నమ్మినవారికి
పరఁదున నిక భయపడఁజోటేది" 4-380

పరఁదుకొను: అ.క్రి. దాగుకొను (?), వ్యాపించు (?)

"యెంతని పరఁదుకొనే విందిరానాథుఁడా
అంతరంగముల నుండె అందరిలోన" 10-41

పరంజోతి: వి. 'పరంజ్యోతి'కి వ్యావహారికరూపం, ఉత్కృష్టమైన జ్యోతి.

"పైకొని వెలిఁగేటి పరంజోతియై(యౌ)
సౌకుమారునకు శరణ్యము" 4-376

పరంపరము: వి. పరంపర. స్త్రీలింగ శబ్దమైన పరంపర శబ్దానికి 'ము' విభక్తి చేరడం విలక్షణం.

"నిరతంబును నీ మాయే పరం
పరములాయ పాపవే నీ మాయ" 4-67

పరకట: పరస్థలంలో, ప్రక్కన, (పరకడ = ఇతరస్థలం, పార్శ్వం) రేపకడ, ఉదయాన్నే.

"పాపముఁబుణ్యము పరకట నున్నది
చేపట్టుము నీ చేతిది ప్రాణి" 3-394

పరకళ్లు: ఈ పదం నిఘంటువుల్లో లేదు. ఇది 'పరగడ(లు)' కావచ్చు. పర(అ)గడ అంటే పరిసరం, పార్శ్వం, ఇతరస్థలం, ఊరిబయటి బీడు, బయలు అనే అర్థాలు ఉన్నాయి. ఉదాహృతకీర్తనలో ఈ అర్థం సరిపోతుంది.

"గొందిఁ బంటసేయువాఁడు కొలుచులు పరకళ్లఁ
జిందకుండా గాదెఁబోసి చేరి కాచీని" 4-437

పరకాయప్రవేశము: వి. ఇతరుల శరీరంలో ప్రవేశించడమనే ఒక విద్య.

"పరమాత్మునిపై నాత్మ ప్రవేశింపఁజేయుటే
పరికింపఁ బరకాయప్రవేశము" 11-258

పరగడుపు: (పరము + కడుపు) వి. ఉదయం నుండీ ఏమీ తిండిలేని కడుపు, ఖాళీ కడుపు. రూపాం. పడిగడుపు. (తె.)

"పట్టి విడె మడిగేవు పరగడుపున వచ్చి
వొట్టి యాపె వూడిగాల కూరటా నేను" 27-317

పరచు: కులట, వ్యభిచారిణి.

"శిరసుండ మోకాల సేసవెట్టిన యట్లు
పరమధర్మము మాని పరచు (?) గా వలసె" 15-120

"చేఁతలు యీ గుణమైన సిగ్గుపడవలదా
బాఁతిపడి విషయాలఁ బర చయ్యాఁగాక" 9-147
"కాంతుఁడ యిటు గాకున్న కన్నవారి వెంటనెల్లా
పంతపు నీ మనసిది పరచై తిరుగుఁగా" 3-436

పరచుఁదనము : (పరచు + తనము) వి. జారత్వం, వ్యభిచారం, దుష్టత్వం, కాఠిన్యం.
"మరలి పద్మజుని మనుమని నైనఁ జంపీనే
పరచుఁదనమున వృథా పాలుమాలీనే" 6-22

పరతంత్రము : వి. పారతంత్ర్యం, ఇతరుల అధీనంలో ఉండడం. ధర్మవాచకానికి బదులుగా ధర్మివాచకం ప్రయోగింపబడింది.
"బలిమి స్వతంత్రముఁ బరతంత్ర మొకరికి
యెలమి నిందులోఁజెల్లే హీనాధికములే" 2-78

పరభారము : వి. 'పెద్దబాధ్యత' అని అర్థము కావచ్చును. సం.ప.స. 16 సం.
"నెలఁత పరభారము నీది కాదా
పలుమారు నిది యాల పచ్చిసేసేవయ్యా"
16-532

పరభారాలు : వి; బహు. ఎక్కువైన బరువులు, పరలోకపు భారములు.
"యేవల మా పరభారాలంతయు నీ కెక్కినది
ఆవటించి నే నీ శరణన్నదే మా వ్రతము " 2-512

పరభావము : వి. పెద్ద బాధ్యత .
"నెలఁత పరభావము నీది కాదా
పలుమారు నిది యాల పచ్చి సేసేవయ్యా"
16-532

పరమాతుము : వి. పరమాత్మ. ఆత్మ శబ్దాన్ని అన్నమయ్య ఆతుమ అనే ప్రయోగించినాడు. చూ: ఆత్మ.
"పరమాతుమ పరమాణురూప శ్రీ
తిరువేంకటగిరిదేవ శరణు" 1-155

పరవంజుకొను : స.క్రి. కమ్ముకొను , వ్యాపించు, ఆవరించు, ప్రసరించు, క్రమ్ము. (బ్రౌన్)
"చూపరఁబసురము తొరలువోయినను సొమ్ము
గలుగువాఁడే పరవంజుక
పైపైఁ దానే వెదకి తెచ్చి కాపాడఁగ నతనికి
భారముగాన" 3-392
"బాదల సంసారము పరవంజుకొని తొల్లి
యేది నమ్మి వాటువడె నీ జీవుఁడు " 3-79

పరవశము : (36) వి. పారవశ్యం. ధర్మార్థకానికి బదులుగా ధర్మివాచకపదం వాడబడింది.
"వనితలు రతిపరవశమున మురిపెపు
కనుఁగవ చూపులఁగరఁగుచును" 5-293

పరవిడుచు : స.క్రి. వదలివేయు .
"పొదలుచు మృత్యువు పందినోటై నల్లెట
నాడఁగ
పదిలముగాఁ గింకరులను చొప్పరులఁ
బరవిడిచీ" 1-298

పరసిపోవు : అ.క్రి. మాసిపోవు, నశించిపోవు, క్షీణించు.
"పట్టె మదనుభూతము పరసిపోయను బుద్ధి
వట్టి పెద్దతనాలను వచ్చే దేమీ" 2-176
"పరగి నాలుక సొం(యిం)పు పరసిపోయ
పరులనే నుతించి పలుమారును"
"బత్తి సేసితేఁ జలము పరిసిపోవు
పొత్తు గలసితే పొరపొచ్చ మేడది" 29-57
చి.సూ. ధాతుమాలలో ఉపద్రవం తప్పిపోవు అనే అర్థం చూపబడింది.

పరాకు : వి. 'పరాఙ్ముఖ' శబ్దభవం. పరవశత, మగ్నత.
"బగివాయ కాపెమీఁది పరాకున నున్నవేళ
నగినదే చాలదా నాతో నీవు" 19-189

పరి(ఱి)గలేరు : కోసేప్పుడు చేలో రాలిన ఎన్నులను ఏరుకొను.
"పరిగలేరేటివానిఁ బట్టపురాజుగా
నిరతభోగము లిచ్చి నిలిపినట్లు" 1-282
'పఱిగయేరితే పాతర నిండుతుందా' అని సామెత.

పరి(ఱి)గ లేరేటివాఁడు : వి. చేలో రాలిన ఎన్నులను ఏరుకొని జీవించే బీదవాడు.
"పరిగలేరేటివానిఁ బట్టపురాజుగా

నిరతభోగములిచ్చి నిలిపినట్లు” 1-282

పరి(ఱి)వోవు: *ప.బం; అ.*క్రి. నిఘంటువుల్లో ఇది బండి 'ఱ' తో కనిపిస్తుంది. బండి 'ఱ'తో కూడిన పదాన్నికూడా అన్నమయ్య ప్రయోగించినాడు. 1. కొల్లపోవు 2. నశించు 3. కొఱతపడు 4. చెడిపోవు.

"పాలుమావి వుండినాను పరివోవుఁగాలము
కూళగోష్ఠి నుండినాను కొంచపడుఁగాలము" 15-270

పరి: అవ్య. అనేకపర్యాయాలు.

"పలు జన్మములే నన్ను పరి అరికట్టుకోఁగా
తొలఁగఁదోసి నాకుఁ దోడైతివి" 1-475

-పరి: పర్యాయం, మాఱు, వరుస

"పలుజన్మములే నన్ను పరి అరికట్టుకోఁగా
తొలఁగఁదోసి నాకుఁ దోడైతివి" 1-45

పరికరములు: *వి; బహు.* శ్రీ వైష్ణవమున చిదచిత్తులు. భగవంతుని క్రీడార్థం ఆకృతులు కల్పింపబడి, సృష్టంపబడిన పదార్థములు. ఈ పదార్థములకు సంప్రదాయంలో పరికరములని వ్యవహారం.

పరికెలువెట్టు: *ప.బం; అ.*క్రి. నిందలువేయు, ఆక్షేపణలు చేయు

"దొరకొని దైవముతో మాటలాడఁగ
పరికెలువెట్టఁగఁ బాడౌనా" 6-93

పరిగె లేరేవానిని పట్టపురాజు చేయుట: ప.బం. ఒక సామాన్యుణ్ణి గొప్ప స్థానంలో ఉంచడం.

పరిచారకపుది: (పరిచారకము + అది) పరిచర్య చేసేది, పరిచారకురాలు. ఇట పరిచర్య అనే అర్థంలో పరిచారకము అని ప్రయోగించడం విలక్షణం.

"పరిచారకపుదానఁ బైకొని నన్నేలితివి
యిరవైన మగువ నన్నెట్టు నవ్వునో" 14-25

పరిచ్ఛిన్నుఁడు: వి. దేశకాలాదులకు లోబడినవాడు.

"పరిపూర్ణుఁడగు నిన్నుఁ బరిచ్ఛిన్నునిఁగా
నరయుట యది నా యపరాధము" 1-271

పరిచ్ఛేది: (?)

పరిజించు: స.క్రి. పరుజుతో (కత్తిపిడి) పట్టు.

"వాఁడి బిల్లకత్తి వలచేతఁ బరిజించి
పోఁడిమి బాలడ సంకుపోచి నాడించి (?)" 17-230

పరితవించు: స.క్రి. ధరించు, పూయు.

"దొరకొని హేయమే తోడేటివాఁడు
పరితవించును మేనఁ బరిమళము" 4 అను. 26

పరిణతలు: *వి; బహు.* ఇది 'పరిణతులు' కావచ్చు. నమస్కారాలని అర్థం.

"బలసి మునుల యాపదలు వాపుటకు
బలునృపభంజను పరిణతులే" 1-335

పరిణమించుకొను: అ.క్రి. సంతోషించుకొను.

"పంతమిచ్చి నవ్వించగఁ బరిణమించుకొంటిని
యెంత లేదు నీ సుద్దులు యెంచవచ్చునా" 7-8

పరిణామము: (2) వి. క్షేమం, సంతోషం.

"ఎక్కడి దిక పరిణామము యీ
మదనానలమున"

"పక్కన సీతకుఁ బరిణామమాయ
నిక్కము రావణ నీకో బ్రదుకు" 3-31

పరిణామించు: సంతోషించు, సుఖించు.

"పచ్చి నీ గుణములకు పరిణామించుట గాక
కెచ్చురేఁగి బొమ్మల జంకించవచ్చునా" 9-5

పరిణాము: వి. పరిణామశబ్దభవం. తీర్మానమని అర్థం. పరిణాపుమాలు ఇత్యాదుల సామాసిక పుంప్వాదేశములు గూడ గలవు. (సం.ప.స. 14 సం. 352 పు.)

"అన్నిటాఁ బరిణామైతే నదే చాలు
వున్నతపుసంతోసాన నున్నాఁడవా" 14-37

"పాయపుఁబతికినిఁ బరిణాము చెప్పి
మోయునుఁ దనకిటు మొక్కితి ననవే" 19-334

పరిపరి జవ్వనము: వి. బహుప్రకారమైన యౌవనం.

"పరిపరిజవ్వనముపై పరవశమో
మరుసముకములోని మాటల తేటలో" 24-139

పరిబాస : వి. 'పరిభాష' శబ్దానికి వికృతిరూపం. సంకేతం, నియమం.

"అలివేణి మదిలోని అడియాసలు
పలుకుల వినయపు పరిబాసలు" 29-389

పరియంకము : (2) వి. 'పర్యంకము'నకు వ్యావహారిక రూపం. మంచం.

"పరియంకంబునఁ బవళించెదవో
సిరుల విభవములఁ జెలఁగెదవో" 5-19

పరివిడుచు : స.క్రి. పాఱవిడుచు.

పరిసరుఁడు : వి. సమీపంలో ఉండేవాడు, సమీపస్థుడు, పరిజనుడు.

"సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు
హితులు గొలువఁగా నిందరును" 1-346

పరిహరము : వి. పరిహారము, విడుపు.

"నెత్తమ్మి తావుల నిట్టూర్పుగములు
కొత్తగు బడలికకును పరిహరము" 24-45

పరుజు : వి. (కత్తి)పిడి.

"వాడివో కంటి రటవే వన్నెలవాఁడు
పైడిమోలము కటారుపరుజులవాఁడు" 17-116

పరుబోఁకి : వి; మాం. పనికిమాలినవాడు, నీచార్థంలో తిట్టు. బోకి అంటే కుండపెంకు. నీచార్థంలో వ్యక్తిని తిట్టడంలోనూ బోకి అని తిట్టడం ఉంది. 'పోరంబోకు' అనే పదానికి వికృతిరూపం.

"పుట్టుమాలిన పరుబోఁకిని నన్ను
దిట్టే వదే మోసి దిమ్మరిమాయ" 1-107

పరువతము : వి. పర్వతము. ఈ విధంగా సంయుక్తాక్షరాల నడుమ అచ్చు చేరడం శివకవుల ప్రయోగాల్లో కనిపిస్తుంది.

"పరువతమేగిన బత్తుఁడనైతి" 1-19

పరు(స)ష : (18) వి. తీర్థయాత్రలు చేసేవారి సమూహం, తిరునాళ్లకు వెళ్లేవారి గుంపు, తైర్థిక సమూహం. (పరుస = బాటసారుల గుంపు అని వాచ; శ.ర.)

"పరుస యనఁ దైర్థిక సభాఖ్య పరుగుచుండు"
అని ఆం.భా. 2-171

"సరుసనే జనులకు స్వప్నములో మాటలాడి
పరుషలకు వరాలు పైపై నిచ్చీని" 15-436

కళాపూర్ణోదయంలో 'పరుసవారు' అనే ప్రయోగం కనిపిస్తుంది. (6-6)

"గరుడధ్వజంబెక్కి కమలాక్షు పెండ్లికి
పరుస లదివో వచ్చె పైపై సేవించుచును" 3-21

"కోవరమై యేఁటనేఁటాఁ గోరి వరములకుఁగా
కావించి పరుష వచ్చే కత చూచుకోరయ్యా"
3-134

సంత అనే అర్థంలో 'పరుష' అనే పదం రా.సీ. లో నేటికీ వ్యవహారంలో ఉంది. పశువుల పరుష మొ॥

పరుసము : (11) వి. పరుసవేది, లోహాలను బంగారు చేసేది, స్పర్శవేది.

"పక్కన లోహముఁ బరుసము దాఁకిన
యెక్కువ నంతా హేమమే కాదా" 3-539

"పరుసము సోకిన బంగారము వలె
పరమభాగవతపట్టములు" 4-381

పఱగడ : ఇతరస్థలం, పార్శ్వం.

పఱచ : వి. ధూర్తురాలు, కులట, వ్యభిచారిణి. (వ్యు.)

"పఱచైన జవరాలు పరులెల్ల మగ లంట
వొఱపు నిలిపి నట్లోహో నేము" 1-94

"తఱచు మాఁటలాడితే తప్పు లెన్నైనా దొరలు
పఱచై తిరిగితేను పాపమంటును" 4-516

పఱపు : వి. పడక.

"పఱపుపై నీకు నాపె పాదములు గుద్దఁగాను
తఱితోడి వలపులు దైవారవా" 26-335

పఱివోవు : ప.బం; అ.క్రి. వెనక్కిపోవు, మరలు, వెనుదీయు, నశించు, కొల్లపోవు, క్షీణించు.

"పఱివోని యాస దనుఁబట్టుకొను భూతమని
వెఱచినది యదిగదా విజ్ఞానమహిమ" 1-181

పలు : వి. పల్లు.

"సుడిగొని నీ పలు సోఁకఁగ సోఁకఁగ
వడిగొని మై మరవక మరచె" 7-304

పలుకుఁదేనెల తల్లి : వాఙ్మాధుర్యం కల తల్లి, సరస్వతి.
"పలుకుఁదేనెల తల్లి పవళించెను
కలికితనముల విభునిఁ గలసినది గాన" 6-74

పలుకు పంతము చెల్లు : ప.బం; అ.క్రి. మాట చెల్లు.
"పిలిచి శ్రీవేంకటేశ పెనఁగి నన్నుఁగూడితివ
పలుకుఁబంతాన నీ నా బలువింతే కాక" 11-253

పలుకుల కొనవాఁడు : వి. ఉపనిషత్తుల్లో ప్రతిపాదింపబడినవాఁడు. (పలుకులకొనలు = ఉపనిషత్తులు)
"పలికి చూచినాను పలుకక మానినాను
పలుకుల కొనవాఁడు దైవమొక్కఁడే" 3-380

పలుగాకి : వి; ప.బం. దుష్టుడు, తుంటరి.
"తల్లిదండ్రి వెంచనట్టి తగుఁబలుగాకి
చల్లుఁబుప్పొడి దొంగిలిన జాజరకాఁడు" 7-324

పలుపు : వి. పసుల మెడ గట్టెడి తలుగు, ఆబంధము.
"పలు పొకచో నుండఁగా భావమెట్టు గరఁగీని
బలిమి నే నెటువలెఁ బైకొందునే యతని" 28-21

పలుసోఁకు : వి. దంతక్షతం. చూ : పల్లుసోకు.
"ముంచిన పలుసోకులె ముయికి ముయి"
9-129
"మోవిపై పలుసోఁకులు మోపకు నీవంత మమ్మ
యీవేళ నన్నుఁ గూడితి వింత చాలదా" 12-11

పల్లకట్టు : వి. పల్లవన్నె చూపేది, పల్లవన్నె కలిగి కనబడేది.
"వలపు చప్పఁజేసెటి వగకాఁడ నీ
బలిమి నా మనసుకుఁ బల్లకట్టవలెనా" 11-159

పల్లటీఁడు : వి. పల్లటి, విలాసకాడు.
"పంతమాడనేర నా పల్లటీఁడు నాయకుఁడు
అంతరంగము దెలిసెననీ కాక" 8-189

పల్లదనము : (6) వి. 'ప్రల్లదనము'నకు వ్యావహారికరూపం. 1.అప్రియవచనం, పరుషవచనం, దుర్భాషణం 2.పౌరుష్యం 3. దౌష్ట్యం 4. దుష్కార్యం 5. వ్యర్థభాషణం. విణ. గర్వంతోకూడిన.
"బల్లిదురాలాకె గొన్న బాస దప్పినాఁ దప్పీని
పల్లదాన నిఁక నీవు పట్టకురా నన్ను" 7-45

పల్లదము : వి. పారుష్యం, ధూర్తత్వం, దౌష్ట్యం, వ్యర్థభాషణం, గర్వం. విణ. గర్వంతో కూడిన.
"పల్లదపుజవ్వనము పంచపాలై మరి
నుల్లసాన నవ్వుతాను ఊడిగాలు సేసేవే" 16-53

పల్లదీఁడు : (3) (పల్లదము + ఈడు) వి. పౌరుష్యం కలవాడు, చెడ్డవాడు, వదరుబోతు, దుష్టుడు, పరుషవాక్యాలు పలికేవాడు.
"బాలుఁడటవే సాదటవే వీఁడు పల్లదీఁడు గాక
కీలుముందై తనమాఁటలే గొలువ గొబ్బనఁ
దగవు చెప్పీనమ్మా" 10-2-111
"పల్లదీఁడైనవాఁడు పచ్చిమాఁట లాడితేను
వుల్లములో నుడి(డు)కెత్త దువిదకును" 27-66

పల్లదొరలు : వి; బహు. సందర్భాన్ని పట్టి ఒకానొక ఎఱ్ఱని ఫలవిశేషమని తోస్తుంది.
"పండెఁబో నీ కెమ్మోవిఁ బల్ల దొర లింతలోనె
నిండెఁబో చల్లనిగాలి నీ వూర్పుల" 26-42

పల్లవరాయని మటము : వి. తిరుపతిలో పల్లవరాయడు (వానె దుత్తకై యలగియార్) కట్టించిన మఠం. కపిలతీర్థం వద్దనున్న నమ్మాళ్వారి గోపురకుడ్యంపైని శాసనంలో దీని ప్రసక్తి ఉంది.
"అక్కజంబైన పల్లవరాయని మటము" 1-227

పల్లాండు : వి. శ్రీవైష్ణవులు పాడే ఆశీర్వచనగీతం. పల్లాండు పల్లాండు అని ప్రారంభమౌతుంది.
"పచ్చవిలువాని తల్లి బంగారుదోసిట నీపైఁ
బచ్చకప్పురము చల్లీఁ బల్లాండు పల్లాండే"
5-188

పల్లించు : స.క్రి. జీనుకట్టు (శ.దీ.) ఆయత్తంచేయు - సాధించు, దిద్దు (ఆ.మూ.)
"పల్లించిన నీ పసిఁడి గరుడని కెల్లున నీ వెక్కిన
యపుడు" 1-92
"తొల్లిట జన్మాదుల గాని నరరూపు
పల్లించుకొన్న యీ బ్రదుకు"

పల్లుసోఁకు : (2) వి. దంతక్షతం.
"యెల్లగా శ్రీవేంకటేశ యేలితివి మమ్మునిట్టె
పల్లుసోఁకు మా గురుతు బాగౌనా నీకు"
14-162

పళావళి : వి. ఈ పదం నిఘంటువుల్లో కానరాదు. 'పాలవెల్లి'కి వ్యావహారికరూపం కావచ్చు. (f.n. 22-240)
"చక్కిలాలు నురుగులు సరిఁ బళావళి గట్టి
మొక్కరో యీ బాలునికి ముద్దుగారీని" 22-239

పళి : వి. నింద అని తమిళం. తెనుగు ప్రయి ఇదే. (సం.ప.స. 14 సం. 352 పు.)
"చిగురువంటివారము చివికేవారము గాము
పగ నీమీఁదనే వచ్చి పళియై నిలుచును"
14-276

పళువరించు : స.క్రి. ఇది పశువరించు కావచ్చు. బలిపెట్టు. (పశువుగా చేయు)

పళ్లి : వి. ఇది కన్నడపదం. బడి అని అర్థం.
"కూపుదాఁకా నేరుపులే మాతోఁ బచరించేవు
యే పళ్లిఁ జదివితివో యింతేసి నీవు" 29-237
"వొద్దికనేఁ జెనకితే నొడ్డించుకొనేవు యీ
విద్దెలు యే పళ్లిఁ జదివితివయ్యా" 28-547

పళ్లిభోగము : వి. దేవునికి చేసే భోగాలు, భక్ష్యభోజ్యాది కైంకర్యాలు.
"పదివేలు పళ్యాల పళ్లి భోగము నీ
వదన నారగింతు వప్పాలతో" 5-198

పళ్లెములో కూడు : ప.బం; వి. సిద్ధాన్నం, సులభంగా లభ్యమయ్యేది.
"పూఁత నీ గర్వముల చూపులే వారకములు
లేఁత నీ నగవులే పళ్ళెములో కూడు" 5-206

పవడపుమోవిది : (పవడము + మోవి + అది) వి. పగడము వలె ఎఱ్ఱనైన పెదవి గల స్త్రీ, స్త్రీ.
"పవడపుమోవిదాన భారపుగుబ్బలదాన
సవరపుఁగొప్పుదాన చక్కనిదాన" 29-409

పవడవాతెర : (పవడము + వాయ + తెర) వి. పగడము వంటి పెదవి.
"వువిద మోము కళలుప్పతిలీ నివె
పవడ వాతెరయుఁ బండె యిదె" 28-168

పస : (2) వి. సారం, నిగ్గు, కాంతి, నత్త, సారస్యం, సమృద్ధి, చాతుర్యం.
"పానుపుపై నుండఁగాను పసలుగా నన్నుఁగూడె
యే నెలఁతల నేలెనో యితఁడు" 13-44

పసని వజ్రము : వి. ఎఱుపు మించిన పసుపు వన్నె గల వజ్రము.
"పలికినవెల్లాఁ బసని వజ్రములు
నిలువునఁ దురుమే నీలములు" 24-47

పసపుఁజీరవాఁడు : వి. పీతాంబరుడు, విష్ణుమూర్తి, పసుపువర్ణం కల వస్త్రం ధరించినవాఁడు అని వ్యుత్పత్తి.
"పసపుఁజీరవానిఁ బట్టుమని యాడితేను
దెసల మాబోఁటి కెట్టు దెలియఁగవచ్చునే"
24-86

పసిఁడి చీరవాఁడు : పీతాంబరుడు, విష్ణుమూర్తి. పసిఁడి వర్ణం కల వస్త్రం ధరించినవాడు అని వ్యుత్పత్తి.
"పసిఁడిచీరవాఁడవు పాలు దచ్చితివి గాన
పసిఁడిఁ బోలినది చేపట్టెను నీ కరము" 22-64

పసిఁడిలో పరిమళమగు : *ప.బం; అ.క్రి.* బంగారానికి తావి అబ్బు, గుణాధిక్యం కలుగు, అపురూపమగు.
"అలరి శ్రీవేంకటేశ ఆదరించినది
ఫలియించి పసిఁడిలోఁ బరిమళమాయ"
21-445

పసిగొను : *ప.బం; అ.క్రి.* తావిని గ్రహించు, వాసన పట్టు, మూర్కొను. (వ్యు.)
"పసిగొని ఋణానుబంధము కొలఁదే
పసులునుఁ బడతులు బహుసుతులు" 2-422
"పరమపదంబను చేనికి పసిగొను
నరమృగములకును
తరమిడి సంసారపుటోదములనె యాగించ"
1-298

పసిచల్ల : వి. ఆవుచల్ల. 'పసి'అనే పదానికి ఆవు అనే అర్థంలో ప్రయోగం ఉంది. (79 పుట. 12 పం.)

"పసిచల్లమ్మే గొల్లపడుచా నీవె
పసివడి తిరిగేవు బడివాయక" 5-197

పసిడిబద్దలవారు : *వి; బహు.* బంగారు వేత్రములు హస్తములందు ధరించినవారు.

పసిబాల : వి. పసిబిడ్డ, శిశువు.

"చూడఁ బసిబాల గాని జూటు గదమ్మా తా
నాడినట్టె ఆడకుంటే నగ్గల మయ్యీని" 24-60

పసిబాలనాఁడు : పసిబిడ్డవయస్సులో, శైశవంలో.

"పసిబాలనాఁడు నీవు బండికిఁ బాదము చాఁచి
దెసల నర్జును బండితేరు నెక్కితి" 20-332

పసిరికాయ : వి. పసిడికాయ, పొత్తినూలుకాయ.

"చుట్టుకొంటిఁగర్మములు సొరిదిఁబసిరికాయ
నట్టనడిమి పురువు నడకవలె" 3-338

పసిరికాయ పురువు : పొత్తినూలుకాయలోని పురుగు.

"పాపపుణ్యకర్మదేహి పసిరికాయపురువు
కూపములోని కప్ప దుర్గుణబద్ధుఁడు" 15-378

పసివడు : *ప.బం; అ.క్రి.* కామాతుర యగు.

"పసిచల్లమ్మే గొల్లపడుచా నీవె
పసివడి తిరిగేవు బడివాయక" 5-197

పసురము : (2) వి. పశువు, గోమహిషజాతి. రూపాం. పసరము.

"నెలకొని నీవద్ద నిలుచుంట చాలదా
బలిమి పైపడునా పసురమువలెనా" 25-214

పసురు : వి. ఆకు మొ॥ వాటిరసం. రూపాం. పసరు.

"అసమున నండవారు అందాలు సేసేమంటే
పిసికితే పసురై పిప్పిరేఁగఁ జొచ్చును" 7-19

"వొలసీ నొల్లనిచోట నొరసితే విసుపౌను
బలిమి సేయఁగఁబోతే పసు రౌను" 19-328

పసురువయసు : వి. లేఁత వయస్సు, పసివయస్సు.

"వసివాఁడుతనముల వల పెంతైనాఁ గద్దు
పసురువయసుతోడఁ బదరదు గాని" 14-64

పసురువేయు : (3) (?)

"రసికులైనవారు రామల నలఁగించితే
పసురువేసె నందురు పట్టకుమీ విభుఁడా"
20-130

"పిలిచితే రానివానిఁ బెనఁగులాటకుఁ జొచ్చి
బలిమిసేయఁగఁబోతే పసురువేసు" 25-261

పసురెక్కు : అ.క్రి. దృఢపడు, బలవంతమగు.

"కొసరి యప్పుడు నిన్నుఁగోపించినది యెల్లా
పసురెక్కుఁగాక యిఁకఁబంతమిచ్చేనా" 11-234

పసులు : *వి; బహు.* పశువులు.

"పసుల యేలిక నేల పసులకు మారు దెచ్చి
పసులఁ గాచినయట్టి బాలుఁడీతఁడు" 7-87

పా

పాఁగు : (52) అ.క్రి. పొంగు అని తమిళ శబ్దం. క్షేమము అని అర్థం. ఇక్కడ క్షేమకరమైన అని అర్థము కావచ్చు. తెలుగులోని బాగు కూడ నిదియే కావచ్చు. అని సం.ప.స. (16 సం.) ఈ పదం ఏ నిఘంటువుల్లోనూ లేదు. సందర్భాన్ని బట్టి దీనికి వృద్ధిచెందు, పెంపొందు, పొంగిపోవు అనే అర్థాలు చెప్పుకోవచ్చు.

"పాఁగినగుబ్బలు సారె పయ్యదను
మూసుకొంటా" 22-529

"పాఁగిన యింతి కుచాలె పై తరవు కాక" 9-112

"పాఁగిన వోవరిలోనఁ బవళించుచున్నాడు"
ఇక్కడ అర్థం కుదరడంలేదు.

"అన్నిట కర్మపుఁ బంకమంటిన దీ యాతుమ
మున్ను కోపదుర్గంధములఁ బాఁగె నీ యాత్మ"
4-446

ఈ ప్రయోగాల్లో అర్థాలు కుదరడం లేదు.

పొంగిపోవు :

"పాఁగిన శ్రీవేంకటపతి నన్నుఁ గూడితివి"
11-360

"కాఁగిలిదే కందువిదే కాదుగూడ దనరాదు
పాఁగితిఁ దన రతులఁ బదపదవే" 20-199
ఆ.మూ.గారు అనురూపమగు, యోగ్యమగు అనే అర్థాన్ని సూచించినారు.

పాఁగెన: వి. (?)
"పలుకుల చిలుకలు పడఁతి నీకును నాకు
కులము పాఁగెన నొక్క గూటి వాయ సుమ్మీ"
26-199

పాఁతగిలు: అ.క్రి. పాతదియగు.
"మోఁత నీటిమడుగులో యీఁత గరచినవాఁడు
పాఁతగిలే నూతికిందఁబాయనివాఁడు" 5-295

పాఁతర: (పాఁతు + అర) వి. ధాన్యముంచడానికై తవ్విన పల్లం, నిధి.
"కాంతలు నవ్వుచునైనాఁ గన్నుల
చూచినచూపు
పంతమున నలుగుల పాఁతర సుండి" 2-26

పాఁతరబెట్టు: స.క్రి. అణచు, తొక్కిపెట్టు, శిక్షించు.
"పెనఁగి నే బిలువఁగా బిగిసి రాకుండే వాఁడు
తన తమి యెక్కడఁ బాతరబెట్టీనే" 28-557

పాఁతు: వి. వైశాల్యం.
"లోఁతుకొలఁదే పాఁతు లోన నేల జంకించేవు
చేఁత నీవు సేసినంతే చేరి మా పొందు" 16-256

పాఁతుమాకు: వి. స్థిరంగా నిలచినవాఁడు.
"చేఁతలు దవ్వేటివాఁడు సిగ్గువడ నేర్చునా
పాఁతుమాకై వుండేవాఁడు పైకొనీనా" 11-475

పాఁపరేని మేను దన పానుపు సేసినవాఁడు: వి. విష్ణువు, ఆదిశేషుని పానుపుగా చేసుకొన్నవాడు.
"పాఁపరేని మేను దన పానుపు సేసినవాఁడు
మోఁపరయి సకలము మోచినవాఁడు" 5-216

పాఁపసెజ్జ: (పాము + సెజ్జ) వి. పాముపడక.
"యెడయక పాఁపసెజ్జ నిద్దరునుఁబెనఁగుచు
కొడుకుఁగంటివిగా గోవిందనాంచారి" 17-315

పాంగెము: వి. 1. సంబంధం 2. ఒక కులపు కట్టుబాటు, చుట్టరికం (వ్యు.) రూపాంతరం పాగెము, పంగెము.
"మోము చూచి నవ్వె నాపె ముచ్చట నీతో నాడె
భామిని యెవ్వరితోడి పాంగె మేల" 16-212
"బచ్చెనల నతఁడు నీ పాంగెములోవాఁడై
నెచ్చెలి నీకుఁ గొంకి నే నీకు వెరతునా"
17-194 old

పాంచరాత్రధర్మము: వి. పాంచరాత్రులు పాటించే ధర్మం. పాంచరాత్రులకు ధర్మానుసారం తాప, పుండ్ర, నామాది పంచసంస్కారాలు ఉంటాయి.
"యెంచఁదాపపుండ్ర నామహిత
మంత్రయాగమని
పంచసంస్కారము చెప్పే పాంచరాత్ర
ధర్మమిది" 15-113

పాండవసరసి: వి. పంచపాండవ తీర్థం. దీన్నే గో గర్భతీర్థం అని అంటారు. ఇది తిరుమలలోని ఒక పవిత్రతీర్థం. కౌరవపాండవులకు జరిగిన యుద్ధంలో అనేక క్షత్రియులతో పాటు బ్రాహ్మణులు కూడా చనిపోతారు. బ్రహ్మహత్యాపాతకం పోగొట్టుకోవడం కోసం పాండవులు ఈ తీర్థంలో స్నానం చేసి బ్రాహ్మణులకు గోదానం చేయాలనుకుంటారు. కానీ ఆ సమయంలో బ్రాహ్మణు లెవ్వరూ కనిపించరు. అప్పుడు పాండవులు శ్రీకృష్ణుని ప్రార్థించగా కృష్ణుడు ఒక వృద్ధబ్రాహ్మణుని రూపంలో వచ్చి ఈ పాండవసరస్సు దగ్గర గోదానాన్ని స్వీకరించినాడట. కాబట్టి ఈ ప్రాంతానికి గోగర్భతీర్థం, పంచపాండవతీర్థం అనే పేర్లు వచ్చాయని చెపుతారు.
"తా మహిఁ గోరికలిచ్చుఁ గుమారధారయు
పాండవసరసీ" 15 అను 460

పాగకాఁడు: వి. తలపాగా ఉన్నవాడు.
"పంతాన నా మోము తప్పక చూచేవది యేమీ
వంతుకుఁబాగకాఁడ వీవల నీవే కావా" 13-151

పాటపాట: కొంచెం కొంచెము, (బ్రౌన్) మాటిమాటికి; క్వచిత్తు అని ఆం.ప.ని.
"పాటపాట సిగ్గులతో పడఁతి నీవు నవ్వఁగ

తేటతెల్లమాయను మీ తెఱఁగు లెల్లా" 21-368
"చిటపొట మని పాటపాట చినుకులు
వడఁజొచ్చుట యాదిగాఁగ" అని కళా. (4 ఆ.)
"వేనలి పాటపాట నరవెంద్రుకలతోఁ
దిలతండులాన్వయశ్రీ నటియింప" అని కాశీ.
(7-160) పాఠం.

పాటమగు: అ.క్రి. విరివియగు, యోగ్యమగు.
(బ్రౌన్)
"కొంచక శ్రీవేంకటేశ కూడితివి నన్నునిట్టె
పంచల నీ మన్ననలు పాటమాయఁ గదరా"
8-122
"పాటమైన నీ పేరు పదములలోనఁ బెట్టి
కూటువ నిన్ను నంకించు కోమలి నిన్ను"

పాటముగొను: (4) ప.బం. నేర్చుకొను,
పాఠముగొను, తనకు తానే వల్లించుకొను.
(సం.ప.స.)
"పైపై నే మవి యెల్లా పాటముగొంటిమి నేఁడు
చాపలాన నే పొద్దూ జపము సేసేవూ" 21-351

పాటము సేసుకొను: పఠన చేసుకొను,
ఉచ్చరించుకొను.
"ఇదె యలమేలుమంగ నేలితివి ననువుగా
పదిమారు లీకె పేరు పాటము సేసుకోవయ్యా"
24-589

పాటి: వి. (1. సామ్యం 2. ప్రమాణం విణ.
1. సమము 2.సామాన్యం 3. న్యాయం
4. కొలఁదిది) 5. శక్తి.
"యెదురు మాటాడితే యెగసక్యమౌ పొందు
పదరితే కడుఁగడుఁ బాటి చాలదు" 7-225

పాటిగంప: వి. చిన్నగంప, తగిన పరిమాణం కల
గంప.
"పాటిగంప నీళ్లు నించేవు పదుమనాభ బండి
బాట లాయె నీ గుట్టు పదుమనాభ" 15-247
"మెల్లనె నీవే కాదు మేలుమేలు అంటే నీళ్లు
బల్లిదులైనవారు పాటిగంప దెత్తురు" 7-50

పాటివట్టు: స.క్రి. లక్ష్యపెట్టు.
"బలిమిసేయఁగఁబోతే పాటివట్ట రెవ్వరును
తలఁపు సరివచ్చితే దగ్గరి రారాదా" 21-112

పాటుసేయు: వీలు కల్పించు, వీలుచేయు.
"ఆయములెత్తి యాడి యతివ నిన్ను దూరితే
చాయగా పాటుసేసుకొని సారె నవ్వేవు" 29-52

పాడిఁబంతాలు: ప.బం. న్యాయాన్యాయాలు
(తె.వ్యు.కో.)
"యింతులెల్లఁ గూడితిరి యియ్యకోలు సేసితిరి
యింతలోనె పాడిఁబంతా లెన్ని కాయనె"
15-243

పాడూరిలో బ్రదుకు: వి; ప.బం. పనికిమాలిన,
దుర్భరమైన బ్రదుకు. పాడూరు ఒక పనికిరాని
ఊరై ఉంటుంది. లేదా పాడు + ఊరు అని
విభజిస్తే పనికిరాని ఊరని అర్థం. అట్టి ఊరిలో
బ్రదుకు పనికిమాలిందే కదా!
"పాడూరిలో బ్రదుకు పాపకర్మపు బుద్ధి
తాడుపై తపసు తమ ధనము ప్రాణులకు"
1-104

పాతాళముల నిధానములు: ప.బం; వి.
వ్యర్థములు. పాతాళములో ఉండే నిధులు
వ్యర్థములే కదా!
"పాతాళముల నిధానములు
పరమాత్మునికిఁగాని తపంబులు" 2-235

పాతురలాడు: అ.క్రి. పాతరలాడు,
నాట్యంచేయు, నర్తించు, చిందుతొక్కు,
సంతోషాదులచే గంతులు వేయు. (వ్యు.)
"పుట్టుగుకెల్ల సుఖము పొల్లు లేని నీ భక్తి
తొట్టికాళ్ల సుఖము పాతురలాడుట" 4-78

పాతురాడు: అ.క్రి. నాట్యం చేయు,
పాతు(త)రలాడు. (తె.వ్యు.కో.)
"పంతపు నా కాఁగిటిలోఁ బాతురాడితివో కాని
దొంతివెట్టి రతులెల్లఁ దోడు చూపితి" 24-95
"చేతులెత్తి మొక్కఁగాను చిటికెన వేలువట్టి
పాతురాడించినయట్టు పట్టి తీసేవు" 27-513

పాత్రకత్తె: వి. నర్తకి, నటి.
"పరఁగ గద్దెపై నుండి పాత్రకత్తెలచేత
గరిమ నాడించుకొంటా కడుఁ జొక్కెని" 24-268

పాదచింతకొమ్మ : వి. పాదములనే చింతకొమ్మ, పాదము లందలి చింత అనే కొమ్మ - చింతకొమ్మ చాలా గట్టిది కనుక మోక్షానికి హరిపాదములు అంత గట్టివని చింతకొమ్మ అనే అర్థమే సముచితమని సంపా.

"ఘనమోహపాశముల గాలిఁబొయ్యేడి నాకు
కొనల నీ పాదచింతకొమ్మయే దిక్కు" 2-146

పాదపుఁబరము : వి. పాదమనే పరమపదం. (?)

"పంకజపుఁజేయి చాచి పాదపుఁబర మిచ్చిన
వేంకటేశు కృపతోడ వెలయఁదానే" 1-162

పాదపుగోరితోఁ బోలు : ప.బం. కొంచెమైనా సాటి రాకుండు.

"ఎంత నా సుద్దులు చెప్పీ నిందరితోను
కొంతైనా తన పాదపుగోర బోలఁగలనా" 23-75

పాదరము : వి. పాదము.

"పక్కన నేనైతేను పాదరము తొక్కుడులనే
చొక్కించి నా యింటికిఁ దెచ్చుకొంటి నే నితని"
28-422

పాదరసము బోలిన మనసు : వి. చంచలమైన మనసు. (పాదరసం చంచలంగా ఉంటుంది)

పాదాంగుటము : (2) (పాద + అంగుటము) వి. కాలి బొటనవ్రేలు.

"పరఁగిన పాదాంగుటమున బ్రహ్మాండము
నగిలించిన
పరమాత్ముఁడీతఁడే పో పతివేంకటవిభుఁడు"
1-80

పాదాలగంగ : వి. విష్ణువు పాదాలలో ఉద్భవించిన గంగ.

"ననిచి బ్రహ్మాదుల నాభిఁ గన్న దేవుఁడు
జనించెఁ బాదాలగంగ సంగతైన దేవుఁడు"
4-297

పాదాలు గుద్దు : (11) ప.బం; అ.క్రి. పాదాలు పిసుకు, పాదసంవాహనం చేయు, ఈ అర్థంలో అన్నమయ్య అంతటా 'పాదాలుగుద్దు' అనే పదబంధాన్నే ప్రయోగించడం గమనించవచ్చు.

"నెట్టుకొని జవరాలు నీ పాదాలు గుద్దఁగాను
చుట్టి యెవ్వతె కెదురు చూచేవయ్యా" 26-303

పాదించు : పూను, వహించు అని అర్థం కావచ్చు.

"చలము పాదించరాదు జంకించి చూడఁగరాదు
యెలిమి నింతలో నేరా యెగ్గువట్టేవు" 19-50

పాదికెత్తు : (పాదిక + ఎత్తు) పాతికెత్తు, పాతిక ప్రమాణం.

"పాదికెత్తు మెరుగారు బంగారు గుండు
సేదదేర మెడఁగట్ట చిత్తిగించితి" 5-219

పాదుపడు : ప.బం; అ.క్రి. నెలకొను, స్థిరపడు.

"పాదుపడక నడుమనుఁ దిరిగాడెడి
ప్రపంచముదే నేరమి
యె దెస నొకచో నిజ మేరుపడక యిటువలెఁ
దిరిగాడెడిఁగాన" 3-396

పాని(ను)పట్టు : (32) అ.క్రి. 'పూనిపట్టు'కు వ్యావహారిక రూపం. ప్రయత్నించు (వ్యు.) పూనుకొను. ఇది 'పనిపట్టు'కు బదులుగా వ్యావహారికంగా వాడిన రూపం కావచ్చునని సం.ప.స. లో పేర్కొనబడింది. (సం.22) ఆనందమూర్తిగారు దీనిని పేనిపట్టుకు వ్యావహారిక రూపంగా భావించి 'పురి యెక్కించు' అనే అర్థం చూపినారు. (సం.వా.పద. 458)

"పానిపట్టి నీవె నా బంట వయ్యేవా" 10-2-88

"నానాదేవతలకు నరసింహ కంభములో
పానిపట్టి చూపినట్టి ప్రహ్లాదవరదుఁడు" 11-135

"పానిపట్టి సర్వవిధబంధుండు విష్ణుఁడుండఁగా"
10-1-55

పాను : (8) అ.క్రి. ప్రసిద్ధనిఘంటువుల్లో ఈ పదం కానరాదు. తె.వ్యు.కో.లో దీనికి పూను , వహించు అనే అర్థాలు చూపబడ్డాయి.

"పానిన చదువుల పతనలుండఁగా
మానిన దుర్భాషమాఁటలే హితవు" 4-96

"ధ్యానమే మా ధనము దయే మా ధనము
పానిన శ్రీ వేంకటాద్రిపతియే మా ధనము"
2-457

"యీ నెపాన దొరవైతి వింతేసెసె నాతఁడు
పానిన చలము చెల్లె బతుకవే యిఁకను " 21-378

పానుకొను : అ.క్రి. పూనుకొను , యత్నించు .
"పానుకొని దనుజుల బలుకిరీటమణుల
సానలఁదీరిన వో చక్రమా" 1-183

పాపమంటాఁ బాలు వోయఁబోతేను , వొల్ల నోకిలించె : నానుడి ; మంచి చేయబోతే చెడు చేయు అనే అర్థంలో సామెత .
"పాపమంటాఁబాలువోయఁబోతేను
వొల్ల నోకిలించె నన్న వూహ నిజమాయఁగా "
22-8

పాపమని : ప.బం. దయాపూర్వకంగా , మేలుచేద్దామని .
"పాపమంటాఁ బాలువోయఁబోతేను వొల్ల
నోకిలించె నన్న వూహ నిజమాయ " 22-8

పాపవినాశనము : వి. తిరుమలకొండమీద నున్న ఒక తీర్థం. ఈ తీర్థంలో స్నానం చేస్తే చేసిన పాపాలన్నీ తొలగి పోతాయని భక్తుల విశ్వాసం. పాపాలనన్నింటినీ నాశనం చేసేది కనుక దీనికి గల పేరు సార్థకం .
"పామరులా అమరులఁ జేయును
పాపవినాశనమూ" 15 అను 460

పామరి : వి. పామరుడు అనేదానికి వ్యావహారికరూపం కావచ్చు . అజ్ఞుడు .
"పామరివై దుర్వ్యాపారమునకు పలుమారునుఁ బొయ్యేవు
వేమరు దుర్జనసంగాతంబులు విశ్రామమనుచు నుండేవు" 1-184

పామఱితనము : వి. (పామఱి=పామరుడు) పామరుతనము కావచ్చునని సంపా. అజ్ఞానం, పామరత్వం. బండి 'ఱ' ప్రయోగం విలక్షణం.
"పామఱితనమున బహువేదనలను
నా మనసెఁబో నా వ్రాఁత" 1-233

పామిడికోరిక : వి. అడ్డులేని - ఉద్దండమైన కోరిక , సాధారణమైన కోరిక .
"పామిడికోరికలకు బంట్లైనవారలు
గామిడితనాలఁదామే కర్తల మనేరు " 2-261

పామిడి గొల్లెతలు : వి; బహు. ఉద్దండంగా తిరిగే గొల్లెతలు .
"బూమెల నీ వాడుకొన్న బొమ్మ చారితనమెల్ల
పామిడి గొల్లెతలందే పచ్చిదేరఁ బదరా" 22-13

పామిడితురగపుఁబాదము : వి. అడ్డమాక లేక ఉద్దండంగా తిరిగే గుఱ్ఱము గల పాదం.
"ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడితురగపుఁబాదము" 1-191

పాముకొల : పాముబాధ .
"పట్టి కాళింగునిఁ దోలి పాముకొల దీర్చినాఁడు
బట్టబాయిటనే రేపల్లెవారికి" 2-57

పాముచెలిమి : ప.బం; వి. ప్రమాదకరం .
"పాము చెలిమి రంపపు సంసారము
గాముల మోఁచిన గంప యిది" 1-180

పాముతోడి పొత్తు : ప.బం; వి. ప్రమాదకరం.
"బలు సంసారపు పొత్తు పాముతోడి పొత్తు సుండి
వెల లేని వలపులు విషము సుండి" 1-494

పామునోరి కడి : ప.బం; వి. ప్రమాదం తప్పనిది , పులినోటి కండ వంటిది .
"పామునోరికడి మీ ప్రాణపుటూరుపుగాలి
జాము జాము మేలుఁగడు చక్కఁ
జేయఁగనుడు" 1-160

పాముపడుకవాఁడు : వి. విష్ణుమూర్తి , శేషశయనుడు .
"పాముపడుకవాఁడ పట్టుకురా ఆ
పామువంటి యారు నీకుఁ బాయదు గదే "
9-108

పాములు వెళ్ళేటి పొద్దు : వి. సాయంకాలం .
"పంచలఁ దిరుగకురే పాములు వెళ్ళేటి పొద్దు
కొంచెపు బాలులఁ బైకొను నందురు " 5-247

పామేటి సుఖములు : వి; బహు. (?)
"దోమటి నా మతిలోనఁ దోడునీడవై యుండి
పామేటి సుఖములనే భ్రమయించవలెనా " 2-59

పాయను: క్రి.ప. 'పోయెను' అనుటకు వ్యావహారికరూపం.
"ముమ్మాటికి నీ బాసలే - నమ్మివున్నదాన నేను
కుమ్మరించరా నీ కరుణ - వెంకటేశ
చిమ్ముఁజీఁకటెల్లఁ బాయను" 7-223

పాయపుఁజంద్రులు: వి. యౌవనంలోని నఖక్షతాలు.
"తోయపుగుబ్బల చన్నుదోయి మీఁద వాఁడొత్తిన
పాయపుఁజంద్రులఁ జూచి భ్రమసితి నమ్మా"
5-46

పాయపుఁబడుచు: వి. యౌవనంలో ఉన్న స్త్రీ.
"బచ్చనరూపుల పాయపుఁబడుచులు
నిచ్చలు గొలువఁగ నెమ్మదిని" 6-144

పాయపునడపు: వి. యౌవనపు నడక.
"పగటుగుబ్బలు పాయపునడపులు
తగులుమాఁటలు తమకయ్యా" 5-358

పాయపు వయసు: వి. యౌవనం.
"పాయపు నా వయసే కా పాసినప్పుడెల్ల నిన్ను
తోయపుమాటల నిన్ను దూరించెను" 12-52

పాయము: (14) వి. ప్రాయం, వయస్సు, యౌవనం.
"పట్టినదె పంతమో పాయమిది సంతమో
యిట్టె శ్రీవేంకటేశుఁ డేమనీనే" 7-301
"పాయము పిడికిటఁబట్టుచు నుండేటి
కాయధారులకుఁగలదా విరతి" 1-432

పాయమువచ్చు: అ.క్రి. పెండ్లియీడు వచ్చు, వయసు వచ్చు.
"ఈ యలమేలుమంగ ని న్నెనసిన వినకనె
పాయము వచ్చి యీరీతి బరగినది" 18-257

పాయవట్టము: (2) వి. ఆభరణవిశేషం, కాలి అందె.
"అందెలుఁబాయవట్టాలు అట్టె గల్లు గల్లనఁగ
యిందుముఖి వచ్చెను నీ యింటికి నేఁడు"
28-441

పారఁబట్టు: స.క్రి. బిగియబట్టు, ఆపుకొను, నిరోధించు.
"ఇంత మమ్మిట్లా నెలయించకురా నీ
పంతములన్నియుఁ బారఁబట్టింతు నోరి" 5-10

పారవెల్లు: ప.బం; అ.క్రి. పరుగెత్తుకొని పోవు.
"పారితెంచి యెత్తివేసి పారవెల్లితివి
నీరసపు టెద్దవైన నీకు ముద్దా" 1-87

పారవైచిన పుల్లాకు బండి కల్లగు: నానుడి; పనికిరాని వస్తువు విలువైన వస్తువగు.
"పారవేసిన పుల్లాకు బండికల్లై మించి నట్లు
కోరి నీ ముద్రలు మోచి కొండగొంటి నిదివో"
3-466

పారాడించు: స.క్రి. పొర్లాడించు, పరుగెత్తించు
"పంచల నరులవెంటఁ బారాడించే మనసు
కొంచక శ్రీవేంకటేశుఁ గొలిపించలేదా" 3-139

పారాయణ: వి. పారాయణం, అంతయు చదువుట, వేదపారాయణ మొ॥
"వేదపారాయణలతో వెసఁజూచెఁ గపిలను
గాదెల లెక్కలడిగె గడేరాలు వినెను" 7-473

-పారి: అవ్య. పర్యాయం, తడవ. ఇది మాండలిక పదం. తెలంగాణంలో దీని వాడుక ఉంది.
"ఒక్కపారే . . . . . ." 8-158
"ఒకపరి వ్యాఘ్రమై తోచు నొక్కపారి . . . . ."

పారిఘంట: వి. ప్రహరిగంట.
"మదనుఁడుండెడి హేమమందిరము దిరిగిరాఁ
గదిసి మ్రోసెడి పారిఘంటలో కాని" 5-259

పారిటాకు: (3) వి. పాఱుటాకు, పండుటాకు.
"పట్టుచీ రేటికి నాకు పారిటాకులె చాలు
దట్టి గట్టుకొమ్మనవే తన మొలనే" 6-108

పారితెంచు: అ.క్రి. పరుగున వచ్చు, వ్యాపించు, ప్రసరించు, ప్రవహించు. ఇది పాఱిపోవు కు వ్యతిరేకరూపం. 'అ' కు బదులు 'ర' వాడబడింది.
"పారితెంచి వేసాలకు బడలికె దెచ్చుకొంటే
ఆ రీతి విసరుచు నలపార్చ వసమా" 13-192

పారితేరు : అ.క్రి. పారివచ్చు.
"దురదురఁ బారితేఁగా తురుమెల్లా నిదె జారె
గరిమల నిట్టే కీలుగంటు వేయరాదా" 14-553

పారియాడు : అ.క్రి. శిశువు జోగాడుటకుముందు ఒకరి చేతిసహాయంతో ముందుకు జరుగు, తిరుగు, పాఱాడు.
"సురలు నీవు రేపల్లె చొచ్చి పారియాడఁగాను
ఇరవై నీ వెంట నెట్లా దిరిగిరో" 15-36

పారివారు : *విణ; బహు.* సేవకులు.
"దీమసపు పారివా రీ దీవెపంజులు చేబట్టి
యేమరక మీలో మీరు యియ్యరో జాలి"
4-166

పారిశము : వి. 'పార్శ్వము'నకు వికృతిరూపం, పక్క. చూ : పారిశెము.
"పడఁతి వొక్కతె నిన్ను పక్క పారిశాన వచ్చి
తొడల జోడించి పట్టి తొలఁగఁదీసె" 21-325

పారిసెము : వి. 'పార్శ్వము'నకు వికృతిరూపం, పక్క.
"ఎడ చొచ్చి వేరొకతె ఇవ్వలి పారిసెమున
అడియాలమైన మాట లటు విన్నవించెను"
21-325

పారుఁజేసు : (?)
"బండివంటి మా పిరుఁదు బడి నీకుఁ దగిలితే
అండ నీపైఁ బారుఁజేసు నందుకోపుదువా"
11-251

పారుపత్తెము : వి. 1. ఆయవ్యయాదులపై అధికారం, అధికారం, యోగక్షేమం.
"ఇంతేసి పారుపత్తే లేమీ నీకు
అంతంతకు గరిసించే వత్తునా నే నీకు" 10-2-34

పారుపత్యము : (5) వి. 'పారుపత్తెము'కు వ్యావహారిక రూపం. దొరతనంవారి కివ్వవలసిన ధనాన్ని ప్రజలనుండి రాబట్టే అధికారం, అధికారం (శ.ర.) 'పిల్ల పారుపత్యము పెట్టని వక్క పొద్దు' అని రా.సీ. సామెత.
"పొలఁతి నీవద్దనుండి బుద్ధులెల్లాఁ జెప్పఁగాను
చెలఁగి పారుపత్యాలు సేయవయ్యా" 7-110
"పాడితోఁ బగర గెల్చి పారుపత్యాలు సేయఁగా
యీడనే సరిగద్దె నెదురెక్కెను" 25-328

పారుబడి వడ్డి : వి. ఒకరకం వడ్డి.
"ముందటి జన్మములెల్లా దుంచెఁ బారువడి వడ్డి
యెందుఁజొచ్చినానుఁ బోనియ్య దీ రుణము"
1-469

పారెటాకు : వి. పాఱుటాకు; మునులు లోనగువారు వస్త్రమునకు మాఱుగా కట్టుకునే ఒకరకపు ఆకు.
"పలచని పారెటాకు పయ్యెదేఁటికే అల
మట్టేకు పానుపు అది నీకు నేలరా" 19-418

పారేబండికిఁ గాలు చాఁచు : ప.బం. అవివేకంతో స్వయంగా ఆపద కొనితెచ్చుకొను, వ్యర్థప్రయత్నం చేయు.
"అబ్బురపు వేడుకల నలసేవు పలుమారు
గబ్బివై పారేబండికిఁ గాలు చాఁచేవా" 10-1-14

పారే బండికింద పాదము చాఁచు : *ప.బం; అ.క్రి.* కావాలని ఆపద తెచ్చుకొను, నడిచే బండికింద కాలు చాచు అని వాచ్యార్థం. చూ : పారేబండికి కాలు చాఁచు.
"పారే బండికింద పాద మేల చాఁచవలె
జారువడి మరి యాల జడియవలె" 10-1-49

పాఱాడు : 1. శిశువు దోగాడుటకు ముందు ఒక చేతి సాయంతో ముందుకు జరుగు 2. తిరుగు.
"పాయక యశోద వెంటఁబాఱాడు శిశువు"
4-1 old

పాలంటే గుటుకన్న మాట : నానుడి; ఇష్టమైన దానిని గూర్చి వినగానే దానిని అనుభవించడం.
"ఆఁక శ్రీవేంకటేశ పాలంటే గుటుకన్నమాట
యేఁకట నీ జాడలాయ నిఁకనేఁటి మాటలు"
9-272

పాల ఉట్లపండగ : వి. కృష్ణాష్టమి నాడు పాలముంతలను ఉట్లలో పెట్టి పైకి, కిందికి దింపుతూ చేసుకునే పండుగ. 12-17

పాలకూడు: (8) వి. పాయసం, పాలతో వండిన అన్నం.
"బంతినాతఁడును నేను పాలకూళ్లారగించఁగా
అంతటనుండి నీ వేల అట్టే చూచేవే" 21-59
"ననుపున సెలవుల నవ్వి నీ నవ్వులు
గొనకొనఁగఁ బాలకూళ్లాయ" 19-18

పాలకొండమల: కడపజిల్లా కడప తాలూకాకు చెందిన నంది మండలానికి దక్షిణంలో ఉన్న పర్వతం. ఈ పర్వతం కోనలో చెన్నకేశవస్వామి నెలకొనిఉన్నాడు.
"మందల పాలకొండమలకు నట్టనడుమ
విందగు దాసులతోడ విహరించీ దేవుఁడు"
4-375

పాలగిరి: వి. పాలకొండ; కడపజిల్లా కడపతాలూకా లోని నంది మండలానికి దక్షిణంలో ఉన్న పర్వతం. ఇట చెన్నకేశవస్వామి నెలకొని ఉన్నాడు. చూ: పాలగిరి రాయఁడు. 24-182

పాలగిరిరాయఁడు: వి. కడపజిల్లా, కడపతాలూకాకు చెందిన నందిమండలానికి దక్షిణంలో కల పాలకొండ పర్వతం కోనలో నెలకొన్న చెన్నకేశవస్వామి. ఇతడు చెన్నరాయడని కూడా కీర్తింపబడినాడు.
"కంటిరా నీ గుణమెల్ల కడగడనే
పంట మోవితేనె కాఁడ పాలగిరిరాయఁడా"
24-182
"చెల్లబో పాలగిరిచెన్నుఁడే వీడు కొమ్మా"
అనే క్షేత్రయ్య పదంలో పాలగిరిచెన్నుని ప్రసక్తి కనిపిస్తుంది.

పాలచాడె: వి. పాలకుండ.
"చెక్కులు నొక్కితే నీ సెలవులఁ బాలుచిందీ
చక్కని రేపల్లె పాలచాడే(?) దొంగవా" 12-447

పాలతో(డ)పోయు: *ప.బం; స.క్రి.* చిన్నతనంలోనే నేర్పు.
"ఎంతపని కెంత పని యిది యేటిదే
పంతమె సతుల కిది పాలతోడఁబోసిరో" 11-306
"చెల్లు లేవే యాతఁడు నీచేతఁ జిక్కనే
పల్లదమే తల్లి నీకుఁ బాలతోనె పోసెనే" 11-522

పాలదుత్త: వి. చిన్న పాలబుంగ, పాలకుండ.
"ఆలదొడ్డివారము నే మంతేసి యెఱఁగము
పాలదుత్త దుత్తెఁడేసి పట్టవయ్య వలపు" 7-180

పాలపండ్లు: *వి; బహు.* పాలు తాగే పిల్లలకు వచ్చే దంతాలు, ఒకరకం తెల్లని పండ్లు.
"జాతితోఁబాలపండ్లు సంగడి నే వుండఁగాను
ఘాతఁబెరిగే బూరుగుకాయలు చూపట్టును"
13-483

పాలపొంగలి: వి. పాయసం, పరమాన్నం.
"పొలపసిగ్గుల పాలపొంగలిగాఁబెట్టి
వెలయఁ గాఁగిలి నీకు విడిది సేసె" 22-320

పాలమీఁది మీఁగడ: వి. సర్వత్రా వ్యాపించి ఉండేది.
"కైవశము నేను శ్రీ వేంకటేశ్వరుఁడు తాను
భావించ నీవే మేలు పాలమీఁది మీఁగడ"
25-332

పాలమీఁది మీఁగడ పాయము: *ప.బం; వి.* నవయౌవనం.
"పాలమీఁది మీఁగడ పాయములోని మదము
జాలువారీఁ జెమటలై చన్నులఁగదే" 25-332

పాలలెక్కు: *అ.క్రి.* వరి మొ॥ పాలు పోసుకొను. (వ్యు.)
"యింటిలోనే శ్రీవేంకటేశుఁడుఁ గూడితి నేను
పంటలై పులకపైరు పాలెలెక్కీని" 7-44

పాలలో(న)పులుసు: *ప.బం; వి.* అనుచితమైంది. ఒకదానిలో దానికి సాటిగాని వస్తు వుండడం అనుచితమనే భావాన్ని తెలియజేసే నానుడి.
"మూల నాకెచేత నాకు మొక్కించఁ బిలిచీని
పాలలోనఁబులుసేల పదవమ్మా" 7-309

పాలలోని పాపఁడు: ప్రహేళిక, వెన్న అని అర్థం.
"పాలలోని పాపఁడన్న ప్రాణమైనవాఁడు" 5-216

పాలలో పులుసేల: నానుడి. ఒకదానిలో దానికి సాటిగాని వస్తు వుండడం అనుచితమనే భావాన్ని తెలియజేసే నానుడి.

"మూల నాకె చేత నాకు మొక్కించఁ బిలిచీని
పాలలోనఁ బులు సేల" 7-309

పాలవంటి కులము : *ప.బం; వి.* నిష్కళంకమైన కులము.

"పాలవంటికులము మా భావము నిచ్చలము
నాలి మమ్ముఁ జూచి యేల నవ్వీనె తాను "
9-114

పాలవంటి వయసు : *వి.* నిర్మలమైన వయస్సు.

"పాలించి శ్రీవేంకటేశ పకపక నవ్వేవు
పాలవంటివయసు నీ పాలికిట్టె దక్కెనా" 20-54

పాలవారి యింట పిన్న వాఁడు : *వి.* గొల్లవారి యింటి పిన్నవాడు, బాలకృష్ణుడు.

"పాలవారి యింటి పిన్నవాఁడై తిరిగినాఁడు
గాలి దాగువానిమీఁదఁ గాలు సాఁచినాఁడు"
6-156

పాలవారు : (2) *వి; బహు.* గొల్లవారు.

"పాలమీఁదఁ బవ్వళించి పాలవారి యింటఁబుట్టి
పాలు దొంగిలించినట్టి బాలుఁడీతఁడు" 7-87

పాలవుట్టి: *వి; బహు.* పాలు నింపిన ఉట్టికుండలు.

"వుల్లసాన నీవు పాలవుట్టెక్కుదువు గాక
పిల్లఁగోవిరాగాలఁ బిలువనేలా" 11-268

పాలవెల్లికూఁతురు : *వి.* లక్ష్మీదేవి, పాలసముద్రపు కూతురు.

"పాలవెల్లికూఁతురుకు పసపులు నలఁచరే
చాలించరే జోలి వీడు చదివేవేళ" 20-182

పాలసుఁడు : *వి.* 1. మూర్ఖుఁడు 2. దుర్జనుడు.

"తాలిమితో నాతో నిన్ను ధ్యానము సేసేవంటే
పాలసుఁడ నేను నీపాటి వాఁడనా" 2-336

పాలార్చు : *స.క్రి.* పాలు + ఆఱుచు = పాలార్చు, నశింప జేయు అను అర్థము స్పష్టమే. కానీ ఆ అర్థమిచ్చుట సరిపడదు. పాలు + ఆడించు = పాలార్చు. తన పాలిదిగా చేయు అను అర్థము సరిపడును. దీనికి 475, 498 కూడ చూచునది" అని (13 సం. సం.ప.స. 5 పు.) లో వివరింపబడింది. వేటూరి ఆనందమూర్తిగారు దీనికి చన్నిచ్చు, ఉగ్గుపెట్టు, హితమైన ఆహారమిచ్చి పరిరక్షించు అనే అర్థాన్ని సూచించినారు.

"పంతగాఁడ వీఁక మమ్ముఁ బాయకువయ్యా
బంతిఁబెట్టుకొని మమ్ముఁ బాలార్చవయ్యా "
13-112

"అగపడి శ్రీవేంకటాధిప! నన్నేలితివి
బగివాయ నెట్ట వచ్చు పాలార్చఁగాను" 13-475

"ఇట్టే శ్రీ వేంకటేశ యెనసితి విట్టు నన్ను
పట్టముగట్టి నన్నెంత పాలార్చినా మంచిదే "
13-498

బడలికచెందు, అలసిపోవు :

"వాలాయించి రాతి గుండెవాఁడ వౌత
యెఱుగుదు
పాలుమాలిన నా యాస పాయనీదు గాని "
11-45

కాని పద.లో 'పాలార్చు' పదానికి పోషించు అనీ, బ్రౌన్ లో ఉపేక్షించు అనీ, సూ.ని. లో బాధించు, క్రీడింపజేయు, చంపు, ఉపేక్షించు, ఎక్కువగా విమర్శించు అనే అర్థాలూ, తె.వ్యు.కో. లో సూ.ని. అర్థాలతోపాటు పోషించు అనే అర్థాలు చూపబడ్డాయి. పైన చూపిన అన్నమయ్య కీర్తనల్లో సం.ప.స. లో సూచించిన అర్థం సరిపోయినా ఈ కింది అన్నమయ్య కీర్తనల్లో ఆ అర్థం సరిపడదు.

"పాలార్చి తొట్టెలలోఁ బండఁబెట్టు యశోద
నీలవర్ణుఁ దొంగి చూచె నిద్దురో యని" 4-258

ఇక్కడ చన్నిచ్చు, ఉగ్గుపెట్టు అనే అర్థాలే సరిపోతాయి.

పాలికిచ్చిన రాసి : *వి.* కౌలు కిచ్చిన పొలంలోని పంట, తప్పక వచ్చేది అనడం.

"పండిన కర్మఫలము పాలి కిచ్చిన రాసి" 3-281

పాలుకొను : (3) *అ.క్రి.* పంచుకొను అనే నిఘంట్వర్థం సరిపోవడం లేదు. దీనికి అతిశయించు అనే అర్థం బాగుంటుందేమో ?

"నీ వాసలు వెట్టితేను నిలువు నూరు వండీని
భావించ నీ సింగారాలు పాలుకొనీని" 13-392

"పాలుకొనెఁ బులకలు పమ్మె సిగ్గు మొలకలు
గోలదానవా యేమి గుట్టు దాఁచేవే" 28-585

పాలుగారు : ప.బం; అ.క్రి. మృదువగు.
"పంతపురతులనే పాలుగారీ వలపు
బంతిమోవులనె కడుఁబచ్చిదేరీ వలపు" 7-421

పాలు దాగినమీద పై కుడుపులా? : నానుడి; కడుపారా తిన్న తరువాత చిఱుతిండి యెందుకు? వ్యర్థమనుట.
"యీలాగునన లోకమింతాఁగాతువు గాక
పాలుదాగినమీఁదఁ బైకుడుపులా" 1-280

పాలుదీయు : ప.బం; అ.క్రి. మృదువగు, దేహబలం తగ్గు. (సం.ప.స. 14 సం. 353 పు.)
"కన్నియ పూఁపవంటిది కాఁకలకు నోపదు
పన్ని చేతఁబట్టితేనే పాలుదీసును" 14-99

పాలుపడు : (2) ప.బం; అ.క్రి. పూనుకొను.
"మేలమ్మా నీ నేరుపు మెచ్చితి మిందరమును
పాలుపడి వూడిగాలు పయికొని సేసేవు" 16-14

పాలుపుఁగోపము : (?)
"పాలుపుఁగోపపు చూపు పగడాలు యివి
మేలు మేలు మీలో మేకే తెలియును" 7-296

పాలుపెట్టు : స.క్రి. విభాగించు, పాలుపుచ్చు.
"ఎట్టు సేసినాఁజేయి యే మనఁగల నిన్ను
పట్టిన వ్రతము నీకు పాలుపెట్టేఁ గాక" 27-28

పాలుమాలు : (2) అ.క్రి. 1. ఆశపడు, కక్కుర్తిపడు 2.బద్ధకించు 3. లొంగు 4. అలయు, శ్రమనొందు.
"తోలుబొక్కలోనఁ జొచ్చి తూలేటి యాఁకలిచేత
పాలుమాలి యిందరికి బంటుబంటనై" 1-215
"పాలుమాలే వేల గొల్లపడుచ, మా
పాలు నీ కేలయ్యే పాలవారివాఁడవు" 5-197

పాలు వాలే నీరు నీరే : నానుడి; రెండిటికీ భేదం ఎక్కువ అనే అర్థంలో వాడబడే పలుకుబడి.
"ఏల మేకులు సేసేవు ఇందరిఁ జూపి మమ్మ
పాలు వాలే నీరు నీరే పలుకు లేమిటికి" 21-214

పాలువెట్టు : ప.బం; అ.క్రి. భాగించు, పంచు, ప్రత్యేకించు.
"తాలిమి నాపె నీచేతఁ దమ్ముల
మిప్పించుకోఁగా
పాలువెట్టు కందరును పంచవచ్చునా" 22-362

పాలువొంగినట్లు : క్రి.విణ. అకస్మాత్తుగా.
"నీలోని వారమే నే మెల్లాను
పాలువొంగినట్లనే బతుకవే యిఁకను" 21-378

పాళగాఁడు : వి. దొర, ప్రభువు, సేనాపతి. రూపాం. పాళెగాడు.
"అట్టె శ్రీ వేంకటనాథుఁడు మరుల నెల్లనుఁజే
పట్టి దైత్యులఁ జంపించే పాళగాఁడు" 10-22

పాళము : వి. 1. విధము, రీతి 2. సమయము 3. కొలఁది.
"వనిత నీ జవ్వనము వలపుల కొటారు
పనుపడ్డ తుమ్మెదపాళము కొప్పు" 28-266

పావా : వి. పాదరక్ష.
"దంతపుఁబావాలు మెట్టి పంతాన నేను రాఁగాను
యింతలో బలిమిఁబట్టేవు వేంకటేశ" 7-223

పావురముపెట్టె : వి. పావురాన్ని ఉంచే పెట్టె.
"శ్రీ వేంకటేశ్వరుఁడు చేరికూడి వుండఁగాను
పావురముపెట్టె మీఁద బత్తి సేసేవు" 7-443

పాశము : వి. పాయసము అనే శబ్దానికి వ్యావహారికరూపం. జానపదులు నేటికీ పాయసాన్ని పాశమనే వ్యవహరిస్తారు. రూపాం. పాసెము. దీనికి 'పాశాలు' అనే బహువచనరూప ప్రయోగం ఉంది.
"కూరలు పాశాలు దొంతిఁగూడఁ బెట్టితే
"యీవేళ మందాఁబాలు యింటాఁ బాశమాయ"
2-165
"వారము సేసేమనుచు వడి నింటివారమెల్లా
మతకరినవ్వులనె మంచిపాశాల విందులు"
9-199 & 1-22

పాసిక : వి. 'పాచిక'కు వ్యావహారికరూపం.
"వెలయఁ బాసిక చక్కవేయనేర దంటాను"
17-222

"అంతలోనే పగడసాలాడు మనేవాకెను
యింతి యలసెఁ బాసిక లెత్తియ్యరాదా " 7-151

పాసికవిద్యలవారు : *వి; బహు.* పాచికలాడేవాళ్లు, జూదగాండ్లు.
"పాసికవిద్యల వారి పక్షపాతివైన నీవు
బాసలెన్ని చేసినాను పాటిలేవు " 14-155

పాసి కూడు : *అ.క్రి.* దూరమై మళ్లీ కలియు.
"వేసాలెల్లఁ జేసేవు వింతవానివలెనే
పాసి కూడి వలపించ పంతమా నాకు " 24-269

పాసు(ను) : (4) 'పాయును' అనే తద్ధర్మ క్రియారూపానికి జానపద వ్యావహారికరూపం. ఇట్లే చేసును మొ॥ ప్రయోగాలెన్నో ఉన్నాయి.
"చెప్పితే నెవ్వరికైనా సేసిన దోసము వాసు
చిప్పిల నీవిందుకుఁగా సిగ్గువడకు " 16-2

పి

పించెము : (6) *వి.* 'పింఛము'నకు వికృతిరూపం. 1.నెమలిపురి 2. నెమలిపురికన్ను. రూపాం. పించియము
"మంచుఁగుంచానఁ గొలిచె మరఁది వీఁడె
పించెపుశిరసు పొగ పిన్ననాటి మరఁది " 5-260

పించెము : *వి.* 'పించము'నకు వ్యావహారికరూపం, మదం.
"పించెపుఁబయ్యెదలోని పెనుగుబ్బలు మూయుచు
చెంచెత యేల యేఁచేవే " 6-96

పిండంతే నిప్పటి : (2) *ప.బం; వి.* పిండికొద్దీ రొట్టె వంటిది, డబ్బెంత ఉంటే అంత బాగా ఖర్చు చేయడం, నీరుకొద్ది తామర. వెన్నకొద్దీ నెయ్యి, తూరినంతే వాకిలి మొ॥ ఇలాంటివే. ('నిప్పటి' నిప్పట్టుకు రూపాం. ఆకులమీద కప్పి నిప్పులో వేసి కాల్చే ఒక భక్ష్యవిశేషం.)
"ఎంత మాత్రమున నెవ్వరు దలఁచిన
అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడఁ
బండంతే నిప్పటి యన్నట్లు " 2-393

పిండతుండాలు : *వి; బహు.* ముక్కలుముక్కలు.
"యేతుల రావణాసురుఁ డిటువంటివాఁడే కాఁడా
కాతరాన నొంటిఁజిక్కి పిండతుండా లాయెను "
15-269

పిండికూర : *వి.* తెల్లని పూలతో ఉండే ఒకరకపు ఆకుకూర, పిండిబొద్దికూర.
"భోగించ కేల పోవుఁబుట్టిన జన్మఫలము
లోఁగుచుఁ బిండికూరలోన నలు పెంచనేల "
4-135

పిండికూరలో నలుపులు ఏరు : *ప.బం; అ.క్రి.* లేనిదానికై ప్రయత్నించు, పిండికూర (పిండిబొద్దికూర) తెల్లపూలతో ఉంటుంది. అందులో నలుపులు ఉండవు. వాటికోసం ప్రయత్నించడమన్నమాట.
"పిండికూరలో నలుపులు నేఁబెనఁగి యేరఁగ
నోప తన్ను
చండిసేయఁగరాదు యిఁక సరుగఁ
గూచుండుమనవే యమ్మా " 11-449

పిండికూరలోన నలుపెంచు : *ప.బం; అ.క్రి;* అనవసర ప్రయత్నం చేయు, పిండికూర తెల్లగా ఉంటుంది. వాటిలో నలుపును ఎంచడం అనవసరమే కదా! చూ : పిండికూరలో నలుపులు ఏరు.
"భోగించకేల పోవుఁ బుట్టిన జన్మఫలము
లోఁగుచుఁ బిండికూరలోన నలు పెంచనేల "
4-135

పికిలి : *వి.* పక్షివిశేషం.
"ముదిత యెలుఁగు వింటే మొక్కలాన
వాలునమ్మా
బెదరని పెంపుడుఁబికిలివలె" 10-2-115

పిచ్చుకపై బ్రహ్మాస్త్రము : చిన్నపనికి పెద్ద ప్రయత్నం చేయడం. ముఖ్యంగా చిన్నవానిపై పెద్దకోపం తగ దనేచోట ఉపయోగించే పలుకుబడి.
"పరఁగిన పిచ్చుకపై బ్రహ్మాస్త్రము
దొరకొని వూరకె తొడిగినయట్లు " 3-574

పిచ్చుగా : *క్రి.విణ.* (?)
"ముచ్చటలాడి వచ్చితి మొదలి నందరితోడ
పిచ్చుగా ముద్రలువెట్టెఁ బెదవి యేదయ్యా"
17-100

పిట్టపిడుగగు : (పిడుగు + పిడుగు) కడుభారమగు, మిక్కుటమగు, హఠాత్సంఘటనమని (పద.)
"పుట్టుభోగి సిగ్గుల చూపుల పూవుఁదీఁగెలపై
పిట్టపిడు గాయ నతిప్రేమము నేఁడు" 5-108

పిడికిలించు : (3) *అ.క్రి.* గుప్పిలిపట్టు *స.క్రి.* పిడికిట పట్టు.
"పెక్కు పండ్లగొలలు పిడికిలించినవాఁడు
మిక్కిలి లంక సాధించి మించినవాఁడు" 3-519

పిడిగుండు : వి. గట్టిగుండు.
"వువిద చన్నుల నొత్తి వూరడించఁజూచితేను
యివె పిడిగుండ్లయితే నేమి సేసును" 8-293

పిడితెడు : (పిడత + ఎడు) చిన్న మంటికుండ ప్రమాణం కల, 'పిడతెడు' కు వికృతిరూపం.
"నడివిడి (వీది) మాటలు నాయమా నీకు
పిడితెడు చల్లవోసెఁ బెనఁగకు వోయీ" 22-304

పితరలు : *వి; బహు.* 'పితరులు' కావచ్చు. పితృదేవతలు.
"నీయందె పితరలు సిద్ధసాధ్యులు
నీయందె ద్వాదశాదిత్యులు" 3-222

పితాళ్లు : (3) *వి; బహు.* పితరులు అనడానికి వ్యావహారిక రూపం. పితృదేవతలు, మృతి చెందిన పితృవర్గంవారు.
"ఇచ్చ నెవ్వరిఁ దలఁచి యిత్తురు పితాళ్లకు
ముచ్చట నెవ్వని నామములనే సంకల్పము"
3-358

పితురార్జితము : (2) వి. తండ్రిచే సంపాదింపబడింది. ఈ అర్థంలో పిత్రార్జితం (పితృ + ఆర్జితమ్) అనేది సాధు రూపం. పితురార్జితం అనేది విలక్షణరూపం. లేదా పితుః (తండ్రినుండి) ఆర్జితమ్ (ఆర్జింపబడింది) పితురార్జితమ్ అని పంచమ్యలుక్ సమాసమైనా చెప్పుకోవచ్చు.
"నమ్మిన దిదివో నా పితురార్జిత
మిమ్మహిఁ జూడరో యిది మీది గాదు" 4-385

పిన్నవయసుఁదనము : (పిన్న + వయసు + తనము) వి. పిన్నవయస్సు, బాల్యం, ఇట పిన్నవయస్సు అనే శబ్దంపై స్వార్థంలో 'తన' ప్రత్యయం.
"మన్నించి గూడఁగరాదా మగఁడవు
పిన్నవయసుఁదనము పెట్టెఁబెట్టేవా" 19-72

పిప్పిగట్టు : (3) *అ.క్రి.* తడిఆరు, నీరసమగు, ఎండిపోవు.
"దప్పిదేరుచును తన పెదవుల
పిప్పిగట్ట నిన్నుఁ బలిచీని" 23-480

పిప్పిగా : *క్రి.విణ.* గట్టిగా.
"పిప్పిగా మోవి యానఁ బెనఁగేది బుద్ధిగాదు
కుప్పలుదెప్పలుగాఁ గూడవలెఁ గాని" 18-6

పిప్పి చవి యడుగు : *ప.బం; అ.క్రి.* వ్యర్థప్రయత్నం చేయు.

పిరరేచు : *స.క్రి.* 'పెరరేచు'కు వ్యావహారికరూపమా? 'పెరరేచు' రూపమేనా? ప్రేరేచు, ప్రేరేపించు.
"పిరరేచి యాతనినేఁ బిలిపించవచ్చునా" 12-35

పిరితియ్యు : (పిఱుదు + తీయు) *అ.క్రి.* 'పిఱుదీయు'కు వ్యావహారికరూపం. వెనుదీయు, పరాఙ్ముఖమగు.
"బిగువుఁ జన్నుల నొత్తి పిరితియ్యదు పంతము
మొగి నీ వలనేవంటా మెరఁగేఁగాని" 27-530
"చలువ నీ మోవితేనెగవి దొరకెఁగనక
పెలుచుఁదమకములఁ బిరితియ్యనైతి" 18-336

పిరితీయు : (పిరి + తీయు) *అ.క్రి.* వెనుదీయు.
"బిగ్గెఁగాఁగలించుకోవే పిరితీయక
నిగ్గుల యాతని మేను నేఁడే నొచ్చీనా" 5-264

పిరిదూరు : *అ.క్రి.* వెనుకదూరు.
"సారె సారెఁ బిరిదూరి సాకిరులు చెప్పఁగాను

తీరిచేటి చెలులెల్లా దీవించకుందురా" 10-2-50

పిరివీకు : వి. బాధ, పెనగులాట.

"చనవు లేని చోటి జగడాలు
పెనఁగఁబోతే వట్టి పిరివీకులు" 16-265 old

"పెనఁగి పంచేద్రియాల పిరువీఁకుల
య్యీనాఁడు
అనుభవింపఁగఁజేసి అందుకు లోనైతివి" 15-29

పిరువీకుసేయు : (పిరువీకు = బాధ) 1. బాధించు, పీడించు. 2. పెనగులాడు, పట్టిలాగు 3. వెనుకంజవేయు.

"పేరడి నింతేసి పిరువీకు సేయనేఁటికి" 14-487

పిఱుఁదుకొను : స.క్రి. వెంబడించు, అనుసరించు.

"వంతుల నూరేండ్లుండే వట్టి యాసలకు నే
పంతపు బ్రంహ్మండము పిఱుఁదుకొనేది" 15-226

పిలిచి పీటవెట్టు : *ప.బం; అ.క్రి.* మిక్కిలి గౌరవించు.

"పిలిచి పీటవెట్టి ప్రియములెల్లా చెప్పి
వలచి వలపించేటి వనితను నేను" 16-574

పిలిచి బిడ్డనిచ్చు : *ప.బం; అ.క్రి.* అడుగకుండానే మేలు చేయు.

"వలరాయని గరిడి వంటిదివో వలపు
పిలిచి బిడ్డనిచ్చిన ప్రియమిది వలపు" 7-212

పిలుచు : వి. పిలవడం, పిలుపు.

"పలుకుల చిలుకల పాటకోవిలలు
పిలుచులుగా చెలి పెంచెనదే" 8-7

పిలువకతొల్లి : పిలువకముందు.

"పిలువకతొల్లె వచ్చి పీటమీఁదఁగూచుండేవు
బలిమి తమకములు పచ్చిదేరె నీకు" 26-475

పిలువనంపు : (3) *ప.బం; స.క్రి.* రప్పించు.

"పడఁతిఁ బిలువనంపి పగడసాలాడేవు
వుడుగ కీ పరాకుల కోపునా ఆపె" 7-251

పిలువని పేరటము : (10) *వి; ప.బం.* అనవసరమగు జోక్యం.

"చలపట్టి యెన్నేసి సరసము లాడినాను
పిలువని పేరటము ప్రియమయ్యీనా" 25-19

"పిలువని పేరటాలు పెనగొన్న మోహాలు
నలువంక నేనే నీపై నడపేఁగాని" 16-283

పిల్లఁగోవి : (8) వి. పిల్లనగ్రోవి, మురళి.

"బింకపుమోఁతల పిల్లఁగోవివాఁడు
సింకసూపులవాఁడు సిన్నెకా" 5-182

పిల్లఁగోవివాఁడు : వి. శ్రీకృష్ణుడు, మురళిగలవాడు.

"బింకపుమోఁతల పిల్లఁగోవివాఁడు" 5-182

పిల్లఁగ్రోవి : వి. పిల్లనగ్రోవి, మురళి.

"పిల్లఁగ్రోవి పట్టుమంటాఁ బెరరేఁచీని మా
గొల్లవారి పిల్లఁగ్రోవి కోరో చల్లా" 6-109

పిల్లంగోవి : వి. పిల్లనగ్రోవి.

"పూచిన మానికింద పోఁటివెట్టుక తా నుండీ
యేచి పిల్లంగోవి యూదీ యేఁటికే వీఁడు" 11-179

పిల్లగొట్లు : వి. 'పిల్లగోట్లు'కు రూపాం. కఱ్ఱలతో బాలురు ఆడుకునే ఒకరకపు ఆట, బిల్లగోట్లు, దూరగోల.

"పట్టపగలే కొందరు పడుచులఁ గూడుకొని
అట్టుగపైఁ బిల్లగొట్లాడుచున్నాఁడు" 14-456

పిల్లగోవి : వి. పిల్లనగ్రోవి, మురళి.

"కొమ్మమోవి నీకుఁ బిల్లగోవి గాఁగ నిడుకొని
కుమ్మరించుఁగుత్తుకలోఁ గులుకుచును" 5-116

పిల్లదీపులు : *వి; ప.బం; బహు.* బాలక్రీడావిశేషం.

"పిన్నవై గోపాలులతోఁ బిల్లదీపు లాడితివి
యెన్నిక మాడుపూరిలో యిట్లాడేవా" 3-179

పిల్లదొరులు : వి. పిల్లన గ్రోవులు. రూపాం. పిల్లదురులు.

"గొల్లెతల మానముల కొల్లకాఁడు
పిల్లదొరు లూఁదేటి పిన్నవాఁడు" 23-92

'పిల్లదురులమోఁత' అని క్రీడాభిరామం. 64 పు.

పిస : వి. కామం.

"పిస లేనివారిఁ బేరఁ బిలువఁబోవుటకంటె
కొసరి కొండసిలకు కుయ్యుటే మేలు" 16-237

పిసిపిసి : (2) *ప.బం; విణ.* మెల్లమెల్లని.
"ముసిముసి నవ్వులతో ముందర నిలచి చెలులఁ
బిసిబిసియెలుఁగులఁబిలిచేవు" 18-202

పీ

పీటవెట్టుకొను : *ప.బం; అ.క్రి.* స్థావరం కల్పించుకొను.
"గెంటు లేని వెంకటగిరిమీఁదను వాఁడె
పీట వెట్టుకొన్నవాఁడు పెండ్లికొడుకు" 5-186

పీరుచు : *స.క్రి; మాం.* పీల్చు.
"లయించక భోగము జలగవలెఁ బీరుచఁగా
నియమించి మట్టువెట్ట నేఁడు నాకు వసమా"
3-208
"పిచ్చిలఁబూతకి చన్ను బీరిచినాఁడు" 3-235
ఈ పదం జానపదగేయాల్లో కూడా కనిపిస్తుంది.
"పాలు నల్ల పీర్చి పాణము
పోపడ గూల్చి పట్టి పడదన్నినాడు"
(రా.మాం. 84 పు.)

పీర్చు : స.క్రి. పీల్చు. చూ : పీరుచు.
"పొలియఁబీర్చితి వొకతిఁ బురిటిమంచముకాడ"
1-294

పీలిచుంగు : వి. నెమలిచుంగు.
"పచ్చని చీర గట్టిన బలుదొర నంటానే
కుచ్చుల పీలిచుంగుల కొంగువట్టేవు" 8-194

పీలిపించము : వి. నెమలిపింఛము.
"పమ్మిన పీలిపించపు పాగ చూచి నీ వనుచు
దిమ్ము విడిచి వొయ్యనె తెప్పిరిలె నిపుడు"
10-2-105

పు

పుంగుడగు : అ.క్రి. వంచితుడగు, దిగజారిపోవు. 'బ్రుంగుడు' వ్యావహారికంలో పుంగుడు కావచ్చు.
"మృదువైన తరుణుల మెఱఁగు బాహులతల
పొదలెల్ల దూరితూరి పుంగుడగయ్యేరయ్యా"
1-234
"పూపసంసారము నమ్మి పుంగుఁడై యిన్నాళ్లదాఁకా
దాపులేక బ్రతికితి దానికేమి" 3-331
"ఆలరి బంగారుగంటే నందరి మనసులూను
పోలిమి నా పసఁజిక్కి పుంగుడు గాకుండునా"
4-166
"పొదిగొన్న యాసలోఁ బుంగుడై సతతంబు
సదమదంబై పడయు చవులు దనకేలా" 1-302

పుంటినొవ్వు : వి. గాయంవల్ల కలిగిన బాధ.
"అంటుకొని మరుఁడొంటి అతివ నేఁపుటకంటె
పుంటినొవ్వుల విరుల పోట్ల మేలు" 5-42

పుంటినోవి : వి. గాయం వలన కలిగే నొప్పి.
"మానినీడు పుంటినోవి మరఁది వీఁడే
మానముపైఁ జేయి చాఁచీ మందవారి మరఁది"
1-435

పుండ్లుబూచులు : వి. పుండ్లు అనే అర్థంలో జంటపదం; లేక పుండ్లు అంటే దైహిక రోగాలు, బూచులు (= దయ్యాలు) అంటే మానసిక రోగాలు అని కూడా చెప్పవచ్చునేమో!
"పురుషోత్తమా! యంటేఁ బుండ్లు బూచులు మాను
పరమౌషధ మీతఁడే పాటింప మాకు" 1-461

పుక్కట : (8) వి. పుక్కట, పక్కటె, పుకసాటి అని కన్నడరూపములు. తేరగా, వ్యర్థముగా అని అర్థము. దీని రూపాంతరములు పుగసాటి, పూసాటి మొదలగునవి అనేకములు కలవు. పుక్కిటిపురాణము లోని తొలిపద మిదియే కావచ్చును. అసందర్భమైన ప్రసంగమని అర్థము అని సం.ప.స. (13 సం.) లో పేర్కొనబడింది. వేటూరి ఆనందమూర్తిగారు ఊరకనే, సునాయాసంగా అనే అర్థాలు సూచించినారు.
"పుక్కట దొరకె పొట్టఁబొరుగుననూ
కౌఁగిలి పుక్కట దొరకె" 6-96

పుక్కటకాఁడు : (పుక్కట + కాఁడు) వి.
1. సంబంధం లేనివాడు 2. వ్యర్థుడు
3. అన్యుడు , తేరకాఁడు రూపాం.
పుక్కటికాఁడు.
"పొసఁగఁగ నిది గని యధికుఁడు పుక్కటకాండ్ల నందరిఁ
బసమారిచి మొదలికర్తఁ బాలించిన గతిని"
1-72

పుక్కటికత్తె : వి. అన్యురాలు , తేరకత్తె (?)
"చెక్కు నొక్కవలెఁగాక శ్రీవేంకటపతితోడ
పుక్కటికత్తెవై యేల పొంచుకుండేవే" 27-233

పుక్కటికాఁడు : వి. చూ : పుక్కటకాఁడు.
"తక్కక పెద్దలు గాఁగ తల వణఁకుటే కాని
పుక్కటికాండ్లు హరిఁ బూజించనేరరు" 3-262

పుక్కిటఁబెట్టు : ప.బం; స.క్రి. ఆపోశనపట్టు , సర్వమూ ఆకళించుకొను.
"చుక్కలు మోవఁబెరిగి సూర్యువద్ద వేదాలు
పుక్కిటఁబెట్టఁ గలశాపురహనుమంతుఁడు"
4-167

పుక్కిటఁబోసిన బుద్ధులు : ప.బం; బహు. సర్వమూ ఆకళించుకొన్న బుద్ధులు .
"పుక్కిటఁబోసినయట్టి బుద్ధులు నీ కవి సుమ్మీ"
20-535

పుక్కిటికొలఁది పొగడు : ప.బం; స.క్రి. నోరార పొగడు.
"యెక్కువ తక్కువ మాటలేమీ ననరాదు నిన్ను
పుక్కిటికొలఁది నిన్నుఁ బొగడేమయ్యా"
13-109

పుక్కిటి పురాణమగు : అ.క్రి. లోకాభిరామాయణమగు , వృథాకాలక్షేపమగు.
"యెక్కడి కెక్కడ సూత్రమెంత నేరిచె మరుఁడు
పుక్కిటిపురాణ మాయ పొందుల మీ చేఁతలు"
20-507

పుక్కిటిబంటిగ : (పుక్కిలి + బంటిగ) క్రి.విణ. పుక్కిలి నిండుగా , నోరారా.
"సందడి వింజామర సారెసారె వేయఁగాను
పొంది నిట్టూర్పులు రేఁగీ పుక్కిటిబంటిగాను"
18-497

పుక్కిలి : వి. బుగ్గలోపలి భాగం .
"పుక్కిట సన్నలు సేసి బొమ్మలను జంకించి
చక్కని యీతని నెంత సాదించేవే" 26-386

పుక్కిలిబంటి : (పుక్కిలి + బంటి) పుక్కిలి నిండుగా.
"పుక్కిలిబంటియ నీతో పొందుల మాటలు నాకు
పిక్కటిల్లె వలపులు పెక్కులేల చాలురా" 12-8

పుచ్చఁబుచ్చ పున్నమగు : అ.క్రి. (?)
"పుచ్చఁబుచ్చ పున్నమాయ పూఁచిన నీ సరసాలు
వచ్చీరాని పాటలాయ వట్టి ప్రియాలు" 19-445

పుచ్చకాయలోర్చు : అ.క్రి. శ్రమను సహించు .
"పొంచి యేమి సేసినాను
పుచ్చకాయలోర్చుఁగాక
యెంచి వేలఁ జూపితేను యితరము లోర్చునా"
8-131

పుచ్చినపోక : ప.బం; వి. వ్యర్థం.

పుటగా : క్రి.విణ. అధికంగా .
"పుటగా నీరాలు దొబ్బుచు పెనుమడుగెల్లా
అటునిటు బూడిసి యాతఁడు" 24-150

పుటజయము : వి. దశమహావిద్యల్లో ఒకటైన తారవిద్యకు సంబంధించిన సాంకేతికపదం. పుణ్యపాపాల్లో కుటిలము లైన కోరికలను తుంచివేయడం.
"పుటజయమాయ నిట్టె పుణ్యపాపములందులో
కుటిలపుఁగోరికల కొనలు దుంచుట" 1-452

పుటమెక్కు : ప.బం; అ.క్రి. 1. వేడెక్కు 2. మెరుగెక్కు.
"పొలఁతుల కాఁకలే పుటమెక్కె మనసు" 4-335

పుటమెగయు : అ.క్రి. వన్నెయెక్కు , పైకెగురు, లంఘించు అని ఆం.ప.ని.
"వడిగొని మనసిజవాయువు విసరఁగ

పొడవగు నెఱుకలు పుటమెగసె" 3-19

పుటుగు: వి. పుట్టుగు, పుట్టువు, జన్మ.

"భూమిరమణా యని పుటుగులు గెలిచితి

వేమరు నితరులకు వెరవ నే నింకను" 15-169

పుట్టచెండులు: *ప.బం; వి.* ఒక ఆట. చూ: పుట్టచెండ్లు.

పుట్టచెండ్లు: (5) వి. బాలక్రీడావిశేషం, బంతియాట, గుడ్డతో చేసిన చెండ్లు (బంతులు), బాల్యంలో ఇలాంటి పుట్ట చెండ్లతో ఆడుకోవడం ప్రాచీనకాలంలో పరిపాటి. ఈనాడు మామూలు బంతిని కూడా పుట్టచెండు అనడం పరిపాటి.

"బొమ్మలచెండ్ల చేత పూచి చూపుల యమ్ముల

కుమ్మరించి వెలి నీపై గురులేసీ

సమ్మతించి యిరువంక చన్నులకాంతులు సొరె

జిమ్ము పయ్యదలోఁ బుట్టచెండ్లాడీని" 8-149

పుట్టించిన హరి పూరి మేపునా?: సామెత; మనకు జన్మ నిచ్చిన భగవంతుడే మన పోషణను చూస్తాడని అర్థం. 1-495

పుట్టుకాశ: వి. పుట్టుకతో వచ్చిన కాసె. (కాసె = కుచ్చెళ్లు ఎక్కువగా వచ్చేట్లు గోచి బిగించి కట్టే కట్టు)

"నించినాఁడు రౌద్రము నిడుపాటి దవడల

కాంచనపు పుట్టుకాశ కడు బిగియించెను" 3-301

పుట్టుపగ: వి. జన్మవైరం.

"పొట్టిపొట్టి యడుగుల బోయనాయఁడు యెందుఁ

బుట్టుపగ సాధించే బోయనాయఁడు" 1-460

పుట్టుపగ సాధించే బోయనాయఁడు: వి. పరశురాముఁడు.

"పొట్టిపొట్టి యడుగుల బోయనాయఁడు యెందుఁ

బుట్టుపగ సాధించే బోయనాయఁడు" 1-460

పుట్టుపూర్వాలు: *వి; బహు.* పుట్టుపూర్వోత్తరాలు, అన్నివివరాలు.

"కల దీ యింతికి గర్వాలు యెత్తి

పొలసీ నీ పుట్టుపూర్వాలు" 25-265

పుట్టుమాలిన బరుబోఁకి: పుట్టుకతో వ్యర్థమైన పనికిమాలిన వాడు.

"పుట్టుమాలిన బరుబోఁకివి నన్ను

దిట్టేవదే మోసి దిమ్మరిమాయ" 1-107

పుడమిధరుడు: వి. పర్వతుడు, ఆదిశేషుడు, భూమిని ధరించేవాడు.

"వెడమంత్ర మిఁక నేల వేరు వెల్లంకులు నేల

పుడమిధరుఁడు మాకు భువనౌషధము" 1-461

పుణుఁగుకాపు: వి. పునుగు అంటే పునుగుపిల్లి నుండి వచ్చే ఒకరకపు సుగంధద్రవ్యం. దానితో భగవంతుణ్ణి పూయడం.

"నేడె సుక్కురారము నెలఁతలాల

పోడిమిసేవ సేయరే పుణుఁగుకాపు" 8-153

పుణుగు పువ్వు గట్టినట్టు: *ప.బం; అ.క్రి.* పునుఁగు రాచి పువ్వు గట్టినట్లు, పునుగు తీసినదారంతో పువ్వులు మాల కట్టుట మైసూరులో నుండినదట. (సం.ప.స. 14 సం. 353 పు.)

"బాపు బాపు నీ మేలు పక్కన నన్నంటుకొనె

కైపగు పుణుఁగు పువ్వుగట్టినట్టే ఆయను"

14-418

పుణ్యపువాఁడు: వి. పుణ్యం చేసినవాడు, పుణ్యాత్ముఁడు.

"కౌరవులఁ బాండవులఁ గడుఁ జుట్టాలనెల్ల

పోరువెట్టి యంపినట్టి పుణ్యపువాఁడే" 9-134

పుణ్యము కట్టుకొను: (3) *ప.బం; అ.క్రి.* ఏదైనా మేలు చేసి ఆ పుణ్యాన్ని పొందుమని చెప్పేప్పుడు వాడబడే పదబంధం. (పద.)

"నేమాన నే పుణ్యమైన నీవే కట్టుకొందుగాక

యేమనిన నీ మాట కెదురాడేమా" 11-398

పుణ్యావాజన: వి. 'పుణ్యాహవాచనం' అనే శబ్దానికి వ్యావహారికరూపం. దైవాదికర్మ ప్రారంభంలో మంగళం కోసం పుణ్యాహమనే శబ్దాన్ని మూడుమార్లు చెప్పే శుభకర్మ. (శ.ర.)

"పురుఁడు వెళ్లెను మరి పుణ్యావాజన సేసిరి

మురిపేన గొల్లెతలు ముద్దాడిరి" 3-509

పుణ్యుఁడు : వి. బహు. పుణ్యవంతుడు. ఈ అర్థంలో ఇది విలక్షణ ప్రయోగం. పుణ్య శబ్దం నపుంసక లింగ శబ్దం, పుణ్యమని భావార్థం. కాని ఇట పుణ్యం కలవారని ధర్మివాచకంగా ప్రయోగం. పుణ్యపువాఁడని కూడా ప్రయోగం ఉంది. 9-134

"వేమరువో పుణ్యులాల వినరో యీ కతలు"

పునుకతల : వి; మాం. తలపుఱ్ఱె.

"పరఁగ పునుకతల పావనము సేసే మంటూ
నిరతితోడ దినము నీట ముంచేము" 3-174

పునుకవీఁపు పెద్దభూతము : వి. చిప్పవీపుగా గల భూతం. క్షీరసాగర మథన సమయంలో మందరపర్వతాన్ని ధరించడానికై కూర్మావతారాన్ని ధరించిన భగవంతుడని భావం.

"కినిసి వోడ మింగెడి భూతము
పునుకవీఁపు పెద్ద భూతము" 1-109

పునుకవీఁపు భూతము : వి. కూర్మము; క్షీరసాగరమథన సమయంలో మందర పర్వతాన్ని ధరించడానికి భగవంతుడు కూర్మావతారం తాల్చినాడు.

"కినిసి వోడ మింగెడి భూతము
పునుకవీఁపు పెద్ద భూతము" 1-109

పున్నమమాసలు : వి; బహు. మంచి చెడులు.

"పున్నమమాసలు పుడమిలో
బదుకులు పోయివచ్చేవి వో మనసా" 1-188

పుప్పించుకొను : స.క్రి. పుప్పిబట్టు.

"పుడిసెఁడౌను సిగ్గులు పుప్పించుకొనే వేళను
పిడికెడేసి కలవు పెట్టేసేసవేళను" 27-329

పుయ్యుట : వి. 'పూయుట'కు వ్యావహారికరూపం.

పురపురమను : ప.బం; అ.క్రి. నొప్పిపొందు, బాధనొందు, దుఃఖించు.

"పుక్కిట నీ ముచ్చటలు పురపురమనఁగాన
మొక్కలపుగుట్టుతోడ మోనమేల చూపేవు"
28-548

పు(ర)అవేదనలు : వి. బహు. సం.ప.స. (14 సం. 353 పు.) లో ఈపదం ఈ విధంగా వివరింపబడింది. పురువేదనలా? 'పురు భూయిష్ఠమ్' అని అమరము. ఇక్కడ తొందర, ఆత్రము అని చెప్పవచ్చును. బండి 'అ' ఈ వ్యుత్పత్తికి కొంత బాధకము. మిక్కిలి వేదనలు అని అర్థం చెప్పవచ్చును.

"జఱసి నీతో నేను సరివొట్టు పెట్టుకొని
పుఱవేదనలతోడఁ బొగులఁగాను" 14-337

"బరువైన మదన తాపంబునకు వెరవకిటు
పురవేదనలను నేఁ బొరలఁగాను" 2-258

ఇట 'ర' ప్రాసస్థానంలో ప్రయోగింపబడింది.

పురాణపత్రికలు : వి; బహు. పురాణాలకు చెందిన పత్రాలు.

"పారి నీ సుద్దులవే పురాణపత్రికలై
పెరుగుచు వ్యాసుల పెట్టెలలో నున్నవి" 15-416

పురుఁడు : వి. స్పర్ధ, పోటీ.

"పుక్కటసతులు నాతో పురుఁడుకు రాఁగాను
దక్కౌనా నీ పంత మదె తగఁజూచేవు" 11-409

పురుండ్లు : వి; బహు. పురుడుకు బహువచనరూపం, పోటీలు, స్పర్ధలు, సాటులు. (సాటి ఏ.వ.)

"పురుండ్లకుఁ జేరేవు పొత్తుల మాటలాడేవు
సరుసఁ గూచుండఁగ నా సరిదానవా" 18-64

పురుటిల్లు : (పురుడు+ఇల్లు) వి. ప్రసవగృహం.

"పొసఁగఁబొత్తులమీఁదఁ బురుటింటిలోపల
శిసువై మహిమ చూపె శ్రీకృష్ణుఁడు" 4-1

పురుడు : వి. 1. స్పర్ధ 2. పోలిక విణ. సాటి సమానుడు.

"నిక్కి చందురుఁడే మోమై నిండుఁగళలు దేరఁగ
పుక్కట నద్దముతోడి పురుడేఁటికే" 9-166

"పురుషులకు పురుషుఁడవు పురుషోత్తమా
పురుఁడు లేదిఁక నీకుఁ బురుషోత్తమా" 2-283

పురుడువెట్టు : (4) ప.బం; స.క్రి. సమానంచేయు, సాటిచేయు.

"ఆపెతోఁ బురుడువెట్టి ఆడక వుండినఁగదా
నాపై నీ వలపెల్ల నమ్మికుందును" 10-2-56

పురుషసూక్తము : వి. ఋగ్వేదంలోని పదహారు ఋక్కుల (మంత్రాల) సముదాయం. 10 వ మండలంలోని 90 వ సూక్తం. నారాయణమహర్షిచే దృష్టం. పురుష దేవతాకం. యజ్ఞయాగాదుల్లోనే కాక దీని వినియోగం భారతదేశ మంతటా ముఖ్యంగా ఆంధ్రదేశంలో షోడశోపచారపూజా విధానంలో మిక్కిలి ప్రచురంగా ఉంది. ప్రకృతి కతీతమైన సచ్చిదానందస్వరూపుడైన పురుషుని తత్త్వం ఈ సూక్తంలో ప్రతిపాదింపబడింది. అన్ని మతాలవారు ఈ సూక్తాన్ని వినియోగించుకుంటారు. ఈ సూక్తంలో పురుషశబ్దం ఎక్కువసార్లు ప్రయోగింపబడింది. కనుక దీనికి పురుషసూక్తమనే పేరు వచ్చింది. "సహస్రశీర్షా పురుషః" ఇత్యాదిగా నున్న మంత్రం ఇందులో తొలిమంత్రం.

"అందుక పురుషసూక్త మర్థముఁ జెప్పుదురు
కందువ నప్పటి నిరాకారమందురు" 3-33

పురుషామృగము : వి. తల పురుషరూపంలోనూ మొండెం మృగరూపంలోనూ ఉన్న రూపం. (పద.), రూపాం. పురుషమృగము.

"సారెకు భీముఁడు పురుషామృగముఁ
దెచ్చుచోట
నీ రోమములు గావా నిఖిలకారణము" 4-458

ఒకప్పుడు ధర్మరాజు చేసిన యాగ సందర్భంగా బ్రాహ్మణులు భోజనం చేసిన ప్రదేశం అపవిత్ర మౌతుంది. ఆ అపవిత్రతను తొలగించడానికి ధర్మరాజు అడవిలో పురుషమృగాకారంలో ఉన్న పురుషమృగమనే జంతువును తీసుకొని రమ్మని భీమ్ముణ్ణి ఆజ్ఞాపిస్తాడు. భీముడు హనుమంతుణ్ణి ఆశ్రయించి ఆయన అనుగ్రహంతో రోమములు సంపాదించి వాటి సాయంతో పురుషామృగాన్ని బంధించి తీసుకు వస్తాడు. ఈ కథ ఈ కీర్తనలో ప్రసక్తమైంది. పుష్పగిరి తిమ్మన సమీరకుమార విజయ కావ్యంలో ఈ కథ వర్ణింపబడింది. (7ఆ. 106 – 143 పద్యాలు)

పురుషామృగముల వేట : వి. పురుషుల వేట. (పద.)

"మిన్నక పురుషామృగముల వేఁటలు
పన్నుక యాడేరు పడఁతులు భువిని" 3-295

పురోడాశము : వి. యజ్ఞంలోని ప్రసాదం.

"తదియ్యి గురుప్రసాదపు పురోడాశమిచ్చి
కొదదీర ద్వయమును కుండలంబులు పెట్టి"
2-148

పులకబియ్యము : వి. పులగానికి ఉపయోగించే బియ్యం.

"పులకబియ్యాలఁ బొంగలివెట్టీ
చలివలపుల చన్నులను" 8-10

పులకమోసులు : వి; బహు. పులకాంకురములు. (వైరిసమాసం)

"పులకమోసులు గాని పుష్పబాణములు గావు"
17-25

పులకససులు : వి; బహు. రోమాంచముల పైరులు.

"చాలై మేనఁ బులకససులు నిండీ
మేలు నీ మేని వలపు మిక్కిలి పండీ" 18-32

పులిగాయ : (పులి + కాయ) వి. పుల్లనికాయ.

"వినుకలిచదువుల సదలో వేమరు మాఁగఁగఁ
బెట్టిన
ఘనకర్మపుటొగ రుడుగదు కమ్మర పులిగాయై"
1-482

పులిగూడు : వి. పులిహోర. (పుల్లని అన్నం)

"పులిగూడు దిన్నవాని పొందొక్కటే సేసెఁగాని
నలువంక లక్ష్మీనాథుఁడితఁడే" 1-454

పులిజూజము : (2) వి. పులిజూదము, జూదాలలో ఒక భేదం.

"మదనమందిరమే మచ్చిక పులిజూజము
వుదుటు మొగపు వజ్రాలొడ్డిన రాళ్లు" 7-167

పులియు : అ.క్రి. 1. మురియు, గర్వించు 2. బిగియు, బింకంతో ఉండు 3. కొవ్వుమదించు 4. దెబ్బలవల్ల శరీరం నొప్పిపెట్టు 5. అలయు 6. జ్వరం వచ్చు.

"పులియుచుఁ జూచేవేమే పొంచి పొంచి" 28-522

అలయు :

"ఇంక నా దైన్యము చూచి యెటు రక్షించెనో కాని
సంకెదీరఁ బులిసితి సర్వేశ్వరా!" 3-265

పులివిందల : వి. కడపజిల్లా లోని పులివెందుల గ్రామం.

పులివిందల శ్రీరంగదేవుడు : వి. కడప జిల్లాలోని పులివెందుల గ్రామంలో వెలసిన శ్రీరంగదేవుడు.

"చెలఁగి పులివిందల శ్రీరంగదేవుఁడవని
కలసితి మిదె శ్రీ వెంకటరాయ నేము" 14-15

పులుఁగము : వి. బెల్లం కలిపి పెసరపప్పు, బియ్యంతో వండిం న వంటకం.

"పట్టపుదేవుళ్లు తాను బంతిసాగి వున్నవాఁడు
అట్టే సేయరో పులుగమారగింపులు" 5-298

పులుఁగాలు : వి; బహు. 'పులుగము'కు వ్యావహారిక బహువచనరూపం.

"వింతగా చెలి నవ్వులే వెన్నెలబాయలు నీకు
పొంత నధరామృతమే పులుఁగాలు" 14-408

పులు కడిగిన ముత్యము : (3) ప.బం; వి. మాలిన్యాన్ని కడిగివేసిన శుభ్రమైన ముత్యం, పాత్రలు, విగ్రహాలు మొ॥ వాటిని చింతపండు పులుసుతో తోమి శుభ్రం చేయడం అలవాటు. దానిమీద వచ్చిన పలుకుబడి.

"ముంగిటఁ బులు కడిగిన ముత్యమువలె నున్నాడు
కుంగని రాజసముతో కొండవంటి దేవుఁడు" 3-125

"కప్పుర కాపామీఁదఁగడుఁ బూసుకొన్నవాఁడు
ముప్పిరిఁ బులుకడిగే ముత్యమువలె" 17-498

పులుకడుగు : అ.క్రి. మాలిన్యం కడుగు.

పులుగు : వి.అబద్ధం, అసత్యం. త. పుళుహు అని సంపా. గుర్తు, జాడ.

"పులుగు చెప్పెడి నదె పొంచి మా గురుఁడు నీకు
తలఁచుకో నేఁడు నీవు దాఁచినర్థము" 2-5

"పులుసువేసి నీ చెంత పురుషోత్తమా! నేము
పులు గరసితి మింత పురుషోత్తమా!" 15-252

పులుగుకాపు : వి. చూ : పుళుగుకాపు.

"పాలజలధిపై నీలిపట్టు నిండాఁ గప్పినట్టు
కాళిమతోడ పులుగుకాపమరెను" 17-501

పులుగుదోషము : వి. అసత్యదోషము.

"పులుగు నెక్కినవాఁడే పులుగుదోషపు రక్ష
బలు బాలుఁడైన వాఁడే బాలగ్రహరక్ష" 4-54

పులుమానిసి : వి. అల్పమానవుడు (వాచ.) ప్రాభవం కోల్పోయినవాడు. (పద.)

"చిత్తములో నిన్నుఁ జింతించనేరక
మత్తుఁడనై పులుమానిసి నైతి" 1-19

పులుసరమెంచు : వి; అ.క్రి; ప.బం. పాసినట్లు గుర్తించు.

"సందడించి మరునాఁటి చవులకే కూడఁబెట్టు
పొంది మింగిన కళ్ల పులుసర మెంచఁడు" 3-206

పుల్లఁదీగెలు : వి; బహు. సన్నని పుడక తీగెలు.

"నీ తలనే వేఁగెనా నిన్ను దూరఁబని లేదు
జాతిఁ బుల్లఁదీగెలకు సారె నలుగుదురు" 7-50

పుల్లాకు : (పుల్లె + ఆకు) వి; మాం. తిని పారవేసిన విస్తరాకు, ఎంగిలి విస్తరాకు.

"పారవైచిన పుల్లాకు బండికల్లె మించినట్లు
కోరి నీ ముద్రలు మోచి కొండగొంటి నిదివో" 3-466

పుళుగు : వి. పునుగు, పునుగుపిల్లినుండి వచ్చే గంధద్రవ్యం.

పుళుగుకాపు : (2) వి. పునుగు అనే సుగంధ ద్రవ్యాన్ని అలదిన శ్రీవేంకటేశ్వరస్వామి. పునుగుకాపు, పుళుకాపు. (పునుగు = పునుగుపిల్లినుండి వచ్చే గంధద్రవ్యం)

"అంగంపుఁబుళుగుకాపు అలమేలుమంగఁగూడి
సింగారా లాయను మంచి సిరు లాయను" 7-137

పువ్వకపూచు : (3) అ.క్రి. అవ్యక్తంగా ఉంటూనే వ్యక్తమగు.

"పువ్వుబోఁణుల కొలువే పుష్పయాగము
పువ్వక పూచె నీకిట్టే పుష్పయాగము" 14-396

పువ్వారుఁబోణి: వి. స్త్రీ, పువ్వువలె మనోహరంగా ఉన్న శరీరం కలది.

"సుద్దులు చెప్పఁగదమ్మ చొప్పాణి ముత్తెమా
పొద్దువొద్దు నీ పతికి పువ్వారుఁబోణి" 23-71

పువ్వు: అ.క్రి. పూచు.

"పువ్వఁగఁబువ్వఁగఁ బూపలె కావా" 22-451

పువ్వుకొను: ప.బం; అ.క్రి. పుష్పించు.

"చివ్వనను సంపెంగ చిగురుపైఁ బూచుఁగాక
పువ్వుకొనఁ జిగురు దాపుగ నుండునా" 7-372

పువ్వుగట్టు: అ.క్రి. పువ్వులు ధరించటం వల్ల వాసన కలుగు.

"పువ్వు గట్టినట్టి మేనఁ బుక్కిలించీఁ జెమట నా
జవ్వనపు మదమె పో చలపట్టీని" 5-281

పువ్వును పిందెవలె: ప.బం. అన్యోన్యంగా.

పువ్వుమొన వాడిచేయు: ప.బం; అ.క్రి. అసంభవమైన దానికి పూనుకొను.

పువ్వులందించిన చేత రాలందించినట్లు: నానుడి; గౌరవించిన చేతితోనే అవమానించు.

"పువ్వు లందించిన చేతఁ బూఁచి
రాలందించినట్టు
జవ్వని కుచాల నొత్త జగడా లేలే" 20-31

పువ్వుల చెండు: (3) వి. పువ్వులతో చేసిన బంతి.

"జవ్వనమదాన నాకె జంకించి చూచితేను
పువ్వులచెండునఁ దాఁకఁ బూఁచి వేసెవు"
26-444

పువ్వులవంక తుంగ తలకెక్కు: ప.బం; అ.క్రి. పెద్దవారి ఆశ్రయంతోపై స్థానం పొందు. (మామూలు తుంగ పూలమాలద్వారా తలమీద ధరింపబడుతుంది కదా!)

"గరిమ నంతటిలోనఁ గలసితే నిద్దరికిని
తొరలి పువ్వులవంక తుంగ తలకెక్కును"
16-265

పువ్వుల వేసినవారి పూపల వేయు: నానుడి; ఆదరించిన వారిని ద్వేషించు.

"పువ్వుల వేసినవారిఁ బూపల వేతురటవే
నివ్వటిల్ల మీలో మాట నీవే యెఱఁగవా" 18-96

పువ్వులు ముడిచిన తల పూరిమోవ వచ్చునా?: సామెత; గొప్పసుఖాలు అనుభవించిన చోటే దుఃఖాలు అనుభవించడం బాధాకరం అని భావం.

"పువ్వులు ముడిచిన తల పూరి మోవ వచ్చునా
యెవ్వతెఁదాఁ బొగడినా నేల వినేనే" 27-512

పువ్వు వేసినవారి రాత వేయు: ప.బం; అ.క్రి. ఆదరించిన వారిని ద్వేషించు.

"పువ్వుల వేసిన వారిఁ బూఁచి రాత వేయలేక
నవ్వంగనె నీతో నే నవ్వేఁగాక" 22-151

పువ్వుసజ్జ: వి. పూలపాన్పు, పూల పడక.

"ఎవ్వరిని దూరవచ్చు నెవ్వ రున్నారిఁకను
పువ్వుసజ్జమీఁదఁగాఁగె పొలఁతికి దేహము"
5-41

పుష్పయాగము: (3) వి. తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామికి రకరకాలైన పుష్పజాతులతో జరిగే యాగం. బ్రహ్మోత్సవాలు తొమ్మిదిరోజులు జరిగిన తరువాత పదోరోజున బ్రహ్మోత్సవంలోని లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఇది నిర్వహింపబడుతుంది. "ధ్వజారోహణ తీర్థాంత ప్రాయశ్చిత్తం తు యద్ భవేత్, తస్య దోషవిఘాతార్థం పుష్పయాగం చ కారయేత్" (కపింజలసంహిత) ప్రస్తుతం ఈ యాగం కార్తికమాసంలో శ్రవణానక్షత్రం (స్వామి అవతార నక్షత్రం) నాడు నిర్వహింపబడుతుంది. ఈ యాగప్రసక్తి తిరుపతి శాసనాల్లో కూడా కనిపిస్తుంది. (1-220, 15-47) 16 వ శతాబ్దిలో ఆగిపోయిన ఈ ఉత్సవం ఇటీవలే (1980 సం.) తిరిగి ఉద్ధరింపబడింది. (తాళ్ళ. ఉ. విశే. 156-163 పుటలు) తిరుమలకు పుష్పమండపమనే పేరు కూడా ఉంది.

"పూవుఁబోఁణుల కొలువే పుష్పయాగము
పూవక పూచె నీ కిట్టె పుష్పయాగము" 7-60

పూ

పూఁచిపట్టు : అ.క్రి. మునుముపట్టు, వరుసపట్టు.
"పూఁచిపట్టి యీ యింతిఁ బొగడరమ్మ
కోఁచక మేఘములోని క్రొమ్మెఱుఁగువలె"
20-218

పూఁచు : అ.క్రి. పూను, స్థాపించు. (శృం.మం.)
"పూవుల గుత్తులఁగొని పూఁచి యేల వేసేవే
పూవుల నొకతెమీఁద పూఁచి వేసెను" 20-596

పూఁట : వి. ఒక డీయదగిన ద్రవ్యానికి మరొకడు పూచీపడటం.
"పాయరాని మోహముల బలువై నిలుపుటకు
సోయగపు మీలోని చూపులే పూఁట" 17-313

పూఁటకాఁపు : (పూఁట + కాఁపు) వి. బాధ్యత వహించేవాడు, బాధ్యుడు. (పద.)
"పూని శ్రీవేంకటేశ్వర పూఁటకాఁపు లిందరును
వీనులతో నీకుఁ దామె విన్నవించేరు" 15-419
"కాచేనన్న చరమశ్లోకము నాకుఁ బూటకాఁపు"
15-419

పూఁటకూటిమీఁదఁ దమ్మ ఉమియు : మంచిదానిని చెడగొట్టు, వృథా చేయు, కష్టపడి సంపాదించుకొన్న వస్తువును అనుభవదూరం చేయు, అనుచితమైన పనిచేయు.
"బొమ్మరపోయెడి నవ్వులఁ బూఁటకూటిమీఁదఁ
దమ్మ వుమియఁగాదా తరుణి" 5-238

పూఁటపూఁటకు : ప్రతిరోజు, రోజురోజుకు
"బుద్ధి నేము చెప్పేమా పూఁటపూఁటకు
గద్దరీఁడు తానె యెరఁగవలెఁగాక" 7-556

పూఁటవడు : అ.క్రి. ఒకరు ఇవ్వవలసిన బాకీని నే నిస్తానని పూచీపడు, బాధ్యత వహించు.
"అట్టె తా పూఁటవడి ఆరవననఁగరాదు
పట్టి చవిగొంటా రోతపడఁగరాదు" 23-231

పూఁటవెట్టు : (2) ప.బం; స.క్రి. పూఁచీ వహింపఁజేయు.
"మంచి చిగురుమోవి నీ మోవి మోఁపెనని చెప్పి
పొంచి వసంతుని నీకుఁ బూటవెట్టినట్లు" 7-62

పూఁతమాటలు : వి. పైపై మెఱుగు మాటలు.
"పూఁతమాటల సొలపు బొంకులనె దూరేవు
యీఁతలేని చల్లులాట యేమి సేసేవే" 5-196

పూఁపకము : (పూఁపు + అకము) వి. పూనిక, ఉద్యమం.
"ఆన లేలయ్య నీ వాడినట్టె ఆడేము
పూనిన నీ మనసులో పూఁపక మేదయ్యా"
20-177

పూఁపకొడుకు : వి. బ్రహ్మ, పూఁబిందె కొడుకని వ్యుత్పత్తి.
"నీ పాదతీర్థము నెత్తి మోచె నొకఁడు
పూఁపకొడుకై యొకఁడు బొడ్డునఁబుట్టె" 3-76

పూఁబరపు : (పూ + పరపు) వి. పుష్పశయ్య.
"పవళించ వచ్చేవని పట్టెమంచముమీఁదట
వివరించి పూఁబరపు వేసుకున్నది" 19-42

పూఁబానుపు : (పూ + పానుపు) పుష్పశయ్య.
"లీలఁ బన్నీటికిని లేఁతా చెలిచెమట
లోలిఁ బూఁబానుపున నుడికెఁగాక" 6-7

పూ : వి. పూవు.
"వెదవడి పుత్రులు పౌత్రులే విత్తులు లోలో
మొలచియు
పొదిఁ గర్మపు పూ మారదు పూ పిందెయిన
దిదే" 1-482

పూచిన తంగెడువంటి పుత్తడిబొమ్మ : వి. కనులకింపుగా నుండే అందమైన స్త్రీ, బాగా అలంకరించుకున్న స్త్రీ, సిరిసంపదలతో కూడింది.
"రాచిలుక పలుకుల రవళితోడి కొమ్మ
పూచిన తంగేడువంటి పుత్తడిబొమ్మ" 13-239

పూచిన తంగెడువంటి పొలఁతి : వి. లక్ష్మీకరమైన స్త్రీ, ఆభరణాలతో నిండైన పొలఁతి, బాగా అలంకరించుకున్న స్త్రీ.
"పూచిన తంగెడువంటి పొలఁతి నీ వురమున
నేచినది నీ సింగార మేమి చెప్పేది" 14-386

పూచిన రేలా తంగేడు పొసఁగినట్లు : తంగెడు, రేలచెట్లు సమృద్ధిగా పరస్పరం రంగులతో (తెలుపు, పసుపుతో) పూసినట్లు.

పూజగుండలు : *వి; బహు.* అయిరేని కుండలు.
"సన్నలా చాయలనె సరుస నీ కాలుదొక్కి
చన్నులఁబూజగుండలు సారెఁ
బూజించవయ్యా" 29-289

పూజరి : (పూజ + అరి) వి. అర్చకుడు.
"పొసఁగి దేవుఁడిచ్చినా పూజరి వరమీఁడు" 3-220

పూజెకుండలు : *వి; బహు.* అయిరేని కుండలు. రూపాం. పూజెగుండలు.
"పొంచి నా చేతికి పెద్ద పూజకుండ లిమ్మంటేను
వంచనతో నిట్టే యాల వంచీనే శిరసు" 12-243

పూజెగుండలు : వి. అయిరేనికుండలు.
"దొంతిఁ బెట్ట వలపులు తోరపుఁబూజెగుండలా
పంతాలు సంగడిఁబార బండికండ్లా"
"పూజెకుండలు నిల్చెఁ బువ్వఁబోడి యొకర్తు
శుభవితర్దిక చతుష్కోణములను" శివ. 256

పూతకి : వి. పూతన.
"సరసమాడఁగ నీకు సతి శూర్పనఖ గద్దు
పోరిఁ జన్నిచ్చి పెంచఁగఁ బూతకి గద్దు" 7-317
"బొమ్మరపోవఁడు పూతకిఁ బొరిగొని
అమ్మరో గయ్యాళి శిశువు" 6-151

పూనికె : వి. పూనిక. (క.పూనికె) ప్రయత్నం.
"నేనే తమకింతుఁగాని నీవు తమకించవేర
పూనికె లొక్కటిగావు బుద్ధి యేదుకో" 24-180

పూనిపట్టు : (2) పట్టుదల వహించు.
"పూనిపట్టి నేనిప్పుడు పొంచి యెచ్చరించే
దేమి" 24-445

పూప : విణ. నిస్సారమైన.
"పూప సంసారము నమ్మి పుంగుడై
యిన్నాళ్లదాఁకా
దాపులేక బ్రతికితి దానికేమి" 3-331

పూరిజీవులు : *వి; బహు.* పూచికపుల్లవంటి జీవులు, తృణప్రాయులు, నికృష్టజీవులు.
"ఊరకైతే నిన్నుఁగాన మొక కారణానఁగాని
పూరిజీవులము నీవు పురుషోత్తముఁడవు" 2-161

పూరిపుల్ల మేరువుసేయు : *ప.బం; అ.క్రి.* సామాన్యమైన వస్తువును పెద్దదిగ చేయు. (గడ్డిపుల్లను మేరుపర్వతం చేయు అని వాచ్యార్థం.)
"చెల్లుఁ గాగిట నీకే చింతింపఁగా పూరి
పుల్ల మేరువుసేయ భూమిలో నిపుడు" 1-182

పూవక పూచు : (?)
"పూవుఁబోఁణుల కొలువే పుష్పయాగము
పూవకపూచె నీకిట్టె పుష్పయాగము" 7-60

పూవు : అ.క్రి. పూచు, పుష్పించు.
"తీవెలకుఁజుట్టి చుట్టి దిక్కు లఁబాఁక నేర్పిరా
తావులఁదతికాలానఁ బూవ నేరిపిరా" 2-333

పూవుటేట్లు : (పూవు + ఏట్లు) *వి; బహు.* పూలదెబ్బలు.
"పోహణించి యేల నాకుఁ బుట్టించేవు తరితీపు
ఈహల మరుని పూవుటేట్ల గురుతు" 27-295

పూవు పరిమళమై : అన్యోన్యంగా.
"మీవంటి దాననటె మీరఁగనేనను
పూవుఁబరిమళమై పొదిగేఁగాక" 21-420

పూవు పిందెవలె : *ప.బం.* కలసిమెలసి.

పూవులగాలము : వి. పూవులు పూసే కాలం, వసంతకాలం.
"పూవుల గాలమవై పురుషునిఁ దగిలేవు
వేవే యెంత రాజ్యమేలితివె నీవు" 14-83

పూవులవల్ల తుంగ తలకెక్కినట్టు : సామాన్య వస్తువైనా ఉత్తమవస్తు సంయోగంతో పై స్థానాన్ని ఆక్రమించినట్లు.
"దోపుచుఁ బూవులవల్ల తుంగ దలకెక్కినట్టు
దాపగు నాలికె నిన్నుఁదలఁచఁగవలసె" 3-440

పూవుల వాసనవలె నుండు : అ.క్రి. అంతర్లీనంగా ఉండు.

పూవుల వేసినవారిఁ రాల వేయు : ప.బం; అ.క్రి. గౌరవించినవారిని అవమానించు.

"పూవుల వేసినవారిఁ బొంచి రాల వేసినట్టి
భావము నీయందె కంటి భళిభళి గుణములూ"
11-310

పూవులు ముడిచిన సిరసున కట్టెలు మోచు : నానుడి; ముందు భాగ్యమనుభవించిన చోటనే కష్టాల పాలగు.

"మునుకొని పూవులు ముడిచిన సిరసున
కనలి కట్టెలు మోచి కాకయ్యేదా" 3-456

పూస గుచ్చినట్టు : ప.బం; క్రి.విణ. వివరంగా.

"పూసగుచ్చినట్టు నీకు బుద్దులు నేఁ జెప్పితేను
ఆసతో నా మోవి మోవి నందుకొనేవు" 11-564

"పూసగుచ్చినట్టు నీకు బుద్దులు చెప్పి నాకె
వేసరక వినవయ్య వేమారును" 27-136

పూసగుచ్చిన దారము : ప.బం; వి. అన్నింటినీ కలుపుతూ అనుస్యూతమై కలసిపోవునది.

"పూసగుచ్చిన దారము పోనీఁడు తానన్నను
వాసితో వీరి వారి వెనువెంట వలలఁదిరుగుట
చాలదా" 11-449

పూసగొండి : (పూశల్ + గొండి) ప.బం; వి. కలహస్వభావం కలవాడు. ఇతరుల పనులు నెత్తిమీద వేసుకొనేవాడు. (తె.వ్యు.కో; పద.) (త. పూశల్ = కలహం, గొండి = తచ్ఛీలార్థక ప్రత్యయం) తనకు లేని సంబంధం కల్పించుకోవటం? తె.వ్యు.కో. లో 'పూసిగొండి' అనే పదం చూపబడింది. దీనికి తనకు లేని సంబంధం కలిగించుకొనేవాడు, అనావశ్యకంగా ఇతరుల కార్యం తనపై వేసుకునేవాడు అనే అర్థాలు చూపబడ్డాయి.

"బిట్టు వాగెలఁబెండ్లిపేరటము వోతిని
ఇట్టి పూసగొండివి నీకేమి బాతి సతులు"
21-151

పూసగొండితనము : (పూసగొండి + తనము) వి. తనకు లేని సంబంధం కల్పించుకోవటం.

"పుక్కటవలపుతోడి పూసగొండితన మేల
పక్కన మొఱఁగితేను పగలు రేయౌనా" 14-292

పూసగొండిమాటలు : ప.బం; వి; బహు. లేని సంబంధాన్ని కల్పించుకొని మాట్లాడే మాటలు.

"వొగరుఁదీపుగా నీవు వోరగండ్లఁ జూచిన
మగటిమిఁ బూసగొండిమాటలెల్లా నాడుదూ"
12-34

పూసల దారమువలె : ప.బం; అన్యోన్యంగా, కలసిమెలిసి.

"చెనకి మాయకు మాయై జీవునికి జీవమై
మొనసి పూసలదారమువలె నున్నాఁడు" 2-232

పూసల దారమై ఉండు : ప.బం; అ.క్రి. అన్నింటినీ కలుపుతూ అనుస్యూతంగా ఉండు, అన్యోన్యంగా ఉండు.

"చెనకి మాయకు మాయై జీవునికి జీవమై
మొనసి పూసలదారమువలె నున్నాఁడు" 2-232

పూసలలో దారము : (3) ప.బం; వి. అన్నింటా అనుస్యూతమై కలసిపోయినది, అన్యోన్యంగా ఉండేది.

"పూసలలో దార మీ పురుషుఁడు నీకు నాకు"
7-459

పూసుకవాసుక వచ్చు : పూసుకొని, పాసుకొని. యథేచ్ఛగా (పూసుక + పాసుక)

"పొందు గలదానవు పూసుకవాసుక వచ్చి
గందము వూసేవు మేన కడుబత్తితోను" 26-219

"పూసుకవాసుక వచ్చే పొరుగులదాననా
రాసికెక్కె పట్టపురమణి నేను" 23-546

పూసుగోడు : వి. సం.ప.స. లో ఈ పదం ఈ విధంగా చర్చింపబడింది. "అస్థిరం, తప్పు కప్పిపుచ్చుట అను అర్థములలో పూసిన గోడ, పూసిన గోళ్లు వంటిది కావచ్చు. పూసుగోళ్లు అనుటకు బదులుగా పూసుగోడు అను ఏకవచనరూపము అపురూపమే. కన్నడమున సాధించవచ్చునేమో" (16-430 పు.) ఇట అస్థిరం అనే అర్థం యుక్తంగా ఉంది.

"సేసతోఁ బెండ్లాడినదే చెల్లుబళ్లౌగాక

పూసుగోడ్రై అంటుకొన్న పొందులు
నిజమౌనా" 16-9

పె

పెంచము : వి. పింఛము. రూపాం. పెంచెము.
"పేగులజంద్యాలు వేసి పెంచపు నమలిపురి
పాగగాఁ జుట్టిన నా బాఁపనయ్యే వీడివో" 5-254
"చుట్టు నెమలిపెంచము చుంగుల నల్లని కాంతి
అట్టె అంగముల నెల్లా నలమెనో కాని" 23-148

పెంచు : (3) వి. పెనం; రొట్టె మొ॥ కాల్చడానికి వాడే గుండ్రని పాత్ర విశేషం.
"పెంచు దెచ్చి మాణికపు బిల్ల సేసె
తోలుబిల్ల మాడకంటె దొడ్డుసేసె" 4 అను. 44
"కాలిన పెంచై వుండి కప్పెర దివ్యాన్నమిచ్చి"
1-455
"ఇల నిందరి నుతియించి పెంచువలె
నలినలియైనది నా జిహ్వ" 1-56

పెంచెపుటాకసము : (పెంచెము + ఆకసము) వి. విశాలమైన ఆకాశం.
"పెంచెపుటాకసము నీ పిడికిటిలోనిది
యెంచరాని వెడదైన్య మేలే నీకు" 20-260

పెంచెపుటురము : (పెంచెము + ఉరము) పింఛము గల వక్షస్సు, వక్షఃస్థలం, తోక, తోకకుచ్చు గల వక్షస్సు.
"నించి శ్రీవేంకటేశుఁడు నీ కౌఁగిటఁగూడినాడు
పెంచెపుటురాన నిన్నుఁ బెట్టుకొనెఁగా" 7-130

పెంచెము : వి. పింఛం, తోక, తోకకుచ్చు.
"యెంచుకో నీ సొమ్ములలో యిది
దాఁచవచ్చునేమో
పెంచెపు మా గురిగింజ పేరడిగేవు" 7-583
"పెంచెపు శ్రీ వేంకటేశ పెండ్లి ముత్యాలసేన
వంచికూడి చెలి మానవచ్చు నటయ్యా"
20-167

పెంజమాటలు : వి. 1. తేలికైన మాటలు
2. తుచ్ఛమైన మాటలు.
"అంగపుఁజిఱుఁజెమట లర్ఘ్యపాద్యాచమనాలు
సంగతిఁబెంజమాటలె జలకములు" 12-273

పెంజెమటలు : (పెను +చెమటలు) వి. మిక్కిలి చెమటలు.
"ఇచ్చకమాడ నెఱఁగ నేమి సేతునే
హెచ్చీఁ బెంచెమటలు యేమి సేతునే" 9-71

పెంట : వి. కుప్ప, పిండం. (గోవులు గడ్డిమేసిన తావు, అశితము పట్టు)
"పెచ్చుపెరిగి కోరికలు పెంటలై పెరుఁగఁగాను
హెచ్చిన దీమసములు యేడనుందు నిఁకను"
28-187

పెంటగా : (2) క్రి.విణ. కుప్పగా.
"పెంటగా నీ కెంత ప్రియమాయెనో" 24-583
"పెంటగా నిద్దరము నీ పెండ్లి చవికెలోన
వుంటిమిగా ఆడకేల వొద్దయ్యే సోదించను"
16-82
"అంటుచు నీ చన్ను లటు గని మొక్కఁగ
పెంటగా నానలు పెట్టుదురా" 26-323

పెంటపట్టు : వి. పెంట = అంగడి, పట్టు = చోటు, పెంటపట్టు = బజారీ.
"పెంటపట్టు సరసాలఁబెనఁగనేలా" 15-231

పెంటపట్టు బీరము : వి; ప.బం. తగనిచోట చూపే బీరం, వ్యర్థమైనదని భావం. పెంటపట్టు అనగా పశువులు నిలిచి పేడవేయు చోటు. అక్కడ చూపే బీరము అనేదానిని బట్టి వచ్చినది.
"పిలిచి నీకు నాకు పెంటపట్టు బీరమేల
కలతము వలపుల కలి(ల)నికి రారా" 14-272

పెంటపులకలు : వి; బహు. అధికమైన గగుర్పాటు.
"అంటితే శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గూడుఁగాక
పెంటపులకలు నీకుఁ బెరుగనేలే" 21-124

పెంటపెట్టుకొను : అ.క్రి. అంగడిపెట్టుకొను.
"గెంటు లేని వేంకటగిరిమీఁదను వాఁడె
పెంటపెట్టుకున్నవాఁడు పెండ్లికొడుకు" 5-186

పెంటపెరుగు : వి. ఆవుపెరుగు, గడ్డపెరుగు.
"పెంటపెరుగుల దొంగ పెండ్లికొడుకు భూమిఁ
బెంటిపోతులఁ గూరిచెఁ బెండ్లికొడుకు" 5-186

"పెంటపెరుగే పెంటపెరుగే
పెంటమంద పెనుఁబెంటపెరుగే" 5-176

పెంటపెరుగుల దొంగ: వి. ఆవుపెరుగుల దొంగ.
"పెంటపెరుగుల దొంగ పెండ్లికొడుకు భూమిఁ
బెంటి పోతుల యారిచెఁ బెండ్లికొడుకు" 5-186

పెంటమంద: వి. ఆలమంద.
"పెంటపెరుగే పెంటపెరుగే
పెంటమంద పెనుఁబెంటపెరుగే" 5-176

పెంటల పూజలు: వి; బహు. సమృద్ధములైన పూజలు కావచ్చు.
"జంటల నిద్దరివిని జాజులుఁ గలువలునై
పెంటలపూజలై కడుఁ బిక్కటిల్లీ మేనను" 18-70

పెంటలు: కుప్పలు, మిక్కుటములు, గుంపులు, పేటలు, చెత్తలు, బాధలు.
"పెంటలాయ సేసలు పెనగొనె నాసలు" 19-177
"పెరుగఁబెరుగఁదానే పెంటలయ్యీ వలపు" 16-352
"కంటిమయ్య నీ చేతలు కన్నులపండుగగాను
పెంటలైన ముచ్చటులే ప్రియము నీకు" 19-136
"నంటున నీతో నవ్వేఁగఁజూపులు
పెంటల నూరక బెదరీని" 20-212
"పెంటలై వున్నా రిదివో పేరటాండ్లిందరును
గొంటరివి యని యాడుకొనేరు గదయ్య" 14-140
"పేరఁ బేరవలపులు పెంటలయ్యీని
నేరుపులు లోలోనే నింతముగాని" 26-81

పెంటవెట్టుకొను: తగవు పెట్టుకొను, (వ్య.) కలహించు.
"పెంటవెట్టుకొని పెనఁగీ నింతలో
వెంట రానమరు యింటిదానికి" 26-495

పెండిలి ఆడేవారు: వి; ప.బం. పెండ్లి చేసుకొనేవారు.
"పెండిలి ని న్నాడేవారు పీఁటమీఁదనే వున్నారు
నిండువాని మేనవారు నిలుచున్నారు" 22-316

పెండిలిపీఁట: వి. పెండ్లిలో వధూవరులు కూర్చునే పీట, పెండ్లిపీట.
"పెండిలిపీఁటెక్కితివి ప్రేమఁజెక్కు నొక్కితివి
అండనే సతికిఁ బతివైతివయ్యా" 26-424

పెండెము: (5) వి. 1. గండపెండారము 2. వలుగాడి తలుపు. రూపాం. పెండియము. శూరులు బిరుదుగా కాలికి ధరించే అందె.
"పెట్టెడి నా పెండెమిది పెట్టుకొంటి నిందరిలో
ముట్టి నాకు నిది గొంత మోచిదింపులా" 23-563

పెండెము: వి. 1. రొట్టెలు, దోసెలు మొ॥ కాల్చడానికి వాడే గుండ్రని మట్టిపాత్ర. వి. 1. పొలంచుట్టూ వేసిన కంచెకు కొయ్యెలతో అమర్చిన ద్వారం 2. పాదాంగదం 3. కంప మొ॥ వాటితో ఏర్పరచిన తలుపు.

పెండ్లాడి పొంతనాలు చూడు: నానుడి; వ్యర్థమైన పనికి పూనుకొను, పెండ్లికి ముందు చూడవలసిన పొంతనాలు పెండ్లి తరువాత చూడడం వ్యర్థమే కదా!
"పొలుపుగాఁ బెండ్లాడి పొంతనాలు చూడనేల
చెలరేఁగి తెరదీసి సిగ్గు మరేల" 16-470

పెండ్లిపీట: (16) వి; ప.బం. పెండ్లిలో వధూవరులు కూర్చునే పీట. చూ: పెండిలి పీట.

పెండ్లిపేరటము: వి. పెండ్లి మొ॥ శుభకార్యం.
"బిట్టు వాఁగెలఁ బెండ్లిపేరటము వోతిని
యిట్టి పూసగొండివి నీకేమి బాఁతి సతులు" 21-151

పెండ్లిసోబనము: వి. (?)
"ప్రేమాన మీకిద్దరికి పెండ్లిసోబనము
యీ మగువలునుఁగూడి రేమి సేతురయ్యా" 26-512

పెందలకాడ: (5) ప్రొద్దున, ఉదయాన, పెందలకడ, పొద్దుపోకముందు.
"అంది విడేలిచ్చుకొంటా ఆయాలు గరఁగు కొంటా
పెందలకాడను మీరు పెండ్లిండ్లాడరా" 29-1

పెంపుడుఁగుచాలు : *వి; బహు.* పెరిగిన స్తనాలు.
"పెంపుడుగుచాల నిన్నుఁ బెద్దసేసేఁ బో నే
నింపులరతుల నిన్నెచ్చరించేనే" 9-59

పెంపుడులేడు : వి. 'పెంపుడులేడి' కావచ్చు.
"యేపున మన సనియేటి మా పెంపుడులేడు
పాపమనే యడవిఁబడినది" 1-506

పెక్కిండ్ల విందు : వి. జారుడు.
"అందగాఁడ తిరువేంకటాధీశ పెక్కిండ్ల
విందవై నీ వొకతెపై వెచ్చఁదన మున్నదా" 5-1

పెగడతనము : (పెగడ + తనము) వి.
గొప్పతనం. (బ్రౌన్)
"తెగువగల దొకతె తిట్టదాయ నందులోన
పెగడతనాలెల్లఁ బ్రియముతో విందుము"
27-254

పెచ్చు : వి. ఆధిక్యం, అతిశయం.
"ఇంత పెచ్చు లేని వలపేఁటికమ్మా" 6-121

పెట్టనికోట : *ప.బం; వి.* రక్షకం.
"ముంచిన సిగ్గయితేను మొదలఁబెట్టని కోట
మించి కాంతల కే పోద్దూ నీ మీఁదిదే యాట"
16-69

పెట్టనెమలి : (2) వి. ఆడునెమలి. (పెట్ట = ఆడుపక్షి)
"చుట్టితి పెంచము సోగనెమలివలె
పెట్టనెమళ్లను బెరసేవు సుమ్మీ" 23-183

పెట్టరు పోయరు : *ప.బం;* క్రి.ప. పోషించరు, అన్నం పెట్టరు - నీరుపోయరు ద్వారా ఏర్పడిన పదబంధం.
"ఇట్టునట్టుఁ దిరిగాడి యేమైనాఁ జెడనాడి
పెట్టరంటాఁబోయరంటాఁ బెక్కులాడి" 1-59

పెట్టరు పోయరు : క్రి.ప. కానుకలతో ఆదరించరు అనే అర్థంలోని పదబంధం. పెట్టిపోతలని కూడా వ్యవహారంలో ఉంది. (పెట్టడం = వస్త్రాదులు పెట్టడం, పోయడం = సారె పోయడం)
"ఇట్టునట్టుఁ దిరిగాడి యేమైనాఁ బెడనాడి
పెట్టరంటాఁ బోయరంటాఁ బెక్కులాడి" 2-59

పెట్టుఁజెట్టు : (6) *ప.బం; వి.* 1. తాను వృద్ధిలోకి తెచ్చినది 2. కల్పవృక్షం. (పర్యాయ)
"చెండువడి నీ వొకరి పెట్టుఁజెట్టువా యేమైనా
నిండుదొర వప్పటిని నీ కేల వెఱపు" 23-192

పెట్టెలో సొమ్ము : *ప.బం; వి.*
కొంగుబంగారంవంటి పలుకుబడి, అందుబాటులో నున్న ధనం.
"పెట్టెలో సొమ్ము గదవే ప్రియురాలు నీ వయసు
కట్టిన ముడుపు గదే కాఁగిటిరతి" 28-505

పెట్లుప్పు : (పెట్లు + ఉప్పు) వి. బద్దలయ్యే ఒకరకపు ఉప్పు.
"కప్పురము సుమ్మీ యది కంతు పెట్లుప్పు గాఁదు
పుప్పొడి సుమ్మీ చొక్కుబూడిదె కాదు" 28-582

పెడఁబాయు : *ప.బం;* స.క్రి. విడుచు, త్యజించు.
"సిగ్గులెల్లా పెడఁబాసె చేరి యెవ్వరు నవ్వినా
యెగ్గుపట్టదు మనసు యెఱుకతోనే" 2-4

పెడగంత : (పెడ + కంత) వి. తప్పుత్రోవ.
"పెద్దతెరు వుండఁగాను పెడగంతలు దీసుకో
పొద్దువోక యడవులఁ బురిగుడయ్యేరు" 3-383

పెడతటి గండఁడు : *వి; ప.బం.* ఒరుల మాట వినని మూర్ఖుడు, పెడసరపు మనిషి. (పద.)
"పెంచుకోవిల నోరు పెడతటికిఁ బోదాయె" 6-92

పెడమరలు : అ.క్రి. పక్కకుగాని, వెనుకకుగాని తిరుగు.
"పెడమరలుండఁగాను పేరునఁ బిలవకురా
వడిమురిపెముల గర్వపువారమా" 11-155

పెడమరు : స.క్రి. వీడిపోవు.
"కాయము గడపల గనుదాఁక యీ
మాయు తన్నుఁ బెడమరు గాక" 1-212

పెడమళ్లు : అ.క్రి. పెడమరలు.
"పెడమళ్లి చూచె నంటా పెద్దకొప్పు పెట్టెనంటా
పడఁతికై నేటికి నెపాలు వేసేవు" 29-350

పెడమొకము వెట్టు : *ప.బం;* అ.క్రి. విముఖత కనబరచు.

పెడరేచు: ప.బం; స.క్రి. మిక్కిలి ప్రోత్సహించు, పురికొల్పు.
"నేరఁగల దొక్కటే నిశ్చలబ్రహ్మవిద్య
వారివారి యంతర్యామి వచ్చి పెరరేఁచీని" 2-184

పెడవాడఁబెట్టు: ప.బం; స.క్రి. బహిష్కరించు.
"వెట్ట సంసారమిది వెంకటేశునిఁ గొలువని
వట్టి మనుజుల పెడవాడఁ బెట్టుఁగాక" 1-177

పెడవాడ: వి. ఇలువరుస మార్పు లేక వరుసమార్పు. (సంపా.)
"సేసవెట్టి పెండ్లాడి చెలియను మగవాఁడు
వేసటతోఁబెడవాడ వేయ దగునా" 24-260

పెదపెద: విణ. మిక్కిలి పెద్ద.
"పెంటల గోపికలెల్లా పెదపెద మేడలెక్కి
నంటునఁ జూచి సిగ్గుతో నవ్వులు నవ్వేరు" 18-73

పెదయౌబళపుఁగొండ: ఎగువ అహోబలపుకొండ. ఇట వెలసిన నృసింహస్వామిని లక్ష్మీనృసింహుడని అంటారు. దిగువ అహోబలంలోని నృసింహస్వామిని ఉగ్రనృసింహుడని అంటారు.
"పెదయౌబళపుఁగొండఁ బెరిగీ నదే
వదలక గొలిచితే వరము లిచ్చీని" 11-13 old

పెదవి గొణఁగుకొను: పెదవితో ఏదో అస్పష్టంగా లోలోన పలుకుకొను.
"పెదవి గొణఁగుకోంగా ప్రియుఁడాకెఁ జెక్కు నొక్కి
చెదర నాడుక లోనై చిక్కఁజెలి" 17-478

పెదవితేనె: వి. అధరామృతం, మోవితేనె.
"అదిమి నిన్నుఁగౌఁగిట నట్టే కౌఁగిలించుకుండఁ గాను
పెదవితేనెకు నేల పెనఁగేవు నీవు" 17-221

పెదవిపై మాటలు: ప.బం; వి; బహు. పైపై మాటలు.
"పెదవిపై మాటలకే పెద్దగా వలచితివి
యెదిరించి యాల యెలయించ వచ్చేవు" 29-323

పెదవిమీఁదటి తేనె: వి. అధరామృతం, సులభం.
"పెదవిమీఁదటి తేనె పేరుకొనేనీ జపము
అదన మాకు నదివో అక్కరలేదయ్యా" 3-580

పెదవివిఱుచు: ప.బం; అ.క్రి. నిరాశను సూచించు.
"కొసరి కొసరి నిన్నుఁ జూచి కోపగించఁజాలకా
విసువుతోడ గొణఁగి పెదవి విఱుచుకొనఁగఁ జాలదా" 17-467

పెదవులవుడు కఱచు: అ.క్రి. కోపావేశం చేత కిందిపెదవి కొఱుకుకొను.
"తోరంపుఁబెనుచేతుల మల్ల చఱచి
దారుణలీలఁ బెదవులవుడు కఱచి" 1-211

పెదవులు పిప్పిగట్టు: అ.క్రి; ప.బం. పెదవులు వాడివత్తలగు.
"పెచ్చురేఁగి యేకతాన పెదవులు పిప్పిగట్ట
మచ్చిక నీతనితోను మాఁటలాడవా" 28-145

పెదాలు పుక్కిటఁబెట్టు: అ.క్రి. మిన్నకుండు.

పెద్దకంభమురాయఁడు: (?)
"కరుణించవయ్య మమ్ముఁ గంభమురాయ
పెరదేవుని కాలువ పెద్దకంభమురాయ" 18-420

పెద్దతెరు వుండఁగా పెడగంతలు తీయు: ప.బం. పెద్దమార్గముండగా సందుగొందులు వెదకు.

పెద్ద దంతెనాల కోట: వి. దంతెన = a large rake (బ్రౌన్)
"తలవాకిలి దంతపుతలుపుల కోటా
తలిరుఁజేతుల పెద్ద దంతెనాల కోటా" 2-84

పెద్దరికము: (3) (పెద్ద + ఱికము) పెత్తనము, ఇట 'ఱికము' అని శకటరేఫ ఉండాల్సి ఉండగా సాధురేఫ ప్రయుక్తం.
"అదియు నా పెద్దరిక మన్నిటాఁగాదా
పదరినా యిందరును బలఁగమే కదవే" 7-78

పెద్దరికెము: (పెద్ద + రికము) 'పెద్దరికము'నకు వ్యావహారిక రూపం. పెత్తనం.
"పొద్దువోదా నీకదేమి పోరు లేలే
పెద్దరికెము సేసితే బిగేసే వేమే" 7-77

పెనపరాలు: *వి; బహు.* వివాదాలు.
"కొనవేసి మరికొంత కొసరఁగఁబోతేను
పెనపరాలకు వచ్చి పిప్పిగట్టును" 23-251
పెనపరి: (పెనపు + అరి) వి. 'పెనుపరి'కి వ్యావహారికరూపం కావచ్చు. అధికుడు, గొప్పవాడు, వృద్ధిపొందించేవాడు. 7-141
పెనపు: వి. 1. వివాదం, తగవు 2. భేదం.
పెనపులఁబెట్టు: వివాదాలు పెట్టు.
"ననుపులు చూపితేనే నగవులు వచ్చుఁగాక
పెనపులఁ జట్టితేను ప్రియములవునా" 12-474
పెనపుల బెట్టు: అ.క్రి. వివాదాలుపెట్టు.
"యెనసి శ్రీవేంకటేశ యిటు నీ వాదరించఁగా
పెనపులఁ బెట్టవుగా ప్రేమపు వలపులు" 9-7
పెనవులఁబెట్టు: అ.క్రి. వివాదాలు పెట్టు
పెనుగాలిమూట: వి. అశాశ్వతం, క్షణికం
పెనుపండుగ: వి. సంక్రాంతి; తెలుగువారికి పెద్ద పండుగ సంక్రాంతి.
"పెనుపండుగలు సేసి పిలిపించె నిన్న మాపె
పెనఁగి చిత్తపు చింత పెనులంపటములు"
11-184
పెను లోకదిమ్మరి: పెద్ద లోకదిమ్మరి.
"తీరువడ్డ పెను లోకదిమ్మరివి నీకు నేను
ఆరితేరి నేఁడు నీకు నాల నెట్లైతినా" 7-10
పెనువాములు: *వి; బహు.* అధికం
పెరఁబెట్టు: తేనెపట్టు పెట్టు.
"యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
బెట్టి(ట్టు) మోఁవి తేనిచ్చితే పెరఁబెట్టనేలా"
7-178
పెరయు: అ.క్రి. పెనఁగు.
పెరరేఁగు: అ.క్రి. విజృంభించు.
"యిరవై శ్రీవేంకటేశ యదె నన్నుఁ గూడితివి
పెరరేఁగిన రతులు పెంటలు గాఁజొచ్చును"
7-19
పెరరేఁచు: స.క్రి. విజృంభింపజేయు, ప్రేరేపించు.
"నీవేమిసేతు వాపె నిన్నుఁబెరరేఁచఁగాను
తావుల సాకిరిగోరఁ దగదా నిన్నును" 10-2-50
పెరరేపన: వి. ప్రేరేపణశబ్దానికి వికృతిరూపం.
"చలమున నిది నా సహజపు గుణమో
పెలుచగు శ్రీహరి పెరరేపనలో" 4-75
పెరరేఁపు: (5) వి. ప్రేరేపించడం, పురికొల్పడం.
పెరరేపకుఁడు: (2) వి. ప్రేరేపకుడు, ప్రేరేపించువాడు.
"భావములోపలి పెరరేపకుఁడై
భక్తి చేరుకొనును యాతఁడు" 2-392 &1-403
పెరరేపణ: వి. 'ప్రేరేపణ'కు వ్యావహారికరూపం.
"దైవమా నీ పెరరేపణలు
అవి తప్పక వున్నవి జీవులకు" 2-190
పెరిమ: వి. ప్రేమ, అనురాగం, పెద్దరికం, గొప్పతనం, అతిశయం. గౌరవం అని ఆం.ప.ని.
"పెరిమ యజ్ఞభాగాలు పెద్దవై ఆరగించేవు"
8-227
"ప్రియమున్నెరుగను పెరిమన్నెరగను
ద్వయాధికారము దగిలినవాఁడ" 4-212
పెరిమె: వి. 'పెరిమ'కు రూపాం.
"ఘనత లేమీఁదప్పుదు కాఁగిలించినంతలోనే
పెనఁగించె ఆపెచేత పెరిమె వోదు" 11-151
పెరియాళువారి బిడ్డ: వి. ఆండాళ్‌దేవి. ఈమె పెరియాళువారి (విష్ణుచిత్తుని) కూతురు.
"పెరియాళువారి బిడ్డ పిసికి పై వేసిన
విరుల దండల మెడవేసినవాఁడు" 1-121
పెరుగుతోఁబెట్టు: *ప.బం; స.క్రి.* చిన్నతనాననే కలిగించు.
"పెరుగుతోడఁబొదిగి పెట్టిరి దుష్టుఁదనము
పెరుగఁ బెరుగ నాఁడె రాండ్లెల్లా" 7-415
పెరెదేవుని కాలువ పెద్ద కంభమురాయఁడు: (?)
"కరుణించవయ్యా మమ్ము గంభమురాయ
పెరెదేవుని కాలువ పెద్ద కంభమురాయ" 18-420
పెర్గుచిప్ప: వి. పెరుగు చిప్ప.

"నే యమ్మే వారము నవ్వనేరము పోసేమిదే
చేయి చాఁచు పెర్గుచిప్పఁ జొప్పుడేసి వలపు"
25-232

పెఱిమ : వి. చూ : పెరిమ. ఇట శకటరేఫ ప్రయోగం విలక్షణం.

"పెఱిమకు నగితేఁ బెదవులు కదలెను
తఱివిందుకుఁ బతి తా నేమనునో" 24-138

పెలుచుఁదనము : (12) (పెలుచు + తనము) వి. పెంకెతనం, అల్పత్వం.

"కలసిమెలసి వుంటే కాపురమీడేరుఁగాక
పెలుచుఁదనాన నుంటే ప్రేమవుట్టునా" 7-363

"పెలుచుఁదనాన నీవు పెడచేత మొక్కినదే
తలఁచుక రమణుఁడు తమకించునే" 25-197

"చలము మానినఁగాక సమ్మతింపించ వచ్చునా
పెలుచుఁదనపు నీతోఁ బెనఁగెఁ గాక" 9-241

పెలుచు : *విశ.* (పెళుచు) విరసం, పరుషం, అతిసులభంగా విరిగేది.

"బిగిసితే నిఁక నాకు పెలుచుఁగోపము రాదా
మగువలాల నాయందు మఱి తప్పులున్నవా"
7-74

పెలుచుగుణము : వి. మూర్ఖలక్షణం, మూర్ఖత్వం, పెంకెతనం.

పెలుచు చూపు : వి. అల్పపుచూపు, అతిశయం నిండిన చూపు.

పెలుచు మాట : వి. విరసమైనమాట, పరుషమైన మాట.

"వెలలేని సోయగపువిభుని చల్లనిచూపు
పెలుచుమాటలనే మరపించేరు సతులు" 6-173

పెలుసుమాటలు : వి. విరసపుమాటలు.

"పిల్లఁగోవిరాగాలు పెలుసు నీ మాటలు
కొల్లగా మఱి పికకూఁతలు మావి" 17-127

పెళ్లి : వి. పెరడు. చూ : పెళ్లిచెట్టు.
23-318, 19-435 & 19-376

పెళ్లిచెట్టు : వి. పెరటిచెట్టు.

"తరుణి పలుకులె తంగేడుజున్ను
బెరసేటి విన్నపము పెళ్ళిచెట్టు" 23-318

"పెళ్లిచెట్టు మందు గాదు పెద్ద కొండలెక్కి తెచ్చే
నెల్లిచెట్టు చవిగాక నేమేల నీకు" 19-435

"పెచ్చువెరిగే వౌలేరా పెళ్లిచెట్టు మందుగాదు
యిచ్చకము సేయవచ్చే విఁకనేల మాటలు"
19-376

పెళ్లిచెట్టు మందు గాదు : సామెత; పెరటిచెట్టు మందుగా భావింపబడదు.

"పెళ్లిచెట్టు మందుగాదు పెద్ద కొండలెక్కి తెచ్చే
నెల్లిచెట్టు మందు చవిగాక నేమేల నీకు" 19-436

పెళ్ళ : వి. (?)

"యిట్టె యీపె యిచ్చలో నెనసితే నే మాయ
బెట్టుగా నీ పెండ్లి వచ్చి పెళ్ల విడిశున్నదా"
21-246

పెళ్ళు : పెరడు మాం. దొడ్డి.

పే

పేఁడు : స.క్రి. దారం మొ॥ వాటిని పేను.

"నారలు నావి వొలిచి నమ్మికలదాడు వేఁడి
పోరచినీ వల్లెవేసే పొట్టివాఁడవు" 3-365

"పెనచి యింద్రియములఁబేఁడిన భవము
పనివడి చింతలకే పాలైన భవము" 4-39

"పేఁడుచు మాటలఁ బెరతేనె నీపైఁ
బోఁడి మాపె బూయఁగానె" 11-383

పేఁడుక : 'పేడుకొని'కి వ్యావహారికరూపం. కూడుకొని. 3-492

"వీఁడుగదే శేషుఁడు శ్రీ వేంకటాద్రిశేషుఁడు
పేఁడుక గరుడునితో పెన్నుద్దైన శేషుఁడు"

"వీఁడిగో నిలుచున్నాఁడు విజనగరములోన
పేఁడుకొన్న ప్రతాపానఁ బెద్ద హనుమంతుఁడు"
3-519

పేఁడుకొను : కూడుకొను.

పేగుంజంధ్యములు : పేగుజందెములు.

"కడలేని చలిగాలిఁ గలని లోపలఁ గెల్చి
వేడఁ బేగుంజంధ్యములు వేసితివో యనఁగ"
22-18

పేనిపట్టు: (4) ప.బం. కొన్నిచోట్ల 'పానిపట్టు' అనే రూపం కూడా కనిపిస్తుంది. 'పూనిపట్టు' అని అర్థం కావచ్చు.
"తానే సన్నలు సేసి తగవులఁబెట్టితేను
పేనిపట్టుక నీ వేల పెనఁగాడేవే" 19-186
"లోనై వుండినదాన లోఁగి రట్టు సేసేనా
పేనిపట్టి మాఁట మఱపించ నేఁటికి" 27-227

పేయ: వి. పెయ్య, లేగ.
"ఆవులఁబేయల నందరి యిండ్ల
వావిరిఁ గాచినవాఁడా వీఁడు" 4-289
"పేయలఁ బిలుచుకూఁత పిల్లఁగోవి బలు
సేయరాని గొల్లెతల సిగ్గుల మోతచేఁత" 5-96

పేరటాలు: వి. పేరటానికి వచ్చిన ముత్తైదువ, సువాసిని.
"అనయముఁ బేరఁటాండ్లారతు లెత్తఁగాను
పనివూని వరాలిచ్చీఁ బ్రహ్లాదవరదుఁడు" 28-16

పేరడగు: అధికమగు.
"తగిన వయసువారి తలనే వేగ నీపని
బిగువుల బింకాలు పేరడయ్యీనా" 27-336

పేరడి: (3) పెద్దఅడుగు, ఎక్కువ అని అర్థమని సం.ప.స.
"పేరడిగా తన్నునెట్లు పెండ్లాడెనే" 26-391
"పేరడిగా జగడాలు వెంచకుండేనా" 10-2-41
"పేరడి నీ కివి యెల్లాఁ బ్రియమైతే నౌఁగాక
మేరలు దప్పిన పని మేము సేసేమా" 27-359

పేరడిఁబెట్టు: (పేరడిన్ + పెట్టు) (?)
"అనుమానము లేదని ఆన నీపైఁ బెట్టఁగాను
పెనచి నీ వా మాఁట పేరడిఁబెట్టేవు" 11-423

పేరడి కన్నీరు: వి.అధికమైన కన్నీరు, సాంద్రమైన కన్నీరు.
"కూరిమి గలుగు సతి కోపగించుకొంటేను
పేరడి కన్నీరు నించు ప్రియునితోను" 7-256

పేరడిగా: క్రి.విణ. అధికంగా.
"ఆ రీతి తాము భోగించిన దెవ్వ రెరుఁగుదురు
పేరడిగాఁజుట్టాలకుఁ బెట్టినదే యెక్కుడు"
27-275

పేరడి చుట్టరికము: వి. సాంద్రమైన చుట్టరికము.
"సారెకుఁదఱచుగాను సరసములాడీని
పేరడి చుట్టరికము పెనచుకొంటాను" 28-127

పేరడిన్: (పేరు + అడి) పెద్దఅడుగు, ఎక్కువ అని అర్థం. ఆధిక్యం.
"నేరక లంపటములు నేనే కొన్ని గట్టుకొని
పేరడిఁ బరులనందుఁ బెట్టరంటాను" 3-98
"యీ రీతి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
పేరడి నింకా నెంత పెనఁగీ రతులకు" 26-236
"పేరడి నాచారము పెంచేవు గాక" 11-323
"పేరడిగా సొలగవు పెద్ద కోరికెఁ
జల్లలమ్మేరు యెలుఁగులతోడ గొల్లెతలు"
13-207

పేరడి పెనపులు: వి; బహు. సాంద్రమైన తగవులు.
"పేరడి నీ పెనపులు ప్రియములనె నన్ను
కూరిమి గొసరేటి వో కోనచెన్నరాయఁడా"
11-2-9

పేరడి మహిమలు: వి; బహు. అధికమైన మహిమలు.
"నేరుపరి వౌదువమ్మ నిజలక్ష్మి
పేరడి మహిమలను బెరసితివి" 20-385

పేరుకుచ్చి తిట్టు: పేర్కొని తిట్టు.
"ఊరకుంటే నన్ను నుండనియ్యవు ఇంత
పేరుకుచ్చి తిట్ట నన్నుఁ బ్రియమా నీకు" 5-243

పేరుకుచ్చు: ప.బం; స.క్రి. పేర్కొను. 12-3 old
"ఊరివారి యింతి నన్ను వుద్దండపుఁదుటారాలఁ
బేరుకుచ్చి సొలయుచుఁ బిసాళించేవు" 5-3

పేరుకొను: స.క్రి. స్తుతించు, పొగడు, పిలుచు, ఉచ్చరించు, వంచించు, తలపెట్టు, స్మరించు. అ.క్రి. ప్రసిద్ధినొందు, పేరుపెట్టు, అతిశయించు, గడ్డకట్టు.
"పేరుకొని యట్టె పిలిచీఁ గమ్మర
మేరతో నగఁదగదు మేనదానికి" 16-495

పేరుపడు : (పేరు + పడు) అ.క్రి. ప్రఖ్యాతికెక్కు, ప్రసిద్ధినొందు, నామం వహించు. (వ్య.)
"జక్కవపులుఁగులు నీ చన్నులకు నోడినాను
పెక్కుదేశముల నెల్లాఁ బేరుపడెఁగా" 7-130
"నారదాది సనకసనందనాదులవలె
పేరుపడి నిన్నుఁ బాడి పెద్దలైనట్టి"

పేరుపు : వి. మట్టిపాత్రవిశేషం.
"తొరలఁ గాచినప్పుడు తోడంటు వెట్టినప్పుడు
పెరుగుఁబాలును నొక్క పేరుపునే గాదా" 9-222

పేరుపెంపు : *ప.బం; వి.* పేరుప్రతిష్ఠలు, నామసమృద్ధి.
"ఊరు లేని పొలిమేర పేరుపెంపు లేని బ్రతుకు
గారవంబు లేని ప్రియము కదియనేఁటికే" 5-55

పేరుబలము : వి. వివాహసమయంలో రాశిఫలాలు చూసేప్పుడు చూసే పేరుమీది బలం.
"వామనుఁడందు రతని వామనయనవు నీవు
ప్రేమపు (మీ) యిద్దరికి పేరుబలమొకటే" 7-280

పేరువడ్డవాఁడు : *వి; ప.బం.* ప్రసిద్ధి పొందినవాడు.
"స్వామికార్యమునకే సరిఁ బేరువడ్డవాఁడు
ప్రేమముతోఁ బూజగొనీఁ బెద్ద హనుమంతుఁడు"

పేరువళి : పేరు గలవాఁడు. ప్రకరణవశంగా పశస్తవాచకం కావచ్చు.
"పట్టిన చలముతోడఁ బైకొనీని
దిట్ట గదే పేరువళి తిరువెంగళప్పఁడు" 16-365

పేరువాఁడు : అ.క్రి. యుద్ధాదుల్లో శౌర్యసూచకంగా ప్రకటించు. స.క్రి. పేర్కొను, వాక్రుచ్చు. (వ్య.)
"పేరువాడి పేరువాడి బిరుదులు మెరసేవు
చేరఁగలవా నా చేవల్లకు" 21-388

పేరువారు : పేర్కొను (వ్య.) పేరు కలుగు, పేరుపెట్టి అని సంపా.
"పెంచి యీ కతలు నాకె పేరువారి వున్నవా
అంచెలను నాకు ప్రసాదించేవు గాని" 27-444

పేరువేర : (పేరు + వేర) ఒక్కొక్కరిని విడివిడిగా, ప్రత్యేకంగా.
"పిలువకు మిద్దరిని పేరువేర
వలచితే వలపులు వడ్డికిఁబారించుము" 27-212

పేరెముదోలు : ప.బం. స.క్రి. పరుగెత్తించు.
"బిరుసుగ గరుడని పేరెము దోలుచు
బెరసి నీవు గోపించినను" 1-92

పేరెమువారు : *ప.బం; అ.క్రి.* పఱుగెత్తిపోవు, పరుగులువాఱు.
"పేరెమువాఱఁగ"

పేరెలువారు : *ప.బం; అ.క్రి.* పరుగెత్తు.
"పెలుచు లంకముంగిట పేరెలువారెను తేరు
చెలఁగె దిగ్విజయపు శ్రీహరి తేరు" 2-227

పేరెవరమోబుళేశుఁడు : వి. పేరెవర మనే గ్రామంలో నెలకొన్న నృసింహస్వామి కావచ్చు. (ఓబుళేశుడు = అహోబలంలో నెలకొన్న స్వామి - నృసింహస్వామి)
"నిచ్చ నిచ్చఁ జేకొను నివాళి
యిచ్చుఁ బేరెవరమోబుళేశ నివాళి" 22-129

పేలకురితి చెన్నుఁడు : వి. పేలకుర్తి గ్రామంలో వెలసిన చెన్నకేశవుడు. బేలకుర్తి, బేరకుర్తి అని కూడా వ్యవహార ముండవచ్చు అని సంపా.(f.n. 28 సం.)
"పేలకురితి చెన్నుఁడిదె పెనఁగీ నే మొక్కగాను
చేలకొంగు వట్టి నన్నుఁ జెక్కు నొక్కీనే" 28-561

పేలరి : (3) (పేలు + అరి) వి. వదరుబోతు.
"యీలాగుల శ్రీవేంకటేశ ఆకెఁ గూడితివి
పేలరియై జాజరాడఁ బిలచీఁ బోవయ్యా"
11-172

పేలరితనము : (పేలు+అరి+తనము) వి. వదరుబోతుతనం.
"వోలి పట్ట వచ్చినది వొడిపట్టవలదా
పేలరితనాన నేల పెనఁగులాడేవు" 28-184

పేలరీఁడు : (పేలు + అరి + ఈఁడు) వదరుబోతు. రూపాం. పేలరి.

"చాలుఁజాలు నూరుకుండు సతులెల్లా నవ్వేరు
కేలు చాఁచి తిట్టేటి పేలరీఁడు గలఁడా" 23-402

పై

పైఁడంతే తూనిక: *నానుడి;* పిండంతే నిప్పటి లాంటిది. బంగారమెంత ఉంటుందో దాన్ని బట్టే తూనిక ఉంటుంది అని వాచ్యార్థం. డబ్బెంత ఉంటే అంత బాగా ఖర్చు చేయు .

"అడరి శ్రీవేంకటేశుఁ డంతలోనే నన్నేలె యీ
యెడఁ బైడెంతే తూని కేమనే నీకూ"

పైఁడికత: (4) (?)

"ఒక్కరికిఁ జెప్పరాదు వూఁకొనరాదు
పక్కననే మనినాను పైఁడికతవంటిదే" 7-235

"ఉమ్మడినే వుండినట్లే వుండనియ్యరా
కమ్మి యేమైనఁ బైఁడికతవో నా పొందులు"

26-210

పైఁడికాశ: వి. బంగారు కాసె, బంగారు దట్టి.

"కట్టినది పైఁడికాశ కంబములోన వునికి
నెట్టుకొన్న నవ్వులు నీ లోనివే" 4-164

పైఁడికి వాసనవచ్చు: ప.బం. అదనపు శోభ కలుగు, బంగారానికి తావి అబ్బు .

"ఎదుట శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
. . . . . .నఁ బైడికి వాసన వచ్చె నిదివో"

15-293

పైఁడిగొండెల పచ్చడము: వి. బంగారుఅంచుల వస్త్రం.

"కొండికపాయ మమరెఁ గోనేటిరాయ పైఁడి
గొండెల పచ్చడముతోఁ గోనేటిరాయ" 26-299

పై: వి. శరీరం, బహిర్భాగం, వెలుపల - సూ.ని.

"పంచేంద్రియములు ముదియక పై ముదిసిన
నేమి" 2-55

పైకుడుపులు: *వి; బహు.* పైతిండ్లు, చిఱుతిండ్లు.

"యీలాగుననే లోకమంతాఁ గాతువు గాక
పాలు దాగినమీఁద పైకుడుపులా" 1-280

పైకొసరు: *ప.బం; వి.*కొన్నదానిపై అదనంగా అడిగే కొసరు .

"పలుకు లేకములైనఁ బైకొసరు మరి లేదు
తెలుపు లేకములైన తెగువలే లేవు " 19-484

పైడికొండలలో బచ్చుబేరాలు: *ప.బం; వి; బహు.* అనుచితమైన కార్యం.

"భారపు పైఁడికొండలలో బచ్చుబేరా లమరునా
వూరకే నీ మేలు గోరకుండు టింతే కాక"

15-156

పైడిగొండెల పచ్చడము: బంగారపు అంచులుగల వస్త్రం.

పైతరవు: పైవిధం, పైదారి. (వ్యు.)

"యీతల శ్రీ వేంకటేశ యిద్దరి మేనులు దానె
పైతరవై మిమ్మొరయఁ బాడిగాదు మాకూ"

12-345

పైపచారాలు: *వి; బహు.* పైపై మెఱుఁగులు .

"సుడిసి పైపచారాలే చూచి సురతసుఖాన
పడఁతులఁబొంది పొంది పరిణామించేను" 3-37

పైరుకాలము: వి. శరత్కాలము .

"పడఁతి మైపులకల పైరుకాలము వచ్చె
కడుఁగోరికల మంచుఁగాలము మీరె" 29-300

పైరులు చేయు: ప.బం. వృద్ధిచేయు, సేద్యం చేయు అని వాచ్యార్థం.

"పంచేంద్రియములకే పైరులు సేసితిమి
అంచెలఁ బ్రాణులకిఁక నాజ్ఞ లేలయ్యా" 3-487

పైవచ్చు ఐవచ్చు: అ.క్రి. కీడు కలుగు .

"బలువుల తోడి పొందు పైవచ్చు నైవచ్చు
చలము సాదించరాదు చాలు నోప నందుకు"

11-536

పొ

పొంచు: వి. దేనినైనా ఉద్దేశించి మఱుగువడి కనిపెట్టి ఉండడం, రహస్యంగా పొంచి ఉండి వినే మాట.

"చెప్పరాని మాటలెల్లా చేరి మీ రాడుకొనఁగా
యిప్పుడే పొంచులు వినీ ని దెవ్వరోయి"

18-388

"మంతనాన నీవు నేను మాటలాడుకొనఁగాను
యింతలోఁ బొంచులు వినీ నిదివో యీకె"
18-569

"దాయగత్తైన యాఁటది తగిలి పెనఁగవచ్చు
పూయక దూలైనాఁటది పొంచులే వినును"
12-334

పొంతకూటికుండ : వి. సమష్టిది, ఎవరికీ చెందనిది, పొయ్యి దగ్గర ఉంచుకునే నీళ్లకడవ.
"దొంతులకడవలోనఁ దొరలి దాఁచిన పెద్ద
పొంతకూటికుండ గొంటఁబోయె నెవ్వఁడో"
15-155

పొంతపొరుగు : 'దగ్గర' అనే అర్థంలో జంటపదం.
"పొంతపొరుగున నుండే పొందుసతివని కాక
మంతనాన నందరితో మాటలాడ వచ్చేమా"
20-143

పొందుకొను : స.క్రి. పొందు. రా.సీ. వ్యవహారంలో కొన్ని ధాతువులపై ఈ 'కొను' చేరడం మామూలే.
"సరసములాడి యాడి చదువులెల్లా రేఁచితివి
పొరుగున నుండి వుండి పొందుకొంటివి"
29-401

పొందులమాటలు : *వి; బహు.* (?)
"పొందులమాటలఁ బొనఁగు ముచ్చటలు
చనవుల మీరేటి సరసపుఁజేతలు" 22-477

పొందువాఁడు : వి. పొందు కలవాడు.
"వెస మాటలాడించితే వెన్నముద్దలే రాలీని
పొనఁగ గోపికలతో పొందువాఁడవా" 12-447

పొక్కాలు : 'పోకాలు'కు వ్యావహారికరూపం. (?) పోవు, కోపం, దుఃఖం కలిగినప్పుడు వాడే మాట.
"చిక్కెఁగదె మీవాఁడే చేరి పెరుగుదొంగ
పొక్కాలదే మోసి బొంకు గొల్లెత" 24-165

పొగబాణము : *వి; ప.బం.* ఒకరకమగు యుద్ధసాధనం. (సూ.ని.)
"కదిసి పెటలు గుండ్లు కంతనాళమున మరుఁ
డెదిగించఁ బొగబాణ మెడచొచ్చినట్లు" 7-405

పొగరుఁబువ్వులు : వి. తీక్ష్ణగంధముగల పువ్వులు.
"తగులున ఇద్దరిని తతిగొని మదనుఁడు
పొగరుఁబువ్వుల నేసి పొందుసేసెనా" 26-408

పొగరు మాఁకులు : వి. గాటు మాకులు.
"పొగరు మాఁకులమీఁది పువ్వుల పొగరే కాదా
తెగడి పేరఁబెట్టితే తేనె లయ్యేవి" 7-84

పొగరుముంపు : వి. గర్వాతిశయం.
"మొగము చూచి నాకు ముందట
నిలుచుండఁగా
పొగరుముంపున నిన్నుఁ బొమ్మందునా"
11-590

పొగరుమూఁపుదనము : వి. పొగరుబోతుతనం.
"వెగటైన విషయాల వేడుకపడకు మవి
జిగరుగండెలు సుమ్మీ చిత్తమా
పొగరుమూఁపుదనాలఁ బొరలకు మవి యెల్ల
తగులు విరిపందేల దారి పంటివి" 10-1-12

పొట్టఁబొరుగు : (27) (పొరుగు + పొరుగు) వి. పట్టపగలు వంటిది, సమీపం, మిక్కిలి పక్కన, ఇట అరసున్న చింత్యం. అంతస్సారములు, గింజ పొట్టపట్టింది అనుటలో ఉన్న పొట్టలాంటిదే ఇది. అతిసమీపస్థానం అని సూ.ని.
"పొట్టఁబొరుగున వలపులు తీపులఁబడె"
26-385

"పొట్టఁబొరుగు లివె పుణ్యపాపములు
నట్టనడుమనె నా బదుకు" 3-578
"పొట్టఁబొరుగుననుండి పొంచి నీకు మోము
చూపె
గుట్టుతోఁదాఁబండే ఇంటి గురుతు చెప్పె"
22-162

పొట్టఁబొరుగు చుట్టము : మిక్కిలి దగ్గరి చుట్టము.
"పొట్టఁబొరుగుచుట్టాలు భోజన సహాయులె
నెట్టన నీవైతే మాకు నిర్వాహకుఁడవు" 2-306

పొట్టఁబొరుగు నీటు : వి. (?)

పొట్టఁబొరుగు సతులు : వి. ఇరుగు పొరుగున నున్న సతులు, ఇట అరసున్న విలక్షణం.

"పొట్టఁబొరుగు సతులు పొంచి సేవసేయఁగా
పట్టపుదేవులమీఁద బాఁతి వున్నదా" 18-514

పొట్టపొంకము : *ప.బం; వి.* (పొంకము + పొంకము) మిక్కిలి కాంతి, మిక్కిలి కుదిరిక.
"బుద్ధి మానిన చింత పోని యూరికిఁదెరువు
పొద్దుపోవని వలపు పొట్టపొంకంబు" 1-96

పొట్టిపొట్టి యడుగుల బోయనాయఁడు : *వి.* వామనావతారమూర్తి.
"పొట్టి పొట్టి యడుగుల బోయనాయఁడు యెందు
బుట్టుపగ సాధించే బోయనాయఁడు" 1-460

పొట్టుపొరలు : (పొరలు + పొరలు) *ప.బం; అ.క్రి.* మిక్కిలి పొరలటం, మిక్కిలి దొర్లటం.
"నీఁగని నా మరులిదె నీవు చుట్టుకొననేల
ఆఁగి నేనె పొట్టుపొరలయ్యేఁగాని" 19-152

పొడపుఁజందురుఁడు : (పొడుపు) *వి.*ఉదయించే చంద్రుడు.
"పొడపుఁజందురుఁడు నొప్పులుసేయ విరహులను
పెడమొకము చేసి నొప్పించేవు" 6-111

పొడమని చందము : *వి.* జన్మరాహిత్యస్థితి.
"పరపీడ లొసఁగు భవమునకంటే
ధరఁ బొడమనిచందము సుఖము" 4-455

పొడలమెకము : *వి.* దుప్పి. (పద; శ.ర.)
"పొడలమెకము నేసి పొడవాటి రాకాసి
గొడవలఁదీసె నట కోరి నీ మగఁడు" 20-230

పొడలువెట్టు : (3) *అ.క్రి. ప.బం.* ఆయాసపడు (పద.), దొర్లు, బోరగిలపడు. (పాకులాడు, పొరలాడు అని తోచుచున్నది వే.ఆ.మూ.)
"పొత్తులలోపల నేను పొడల పెట్టేనాఁడు
యిత్తల జవ్వనమద మెందుండెనో" 15-49
"పొడలు వెట్టెడి పొగులు పొందువాసిన దిగులు
పడఁతికి నిదియెల్ల బరికించ దిగులు" 4-20

పొడవగు పదవులు : *వి; బహు.* పెద్ద పదవులు, మేలైన పదవులు.
"బడిబడి లక్ష్మీపతికి దాసులై
పొడవగు పదవులఁ బొందరొ ప్రజలు" 1-101

పొడవాటి : *విణ.* పొడవైన, పొడుగాటి.
"పొడవాటి కాళ్లు" 22-98
"పొడల మొకము నేసి పొడవాటి రాకాసి
గొడవలఁ దీసెనట కోరి నీ మగఁడు" 20-230

పొడవు : *వి.* ఆధిక్యం, గొప్పదనం.
"ఇందరి నేలిన యీ వేంకటపతి
పొందగు మహిమల పొడవే చాలు" 1-98

పొడవుకు పొడవైన : *విణ.* మిక్కిలి గొప్పనైన.
"పొడవుకుఁ బొడవైన పురుషోత్తముఁడు నేఁడు
అడరి తొట్టెల బాలుఁడాయనమ్మా" 3-17

పొడవుకెక్కు : *ప.బం; అ.క్రి.* ప్రసిద్ధికెక్కు, పేరుకెక్కు. (వ్యు.)
"పూని దేవేంద్రాదులు పొడవుకెక్కినవారు
శ్రీనాథ మిమ్ము నే పూజించినవారు హరి"
1-411

పొడవులు చూపు : *ప.బం; అ.క్రి.* కన్పడు, తోచు, ప్రత్యక్షమగు.
"నుడిగితే నెంతయినాఁ బొడవులు సూపేవు"
18-102

పొడవెక్కించు : *ప.బం; స.క్రి.* పైకి ఎత్తిపెట్టు, అభివృద్ధి లోనికి తెచ్చు, ఎక్కువచేయు.
"పుట్టించఁ బెంచఁగ పొడవెక్కించ దేహుల
గట్టిగా మాటలాడించఁ గదలించ" 2-319

పొడిఁబడు : (పొడిన్ + పడు) *అ.క్రి.* పరిష్కర్తలు దీనికి చిన్నతనం పొందు, చులకనగు అనే అర్థాలను సూచించినారు. అట్లే ఈ పదం పొడివడి యుండునేమో అని సందేహించినారు. శుష్కించు, నిస్సారమగు (వ్యు.)
"మతిలోఁ బొడిఁబడేవు మాటిమాటికి" 24-69
"కొమ్మ నీతో నెఱఁగక కోపగించుకొంటి నంటా
వుమ్మడిఁ బొడిఁబడుచు నుసురనీని" 23-221

పొడుపుకథ : *వి.* గూఢభావాలున్న చిక్కుప్రశ్న.

"మొగి నొక్క తామరలోనె మోవిపండు పండెనట
జిగిఁదేనె వావాతఁ జిందెనట" 24-4

పొడుపుగత : వి. చూ : పొడుపుకథ. 24-8

పొడుపుడుఁగత : (2) వి. పొడుపుకథ, గూఢమైన భావం కల సమస్య.
"కానీ లేరా పొడుపుడుఁగతలు వొడువు మని
ఆనవెట్టి నన్నేల అడ్డగించేవు" 10-2-88 & 24-4

పొడుపుడుకత : వి. పొడుపుకథ.

పొత్తర : వి. ఆకులు లోనగువాని కట్ట. (శ.ర.) పొట్లం, సంచి, పొతక. (పితృకర్మల్లో విస్తళ్లలో ఉంచి బ్రాహ్మణులకిచ్చే ఆమద్రవ్యం .)
"పొదల పువ్వులు గోసి పొత్తర గట్టుకుండఁగా
వెదఁజల్లుదురా నాపై వేసాలవాఁడా" 7-167

పొత్తల : దగ్గర, స్నేహం, అనుకూల్యం.
"పొత్తల నాపె వుండఁగా బువ్వానకు రమ్మనేవు
కొత్తలుగా నిదియేమి గొల్లదోమటా" 14-203

పొత్తులకాఁపు : *ప.బం; వి.* ఉమ్మడి రక్షకుడు . (పద.)
"ఇంతట విడిచేవా నన్నింద్రియాలఁ గట్టివేసి
పొంతఁజూచే విటు నాకుఁ బొత్తుల కాఁపవుగా"
3-458

పొత్తులకూటమి : వి. వేశ్యల కూటమి.
"పొత్తులకూటమి నీకే పుణ్యము గట్టుదుగాక
బత్తి గొట్టాన బెట్టేటి పంతము నాకేలా" 26-179

పొత్తుల కూడు : వి. పంక్తిభోజనం, సమష్టి భోజనం.
"ఉట్టిపై చెరలాట మూరఁ బొత్తుల కూడు
పట్టుచాలని కొమ్మ బహునాయకము" 1-71

పొత్తుల కూరిమి : వి. వేశ్యలస్నేహం.
"చిత్తము వచ్చినట్టెల్లాఁ జేయుమ
పొత్తుల కూరిమితోడ బోదించవలె" 18-562

పొత్తులచుట్టాలు : *వి; బహు.* ఉమ్మడి బంధువులు.
"పొత్తులచుట్టాలు మీరు భోగములు మాకు నబ్బె
కొత్తలాయ నవ్వులు కొఱతయ్యీనా" 26-86

పొత్తుల బోజనసాల : వి. సమష్టిగా భోజనం చేసే శాల.
"పొత్తుల బోజనసాల పొలఁతి నీ వదనము
హత్తిన కొలువు కూటాలాయఁ దొడలు" 18-58

పొత్తులమగఁడు : (5) వి. ఉపపతి, జారుడు.
"తగిలిన నాసేవ తలఁచుకొ మ్మనఁ గదే
మగఁటిమితో పొత్తులమగఁడు కాను" 23-458

పొత్తులమగువ : వి. జారిణి, కులట, వ్యభిచారిణి.
"పొత్తులమగువలకుఁ బోవునా యింక
యిత్తలఁగూడుండుదము యీడ కిట్టే రావే"
17-249

పొత్తులమాటలు : వి. ఇద్దరికీ నచ్చే మాటలు, అనుకూల్యపు మాటలు, స్నేహపు మాటలు.
"హత్తి నేము తగవు ని న్నడుగఁగ వచ్చితేను
పొత్తుల మాటలాడి పొదివేవు" 26-436

పొత్తులమొగడు : వి. ఉపపతి, జారుడు. చూ : పొత్తులమగఁడు.
"హత్తి నీకె దక్కెనటె ఆతఁడు నేఁడు
పొత్తుల మొగఁడాతఁడు పొలఁతులకు" 22-410

పొత్తులయెంగిలి : వి. మరొకరితో పాటు సమానంగా అనుభవించేది.
"యిత్తల నీ కూడిగాలు యెన్నియైనఁ జేసేఁ గాని
పొత్తుల యెంగిలితోడి బోగము సయించదు"
11-556

పొత్తులల్లుఁడు : (పొత్తుల + అల్లుడు) వి. వేశ్యాలంపటుడు, విటుడు, పెక్కుమందికి అల్లుడైనవాడు.
"అత్తనంటాఁ బిలిచేవు అక్కడనిక్కడ నీకు
అత్త లెవ్వరోయి వూరఁబొత్తులల్లుఁడా" 5-323

పొత్తులవిభుఁడు : *వి; ప.బం.* ఉపపతి.
"బత్తి నీ కెక్కడ నని భావించి నమ్మఁగవచ్చు
పొత్తుల విభుఁడవై పొదిగేవు నీవు" 26-372

పొత్తులసుఖము : వి. కామసుఖం.
"బత్తి సేయుట యేమి పాసిపోవుట యేమి

పొత్తుల సుఖంబులకు పొరలుటలు గాక" 1-328

పొదచాటుమృగము : *ప.బం; వి.* అదృశ్యమైనట్టిది, వెదకదగింది.
"ఎదురుచూచి చూచి యెలయించి యెలయించి
పొదచాటుమృగమై పోయెఁ గాలము" 1-48

పొదటూరి చెన్నరాయఁడు : వి. కడప జిల్లాకు పశ్చిమంగా పెన్నాతీరాన ఉన్న మండల కేంద్రమైన పొద్దుటూరులో వెలసిన చెన్నకేశవుడు. పొదటూరుకి ప్రొద్దుటూరు, పొదలపల్లె, బంగారు ప్రొద్దుటూరు, ప్రఖ్యాతపురం అనేవి నామాంతరాలట. అన్నమయ్య ఈ చెన్నకేశవునిపై ఒక కీర్తన చెప్పినాడు.
"గారవించి యిందునందు కందువలు మెరసిరి
వూరటగా నీకుఁ బొదటూరి చెన్నరాయా"
7-537

పొదరులాడు : అ.క్రి. ప్రసిద్ధనిఘంటువుల్లో ఎందులోనూ ఈ పదం కానరాదు. వికటోక్తులు పలుకు(?)
"పొదిగి మమ్ము రేఁచక పోపో నీవు
పొదరులాడక నీవు పోపో నీవు" 11-291

పొదలు : విణ. 1. స్థూలమగు, పొంగు 2. అతిశయించు 3.పెరుగు 4. ఉద్రేకించు 5. పుట్టు 6. వ్యాపించు 7. అగు 8.ఒప్పు 9. నీరసించు 10. క్రీడించు 11. తోచు 12.విఱ్ఱవీగు 13. ఫలించు 14. ప్రకాశించు.
"పొదలు గుబ్బలు వలపుల బోనపు దొంతులు
కదలు కనుచూపులు క్రపవిడేలు" 18-50

పొదిగొను : (3) స.క్రి. 1. కప్పు 2. కమ్ము, ఆవరించు 3.ఖచితం చేయు, చెక్కుఁగుంపుగూడు 4. పరివేష్టించు (శ.ర.) అ.క్రి. కలియు, పైబడు.
"గొదిగొన నీ వాపె బుజముపైఁ జేయివేసి
యెదుట నా మోము చూచే వి దేమయ్యా"
12-480
"మొదలనుండి ప్రపంచమును తథ్యమగుటకు
పొదిగొన్న యాగములే భువిలో సాక్షి" 3-287

పొదుగు : స.క్రి. కమ్ము.
"ఇదివో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పొదిగాకెఁ జెప్పవయ్యా బొంక నీఁక నేఁటికి"
27-38

పొద్దు : వి. 1. సూర్యుడు 2. దినం (దినం = సమయం) 3.సమయం.
"పొద్దు పొడుచునదే పొద్దుగుంకినదె
తిద్దిన జగముల దినదినము" 4-412
"కదిసి యే పొద్దు వద్ద గాచుకుండనా" 7-294
ఉదయం :
"పొద్దున నెవ్వరింటికో పోవలసి ఇంటివారి
నిద్దురలు వొమ్మనేవు నెమ్మది నీవు" 25-1

పొద్దుకుఁబొద్దు : వి. రోజురోజుకు, ప్రతిరోజు.
"వెలయఁగ సాలీఁడు వేసిన కండెయై
పొలసీఁగాలము పొద్దుకుఁ బొద్దు" 15-63

పొద్దుకొక కొత్తలుగా : క్రి.విణ. నిత్యనూతనంగా, ఎప్పటికప్పుడూ కొత్తగా
"ఇద్దరిఁ గూరిచితిమి మేము చెలికత్తెలము
పొద్దుకొక కొత్తలుగా భోగించరయ్యా" 22-539

పొద్దుగాని పొద్దు : *ప.బం; వి.* సమయం కాని సమయం.
"అద్దో నాతో నీవు అలిగి యందు చేరిన
పొద్దుగాని పొద్దనక పొందులు సేసేరా" 7-30

పొద్దుగూఁకు : *అ.క్రి; ప.బం.* సాయంకాలమగు, సూర్యుడస్తమించు.
"అలుకలఁ బొద్దుగూఁకె ఆసలనే తెల్లవారె"
16-468

పొద్దుగూఁకు పొడపులు : *వి; బహు.* సాయంకాలంలో ఎక్కువగా ఉండే నీడపొడవులు.
"ముద్దు చూపి దవ్వులనే మొఱఁగులు చల్లితేనే
పొద్దుగూఁకు పొడపు లిప్పుడే మఱచితివి"
19-482

పొద్దుగూకుఁ దెల్లవారు : వి. రాత్రింబగళ్లు.
"పొద్దుగూకు దెల్లవారు పురుషుని చిత్తమింతె
వొద్దివారే యిట్లైతే వోరువనేఁ గలనా" 16-261

పొద్దుపొడ(డు)పు : వి. సూర్యోదయం.
"పొద్దుపొడపు గోళ్లపొలఁతి నన్నుఁగూడితి
విద్దరికి శ్రీవేంకటేశ వోపేవా" 19-504

పొద్దుపొడవక ఎండకాయు : *ప.బం; అ.క్రి.* జరుగనిది జరగడమని భావం.
"వెదకుతానే నిన్ను వెలఁది కాఁకలబొందె
యెదుటఁ బొద్దువొడవ కెండ గాసెను" 17-402

పొద్దులు వేళలు : *వి; బహు.* రోజులు, సమయాలు.
"పెద్దగా నే వొజ్జలనై పెండ్లి మీకుఁ జేసేవా
పొద్దులు వేళలు నన్నే పూఁచి యడిగేవు"
14-600

పొద్దువొడుచు : *ప.బం; అ.క్రి.* సూర్యోదయమగు.
"పొలఁతి నీవు చూచితే పొద్దువొడుచు నప్పుడే
పొలయలుకల నెండ పొడచూపును" 13-427

పొద్దు(పొ)వొద్దు : (7) వి. ప్రతినిత్యం.
"వద్దువద్దు తడవితే కాదులే సుమ్మీ నీవు
పొద్దువొద్దు వారి వీరి పోడులే సుమ్మీ" 21-433

పొద్దువోక : *వి; ప.బం.* 1. కాలక్షేపం 2. ఆలస్యం.
"పొద్దువోక కిటు పొలసితివి
అద్దము నీడల నాఁగేవా" 20-156

పొద్దువోత : (పొద్దు + పోవు + త) వి. పొద్దుపోవడం, కాలక్షేపం. (పోత= పోవుట, భావార్థంలో 'త'ప్రత్యయం; ఇట్టి రూపాలు అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో ఉన్నాయి .)
"యివ్వల శ్రీవేంకటేశ యిట్టే నన్నుగూడితివి
పువ్వుల పులకలతో పొద్దువోత గాక" 17-358

పొద్దువోనివారు : *వి; ప.బం.* కాలక్షేపం జరుగనివారు.
"పొద్దువోనివారు గాకపోరే మీరు
యిద్దరము గూడినపు డీడకు రాఁగదరే" 14-250

పొద్దువోయి వచ్చు : అ.క్రి. ఆలస్యంగా వచ్చు.
"పొద్దువోయి వచ్చినాను పొదిగి చేకొందుఁగాక"
17-67

పొద్దువోవు : (9) (పొద్దు + పోవు) అ.క్రి. కాలక్షేపమగు, సమయం గడచు.
"పొంతనుండి నవ్వేవు పొద్దువోదా నీకు" 21-81
"పోపో యింకా నేటికి పొద్దు వోదా?
పైపై నీకు మొక్కేము పదివేలు వచ్చెను"
16-201
"కొలువు విరిసె నిదె గోవిందుఁడు పొద్దువోయ
వెలుపట నుక్కళాలు వేగుదాఁకా నుండరో"
3-525

పొద్దుసేయు : *ప.బం; అ.క్రి.* కాలక్షేపం చేయు, సమయం గడుపు.
"వరుసకు వచ్చి యాపె వాకిట నిలుచుండఁగా
పొరుగువారితో నెంత పొద్దుసేసేవు" 28-357

పొద్దెక్కు : (పొద్దు + ఎక్కు) *ప.బం; అ.క్రి.* వేళ మీరు, సూర్యుడు పైకివచ్చు, ఎండెక్కు.
"వేగినంతా నీతోడ వెలఁది మాటలాడి
భోగించీ నిద్దుర అదె పొద్దెక్కినంతా" 7-37

పొనుగు : (8) అ.క్రి. కుంగిపోవు, క్షీణించు, శూన్యమగు, పాడుబడు, కష్టపడు, బాధపడు, కాంతివిహీనమగు, వికలమగు, అస్వస్థమగు (వ్యు.) ఇవి పొనుగుడుపడు కు అర్థాలు.
"పొనిఁగి చంద్రమతికిఁ బూవుదండాయ" 2-85
"చెనకక నీవుంటె చెలి పూవుల వేసునా
పొనిగి మాతో లేదని బొంకేవు గాక" 10-2-35
"పొనిఁగి చెలులఁగంటే పురుషుల చూపులెల్లా
ననిశము నందుమీఁద నంటఁ బారకుండున"

పొనుగు : పూనిక వహించు.
"పొనిగితే పాపమేది పుణ్యమేది కర్మమందు"
2-19

పొయిఁబాలవంటిది : *ప.బం; వి.* ఉవ్వెత్తుగా పొంగి వెంటనే చల్లారే స్వభావం కలది. పొయ్యిమీద పెట్టిన పాలు పొంగుతుంటాయి అనే దానినుండి వచ్చిన పలుకుబడి.
"పొయిఁబాలవంటిది పూఁచిన తన మోహమెల్లా
నయముల నెందాఁకా నానఁబెట్టవచ్చునే"
21-323

పొరఁటు : వి. భక్ష్యవిశేషం.
"సుడిగొను నప్పాలు సుకినప్పాలును
పొడిబెల్లముతోఁ బొరటులును" 6-4

పొరచి : విశ. చేబదులుగా అడిగి తెచ్చుకొన్న ధనాదికం.
"పొత్తులమగఁడవట పొరచి కాఁపురమట
యిత్తల నాపై భక్తి యింకా నీకుఁ గలదా" 9-166

పొరపొచ్చము : (4) ప.బం; వి. 1. కపటం 2. దోషం 3.అవమానం 4. భేదం. విశ. కుత్సిత కల్మషాదులున్న. రూపాం. పొరపొచ్చెము.
"కొల్లగా శ్రీవేంకటేశ కొసరుచు నింతెకాక
పొల్లు లేని నీ గుణాల పొరపొచ్చమున్నదా"
11-106

పొరపొచ్చెము : చూ : పొరపొచ్చము.
"కాఁకలు రేఁగకుండఁగఁ గానుక లిచ్చితిఁగాక
యేఁకట నీ పొరపొచ్చె లెన్ని లేవు" 11-59

పొరయు : స.క్రి. అనుభవించు. (అ.క్రి. కలుగు, జనించు)
"కరఁగించి కరఁగించి కౌఁగిట నిన్నుఁ గూడఁగా
పొరయించవలదా పొందుల నేడు" 18-150

పొరి : అధికం, ఆధిక్యం, దృఢంగా, క్రమంగా.
"పొరి నెరుకే జ్ఞానము పొంచి మరపే సమాధి
సొరిది నేఁడింతకంటే సుఖమున్నదా" 4-246

పొరుగాపె : (పొరుగు + ఆపె) వి. పొరుగింటి స్త్రీ.
"కలికిఁ బొరుగాపెనుఁ గని నా మోము చూచేవు
వలచి తెచ్చుకోఁగాను వద్దనేనా"
26-570 &2-291

పొరుగాలు : (పొరుగు + ఆలు) వి. పొరుగింటి స్త్రీ, పొరుగాపె.

పొరుగింటి పోరచి : పొరుగింటి పడచు (వ్యు.)

పొరుగిరుగు(ల)వారు : (3) వి; బహు. ఇరుగుపొరుగుల వారు. 'పొరిగిరుగువారు' అని హంస. ప్రయోగం (5-114)
"పొరుగిరుగులవారి పొందులు మరిగెనంటా
పురిగొన నిమ్మపంటఁ బూఁచి యేల వేసేవే"
28-416

పొరుగిరుగులు : (3) వి; బహు. ఇరుగుపొరుగు వారు.
"పొంచి లోనఁబెట్టుకొంటే పొరుగిరుగుల నింద"
11-258
"బొంకులను నోపఁగాని పొరుగిరుగుల మెచ్చ
సంకెలేక నీ యిచ్చల సాదించరా" 23-409

పొరుగిరుగువారు : (2) ఇరుగుపొరుగువారు.
"పొరుగిరుగువారు నీ బూటకాన కోపుదు
గొరబుల వీ వనిత కొత్తపెండ్లికూఁతురు"
18-373

పొరుగుపొంతలు : (2) ప.బం; వి; బహు. చుట్టుపక్కలు.
"పొరుగుపొంతలనుండి బుద్ధులు చెప్పేనదె
గరిమల మించీఁ గలికితనమునను" 21-54

పొరుగు పొరచి : పొరుగింటి పడుచు. (వ్యు.)
"సరి వెనఁగేమా నీతో సాములు సేయఁగ నేము
పొరుగుపొరచా నిన్ను బూమెలు సేయ"
21-201

పొరుగు పోరచి : (3) వి. పొరుగింటి పడచు. (వ్యు.)
"బుద్ధులెఱుఁగుదునంటా పొరుగుపోరచి యంటా
ఉద్దండానఁ జన్నులంటీనో యక్కరో వీఁడు"
7-96
"కరఁగించేవు మనసు కడలఁదనిసి వచ్చి
పొరుగు పోరచులైతే పొందుకోపమయ్యా"
20-503
"బుద్ధు లెరుగుదునంటా పొరుగు పోరచి యంటా
ఉద్దండానఁ జన్నులంటేనో యక్కరో వీఁడు"
7-96

పొరుగులు : వి; బహు. పక్కభాగాలు.
"బుద్ధులు చెప్పీఁ బొరుగులు మెట్టీ

గద్దులే తనకుఁ గలిగినవే" 16-215

పొరుగువారిరుగువారు : ఇరుగు పొరుగువారు, చుట్టుపక్క యిండ్లవారు.

"పొంచి శ్రీవేంకటేశ్వర పొరుగువారిరుగువా
రెంచ నీకు మంచముపై నిందరు సరే కా"

14-142

పొరులు : వి; బహు. పొరపొచ్చాలు.

"పుచ్చరో మీ మదిలోని పొరులెల్లాను"

పొరెవొడుచు : (పొరె + పొడుచు) అ.క్రి. అతిశయించు.

"పావనమతిఁ బొరెవొడిచి పరమానందము
బొందుచు శ్రీవేంకటపతి మనమునఁ జింతించీ
నరమృగము" 1-298

పొఱపొచ్చము : చూ : పొరపొచ్చము.

పొలగూడు : (పొల + కూడు) వి. మాంసాహారం.

"దొడ్డమేక పొలగూడు దోమటి దొడికినాఁడు
గడ్డువయసగు బిడ్డ గన్నవాఁడు" 4-43

"దేవరొజ్జ లొకవంక దిక్కులతోఁ బొలగూడు
దీవెనతో నారగించి తీపు మరఁగి" 2-70

పొలగూడు : వి. మాంసపుతిండి.

"దేవరొజ్జ లొకవంక దిక్కులలోఁ బొలగూడు
దీవెనతో నారగించి తీపు మరిఁగి" 2-70

పొలపవేడుక : వి. (?)

"తలపోసి చూడరాదా తనివి మనసులో
పొలపవేడుకలెల్లాఁ బొదపౌనా నీకు" 14-162

పొలమురాజు : వి. వరాహం. (పొలానికి రాజు)

"పొలమురాజవు నీవు పురుషోత్తమా నీ
పొలఁకువదే కంబమునఁ బురుషోత్తమా" 2-283

"పొలమురాజై తిరిగే బోయనాయఁడు
వెలయ మోటున నుండే వేఁట బోయనాయఁడు"

1-460

పొలమేర : వి. 'పొలిమెర'కు రూపాం. ఎల్ల, సీమ, బలిని తీసుకొని తిరుగవలసిన గ్రామపు ఎల్ల, పొలాల మేర, కూతవేటుదూరం. (వ్యు.)

"పుట్టుచు సాదురేఁగితే పొలమేర నిలువఁడు
నెట్టన ననేటిమాట నిజమాయ నేఁడు" 14-305

పొలమోర : వి. పొలిమేర కావచ్చు.

"యెండఁదాఁకితివి కడు నిచ్చల రచ్చలుసేసి
కొండచరిఁ బొలమోరఁగూరుచుంటివో" 6-41

పొలయలుక : (4) వి. ప్రణయకలహం.

"యెండమావుల నీరు యేకతపు పొలయలుక
వండఁగ వండఁగ నట్లు వలపులెల్ల" 7-231

పొలయాట : (2) వి. ప్రణయకేళి.

"చిందులపాటల శిరి పొలయాటల
అందెలమోఁతల నాడెనదే" 5-24

పొలయు : అ.క్రి. 1.సంచరించు 2. వ్యాపించు 3.సమీపించు 4. ప్రవేశించు 5. అతిశయించు 6. ప్రకాశించు, కనిపించు, తొలగు.

"పొలసి మీ కృపాంబుధి చేరితి మిదె
తెలిసి నా దాహము తీర్చవే" 3-19

పొలవోవు : అ.క్రి. 1. నశించు, చచ్చు 2. వ్యర్థమగు 3.భంగమగు 4. ఉడుగు.

"పాపపుపసురము బందెలు మేయఁగ
పోపుల పుణ్యము పొలివోయ" 3-19

పొలసిపోవు : అ.క్రి. సంచరించు, తిరుగు.

పొలసు : వి. 1. మాంసం 2. చేపమీదిపొట్టు, చేపకంపు.

"పొలసు పైఁబారెనట బురుద మేనంటెనట
యిల మన్నుమోఁచెనట యీ దేవుఁడు"

19-335

పొలసుమేనివాఁడు : వి. చేపశరీరం కలవాడు, మత్స్యావతారుడైన విష్ణువు.

"పొలసుమేనివాఁడు బోరవీఁపువాఁడు
సెలసుమోరవాఁడు సిన్నెకా" 5-182

పొలసులాడు : (పొలసులు + ఆడు) వి. మత్స్యావతారుడైన విష్ణువు. (పొలసులు = చేపమీది పొట్లు. అవికలది = చేప)

"పొలసులాడవు నీవు పురుషోత్తమా
బులిసి లోఁగఁగనే పురుషోత్తమా" 2-283

'ముద్రిత ప్రతిలో పొలసులాడకు' అని ఉంది.

తరువాతి పాదాల్లోని 'పొలమిు రాజవు ' అనే పదం వల్ల ఇది పొలసులాడవు ఐ ఉంటుందని ఊహింపబడింది.

పొలసులాడు : అ.క్రి. 1. సంచరించు, తిరుగు 2. మోసపు మాటలు పలుకు 3. కుటిలత చూపు. (పొలసు = కుటిలత)

"చలపట్టి యప్పటిని సలిగెలు నెరపఁగా
పొలసులాడవచ్చునా పొరుగువారికి" 23-1

పొలిఁతి : (13) వి. 'పొలఁతి'కి వ్యావహారికరూపం, స్త్రీ.

"పొలిఁతి నవ్వితే నీవు బొమ్మల జంకించేవు
మలసి యేమైనా నాపె మర్మమెత్తె నో" 14-498

పొలియు : అ.క్రి. మరణించు.

"పొలిసిన ధ్రువునకు వున్నతలోక మిచ్చె
అల బ్రహ్మలోకమున కదె మీఁదెఱఁగరా" 2-405

పొలివారు : ప.బం; వి. తూర్పెత్తు.

"వెలిధాన్యంబులు విషయపురాసులు
పొలివారేటి వూరుపుగములు" 1-387

పొలివోవు : ప.బం; అ.క్రి.1. క్షీణించు 2. వ్యర్థమగు 3. చెడు 4. భయపడు.

"పాపపు పసురము బందెలు మేయఁగ
పోపులపుణ్యము పొలివోయ" 3-19

పొలిసిపోవు : ప.బం; అ.క్రి. ఉడుగు, శమించు.

"అంది నిన్ను నొకమాటు హరియని నుడిగితే
పొందిన పాతకమెల్లాఁ బొలిసిపోయ" 2-51

పొలుగు : అ.క్రి. ఇది 'పొలుచు' కావచ్చు, కనబడు, గోచరించు.

"పెంచఁ బెంచ నెంతైనాఁ బెరుగుచు నిడువలపు
వంచించి పొలుగనీదు వలపు" 28-408

పొలుపు : వి. 1. శోభ 2. ఉల్లాసం 3. రూపు 4. స్థైర్యం, ప్రతాపం 5. వృద్ధి 6. సువాసన 7. పట్టు, విషయం 8. జాడ 9. పదినిమిషాల ఎండవేడిమి. విశ. 1. అధికం 2. ఇంపైనది 3. నియతం, న్యాయం.

"పొలుపుగాఁ బెండ్లాడి పొంతనాలు చూడనేల
చెలరేఁగి తెరదీసి సిగ్గు మరేల" 16-470

పొలుపు దాంట్ల పెద్దభూతము : వి. గుఱ్ఱాన్ని ఎక్కి మిక్కిలి వేగంగా దాటిపోతూ శత్రువులను చెండాడే కల్క్యవతారం.

"పొలుపుదాంట్ల పెద్ద భూతము" 1-109

పొల్ల : వి. బొత్తిగా గింజపట్టని ధాన్యం, పొల్లు. విశ. వ్యర్థం, తోపుడైనది.

"బాసదవ్వి నీవలె పదరనే నోపఁగాక
వీసమంత పొల్ల గల్లా విడుతువా నీవు" 14-245

పొల్లకట్టు : (4) ప.బం; వి. తూర్పారబోసేప్పుడు మేలు రాశి పక్కన పడే తాలుగింజలు.

"వుల్లములో నెంచనెంచ నుద్యోగము తీపెక్కు
పొల్లకట్టు దంచదంచఁ బోగులైనట్టు" 4-80

"మొల్లమి గాలియొకటె ముంచి తూరుపెత్తు చోట
పొల్లకట్టు కడఁబడె పోగువడె గట్టివెల్లా"
4-26 & 1-398

పొల్లకట్టు దంచి దంచి పోగుసేసుకొను : ప.బం; అ.క్రి. నిష్ప్రయోజనమైన పనిని చేయు.

పొల్లసేయు : ప.బం; స.క్రి. 1. అలక్ష్యంచేయు 2.వ్యర్థంచేయు 3. పొల్లుచేయు 4. నశింపజేయు.

"పరసతుల మానములు పొల్లసేసిన చేయి
తురగంబు బరపేటి దొడ్డచేయి" 1-334

పొల్లువోవు : ప.బం; అ.క్రి. అసత్యమగు.

"కెల్లురేఁగె దేహమందే కమ్మల చుట్టరికాలు
పొల్లువో దెన్నఁడు భూమి పుట్టఁగాఁ బుట్టినది"
2-490

పొస్తకము : (3) వి. పుస్తకమునకు వికృతిరూపం.

"వా(వ్రా)సుకో పొస్తకాన నివ్వల మఱవకుండాను
యే సుద్దులకైనాను యెచ్చరిక వలెను" 18-386

పో

పోఁక : వి. పోకముడి.

"వలపులు చల్లేవు వావులు గలసెనా
లలిఁబోఁకముడిచిరా లలనలెల్లా" 27-38

పోఁకందుకొను : అ.క్రి. ఆహ్వానమందుకొను .
"మాటులేని మందు నూరీ మగఁడు నవ్వులనే
చాటుకుఁ బోకందుకొని సమ్మతించవే " 7-103

పోఁకకుఁ బుట్టెడగు : ప.బం; అ.క్రి. ధాన్యం అతి చౌకగా లభించు, సమృద్ధమగు. ఒక పోకకు పుట్టెడు ధాన్యం లభిస్తుంది అనడం. ఇది సుభిక్షానికి సూచకం.
"పొలఁతికి నీతో పొందు పోకకుఁ బుట్టెఁడాయ " 23-66
"ధారణ పోఁకకుఁబుట్టెఁడయ్యె" అని జైమి. 69
"అమ్మరో పోఁకకుఁబట్టెడాయను సిగ్గులు నేఁడు
యెమ్మెల సతుల భాగ్యాలేమి చెప్పేదయ్యా " 13-68

పోఁకముడి : వి. చీరె చెంగు తొలిచుట్టులో వేసుకునే ముడి. రూపాం. పోంకముడి .
"చెనకుచు నీ వంతలో చేతులు చాఁచఁగానూ
వనిత పోఁకముడి వదలఁగఁ జొచ్చెను " 13-228

పోఁకవెట్టు : ప.బం; అ.క్రి. నిశ్చయతాంబూలం పెట్టు, (వ్యు.) బహుమానమిచ్చు.
"వారము వజ్జమనక వాకిట నన్ను నాఁగేవు
పోరచి మా వారు నీకుఁ బోఁకవెట్టిరా" 10-2-38
"పెండిలాడేనని పోఁకవెట్టి నాఁడు మొదలనే
అండనుండి యెచ్చరించరమ్మ సారెఁ జెలులు " 28-409

పోఁకులు : వి; బహు. పోకిళ్లు, మాయాప్రవర్తనం, కపటచేష్ట, చేష్ట, నష్టి, దొంగతనం, చరిత్ర.
"పోపో నీ కతలు పోకుల నీ గతులు
మాఁపుల రాఁపుల నే నోపుదునటే" 9-133
"నిక్కపుఁబోకులు నీ కేలే
నిక్కల గంటివి నీ కేలే" 6-66

పోఁగు : వి. జందెం .

పోఁగుపోఁగు పొందు : ప.బం; అ.క్రి. కలసి మెలసి ఉండు, నేతలో దారం దారం కలియు అని శబ్దార్థం.
"పాఁగిన శ్రీవేంకటాద్రిపతి నన్నుఁ గూడితివి
పోఁగుపోఁగు వొందినట్లు పురిగొంట గాక" 11-369
"వీఁగము శ్రీవేంకటేశ విన్నవించేమిఁక నీతో
పోఁగువోఁగుఁ బొంద మమ్ము బొందించుమీ నీవు" 8-241

పోఁగువెళ్లు : పోగువలె వ్యాపించు. (?)
"నిగిడి కూటములకు నీయంతనే పోఁగువెళ్లె
వగదీరె నాతనిని వలపించవమ్మా" 20-482

పోఁగువోయు : (పోఁగు + పోయు) సంతనకోసం తిన్నగా పోగు పారించి కుట్టు, రప్పుతీయు, పచ్చినూలుతో మంగళసూత్రాన్ని పేని సిద్ధంచేయు.
"పొందుల కోరికె లింత పోఁగు వోయనేఁటికే" 27-576

పోఁగెత్తేటివారు : ప.బం; వి; బహు. నేతవారు.
"చేవలఁబత్తి ముదుగు చేని ముదుగూ లేదు
వావిరిఁ బోగెత్తేటివారివారి నేరుపు" 2-90

పోఁగెత్తేటివారు : ప్రస్తావించేవారు, ఊసెత్తేవారు.
"చేవలఁ బత్తిముదుగు చేని ముదుగూ లేదు
వావిరిఁ బోగెత్తేటి వారివారి నేరుపు" 2-90

పోంకముడి : వి. పోఁకముడి.
"లలిఁ బోంకముడి వట్టి లాసుకొంటా నందరిని
గిలిగించీ శ్రీవేంకటగిరి కృష్ణుఁడు" 13-216

పోకు : వి. చూ : పోఁకులు.
"యేకతాలు సమకూడె నియ్యకోళ్లే మనకు
వాకులు పోకులు వొక వావి గూడెను " 8-32

పోకులఁబోక : ప.బం; వి. పోకిళ్లు పోవుట, మాయలు పన్నుట, దుర్మార్గంలో ప్రవర్తించడం.
"కాకరివై దూరేవు గక్కన విడె మీ నంటా
పోకులఁబోక నీ వాపెఁ బూటవెట్టరాదా" 8-197

పోకులఁబోవు : ప.బం; అ.క్రి. డాబులకు పోవు, పోకడలకు పోవు.
"పోని తెరువుల పోకులఁబోయేవు

కాని రాయేటి వంకలు తిద్ద వశమా " 6-58

పోగులు : వి; బహు. కుప్పలు, రాసులు.
"వేగమె రావయ్యా నీవు వెలఁది దినదినము
పోగులైన సంతోసాలు పోదిఁబెట్టుకున్నది "
28-310

పోగులు పోయు : (పోగులు + పోయు) ప.బం. అ.క్రి. రాశులుపోయు, కుప్పలుపోయు.
"పున్నమ వెన్నెలనెట్టు పోగులు వోయఁగవచ్చు
సన్నలఁగొండలనెట్టు జరుపవచ్చు" 14-585

పోగువడు : (పోగు+పడు) రాశిగా పడు, సందడించు.
"మొల్లమిగాలి యొకటే తూరుపెత్తుచోట
పొల్లకట్టు కడఁబడె పోగువడె గట్టి వెల్ల" 4-267

పోచిళ్లు : వి. ఉపశ్రుతులు. (బ్రౌన్)
"పొంచీ యెలుఁగు గోవిల పోచిళ్లు దెలుపవే"
28-365

పోచిళ్లు : వి; బహు. శకునం చూడటానికి ఇరుగుపొరుగు ఇండ్లమీద నీళ్ళతో చల్లే అక్షతలు. (వ్యు.) శుభాకాంక్షలు తెలియుటకై చల్లే అక్షతలు. (ఆం.ప.కో.)
"యెంచఁగ శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁ గూడె
పోరచి నీ పొరుగునఁ బోచిళ్లు చల్లరా" 11-212

పోటిదొర : వి. స్పర్థగల ప్రభువు.
"తీపు నీ కా మాఁటలైతే తిట్టించుకొందు గాని
పోపో నేనెందుకోప పోటిదొర వౌదువు " 11-287

పోటుఁబాటు : వి; ప.బం. కుమ్ముడుపడుట.

పోటుదారల భూతము : వి. ఇది పోటు దొరలపెద్దభూతమని కావచ్చు. యుద్ధ నిపుణమైన భూతమని శబ్దార్థం. ఇట ఇరువదిఒక్క పర్యాయాలు క్షత్రియులను యుద్ధరంగంలో తునుమాడిన వీరుడైన పరశురామావ తారమని గ్రహించాలి.
"పోటుదా(దొ?)రుల పెద్దభూతము" 1-109

పోటుబంటు : వి; ప.బం. శూరుడు.
"పొంచి సత్యభామకుఁగా పువ్వుల మోకుకు మోచితి
పొంచి సత్యభామవద్ద పోటుబంటవై మించితి "
27-399

పోట్లదొరితి : వి. రూపాం. పోట్లదుర్తి, పొట్లదొరితి. కడపజిల్లా యర్రగుంట్ల మండలం లోని గ్రామం. ఈ గ్రామానికి పోట్లదురితి, పోట్లదుర్తి అని నామాంతరాలు. ఇట చెన్నకేశవస్వామి ఆలయం ఉంది.
"భోగపు శ్రీవేంకటేశ పోట్లదొరితిలోన
నీ గతి చెన్నుఁడవైతే నెనసితిగా" 21-499

పోడి : వి. ఒప్పు, చక్కన, అందం.
"వద్దువద్దు తడవితే వాదులే సుమ్మీ! నీవు
పొద్దు పొద్దు వారి వీరి పోడులే సుమ్మీ" 21-433

పోతరము : (3) వి. పొగరు, మదం, గర్వం, ప్రభావం. (తె.వ్యు.కో.)
"యీతల శ్రీవేంకటేశ యిందరిఁగూడితి నిట్టె
పోతరముగా మీకు పోగువోసి దదివో" 14-76

పోతరించు : (4) అ.క్రి. గర్వించు, మదించు, పోసరించు.
"నీతులు నేరుచుకొంటే నీవె నడతువుగాక
పోతరించి నీవు మాకు బుద్ధి చెప్పనేఁటికే"
24-272

పోతరీఁడు : (పోతరము + ఈఁడు) మదం కలవాడు, గర్వం కలవాడు.
"రాతిరేడ నుంటివంటే రతికేల పిలిచీనే
పోతరీఁడు వీని కేల పొద్దువోదో యమ్మ "
20-225

పోది : (24) వి. 'ప్రోది'కి వ్యావహారికరూపం. పోషణం, వైభవం, రక్షించడం.
"పోదితో నప్పటి నేల పొదిగి వేఁడుకొనేవు
సాదించేనా నీతో చలము లింకాను " 25-320

పోదికత్తె : (ప్రోది + కత్తె) వి. ప్రోదికత్తె, పోషకురాలు, రక్షకురాలు.
"రాఁపుగ శ్రీవేంకటేశు రతినెట్టు గూడితివే
పూఁప జవ్వనముతోడి పోదికత్తెవు " 23-43

పోదికాఁడు : (2) (పోది + కాఁడు) ప్రోదికాడు, పోషకుడు, వైభవం కలవాడు.

"అంది నిన్నుఁబొగడితి నౌఁగదవయ్యా
పొందుల రతుల మంచి పోదికాఁడవు" 18-540

పోదిమాని కన్నగతి : (?)
"వీదుల వీదులనెల్లా విష్ణుఁడు సంచరించీని
పోదిమాని కన్నగతై పొండి మీ రసురలు"
3-487

పోదియెక్కు : *ప.బం; అ.క్రి.* అతిశయించు, వర్ధిల్లు.
"పోదియెక్కె వైరాగ్యబోధలచేఁ బలుమారు
పాదుకొని వేరువారె పంచసంస్కారాలను"
2-222

పోదిసేయు : (పోది + చేయు) ప్రోదిచేయు, అతిశయింప జేయు, వర్ధిల్లజేయు, పోషించు, సంరక్షించు. (వ్యు.)
"తానె శ్రీవేంకటేశుఁడు తగిలి నేఁగూడితేను
పూని యలసినందు పోదిసేయవలదా" 19-202

పోనియూరికిఁ దెరువు : *ప.బం; వి.* ఎటూ తీసుకొని వెళ్లనిది
"బుద్ధిమానిన చింత పోనియూరికిఁ దెరువు"
1-96

పోపు : వి. ప్రోపు, పోషణ.
"పాపపు పసురము బందెలు మేయఁగ
పోపులపుణ్యము పొలివోయ" 3-19

పోయ : (25) క్రి.ప. 'పోవు' ధాతువు భూతార్థకైక వచన క్రియయగు 'పోయెన్' కు వ్యావహారికరూపం. వెళ్లెను అని అర్థం. అన్నమయ్య ఎక్కడో ఒకచోట 'పోయె' అనే రూపాన్ని ప్రయోగించినా, ఎక్కువ చోట్ల 'పోయ' అనే రూపాన్నే ప్రయోగించినాడు. ఇట్లే అణఁగిపోయ, లేకపోయ, అమ్ముడుపోయ, పొద్దువోయ మొ॥ రూపాలు ప్రయుక్తాలు.
"కుప్పలుదెప్పలు నైన కోరికలు మతిలోన
యెప్పుడుఁ బాయకపోయ నెన్నిలేవు రోఁతలు"
1-206

పోయిన నీళ్లకుఁ గట్ట : *వి; ప.బం.* గతజలసేతు బంధనం, వ్యర్థమనుట.
"పోనీ పోనీ ఇఁకనేల పోయిన నీళ్లకుఁగట్ట
నేనే యింతకుఁ జొచ్చితే నిన్నిఁ బారనిత్తునా"
20-282
"బుద్దులు తప్పె నేమిటికి బోయిన నీళ్లకుఁగట్ట పెట్టనీ
యద్దములోని నీడకెటు లాసపడం
బొసఁగుందలోదరీ" అని ఉ.హరి.ప్రయోగం.
(5-157)

పోరచి : కానుక అని వాచ్యార్థం. కట్నం, చేబదులు. (ఆం.ప.ని.) కానుక. (ఆం.భా.చ. 521 పు.) ఇట ఘనత అనే లక్ష్యార్థం.
"ధారుణి శ్రీవేంకటేశు దాసుల సంగతినుంటే
పోరచి నే జీవులైనఁ బుణ్యులు గాకుందురా"
"యెసఁగి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
అసమున నాపె పోర చెందుకొనవయ్యా"
29-222
"పొట్టఁబొరుగున నుండి పోరచి వెట్టంపి నేఁడు
గట్టిగా నింత కరుణ గలదుగా నాకు" 11-149

పోరచి : విణ. 1.నిస్సారమైన 2.వ్యర్థం 3.అలక్ష్యం 4.విపరీతం. (వ్యు.)
"పొరుగున నున్నవాఁడు పోరచి యడుగవద్దా
సరుస నా మోవితీపు చవి చూచుఁగాని"
25-184

పోరచికూడు : వి. యాచితకపు కూడు.
"పొందుగ బాపనవారి పోరచికూ ళ్లారగించి
బందుకలవాఁడవై బలియరాదా" 20-584

పోరచి కోరికలు : వి. కానుకల మీది కోరికలు, వ్యర్థమైన కోరికలు.

పోరచి చెలులు : వి. అరణంగా వచ్చిన చెలికత్తెలు
"పోరచిచెలుల నెల్లా బొమ్మల జంకించీనే
చేరి తన సుద్దులెల్లాఁ జెప్పేరంటాను" 22-278

పోరచితనము : వి. వ్యర్థత, నిస్సారత.
"తీరిచి అనేకములు తిద్దితిద్ది చెప్పేవు
పోరచితనాన నీకు పూఁటలంటెనో" 21-79
"పొందులాపెతోఁ జేసి పోరచితనాన నాపై

నందిపచ్చడము గప్పే వౌనయ్యా" 12-480

పోరచిన్ : ఘనతతో అని లక్ష్యార్థం. (పోరచి = కానుక)

"ధారుణి శ్రీవేంకటేశు దాసుల సంగతి నుంటే
పోరచి నే జీవులైనఁ బుణ్యులు గాకుందురా"
4-66

పోరచి పెట్టేవారు : (2) కానుక పెట్టేవారు.

"పోరచి పెట్టేవారు పొరుగున నుండఁగాను
మేరతోడి కామినుల మేకొనేవా" 16-29

"పొత్తుల మా యిద్దరికి పోరచివెట్ట వచ్చేవు
యిత్తల నీ పెద్దరిక మెంత గలదే" 21-268

పోలించు : స.క్రి; పోల్చు.

"పోలించి చూచితేను పొసఁగు నిద్దరికిని
మేలువారు తొల్లె మీరు వోలలాడరయ్యా" 18-8

పోలింపు : స.క్రి. పోల్చు.

పోలికె : (3) వి. 'పోలిక'కు వ్యావహారికరూపం.

"మేలు మేలు జాణ కాదు మెస్తిరా నిన్ను
పోలికెకు నవ్వితేనే బూమెలు సేసేవా" 26-6

పోలిమి : (పోలు + ఇమి) వి. పోలిక.

"బాలుఁడాయ పరబ్రహ్మము వీఁడంటూ
పోలిమితోఁ గరిపురజను లనిరి" 23-547

"పొలిమితోఁ జూడవచ్చె పొరుగున నాపె"
26-284

పోళిమి : వి. 'పోడిమి'కి రూపాం. 1. ఆదరం, గౌరవం 2.ఒప్పు, చక్కన, అందం 3. అవధానం,హెచ్చరిక 4. లక్షణం, చిహ్నం. (వ్యు.)

"మూలనున్నవారి మమ్ముఁ ముంగిట వేసితివి
పోళిమినాఁడు వారు నీ పొరుగవుటే దోసమా"
17-175

"నాలి నాయెదుట నీవు నవ్వు నవ్వేవేమే నిన్నుఁ
బోళిమితోఁబొంది నన్నుఁబొందె నంటాను"
15-99

పోవవు : క్రి.ప. పోవు ధాతువు వ్యతిరేక తద్ధర్మార్థక మధ్యమపురుషైకవచనరూపం. 'పోవు' (= వెళ్లవు) అనేది సాధురూపం. 'పోవవు' అనేది విలక్షణరూపం.

పోసపుబాస : వి. (?)

"మాసినట్టి పై చెఱఁగు మంతనములో కరంగు
పోసపుబాన పోఁకకుఁ బుట్టెడేసి" 19-479

పోసపోవు : అ.క్రి. మదించు, గర్వించు.

"పోసపోని వారయితే ముయికి ముయిసేతురు
వాసి మానాపతులనె వంచుకొంటేఁ జెల్లునా"
8-270

పోసము : వి. ఇది 'పోసనము' కావచ్చు. క్షీరం, పాలు. (కాంతి, పైపూత)

"నెలఁత దక్కితినని నీ వీడెపురసము
చలివాయ నిపుడు పోసము దాగేనే" 15-90

పోసముదాగు : ప.బం; అ.క్రి. తీర్థమువలె భక్తితో ఆపోశనము పట్టు.

"నెలఁత దక్కితినని నీ వీడెపు రసము
చలివాయ నిపుడు పోసము దాగేనే" 9-90

పోసరము : వి. పోతరము, గర్వము, మదం.

"రాసి సేసేవు వలపు రతులలో నెల్లా నీవు
పోసరపువేడుకకు భోగమా యిది" 23-181

పోసరించు : (42) అ.క్రి. పోతరించు, మదించు, గర్వించు.

"పోసరించి వుండే నన్ను పొందుగా యింతేసెసె
పోసరించిన బుద్ధులు పోరచివెట్టేరా" 20-572

పోహణించు : స.క్రి. కూర్చు, గుంపించు, పొగడు.

"మోహము గలవాఁడవు మొక్కించుకో ఆపెచేత
పోహణించి నన్నేమి బుద్దెడిగేవు" 19-90

పౌ

పౌఁజు : వి. సైన్యం. ఇది ఉర్దూపదం. (బారు. పీఠిక 12 -)

"విడిసెఁ గపిబలము వెస సముద్రముదరి
నడచె లంకపైఁ బౌజు నానాగతుల" 4-279

ప్ర

ప్రతాపించు : అ.క్రి. శౌర్యం చూపు.
"వసుధఁ బ్రతాపించి వడిఁదోఁక గదలించి
దెసలెల్లాఁ బాలించీ దివ్యహనుమంతుఁడు "
4-272

ప్రతిచంద్రుఁడు : (2) వి. మాఱుచంద్రుడు.
"సతి నింత తాపాన చందురుఁడేపఁగఁబో
ప్రతిచందురుండాయ పడఁతి మోము" 5-375

ప్రతిపెట్టుకొను : స.క్రి. ఎదుట ఉంచు, సమానంగా ఉంచు.
"నీవే కావఁగఁ గర్తవు నేనే శరణాగతుఁడను
కైవశమగునను ప్రతివెట్టుక నా కథలు యెంచనేలా అయ్యా" 2-514

ప్రత్తెక్షము : వి. 'ప్రత్యక్షము'నకు వికృతిరూపం.
"హత్తి యింద్రియములందుఁ బ్రధానులు
ప్రత్తెక్షరాజ్యము ప్రకృతియుఁ గలిగె" 3-272

ప్రముఖము : వి. ముఖము.
"చక్రాయుధ రవి శతతేజోంచిత
సక్రోధ సహస్ర ప్రముఖా" 2-81

ప్రహేళిక : వి. గూఢార్థం కలిగిన శ్లోకం లేక కావ్యం.

ప్రా

ప్రాణచారి : వి. అభీష్టసిద్ధికి దీనప్రయత్నం చేసేవాడు, విడువక అతిదీనంతో ఒకరిని అర్థించేవాడు.
"బడిబడి నొసఁగుచు (ను!) బ్రాణచారులకు
కడిమినీడ దిరుగని చింతాడ" 1-320

ప్రాణచారి : వి. ప్రాయోపవేశం చేసేవాడు, స్వచ్ఛందంగా మరణించేవాడు.
"బడిబడి నొసఁగుచుఁను బ్రాణచారులకు
కడిమి నీడ దిరుగని చింతాడ" 1-320

ప్రాణపుటూరుపు : (ప్రాణము + ఊరుపు) వి. ప్రాణవాయువు.
"ప్రతిలేని తనలో ప్రాణపుటూరుపైన
రతి నలసినవేళ రంపమై తోఁచు" 7-333

ప్రాణప్రతిష్ఠ : వి. దేవతల విగ్రహాల్లో ప్రాణాన్ని ఆవహింప జేయడం.
"మొదల నంతర్యామిమూర్తి వయిన నీకు
పదవి మీర నదియే ప్రాణప్రతిష్ఠ" 4-46

ప్రాణప్రాణనేస్తము : వి. మిక్కిలి ప్రాణస్నేహితుడు.
"నీకు నీకుఁబ్రాణ ప్రాణనేస్తమైనచో
చౌకగాకతనికి నిచ్చకమాడఁ దగదా" 20-241

ప్రాణబందుగుఁడు : వి. ప్రాణబంధువు.
"యిన్నిటాను శ్రీవేంకటేశుఁడు యీ కాంతఁగూడె
పన్ని యీతఁడే యింతి ప్రాణబందుగుఁడు "
17-429

ప్రాణబందుగురాలు : వి. ప్రాణబంధువైన స్త్రీ.
"బాగాలిచ్చీ నీ ప్రాణబందుగురాలు
చేవదేర నీ వేల చే యొగ్గవు" 25-460

ప్రాణబంధువుఁడు : వి. అత్యంతసన్నిహిత బంధువు.
"పాయరాని చుట్టమైన ప్రాణబంధువుఁడు
వేయైనాఁ దనచేఁతకు వేసరే దానునటే" 16-83

ప్రాణవల్లభుఁడు : వి. ప్రియుడు, భర్త. ప్రాణేశ్వరుడని వ్యుత్పత్తి.
"ప్రాణవల్లభునిఁ బెడఁబాసి మరుబాణముల
ప్రాణబాధల నెగులు పడుటేఁటి వలపే" 5-230

ప్రాణవిభుఁడు : (2) వి. భర్త.
"నీఁటునఁ బ్రాణవిభుఁడ నీ వేమి సేసినా
వాఁటమై మొక్కదుఁగాక వాసివట్టేనా" 11-213

ప్రాణాచారాలువడు : అ.క్రి. అభీష్టసిద్ధికి ప్రయత్నాలు చేయు, విడువక ఒకరిని అతిదీనంగా అర్థించు, ప్రాయోపవేశం చేయు. (వ్యు.)
"పరులఁ గొలిచి వచ్చి ప్రాణాచారాలువడితే
సిరుల వరాలిచ్చేవు శ్రీవేంకటేశా" 3-128

ప్రాణుఁడు : వి. జీవుడు.

"విడిచెనా తన పాపవిధులు ప్రాణుఁడు మున్ను
అడరి మానుషరూప మైనంతనే" 4 అను. 18
"తనవారని యాసఁ దగిలి భ్రమయనేల
తనువుఁ బ్రాణునికంటె తగులేది" 1-222

ప్రాణేశుఁడు : (2) వి. భర్త, ప్రియుడు.
"అవధారు చిత్తగించు మంగన ప్రాణేశుఁడవు
యివల నీ కింతలోనే యెక్కడ పరాకు" 12-299

ప్రాణేశ్వరి : (3) వి. భార్య, ఇది సంస్కృత పదమే యైనను సంస్కృతంలో దీనికంతగా వాడుక లేదు.
"అలిగి ప్రాణేశ్వరి అవ్వలి మోమైనవేళ
వలపుతో బుజ్జగించేవాఁడు వో జాణ" 11-220

ప్రాణేశ్వరుఁడు : వి. భర్త, ప్రియుడు; ఇది సంస్కృతపదమే యైనను సంస్కృతంలో దీనికంతగా వాడుక లేదు.
"ప్రాణేశ్వరుఁడు దన్నుఁ బాయఁ జూచినయపుడు
ప్రాణంబు మేనిలోఁ బాయంగవలదా" 5-230

ప్రాప్తవ్యమర్థం లభతే : ప్రాప్తవ్యమర్థం లభతే మనుష్యః అని పూర్తివాక్యం. మానవుడు తాను పొందదగిన వస్తువును తప్పక పొందుతాడు అని భావం.
"తలఁపేల చిక్కుపడీ ధనము కొఱకుఁగాను
అలమి ప్రాప్తవ్యమర్థమనఁగాను" 15-223

ప్రాయము : (3) వి. వయసు్స, యౌవనం.
"ఎవ్వరికిఁ గలదయ్య యిటువంటి వలపు
పువ్వువంటి ప్రాయమున భోగించీఁ జెలియ"
16-495

ప్రి

ప్రియపడు : (9) (ప్రియము + పడు) స.క్రి. ఇష్టపడు.
"నియతి శ్రీవేంకటేశ నేఁడిట్టే పెండ్లాడితిని
ప్రియపడి యింత సేయ బిరుదులదాననా"
13-407

ప్రియవాదితనము : వి. ప్రియం పలికేవాని లక్షణం.
"పెనఁగులాటకు లంకె ప్రియవాదితనములు
వొనరి మమ్మిక నేల వుప్పతించేవయ్యా"
28-454

ప్రే

ప్రేమసేయు : (ప్రేమ + చేయు) ప్రేమచూపు, ప్రేమించు.
"సెలవి నవ్వినవాఁడు చేయి చాఁచకుండునా
పిలువనేలే తానే ప్రేమసేసీని" 25-238

ప్రొ

ప్రొద్దుప్రొద్దు(లు) : వి. బహు. (ప్రొద్దులు + ప్రొద్దులు) ప్రతినిత్యం.
"ప్రొద్దుపొడుపుల దొకటి ప్రొద్దుగ్రుంకుల దొకటి
ప్రొద్దుప్రొద్దులకు రహిపొయ్యేటి దొకటి" 6-57

ప్రో

ప్రోడ : వి. 'ప్రౌఢ' శబ్దానికి వ్యావహారికరూపం, ప్రగల్భుడు, నిపుణుడు, వివేకి.
"యీడనె శ్రీవేంకటేశ యెంతకెంత సేసేవు
ప్రోడవౌదువు నీకిఁక బొద్దువోదా" 7-581

ప్రోడదొర : వి. ప్రౌఢుడైన యజమానుడు.
"యెగ్గు లేని ప్రోడదొర వెఱుఁగరాదు నీకైతే
వొగ్గేవు నీవెందుకైనా వోయమ్మ వెరవవు"
27-170

ప్రౌ

ప్రౌఢవాఁడు : (ప్రౌఢ + వాఁడు) వి. ప్రౌఢుడు, దిట్ట, నిపుణుడు, వివేకి. 'ప్రౌఢ' అనే కేవలతత్సమ శబ్దంమీద 'వాడు' శబ్దప్రయోగం. ప్రౌఢప్రయోగమే. ఇట్టి ప్రయోగము లీ పదవాఙ్మయమున కలంకారములని సంపాదకుల వివరణ.
"కన్నెపాయ మటుగాన కాంత పలుకఁగ వుంటే
పన్ని యేల పైకొనవు ప్రౌఢవాఁడవు" 27-141

ఫ

ఫలము లేని పంట : *ప.బం; వి.* నిష్ప్రయోజనం
"వట్టిజోలితో నూరక దేవర లేని పూజవంటిది
వొట్టుక ఫలము లేని పంటలకు వొడిగట్టే యటు
వంటిది"72-320

ఫలాధరుఁడు : వి. బింబఫలాధరుఁడు
కావచ్చునని సంపా. దొండపండువంటి పెదవి
గలవాడు.
"వరుఁడు సీతకు ఫలాధరుఁడు మహోగ్రపు
శరుఁడు రాక్షససంహరుఁడు వాఁడే" 2-219

ఫలాధరుఁడు : వి. బింబఫలాధరుడు కావచ్చు.
బింబ (దొండ) ఫలంవంటి పెదవిగలవాడు.
"వీరుఁడు సీతకు ఫలాధరుఁడు మహోగ్రపు
శరుఁడు రాక్షస సంహరుఁడు వాఁడే" 2-219

బ

బంగపెట్టు : స.క్రి. 'భంగపెట్టు'కు
వ్యావహారికరూపం. అవమానపఱచు,
మోసగించు.
"బంగపెట్టి వేరొకతె పగ దీర సూడువట్టి
యెంగిలి తమ్మ వేసితే నెట్టవునో కదరా"
14-220

బంగారగు : ప.బం. శ్రేష్ఠమగు.
"పచ్చితనమెల్ల బంగారగు" 23-461

బంగారాన పరిమళమగు : *ప.బం; అ.క్రి.*
అదనంగా అతిశయం కలుగు, బంగారానికి
తావి అబ్బు.
"నిగ్గుల నిందుమీఁద నీవై పైకొని కూడితి
బగ్గన బంగారానఁ బరిమళమాయెను" 14-334

బంగారుచేయి : వి. ప్రశస్తమైన చేయి,
అమూల్యమగు చేయి.
"ఇందరికి నభయంబు లిచ్చుఁజేయి
కందువగు మంచి బంగారుచేయి" 1-334

బంగారునకు అపురూపమగు మణి దొరకినట్లు :
ప.బం; క్రి.విణ. అందమైన వస్తువుకు మరింత
అందం చేకూరినట్లు.
"అరిది బంగారునకు నపురూపమగు మణి
దొరకినట్లాయఁ గాదో తరుణి" 5-238

బంగారుపంటలు వండు : *ప.బం; అ.క్రి.*
సౌందర్యం అతిశయిల్లు.
"పడఁతి మేనిపై నెల్లా బంగారుపంటలు వండు
చిడుముడిఁ బాదాలకు చిగురుదాపు" 28-518

బంగారుపెంకును ఇనుమును సరియను : *ప.బం;*
అ.క్రి. అమూల్యమైన వస్తువును కొద్దిపాటి
విలువగల వస్తువుతో సమానమను.
"పెట్టిన బంగారుపెంకును నినుమును
అట్టే సరియను టదియు నీ పూజ" 3-320

బంగారువంటిది : వి. అందమైనది,
స్వచ్ఛమైనది.
"బంగారువంటిదాన పచ్చివిటుఁడవు నీవు
యెంగిలి నీ మాట వింటి నేమి సేతురా" 3-163

బంగించు : స.క్రి. 'భంగించు'కు
వ్యావహారికరూపం. భంగపఱచు.
"సంగడిఁగూచుండి నీవు సణఁగు లేల రాల్చేవు
బంగించి యాతనిఁ దప్పుపట్టవే నీవు" 7-252

బంటతనము : వి. 'బంటుతనము' కావచ్చు.
పరాక్రమం.
"పంతగాఁడు మిక్కిలి బంటతనమునను
అంతటాఁ గలశాపురహనుమంతుఁడు" 3-503

బంటుపంతము : *ప.బం; వి.* వ్యర్థమైన పంతం.
బంటు (=సేవకుని) పంతాలు వ్యర్థమేకదా!
"జంటై వుందునో వద్దో సారె నమ్మ లేవనేవో
బంటుపంతా లేఁకనేల పలుకఁగదయ్యా" 22-85

బంటుబంటు : వి. దాసానుదాసుడు.
"పాలుమాలి యిందరికి బంటుబంటవై" 1-215

బంటుబంటుతనము : వి. దాసానుదాస్యం,
దాసునికి దాసుడుగా ఉండడం.
"బంటుబంటుతనమా పడితాళించవచ్చీని
దంటఁ జేసితివి నీవే తరుణి నింతేసి" 25-254

బండగు : (బండు + అగు) అ.క్రి.
అవమానమగు, నిస్సారమగు.

"కొండదవ్వుట యెలుకగోరి పట్టుట దీన
బండాయ సంసారబంధము" 1-321

బండవలము : వి. మూలధనం, సంచిమొదలు, సామర్థ్యం.

"ఆరసియుఁ గొంకనేల అన్నిటా జాణవు నీవు
భారము లే దించుకంతా బండవలము నీకు"

7-515

బండవెవసాయము : ప.బం; వి. పాడువ్యవసాయం. (వ్యవసాయానికి వెవసాయం వ్యావహారికరూపం)

"పలుకంతల చేను బండ వెవసాయము
బలిమిఁ దొక్కిఁ గుంటపసురము" 3-464

బండాతుకూరి జనార్దనుడు : వి. బండాతుకూరు అనే గ్రామంలో నెలకొన్న జనార్దనస్వామి. బండాతుకూరు అనే గ్రామం ఎక్కడ ఉందో తెలియడంలేదని డా॥ దాసెట్టి శివప్ప పేర్కొన్నారు. (తా.అ.సా.తె. 107 పుట.)

"చల్లఁగా బండాతుకూరి జనార్దనుఁడై
యెల్లగా శ్రీవేంకటేశుఁడిరవాయ వాడే" 24-157

బండారించు : (4) స.క్రి. కోశాకారంగా చేయు.

"కందువైన రతులెల్లా కాఁగిట బండారించె"

13-257

"పలుకులు మూటగట్టి బండారించవచ్చునా
చలమరి నీ గుణాలు చక్కఁబెట్టవచ్చునా"

26-417

"అంచల నా కర్మ మనే అలుగు బండారించితి
పెంచి యింద్రియాలఁ బంపు వెట్టకుమయ్య"

15-111

బండారు : వి. బండారము, బొక్కసము, ధనం.

"నిలువుఁజక్కదనము నిండుబండారు
కలిగె నీకు రావయ్య కందువల నిపుడు"

23-318

బండారుముద్ర : వి. ధనాగారంమీది ముద్ర, పసుపు ముద్ర, కుంకుమ ముద్ర.

"మతించిన కౌస్తుభమణి నిలువుటద్దము
మితిలేని శ్రీవత్సము మించు బండారుముద్ర"

9-299

బండికంటిజాడలు : (బండికల్లు + జాడలు) వి. బండిచక్రపు గుర్తులు.

"గొంట జాణతన మేలే కూళతనా లేలరా
కంటి నే నీ జాడ బండికంటి జాడలటరా"

24-217

బండికల్లు : వి. బండిచక్రం, రథచక్రం.

బండిగాలి కత్తి : వి. చక్రాయుధం.

"బండిబోయుఁడై వచ్చి బండిగాలి కత్తి వట్టి
బండి విఱిచిన యట్టి బాలుఁడీతఁడు" 7-87

బండిగాలు : వి. చక్రం.

"బండిబోయుఁడై వచ్చి బండిగాలి కత్తి వట్టి
బండి విఱిచిన యట్టి బాలుఁడీతఁడు" 7-87

బండిబంటు : వి. రథసారథి.

"యిందరి పాలిటికి యీశ్వరుఁడ వేలికవు
పందలై యర్జును బండిబంట వైతివి" 1-473

బండిబాట : వి; విశాలమైన బాట, కాలిబాట.

"గరిమనాడే మాటలు కప్పురపు మూటలు
పరగుఁజక్కఁదనాలు బండిబాటలు" 28-515

"పాటిగంప నీళ్లు నించేవు పదుమనాభ!
బండిబాట లాయె నీ గుట్టు పదుమనాభ!

15-247

బండిబాటలగు : ప.బం; అ.క్రి. ఘంటాపథమగు, అందరికీ వెల్లడగు.

"దాపరికము లేక బహిర్గతమై తేటతెల్లమై పోవు" అని వేటూరి ఆనందమూర్తి.

"బండిబాటలాయె నీ గుట్టు పదుమనాభ"

15-247

బండిబోయిఁడు : (4) వి. చూ : బండిబోయుఁడు.

"పసులఁగాచుట యెట్టు బండిబోయిఁడ వౌ టెట్టు
వెస నిన్నుఁదలఁచితే వెరగయ్యీ నాకు" 2-332

"బండి విఱిచినట్టి పాతకమునఁబెద్ద
బండిబోయిఁడవై పనిసేయవలసె" 1-277

బండిబోయుఁడు : *ప.బం; వి.* సారథి, రథచోదకుడు, బండి నడిపేవాఁడు.
"బండిబోయుఁడై వచ్చి బండిగాలికత్తి వట్టి
బండివిఱిచిన యట్టి బాలుఁడీతఁడు" 7-87

బండు : *వి.* 1. అవమానం, పరిహాసం 2. ఆకతాయితనం 3.ఆకతాయిమాట 4. రోత 5. బురద.
"మోసపుచ్చి అందులోన మొఱఁగఁగఁ జోటులేదు
ఈ సరి యాఁడువారిలో నింత బండు గలదా"
20-319

బండుబండగు : (12) *ప.బం; అ.క్రి.* పటాపంచలగు, (పద.) మిక్కిలి అవమానమగు.
"వుండ నుండ నంతలో నిట్టూరుపుటుసురులు
బండుబండై పులకల పైరుల పసురులు"
24-141
"మెండుగ దేవుఁడు వీధి మెరసి యేతెంచీ వాఁడే
బండుబండై యసురలు పారరో దిక్కులకు"
3-164

బండుబండుసేయు : *ప.బం; స.క్రి.* పటాపంచలు చేయు.

బండుబూతు : *ప.బం; వి.* పచ్చిబూతు. బండవాండ్లు తిట్టుకునే బూతు.
"బండుబూతు లిఁక నేల పంతమెక్కె నిపుడు"
23-46

బండుసేయు : (6) *ప.బం; స.క్రి.* పరిహాసం చేయు, అవమానంచేయు, అల్లరిచేయు.
"వలచి వచ్చినదాన వంకలు గుణాల నుంటే
బలిమిఁ బెనఁగి నిన్ను బండుసేసేనా" 13-413

బండ్లకు కాళ్లుచాచు : *ప.బం; అ.క్రి.* కావాలని ఆపద తెచ్చుకొను. చూ : పారేబండికి కాలు చాఁచు, పారెబండి కింద పాదము చాఁచు.
"యేరీతిఁ దమి రేఁచిన నీరు దియ్యఁ బేను వచ్చు
భారపు బండ్లకుఁగాళ్లు పైఁజాఁచ నేలే" 11-458

బంతిఁబెట్టు : *ప.బం; స.క్రి.* వరుసపెట్టు.
"యెంత లేదు నీ సణఁగు యేల వాదుకు వచ్చేవు
బంతిఁబెట్టి వలపులు పంచి పెట్టవచ్చునా"
9-193

బంతికట్టు : (2) *ప.బం; స.క్రి.* కళ్ళంలో కుప్ప నూరిచేప్పుడు ఎడ్లవరుసను తాడుతో కట్టు. పండిన పైరును ధాన్యపు గింజలు వేరు కావడానికి పశువులను వరుసలో కట్టి చుట్టు తిప్పి తొక్కించు.
"బంతిగట్టి నురొపెడి పసురమునై" 3-338
"ఎద్దుల బంతిగట్టుదు రెండైనా మగువల
కొద్దిమీఱ బంతిగట్టి కూడేదే యరుదు" 17-110

బంతికూటి సతులు : *వి; బహు.* పంక్తి భోజనం చేసే స్త్రీలు.
"బంతికూటి సతులెల్ల పనికివత్తురా నీకు
వంతుకుఁ బెండ్లాడినటువంటివారే కాక" 26-306

బంతికూడు : (7) *వి.* పంక్తిభోజనం. (బంతి = పంక్తి)
"మంతనాన నుండి తమకింతు నీ రాకకు
బంతికూటివేళ నీకు వారమిత్తును" 12-281

బంతిపెట్టు : *అ.క్రి.* వరుసపెట్టు.

బంతిబాసలు : *వి; బహు.* నలుగురితో మాట్లాడే మాటలు.
"కాంతుడ శ్రీవేంకటేశ గక్కునఁ గూడితి నన్ను
బంతిబాస లేమిటికి బతికించేయందుకు" 21-32

బంతిబోజనాలవారు : *వి; బహు.* పంక్తిభోజనం చేసేవారు.
"పలుకుఁదేనెలవారు బంతిబోజనాలవారు
చెలిమికత్తెలు నీకు సేనాసేన" 12-282

బంతిభోజనము : (3) *వి.* పంక్తిభోజనం.
"ఇంతలేసి కావలెనా యింకాను నీ
బంతిభోజనాలే చాలుఁ బాలించ మమ్మును"
25-464

బంతియాసలు : *వి; బహు.* పెక్కు ఆసలు.

"చింతతో నన్నేలిన సిగ్గుపట్టెల్లా నీది
బంతి నా యాసలు నీపై వేసేఁగాక" 27-28

బంతివిందు: వి. పంక్తిభోజనం.
"బంతివిందులు చెప్పేరు పాలిండ్లు చూపి చూపి
సంతకూటములలోని చవులాయ వలపు"
21-115

బంతిసాగు: అ.క్రి. భోజనానికి బంతి దీరి కూర్చుండు.
"పట్టపుదేవుళ్లుఁ దాను బంతిసాగి వున్నవాఁడు
అట్టె సేయరో పులుగమారగింపులు" 3-298

బంతెనఁగూళ్లు: వి; బహు. పంక్తి భోజనాలు.
"బంతెనఁగూళ్లు నేఁడు పచ్చదోరణాలు నేఁడు
చింత దీర భోగించి చిత్తగించవయ్యా" 20-343

బందుకట్టు దుఃఖములు: వి; బహు. (?)
"ముందుసిరు లిత్తు వని మోక్షము నీ విత్తునని
బందుకట్టు దుఃఖములఁ బాపుదు వీని" 2-468

బందుకలవాఁడు: వి. బలం కలవాడు.
"పొందుగ బాఁపనవారి పొరచికూళ్లారగించి
బందుకలవాఁడవై బలియరాదా" 20-584

బందుగుఁడు: వి. చుట్టం. రూపాం. బందుగు, బంధువు.
"బదుకఁగలవు పెక్కుపడఁతులలోన నెల్లా
పదరవన్నిటికిని బందుగుఁడవయ్యా" 14-68

బందె: (2) వి. నిర్బంధం.
"గట్టిగ శ్రీవేంకటాద్రి ఘనుఁడిట్టె నన్నుఁగూడె
పట్టిన చలము నీకు బందె దెచ్చెనా" 11-264

బందెదీరు: అ.క్రి. విముక్తి కలుగు.
"అందరికి నీ సేవలు హస్తగతాలై వున్నవి
బందె దీర నీకు మొక్కి బదుకుమని" 3-285

బందెపసురము: వి. బందెదొడ్డిలో పడిన పశువు. బంధనంలో చిక్కుకున్నది.
"ఇందునందుఁ దిరుగుచు నెవ్వరివాఁడవుగాక
బందెపసురమ వైతి బాపు జీవుఁడా" 1-215

బందెమాన్యము: వి. బందెలదొడ్డి.
"సరుస శ్రీవేంకటేశు శరణాగతులకును
పరఁగ మాయలదొడ్డి బందెమాన్యము" 2-451

బందెయెద్దు: వి. బందెదొడ్డిలో పడిన ఎద్దు.
"పంగించ నీనోరు బందెయెద్దు మోరాయ
కంగులేక కదుపునఁ గలపఁగవలెనా" 7-185

బందెలుమేయు: ఇతరుల పొలాల్లో, భూముల్లో దొంగమేత మేయు.
"పాపపు పసురము బందెలు మేయఁగ
పోపులపుణ్యము పొలివోయ" 3-19

బంధువుఁడు: (2) వి. బంధువు, చుట్టం; ఏకవచనంలో వచ్చిన 'వు' ప్రత్యయంపై మళ్లీ ఏకవచన 'డు' ప్రత్యయం రావడం విశేషం.
"తెగని బంధువుఁడు దేవుఁడు
బగివాయఁడిహముఁ బరమునను" 2-472

బగి: వి. పార్శ్వం.

బగిడికాఁడు: వి. ఎక్కువవయస్సు కలవాడు; క. బగుడ.
"సగము సాయ సంపి సడిఁబెట్టి విడిశిన
బగిడికాఁడు సిన్న పడుసటె వీఁడు" 5-378

బగివాయు: అ.క్రి. పక్కను పాయు, దూరమగు.
"బగివాయకుండుటే చేపట్టిన పొందు" 25-152
"మగువ నెట్ల నీవు మరిగించుకొంటివో
బగివాయ దెపుడు నీ పానుపుమీఁద" 14-465

బగివాయు: ప.బం; అ.క్రి. బైసిమాలు, సిగ్గుమాలు, గౌరవం లేనిదగు, భాగ్యం లేనిదగు, మర్యాద తప్పు, అవమానపాత్రమగు.
"మగిడి మగిడి యాపె మాట నీతో నాడితేను
బగివాయ కటు నన్నుఁ బలికించేవు" 13-509

బగ్గడ: వి. ప్రగ్గడశబ్దానికి ఇది వ్యావహారికరూపం కావచ్చు.
"గట్టిగా శ్రీవేంకటేశ కలసితివిటు నన్ను
బట్టువలెఁ గొనేడఁగా బగ్గడె నవు గదా" 28-190

బగ్గడి: వి. పనికిరానివాడు, కోపిష్ఠి.
"బగ్గడికిఁగాని పట్టి పంతము లీడేరవు

వెగ్గళించ నీ తలనే వేగెనటవే" 18-184

బగ్గడికాఁడు: వి. (బగ్గడి + కాఁడు) పనికిరాని వాడు, కోపిష్ఠి.

"బగ్గడికాఁడాతఁడు పంతకత్తెవు నీవైతే
వెగ్గళించఁజూచితేను వింతదోఁచుఁబనులు"
7-586

బగ్గడితనము: (బగ్గడి + తనము) పనికిరాని తనం, మోటుతనం.

"సిగ్గరితనానఁ జెక్కు చేతఁ బెట్టుకుండఁగా
బగ్గడితనాన నీవు పదరుదువా?" 25-262

బగ్గడిది: (బగ్గిడి + అది) వి. పనికిరానిది.

"బగ్గడిదానికిఁగాని పచ్చిమాఁట లమరవు
వొగ్గి యందాఁకా దీని వోజ చూచేవే" 16-561

బగ్గడివాఁడు: వి. మోటువాడు, పనికిరానివాఁడు.

"ఎయ్యెడ బగ్గడివాఁడ విటు నీ వంటూనే కా
కుయ్యక తెరమాటున గుట్టు సేసుకుందురు"
13-51

బగ్గన(న్): అవ్య. పగులుటయందనుకరణ ధ్వని, తొందరగా, ప్రకాశంగా.

"ఇటు గరుడని నీ వెక్కినను
పటపట దిక్కులు బగ్గనఁబగిలె" 1-92

"దగ్గరనె వున్నవారు తరుణులందరు నదే
బగ్గనఁదాఁ బైకొంటే పకపక నగరా" 11-283

బగ్గన నవ్వు: ప.బం; అ.క్రి. కోపంతో నవ్వు.

"సిగ్గులు ముదిరితే సెలవికి నవ్వువచ్చు
బగ్గన నవ్వితేఁ గోపము వచ్చును" 11-438

బచ్చన: వి. 'బచ్చెన'కు వ్యావహారికరూపం. 1. వంచన 2.మోసం 3. పూత 4. రంగు, వర్ణం 5. గుర్తు.

"బచ్చనవంటిది నా పలుకు నీ యడకును
అచ్చమై చూడఁజూడఁగ నందమై యుండు"
11-414

"ముచ్చట మమత చీచీ ముచ్చు మురిపెము చీచీ
బచ్చురపణములోని బచ్చన చీచీ" 1-195

బచ్చనకవిత: వి. పైపై మెఱుఁగుల కవిత, అంతస్సారం లేని కవిత. రూపాం. బచ్చెన కవిత.

"పుచ్చినట్టి పండు బూఁజిలోననే వుండు
బచ్చనకవితలు బాతిగావు యెందు" 2-494

బచ్చనకూటమి: వి. కపటపు కూటమి. (?)

బచ్చనకూరిమి: వి. కపటపు స్నేహం.

"బచ్చనకూరిమి చల్లి భ్రమయించేదానవా
బచ్చనలు పచరించి బలిమి నే నీ పొందు"
16-114

బచ్చనచక్రము: (?)

"బచ్చనచక్రము చేతి కృష్ణుఁడు లాల
పచ్చారి వలపులనే బాలకృష్ణుఁడు" 29-481

బచ్చనబంధము: వి. మోసపు బంధము.

"పొచ్చములనల్ల నాఁటిపూఁట దీరదని కొన్ని
బచ్చనబంధాలు వచ్చెఁ బాఁపగదవయ్య"
4-360

బచ్చనరూపులు: వి; బహు. పైపై మెఱుఁగులు, అశాశ్వతాలు.

బచ్చనల సిగ్గులు: వి; బహు. వన్నెల సిగ్గులు.

"బచ్చనలసిగ్గుల చప్పరములో వారము
యిచ్చెఁ జప్పరానకు నన్నిటు దీసేవా" 19-587

బచ్చన సంసారము: వి. వన్నె సంసారము.

"పట్టితే పసిఁడి రాలీ బచ్చన సంసారము
గుట్టు దెలియఁ బ్రాణము కూటిచేతిది" 3-248

బచ్చన సింగారము: వి. పూఁతసింగారము.

"బచ్చన నీ సింగారము బయ లేఁటి కాయెనే
ముచ్చట నీ మాటలకు ముసుఁగేల జాటెనే"
6-78

బచ్చించు: స.క్రి. 'భక్షించు'కు వికృతిరూపం. తిను.

"ముచ్చట నే మడిగితే మెఱుఁగుమాటలాడేవు
బచ్చించి యాల నేరెడుఁబండులమ్మేవే" 7-206

బచ్చు చేతి వొరగల్లు: ప.బం; వి. మేలిమిని గుర్తించేది, కంసాలి చేతిలోని గీటురాయి.

"బచ్చుచేతి వొరగల్లు పరమాత్ముఁడు" 1-410

బచ్చుబేరాలు : వి; బహు. కోమటిబేరాలు.
"భారపు పైఁడికొండలో బచ్చుబేరా లమరునా
వూరకే నీ మేలు గోరు కుండుటింతే కాకా"
9-156

బచ్చురపణములోని బచ్చన : ప.బం; వి. (?)
"ముచ్చట మమత చీచీ ముచ్చు మురిపెము చీచీ
బచ్చురపణములోని బచ్చన చీచీ" 1-195

బచ్చెన : వి. 1. మోసం 2. పూత, వరకు 3. గుఱుతు 4.రంగు, చాయ.
"బచ్చెనల నతఁడు నీ పొంగెములో పాఁడై
నెచ్చెలి నీకుఁ గొంకితేనే నీకు వెరతునా"
11-194

బచ్చెనకవిత : వి. పైపై మెరుగుల కవిత్వం.
"పుచ్చినట్టి పండు బూఁజిలోననే వుండు
బచ్చనకవితలు బాఁతిగావు యెందు" 2-494

బచ్చెనకాఁడు : (బచ్చెన + కాఁడు) మోసగాడు.
"ప్రియముతో వావులేల పెనచీనే చెలులతో
బయలీఁతనగవుల బచ్చెనకాఁడు" 12-149

బచ్చెనగచ్చులు : మోసపు కపటాలు.
"హెచ్చిన యీ వినయాల నిన్నిటా నేఁదనిసితి
బచ్చెన యీ గచ్చు లేల పదమనవే" 24-64

బచ్చెనచక్రము : (?)
"మొగి బచ్చెనచక్ర మిమ్ముల గానుకియ్యవే
తగ నా పిఱుఁదు మదిఁ దలఁపయ్యీఁగాని"
17-237

బచ్చెనచూపులు : వి; బహు. పైపై మెఱుఁగుల చూపులు, కపటపు చూపులు.
"బచ్చెనచూపులూ పైపైఁ దరితీపులూ
గచ్చుల నీయందెపుడుఁ గలవే కావా" 16-283

బచ్చెనదేహము : వి. పైపై మెఱుఁగుల దేహము.
"బచ్చెనదేహపు పై పొర సుఖమే
యిచ్చఁ బ్రపంచం బీనెడిని" 3-47

బచ్చెన పైఁడిచీర : (?)

బచ్చెన ప్రియాలు : వి; బహు. పైపై మెఱుఁగుల ప్రియాలు, కపటపు ప్రియాలు.
"పచ్చలాయ కట్టేవు ప్రద్యుమ్న
బచ్చెనప్రియాలు చూపి ప్రద్యుమ్న" 15-250

బచ్చెనరూపులు : వి; బహు. పైపై మెఱుఁగులు, అశాశ్వతాలు.
"బచ్చెనరూపులు పెక్కు పడెచ్చుల వేసినట్లు
విచ్చల నినుచున్నది నీ మాయ" 2-180

బచ్చెనవాఁతలు : గుర్తుగా నున్న వాఁతలు
"సరవి నీవు దొసిన చన్నులపై గీతలు
సిరుల జవ్వనపు బచ్చెనవాఁతలు" 5-392

బజన : వి. ప్రీతి.
"నిజమాడరా నాతో నీకు నీవే
బజన చెడ్డ వలపు పని లేదురా" 19-529

బటువు : వి. బటువు బిల్ల, బిల్లతలగడ.
"పిరుఁదు బటువుననుఁ బెనగొనీ సింగారము
కరకమలమునుఁ గైకొనె సేస" 28-474

బటువుదిండు : వి. గుండ్రని దిండు.
"పెనగొన్న సింగారపు బిరుదు బటువు
తనరారు మంచి రత్నాల పెండ్లిపీట" 18-536

బటువుబిల్ల : (2) వి. గుండ్రని తలగడబిల్ల, బిల్ల తలగడ.
"మొనపాదము చాఁచితే మొక్కేదే తగవుగాక
పెనఁగి అట్టె బటువుబిల్ల వెట్టనేలా" 7-178

బట్టగుత్తు : (3) వి; ప.బం. సిగ్గుమాలినవాడు, సిగ్గుమాలినది.
"ఇట్టె సేసవెట్టి నీవు యేమరేవా నీ పనులు
బట్టగుత్తలైనవారు ఫల మందకుందురా" 8-184

బట్టబయటిధనము : ప.బం; వి. అందరికీ అందుబాటులో ఉన్న ధనం.
"పట్టినవారి చేబిడ్డ పరమాత్ముఁడు
బట్టబయటిధనము పరమాత్ముఁడు" 1-410

బట్టబయటిపెసరుఁబంట : ప.బం; వి. అందరికీ సులభంగా ఉండేది. చూ : నడువీథిలో పెసరు.
"పట్టి శ్రీవేంకటేశ్వర భ్రమలఁబెట్టకు వయ్య

బట్టబయటి పెసరు(బంటవంటివా(డవు" 9-5

బట్టబయటి యాత : *ప.బం; వి.* వ్యర్థం, అసాధ్యం. 5-351

బట్టబయలీ(త : వి. వ్యర్థమైన ఆశ.

"చుట్టి చుట్టి నీతోను సుద్దులెల్లా(జెప్పగాను

బట్టబయలీ(తలని భావించవు గదా" 28-83

వ్యర్థం, అసాధ్యం :

"పచ్చిపచ్చి చేతలు బట్టబయలీ(తలు

యెచ్చరించీ నాకు నిఁక నేమి సేతువే" 27-35

బట్టబయలీదు : *అ.క్రి; ప.బం.* వ్యర్థమగు, బహిరంగం చేయు, అసాధ్యమునకు పూనుకొను, వ్యర్థప్రయత్నం చేయు.

"గుట్టున నుండుటే మేలు కొసర(గ(బనిలేదు

బట్టబయలీ(ద(గాను పనికివచ్చీనా" 23-171

బట్టబయలు తగుళ్లు : *వి; బహు.* బహిరంగపు సంబంధాలు. 2-185

బట్టబయలు పందిలివెట్టు : *ప.బం; స.క్రి.* దగ్గరున్న దానిని చేజిక్కించుకొను, బహిరంగంగా పందిరివేయు, అసాధ్యమైన దానికి ప్రయత్నించు.

"బట్టబయలు పందిలివెట్టేరుగాని చే

పట్టరు శ్రీవేంకటాద్రిపై నున్న హరిని" 3-160

బట్టబాయిట : (6) బట్టబయట. 'బయట' అనడానికి అన్నమయ్య అంతటా బాయిట అనియే ప్రయోగించినాడు.

"పూ(త చెక్కుచేతులతో నుమ్మగిల నేమిటికి

పొ(తసుద్దులెల్లా బట్టబాయిట వేయరాదా"

18-561

బట్టబాయిటి యీ(త : *ప.బం; వి.* అసంభవం. నీటికి బయట ఈదడం అసంభవం కదా!

"పఱచు నీ నును(జేత బట్టబాయిటి యీ(త

తఱి నిన్ను(బైకొన(గ(దరమా నాకు" 5-75

బడకరము : *వి;* శ.ర., బ్రౌన్ నిఘంటువుల్లో ఈ పదం కానరాదు. బ్రౌన్ లో 'బళకరము' అనే శబ్దాన్ని పేర్కొని సం.ప.స. a guard, watch అనే అర్థాలనిచ్చింది. శ.ర. బలకరము అనే పదానికి కావలి అనే అర్థం చూపింది. ఈ అర్థమే పొసగుతుందని ఆ.మూ. (సం.వా; పద; భాషా. 462 పు.) అన్న. రా.మాం. దీనికి బలకరము, అధికం, ఎక్కువ అనే అర్థాలు చూపింది. (38 పు.)

"జతనము జతనము సర్వేశు నగరిది

బతుకుదోవ యిదె బడకరము

హృదయములోపల నీశ్వరు(డున్నా(డు

పదిలము మనసా బడకరము" 2-318

బడకెళము : వి. కావలి.

"పర(గ దేవతలెల్ల బడకెళమున్నారు

యిరవాయ సూర్యచంద్రు లెదురు పారి"

15-118

బడలికె : వి. బడలిక అనడానికి వ్యావహారికరూపం. కన్నడంలో చాలా పదాల చివర 'అ'కారం బదులు 'ఎ'కారం ఉండడం సహజం. దాని ప్రభావం కావచ్చు. ఎన్నికె, ఏలికె మొ॥

"పారితెంచి వేసాలకు బడలికె దెచ్చుకొంటే

ఆరీతి విసరుచు నలపార్చ వసమా" 13-192

బడి : వి. క్రమం, వెంబడి.

"బడి(బాయక తిరిగే ప్రాణబంధు(డా

గడియించినట్టి శ్రీవేంకటనాథు(డా"

బడి(దగులు : అనుసరించు, వెనుదగులు.

బడి(దిప్పు : *ప.బం; స.క్రి.* దిష్టిదోషపరిహారం కోసం దిగదుడుచు, మరణదండన విధించినవారిని ఉరి తీయడానికి ముందు ఊరంతా తిప్పు.

"యీడులేక శ్రీహరి నీ వుండెడి యీ దేహపు నీపరి

దాడిగ(బంచేంద్రియములు పట్టుక బడి(దిప్పెడి నీకేసెలవు" 3-392

బడిగండ్లు : (బడిగల్లు - ఏ.వ.) చాపరాళ్లు.

"బంతుల నెదుటనున్న పడ(తుల చన్నులివి

కంతల నొడ్డిన బడిగండ్లు సుండి" 2-26

బడిదప్పి తిరుగు : *అ.క్రి.* దారితప్పి తిరుగు, క్రమం తప్పి తిరుగు.

"బడిదప్పి తిరిగేటి పడుదుల తమవారు
తడయక తెచ్చుక ఆదరించినట్టు" 2-5
"బడిదప్పెఁగదె దీని పలుకుదేనియలు
తడఁబాటుతోడ చిత్తము దాఁచె నిపుడు" 6-13

బడినుండు: వెనుక ఉండు. (పద.)
"కడివోని జవ్వనము కలిమిలేమెఱుఁగునా
బడినుండి మిగుల రుణపరచుఁగాక" 2-11

బడిన్: (6) వెంటనే, వెనుక వి. వేగం, తొందర, విధం, రీతి.
"బడినే యాకెకు మరి బాగా లొసఁగఁగాను
నడుమఁ జేయొగ్గే విది నాయమౌట" 29-352

బడిబడి: (21) అవ్య. వెంటవెంటనే, తత్ క్షణమే. (క్రమక్రమంగా)
"కడు గర్వినైనా నీ కతలకెల్లా లోను
బడిబడి విన్నవించఁ బాడి గాదు" 21-291
"కడు సంపదలును కాలము కొలఁదే
బడిబడిఁ జవులై ఫలియించు" 4-222

బడిమిపోయు: *ప.బం; స.క్రి.* చుట్టూరా పోయు.
"పొలఁతికి కెందమ్మిరేకులు పోయుఁడు
బడిమిగను" 5-352

బడివాయు: (37) స.క్రి. వదలిపెట్టు, పనిచేయు.
"బడివాయనని నీతో బతిమివట్టెనయ్యా"
29 -385 & 6-10
"పసి చల్లమ్మే గొల్లపడుచా నీవె
పసివడి తిరిగేవు బడివాయక" 5-197

బతికినందు: బతకడంలో.
"బతికినందుఁగలిగె పాడిపంట తగులు" 1-471

బతిమి: *వి.* 1. వ్రతము 2. బతుకు, బ్రదిమి.
"యితవుగ శ్రీవేంకటేశ నన్నుఁగూడితివి
బతిమి సుఖము దక్కెఁ బంతమిచ్చె పో"
17-334

బతిమిపట్టు: *వి.* బతిమాలు. (బ్రౌన్. బతము = వ్రతము)
"వ్రతినైన యతినైన వలలమాటలఁబెట్టి
బతిమి చెరుతురుగా బంధువులాల" 10-1-28
"కతకారి శ్రీవేంకటనాథ నన్నుఁగూడి
బతిమిపట్టుకుండఁగా బాసడుగఁ జెల్లునా"
10-2-69

బతుకు: 'బ్రతుకు'కు వ్యావహారికరూపం.
"దంచనున్న రోలిపిండి తలఁపాయ బతుకు"
1-90

బత్తి: (55) వి. 'భక్తి' శబ్దానికి వికృతిరూపం. అన్నమయ్య ఈ పదాన్ని ఎక్కువచోట్ల స్త్రీ పురుషుల ప్రేమ, వలపు అనే అర్థాల్లోనే వాడడం కనిపిస్తుంది.
"బత్తిగల యాపె నీకు బాగా లొసఁగఁగాను"
14-542
"పడఁతెపై నీవు సేసే బత్తియైనాఁదలఁచుకో"
12-72

బత్తి గొట్టానఁబెట్టు: (5) *ప.బం; అ.క్రి.* ప్రేమను వ్యక్తీకరించక లోపల బంధించు.
"బత్తి గొట్టానఁబెట్టఁగఁ బనిలేదు వోరి నీ
యిఁకఁ చిత్త మింతేకాని జెప్ప నే మున్నదిరా"
5-77

బత్తిసేయు: (31) అ.క్రి. ప్రేమ చూపు, వలపుగొను.
"సేసవెట్టి పెండ్లాడి సిగ్గులువడితేఁబోదు
బాసయిచ్చి నీ కితఁడు బత్తిసేసీని" 28-316

బత్తుఁడు: వి. 'భక్తుడు' అనే శబ్దానికి తద్భవరూపం.
"పరువతమేగిన బత్తుఁడనైతి" 1-19
"నెత్తురు దానము సేసి నిండిన జడలతోడ
బత్తుఁడైన చక్కని నా బాఁపనయ్య వీఁడివో"
5-254

బదనికె: వి. (?) వేరొక చెట్టుమీఁద మొలుచు నట్టి తీగె, తిప్పతీగె. Any parasitec plant - Brown
"బలుశంఖుఁజక్రముల బదనికె లున్నది
తలఁచినవారికెల్లఁ దత్వమైనది" 1-468

బదుకు: వి. 'బ్రతుకు'కు వ్యావహారికరూపం.

"బదుకెల్ల నీ సొమ్ము పట్టపుదేవులఁగాన
యిదె నీ రతులలో నేనెంత సేతునో" 11-436

బద్దితాడు: వి. ఒకరకమైన తాడు.

బద్దు: (18) వి. బొంకు, అబద్ధం, అసత్యం, నిర్బంధం.

"ఇద్దరుఁగూచుండి యేలె యెరవు నేఁడు
బద్దు లేనివాని కేలే పయి తరవు" 14-415

"బద్దులో నిజమో కాని పచ్చివెచ్చి చేఁతల
వొద్దికతో బండుబండై వున్నాఁడటా" 11-183

"యిద్దరూ నుండఁగానే యిటు నన్ను నేలితివి
బద్దుల శ్రీవేంకటేశ పాడి నీ వెఱఁగవా" 23-448

బద్దు: (2) అ.క్రి. బొంకు, అసత్యమాడు.

"బద్దకు మంటే బాసలు సేసే
పొద్దువోనివాఁడు బోదించేనే" 17-213

"తిద్దిన జాణవుగాన తిరిగి తిరిగి మాతో
బద్దనేఁటికి రానేఁ బచ్చిసేయఁజాలను" 5-84

బద్దుల నేరుపు: వి. అసత్యవచనముల నేర్పు.

"బద్దులనేరుపు లెల్లా పచరించి నీ మోహము
పెద్దసేసి కైలాటాలు పెట్టకుండేవా" 10-2-41

బద్దుల పని: వి. నిర్బంధపు పని, అసత్యపు పని.

"బద్దుల పనులై పోయ పండరంగిరాయ" 7-219

బద్దుల మొక్కు: అసత్యపు మొక్కు.

"బద్దుల మొక్కులు మొక్కి పాఁతదాన వైతివి
చద్దివేఁడి నీ బీరాలు సారె నేమి చెప్పేదే" 29-392

బద్దుల వినయాలు: *వి; బహు.* బొంకు వినయాలు.

"బద్దుల వినయాలకు పంగించవలదా
అద్దో నా వయసు నిన్నాసపడీఁగాక" 29-206

బద్దులు: *వి; బహు.* బద్ధులైనవారు.

"యిరవెఱిఁగిన ముక్తు లెఱఁగని బద్దులు" 2-12

బబ్బిలికాయ: (2) వి. ఇది బిబ్బిలికాయ కావచ్చు. బిబ్బిలికాయ అంటే స్త్రీల కాలి మూడవవేలుకు ధరించే ఆభరణం.

"బబ్బిలికాయల రవములు పదనూపురములఁ గెలయఁగ
తబ్బిబ్బుగ నునుపాదము తాటించెద వేలే"
5-164

"బబ్బిలికాయలతోడి పసిఁడి మెట్టెలది
జొబ్బిలిన చెమటలచేఁ జుక్కి నిలచినది"
5-366

బమ్మచారి: (3) వి. 'బ్రహ్మచారి'కి వ్యావహారికరూపం. వటుడు, బ్రహ్మచారి, పెండ్లి కానివాడు, బ్రహ్మచర్య వ్రతమందు ఉండేవాడు.

"పంకించ కెవ్వతె నిన్ను బమ్మచారిఁ జేసెనో
సంకె దేరిచేఁ గాని ఆ సతిఁ జూపరాదా" 7-104

బమ్మరపోవు: *ప.బం; అ.క్రి.* దిగ్భ్రమచెందు.

"కమ్మి యక్రూరుఁడు దేగా కంసునిపై నెక్కఁదేరు
బమ్మరపో దంతవక్త్రుపైఁ దోలెఁదేరు" 4-35

బమ్మరవెట్టు: స.క్రి. భ్రమపెట్టు, మోసపుచ్చు, భయవిస్మయాదులతో మూఢులను చేయు.

"యిమ్ముల శ్రీవేంకటేశ యింతలోఁగూడితిఁగాని
బమ్మరవెట్టినా నీకుఁ బాయదు చెలి" 20-144

బమ్మరాకాసుఁడు: వి. బ్రహ్మరాక్షసుడు.

"పదిశిరసుల పెద్ద బమ్మరాకాసునివి
జెదరనీయక యందించిన భూతమా" 6-112

బయకాఁడు: (5) (బయలు + కాఁడు) గాయకుడు, రాగాన్ని బయలు పరచేవాడు, బయకారి.

"నీవు నన్నుఁ గూడితివి నీకే వుండితే మేలు
భావించి నిన్నెవ్వరైనా బయకాఁడ వందురు"
14-65

బయకారము: (5) (బయలు + కారము) వి. 1.యౌవనంలో బయలుపడే శృంగారచేష్ట 2.సంగీతం.

"బెట్టుగా నవ్వి నవ్వి బేరి జోకొట్టితివి
గుట్టున బయకారాలే కుమ్మరించితి" 14-558

బయకారించు : (బయకారము + ఇంచు) అ.క్రి. శృంగార చేష్టలు ప్రకటించు, అభినయించు, లేనిది పైకి నటించు. (ఆ.మూ.)
"నయము చాలని చోట నవ్వులు నవ్వఁగఁబోతే
బయకారించె ననవా పక్కన నీవే" 11-553

బయకారి : (బయకారము+ఇ) వి. విలాసవతి, గాయకుడు.

బయకారివాఁడు : వి. విలాసవంతుడు, శృంగారచేష్టలు చేయువాడు.
"బయకారివాఁడవని తగుల నిన్నాడుదురు
వచ్చెఁదారుకాణలు వరుస నీ సుద్దులు" 18-380

బయము : వి. 'భయము'నకు వికృతిరూపం.
"రట్టడి రతికెవ్వతె ఇట్టె నిన్నుఁ దీసినాను
అట్టె బయము దెలిపె నదె నా సేవ" 27-485

బయలింత : (2) వి. బయలీఁత, వ్యర్థమైన ఆశ.
"తలకొన్న తలపోఁత తతిగొన్న బయలింత
వలరాజేపకుఁ దొల్లి వ్రాసిన వ్రాఁత" 12-496
"వెలయాలి చేతలు వింత బయలింతలు" 17-3

బయలీఁత : (4) వి; ప.బం. వ్యర్థమైన ఆశ, జరగని పని.
"మనసులో తలపోఁత మర్మముల బయలీఁత
తనివోని చూపులలో తరితీపులు" 24-341
"చిత్తములో తలపోఁత చెప్పితే బయలీఁత
బత్తితోఁ బతికి విన్నపము సేయరే" 16-454

బయలీదు : (6) (?)
"పట్టరాని వయసున బయలీదవచ్చునా"
26-417
"వల పొకచోట నుండ వచ్చి బయలీదనేల"
12-401
"బంతినే నన్నేలినాఁడు బయలేల యీఁదేవే"
14-516

బయలీదించు : (18) స.క్రి; ప.బం. నడుమంత్రాన వదలిపెట్టు, వట్టియాసలు కల్పించు. (పద.) నమ్మకద్రోహం చేయు.
"యేల బయలీదించేరే యింతులాల
మేలిమి బత్తి గలిగితే మీ రతనిఁ దేరే" 12-426

బయలుచిమ్ము : అ.క్రి. బయటికి నడచు.
"పాదమున నేనిట్టె బయలు చిమ్మిన నీవు
వాదుకు వచ్చేవేమె వనితా" 9-43

బయలు పందిలివెట్టు : ప.బం; అ.క్రి. అసాధ్యానికి ఉంకించు.
"బయలు పందిలివెట్టె పడఁతి నెన్నడు మను
ప్రియమున నీపై సేస వెట్టే నంటాను" 18-422
"పడఁతి మాటలనె బయలు పందిలి వెట్టె
జడియక నీవది విచారించవయ్యా"
18-376 & 1-129
"నయము నీ వాడితేను నగ నాకుఁజెల్లదా
బయలు బందె వట్టితేఁ బట్టుదుగాక" 22-67

బయలుమొరగు : ప.బం; అ.క్రి. బయటికి మోసంకలదగు.

బయలువందిలి : (4) ప.బం; వి. అసాధ్యకార్యం.
"పట్టరాని సంసారము బయలువందిలి యిది
మట్టితో నీ జీవుఁడెట్టు మాయ గడచీని" 15-325
"బయలువందిలి నీ కర్మబంధములు నీ మాయ
నియమపుఁబెనుగాలి నీ మాయ" 3-347
"పడఁతి మాటలనే బయలువందిలి వెట్టె
జడియక నీ వది విచారించవయ్యా" 18-376

బయలువాఁకు : ప.బం; అ.క్రి. వ్యర్థప్రయత్నం చేయు. (వ్యు.)
"అన్నిటికి మూలమని హరి నెంచరు
పన్నిన మాయలో వారు బయలువాఁకేరు"
2-261
"భావించలే రెవ్వరును బయలువాఁకేరు గాని
నీవే గుఱుతు మాకు నీరజనాభా" 2-200

బయలైపోవు : ప.బం; అ.క్రి. బహిర్గతమగు.
"తేటల నాఁకలి దీరిన పిమ్మట
పాటుకుఁబాటే బయలై పోవు" 4-339

బయిరూపము : బహి(ర్)రూపము(?), పైకి కనిపించేరూపం.
"కగ్గుదేర నీవు మున్ను కట్టుకొన్న
బయిరూపము

వొగ్గి ఆడకపోవునా వోరుచుకో యిఁకను"

18-128

బరుబోఁకి : వి. వట్టిపెంకు (వ్యు.) వ్యర్థుడు (ఆ.మూ.) ఇది 'పోరంబోకు' అనే పదానికి వికృతరూపం కావచ్చు.

"పుట్టుమాలిన బరుబోఁకివి నన్నుఁ

దిట్టే వదేమోసి దిమ్మరిమాయ" 1-107

బలఁగము : వి. పరిజనం, బంధుజనం. ఇందులోని అరసున్న విచార్యం.

"సవతై యింట నుండఁగ జగడా లడతునా

కవగూడి బలఁగము గలదానను" 27-238

బలవంతకోలు : (2) వి. (?)

"వెలఁది యిట్టుండితేను విభుని చిత్తము వచ్చు

బలవంతకోలైతే పలుక నేమున్నది" 24-533

బలిమికత్తె : (బలిమి + కత్తె) వి. బలవంతురాలు.

"పాయపుదాని నంటా బలిమికత్తె నంటా

మాయ లేమి సేసేవే మతకానను" 28-558

బలిమికాఁడు : (12) (బలిమి + కాఁడు) బలవంతుడు.

"బలిమికాఁడ వౌదువు పంతమెల్లా నీకుఁజెల్లె

చలము లింతులపైనే సాదించితివి" 18-375

బలుఁడు : వి. బలం కలవాడు. బలమనేది బలమ్ అనే శబ్దం అమహద్వాచక శబ్దం. దీన్ని బలం కలవాఁడు అనేఅర్థంలో మహద్వాచకంగా వాడడం విశేషం. ఇట్టి ప్రయోగాలు చేయడంలో అన్నమయ్య స్వతంత్రుడు.

"బలుఁడు యిన్నిటా రవికులుఁడు భావించ ని

ర్మలుఁడు నిశ్చలుఁడవికలుఁడు వాఁడే" 2-219

బలుతురు : క్రి.రూ. బలియుదురు (= బలుస్తారు) అనడానికి వ్యావహారికరూపం.

"బలుతురు పిలుతురు బొమ్మల జంకింతురు"

28-303

బలుదూరు : ప.బం; వి. పెద్ద తిట్టు. 12-26 old

బలుపు : వి. 1. విలాసం 2. బింకం 3. ఉబలాటం 4. సుఖం.

"తనివిమాలిన తలఁపు తడవోరుపని బులుపు

అనువెఱుంగని కెలపు అడియాస మెలపు"

బలువాఁడు : (4) వి. బలవంతుడు, గొప్పవాడు.

"బలువాఁడవయ్యా భామల రొచ్చుకోర్చితి

పలువై యెందరి పాలఁబరఁగె నీ మేను" 18-593

బలువుఁడు : (9) వి. బలియుడు, బలవంతుడు.

"తనకేమి విచారమే తానిన్నిటా బలువుఁడు

మనసునఁబెట్టి మమ్ము మన్నించుమనవే"

7-277

"సేయకుండ వచ్చునా చెప్పినట్టెల్లా నేను

పాయపు వాఁడవు నీవు బలువుఁడవు" 19-85

బలువు : (3) వి. 1. బలం, శక్తి 2. ఏపు 3. విజృంభణం 4.అతిశయం 5. పుష్టి 6.గర్వం. విణ. 1.దృఢం 2.సాంద్రం 3. బలిష్ఠం, అధికం.

"యేమి నీకింత బలువు యెవ్వరిచ్చిరి

మీమీఁది చలములు మానుమన్నా మానవు"

17-386

'బలువున నెల్లెడలా గెలిచి' అని యయాతి చరిత్ర ప్రయోగం.

బలువురాలు : (బలువు + ఆలు) వి. 'బలువుడు'కు స్త్రీ లింగరూపం, బలవంతురాలు.

"కలసి శ్రీవేంకటేశ కన్నవారే నవ్వరా

బలువురా లిది యని భామ నాడుకోరా"

25-272

"బలువురాల వంటాను పడఁతులు పొగడేరు

తెలిసితిమి పట్టపుదేవులవే నీవు" 18-580

బలుసుకొను : (బలియు + కొను) అ.క్రి. బలియు, లావెక్కు, అధికమగు.

"అతివ నేరుపులు నటు శ్రీవేంకట

పతిరతులు నొకట బలుసుకొని

చతురతనంబుల సందడిసేయఁగ

యితవగు కౌఁగిట నెడ మీరైరి" 24-88

బల్లిదురాలు : (బల్లిద + ఆలు) వి. శూరురాలు, బలవంతురాలు, అధికురాలు.

"వుల్లము గరఁగను నీ కొడివట్టి పెనఁగీని
బల్లిదురాలైన నీ పాయరాని చుట్టము" 26-309

బల్లిపాటుది : (బల్లిపాటు + అది) వి. నిశ్చేష్టురాలు, భయ స్వభావురాలు.
"ఆసపడి నీకు సన్నలట్టె సారెఁజేసేవానిఁ
బాసి వుందానవు బల్లిపాటు దానవటవే" 16-579

బళి : బలి.
"ఒప్పుగా నరకము మాకు బళిచ్చి మనమెల్ల
కప్పముగొంటిరిగా యంగనలార" 1-103

బహుపరాకు : (?)
"యెసఁగ శ్రీవేంకటేశ యేపురేఁగి రతులను
పసగా సరసమాడే బహుపరాకున ను" 26-374

బహుపరాకులు : *వి; బహు.* (?)

బహుభాషిది : (బహుభాషి + అది) వి. మిక్కిలిగా మాట్లాడే స్త్రీ.
"తిలకించి చూడఁబోతే ద్రిష్టిదాఁకీ నందువు
పలికితేనే బహుభాషి దందువు" 7-485

బహుభాషివాఁడు : (బహుభాషి + వాఁడు) వి. ఎక్కువగా మాట్లాడేవాడు.
"పలుకుల ప్రల్లదపు బహుభాషివాఁడను
యిల వెన్నదొంగకంటే హీనమా నీకు" 15-361

బహురూపమాడు : ప.బం. అనేకవేషములు వేయు.
"కొండంత దొరతనము కోరి మీఁద వేసుకొంటే
నండనే యా బహురూపమాడక పోదు" 1-417

బా

బాఁతి : (5) వి. 'బ్రాఁతి' కి రూపాం. 1. ప్రీతి, ఇష్టం, ఇంపు 2. శ్రద్ధ, జాగ్రత్త 3. రీతి, విధం (వ్యు.) విణ. 1. ఘనం, గొప్పది 2. దుర్లభం 3. అపురూపం 4. ప్రియం 5.అనుకూలం 6. అధికం.
"ఆపదలు బాఁతె అందరికినిఁ దమ
చాపలపు సంపదలు సడిఁబెట్టఁగా" 1-41
"బాఁతిగ శ్రీవేంకటపతిఁ జిత్తపు
టూఁతలఁ గోరికలూనవా" 1-216
"నారాయణ నీ నామము బుద్ధిఁ
జేరినాఁ జాలు సిరు లేమి బాఁతి" 1-262
"నాలో నున్నాడు బ్రహ్మ తండ్రి
యట నా కాయుష్యము బాఁతా" 3-371

బాఁతిపడు : (57) అ.క్రి. ప్రియపడు, ఇష్టపడు, భ్రాంతిపడు.
"నీకెంత పొద్దువోదు నేమంత బాఁతిపడ్డాను
దాకొన్నయపుడు నీ చిత్తానఁబట్టీనా" 13-460

బాఁతిమీఱు : అ.క్రి. ప్రీతి అధికమగు.
"మూఁతులే గిరువంగ మోము నొచ్చీనంత
బాఁతిమీఱఁ బకపక నవ్వకురా" 6-103

బాఁపఁడు : వి. బ్రాహ్మణుడు; అరసున్న విలక్షణం.
"పట్టకింత మా చెఱఁగు బాఁపఁడా నాఁడె
వుట్టిఁగట్టితివి కులమో బాఁపఁడా" 6-90

బాఁపనకొల : వి. బ్రాహ్మణహింస.
"బలరావణునిఁజంపి బాఁపనకొల తీర్చినాఁడు
యిలమీఁదఁగలిగిన ఋషులకెల్లా" 2-57

బాఁపనజిడ్డు : వి. గట్టి బ్రాహ్మణలక్షణం.
"బాఁపనజిడ్డంటెనట పట్టెనట ముమ్మురము
కైపగు నల్లనికోక గట్టినాఁడట" 19-335

బాఁపనాసోదము : (బాపన + ఆసోదము) వి. బ్రాహ్మణుల కుండే ఆశ, అధికమైన ఆశ.
"ఎంత బాఁపనాసోద మింత గలదా
అంతయు నీ మహిమే హరిభట్లూ" 2-70

బాఁపెత : వి. 'బాఁపత'కు వ్యావహారికరూపం, బ్రాహ్మణస్త్రీ.
"పసులఁగాచేనాటి బాపెతల విందులా
ముసరే తుమ్మెద నా మోవి తీపులు" 7-259

బాగకాఁడు : (బాగము + కాఁడు) వి. భాగం కలవాడు, పొత్తు గలవాడు.
"పంతాన నా మోము తప్పక చూచే వది యేమి
వంతుకు బాగకాఁడ నీవల నీవే కావా" 7-151

బాగులుగా : క్రి.విణ. మిక్కిలి బాగుగా. 'బాగులు' అని బ.వ. ప్రయోగం విలక్షణం.

"యీగతి శ్రీవేంకటేశుఁడెట్టు వలసినఁజేసు
బాగులుగా నీతని శ్రీపాదమే దిక్కు" 3-91

బాగువాఁడు : (బాగు + వాఁడు) *ప.బం; వి.* అందగాడు.

"యేమఱేటివాఁడవా హీనగుణమువాఁడవా
పామరపు సేఁతల బాగువాఁడవా" 15-366

బాజుఁగర్మము : వి. వరుసకర్మము.

"సాజపు శ్రీవేంకటేశు శరణ మొక్కటే గతి
బాజుఁగర్మ మొండొకటి బంధమోక్షములు"
2-78

బాటసంసారము : *ప.బం; వి.* అస్తవ్యస్తమైన సంసారం, కష్టాలతో కూడిన సంసారం. బాటపై చేసే సంసారం కష్టాలతో కూడిందే కదా!

"మీఁటైన గురువుకంటే మీఁద రక్షకుఁడు లేఁడు
బాటసంసారముకంటే పగ లేదు" 1-443

బాడిగె : వి. 'బాడుగ', 'బాడిగ'లకు రూపాం. అద్దె.

"పంచేంద్రియములనే బాడిగె మోఁచితిని
లంచపు సంసారమనే లాడిఁ బడితిని" 4-227

బాడిగెవాఁడు : వి. జీతగాడు. రూపాం. బాడిగ.

"నవ్వులే కలవంటా నంటునఁ దాడెక్కేవు
పవ్వళించి యీ విభుఁడు బాడిగెవాఁడా" 7-97

బాద : (2) వి. 'బాధ'కు వ్యావహారికరూపం.

"బాదల సంసారము పరవంజుకొని తొల్లి వడె నీ జీవుడు
యేది నమ్మిపాటు యమబాదలు" 3-79

బాపు బాపు : (2) అవ్య. 1. ఆశ్చర్యార్థకం 2. ప్రశంసార్థకం 3. సంతాపార్థకం.

"రాసికెక్క నిన్ను నేలె రమణుఁడితఁడె వచ్చి
బాసతోడి యిల్లాల బాపు బాపు నీవు" 29-349
"బాపు బాపు మెచ్చితినే బలుదానవు" 21-38

బాము : (2) వి. 1. జన్మం, పుట్టుక 2. దుఃఖం 3. శ్రమ, బాధ 4. భంగం, తిరస్కారం.

"సామవేద సామగాన సప్తస్వరములను
బాముతో నీ సతి నిన్నుఁ బాడినయట్టి
ఆముకొన్న తాళపాకన్నమాచార్యులు
వేమరు మెచ్చిన శ్రీవేంకటనిలయా" 2-24

బాయట : (9) అవ్య. బయట. 'బయట' శబ్దానికి వ్యావహారికరూపం. అన్నమయ్య అంతటా బాయట, బాయిట అనేరూపాలే వాడినాడు. బయట శబ్దాన్ని వాడలేదు.

"దాయగాండ్లెవ్వరినైనాఁ దప్పించుకొనేవారే
బాయట నున్నా నీ వాపన్నశరణ్యుఁడవు"
2-306

బాయట వేయు : *ప.బం; స.క్రి.* బయటవేయు, ప్రకటం చేయు. చూ : బాయిటవేయు.

"గుట్టు బాయటవేతురా కొమ్మలాల" 25-41

బాయిట : వి. బయట. ఈ అర్థంలో అన్నమయ్య ఎక్కువగా 'బాయిట' అనే వాడినాడు. బాయట, బాయిట ఈ రెండు రూపాలు బాహ్య శబ్దభవాలు కావచ్చు నని పీఠిక. (5 సం.)

"బాయిటఁ బవ్వళించి పడఁతి చన్నులు నీవు
చేయి చాఁచి పిసికేవు సిగ్గువడఁగా" 24-499

బాయిటఁబడు : (12) (బాయిటన్ + పడు) *ప.బం; అ.క్రి.* బయటపడు, వ్యక్తమగు.

"బాయిటఁబడెను మీ పైపై వలపులెల్లా" 27-124
పైపై నిట్టూర్పులు రేఁగె బాయిటఁబడెఁ జన్నులు
యేపున నాకు మడిచి ఇయ్యఁగాను" 23-349

బాయిటఁబెట్టు : (2) *స.క్రి.* బయటబెట్టు, బయటవేయు.

"బాయిటఁబెట్టేనంటే పంచవన్నె ముగ్గు గాదు"
28-284

బాయిటవేయు : (13) *స.క్రి.* బయటవేయు, బట్టబయలు చేయు.

"యేరా నా గుట్టంతయు బాయిటవేసేవా" 5-3

బార : వి. అడ్డంగా చాపబడ్డ రెండు చేతులతోడి బొమ్మ కొలత, వ్యామం.

"పంతపు మాటలకెల్లా బారలు చాచేవా" 23-254

బారకుఁడు : వి. బరువు మోసేవాడు, భారకుడు. భారం మోసేవాడనే అర్థంలో 'భారకుడు' అనే పదం విలక్షణం.

"యీరీతి శ్రీవేంకటేశుఁ డెనసె నీకఁ బాసేనా
బారకుఁడై తా నిట్లా బదుక నీఁగదవే" 23-540

బారము : వి. 'భారం' అనే శబ్దానికి వ్యావహారికరూపం, బరువు.

"మాపై బారాలు వేయకు మతకానను
చేపట్టినవాఁడవు నీ చేతివే మహిమలు" 27-404

బారవెట్టు : (?)

"ఊరకుండితే మేలు వూకొంటేఁ బైడికతౌను
బారవెట్టితే నలపు పచ్చిదేరె నందువు" 7-478

బారిఁబడు : అ.క్రి. కష్టపడు. 5-206 old

బారిజగడము : వి. గొప్ప జగడం.

"బారిజగడము గాదు పంతమిచ్చుటఁగాదు
వైరమాయ నని పొందు వదలేవు సుమ్మీ" 22-7

బారివిద్యలు : వి; బహు. తీగెమీద నడిచే విద్యలు, మిక్కిలి కష్టసాధ్యమైన నేర్పులు (?)

"పాపపుణ్యములు రెండు బారివిద్య
లుండఁగాను
కోపుల నాటలవారిఁ గోరి చూచేము" 4-190

బారుబడివడ్డి : వి. సంవత్సరంలో ఒకసారికే లెక్కించే వడ్డీ, బారువడ్డీ.

బాలకి : (6) వి. బాలిక. వ్యాకరణనియమాల ప్రకారం 'బాలకి' అనే పదం దుష్టమే అయినా అన్నమయ్య స్వతంత్రంగా ప్రయోగించిన పదం. ఈ పదం సోమన బ.పు. లో కూడా కనిపిస్తుంది.

"బాలకివన్నిటా నీవు పనిగొంటి వాతనిని
కీలు నీచే నున్నది రక్షించవమ్మా" 27-438

బాలకిసునరాయఁడు : వి. బాలకృష్ణరాయడు అనడానికి జానపదవ్యవహారం. 'కృష్ణ' శబ్దం 'కిసున'గా మారింది.

"అవుర బాలకిసున రాయడ నీవు సంటిపాలు
సవులంటా నెత్తురెల్ల సప్పరించగా" 5-15

"రారా బాలకిసునరాయ నీ వదె గొల్ల
వారి మగువల సూపు వల్లెవేయఁగా" 5-15

బాలది : (బాల + అది) వి. చిన్నవయసుది, బాలిక.

"తూలుచును నీ కొప్పు తుమ్మిదలెల్లా బెదరె
బాలదానవా వట్టి భయము నీకేఁటికే" 8-71

బాలనాడు : (2) వి. చిన్ననాడు, బాల్యంలో ; విలక్షణ ప్రయోగం.

"కొంత సిగ్గువడేవాఁడు కొంగువట్టేల తీసీనే
వంతులఁదా బాలనాటివలె నుండుఁగాక" 20-25

బాలబమ్మచారి : వి. 'బాలబ్రహ్మచారి' శబ్దానికి వికృతిరూపం. బాలుడైన బ్రహ్మచారి.

"యీసు లేక నీవు మాట లేమాడినాఁ జెల్లెఁగా
బాసేసెసి నీవు బాలబమ్మచారి నన్నవి" 14-278

బాలబొమ్మచారి : (2) వి. 'బాలబ్రహ్మచారి' శబ్దానికి వికృతిరూపం. చూ : బాలబమ్మచారి.

"బాల బొమ్మచారివి పట్టపువికారివి
ఓలి నీ వెవ్వరిఁ గన్నా నూరకుండేవా" 6-40

బాలయవ్వనలు : వి. నవయౌవనం కల స్త్రీలు.

"బాలయవ్వనలు పసిఁడివుయ్యాల
బాలునివద్దఁ బాడేరు" 5-246

బావుకొను : స.క్రి. అన్నం మొదలైన వాటిని చేతినిండా ఎత్తి నోట నిడుకొను, అనుభవించు.

"ఆదిగొని నే రాఁగా నఱచేతి వెన్నముద్ద
పాదుకొన నోరనిండాఁ బావుకొన్నాఁడు"
20-450

బాస : వి. 1. ప్రతిజ్ఞ, శపథం 2. ఒడంబడిక 3. నిమిత్తం 4.ఒట్టు 5. వృత్తం 6. సరస్వతీదేవి.

"బాసకు వెరచి నన్నుఁ బైకొని కూడితిఁగాక"
10-2-28

బాసగొను : (5) (బాస+కొను) ప.బం; అ.క్రి. ప్రతిజ్ఞ చేయు, ఒడంబడిక చేయు, ప్రమాణం చేయు, ఒట్టు పెట్టుకొను.

"పరఁగ నేకతమున బాసగొంటే నింక నెట్టో
తొరలింపు మాటకే హత్తుకోవచ్చేవు" 26-442

బాసటపు టేరు : (బాసటము + ఏరు) విషపుటేరు.

"పన్నీటికాలువ సుమ్మీ బాసటపుటేరు గాదు
పున్నమచంద్రుఁడు సుమ్మీ భూతము గాఁడు"
28-582

బాసటము : వి. విషం, బంధనం, పొగరు,

మెరుగు. ఇట విషమనే అర్థం ప్రకరణాని కతుకుతుంది అని సం.ప.స. 16 నం. 3.
“బంతులనే పూవుటమ్ము బాసట మెక్కినప్పుడు
దొంతులతోనే తా నిందుకు వచ్చీఁగాక” 16-98
“చిందిన నా తలఁపులే జిగురువలె నంటఁగా
గందము బాసటమై కమ్ముకొనీనటవే” 22-525
“పంచబాణముల బాసట మంటిన
చంచలమౌ నిశ్చలమనసు” 4-117

బాసడుగు : (బాస + అడుగు) అ.క్రి. ప్రతిజ్ఞఅడుగు.
“మేకుల శ్రీవేంకటేశ మేలు నన్ను భ్రమయించి
పైకొని కూడితి వింక బాసడుగ నేల” 9-69

బాససేయు : (బాస + చేయు) ప.బం; అ.క్రి. ప్రమాణం చేయు, ప్రతిజ్ఞ చేయు.
“బాససేయ నేర్చునట పాయకవుండ నేరఁడా
వాసితోఁబిలిపించుకొనవలెనా తా నిపుడు”
18-310

బాసికము : వి. పెండ్లిలో అర్ధచంద్రాకారంగా కాని, మూడు పక్క లేర్పడేట్లు గాని వధూవరుల నొసట కట్టే ముత్యాలు, పుష్పాలు మొ॥ వాటితో చేయబడిన బలామలకం. రూపాం. బాసింగం.
“బాసికము గట్టితివి భామ కాలు మెట్టితివి
చేసిన చేఁతలు నీకుఁ జెల్లెనయ్యా” 26-424

బాసిచ్చు : (బాస + ఇచ్చు) ప.బం; అ.క్రి. ప్రతిజ్ఞచేయు
“మేరతో బాసిచ్చేఁదాను మెలుఁతలు
నమ్మినారు
నేరుపుతో నిజములు నిలుపుఁగాక” 14-567

బాహుపురి : వి. 1. కేయూరం, భుజకీర్తి, సందెకడియం. (ధ్యానవిశేషం)
“మొగపుల బాహుపురి ముంజేత నీ కున్నది
అగపడీ గుఱుతుగా నాపె నీకుఁ బెట్టెనా” 12-436

బాహుమూలము : వి. కక్ష, చంక.
“చాయల కెంపు లెడ విసరీ బాహుమూలముల
నీయందుఁ గళకు నేఁడు నెలకొన్నట్లున్నవి”
19-1

బి

బింబాధరుఁడు : విణ. బింబము (= దొండపండు) వంటి పెదవి గలవాడు. సాధారణంగా ‘బింబాధర’ అని స్త్రీ విశేషణంగానే వాడుక. కాని ఇట పురుషవాచకంగా వాడబడటం విశేషం.
“బింబాధరుఁడాతఁడు పికవాణిని నేను
యింబడర నిద్దరికి నేఁటి పొందులే” 9-281

బిగ్గి : క్రి.విణ. ఇది బిగ్గ కావచ్చు లేదా ‘బిగ్గ’కు రూపాంతరం కావచ్చు. బిగ్గరగా, ధృఢంగా. ‘బిగ్గి’ అంటే తొందర అనే అర్థం ఉంది.
“యిక్కువ శ్రీవేంకటేశ యెనసితి విట్టె నీవు
గక్కన బిగ్గి నిన్నుఁ గౌఁగిలించుకున్నది”
12-492

బిగ్గెన్ : (18) క్రి.విణ. ధృఢంగా, గట్టిగా, బిగ్గరగా.
“బిగ్గెఁ గాఁగిలించుకోఁగా పెనఁగక వుంటేను
నిగ్గులఁ దా నేల నాకు నేర్పవచ్చీనే” 13-126

బిటారి : (బిటారము + ఇ) వి. విలాసవంతురాలు.
“ఎంతటి బిటారి యీపె యెటువంటి వొయ్యారి
కాంతను సంతోసించి పొగడరమ్మా” 28-537

బిటారికత్తె : (2) (బిటారము + ఇ + కత్తె) విలాసవతి. ఇట ‘కత్తె’ అనేది స్వార్థంలో వచ్చిన తద్ధిత ప్రత్యయం.
“ముద్దుల బిటారికత్తె మొక్కలాన నీ పాదాలు
గుద్దేనంటాఁ బానుపుపైఁ గూచున్నది” 22-297

బిత్తరికాఁడు : విణ. విలాసవంతుడు.
“వేగుదాఁకా జాగరాల వేసారితిమి
వాగపు బిత్తరికాఁడ వచ్చేవొ రావొ” 9-84

బిత్తల : వి. దిసమొల, వస్త్రహీనమైన మొల.
“దరిఁ జీరలువెట్టి బిత్తలే నీళ్లాడఁగాను
సరసమాడకుండునా చంకఁబెట్టుక” 14-455
“బిత్తలున్నాఁ డనకురే పృథివిలోఁబిన్నవాఁడు
మత్తులై వున్నవారి మడియించీని” 5-218

బిత్తలి : (బిత్తల + ఇ) దిసమొలవాడు, దిగంబరుడు.

"బిత్త లున్నా డనకురే పృథివిలోఁబిన్నవాఁడు
మత్తులై వున్నవారి మడియించీని" 5-218

బిత్తలే తిరిగేటి భూతము : వి. నగ్నంగా వెళ్లి త్రిపురాసుర స్త్రీ మానాన్ని కొల్లగొట్టిన బుద్ధుడు.

"కెలసి బిత్తలే తిగేటి భూతము" 1-109

బిన్నాణము : వి. విన్నాణము, అందము, నేర్పు.

"నెరజాణ విన్నిటాను నీ గుణము కోటిసేసు
మెఱసి నీ బిన్నాణాలు మెచ్చవద్దటే" 29-458

బిన్నాణి: వి. నేర్పరి. (శ.ర.)

"చిక్కులు దేరిన నెరుల పాపటచేత నొయ్యనే దువ్వుచు
ఎక్కడనుండి వచ్చేవే చెలియ యెంత బిన్నాణివే" 27-589

బిమ్మిటి: క్రి.విశ. వివశత, పారవశ్యం.

"క్రమ్మర నావలెనే వేంకటగిరివిభుండా
బిమ్మిటిగాఁ గూడి ప్రేమ పెంచకుండేవా" 6-40

బిమ్మిటిగొను : అ.క్రి. వివశత్వం పొందు, మూర్ఛిల్లు. రూపాం. బిమ్మిటిగొను.

"జంటయి శ్రీవేంకటేశ సమరతిఁజొక్కించితే
పెంటగా నిందుంటి నంటా బిమ్మిటిగొనేవు"
13-434

బిరుగాలి : వి. బిఱుగాలి, గట్టిగా వీచే గాలి.

"సరుస గురుతు మాయించ కీకెను రట్టుసేసి
బిరుగాలి ముడిగట్టే ప్రియుఁడూఁ గలడా" 7-54

బిరుదుకెక్కు : ప.బం; అ.క్రి. ప్రసిద్ధిచెందు, పేరుగాంచు.

"ప్రియము లింపులు బిరుదుకెక్కిన
నయము మీలొ నాఁటినను" 15-30

బిరుదుపద్యము : ప.బం; వి. శౌర్యాన్ని, సామర్థ్యాన్ని ప్రశంసించే పద్యం.

"పేరుకొన్న వేదముల బిరుదుపద్యము లవె
శ్రీరమణుఁడు మెరసె చిక్కులు వాఁపఁగను"
3-274

బిరుదుబంటు : వి. ధీరుడైన బంటు, పేరుపొందిన సేవకుడు.

"ముట్టిన ప్రతాపపు రాముని సేనలలోన
అట్టి బిరుదుబంటు శ్రీ హనుమంతుడు"
3-138 & 22-140

బిరుదులది : (బిరుదులు + అది) సమర్థురాలు.

"నియతి శ్రీవేంకటేశ నేఁడిట్టే పెండ్లాడితిని
ప్రియపడి యింత సేయ బిరుదులదానా"
13-407

బిరుదులాడు : ప.బం; అ.క్రి. ప్రతిజ్ఞలు పలుకు, పరుషవాక్యాలు పలుకు.

"క్రియ దెలుసుక నేమి కినియ మాతనితోడ
ప్రియము గల యాటది బిరుదులాడునా"
27-486

బిరుదుశాస్త్రము : సమర్థమైన శాస్త్రం, గొప్పశాస్త్రం (?)

"బిరుదుశాస్త్రమున పెండ్లియాడిన సతి
మరలి పుట్టువున మఱి వేరట" 15-302

బిల్లఁగోట్లు : వి. బిల్లగోడు, బిల్లంగోడు శబ్దాలకు వికృతిరూపం. బాల, బాలికలు ఆడుకునే ఒక ఆట. 'బిల్లగోళ్ళు' అని శ.ర; సూని.

"చుల్లరితనాన నీపైఁ జూపులు చిమ్ముకొంటా
బిల్లఁగోట్లాడీ నీ ప్రియురాలు" 23-31

"గల్లుగల్లుమనఁగాను గజ్జెలు నందెలుతోడ
బిల్లఁగోట్లాడీని పిన్నికృష్ణుఁడు" 4-172

బీ

బీగముద్ర : (బీగము + ముద్ర) వి. కప్పతాళం.

"పేనిపట్టి వాకిళ్ల బీగముద్రలాయ నిడి
కానిమ్మని వాయించరో గంట పారి" 15-118

బీద గరచిన బూరె : ప.బం; వి. పేదకు దొరికిన పెన్నిధి అనే అర్థం వచ్చే నుడికారం.

"గాదిలి వేంకటపతిఁగానఁగఁ బోయెద మింక
బీదగరచిన బూరె ప్రియమాయ బ్రదుకు" 1-90

బీరకాయపీచు : ప.బం. విశ. దూరపుసంబంధానికి చెందిన.

బీరకాయలోని చిక్కు : ప.బం; వి. మిక్కిలి చిక్కు.
"పెట్టిన దైవమెరుఁగు బీరకాయలోని చిక్కు
దిట్ట కూళప్రాణులమై తిరుగుత గాకా" 3-313

బీరగాఁడు : (బీరము + కాఁడు) వి. పరాక్రమవంతుడు.
"తనకు వలచినట్టి తరుణి సూర్పనకను
పెనుముక్కు గోసిన బీరగాఁడే" 9-134

బీరమాడు : ప.బం; అ.క్రి. గర్వోక్తులు పలుకు.
"నీ రాక దెలిసియు నిద్దిరించెఁ జాలదా
బీరమాడితి నిన్ను రతి బెండుసేయవలెనా"
20-248

బీరముసేసుకొను : అ.క్రి. శక్తి కలుగజేసుకొను (?)
"నీతితోడ వీనులను నీ కతలు వినేయాస
రాతిరిఁ బగలును బీరము సేసుకున్నది"
20-474

బీరువోవు : (బీరు + పోవు) ప.బం; అ.క్రి. సత్వ విహీనమగు, సారహీనమగు.
"మనసెంత గరఁచినాను మచ్చికెంత రేఁచినాను
పెనగొన్న రతులఁక బీరువోయీనా" 21-290

బు

బుంగుడగు : అ.క్రి. మునుగు.
"పొదిగున్న యాసలోఁ బుంగుడై సతతంబు
సదమదంబై పడయు చవులు దనకేలా" 1-302

బుగందించు : అ.క్రి. ఇది ఒక అపురూపమైన పదం. సం.ప.స లో 'పువు+గందించు' అనే పదాల సంగ్రహ రూపంగా తోస్తుంది అనీ, ప్రకరణాన్ని బట్టి 'వాసనకొట్టు' అని అర్థమనీ వివరింపబడింది. (21 సం. 387పు.)
"ముందు నన్నుఁగూడెను ముడిచివేసిన పువ్వు
పొందుగా వీది నుండితే బుగందించకుండునా"
21-341

బుగులుకొను : అ.క్రి. 1. పరిమళించు 2.పైకి లేచు 3.వ్యాపించు 4. విస్తరించు 5. విజృంభించు 6.అతిశయించు.
"తావితో బుగులుకొనేటి పూవులు దాఁపఁగ
నవియె వాడిన పిమ్మట
భావించి చూచితే నందలి తొల్లిటి పస
యెందుండు" 10-1-50

బుగ్గ : వి. నీటిబుడగ.
"నీటిలోన నొక బుగ్గ నిమిషలోనఁ బుట్టి
కోటిసేసినట్లుండు గొంతవడి" 2-360

బుజ : వి. హంసపాదం, కుండలీకరణం, సున్న. (బ్రౌన్; శ.ర.)
"చెలి చెమటల నాని చిత్తములో వలపులు
పులకలై మొలచెను బుజగలిగే" 11-442

బుజము : వి. 'భుజము' నకు వికృతిరూపం.
"సందిఁగట్టుకొన్నవి చంద్రవంక తాయతులు
అందపు వల్లెవాటు పయ్యెద బుజాన" 29-106

బుజమెక్కు : ప.బం; అ.క్రి. పెత్తనం చెలాయించు, నెత్తికెక్కు వంటిది, మిక్కిలి చనువు గలిగినదగు.
"వూడిగము సేసేయట్టి వువిదలతో నవ్వితే
యీడుజోడై నీ బుజమెక్కకుందురా" 26-255

బుజవేయు : చేయివేయు, (శ.ర.) సిద్ధంచేయు. (వ్యు.)
"పూఁపల స్వర్గము త్రోవ బుజవేయరో"

బుజవైచు : స.క్రి. ముద్రలువేయు, సున్నచుట్టు, కుండలీకరించు, సిద్ధంచేయు.

బుడిబుడి : విణ. అల్పము, కపటం.

బుడిబుడిమాయలు : వి. దొంగనటనలు, దొంగమాయలు.
"బుడిబుడిమాయలఁ బొరలేటి దేహికి
కడవరాని బంధము కాంతలు" 3-361

బుడుగు : బుడిగ, బుడిగె, పిడత, సిద్దె, చిన్న మట్టిపాత్ర.
"పొడవాటి వుట్లెక్కి బుడుగులతోడి వెన్న
తొడికివెట్టీఁ దన తోడివారికి" 24-267

బుద్ధి : (5) వి. 'బుద్ధి' కి వికృతిరూపం. ఇట మంచిది, యుక్తం అని అర్థం.
"పొద్దువొద్దుకును వలపుల నేఁచేవు వద్దు

బుద్ధిగాదు నీకు నేఁప భువనమోహినిని" 5-16

బుద్ధి చెప్పు : ప.బం. హితం చెప్పు, నీతి చెప్పు .

"బుద్ధి చెప్పవయ్య నీవు పొరుగులవారి కెల్లి
పొద్దువోదా అటువంటి పొలఁతులకెల్లాను"
25-323

బుద్ధి(ధ్ధి)చెప్పు : *ప.బం; అ.క్రి.* హితం చెప్పు, బుద్ధిచెప్పు, సత్ప్రవర్తన మెరిగించు, మంచి నడవడిని బోధించు.

"చెక్కు నొక్కి నీకు బుద్ధిఁజెప్పడా ఆతఁడు
దొల్లి" 20-447

"సొరిదిఁ దనకు నేఁ జుట్టమయ్యేదానినా
దరిచేర్చి బుద్ధిచెప్పఁదానే కాక" 24-399

బుద్ధులు నూరిపోయు : *ప.బం; అ.క్రి.* అదేపనిగా హితబోధ చేయు .

"బోదించి యెట్లా నాపె బుద్ధులు నూరిపోసినో
సాదువలె నేమనినా సమ్మతించేవు" 17-180

బుద్దెరుగు : (6) (బుద్ధి + ఎరుగు) *ప.బం; అ.క్రి.* తెలిసి వచ్చు, జ్ఞానం వచ్చు.

"బుద్దెరఁగక బాలుఁడై పొత్తులలో నున్నపుడు
కొద్ది లేక తానెవ్వరి గురుతెరుఁగు" 3-268

బుద్బుజము : వి. ఈ పదం ఈ రూపంతో నిఘంటువుల్లో కానరాదు. నిఘంటువుల్లో బుద్బుదము, బుబ్బుదము అనే రెండు రూపాలు కనిపిస్తున్నాయి. బుద్బుదమనే పదానికి నీటిబుడగ అని అర్థం. బుబ్బుదమనే దానికి భక్ష్యవిశేషమనే అర్థం ఉంది. పరిష్కర్తలు కొంచెము గుండుగా సుమారుపాటి పొడవైన భక్ష్యవిశేషమైతే ప్రకరణానికి సరిపోతుందనీ, పెద్దనదులందు, సముద్రము లందు పొడవుగా ఏర్పడే బుడగ కూడా సరిపోతుందని పేర్కొన్నారు. కనుక ఇట భక్ష్యవిశేషమనే అర్థాన్నీ, నీటిబుడగ అనే అర్థాన్నీ చెప్పుకోవచ్చు.

"సారె నీ ముద్ర లేని భుజములు
బుద్బుజములు
తేరి నీ దాస్యము లేని దేహము సందేహము"
2-450

బురి : వి. ఉత్సాహం (?)

"నీవు మాకు బురిగాక నేరము లెందేమున్నది
ఆవటించి మనసులో నౌఁగాము లున్నవా"
27-118

బుఱ్ఱటకొమ్ము : *ప.బం; వి.* నీరు చిమ్మే గొట్టం, చిమ్మనగ్రోవి. నాచన సోమన ప్రయోగం ఉంది.

బుఱ్ఱటకొమ్ముల వసంతము : వి. చిమ్మన గ్రోవులతో ఆడే వసంతం. (చిత్తుడుగొట్టం)

"వుడుకుఁజెమటలనే వూర్చి కొనగోరఁ జిమ్మి
కొడిసాగ బుఱ్ఱటకొమ్ముల వసంతము" 18-389

బులియు : *అ.క్రి.* మురియు.

"కలయ వేడుక నీకుఁ గలిగితే గనకిట్టే
బులియక లోనికేగి భోగించరాదా" 13-149

బులిసి లోగు : *అ.క్రి.* మొదట ప్రాపంచికసుఖాల్లో మునిగి తరువాత దుఃఖించు.

"బులిసి లోఁగఁగనేల పురుషోత్తమా" 2-283

బులుపు : (2) వి. సుఖం, వేడుక, వాంఛ, ఉబలాటం.

"బులుపుఁబిలుపుల మేను పులకించ కేలుండు
మొలకనగవుల యా(నా)స మొలవకేలుండు"
5-101

బువ్వపుఁబాలకూళ్లు : వి. విందులోని పాయసాలు.

"పొత్తుల మోవితేనెలే బువ్వపుఁబాలకూళ్లు
బత్తితోడి నవ్వులే కప్రపుబాగాలు" 21-417

బువ్వము : (7) వి. వివాహంలో బంధువులైన మగవారు, ఆడువారు అందరూ ఒకటిగా కూర్చుండి వేడుకగా చేసే భోజనం, బూవం, అన్నం.

"పొరుగుదానికేల బువ్వానఁగూచుండ" 23-48

"పొలఁతులు వడ్డించఁగా బువ్వానఁ గూచుండి
చెలఁగి సరసమాడీ శ్రీదేవితో" 28-16

బుసకొట్టు : (14) వి. బుసకొట్టడం.

"ముక్కున నీ బుసకొట్టు ముసిముసి
నవ్వులగుట్టు

దిక్కులవారి నడిగి తెలుసుకోరాదా" 19-465
"సారె విసరుకొనేవు చప్పుడుగా నింతలోనె
ఆ రీతి బుసకొట్లు నీ కాఁఅడయ్యీనా" 27-434

బూ

బూఁజి: వి. బూజు, దుర్గంధం, ఎండ సోకకపోవడం వల్ల తడివస్తువులమీద పట్టే మకిలి.
"పుచ్చినట్టి పండు బూఁజిలోననే వుండు
బచ్చనకవితలు బాఁతిగావు యెందు" 2-494

బూక: (6) వి. మాయ, బూటకం, అసత్యం, బొంకు.
"పలుమారు నలయించు పరవశంబొకకొంత
పొలయలుకలను బొడము బూకలొక కొంత"
5-312

బూజకుండ: వి. ఐరేనికుండ.
"గొప్ప కుచముల బూజకుండలునుఁ బట్టితివి
పిప్పిగాఁగ రతులను పెండ్లాడితివి" 27-179
"పొందైన కుచములను బూజగుండలు దెచ్చె
అందముగఁ గాఁగిలించే నంటా నిన్ను" 18-422

బూటకీఁడు: (బూటకము + ఈఁడు) వి. మాయావి, మోసగాడు.
"అందునిందు నిచ్చకము లట్టె యేల చూపేవు
పొంది నన్నుఁ గోపించేనా బూటకీఁడ" 27-287

బూడిది: వి. 'బూడిద'కు రూపాం.
"ఏడ సుజ్ఞాన మేడ తెలివి నాకు
బూడిదిలో హోమమై పోయఁగాలము" 1-48

బూడిదిలో కచ్చుక: ప.బం; వి. అంటీ అంటక ఉండేది. బూడిదలోని కచ్చుకాయకు బూడిద ఏ మాత్రమూ అంటదు కదా!
"ఏడ సుజ్ఞాన మేడ తెలివి నాకు
బూడిదిలో కచ్చుకయై పొరయఁడెందు" 2-374

బూడిదిలో హోమము: వి; ప.బం. వ్యర్థం.
"ఏడ సుజ్ఞాన మేడ తెలివి నాకు
బూడిదిలో హోమమై పోయఁగాలము" 1-48

బూడిదె: వి. 'బూడిద'కు రూపాం.
"బూడిదెలో వసంతమా" 26-32

బూడిదెలో వసంతము: వి; ప.బం. వ్యర్థం.
"ఆడనుండి మోవిఁ దిట్టే వంతేకాదా వలపు
బూడిదెలో వసంతమా పోపో అంతేకాదా"
26-32

బూతకి: ఆడుభూతము, ఇట పూతన లేదా పూతక యే పూతకిగా వ్యవహరింపబడి క్రమంగా 'బూతకి' ఐనదేమో? "బొమ్మరపోవడు పూతకి బొరిగొని" అనే (6-149) కీర్తనలో పూతకి అనే ప్రయోగం కనిపిస్తుంది.
"వగపు లేక చంపవచ్చిన బూతకి
పగ సాధించినవాఁడు పసిబిడ్డ"
10-2-11 & 1-126
"బూతకిఁ జంపినవాఁడే బూతకి వాకట్టు రక్ష
పాతాళానఁగూర్మమైన పతి గుంతదోషరక్ష"

బూతాల పొంగలి: వి. భూతబలి.
"భూతాల పొంగటికే పొడమిన పంటలెల్లా
కోతవేత చూచుకొని కోరుకొంటారు" 3-464

బూతు: (2) వి. కుత్సితపు తిట్టు, అసత్యం.
"పొలఁతి యంపిన లేక బూతులు దొరలఁబోలు
వెలయ నే మడిగినా వెళ్లనాడవు" 10-2-40

బూతుచిల్లి నేస్తము: కామసంబంధమైన స్నేహం, యోనిసంబంధమైన స్నేహం (?)
"నేతిబీరకాయ నెట్టనఁ గర్మబంధము
బూతు చిల్లినేస్త మెప్పుడు మనసు" 15-325

బూతుజన్మము: వి. అసహ్యాకరమైన పుట్టుక.
1-129

బూతుబండుఁడు: ప.బం; వి. తిట్లమారి.
"నిండు బూతుబండుఁ డిట్టు నెరపిన దెవ్వతే
వొండేమి నెఱుఁగక వూరకుండే బాలుని" 17-94

బూతుబండు: (2) వి. బండుబూతు, ఆకతాయిమాట.
"యెలమి శ్రీవేంకటేశ యెనసి మెచ్చితిఁ గాక
పలుకులలో నే బూతుబండునఁ దిట్టితినా"
23-240

బూతుమాట : వి. అసహ్యాకరమైన మాట
"కొంకి తిట్టేదే కాని గురియైన రతిదాఁకా
పొంకపు బూతుమాటలఁ బూఁచుకున్నది"
12-210

బూతురేవు : వి. నింద్యమైన సంసార వ్యామోహమనే రేవు.
"జగతిఁబుణ్యపాపపు సరకులు దెచ్చినాఁడ
దిగితి బూతురేవునఁ దీరుచరో సుంకము"
3-324

బూతుల యెంగిలి : వి. నింద్యమైన సంసర్గం.
"బూతుల యెంగిలిఁబుట్టిన దేహము
బాఁతిగ శుచియై పరఁగీనా" 3-430

బూతో బండో : *ప.బం;* వి. నీచమైనది అనే అర్థంలో జంటపదం.
"పుట్టినదే నగ్నత్వము బూతో బండో
యెరఁగము" 3-340

బూపతిచెరువు : ఇదొక చెరువు పేరై ఉంటుంది. ప్రస్తుతం ఇది ఎక్కడ ఉందో తెలియదు. గౌరిపెద్దివారు చెరువు అంటే కోనేరు అనే అర్థం ఉంది. కోన్ అంటే తమిళంలో ప్రభువు అని అర్థం. కోన్ + ఏరు = కోనేరు - స్వామి పుష్కరిణి అన్నారు. అన్నమయ్య ఈ భూపతి చెరువు శ్రీవేంకటేశ్వరస్వామిపై ఎనిమిది కీర్తనలు పాడినాడు
"పోదితో శ్రీవేంకటేశ బూపతిచెరువుకాడ
ఆదిగొని నిన్నుఁగూడె ఆకె నీకుఁదగును"
25-157

బూమి : (10) వి. 'భూమి'కి జానపదవ్యవహార రూపం.
"బుద్ధులఁబోయేవు మెట్టి బూములెల్లాఁ దిరిగేవు"
9-84

బూమిదేవులమ్మ : వి. భూదేవత.
"బూమిదేవులమ్మ నీ బుజముపై నుండఁగాను
వేమారు నాతో నవ్వేవు వింతొక చవే" 21-87

బూమివారు : *వి; బహు.* భూమిలోనివారు, ప్రజలు.
"వుండుండి బూమివారెల్లా వూరకే నీ కన్నులను
పుండరీకముల నిట్టే పోలునందురు" 7-522

బూమె : వి. కపటవేషం, మాయ, (ఆం.ప.ని.) వంచకుడు.
"పొరుగు పోరచా నిన్ను బూమెలు సేయ"
21-201

బూమెట : భూమికా శబ్దభవమా అని సంపా.
"పొంతల నవ్వే వేల బూమెటవలెను
ఎంత మాయకాఁడవో యేమని చెప్పుదు నిను"
21-125

బూమేటులఁబెట్టు : స.క్రి. వంచించు. మాయల బడదొబ్బు.

బూరుగుపై చిలుక : *వి; ప.బం.* నిరాశచెందిన చిలుక, బూరుగుపండును పండని భావించి చిలుక బూరుగుచెట్టు పైకి వస్తుంది. కాని బూరుగు పండు దూదితో నిండి ఉంటుందేకాని అది నిజంగా పండు కాదు.
"శ్రీవేంకటాధీశ్వరు సేవించక మోక్షానకుఁ
బోవలె ననేటివాఁడు బూరుగుపై చిలుకా"
15-378

'బూరుగమాను కాసించి పొంచి చిలుకచంద మాయె' అని క్షేత్రయ్య.

బూరుగుమాకున చెందిన కీరము : *ప.బం;* వి. లాభం లేనిదానిని చేరినట్టిది. (బూరుగు మాకున ఉన్న ఫలాన్ని చూచి అది ఫలమనే భ్రమచే చిలుక బూరుగు వృక్షాన్ని ఆశ్రయించి బూరుగుపండులో కేవలం దూదే ఉంటుంది కనుక నిరాశచెందుతుంది.)
"బూరుగుమాకున చెందిన కీరము చందమున
ఆరయ నిష్ఫలమగు మరి యన్యుల జేరినను"
1-194

బూవపువారు : *వి; బహు.* వివాహాది సమయంలో కలిసి భోజనం చేసే బంధువులు .
"శ్రీవేంకటేశ్వర చెలఁగి నగేమా
బూవపువారము భోగులము" 19-8

బూవము : వి. 'బువ్వము'కు రూపాం. వివాహంలో బంధువులైన మగవారు అందరును

ఒకటిగా కూర్చుండి వేడుకగా భోజనం చేయడం.

"బూవానఁబెట్టుకొపెను బోగించరాదా" 23-435

బె

బెంగ: వి. 1. కలవరం, మనోవ్యాకులత 2. విరహం, వ్యథ. (వ్యు.)

"అంగన గెలిచితి వనవయ్య వొక్కమాఁటే

బెంగవలెఁగోరివచ్చి పెనఁగీ నీతో" 25-230

బెంగతనము: (బెంగ + తనము) వి. చూ: బెంగ.

"అంగడిఁబెట్టే వయసు అడియాల మానునే

బెంగతనాన నుండినాఁ బెడరేఁచుఁగాక" 21-404

బెండ: వి. (?)

"అండకురావచ్చుఁ గాని అలుక మానుపరాదు

బెండ నాతో నేల పెనఁగాడీనే" 25-63

బెండువంటివారు: వి; బహు. బెండువలె తేలికైన వారు, శక్తిలేనివారు.

"కొండలరాయఁడ మమ్ముఁగోరి పుట్టించఁగా నీవు

బెండువంటివారము మా బిగువేఁటి బిగువు"

4-126

బెండువడు: (బెండు + పడు) బలహీనుడగు, తేలికపడు, నీరసపడు.

"పెనఁగి పెదవులైతే బెండుపడీని" 26-35

బెండ్లు ముంచి గుండ్లు తేలించు: ప.బం; అ.క్రి. అసాధ్యమైన పనిని సుసాధ్యం చేయు.

"తెంకి బెండ్లు ముంచి గుండ్లు దేలించేది నీ విద్య

వంకలొత్తి యాటదాని వంచేది నీ విద్య" 3-213

"మజ్జంత్యలాబూని శిలాః ప్లవంతే" అని సంస్కృతసూక్తి.

బెంబడి: అవ్య. వెంబడి, వెంటనే.

"కరఁగి వారెల్లా శ్రీ వెంకటనాథ కూడఁగాఁ

పరువపు నారతి బెంబడి నోడవైతివి" 10-2-36

"నరపతి భూమేలఁగ భూవరు భజియింపఁగ నొల్లక

పరిసరవర్తుల బెంబడిఁ బని సేసినయట్లు"

1-362

బెంబాడి చేఁతలు: ప.బం; వి. (?)

"పేరు నారాయణుఁడవు బెంబాడి చేఁతలు నీవి

నోరు మూసుకున్నఁబోదు నున్నని నీ సుద్దులు"

2-162

బెట్టి: వి. రూపాం. బెట్టు, (?) గట్టిగా, దృఢంగా.

"ఎట్టి పరవశమో యెటువంటి తమకమో

బెట్టి ముంజేతిచిలుక పిల్చినా నెఱఁగదు"

24-442

బెట్టిమాట: వి. గట్టిమాట, బెట్టు శబ్దానికి 'బెట్టి' అనేది విలక్షణమైన ఔపవిభక్తికరూపం.

"కందువలు చూపి నీకుఁ గనుసన్న సేసితేను

అంది బెట్టిమాటల నేల అడిగేవు" 16-119

బెట్టుగా: క్రి.విణ. గట్టిగా, దృఢంగా.

"బెట్టుగాఁజేరఁబిలిచి ప్రియములు చెప్పఁగాను"

25-446

బెడగు(లు): వి. తప్పు(లు), దోషము(లు)

"కడుపులోపలి శిశువు కన్నతల్లిఁ దన్నితేను

బెడగులెంచక కని పెంచీనట" 3-437

బెరయు: అ.క్రి. సంభవించు, కలుగు.

"పెనుగులాడేటివేళ బెరసిన చెమటల

పనుపడి నీ తమికిఁ బదనాయను" 7-132

బెరయు: స.క్రి. చేరు, చలించు, ఒరయు. (శ.ర.)

"పెక్కు పురుషులలోన బెరసొక సతి యుంటే

యిక్కువై యందే నాఁటు నిందరి చూపు"

బెల్లించు: (6) వి. స.క్రి. 1. వంచించు 2. ఉబ్బించు 3.ముఖస్తుతి చేయు 4. సాంత్వనం చేయు. (ఆం.ధా.మా.) (బెల్లింపు = మోసం ఆం.ప.ని.)

"పట్టెడేసి గుబ్బలపై పయ్యెదించుక జారించి

బెట్టుగా సరసాలాడి బెల్లించెఁగా" 22-536

"యెనసి వుండినవారి నెఱుక సేసుకోనేల

పెనఁగులాడేవారి బెల్లించనేల" 27-542

బేసబెల్లి శబ్దంలోని బెల్లి శబ్దం ఈ ధాతురూపమే.

బెల్లికత్తె : (బెల్లి + కత్తె) వి. వంచకురాలు, మోసగించే స్త్రీ.

"యిక్కడ శ్రీవేంకటేశ! యిరవై వుందువు గాక
పెక్కుబుద్ధి చెప్ప నీకు బెల్లికత్తెనా" 27-227

బెళకు : అ.క్రి. వెలుగు, మనసులోని భావాన్ని బయటపెట్టు, పైకి తెలియు. (విలాసం చూపు. ఆ.మూ.)

"పలుకనేరదు గాని భావములోని చేఁత
బెళకకుండా నట్టిపెట్టుకున్నది" 8-210

బే

బేఁటము : వి. 1. రతి, సంభోగం 2. దయ, ప్రేమ 3. కండ్లకు గంత (తె.తె.ని.) 4. ఆనందం.

"గుట్టున నీవు గూడక గోర నెంత గీరినాను
వట్టి బేఁటమే కాక వచ్చే దేమున్నది" 13-519

బేగడపసిఁడి : వి. అభ్రకం, కాకిబంగారం.

"బేగడపసిఁడి నిగ్గు బీరపుబిగువులివి
లాగవేగపు గోరిలాంచనములు (?)" 7-231

బేగడబొట్టు : అభ్రకపుబొట్టు.

"కలికి నొసలనున్న కపురు బేగడబొట్టు
పెలుచవై నీ నుదుటఁబెట్టుకొంటివి" 26-404

బేడలు : *వి; బహు; మాం.* రెండుగా చీలిన ముక్కలు, రెండుగా చీలిన పప్పుధాన్యములు. ఉదా :- కందిబేడలు, సెనగబేడలు మొ॥ ఈ వ్యవహారం రాయలసీమలో ఉంది. ఇతరత్రా కందిపప్పు, సెనగపప్పు అనియే వ్యవహారం. రాయలసీమలో ఉడికినదానికే పప్పు అని వాడుక. ఇట రెండుగా చీలిన ముక్కలు అని అర్థం.

"వోడక పిడికిలించి వుగ్రదైత్యుల తలలు
బేడలుగాఁజేసినాఁడు పెద్ద హనుమంతుఁడు" 2-350

బేడలుగా జేయు : స.క్రి. బద్దలు చేయు, ముక్కలు చేయు.

"వోడక పిడికిలించి వుగ్రదైత్యుల తలలు
బేడలుగా జేసినాడు పెద్ద హనుమంతుఁడు" 21-350

బేడుకోల : (?)

"తోడఁబెండ్లికూఁతురవా తొయ్యలి నీవు
బేడుకోలవై సందడిఁబెండ్లాడవచ్చేవు" 29-352

బేడుకోలుఁదనము : వి. (?)

"బేడుకోలుఁదనమున పెండ్లిమాట
చూడు ముసిముసినవ్వు చూపీ నీ యెదుట" 24-514

బేరగాఁడు : (బేరము + కాఁడు) వి. వ్యాపారం చేసేవాడు, వర్తకుడు.

"చొక్కపుమోవిపైఁ గస్తూరి నిగరాలు నించి
పెక్కువలపు లమ్మేటి బేరగాఁడ" 18-354

బేరి : వి. 1. వైశ్యుడు. (2. వాద్యవిశేషం)

"ఔరా మంచి బేరి వవుదు వన్నిటా నీవు
సారె పయ్యెదమాఁటున జట్టి శాయ వచ్చేవు" 16-531

బేరిజోకొట్టు : అ.క్రి. తీవ్రతను తగ్గించు. (?)

"నాలిసేసి నాతోను నమ్మిక మాటలాడి
యేల బేరిజోకొట్టీనే యిప్పుడు తాను" 19-221

"బేరిజోకొట్టుచు మాతోఁబెనఁగే వప్పటి నీవు
నేరిచినంతా మాతో నేరుపుదువు గాక" 17-23

బేలుఁడు : (2) *వి;* సూ.ని. లో 'బేలు' శబ్దం ఉంది. వివేకహీనుడు, వివేకహీనురాలు అనే అర్థాలు చూపబడ్డాయి. అన్నమయ్య 'బేలుఁడు' అని 'డు' ప్రత్యయాంతంగా ప్రయోగించడం విలక్షణం.

"నాలికె కారు రుచులు నలిఁదెలుపు నీమాయ
బేలుఁడై విరక్తుఁడై భిక్షమెత్తించు నీ మాయ" 3-237

"బేలుఁడై యుండకితఁడు ప్రియమునఁ జెలరేఁగి
కాలుదొక్కి పానుపుపై కందువంటె నిదివో" 20-553

బేలుఁదనము : (2) (బేలు + తనము) వి. వివేకహీనత, అమాయకత్వం, బేలదనం.

"నాలుగుచేతులవాఁడు నాకశయనపువాఁడు
బేలుఁదనమున సరి పెనఁగేవా" 21-3
"బాలుల గూడుక వీది బారాడి నల్లవాడె
బేలుదనమున లెస్స పెంచితి వోయమ్మా"
26-88
"బాలులఁ గూడుక వీదిఁబారాడి నల్లవాఁడె
బేలుఁదనమున లెస్స పెంచితివో యమ్మ"
26-88

బేలుచేయు : స.క్రి. అవివేకిగా చేయు, మోసంచేయు.
"ఏలితివి శ్రీవేంకటేశ యిన్నిటా నీకెను
బేలుఁజేయవద్దుగాని ప్రేమ నించవచ్చును"
7-142

బేలుపోవు : *ప.బం; అ.క్రి.* మోసపోవు.
"చుల్లరపుటాగడాలు చూపబోతే గంపనిండా
పెల్లుమాణికా లున్నవి బేలుపోయ మాటా"
26-156

బేసబెల్లి : (8) వి. మిక్కిలి వంచకుడు, మిక్కిలి వంచకురాలు, నంగనాచి, మిక్కిలి వగలాడి విణ. వంచకము, మోసగించేది.
"బేసబెల్లి నిన్ను నేఁడు పెండ్లాడీనా" 22-255
"బీరములు నెరపేది బేసబెల్లులకుఁ గాక
మేరతోఁ బెండ్లాడిన మేనవారి కేలే" 26-228

బేసబెల్లితనము : (15) వి. బెల్లి అంటే వంచకుడు. బెల్లి + బెల్లి = బేసబెల్లి అనే వ్యుత్పత్తి ఆధారంగా దీనికి మిక్కిలి వంచకుడు అనే అర్థం వస్తుంది. అప్పుడు బేసబెల్లితనం అంటే మిక్కిలి వంచన, నంగనాచితనం, వేషాలమారి తనం, వగలాడితనం అని అర్థం.
"సేసినట్టు చెల్లెఁగా చేరి రుకుమిణిఁ దెచ్చి
బేసబెల్లితనపు నీ పెండ్లిలోన" 14-278

బేసబెల్లిది : (బేసబెల్లి + అది) వి. మిక్కిలి నంగనాచిది, వంచకురాలు.
"మోసపోనిదానికి ముచ్చట లొనరునే
బేసబెల్లిదానికి పెనఁగఁదగునే" 28-590

బేసబెల్లి పంతము : వి. వంచనతో కూడిన పంతం.
"సేసలు వెట్టేవేళ చెంతనెంత పెనఁగినా
బేసబెల్లిపంతాల బీరమాడఁజెల్లదూ" 12-222

బేసబెల్లి రతులు : నంగనాచి రతులు.

బేసబెల్లి రమణుఁడు : వి. మోసగాడైన రమణుఁడు.
"బేసబెల్లిరమణుఁడు పెనఁగీ నాతోఁజెరఁగు
మాసి వున్నదాన నేఁడు మాను మనవే" 16-91

బేసబెల్లివారు : *వి; బహు.* మిక్కిలి వంచకులు, నంగనాచి వంటివారు.
"పెనఁగేటి యిటువంటి బేసబెల్లివారికే కా
వెనకముందరికెల్లా వెలవెట్టు వలపు" 8-52

బేసబెల్లి వేడుకలు : *వి; బహు.* మోసపువేడుకలు.
"ఆసలు గలిగితేనే అంటుకొను వేడుకలు
బేసబెల్లి వేడుకలఁ బ్రియము లేదు" 12-445

బేసము : వి. పండ్లగుజ్జు, చిక్కని పండ్లరసం. (క. బేసవు)
"లలి నేనుగు దిన్న వెలఁగపంటి బేసము
వలెనే పోఁగలవెల్ల వడిఁదానే పోవురే" 2-140

బొ

బొంకులదేహము : వి. అసత్యాల దేహం.
"బొంకులదేహము పో దిది వేగనే
చింకవేఁట యిటు చేసనని" 6-97

బొండఁబెట్టు : (?)
"యెంచరాని యింద్రియము లెవ్వరికి నేల చిక్కు
పొంచిపొంచి వలపుల బొండఁబెట్టుఁగాక" 1-177

బొండ : వి. 1. తప్పు చేసినవారి కాళ్లు చేతులకు తగిలిచ్చే కర్రయంత్రవిశేషం. 2. దొంగగొడ్డు పరుగెత్తకుండా కాలికి కట్టే బంధం. (వ్యు.)

బొందెకోల : వి. యోధులు శస్త్రాభ్యాసంలో ఉపయోగించే ఆయుధం.
"బోరనఁబట్టేవు చేయి బొందెకోలా" 23-217
బొండకోల అని ఆం.ప.కో.

బొక్క : వి. 1. ఎముక 2. రంధ్రం.

బొగ్గరము : వి. ఉక్కతో కూడిన వేడిమి. (వ్యు.)

"వెగ్గళించి ఇంతలో శ్రీవేంకటేశ కూడితివి
బొగ్గరపుఁజింతలెల్ల పోపో మెచ్చాయనా" 24-77

బొట్టనవేలు : (2) వి. బొటనవ్రేలు, అంగుష్ఠం.
"చేరి తూఁగుమంచ మూఁచే చెలియ చనుమొనలు
తారుచు బొట్టనవేలఁ దాకించనా" 7-123
"అందలమెక్కిన నిన్ను ఆకె గొలిచిరాఁగాను
పొందుగాఁజన్నులొత్తేవు బొట్టనవేల" 7-117

బొట్టులమెకము : వి. లేడి, జింక . (మచ్చలు గల మృగమని వ్యు.)
"బొట్టులమెకము నేసే బోయనాయఁడు
పట్టపునెమలి చుంగల బలుబోయనాయఁడు" 1-460

బొట్టులమెకము నేసే బోయనాయఁడు : వి. శ్రీరాముడు. (లేడి రూపంలో నున్న మారీచుణ్ణి బాణంతో కొట్టినవాడు.)
"బొట్టులమెకము నేసే బోయనాయఁడు " 1-460

బొడుక: వి. బాలుడు, పిల్లవాడు. (తె.వ్యు.కో.)
"లెక్కించ నితనికైన లెంకలకు బొడుకల
కొక్కట విధి నిషేధా లూహింపలేవు" 2-511
"సరిఁ గర్మములకెల్ల చనవరి బొడుకను
పొరలే జన్మముల యప్పులవాఁడను" 2-480

బొడ్డుతామెర: (2) వి. నాభికమలం.
"దనుజాంతకు బొడ్డుతామెర కాదా
జననకారణము సర్వమునకు" 4-133

బొడ్డుపూపకొడుకు : వి. బ్రహ్మ, విష్ణువు నాభికమలంలో పుట్టినవాడని వ్యుత్పత్తి.
"బొడ్డుపూపకొడుకుతో పుక్కిటి తమ్ములముతో
నొడ్డిన రతులతోడ నోలలాడీని" 5-141

బొడ్రాయి : (బొడ్డు + రాయి) వి; ప.బం. కలరా, మశూచి మొదలైన సాంక్రామిక సాంఘిక వ్యాధులు, పశువ్యాధులు సోకకుండా గ్రామవాసులు పూజించే నిలువున నాటిన పెద్దరాయి.
"ఇంతటి శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁగూడితివి
పొంతలనే శిరసిది బొడ్రాయి గాదా" 25-451

బొత్తుగా : క్రి.విశ. బొత్తిగా, పూర్తిగా.
"బొత్తుగా నీ వాపెచేత బుద్ధులు వినఁగాఁగాక
హత్తి నీతోనేఁదొల్లి అలిగితినా" 12-409
"బొత్తుగా మిమ్ము గెలిచెఁ బొగడరో మెచ్చీని"
2-245

బొద్దులు : వి; బహు. శిశువుల చేతి ఆభరణవిశేషం.
"ముద్దుల వ్రేళ్లతోడ మొరవంక యుంగరాల
నిద్దపుంజేతుల పైఁడిబొద్దులతోడ" 6-1

బొమ్మఁబెట్టు : ప.బం; అ.క్రి. అవమానం చేయు, తిరస్కరించు. జయించినందుకు సూచనగా అరివీరుల బొమ్మలను కాలియందెలపై చెక్కించడమే బొమ్మపెట్టడం దీనిపై వచ్చిన పలుకుబడి గౌణార్థం తిరస్కరించడం.
"మహి నా పుట్టుగులకే మరి బొమ్మఁబెట్టినాఁడ
విహితమిందుకు నేది విధి చెప్పవయ్యా" 3-311

బొమ్మంచు మోవి : వి. ఎఱ్ఱని పెదవి.
"పులకజొంపాలతోడ బొమ్మంచుమోవితోడ
కొలచినందె కొలచి కొంక నేఁటికే" 9-117

బొమ్మచారి : (4) వి. 'బ్రహ్మచారి'కి వికృతిరూపం. పెండ్లి కానివాడు, బ్రహ్మచర్యమందున్నవాడు.
"బిత్తలై పరువులిడి పిన్న బోడి తలతోడ
కొత్త బొమ్మచారియై గోచి గట్టెను" 4-254

బొమ్మచారితనము : (2) వి. బ్రహ్మచర్యం. చూ : బొమ్మచారి.
"బూమెల నీ వాడుకొన్న బొమ్మచారితనమెల్ల
పామిడిగొల్లెతలందే పచ్చిదేరీఁ బదరా" 22-43

బొమ్మజంకె : (4) వి. కనుబొమలతో బెదిరించడం. (జంకె జంకెనకు రూపాం.)
"వొద్దనున్న ఇల్లాలి నురముపైఁ బెట్టుకొంటే
గద్దించి బొమ్మజంకెలఁ గైకొని కూడె (?)" 5-20

బొమ్మజంకెన : (2) వి. కనుబొమలతో బెదిరించడం.

"బొమ్మజంకెనలు పొలఁతి చూపఁగా
నమ్మికలిచ్చీ నాయకుఁడు" 29-79

బొమ్మపెండ్లి: వి. బాలికల క్రీడావిశేషం, బొమ్మలను పెండ్లికూతురుగా, పెండ్లికొడుకుగా చేసి ఆడుకునే ఆట, బొమ్మలపెండ్లి.
"పిన్నదాననై బొమ్మపెండ్లి నేఁజేయఁగాను
నన్నుఁ జూచి నీవు నాఁడే నవ్వితివి గదరా"
20-45

బొమ్మరపరపు: స.క్రి. ఆశ్చర్యపఱచు, భ్రమపఱచు.
"వలరాయని చి(చీ)రు నమ్ములు (?)
వడిఁదాకిన గంటవలెఁ
బొలుపుగఁజూచినవారల బొమ్మరపరపెడిని"
5-122

బొమ్మరపోవు: *ప.బం; అ.క్రి.* దిగ్భ్రమచెందు, ఆశ్చర్యపడు, బమ్మెరపోవు, విస్తుపోవు.
"బొమ్మరపోవఁడు పూతకిఁబొరిగొని
అమ్మరో గయ్యాళిశిశువు" 6-149

బొమ్మరము: (2) వి. బొంగరం. (బాలక్రీడావిశేష సాధనం)
"పొంచి నీతో జాళెలేక బొమ్మరాలు వేసేవారు
ముంచి చేతులు చాఁచేరు మొగిఁజూడవయ్యా"
7-264

బొమ్మలపెండెము: వి. ఓడింపబడిన వారి బొమ్మలను కూర్చి చేసిన కాలిఅందె.
"మగువ పాదమున బొమ్మలపెండె మున్నది
నిగనిగ మనీ నదే నీ విచ్చినదా" 12-436

బొమ్మిరెడ్డిచెర్లహరి: బొమ్మిరెడ్డిచెర్ల గ్రామంలో వెలసిన నృసింహస్వామి. ఈ గ్రామం ఎక్కడిదో తెలియదు. బహుశః కడప మండలంలోనిది కావచ్చు. (తా.అ. తెలుగునాడు - 109 పు)
"పొంది లకిమమ్మతోడ బొమ్మిరెడ్డిచెర్ల హరి
యిందరి శ్రీవేంకటేశుఁ డేలుచున్నాఁడు" 17-449
ఈ కీర్తనలో ప్రహ్లాదవరదుడు, శ్రీనరసింహుడు అని ఉండడంవల్ల ఇట హరి శబ్దం నృసింహస్వామి వాచకమే.

బొమ్మె: వి. మూర్ఛ.
"కుమ్మరించి యాపెలోని కోరిక దీరుచరాదా
బొమ్మెల నింతలో వెలిఁబుట్టీనా యీ సుద్దులు"
20-580

బో

బోఁసేయు: స.క్రి. భోజనంచేయు అనే అర్థంలో జానపదవ్యవహారం. విలక్షణప్రయోగం.
"బువ్వాన నాతఁడు నిన్ను బోఁసేతము
రమ్మంటే
పువ్వుల వాటుల నేల పూఁచి వేసేవే" 27-226
చూ: భోఁసేయు.

బోయతి: (12) వి. 'బోయెత'కు రూపాం. బోయస్త్రీ.
"పొదిగొన్న పెనుఁగొప్పు బోయతి మించు
బొదిలిన గుబ్బల బోయతి" 5-175

బోయనాయఁడు: వి. శ్రీవేంకటేశ్వరస్వామి. తిరుమల ఒకప్పుడు పెద్ద అటవీప్రాంతం. కనుక బోయవాళ్లు అక్కడ ఎక్కువగా నివసించేవారేమో. అందువల్ల వేంకటేశ్వర స్వామి 'బోయనాయఁడు'గా వర్ణింపబడిఉంటాడు.
"పొడవైన శేషగిరి బోయనాయఁడు
విడువ కిందరిఁగాచు వెడ బోయనాయఁడు
పొలసి మీసాల పెద్ద బోయనాయఁడు
మలిగి వీపున గట్టె మంకు బోయనాయఁడు"
1-460

బోయిఁడు: వి. సారథి.
"అందపుబోయిఁడవుగా నర్జుని బండి గద్దు"
7-319

బోరవీఁపువాఁడు: వి. వక్షస్సు వీపుగా గలవాడు. కూర్మావతారుడైన విష్ణువు.
"పొలసుమేనివాఁడు బోరవీఁపువాఁడు
సెలసుమోరవాఁడు సిన్నెకా" 5-182

బోరునన్: క్రి.విఱ. శీఘ్రంగా.
"పూని నేఁదలఁచఁగానే బోరున వచ్చితివి"
12-318

బోలుఁగొప్పు : (2) వి.ఒకరకం కొప్పు, లోపల ఏమీలేకుండా వేసుకున్న కొప్పు.
"పొడవుగ నేడ లేని బోలుఁగొప్పు పెట్టితివి
నిడుపులు సాగీనటే నీ నెరులు" 18-292

బ్ర

బ్రహ్మాత్య : వి. 'బ్రహ్మహత్య'కు వాడుకరూపం కావచ్చు.
"సేసిన నా బ్రహ్మాత్యలు శిశుహత్యలు గోహత్యలు
ఆసల నెన్నో యెన్నో ఆయా జాడలను" 1-134

బ్రా

బ్రాహ్మఁడు : వి. 'బ్రాహ్మణుడు' అనే శబ్దానికి వ్యావహారిక రూపం.
"పాపమెరంగని బ్రాహ్మఁడు యెందుఁ
జూపరాని చోటు చూపీనయ్యా"
1-209 & 1-135

భ

భంగపడు : అ.క్రి. అవమానపడు, ఓడిపోవు.
"అడర నీ విధికి విధియగు వేంకటేశుకృప
పడయకుండఁగ భంగపడకపోరాదు" 1-134

భంగించు : స.క్రి. మోసపుచ్చు.
"భంగించి పదారువేల బలిమిఁ బట్టినట్టే
చెంగట నన్ను నీవు చేయి వట్టితివి" 13-467

భయభక్తి: వి. భయం మరియు భక్తి. ఇది ద్వంద్వసమాస పదం. కనుక 'భయభక్తులు' అని బహువచనాంతంగా ప్రయోగించే బదులు ఏకవచనాంతంగా ప్రయోగించడం విశేషం.
"యిందలి యాసలనే పో యేచిన నా భయభక్తి
యెందును నావల్ల నీకు నించుకంతా లేదు"
2-468

భయస్తుఁడు : వి. 'భయస్థుడు' అనే రూపానికి వ్యావహారిక రూపం. భయస్వభావం కలవాడు.
"నిలిచి భయస్తుఁడనై నీ యెదుట దైన్యమే
పలుకఁగఁగావకుండఁబాడిగాదు నీకు" 1-501

భల్లూకులు : వి; బహు. భల్లూకములు, ఎలుగుబంట్లు.
"కూలిరి భల్లూకుల ఘోషములకు
వాలిరి వాయుజవాలహతి" 4-523

భవంతిమేడ : వి. నాలుగిండ్లు కలిపి కట్టిన పెద్దమేడ.
"భవంతిమేడలో నిన్నుఁ బారితెంచి కాఁగలించి
దువాళివలపు చెల్లె తొయ్యలి నీకు" 7-530

భవనాశి(యేరు) : వి. అహోబలం పైనుండి పారే నది పేరు.
"పంచలఁబంతాలు మీరి భవనాశియేరు వార
చెంచెతలఁగోరీ నరసింహదేవుఁడు" 2-228
"పరిపరివిధ విధముల భవనాశిదరులను
సరసములాడీని సాటికి బేటికిని" 28-35

భా

భాగించుకొను : స.క్రి. భాగము చేసుకొను, పంచుకొను.
"పరిమళమొక్కటే భాగించుకొనుటే వేరు"
3-238

భాగ్యమంతురాలు : (2) వి. భాగ్యం కలిగిన స్త్రీ, భాగ్యవంతురాలు అనేది సాధురూపం.
"నేనే భాగ్యమంతురాల నిన్నేమని పొగడేను
పూని నేఁదలఁచఁగానే బోరున వచ్చితివి"
12-318

భారకుఁడు : (7) వి. భారం వహించేవాడు, పోషకుడు. ఈ అర్థంలో ఇది విలక్షణప్రయోగం.
"తిరువేంకటాచలాధిపుఁడు దానె యుండె
పరిపాలనము సేయ భారకుండితఁడు" 1-170
బారకుఁడనే ప్రయోగం కూడా ఉంది.

భారపెట్టు : స.క్రి. భారం కలిగించు.
"భారపెట్టి దేహమెల్లా బడలించిన యాన
పారి మమ్మేఁచితి వింతి బదుకవో యాసా"
4-456

భారీతనముది : (భారీతనము + అది) వి. గొప్పతనం కల స్త్రీ, పెద్దతనం కల స్త్రీ.
"మేరతో నున్నదానికి మిక్కిలి కీర్తి గలుగు
భారీతనముదానికి పరులెల్లాఁ జుట్టాలే" 17-257

భార్గోటినరసింహుడు : వి. చిన్న అహోబలానికి సుమారు మూడుమైళ్లదూరంలో భార్గవతీర్థం అనే క్షేత్రంలో వెలసిన నృసింహస్వామి. నవనారసింహుల్లో ఒక స్వామి.
"మరలి బీభత్సపు మట్టెమళ్ల నరసింహ
నరహరి భార్గోటినరసింహో" 1-453

భాలాక్షము : వి. ఫాలము (నుదురు) నందలి కన్ను. భాలము ఫాలమునకు రూపాం.
"భాలాక్షముతో బ్రహ్మాండకోట్ల
కేలికవై నీ వెట్లుండితివో" 1-68

భాష్యకారులు : (4) వి; బహు. శ్రీభాష్యాన్ని రచించిన భగవద్రామానుజాచార్యులు.
"దొడ్డఁజేసె భాష్యకారులు, ప్రతిపాలించఁగలిగె
భాష్యకారులు
పైకొనఁగఁ గరుణించె భాష్యకారులు,
పంకమెల్లఁబోఁగడిగె భాష్యకారులు" 1-162

భు

భుజవేయు : (?)
"కోపులఁ బుణ్యములెల్ల గోవిందుని కిచ్చితిమి
పూఁపల స్వర్గముత్రోవ భుజవేయరో" 2-145

భువనేశ్వరము : వి. గృహవిశేషం, చుట్టుభవంతి.
"పువ్వుల తోఁటలనీడ భువనేశ్వరములోన
జవ్వనపు మనుజకేసరి వీఁడె" 4-512

భూ

భూపతి చెరు (ర్వు)వు : వి. కోనేరు. కోన్ అంటే ప్రభువు. కోనేరు అంటే స్వామి పుష్కరిణి అని సంపాదకులు. భూపతిచెరువు మరొకటున్నదా ఆలోచించాలి.
"మేరతో భూపతిచెరువు మేటి శ్రీవేంకటేశుఁడు
యీరీతి నన్నుఁగూడఁగా నీడ నాపె వుండెనా"
19-175

"చెప్పవయ్య నాతోను చెలి నీకెంత చుట్టమో
తెప్పల భూపతిచెర్వు తిరువెంగళప్పడా"
26-281

"చెన్నలర భూపతిచెరువుకాడ నున్నాఁడు
వెన్నెలబాయిట నాడీ వేఁకటేశుఁడు" 24-368

భూపతిచెర్వు తిరువెంగళప్పఁడు : వి. కోనేటి రాయడైన శ్రీవేంకటేశ్వరస్వామి; చూ: భూపతిచెరువు. 26-281

భో

భోఁసేయు : స.క్రి. 'భోంచేయు' పదానికి వ్యావహారిక రూపం. (?)
"యింట నే బోఁసేసేవేళ యెంగిలి ముట్ట వచ్చేవు
అంటకు మన్నంతలోనే అలిగేవు" 11-262

భోగరాయఁడు : వి. భోగముల ననుభవించే రాయుడు.
"గద్దెమీఁద నల్లవాఁడె కంటిరటే చెలులాల
పొద్దొక సింగారాల భోగరాయఁడు" 20-186

భౌ

భౌష్యము : వి. భవిష్యము, అదృష్టం. విలక్షణప్రయోగం.
"శ్రీవేంకటపతి సే విది యొకటే
భావించు నాయుష్యభౌష్యములు" 4-385
"అనంతుని పాదములే ఆయుష్యభౌష్యములు
దనుజారి పాదములే ధనధాన్యధర్మములు"
4-149

భ్ర

భ్రమత : (4) వి. ప్రేమ, మోహం.
"నాకు నాకే వెరగయ్యీ నన్నుఁజూచి
పైకొని మరుఁడు సేసే భ్రమతఁగాఁబోలును"
9-98

భ్రమయించు : (4) స.క్రి. మోహపెట్టు, భ్రమ కలిగించు.
"వూరకే వద్దఁగూచుండి వొళ్లిమీఁదఁజెయి వే
భారపుఁదురుమువట్టి భ్రమయించఁగా" 16-102

"అలర నుతించరో హరిని
యెలయించి మిము భ్రమయించీనిఁ గాలము"
1-338

భ్రమసు: భ్రమయును అనేదానికి వ్యావహారికరూపం.

భ్రా

భ్రాఁతి: వి. ప్రేమ (?)

మ

మంకుఁదనము: (16) (మంకు+తనము) వి. మొండితనం, మూర్ఖత్వం, గడుసుదనం.
"అంకెలో మెలఁగవలె ఆయములంటఁగవలె
మంకుదనమింత యేలే మగువలకు" 26-476
"జంకెన చూపుల నిన్ను సాధించదడవా
మంకుదనమేటికనే మాటకుగాక" 26-402

మంకు: (4) విణ. మొండి, మూర్ఖుడు, గడుసు వి. అవివేకం, మొండితనం.
"తెగరాని మంకులకు తెలిపి చెప్పుట మేలు
తగులైన యెడకు నాదరించఁబాడి" 24-282
"దీనికి అవివేకం, మొండితనం మొదలైన అర్థాలు ఉన్నాయి. కాని ఈ అర్థాలు ఈ కింది కీర్తనభాగంలో కుదురవు. ఇట ఆర్జవం, మంచితనం అని చెప్పుకోవాలి అని సం.ప.స. (14 సం. 354)
"మక్కువ నేర్చితిఁగాని, మంకు నేరనైతి"
14-548

మంకో మరులో: మూర్ఖత్వమో మరులో.
"మంకో మరులో మదమో ముదమో
జంకో లంకో జగడమో" 3-77

మంగలాన జాజులు వేఁచు: *ప.బం; అ.క్రి.* లలితమైన వాటిని పాడుచేయు, అనుచితమగు పనిచేయు. (పెనం మీద జాజిపూలను వేఁచు అని వాచ్యార్థం.)
"సంగతెఱఁగవు చీ జాణనందువు
మంగలాన జాజులు వేమారు వేఁచేవు" 5-4

మంగలోజు: వి. మంగలి.
"కాఁపుటూరి మంగలోజు గడెమీఁది రాజు గాఁగా
కాఁపులెల్లాఁ బనిమాసి కందినయట్టు"
4 అను. 31

మంగళసూత్రము: వి. తాళిబొట్టు గల సూత్రం, పెండ్లిలో వరుడు దీన్ని వధువు మెడలో కడతాడు.
"మందగొల్లెతల కెల్లా మంగళసూత్ర మీతఁడు"
4-526

మంగళాష్టకము: (3) వి. వివాహసమయంలో వధూవరుల శ్రేయస్సుకోసం పురోహితులు చదివే ఆశీర్వచనశ్లోకాలు.
"పలుకుల సరసాలు బలు మంగళాష్టకాలు
మలసి యవె మదనమంత్రాలు" 16-439
"మునులు మంగళాష్టకములు చదువుచుండఁగ
పెనఁగుచు సేసలు పెట్టే రదే" 14-110

మంగాంబుధి హనుమంతుడు: మంగాంబుధి (= మంగ సముద్రము) అనే గ్రామంలో వెలసిన హనుమంతుడు. ఈ మంగసముద్ర మెక్కడున్నదో తెలియరాదు. చంద్రగిరి సమీపంలో ఉన్న మంగాపురం అలమేలు మంగాంబ పేర ప్రఖ్యాతిచెందిన తాళ్లపాక వారి అగ్రహారం. మంగాంబ సముద్రరాజతనయ కనుక మంగాపురమే మంగాంబుధి కావచ్చునేమో! (సం.వా.ప.) నేటి మంగాపురంలో ఆంజనేయవిగ్రహాలు లేకపోలేదు.
"మంగాంబునిధి హనుమంత నీవే కాలము
చెంగట శ్రీవేంకటాద్రి శ్రీరామరక్ష" 4-459
"బలిమి శ్రీవేంకటేశు బంటై మంగాంబుధి
నిల యీ హనుమంతుని కెదురా లోకము"
4-462

మంచముకిందే నుయ్యి(నూయి): (6) *ప.బం; వి.* కనబడని పొంచి ఉన్న ప్రమాదం.
"మదినింత విచారించ మంచముకిందే నుయ్యి
కదిసి నంతటి మీఁదఁగా పనులు" 22-9
"మఱి విచారించఁ బోదే మంచముకిందే నూయి
మెఱయఁగ హరిఁగొల్చి మించరో ప్రజలు"
4-135

మంచముకోడు : వి. మంచముకాలు.
"మంచి పువ్వుదండ లాపె మగనికి నంపితేను
కొంచ కేల నీ మంచముకోటఁ జుట్టేవు" 26-272

మంచము చెంతనే నుయ్యి : ప.బం; వి. కనబడని పొంచి ఉన్న ప్రమాదం. చూ : మంచము కందే నుయ్యి.
"చింతించితేను మంచము చెంతనే నుయ్యి" 28-67

మంచమువంచు : ప.బం; అ.క్రి. మంచం వేయు, పడక వేయు.
"ముంగిటనే పాలుగాఁచి మూలఁ దోడంటు
సంగతిగా నప్పుడే మంచము వంచేవు" 8-198

మంచుకాలము : వి. హేమంతఋతువు, మంచుపడే కాలం.
"పలికే నీ మోవి పక్కులుగట్టె నేఁడు
కలికి యిప్పుడు మంచుకాలము గాదు" 26-94

మంచుకుఁబెట్టిన మైనపుఁ గుల్లాయ : ప.బం; వి. (?)
"మంచుకుఁ బెట్టినయట్టి మైనపుఁ గుల్లాయలు
అంచెల లవుడి(టి)పెట్టు లానఁబోయీనా" 10-1-33

మంచు గుంచానఁ గొలుచు : ప.బం; అ.క్రి. అసాధ్యమైన కార్యాలను నిర్వర్తించగలుగు. (మంచు కరిగిపోయే వస్తువు. దాన్ని కుంచంతో కొలవడం సాధ్యంకాని పని కదా! దీనిపై వచ్చిన పలుకుబడి.)
"మంచుఁ గుంచానఁ గొలిచే మరఁది వీఁడే" 5-260

"మంచు కుంచానఁబోసి కొలువగనేర్తు" అనే జానపదగేయంలో కూడా ఈ పదబంధం కనిపిస్తుంది.

మంచునీరు కుంచాలఁ బోయు : ప.బం; అ.క్రి.మంచునీటిని కుంచాలతో కొలుచు. అసాధ్యమైన దానికి పూనుకొను.
"మాయలఁబెట్టుచు నీవు మంచునీరు కుంచాలఁ
బోయుచు నన్నేఁపక పోయేవో పోవో" 5-285

మంటఁగలిసి పోవుట : ప.బం; వి. నశించడం.
"కలుషబుద్ధులఁ బ్రజ్ఞగల దింతయును మంట
గలిసిపోవుటే పూర్వకర్మశేషం" 1-113

మంటఁజేసిన బొమ్మ : ప.బం; వి. అస్థిరం. మట్టితో చేసిన బొమ్మ అస్థిరమే కదా!
"మంటఁజేసిన బొమ్మ మనికి సంసారంబు
రెంటికిని గాని వీరిడి కొలువు బ్రదుకు" 1-104

మంటమారి : (మంట + మారి) వి. కోపిష్ఠి.
"నగినందుకుఁ బతితో నాఁటఁ గోపించుకొంటేను
మగువా అది మంటమారి గాక" 12-393

మంటికి : నిరుపయోగము.
"అందిన శ్రీవేంకటేశుఁడంతరాత్ముఁడొక్కఁడింతే
మందలించి కొలువరు మంటికా మీ జ్ఞానము" 3-65

మండాటము : (4) వి. బ్రతిమాలుట, దైన్యంతో యాచించడం, పరితాపం అని ఆం.ప.ని.
"మా మండాటాలకు నీకు మన్నన లొసఁగవమ్మ
నాముదేర మగనితో నవ్వవమ్మా" 28-137

మండాడు(కొను) : అ.క్రి. దైన్యంతో యాచించుకొను.
"ఇవల నీసేవ సేసి ఇన్నిటా మండాడుకొంటి
అవి యేల తలఁచేవు ఆ సుద్దులు" 26-229
"మన్నించనేర్తువు నీతో మండాడేవారమా" 21-77
"మానరే ఆతని నేల మండాడేరు
కానుక మా మొక్కులివి కడ్డాయము గాదు" 7-593

మండెము : వి. కడపజిల్లా రాయచోటి మండలం లోని చినమండెం అనే గ్రామం, ఇది నృసింహస్వామి వెలసిన క్షేత్రం.
"చెలఁగి మండెములోన శ్రీవేంకటేశ కూడితి
నలువంక చెలులతో నవ్వే నేను" 27-360

మండెము నారసింహుడు (నృసింహుడు) : చూ : మండెమురాయడు.
"నవగుణి వేంకట నారసింహా వో

నవమూర్తి మండెము నారసింహా" 1-259

మండెమురాయఁడు : (5) వి. కడపజిల్లా రాయచోటి మండలంలోని నేటి చినమండెం అనే గ్రామంలో వెలసిన నృసింహస్వామి. ఈతడు నవమూర్తి నారసింహుడని కీర్తింపబడినాడు.

"యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
మారుని తండ్రివి నీవే మండెమురాయఁడవు"
7-513 & 10-2-66

మండ్రాడు : అ.క్రి. 1.పెనఁగులాడు, మల్లాడు 2.శ్రమపడు, బాధనొందు.

"మండ్రాడి తల్లిపైఁ జేసే మచ్చికెల్లా నీది
నిండ్రు(?) దల్లిలో వాఁడవు నీవె కనక" 15-144

మంతిరించు : స.క్రి. మంత్రించు, రహస్యంగా చెప్పు.

"మగువకుఁ జెవిలోన మంతిరించినవే కావా
పగటున నందరినిఁ బరచుమని" 13-491

మంతు : (3) వి. ప్రసిద్ధి.

"మంతుకు వలపుపూసి మఱి నేరేడులమ్మీని
సంతసపుటిసుకలో చద్దివేఁడి పండులు" 17-336

మంతుకెక్కు : (27) ప.బం; అ.క్రి. ప్రసిద్ధికెక్కు, వార్తకెక్కు. సం.ప.స. లో ఈ పదవివరణ ఇట్లా ఉంది. 'మంతు' అనగా మాట. మాటామంతీ అనే జంట పదంలోని 'మంతి' కూడా 'మంతు' వికారమే. 'పదిమంది చెప్పుకొను మాటలలోనికి వచ్చు' అనే అర్థంలో ఈ పలుకుబడి యేర్పడింది. 'వార్తకెక్కు' ఇలాంటిదే.

"ఇంతకంటెఁ జెలులాల యేమి చెప్పే రతనికి
మంతుకెక్కి తన్నుఁదానె మంచిదయ్యీఁ గాక"
21-16

"చెంతనుండి కొంతవడికి సిగ్గుపడవచ్చుమగాని
మంతుకెక్కిన వలపు మఱవరాదయ్యా"
29-5 అను.

"మంతుకెక్కిన ద్రౌపదీమానరక్షకుఁడీతఁడు
చెంతనే వుధ్ధవుపాలి చింతామణి యీతఁడు"
4-526 & 2-506

మంత్రాలు మందులు : ప.బం; వి; బహు. మాయలు - మందులు అనే అర్థంలో జంటపదం.

"విందును నీ కతఁడు నోరెత్తకుండ మంత్రాలు
మందులు నేరుతువుగా మా యమ్మ" 5-359

మంత్రించుకొను : వశం చేసుకొను.

"చిత్తగించి తగవులు చెప్పే దిందులోనేమి
మత్తిలి పచ్చిమాటల మంత్రించుకోవయ్యా"
13-428

మందగొల్లెత : వి. గొల్లపల్లెలోని గొల్ల స్త్రీ.

"అందపు శ్రీవేంకటేశ! ఆండ్లు గారా తాము నీకు
మందగొల్లెతల నెల్లా మర్మాలెత్త నోపనా"
25-257

మందటలాడు : (3) (మందటలు + ఆడు) అ.క్రి. 1.తగవులాడు 2. ఎదిరించు 3. కలియు.

"మనసిచ్చి యాపె నీతో మందటలాడితేను
చొనిపి నన్నేల నీవు చుట్టుకొనేవు" 21-94

"యిందు రమ్మని పిలువ యేలుకొన్నదాననా
మందటలాడి పెనఁగ మంకుదాననా" 27-268

"కందువకు రాఁగాను కాఁగిటఁ గూడితిఁ గాక
మండటలాడఁబోతేను మత్సరించేనా" 27-84

మందటాడు : (3) (మందట + ఆడు) అ.క్రి. జగడమాడు. (మందట = కలహం)

"మందటాడ నేమిటికి మచ్చికసేయఁదగును
అంది పదారువేలఁ బెండ్లాడినందుకు" 18-352

"మాకు మీకే మందటాడి మీరు మీరే మీలోన
ఏకమై కూడితిరి మీరిందుకా యిది" 5-106

మందడిసాని : వి. గొల్లస్త్రీ, గొల్లభామ.

"మందడిసానుల కమ్మని మోముఁదమ్ములకు
చెందిన తుమ్మెదవో మా శ్రీకృష్ణుఁడు' 11-343

మందడీఁడు : (మందడి + ఈఁడు) గుబ్బవాడు, మందురకుడు.

"మందడీఁడవా వోయి మంకులెల్లా నెరపేవు
విందు చెప్పి చెక్కు నొక్కి వేఁడుకొనఁగాను"
23-551

మందపిలు : అ.క్రి. ఈ శబ్దం సూ.ని. లో కానీ శ.ర. లో కానీ లేదు. ఇది 'మందటిలు' కావచ్చునేమో! మందటిలు కు 1. ఉడుగు, నిలచిపోవు, క్షీణించు 2. మిన్నకుండు, ఊరకుండు 3. మెండుకొను, అతిశయించు అని అర్థాలు. వీటిలో మొదటి రెండర్థాలు అన్నమయ్య కీర్తనల్లో పొసగుతాయి.

"పట్టరాని విషముల పాముఁ దెచ్చి తలకిందఁ

బెట్టుకొన్నా నది మందపిలివుండీనా" 1-177

మందపెండ్లికూఁతురు : వి. గొల్లపల్లెలోని పెండ్లికూతురు, గొల్లపెండ్లికూతురు. (మంద = గొల్లపల్లె)

"సందడిఁ జేతులు చాఁచి జవ్వనములంటి యంటి

మందపెండ్లి కూఁతులను మరగించేవు" 17-7

మందప్రోయాలు : వి. గొల్ల ఇల్లాలు, గొల్ల స్త్రీ.

మందబోయిరాలు : వి. గొల్లస్త్రీ.

"మందబోయిరాండ్లను మానముపైఁదిట్టుకొంటా

అంది పోఁకముడి విడి చాడుకొంటాను" 21-327

మందమిరియాలు : (4) వి; బహు. వ్యర్థం, ఎవరికీ ఉపయోగపడనివి.

"మాటలాడఁబోయి చెలి మందమిరియాలు చల్లె" 23-583

"మందమిరియాలు వో నీ మాటలు

నిందలకు గురివో నీ నీటులు" 9-116

మందమిరేలు : వి; బహు. మందమిరియాలు.

"అందరివలెనే చూచేవప్పటి నన్ను నీవు

సందడి మందమిరేలు చల్లఁగా నేను" 23-428

మందవారము : వి. శనివారము; ప్రసిద్ధమైన ఈ పదం ప్రసిద్ధములైన శ.ర; సూ.ని., ఆం.వా., మొ॥ నిఘంటువుల్లో ఎందుకో ఎక్కడా చేరలేదు.

"జగతి వైశాఖశుద్ధచతుర్దశి మందవార

మగణితముగఁగూడె నదె స్వాతియోగము"

14-285

మందవారి మరది : వి. గొల్లవారి మరది, శ్రీకృష్ణుడు.

"మాననీఁడు వుంటి నోవి మరఁది వీఁడే

మానముపై చేయి చాఁచీ మందవారి మరది"

5-260

మందవారు : వి; బహు. గొల్లవారు.

"జంకెనలవారమా సరసపువారమూ

మంకుమంకుమాటల మందవారమా" 6-83

మందావు కల్లలు మావులెల్లా మొగ్గలు : (?)

18-259

మందుమంతరము : ప.బం; వి. రోగాన్ని మాన్పే మందూ మంత్రం అనే అర్థంలోని జంటపదం.

"మానని పుంటికి మందుమంతరము లేని

గోనెఁబట్టిన బంక గోడమీఁది మన్ను" 15-462

మందులాఁడి : (మందులు + ఆఁడి) మర్లు మందులు పెట్టేది, వశ్యౌషధాలు పెట్టేది. మందులమారి అనడం సహజం. 'మందులాడి' ప్రయోగం విలక్షణం.

"ముప్పిరి నది యంతటి మొగమాయ మందులాఁడి

విప్పుచు నీతో విన్నవించరాదు గాక" 29-171

మందులు నూరు : (3) ప.బం; అ.క్రి. ప్రతికూలపరిస్థితులు కల్పించు, విరోధం కల్పించుకొను.

"మాటకు మునుపనే మందులు నూరేవుగాని

గాఁటపు గుబ్బల దగ్గర వేలరా" 19-428

"దూరి మాటాడ నోప మందు లట్టె నూరకురా"

11-365

మందులు మంత్రాలు : (2) వి; ప.బం; బహు. రోగాలను పోగొట్టే మందులు మంత్రాలు అనే అర్థంలో జంటపదం.

"మందులో మంత్రాలో నీకు మరి పంపు చేసుకొనె

సందడి నీపెండ్లాడి నీ సగినాలు మంచివే"

25-64

మందులు మాయలు : (2) *ప.బం; వి; బహు.* మందులు - మంత్రాలు అన్న అర్థంలో జంటపదం.

"మందులు మాయలు మఱచితివో యిప్పు

డిందూ నామీఁద నింకాఁ జేసేవో" 6-69

మందెమేళము : (51) *వి.* 1. చనవు, అతిపరిచయం, జంకు కొంకులు లేకపోవడం 2. స్నేహం 3. ఉపేక్ష 4. గర్వం 5. గేలి, పరిహాసం.

చనవు :

"మందెమేళాలు సేసుక మలసి సొలసి నవ్వి

సందుసుడిఁ దన మోవి చాటు చూపీని" 17-4

పరిహాసం :

"మగనితో నేల మందెమేళాలు,

సొగిసి యిచ్చకములే చూపవలెఁగాక"

ద్వేషం అని ఆం.ప.ని.

మందెమేళములది : *వి.* చనవుగలది, స్నేహం కలది, గర్వం కలది.

"ననుపున నీతోను నవ్వులు నవ్వమనేవు

మునుకొని మందెమేళములదానవా" 25-228

మందెమేళములాడు : (2) *అ.క్రి.* పరిహాసమాడు

"విందుల మోవి చూపి విడె మడిగేటివాని

మందెమేళములాడుచు మారుకొందురా"

19-38

మకరాల చీర : *వి.* మొసలిబొమ్మలు గల చీర.

"వినుకలిఁ జొక్కఁగాను వెస మరుఁడేఁచితేను

ఘనమకరాల చీర గట్టె నతివ" 14-528

మక్కళము : *వి.* నక్షత్రం (?), (అధికం)

"వెలుపట మక్కళాలు వేఁగుదాఁకా నుండరో"

3-525

"మక్కళంపు మంకులతో మాటలాడ రిద్దరును

వొక్కటై యుండుండి మీకు నొరటులు వచ్చెఁగా"

17-304

మక్కళించు : *స.క్రి.* 1.ఉబికించు 2.సరిచేయు, సమానం చేయు 3.కూర్చు, అమర్చు 4.పెంపొందించు (తె.వ్యు.కో.) *అ.క్రి.* 1.జ్వరాదిరోగం తిరుగబెట్టు 2.కలియు 3.వ్యాపించు (సూ.ని.) అనువుపడు, పోల్చు, వ్యాపించు(పర్యాయ.) ఆవర్తించు, సవరించు, సదృశము (ఆం.ప.ని.)

"మక్కళించి మక్కళించి మాటలు నీవాఁడఁగాను

గక్కన నా మన సెల్లఁ గరఁగెనిదె" 21-289

మక్కు : *వి.* మాలిన్యం (తుంటి, లప్పం, గాయం) (*అ.క్రి.* 1. కాంతివిహీనమగు 2. నవయు 3. చచ్చు శ.ర.) *విశే.* మలినమైన.

"మక్కుఁజెమటలు గాని మదనరసాలు గావు"

17-252

మక్కువేయు : *ప.బం; స.క్రి.* అతుకు.

"గుక్కక నా దీమసము గోడవంటిది యెంతని

మక్కువేసే తానే చూచి మమ్ముఁ గాచీఁగాక"

12-261

"మొక్కు మొక్కవచ్చుఁ గాక మొగముపై నగవులు

మక్కువేయవచ్చునా మాపుదాఁకాను" 27-39

మగఁటిమి : *వి.* శక్తి, సామర్థ్యం. (శౌర్యం, పౌరుషం, మగతనం)

"మగఁటిమి మీ వాదులు మానుపఁగద గదా"

27-382

మగఁడులేని మనువు : *ప.బం; వి.* మగడు లేని పెండ్లి, అసంభవం.

"మక్కువ మగడు లేని మనువు గలుగునా"

2-130

మగఁడు లేని సింగారము : *ప.బం; వి.* వ్యర్థం.

"మరుగురునికిఁగాని పూవులపూజలు

మగఁడు లేని సింగారములు" 2-235

మగఁడు విడిచినా మామ విడువనియట్టు : నానుడి; అసలువాడు వదిలిపెట్టినా పైవాడు వదలనట్లు, ఒకబాధ తప్పినా మరో బాధ తప్పనట్లు.

"మగఁడు విడిచినా మామ విడువనియట్టు

నెగడిన నేమి సేయు నేనే రోయఁగాని " 2-476

మగండ్లు: *వి; బహు.* 'మగఁడు' శబ్దానికి బహువచనరూపం. ఇది విలక్షణరూపం. మగలు అని వ్యాకరణసిద్ధ రూపం.

"తెగువ సేసి నీకుఁ దెచ్చిరి బోనములు
మగండ్ల మాటదోసి మౌనిసతులు " 3-198

మగనాలు: (6) (మగని + ఆలు) వి. మగడున్న స్త్రీ, ముత్తైదువ.

"మగనాండ్లము మమ్ము మన్నించవయ్యా
అగడు సేయకువయ్యా అప్పటిని మొక్కేము "
12-540

మగపాడి: వి. శౌర్యం, మగటిమి, ఉపరతి, పురుషధర్మం.

"యెగసక్కేలు నిన్నాడి ఇంతలోనె పంతమిచ్చి
మగువ గాఁగిలించుటే మగపాడి సుమ్మీ " 23-68

మగపారి: (?)

"తిరుపణి మణఁగెను తిరుగరా దెవ్వరికి
మరల నెలుగియ్యరో మగపారి " 15-118

మగుటవర్ధనుఁడు: వి. (?)

"మగుటవర్ధనులు మండలేశ్వరులు
జగదేకపతులుఁ జతురులు" 1-346

మచ్చము[1]: (29) వి. మచ్చ (క. మచ్చ, త. మచ్చె) గుఱుతు, కళంకం, మాలిన్యం, మఱక.

"తచ్చి తనపై మచ్చము తాఁజూచుకోరాకుంటే
అచ్చలాన నద్దమైనా నట్టె చూడుమనవే "
21-217

"కాయముపై మచ్చములు కడు సింగారమా "
21-320

మచ్చము[2]: (2) వి. మత్స్యమునకు వికృతిరూపం. చేప.

"చెక్కుల మకరాంకము జిగిఁగన్నుల మచ్చములును
మిక్కిలి శంఖము మెడను మీఁగాళ్లఁ గచ్ఛపములు" 9-201

"వారధిలో మచ్చకూర్మావతారము లైననాఁడు
నీరులో జంతువునైనా నీవు గాతువుగా" 15-6

మచ్చమువట్టు: వి. గుట్టుపట్టు, జాడపట్టు.

"మలసి వాడుఁజూపుల మచ్చమువట్టినా"
11-361

మచ్చికసుద్ది: వి. మోహపుమాట, ప్రేమవాక్యం.

"పచ్చిదేర నప్పటిని పానుపుపైఁ గూచుండి
మచ్చికసుద్దులు విని మరుగఁజేసితివి " 26-557

మచ్చికె: (12) వి. 'మచ్చిక'కు వ్యావహారికరూపం, మోహం, ఆసక్తి, వలపు, స్నేహం, చనవు, భ్రమ.

"ఇచ్చకమాడితిమీ యింతగా నోడితిమీ
మచ్చికె లింకా మాతో మానవా అయ్యా "
11-560

మచ్చు: వి. చొక్కుమందు, వశ్యౌషధం, పరవశం చేసే భస్మవిశేషం, మృగాలు మొ॥ వలలో పడడానికి వలకు దగ్గరగా ఉంచే ఆహారం, ప్రలోభం.

"ఏఁటి బుద్ధులు చెప్పరే యింకా నీకు
మాఁటలాడుట గాక మచ్చు చల్లేదా" 8-61

మచ్చుమేపు: (3) వి. మరులుమందుల ఆహారం.

"మంచిమాటలే కావా మచ్చుమేపులు " 21-226

మచ్చుల పాయము: వి. యౌవనం (?)

"మచ్చులపాయములోని మంపు నా మతి "
26-210

మచ్చెము: (3) వి. మచ్చము, గుర్తు, చిహ్నం.

"మచ్చెము నీ మై యుండఁగా మరియేల
జంకించేవు" 29-98

"మెలుపు మచ్చెములు నీ మేన నిండివుండఁగ
తలమోచి యెన్నెన్ని తప్పులు వట్టేను " 23-404

మచ్చెము: మిక్కిలి (?)

"మచ్చెము చిక్కెను నీ మనసు నామీఁదను
వొచ్చెము లెల్లాఁదీరె నొడఁబాట్లేలయ్యా" 8-226

మచ్చెము: వి. మత్స్యము శబ్దానికి వికృతి రూపం. చేప.

"పొంచి మచ్చెమైన నాఁటి పొలసుకంపులు వాయ
సంచులఁ బన్నీట మజ్జనమార్పరే" 7-198

మజ్జనమిల్లు : (మజ్జనము + ఇల్లు) వి. స్నానగృహం. (bath room)
"జలజాక్షి నీ పతి మజ్జనమింట నున్నవాఁడు
జలక మందియ్యవే సంతోసానను" 24-401

మజ్జాతి : వి. ప్రకరణాన్నిబట్టి వంచన కావచ్చు అని సంపా.
"పలువూడిగాలు సేసే భామలకందరికి
చలివాసి కూడేది మజ్జాతి నీకు నయ్యా"
25-346
"మాతో నింకానా మజ్జాతా యను మాకు (?)
చేతికి లోనైనమీఁదఁ జెప్పవలెనా" 8-151
"నవమై శ్రీవేంకటేశ నాకె మజ్జాతి గాక
నివిరి వేరొక్కతైతే నీతోఁ బొందుసేసెనా"
11-347

మటమాయతనము : వి. మటుమాయతనమునకు రూపాం. మిక్కిలి మోసం, మిక్కిలి టక్కరితనం.
"మటమాయతనమున మగువలు మగవారి
సటకారితనమున సాధింతురు" 18-201

మటమాయము : (2) వి. 'మటుమాయము'నకు రూపాం. మిక్కిలి మోసం, టక్కరితనం.
"మటమాయపుచవి మానేనా" 4-69

మటమాయలు : (మాయలు+మాయలు) మిక్కిలిమోసాలు, టక్కరితనాలు.
"మటమాయలకు నీవు మరి వలపు చల్లేవు
తటుకున చెమటల తడి చూపవయ్యా" 18-551

మటము[1] : వి. 'మఠము'నకు జానపదుల వ్యవహారం. సన్యాసులు నివసించే స్థానం.
"కూరిమి మటములు గోపురంబులును
తేరుపడెగెలే తెరువెల్లా" 1-119

మటము[2] : వి. మొండితనం, పంతం. శ.ర. లోనూ, తె.వ్యు.కో. లోనూ దీనికి కూర్చునే తీరు అనే అర్థం ఉంది. ఈ అర్థం క్రింది ఉదాహరణల్లో పొసగదు.
"మటము లేల నన్ను మన్నించుమనవే"
17-227

మటుమాయములు : వి. మిక్కిలి మోసములు, మిక్కిలి మాయలు.
"అటువంటి సతిఁగాని యాదరించవు
మటుమాయముల మాటు మందులే నీకు"
7-82

మట్టమధ్యాన్నము : వి. మిట్టమధ్యాహ్నం. (మధ్యాహ్నము నకు 'మధ్యాన్నం' అనేది జానపద వ్యవహారం.)
"మట్టమధ్యాన్నపువేళ మలయుచు నింటిలోనే
చట్టుల పెరుగు వేఁడీ చాలఁబెట్టరే మీరు"
24-160

మట్టము : వి. అల్పము, కొద్ది, సమానము.
"మట్టపు మలపుల మట్టెల కెలకుల
తట్టెడి నడవుల దాటెనదె అలరులు గురియగు"

మట్టిన చోటు : వి. తిరిగినచోటు.
"నెట్టన శ్రీవేంకటేశ్వర నీతోఁగూడఁ జగములు
మట్టిన చోటే మట్టే మనుజులమిదె నేము"
3-340

మట్టినచోటే మట్టు : ప.బం; అ.క్రి. తిరిగిన (తొక్కిన) చోటే తిరుగు.
"నెట్టన శ్రీవేంకటేశ్వర! నీతోఁ గూడఁగ జగములు
మట్టినచోటే మట్టే మనుజులమిదె నేము" 3-340

మట్టు : (20) వి. 1.మితి 2.పరిమాణం 3.ప్రదేశం 4.అందం 5.విధం 6.కుదురు 7.అమరిక 8.మర్యాద 9.ఆధారం 10.పర్యంతం, పాఁతు 11.తొక్కుడు (సూ.ని.) 12.హ్రస్వం, తక్కువ. (ఆం.ప.ని.)
"ఆఁటది గర్వించితేను అంతట మట్టెరఁగదు"
24-382
"మట్టున నిందాకా నాపె మంకులు దెలిపితిమి"
25-350

"మట్టు లేని రామానుజమతము చేకొనుటే"
2-334

"మనసెల్ల నడ్డవెట్టి మట్టున నుండేనంటే
మనసు కోరికలు నీ మతకాలు" 1-466

మట్టు : స.క్రి. 1.తొక్కు 2.అణగదొక్కు 3.అధఃకరించు 4.బాధించు 5.చుట్టుముట్టు 6.పడవేయు 7.ప్రవేశించు.

"మట్టినచోటే మట్టే మనుజులమిదె నేము"
3-340

మట్టుకుమట్టు : ప.బం; వి. మితికి మితి, మేరకు మేర.

"కలసేనంటా మేను కడుఁబిప్పిసేయరాదు
వొలసి మట్టుకు మట్టే వుండవలెఁగాని" 23-234

"తరితీపు సేసేనంటా దండకు రాకుండుదురా
మరిగిన మగనితో మట్టుకుమట్టే కాక" 27-526

మట్టుకువచ్చు : అ.క్రి. దారికి వచ్చు, కుదురుకు వచ్చు, మాటవిను. మట్టుమర్యాద లోని మట్టు ఇది.

"మంకుదీరి తనుఁదానె మట్టుకు వచ్చును"
11-177

మట్టుకొను : అ.క్రి. కుదురుకొను, నెలకొను.

"మట్టుకొని వేణురవమున గొల్లెతల చీర
లట్టునిట్టు వదలించి నాతఁడౌదో కావో" 5-180

మట్టుపడు : ప.బం; అ.క్రి. కుదురుకొను.

"వొరసి దుర్గుణములను నూనిన నా చిత్తము
మరలి మంచిగుణాన మట్టుపడీనా" 4-345

మట్టుమీరు : (2) మితిమీరు, అతిశయించు, అతిక్రమించు.

"మట్టుమీరఁ జనవిచ్చి మన్నించితివయ్యా"
12-41

మట్టుమేర : ప.బం; వి. అడ్డు, సరిహద్దు.

"ఎదురులేక చరింతు రెట్టైనా శ్రీవైష్ణవులు
మదించి నేనుగులకు మట్టుమేర వున్నారా"
3-401

మట్టెమల్ల నరసింహము : వి. చూ: మట్టెమల్ల నరసింహుఁడు.

"నాఁటుకొన్న భార్గవూటు నరసింహము వీఁడె
నాఁటకపు మట్టెమల్ల నరసింహము వీఁడె"
4-182

మట్టెమల్ల నరసింహుడు : వి. పెద్ద అహోబలానికి నాలుగు మైళ్లదూరంలో ఉన్న మట్టెమల్ల అనే ఊరిలో బీభత్స రూపంలో వెలసిన నరసింహస్వామి. నవనారసింహుల్లో ఒక స్వామి.

"మరలి బీభత్సపు మట్టెమల్ల నరసింహ
నరహరి భార్గోటి నారసింహా" 1-453

మడమె : వి. మడమ, గుదికాలు, పాదంవెనుక భాగం.

"మడమెలదాఁకా వీడె మగువ నెరిఁగురులు
తడవి యెంత సదమదము సేసితో" 23-426

మడిదున్నుకొని బ్రదుకు : ప.బం; అ.క్రి. పొలం దున్ని జీవించు. 11-2-27 old

మడిదొసకులు : వి; బహు. (?)

"మడిదొసకులు గావు మధుసూదనా నాకు
మడుకపన్నాయె మేలు మధుసూదనా" 15-242

మడుఁగు : అ.క్రి. 1. అడఁగు 2. నమ్రతనొందు 3. వంగు.

"యిరవై యలమేల్మంగ నేలిన శ్రీవేంకటేశ
మడుగనివారికి మట్టుతో నుండుదువు" 15-397

మడుఁగులుబ్బు : వి. వస్త్రాలు పొంగు. (వ్యు.)

"కులికి శ్రీవేంకటేశ కూడితివి వయోమద
మెలమి మడుగులుబ్బె నెంత బంటో యిఁకను"
8-190

మడుక : వి. జేన. ఏడు జేనల దేహమని అన్నమయ్య వర్ణిస్తుంటాడు. కనుక ఇట 'మడుక' అంటే జేన అనే అర్థం యుక్తంగా కనిపిస్తుంది.

"ఏడు మడుకల చర్మ మింతయునుఁ దూంట్లై
గాడఁబెట్టుచుఁ జీము గారఁగాను" 1-77

మడుగుఁజీర : వి. తెల్లనివస్త్రం, పరిశుభ్రమైన వస్త్రం, వస్త్రం.
"మడుగుఁజీర మడిచి మడిచి కట్టుకొంటివి
తొడిఁబడఁ, బిరుదిది దొడ్డాయ నటవే" 18-292

మడుగులోపల మైల : స్వచ్ఛమైన వస్తువుకు ఏర్పడిన మైల.
"కడు వేంకటేశ్వరుని కౌఁగిటను పరవశము
మడుగులోపలి మైల మానదీ చెలికి" 6-70

మడ్డు : వి. ఇనుపగుండు.
"దోసిట మడ్డెత్తే వేళ తోడై వచ్చే దైవము"
15-319

మడ్డువట్టు : *ప.బం; అ.క్రి.* తనయెడ అపరాధం లేదని నిరూపించుకోవడానికి ఎఱ్ఱగా కాలిన యినుపగుండును పట్టుకొని ప్రమాణం చేయు. పూర్వం ఇలాంటి ప్రమాణాలు చేయడం అలవాటు. నేటికీ ఎఱుకలు మొదలైన ప్రాచీనజాతుల్లో ఈ అలవాటు కానవస్తుంది. (పద.) (మడ్డు= గుండు) ఇట నాలుక కాల్చుకొని ప్రమాణం చేయు అని అర్థం కావచ్చు.
"ఎనసి యెవ్వతెకొ మోహింతువని నీ మోవి
మనసార నాలిక మడ్డువట్టేరా" 5-90

మతంగగిరికాడి హనుమంతుఁడు : వి. హంపీలోని మతంగగిరి దగ్గర నున్న హనుమంతుడు, మతంగగిరి కాడ నున్న హనుమంతుడు. ఇట 'కాడ' అనే శబ్దంమీద సంబంధార్థంలో 'ఇ' చేరింది.
"అందరిలోనా నెక్కుడు హనుమంతుఁడు
కందువ మతంగగిరికాడి హనుమంతుఁడు"
2-207

మతంగపర్వతమాడ : హంపీలోని మతంగపర్వతం దగ్గర. ఆడ అనే పదాన్ని స్వతంత్రంగా కాక ఒక పదానికి అనుబంధపదంగా వాడడం విలక్షణం.
"మరిగి రేయుఁబగలు మతంగపర్వతమాడ
బిరుదులతోడను బెరసీ వాఁడే" 4-158

మతంగపర్వతము : వి. హంపీలోని మతంగపర్వతం. 4-158

మతకములు : వి. మాయలు.
"మనసెల్ల నడ్డపెట్టి మట్టున నుండేనంటే
మనసు కోరికలు నీ మతకాలు" 1-466

మతకరితనము : (2) (మతకము + అరి + తనము) మాయావి లక్షణం, మాయలమారితనం, కపటం.
"మతకరితనములు మాతో నేమిటికి
తతి వచ్చినందుమీఁద దాఁచవచ్చునా" 26-409

మతకరివాఁడు : (2) (మతకము + అరి + వాఁడు) మాయావి.
"మతకరివాఁడవు మాయదారి ఆపె నీకు
ఇతవుగ మరుఁడు మిమ్మెట్టు గూర్చెనయ్యా"
20-577
"సన్నలేల సేసేనే తా జాణ శ్రీవేంకటేశుఁడు
మన్నించుమనవే మతకారివాఁడు" 12-535

మతిఁబెట్టు : *స.క్రి.* భావించు, ఆలోచించు.
"సందడి నీతో సరసములాడఁగ
మందెమేళమని మతిఁబెట్టుదువో" 20-365

మతించు : *స.క్రి.* తలఁచు, ఊహించు (సూ.ని.) ఇట అంగీకరించు, గౌరవించు అనే అర్థాలు ఉచితంగా ఉంటాయి.
"మతించిన కౌస్తుభమణి నిలువుటద్దము
మితి లేని శ్రీవత్సము బండారుముద్ర" 9-299

మతిచొచ్చు : *అ.క్రి.* మనసులో చొచ్చు.
"ఇతరులవలె నన్ను నెంచకురా నీ
మతిచొచ్చి నీ మేను మఱపింతు నోరి" 5-10

మతిపరవశము : వి. మతిపారవశ్యం.
"ఇంతలో శ్రీ వేంకటేశ ఇట్టె నన్నుఁగూడితివి
మంతనాలకెల్లా గురి మతిపరవశమే" 20-302

మతిమాలు : *ప.బం. అ.క్రి.* భ్రంశమగు. 1-63

మత్తాయిగొను : *అ.క్రి; ప.బం.* మదించు, మత్తెక్కు.

"యెక్కెడిని నానాఁటికి మదమెంతైనా నజ్ఞానమున
యెక్కుడి నీ సంసారమే హరి యెదుటనే మత్తాయిగొన్నట్లు" 3-88

మదనచిన్నలు : వి. మన్మథచిహ్నలు, నఖక్షతాదులు.
"నీ వలమేలుమంగవు నిన్నేలే శ్రీవేంకటేశుఁ
డీవల మదనచిన్నలే గంపగమ్మేవే" 29-360

మదనముద్ర : (3) వి. మన్మథముద్ర, నఖక్షతాదికం.
"దాఁపరాని మదనముద్రలు మేన నవె నీకు
నేఁపుచు భ్రమలఁబెట్టి యెవ్వతె సేసినవో" 5-29

మదనమెత్తు : అ.క్రి. మత్తెక్కు.
"సన్నపుఁజెమట నొసలఁబొడమ
మిన్నక మదనమెత్తె ననుచు
మెలుఁత తమ్ముల ముమియున" 6-50

మదనరసము : వి. శృంగారరసం.
"వెదకి వెదకి నిన్ను వెలఁది కెంగేలు వట్టి
మదనరసము చింది మరి సిగ్గువడెను" 14-351

మదనరేకలు : వి. మన్మథరేఖలు, మన్మథచిహ్నలు .
"కడుఁగాక తన మేను గాఁగిలించఁబోతేను
యెడసి మదనరేక లేఁడ రేఁగునో" 20-255

మదనవిద్య : వి. కామశాస్త్రం.
"చిక్కితి వెక్కడికి విచ్చేసేవు నిన్ను నే
దక్కగొని మదనవిద్యలనే చొక్కింతువా" 5-81

మదనవేదము : వి. రతిశాస్త్రం.
"మదనవేదాలెల్లా మాటల నమలఁజొచ్చె
అదె శారికల కెందు నాజ్ఞ లేదు" 26-533

మదనుని చదువు : వి. రతిశాస్త్రం, కొక్కోకం.
"పెదవులు గదలియుంగదలని మదనుని
చదువులు నాఁడవి చదువవుగా" 6-130

మదమత్సరము : వి. మదమాత్సర్యములు ; ద్వంద్వంలో ఏకవచనం.
"మదమత్సరము లేక మనసు పేదై పో" 1-59

మదిమదినుండు : ప.బం; అ.క్రి. నిశ్చింతగా నుండు, నెమ్మదిగా నుండు.
"మదిమదినుండే కాయక్లేశము
మాఁటికి మాఁటికి దన కేలా" 2-236

మదిరాక్షి : (2) (మదిరా + అక్షి) మదం కప్పిన కన్నులు గల స్త్రీ, స్త్రీ.
"కదసి యాతనితో నేకతాలు నీవాడఁగాను
మదిరాక్షులతో నేల మాఁటలాడీనే" 29-19

మద్దులు మారేళ్లు మోచు : ప.బం. చెట్లను కొనిపోవు అని లాక్షణికార్థం.
"వద్దు వద్దు మాఁటలనే వలపుల యేరువారి
మద్దులు మారేళ్లు మోఁచె మానరాదా యిఁకను"
20-233

మద్దెలలోని యెలుక : (2) ప.బం; వి. ఒకచోట నిలువక తిరిగేది. మద్దెలలో ఉన్న ఎలుక తానున్న పరిధిలోనే అటూ ఇటూ తిరుగుతూ ఎక్కడా నిలువలేక ఉంటుంది.
"మతిచంచలపువాఁడు మద్దెలలోని యెలుక
వ్రతియై కోరెడువాఁడు వలలో మీను" 15-378
"మద్దెలలో నెల్క మర్యాద" అని **హం.విం.** ప్రయోగం.(1-22)

మద్దేనము : వి. 'మధ్యాహ్నము' అనేదానికి జానపద వ్యావహారికరూపం.
"పంతము లాడఁగానే పడుమటజామాయ
మంతన మాడేకొద్దికి మద్దేన మాయ" 14-145

మద్యాన్నము : (2) వి. 'మధ్యాహ్నము' అనేదానికి జానపద వ్యావహారికరూపం. పట్టపగలు.
"పొద్దు మద్యాన్నమాయను భోగాలు మరిఁగితివి
అద్దో లోకము మెచ్చ నణఁకు వొద్దా" 27-426

మధురము : (3) వి. మాధుర్యం. ధర్మవాచకానికి బదులు ధర్మివాచకం.
"మాటల తేనెలలోన మధురము గురియఁగ
గాఁటపు నీ బిగువులు కారమయ్యీనే" 11-179

మధ్యరాతిరి : వి. మధ్యరాత్రి.

"రాముని మెప్పించి మధ్యరాతిరి సంజీవి దెచ్చి
ఆముకొని యున్నాఁడు హనుమంతుఁడు "
3-143

మధ్యాన్నము : వి. 'మధ్యాహ్నము' అనేదానికి జానపద వ్యావహారికరూపం.
"యిచ్చట శ్రీవేంకటేశుఁ డింతసేసి కూడెనింకా
మచ్చికెతో రమ్మనవే మద్యాన్నమెక్కె " 8-64

మధ్యాన్నమెక్కు : అ.క్రి. మధ్యాహ్నమగు.
"యిచ్చట శ్రీవేంకటేశుఁ డింతసేసి కూడెనింకా
మచ్చికెతో రమ్మనవే మధ్యాన్న మెక్కెను "
8-64

మనకితపడు : అ.క్రి. శోకించు.
"వెంగేన నిమ్మపంటను వేసల వేసితినంటా
కంగి మనికితపడి కరఁగీఁ జెలి" 7-221

మనయిది : (మన + ఇది) ఇందులోని ఇది శబ్దం 'నాకు చాలా ఇదైంది' ఇత్యాది వాడుకలో ఉన్న 'ఇది' శబ్దమే. ఈ ఇది శబ్దం ప్రాకరణికమైన ఏదో అర్థాన్ని చెప్పుతుంది. అన్నమయ్య జనుల వాడుకలోని ఇలాంటి పదాల నెన్నింటినో ప్రయోగించినాడు.
"ఇద్దరి యెలుఁగులకు యా యాకసమె గురి
అద్ది మన యిదియె మాటాడుట గాఁదా"
20-301

మనసగు : (మనసు + అగు) ప.బం; అ.క్రి. ప్రియమగు, ఇష్టమగు, కోరిక పుట్టు.
"నీ వేల వత్తువయ్య నెలఁతఁబాసి
మావంటివారు నీకు మనసయ్యేనా" 10-2-51

మనసరి : (మనసు + అరి) వి. మంచి మనస్సు గలది.
"అంత మనసరివని ఆడెనా నిన్ను
చింతించే నీ యాసలనే సిగ్గుకింతే కాక"
10-2-60

మనసార : ప.బం; క్రి.విశ. మనఃపూర్తిగా, నిండుమనస్సుతో.
"మనసార నే నీతో మాటలాడే నంటేను
వినేయందు నీకైతే వేళ లేదు" 23-257

మనసిచ్చు : (7) ప.బం; అ.క్రి. ఇష్టపడు, ప్రేమించు, రహస్య మెఱిగించు.
"మనసిచ్చి మాటాడితే మాటాడఁ గరఁగించెను
చెనఁకఁగ వచ్చితేను చిక్కించుకొనెనే" 18-250
"మనసిచ్చి యప్పటిని మాటలు నీతో నాడే
వెనకతియ్యకువే వెలఁదీ" 18-71

మనసు కరచు : ప.బం. మనస్సును ఆకర్షించు.
"చెంతనుండి యీకె సెలవుల నవ్వి
కాంత నీ మనసు కరచెను" 26-518

మనసుకు మనసే సాక్షి : నానుడి; తనకు తానే సాక్షి.

మనసు చిముడఁ బెట్టు : అ.క్రి. మనస్సును బాధపెట్టు. 12-202 old

మనసు చిల్లులగు : ప.బం. మనస్సుబాధపడు.
"చివ్వన బూతులు విని చిల్లులాయ మనసు "
7-98
"విని విని చిల్లులాయ మనసు " 7-97

మనసు చిల్లులువోవు : ప.బం; అ.క్రి. మనస్సుబాధపడు.
"పూఁచిన యొరపుల బొమ్మముడి జంకెనల
లోఁచకువే మనసు చిల్లులు వోయీని" 6-8

మనసు(నఁ) దాగిన పాలు : (2) ప.బం; వి. నిజం కానివి.
"గొనకొన్న మానినుల కూటముల సుఖములివి
మనసు దాగినపాలు మట్టు లే దెపుడు" 1-486
"మనసునఁ దాగినపాలివి మదిఁగల
కోరికలిన్నియు" (2-133)

మనసునఁబాలు దాగు : ప.బం; అ.క్రి. నిజం కానివి.
"మనసునఁ బాలుదాగి మదియించి వున్నట్టు
ననిచి గిలిగింతకు నవ్వినట్టు" 2-37

మనసుపట్టు : (3) ప.బం; అ.క్రి.నిగ్రహించు, మనస్సును ఆపుకొను .
"మచ్చరించఁగఁ గదా మనసుపట్టఁ దిరిగే

నిచ్చకము లాడుకంటె యిదె మేలు" 7-8
"వినయముతో నీకు విరులు ముడువఁగాను
మనసుపట్టఁగలేక మర్మము లంటేవు" 29-238

మనసుపెట్టు : (5) *ప.బం; అ.క్రి.* శ్రద్ధ ఉంచు, కోరు, ఏకాగ్రతతో ఉండు, ఏకాగ్రతతో శ్రద్ధపెట్టు. (పద.)
"మచ్చిక నీ కౌఁగిటికి మనసు పెట్టుకున్నది
కుచ్చి కుచ్చి కౌఁగిటఁగూడవయ్యా" 12-298

మనసుపేద : *ప.బం; వి.* సున్నితమైన మనస్సు కల(వాడు)ది, ధైర్యం లేని(వాడు)ది.
"పెక్కు లంపటాల మనసుపేద వైతివి నీకు
నెక్కడా నెవ్వరు లేరు యేమి సేతువయ్యా"
1-125

మనసు పొక్కు : *ప.బం; అ.క్రి.* మనసు బాధపడు.

మనసు మంగళము : *ప.బం; వి.* హృదయ విహీనుడు. 17-278

మనసు రాయి సేయు : *ప.బం; అ.క్రి.* మనస్సును కఠినం చేయు .
"పిలిచితే రాఁడట్టే బిగిసీ నీ పాటివాఁడు
చెలఁగి మనసు రాయిసేయకుండీనా" 13-144

మనసులోన పాలు దాగినట్లు : *ప.బం.* తృప్తిని కలిగించనట్లు, అసాధ్యమగునట్లు .
"పక్కన మనసులోన పాలు దాగినట్లనే
చక్కని మాయలలో సంసారభోగములు"
15-59

మనసువచ్చు : (4) *ప.బం; అ.క్రి.* ఇష్టపడు.
"మట్టు మీర నేఁడు నీ మనసు వచ్చితేఁజాలు
గట్టిగా నెంగిలిపొత్తు గల సేమయ్యా" 18-198

మనసువారు : (మనసు + పారు) *ప.బం; అ.క్రి.* మనసుపోవు, ఇష్టమగు.
"మరిగి యాపై నీకు మనసు వారితేను
వరుసతోఁ బెండ్లాడఁగా వద్దనీనా నిన్ను"
29-350

మనసువిఱుగు : *ప.బం; అ.క్రి.* విరక్తి పుట్టు.
"విరుగదు మనసు"
"బలిమి నిందులకెల్లా పడిగెమట నీ మోవి
వెలయ నీకిది విని విరుగదు మనసు" 26-401

మనికితము : *వి.* 1.సందేహం 2.దుఃఖం, మనోవ్యథ 3.జాలి, కరుణ.
"మాటలాడితేఁజాలు మట్టుకుఁదెచ్చే నతని
యేఁటికి మనికితము ఇంతిరో నీకు" 26-445

మనిమని : మిక్కిలి వృద్ధిచెంది, మిక్కిలిగా వర్తించి.
"మనిమని యేకతాలు మర్మములు గరఁగించు"
18-145

మనుఁగాఁపుఁజేయు : *ప.బం; స.క్రి.* రక్షించు.
"వినవయ్య యిదివో శ్రీవేంకటేశ నా మనవి
మనుఁగాఁపుఁజేసితివి మన్నించవయ్యా" 4-208

మన్నమనువు : *వి.* బ్రతికిన బ్రతుకు.
"మన్నమనువు దిమ్మరితనమే" 1-19

మన్మనా భవ : ఇది భగవద్గీత లోని శ్లోకభాగం.
"మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు, మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణః" 9-34 (అని పూర్తి శ్లోకం.) "మనస్సును నామీదే నిలబెట్టుము. నా భక్తుడవగుము. నన్నే పూజించుము. నాకే నమస్కారం చేయుము. ఈవిధంగా చిత్తం నామీదే నిలిపి నేనే పరమగతి యని సేవించుచు ఆత్మనైన నన్నే చేరుతావు" అని ఈ శ్లోకతాత్పర్యం.
"మన్నించి యాతఁడే 'మన్మనా భవ' యని
అన్నిటా నందరి కానతిచ్చెఁ గాన" 4-71

మబ్బువయసు : *వి.* యౌవనం.
"మబ్బువయసు మదము మాపై నేల కప్పీనే
నిబ్బరపు తన తమి నేనే యెఱుఁగుదునే"
27-457

మమకరించు : (3) *అ.క్రి.* మమకారం చూపు. మమకారములోని 'కా' హ్రస్వం చేసి దానిపై నామధాతువు చేసిన రూపమా? (f.n. 22-236)
"మమకరిం చలమేలుమంగ శ్రీవేంకటేశుఁడు

సమరతి న న్నేలే యీ జాణఁడే నా విభుఁడు "
12-394

మయి : వి. మై, శరీరం.
"కుప్పలుగాఁ గస్తూరియు కుంకుమయు మయి
నిండ నప్పళించుకొని యున్న యాతఁడు
నిండ" 5-89

మయిపూఁత : ప.బం; వి. చందనాదుల పూఁత.
"కమ్మని మా మయిపూఁత గదరుఁబిల్లుల
గబ్బు
యెమ్మెల మా పట్టుచీర యేపెనార" 5-121

మయిల : మైల, మురికిగల, మాలిన్యం (కల)
"మదిలో చింతలు మయిలలు మణుఁగులు
వదలవు నీవవి వద్దనకా" 2-475

మయివడి : ప.బం; వి. 1. సమ్మతి
2. ఆనుకూల్యం 3.విధం 4. సౌమ్యత
5. నేర్పు. (వ్య.) విణ. అనుకూలం.
"నలువొందఁ జంద్రకిరణములు మయివడిఁ
బొక్కె" 5-161

మర : వి. కొలపాత్ర, చేరకు మించినది.
"తారుకాణ లిప్పు డేలే, తన సుద్ది చెప్పఁజెప్పఁ
జేర మరా యని చెల్లఁబెట్టేఁ బదవే" 25-479

మరకాఁడు : (మర + కాఁడు) వి. కర్ణధారుఁడు,
సరంగు, ఓడ నడిపేవాడు.
"అడిబరవుగ మాయ అందునిండా నించుకొని
యెడతాఁకె జీవుఁడనే యీ మరకాఁడు" 3-388

మరకుండు : స.క్రి. మరవకుండు.
"దొరవైన నీతోడి పొందులు యెట్టయినా వచ్చు
మరకుండఁగ రాదు మరగారాదు" 21-262

మరగాళ్లు : వి; బహు. కృత్రిమపాదాలు.
"వున్నతి నీకడకు రాకున్న కాళ్లు మరగాళ్లు
సన్నుతి సేయని జిహ్వా సరి నుపజిహ్వా " 2-450

మరపుకొను : మరచిపోవు.
"దువ్వటంపుచెఱఁగు మెఱయ తోడుదోడ
సురటి విసరి
ఇవ్వల నతని మరపుకొనఁగ నెందు
నేర్చుకొంటివే" 27-587

మరపుట : వి. మరచిపోవడం.
"సత్తెపు నాలుకెల్ల చవుల కమ్మితిఁగాని
మత్తిల నా కీర్తనము మరపుటా లేదు " 3-60 new

మరవ : వి. చెరువులు నిండిన వెనుక నీళ్లు
పొర్లిపోవడానికి చెరువుకు అటునిటు చివర
తక్కువ ఎత్తులో కట్టిన కట్టడం. తూము ;
రాయలసీమ మాండలికం.
"యెలమి సింగారరస మేరులు నిండాఁబారి
తలపోఁత చెరువుల దైవారె మరవలు" 18-47

మరుగుడి : వి. స్త్రీల గుహ్యావయవం.
"నెట్టన నీవు నన్నాడే నిందలెల్లాఁ దప్పదని
చుట్టి మరుగుడి వాసి చొచ్చి వెళ్లేవా" 7-181

మరుగురుఁడు : వి. మన్మథుని తండ్రియైన
విష్ణువు.
"పరమసుజ్ఞానులకు ప్రపన్నులకు
మరుగురునిమీఁదట మన సుండవలదా" 15-46
"మరుగురునికిఁ గాని పూవుల పూజలు
మగడు లేని సింగారములు" 2-235

మరుచావడి : మన్మథుని కొలువుకూటము.
"పనివడి మన చేతి పచ్చి చేఁతలె నావా
ఘనమై మరుచావడి కళలు దించేవి" 7-67

మరుచిలుకు : వి. దంతక్షతం, మన్మథబాణం.
"దిట్టైన యది యెవ్వతెర నీ యధరమంది
కొల్లఁగొన మరుచిలుకు లొత్తినది" 5-159

మరుతండ్రి : వి. విష్ణుమూర్తి (మన్మథుని తండ్రి)
చూ : మరుగురుఁడు.
"మరుతండ్రిఁ జూచిన మంచికన్నులను
మరొకరిఁ జూచిన నింపౌనా" 2-313

మరుతేరు : వి. మన్మథుని రథం, చిలుక.
"ఇంతుల మనోవీథి నేఁగిఁ మరుతేరి మీఁద
నంతటా రతిప్రియుఁడటుగాన" 1-424

మరుసాము : వి. మన్మథక్రీడ, మరుపోరు.

"ఉదుటుఁదమకమున నోపిక కలిగితేను
యెదుటి మరుసామున కియ్యకొనరాదా"
8-125

మర్నాడు : (మరు + నాడు) వి. శబ్దార్థంప్రకారం మరుసటి దినమైనా రాయలసీమలో 'ఎల్లుండి' అనే అర్థంలో వాడుకలో ఉన్నది. మర్నాడు - మన్నాడు - మొన్నాడు

"నవ్వినప్పుడు నవ్వక నాతో మర్నాడు వచ్చి
ఇవ్వల సరసమాడీ నేటికే నాకు" 26-143

మర్మగాఁడు : (మర్మమ + కాఁడు) వి. మర్మాలు తెలిసిన వాడు.

"అన్నియు నడుగవే నేనే మఱచితి నని హరి
నీకే తెలిసినవి
మన్నించి నా కీ జన్మమొసఁగితివి మర్మగాఁడు
మన్మథుఁడొకఁడు" 2-189

మఱఁగా : (?)

"మాటలాడే యందుకు మఱఁగా నీ గుబ్బలకు
మాఁటు పయ్యెదైతే నమరుఁగాక" 20-268

మఱఁగు మొఱఁగు : వి. మఱగు = చాటు అనే అర్థంలో జంటపదం (?)

"మచ్చికెంత గలిగినా మఱఁగు మొఱఁగు లేదా
ఇచ్చయెఱిఁగి లోలోనే యెనయుట గాక" 28-24

మఱస్తి : క్రి.ప. మఱచితిని అనడానికి వ్యావహారిక రూపం.

"పడఁతి చే కానుక పట్టి నా చేయి చాఁచి
అడియాలాలు మఱస్తి ననఁడు గదా" 12-171

మఱుఁగున బదుకు : అ.క్రి. శరణుపొంది బదుకు, చాటున బదుకు.

మఱులుదేహి : వి; బహు. ఇట 'రు' కావచ్చు. అజ్ఞానం, మోహం, వలపు, ప్రేమ, పిశాచం.

"మఱులు దేహియై మఱచి వున్నయెడ
తఱచుటూరుపులఁ దలఁచీనా" 1-304

మట్టిమాని పంట : ప.బం; వి. మట్టిచెట్టు ఎంత పెద్దదో మట్టికాయ అంత చిన్నది. అందుపై వచ్చిన పలుకుబడి. (పద.) ఎక్కువపంట అని తె.వ్యు.కో.

"కలిమికామిని తోడ కారుకమ్మిన పంట
మలయుచుఁ దమలోని మట్టిమానిపంట"
4-342

మలఁగు : (3) వి. మెత్తదిండు, బాలీసు.

"మలఁగుపై నొరగుండి మాటలాడి దేవులతో
వలపులు చల్లుకొంటా వాడవాడల" 18-321

మలగొను : (3) ప.బం; అ.క్రి. (మలక + కొను) మెలిగొను, వ్యాపించు.

"మచ్చికతోఁ బులకలు మలగొన్న వాకె మేన
పచ్చి సరసాలెదురుబడి నాడరాదా" 26-596

మలఘుని నిన్న పెరుమాళ్లు : వి. సందిగ్ధపద సమీక్షలో ఈ పదం అర్థం ఈ విధంగా చెప్పబడింది. మలై + కునియ + నిన్ఱ + పెరుమాళ్లు = కొండ క్రుంగునట్లు నిలుచున్న దేవుడు. వేంకటేశ్వరుని మూలమూర్తి. మలైకినియ అని, తిరుమలై ఒళుగు అను గ్రంథమున నున్నదట. ఇందు 'కినియ' కు వ్యాపించు అని అర్థం.

"మలఘుని నిన్నపెరుమాళ్లు వీఁడే
వెలయ రాజసమున విఱ్ఱవీఁగేవాఁడే" 14-367

మలయు : అ.క్రి. 1. వ్యాపించు 2. విజృంభించు (3.కదలు 4. చలించు 5. సంచరించు 6. బాధపడు 7. మండు 8.తొలగు 9. పోరాడు 10. యత్నించు 11. ఉత్సహించు)

"సొలసి చల్లగాలికి చోట్లన్ని గలిగినా
మలయఁ బేరైన చోటు మలయాద్రి గాదా"
7-197

మలిగండ్లు : (3) వి; ప.బం; బహు. (మలి + కండ్లు) కండ్లు అనేది 'కల్లు' (= రాయి)కు బహువచన రూపం. బియ్యం మొదలగునవి బాగుచేసినపుడు మలిచి తీయదగిన రాలు.

"చెప్పనేల రాళ్లు చక్కఁజేసి మలిగండ్లేరీ
నిప్పు డిట్టె నే నిందు కేమందునే" 9-58

మలిగినవానికి మొనవాడి : ప.బం. (?) 2-431

మలినము : (5) వి. మాలిన్యం, ధర్మవాచకానికి బదులు ధర్మివాచకం.

"వలవని మోహావస్థలఁ బొరలెడి
మలినంబెన్నఁడు మానును" 1-174

మల్లడిపొందులు : వి. మిక్కుటమైన పొందులు.
"చల్లలమ్మేదానవు అచ్చపు మగనాలవు
మల్లడి మా పొందులేల మరిగేవు నీవు" 5-322

మల్లసాల : వి. 'మల్లశాల'కు వికృతిరూపం.
1. సాముగరిడీ లేదా కసరత్తు చేసే చోటు వ్యాయామశాల 2. భోజనశాల.
"కన్నుల చూపులనే కాంత నీ కారతులెత్తీ
మన్నించి రావయ్యా లోని మల్లసాలకు"
22-336

మల్లాడు : (10) (మల్లు + ఆడు) ప.బం; అ.క్రి.
1.పెనగాడు 2. పోరాడు 3. అతిశయించు 4. క్రీడించు.
"తొల్లిటి మాటలకుఁగా తొడరి సూడువట్టేవు
మల్లాడి రాతికి మారుమలసేవు" 7-170
తిరుగాడు : (మాం.)
"తగు మోహసలిలంబు దాఁట మతి లేదుగన
మగుడఁబడి భవముతో మల్లాడవలసె" 1-221

మల్లువాఁడు : (మల్లు + వాఁడు) వి. జెట్టి.
"మల్లువారితోడి పోరు మానవింత చాలదా"
5-297

మల్లెవట్టు : అ.క్రి. నశించు, చీడపట్టు అని శబ్దార్థం.
"బడి విభీషణునిఁజేపట్టితే రక్కసులెల్లా
చిడిసి మల్లెవట్టిరి శ్రీవేంకటరామా" 4-281

మసి కస్తూరగు : ప.బం; అ.క్రి. అల్పవస్తువు మహావస్తువగు.
"శునకసూకరాదులు సుకమందే పొందినట్లు
ఘనముగా నిక మసి కస్తూరాయ నాకు" 15-41

మస్తరించు : స.క్రి. 1. వశపరచుకొను 2. ప్రోత్సాహపరచు 3. అస్ఫాలనంచేయు 4. చేతులప్పళించు.
"మందెమేళపుటింతిని మస్తరించవలెఁగాని
ఇందరిలో జంకించితే యీసు రేఁగును" 26-426

మహనియ్యము : విశ. 'మహనీయము' (= గొప్పనైన) అనే పదంలో 'నీ' లోని దీర్ఘానికి హ్రస్వమూ, యకు ద్విత్వమూ వచ్చినరూపం. గొప్పనైనది. ఇట్లే తదియ్య (తదీయ) అనే రూపం.

మహరుషి : వి. మహర్షి, గొప్ప ఋషి.
"కనుకలిగి హరిఁగొలచి ఘనులైరి గాక
ముని మనుజులే కారా మహరుషులును"
1-404

మహాచరులు : వి; బహు. (?)
"చనుఁగొండలను మహాచరులఁ బడుటొండె"
1-159

మా

మాఁకుపడు : (2) ప.బం; అ.క్రి. మ్రాన్పడు, స్తంభించు, కొయ్యవారు, నిశ్చేష్టుడగు.
"ఆఁకట నా సేల మాను అన్నిటాను యిందరికి
మాఁకుపడి తత్తరము మఱచుంటేఁ గాక" 1-204

మాఁగు : (3) అ.క్రి. బాగా పండు, పరిణతి చెందు, కవియపండు.
"ఆఁగి ముచ్చటాడవమ్మ అట్టె నీవద్ద నుండఁగా
మాఁగినరతుల మేను మఱచియున్నాఁడు"
19-586
"మాఁగిన మనసు నీకు మనసే సాక్షి" 26-160

మాఁజు : నిఘంటువుల్లో ఈ పదం కానరాదు. 'మాఁగు' ధాతువుకు రూపాం. లాగా అనిపిస్తుంది అని సం.ప.స.
"మాఁజితేను జవ్వనము మట్టున నిలుచునా
రాఁజి రాఁజి వలపు లాఁఅడిఁబెట్టుఁగాక" 20-85

మాఁట : (112) వి. మాట, శబ్దం మొ॥ అన్నమయ్య సంకీర్తనల్లో ఈ శబ్దం మాఁట, మాట అనే రెండురూపాల్లో కనిపిస్తుంది. మాటలో అరసున్న ప్రాచీనకాలంలో ఉన్నదేమో! సబిందుక, నిర్బిందుకప్రాస సాంకర్యానికి అనంతుడు ఛందోదర్పణంలో ఇచ్చిన "మాట లేటికి మేటి తాఁబేఁటి కనఁగ"

అనే ఉదాహరణను బట్టి మాట శబ్దం నిర్బంధుక మని తెలుస్తుంది.

"యిత్తలఁదన నా సంది యీ రెండుఁ దెలియుదాఁకా

పొత్తులనె వుండనీరె పొరుగుల మాఁటా"

11-126

మాఁటపలుకు : *ప.బం; వి.* వాగ్వాదం, తాను మొదట పల్కరించుట మాట. అడిగిన దానికి బదులిచ్చుట పలుకుగా ఈ నుడికారము పుట్టియుండవచ్చును. (f.n. 22-508)

"మగనికి నాలికి మాఁటపలుకైతేను

తగవులు దిద్దేవారు దండచెలులా"

25-204 & 29-358

మాఁటపలుకులాడు : వాగ్వాదం చేయు.

"మచ్చిక నే నితనితో మాఁటపలుకులాడఁగా

ఇచ్చటికి వచ్చి నీ వేమి వినేవే"

29-58 & 29-358

చూ : మాటపలుకు

మాఁటమాఁటగా : (?)

"గాఁటమున రమణుని గడవనాడుట కంటె

మాఁటమాఁటగా బొగడే మచ్చికే మేలు" 28-43

మాఁటలపందిలి వెట్టు : *ప.బం; అ.క్రి.* వట్టిమాటలతో సరిచేయు, వట్టిమాటలతో భ్రమగొలుపు.

"మాఁటల పందిలివెట్టు మానిని యందురు గాని

మాఁటల గూళ్లు కట్టి మమ్ము నింతేసేవు"

8-178

మాఁటల మూటలుగట్టు : *ప.బం; అ.క్రి.* వట్టి మాటలు పలుకు.

మాఁటలలోనే తేనెలు మనసులోనే నూనెలు : *ప.బం; వి.* మాటలు తియ్యన మనసు మాత్రం దుష్టం.

"మాఁటలలోనే తేనెలు మనసులోనే నూనెలు

యేఁటికి నీ పతి యెడ కింత వలెనా" 25-441

మాఁటు : వి. 1. తగులము 2. మాఁతు.

"వదలకింతకుఁ దలవాకిలైనది

మదనుని బారికి మాఁటువో నీ పతికి" 5-115

మాఁటువెట్టు : (మాటు +పెట్టు) స.క్రి. మఱుగుపరచు, దాచు, మఱుగుపుచ్చు. (వ్యు.)

"పీఁటమీఁద నొండొరులు పెనఁగుతా నన్నుఁగని

మాటువెట్టు నన్ను నెంత మన్నించితివి"

26-586

"ఇరవైన ఆసలతో నెప్పుడు వత్తువో యంటా

సురటి మాఁటువెట్టుక చూచీ నిన్ను" 24-321

మాఁడు : (?) 1. శుష్కించు 2. చెడు 3. దగ్ధమగు.

"వేఁడినిట్టూర్పుల వెసఁగారముల

మాఁడనేల నీకు మంకు గద్దా" 11-383

మాఁడుకూరి మాధవరాయఁడు : వి. మాడుకూరిలో వెలసిన మాధవుడు. చూ : మాడుపూరు.

"మంచివాఁడవంతే పో మాధవరాయా

మంచు మాయ మాడుకూరి మాధవరాయా"

14-237

మాఁడుకూరు : వి. ఒకగ్రామం.

"బడినే శ్రీవేంకటేశ పారితెంచి మాఁడుకూర

తడవి యింతసేసితి దక్కెఁగా నీ పనులు"

14-233

మాఁపటిచేఁత : వి. సంభోగం.

మాకు : వి. చెట్టు. నిఘంటువుల్లో ఈ పదం కానరాదు. మాను (మ్రాను) కు వ్యావహారికరూపం. మ్రానుకు బహువచన రూపమైన 'మ్రాకులు' అనే దాని అనుచిత విభాగంచే ఏ.వ. లో వ్యవహారంలో 'మాకు' అనే రూపం ఏర్పడిఉంటుంది. మందు-మాకు అని వ్యవహారం.

"మఱచి ముమ్మదముతో మాఁకువలె నుండినాను

గుఱిగా గోరు సోకితే కోరికలు రేఁగును" 23-297

మాచనవోలి చెన్నుఁడు : కడపజిల్లా ప్రొద్దుటూరు తాలూకా లోని మాచనపల్లె యే మాచనవోలు కావచ్చు. అట నెలకొన్న విష్ణుమూర్తియే

మాచనవోలి చెన్నుడు కావచ్చును. మాచనవోలు మాచవోలుగా కూడా పేర్కొబడింది. (26-63)

"నాఁగు లెల్లఁదీర మాచవోలి చెన్నుఁడవై
మూఁగితి శ్రీవేంకటేశ మోవి యిచ్చేఁగాక" 21-495

మాచనవోలినిలయుఁడు : వి. మాచనవోలులో వెలసిన చెన్నకేశవుడు. తాళ్లపాక సమీపంలోని మాచుపల్లెయే మాచనవోలు. ఇది ఒంటిమిట్ట, టంగుటూరుల నడిమి గ్రామం. ఇట 'మాచనవోలు' లోని 'వో' వర్ణం 'వొ' గా ప్రయోగింపబడినది. కనుక సంపాదకులు 'ఒలినిలయా' అని విడదీసి ఒలి అంటే శబ్దమని చెప్పి 'ఒలినిలయా' అనే పదానికి 'వేదాధారా' అనే అర్థం చెప్పడం యుక్తం కాదేమో ! ఇందుకు మాచనవోలి చెన్నుడు అనే ప్రయోగం (21-495) కూడా ఆధారం. (చూ: సం.ప.స. 19 సం.)

మాచవోలి చెన్నుడు : వి. చూ: మాచనవోలి చెన్నుడు.

మాటఁబడు : *ప.బం; అ.క్రి.* దూషణపొందు, ఒకరిచే తప్పుపట్టించుకొను.

"తొక్కి నీవు మాటఁబడి దూరి నాపై వేయకు
అక్కర అంత గలితే అప్పణ దేరాదా" 7-427

మాటకారి : (మాట+కారి) వి. యుక్తిగా మాట్లాడేవాడు, వాగ్మి.

"విన్నపాలు సేయఁదగు వెస మాటకారికి
సన్నలు సేయఁగఁదగు చనవరిదానికి" 24-358

మాటకు మాట ఆడు : (3) *ప.బం; అ.క్రి.* ఎదురుచెప్పు, ఎదురు మాటలాడు.

"ఔనె మాటకు మాట ఆడితివి వోరి
కాని యింకా నేమి గలిగినాఁ జెప్పరా" 9-80

మాటకు మాటలాడు : *ప.బం; అ.క్రి.* ఎదురుచెప్పు, ఎదురుమాటలాడు.

"మాటకు మాటలాడ మరి యంతేసి నేరవు
యేఁటికి మాతో వాదులేల పెంచేవు" 16-224

మాటకు మాటాడు : *ప.బం. అ.క్రి.* ఎదురుచెప్పు, ప్రతిఘటించు.

"మాటకు మాటాడేవాని మారుకొనఁగరాదు
మూఁటకట్టువినయాన మొక్కవలెఁగాని" 23-182

మాట గోరువోవు : *ప.బం; అ.క్రి.* (?)

"మాట గోరువోయీనంటా మౌనాన నుందునుగాని
నీటున ముచ్చటాడక నే మానరా" 17-384

మాటపట్టు : (5) వి. మాటపట్టింపు, పట్టుదల, (పద.) ఒట్టు, శపథం, మాటఆసరా.

"ఎట్టు గెలువఁగఁగల వీకెను నీవు
యిట్టె మాటపట్లు నీవిచ్చితి విందరికి" 17-171

మాటపట్టుసేయు : *ప.బం; అ.క్రి.* పట్టుదల వహించు.

"చెలియకు మాటపట్టు సేసినాఁడవు గనుక
వెలయ నీ కొత్తి విన్నవించితిమి" 16-550

మాటపలుకాడు : (2) *ప.బం; అ.క్రి.* వాగ్వాదం చేయు. (మాటపలుకు - ఇట జంటపదం)

"వినయముతో నీకు విన్నపాలకు లాచీ
పని గలిగితే మాట పలుకాడవయ్యా" 22-508

మాటపలుకులాడు : వాగ్వాదం చేయు. (?)

"పంతము లేటికే మాటపలుకు లాడేవేళ
చెంతనుండే ప్రియములే చెప్పఁగరాదా" 22-514

మాటయిచ్చు : (మాట + ఇచ్చు) *ప.బం; అ.క్రి.* వాగ్దానం చేయు.

"తానే నాకు మాటయిచ్చెఁదన చిత్తము
మోనముతో నలిగేనా ముద్దరాల నేను" 14-473

మాట యిచ్చుకొను : *ప.బం; అ.క్రి.* వాగ్దానం చేసుకొను.

"మఱి యెవ్వతె కీ పొద్దు మాట యిచ్చుకున్నాఁడవో
యెఱుగక నీకు వీడె మియ్యవచ్చునా" 12-352

మాటల కత్తులు నూరు : తీక్ష్ణమైన మాటలు మాట్లాడు, వాడి మాటలు మాట్లాడు.

"మాటల కత్తులేఁటికి మరి యెంత నూరేవే
చాటుకెట్టుక గుబ్బల సాము లెందాఁకాఁజేసేవే" 29-386

మాటల దొంతులు వెట్టు : *ప.బం; అ.క్రి.* వట్టిమాటలు పలుకు.

మాటల బెల్లాలు : (2) *వి; బహు.* బెల్లంలాగా తియ్యనైన మాటలు, ఆకట్టుకునే మాటలు.

"నిగ్గుల నన్నుఁగూడఁగా నిజాన మెచ్చఁగఁబోతే
వొగ్గి మాటలబెల్లాల కొడిగట్టీ నితఁడు" 17-33

మాటల మూటలు : *వి; బహు.* వట్టిమాటలు.

మాటు : వి. మఱుగు, ఛత్రం, రక్షణస్థానం, రక్షకుడు.

"మాటు లేని నాయకుఁడు మరి కడమ లేలే" 16-70

మాటుకొను : అ.క్రి. మఱుఁగుపడు, దాగు.

"కొత్తగాఁగాఁ జెలి మాటుకొని నిలుచుండఁగాను
బత్తితోఁ గప్పురమేల పైఁజల్లేవు" 22-268

మాటుమందు : (4) వి. మఱుగుమందు, స్త్రీ పురుషుణ్ణి లోబరుచుకోవడానికి పెట్టే మరులు మందు, మచ్చుమందు, చొక్కుమందు.

"మరఁగి నా పొందె నీకు మాటుమందు
సరస నిద్దరమును సతులమె కామా" 7-146

"కెరలి చేకొనీ నీ కాఁగిటిపొందులు
మరుగకు నీకు నవి మాటుమందులు" 26-319

మాటొకటి చేతొకటి : *ప.బం; వి.* చెప్పేదొకటి చేసేదొకటి.

మాడాడు : అ.క్రి. 'మాటాడు' కావచ్చు.

"మగువ నీ కతనితో మాడాడకున్న నేమి !
నొగిలి యాతఁడు నీచే నొచ్చిన నేమి" 24-22

మాడుగు : వి. మాళిగ, హర్మ్యం, భవనం. రూపాం. మాడువు.

"కూడి శ్రీవేంకటేశుఁడ కొలువుండ వచ్చేవు
మాడుగులోనికి కమ్మటి వేళ లేదా" 14-184

"మిగుల నున్నతములగు మేడలును
మాడుగులు
మితిలేని దివ్య తపసులున్న గృహములును" 1-227

మాడుపూరు : వి. కడపజిల్లా అట్లూరి మండలం లోని సిద్ధవటం తాలూకాలోని గ్రామం. అన్నమయ్య మేనమామ ఊరు. అన్నమయ్య బాల్యం కొంతకాలం ఇక్కడే గడిచింది. మాడుపూరులో చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. అన్నమయ్య ఈ స్వామిపై సుమారు ఏడు కీర్తనలు (14-229, 232, 233, 237, 3-179) చెప్పినాడు. దీనికి మాడుకూరు, మాడువూరు అని రూపాంతరాలు.

"వొలిసి శ్రీవేంకటాద్రినుండి వచ్చి మాడుపూర
మలసి నన్నుఁగూడి మన్నించితిగా" 7-47

"చేరి యందెల మ్రోతతో చెన్నకేశవా
యీరీతి మాడుపూరిలో నిట్లాడేవా" 3-179

మాడువుటిల్లు : (మాడువు + ఇల్లు) రూపాం. మాడువిల్లు. మేడయిల్లు.

"వేడుకలు మతినిండె వెస వలపిదె పండె
మాడువుటింటిలో తెరమఱఁగునను" 24-504

మాణికము : (22) వి. 'మాణిక్యము'నకు వికృతిరూపం. 'మానికము' సాధురూపం. అన్నమయ్య పెక్కుచోట్ల 'మాణికము' అనే వాడినాడు. రెండుమూడుచోట్ల 'మాణిక్యము' అని తత్సమ రూపాన్నికూడా వాడినాడు. 20-21, 7-8, 3-381 "మాణికపుటుంగరాలు" 5-280, "మాణికపుటిల్లు" 19-565, "మాణికము" 15-327, "మాణికపుమట్టెలు" 9-106, "మాణికాల పోగులు" 5-219, "మాణికపు సొమ్ములు" 29-2

మానఁ జిక్కిన కోల : తిరిగి పొంద శక్యం కానిది.

"మానఁ జిక్కినకోల మతమాయ మనసు
తేనె లోపలి యీఁగ తెఱఁగాయ మనసు" 1-337

మానపడు : అ.క్రి. మానుపడు, చేష్టలుడుగు. 15-125 old

మానాపతి : (30) వి. మానవతి, గయ్యాళికి వ్యతిరేకపదం. ము.ప్ర. ల్లో అంతటా ఈ పదం 'మానాపతి' అనే రూపంలో కనిపిస్తుంది. కాని ఇది మానావతి కావచ్చు. అన్నమయ్య మానవతి శబ్దాన్ని అంతటా 'మానాపతి' అని ప్రయోగించడం విలక్షణం. సం.ప.స. లో "మానవతు లనుటకు వ్యావహారికరూపము నేటికిని కడపమండలంలో గలదు" అని

తెలుపబడింది. (13 సం. సం.ప.స. 6 పుట.) ఈ పదం సంకీర్తనల్లో సుమారు ముప్పైచోట్ల వాడబడింది. రెండుచోట్ల మాత్రం 'మానావతి' అనే రూపంలో కనిపిస్తుంది. (21-205, 28-456) ఈ విషయంలో రాగిరేకుల పాఠం చూడవలసి ఉంది.

"ఎఱిగివుందువుగాని యిందరివలెఁగాక
మఱవరానియట్టి మానాపతి సుమ్మీ" 9-248

"మలసి గుణము గల మానాపతి యైనాను
కలసి నిన్ను గూడితే గయ్యాళి యౌను" 12-224

మానాపతితనము : వి. అభిమానం కలిగి ఉండే లక్షణం, మానవతీత్వం.

"మానాపతితనాన మాటలాడకుండఁగాను
ఆనుకొని యాడో కత లడిగీఁదాను" 20-466

మానాపతిది : (మానాపతి + అది) మానవతి, అభిమానవతి

"రాయడించేదానఁగాను రచ్చలఁబెట్టకు నీవే
పాయముతోడి మానాపతిదాన నేను" 26-280

మానావతి : వి. 'మానవతి'కి ఆనాటి వ్యావహారికరూపం. పెక్కుచోట్ల 'మానాపతి' అనే ప్రయోగం కనిపిస్తుండగా రెండుచోట్ల మాత్రమే ఈ మానావతి పదం కనిపిస్తుంది. నేటికీ ఈ పదం కడపమండలంలో వినపిస్తుందట. చూ : మానాపతి; 'మానవతి' అనే రూపం ఒకచోట కనిపిస్తుంది. (23-422)

"మందెమేళమైన వారే మారువెనఁగేరు గాక
అందపు మానావతుల మందు కోపేమా" 21-205

"ఇటువంటి మానావతి నింత సేతురా
తటుకున లాలించి దయఁజూడు మిఁకను" 28-456

మానిపండ్లు రాలితేను మాని కిందనే : నానుడి; ఎవరి కర్మకు వారే బాధ్యులనడం.

"ఔనే తనకూ నాకు నంత పొందా తిట్టీని
మానిపండ్లు రాలితేను మానికిందనే" 17-44

మానిబొమ్మ : వి. చెక్కబొమ్మ.

"తేనెపూసి నీ విట్లాఁ దిప్పఁగానే తిరిగేటి
మానిబొమ్మఁ జుమ్మీ నా మతిలోని దైవమా" 1-286

మానివోడ : వి. చెక్కతో చేసిన ఓడ.

"మానివోడ నమ్మి వొక్క మనుజుఁడు వార్ధి దాటి
నానార్థములుఁ గూర్చి నటించఁగాను" 1-429

మానిసిమెకము : వి. నరసింహస్వామి. (మానవ, మృగ రూపాలు గలవాడు.)

"గండు మీరి దానవుని కండలు చెక్కుచు నూర్చు
నిండించీ నాకసము మానిసిమెకము" 1-436

మానుషము : (2) వి. 1. పౌరుషం 2. మానవజన్మ.

"వుట్టిపడీ మానుషము వొకనాటికొకనాఁడు
వట్టికాంతల యెదుట భంగపడే మిదివో" 3-248

2. మానవజన్మ :

"కామక్రోధముల గడవఁగ లేమట
యీ మానుషములు యెన్నటికి" 3-129

మాపటంత : (4) (మాపటి + అంత) సాయంసమయంలో, రాత్రిసమయంలో.

"మందలోన నున్న మేము మాపటంతఁగాని రాము
దిందుపడఁ గొంగువట్టి తియ్యకువయ్యా" 11-273

మాపటిచేఁత : వి. శృంగారచేష్ట, సంభోగం.

"ఆ పనికి బెట్టుగానన్న దీవించేవు
మాపటిచేఁతలకె మచ్చిక చల్లేవు" 6-126

మాపటిపొద్దు : సాయంకాలసమయం, రాత్రిసమయం.

"మనసు చూడఁగానే మాపటి పొద్దాయెను
చనవిచ్చె ననఁగానే జామెక్కెను" 14-145

మాపు : (8) వి. రాత్రి, సాయంకాలం.

"మఱి యేఁటి మాటలు, మాపుదాఁకాను
యెఱగవా నీ వేమైనా నిఁక నీ చిత్తమయ్యా" 28-331

మాపురేపు : వి. రాత్రింబవళ్లు.
"యేపున నన్నెటువలె నేలేవో నీవు
మాపురేపు నీ సుద్దులే మరిగితి నేను" 18-325

మామంగారు : వి. మామగారు ; ఇక్కడి అనుస్వారం విలక్షణం.
"లోనివారి మొఱఁగేటి లోకదొంగవు కనిం
గాన నట్టె రాకు మామంగారు వినేరు" 6-54

మాముపేత్య తు కౌంతేయ : "మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే" అనే భగవద్గీతాశ్లోకభాగం. (నన్ను చేరిన తరువాతమాత్రం పునర్జన్మ ఉండదు అని భావం) శ్రీకృష్ణుని వాక్కు.
"ఘటన మాముపేత్యతు కౌంతేయ మహిని
నటనఁ బునర్జన్మ న విద్యతే" 4-71

మామేకం శరణం వ్రజ : భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అనే శ్లోకభాగం . 'నన్నొక్కణ్ణే శరణు పొందు' అని దీనికి అర్థం.
"నాఁడు 'మామేకం శరణం వ్రజ' యను మాట
పోఁడిమి దిక్కుల నీ వెప్పుడు చాటఁగా"
2-57 old

మాయకాఁడు : (4) (మాయ + కాఁడు) వి. మాయావి, వంచకుడు.
"ఎంత మాయకాఁడవో యేమని చెప్పుదు విను
పొంతల నవ్వే వేల బూమెటవలెను" 21-125

మాయదారి : (మాయ + దారి) మాయావి, మోసగాడు. విణ. మోసపుచ్చేవాడు.
"మాయదారి విభుఁడెంత మరిగిననే నెంత
ఆయనాయ నను నేల యలయించేవే" 24-54

మాయదారితనము : (మాయ + దారి + తనము) మాయావితనం, మోసపుచ్చే లక్షణం.
"మనసు చూడఁగవద్దు మాయదారితనమున
యెనసి విభుని కప్పణియ్యవమ్మా" 27-519

మాయదారివాఁడు : (మాయ + దారి + వాఁడు) మాయావి, మోసపుచ్చేవాడు.
"మాయదారివాఁడవౌత మలసి నేనెఱఁగనా
నాయము నడపేవంటా నమ్మితిఁగాక" 25-194

మాయపుఁబులుగు : (మాయము + పులుగు) వి. మాయపక్షి.
"మాయపుఁబులుగొకటి మచ్చిక నీ బాలుని
చేయిచ్చి యెక్కిరించుకొనఁ జేరీనట" 5-247

మాయపుకతలు : (మాయము+కతలు) వి. మోసపుకథలు, మోసపు విషయాలు.
"నాయమే నడిపితేను నగుతా సమ్మతించుట
మాయపు కతలకెల్ల మరి నే మెరఁగము" 7-520

మాయపుగుణము : (మాయము + గుణము) వి. మోసపుగుణం.
"మాయపు నీ గుణాలకు మారుకొందు
నంతలోనె
ఆయములు నీ వంటితే నన్నియు మఱతును"
11-71

మాయము : వి. మాయ.
"సోయగంబగు కన్నుచూపు లనియెడు మహా
మాయములఁ బొరలించి మనసు నాటించె"
5-240

మాయి : వి. తల్లి.
"మాయి మాయి యలమేలుమంగ నాచ్చారి
మతిఁ
బాయని వేంకటపతి పట్టపురాణి" 6-47

మారకపురము : వి. ఒంగోలుజిల్లా లోని మార్కాపురం. 26-100

మారకపురము చెన్నరాయఁడు : వి. ఒంగోలుజిల్లా లోని మార్కాపురంలో వెలసిన చెన్నరాయడు.
"రవ్వలాయ మారకపురము చెన్నరాయ నేడు
యివ్వల శ్రీవేంకటాద్రి నిటు నన్నుఁగూడఁగా"
26-100

మారాడు : (మారు + ఆడు) *ప.బం; అ.క్రి.* ఎదురు మాట్లాడు.
"యీతఁడిదె నిను నేలె యింక మారాడకువే
యేతులనైనా నీవు యెడయఁగ నోపవు"
14-160

మారిపిల్లాడించు : *ప.బం; స.క్రి.* బాధించు.
"కూరిమి నీతఁడు దొల్లి కొనగొనలనే తల్లి
మారిపిల్లాడించెనే మారుదల్లి" 5-48

మారిపిల్లాడు : (2) *ప.బం; అ.క్రి.* బాధపడు.
"మాడలవలె సతుల మారిపెల్లాడేవు
తోడనిట్టే యందరిని దొడ్డిఁబెట్టేవో" 7-455

మారుఁ బేరు : వి. వేరే పెట్టిన పేరు. 13-56 old

మా(ఱు)రు : వి. ప్రతి, సమానం, బదులు.
"కొమ్మ నీ పయ్యెదలోని కుచముల మారు సుమ్మీ
నిమ్మపండ్లెగరవేసీ నీ రమణుఁడు" 7-387

మారుకు మారాడు : *ప.బం; అ.క్రి.* ప్రతిభాషలాడు, ఎదురు మాట్లాడు. 6-109
"మారుకు మారాడేటి మందవారము మేము
కోరికి నాడేటి చల్ల కోరో చల్ల"

మారుకు మారు : (21) బదులుకు బదులు, మేరకు మేర, మట్టుకు మట్టు, ఎంతకంత, తత్ క్షణం, వెంటనే (వ్యు.)
"కానుక నే నంపితేను కమ్మటి మారుకు మారు
లౌనూఁ గప్పురముపెఁ దగవే కదే" 23-205
"చేరి నీవు చెనకఁగా సిగ్గునేఁ బడఁగాను
మారుకు మారుసేయక మానవచ్చునా"
25-236
"చెఱకు దీపంటా నేమి సేయవచ్చునే
మఱిమరి విభునితో మారుకు మారే కాక"

మారుకొను : *స.క్రి.* ఎదుర్కొను.
"వెక్కసపు వలపుల విఱ్ఱవీఁగేవు
మక్కువలు మారుకొంటే మఱియేమి సేసేవే"
19-107

మారుగత : వి. సమాధానమైన కథ. పొడుపుకథకు సమాధానం కావచ్చు.
"అన్నియు నీయందే అమరెనట
కన్నియ ఇందుకు మారుగత చెప్పవే" 24-7

మారుగమ్మ : (మారు+కమ్మ) *ప.బం;* వి. సమాధానమిచ్చే జాబు.
"అంగనకు మారుగమ్మ లంపవయ్యా
యింగితము లోనే కంటి మేమందుమయ్యా"
13-454
"అగడుగాఁబువ్వుల గుత్తి యట్టె పైవేసేఁగాని
మగటిమి నీ కమ్మవు మారుగమ్మ వెట్టదు"
26-540

మారుగొండలు : వి. (?)
"చండి హిరణ్యాక్షునితోడ సరసములాడఁగా
అండనుండే చెలి మారుగొండ లెక్కెను"
25-328

మారుగొల : (మారు + కొల) వి. (?)
"మలసి మామీఁద నట్టె మారుగొల గొలచేవు
కలిగినదెల్లా నీకె గాదెఁ బోసేఁజుమ్మీ" 14-89

మారుజాతివారు : తక్కువజాతివారు (?)
"చీర వెలిగా నవ్వేవు చెల్లఁబో యెక్కడనైన
మారుజాతివారికైన మానము లేదా" 5-323

మారుత్తరము : (2) (మారు + ఉత్తరము) ప్రతిజవాబు.
"ఆకెతో మారుత్తరము లాడరాదా విచ్చేసి
పైకొని మమ్మే వొడఁబరచే నీడ" 19-441

మారుదల్లి : (మారు + తల్లి) వి; *ప.బం.* సవతితల్లి.
"మారుదల్లి సేతి మాటలఁబడలేక
వూరువిడిశి యడవులకేఁగి" 5-378

మారుబేరాలాడు : (2) (మారుబేరాలు + ఆడు) మారు బేరములు చేయు. ఒకటి ఒకరు ఇవ్వగా మరొకరు మరొకటి యిచ్చి చేయు బేరము మారుబేరము. ఒక వస్తువును కొని దాన్ని తిరిగి లాభానికి అమ్ముకొను. ఒకచోట కొని మరొకచోట లాభానికి అమ్మ.
"మంచిదయ్యా వలపులు మారుబేరాలాడేవు
పొంచి నెట్టువడినది పొరుగాపెమీఁదను"
18-206

మారుమంచము : (2) వి. వేరుమంచం.
"మగువ నాతో నలిగి మారుమంచ మెక్కినాను

తగిలి నా మనసందు దగ్గరి రాదా" 24-10

మారు(ఱు)మలయు : (4) *ప.బం; అ.క్రి.* ఎదిరించు, ఢీకొను, ప్రతిఘటించు, ప్రతికూలంగా మాట్లాడు.

"తతి నలమేలుమంగపతి శ్రీవేంకటేశ్వర

మతకాన నున్నవారు మాఱుమలసేరు" 2-261

మారుమాట : వి. ఎదిరించి మాటాడు మాట.

"మారుమాటలంత నేరమరి విన్నపాలు నే

శ్రీరామచందురుని చిత్తమింతే కాక" 26-38

మారుమొగమగు : *ప.బం; అ.క్రి.* అనిష్టతను సూచించు.

మారువెలవెట్టు : తిరిగి ఇచ్చే మూల్యం.

"మరుతంత్రములనే మారువెలవెట్టి నన్ను

ధరలోన నింత యేల దక్కఁగొనేవే" 14-363

మార్పులాడు : *ప.బం; అ.క్రి.* గోత్రస్ఖలన మొనరించు. (వ్యు.)

"అంగలించి శ్రీవేంకటాధిప నీవు గూడితివి

వుంగరము లాకె వేళ్ల నొగి మార్పులాడెను"

ఈ అర్థం ఇక్కడ సరిపోవడం లేదు.

మాఱుమాట : *వి; ప.బం.* ప్రత్యుత్తరం.

"మాఱుమాటలును మాతో నాడవు

తీఱక లోవెలిఁదిరిగేవే చెలియా" 19-535

మాలజీవుఁడు : వి. నికృష్టజీవుడు, పాడు జీవుడు.

"మరచెనా తన పాటు మాలజీవుఁడు దొల్లి

కొరమాలి బహుయోనికూపముల పొరలి"

4 అను. 18.

మాలిక : వి. వరుస (?)

"చెండిన రావణు శిరోమాలికల

దండల పూజల తఱచుగను" 2-516

మాలిమి : వి. సరంగు, కర్ణధారుడు, ఓడ నడిపేవాడు. ఓడ నడిపే శాస్త్రం తెలిసినవాడు. (వ్యు.)

"అలర శ్రీవేంకటేశ్వరుఁడని యేటి మాలిమి

నలుదిక్కులకు నోడ నడపఁగాను" 3-388

వరాహ. 5-76

మాలు : వి. చెడు.

"మాలు గలసిన బదుకు మాయలోనె కలపి

యేలకొ ఘనసుఖంబియ్యదాయ" 15-51

మాలు : *ప.బం;* వి. శూన్యం కావచ్చు అని సంపా.

"మనసొకటి కోరికలు మాలు గలపుచు(?) నుండు

తనసితే నదియ పరతత్వమై నిలుచు" 3-426

మాలుగలియు : *అ.క్రి; ప.బం.* అందులో ఒకటగు, కలిసిపోవు.

"మాలుగలసిన బదుకు మాయలోనే కలపి

యేలనో ఘనసుఖంబియ్యదాయ" 15-51

మాలుగలుపు : *ప.బం; స.క్రి.* అందులో ఒకటిగా చేయు, కలిపివేయు, కలిసిపోయేట్లు చేయు. (వ్యు.)

"మనసొకటి కోరికలు మాలుగలపుచు నుండ

తనిసితే నదియ పరతత్త్వమై నిలుచు" 3-426

మాలుగొనివుండు : *ప.బం; అ.క్రి.* మనసు మనసున లేకుండు, మనసు మరొకలాగా ఉండు. ఇది రా.సీ. మాం; విడుచు, త్యజించు అని (వ్యు.)

"మాలుగొని వున్నాఁడవు మదమెత్తి

వున్నాఁడవు

అలరి మా విన్నపము లాలకించేవా" 3-576

మాలె : వి. 'మాళిగ'కు వ్యావహారికరూపం. మాలియ, హర్మ్యం, మాడుగు. తేనె దీయునపుడు కొండచరుల నడుమ గట్టెడి చిన్న మంచె వంటిదియా? (f.n. 1-123 పు.)

"మాలెమీఁద పరువెందాకా నీ మచ్చిక విడువఁగ

లేవు" 1-184

మాలెకంబము = హర్మ్యస్తంభం. నీ.శ. 70

మాలెమీది పరువు : *ప.బం;* వి. అపాయకరం. మేడమీది పరుగు అపాయకరమే కదా!

"మాలెమీఁద పరు వెందాకా నీ మచ్చిక

విడువఁగలేవు" 1-184

మాళిగ : వి. మేడ.

"వొప్పగు దోమతెరలో నున్నదో కాక నీ
చప్పరమాళిగెలోన సరినొంటి నున్నదో"
19-432

మావతన్ః (?)

"యీవల నలమేల్మంగని ఇటు నన్ను నేలితివి
మావతఁదెచ్చితివి మన్నించితివేమో" 18-510

మావిటికిః మాపటికి, సాయంకాలానికి, రాత్రికి. ఇది 'మాపటికి' అనే పదానికి వ్యావహారికరూపం కావచ్చు. ప్రాస నిర్బంధంతో 'ప' 'వ' గా మారిందేమో!

"ఆవులమందకు రాఁగా నాయము లంటితిగాక
మావిటికి వచ్చి నీవు మమ్ముఁ జేసేవా" 20-306

మాసటీఁడుః (7) (మాసటి+ఈఁడు) వి.మాష్టీడు, శూరుడు, మల్లుడు. మాలపల్లెలో మల్లవిద్యా ప్రదర్శనం చేసి వారి నాశ్రయించి జీవించేవాడు. విణ. శ్రేష్ఠుడు.

"మంతుకెక్కి యీ పనికి మాసటీఁడు తానె కాన
పంతము లిప్పించీని పడఁతులకు" 27-254

మాసినది మణుగనుః నానుడి; కశ్మలమే మంచిదిగా తోచు, మాసినబట్టయే నిర్మలమైన వస్త్రమైన దనుట.

"మాసినదే మణుగాయెను మాకు నేది
జన్మము" 3-86

మాసు(సి)ః మైల, మావి, గర్భస్థపిండాన్ని ఆవరించి ఉండే పొర. (వ్యు.) మాసు = మావి the after birth placenta (kittel)

"పొంచి గర్భమున మాసు పొదిగి
వుండిననాఁడు
యెంచుకొని ముచ్చటలాడ నెవ్వరున్నారు"
3-268

మి

మింగిన కడికి చవులాః సామెత; చూః మింగిన కడికి చవులెంచు.

"వెనకకి కోపము వేడుక లిప్పుడు
కనుఁగొన మింగిన కడి కిఁకఁ జవులా" 20-226

మింగిన కడికి చవులెంచుః సామెత; గడిచిన దానికి వగచు. నాలుకమీద ఉన్న ముద్ద రుచినే గ్రహించగలం కాని మింగిన తరువాత కడుపులోకి పోయిన ముద్ద రుచి ఎటువంటిదో చెప్పలేం అనేదానినిబట్టి వచ్చిన సామెత. వ్యర్థప్రయత్నం చేయు అని భావం. "చీఁకటి వాసెను చే దీపమేలే" అని ఈ కీర్తనలోనే మరో ప్రయోగం.

"మొదల నే నెరుగక మోసపోతి గాకనే
కదిసి యేపొద్దు వద్దగాచుకుండనా!
యిది మింగిన కడికి యింక జవు లెంచనేల!
చెదర నీ పంతమెల్లఁ జెల్లెఁ బదరోరి?" 7-294

మించుఁజూపులాఁడిః (మించు + చూపులు + ఆఁడి) వి. మెఱుపు వంటి చూపులు గల స్త్రీ, స్త్రీ.

"ఏడు నిలువుల పైఁడిమేడమీఁద నుండి నిన్ను
జూడవేడుకైన మించుఁజూపులాఁడి" 5-63

మించుః వి. పెండ్లి తతంగంలో పెండ్లికూతురుకు మట్టెలు పెట్టినట్లు పెండ్లికొడుకు కుడికాలి రెండోవేలికి పెట్టే మట్టెవంటి వెండి చుట్ట. రాయలసీమలో కొన్ని తెగలలో ఈ ఆచారముంది. పెండ్లితరువాత పెండ్లికొడుకు వీటిని తీసేస్తాడు.

"నెలకొని తనకు మారు నీకుఁ బాదా లొత్తుమని
మెలుపున వజ్రాల మించు లంపెను" 29-239

మింటితాపలుః వి; బహు. ఊర్ధ్వలోకపు మెట్లు.

"తొడికి మింటితాపలు తుంచి దూపదాఁకినమ్మ
జడధి మరుదేశాల జలమింకించె" 3-133

మిండతుమ్మెదః వి. మగతుమ్మెద.

"తమ్మిపూవుఁగొలనిలో తరుణులుందాము
మిండ
తుమ్మెద లీఁదులాఁడంగఁ దొంగిచూచి" 6-9

మిందుఁగిందుః మంచిచెడులు; మీదా కిందా, తలకిందులు అని శబ్దార్థం. ఇట మీద శబ్దం 'మిందు' గా ప్రయోగింప బడటం విశేషం.

"మేర మీరినాతఁడు మిందుగిందు నెంచఁడు
తారుకాణించగఁబోతే తగవులే కలవి" 21-377

మిక్కిలిదొరః వి. గొప్పదొర, గొప్పప్రభువు.

"మిక్కిలిదొరవు నీవు మేనదాననంటా నేను

చిక్కఁగా నవ్వితిని సెలవులను" 18-328

మిక్కిళ్లు : వి; బహు. 'మిక్కిలు' శబ్ద బహువచనరూపం. మిగుళ్లు, శేషములు. (మిక్కిలు = మిగులు, శేషం)

"నెఱవగు చూపులు నిక్కిళ్ల

మెఱసెను తమకము మిక్కిళ్ల" 28-419

మిగులార : (మిగులు + ఆర) క్రి.విశ. ఎక్కువగా.

"తగవులు చెప్పఁగాను తప్పులేమీ రావు గదా

మిగులార సరసమాడే మీలోనను" 27-370

మిట్టించు : అ.క్రి. 1. ఉబుకు, నిగుడు 2. అతిశయించు, అధికమగు 3. మీదికెగయు, పైకెగురు.

"యీరెండు మిట్టించి యా యింతి పైకెగురు

తీరుగా నీ చిక్కెవ్వరు తీర్చవలెనయ్యా" 7-124

మిట్టకోల : వి. తీక్ష్ణమైన కఱ్ఱ, తీక్ష్ణమైన బాణం. (శ.ర.)

"మేకొని మరునింటికి మిట్టకోలలై యవి

కూకులువత్తులుగా నీగుందురా" 23-350

మిడిమాలము : వి. 'మిడిమేలము' నకు వ్యావహారికరూపం. ఉపద్రవం, కీడు, మిడిసిపాటు. విశ. ఉపద్రవకరం, బాధాకరం.

"మిడిమాలపు నీ మెచ్చు మేలు మేలు కైకొంటి

వడి నోపనన్నాఁబోవు వచ్చి కాఁగిలించేవు"

8-192

మితిమేర : వి. మేర (= అవధి) అనే అర్థంలో జంటపదం. ఇందులోని రెండు పదాలూ ఏకార్థకాలే.

"చిత్తం బాఁకలి దీరదు చింత దలంపునఁ బాయదు

యెత్తిన పరితాపమునకు నేదీ మితిమేర" 1-176

మినుకు : విశ. స్వల్పమైన, మినమిన కాంతిగల, మినమిన ప్రకాశించు. 11-3-112 old

మినుకుల పట్టుచీర : వి. కాంతివంతమగు పట్టుచీర, చిన్న బంగారు నాణెములు పొదిగిన పట్టుచీర. (?)

"మినుకుల పట్టుచీర మేలు ముసుఁగువెట్టుక

కనుచూపు దవ్వులనే కానవచ్చీ నదివో"

12-495

మినుకులాఁడి : (మినుకులు + ఆఁడి) తళతళకాంతులు గల స్త్రీ, స్త్రీ.

"ననుపున మోవి చూపి నానఁబెట్టే నాసలు

మినుకులాఁడివి కడు మేలే నీవు" 29-81

మిన్నుమన్నుల పొడవులు : వి; బహు. అత్యున్నతాలు. 9-249 old

మిన్ను(లు)మోయు : ప.బం; అ.క్రి. ఆకాశాన్నంటు.

"కదలె కదలె నదె గరుడధ్వజుని తేరు

అదె మిన్నుమోచిన నీలాద్రివలెను" 4-55

మిన్నులఁబారు : ప.బం; అ.క్రి. దుముకు, అతివేగంగా పోవు.

"చించుక మిన్నులఁబారే చింకలను బండికట్టి"

1-177

మిన్నుల పొడవులు : ప.బం; వి; బహు. అత్యున్నతాలు.

"మించిన కోరికలివి మిన్నుల పొడవులు

కొంచపుదేహము దన కొలఁది కాదు" 3-538

మిన్నులమోచు : ప.బం; అ.క్రి. ఆకాశాన్ని అంటు.

"తూరుపునం బొడిచెఁ జందురుఁడు మిన్నుల మోవ

పాఱుతెంచె విరహుల బందికాఁడు" 6-16

మిరియపుఁగాయలు : వి; బహు. భక్ష్యవిశేషం.

"కాయపురుచులకు గనియగు

మిరియపుఁగాయలు నేలకికాయలును" 6-4

మిఱుపల్లములు : వి; బహు. మిట్టపల్లములు .

5-115 old

మీ

మీఁదటెత్తు : (2) పైఎత్తు.

"ఎచ్చరించ వచ్చితి నీ కితవరిదానవై

కచ్చుపెట్టి మీఁదటెత్తు గనుకొమ్మీ యిఁకను"

27-60

మీఁదమీఁదఁ జవులు : పైపై రుచులు.
"మేటి వేంకటేశుఁబాసి మీఁమీఁదఁజవులంటా
నాటకపు తెరువుల నడిచేము" 1-94

మీఁదమీఁద : (2) అవ్య*; ప.బం.* పైపైన, వెంటవెంట.
"మీఁదమీఁద వలపెక్కె మేలు మేలోయి
చీఁదర రేఁచేవు నన్ను చెల్లులేవోయి" 20-91

మీఁదమీఁద వుండు : *ప.బం; అ.క్రి.* తేలికగా ఉండు.
"తాలిమి చక్కన గాని తమక మెంతైనాఁగద్దు
మేలమాడవయ్యా చెలి మీఁద మీఁద నున్నది"
11-298

మీఁదిమాటలు : *ప.బం; వి; బహు.* పైపై మాటలు, ఇచ్చకోలు మాటలు.
"చెప్పరే బుద్ధులు నాకుఁ జెలులాల మిమ్ము
మెప్పించుదాఁకా నుంటి మీఁదిమాట లేఁటివే"
16-102

మీఁదు : *వి.* పైభాగం, మీదిభాగం.
"భావింప నన్నేలితివి బలిమి తెంకాయ మీఁదు
చేవదేరు లోపలెల్లా జిగి మించుఁ దీపులు"
26-477

మీఁదుకట్టు : *ప.బం; వి.* ఎప్పటికో, ఎవరికోసమో ప్రత్యేకించు (పద.), ఏదేని సందర్భంలో మొక్కుకొని దేవునికి ముడుపు కట్టినది. (రా.సీ. మాం.)
"తొలుత నమ్మించితివి దోసము బుణ్యము నీది
మెలఁగి పాయము నీకే మీఁదుకట్టె గాక"
"ఎంత మీఁదుకట్టెనో యింతి నీకు జవ్వనము"
20-144

మీఁదెక్కై వుండు : పైకి ఎక్కి ఉండు. 'మీఁదేడు' అని పూ.ము.పా.
"కోరి శ్రీవేంకటపతి కుక్షిలోనే లోకములు
అరయఁగిందెడు మీఁదెక్కై వున్న వింతే" 3-14

మీఁదెత్తు : *ప.బం; స.క్రి.* దేవతాదులకు సమర్పించటం కోసం నియమించి ఉంచు.
"గుట్టున నా చన్నులు నీకు మీఁదెత్తినవే కావా
బెట్టుగాఁ బెనఁగి చేతఁబట్టేవుగాక" 12-364

మీదెత్తుట : మీదుకట్టు.
"పాటించి నీ భావము పట్టవశమా
మేటి నా మనసు నీకు మీదెత్తు టింతే" 2-261

మీలకు నీఁతలు గరపు : *ప.బం; అ.క్రి.* వ్యర్థమైన పనికి పూనుకొను. చేపలకు ఈదడం నేర్పు అని వాచ్యర్థం.
"నాఁతిరో చూడవే నవ్వుచు మీలకు
నీఁతలు గరపీ నిదె వీఁడు" 5-124

మీలపిల్లలకు ఈతలు నేర్పు : *ప.బం; అ.క్రి.* వ్యర్థమైన పనికి పూనుకొను.
"మేఁతలు మరిగిన మీలపిల్లలకు
నీఁతలు నేరిపె(పీ) యీ తరుణి" 5-294

మీసాలతేనె : *వి; ప.బం.* తాత్కాలికం, అశాశ్వతం, అల్పసుఖం.
"ఓ యమ్మ యేడకేడే వోయమ్మా
యీ యెడ మీసాలతేనె యీ వలపు" 19-407

మీసాలపై తేనె : *ప.బం; వి.* అల్పసుఖం.
"తీపువలెనే వుండు దిష్టపుఁబదార్థాలు
మేపుగొంటే మీసాలమీఁది తే నౌను" 2-240

మీసాలమీఁది తేనె నాకుట : *ప.బం; వి.* తాత్కాలికమైనది. అల్పమైనది.
"శ్రీపతి యీతఁడుండఁగాఁ జిక్కినవారి నమ్ముట
తీపని మీసాలమీఁది తేనె నాకుట సుండీ" 3-169

ము

ముంగమురువు : *వి.* ముంజేతికడియం, రూపాం. ముంగామురారి, ముంగైమురారి, ముంగామురువు, ముంగామురుము, ముంగమురుము, ముంగమురాము.
"ముచ్చువలె వచ్చి తన ముంగమురువుల
చేయి
తచ్చెడి పెరుగులోన తగఁబెట్టి" 4 అను. 20
"ముంగామురారి కడియము
ముంగామురువును మురుగును ముంగా

మురుమున్
ముంగమురము సూడిగమును ముంగమురా
మనఁగఁగటకమునకు నభిఖ్యల్!"
(ఆం.ప.ని.; మనుష్య. 245 ప.)

ముంగారుముంపు : (ముందు+కారు+ముంపు) *ప.బం; వి.* తొలకరివాన. (వ్యు.)
"ముసిముసి నవ్వుల ముంగారుముంపులు
వసివాడుఁజెమటవానలు" 9-230

ముంగారు మొయిలు : (ముందు + కారు + మొయిలు) *వి.* తొలకరిమేఘం, వర్షాకాలమేఘం.
"బంగారువంటిది చెలి పదారుగళల మించు
ముంగారుమొయిలువంటిది ముద్దుగురుసు"
23-83

ముంగిటవేయు : *ప.బం; స.క్రి.* బయట పారవేయు, బహిర్గతంచేయు.
"చిత్తమెల్లాఁ దక్కఁగొనె సిగ్గులు ముంగిటవేసె
వత్తివలె దేహమెల్లా వాడఁబారెను" 5-28

ముంగిట సంపద : *వి; ప.బం.* ముంగిటి నిధానం, ముంగిటి పెన్నిధి, అన్ని కోర్కెలను తీర్చేది.
"ముంగిట సంపద ముదిత సింగారము" 29-27

ముంగిటిధనము : *వి; ప.బం.* అన్నికోర్కెలను ఈడేర్చేది.

ముంగిటినిధానము : (8) *వి.* అందుబాటులో నున్న నిధి, పెరటికల్పకము.
"అంగవించి శ్రీవేంకటాధిప కూడితి నన్ను
ముంగిటినిధానమవై ముట్టి నన్నుఁ బాయవూ"
11-430 & 1-133

ముంగిటి బంగారు : *ప.బం; వి.* అందుబాటులో నున్న అమూల్యవస్తువు, ముంగిట నిధానము వంటిది.
"ముద్దుల నవ్వులు ముంగిటి బంగారు
అద్దములోఁ జిగురంటినది" 5-354

ముంగిటి ముగ్గులగు : *ప.బం; వి; బహు.* గృహాలంకారమగు, కళకళలాడు, ప్రకాశించు.
"ముంగిటి ముగ్గు లాయ మునుకొన్న సిగ్గులు"
29-402

ముంగిటి ముత్యము : *వి.* గృహాలంకారం, ముంగిలి యందున్న ముత్యం, నలుగడలవారికి కనబడుతూ చెలువారే ముత్యం, ముద్దుబిడ్డ.
"ముద్దుగారే యశోద ముంగిటిముత్యము వీఁడు
తిద్దరాని మహిమల దేవకీసుతుఁడు" 3-577

ముంగైమురాలు : (ముందు + కై + మురము) *వి; బహు.* ముంజేతికి ధరించే ఒకరకపు కడియాలు. చూ : ముంగమురపు ముంగైమురువులు.
"ముంగైమురాలు వెట్టేవు ముంచి నేఁ
బాదాలొత్తఁగా
అంగాలు నిన్ను దాఁకగా నందు కోరిచేవా"
13-517
"ముంగైమురాలును నవె మొలకతారును నదె
బంగారు నిగ్గులవన్నె పచ్చబట్టదే" 1-133

ముంగైమురువులు : (2) (ముందు + కై + మురువులు) *వి; బహు.* ముంజేత ధరించే ఒకరకపు కడియాలు. చూ : ముంగమురవు, ముంగైమురాలు.
"సంగతిఁ గొలువున్నాఁడు సవరాజ్యమేలుదువు
ముంగైమురువులచేత మొక్కవే నీ పతికి"
26-517

ముంగోపము : (ముందు + కోపము) *ప.బం; వి.* ఓర్పు లేక తటాలున వచ్చే కోపం.
"ముక్కుననే వున్నది ముంగోపమైతేను
యెక్కువ తక్కువలంటే నే మందువో" 14-206

ముంగోపి : (ముందు + కోపి) ముక్కోపి, తటాలున కోపపడే స్వభావం కలవాడు.
"ముంగోపులైనట్టి ముదితలనే కాని
కందుదీరి యెందుకును గైకొనరు" 21-338

ముంగోపితనము : *వి; ప.బం.* తటాలున కోపపడే స్వభావం, శీఘ్రకోపం.
"తక్కరి తమ గుణాలు తాము చూచుకోరుగాని
మొక్కలమై వున్నది నా ముంగోపితనము"
20-97

ముంచి : (5) అవ్య. అతిశయించి.
"ముంచి చెలి నవ్వితేను ముత్తేలే రాలీని,
యించుక గేలిసేసితే నే మాయనయ్యా" 20-167
"ముందరఁజంద్రుడు వచ్చి మొక్కితే యశోద చూచి
ముందేలా యంటినో యని - ముంచి వెరగందెను" 4-258
"మూలనెంత ధనమున్నా ముంచి దాన ధర్మములు
తాలిమితో నిచ్చినదే దాఁపురమై నిల్చును"
2-260

ముంజీతము : (ముందు + జీతము) వి. పనికి ముందుగానే ఇచ్చే జీతం.
"చుట్టరిక మెంచేవారి చోటికిఁ దల్లిదండ్రివి
ముట్టి కొలిచినవారి ముంజీతమవు" 3-508

ముంజు : వి. మెదుక, పిసక, మురికి.
"గొల్లముంజు రాచజిడ్డు వోరి బుద్ధుడైన సిగ్గు
చొల్లుగుజ్జుపు నూఁగురొచ్చులు మానునా(నగా?)" 7-198

ముంజూరు : (ముందు + చూరు) వి. ఇంటిమీది కప్పు ముందు చివర.
"దాకొన్న మోవిగంటి తానే చూచుకొమ్మనవే
లేకలు ముంజూరు నిండె లెక్కించుకొమ్మనవే"
19-477

ముంజేతి అద్దము : *ప.బం; వి.* స్పష్టమైన విషయం.

ముంజేతి కంకణము : *ప.బం; వి.* అందుబాటులో నుండేది, స్పష్టంగా కనిపించేది.
"అందరిని గన్నతల్లి ఆదిమూలమైన లక్ష్మి
కందువ నీ ముంజేతికంకణమాయను" 7-3

ముంజేతి కంకణాన కద్దమా : (2) *ప.బం.* స్పష్టమైన విషయమని అర్థం. ముంజేత నున్న కంకణం స్పష్టంగా కనిపిస్తుంది. దాన్ని చూడటానికి అద్దమవసరం ఉండదు కదా! అతి స్పష్టమైన విషయానికి మరో సాక్ష్యం అవసరం లేదని భావం.
"వద్దే నాతో నింక వట్టి సరసము
అద్దో ముంజేతికంకణాన కద్దమా యింక" 17-44

ముంజేతిచిలుక : *ప.బం; వి.* అందుబాటులో నుండేది, స్పష్టంగా కనిపించేది.
"చెలరేఁగే ముంజేతిచిలుకవో వలపు
నిలువు నూరు వండేటి మొలకవో వలపు"
7-212

ముంజేయి : (4) (ముందు + చేయి) *ప.బం; వి.* మణికట్టు వరకు గల మోచేతి కిందిభాగం.
"చిలుక ముంజేతఁబట్టి చేరి పలికించనేలే"
29-101

ముంటికి వాడిపెట్టు : *ప.బం; అ.క్రి.* వ్యర్థమైన పనికి పూనుకొను.
"నంటుసేయ నోపుదుము నగ నీతో నోపుదుము
ముంటికి వాఁడివెట్టఁగ ముందే వోపము"
20-593

ముంటికొనవాదులు : *ప.బం; వి; బహు.* తీక్ష్ణములైన వాదాలు.
"నేఁడు గొత్తలా తన నేరుపు లివి
వాఁడివెట్టి ముంటికొనవాదు లడిచేనా" 8-298

ముంటిపై సుఖమందుట : *ప.బం; వి.* అసాధ్యమైనది, దుష్కరము, కుదరనిది.
"ముంటిపై సుఖమందుట ......
వెంటఁ గర్మమార్గమున విష్ణుని సాధించుట"
6-49

ముంతనీళ్లనే మునుగు బతుకు : *ప.బం; వి.* అతిసంకుచితమైన జీవితం.
"ముంత నీళ్లనే మునిగే బ్రదుకు"
1-151 పుట. old

ముంతల ముంచిన : *విణ.* అధికమైన.
"ముంతల ముంచినయట్టి మోహములు చల్లఁగాను
వంతులకుఁ గొసరేటి వనితయుఁగలదా"
22-332

ముంతలోని నీట మునిగి లేచు : నానుడి; అతిసంకుచితమైన జీవితం గడపు.

"ఎంత సేసినా నెడయకే పోయ
ముంతలోని నీట మునిఁగి లేచుట" 1-71

ముందటెత్తు : (?)
"అందరికొక్కటే చాలు ఆండ్లకు మొగలకు
ముందటెత్తు వేరె నీతో మోవనాడ వలెనా"
22-63

ముందర నుయ్యి వెనకఁ దగరు : *ప.బం; వి.* రెండువైపులా ఆపద పొంచి ఉండడం. ముందర బావి వెనుక పొటేలు అని వాచ్యార్థం.
"ఈ రీతి ముందర నుయ్యి యెంచ వెనకఁ దగరు
యేరా నీతోడి పొందు యేమి సేతు నిఁకను"
21-458

ముందర పారెడి తేరు ముంచి వెనకా పులి : *ప.బం; వి.* రెండువైపులా పొంచి ఉన్న ఆపద.
"ముందర పారెడి తేరు ముంచి వెనకా పులి
యిందిరారమణుఁడే దిక్కు యిఁకఁ జేసేదేమి"
15-94

ముందర ముసళ్లపండుగ : *ప.బం; వి.* ప్రధానమైన విషయం ముందున్నదనుట.
"చెప్పితిఁ జెప్పితిని మాతోఁజెల్లదు నీకింకను
ముప్పిరినున్నది ముందర నిదివో
ముసళ్లపండుగ" 17-88

ముందరవెనుకలగు : *ప.బం; అ.క్రి.* తలకిందులగు.
"వలచి తిరువేంకటేశ్వరునిం బొందిన మరుని
తలఁపులన్నియు ముందరవెనుకలాయె" 4-49

ముందరి చెవులకంటే వెనక వచ్చే కొమ్ములు వాఁడియగు : నానుడి; కొత్త స్నేహితులో, చుట్టాలో ముఖ్యులైన పాతవారిని మఱచి పోయినప్పుడో, ఉపేక్షించినప్పుడో ఉపయోగించే పలుకుబడి.
"ముప్పిరి నేమి చూచేవే ముందరి చెవులకంటే
గొప్పలై వెనకవచ్చే కొమ్ములు వాఁడాయనే"
17-35

ముందలపట్టు : ప.బం; అ.క్రి; మాం. (రా.సీ.) తలవెంట్రుకలుపట్టు.

"ముందలేల పట్టేవు ముడిచేనంటా పూవులు
చెంది నాకు నితవరి చేతవలెనే" 27-122

ముందు ముందే : (3) తొలుతనే, మిక్కిలి పూర్వమే.
"ముందుముందే వలపులు మోపులు గావా"
28-260
"ముందుముందే చెనకితే మొగచాటై వుండును"
25-261

ముందువెనుక : (6) అన్నివిధాలా, సమగ్రంగా.
"అందెనందె మోక్షము హరిదాసులవల్లను
ముందువెన కెంచితేను మూలమే హరి" 4-221

ముంబారము : (ముందు + బారము) వి. ముందరిభారం.
"ముందరనె యెనసెటి శరముల
ముంబారము గడవఁగ వసమా" 10-2-112

ముంభారము : (ముందు + భారము) వి. ముందరిభారం.
"చెప్పఁగరాదీ వలపులు చెలివల
నెవ్వరిఁగానము
ముప్పిరి జవ్వనభారపు ముంభారము
గాఁబోలు" 17-390

ముకుందము : వి. 1. ఒక నిధి 2. ఒకానొక గంధద్రవ్యం 3.పాదరసం 4. మణివిశేషం 5. ఎఱ్ఱదామర.
"కాఁగిటను శ్రీవేంకటగిరి ముకుందంబు
మూఁగిన వరములెల్ల ముంగిటందు" 9-202

ముకుచాయ : *ప.బం; వి.* ముక్కుసూటి.
"జాడతో భూమెల్లా ముకుచాయనె
యేలినవాఁడు
వేడుకఁగంబసూత్రపు వేసాలవాఁడు"

ముకుదాఁటఁ గాలు గుచ్చు : *ప.బం; అ.క్రి.* అదేపనిగా తగాదాకు పిలుచు. (పద.)
"కావలసిన పనులు రాకమానీనా నీవు
కావరాన ముకుఁదాటఁ గాలు గుచ్చే వేలరా"
26-159 భార. ఉ. 3-220

ముకెము : వి. 'ముఖ్యము' నకు వికృతిరూపం.
"ముకెమై వుభయకర్మములు బంధహేతువని
ప్రకటించి వేదాంతపఠనమే యెక్కుడు" 4-188

ముక్కపోవు : *ప.బం; అ.క్రి.* మొక్కవోవు, కుంఠితమగు.
"తక్కక పరస్త్రీలఁ దలంచి మనసు బుద్ధి
ముక్కపోయ మాకు నేఁటి
ముందరిపుణ్యములు" 2-61

ముక్కర : *వి;* రూపాం. ముక్కఱ (ముక్కు + ఱాయి) ముక్కుకు ధరించే ఆభరణవిశేషం.
"ముద్దుల పెదవిమీద ముక్కర గదలఁగాను
వుద్దండపు మాటలాడె నువిద నిన్ను" 26-301

ముక్కలువోవు : (ముక్కలు + పోవు) ముక్కపోవు, కుంఠితమగు.
"పచ్చివలెనే తోఁచు పండ్లు ముక్కలువోవు
మచ్చికఁగాంతలతోడి మదనసుఖము" 15-47

ముక్కాలిపీఁట : వి. మూడుకాళ్లు గల ఒకరకపు పీట. రూపాం. ముక్కలిపీట.
"ఎనసితినే నిన్ను యింతలో శ్రీవేంకటేశ
అనువై ముక్కాలిపీఁట వైతివిగా యిపుడు"
21-229

ముక్కు తిక్కలు : *వి; ప.బం; బహు.* (?)
"ముక్కుతిక్కలకుఁదెచ్చి మోము చూచి నవ్వి నాతో
నొక్కటైతి వింతలోనే వోరీ పోరా" 14-312

ముక్కునఁగోపము : *ప.బం; వి.* తొందరగా వచ్చే కోపం.
"మొక్కళపుఁదుమ్మిదలు మూఁగీఁ గన్నుల తుద
ముక్కునఁగోపము లేలే ముట్టినంతలోననే"
19-434

ముక్కునఁగోపము నిండు : *ప.బం; అ.క్రి.* తొందరగా కోపం కలుగు.
"ముక్కునఁగోపము నిండె ముందరనుండిన యీపె
తక్కించి నీవు పరులఁదప్పక చూడఁగను"
19-579

ముక్కున కోపముండు : *ప.బం; అ.క్రి.* తొందరగా కోపం కలుగు.
"ముక్కున నుండుఁ గోపము ముంచి నీవంటి వానికి
నిక్కి మాతో నవ్వరాకు నీవెన్నడు నయ్య"
14-374

ముక్కున నున్న ముంగోపము : *ప.బం; వి.* మిక్కిలి అధికమైన కోపం.
"ముక్కున నున్నది ముంగోపం బిది
ఎక్కువ శాంతం బిందున్నదో" 15-50

ముక్కున ప్రాణముండు : *ప.బం; అ.క్రి.* అవసానదశలో నుండు.
"ముక్కున నున్నది ముందటఁ బ్రాణము
ఎక్కడ నమ్మెదిఁక బ్రదుకు" 4-131

ముక్కున ముంగోపము : *ప.బం; వి.* మిక్కిలి కోపము, అతిత్వరగా వచ్చే కోపము.
"ముక్కునఁదనకే ముంగోపము మరి
తక్కరి రమణుఁడు తగునా తనకు" 20-150

ముక్కున వయ్యంగ దిను : *ప.బం; స.క్రి.* బాగా తిను. ముక్కులో వచ్చునట్లుగా అని కూడా వాడుకలో వినవస్తుంది.
"వెక్కసాన రేపల్లె వెన్నలెల్లా మాపుదాకా
ముక్కున వయ్యంగ దిన్న ముద్దులాఁడు"
6-144

ముక్కుపై వేలంటుకొను : *ప.బం; అ.క్రి.* ఆశ్చర్యపడు.
"అదేల ముక్కుపై వేలంటుకొనేవే ఇందరు
ఇదె యీతని పొత్తున నేసేరంటా" 25-165

ముక్కుపై వేలిడుకొను : *ప.బం; అ.క్రి.* ఆశ్చర్యపడు.
"అక్కడనే విడెము నీ కాపె వొసఁగినదంటా
ముక్కుపై వేలిడుకొను మోనమున నున్నది"
29-68

ముక్కుమీఁద వేలిడు : *ప.బం; అ.క్రి.* ఆశ్చర్యపడు.
"ముక్కుమీఁద వేలిడుక మోనమున నే నుండితే
తక్కె సిగ్గుల మునిఁగే తాఁదానే" 8-36

ముక్కుమీఁద వేలువెట్టు : *ప.బం; అ.క్రి.* ఆశ్చర్యపడు.
"వెరగంది ముక్కుమీఁద వేలువెట్టే వది యేమే
తెరవేసు కాతఁడు నీ దిక్కు చూడఁగాను"
29-407

ముక్కుమీఁది వేలు : *ప.బం; వి.* ఆశ్చర్యం.
"ముక్కుమీఁదివేలితోడ ముందట నుండేఁగాక"
7-338

ముక్కుమొకము చూచు : *ప.బం; అ.క్రి.* ఆదరించు.
"ముక్కుమొకముఁ జూడవు ముదితైతేఁ జేకొనేవు
నిక్కిన తృణగ్రాహినీలము వలె" 23-391

ముక్కుల చన్నులు : *ప.బం; వి; బహు.* చూచుకములు గల స్తనాలు. (ముక్కులు = చూచుకములు)
"చెక్కులు నీకు నొక్కఁగా సేదదేరుదువు గాక
ముక్కుల చన్నుల నేలే మొనపోట్లు" 21-120

ముక్కువట్టు : *ప.బం; అ.క్రి.* నిర్బంధించు.
"ముక్కువట్టినట్లు యీ మోహము నీవు చల్లితే
వొక్క నీసేవ సేసుకవుండేరా నేను" 11-260

ముక్కువాత నుండు : *ప.బం; అ.క్రి.* చివర ఉండు.
"యెనసి ప్రాణవాయువు లవి సొమ్మని నమ్మితి
మొనసి లోనువెలినై ముక్కువాత నున్నవి"
3-41

ముక్కెము : *వి.* 'ముఖ్యము' అనే దానికి వ్యావహారిక రూపం.
"యెంగిలి మోవు లిచ్చేది యిటు చన్నులఁగుచ్చేది
ముంగిటిరమణులకు ముక్కెమే కాదా" 20-237

ముఖరము : (?)
"ముఖరమై మాఁకులకు మొదలఁబోసిన నీరు
శిఖలకు దనువెక్కి చిగిరించినయట్టు" 4-340

ముగియు : *అ.క్రి.* మరణించు, చచ్చు.
"మోవ మూఁతి గిరిపితే మూఁడులోకాలు
మోవిఁబార నవ్వితేనే ముగిసి రసురులు"
2-156

ముగుదతనము : *వి.* (ముగుద + తనము) గోలతనం, ముగ్ధత్వం.
"ముగుదతనాన నాపె మోనముతో నుండఁగాను
నగుమంటా గోరనేల నాఁటించేవు" 28-38

ముగుసును : *క్రి.ప.* 'ముగియును' అనే గ్రాంథిక రూపానికి వ్యావహారికరూపం.
"ఏది తుద యెన్నఁడు ముగుసును
ఆదికి ననాది హరిమాయ" 15-4

ముగ్గు : *అ.క్రి.* 1. కంకులు పూర్తిగా ముదిరి ఫలించు 2.మాగు, పండు, పక్వమగు.
"బగ్గన నక్కడ నిన్ని పనులు గలిగినాను
ముగ్గిన యీవేళకు మూట గట్టరాదా" 14-63

ముగ్గుపిండి : *వి.* ముగ్గువేయడానికి ఉపయోగించే పిండి.
"బగ్గన శ్రీవేంకటాద్రిపతి నన్నుఁగూడె నిఁక
ముగ్గుపిండి అట్లకు మొదలయ్యీనా" 11-160

ముగ్గువేయు : *స.క్రి.* పండవేయు.
"ముసుగులు వెట్టితేను ముగ్గు వేయదా
పొసఁగ నీ గుణములు పొగడవలెఁగాక" 26-432

ముచ్చటలచ్చటలాడు : ప.బం; *అ.క్రి.* ముద్దు ముచ్చటలాడు.
"ముప్పిరి నితవుతోడ ముచ్చటలచ్చటలాడి
యెప్పుడూఁబాయకుండెడి ఇల్లాలు" 22-524

ముచ్చటాడు : *ప.బం; అ.క్రి.* ముచ్చటగూర్చు.
"మోవిపై విడెపు కెంపు ముచ్చటాడంగ" 5-334

ముచ్చము పట్టు : *ప.బం; స.క్రి.* గుర్తుపట్టు.
"అలరులు ముడిచేనంటేఁదా లోఁగిని
మలసి వాడుఁజూపుల మచ్చము వట్టేనా"
11-361

ముచ్చింత: వి. ఒకానొక నోము, మూగనోము. (మూగచింతలమ్మ > మూ చింత > ముచ్చింత)
"నెమ్మదిని కన్నీట నిండుఁగొలఁకులు నీమె
ముమ్మడించిన వగల ముచ్చింత నోమె" 5-127

ముచ్చిమి: (ముచ్చు + ఇమి) దొంగతనం.
"అచ్చపు శ్రీవేంకటేశ అట్టె నన్నుఁగూడితివి
ముచ్చిమి దీరినమీఁద మొక్కు లేల యిఁకను" 11-551

ముచ్చిమికూడు: వి. దొంగకూడు, దొంగసొమ్ము. (ముచ్చిమి = రాత్రి, అర్ధరాత్రి)
"తీరని వేడుకతో తిరుమంగయాళువారి
ఆరడి ముచ్చిమిగూటి కాసపడ్డవాఁడు" 1-121

ముచ్చిమిపొద్దు: వి. దొంగలు తిరిగే వేళ.
"చెలిచుక్కలన్ని కోరికలతోడ చిత్తము నీకిచ్చు కుండఁగా
పొలసి ముచ్చిమిపొద్దున నెడ పూఁబోడిఁ
బిలిచేవయ్యా" 10-2-106

ముచ్చుఁగన్న తల్లి మూలకు నొదిగినట్టు: నానుడి; తన వారి న్యూనత బయటపడుతుందేమో నని దూరంగా ఉండు.
"ముచ్చుఁగన్న తల్లి మూల కొదిగినట్టు
ముచ్చిమినుతులేల మొక్కరో హరికి" 2-494

ముచ్చో చిచ్చో: కొండో నుయ్యో వంటి పదం.
"రచ్చ మాని చింతకిందు రాఁపుల కూటమి పొందు
ముచ్చో చిచ్చో మూఢులాల" 1-160

ముట్టితే మూయగు: ముట్టినదెల్లా బంగారమగు వంటి నానుడి.(?)
"మోనమున నిందరిలో ముట్టితే మూయాయఁ
యీ నవ్వులలోఁ గంటిమి ఇంటికి రారాదా" 25-378

ముట్టినదెల్లా ముయి: ముట్టినదెల్లా బంగారం వంటి ప్రయోగం.
"ముట్టినదెల్లా ముయి పట్టినదెల్లా బంగారు
అట్టుసేయరాదు మేలాఅడి కక్కనే" 14-80

ముట్టుపడు: ప.బం; అ.క్రి. కలతపుట్టు (పద.) సంకటపడు (శ.ర.)
"పట్టియుఁ బట్టఁగరాని పాయములో మర్మము
ముట్టుపడ్డ పతిమీఁది మోహ మిదిగో" 9-126

ముట్టుపాఁత: వి. ముట్టువస్త్రము, ముట్టుబట్ట.
"ముట్టుపాఁతవలె మురిగిన దేహము
గుట్టునఁ దాఁచితిఁ గొన్నాళ్లు" 4-17 అను.

ముట్టుపెంచు: వి. అంటుపడినవారు తాకిన మట్టిపెంకు. ప్రభాకరశాస్త్రిగారు దీనిని మట్టిపెంచు అని భావించినారు. (చూ: తాళ్లపాక అన్నమాచార్యులవారి జీవితచరిత్ర వివేకదీపిక - 6 పుట.)
"మించువంటిది రూపు మేలింతయును ముట్టు
పెంచు వంటిది, దీని ప్రియమేమి బాఁతి" 1-112

ముడికాఁడు: (ముడి + కాఁడు) వి. ధూర్తుఁడు. (సాంబ. 9 ప.) సంధానం చేసేవాడు, కూర్పరి.
"ముడికాఁడిద్దరి మీఁద మొకమోటమే తనకు
అడఁచీనా యిద్దరివాడాడకేలే నేను" 26-146

ముడికారి: వి. ముడియవిడుపు, దొంగ.
"ముడికారి సట లేలె ముదితా
ముడి నీ సిరసునఁ గొమ్ముడి యిదె కదరా" 9-72

ముడికారితనము: (ముడి+కారి+తనము) వి. దొంగతనం, ధూర్తత్వం.
"ముడికారితనముల మునిముచ్చువాఁడమ్మ
బడిబడి నుద్దండపనులు మానుపవో" 22-69

ముడిగిన మంత్రము: వి. రహస్యమంత్రము.
"మునికొని వేదముల ముడిగిన మంత్రము
కొననాలికలలోఁ గుదురై నిలిచె" 3-10

ముడిగొను: (ముడి + కొను) స.క్రి. ముడుచు. (శ.ర.)
"ఇంకా నో దైవమా యేల వెట్టి దవ్వించేవు
కొంకి తెంచి ముడిగొంటే కుఱుచే కాదా" 3-175

ముడిచివేసిన పువ్వు: వి. వాడిన పువ్వు, నిష్ప్రయోజనం.
"ముచ్చటఁ బదారువేలు ముడిచి వేసిన పువ్వు

తెచ్చి నే దాఁచుకొంటి దేవర యెరఁగదా" 14-79

ముడిదీరు : *ప.బం; అ.క్రి.* కోకముడి విడు.

"కడుగుట్టు నేఁజేసితే కాఁగిలించుకొంటి విట్టె
ముడిదీరె నిటమీఁద మొక్కే నిదె" 11-63

ముడిపువ్వు : *వి.* కొప్పులోని పువ్వు. (ముడి = జుట్టుముడి) సిగపువ్వు, ముడిచిన పువ్వు.

"కొమ్మ ముడిపువ్వులు నీ కొప్పులోన నుండఁగా
నే ముమ్మాటికి చేతులపై మొక్క వచ్చేవు" 29-334

"ముడువవే శిరసున ముడిపువ్వులూ
కడలేని వవియెకా కంతునమ్ములూ" 21-250

ముడియ : (3) *వి.* మూట.

"చెప్పరాని మాటలు చెవులొగ్గి వినరాదు
విప్పరాని ముడియలు విడువరాదు" 18-60

"కట్టిపెట్ట వశమా గాలిముడియ గాఁగ
వొట్టిన నీ మోహమును నట్టిదే కాదా" 24-169

ముడియగట్టు : *స.క్రి.* మూటగట్టు.

"మొయిలువంటి వయసు ముడియగట్టఁగ రాదు
నయముగ బుద్ధిచెప్ప నా వసమా" 13-31

ముడియము నారసింహుడు : *వి.*కడపజిల్లా జమ్మలమడుగు తాలూకాలో కుందేరునది ఒడ్డున పెద్దముడియము అనే గ్రామం ఉంది. దీనికి పడమటివైపున ప్రాచీనకాలంనాటి దిబ్బ ఒకటి ఉంది. అక్కడ ప్రాచీనమైన దేవాలయాలు ఉన్నాయి. అందులో ఒక దేవాలయంలో వెలసిన నృసింహస్వామి.

"జయమాయె నీకు నాపె సరసములూ
నయగారి ముడియము నారసింహా" 11-139

ముడియలుగట్టు : *ప.బం; అ.క్రి.* మూటలుగట్టు.

"జాలితోడ విరహాన సారెకు నిట్టూర్పులు
గాలిముడియలు గట్టీఁగామిని" 29-356

ముడివేయు : *స.క్రి.* ఒకదానికొకటి కూర్చు.

"గుట్టుతోడ జలనిధిపై గొండలు ముడివేసితి
వెట్టు మఱవఁగ వచ్చునివి రామచంద్ర" 19-165

ముడుగు : *అ.క్రి.* 1. చాపచుట్టుగ చుట్టుకొను 2. తగ్గు, క్షీణించు 3. చేష్టలుడుగు 4. సంకోచించు 5. ముకుళించు 6.చచ్చు, నశించు 7. ముడుతలు పడు.

ముడుగు : *వి.* అవయవసంధి. 5-19

"మొక్కుచును మోకాళ్లముడుగు గడచినమీఁద
నక్కడక్కడ వేంకటాద్రీశు సంపదలు అంతంతఁ
గానరాఁగాను" 1-227

ముడుపు : *వి.* దేవునికి మొక్కుకొని డబ్బు మొ॥ వాటిని ఒక పసుపుగుడ్డలో కట్టినది. దీన్నే ముడుపు అంటారు.

"కట్టిన ముడుపగు ఘన కృష్ణభక్తి
ముట్టిన పాపవిమోచనము" 3-564

ముడుపుకట్టు : *ప.బం; వి.* ఉపయోగించక అట్లే ఉంచు దానినిబట్టి వచ్చిన మాట. ముడుపుకట్టిన వస్తువును అనుభవించక అట్లే దాచి ముడితో ఉంచవలెను.ఏ దేవునికో మొక్కుకొని పసుపుగడ్డలో ధనం మొ॥వాటిని ఉంచి దేవాలయంలో ఒకచోట కట్టు.

"పువ్వువంటియాస ముడుపుగఁ గట్టికొంటిఁ గాక
నివ్వటిల్ల బొమ్మముడి నీపైఁ బెట్టితినా"

"కట్టిన ముడుపగు ఘనకృష్ణభక్తి
ముట్టిన పాపవిమోచనము" 3-564

ముడుపు కొంగున గట్టు : *అ.క్రి.* దేవునికి మొక్కుకొని డబ్బును చీరకొంగున కట్టు.

"ముడుపు కొంగున గట్టి మూలమూలల వెదకే
వెడమతినై నే వెర్రుఁడ నైతి" 1-19

ముడుపుగట్టు : *స.క్రి.* దేవునికి మొక్కుకొని డబ్బును చీరకొంగున కట్టు.

ముడెగట్టు : ముడియ (మూట) కట్టు. ముడియ 'ముడె' గా మారవచ్చు.

"వడిఁబెట్టి మీరేల వట్టి దూరులు దూరేరే
ముడెఁగట్టి తన నవ్వు ముంగిటనే పెట్టరే"
24-346

ముత్తరములు : *వి.* 1. మూడు వరుసలు 2. మూడువిధాలు 3. మూడు పురుషాంతరాలు.

"ముత్తరపుఁదమకము" 12-42

ముదల : వి. చూ : ముదుల.

"అనుమాన మెల్లఁ బోసి అలుక లిన్నియుఁ దేరే

మొనసి కూటమికి నా ముదల గావలెనా"

17-161

ముదలించు : స.క్రి. 1. అడుగు 2. మార్కొను. (శ.ర.)

"ఇక్కువతో శ్రీవేంకటేశుఁడు తా నన్నుఁగూడె

మొక్కితిఁ దన నేరుపు ముదలించనేలే" 12-338

ముదిమదిదప్పు : (2) ప.బం; అ.క్రి. ముసలితనంవల్ల మతిదప్పు. ముసలితనంలో మనస్సు స్తిమితం తప్పుతుందనడంపై వచ్చిన పలుకుబడి.

"అలరి శ్రీవేంకటేశుఁ డాత్మలో నుండఁగాను

అల ముదిమది తప్పుటది వెఱ్ఱి గాదా" 15-67

ముదుగు : దళసరి, ముతకతనం, మోటుమాట, కఠినోక్తి.

"చేవలఁ బత్తి ముదుగుచేని ముదుగూ లేదు

వావిరిఁ బోగెత్తేటి వారివారి నేరుపు" 2-90

"పచ్చిదేరే మాటలాడి పల్లె లావువారిఁదెచ్చి

ముచ్చిలి చే చాఁచఁబోతే ముదుగులే కావా"

21-205

ముదుల : (3) వి. 'ముదల'కు వ్యావహారికరూపం. 1.అంగీకారంతో ఇచ్చిన డబ్బు 2. ఆజ్ఞ 3. లక్ష్యం, గురి 4.గనిమ చేరికనేల. (సూ.ని.)

"ఆ సతి మరఁగువాఁడవన్నిటా నీవు

మోసపోక నీ వాపె ముదుల దేరాదా" 8-197

ముదులకించు : (5) 1.ముదలకించు, ఎత్తిపొడుచు 2.వర్ణించు, ప్రశంసించు 3. ఎదుర్కొను 4. హెచ్చరించు.

"మోసపోక నీమాఁట ముదులకించి

వాసితో తానే యీడకు వచ్చునో యేమో"

16-239

ముద్దరించు : స.క్రి. 'ముద్రించు' కు వ్యావహారికరూపం.

"కొద్దిగా మాటాడినాను కోరి నీతోనే కాని

ముద్దరించి పరులతో మోనమే చెలి" 20-144

ముద్దుగారు : ప.బం; అ.క్రి. మనోజ్ఞంగా ఉండు.

"వన్నెల నీ కోపమింత వద్దు నీకు నీ యాస

కన్నుల నవ్వుల ముద్దుగారీని బాలుఁడు" 1-57

ముద్దుగునియు : ప.బం; స.క్రి. ముద్దులు గుడుచు.

"తల్లిదండ్రి గలవాఁడు తప్పులేమైనాఁ జేసి

తల్లితో ముద్దుగునిసి తప్పించినట్లు" 3-449

ముద్దుర : వి. 'ముద్ర'కు వికృతిరూపం.

"వీడక ముద్దురతోనే వున్నవి నే మెరఁగము

జాడతోడ నీకు నీవే చదువుకోవయ్యా" 29-355

ముద్దులాఁడు : (ముద్దులు + ఆఁడు) ప.బం. మనోజ్ఞుఁడు.

"మొత్తకురే యమ్మలాల ముద్దులాఁడు వీఁడె

ముత్తెమువలె నున్నాఁడు ముద్దులాఁడు" 6-144

ముద్దులు గునియు : ముచ్చటలాడు.

"ముద్దులు గునియువారు ముచ్చటలాడెడివారు

గద్దించి తిట్టెడివారు గలరు నీకు" 5-377

ముద్రధారి : వి. శ్రీవైష్ణవులకు విధింపబడ్డ పంచసంస్కారాల్లో ఒకటైన ముద్రలను ధరించినవాడు. చూ : ముద్రలు

"ఒక పనివాఁడనై వూని ముద్రధారినైతి

మొకమోడి యిందుకే గోముున నేలు నన్నును"

2-2

ముద్రలు : వి; బహు. శ్రీవైష్ణవులకు విధింపబడ్డ పంచసంస్కారాల్లో ఒకటి. సదాచార్యుని చేతిమీదుగా శిష్యుడు తన భుజములందు ధరించే అగ్నితప్తమైన సుదర్శనచక్ర, పాంచజన్యముల గుర్తులు.

"నిలిపినాఁడీతఁడే కాని నిజముద్రాధారణము

మలసి రామానుజాలే మాటలాడే దైవము"

2-372

ముద్రుంగరము : (ముద్ర + ఉంగరము) వి. ముద్రగల ఉంగరం.

"పట్టిన ముద్రుంగరపు ప్రధాని కెదురు లేదు

కుట్టిచాతనివారికిఁ గొంకు లేదు" 2-237

మునికొంగు : వి. ముందుకొంగు .

"తెరలోనికేఁగే వేమే దిష్టించి చూచి యాతఁడు

పరఁగ నీ మునిగొంగు వట్టి తియ్యఁగా" 13-409

మునిమార్గము : వి. ముందుమార్గము .

"ముదిత నినుఁదలపోసి మునిమార్గమునఁ జెలఁగె

మొదల నివ్వెరపాటు మోసంబుతో" 7-290

మునిముంగిలి : (2) *ప.బం; వి.* ఎట్టయెదుట .

"మునిముంగిటికి వచ్చి ముచ్చటనవ్వులు నవ్వి

తనుఁదానే పాటవాడీ తలుపుదండ" 29-470

మునిముచ్చువాఁడు : *ప.బం; వి.* చూస్తుండగానే మోసగించి దొంగిలించేవాడు, పచ్చెకాడు, పశ్యతోహరుడు. ఇట 'వాడు' అనేది స్వార్థంలో చేరింది.

"ముడికారితనముల మునిముచ్చువాఁడమ్మా

తడమారి ఇందరిలో తాటఁ గట్టమ్మా" 22-69

మునిరుషులు : *వి; బహు.* మునులు, ఋషులు. రెండూ ఒకే అర్థం గలిగిన శబ్దాలు.

"పొద్దైన మునిరుషులు బహుముఖములే కాని

సోదించి వొకమాట చూపంగలేరు" 3-570

మునివాఁడు : వి. ముందఱవాఁడు .

"ఆనుక శ్రీవేంకటేశ ఆతుమ నీ వుండఁగాను

మోనాన నీకు మొక్కేటి మునివాఁడ నేను"

4-342

మునుక : ముందు – 'వెను' వెనుక అయినట్లుగా 'మును' మునుకు అని ఏర్పడి ఉంటుంది.

"మునుక వెనకెంచక ముచ్చట లెట్టాడవచ్చు

ఘనుఁడాతని తలఁపు గనుకొందమే" 27-582

మునుకొను : *అ.క్రి.* ఎదురుబడు, ముందగు, పూనుకొను, జాగరూకుడై ఉండు, ప్రారంభించు, అతిశయించు, ముందుపెట్టుకొను.

"మూరెఁడు దురుము వంచి మునుకొని మొక్కీ నీకు

తేరకొనఁ జూచాకెను దీవించవయ్యా" 29-359

మునుపు : *స.క్రి.* ముని = మునిపు = ముళిసు = కోపము anger, wrath, passion, rage, enmity ఇత్యాదిగా కిట్టెల్. దాని రూపమే మునిపితే కావచ్చు అని సం.ప.స. (23 సం.) కోపగించు అని అర్థం.

"తనిసితే గోరికలు తప్పక దైలువారు

మునిపితేఁ బంతములు ముప్పిరిగొను"

23-117

మునుపు వెనుకలు : *వి; బహు.* పూర్వాపరాలు.

మున్నాడు : *ప.బం; అ.క్రి.* ముందుకు వచ్చు.

"విడిచిపోవని యాస విజ్ఞానవాసనల

గడచి మున్నాడె నెక్కడి వివేకములు" 1-327

మున్నిటి వెనకలు : *వి; బహు.* పూర్వాపరాలు, ముందు వెనుకలు.

"యిన్నిటా శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి

మున్నిటి వెనకల యీ ముచ్చటలే యిఁకను"

11-368

ముప్పిరి : వి. మూడురెట్లు. 1-505

"అప్పు దనమీఁద మోచి అదె యెన్నాళ్లు వుండె

ముప్పిరి వడ్డి వారక మూలనుండినాఁ బోదు"

1-505

ముప్పిరిగొను : *ప.బం; అ.క్రి.* పెనుగొను, చుట్టుకొను, అతిశయించు, మూడు మెలికలు కలదగు.

"ముప్పిరిగొన్న వయసు ముంచి యాసలు రేఁచఁగా

చెప్పరాని వలపుల జిమ్మిరేఁగేని" 28-197

ముమ్మడించు : (2) *అ.క్రి.* ముబ్బడించు, ముమ్మడిగొను, మూడురెట్లు కలదగు, ముమ్మడగు.

"ముచ్చట నీ వాడఁగాను ముమ్మడించె నిదే మేలు

ఇచ్చక మాడవమ్మ ప్రాణేశునితోను"

20-482 & 5-237 old

ముమ్మడినాఁగు : వి. మూడువంతులు ఎక్కువగా ఇచ్చే ధాన్యరూపమైన వడ్డీ.

"కంటిమి నీ జాడలెల్ల కడు దిష్టమాయెను
నంటువావులు ముమ్మడి నాఁగు కిచ్చేవు"
23-355

ముమ్మదము : (మూడు + మదములు) 'ముమ్మఱము'నకు రూపాంతరంగానో, వ్యావహారికంగానో వాడినట్లున్నది. లేక రూప-యౌవన-ఆభిజాత్య మదములు మూడుగానీ, కాయిక - వాచిక - మానసికములగు మూడు మదములు గానీ కావచ్చునని సం.ప.స. (21 సం. 387 పు.)

"వద్ద నున్నారము నేము వాడికవార మెల్లాను
కొద్దిమీరి ముమ్మదము కుంగ దెఁ(దెం)తైనాను"
21-336

"మఱచి ముమ్మదముతో మాఁకువలె
నుండినాను
గుఱిగా గోరు సోకితే కోరికలు రేఁగును" 23-297

ముయి[1] **:** వి. మాట, నింద అని సం.పా. (f.n.)

"చెనకఁగఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
మునిపితే ముయాయ మోహమెందుఁ గలదే"
26-68

"నడచీఁ బరుషలు నానాముఖముల
ముడుపులు చదువరొ ముయిగా నరులు"
(22-96)

ఇట 'ముయి'కి శ్రద్ధ, భక్తి అనే అర్థాలు తోస్తున్నాయి.

ముయి[2] **:** వి. కానుక, పెండ్లినాడు చదివించే కానుక, దేవునికి సమర్పించే మొక్కుబడి.

"నడచీ పరుషలు నానాముఖముల
ముడుపులు చదవరొ ముయిగా నరులు"
28-96

ముయి : వి. మూత.

ముయికిముయి : ముయి అంటే వివాహాదుల్లో ఇచ్చే కానుక. దానికి బదులివ్వడం ముయికి ముయి. ఇది కన్నడపదం. కూడువ ఉడుగర, వధూవర రిగనంటి రిష్టరు కూడువ, ఒళువళి, ఉడుగర, ప్రతిఫల, పడదుదక్కిప్రతి యాగి కూడువుదు అని కన్నడ నిఘంటువు. రూపాం. ముయ్యికి ముయ్యి.

"నయగారితనముల నవ్వులెల్లా నవ్వేవు,
ముయికి ముయి మళ్లించ ముచ్చట గాదా"
14-69

"ముట్టినదెల్లా ముయి పట్టినదెల్లా బంగారు
అట్టు సేయరాదు మేలాఅడి కెక్కనే" 14-80

ముయికి ముయి వెట్టు : కానుకకు ప్రతిగా కానుక పెట్టు, మారుకు మారు పెట్టు.

"ముయికి ముయివెట్టేది మున్నిటివారి తగవు
నియతి నీవు మెచ్చిన నేను మెచ్చితి" 24-84

ముయిముచ్చటలు : (?)

"ముట్టితేనే ముయి ముచ్చటలూ
అట్టుసేయ నాఅడిదాననా" 13-208

ముయ్యంచు చంచలము : వి. ధర్మార్థకామాలనే త్రివర్గాలపై అపేక్ష, మోక్షాపేక్ష కాదనడం.

"అయ్యో నా నేరమికే అట్టే యేమని వగతు
ముయ్యంచుచంచలాన మోసపోతిఁ గాక" 3-39

ముయ్యంచు మనసు : వి. ధర్మార్థకామాలనే మూడు అంచులు గల మనస్సు.

"అయ్యో పోయఁ బ్రాయముఁ గాలము
ముయ్యంచుమనసున నే మోహము నైతి"
1-179

ముయ్యకమూయు : అ.క్రి. మూయలేక మూయు, బలవంతంగా అనడం.

"ముయ్యక మూసిన రెప్ప మూయుచుఁ
దెరచుఁగాని
నెయ్యమునఁ జూడనేర దేమి సేతమే" 5-68

ముయ్యడ : (మూ + ఎడ) *ప.బం; వి.* ముయ్యెడ, మూడుదిక్కులు .

"వొయ్యనె చెనకకు వొమ్మదు మాకిది
ముయ్యడ మాటల ముచ్చటె చాలు" 20-212

ముయ్యాడువారు : (మూడు + ఈడు + వారు) వి. యౌవనంలో ఉన్నవారు. (యువకులు, యువతులు)

"ముప్పిరిగొన్న సతులు మయ్యీడువా రున్నారు
తప్పులు నిన్నుఁ బట్టేటిదానను నే బ్రియమా"
8-220

మురికిడొక్కు : వి. మురికితో నిండిన ముసలి శరీరం.
"యెంచి నూరేండ్లమీఁద యెప్పుడో మరణము
ముంచి యిట్టే మోచినదె మురికిడొక్కు" 3-86

మురువులాఁడి : (మురువులు + ఆఁడి) సౌందర్యవతి, విలాసవతి, సౌందర్యగర్వం కల స్త్రీ.
"కొత్తలైన మాణికపు కొలువుటోవరి లోన
ముత్తేల చెఱఁగు దూలు మురువులాఁడి" 5-63

ముఱ్ఱుఁబాలమంకు : (2) వి. చిన్నతనపు మొండితనం.
"వెట్టివారిఁ దెలుపుట వేవేలు సుకృతము
ముఱ్ఱుఁబాలమంకే కాని ముందు గాన దైవమా"
3-37

ముఱ్ఱుఁబాలు : (ముఱ్ఱు + పాలు) వి. బఱ్ఱెగాని, ఆవుగాని ఈనిన రోజున ఇచ్చే పాలు, జున్నుపాలు.
"వెట్టి మానుప రెవ్వరు వేదురు నాయంత విడువడు(ను?)
ముఱ్ఱుఁబాలలోఁబుట్టిన ముంచిన వెఱ్ఱియ్యా"
3-72

ములిగించు : స.క్రి. మూలుగునట్లు చేయు.
"అలిగించు ములిగించు నంతలోనే భ్రమయించు
కొలఁది సంసారపు గుణమిది" 4-223

ములుక : వి. 1. మునగ 2. వార్తాకం, ముండ్లవంగ.
"చిగిరించిన వలపు చేగ లెక్కవి(?) యిపుడు
మొగి ముమ్మారు నాఁటితే ములుక వంగవుఁగా"
7-463

ములుకు : ఇది మూలుగు కావచ్చు. మూలుగు, బాధతో ధ్వనించు.
"ముట్టి తన చెనకుల ములుకుచు నుండఁగాను
అట్టె యేల తడవీని అప్పటిఁదాను" 27-92

ములుగు : అ.క్రి. దైన్యస్వరూపంతో బాధపడు, బాధతో హీనస్వరంతో శబ్దించు, మూలుగు.
"యెలమి శ్రీవేంకటేశుఁడేపు మీరఁజొచ్చితేను
ములిగి దైత్యసతులు మూలముల చొచ్చిరి"
3-92
"ములిగి భారపు మోపు మోఁచేటివాఁడు
అలసి దించుకొను నాడాడను" 4 అను 26

ములుచ : (2) వి. మూఢుఁడు, అల్పుడు, ధూర్తుడు.
"పులి బందివేఁట వోయి పూరేడు బట్టి తెచ్చి
ములుచ మానవుఁడు ముదమందుటా" 15-71
"యీరీతి శ్రీవేంకటేశ యింతలో నన్నుఁగూడితి
మోరతోపులిఁకఁ జేయ ములుచలమా" 25-237

ములుచతనము : వి. మూఢత్వం, ధూర్తత్వం.

ములువాడి : విణ. ముల్లువలె తీక్ష్ణమైన.
"ములువాడి కొనగోరు" 23-247, "ములువాడి జాజులు" 23-63, "ములువాడి చెక్కు" 9-61, "ములువాడి విరులు" 23-44

ముల్లుచూపు : ప.బం; అ.క్రి. మనసు మొగ్గు.
"ముల్లుచూప తొలుతేల మొక్కి తలవంచనేల
వొల్లెనె యప్పటి జాడనుండరాదా" 9-159

ముల్లుదీసి కొఱ్ఱు మొత్తినట్లు : నానుడి; క్రి.విణ. తక్కువ బాధను తొలగించుకోవటానికి పోయి మరింత ఎక్కువ బాధను కల్పించుకొన్నట్లు. ముల్లు ఊడబెరికి ఆ గాయంలో ఇనుప కొఱ్ఱు దిగవేసినట్లు అని వాచ్యార్థం.
"కల్ల సుఖములచే కనలి కమ్మర
ముల్లుదీసి కొఱ్ఱు మొత్తినట్టాయ" 1-203

ముల్లు ముంటనే తీయు : నానుడి; చెడును చెడుగుతోనే సాధించు.
"ముల్లు ముంటనే తీసి మోసపుచ్చినట్లు"

ముప్వంకవేదములు : వి; బహు. మూడువిధాలైన వేదాలు, ఋగ్యజుస్సామవేదాలు.
"ముప్వంకవేదములను ముద్దు మాటలాడ

నేర్చె యెవ్వరూఁ గొంత నేర్పనేఁటికే వీనికి"
2-397

ముప్వరజాము : వి. ఒకటిన్నర జాము, మూడున్నరజాము (?)
"అగపడ్డందుకు మేని అడియాలములు గురి
మొగమేది రమ్మనవే ముప్వరజామెక్కెను"
8-64

ముష్టిమాను : వి. ముష్టిచెట్టు. (ఇదొక విషపు చెట్టు)
"పుడమిలో ముష్టిమానఁ బొడమిన శాఖలు
బడి ముష్టిపండ్లె పండకుండీనా" 2-389

ముసగసలాడు : ప.బం. కోపంతో చిరచిరలాడు, గుసగుసలాడు, క్రిక్కిరియు.
"మోవిపైఁ గెంపులు ముసగసలాడీ
కావిరిమోమునఁ గళదేరీ" 16-440

ముసగసలు : (3) *ప.బం; వి; బహు.* గుసగుసలు, కోపంతో చూపే చిరచిరలు.
"చద్దివేఁడికిఁ గడు చవులు రేఁచీఁ బతికి
ముద్దులమూటల నీ ముసగసలు" 22-490
"వెసఁగాపురము సేయ విచ్చనలి (వి?)డి
ముసగస లేఁటికి ముదితలతోడను" 23-422

ముసిడికాయ : వి. ముష్టిచెట్టుకాయ.
"జిగిగల చేఁతి ముసిడికాయ యగు నన్ను
మొగిఁ గల్పకము ఫలముగఁ జేయ వసమా"
1-182

ముసిడికాయను కల్పకఫలము చేయు : *ప.బం.* అయోగ్యమైన వస్తువును మహావస్తువుగా చేయు. ముష్టికాయను కల్పవృక్షం చేయు అని వాచ్యార్థం.
"జిగి గల చేఁతి ముసిఁడికాయ యగునన్ను
మొగిఁ గల్పకఫలముగఁ జేయ వసమా" 1-182

ముసిడికాయను కల్పకము చేయు : *ప.బం; అ.క్రి.* మామూలు వస్తువును అమూల్యమైన గొప్ప వస్తువుగా చేయు.

ముసిడిమాను : వి. ముష్టిచెట్టు.
"మిసమిస మెరువఁగ మెల్లన చేరిరి
ముసిడిమానిఫలము చూచి" 4 అను. 4

ముసిపు : (3) అధికం.
"పొసఁగ మానుగ నన్నుఁ బుట్టించితేఁ బొగడేనా
ముసిపి నరుఁజేయఁగా మొర యిదేఁగాక"
2-135
"పసిగొని యింద్రియాల బంటై వుండు నొకవేళ
ముసిపితో దైవానకు మొక్కు నొక్కవేళ" 2-97

ముసిమి : వి. ప్రేమానుబంధం.
"కసరి సవతులు మొగాలు ముడుచుకొన్నాను
ముసిమి చెప్పి నవ్వించి మొక్కుదు నేను"
12-377

ముసిమిముచ్చట : వి. ముద్దుముచ్చట.
"ముగుదలమైన మాకు ముసిమి ముచ్చట లేదా
మొగమెత్తి తనవలె మొక్కులు మొక్కేదా"
20-20

మూ

మూఁకగమికాఁడు : వి. మూకకు అధిపతి, సేనాపతి, మూకకు ముఖ్యుడు. (గమికాఁడు = అధిపతి, సేనాధిపతి)
"మూఁక గమికాఁడ నేను మొక్కెద శ్రీవేంకటేశ
యేఁకటారఁ గడపేవా నెంచుకో మా పొఁజు"
2-64

మూఁకొను : *ప.బం; అ.క్రి.* మూర్కొను, వాసన చూచు.
"వొప్పుగా నందరి వూర్పు లొక్కటైనందుకు గురి
కప్పురమదే కాక కస్తూరిగా మూఁకొనరా" 2-467

మూఁట మాటలు : *వి; బహు.* పెక్కుమాటలు.
"మూఁటమాట లింతయేల మోవితేనె లూరనూర
మాటలాయఁ దనకు నే నొద్దికైతిఁబదలే" 25-479

మూఁతిగిరిపు : స.క్రి. మూతి విరుచు, అసంతృప్తిని ప్రకటించు. 2-156

మూఁతిమీఁది కత్తికోఁత : *ప.బం; వి.* మిక్కిలి బాధాకరం.

"మోఁత నీటిలోని యీఁత మూఁపునఁ బుట్టిన మేఁత
మూఁతిమీఁది కత్తికోఁత మొనగోరి వాఁత"
5-275

మూఁతులు నాకు : ప.బం; అ.క్రి. ఎవరిదగ్గరో చేరి పని గడుపుకోవడానికి వా రన్నదానికల్లా తాళంవేస్తూ అవీ ఇవీ చెపుతూ నీచంగా వారి ఇష్టాన్ని సంపాదించుకోవడానికై ప్రవర్తించు, శుష్కప్రియములాడు. (పద.)
"చీరవెలిగా నవ్వేవు సిగ్గు విడిచేవు
మోర నిడుపుచేసుక మూఁతులు నాకేవు" 6-126

మూఁతులు విరుచుకొను : ప.బం; అ.క్రి. అసంతృప్తినీ, అనిష్టతనూ కనబఱచు.
"మొగము తప్పక చూచి మూఁతులు విరుచుకొని
జగడించి ఇట్టే పగ చాటీ నీపె" 13-372

మూఁపున గట్టిన చద్ది : ప.బం; వి. కొంగు పసిడి వంటిది. అందుబాటులో నున్న వస్తువు, సులభలభ్యం.
"యేపున నాస విడిచి యేరుపడి వుంటేను
మూఁపున గట్టిన చద్దె మోఁపించును" 2-240

మూఁపులు మూడగు : ప.బం; అ.క్రి. 1.ఉప్పొంగు 2.భుజములుప్పొంగు.
"యెవ్వరైనా **నాపెను** నేఁడిటు పేరుకొంటేఁ జాలు
అవ్వల మూఁపులు మూఁడు అవుదువు నీవు"
11-417

మూటకట్టుగా : క్రి.విశ. మూటకట్టినట్లు.
"మూటకట్టుగా వేడుక మొక్కేవాఁడ వీ చేతులు
చాటి యూపె చన్నులపైఁ జాఁచకుండరాదా"
13-504

మూటగట్టు : (2) ప.బం; స.క్రి. కూడబెట్టు, ఒకచోట చేర్చు.
"మూసిమంతనాల మేలు మూటగట్టేవా
వాసుల వంతులనే వడ్డివారీనా" 20-317

మూడామంచులు : (?)
"ముసుఁగుల సిగ్గుల మూడామంచులు
కుసుమై వలపులె కురిసేఁ జెలియా" 15-280

మూడిఁ జొచ్చివాత వెళ్లివచ్చు : ప.బం; అ.క్రి. అతి ఉపాయశాలియగు. చూ : మూడిఁ జొచ్చి వాతవెళ్లు.
"ఇంక నేడ సుద్దులు యెవ్వరు నేమి చెప్పేరు
వంకలొత్తి మూడిఁజొచ్చి వాతవెళ్లి వత్తునే"
25-34

మూడిఁజొచ్చి వాత వెళ్లు : ప.బం; అ.క్రి. అతిఉపాయశాలి యగు. (కొంత నిరసనతో వాడే పదం. ఇలాంటిదే "పొయిలో పెడితే పొంతలో వెళ్లివచ్చు" అనేది.)
"వచ్చివచ్చి మూడిఁజొచ్చి వాతవెళ్ల నేమిటికే
మచ్చిక నీతఁడు నన్ను మన్నించెఁ జూడఁగదె"
29-392

మూడుగాళ్ల (పెద్ద) ముసలి : ప.బం; వి. అతివృద్ధుడు, ముసలితనంలో కఱ్ఱ ఊనుకొని నడవడంపై వచ్చిన పలుకుబడి. (పద.)
"మూడుగాళ్ల పెద్దముసలి సవులుగొన్న
పాఁడిమేకల పాలపాశము" 5-378

మూయికి మూయి : ప.బం; వి. బదులుకు బదులు అని వ్యు. రూపాం. ముయికి ముయి.
"మూయికి మూ యున్నదింతే మూసి దాఁచితి నీకు
వుడివోని వలపులై వుమ్మగిలీని" 23-299

మూరట బారట : మూరలు బారలుగా, దీర్ఘంగా, పొడుగ్గా.
"తోరణము లే దోవెల్లా
మూరట బారట ముంచిన లతల" 1-119

మూరెడంత కొప్పు : వి. పొడుగాటి కొప్పు.
"ముంచి మూరెడంత కొప్పు వంచి నీకు మొక్కెను" 22-205

మూరెడు నోరు : వి. పెద్ద నోరు.
"ఆయ నాయ నీ మాటలల్లములు బెల్లములు
మూయ మూయ నీకె మూరెఁడు నోరు" 9-73

మూలఁబడు : ప.బం; అ.క్రి. చెడు, నశించు.
"ఎన్నికతో శ్రీవేంకటేశుఁడు గూడఁగ నన్ను

మున్నిటివారి సొంపు మూలఁబడెఁగా" 23-575

మూలకెక్కు : *ప.బం; అ.క్రి.* మూలఁబడు.

"చాలు నే నీ మాఁటలు చాలు మూలకెక్కెరా
వేలఁజూపేవా పదారువేలవాఁడ వౌదురా"
24-217

మూలదాఁటు : *వి.* (?)

"మొదలైన రతులెల్ల మూలదాంట్లు నీకు" 23-73

మూలనున్న వారిని ముంగిటవేయు : *ప.బం; అ.క్రి.* సంబంధం లేనివారికి ఏదో ఒకటి అంటగట్టు.

"మూల నున్నవారి మమ్ము ముంగిట వేసితివి
పోళిమి నాఁడువారు నీ పొరుగవుటే దోసమా"
11-175

"కైలాటాలు నెట్టఁగాఁబో కాఁకల నీ మేను చిక్కె
మూలనున్నవారి నేల ముంగిట వేసేరా"
20-311

మూలముట్టు : *ప.బం;* మొదలు, మూలం.

"వదలక జీవుఁడెవ్వరిని నేమించలేఁడు
పదరక మూలముట్టు భావించుకోఁలేదు"
15-262

మూసిదాఁపిరము : (3) *ప.బం; వి.* మూసి మరుగు పుచ్చుట, గోపనం, మూసి దాచిన సొమ్ము.

"చేసుకొన్న యట్టివాఁడు చెప్పినట్టు సేసుఁగాక
మూసిదాపిరము లేలె మొరఁగు లేలె" 11-90

మూసిదాపిరెము : *వి; ప.బం.* మూసి మరుగు పుచ్చడం.

"మూసిదాఁపిరెము గాఁగ మోవి యాతఁడడిగితే
రాసికొలువులో నేల రవ్వ సేసేవే" 28-373

మూసిదాపురము : *వి; ప.బం.* మూసి మరుగు పుచ్చడం.

"కప్పు గడు వెడ జారెఁగోపము కన్నుల మీరె
ఇప్పుడు మూసిదాఁపురా లిఁక నేఁటికే" 21-502

మూసిన గర్భము : *ప.బం; వి.* గర్భంలోని శరీరం.

"ఆస లి వెఱఁగము అలమట లెఱఁగము
మూసిన గర్భమే మును సుఖము" 2-465

మూసినముత్తెము : (14) *ప.బం; వి.* అమాయకురాలు, తెలిసికూడా తెలియనట్లు నటించే వ్యక్తి అనే అర్థాల్లో వాడబడే పదబంధం. అణగిమణఁగి ఉండటం, ఎక్కువ జాగ్రత్తగా ఉండటం. ముత్యం వెలుగులో ఉంచినపుడే మిలమిలలాడి ముత్య మనిపించుకుంటుంది. మూసిపెట్టినపుడు ముత్యమనే అనిపించక తెల్లగా ముద్దవలె ఉంటుంది. దానిని బట్టి యేర్పడిన పలుకుబడి కావచ్చు. మూసినముత్తెం పాసినపగడం.

"దాసితోఁ బెండ్లాడేవాఁడు వట్టి తరితీపులేల
మూసినముత్తెమైనా మోముచూచుఁ గాక"
12-455

"మూసిన ముత్తెము వలె మొనసి నిన్నుఁ
జూడఁగా
సేసవెట్టిన సతులఁ జెలి యేమి చూపేవు"
28-465

మూసినముత్యము : (16) *వి.* చూ : మూసిన ముత్తెము.

"వేసరించి యేమైనా వెంగెములాడుటకంటె
మూసినముత్యమువంటి మోనమే మేలు"
12-204

మూసిన మేను : *ప.బం; వి.* గర్భస్థశరీరం.

"పుట్టిన చోటంటినా అదిభూతముల నెలవు
నెట్టన మూసినమేను నిఖిలహేయమయము"
4-41

మూసిమంతనాలు : (2) *ప.బం; వి; బహు.* ఈ శబ్దం ఏ నిఘంటువుల్లోనూ కానరాదు. దీనికి గుసగుసలని అర్థం.

"మూసిమంతనాల మేలు మూటగట్టేవా
వాసుల వంతులనే వడ్డివారీనా" 20-317

మె

మెంగతనము : *వి.* అమాయకత్వం, బేలతనం.

"అంగళ్ల ముంగిళ్ల నల్లారుముద్దు చూపేవు
మెంగతనాలు నీ సొమ్ము మేలుగా నీవు"
14-162

మెంగది : (మెంగ + అది) ముద్దరాలు, అమాయకురాలు, బేల.
"ఏల పురుడు వెట్టుక యింత సేసేవు నన్ను
మేలిమివాఁడవు నీవు మెంగదాన నేను" 7-93

మెంటు : వి. ప్రసిద్ధ నిఘంటువుల్లో ఈ పదం కానరాదు. శరీరమని అర్థమా?
"అంటుముట్టు అడియాసకే కా
మెంటునఁ జెమటలు మిక్కిలిఁ బొలసె" 20-356

మెకురు : వి. మకురు, మంకుతనం.
"మెల్లనె మాటాడరాదా మెకు రేల చేసేరు"

మెచ్చించు : స.క్రి. మెప్పించు, సంతోషపెట్టు.
"పంతాలు నెరపఁబోతే పడఁతులు లోఁగేరా
చెంత రతులఁగూడి మెచ్చింతురు గాక" 11-226

మెచ్చు : వి. 1. మెప్పు, శ్లాఘ, పొగడ్త 2. సంతోషం 3.బహుమానం.
"వీఁగక శ్రీవేంకటేశ వింతలుగాఁ గూడితివి
రేఁగించేవయ్యా నీవె రేసు లేని మెచ్చులు"
7-452

మెచ్చులాఁడి : (4) (మెచ్చులు + ఆఁడి) మెప్పులు పొందిన స్త్రీ, మెచ్చుకోదగ్గ స్త్రీ. (శ.ర.)
"యిచ్చలు శ్రీవేంకటేశు నెదపై నెలకొంటిని
మెచ్చులాఁడివే అలమేలుమంగా" 12-184

మెచ్చులాఁడు : (మెచ్చులు + ఆఁడు) ప.*బం*; వి. మెచ్చుకోదగ్గవాడు.
"ఏల వేగిరపడీనే యింతలోఁదాను
మేలల్లా నొకరూపైన మెచ్చులాఁడు గాఁడా"
27-281

మెట్టు : అ.క్రి. అడుగుమోపు.
"మెట్టి పట్టు కాతఁడు మేనవాని పయిమోవ
చుట్టి కాఁగిలించఁగాను సూడు వట్టరాదా"
25-201

మెట్టుక : మెట్టుకొని, అడుగుపెట్టి, ప్రవేశించి.
"పట్టెమంచ మెక్కితిని బలువాని చేకొంటిని
మెట్టుక నాతో నింత మెచ్చవలెనా" 9-289

మెట్టుకొను : (2) ఒకదాన్ని ఒకటి తాకు.
"మెట్టుకొని కొల్లలాడి మేఁటేసేవు వీదులను
పట్టుకొనే రిఁకఁ జుమ్మీ బల్లిదుఁడవైనాను"
20-161
"మెట్టుకొన్నవి రాకాసి మెదడుతోడి తలలు"

మెట్టె : (5) వి. 'మట్టె'కు వ్యావహారికరూపం. స్త్రీలు కాలి రెండవవేలికి ధరించే ఆభరణవిశేషం.
"పట్టేఁ జిన్నులట్టే పైపై గోవిందుఁడు
మెట్టెల పాదాల మెట్టే రింతులు" 3-162

మెడగట్టు : ప.*బం*; స.క్రి. అంటగట్టు, బాధ్యత కలిగించు.
"మిక్కిలి సంసారము మెడఁగట్టితివి" 3-20

మెడగట్టుకొను : స.క్రి; ప.బం. బాధ్యత నెత్తిన వేసుకొను.

మెడచుట్టు : ప.*బం*; స.క్రి. తప్పించుకోవడానికి శక్యం కాకుండా అలముకొను, తగులుకొను.
"మేరతో పంచేంద్రియములు మెడచుట్టకపోవు
యే రీతుల సంసారముగ"

మెడవట్టి నూకు : ప.*బం*; స.క్రి. అనాదరంతో తోసివేయు.
"ఉడుగనియ్యని మోహముబ్బి పరమార్థముల
మెడవట్టి నూకె నేమిటికింక నెరుక" 1-327

మెడిది : వి. పుల్లమజ్జిగ (శ.ర.) పులకడుగు (సూ.ని.) ఇది 'మెడుద' కావచ్చు.
"వలపు రేఁచకుమీ వద్దు వద్దు అంతేసి
మెలఁగి కలి ముదిరి మెడిదయ్యాని" 13-461
"తిరమై పాసి కలిముదిరి మెడిదె యైతే
ధరలో పండ్లు పులిసి తమి రేఁగునపుడు"
20-428

మెణకు : వి. చాతుర్యం, నేర్పు.
"మేర మీర రాని నీతో మెణకేల నిన్ను
గారవించఁగా యాడో కత లేల" 11-60

మెత్తులు వేయు : ప.*బం*; అ.క్రి. పూయు.
"పొందుల నదెవ్వరికి పొరసి నీ వియ్యకుండా
కందువ మెత్తులు వేయుగతి సుమ్మీ విభుఁడా"
9-135

మెనకు : వి. ఎనచు, మెత్తజేయు ఇత్యాదిగా సూ.ని. దాని ఛాయార్థమే నలచుట, బాధించుట ఇత్యాదిగా ప్రకరణాన్ని బట్టి ఊహించవచ్చు. 'మనసు నొప్పించెడి వాదులాట' కావచ్చు. ఇంకా విచారింపవలసి యున్నది అని సం.ప.స. (22 సం. 391 పు.) లో చెప్పబడింది.

"మనసురాని చోటికి మంతనాలుఁ గొన్నా
మెనకుల వాదులైన మేలుగాక" 22-101

మెనుకు : చూ : మెనకు.

"మెనుకు లే కింతులచే మెప్పించుకొంటివి గాన
నినుపుల జాణఁడవు నీదివో జన్మము" 27-349

మెయి : వి. శరీరం.

"చింతతో మెయి చెమరించె చెక్కులెల్లాఁ బులకించె
యెంత లేదు తన గర్వమింకా రాఁడా" 20-203

మెయిలచ్చన : వి. శరీరలక్షణం, శరీరంలోని గుర్తు.

"మెచ్చితే శ్రీవేంకటేశ మెయిలచ్చన చూపె నాపె
యెచ్చి లోలోనే కూడితి రిద్దరూను జాణలే" 7-109

మెర(ఱ)మెచ్చులు : (మెచ్చులు + మెచ్చులు) *ప.బం; వి; బహు.* మిక్కిలి మెప్పులు, ముఖప్రీతి కొరకైనవి.

"మెచ్చి నన్నుఁగూడితివి మేలపు శ్రీవేంకటేశ
యిచ్చలు మెరమెచ్చులే యిందాఁకాఁగాదా" 24-71

మెర(ఱ)వడికత్తె : (2) (మెరవడి + కత్తె) ధైర్యం కల స్త్రీ, ఉద్రేకం కల స్త్రీ, నేర్పు గల స్త్రీ, గౌరవం కల స్త్రీ.

"మెరవడికత్తెలైన మెలుఁతలే నీకు బాఁతి
కరకరిఁబెట్టేది కాంతలే బాఁతి" 21-108

మెరమెర : వి. బాధ, భేదం, సంశయం, సంభావన, మాలిన్యం, క్రౌర్యం.

"మేలుమీఁదా మేలేకాక మెరమెర లిఁక నేలే
యేలినవాని తోడి దిది యేఁటిదే" 16-244

మెరవణి : వి. మెరవణి = ఊరేగింపు. మెరవణివి అని వ్యక్తి పరంగా నిర్దేశించడం వింత. మెరవణి శబ్దచ్ఛాయార్థమే 'అందరెరిగినవాఁడు' అని కావచ్చు. (సం.ప.స.)

"మాటలనే చొక్కించి మరగించుకోఁగలవు
మేటితనముల మంచి మెరవణివి" 22-405

మెరుచు : (2) అ.క్రి. తళుక్కున ప్రకాశించు.

"మించుల చూపుల మెఱుఁగు లిట్టె మెరిచి
అంచెఁగొరికల జళ్లవె పట్టెను" 19-281

మెఱమెచ్చు : *ప.బం; వి.* చూ : మెరమెచ్చు.

"తఱి నా చూపు నీ గుండె తమిఁగరఁగించుఁ జుమ్మీ
మెఱమెచ్చులకు మితిమీరక వున్నదానను" 12-11

మెఱుచు : అ.క్రి. 'మెఱయు'కు వ్యావహారికరూపం. చూ : మెరుచు.

"మెఱిచిన నుఱుమక మిన్నైన నుండదట
గుఱి నీ చేఁతలు చూచి కోపము రాదా" 24-84

మెలుఁత : (46) వి. 'మెలఁత'కు వ్యావహారికరూపం. స్త్రీ.

"మెలుఁత కన్నులు గండుమీలైన ఫలము
తొలఁకు రెప్పల నీరు దొరకె నేఁడు" 5-260

"పూఁతగాఁదెచ్చి చెలియ పులకల వెల్లినించె
మేఁతలాడి రమణుఁడీ మెలుతమైఁ జూడరే" 5-108

మెలుతుక : (మెలుత + ఉక) 'మెలతుక'కు వ్యావహారిక రూపం.

"మించిన తొడల మెఱుంగుల మెలుతుక గట్టిన పుట్టము
చించుక వెడలిన నిగ్గుల సిగ్గులు దొలఁకగను" 5-292

మెలుపుఁగూరిమి : వి. ఉల్లాసంతో కూడిన ప్రీతి.

"పలచని యెలుఁగునఁబాడీ నీ మీఁది పాట
మెలుపుఁగూరిమి నలమేలుమంగ" 19-355

మెలుపు : (5) వి. ఉల్లాసం, మెత్తఁబాటు, భ్రమణం, జాగరూకత, చలింపని. రూపాం. మెలపు.

"సుళువుఁజూపు చూచి సన్నసేసె నీ కాపె
మెలుపు లెట్టివయ్య మీలోనను" 25-271

మెలుపుమచ్చెములు: చాతుర్యపు గుర్తులు.
"మెలుపు మచ్చెములు నీ మేన నిండి వుండఁగ
తలమోచి యెన్నెన్ని తప్పులువట్టేను" 23-409

మెలుపురాలు: వి; బహు. మార్దవం కల రాళ్లు.
"బలిమికాఁడవు నీవు పాయపుదాన నేను
మెలుపురాలవంటివి మేఁటి చన్నులు" 26-509

మెసఁగు: అ.క్రి. మెసవు, తిను.
"గుడ్లకొలఁది కోరి మెసఁగుచు
దిడ్లకంతల దిరుగాడీని" 23-331

మే

మేఁకపిల్ల: వి. ఇందులోని అరసున్న విచార్యం.
"సరుస మేఁకపిల్లఁ జంకఁ బెట్టుక నుంత
నరయు గొల్లని రీతి నజ్ఞానినైతి" 1-19

మేఁడివారు: వి; బహు. (?)
"వంచి పుణ్యముల మేఁడివారము మీ కిచ్చితిమి
మించి నీ కామాదులనే మేర గాండ్లేలయ్య"
15-111

మేఁడివారు: వి. మేఁటివారు (?)
"వంచి పుణ్యముల మేఁడివారము మీ కిచ్చితిమి
మించిన కామాదులనే మేరగాం డ్లేలయ్య"
15-111

మేఁతలాడు: ప.బం; అ.క్రి. (?)
"పూఁతగాఁదెచ్చి చెలియ పులకల వెల్లి నించె
మేఁతలాడి రమణుఁడీ మెలుత మైఁ జూడరే"
5-108

మేంట్లు: వి; బహు. మేటి శబ్దానికి బహువచనరూపం, శ్రేష్ఠులు, ఉత్తములు.
"అలయించి కూడేది గయ్యాళిమేంట్లకుఁగాక
వలచిన గుట్టుతోడ వనిత కేలే" 26-228

మే: అవ్య. మెల్లగా.
"గక్కునఁ బొలయుటలు కాఁకలు సేయుట
గాదా
అక్కరఁ గొనెట (గొనుట) మే గుట్టరయఁగాదా"
26-107

మేకతాకు: వి. క్షణికం, అజాయుద్ధం క్షణికమని వినికి.
"మేడమీఁది సరసాలు మేకతాఁకులు
జాడ లెరుఁగుదు దూరఁ జవిగాదె చెలియా"
14-584

మేకు: (19) వి. పెద్దఱికం, మాయ (వ్యం.), గొప్పవినోదం, పరిహాసం, స్పర్థ, పోటీ అనే అర్థాన్ని భావిస్తున్నట్లుగా వేటూరి ఆనందమూర్తిగారి ఊహ.
(1.సం.వా.పద.భాషా. 467 పు.)
"మెచ్చి మెచ్చి నాతో నింతేసి మేకు లేలా
యిచ్చకమునేసి సేసి నన్ను యేలఁ జూచేవు"
10-2-14

మేకు: ఈ పదానికి కన్నడంలో పెద్దఱికము అనే అర్థం పేర్కొబడింది. Superiority, revelry (కిట్టెల్) ఇట ఈ అర్థం సరిపోదు. కింది వాక్యంలో మాయ అన్న అర్థమే సరిపడుతుంది. (సం.ప.స. 13 సం. 103 కీర్తన)
"ఏలవయ్య యింతుల నెందరినైనా
మేలిమివాఁడవు నీకు మేకులు బాఁతే" 13-18

మేకుఁగొప్పు: పెద్దకొప్పు.
"మేకుఁగొప్పు దువ్వితేను మే గోరంటితే తప్పు
వూకించి లోలోన వొరటైన చోటికి" 21-466

మేకుచూపు: మాయ చూపు, పోటీపడు.
"మేరతోడి పొందులకు మేకు చూపవద్దు గాని
బీరపు సమరతులఁ బెనఁగఁగవచ్చును" 7-394

మేకులవాడు: (2) వి; సం.ప.స.లో మేకు = పెద్దఱికము. కనుక దీనికి పెద్దఱికం కలవాడని అర్థం.
"మేకులవాఁడవని మెత్తురు శ్రీవేంకటేశ
జోకలతో నీడు వచ్చె సొరిది నీ కతలు" 18-380

మేకులాడి: వి. మాయలాడి, పెద్దఱికం కల స్త్రీ.
"యీకడ శ్రీవేంకటేశుఁడెనసె నన్నును నిన్ను

మేకులాడివి నవ్వేవు మేలే నీవు" 29-81

మేకులుచేయు : (19) పరిహాసం చేయు, మాయలు చేయు, మోసం చేయు.

"మెచ్చినట్టివాఁడవు మేకులిఁకఁ జేయకుమీ
అచ్చలాన యిక్కువలే అంటుదుగాని" 7-511

మేకుసేయు : (9) మాయచేయు, పరిహాసం చేయు.

"మెచ్చు మెచ్చు నన్నింతలో మేకుసేసి కూడితివి
అచ్చుమోపేవాపె నిను నెచ్చరించదా" 14-70

మేఘపుష్పము : వి. 1. ఉదకం (2. తూర)

"మేకొని నీవే నిండుమేఘవర్ణుఁడవు గాన
నీకు మేఘపుష్పాలే పన్నీరుకాపు"
17-497 & 2-280

మేటానమేటీలు : *వి; ప.బం; బహు.* మిక్కిలి మేటియైన వారు.

"చెంగట మేటానమేటీలు సేవ లెల్లాఁ జేయఁగాను
సంగతెఱఁగక యేమి చవులు రేఁచేవే" 28-206

మేటానమేట్లు : (మేట్లు + మేట్లు) *వి; ప.బం; బహు.* ఎక్కువ కాంతులు, మిక్కిలి మేటైనవారు.

"మాటు లేని మాటుదెచ్చి మరఁగువెట్టుక వట్టి
మేటానమేట్లవలె మెరసేము" 1-73

మేట్లు : కాంతులు. (వ్య.)

"మెలఁగి పరశురాము మేట్లేసిన బాణము
తళతళ మెరసీని తలరో యసురలు" 4-283

మేట్లేయు : (మెట్లు + ఏయు) మేటితనములను దెబ్బదీయు. (మేటికి మేట్లు బహువచనరూపం.)

"మెలఁగి పరశురాము మేట్లేసిన బాణము
తళతళ మెరసీని తలరో యసురలు" 4-283

మేడదేవళ్లు : *వి; బహు.* పెద్దపెద్ద గోపురాలు, భవనాలు కలిగిన దేవతలు (?)

"హత్తి తన్నొల్లకపోఁగా నందరి మేడదేవళ్ల
యెత్తి పాదాలందుఁ జూపె నితఁడే విట్ఠలుఁడు"
2-217

మేడము : వి. కూడికె, అనుగుణము. (ఆం.ప.ని.) 8-28

మేడామాడుగు : వి. మేడ అనే అర్థంలో జంటపదం.

"కూడె ని న్నలమేల్మంగ కొసరేకొరకా మేడా
మాడుగు శ్రీవేంకటేశ మన్నించవయ్యా"
24-501

మేడిపంటి బోనము : *వి; ప.బం.* మేడిపండు చూడడానికి అందంగా ఉన్నా అందులో అనుభవించడానికి ఏమీ ఉండదు కదా! దానిపై వచ్చిన పలుకుబడి. పైకి బాగా కనబడుతూ తినడానికి ఉపయోగపడనిది, నిస్సారము, హేయము.

"మెరసి చెప్పఁగఁబోతే మేడిపంటి బోనమౌను
యెరవేల సతమౌను యేతు లింతే కాక"
17-253

మేడికాయబోనమని కూడా వ్యవహారం. (విప్ర. 2-80)

మేడిపండు వంటిది : వి. పైకి బాగుగా కనిపించినా లోపల గుణం లేనిది.

"మేడిపండు వంటిది మెరసే నీ మోహము"
16-254

మేడిసేయు : (మేడి + చేయు) (?)

"మేడి సేసేవటే మేడిపండె నీ గుణాలు
వోడ వేమిటాను నీ వా వోడతో దూలమురా"
24-217

మేడెము : విణ. మేలు, శ్రేష్ఠమైన వి. 1.యుద్ధం 2.కలహం, తగవు 3. గుంపు, సంఘం.

"ఆడనుండి వేరొక్కతె పాడి దిద్దవచ్చితేను
మేడెపుఁగాఁగిట నించి మెచ్చుమెచ్చేవు"
21-162

"మేడెపు గొల్లెతలకు మేఁటి మగఁడతఁడు"
26-577

"మేడెపు దంపతులకు మేర దప్పితే నే మాయ"
20-241

"మేడెపు మేనవాఁని మెడఁ గాఁగిలించుకోఁగా
యీడ నివ్వెరగు లందే విది యేమే నీవు"
22-496

"మేడెపు బ్రహ్మాదులెల్ల మింటనున్నారు" 22-31
"మేడెపు సంసారమున మించినవాఁడు" 15-39
"యీడనుండి సుర లిందరిఁగాచెను
మేడెపు మన లక్ష్మీవిభుఁడు" 4-364
"మేడెపుఁగళలచేత మించేవుగాక" 8-140
గుంపు:
"యెప్పుడూఁ గలవే నీ యింటివాఁడను
కప్పురపు వీడేలు గబ్బిచూపు మేడేలు" 16-246

మేదకపుకొయ్య: వి. స్థిరమైన కదలని మెదలని వెట్టిబాగులవాడు.
"వాదు నీతోఁ బెట్టుకొంటే వాడవారిపైఁ బెట్టేవు
మేదకపుకొయ్య వవుదు మేలురా నీవు"
11-187

మేదకము: విణ. స్థిరమైనది, కదలనిది మెదలనిది.
"సాదుసేయ వసమా చంచలపుఁగనుచూపు
మేదకాన మేలనుచు మెచ్చుటగాక" 24-181
"వాదు నీతోఁ బెట్టుకొంటె వాడవారిపైఁ బెట్టేవు
మేదకపు కొయ్యవవుదు మేలురా నీవు"
11-187

మేదరింటిలంజ: వి. నీచురాలైన కులట.
"మేదరింటి లంజవోయి మేదినీశుఁ దగులఁగ
గోదిలి కువిటులెల్లఁ గుల్లినయట్లు" 4 అను. 31.

మేదించు: స.క్రి. 1. మర్దించు, నూరు 2. నేర్పు, అభ్యసింపజేయు, మప్పు.
"మేదించి వలపు లిరుమేలాఁ బూసేవు" 19-12
"మేకొని కస్తూరైనా మేదించక యెనయదు
ఆకడ నీవు కోరి అటువంటివాఁడవు" 7-8

మేనపడుచు: వి; ప.బం. మేనకోడలు.
"నయానఁ బందెమువేసి నడుమ మేనపడుచు
ప్రియపడి నిన్ను నిట్టె పెండ్లాడెను" 7-177

మేనవాఁడు: వి. తోడబుట్టినవారి దేహసంబంధం కలవాడు, మేనమామ.
"మేనవాఁడవటు గాన మెడగట్టుకొనిపించె
తానె అలమేలుమంగ తమకమేలా" 7-202

మేనవారి పడుచు: వి. మేనగోడలు.
"సోయగమై తన మోము చూచినట్టె మోహించి
పాయకుండ మేనవారి పడుచనా నేను"
10-2-89

మేనవావి: వి. తోడబుట్టినవారి దేహసంబంధం.
3-258

మేనిపచ్చి: వి. శరీరసౌందర్యం.
"యెవ్వతో కాఁగిట నీ యీ మేనిపచ్చి చూచి
యివ్వల నీ కాఁగిలి నీ కెక్కె నిపుడు" 15-77

మేమఱచు: అ.క్రి. మైమఱచు, పరవశమగు.
"ఒకమారు తనుఁజూచి వూరికే తలవూఁచు
నొకమారు హర్షమున నొంది యేమఱచు" 5-70

మేరకు మేర: సరికిసరి.
"యీరీతి శ్రీవేంకటేశుఁ డిప్పుడిట్టు నిన్నుఁగూడె
కోరి యేలినవారితో మేరకు మేరే గాక" 27-526

మేరగాఁడు: (మేర + కాఁడు) వి; ప.బం. ధనరూపంగా కానీ, ధాన్యరూపంగా కానీ ఆయా స్వాస్థ్యాలను చెల్లించేవాడు. (తె.వ్యు.కో.)
"వంచి పుణ్యముల మేఁడివారము మీ కిచ్చితిమి
మించిన కామాదులనే మేరగాండ్లేలయ్యా"
15-111

మేలము: వి. పరిహాసం.
"చెలులెల్లాఁజూచి సంతోసించి మెచ్చి పొగడేరు
కలిగె మీకు మేలము కలకాలము" 7-370

మేలములాడు: అ.క్రి. పరిహాసములాడు.
"మేలములు నీవాడఁగా మేలుదాననైతి నీకు
యేలుకోవయ్యా చన వియ్యవయ్యా నాకును"
29-347

మేలుకట్టు: వి. స్వామివారిని ఊరేగించే వాహనానికి పైభాగంలో చేసే అలంకరణ. (చాందినీ, ఉల్లెడ)
"మెరసి పెండ్లికి వలె మేలుకట్లు గట్టించి
పిఱిగొన ముత్యాలపేఁట పట్టు వెట్టెను" 12-406

మేలుగాలము: మంచికాలము, శరత్కాలము.

"రతుల శ్రీవేంకటేశు రమణి నీవుండితే
మితిలేని జవ్వనపు మేలుగాలము" 17-522

మేలు - తీలు: శుభం - అశుభం, మేలు - కీడు.
"మేలు లేదు తీలు లేదు మించీ నదె హరిమాయ
కాలమందే హరిఁగంటి కైవల్యమొకటే" 2-73

మేలుది: (మేలు + అది) వి. 1. వలపుకత్తె 2. శ్రేష్ఠురాలు (3.జారిణి) 4. శుభకరురాలు.
"మేలుదాన నని ఇట్టే మెచ్చేవు లాలించి
సోలి నా గుణాలు చెప్పి చూప నే మున్నది" 12-212

మేలు మీఁద: పైభాగంలో.
"మేలు మీఁద నవ్వితేను మేనఁబులకలు నిండు" 29-405

మేలువాఁడు: (మేలు + వాఁడు) వి. వలపుకాఁడు, శ్రేష్ఠుడు, ఇష్టుడు, శుభకరుడు. జారుడు చూ: మేలుది.
"మేలువాఁడై నన్ను నేలె మించి శ్రీవేంకటేశుఁడు" 29-220
"ఎఱఁగ మిన్నాళ్లదాఁకా నిటువంటి మీ పొందులు
మెఱసి యెప్పుడూ నాకు మేలువాఁడవు నీవు" 28-506

మేలుసుద్ది: వి. శుభవార్తకు అన్నమయ్య కల్పించిన అచ్చతెలుగుపదం.
"మేలుసుద్ది చెప్పితేను మెచ్చవద్దా యిఁకనైనా
కాలు దొక్కుదువు పాన్పుకడకు రావయ్యా" 23-13

మేలొకటి తీలొకటి: ఒకటి మేలు, ఒకటి కీడు.
"చుట్టి వరిగురుమతో జొన్నగింజ సరిదూఁగు
తెట్టలై మేలొకటి తీలొకటి కాయ" 3-14

మేసవారు: (మేసు+వారు) వి; బహు. పెంకితనం కలవారు.
"మేసవారి పిన్నదాని మేకుసేసి యింటిలోన
దోసుకొంటి వెఱఁగవా దుండగీఁడు"

మేసు: (7) వి. పెంకితనం శ్రీ.ని. వ్యు. మేయు ధాత్వర్థమే అనుభవించు అనే ఛాయార్థంగా మారినట్లున్నదని మేసులు అనే దానికి అనుభవములని అర్థమూహింప బడినది. (సం.ప.స. 22-62)
"మేసులఁ బరవశముమీఁద మీఁద నబ్బె నదె
బాసల శ్రీవేంకటేశుఁ బైకొనితే నంటిగా" 22-62
"దొమ్ముల మేసువారికి దొడ్డవారి కేఁటి మాట
ముమ్మాటికి విను చన్నుమొనలు దాఁకీని" 8-194

మై

మై: వి. శరీరం.
"తరుణి మై చెమరించె" 23-585
"సరసనే శశివర్ణ మైనందు
పురిగొన నించి రదె పుళుగుకాపు" 19-569

మైకాఁక: (2) వి. శరీరతాపం.
"ఆలి నా మైకాఁక నాకె మేనికాఁకలను
కాలపువరుసఁ జలిగాయిమనవమ్మా" 7-309

మైనము సూలమగు: ప.బం; అ.క్రి. మైనము శూలమగు, మృదువైనది బలవంతమగు .
"దాని కేమే మాటలేల దగ్గరి రావే వోసి
మైనము సూలమౌనటే మాపుదాఁకాను" 7-191

మైనము సూలము సేయు: ప.బం; అ.క్రి. శక్తిహీనమైన దాన్ని శక్తిమంతం చేయు, అసాధ్యానికి పూనుకొను.
"దీనికే శ్రీవేంకటేశ తెఱవఁగూడితివిట్టె
మైనము సూలము సేసే మగవాఁడూ గలఁడా" 7-54

మైమరువు: వి; ప.బం; కవచం.
"అతివకు భూషణజాలంబంతయు మరువస్త్రములకు
జతనంబగు మైమరువై సరిఁ జెలువొందెడిని" 5-122

మైలసంత: వి. మత్స్యమాంసాదులు విక్రయించే బజారు.
"మచ్చిక కర్మమనేటి మైలసంతలోన

వెచ్చపు కర్మధనము విలువచేసి
పచ్చడాలుగాఁ గుట్టి బలువేంకటపతి
ఇచ్చకొలఁదుల నమ్మే ఇంటిబేహారి" 1-275

మొ

మొకదాకిరి : (10) వి. ఈ పదం ప్రసిద్ధ నిఘంటువుల్లో కానరాదు. 'మోమోటం' కావచ్చు. ముఖదాక్షిణ్యం.
"రాక దరచైతే మొకదాకిరి గలుగుగాక" 25-51
"నెమ్మి మొకదాకిరితో ని న్నేమీ ననకుండితే
సమ్మతించె నంటా నెంత సంతోసించుకొనేవు"
18-172

మొకదాకిరిది : (3) (మొకదాకిరి + అది) మోమోటం కలది.
"మొదలనే నేనైతే మొకదాకిరిదానవు
యెదురాడఁజాల నీక నే మందునే" 27-566

మొకబంగము : వి. ముఖంవిరుపు, కోపం. దీని కీయబడిన ఉదాహరణంలో పెంకితనమనే అర్థం కూడా యుక్తంగా కనిపిస్తుంది.
"పక్కన మీలోన మొకబంగాలు వాసినదాఁకా
వెక్కసపు నీ సణఁగు వినవలెఁగా" 11-483

మొకమజ్జనము : (3) వి. 'ముఖమార్జనం' అనే శబ్దానికి వికృతిరూపం. ముఖం కడుగుకోవటం.
"ముందు యెడకె వచ్చె మొకమజ్జనానకు
కందువగా నాపె వచ్చి గడె వెట్టెనే" 7-462

మొకమజ్జనము : వి. ముఖమార్జనము; ముఖము కడుగుకొనుటకైన నీరు.
"కనుదెరవు నా తండ్రి కమలాప్తుఁ డుదయించె
వనిత మొకమజ్జనము వడిఁదెచ్చెను" 3-543

మొకమాయకాఁడు : (2) ప్రత్యక్షంగా మోసం చేసేవాడు.
"చెలియ నీ యెడ కింత చిత్తిణి గుణముదాయ
మలసి నీ వెంత మొకమాయకాఁడవో" 16-411
"ముచ్చట నీ విటువంటి మొకమాయకాఁడ వౌత
యిచ్చలోన నేము తొల్లె యెరఁగమైతిమిరా"
11-18

మొకమిచ్చుమాటలు : వి; బహు. ముఖప్రీతివచనాలు.
"మొకమిచ్చుమాటలే మునుకొని ఆడియాడి
వెకలివైతివి గదే వెలదీ" 25-571

మొకమిచ్చులాడు : ప.బం; అ.క్రి; మాం. ముఖస్తుతులు చేయు, ముఖప్రీతికై మాటలాడు.
"ఒక్కటొకటికి నీవు వొరసెటిదానవు
మొకమిచ్చులాడ నేలె మొదలె యాతనిని" 11-5

మొకము : (3) వి. 'ముఖము'నకు వికృతిపదం.
"ముచ్చట నెవ్వతెనైనా మొకము దగ్గరఁ బోయ
యిచ్చకములాడేవు యేరా నీవు" 10-2-60
"సకులెల్లాఁ జూడఁగాను చవుల మో వెడిగితే
మొకము వంచి కన్నుల మొక్కుమొక్కీని"
19-270

మొకమొకములుచూచు : (9) ముఖం ముఖం చూచు, పరస్పరం ఒకరినొకరు చూచుకొను.
"ఒకరొకరి మనసు లొక్కటాయను
మొకమొకములు చూచి ముచ్చటాడినట్లు"
24-82

మొకమొకమెదుట : ముఖం ముఖం ఎదుట, ఎదుటెదుట.
"ఇక నేలయ్యా మా యెడమాటలు
మొకమొక మెదుటనె ముయికి ముయాయ"
9-24

మొకమొకాలు చూచుకొను : చూ:
మొకమొకములు చూచు. 29-182

మొకమోట : (4) వి. మొగమోట, దాక్షిణ్యం, ఇతరుల మనస్సుకు అనుకూలంగా వర్తించడం, సంకోచం.
"పచ్చిగాదు వెచ్చిగాదు పాయపు నీసేఁతలు
ఇచ్చట నీ మొకమోట నేమందురా" 21-505

మొకమోడించు : మొగమాటపెట్టు.
"గద్దరి శ్రీవేంకటేశ గబ్బినైన నన్నూఁజూడు
ముద్దుమోము యిచ్చి కూడి
మొకమోడించితివి" 11-338

మొకమోడు : (4) అ.క్రి. మొగమాటపడు, సంకోచించు. (దాక్షిణ్యం వల్ల)
"నాకు మొకమోడి యాకె ననుపేల దాఁచేవు
జోకతోడ మాటలాడి సోదించరాదా" 12-373

మొకరి : (5) వి. జలసూకరం, అసంబద్ధ వచనా లాడేవాడు, పొసగని మాటలాడేవాడు, మోగేది, అగ్రేసరం, శంఖం ఊదేవాడు. వి. మొకరి. ఊదేవాడు, దిట్ట, చతురుఁడు (వే.ఆ.) మొసలి.
"ప్రకటించి యేలికయై బహుసంపదలై
మొకరిబంధువుఁడై ముందర నున్నాఁడు"
15-101
"మొకరివై భూమెల్ల మోచియుండిన నీవు
అకట నా పరభారా లాఁప ననేవా" 15-1
"మొకరివైయుండి నన్ను మోహించఁజేసితివి"
3-393
"ప్రకటించి బహువేదపఠనఁ జిక్కని నీవు
మొకరివై తిరుమంత్రమునకుఁ జిక్కితివి" 3-56

మొకసిరి : వి. ముఖశోభ.
"సకలపతికి సరసపుఁగొమ్మా నీ
మొకసిరి మెరసె చిమ్ముల మురిపెములా" 6-47

మొకెము : వి. ముఖ్య శబ్దభవం కావచ్చు.
"వొక శ్రీవేంకటపతి నమ్మియుండలేము
మొకెమో మా బ్రదుకిందుఁ బోలదాయఁగా"
1-388

మొక్కపోవు : ప.బం; అ.క్రి. కుంఠితమగు, భంగపడు, నశించు, హాని చెందు.
"తెగి మురాసుర జాడ తెలియఁడా నరకుఁడు
మొగిసి పోటుకుఁబోయి మొక్కపోయను"
2-308

మొక్కలము : వి. మోటుతనం, ఉత్సాహవచనం, మూర్ఖత, ధైర్యం, శౌర్యం, ఔద్ధత్యం, అతిశయం. విణ. అప్రతిహతం, ఉద్ధతుడు.
"మొక్కలపు టల్క గొంత మొకదాకిరి గొంత
నిక్కముగా నీకుఁజూపి నివ్వెర గందినది"
7-377

మొక్కలికాఁడు : (2) (మొక్కలము + ఇ + కాఁడు) ఉద్ధతుడు, పొగరుబోతు, మూర్ఖుడు, శూరుడు. తద్ధతంపై తద్ధిత ప్రత్యయం.
"తప్పక యేల చూచేవు తపన లేల పెట్టేవు
ముప్పిరిఁ గళలు రేఁచే మొక్కలికాఁడా" 26-420

మొక్కలీఁడు : (2) (మొక్కలి + ఈఁడు) శూరుడు, ధీరుడు, మూర్ఖుడు, ఉద్ధతుడు.
"ఇందు కిట్టె తమయక్క యెరిఁగితే నేమి యను
ముంద రెరఁగడు తాను మొక్కలీఁడు చూడరే"
26-348

మొక్కళపుఁదనము : (మొక్కళము + తనము) వి. మొక్కలముపై స్వార్థంలో 'తన' ప్రత్యయం. చూ: మొక్కలము.
"పిక్కటిల్లుఁ జన్నులిట్టె పిసికినంతటిలోనె
మొక్కళపుఁదన మేల మోహించినచోటను"
24-600

మొక్కళము : మొక్కలమునకు రూపాం. చూ: మొక్కలము
"మొక్కళమైనాఁగానీ మోహము నీపైఁజల్లీ
అక్కరతో సరసము లాడేఁగా విభుఁడ" 12-470

మొక్కళితనము : ఔద్ధత్యం.
"మొక్కళితనాల బొమ్మముడి వెట్టుకోకువే
చిక్కించుక నిన్ను గోరఁ జిమ్మెనంటాను"
29-296

మొక్కిళ్ళు : వి. (?)
"మొదలనే తనకు నే మొక్కిలి నేననవే
పదివేలకుఁ దనపై బత్తిగల ననవే" 28-374
"చెలపల చెమటలు చెక్కిళ్ల
మొలకల నవ్వులు మొక్కిళ్ల" 28-419

మొక్కులాడు : ప.బం. నమస్కరించు. (?)
"మున్నాడి యొక్కరొక్కరు మొక్కులాడే రప్పటిని
కన్నచో గోళ్లు దాఁకీనే కడువాఁడి పొద్దు"
18-176

మొగఁడు : (3) వి. 'మగఁడు'కు వ్యావహారికరూపం. మగడు, భర్త. ఇట 'మగ'

శబ్దం 'మొగ' గా మారింది. వ్యవహారంలో 'మగడు' శబ్దం 'మొగడు'గా ఉచ్చరింపబడడం సహజమే.

"తగవెఱుఁగనివాఁడు దయ దలఁచనివాడు
మొగఁడైతే మారాడక మొక్కేదే మేలు" 17-225

"నగు శ్రీవేంకటపతి నన్నే రక్షించినదాఁక
మొగఁడై యెరుక తుది ముట్టరాదాయను" 2-80

"జక్కవ చన్నుల జగబిరుదా
మొక్కఁగదవే మొగనికి నిపుడు" 29-306

మొగకళలు : *వి; బహు.* (?)

"ఇప్పట నుంటి నేల యెడమాట కానీ కాని
ముప్పిరి నే నవ్వితేఁ గా మొగకళ లెక్కుత"
20-65

మొగచాటు : వి. ముసుగు, ముఖపటం, మొగంమొత్తేది, వెగటైనది.

"ముప్పిరి మోవిమీఁదటి మొగచాటు లెన్ని లేవు
కప్పి తములమిడుటే కతలాయఁగాక" 7-486

"ఎన్నడులేని గుణము యేల వచ్చె నీకును
మొన్నటి నిన్నటి పొందు మొగచాట్లాయనో"
13-384

మొగతిరుగు : *ప.బం; అ.క్రి.* విముఖములగు.

"అట్టహాసమున నసురలు వారఁగ
ముట్టి వాయువులు మొగతిరుగ" 3-239

మొగదాకిరి : (2) వి. 'మొకదాకిరి'కి రూపాం. మొగమోటం.

"అంతరియామివైన ఆ మొగదాకిరికైనా
కంతుగురుఁడ నన్నుఁ గావరాదా" 16-336

మొగదాకిరివాఁడు : (మొగదాకిరి + వాఁడు) మొగమోటం కలవాడు.

"మొగదాకిరివాఁడవు మొదలే నీవు
తెగనాడ వేమిటికి దేవరవు నీవు" 7-570

మొగనాలు : (మొగని + ఆలు) *ప.బం;* వి. భర్త గల స్త్రీ, ముత్తైదువ. 'మొగనాలు' అనేది ఉచ్చారణానురూపమైన రూపం, మగనాలు.

"ఒక్క మొగనాండ్లకు వొరటు లెందాఁకానే
వెక్కసపుఁబొత్తు గూడి వేడుకతో నుందమే"
25-429

"మున్నున్న దయ లేక మొగనాలి యని యెంచక
కన్నుమరుగు గాని చోటుగా జెక్కిలి జీరుమని" అని క్షేత్రయ్య ప్రయోగం.

మొగబాటు : వి. ఇది 'మొగచాటు' అయి ఉంటుంది.

"కన్నులఁ దన్నుఁ జూచితి కాంక్షలును దీరవు
సన్నలు సేసితి మొగబాటూఁ గాదు" 12-262

మొగమాయకాఁడు : ప్రత్యక్షంగా మోసం చేసేవాడు; చూ : మొకమాయకాఁడు.

"ఎంత మొగమాయకాఁడో యేమో కాని
యింతులార వెరగైతి మీఁక నేమో కాని" 9-147

మొగమాయ మందులాఁడి : వి. ప్రత్యక్షంగా మర్లు మందులు పెట్టే స్త్రీ. మగవారిని మాయలో ముంచే మందులు గలది కావచ్చు అని సంపా. (f.n. 29-171) మందులాడి అనేది విలక్షణప్రయోగం.

"ముప్పిరినది యంతటి మొగమాయమందులాఁడి
విప్పుచు నీతో విన్నవించదుగాఁక" 29-171

మొగమాయలాఁడి : వి. గట్టి మోసకత్తె. చూ : మొగమాయకాఁడు.

"మొగమాయలాఁడివే మొగని నింత సేసితి
చిగురే చాఁగరైతేఁ జెప్పనేటికి" 16-486

మొగమిచ్చు : (3) (మొగము+ఇచ్చు) *ప.బం;* వి. ముఖప్రీతి.

"నగినవాఁడవు నీకు నయములు నేరెపేమా
మొగమిచ్చలను నీవే మొక్కించవయ్యా"
21-37

మొగమిచ్చలాఁడి : (మొగము + ఇచ్చలు + ఆడి) *ప.బం;* వి. ముఖప్రీతి మాటలాడే స్త్రీ.

"మొగమిచ్చలాఁడి గాన మోహములు చల్లీని
జిగి నిన్నెంత మీటినాఁ జెల్లునయ్యా ఆపెకు"
12-487

మొగమునఁగట్టు : *ప.బం; అ.క్రి.* నిరంతరం జ్ఞాపకానికి వచ్చు, కనిపించు.
"అగపడి నిరంతర మలవాటై జగత్తు
మొగమునఁ గట్టినట్టు మొగి మరవనీదు" 3-216

మొగమొగము చూడు : *ప.బం; అ.క్రి.* ఒకరిముఖం ఒకరు చూడు.
"తెగరానిచోటికి దీమసంబులే మేలు
మొగమొగము చూచితే ముందువెన కౌను" 17-342

మొగమొగాలు చూడు : *ప.బం; అ.క్రి.* ఒకరి ముఖం ఒకరు చూడు. చూ : మొగమొగము చూడు.
"మొగమొగాలు చూచుట మొక్కులకు మూలము
తగవులు కూటమికిఁ దానె మూలము" 21-375

మొగమోట : (4) వి. దాక్షిణ్యం, సంకోచం. రూపాం. మొగమోటము.
"అగపడ్డ దొరవు నీ వన్నియుఁ జెల్లు నీకు
మొగమోటే మించె నాకు మోస మేమీ లేదు" 20-510

మొగమోటకాఁడు : దాక్షిణ్యం కలవాడు, సంకోచం కలవాడు.
"మొగమోటకాఁడు మోనాన నుండక
బెగడి ఆ నేఁటికి బెట్టీనే" 9-254

మొగమోటము : (2) వి. సంకోచం, జంకు, బిడియం, కనికరం, దాక్షిణ్యం.
"అప్పటి మొగమోటాలు అవియే తేవచ్చునా
మెప్పించిన వేళలను మించుఁగాక" 20-432

మొగమోడు : *ప.బం; అ.క్రి.* 1. జాలిపడు 2. సంకోచపడు.
"కమ్మటి నిచ్చకమ్ములు నెరపుడు కైవసము గావలె ననుచు
వుమ్మడి నీ గుణాలు వొగడుదు వూరక
మొగమోడుదు వనుచు" 2-296

మొ(గ)గ్గలెత్తు : (మొగ్గలు+ఎత్తు) మొగ్గలుదొడుగు, మొగ్గలు గలదగు.
"మాటలు తీగెలు వారె మక్కువలు చిగురించె
మాటలకొద్ది నవ్వులు మొగ(గ్గ)లెత్తెను" 26-337

మొగవాఁడు : (4) (మొగ + వాఁడు) వి. మగవాడు. 'మగ' కు 'మొగ' అని వ్యావహారికం.
"ఈవల వలపునూ ఇద్దరికొకటే నీవు
ఆవటించి మొగవాఁడ వాఁటదాన నేను" 21-187

మొగసిరి : వి. పౌరుషం. (మొగ = మగ)
"సిరిమగఁడే మొగసిరి రక్ష
మరుగురుఁడే మా మర్మపు రక్ష" 9-54

మొగసిరిమందు : పురుషత్వాన్ని కలిగించే మందు.
"ఏమి మొగసిరిమందో యెంత నేరుపరో కాని
నా మనసు గరఁగించి నవ్వీని" 14-229

మొగసిరిమందులాఁడు : పురుషత్వాన్ని కలిగించే మందులు కలవాడు.
"మచ్చికల మొగసిరి మందులాఁడ నీ
కిచ్చిన దేహమిది యెట్టయినఁ జేయరా" 5-76

మొగాలు ముడుచుకొను : *ప.బం; అ.క్రి.* అసంతృప్తి ప్రకటించు.
"కసరి సతులు మొగాలు ముడుచుకొన్నాను
ముసిమి చెప్పి నవ్వించి మొక్కుదు నేను" 12-377

మొగిచాటు : వి. 'మొగచాటు' కావచ్చు. మొగంమొత్తునది, వెగటైనది.
"ముందరనున్న వలపు మొగిచాట్లాయఁగాక
పందెము వేసితే నా పాటి దయ్యీనా" 26-390

మొగుడ : వి. మొగ్గ.
"తరుణి కుచములను తామరమొగుడలు
విరిసెనో యని వెరపునను" 6-17

మొగ్గు : వి. హెచ్చు.
"తలవంచుకుండినాను తగ్గు లేదు మొగ్గు లేదు
పలుకక వుండినాను భయము లేదు" 11-15

మొత్తగాఁడు : (మొత్తము + కాఁడు) వి. సేనానాయకుడు.

"నిలువు నీ సింగారము నేఁడు గంటిమయ్యా
మొలకనవ్వుల పెను మొత్తగాఁడవు" 18-540

మొత్తమి: వి. మొత్తము. (?)
"యెత్తినది మీఁదు దనకె మేనుఁ బ్రాయమునను
మొత్తమి నా కిఁక మీఁదమోనమె చాలు" 9-61

మొత్తిమోఁదు: *ప.బం; స.క్రి.* మిక్కిలిగా కొట్టు.
"తుత్తుమురుగ దైత్యుల దనుజుల నని
మొత్తి మోఁది చలమునఁ జెలగి" 1-207

మొదలగు: (మొదలు + అగు) *అ.క్రి.* ఏమాత్రమైనా ఉపయోగపడు.
"బగ్గన శ్రీవేంకటాద్రిపతి నన్నుఁగూడె నిఁక
ముగ్గుపిండి అట్లకు మొదలయ్యీనా" 11-160

మొదలారి: *వి.* 1. నాయకుడు 2. అరవశూద్రుల్లో ఒక తెగవాడు, మొదలియారు.
"నీవె కాఁ చెప్పఁజూప నీవె నీవెకా
శ్రీవిభు ప్రతినిధివి సేనమొదలారి" 1-255

మొదలికర్త: *వి.* బ్రహ్మ.
"పొసఁగఁగ నిది గని యధికుఁడు పుక్కటకాండ్ల నందరిఁ
బసమారిచి మొదలికర్తఁ బాలించిన గతిని"
1-72

మొదలియెముక: *వి; ప.బం.* ప్రధానమైన ఎముక, వెన్నెముక.
"మురదనుజుని పెద్ద మొదలియెముకఁ దీసి
తురులూదరే తుత్తు తుత్తు తుత్తుత్తు" 1-120

మొదలుండఁగొనలకు నీళ్లువోయు: నానుడి; వ్యర్థమైనపని చేయు.
"మొదలుండఁ గొనలకు మోచి నీళ్లువోయనేల
యెదలో నీవుండఁగా నితరము లేలా" 1-466

మొనకత్తిధార: *వి.* నిశితమైన కత్తి అంచు.
"మునుప హరిశ్చంద్రుదు మొనకత్తి ధారఁదొల్లి
పొనిఁగి చంద్రమతికిఁ బూవుదండాయ" 2-85

మొనగోరితాఁకు: *వి.* గోరికొన తాకు, నఖక్షతం.
"మొగమోట దాని కేలే మొనగోరితాఁకులు
అగడైన రతుల గయ్యాళిదానికిఁ గాక" 26-345

మొనచూపు: *ప.బం; అ.క్రి.* కనిపించు.
"మోహాంధకారము పై మొనచూపే నని పోయి
సాహసము లేక నే జడిసితిని" 3-265 & 2-415

మొనచేయు: *ప.బం.* వాఁడిచేయు, పదనుపెట్టు.
"మన్నించి యెంత గూడినా మందెమేలము
మున్నిటిసుద్దులు మొనసేతురా" 12-27

మొనపట్లు: *వి.* పంటికొన.
"మోవితేనె విందువేళ మొనపల్లు సోఁకితేను
ఆవల చూచి నవ్వేవు అదేమో నీవు" 8-240

మొనపాదము: *వి.* పాదముకొన.
"మొనపాదము చాఁచితే మొక్కేదే తగవు గాక
పెనఁగి అట్టె బటువుబిల్ల వెట్టనేలా" 7-178

మొనపు: *అ.క్రి.* ప్రకాశించు, అతిశయించు.
"ముత్తెపుఁజిప్పల నీరు మున్నిటివలె నుండునా
ముత్తెములై బలిసి లో మొనపుఁ గాక" 2-139

మొనవాఁడి: *ప.బం; వి.* కొనయందుండే వాడి.
"కొలచిన వారల కొంగుపైఁడి
ములిగిన వారికి మొనవాఁడి" 2-431

మొనవాండ్లు: 'మొనవాఁడి'కి బహువచనం. చివరిభాగాల్లో ఉండే తీక్షతలు (వాండ్లు = వాఁడి శబ్దానికి బహువచన రూపం. అన్నమయ్య వాఁడి, వేఁడి శబ్దాలకు బహువచన రూపాలు వాడడం విశేషం.)
"ముందటి కన్నులకంటే మొనవాండ్లైన చన్ను
లందమాయఁగాక చూపు లప్పటివే కావా"
24-107

మొనవెట్టు: *ప.బం; అ.క్రి.* వాడి కలిగించు, పదనుపెట్టు.
"ఏ నెపమెఱఁగనాపె నెగ్గులెంచ నేరిపి
నానాట నిందరికి మొనవెట్టితివి" 25-364

మొప్పె: *వి.* 1. మూర్ఖుడు 2. మూర్ఖురాలు.
"వడి నెవ్వతో నిన్ను వాకట్టు గట్టుక యింత
ముడివెట్టి విడిచి తా మొప్పెఁ జేసెఁగాకా"
11-563

మొయిలు: *వి.* మేఘం, మబ్బు.

"మొత్తమిఁ జెలితురుము మొయిలు విరొసె నిదె
హత్తి వెలుతురుఁగాల మది నేఁడే" 19-519

మొయిలు లేని వానజల్లు : *ప.బం; వి.* అసంభవమైనది.

మొయిలువారు : *అ.క్రి.* మబ్బుపట్టు, మేఘావృతమగు.
"జిగిఁ జన్నుగొండలపై సెలయేరులు వారీని
మొగముపై జారిజారి మొయిలువారీని"
28-100

మొయిలైపోవు : *అ.క్రి.* విడివడిపోవు, నశించిపోవు.
"అఱమరపుల సుఖ మందిన పిమ్మట
మొఱఁగుకు మొఱగే మొయిలైపోవు" 4-339

మొరఁగు : *వి.* వంచన *విణ.* వంచకుడు.
"అంది తానె మోవి ఇచ్చెనలమేలుమంగ నేను
ముందువెన కెంచిచూడ మొరఁగిందుఁగలదా"
26-116

మొరఁగులాడు : *ప.బం; అ.క్రి.* అరచు, మోసపు పలుకులు పలుకు.
"అక్కరతో నాతఁడే ఆదరించి నన్నుఁగూడె
మొక్కనైతి నంటా నేల మొరఁగులాడేరే"
11-314

మొరఁగులు : *వి; బహు.* అరపులు.
"మనసులో కరఁగులు మాటలలో మొరఁగులు
వనితకుఁ జూడరే చేవలుదేరీని" 17-143

మొర ఇడు : *ప.బం; అ.క్రి.* మొరపెట్టు.
"బలిమి శ్రీవేంకటపతికి మొరఇడి
వెలసిరి తుదనిదే వెరవిందరికి" 3-255

మొరమొర : ధ్వన్యనుకరణశబ్దం.
"మొలనూలి గంటలు మొరమొర మనఁగాను
అలమి పెనఁగులాడీ అంటి నిన్ను" 22-291

మొరయు : *అ.క్రి.* ఉరిమిచూచు. 'ఏమిరా మొరుస్తా' వని చిత్తూరుజిల్లాలో నొక భాగమున వ్యవహారం.
"అనిరుద్ధుతోఁ గూడ నయ్యుషాకన్యఁ
జెరవేయుడని క్రోధచిత్తుఁడై యరిగె
మొరయుచు"
అని చిన్నన్న ఉషాకల్యాణము - 999 వి. పంక్తి. సం.ప.స.

మొరయు : *అ.క్రి.* ధ్వనించు.
"ఒకరిఁ దడవితేను వోరుతురా
మొకము చూడఁగానే మొరతురు గాక" 23-530

మొరవంక యుంగరము : *వి.* వంకరదైన ఉంగరం.
"ముద్దుల వ్రేళ్లతోడ మొరవంక యుంగరాల
నిద్దపుంజేతుల పైఁడిబొద్దులతోడ" 6-1

మొఱఁగు : *అ.క్రి.* అబద్ధమాడు, బొంకు.
"వేవేలు సతులకు వేరే సేసవెట్టి వచ్చి
యీ విధాన మొఱఁగేది యెఱగవు నీవు"
19-186

మొఱఁగు : *వి.* వంచన, మోసం. (మోసపుపలుకు)
"యెక్కుడు శ్రీవేంకటేశ కలిసితి
యిక్కువ మొఱఁగులు యిఁక నేలా" 26-120

మొఱఁగుమాటలు : వంచించే మాటలు.
"ముచ్చట నే మడిగితే మొఱఁగుమాట లాడేవు
బచ్చించి యాల నేరేడుఁబండులమ్మేవే" 7-206

మొలకమోవి : వి. చిగురుమోవి. (మొలకకు చిగురు అనేది లాక్షణికార్థం కావచ్చు)
"చెలియ నీ మోము చూచి సిగ్గులు చల్ల లేక
మొలకమోవిని లోలో ముంచి నవ్వీని" 26-29

మొలకలనోము : వి. ఒకరకపు నోము.
"కదియు పులకలకు మొలకల నోము నోమె"
5-127

మొలకల పున్నమ : వి. వైశాఖమాసంలో పున్నమినాడు స్త్రీలు చేసే పండుగ. రూపాం. మలకల పున్నమ, ములకల పున్నమ, మొలకల పున్నము, మొల్కల పున్నమ.
"పులకల మొలకల పున్నమతోడనె కూడె
అలివేణి నీ పతితో నాడవే వసంతము" 26-337

మొలకవయసు : వి. బాల్యం.
"మొలకవయసుతోడి ముద్దరా లే మెఱుఁగును
నెలకొని రా దిఁక నీది గాదా దోసము" 17-311

మొలనూలు : (మొల + నూలు) వి. స్త్రీలు అలంకారార్థం ధరించే కటిసూత్రం.
"అలమేల్మంగకు నీకు నమరెను మొలనూళ్లు
మలసి మీ రిద్దరును మార్చుకొంటిరా" 12-436

మొలపూస : వి. మొలతాడులో కట్టే పూస, బాలుర కటిసూత్రంలో గుచ్చే బంగారు మొ॥ వాటి ఘుటిక. 2-243

మొల్లమి : వి. తఱచు.
"తొల్లి నిన్నుఁ గొలువని ద్రోహముననే కదా
మొల్లమి నానాజన్మములఁ బుట్టితి" 15-99

మొసగసమాటలు : వి; బహు. గుసగుసమాటలు. రూపాం. ముసగసలు.
"మొక్కలపుఁజేఁతలును మొసగసమాఁటలును
యెక్కడ నేరిచితివే యింతేసి నీవు" 29-167

మొసలిమొకము సొమ్ములు : ప.బం; వి; బహు. చెవులకు ధరించే మొసలిముఖం ఆకారంగల కుండలాలు, మకరకుండలాలు.
"మొసలిమొకము సొమ్ములు సెవులనుఁబెట్టి
విసవిస నవ్వీని వీఁడు గదమ్మా" 17-230

మో

మోఁటు : వి. పందికి ఎదుట మనుష్యాకారంలో నిలిపిన కపటలక్ష్యం. (శ.ర.)
"చేరువ నా మోఁటునఁ జేరిన నా
మెకముల నేరుపరి నంటా" 5-217

మోఁటుపడు : ప.బం; అ.క్రి. మొద్దుబారు, చెడిపోవు (పద.), మ్రాన్పడు.
"కాపురము సేసేనంటే కల్పవృక్షమై తోచు
వోపనంటే మోఁటుపడి వుండు" 23-256

మోఁతుగు : వి. మోదుగు, పలాశం. ఇందులోని అరసున్న చింత్యం.
"ముసరీఁజూపులతేంట్లు మోఁతుగై వలపు పూచె
రసికత నాడుదువు రావయ్య జాజర" 18-249

మోఁపరి : (మోఁపు + అరి) మోసేవాడు, మోఁపు గలవాడు.
"పాఁపరేని మేను దన పానుపు సేసినవాఁడు
మోఁపరయి సకలము మోఁచినవాఁడు" 5-216

మోకదాకిరి : వి. 'మొకదాకిరి'కి రూపాం. కావచ్చు. మొమోటం కలది.
"మంకుదాన నౌదుఁగాని మనసు మోకదాకిరి (?)
కొంకక యేమి సేసినాఁ గోపగించనమ్మా"
12-312

మోకాలిచ్చలఁజూచు : ప.బం; స.క్రి. మొక్కు, నమస్కరించు.
"చేరి వేడుకొంటూనే నీ చెక్కు నొక్కఁగాఁ జూచి
సారెఁదమ మోకాలిచ్చలఁ జూచేరు" 11-124

మోకాళ్లముడుగు : వి. మోకాళ్ల ముడుపు కావచ్చు. వేంకటేశ్వరస్వామి తిరుమలకొండకు కాలిబాటన వెళ్లేప్పుడు ఎదురయ్యే చోటు. దీన్నే మోకాళ్ల పర్వతమని అంటారు. తిరుమలకొండలంతా సాలగ్రామ మయం కనుక పర్వతాన్ని పాదాలతో కాకుండా మోకాళ్లతో ఎక్కేవారట. ఒకచోట మెట్టు మోకాలు ఎత్తుకలిగి మోకాళ్లు ముడుచుకొంటూ ఎక్కవలసి వస్తుంది. కనుక ఈ ప్రదేశానికి మోకాళ్లముడుగు(పు) అనే పేరు వచ్చింది.
"చక్కనేఁగుచు నవ్వచరిఁగడచి హరిఁదలఁచి
మ్రొక్కుచును మోకాళ్లముడుగు గడచినమీద"
1-227

మోచి దింపు : వి. బరువు దించుట. (?)
"తప్పక చూచేటి చూపు తడఁబాటుతో దోపు
ముప్పిరి శిరసువంపు మోచిదింపు" 26-349

మోచిదింపులు : వి; బహు. మోయడం – దింపడం.
"పెట్టెడి నా పెండెమిది పెట్టుకొంటి నిందరిలో
ముట్టి నాకు నిది గొంత మోచిదింపులా"
23-563

మోటు : వి. స్తంభం. (?)
"పొలమురాజై తిరిగే బోయనాయఁడు

వెలయ మోటున నుండే వేఁటబోయనాయఁడు "
1-460

మోటుననుండే వేఁటబోయనాయఁడు : వి. నృసింహస్వామి, స్తంభంలో ఉండే స్వామి.
"పొలమురాజై తిరిగే బోయనాయఁడు
వెలయ మోటున నుండే వేట బోయనాయఁడు "
1-460

మోటుపెట్టు : (?)
"మాటకు మాటాడఁబోతే మరియెన్నైనాఁ గలవు
మోటుపెట్టి నేము నీకు మొక్కేదే మేలు " 8-91

మోడామోడి : విఐ. అందమైన, ఉదాత్తమైన.
"కూడె శ్రీవేంకటేశుఁడు గొబ్బున నిన్నింతలోనె
మోడామోడిసిగ్గుల మూసిపెట్టవే" 21-357

మోడామోడితనము : వి. అందమైన ఉదాత్తశైలి, విధానం. (వ్యు.)
"ఏడ నున్నా నీవారమే ఎరవు సేయకువయ్యా
మోడామోడితనమున మొక్కేము నీకు "
20-293

మోడిసేయు : అ.క్రి. అనాదరం చూపు, (పద; వ్యు.) ఏమార్చు, మోసంచేయు, పంతముపట్టు.
"మోడిసేసి ఇందుకేనా మొక్కేఁ జుమ్మీ " 19-397

మోతనీటిలోని యీత : మిక్కిలి బాధను కలిగించేది.
"మోత నీటిలోని యీఁత మూపునఁబుట్టిన మేఁత
మూఁతిమీఁది కత్తికోఁత మొనగోరివాత" 5-274

మోతుగు : వి. మోదుగుచెట్టు
"మోతుగు వూచెనో మొల్ల వూచెనో
కాతరపు చెలి కన్నులను" 20-291

మోదుకట్టు : అ.క్రి. దెబ్బవలన నెత్తురు గడ్డకట్టు
"మోవి మోవి సోకితేనే మోదుకట్టీనా" 13-246

మోన : వి. మొన, మీద, పైన అని వ్యు. ఇట మోనముతో (= మౌనముతో) అని అర్థం కావచ్చు.
"కానుక యిచ్చితినని కాంతునికి పూవుదండ
మోనతోఁ జేతికిచ్చి మొక్కరే నామారు" 14-482

మోనదాగెలు : ఒకానొక నోము .
"ముదిత మాటాడకిదె మోనదాగెలు నోమె"
5-127

మోనము[1] : అన్నమయ్య 'మౌన' శబ్దాన్ని అంతటా మోనమనే వాడినాడు. ఆనాడు మోనమనే పదమే వ్యవహారంలో ఉండెనేమో ! మౌనం.
"ముక్కుమీఁద వేలిడుక మోనమున నే నుండితే
దక్కిసిగ్గుల మునిఁగీ తాఁదానే" 8-36
"ఇంత నే మోనాన నుంటే యేల మాటాడించీ
పంతము చెల్లినమీఁదఁ బలికేఁ గాక" 20-141

మోనము[2] : వి. దురాగ్రహం.
"గడుసుఁదన మేఁటికి కలికి మోనమటే
తడవకున్న దిట్టతనమిది యనఁడా" 8-243
"పూని నిన్ను నుతియించి భోగియాయ నొకఁడు
మోనమున నిన్ను దిట్టి మోక్షమందె నొకఁడు "
4-8

మోపు : వి. భారం, బరువు, పెద్ద ప్రయత్నం.
"కొమరే పాయమింత కూడినాను మోపుగాదు "
12-246

మోపు(లు)గట్టు : ప.బం; స.క్రి. కుప్పలుపోయు, గడ్డి-గాదం మోపుగట్టడంపై వచ్చిన పలుకుబడి.
"రాఁపులీఁకఁ జేయకువే రతికేలిలోపలను
మోపుగట్టించె వలపు ముదితచే" 7-580

మోపు మోయనే కాని మూలుగఁగఁ బొద్దు లేదు : సామెత. శక్తివంచన లేకుండా బాధతో పనిచేయడమే కాని బాధను తెలియజేయడానికి కూడా సమయం లేదని భావం.
"మోపు మోయనే కాని మూలుగఁగఁ బొద్దు లేదు
శ్రీపతి మా పాటు చిత్తగించవయ్యా" 15-199

మోపులకొలది : అత్యధికం, మిక్కుటం

"యేపుల నిన్ను సొలసి ఇచ్చకములే సేసీ
మోపులకొలఁది గావు ముదిత నేరుపులు"

28-141

మోపులగు : *ప.బం; అ.క్రి.* అధికములగు గడ్డీగాదం వీటిని ఒకచోట కట్టిన పెద్దకట్టలు మోపులు. దీన్నిబట్టి వచ్చిన పదబంధం.

"మోపులాయఁ గోరికలు ముక్కున నూర్పులు రేఁగె
పాపము పుణ్యము మా కా పని గాదు సుమ్మీ"

19-463

మోముచక్కటిన్ : మొగమునకు సూటిగా, ముక్కుకు సూటిగా.

"చాయల నేపొద్దూ మోముచక్కటిఁ గొలువు సేసి
పాయరాని చుట్టమవై పనిగొంటివే" 23-91

మోమెల్లాఁ గన్నులు చేసుక చూచు : *ప.బం; స.క్రి.* మిక్కిలి ఆసక్తితో చూచు, తదేకదృష్టితో చూచు.

"కతలుగా మోమెల్లా గన్నులు చేసుక చూచె
రతి నీ వింటికి వచ్చే రాకలకును" 28-8

మోమోము : (మోము + మోము) ప్రతివారి ముఖము అనియే కాక ఒకరి ముఖము నింకొకరు చూచుట (మొగము మొగము చూచుకొంటే) అను నర్థము కూడా సరిపోవుచున్నది అని సం.ప.స. (19 సం.)

"రాయుడి దవ్వులనుండే రాజసాలు చెల్లుఁగాక
యీయెడ మోమోము చూచి యెడమాఁట లేలే"

13-437

మోయని మోపు : *ప.బం; వి.* భరింపరానంత భారం.

"ఆయము రెంటికి నన్నపానములు
మోయని మోపిది ములుగఁగ నెట్లొ" 6-167

మోరకించు : *అ.క్రి.* మొండితనం చూపు.

"మోరకించి నీ విభుఁడు మోవితేనె లానీ నదే"

16-244

మోరతోపు : (9) వి. వెనుకముందులు చూచుకొనక పోవడం (పద.), అనాలోచిత చేష్ట (వ్యు.) నిర్లక్ష్యం, గుడ్డిగా, మూతులు తిప్పడం, పరాఙ్ముఖత్వం. రూపాం. మోరత్రోపు. ఈ పదానికి వేటూరి ఆనందమూర్తిగారు మూతివిరుపు, నిర్లక్ష్యం చేయడం అనే అర్థాలు సూచించినారు. వారి వివరణ ఈ విధంగా ఉంది. 'పశ్వాదుల దీర్ఘముఖమును మోర యందురు. నీ మొహము, నీ మోర అని వ్యవహారము. మూతిని విరిచియు, మూరెడు చేసికొనియు తిరస్కారమును ప్రకటించుటయే మోరతోపు చేయుట. ఇది మోరతోపే కాని మొరతోపు కాదనుకుందును. చూ : బ్రౌన్. మోరతోపు = aversion, turning, away or averting the face, మూతులు తిప్పడము.

"మోరతోపున నిన్నాళ్లు మోసపోతిఁగా"

1-75 పు.

మోరతోపుఁదనము : (4) వి.అనాలోచనం, అనాలోచనచేష్ట, పెడముఖం పెట్టడం. రూపాం. మోరత్రోపుఁదనము.

"మొలనూలు వట్టఁగానే మోరతోపుఁదనమేల
చెలువుఁడ మారుమోము సేసుక నవ్వేవు"

18-52

మోరుఁడు : వి. అటూఇటూ చెందని స్థితిలో ఉన్నవాడు, మూర్ఖుడు, మూర్ఖశబ్దభవమైన మోరకుడు అనేదానికి వ్యావహారికరూపం (?) లేదా ఇది 'మోరఁడు' కావచ్చును. మోరడు అంటే మ్రోడు.

"అటు గన తాఁబట్టిన వ్రతముండఁగ
నన్యమతము చేపట్టినను
నటనల నెందునుఁ బొందక జీవుఁడు నడుమనె మోరుఁడైనట్లు
తటుకన శ్రీవేంకటపతి నొక్కని దాస్యము భజియించిన నరుఁడు
ఘటనల నాతని కైంకర్యములకు
కడుఁబాత్రుఁడు గాక మానునా" 2-22

మోలము : వి. మొలాము, బంగారు మొదలైన వాటి పూఁత, పుంటికి పూసెడి మందు.

"పైడి మోలము కటారు పరుజులవాఁడు" 7-116

మోవనాడు : ప.బం. మనసుకు తగులునట్లుగా మాట్లాడు, తాకనాడు. 6-37 & 12-241

మోవిగిరుపు : వి. పెదవివిరుచుట.

"నీ విన్నిటా నేర్పరివి నే నంతేసి నేరను
మోవి గిరిపే నింతే ముంచి యేమి సేసేరా" 11-1

మోవితే(నియ)నె : (40) వి. అధరామృతం.

"నీ రూపుపటాన వ్రాసు నివ్వెరగుతో నిలుచు
సారె నీ మోవితేనెకు నోరూరును" 29-469

మోవిదిష్టము : వి. (?)

"మాపుదాఁకా వట్టిమాట లేమిటికి నిఁక
తీపులకు గుఱి మోవిదిష్టంబులే" 7-35

మోవిపంటి బోనము : ఒకజాతిపండు భోజనము.

"వేవేలుగ నీకు దానే విందులు వెట్టీనంటా
మోవిపంటి బోనాలు మోచుకున్నది" 29-534

మోవిపండు : (17) వి. పండువంటి పెదవి. (?)

"చేవదేరి మోవిపండు చిప్పిలి తేనె గారఁగా
పూవుల నేల వేసేనే పొద్దువోని వాఁడు" 29-96

ఒకజాతి పండు :

"మంచి మాటలాడఁగాను మధురాలు సోఁకి సోఁకి
ముంచి నీ పెదవి నంటె మోవిపండు" 12-175

"మోవిపండు నీకు మోవి నిచ్చినదఁట (?)
మోవికింద నీవు మలయఁగాను" 5-102

మోస : (10) వి. ప్రమాదం, వంచన, దొంగతనం, అడ్డు, అసత్యం, ఆపద.

"రాసికెక్క నీ వలపు రతులను మెప్పించి
మోస లేక వేఁడుకొని మొక్కు మొక్కవమ్మా" 29-297

"పాసి వుండి నినుఁ బలికిన పలుకులు
మోసదీర నిదె మొక్కేనయ్యా" 16-132

మోసపెట్టు : స.క్రి. మోసంచేయు.

"ఆసపెట్టు మోసపెట్టు నంతలోనే వాసిపెట్టు
గాసిల నీ సిరులకు గలదిది" 4-223

మోసు : వి. అందం. (మొలక)

"మొలక చన్నుల మొనలమోసుల నూఁది మనసు
చెలఁగించినఁగాక చెప్పినట్టు సేసునా" 23-172

మోసువారు : ప.బం. వర్ధిల్లు.

"తలవంచీ నేల తాను తగిలికూడు మనవే
మొలచి నాపై బత్తి మోసువారెనా" 13-480

మోహినీగజము : వి. పెద్ద మోహకశక్తియా అని సంపా.

"జాలి మోహినీగజము సంసారమిది
లోలుఁడఁ గాకపోదు లోకము సహజము" 3-132

య

య(హో)చ్చ యింద్రే యచ్చ సూర్యే : (?)

"యచ్చ యింద్రేయని యచ్చ సూర్యేయని
అచ్చుగ తుదకెక్క(కు)నదే పొగడీ శ్రుతి" 2-485

యద్దృష్టం తన్నష్టమ్ : కనిపించేదెల్లా నశించేదే.

"ఎదుటఁగన యీ జగము యిది నీవన వెఱతును
అది విపరీతజ్ఞానము యద్దృష్టం తన్నష్టము గాన" 2-121

యద్భావం తద్భవతి : దేన్ని భావించుకుంటుందో అదిగా మారిపోతుంది.

"ఇదివో సుజ్ఞానము సూత్రే మణిగణా యివ గాన
మది నితరమే లేదు మాయల యద్భావం తద్భవతి" 2-121

యా

యాఁకరు : అ.క్రి. 'ఏకరు'కు జానపదవ్యవహారం. మిక్కిలి అపేక్ష కలిగి ఉండు. రూపాం. యాకారు.

"ఎంత యాఁకరేవు నీవు ఇంతి చెలువము చూచి
వింతలుగా జోడుగూడ విచారించేవా" 22-257

యాకట : వి. 'ఏకట'కు వ్యావహారికరూపం. అపేక్ష, మిక్కిలి కోరిక.

"వాఁకమాయ వలపంటా వన్నెకాఁడ నేనంటా
యాఁకట నలయింతురా అప్పుడే నీవు" 2-796
"అలరి మర్మములంటే యాఁకట మరేటికే"
29-2 అను.

యా(ఏ)కతమాడు : అ.క్రి. మంతనాలాడు. ఇందులో ఏ 'యా'గా ఉచ్చరించబడింది.
"గారవించి యాపెతో యాకతము నీవాడగాను
యారీతి దగ్గరితేను యిది సిగ్గు గాదా" 11-9

యా(ఏ)కతము : వి. ఒంటరి, నిర్జనప్రదేశం, ఆలోచనకు తగినచోటు, ఆలోచన, సంప్రదింపు. ఇందులో ఏ 'యా'గా ఉచ్చరించబడింది.
"పిన్నదాన యాకతానఁ బిలిచి ఆనతీవయ్యా"

యాకాంతములాడు : అ.క్రి. 'ఏకాంతములాడు'కు జానపద వ్యవహారం. రహస్యంగా మాట్లాడు.
"వేళయేమి చూచేవే శ్రీవేంకటేశు చెవిలోన
తాలిమితోడుత యాకాంతములాడవే" 17-216

యాకారు : అ.క్రి. 'ఏకారు'కు జానపదవ్యవహారం. మిక్కిలి అపేక్ష కలిగి ఉండు.
"మిక్కిలి నీ గుణాలకు మెచ్చి మెచ్చిలోలో నవ్వి
వొక్కటై నీ మోవితేనె కూరకె యాకారును"
12-280

యాచకము : వి. యాచన. ఇది సంస్కృతపదం. దీనికి 'యాచించునది' అని కర్త్రర్థం. కాని ఇట యాచకత్వం, యాచన అని భావార్థంలో వాడబడింది.
"సకలయాచకమే సరుస నాకుఁబని
సకలరక్షకత్వము సరి నీ పని" 2-53

యాజకము : వి. యజ్ఞం చేయడం.
"అది నిజమతంబదిగాక యాజకం
బదిగాక హృదయసుఖగదిగాక పరము" 1-40

యాదవనారాయణుఁడు : వి. యాదవరూపంలో ఉన్న విష్ణుమూర్తి. శ్రీకృష్ణుడు.

యావభావాలు : వి. 'హావభావాలు' శబ్దానికి జానపద వ్యవహారరూపం.
"అమరీ నమరదు నీ యావభావాలు
గమి నీ వలపు లిందే కానరాదా నాకును"
17-284

యో

యోగక్షేమం వహామ్యహమ్ : భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన వాక్యం. 'నా భక్తుల యోగక్షేమాల బాధ్యతను వహిస్తాను' అని అర్థం.
"అల యోగక్షేమం వహామ్యహ 'మ్మను మాట
పదమైయుండఁగా" 8-2-22

యోగపట్టెము : వి. యోగులు జందెమాదిరిగా వేసుకునే పట్టు మొ॥ వాటితో నేసే పట్టె. రూపాం. యోగపట్టము.
"చిలుకుగోళ్లతోడ సెలవిన నవ్వులతోడ
బలుజిహ్వాతోడ యోగపట్టెముతోడ" 2-278

యోగానంద నరసింహస్వామి : వి. చిన్న అహోబలానికి ఆగ్నేయదిశలో రెండుమైళ్ల దూరంలో వెలసిన నరసింహస్వామి. నవనారసింహుల్లో ఒక స్వామి.
"అతిశయకరుణ యోగానందనరసింహో
మతి శాంతపు కానుగుమాని నారసింహో"
1-453

ర

రంగక్షేత్రము : వి. తమిళనాడురాష్ట్రంలో రంగనాథుడు వెలసిన శ్రీరంగక్షేత్రం. ఇది కావేరినది రెండుపాయల నడుమ ఉంది.
"కావేరీమధ్య రంగక్షేత్రమల్లదిగో" 15-125

రంగపతి : వి. శ్రీరంగం లోని రంగనాథస్వామి
"బ్రహ్మ పూజించే రఘుపతి విభీషణు కిచ్చె
బ్రహ్మణ్యుఁడీ రంగపతిఁ గొలువరో" 15-125

రంగుపాట : వి. శ్రేష్ఠమైన పాట, ఇంపైన పాట, మనోజ్ఞమైన పాట.
"రవళి నారదాదుల రంగుపాటకుఁజొచ్చి

చెవులాలించీ సుతలు శ్రీనారసింహుఁడు"
15-132

రంటదెప్పరపు రచన : వి. అతుకుల కూర్పు
"రంటదెప్పరపు రచనమా బదుకు" 4-184
"రతిరాజు నమ్ము లివి రంటదెప్పరపువేళ
కతుకున నాఁటుఁజేసు గవిశన నిడరే" 11-221
"రంటదెప్పరము లేల రాకు రాకు పోవయ్యా"
20-192

రండు : (15) వి. 'రెండు'కు వికృతిరూపం.
"రాతిరిఁబగలనేటి రంటినడుమఁజిక్కి
వూతఁగాన వెళ్లనీరో వో యాసలాల" 3-442
"వుండేది వొక్కతె యింట పండేది వొక్కతె వద్ద
రండును నడపేవు నీ రాజసమున" 8-38
"రండూ నేరుతువే రమణి నీవు
వెండిపైఁడి వుంగరాలు వేలనే పెట్టితివే" 8-26

రండు నాడేటివారు : వి. అవును కాదు అని రెండూ చెప్పేవారు, పట్టు లేనివారు.
"రండు నాడేటివారు రమణులు
అండ నీవే కనుకొనే వడుగకు మమ్మును"
14-417

రంతు : వి. 1.రతి 2.ఆట 3.మనవి 4.కలకలం, శబ్దం 5.గల్లంతు 6.కలహం 7.సింహనాదం 8.మిడిసిపాటు 9.ఒప్పిదం 10.విఘ్నం 11.విలాసం అనే అర్థాలు నిఘంటువుల్లో కనిపిస్తున్నాయి. ఈ అర్థాల్లో ఇట ఒప్పిదం, విలాసం అనే అర్థాలు ఒప్పుతున్నాయి.
"రంతున వాల్మీకి చెప్ప రామాయణముగాను
సంతగాఁ దాటకాదులఁ జంపినదెల్లా" 2-162

రంతుకెక్కు : ప.*బం; అ.క్రి.* మిడిసిపడు.
"రంతుకెక్క విరహతాపము కూన
కాంతుల నీ సోయగపు కనుచూపే మందు"
4-273

రంపపుసంసారము : ప.*బం;* వి. కటకటగా నడిచే సంసారం, బాధాకరమైన సంసారం.
"పాముచెలిమి రంపపుసంసారము
గాములు మోఁచిన గంప యిది" 1-180

రక్తగుండాలు : వి. రక్తపాత్రలు.
"జగములో రాక్షసుల సంహారముగ నేనె
నిగిడి రక్తగుండాలు నిండ నేసెను" 2-107

రచ్చఁబడు : వీధిన పడు. 8-27

రచ్చలఁబడు : ప.*బం; అ.క్రి.* వీథుల్లో పడు.
"రచ్చలఁబడె మా గుట్టు రమణుల చేఁతబెట్టు
అచ్చమై యిందుకుఁ బరిహర మేదో కాని"
3-531

రచ్చలు : *వి; బహు.* రట్టులు.
"రతి వినోదమెపుడు రచ్చలఁబొందించును"
3-532

రచ్చవేయు : స.క్రి. బజారున వేయు.
"చేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
రాఁగిన నీ పొందులెల్ల రచ్చవేసేదానవా"
11-276

రచ్చె : వి. రచ్చ, రాజమార్గం.
"సారె సారె రచ్చెలోన సరసము లాడితి
కోరి కొలువులు సేసితి గుబ్బతిలితి" 23-28

రట్టుకెక్కు : ప.*బం; అ.క్రి.* అల్లరిచేయు.
"చేముంచి నీవు సారెఁ జెనకఁగానే పో
యేమి నెఱఁగని బాల ఇంత రట్టుకెక్కెను"
18-223
"రట్టుకెక్కి దొర నౌటే నెట్టన మూడో తప్పు
యిట్టె కావు కావకుండ మిదివో తప్పు" 4-208

రతికెక్కు : (14) (రతికి + ఎక్కు) ప.*బం; అ.క్రి;* మాం. బాగుపడు, చక్కబడు, ప్రసిద్ధిచెందు, వర్ధిల్లు.
"యేరా శ్రీవేంకటేశ్వరుఁడా
రార కడపలో రతికెక్కఁ బనులు" 26-58
"అంగన మంచముమీఁద నభ్యసించిన విద్యలు
రంగుగా మా కౌఁగిటిలో రతికెక్కెను" 21-351

రతిపరవశము : (2) వి. రతిపారవశ్యం.
"రతిపరవశములు రాఁగిన మూర్ఛలు సుండీ

మతిలోఁ దప్పించుక మనుదురు గాని" 1-494

రతిరాచవిభవము : వి. రతిరాజవిభమము అనడానికి బదులుగా రతిరాచవిభమనడం అన్నమయ్య ప్రయోగ స్వాతంత్ర్యానికి లక్షణం. మన్మథ విభవము.

"కలయవే పాన్పుపై కళలు మోమునఁ బొదల

వెలయవే రతిరాచవిభవములను" 28-2

రతు(కు) : 'రతి(కి)' అనే అర్థంలో ప్రయోగింపబడిన పదం. ఇందులో 'రతు' అనేది ప్రాతిపదికమా!

"సారె సారె రతుకు సమ్మతించ వేఁడుకొని

తూరుపెత్తీఁదమక మేతులతోడను" 28-246

రత్నకోమలి : వి. రత్నంవలె మృదువైన శరీరం కల స్త్రీ, స్త్రీ. ఈ పదాన్ని ఇతరకవులు ప్రయోగించినట్లుగా కనిపించదు. ఇది అన్నమయ్య విలక్షణప్రయోగం.

"మాట గాఁగ నవ్వితే ముత్యాలు రాలీని

కూటువ నీ సతి రత్నకోమలి గనక" 7-314

రత్నదీపము : వి. చంద్రుడు. 'అన్వయస్తు సముద్రః స్యాద్రత్నదీపస్తు చంద్రమాః' అనే నిఘంటువాక్యాన్ని ఉదాహరిస్తూ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు రత్నదీప శబ్దానికి చంద్రుడనే అర్థాన్ని పేర్కొన్నారు. (తెలుగుమెఱుగులు 82 పు.)

"మొలచి రత్నదీపమే మొకమై తా నుండినాను

వెలుగు ఇంటిలో నెల్ల వెలయకుండీనా" 24-184

రత్నాల కమ్మలు : వి; బహు. రత్నాలు పొదిగిన కమ్మలు (కమ్మలు = చెవికి ధరించే ఆభరణ విశేషం.)

"కప్పులు దేర నొసలఁగస్తూరిబొ ట్టమరించె

వొప్పుగా రత్నాల కమ్మలొనరించె వీనులు"

27-528

రథసప్తమి : వి. మాఘశుద్ధ సప్తమినాడు చేసే వ్రతవిశేషం. ఇది సూర్యసంబంధివ్రతం.

"సతి పిరుఁదుల రథసప్తమి నేఁడె కలిగె

తతి శ్రీవేంకటేశుఁడు తగిలెఁగదె" 29-409

రపణము : వి. గర్వం, ఉత్సాహం, సంబరం. విణ. గొప్పది. (సూ.ని.) గొప్ప. (శ.ర.)

"రపణపుభవములు రాట్నపుగుంద్రలు

చపలపు బుద్ధులు జలనిధులు" 3-50

రపణము : విణ. మోగేది. వి. భూషణం. ఇది రవణము కావచ్చు.

"రతి చెనకులే నీకు రపణపుసొమ్ములు

సతతపుఁగూటమే సర్వసంపద" 12-76

"ముచ్చటమమత చీచీ ముచ్చు మురిపెమ చీచీ

బచ్చురపణములోని బచ్చన చీచీ" 1-195

రపము : (21) వి. చెల్లుబడి, (శ.ర.) గర్వం, ఉత్సాహం, సంబరం, అధికారం. విణ. అధీనం, ప్రచురం. (చనవు అని పీఠిక)

"కపటము లెల్లఁదీర కాఁగిలించుకొంటి నీడ

రపముగ నిట్టె నన్ను రక్షించరాదా"

"జాణఁడవు నీకు నిదే చద్దివలపు

రాణించె నింకెన్నఁడు నీ రపమాయ వలపు" 7-7

"రపమై శ్రీవేంకటేశ రతి నన్ను గూడితివి

వుపమించి చూడనింతా నొక్కటే వలపు" 11-7

"వేసిన కర్మములెల్లా చెప్పరాని మోపులాయ

రాసికెక్కె యింద్రియాల రప మాయను" 3-86

"కొంతపుఁజూపులఁ జూచి గోల దాన నేమి సేసే

రంతుల విభుఁడవు నీ రపమిందే కాక" 27-232

రమ్మను పొమ్మను : ప.బం; స.క్రి. పట్టించుకొను, ఆదరించు, గౌరవించు. దీనికి వ్యతిరేకార్థంలోనే ప్రయోగం.

"రమ్మనవు పొమ్మనవు రాజసము నెరపేవు"

20-253

రళిత : 'రళిత' అనే రూపం ఏర్పడడానికి వీలుగా 'రల్' ధాతువు కనిపించదు. 'రలయోరభేదః' అనే దాన్నిబట్టి దీన్ని 'లలిత' అనుకోవడానికి వీలున్నా అది సందర్భానికి సరిపోదు. కనుక దీన్ని 'గళిత' గా భావిస్తే సరిపోతుంది. గళిత అంటే జారిన అని అర్థం. కాని యతిభంగ మేర్పడుతుంది. అన్నమయ్య స్వతంత్రుడు

కదా! లేదా 'రళిత'కు జారిన అనే అర్థం చెప్పుకోవాలి.
"ప్రళయానలసంభ్రమ విభ్రమకర
రళిత దైత్యగళ రక్తవికిరణా" 2-81

రవకత్తె : (రవ+కత్తె) నింద గల స్త్రీ. రూపాం. రవ్వకత్తె.
"రచ్చలఁ దన్నుఁబొగడి రవకత్తె నేనైతినే
యిచ్చకమే ఆడియాడి ఇట్లయితినే" 25-370

రవణహీనత్వము : వి. భూషణం (నగ) లేకుండటం.
"రాజసన్మానమట రవణహీనత్వమట
తేజమట నలువంకఁ దిరొపెంబట" 1-247

రవరవ : అవ్య. మెరయుట యందగు ధ్వన్యనుకరణం, శీఘ్రంగా.
"రవరవ చెమటఁ గరఁగి నేడు యిదె
చవులాయను నీ జాజర" 5-332

రవిపదకము : వి. ఆభరణవిశేషం.
"రంతుఁ గలువకంటికి రవిపదక మిదేలే
పంతముతోడ చంద్రాభరణము లిడరే" 17-427

రవ్వ : వి. అపకీర్తి, నింద. (వజ్రం)
"రవ్వగా శ్రీవేంకటరాయఁడిదే నన్నుఁగూడె"
"రవ్వ మొక్కరో కరము రతిఁ
జొక్కియుండఁగాను నవ్వరేలే" 26-582
"రవ్వ శ్రీవేంకటేశుఁడు రతి నన్ను నిటు గూడె
జవ్వనులు నీవలె సాదించనోపరా" 27-387

రవ్వకాఁడు : (రవ్వ + కాఁడు) నింద గలవాడు.
"చివ్వన నింకా నీపైఁ జిత్త మిటువలె వచ్చు
రవ్వకాఁడ మాతోను రాయడించకుమయ్యా" 27-246

రవ్వకెక్కు : *ప.బం; అ.క్రి.* నింద పొందు, నిందకు లోనగు.
"రాతిరెల్లా జాగరాలే రవ్వకెక్కెఁ బగలెల్లా
చేఁత లేమి సేయవలెఁ జెప్పరో యమ్మా" 20-29

రవ్వగా : *క్రి.విశ.* (?)
"అవ్వల నెవ్వని కేశవాదినామములే
రవ్వగా నాచమనాలు రచియింతురు" 3-358

రవ్వపడు : *అ.క్రి.* నిందపడు, దూఱుపడు.
"రాతి రొక్కలోకము రవ్వపడెఁ గలలోపల" 2-163
"నవ్వినంతే చాలుఁదాను నాయమేమీ చెప్పకురే
రవ్వపడ్డ మేనవావి రమణిని నేను" 20-87

రవ్వ(లు)సేయు : *ప.బం; అ.క్రి.* రచ్చలు చేయు, అల్లరి చేయు, దూరు, నిందించు, పెద్ద ధ్వని చేయు.
"వూడిగాల చెలులతో వొంటి మాటలాడెనంటా
వాడలోన నేఁటికి రవ్వలు సేసేవే" 28-416
"రవ్వసేయఁజోటు లేదు రాజసానకిమ్మ లేదు
పువ్వువంటి చెలినెట్టు బుజ్జగించేవో" 20-106

రవ్వలైనవారు : *వి; బహు.* నిందపడ్డవారు, అల్లరిపాలైన వారు.
"నవ్వు నవ్వేవారికి నాయములు దగునా
రవ్వలైనవారికి బీరము లేలా" 25-449

రవ్వెన : వి. అల్లరి.
"రవ్వెనవాఁడవు గావా రాజవుగావా మున్నే
అవ్వల నెంచి చూచితే నందుకునుఁ దగవా" 8-244

రవ్వెనవాఁడు : (రవ్వెన + వాఁడు) అల్లరివాడు. (వ్యు.)
"రవ్వెనవాఁడవు గావా రాజవుగావా మున్నే
అవ్వల నెంచి చూచితే నందుకునుఁ దగవా" 8-244

రసబద్ధము : వి. రసబంధము కావచ్చునని సంపా. ధర్మవాచకానికి బదులు ధర్మివాచక ప్రయోగం అన్నమయ్యకు సహజమే. ఇంద్రియాలను శరీరంలో పదిలంగా నిలిపి బంధించడం.
"యిదివో రసబద్ధము యింద్రియములు మేనిలో
పదిలముగా నిలిపి బంధించుట" 1-452

రా

రాఁగఁజేయు : స.క్రి. అల్లరిచేయు. 13-22 old

రాఁగతనము : (2) (రాగ + తనము) వి. పొగరుబోతుతనం, ఔద్ధత్యం, ధూర్తత్వం.
"గొప్ప రాఁగతన మేల కోరి విడెమియ్యవే
చిప్పిలిఁగ వేడుకొని చే యొగ్గిని" 25-252

రాఁగిలించు : అ.క్రి. సంతోసించు, రంజిల్లు, అనురాగం కలిగి ఉండు.
"చేయి చాఁచి రాఁగిలించి చిత్తగించి మోము చూచి"

రాఁగు : (11) అ.క్రి. అనురాగం పొందు. (వ్యు.)
"పాఁగిన శ్రీవేంకటాద్రిపతి యిన్నిటా నాతో
రాఁగిన మోవితేనెల రసికు నే మందునే"
19-511

రాఁగు : (2) రేగు, కోపంతో మండిపడు బ్రౌన్; to be enraged, perhaps this should be రేగుట.
"రాఁగిన వేళల రంకెలు వేయు"
"వీఁగక శ్రీవేంకటేశ! వేడుక గూడితి నన్ను
రాఁగినా కోపముడిపి రక్షించనే కాదా"

రాఁపుఁదనము : (రాఁపు + తనము) వి. సంఘర్షణ, రాపిడి.
"చుట్టమువలెనే నీకు సుద్దులెల్లాఁ జెప్పిని
రట్టడి యి దెవ్వతెయ్యా రాఁపుదనాన" 28-135

రాఁపు : వి. నింద, రవ్వ; రాపిడి, సంఘర్షణ. రంపు ఇదియే కావచ్చు. (సం.ప.స. 14 సం.)
"నెమ్మదిఁ దనకొరకే నివ్వెరఁగున నుందాన
రమ్మని తానే నాతో రాఁపు వలదనవే" 26-30
"రాఁగదే యింటిలోనికి రాఁపు సేయక
చేఁగచూపుల మమ్మేల చిమ్మిరేఁచేవే" 14-363

రాఁపుసేయు : ప.బం; అ.క్రి. గిల్లికజ్జాలు పెట్టుకొను, ఘర్షణచేయు.
"నీ పలుకులెల్లా వింటి నీవు వేఁడుకొననేల
రాఁపుసేయ కిప్పుడిట్టే రావయ్య లోనికి"

రాకాఁబోకలు : వి. రాకపోకలు.
"రాకాఁబోకల రమణుఁడు దూరీనే తా
జోక సన్నసేయఁగాను చూడనంటా" 20-47

రాకొట్టు : (రా + కొట్టు) ప.బం; వి. రారా పోరా అని ఏకవచనాంతంగా పిలవడం.
"యేకతపువిన్నపము లిచ్చకము పుట్టించు
రాకొట్టులై పెనగొను రతివేళ విన్నపము"
12-125
"పోతరించి రాకొట్టఁబొగడుదుమా" 12-276

రాకొట్టు(లు)గొట్టు : ప.బం; అ.క్రి. రారా పోరా అని ఏకవచనాంతంగా పిలుచు.
"రాకొట్టులుగొట్టు రాజసము చూపిమోపి"
27-201
"సందడించి నీ యింటికి సారెకు వచ్చీనంటా
గొందినుండి యేల రాకొట్టు గొట్టేవే" 29-382

రాగిదేరు : అ.క్రి; ప.బం. ఎరుపెక్కు. చూ : రాగిదేఱు.
"నవ్వులేమి నవ్వేవే నాయకుని మాటలకు
రవ్వలుగా నందేమైనా రాగిదేరెనా" 13-251

రాగుంజు పోగుంజులాట : వి. అటువారు ఇటు వచ్చేట్లు, ఇటువారు అటు పోయేట్లు తాడును గుంజుతూ ఆడే ఆట.

రాచయిూవి : వి. రాజులు చేసే దానం
"దీన నీ విచ్చిన మేను తెగి రోయ నెంతవాఁడ
కావించి రాచయిూవికిఁ గడమున్నదా" 4-248

రాచవిద్దె : వి. రాజవిద్య. 7-268

రాచవెట్టి : వి. రాజులకు చేసే చాకిరి, రాచకొలువు, (వ్యు.) దొంగతనం. (తె.జా.)
"శ్రీపతి యీ సంసారము సేయకుండా నెంతవాఁడ
మాపుదాఁకా రాచవెట్టి మానవచ్చునో" 4-248

రాజనపుఁబొట్ట : వి. రాజనపువరి పొట్ట.
"సరి ననంట్లు రాజనపుఁబొట్టలవె
వెరవున తామరవిరులు నవె" 7-281

రాజు లేని కొలువు : ప.బం; వి. అసంభవమైనది, వ్యర్థమైనది.

"జ్ఞానము లేని యెఱుక సందుగిందు లేని యిల్లు
రానిపోనిచోటి యాస రాజు లేని కొలువు"
15-462

రాజు వలసినది దేవులు : *వి; బహు.* ఇట 'వలచినది' అని కావచ్చు. రాజుమెచ్చిందే రంభ వంటి ప్రయోగం.
"సరిగాఁడు వీఁడనవలదు జగమున
రాజు వలసినది దేవులు" 2-298

రాట్నపుఁజెవులు : *ప.బం; వి; బహు.* నిరుపయోగమైనవి.
"నిన్నుఁజూడని కన్నులు నీచుల వలకన్నులు
చిన్ని నీ కథలు వినని చెవులు రాట్నపుఁజెవులు"
2-450

రాట్నపుగుంద్ర : *ప.బం; వి.* నిష్ప్రయోజనమైనది. (వ్య.)
"కోటానఁగోట్లాయ కోరికెలు జన్మములు
కూటువ గూడి రాట్నపుగుంద్రలైనారయ్యా"
2-266

చక్రభ్రమణం :
"ధరలోనఁబుట్టి తగవచ్చినందే వచ్చి
వరుస రాట్నపుగుంద్రవలె నైతి" 3-338

రాణివాసము : *ప.బం; వి; బహు.* అంతఃపురస్త్రీ, అంతఃపురము.
"నీ రాణివాసాలు నీకు మోహించిరి
యేరీతిఁ జనవులిచ్చేవయ్యా" 25-249
"ధర శ్రీవేంకటేశ నీ తావెల్లా రాణివాసాలే
యిరవై మమ్ము నేలితి వేదుగాను సతుల"
13-95

రాత నార ఒలుచు : *ప.బం; అ.క్రి.* అసాధ్యకార్యాలను చేయు. రాతినుండి నారలాగు అని వాచ్యార్థం. బండకు నారలు దీయుట, వట్టి కట్టెకు నారలు దీయుట, రోకండ్లకు నారలు తీయుట అని తెలంగాణంలో వ్యవహారం. (తె.జా.)
"ఆసపడనీవే తాను అంబుధులు పేరఁబెట్టు
కోసి రాత నారొలిచి కూరిము లింతేఁటికే" 8-298

రాతిగుండె : (5) *వి; ప.బం.* కఠినమైన హృదయం, కఠినుడు.
"ముచ్చువలె నిప్పుడుండె మూడులోకములు నిండె
రచ్చసేసెఁ జూడరే రాతిగుండె" 5-48

రాతిగుండెది : (రాతిగుండె + అది) *ప.బం; వి.* కఠినమైన హృదయం కలది.
"రారాపులదానఁగాను, రాతిగుండెదాన గాను
కోరి నీకు మోహించిన కొమ్మను నేను" 18-67

రాతిగుండెవాఁడు : (రాతిగుండె + వాఁడు) *ప.బం; వి.* కఠినమైన హృదయం కలవాడు.
"వాలాయించి రాతిగుండెవాఁడ వౌత యెఱుఁగుదు
పాలుమాలిన నా యాస పాయనీదుఁగాని"
11-45

రాతిగుణము : *వి; ప.బం.* కాఠిన్యం.
"ఈ తీరున రాతిగుణము దాకాఁదిప్పఁగవచ్చు
నీతితోడ నీ వలపు నీయంత లేనిది" 16-158

రాతిగుబ్బము : *వి.* నిష్ప్రయోజనమైనది.
"ఒట్టుకొని దేవరాహుత్తరాయ బిరుదు నీదే
కిట్టి రాతి గుబ్బమెక్కితివి గాన" 2-142

రాతిటనుండి : (3) రాత్రినుండి.
"రాతిటనుండియు జాగరములె సేయఁగఁబట్టె
యీ తరుణులఁజూచైన యియ్యకొనవమ్మా"
11-133

రాతిటి : (3) రాత్రికి సంబంధించిన. రాత్రి శబ్ద వికృతిరూప మైన 'రాతిరి' పదం ఔపవిభక్తికంగా వాడబడింది. ఇట్లే అన్నమయ్య 'జాముట' అనికూడా వాడినాడు.
"రాతిటి యాకె రతులు రచ్చనేల వేసేవు
కాతరానఁ జిక్కినపుడు గరలియ్యరాదా"
29-298

రాతిపై నార : *ప.బం; వి.* అసంభవం, రాతిలో నార ఉండదుకదా!
"గునిసి మందలవారి గుణము రాతిపై నార

నను పెంత గలిగినా నాలిమాలేనా" 7-479

రాతిమనసు : *ప.బం; వి.* కఠినమైన మనస్సు.

"ఎంత రాతిమనసో నీ కెప్పుడిఁకఁ గరఁగీనో
పొంత సిగ్గువడీ నీతోఁ బొందేటి వేడుకను"
21-374

'ఎంత రాతిమనసుదానవే' అని క్షేత్రయ్య పదం.

రాతిరింటిపని : *ప.బం; వి.* సంభోగం. 'రాతిరింటి' అనేది 'రాతిరి' కి ఔపవిభక్తికరూపం. వ్యభిచారం. (వ్యా.)

"రాతిరింటి నీ పనులు రతికెక్కు రచ్చకెక్కు
యీతల వేగి లేచితే నింటికెక్కును" 7-559

రాతిరి పని : *ప.బం; వి.* సంభోగము, వ్యభిచారం. (వ్యా.)

"రాతిరిపనులాతఁడు రవ్వల కెక్కినతఁడు
భీతిలేక ఆనలెల్లాఁ బెట్టుకోఁడా" 8-13

రాతివీరుఁడు : వీరుని విగ్రహం. 2-494

రాతివీరుని బీరము : *వి; ప.బం.* అసంభవం.
2-294

రానిపోని చోటి యాస : రానిపోని చోటు వ్యర్థమే కదా! వ్యర్థం(?)

"జ్ఞానము లేని యెఱుక సందుగిందు లేని యిల్లు
రానిపోని చోటి యాస రాజులేని కొలువు"
15-462

రానిలే : రానీలే (= రానివ్వులే) అనే పదబంధానికి వికృతరూపం. 'నీ' లోని దీర్ఘం హ్రస్వంగా మారింది.

"మాని మాని కమ్మర మగుడ మమ్మేఁచీని
రానిలే చూచుఁగాని రాచగోవిందుఁడు" 5-325

రాపు సేసి మోఁపుగట్టు : *ప.బం; అ.క్రి.* (?)

"ఏఁపుచు నా కాళ్లితఁడేల వట్టెనె
రాఁపుసేసి నాకుఁబెద్ద మోఁపు గట్టినట్లు" 6-167

రాపుబీరాలు : *ప.బం; వి; బహు.* కఠినోక్తులు.

"రాఁగదవే యిఁక నేల రాపుబీరాలు
మాఁగిన మోవితేనెకు మరిగినదానవు" 7-120

రామరాజ్యము : *వి; ప.బం.* సుభిక్షము, మంచి పరిపాలన గల రాజ్యం, ఆనందప్రదమైన రాజ్యం.

"రమణి జవ్వనము రామరాజ్యమిఁక
అమరఁగ నిట గొనియాడా చెలులు" 24-123

రాయడి : (3) వి. 'రాయిడి'కి వ్యావహారికరూపం. ఒరయిక, ఉపద్రవం. (వ్యా.)

"రాయడికి నలులేల రాసీనే మాతోను
కాయజుఁడు తానేల కసరీనే" 5-191

రాయడించు : (3) బాధించు, ఉపద్రవం కలిగించు. చూ: రాయడి.

"యెంత సంతసమైనదో యిండ్లిండ్ల వెన్నెలు దిని
రంతుతోఁ బడుచులతో రాయడించడు" 24-185

రాయడికాఁడు : (రాయడి + కాఁడు) రాయిడికాఁడు, ఉపద్రవం కలిగించేవాడు, హాని చేసేవాడు.

"రాయడికాఁడు గదమ్మా రంతు సేసీని
పాయపుసతులనే గోపాలగోవిందుఁడు" 5-325

రాయిడిపడు : *ప.బం; అ.క్రి.* రాపిడిపడు, బాధపడు.

"చేఁగ చిగురు తన చేఁతే యిటులై
రాఁగినవలపుల రాయిడిపడెను" 24-85

రాయివంటి మనసు : వి. రాతివలె కఠినమైన మనస్సు.

"మచ్చరాన రాయివంటి మనసులు గరఁగెనా
గచ్చుల మీ మేనుల కాఁక దీరెనా" 16-235

రారాఁపుఁదనము : (రారాఁపు + తనము) వి. మిక్కిలి సంఘర్షణ, మిక్కిలి రాపిడి. ఇట రారాఁపు శబ్దం స్వార్థంలో పై 'తన'ప్రత్యయం చేరింది.

"రారాఁపుఁదనములు రవ్వలవారికిఁగాక
సారె నోజ గలిగిన సతుల కేలే" 26-228

రారాఁపు : (5) (రాఁపు + రాఁపు) వి. మిక్కిలి ఒరయిక, ఉపద్రవం, మిక్కిలి రాయిడి.

"రమ్మనఁగ పొమ్మనఁగ రారాఁపు లేఁటికే

దొమ్మి రేఁగి కాఁకలు తోదోపులాడీని" 10-2-70

"ఇతవైన చోటికి యేమి సేసినా సమ్మతి

రతికెక్కిన మీఁదట రారాఁపు లేదు" 29-370

రాలుదింటా మలిగండ్లను : *ప.బం.* కంబళిలో అన్నంతింటూ వెంద్రుక లెన్నడం వంటిది. పెద్దపెద్ద రాళ్లు తింటూ వాటిలో చిన్న చిన్న రాళ్లు ఏరడమని వాచ్యార్థం.

"మలసి రాలుదింటా మలిగండ్లన నేల

నొలసితే గైకొంట వొల్లకుంటే మానుట" 4-223

రాలురప్పలు : *ప.బం; బహు.* 'రాళ్లు' అనే అర్థంలోని జంటపదం.

"కొండలవంటివి కోమలి కుచములు

బండగు రాలురప్పలుఁగావు" 26-137

రాళ్లలో మలిగండ్లేరు : *ప.బం; అ.క్రి.* కంబళిలో అన్నం తింటూ వెంద్రుకలేరు వంటిది. పెద్దరాళ్లు తింటూ వాటిలో వచ్చే చిన్న చిన్న రాళ్లను ఏరడమని వాచ్యార్థం.

"అట్టె సర్వాపరాధి నపరాధా లెంచనేల

గట్టిరాళ్లలో మలిగండ్లేరనేల" 7-220

రాళ్లు చక్కచేసి మలిగండ్లు ఏరు : *ప.బం; అ.క్రి.* కంబళిలో వెంద్రుకలేరు వంటిది.

"చెప్పనేల రాళ్లు చక్కఁజేసి మలిగండ్లేర

నిప్పుడిట్టి నే నించు కేమందునే" 15-58

రాళ్లు తింటూ మలిగండ్లేరు : *ప.బం; అ.క్రి.* నిష్ప్రయోజన మైన పని చేయు. పెద్దపెద్ద రాళ్లు తింటూ వాటిలో చిన్నచిన్నరాళ్లు ఏరివేయడమని వాచ్యార్థం.

రావణ! హతో భవ : ఇది సంస్కృతవాక్యం. 'ఓ రావణా! హతుడవు కమ్ము" (చచ్చిపొమ్ము) అని అర్థం.

"అనలము 'శీతో భవ' యన నేరిచిన సీత

పనివి "రావణ హతో భవ" యననేరదా" 15-263

రావాడి : (2) ఆకర్షణ. సం.ప.స. లో ఈ పదాన్ని గురించి ఈవిధంగా ఉంది. రావు + ఆడు రాహుశబ్దభవము రావు. రావు గొట్టే ముఖము అని వ్యవహారము. రావాడు = కబళించు దనమును చూపు అని అర్థము కావచ్చును. (27 వా అనుబంధం 7 పుట.)

"నావంటి సీతను నాఁగేటి కొనఁదెచ్చితి

రావాడి తమకముతో రామచంద్ర" 19-165

"యీ వేళ నితని నిట్టే యెనసితి విదిగాక

రావాడి బింకాన నుంటే రతి సమకొనునా"

13-217

రావాడు : (రావు + ఆడు) మోహరించు, బిరుసెక్కు, కళకళ లాడు, ఆకర్షించు, గంభీరంగా ఉండు, రాజసంగా ఉండు. ఇత్యాదులు అర్థములు కావచ్చు. వాని మొగము రావు గలిగినది ఇత్యాది వ్యవహారము నేటికిని గలదు అని సంప.స. (27సం. 192 పుట, అధస్సూచిక)

"కైవశపు మేనికిని కాఁగిలి యటుండఁ గాను

రావాడే చన్నులే కావా రతికెక్కు నడుమ"

27-284

"చేతులు చాచి నన్నుఁ జెనకి కాఁగిట నించీ

రాతిరి పంతములకు రావాడేనటే" 26-287

రావి జిగురగు : (?)

"రావిజిగురైనవాఁడు రచియించీ తరితీపు

యేవి వరమో కందము యింత కోపఁగలవా"

8-49

రావిమానిజిగురు : *ప.బం; వి.* ఊరక అంటే జిగురు, పిసినారి.

"ఏ వేళ గుణమో యెడతెగని కర్మాలు

రావిమానిజిగురై వూరక యంటీని" 2-105

రావిమాని పువ్వులు : *వి; ప.బం; బహు.* లేనివి, రావిచెట్టుకు పువ్వులుండవు కదా!

"రతులలో మాటలు రావిమాని పువ్వులు

తతి విరహపుకాఁక తాటిమాని నీడ" 2-268

రాసకొడుకు : వి. రాజపుత్రుడు.

"వసముగాని సతుల(లు) వారిఁగూడి మమ్ముఁగూడి

కొసరించుకొని రాసకొడు కాయ నిపుడు"

27-393

రాసబలుపువాఁడు : వి. రాజగర్వం కలవాడు.

"రాసబలుపువాఁడు రామ నాతఁడు వాఁడే
మోసపోక మనము మొక్కవలె వాఁడే" 24-150

రాసికూటము : వి. రాశికూటము.
"వాసులెంచి నీవు నన్ను వలెనని కూడితిని
రాసికూటా లెంచఁబోతే రవ్వగాదా ఇఁకను"
26-291

రాసికెక్కు : (రాసికి + ఎక్కు) ప.బం; అ.క్రి. ప్రసిద్ధికెక్కు, గణనకెక్కు.
"వాసులకుఁ బెనగితి వోడి సవతులలోను
రాసికెక్కె నా వలపు రమ్మనవే పతిని" 29-428

రాసిగొల్లవారు : వి. గొల్లల్లో ఒక జాతివారు.
"చేసేవు మంచితనాలు చిక్కియుఁజిక్కవు
రాసిగొల్లవారి నేల రాఁపులఁబెట్టేవు" 16-96

రాసివిరహము : వి. అత్యధికమైన ఎడబాటు.
"రాసివిరహానఁ గప్పురము మేనఁజల్లుకోఁగా
దోసమెఱఁగక యేల దోసి లొగ్గీనే" 25-126

రాసిసేయు : ప.బం; స.క్రి. ప్రశంసించు.
"ఆసపడి వచ్చినట్టి అతిథి బలురాజుకు
రాసిసేసి యే మిచ్చిన రతికెక్కెని" 2-490

రాసులగు : అ.క్రి. కుప్పలగు, అధికమగు.
"సేసవెట్టి యేలినాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
రాసులాయ వేడుకలు రావే వాకిటికి" 19-315

రాహు : వి. రాహువు; రాహు, బాహు శబ్దాలపై ప్రథమైక వచనంలో వచ్చిన 'వు' ప్రత్యయానికి లోపం వచ్చిన రూపం.
"వెనకఁ దురుమను రాహు వేవేలు రూపులై
తనర ముఖచందురుఁడు తలఁకడు గదా"
5-348

రి

రిచ్చ : వి. నిశ్చేష్టత, విసుగు, దిగులు.
"కచ్చుపెట్టేదెందు నీకు కాఁగిలి యెవ్వరి సొమ్ము
రిచ్చల నీ మనసిద్దరికిఁదూఁచిచ్చేవా" 13-356

రివ్వనన్ : క్రి.విణ. ఱివ్వున, శీఘ్రంగా, వేగంగా.
"పువ్వులనే నన్ను వేసి బుజ్జగించి సన్నసేసి
రివ్వనఁజుట్టరికము రేఁచెఁగా తాను" 29-396

రివ్వలు : రెమ్మలు.
"రవ్వలైనా నాయఁగాని రాఁపైనా నైతిఁగాని
రివ్వల నీ మోవితేనె రేఁచవద్దా ఇందుకు"
27-184

రివ్వలుగా : క్రి.విణ. అధికంగా. (వ్యు.)
"మువ్వంక నీ రాజసము మున్నిటివంటిదా నేఁడు
రివ్వలుగా సతు లెల్ల రేఁచిరి నీ గుణము"
11-509
"రివ్వలుగ నెందాఁక రేఁచేము నిన్నును"
11-102

రు

రుకుమిణి : (21) వి. 'రుక్మిణి'కి జానపద వ్యవహారరూపం. రుక్మిణిలోని కకారం మీద ఉకారం ఆగమంగా చేరింది. రుక్మిణి అనే పదంకూడా రెండుచోట్ల మాత్రమే వాడ బడింది.
"గతి గూడి రుకిమిణి కాఁగిట పంజరములో
రతి మద్దు గురిసేటి రాచిలుకా" 15-215

రుక్కిణిదేవి : వి. 'రుక్మిణిదేవి'కి జానపద వ్యవహారరూపం.
"వోడక రుక్కిణిదేవి నూరకే యెత్తుకవచ్చి
పాడితో నగ్రపూజకుఁ బాత్రుఁడ వైతివి" 15-211

రుణము : (6) వి. అప్పు. 'ఋణము' అనే శబ్దంలోని 'ఋ' వర్ణానికి బదులు 'రు' వర్ణం వాడబడింది. అన్నమయ్య 'ఋ' ఉన్న పదాలన్నింటినీ 'రు' తోనే ప్రయోగించినాడు. ఉదా : రుణం, రుషి.
"ఏమి సేసినా నీ రుణ మెట్టు వాసును" 1-474

రుణస్థుఁడు : వి. అప్పుల్లో ఉన్నవాడు. 'ఋణ' అనే పదం ఇట 'రుణ'గా వాడబడింది.
"యెపుడూ నీ ధర్మమున నిటు నీ రుణస్థుఁడనై
ప్రపన్నుఁడనై నేను బ్రదుకుటే కలది" 2-197

రుణానుబంధపశుపత్ని : 'ఋణానుబంధరూపేణ పశుపత్నీ సుతాలయాః' అనే సంస్కృత వాక్యానికి సంగ్రహరూపం. మానవుడు చేసుకున్న పుణ్యకర్మలను బట్టి అతనికి

పశుసంపద, భార్య, కుమారులు, గృహము కలుగుతా యని భావం.

"పయమేల తమకించీ పడఁతుల కొఱకుఁగా

బాయట రుణానుబంధ పశుపత్ని యనఁగా" 15-223

రుణానుబంధము : ఏదేనొక ఋణపు సంబంధం, ఏదో ఒక కారణసంబంధం .

"పుత్రదారధనధాన్యభూములు నమ్మితినా

పాత్రమగు రుణానుబంధములని" 2-422

రుణోత్తారము : వి. ఋణాన్ని దాటడం, ఋణాన్ని తొలగించుకోవడం.

"తరి యజ్ఞములు రుణోత్తార మయ్యెడికొరకు

సరిలేని దానములు జన్మములకొరకు" 1-34

రుత్త : (5) విణ. రిక్తము, వట్టి, రిత్త, శూన్యమైన, వశమని ఆం.ప.ని .

"ఒత్తి నారాయణనామ ముచ్చరించే నోరను

రుత్త యధరపుఁదోలు రుచి గొనేదా" 2-115

రుత్తవోవు : అ.క్రి. రిత్తపోవు, వ్యర్థమగు. బ్రౌను 'రుత్త' శబ్దాన్ని చూపి దానికి 'నాశము' అనే అర్థాన్ని ఇచ్చినాడు. ఈ ప్రయోగంలో 'రుత్తవోని' అనే దానికి అంతులేని, నాశంలేని అనే అర్థాలు కూడా సరిపడుతాయి.

"చిత్తమె చిమ్మరేఁగితే సిగ్గేమి యేమి

రుత్తవోని వేడుకలు రుచి గన్నవారికి" 10-2-66

రువ్వ : వి. దమ్మిడి, ఐదుకాసుల నాణెం .

"రూకలై మాడలై రువ్వలై తిరిగేని

దాకొని వున్నచోటఁ దా నుండ దదివో" 1-458

రుషి : (6) వి. ముని. 'ఋషి' అనే పదంలోని 'ఋ' కు బదులుగా 'రు' వాడబడింది.

"మునులు రుషులకు నభయ

మొసఁగిన మూలమూరితి రాముఁడు" 2-178

రూ

రూఢి : వి.'రూఢి'కి వ్యవహారరూపం. 1.స్థైర్యం 2.నిశ్చయం 3.ప్రసిద్ధి 4.నిక్కల. (తె.వ్యు.కో.)

"రూపుఁజూపవే నీవు రొచ్చులుగఁ జేరి తొల్లే

రూపులెల్లా నద్దములో రూఢి నున్నవి" 7-208

రె

రెంట : వి. ద్వైవిధ్యం, జత, రెండుగా ఉండే స్థితి.

"గొంటుఁజేతల(లు?) మనసు గొల్లకొన కేలుండు

రెంటలను విరహాగ్ని రేఁచ కేలుండు" 5-101

రెంటదెప్పరము : వి. ఎక్కువకష్టము.

"తలఁచుకోఁడు గాక తన లాగులు

రెంటదెప్పరాన ఇతవౌనా వలపు"

26-332 & 2-163

రెంటెము : (16) వి. జంటనేత వస్త్రం. 'రెంటము'నకు రూపాం. జమిలి నూలుబట్ట.

"చెమట రేఁగి రెంటెము చిప్పిలఁదడిసెనంటా"

7-373

"చెక్కు చేతఁ బెట్టఁగానె చిగురు బాణమాయే

గక్కన నీ రెంటె మింతి గప్పుకొనెను" 27-466

రెంటికిఁ గొరగాని రేవని కత : వి. (రేవఁడు = చాకలివాడు) చాకలివాడొకడు రేవున గుడ్డ లుదుకుతూ కొన్నింటిని గట్టుపై ఆరవేసి కొన్నింటిని ఉతుకుతూ ఉన్నాడు. ఇంతలో పెద్దగాలి వీచి గట్టుపై గుడ్డలు లేచిపోతూ ఉన్నాయి. చాకలి వాటికోసం పరుగెత్తి సగందూరం పోయేలోపుగా నదిలోని నీ రుబికి బండ దరినున్న గుడ్డలు మునిగిపోతున్నాయి. వెంటనే వాడు వాటి దాపునకు పోతూండగా వెంటనే గాలి మరింత తీవ్రంగా సాగటంవల్ల వాడు వాటిని వదలి గట్టుపైకి పరుగెత్తినాడు. పరుగెత్తేలోగానే గాలికి గుడ్డలు లేచిపోయినాయి. నది పొంగడంవల్ల ఉదుకాల్సిన గుడ్డలు నీటిలో మునిగి పోయినాయి. వాడు రెంటికీ చెడి నిట్టూర్చినాడు. అటునిటు కాక ఉభయభ్రష్టుడైనాడని అర్థం.

"రెంటికినిఁ గొరగాని రేవని కత గా కిట్టి

సొంటులు సోదించి నీవు చూచుకో వో జీవుఁడా"

15-93

రెంటికిని గాని వీరిడి : ప.బం; వి. రెంటికి చెడిన రేవడి. ఉభయ భ్రష్టమైన మూర్ఖుడు.

"మంటఁజేసిన బొమ్మ మనికి సంసారంబు
రెంటికిని గాని వీరిడి కొలువు బ్రదుకు" 1-104

రెండు నొకటగు : అ.క్రి. ఏకీభావమందు.
"రెండు నొకటి గాని రచన ప్రియము లేటికి"
5-55

రెంబు : స.క్రి. రాల్చు, కోయు, దూయు. నిఘంటువుల్లో ఈ పదం కానరాదు.

రెక్కలగుఱ్ఱము : వి. గరుత్మంతుడు.
"దిక్కులు సాధించి తన దేవుల నండఁబెట్టుక
రెక్కలగుఱ్ఱముపై పేరెము దోలీని" 9-160

రెక్కలచక్రము : వి. చక్రవాకపక్షి. (రెక్కలున్న చక్రము, రెక్కలున్న చక్రవాకపక్షి)
"ఒక్క చక్రమె నీ కున్నది గాని యింతి
రెండు చక్రాలె పో రెండుగుబ్బలు" 5-71

రెక్కలపిట్ట : వి. చక్రవాకపక్షి.
"చిక్కని వెన్నెల లేల చిమ్మి కలియఁబెట్టేవే
రెక్కలపిట్టల నేల రేఁచఁజొచ్చేవే" 28-158

రెట్టి : వి. ద్విగుణం, రెండవ పర్యాయం. (మణుగు, గుణం)
"పట్టి ప్రహ్లాదు బాధలు పాపిన దేవుఁడితఁడు
రెట్టిగా వేదము లుద్ధరించె నితఁడు" 3-195

రే

రేక : (5) వి. రేఖ, గీత.
"గారవపు నీ మేన గస్తురి రేకలవిగో
తేరకొన వంకలెల్లా దిద్దుకొనరాదా" 11-158

రేకలుదీయు : (?)
"రేకలు దీయిమనేవు రీతిగా నీ బుజముల
కాకుసేసేదానవుఁ గాను సుమ్మీ నిన్నును"
23-122

రేఖరేఖపందెము : (?)
"రేఖరేఖ పందెమా" 6-13

రేతిటనుండి : రాత్రినుండి.
"కాతరాన బువ్వానకు గక్కనఁబెట్టరె మీరు
రేతిటనుండియు వేగిరించేరు వీరు" 16-295

రేతిరి : (8) వి. 'రాత్రి'కి వికృతిరూపం.
"ఈ రీతి నిందరి చిత్త మేకమైనందుకు గురి
మేరతో సూర్యోదయము మించి రేతిరయ్యీనా"
2-467

రేపకాడ : 'రేపకడ'కు వ్యవహారికరూపం. ప్రాతఃకాలం.
"రేపకాడ రచ్చసేసి రేతిరి యీపె దగ్గరి
చేపట్టితి వింతలో నీ చిత్తమింతే యిఁకను"
21-259 & 13-219

రేపట : పగటిపూట, మరుసటిదినం.
"మది రేపట కాకుంటే మాపట వచ్చేవుగాక
కదిసి యిప్పుడు యేమి కక్కురితా" 21-503

రేపల్లెవాడలో పాలమ్ము : *ప.బం; అ.క్రి.* అనవసరమైన పనికి పూనుకొను.
"భ్రమసి రేపల్లెవాడఁ బా లమ్మితే సరకౌనా
ప్రమదాన నీకు మొక్కి బ్రదుకుట గాకా"
15-156

రేపుమాపను : *ప.బం; అ.*క్రి. అనిర్దిష్టమగు గడువుపెట్టు.
"సమ్మతించిన వాఁడైతే చనవిచ్చి కూడుఁగాక
కమ్మటి రేపుమాపని గడువేఁటికే"

రేపుమాపు : (9) వి; ప.బం. రాత్రింబవళ్లు (రేపు= పగలు, మాపు = రాత్రి) ఉదయం-సాయంకాలం, ఎల్లప్పుడు.
"రేసులదానఁగాను రేపుమాపును నీకు
సేసపెట్టి పెండ్లాడిన చిన్నదాన నేను" 19-231
"బాపు బాపు మెచ్చితినే పడఁతి నిన్ను
రేపుమాపు నితనినే మరిగించుకొంటిని" 26-238

రేవంతుఁడు : వి. గుఱ్ఱపురౌతు.
"దిట్టయిన మనసనేటి తేజిగుఱ్ఱమునకు
వొట్టిన రేవంతుఁడ వుపమింప నీవు" 15-137

రేవు : వి. రొట్టె తినడానికి నంజుడు ఉపయోగించు కొనే పచ్చడి వగైరాలుంచుకొనే స్థలం కావచ్చునని సంపాదకుల ఊహ. (24-132 f.n.)

"ఏ దాయ నేమి రొట్టె కింత రేవే కాదా
దాదాత మోచెఁబని తానే నేఁగానా" 24-132
"రొట్టెకును రేవేది రుచిగొనుటే గాక" 7-270

రేవులు రేవులుగా చూచు : *ప.బం; అ.క్రి.* కన్నార్పకుండా చూచు.
"రెప్పలణఁచినదాఁకా రేవులు రేవులుగాను
అప్పటిఁ దప్పక నన్ను అదేల చూచేవే" 22-83

రేసు : (8) *వి.* 1. ఈర్ష్య 2. చులకన.
"ఎప్పుడు మానవు కోప మేమే నీవు
రెప్పలెత్తి చూచితేనే రేసు పుట్టీనా" 14-226

రేసుతిమ్మట : *వి; బహు.* అదేవిధంగా భ్రమించుట, వ్యర్థ భ్రమణము.
"రెక్కలు గల పక్షికి రేసుతిమ్మటలే కాని
చక్క వైకుంఠానకెగయ సత్తువ లేదు" 2-89

రేసులది : (రేసులు + అది) *వి.* ఈర్ష్య గలది, చులకనది.
"రేసులదానఁగాను రేపును మాపును నీకు
సేసవెట్టి పెండ్లాడిన చిన్నదాన నేను" 19-231

రేసులాడు : *ప.బం; అ.క్రి.* ఈర్ష్య చూపు.
"కొప్పువట్టి తియ్యఁగాను కొమ్మ నీ చేయిపట్టి
రెప్పలెత్తి జంకించి రేసులాడేవు" 23-202

రేసులెక్కించు : *అ.క్రి.* ఈర్ష్యకలిగించు, చులకనచేయు.
"ఒసి పోపో నీకు నేమె వుండఁబట్టదా
వాసులు రేసులెక్కించి వాదుకువచ్చేవా"
11-307

రేసువడు : (2) (రేసు + పడు) ఈర్ష్యపడు, చులకనపడు.
"రెప్పలెత్తి చూచితేనే రేసువడె నా మనసు"
9-244

రేసువెన్నెల : *వి.* పొగరువెన్నెల.
"రేసువెన్నెల యెండ కోరిచెఁగా నా తనువు
ఆసల నా ప్రాణవిభుఁడాతనిఁ బాసి" 9-52

రొ

రొండి : *వి.* నడుము పార్శ్వభాగం, తుంటి, పార్శ్వభాగాన ఉండే బిట్టమడత.
"సిరుల రొండ్ల నీవు చేతులు వెట్టుక యిట్టే
వెరవు విచారించేవు విఠ్ఠలేశ్వరా" 13-244

రొంపికంబము : *ప.బం; వి.* అస్థిరం
"నిన్నుఁ గైకొనరాదు నెలఁతఁ బొమ్మనరాదు
అన్నిటా రొంపికంబమై నీ వున్నాఁడవు"
16-129 old
"రొంపి కంబము వంటిది రొక్కమైన నీ నిజము"
16-254

రొంపిలోని కంబము : (4) *ప.బం; వి.* అస్థిరం. బురదలోని కంబము స్థిరంగా నిలువదు కదా!
"రిత్తకు రిత్తయి యీ రెంటి నడుమను జిక్కి
కత్తరపు రొంపిలోని కంబమైతి గాక" 4-44

రొక్కము : నిర్బంధము.
"రొక్కమైన (నా) పొందులు రోకటఁబాడిరిగా
దిక్కులు నిండెఁగా నీవు తెలియ కుండినను"
10-2-33

రొచ్చు : *వి.* (1. అడుసు 2. నుచ్చు 3. మాలిన్యం 4.తూము కాల్వలవెంట పారే మురికిబంద) 5.అపవాదం (6.పశువుల మూత్రంలో ఏర్పడ్డ బురద.)
"బలువాఁడవయ్యా భామల రొచ్చు కోర్చితివి
పలువై యెందరిపాలఁ బరగె నీ మేను" 18-593

రొచ్చులుసేయు : *ప.బం; స.క్రి.* కల్మషభూయిష్ఠం చేయు.
"ఏపున శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
రూపించేవు నే నిన్ను రొచ్చులు సేయుదునా"
23-514

రొమ్ముచోటు : *వి.* వక్షఃస్థలం.
"కైదండ వట్టేనంటా కంకణము గట్టెనే
జూదాలాడేనంటా రొమ్ముచోటు గీరెనే" 18-18

రొమ్మునఁగుంపటి : (2) *ప.బం; వి.* బాధాకరం.
"సమ్మతిగాఁబెనఁగితే సతిఁబాయకుండుఁగాక

రొమ్ముమనఁగుంపటియైతే రుచి పుట్టునా"
17-241

రొయ్యకొవ్వు : ప.బం; వి. లేనిది, వ్యర్థం.
"వొల్లనె సంసారములో నూరకె గర్వించేవు
చెల్లఁబో రొయ్య కొవ్వేలె జీవుఁడా" 10-1-14

రో

రోఁటు : (?)
"ఏఁటిదే మా వలపు యింతా నీదే వలపు
రోఁటితేఁ బదియుఁ బది రొక్కమాయ వలపు"
27-390

రోకటఁబాడు : స.క్రి. దంపుడుపాటగా పాడు, సువ్విపాటగా పాడు.
"రొక్కమైన నా పొందులు రోఁకటఁబాడిరిగా
దిక్కులు నిండెఁగా నీవు తెలియకుండినను"
10-2-33

రోకలికైదువవాఁడు : వి. రోకలి ఆయుధంగా గల బలరాముడు.
"రోకలికైదువవాఁడు రోలఁగట్టువడ్డవాఁడు"
6-154

రోసును : క్రి.ప. 'రోయును' అనే రూపానికి వ్యావహారికరూపం.
"హేయమేమీ లేదు జగమింతా రుచికరమే
మాయావికారమిది మనసెట్టి రోసునో" 4-473

ఱ

ఱట్టడి : వి. అల్లరిచేసేవాడు.
"ఱట్టడివి నిన్నాపె యాఱడిసేయనోపునా
పట్టినవ్రతముతోడి బలిమే కాక" 8-146

ఱట్టు : వి. అల్లరి.
"అసల నీ తమకమే అంత ఱట్టుగాఁజేసె
యేస చూపులను మిమ్ముఁ నేమిచూచేవయ్యా"
14-146

ఱట్టు వొలకమ్మ కెక్కు : ప.బం; అ.క్రి. (?)
"వద్దు వద్దు మాఁటలనే వలపుల యేరు వారి
మద్దులు మారేళ్లు మోఁచె మానరాదా యిఁకను"
20-233

ఱా

ఱాఁగ : వి. ధూర్తస్త్రీ.

ఱాతిగుండె : వి; ప.బం. కఠినమైన హృదయం.
"ఱాతిగుండెతోఁ దనకు ఱట్టొకటే దక్కెఁగాక
యీతల నే నాఁటదాన నెట్టోరిచేనే" 13-241

ఱాతిగుండెది : (ఱాతిగుండె+అది) వి.కఠిన హృదయురాలు.
"ఱట్టయి మీతగవు దిద్ద ఱాతిగుండెదానను గాను
వట్టి యానలేల నాకుఁబెట్టేరు మీరు" 27-192

ఱాతిగుండెవాఁడు : వి. కఠినహృదయుడు, దయాదాక్షిణ్యాదులు లేనివాడు.
"ఱట్టడివి మిగులాను ఱాతిగుండెవాఁడవు
పట్టిపట్టి చూచి యేల భ్రమసేవయ్యా" 14-175

ఱాతిచన్నులు : వి. కఠినమైన స్తనాలు.
"చేతి జిగురువంటిది రేకలు నీ మేన నివే
ఱాతిచన్నుల నెట్టొత్తి జుఱ్ఱుసేసేవే" 8-231

ఱాతిమనసు : వి; ప.బం. కఠినమైన మనస్సు.
"ఆతఁడు బాగాలిచ్చి ఆకుమడిచియ్యఁ జూచి
ఱాతిమనసా రమణీ ఱట్టు నీ కిదేమే" 16-282

ఱాలు దింటా మలిగండ్లేరు : (2) ప.బం; అ.క్రి. కంబళిలో తింటూ వెంట్రుక లేరు వంటిది.
"ఱాలు దింటా మలిగండ్లాఱడి రాసి గానేరము
తేలుచు శ్రీహరి నీవే దిక్కొకట గాక" 10-61

ఱే

ఱేసు : వి. (?)
"ఱెప్పలు రిచ్చవడె మీ ఱేసులెల్లాఁ జూచి చూచి" 11-133
"ఱెప్పలెత్తి చూచితేనే ఱేసు వుట్టె నిదె నీకు
దుప్పటికొంగు వట్టితే దూరకుండేవా" 9-143

ల

లంకెఁబెట్టు : స.క్రి. తగుల్కొనజేయు.
"యెంచరాని తిరువేంకటేశుఁగూడి యాతని

లంచపుఁ గౌఁగిటితావి లంకెఁబెట్టె నిపుడు" 5-205

లంకె : వి. తగులము, జోడి.
"కుంకుమ చెమటబొట్లు కురిసె నీడ నెల్లాను
లంకెలైన నీ చెక్కుల లాగులా వోయి" 11-112

లంకెపాటు : (2) వి. తగులుపాటు, తగులం, బంధం.
"పొంతల మీ రిద్దరును పొంది యెడయకుండితే
బంతినే వాసన లంకెపాటు తాఁబోయినపుడే" 21-530

లంకెలవిందులు : *వి; బహు.* వరుసవిందులు.
"జంకెనల కారాలు చవుల పాకములు
లంకెలవిందులు వెట్టీ లలన నీకు" 8-166

లంకెల విను : *ప.బం. స.క్రి.* అధికంగా విను.
"వేంకటగిరిపై విభుని పుణ్యకథ
లంకెల వినని యన్యులము" 1-241

లంగించు : 'లంఘించు'కు వ్యావహారికరూపం.
"లాసేటి లాగులును లంగించే యెగరులు
వేసేటి గంతులెవ్వరే వీది వీదులా" 16-180

లంచపుసంసారము : వి. లంచాలతో కూడిన సంసారం.
"పంచేంద్రియములనే బాడిగె మోచితిని
లంచపు సంసారమనే లాడిఁబడితి" 4-227

లంజకాఁడు : (3) (లంజ + కాఁడు) విటుడు.
"లంపుగుబ్బ గొల్లెతల లంజకాఁడ నీ
యింపులే వెదకంబట్టీ నెట్లరా వోరి" 6-125
"లంజకాఁడవౌదువు నీ లాగులెల్లఁ గానవచ్చె
ముంజేతఁబెట్టిన సొమ్ముల కద్దమేలరా" 5-84

లంజగొడవ : వి. నీచమైన గొడవ. (?)
"బడిబడి తల్లిదండ్రి పగటుండఁగా లంజ
గొడవలకుఁ బెనఁగే కూళలు గలరుగా" 11-181

లంజెవారు : వి. బహు. వ్యభిచారులు. 5-84

లండఁడు : వి. కుత్సితుఁడు, వ్యర్థుడు
"లాగులు చూచినవారు లండఁడందురు" 19-567

లండుఁజేతలు : *వి; బహు.* (?)
"కాకుసేసే చేఁతలూ కతకారి చేఁతలూ
లాకల సిగ్గుమీరిన లండుఁ జేతలు" 13-391

లండుగా : *క్రి.విశ.* కుత్సితంగా, మొండిగా.
"సెలవుల నిన్ను నవ్వి చేయి మాఁటు సేసుకొని
లలి నీకు నెత్తించీ లండుగా ఇది" 27-488

లంపటపడు : అ.క్రి. శ్రమపడు.
"లంపటపడని మేలు లవలేశమే చాలు" 1-114

లంపు : వి. (?) మేత?
"లంపు గుబ్బగొల్లెతల లంజకాఁడ" 6-125

లకిమమ్మ : (17) (లకిమి+అమ్మ) 'లక్ష్మమ్మ'కు వ్యావహారిక రూపం.
"లకిమమ్మ కేమైనా లంచము లిమ్మనరో
శుకవాణి తలుపు మూసుకు తియ్యదు" 5-81

లక్కపూత కపురులు : *ప.బం; వి; బహు.* అశాశ్వతాలు. 1-189

లక్కపూస కపురులు : అస్థిరములు. లక్కపూసల శోభలు స్థిరంగా ఉండవు కదా!
"లలనల జవ్వనాలు లక్కపూసకపురులు
నెలకొని సేసే బత్తి నీటిపై వ్రాఁత" 2-268

లక్కముద్ర : వి. లక్కతో వేసే ముద్ర.
"పండువంటి మోవి కేలే పచ్చిలక్కముద్ర లివి
పండిన పంటకే కావా బలుముద్రలు" 7-38

లక్కవంటి మనసు : (3) వి. త్వరగా కరిగన మనస్సు.
"లక్కవంటి దీ మనసు చొక్కు వంటిది వలపు" 18-347

లక్కిమమ్మ : (2) (లక్కిమి + అమ్మ) 'లక్ష్మమ్మ'కు వ్యావహారికరూపం.
"పొలసి విణ్ణవీఁగేవు పురుషోత్తముఁడ నంటా
పొలిసి లక్కిమమ్మ నీ వురమెక్కి వుండఁగా" 16-314

లక్ష్మిదేవి పండుగ : వి. వరలక్ష్మీ వ్రతం.
"పచ్చిగా లక్ష్మిదేవిపండుగలు సేసె నిదె

యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నిన్నుఁగూడెనూ"
11-184

లక్ష్మిమండపము: వి. దిగువ తిరుపతిలోని మండపం. క్రీ.శ 1494 కు పూర్వమే నిర్మితమైన వసంతమండపం కావచ్చు. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో లక్ష్మీదేవి మంటపమని వేరొకటి ఉన్నది. కాని అన్నమాచార్యుడు పేర్కొన్నది అది అగునో కాదో! ఏలన ఆ మంటపము క్రీ.శ. 1537 తరువాతనే నిర్మితమైనదని చారిత్రికుల భావన అని వేటూరి ఆనందమూర్తిగారు పేర్కొన్నారు. (సం.వా., పద. 242 పు.)

"లలితపు గోవిందుఁడు లక్ష్మిమండపమందున్న
వలరాజదివో కొలువఁగ వచ్చెను" 7-445

లగినము: వి. 'లగ్నము'నకు జానపద వ్యవహారరూపం. ముహూర్తం.

"మంతనపుఁగాఁగిటికి మంచి లగినము వచ్చె
బంతిఁబులకల శానపైఁ జల్లవే" 29-444

లగ్గము: వి. 'లగ్నము'నకు జానపద వ్యవహారరూపం. పెండ్లి, ముహూర్తం.

"అప్పుడు నే నెంత గబ్బి ననవద్దు
తప్పదు లగ్గము నీపైఁ దగిలింతుఁ జుమ్మి"
17-420

లగ్గము వెట్టుకొను: అ.క్రి. వివాహముహూర్తం నిర్ణయించుకొను.

"లలి నిన్నుఁబెండ్లాడ లగ్గమువెట్టుకుండఁగ
బలిసి యేమి వినేవు వూరఁగతలు" 22-306

లగ్గవెట్టు: స.క్రి. ముట్టడించు. (పద.)

"దాకొని నీ చిత్తమెల్ల దక్కఁగొంటేఁ గొంటిఁగాక
వాకల నీపెనపులు లగ్గవెట్టీనా" 17-364

లగ్గస్తుఁడు: వి. 'లగ్నస్థుడు'కు వికృతిరూపం. లగ్నమైనవాడు, స్వాధీనమైనవాడు, నమ్మకస్థుడు, అవమానస్థుడువంటి శబ్దం.

"దీమనపుటాసలకు తీరని లగ్గస్థుఁడను
యీ మరఁగువాఁడ నిన్ను నెట్టు గొలిచేనయ్యా"
2-480

"లలిఁజిత్త మింద్రియముల లగ్గస్థుఁడూ
తొలఁగఁదోయఁగ నేది దొరతనమూ" 15-62

లచ్చన: (11) వి. గుర్తు, లక్షణం, అచ్చుతికిన పడుగుమీద కొలతను బట్టి వేసిన గుర్తు. రూపాం. లాంచన.

"పచ్చిమోవితేనె లాని పలుమారుఁ దనియరు
లచ్చనై వొకమాఁటే పులకలు రేఁగె" 7-441

"కందువగు నీ మేను కాగిలించఁగానే నా మై
చందముగ నీ మేని లచ్చన లంటెను" 8-163

"ముచ్చట నామనికాలమునఁ బండిన పంటకు
లచ్చనలు వేయరా యీ లాగుల నెవ్వరును"
13-490

లచ్చనగుఱుతు: గుఱుతు అనే అర్థంలో జంటపదం.

"పచ్చగా నీ మోవిమీఁదఁ బల్లుమోపఁగలఁగాక
లచ్చనగుఱుతు మాన్ప లాగుల నా వశమా"
9-60

లచ్చించు: (2) 'లక్షించు'కు తద్భవం. చూచు.

"ఎచ్చరికగాఁ బాదాన లచ్చించరాదా" 18-411

లచ్చిగొండి: (లచ్చి+గొండి) వి. ధనవంతుడు, ధనవంతురాలు. 'లచ్చిగొండి' లోని 'లచ్చి' అనే పదానికి లక్ష్మి, సంపద అని అర్థం. కనుక 'లచ్చిగొండి' అనే పదానికి ధనవంతుడు అనే అర్థం చూపబడింది. ఆనందమూర్తిగారు దీనికి అహంకారం కలది, దుడుకుతనం కలది అనే అర్థాలను సూచించినారు. (సం.వా.పద., భాషా. 470 పు.) వాచ్యార్థమైన ధనవంతు(డు)రాలు అనే దానికి పై అర్థాలు లక్ష్యార్థాలుగా భావించవచ్చును. అహంకారానికి, దుడుకుతనానికి, ధనం కలిగిఉండడం కూడా కారణమే కదా!

"లచ్చిగొండి నీవంటి నెలఁతనా నేను యింత
పెచ్చుపెరిగే వదేమె పిన్నదానవా" 6-105

లచ్చిగొండితనము: వి. ధనవంతురాలితనం, అహంకారం కలిగి ఉండడం. చూ: లచ్చిగొండి.

"లచ్చిగొండితనముల లాగవేగకాఁడవు

విచ్చనవిడి తగులు విరికాఁడవు" 19-17

లచ్చిమమ్మ: (లచ్చిమి + అమ్మ) 'లక్ష్మమ్మ'కు జానపద వ్యవహారం.

"సేసవెట్టి లచ్చిమమ్మ చెంగటనే వుండగాను
ఆసపడే వెవ్వరికో అప్పటి నీవు" 21-282

లచ్చెన: వి. గుర్తు, లచ్చనము.

"బచ్చెనలు కుచయుగముపై నతని మృగమదము
లచ్చెనలు కొనగోళ్ల లాంచనములు" 5-184

లచ్చెనవెట్టు: గుర్తుపెట్టు. (వ్యు.)

"గక్కన వేరొకతెకుఁ గాఁగిలి నీ వియ్యకుండా
లెక్కల లచ్చనవెట్టే లీల సుమీ విభుఁడ" 9-135

లతలమంజిష్టి: వి. (?)

"దంతియానకు సింహాలఁ దగవ్రాసిన చీ రేలే
చెంతలనే లతల మంజిష్టిగాక" 17-427

లప్ప: (9) వి. రాశి, ముద్ద.

"కదిమి యాపె నోరిలోఁ గప్రపులప్ప వెట్టేవు
అదనఁబనులు గొనేయట్టి నిబ్బరాననుు"
23-319

లప్పలుగట్టు: ప.బం; అ.క్రి. రాసులగు.

"గందానఁ బూసినపూఁత కడఁగి లప్పలుగట్టి
యిందుముఖి లలమేల్మంగ కింపులాయను"
7-144

లయకాఁడు: వి. మోసగాడు.

"ప్రియముతో మంచమెక్కి పిలువని పేరంటము
లయకాఁడు గదవే తొలఁగు బావఁగారు"
11-355

లయకాఁడు: (లయ + కాఁడు) వి. మోసగాడు.

"ప్రియముతో మంచమెక్కి పిలువని పేరంటము
లయకాఁడు గదవే తొలఁగు బావఁగారు"
11-355

లయపడు: ప.బం; అ.క్రి. లయమగు, నశించు.

"చేగల నింద్రియములలోఁ దిరిగిన
చిత్తవికారము లయపడదు" 2-137

లలాటశూన్యపు చూపు: వి. ఏమతమునకూ చెందకపోవుట.

"కొందఱేమియును లేదు కొట్టఁగొన లయమని
అంది వట్టి లలాటశూన్యము చూపిరి" 2-270

లలాటశూన్యము: వి.శూన్యమైన లలాటము. శూన్యలలాట మనటం యుక్తం. సమాసం విలక్షణం.

"కొందరేమియును లేదు కొట్టఁగొన లయమని
అంది వట్టి లలాటశూన్యము చూపిరి" 2-270

లలి: క్రమం, ప్రేమ, ఉత్సాహం, విలాసం.

"లలి భోగమతనితో లంకేసేసిన వెనక
చెలిమి సేయక మరవఁజెల్లు నటవే" 28-54

"లలి మోవి పిప్పిసేసీ లావణ్యమెఱఁగడు
అలరి తానాడినదే ఆట యనవే" 26-249

లవలవలు: పెనుగులాటలు, పాకులాటలు, భంగపాట్లు. భేదము లని ఆం.ప.ని. 344 పు.

"లంపటాలెఱఁగము లవలవలెఱగము
పంపుల బాల్యమే పరిణామము" 2-465

లవలేశము: (2) వి. 'కొద్ది' అనేఅర్థంలో వాడబడే జంటపదం. లవం అన్నా లేశం అన్నా ఒకే అర్థం.

"చవియూఁ దీరదు చలమూఁ బాయదు
లవలేశమైన నొల్లకపోదు" 1-124

లా

లాఁచు: (9) స.క్రి. కోరు, పొందు, పెనఁగులాడు, లాగిపట్టు. కవియు, పొంచు. (శ.ర.)

"అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
లలి నీవద్ద నే నుంటే లాఁచీఁదాను నీకును"
22-325

"చేచేత శ్రీవేంకటేశ చేకొని నన్నేలితివి
లాఁచి మెచ్చినట్లా వొల్లఁగె మెచ్చరాదు" 26-480

లాఁతు: (3) విణ. మిక్కిలి, అధికం. వి. మిక్కిలివెక్కసం.

"యీతల శ్రీవేంకటేశ యెనసితివి

లాతాయ మన్ననలు లలనకును " 23-246
"ఏతులకు నాకు మడిచిప్పించుకొంటి విందాకా
లాతుగా నిది గొంత లాభమే కాదా !" 21-129

లాక : (4) అంకురం.
"లాకల నీ రతులకు లాచుట గాదా" 22-198
"కాకుసేసే చేఁతలూ కతకారి చేఁతలూ
లాకల సిగ్గు మీరిన లండుఁజేతలు" 13-391
"ఈకె యెంత చనవరో యేకతాన నింతేసెసె
లాకలుగా వారు నవ్వి లలి నొక్కటై" 21-141

లాగవేగకాఁడు : వి. లాఘవమూ, వేగమూ కలవాడు.
"లచ్చిగొండితనముల లాగవేగకాఁడవు
విచ్చనవిడి తగులు విరికాఁడవు" 19-17

లాగవేగాలు : వి; బహు. సులువు-వేగము. లాగ లాఘవ శబ్దభవం. వేగానికి లాఘవం కారణమూ కావచ్చు. అప్పుడు ద్వంద్వం పొసగదని సం.ప.స. (19.12 పు.) అన్నమయ్య సమాసనిర్మాణంలో కూడా స్వతంత్రుడని భావిస్తే ద్వంద్వసమాసాన్ని సమర్థించుకోవచ్చు.
"యిచ్చగించి శ్రీవేంకటేశ! నన్నుఁగూడితివి
లచ్చనలే గురుతాయ లాగవేగా లేలా" 7-511
"ఆడనుండే లాగవేగా లాడవద్దు
యీడనే నీ కాఁగిలి నా కిప్పుడే యిమ్మా"
24-590

లాడిఁబడు : అ.క్రి. బలియగు, వశమగు.
10-2-27
"పంచేంద్రియములనే బాడిగె మోచితిని
లంచపు సంసారమనే లాడిఁబడితి" 4-227

లాడి : వి. బలి, పెద్దపుండు.
"పంచేద్రియములనే బాడిగె మోచితిని
లంచపు సంసారమనే లాడిఁబడితి" 4-227

లాబగాఁడు : (లాబము + కాఁడు) వి. లాభం పొందినవాడు.
"ఈ కొలఁదివాఁడవా నీ వింత లాబగాఁడవా
కాకుగా నా పచ్చడమే కప్పుకుమీ నాకును "
16-222

లాబము : వి. 'లాభము' నకు వికృతిరూపం.
"మూసుకొనేవేమి నేఁడు మొగవాఁడ విందరిలో
దోసమా నీ కందుకేమి తొలుసారి లాబము "
7-515

లాయము : వి. అశ్వశాల.
"యీయెడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁగూడితివి
లాయపుటింతుల పౌఁజులను గూర్చవయ్యా"
8-276

లాయు : ఉద్రేకించు, విజృంభించు.
"మోసపోక తమలోన మొగములు చూచుకోఁగా
లాసిలాసి నీ వెంత వలపు చల్లేవే" 29-14

లాల : వి. నీరు. బాలభాషలోనే దీనికి ప్రయోగం. లాలాజలం.
"కత్తులు నూరీ కఠినపుఁ గోరటు
కొత్తనురుగులటుఁ గురిసీ లాలల" 28-33

లావరి : (లావు + అరి) బలవంతుడు.
"మావంటివారికెల్లా మాటలో నయ్యేవా
లావరుల కైతేఁగాక లాలనకు మెత్తువా" 21-338

లావరితనము : (లావు+అరి+తనము) బలంకలిగి ఉండడం.
"లాలించి శ్రీవేంకటేశ లలన నిన్నుఁ గలసె
నీ లావరితనానకు నేరుచునా యీకె" 25-262

లావుకొను : (లావు + కొను) అ.క్రి. అతిశయించు.
"అంకురించినట్టి తలఁపు లధికమయిన చెలిమి
లంకెలయిన యాసలెల్లా లావుకొన్న చెలిమి "
1-29

లి

లింగముమీఁది యెలుక : ప.బం; వి. విశ్వాసానికి భంగం కలిగించి బాధ కలిగించేది.
"కలకాలమునకు లింగముమీఁది యెలుకయై
తలకొనియె నాత్మపరితాపము" 1-321

లిక్కి : వి. చిన్నకొడవలి.

"పెక్కగు నమ్రుతము పెదవి కోమలికి
లిక్కిగఁ జేసితి లేవయ్యా" 6-151

లియ్యము : వి. స్నేహం, ఒద్దిక, ఐక్యం, మిక్కిలి కలిసినది, లీనం.

"నెయ్యమలర మంచి విరులశయ్య వేంకటాద్రి విభుఁడు
లియ్యమైన చెలికి చనవు లియ్యఁ దొణఁగెనే"
5-315

లూ

లూటిఁబెట్టు : ఉపద్రవం కల్పించు, దుడుకుతనం ప్రదర్శించు. బ్రౌన్ : లూటి = దుడుకు, ఔద్ధత్యం, misbehaviour లూటీ, లుటానా అనే తురుష్కపదానికి దోపిడిచేయు అని అర్థం. దోపిడిచేయడమే దుడుకుతనం చూపడం. ఇది తురుష్కపదమనియే భావించవచ్చునని ఆ.మూ.

"లోకములోపల లూటిబెట్టు-ఇది
కైకొనిన హరి యెరఁగవుగా నీవు" 4 అను. 22

లూటిసేయు : స.క్రి. దోపిడీచేయు.

"రమణఁ గంసాదియసురలు లూటిసేయఁగాఁగా
తమిఁ గృష్ణావతార మిందరికైతివి" 2-160

లె

లెక్కలువెట్టు : (లెక్కలు + పెట్టు) గణించు.

"లేవే యెందాఁకాను లెక్కలువెట్టేవు
ఆవటించి పైకొంటే నాయములు రేఁగును"
21-331

లెక్కసేయు : (2) (లెక్క + చేయు) లక్ష్యపెట్టు, లెక్కపెట్టు.

"లేవే నే బిలిచితే లెక్కసేసీనా తాను
చావి వోయ వుమి నాకి చవుతమా ఇఁక (?)"
26-61

లే

లేఁతచందురులు : వి; బహు. సన్నని నక్షత్రాలు.

"చన్నులపై నీవు లేఁతచందురుల నించితివి
కన్నులమెచ్చితినోయి గండికోట కేశవా"
18-367

లేక : (29) వి. 'లేఖ'కు వికృతి రూపం.

"దాకొన్న మోవిగంటి తానే చూచుకొమ్మనవే
లేకలు ముంజూరు నిండె లెక్కించుకొమ్మనవే"
(19-477)

"యెదుటికి వచ్చి వీడె మిప్పించుకొ మ్మనరాదా
పదిమారులు లేకలు పంప నేటికి"

లేటి : వి. ఆడుజింక, మగజింక.

"నవ్వుల నుండిన లేటిఁ దప్పక చూచితిఁగాక
రవ్వల నంటఁగాఁ బరారైతినా" 17-335

లేసు : వి. సులభము, చులుకన(శ.ర.) లేత, మృదువైన (వ్యు.)

"లేసులు నీ గుణాలెన్ని లెక్కవెట్టేమయ్యా"
22-404

"ఆసపడ్డ సతితో మాటాడితే దోసము గాదు
లేసుపెదవులు గదలించవయ్యా" 12-309

లొ

లొల్లి : వి. అల్లరి, గోల.

"ఇల్లిదె శ్రీవేంకటేశ యింతి నీకుఁ జెప్పించె
లొల్లిఁ గూడితివిఁకను లోన నుండరాదా" 7-399

"చల్లలమ్మే చోట నెల్ల జాణతనాలాడి యాడి
లొల్లిగా నీ పోఁగులకు లోనయితిమి" 20-484

లో

లోఁచు : (4) స.క్రి. 'లోఁగు'కు ప్రేరణార్థకం.
1. వెనుదీసేట్లు చేయు, సంకోచింప జేయు
2. అణగించు 3. అడకువ కలవానినిగా చేయు
4. చొచ్చునట్లు చేయు 5. జంకునట్లు చేయు
6. లోపల పోవునట్లు చేయు 7. కుంగునట్లు చేయు 8. వశమగునట్లు చేయు.

"లోకములో నెవ్వతైనా లోఁచి మాటాడఁగాను
పైకొననివానికి పంతమేది" 9-172

"మమ్ము నేల లోఁచేవు మర్మా లేల రేఁచేవు
కమ్మర మాపై నేల కాలు చాఁచేవు" 26-336

లోకదిమ్మరి: *ప.బం; వి.* ప్రపంచమంతా తిరిగేవాడు.
"తీరువడ్డపెను లోకదిమ్మరివి నీకు నేను
ఆరితేరి నేఁడు నీకు నాల నెట్టైతిరా" 7-10

లోకదొంగ: వి. లోకంలో ప్రసిద్ధుడైన దొంగ, గజదొంగ. (?)
"లోనివారి మొఱఁగేటి లోకదొంగవు" 6-55

లోకబండఁడు: *వి; ప.బం.* ప్రపంచంలోని అజ్ఞుడు.
"యోనిగతుఁడనై పుట్టి యోనికి మగ్నుఁడనైతి
పూని లోకబండఁడనే బుద్ధిఱేఁగీ" 15-13

లోకలోడి మాట: *ప.బం; వి.* పైమాట (లోకానికి ఓడి అంటే జనప్రభావానికి లోబడి అని అర్థం. వ్యు.)
"లోకలోడి మాట గాదు లోను వెలి నొక్కటే
ఆకె నీడకె తేవయ్య నవుఁగాము లెంచను"
11-68

లోభించు: అ.క్రి. లోభంకలిగి ఉండు.
"నేమమున లోభించితి నీ మంత్ర
మన్యులకియ్య" 2-215

లోలాయము: వి. శ్రమ, బడలిక.
"అట్టె పరువు దోలిన ఆసలనే గుఱ్ఱముల
గట్టిగ లోలాయమునఁ గట్టుకోరాదా" 3-217

వ

వంకగాలము: వి. వంకరగా ఉండే గాలము.
"కుత్తికె మరుశంఖము కురులు వంకగాలాలు
కొత్త నీకు నాకుఁ బొందు గూడు నటవే" 9-81

వంకచందురులు: *వి; బహు.* నఖక్షతాలు, గోరొత్తులు. వంకరగా ఉండే చంద్రుని ఆకారంలో ఉండేవని వ్యుత్పత్తి.
"వంకచందురుల చెక్కు వన్నెకాఁడా
కొంకక కూడె నిన్నాపె కోడెకాఁడా" 23-471

వంకలచంద్రులు: *వి; బహు.* నఖక్షతాలు.
"వంకలచంద్రుల నించి వాడివెట్టెఁగాక నీకు
కంకిగా రతులలో ఘాత సేసునా" 8-112

వంకలాడు: (2) (వంకలు+ఆడు) అ.క్రి.లోపాలు పేర్కొను.
"వంకలాడవద్దు గాని వంతుల సవతులలోన
కొంకు లేక నీ పాదాన కోరి చిమ్మరా" 23-409

వంకలొత్తు: (3) అ.క్రి. తప్పులుపట్టు (వ్యు.), వంకలుతీర్చు, చక్కగాచేయు (పద.)
"యీడనే శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
వోడక నీకు వంక లొత్తదాయను" 13-360

వంగళము: వి. 'వంగడము' నకు రూపాం.
"ఇంతేపో యెడమాఁటలిఁక నేఁటికి తా
నంతే వంగళమైతే నంతకంటె నేను" 24-81

వంగుడు: వి. బొట్లు రాలడం, చినుకులు పడడం. (బ్రౌన్. వంగుడు = బొట్లు రాలడం)
"వరుస వానకంటే వంగుడే ఘనము"

వంగులిచ్చు: నమస్కరించు. (?)
"రంగగు శ్రీవేంకటాద్రిరామునిదేవి కిచ్చితి
వంగులియ్యక మొక్కంత హనుమంతా" 2-249

వంచాడించు: (వంచి+ఆడించు) అ.క్రి. అదుపులో ఉంచు, బెదిరించు, విహ్వాలించు, దాక్షిణ్యంతో చూచు.

వంచెన: (2) వి. 'వంచన'కు వ్యావహారికరూపం.
"యెంచుకొంటే తన బత్తి యెందైనా
నాకుఁగలదు
వంచెనతో మొక్కే మరవకుమనవే" 29-154
"వంచెన మొక్కులనుండు వాడికైన తరితీపు
నించిన నేర్పుల నుండు నెలకొన్న సిరులు"
28-243

వంటలేని కూడు: వి. అమృతం. 5-297

వంటసాల: వి. 'వంటశాల'కు వ్యావహారికరూపం.
"వాలిన రాజసముతో వంటసాలలోననే
మేలిమిఁ గూచున్న దలమేలుమంగ" 14-370

వండదగినకూర: వి. ముక్కలు ముక్కలుగా ఉండేది.
"వుండగిలి నరకాల నుడుక బోయెద మింక
వండఁదగిన కూరవలె నాయ బతుకు" 1-90

వండదగిన కూరవలె అగు : *ప.బం; అ.క్రి.* ముక్కలు ముక్కలు అగు, సిద్ధంగా ఉండు.
"వుండగిలి నరకాల నుడుకబోయెద మింక
వండదగినకూరవలె నాయ బతుకు" 1-90

వండవండనట్లుగా : *ప.బం; క్రి.విశ.* పకపకమని. అర్థమింకను విచార్యమని పద.
"వండవండనట్లుగా వారిఁజూచి నవ్వేవు
యెండలెల్లా నీడ లాయె నింక నేటి మాటలు" 17-117

వండీవండని కూడు : *వి; ప.బం.* పూర్తిగా ఉడుకని అన్నం.
"రెండు విడువలేక రతులు వేరే యయితే
వండీవండని కూడువలె నవు మనసూ" 15-117

వండు : వి. బురద.
"కారణాన నప్పటినీఁ గలిగేనా నది మరి
తేరిన నీళ్ల వండుదేరి నట్లవును" 2-29

వంతు : (6) 1. భాగం 2. వరుస 3. సామ్యం 4. పోటీ.
"వంతుకు మాటలాడితే వాఁడివోయనా యేమి
చింతదీరఁ జెవిలోనే చెప్పిచూపేఁగాక" 25-473

వంతుకుఁజెప్పు : (?)
"చింతించి చింతించి శ్రీవేంకటేశ్వరు
వంతుకుఁ జెప్పిన హరివాక్యమే యెక్కుడు" 4-188

వంతుకు వంతు : *ప.బం; వి.* సరికి సరి.
"ఇంతి సేసిన మేలు కిదియా నీవు
వంతుకు వంతే వైపోఁగాక" 26-189

వంతుకువాసికి : (2) *ప.బం;* వాసికి వన్నెకు, ప్రసిద్ధికి.
"అంతటనే వచ్చి కాచు నాపద్బాంధవుఁడు హరి
వంతుకు వాసికి నతనివాఁడ నంటేఁ జాలు" 4-201

వంతుపెట్టు : *ప.బం; అ.క్రి.* వంతుతెచ్చు, పోటీపెట్టు.

వంతుల సతులు : *వి; బహు.* పోటీలు పడు సతులు, పంతాల సతులు.
"వంకలాడవద్దు గాని వంతుల సతులలోన
కొంకులేక నీ పాదాన కోరి చిమ్మరా" 23-409

వంతులు వాసులు : (5) *వి; ప.బం; బహు.* వన్నెలు వాసులు, గొప్పలు.
"దొంతులాయఁ గూరిములు దూరులాయ నేరములు
వంతులు వాసులు నింక వద్దనవే" 9-109
"వంతులకు వాసులకు వలపులు చల్లి
అంత నిన్ను దూరేటి యాఁటదాన చల్లనా" 11-484

వంతువరుసలది : (వంతువరుసలు + అది) *వి.* వావివరుసలది.
"వంతువరుసలదాన వలచి వుండినదాన
యెంత విరహాన నున్నా నే మాయను" 8-161

వంతువరుసలవారు : *వి; బహు.* వావివరుసలవారు.
"వంతువరుసలవారు వాకిటఁ గాచుకుండఁగా
దొంతివెట్టీ నవ్వులెల్లా దొరతన మెట్టిదో" 21-185

వంతువరుసలు : *ప.బం; వి; బహు.* వావివరుసలు.
"వంతువరుసలు గాక వద్దఁ గాచుకుందానవు
యెంతలేదు నీ మాసోదమేమి చెప్పేదే" 18-457

వంతువాసి : ప.బం. వన్నెవాసి.
"అంత హితులా తనకు నన్నలుఁదమ్ములును
వంతువాసికిఁ బెనఁగువారే కాక" 1-179

వంతువాసికెక్కు : *ప.బం; అ.క్రి.* ప్రసిద్ధికెక్కు
"వంతువాసికెక్కఁగా నా వగ పొకచోటనైన
సంతమైన నాయకుఁడ చాలదా నా జన్మము" 11-255

వంతువాసులు : (14) *ప.బం; వి; బహు.* తమతమ వంతులప్రకారం తృప్తిమంతులు కాని వర్తకసంస్థలు కాని ప్రభుత్వానికి చెల్లించే ద్రవ్యవిభాగం అని వ్యు.
"వంతు వాసులడుగను వచ్చి వచ్చి యలుగను
వింతగా నీ మేనెల్లా వినుచుండేము" 16-223

వందడి: వి. (?)

"పరఁగ నీరు వందడి (?) పారే నీరువలె

సిరులవెంటఁ బారీనా చిత్తవికారాలు" 15-194

వందన: వి. నమస్కారం, స్తుతి.

"పందెమాడఁ బిలిచితే పచ్చిసేసి నన్నుఁగూడే

వందనతోఁ దన్ను ముట్టవస్తినా నేను" 20-225

వందు: (4) వి. ఈ పదం క్రియారూపంగానే కాని విశేష్య రూపంగా నిఘంటువుల్లో కానరాదు. క్రియారూపంగా దీనికి దుఃఖపడు, పరితపించు అనే అర్థాలున్నాయి. సంతాపం (?) దుఃఖం, గ్లానత, వివర్ణత అనే అర్థాలు చెప్పవచ్చు.

"కందువ వెంకటపతి కౌఁగిటి పరవశాన

వందు లేక పండి క్రైవాలెనో యనంగా" 6-124

"సందడించి యిన్నిటా నీ చైతన్యమై యుండఁగాను

వందు లేక నేఁగొన్ని వాహనా లెక్కితిని" 1-427

వంపెట్టు: (వంపు + పెట్టు) *ప.బం; స.క్రి.* వంగేట్లు పెట్టు (తె.వ్యు.కో.) కాని ఇట సంపాదకులు సూచించినట్లుగ 'అరచుట' అనే అర్థమే సముచితం. దీని వికృతరూపమైన ఓపెట్టు అనేపదం ఈ అర్థంలో ఇప్పటికీ రా.సీ.లో వ్యవహారంలో ఉందట.

"ధరణి వంపెట్టుఁ బ్రతిధ్వనులు మిన్నులుముట్టు

శిరసెత్తి నలి నరసింహదేవుఁడు" 2-228

వంబు: వి. 'వమ్ము'కు రూపాం. కావచ్చు. వ్యర్థత. (వంబు - త.)

"వంబు లేక అందుకె పో వైపుగ మాధవుఁడనే

పంబిన పేరు ధరించె" 9-281

వక్కణించు: స.క్రి. 'వక్కాణించు'కు రూపాం. చెప్పు, వివరించు.

"అంటిన నీ తలఁపు లేమని వక్కణింతు నేను

నంటున నీ కూటమికి నమ్మి కాచుకున్నది"

12-79

వక్కు: అ.క్రి. కృశించు, బక్కటిల్లు.

"యెక్కువ తమకపుటింతులఁ బొందక

వక్కుచు వాడే వయసేలా" 1-216

వగకాఁడు: (వగ + కాఁడు) వి. ప్రియుడు, విలాసవంతుడు, వన్నెకాఁడు.

"కైకోలు వేగిరకాఁడ కందువుల వగకాఁడ

చేకొని నీ చెప్పినట్టు సేసేమయ్యా" 11-57

వగరించు: అ.క్రి. వగర్చు, నిట్టూర్చు. వంచనపు మాటలాడు ఆం.ధా.పా.

"ఎంత లేదు చిత్తమా, ఈఁతలేల మోతలేల

వంతులకుఁ బారనేల, వగరించనేల" 4-426

వగ్గరించు: అ.క్రి. 'వగరించు'కు రూపాంతరమా? నిట్టూర్చు.

"వొగ్గిన రతులలోన వూరకైనా వలపులు

వగ్గరించి చవిగొనేవారు గలరా"

వజ్రపంజరము: *ప.బం; వి.* గట్టిరక్షణ నిచ్చేది.

"కావలెనన్నవారికి ఘనమనోరథమవు

వావిరిఁ బూజించువారికి వజ్రపంజరమవు"

3-508 & 2-101

వజ్రాంగి: వి. వజ్రమయమైన కవచం, అంగీ, చొక్కా. ఈ పదం నేటికీ పశ్చిమాంధ్రలో రోజూ వినబడే మాట అని పద.

"సందడి నాతనిపై మచ్చము సోదించేదానవు

తుందుడుకేల వజ్రాంగి దొడుగఁగ వలదా"

17-186

వజ్రాంగిజోడు: వి. వజ్రమయమైన కవచం, రక్షణ.

"పంచామృతములు నీ పాదతీర్థము మేనికి

పంచముద్ర లదే వజ్రాంగిజోడు" 3-393

వజ్రాలబిల్ల: వి. ఆభరణవిశేషం.

"పెనుగొప్పుపై వజ్రాలబిల్లలు మెరవఁగాను

మినుకుఁగమ్మలకాంతి మించఁగాను' 22-212

వజ్రాలబొట్టు: వి. ఆభరణవిశేషం. (?)

"సుదతి వజ్రాలబొట్టు సూర్యోదయమై వుండఁగా

యెదుటఁగను మెఱుఁగు లెండఁగాయఁగా"

12-444

వటర : వి. వదరుబోతు, వాచాలుడు, సమర్థుడు, నేర్పరి. (వ్య.)
"సేసపాలు రాలఁగానే చెప్పరాని బాసలిచ్చీ
యీ సుద్దుల వటరతో నే మందునే" 27-566
"వటరయై చంచలవాణి నాఁబరగు" అని పరమ. (268 పు.)

వట్టఁగట్టు : అ.క్రి; ప.బం. ఇంకిపోవు. వి. బ్రహ్మచర్యం (వట్టన్ + కట్టు = వట్టగట్టు అని పద విభాగమేమో! లేకున్న అరసున్న చింత్యం. 1.సం. పీఠిక 38 పుట) విణ. 1.రిక్తం 2.ప్రయోజనం లేనిది 3.శుష్కం 4.కారణం లేనిది 5.పాలుడిగినది.
"ధృతిహీనులకు నెల్ల దిక్కయి గాతువుగాక
వ్రతము చెల్లిన నింక వట్టఁగట్లా" 1-280

వట్టవెట్టు : స.క్రి. తక్కువ చేయు, న్యూనపరచు.
"చనవు లొకతె కిచ్చి చలము రేఁచె వొకతె
వనితకు వనితలు వట్ట వెట్టేరా" 21-145

వట్టిజోలి : వి. ఖాళీసంచి, వట్టి సంబంధం.
"చెంది నీతో సిగ్గుతోడి చేరువ నిలుచున్నది
యెందాఁకా వట్టి జోలియిఁక నానతీవయ్యా" 8-29

వట్టిమాకు లిగురించు : ప.బం. అద్భుతం జరుగు.
"వట్టి మాకు లిగిరించు వనిత నీమాట వింటే
నెట్టన ఆదివృద్ధి గుణములు నీకు నీకే వలదా" 8-5

వట్టిమాకు లివురుపెట్టుట : ప.బం; అ.క్రి. పనికి రానివి ఫలవంతమగుట.
3-99, 541 ఆ.భా. 3-3

వట్టువోవు : (వట్టు + పోవు) ప.బం; అ.క్రి. ఎండిపోవు, ఇంకిపోవు.
"గుట్టున జడియరు కొంకుచు మొరయరు
వట్టువోరు తమ వలపులకు" 9-214

వడఁబడు : (4) అ.క్రి. వేడిచెందు, శ్రమచెందు.
"నడుమ రెంటికిని నా మేను
వడఁబడె యెందలివాఁడనొ నేను" 3-342
"వడఁబడి పరులిండ్ల వాకిలిగా చేసెను
వడి నాలో హరియున్న వాకిలి గాచేను"
"నడుమ రెంటికిని నా మేను
వడఁబడె యెందలి వాఁడనొ నేను" 3-342
సంబంధపడు :
"చీచీ వో బదుకా సిగ్గులేని బదుకా,
వాచవికి బతిమాలి వడఁబడ్డ బదుకా" 1-467 & 9-53

వడఁబెట్టు : స.క్రి. శ్రమ కలిగించు, వేడి కలిగించు.
"బడిబడి నీడుగాని పనులకే పెనఁగేవు
వడఁబెట్టి సటకాఁడ వచ్చేవొ రావొ" 9-84

వడ : వి. 1.వేడిగాలి 2.వేడిమి 3.పరితాపం 4.హిమం 5.దప్పి 6.శ్రమ, బడలిక 7.ఆకలిబాధ. విణ. ఉష్ణం, వేడి అయినది.
"నీడల చూపులు నీ కేలే యీ
వాడక వాడెడి వడ నీ కేలే" 6-66

వడగండ్ల గుడి : వి; ప.బం. అస్థిరం. వడగండ్లతో నిర్మించిన గుడి అస్థిరమే కదా!
"పడఁతుల వేడుకలు పచ్చివడగండ్ల గుళ్లు" 2-268

వడచల్లు చూపుకాఁడు : వి. చల్లనిచూపులు గలవాడు. (వ్య.)
"కడు ముత్యపుం బేరులె కట్టబెట్టె మెడనిండ
వడచల్లు చూపుకాఁడ వచ్చేవో రావో" 4-106

వడచల్లు మేను : వి. చల్లటి శరీరం.

వడదాఁకు : ప.బం; అ.క్రి. వేడిగాలి సోకు, ఎండదెబ్బ తగులు. (వ్య.)
"వెన్నెలబాయిట నీవు వెలఁదిఁదలఁచుకొని
వన్నెకాఁడ విరహాన వడఁదాకేవు" 7-146

వడదీరు : అ.క్రి. దప్పితీరు. 4-164

వడదేరు : (వడ + తేరు) అ.క్రి. శ్రమనుండి తేరుకొను, వాడిపోవు, తాపం తొలఁగు.
"కడు విరహినై నిన్నుఁ గన్నులఁ జూచేమంటేను
వడదేరి కొలువు చావడి నుందువు" 7-22

వడిఁబడు : అ.క్రి. మెలిబడు.
"ఆసల శ్రీవేంకటేశ అంగన నిట్టె కూడితి
వాసితోడ సరసము వడిఁబడదు" 21-284

వడిఁబెట్టు : వి. 'వడి'కి వేగమని సామాన్యార్థం. కాని ఇట మెలిబెట్టు అని అర్థం.
"నీమాట మీరేనా నీవేనేఁ గానా
వాములాయ వలపులు వడిఁబెట్టకికంను" 12-19

వడిగొను : ప.బం; అ.క్రి. వేగం కలుగు, త్వరపడు, వడియు, కారు, స్రవించు. (వ్యు.)
"అడఁకువలు మోదములు అలుక దీరినదాఁక
వడిగొన్న కోరికలు వలసినందాకా" 17-517

వడియించు : స.క్రి. కార్చు, స్రవింపజేయు.
"తొడతొడ మోయఁగాలు దొక్కి శ్రీవేంకటేశ్వర
వడియించేవు చెమట వనితదేహమున" 17-217

వడియు : (7) అ.క్రి. కారు, స్రవించు.
"వలచిన వలపులు వడియుచుఁ జెక్కులను
జలజలఁ జెమటలై జడివట్టె నదివో" 7-379

వడియు : స.క్రి. వడియఁజేయు, కార్చు.
"అడువఁడా నేలతో నలిమి శకటాసురుని
వడువఁడా నెత్తురులు వసుధ కఠినునిని" 1-126

వడివడు : ఒడంబడు, సంబంధపడు. 12-264

వడివెట్టు : (వడి+పెట్టు) మెలిపెట్టు, నులుము, వస్త్రగాళితం పట్టు.
"వాములైన వలపులు వడివెట్టవచ్చునా
ప్రేమముతో తానే వచ్చి పెండ్లాడీఁగాక" 12-472

వడ్డికిఁబారు : (2) ప.బం; అ.క్రి. ఎక్కువగు, వర్ధిల్లు. (వ్యు.)
"వనితల తలఁపులు వడ్డికిఁబారీ నీమీఁద
యెనయు నెక్కడనైనా యేదుగాను సతుల"
7-95

వడ్డిరెచ్చుకొను : పెంపొందించుకొను.
"వలనైన చిరునవ్వు వడ్డి రెచ్చుకొనేవటే
వెలయు నీ వెంత నవ్వించినా వగవు" 12-136

వడ్డివారు : (8) ప.బం; అ.క్రి. అధికమగు. (వ్యు.)
"వడ్డివారె శిగ్గుతోడి వనితను వానిఁదెచ్చి
జిడ్డుదేర నవ్వించేవు చీచీ నీవు"
11-74 & 1-198

వత్తలూరి కేశవుఁడు : వి. కడపజిల్లా పుల్లంపేట మండలం లోని నేటి బత్తలూరే వత్తలూరు. ఇక్కడ కృష్ణదేవాలయ ముండేది. ఈ స్వామిని కేశవుడని అన్నమయ్య కీర్తించినాడు.
"వత్తలూరికేశవా వన్నె లీడ జేసేవా
బత్తిగలవాఁడ వౌదు పట్టకువయ్యా" 22-106

వత్తికి నూనెకుఁగొలది : వి; ప.బం. అతికష్టంమీద జరుగుబాటు జరగటం.
"హత్తిన పుణ్యము బాపము నప్పటి
సుఖములకొఅకే
వత్తికి నూనెకుఁ గొలదై వడిఁజనె దివసములు"
1-176

వత్తికి నూనెకు ఒక్కవరుస యగు : ప.బం; అ.క్రి. అతికష్టం మీద జరుగుబాటు జరుగుతున్నదనే సందర్భంలో వాడబడే పలుకుబడి.
"వత్తికి నూనెకు నొక్క వరుసాయ
హత్తి నీవే సేసవెట్టి తల్లనాఁడే నీకు" 14-324

వత్తికి నూనెకు కొలఁది యగు : ప.బం; అ.క్రి. ఒకదాని కొకటి సరిపడు.
"హత్తిన పుణ్యము బాపము నప్పటి
సుఖములకొఅకే
వత్తికి నూనెకుఁ గొలఁదై వడిఁజనె దివసములు"
1-176

వత్తిలోపలి నూనె : ప.బం; వి. అస్థిరం, అంతర్లీనంగా ఉండేది.
"వత్తిలోపలి నూనెవంటి దీ జీవనము
విత్తుమీఁదటి పొల్లు విధము దేహంబు" 1-328

వదర : వి. ఇది 'వదరు' కావచ్చు. వదరు అంటే సొరకాయ. (వదరుకాయ = సొరకాయ)
"ఒడ విడిచి వదర వూరకేల పట్టేవు
గోడ గడుగ నడుసే కురిసే వో మనసా" 3-196

వదరు[1] : వి. దంభవచనం, (డంబం) వ్యర్థవచనం, ఉపయోగం లేని మాట, ప్రేలుడు, ప్రలాపం.

"అదన నెదుటనె అత్తమామ లున్నవారు
వదరు లింతేలంటా వారైనఁ దిట్టరా" 11-283

వదరు²: వి. సొరకాయ.
"జలధి దాఁటేవాఁడు సరి నోడ వుండఁగా
వలవని జాలితో వదరు వట్టేదా" 3-456

వదరుఁదనము: (వదరు + తనము) వి.
ఎక్కువగా మాట్లాడటం.
"చదురులాడి యాతఁడు సారెకు నేరుతునంటా
వదరుఁదనములనె వాదించెనె" 8-260

వదరుమాటలు: వి; బహు. ప్రలాపాలు, మాయమాటలు, అర్థంలేని మాటలు.
"అదనఁ బార్వతీదేవి కతఁడే నీ మంత్రమిచ్చె
వదరుమాటల మాయావచనా లేమిటికి" 3-493

వద్దివారు: వి; బహు. దగ్గరివారు.
"చెలరేఁగి యాతఁడాపె చేతికి లోనై వుండఁగా
వలవని వాదులేలే వద్దివారికి" 12-374

వననిధిఁగురిసిన వాన: ప.బం; వి.
నిష్ప్రయోజనం. సముద్రంలో కురిసిన వానవల్ల ప్రయోజనం లేదు కదా!
"వననిధి గురిసిన వాన లివి మతి
పనిలేని పనుల భారములు" 1-24

వనభోజనాలు: (2) వి; బహు. కార్తికమాసంలో శ్రవణా నక్షత్రం నాడు తోటల్లోకి వెళ్లి బంధుమిత్రులతో కలిసి భోజనాలు చేసే ఉత్సవం. దీనికి ఉల్లాసయాత్రోత్సవం అని కూడా పేరు.
"పొలయుచు నేడు వనభోజనాలు సేయఁగాను
అలమి పొత్తులనుండి ఆరగించీఁదాను" 26-227

వనితె: (2) వి. 'వనిత'కు వ్యావహారికరూపం. 'వనిత' లోని అకారం ఎకారం కావడం కన్నడ ప్రభావంవల్ల కావచ్చు.
"మంచివాఁడవె నీవు మంకువనితెను నేను
యెంచి మాతోఁగూడి నీవు యెడ్డవైతివి" 27-436

వన్నెకాఁడు: (4) (వన్నె + కాఁడు) వి.
అందగాడు, సౌందర్యవంతుడు, విలాసవంతుడు.
"ని న్నిటనుండి తన్ను నిందలాడితి ననీని
వన్నెకాఁడేమి సేసినా వట్టి వెరపేఁటికే" 26-528

వన్నెకుఁదెచ్చు: ప.బం; స.క్రి. ప్రతిష్ఠకు తెచ్చు, సామర్థ్యం మెరుగుపరచు.
"అన్నిటా శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
వన్నెకుఁ దెచ్చుకో మాట వహికెక్కినపుడు"
8-93

వన్నెచెడు: ప.బం; అ.క్రి. పేరుపోవు, కళతప్పు.
"వాసి విడిచితిమి నీ వారమైతిమి
మమ్ము వన్నె చెడనీకు వో కర్మమా" 1-284

వన్నెపదాలు: వి; బహు. ప్రసిద్ధినీ, కీర్తినీ వర్ణించే పదాలు.
"జీవునికిని దండె వేసినవాఁడవు నీవు
వావాతిమాటలే నీపై వన్నెపదాలు" 3-467

వన్నెలు వాసులు: వి; ప.బం; బహు.
ప్రకాశమూ దాని విలువా; లక్షణయా 'కీర్తిప్రతిష్ఠలు' అని కూడా.
"వన్నెలాను వాసులాను వలపు నీపైఁ జల్లఁగా
ఇన్నిటా సంతోసము లింకఁ జెప్పనేల" 26-441
"వన్నెలు వాసులతోడ వడి బతికేవారము
నిన్ను వలెనా నేము నిలవయ్యా" 11-142

వమ్ము: విణ. నిరర్థకం వి. నాశం.
"వమ్ముదొలి మాటలనే వాఁడి వసులనే నన్ను
కుమ్ముచుఁబ్రాణముల నిట్టె కొన దొరకొంటివి"
5-119

వయసువాఁడు: (వయసు + వాఁడు) వి.
యువకుడు, పడుచువాడు.
"ఆనుక వయసువాఁడ వందుకుఁ దో డివియైతే
మోనమున సతులెల్ల మోహించకుందురా"
7-518

వయ్యాళి: వి. విహారం, స్వారి. తమిళంలో ఈ పదానికి గుఱ్ఱాలు తిరిగే చోటని అర్థమట.
"నీటున వయ్యాళివోయి నీవు రాగా నదె చెలి
కోటకొమ్మ నొరగుండి గొబ్బునఁజూచీ" 9-277
"అంది నీకుఁగావఁబో నావులమంద గలదు

కుంది వయ్యాళికి రాతి గుఙ్జము గద్దు" 7-219

వయ్యాళిపోవు: అ.క్రి. వాహ్యాళికి పోవు, విహారానికై పోవు.

"నీటున వయ్యాళివోయి నీవు రాఁగా నదె చెలి

కోటకొమ్మ నొరగుండి గొబ్బునఁజూచి" 9-277

వరఁతఁబోవు: ప.బం; అ.క్రి. ప్రవాహంలో పడిపోవు. 4-49

వరతఁగలపు చింతపండు: (3) ప.బం. వ్యర్థం, నిష్ప్రయోజనం. ప్రవాహంలో కలిపిన చింతపండు వ్యర్థమే కదా!

"వావిరిఁగేశవు నొల్లని బదుకులు

వరతఁగలపు చింతపండు" 2-235

వరతఁగొట్టు: ప.బం; స.క్రి. నశింపజేయు.

"కడుఁగోపపుభూతము కాయమెల్లా మఱపించె

వడి నజ్ఞానపుటేరు వరతఁగొట్టె" 3-65

వరత వచ్చు: ప.బం; అ.క్రి. విజృంభించు.

"వాటమై వరత వచ్చె వనితల కోరికలు

యీటువెట్టుకొన నేను యెవ్వరిఁబోలుదును"

14-121

వరతిపాలగు: ప.బం; వ్యర్థమగు. (వరద పాలగు అని వాచ్యార్థం)

"నిరతి రామునిచేత నిమిషము లోననే

వరములన్నియు నెందో వెరతి పాలాయ"

3-364

వరదరాజులు: వి. మదరాసు (చెన్నై) సమీపంలోని కంచి క్షేత్రంలో వెలసిన వరదరాజస్వామి.

"తేరువెంట వచ్చె వరదరాజులును

నరులార సేవించరే మన కోరికలు మీర"

వరదహస్తము: వి. వరాలను ప్రసాదించే హస్తం.

"వరదహస్తమున వలచేయి వట్టుక

అరుదుగ విను మాఁటాడించినది" 20-6

వరవాత: (3) 'వఱువాత'కు వ్యావహారికరూపం. ఉదయాన.

"యెరవు లేక విభుఁడు యేమీ ననఁజాలఁడు

వరవాత నిఁకనైనా వచ్చేవో రావో" 27-161

వరిగురుము: వరిగింజ, వరిబీజం, వరివిత్తు.

"చుట్టి వరిగురుమతో జొన్నగింజ సరిదూఁగు

తెట్టలై మేలొకటికి వీలొకటాయ" 3-14

వరుసదినములు: (2) వి. వంతు వచ్చే దినములు.

"మోనాన వరుసదినములు యెంచుకొమ్మనవే

తా నిఁక నాపై దయదలఁచుమని యనవే"

28-525

వరుసవంతు(లు): (12) ప.బం. వాసివంతు(లు), వన్నె-వాసి.

"వరుసవంతులు చూపి వసపరతువు గాక

తెరదీసి మరియేల తిలకించేవే" 22-427

"వరుసకంతడిగితే వలపించనేరవలె"

29 అను. 10

వర్తన: వి. ఆయా పనుల్లో ఇంతింత ఇవ్వడం అనే కట్టుబాటు, మామూలు. ఈ అర్థంలో ఇది వ్యావహారికం. (f.n. 22-376) (నడవడి, జీవనం. శ.ర.)

"వాసితో శ్రీవేంకటేశ వలపు వర్తన గొనె

యీ సరి నన్నేలితివి యీకె నీకు నబ్బెను"

22-376

వలఁబడు: ప.బం; అ.క్రి. మోసపడు. 22-376

వలఁబెట్టు: ప.బం; స.క్రి. మోసంచేయు, (వ్యు.) వంచించి వశంచేసుకొను. (పద.)

"కద్దురా నీ సుద్దులు కడఁగడల వింటిమి

వద్దురా యింతేల మమ్ము వలఁబెట్టేవు

వాసితో నుండినవారిని వలఁబెట్టవలెనా"

11-587

"వాలుగన్నులచేత వలలఁబెట్టుటె కాక" అని నిరంకు. ప్రయోగం.

వలగొను: స.క్రి. చుట్టుకొను, పరివేష్టించు.

"సులభానఁ గలరు సొరిది దేవతలు

వలగొను పాపము వారించలేరు" 4-215

వలచేయి: వి. కుడిచేయి.

"వరదహస్తమున వలచేయి వట్టుక
అరుదుగ నిను మాటాడించినది" 20-61

వలతి: 1. వశము, అధీనము 2. నేర్పరి 3. అనుకూలము 4. చోటు.
"వనిత కాఁగిలి నీకు వలపుల వలతౌను
తనిసి చేపట్టితే తమ్మిపూజలే" 14-403

వలపక్షము: (2) వి. పక్షపాతం.
"మగవారయినవారు మగరీతి నుంటఁగాక
పగటులు మించి వలపక్షాలకు వత్తురా" 13-538

వలపల: వి. కుడివైపు.
"వలపల దాపలాను వడిగాఁ గొసరె నిన్ను
చెలియ విన్నపములు చెవిసోఁకెనా" 25-241

వలపుకాఁడు: (వలపు+కాఁడు) వి. కాముకుడు, ప్రియుడు.
"చొల్లెపుఁజుట్లే నీకుఁజుట్టుఁబట్టె నింత వడి
వల్లడి వలపుకాఁడ వచ్చేవో రావో" 6-106

వలపుమడుగు: వి. ప్రేమసరస్సు.
"నెమ్మి యమునలో నీఁద నేరిచినవాఁడు నాతో
ఇమ్ముల వలపుమడు గీఁదఁగలఁడా" 26-78

వలపుల కత: వి. ప్రేమకథ.
"గారవించి వలపుల కతలు చెప్పేవు
నేరుపు గలిగినావె నీ వద్దనే వుండఁగాను"
23-370

వల(సి)సీ నొల్లములు: (4) *వి; బహు.* అనిష్టములు.
"వలపు నా కాయ నీకు వలసీనొల్లములాయ
మలకల బొంకు లీఁక మానవయ్య" 21-453

వలరాచకాఁక: వి. మన్మథతాపం.
"పొలఁతి దేహము మొదలఁబూఁదీఁగె కనక ఇదె
వలరాచకాఁకచే వాడఁబారీని" 24-1

వలలఁబెట్టు: *ప.బం; స.క్రి.* మోసంచేయు, వంచించి వశం చేసుకొను. (పద.) చూ: వలఁబెట్టు.
"వలచినవారి నింత వలలఁ బెట్టఁగఁబోతే
అలరి యెంతపకీర్తి యనరా లోకులు" 17-481

"వగలు బాఁతె వలలఁ బెట్టెడి తమ్ముఁ
దగిలించు మమత వేదనము సేయఁగా" 1-41
"వలపించి నన్నింత వలలఁబెట్టినందుకు
సొలయవద్దా అదీఁ జూడనైతిఁగాక" 16-25

వలలోపలి నిడిపరువులు: *ప.బం; వి; బహు.* అసంభవాలు.
"కలలోపలి సంభోగము ఘనమగు సంపద
లిన్నియు
వలలోపలినిడిపరువులు వన్నెలవిభవములు"
2-133

వలసీనొల్లని: *విణ.* అంతగా ఇష్టపడని
"వలసీ నొల్లని సతి వద్ద నెంత నిలుచున్నా
తలఁపులో నీ కిట్టె దయ వుట్టీనా" 23-171

వలుము: వి. మోసం. (వ్యు.)
"వలుములు చన్నులంటా వాసుదేవుఁడా వట్టి
వళుకులఁ బెట్టకుమీ వాసుదేవుఁడా" 15-249

వలువకాఁడు: (వలువ + కాఁడు) గోపికల వస్త్రాలను అపహరించిన శ్రీకృష్ణుడు.
"పాము నాడించిన యట్టి బాలజోగి పిన్నవాఁడు
వాముల వెన్నలు దినే వలువకాఁడు" 24-112

వలె: (3) *క్రి.రూ.* 'వలయును' అనే రూపానికి వ్యావహారిక రూపం; కావలయును.
"మంచితనమే వలె మాటలాడే యప్పుడెల్లా"
3-158

వల్ల: వి. 1.నైపుణ్యం 2.ఆనుకూల్యం 3.యుక్తత 4.స్నేహం. (తె.వ్యు.కో.)
"వల్ల చూచి కామినుల వలపించేఁగాని
మొల్లమై నా మేను ముదిసిన దెరగ" 2-16

వల్లడి: వి. 1. తొందర 2. అకారణమైన ఆపద 3. కొల్ల. (తె.వ్యు.కో.)
"పల్లదాన నలిగితే బలిమి నీవు గూడేటి
వల్లడిరతి దలఁచి వడి లోలో నవ్వెను" 16-247

వల్లె: వి. పశువులను కట్టే పలుపు, కట్టుతాడు, తలుగు, ఉచ్చు, ఉత్తరీయం, పగ్గం.
"వల్లెవేసి కోడెలను వంచుకొనేయట్టి నీకు
చెల్లు నెంత నీవు చేఁత చేసినా కుమ్ము" 7-92

వల్లెతాడు : (3) వి. పశువులను కట్టే తాడు, పగ్గం.
"కోడెల వల్లెతాడై గొల్లెతలా తాఁ
గూడి పైకొన నుండెఁగోరి కొన్నాళ్లు" 5-94

వల్లెవేయు : స.క్రి. పగ్గంతో కట్టివేయు.
"బాలకృష్ణ బోయిఁడా పసుల వల్లెవేయరా
వాలుఁజూపుల మమ్మేల వల్లెవేసేవు"
11-346 & 7-92

వళకాడు : అ.క్రి. వణకు. (వ్యు.)
"శ్రీవేంకటేశుఁడే చిత్తగించి నన్నేలెఁగా
వావాత నింద్రియాలు వళకాఁడినా" 3-417

వళకాడు : ప.బం; అ.క్రి. వళకులాడు, నిందలాడు.
"ఏఁటి మాటలాడేవే యెందాఁకా నీవు వోరి
హటముగ యిట్టే వట్టి వళకులాడరా" 7-23

వళకు : వి. 'వళుకు'కు రూపాం. (?) తగవు, నింద, మోసం, భయం.
"యిందుకు నందుకుఁబోనీ
రిహలోకమందువారు
దిందుపడని వళకు తీరుచవయ్యా" 3-330
"పైకొని శ్రీవేంకటేశు బంటుకు వళకు లేదు
సైకమైన హరిభక్తి సహజమింతే" 2-288

వళకులాడు : తడబాటు మాటలు పలుకు.
"ఏఁటి మాటలాడేవే యెందాకా నీవు వోరి
వాఁటముగ యిట్టే వట్టి వళకులాడకురా" 7-230

వళచుకొను : 'వలచుకొను'కు రూపాం.
"పలుమారు వచ్చీఁదానే పనిలేని పరాకు
వళచుకొన్నది తానే వట్టి భీతి" 3-225

వళావళి : వి. 1.కుతూహలం 2.విజృంభణం 3.కోలాహలం 4.చప్పుడు, ధ్వని (వ్యు.) 5.ఊరకమాట్లాడే వ్యర్థమైన మాటలు. (ఆం.ప.కో.)
"ఎంత చన విచ్చితివి యీపెకు నీవు
వంతులకు వట్టి వళావళ్లు సేసీ నిపుడు" 7-174

వళుకు : వి. 1.మోసం 2.తగవు, కారణం లేని తగవు, వివాదం (శ.ర.) 3.అపవాదం, నింద(?) 4.మిథ్యాభియోగం. (బ్రౌన్)
"వాకున వినయము వళుకులు చెంతల
సాకిరి రమణుఁడ సరికి సరి యాయ" 21-525
"వళుకు కోపనివాఁడు వచ్చి పూటవడనేల
వొలసినట్టు తనంత నుండరాదా" 10-1-30

వళుకువేయు : లగ్నంచేయు.
"వట్టి భక్తి నీ మీఁద వళుకువేసి నిన్నుఁ
బట్టితెచ్చి మతిలోనఁ బెట్టుకొంటిని" 3-49

వళుకుసేయు : లగ్నంచేయు. 3-49

వశగాదు : క్రి.ప. వశముగాదు, సాధ్యంకాదు. చూ : వసగాదు.
"వాడిక నా కోరిక వశగాదు
వేడుకకు నెంతైనాను వెలలేదు" 18-97

వసంతకాఁడు : (వసంతము + కాఁడు) వి. (?)
"యింత యేలే నాతోఁగారింతలు నీవల్లనే పో
సంతమైతి నేలో వసంతకాఁడా" 24-217

వసంతపు నీళ్లగు : ప.బం; అ.క్రి. ఆనందమగు.
"జోడుగా మరియు నీ చూపులు నాపైఁ బారెనా
నీడలనే వసంతపునీళ్లాయ వలపు" 13-60

వసంతపునీళ్ళు : వి; బహు. వసంతోత్సవంలో ఒకరిపై నొకరు చల్లుకొనే రంగునీరు, పసుపు-సున్నం కలిపిన ఎఱ్ఱనీరు.
"జోడుగా మరియు నీ చూపులు నాపైఁ బారెనా
నీడలనే వసంతపు నీళ్లాయ వలపు" 13-60

వసంతపూర్ణిమ : వి. చైత్రపూర్ణిమ
"వరుసతో సాసముఖా వసంతపూర్ణిమ నేడు
సిరుల యీ విభవాలు సేవించరో" 7-445

వసంతమాడు : స.క్రి. చల్లుకొను, అ.క్రి. వసంతాలు చల్లుకొను.

వసంతము : వి. సంబరం, ఆనందం. (లాక్షణికార్థం)
"వాడల వాడల వెంట వసంతము
జాడతోఁ జల్లేరు నీపై జాజర జాజర జాజ"
26-18

వసకాఁడు : (వసము + కాఁడు) వశంకలవాడు, అధీనంలో ఉన్నవాడు.
"రచ్చ రావికింద రంతులె చేసేవు
బచ్చనమాటల వసకాఁడ" 6-103

వసగా : క్రి.విణ. ఇది 'వసిగా' కావచ్చును. మిక్కిలిగా.
"వసగా నాసలలోన వడిఁబడ్డ నా మనసు
యెసఁగ మళ్లించవే న న్నేలిన గోవిందుఁడా" 3-437

వసగాదు : క్రి.ప. వశం కాదు, సాధ్యం కాదు.
"మందలించి వలపులు మట్టుపెట్టె వసగాదు" 25-154
"వెసఁ గర్మమొక వంక విజ్ఞానమొక వంక
వసగావు రెంటి బలవంతములు" 3-570
"వసగాని పెక్కు దేవతలఁ గొలుచుట కంటే
సుసరాన హరి వారై సుఖియించరో" 3-568

వసము : (9) 'వశము' నకు వికృతిరూపం. వశం, అదీనం, సాధ్యం.
"వసము గాక నీతో వాదు లడువఁగ లేదు
వస ఇంతే కలది నా పడఁతితనమున" 27-186

వసవాడు : (వాడు + వాడు) *ప.బం; అ.క్రి.* మిక్కిలి వాడు.
"మొగి విచ్చకుండే సిగ్గు మొలచి వసివాడదు
యిగిరించె నా వయసు యెటువలె దాఁతునె" 24-379

వసి : వి. ఆశ్రయం, ప్రాపు, కూచిగా చెక్కిన కొయ్య.
"వావాత నీ వనెటి వసి దవ్వి కైకొంటి
భూవిభుఁడు నీ వనెటి పురుషార్థము" 4-200

వసివాడు : (3) (వాడు + వాడు) *ప.బం; వి.* మిక్కిలి వాడిపోవుట.
"వత్తివలె మోవిమీఁది వసివాడు లేమిటికి
పొత్తుకు వచ్చి యాతనిఁబోదిసేయరాదా" 23-228

వసివాడుతనము : (వసివాడు + తనము) *ప.బం; వి.* మిక్కిలి వాడిపోయే లక్షణం.
"వసివాడుతనముల వలపెంతైనాఁ గద్దు
పసురువయసు తోడఁబదరదు గాని" 14-64

వసులమూట : (?)
"వసుల మూఁట మోవఁగఁ బడవేయఁగ
వసముగాని దెటువలె నౌనో" 1-180

వస్తి : (2) *క్రి.ప;* 'వచ్చితిని' అనడానికి వ్యావహారిక రూపం.
"పిలువఁగా వస్తి నింతే పెనఁగినఁదానఁగాను
కలియ లోనికిఁదీసి గడెవెట్టు వలెనా" 26-234

వహమానము : వి. చిన్నతనం. (శాంతి?) అహంకారం (?)
"వంచుకొనవలె నొండె వహమానమున నుంటే
కొంచక పంతములిచ్చి కూడవలెను" 17-248
"వడి నీచకృత్యంబు వహమాన మొదవించుఁ
జెంది వృద్ధత్వంబు శిథిలపఱచు" నీ.శ. 23

వహించు : (2) అ.క్రి. పట్టుబట్టు.
"బహుయోని కూపసంపదఁ దేలేవాఁడ నేను
వహించుక నావంటివానిఁదే నోపెనా"
"అమరఁగ నన్ను వహించుక
నా వళుకంతయుఁదీర్చఁగఁ దాఁగర్తా" 2-294

వహించుకొనేవాఁడు : వి. భరించుకునేవాడు.
"వహించుకొనేవాఁడు వద్ద నట్టే వుండేవాఁడు
విహరించ నా కిన్నిటా వెలసె తానె" 11-149

వహి : (3) వి. 1. విధం, రీతి 2. ప్రసిద్ధి. (3. పర్యాయం, లెక్కరాసే పుస్తకం)
"వహి దేవతాచక్రవర్తి బిరుదు నీకే
విహితము చక్రముచే వెలసేవు గాన" 2-142
"వహి ముత్తాతలా నీచే వరములు గొన్నవారు
మహి నిందులకె పోనీ మఱుఁగు చొచ్చితిని" 15-19

వహికెక్కు : (5) (వహికి + ఎక్కు) వాసికెక్కు, ప్రసిద్ధికెక్కు.

"ఇహమున గర్మ వహికెక్కితి నేను" 3-48
"వహికెక్క నేలినవాఁడెక్కడ నుండుమన్నా
తహతహఁ గొలువు కుత్తరువే బంటుకును"
4-47
"వహికెక్కు శ్రీవేంకటవల్లభుఁడితఁడే నన్ను
తహతహ దీరఁగూడె తగవరి అవుఁగదే"
11-149

వా

వాఁకపువలపు: వి. 'వాఁక'కు 'వాఁకము' అని రూపము కలదా? అట్లైన ప్రవహించు వలపు అను అర్థము కావచ్చును లేదా వాకమైన = వాటమైన వలపు అనియు కావచ్చును.
"ఏఁకారే యాపె నేల యేఁచేవు నీవు
వాఁకపువలపులెల్లా వంచీని నీకు" 13-245

వాఁకము: విణ. వాటము, జారుడుగా ఉండేది.
"వాఁకమైన జవ్వనపాయము
వచ్చెను మతితోఁ దలఁచుకొనవే" 28-57
"వూఁకొంటే దోసమా వొంటి సుద్దులు చెప్పఁగా
వాఁకపుగోళ్లు చిమ్మవద్దు గాక" 22-3

వాఁకసేయు: (?)
"యెంతవడైనాఁ గూడేవేమి నేరుచుకొంటివి
వంతవంటి సిగ్గేటికి వాఁకసేసేవు" 18-81

వాఁగు: అ.క్రి. 1. మోగు, ధ్వనించు 2. వదరు, పేలు.
"పొదలు పూదండ లవే పూఁచివాఁగే ఘంట
యెదుటఁ దిరువీథుల వేఁగీ సేవించరో" 3-501

వాఁటమగు: (3) అ.క్రి. అనుకూలమగు, వలనుపడు. ఇట అరసున్న విచార్యం.
"యిచ్చటఁ శ్రీవేంకటేశుఁడేలెఁ దానే
వచ్చెఁ బదివేలు వాఁటమాయనే" 14-38
"యీటుతోఁ బెండ్లాడితివి యిట్టెసేస వెట్టితివి
వాఁటమాయ వలపులు వద్ద నే నుందానను"
11-377

వాఁటి: (?)
"వాచవియిఁగాదు వాఁటి తీపు వోదు
ఆ చాయనే వున్న వందుకోనీవే" 14-38

వాఁడిమి: (వాఁడి + ఇమి) వి. వాడితనం, నైశిత్యం, తీక్ష్ణత, ప్రతాపం, పరాక్రమం.
"నేఁడు నీ శరణమనే నిశ్చయమిచ్చితిఁగాన
వాఁడిమి నన్నిటా నేఁ బావనమైతి నిదివో"
3-466

వాఁడిమీదవాఁడి: మిక్కిలివాడి.
"చెలువుఁడు వీఁడె చేకొను నేఁడె
వలరాజు తూపులివి వాఁడిమీఁద వాఁడి" 9-16

వాఁడులు: (2) వి; బహు. 'వాఁడి' శబ్దానికి బహువచనరూపం. చూ: వాండ్లు.
"జక్కవ చనుముక్కులు సరి వాఁడు లైతేను
వుక్కునఁ గాఁగిట నిన్ను నొత్తే ననేవు" 19-113

వాండ్లు[1]**:** (22) (వాఁడి + లు) 'వాఁడి' శబ్దానికి బహువచనరూపం. తీక్ష్ణతలు, పదునులు.
"మక్కువ మీ ఇద్దరికి మాటలే వాండ్లుగాని
లక్కవంటి పెంచి చూడలవి మీ మనసులు"
19-148
"కొనగోరివాండ్లు" 19-301
అన్నమయ్య వేండ్లు (వేఁడి శబ్ద బహువచనరూపం) అనికూడా వాడినాడు. రామకృష్ణుని ప్రయోగంలో కూడా ఈ రూపం కనిపిస్తుంది.

వాండ్లు[2]**:** 'వాఁడు' శబ్దానికి బహువచనరూపం. వారు.
"ఆడెడి బాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్ల నోర దుమ్ములు చల్లి" 2-167

వాండ్లెక్కు: (6) అ.క్రి. తీక్ష్ణతలు అధికమగు. ఇట వాఁడ్లు అనేది వాఁడి (= తీక్ష్ణత) శబ్దానికి బ.వ.రూపం.
"పాని నీపై మచ్చరము పండ్లఁ బెట్టుకుండితేను
మోనాన వాండ్లెక్కి నీ మోవిమీఁద నిండెను"
8-221

వాకట్టు: (వాయి + కట్టు) ప.బం; వి. వ్యతిరేకంగా మాట్లాడనీయకుండా పెట్టే మందు.

"కొంచక నా కొప్పులోన కురువేరు ముడిచితివి
వంచి నన్ను లోనుసేసే వాకట్టు గాబోలు దా"
17-383

వాకట్టుగట్టు : (2) ప.బం. దిగ్బంధం చేయు.
"మొనసి నీ కిది యేమి మొగసిరిమందు గద్దో
వనితలు నన్ను నవ్వ వాకట్టుగట్టితివి" 14-306

వాకట్టువాఁడు : వి. మూలికా మంత్రాదులచే దిగ్బంధం చేసేవాఁడు, నోట మాటలు రాకుండా చేసేవాడు.
"వంచిన కోవిల వాకట్టువాఁడట
ముంచి కోవిలలు మొఱసేనా" 19-360

వాకట్టేమంత్రము : వాగ్బంధనం చేసే మంత్రం, మాటలు రాకుండా చేసే మంత్రం, కనికట్టువిద్య.
"మొదలనే మాతోఁజెప్పిన మొక్కే మిదే నీకు
మదనుని నిటు వాకట్టే మంత్రంబిఁక నేదో"
17-354

వాకము : (3) వి. అనుకూలత, (?) పక్క, వాటము. (పీఠిక. 12)
"కైకొ నేలితివి శ్రీవేంకటేశ నన్ను
వాకముగా నాకు నిట్టే వలతువు గాక" 13-446

వాకిట గాచుకుండు : *ప.బం; అ.క్రి.* నిరీక్షించు.

వాకిటిగొల్ల : వి. వాకిట్లో ఉండే గొల్ల.
"వామనమూర్తికి వాకిటిగొల్లను
సోమార్కనేత్రుని సొరిది లెంకను" 1-446

వాకిటితంగెటి జున్ను : *వి; ప.బం.* మిక్కిలి అందుబాటులో నున్న వస్తువు.

వాకిలిగాచు : స.క్రి. రక్షించు.

వాకు : వి. నోరు.
"వాకులు దెరచి లోలో వావులు దెలుపుకోగా
ఆకడీకడ నుండి మిమ్మొఁగాదనవలదా" 27-93

వాకు : వి. మాట, శబ్దం.
"వాకుగా జలధి గట్టవచ్చు మాయ చూపవచ్చు
పైకొని నిన్నొకయింత పలికించరాదురా"
20-210

"యేకతాన నాపెతోనే యేమన్నా నందువు గాని
వాకునిష్ఠూరము లేల వద్దు వద్దు యీడను"
11-392

వాకుచ్చు : (5) 'వాక్రుచ్చు'కు రూపాంతరం. 1. వచించు, చెప్పు 2. పేర్కొను, పేరుచెప్పు, పలుకు.
"నీకంటే మునుపను నిన్ను నే రమ్మనఁగానే
వాకుచ్చి పలికేవు వలెరా యీ వలపు" 16-91

వాకులు పోకులు : *వి; బహు.* మాటలు - నడవడులు.
"యేకతాలు సమకూడె నియ్యకోళ్లే మనకు
వాకులు పోకులు నొక వావి గూడెను" 8-32

వాకైనవారు : *వి; బహు.* వాటమైనవారు, దిట్టమైనవారు.
"నీకేల ప్రియము చెప్ప నెలఁతల కెవ్వరికి
వాకైన వారే కానీ వనితలు" 27-174

వాగపుబిత్తరికాఁడు : చక్కని విలాసవంతుడు.
"వేగుదాఁకా జాగరాల వేసారితిమి
వాగపు బిత్తరికాఁడ వచ్చేవో రావో" 9-84

వాగము : (5) వి. 1. 'వాగై' తమిళం. మంచి నడత, సమృద్ధి మొదలైన అర్థములు గలవు. అట్లే వాగు అను పదము కూడ గలదు. అందమని అర్థము. ఇది తెలుగు బాగు. ఇంకను అర్థము విచారింపఁదగినది. అని సం.ప.స. (14 వా. 355 పు.) చూ : సం.ప.స. 23 సం.
"సోగకన్నులనుఁ జూచి సొలపుల మాటలాడి
వాగపుగొల్లెతలను వలపించేవు" 23-245
"వాగమై యెవ్వతె నీకు వచ్చినవేళ గుణమో
ఆగడపుమాటలకు నటు గురియైతివి" 27-110

వాగము : వి. వాగె.
"సోగల శ్రీవేంకటేశు సురతసింగారము
వాగమై యమరెఁగాన వన్నెలెల్ల నమరే" 9-90

వాగె : వి. గుఱ్ఱంనోటి కళ్లానికి తగిలించే పగ్గం.
"లోనుగా కెట్టు మాను లోలత నీ చేతలకు
దీనికే పురసతులు తేరి నీ వాగెకు" 27-250

వాచకపు మాటలు: *వి; బహు.* నోటి మాటలు.
"అందమై వాచకపు మాటలాడేవు సారె నాపె
పొందులంజదివించు నా పుస్తకములు నిన్ను"
17-125

వాడఁబారు: *అ.క్రి.* వాడజొచ్చు.
"చిత్తమెల్లా దక్కఁగొనె సిగ్గులు ముంగిటవేసె
వత్తివలె దేహమెల్లా వాడఁబారెను" 5-28

వాడమగువ: వి. వేశ్య.
"వోడఁ డెందరికినైనా వుత్తరువు చెప్పీని
వాడమగువల విందు వాని కేమె" 10-2-31

వాడలసతి: *ప.బం; వి.* కులట, జారిణి.
"వలపు లెల్లా రేఁచి వాడలసతులఁ జూపి
చలము పుట్టింతురా సతుల కింత" 17-344

వాడవనిత: (2) *ప.బం; వి.* జారిణి, కులట.
"వాడవనితలతోడి వంతులు మా కేటికె
యీడువెట్టుకొని దూరే దితనిఁగాకా" 9-275

వాడవారి మరది: *ప.బం; వి.* స్త్రీ లంపటుడు.
"వదినెంటాఁబిలిచేవు వద్దు సుమ్మీ యెవ్వరోయి
వదినెలు నీకు వాడవారి మరఁది" 5-322

వాడసతి: *ప.బం; వి.* జారిణి. చూ: వాడల సతి.
"వీడు దొరై విందువెట్టి వీడెము చేతికిచ్చె
వాడసతులకు నీవు వలచేవే యిఁకను" 29-212

వాడా లేదు పీడా లేదు : వాడలేదు ఏమీలేదు అనే అర్థంలో జంటపదం.
"వాడాలేదు పీడాలేదు వచ్చేవంటా నీ రాకకు
తోడనే యెదురుచూచే తొలఁగకిదే" 8-214

వాడిక: (2) పోషణము (సూ.ని.) చెప్పకుండా, చూపకుండా ఉంచిన నిధి, ఉపనిధి, తాకట్టు, పోషణం, వాడుక, వ్యవహారం, ఆచారం, (తె.వ్యు.కో.) సాధారణ ప్రసిద్ధి, పనుపడడం, ఉపయోగం, అభ్యాసం, అలవాటు, వ్యవహారం, (బ్రౌన్) చెప్పక చూపక ఉంచిన యిల్లడ, ఉపనిధి. (శ.ర.)
"యేడో వున్న శ్రీవేంకటేశుఁడే యింటికి వచ్చె
ఆడికో వాడికో అంగన నీకు" 8-1
"వాడికతో రమణుఁడు వచ్చితే రానీఁగదవే
వేడుకగా నేనే విన్నవించేఁగానీ" 24-301
"తోడఁదోడఁ బాదాలు తుడిచేవు పయ్యదను
వాడిక సేసుక యెంత వలపు చల్లేవే" 22-372
"వేడుకకత్తె యైనది వెక్కసాన నవ్వఁగాక
వాడికైన యిల్లాలికి వరుసా యిది" 12-323

వాడికె: (42) వి. 'వాడిక'కు రూపాం. చూ: వాడిక.
"వేడుకతో దగ్గరి శ్రీవేంకటేశ కూడితివి
వాడికెగా నిట్లనె వచ్చేవో రావో" 7-76
"వాడికె నొండొరులము వలచిన వలపులే
కోడి యెరుకలు సేసికొన వచ్చేరు" 18-14

వాడిన పైరుకు వాన వచ్చు: *ప.బం; అ.క్రి.* అవసరమైన సమయంలో అనుకూల్యం లభించు.
"యెడయ కిందుపై నీవు యేపాటి మాటలాడిన
వడి వాడిన పైరుకు వాన వచ్చినట్టు" 14-334

వాడివో: (వాడు + ఇవో) వాడు ఇదిగో > ఇవో అని అర్థం. ఇట్లే వీఁడివో అని కూడా ఉంది.
"వాడల వాడల వెంట వాఁడివో వాఁడివో
నీడనుండి చీర లమ్మే నేఁతబేహారి" 1-275

వాడు: వి. వాడుట.
"చెప్పఁజాలక వలపు సిగ్గువడీఁగాని చెలి
చొప్పున మొకము వాడు చూడరాదా" 27-362

వాడుదేరు(ఉ): *ప.బం; అ.క్రి.* 1.వాడు, మ్లానమగు 2.తేరుకొను .
"వాడుదేరఁ బూజించవలెఁ గమ్మపువ్వు లివె
వీడె మిదె కొలువుకు విచ్చేయవయ్యా" 3-484
"హత్తి కాఁగిలించుమంటా నానలేల పెట్టేవు
వత్తివలె నీ మోవి వాడుదేరీ నిపుడు" 20-492

వాతరొట్టు: (వాయి + రట్టు) వి. వాతరట్టుకు రూపాం. నోటి దురుసుతనం కలది, వదరుబోతు.
"కెలయుఁగీరంబు మిక్కిలి వాతరట్టు" అని చిన్నన్న పరమ. 8-278

వాతులుమోయు : *ప.బం; అ.క్రి.* (?)
"వాతులు మోవఁగ వలెనని వెదకిన
పూతల నిన్నియు భోగములే" 3-481

వాతెర : (వాయి + తెర) వి. పెదవి. వాయికి (= నోటికి) తెరలాగా ఉండేది.
"పలచనగు గోళ్ల నీ పగడవాతెర నొక్కి
చెలువమగు నునుగంటి సేయు టెన్నడురా"
5-54

వాదడుచు : (వాయి+తడుచు) *ప.బం; అ.క్రి.* వివాదపడు.
"వాదడుతుఁ జెలులతో వడి నీవు బొంకవని
నా దెస చూడకుండితే నమ్మకుండుదు" 2-37

వాదువాఁడు : (వాదు + వాఁడు) వాదులాడువాడు, నింద కలవాడు.
"యిల నిది నిందరికి నెగసక్కెమై తోఁచీ
వలవని అట్టుగాక వాదువాఁడా తాను" 22-68

వానగుంటలు : *వి; బహు.*
'ఓ(వా)మనగుంటలు'కు ఆనాడు వ్యవహారంలో ఉన్న రూపం కావచ్చు. గవ్వలను గాని, చింతగింజలు మొ॥ వాటిని గాని వేసి ఆడే రెండు వరుసలుగా ఏడేసిగుంటలు గల పీట. దాన్నిఉపయోగించి ఆడే ఆట.
"పైపై దొరతోటి పంతాలకు నేమి పని
ఆ పరాకై వానగుంట లాడుకొనేఁగాక" 7-247

వానగుంతలు : *వి; బహు.* వామనగుంటలు. చూ : వానగుంటలు.
"చివ్వన నీ వియ్యనంటే చేతవాసి చూపరాదా
తవ్వి వానగుంతలైనా తా నాడీఁగాని" 23-438

వానచేతకము : వి. వానకోసం ఎదురుచూచే చాతకపక్షి; చాతకము లనడానికి చేతకములనడం వ్యవహారాన్నిబట్టి కావచ్చు.
"వానచేతకములవలె నాయ మనసు
గోనెఁబట్టినబంక గుణమాయ మనసు" 1-337

వానపడ : వి. 'వానపడె'కు వికృతిరూపం. వాననీరు నిలిచే గుంట. (తె.వ్యు.కో.)
"నిధినిధానాలవలె నిచ్చ వానపడలను
సదమదమై నవ్వీని చతురత మెఱసి" 28-35

వాన లేని వరద : *ప.బం;* వి. కారణం లేకుండానే జరిగినది.
"చెలి నీ కడకు రాఁగా చెమటలఁ దొప్పదోఁగె
వలపులు వానలేని వర దాయను" 7-402

వాపాటము : (వాయి+పాటము) వి. కంఠపాఠం, నోటిపాఠం, అభ్యాసం, అలవాటు.
"కనుపట్టె మీ జాడలు కతలు వాపాట మాయ
తనిసితి విన్నిటాను తలపోఁత లేఁటికి" 16-451

వాపోటు : (వాయి+పోటు) వి. మాటలపోటు, మాటలదెబ్బ.
"ఒరిచితేఁ జుట్టరిక మొల్లకుంటేఁ జుట్టరిక
మీరసపు వాపోటు లీడ నేలే" 20-108

వాబలిమి : (వాయి + బలిమి) నోటిబలిమి.
"ఏ బాస కియ్యకొనేవే యిప్పుడు నీవు
వాబలిమి మాటల వాదు కోపఁగాని" 7-181

వామి : వి. గడ్డిమేట, గింజలు రాల్చిన గడ్డిమోపులతో వేసిన పెద్ద కుప్ప, వాము, ప్రోగు, రాశి.
"వలపుల పంటకెల్ల వామివైతివి" 21-274

వాము : వి. రూపాం. వామి. అన్నమయ్య 'వాములు' అనే శబ్దాన్ని అనేక పర్యాయాలు వాడినాడు. గడ్డి, చొప్ప మొ॥ వాటి ఎత్తైన కుప్ప అని వాచ్యార్థం. అధికం, మిక్కుటం అని లక్ష్యార్థం.

వాములకొలఁది : మిక్కిలి, అపరిమితం, అతిశయంగా. అన్నమయ్య అపరిమితం, అధికం అనే అర్థంలో ఎక్కువగా 'వాములకొలది' 'వాములగు' ఇత్యాది శబ్దాలను ప్రయోగించడం కనిపిస్తుంది. వాము (వామి) అంటే గడ్డిమోపులను ఒక్కచోట చేర్చిన పెద్దకుప్ప అని అర్థం. అడుకులు చక్కిలాలు ఆనవాలు నురుగులు వడపప్పు మొ॥.
"అడుకులు చక్కిలాలు ఆనవాలు నురుగులు
వడపప్పు మొదలుగా వాముల కొలఁదులు"
4-27

వాములగు : *అ.క్రి.* అధికమగు.

"వాములాయ వలపులు వడిఁబెట్ట కింకము " 2-19

వాయితప్పు: *ప.బం; అ.క్రి.* మాటతప్పు.
"ఆయమంటి మొదలనే ఆన వెట్టించుకోరాదా
వాయితప్పి యిప్పుడిఁక వాదులేఁటికే" 26-129

వాయిదము: వి. 'వాద్యము'నకు వికృతిరూపం.
"వాయిదాలు వాయించేరు వాకిటికి రాఁబోలు
యీ యింతిఁ జేపట్టినాఁడింతలో నట" 11-403

వాయిద్యము: వి. వాద్యమునకు వ్యావహారికరూపం. మద్దెల మొదలైనవి.
"ధరపై బ్రహ్మాదిదేవతలెల్లాను వచ్చి రదె
వరుసతో వాయిద్యాలు వాయించరొ" 25-432

వాయెత్తు: *ప.బం; అ.క్రి.* గొంతెత్తు.
"చేయెత్తి మొక్కితి నిన్నుఁ జెనకిక చేఁతలకు
వాయెత్తి పాడితి నీతో వాదుదీరను" 27-246

వారకము: వి. లేనప్పుడు ఇతరులకు వాడుకోవడానికి ఇచ్చి ఉన్నపుడు మళ్లీ తీసుకునే ధనాదికం, తాకట్టు. (తె.వ్యు.కో.) సమానత్వం; పరకీయ శబ్దభవం. ఓరిగే, వారిగె అనునవి కన్నడమున ఈ యర్థమునందు గలవు అని సం.ప.స. (13 సం. 7 పు.)
"వారకానఁ బ్రహ్లాదవరదుఁడు మరుముద్ర
లూరట సొమ్ములు గాఁగ నుంచీ
నరసింహుఁడు" 13-204

వారచేడె: వి. వేశ్య, వారకాంత. వింత సమాసం.
"ఆడేనంటా వచ్చె నారగించలే దింకా
వాడ వారచేడెలాల వనజాక్షుఁ జూపరో" 22-139

వారధి: వి. వంతెన.
"వల్లెగాఁ గొండలచేత వారిధిగట్టుట యెంచ
ఇల్లిదె నాకొరకుఁగా నింత సేసితివిగా " 24-128

వారపట్టు: ఓరపట్టు శబ్దం కావచ్చుననీ, ఒకమూల స్వాధీనం చేసుకొను అని అర్థం కావచ్చుననీ పరిష్కర్తల ఊహ. (సం.ప.స. 16 సం. 431 పు.) 1.కుండకు చేతి నానించి ధారగా కింద పడుతుండగా పొడవుగా పోయు. 2.దేవతా విగ్రహాదులకు ముందు భక్తిసూచకంగా ధారగా నీళ్లువదలు, ఆపోశించు.
"వారము వర్జము లేదు వంచుక పాలు వెన్నలు
వారవట్టి యారగించీ వాఁడే వాఁడే కదవే" 16-180
"నీరువట్టుగొని భూమి నీళ్లెల్లా వారవట్టి
కేరి కేరి నగవయ్యా కృష్ణభట్లూ" 2-70

వారబియ్యమెత్తు: *ప.బం; అ.క్రి.* భిక్షాటనం చేయు. (పద.)
"సూరిభట్లొక వంక చొరని చోట్లు చొచ్చి
వారబియ్యమెత్తి యెత్తి వడదాఁకి" 2-70

వారమిచ్చు: *ప.బం; అ.క్రి.* భిక్షమిచ్చు.
"మంతనాన నుండి తమకింతు నీ రాకను
బంతికూటివేళ నీకు వారమిత్తును" 12-281

వారము వజ్జమనక: *ప.బం.* శుభాశుభ సమయము లాలోచించక, ఇష్టం వచ్చిన సమయంలో.
"వారము వజ్జమనక వాకిట నన్ను నాగేవు
పోరచి మావారు నీకుఁ బోకవెట్టిరా" 10-2-38

వారము-వర్జము లేదు: శుభాశుభ సమయాల పట్టింపులేదు.
"వారము వర్జము లేదు వంచుక పాలు వెన్నలు
వారవట్టి యారగించీ వాఁడేవాఁడే కదవే" 16-180

వారముసేయు: (వారము+చేయు) *ప.బం; అ.క్రి.* ఒక్కొక్క రోజు ఒక్కొక్కరింట్లో భోజనం చేయు.
"వారముసేసే మనుచు వడి నింటివారమెల్లా
కూరలు పాశాలు దొంతి గూడఁబెట్టితే" 2-165

వారలుపట్టు: *ప.బం.* చూ: వారవట్టు.
"పట్టరో వారలు పాలునేతికిని
గట్టిగ జోరునఁ గారీ నవిగో" 29-37

వారవట్టు: (8) *ప.బం.* ఓరపట్టు శబ్దమేనా? ఒకమూల స్వాధీనము చేసుకొని అని అర్థముండవచ్చును. (సం.ప.స. 16 సం.) 1. కుండకు చేతి నానించి ధారగా కింద

పడుతుండగా పొడవుగా పోయు. 2. దేవతా విగ్రహాదులకు ముందు భక్తిసూచకంగా ధారగా నీళ్ళు వదలు, ఆచమించు, ఆపోశించు, తాగు. కొలుచు అని పద.

"పాలు పెరుగు వారవట్టీ గోవిందుఁడు
సోలిఁ గొనేటి యీ చుట్టులను"
22-537 & 8-131

వాలాయము: (3) వి. అవశ్యం, అనివార్యం, నిరంతరం.

వాలాయించు: (3) నిర్బంధపడు.

"ఏలే పొగిలేవే యిప్పు డింతిరో నీవు
వాలాయించి నీ విభుఁడు వచ్చి కూడీఁగాక"
18-130

"ఏల మమ్ము నేఁడు కొనే వెంత అట్టుసేసేవు
వాలాయించి నీ చేతిలోవార మింతే నేము"
18-211

వాలిక: విణ. 1. మనోజ్ఞం 2. మృదువు 3. దీర్ఘం.

"వాలికమోము వంచి వనిత నీకు మొక్కఁగా
కేలనొత్తి నీ విట్టే కౌఁగిట నించేవూ" 12-411

వాలుక: విణ. దీర్ఘమైన, వాడియైన.

"వాలుకచూపులు వసమై యాకెకు
కేలు చాఁచి తమకించేవు" 25-408

వాలుమగంటిమి: వి. శూరత్వం.

"ఆలికై విల్లువిఱిచి వాలికై యమ్ము వేసిన
వాలుమగఁటిమి గలవాఁడా వీఁడు" 2-226

వావాత: (27) ప.బం; క్రి.విణ. సోరార, (పద.) చేసేత వంటిది.

"వావాత శ్రీవేంకటాద్రి వరములిచ్చీఁ గనక
యేవల దాతలలోన నితఁడే దొడ్డ"
3-411 & 24-200

"శ్రీవేంకటేశుఁడే చిత్తగించి నన్నేలెఁగా
వావాత నింద్రియాలు వళకాడీనా" 3-417

వాచికమైన కైంకర్యంతో అని లక్ష్మణయ్య గారు. (అ.సం; 360 పు. 4-200 సం.)

"వావాత నీ వనేటి వసి దవ్వె కైకొంటి
భూవిభుఁడ నీ వనేటి పురుషార్థము"

వావాతమచ్చికలు: వి. (?)

"కావరపు వలపు లొడిఁగట్టుకుండినవెనక
వావాత మచ్చికలు వదలఁదగునటవే" 28-54

వావాతలు: వి; బహు. మిక్కిలి వ్రాతలు.

"చేఁతలెన్నైనా గలవు చిక్కించుక చెనకితే
వావాత లెన్నైనాఁ గలవు వ్రాసేనంటే" 29-331

వావాతిమాటలు: (?)

"జీవునికి దండె వేసినవాఁడవు నీవు
వావాతిమాటలే నీపై వన్నెపదాలు" 3-467

వావాదము: (వాదము + వాదము) మిక్కిలి వాదము.

"రచ్చల నీఁగక యున్న రతుల వీఁగేవు గాక
వచ్చి వచ్చి నీతోడ వావాదమా" 21-503

వావాదు: వి. ఉపన్యాసం, వాఙ్ముఖం. (వ్యు.)

"నీ వేమి సేతువు నన్ను నీవు
మోహించుమంటివా
వావాదు నెంచేది నా వలపింతే కాక" 12-193

వావిదిష్టము: (?)

"దేవుల వయితివి వావిదిష్టము లాయఁగదవే
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరి కూడినాఁడు"
28-361

వావిలి: విణ. వావిరి కావచ్చు. 1. ఉత్కృష్టం, గొప్పది 2.అత్యంతం. (3. వెన్నంటిన 4. ధూర్తుడు)

"నీవే ఆతఁడు గావా నేటిదాఁకా
వావిలి నాతనిలోని వలపు చేకొనవే" 27-202

వావిలిపాటి రామచంద్రుఁడు: వి. చిత్తూరు జిల్లా మదనపల్లి తాలూకాకు చెందిన వాయిల్పాడు గ్రామంలో వెలసిన శ్రీరామచంద్రుడు. వాయిల్పాడుగ్రామమే వావిలిపాడుగా పేర్కొనబడింది. అన్నమయ్య వావిలిపాటి రామచంద్రుని పది - పన్నెండుచోట్ల పేర్కొన్నాడు.

"రావయ్య వావిలిపాటి రామచంద్ర
రావాడి వలపులు రామచంద్ర" 10-2-67

వావిలిపాడు: చిత్తూరుజిల్లా లోని మండల

కేంద్రమైన వాయిల్పాడు. శ్రీరామచంద్రుడు వెలసిన గ్రామం.
"ఉంకువ వావిలిపాటనుండి శ్రీవేంకటగిరి
తెంకుల నిన్ను గూడి తిరుమాయ నమ్మా"
26-40 & 1-178

వావివర్తన: *ప.బం.* సరి అయిన నడవడి అనే అర్థంలో జంటపదం.
"కోవిదు శ్రీవేంకటేశుఁగొలిచి పెద్దల కృప
వావివర్తన గలవాఁడు వో వైష్ణవుఁడు" 1-59

వావివర్తనది: సరియైన నడతగలది, వావివరుస గలది.
"కావరించి తిట్టేది గయ్యాళి యొకతెగాని
వావివర్తనది యైతే వచ్చి మొక్కును" 26-589

వాసంతిక: *వి.* అడవిమొల్ల, పువ్వుల గురివెంద, బట్టకడిమి.
"వలనగు తావుల వాసంతికలలోన
కెలకుల నరమోడ్పుఁ గెందామరలయందు"
5-177

వాసి: *వి.* 1. ఆధిక్యం 2. లాభం 3. ప్రసిద్ధి 4. పరిమితి 5.తారతమ్యం 6. భేదం 7. ఔన్నత్యం, బాగు .
"వాసికిఁ బెనఁగఁబోతే వడిఁబడుఁజేసునిఁక
నా సరివారెల్లాఁజూడ నవ్వినంతే చాలును"
19-385

వాసికత్తె: (9) (వాసి + కత్తె) వి. పేరుపొందిన స్త్రీ. (తె.వ్యు.కో.)
"మచ్చరపు సవతుల మట్టుపెట్టుట మంచిది
యెచ్చిన వాసికత్తెల నేలుట కీర్తి" 24-282

వాసికాఁడు: (వాసి + కాఁడు) వి. పేరుపొందినవాడు, ఉన్నతుడు.
"తగిలి నేఁ దడవితేఁ దడవఁగ వలెఁగాక
మిగుల వాసికానికి మేర మీరఁ జెల్లునా" 19-395

వాసితనము: (వాసి + తనము) వి. గొప్పతనం, ఘనత, యుక్తత, ఔచిత్యం.
"వాసితనంబున వంచిన శిరసున
సేసలువెట్టేఁ జెనకవయ్యా" 25-348

వాసిదప్పు: *అ.క్రి.* పేరుపోవు.

వాసిపట్టు: (2) ప్రసిద్ధికెక్కుట.
"పురుషుఁడైతే నేమి పొలఁతి యైతేనేమి
వరుస నొకటే కాదా వాసిపట్లు" 21-311

వాసివంతు(లు): *ప.బం; వి; బహు.* వన్నె-వాసి.
"వాసివంతు విడిచినవాఁడే యోగి ; యీ
ఆసలెల్లా విడిచిన అతఁడే యోగి" 1-167

వాసివట్టము: *ప.బం; వి.* హెచ్చుతగ్గులు, లోపము.
"వాసివట్టముకొరకు వదలిదినములచేతఁ
బాసిపోయిన వెనక పర మేడ పరము" 4-1-25

వాసివట్టు: *అ.క్రి.* అభిమానం చూపు.
"నీఁటునఁ బ్రాణవిభుఁడ నీ వేమి సేసినా
వాఁటమై మొక్కుదుఁగాక వాసివట్టేనా" 11-213

వాసివన్నె(లు): *ప.బం; వి; బహు.* గొప్పతనాలు అనే అర్థంలో జంటపదం.
"వేడుకతో నీ వెన్నివిధముల రక్షించినా
వాడికతో మెత్తురు వాసివన్నె లెల్లాను" 12-73

వాసివాఁడు: (వాసి+వాఁడు) ప్రసిద్ధి గలవాడు, అందగాడు.
"యీయెడ నన్నుఁ గూడితి వింత వాసివాఁడవు
చాయల శ్రీవేంకటేశ చన్ను లంటఁజెల్లునా"
21-366

వాసీవంతు: వన్నె-వాసి.
"చేసినట్టె సేసుఁగాక చింత మాకేలా
వాసీ వంతూ నతనిదే వట్టి జాలి యేలా" 3-91

వాసులు: (6) *వి.* తారతమ్యములు, ఆధిక్యములు, లాభములు, పరిమితులు.
"వారి వీరిఁ జూపకు వాసులు వుట్టించకు
కోరికతో నున్నదాన గుట్టుసేసి నేను" 25-344
"వాసులకు నీతోను వాదులడువఁగ రాదు"
25-475

వాసులువంతులు: (8) *ప.బం; వి; బహు.* వన్నెవాసులు.
"చేసినట్టెల్లా నీకుఁ జెల్లెఁగాక
వాసులు వంతులుఁ బట్టి వద్దనేమా నిన్నును"
25-80

వాసులువట్టు: (వాసులు + పట్టు) ప్రసిద్ధికెక్కు.
"అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
వడి నన్నుగూడితివి వాసులు వట్టుదునా"
11-590

వాహనసుపర్ణుఁడు: వి. సుపర్ణవాహనుడు, గరుడవాహనుడు, విష్ణుమూర్తి.
"పూర్ణుఁడు నీలమేఘవర్ణుఁడు
దానమున విస్తీర్ణుఁడు వాహనసుకర్ణుఁడు"
2-208

వాహ్యాళి: వి. స్వారీ.

వి

వింగడము: *విణ.* 1. సుందరం 2. విశాలం 3. విస్తృతం.
"వింగడమై నాకు నబ్బె వేంకటేశుమంత్రము"
4-438

వింతతనము: (వింత + తనము) వి. భేదం, అన్యత్వం.
"వీడని చుట్టరికము వింతతన మెంచదు
వేడుక యెదిరివల్ల వెరవెంచదు" 26-380

వింతవాఁడు: (వింత + వాఁడు) అన్యుడు, పరుడు, కొత్తవాడు.
"వింతవాఁడా తా నేమి వేమరుఁజెప్పించుకొన
బంతినే తరితీపులు పచరించవలెనా" 7-234

విందుపొత్తు: వి. బంధుత్వపు పొత్తు, విందుభోజనం లోని పొత్తు.
"ముందు నా యెంగిలి మోవి మాటాడితివనీ
విందుపొత్తులు గలసి వెలయమా తొల్లి"
12-364

విందువేడుకకాఁడు: వి. (?)
"విందువేడుకకానికి వెసలఁ బెట్టినకత
యిందులోనే నెరపనేల యింటికి రారాదా"
25-378

వికల్పవాది: వి. ఏ పక్షాన్నీ గట్టిగా సమర్థిస్తూ వాదించనివాడు.
"అయ్యో వికల్పవాదులంతటా సిగ్గువడరు
యియ్యెడ నెట్టు గలిగె నీ యసురమతము"
3-52

వికవికలు: వి. 1.నవ్వటంలోని ధ్వనికి అనుకరణపదం (2.చెల్లాచెదరు కావడంలోని ధ్వనికి అనుకరణం 3.తెగటంలో అయ్యే ధ్వనికి అనుకరణం.)
"యెన్నరాని వేడుకల కింపులు పుట్టించీ నిదె
వెన్నెలనవ్వుల నీ వికవికలు" 22-490

విగడము: వి. వికటము అన్న పదానికి వ్యావహారికరూపం, విపరీతము.
"చాలుకొన్న జంకెనల జగడాలు మీ
వేలికొన గోళ్లలో విగడాలు" 7-296

విచ్చనవిడము: వి. విచ్చనవిడి, విచ్చలవిడి.
"అచ్చముగాను సరసమాడితేను తనలోన
విచ్చనవిడము గాని వెగటు దోఁచదు" 14-570

విచ్చనవిడి: (73) *వి; ప.బం.* విచ్చలవిడి. (వ్య.) అన్నమయ్య అంతటా 'విచ్చనవిడి' యనే రూపాన్నే ప్రయోగించినాడు. 'విచ్చలవిడి' అనే పదం కనిపించదు.
"కుచ్చి శ్రీవేంకటాద్రిపైఁ గూడితివి నన్ను
విచ్చనవిడాయ నిఁక విట్ఠలేశ్వరా!" 18-216

విచ్చనవిడికాఁడు: (విచ్చనవిడి+కాఁడు) వి. విచ్చలవిడితనం కలవాడు, స్వేచ్ఛాప్రవృత్తి కలవాడు.
"ఇచ్చట నన్నుఁ గూడితి విరుమొనసూదివైతి
విచ్చనవిడికాఁడవు వెరపేల యిఁకను" 7-457

విచ్చనవీడి: విచ్చలవిడి.
"నిచ్చలు రతివేళ నేరుపు మరతురా
విచ్చనవీడైన చోట వేగుదురా" 18-110
"ఇచ్చిన కాఁగిళ్లగురి యిద్దరి తమకములు
విచ్చనవీళ్లకు గురి వింతరతులు" 8-64

విచ్చిచెప్పు : స.క్రి. విపులీకరించి చెప్పు.
"విచ్చి చెప్పఁగాని తన వింత చక్కఁదనమెల్ల
పచ్చి నా చూపులలోనే పదరనేలే" 18-79

విజనగరము : (4) వి. 'విజయనగరము'నకు వ్యావహారికరూపం.
"వేడుకకాఁడు గదమ్మ విజనగరములోన
వేడెవెట్టీ సతులను వెన్నముద్దకృష్ణుఁడు"
14-294

విజయనగరపు వుగ్రహనుమంతుఁడు : హంపీ విజయనగరంలో నెలకొన్న ఉగ్రహనుమంతుడు.
"పట్టపు శ్రీవేంకటేశుబంటయి ప్రతాపమెల్ల
వొట్టీ విజయనగరపు వుగ్రహనుమంతుఁడు"
4-85

విటకత్తె : (విట+కత్తె) వి. విటురాలు, విటి, విటుకులాఁడి, కులుకులాఁడి, వలపుకత్తె.
"జాడతోనే అడపముసతుల వెదకఁగాను
వీడెము నీ విచ్చేవు విటకత్తెవమ్మా" 12-160

విటకుక్కితనము : విటుల యొక్క సంకుచితమైన లేక నీచమైన భావము కావచ్చునని సంపాదకులు. (f.n. 172 పు.)
"ఇటువంటి సుద్దులకు యెరిది సాకిరై వచ్చు
విటకుక్కితనా లెల్ల వెరగంది చూతము" 27-254

విటతనము : (5) (విట + తనము) వి. విటత్వం, జారత్వం. కేవలసంస్కృతశబ్దంపై 'తన' ప్రత్యయం రావడం విలక్షణం.
"విటతనములవాని వేమారుఁ గొసరరాదు
చిటుకురంటే సేవసేయవలెఁ గాని" 23-182

విటరాయఁడు : వి. విటశ్రేష్ఠుఁడు.
"విటరాయఁడవు శ్రీవేంకటనాథ నీ కూటమి
ఘటియించ వేడుక మిక్కుటమాయఁ
గృష్ణమ్మా" 10-2-84

విటరాయతనము : (విట + రాయ + తనము) వి. విటశ్రేష్ఠుని లక్షణం.
"భావింప నెవ్వరికైనా పక్క నున్నట్టున్నాఁడవు
తావగు నీ విటరాయతన మెట్టిదో" 12-90

విటుకులాఁడి : వి. మిటుకులాడికి రూపాం. విటురాలు, కులుకులాడి.
"వింత వింతవలపుల విటుకులాఁడి
యింత యెమ్మెలు చూపీ నకేమౌనయ్యా"
23-65

"విటుకులాడిని బిగికౌగిట చేర్చి
మేటౌ చాకటు లిచ్చినాడట" అని సారంగపాణి. శృంగార. 63

విట్టలరాయఁడు : వి. చూ : హంపీలోని విఠ్ఠలేశుఁడు, విఠ్ఠలేశుడు.
"ఇట్టి సింగారము సేయ నింత నీకుఁ
బ్రియమాయ
వెట్టి నీ చేఁతల మాయ విట్టలరాయ" 5-96

విఠ్ఠలము : వి. విఠ్ఠలుడు వేంచేసివున్న హంపీ క్షేత్రం.
"అనయము శ్రీవేంకటాద్రిదేవుని బంటు
వెనుబలమై యుంటాడు విఠ్ఠలములోను"
3-301

విఠ్ఠలుఁడు : వి. చూ : విఠ్ఠలరాయడు. 17-289

విఠ్ఠలేశుఁడు : వి. బళ్లారిజిల్లా హోస్పేటతాలూకా తుంగభద్రా నదీతీరంలోని హంపీక్షేత్రంలో గల విఠ్ఠలేశ్వరస్వామి. అన్నమయ్య పండరిపురం (మహారాష్ట్రం) లో గల విఠ్ఠలేశ్వరుని, హంపిక్షేత్రంలోని విఠ్ఠలేశ్వరునికి అభేదం కల్పించి కీర్తన రచించినాడు.
"వెన్నలు సెలవిఁగారే విఠ్ఠలేశా
నన్నుఁ జూచి నవ్వేవు విఠ్ఠలేశా" 11-127
"యిల్లిదె శ్రీవేంకటేశుఁడితఁడె తానై వుండి
యెల్లగాఁ గోనేట వరాలిచ్చె విఠ్ఠలేశుఁడు"
14-590

విడిదల : వి. విడిది చేసే చోటు.
"వెస దెరువరి తమి విడిదలపై నున్నట్టు
వసియించవలదా శ్రీవల్లభుమీఁదటను" 15-46
"మెడఁగట్టినట్టున్నది మెలఁగీ నురులది
విడువక యెల్లప్పుడూ విడిదలైన దేహము"
3-216

విడిదిల్లు : (విడిది + ఇల్లు) వి. విడిది చేసే ఇల్లు .
"బలిమిసేసి నా చేతఁబడి తలంపించితేను
వెలలేని నీ కాఁగిలి విడిదిల్లు గాదా" 25-451

విడిపరి : 'విడుపరి'కి రూపాం. త్యాగశీలుడు.
"కలలోపలి సంభోగము ఘనమగు సంపదలన్నియు
వలలోపలి విడిపరులు వన్నెల విభవములు"
2-133

విడిముడి : వి. ధనం.
"అడుగనేఁటికి మమ్ము ఆపె నిట్టె కరుణించు
విడిముడిగా నీఁక విచ్చి చెప్పవలెనా" 25-97

విడుగర యగు : విడుదలయగు , విమోచనమగు , విడుగడయగు .
"పడిన మీ బాధలెల్ల ప్రజలాల యిప్పు డిట్టె
విడుగరాయ మీరు వెరవకుఁడీఁకను" 10-1-32

విడుజోడువాఁడు : వి. విడిచిపెట్టే స్నేహితుడు . (వ్యు.)
"విన్నవించేవాఁడనా విడుజోడువాఁడనా
అన్నిటా శరణు చొచ్చినట్టి జీవికి" 2-492

విడుముడి : వి. విడుదల కావచ్చు.
"సటలోభపు సంసారము చొచ్చితి
ఘటన విడుముడీఁకఁ గలిగీనా" 4-69

విడువకైతే : విడువకుంటే, విడువకపోతే.
"వడి మా విడేలకే(ల?) వరుసఁ జేయి చాఁచేవు
విడువకైతే కారాలు వేగినంతా వలెనా" 7-514

విణ్ణాపఁజివారు : విణ్ణప్పం సెయివార్ అనే అరవపదానికి సంగ్రహరూపం కావచ్చు. స్తోత్రపాఠకులు.
"వరుసతో విణ్ణాపఁజివారు తాళము లొత్తుచు
పోరిఁబొరి ద్రావిడానఁ బొగడఁగాను" 18-281

విత : వి. 'వితా'కు రూపాం. వ్యర్థమని అర్థం.
"యితరు లేమీ నెఱుఁగ రిద్దరును నవ్వుకోఁగా
వితగాని మీ పనులు వెల్లవిరులాయను" 8-19

విత్తరాలు : (4) వి. శ.ర., బ్రౌన్, వ్యు.కో. ల్లో ఈ పదం లేదు. సూ.ని. లో 'విత్తు' అనే పదం ఉంది. దానికి జ్ఞానం, తెలివి అని అర్థం. ఈ పదం ఉన్న కీర్తనలో జవరాలు, చదురాలు, ఘనురాలు అనే పదాలుకూడా ప్రయోగింపబడ్డాయి. కనుక ఇట విత్తరాలు అనగా తెలిసినది అని అర్థమేమో అని ఆనందమూర్తిగారు వివరించినారు. ఐతే జ్ఞానార్థకమైన విత్ శబ్దంనుండి ఈ రూపం ఏర్పడిందన్నమాట. అప్పుడు 'తర' అనే ప్రత్యయం ఎలా వస్తుంది? అది విశేషణాలపైనే రావాలికదా! అనే సందేహం రావచ్చు. కనుక ఇట 'తెలిసినది' అనే అర్థంకల విత్ (జ్ఞానవిత్, అర్థవిత్ మొ॥) అనే శబ్దం విశేషణం కనుక దానిపై అతిశయార్థంలో 'తరప్' ప్రత్యయం వచ్చి 'విత్తర' అని ఔతుంది అని చెప్పితే ఉచితంగా ఉంటుందేమో! బాగా 'తెలిసిన' అనే అర్థం వస్తుంది. దానిపై ఆలు శబ్దం చేరిస్తే విత్తరాలు అనే రూపం ఏర్పడుతుంది. బాగా తెలిసిన స్త్రీ అని అర్థం. సం.ప.స. లో ఈ పదం 'బిత్తరాలు' కు రూపాంతరంగా ఊహించబడింది. 'బిత్తరాలు'కు రూపాం. బిత్తరము = విలాసము. అది కలది బిత్తరాలు.
"యిప్పుడే శ్రీవేంకటేశ యెనసి నిన్ను గుట్టున
విప్పుచు రట్టుసేసునా విత్తరాలు" 7-454
"వినయపు బిత్తరాలు వేడుకతో గొలువుసేయఁ
బెనఁగీ వద్దఁ గూచుండఁబెట్టుకోరాదా" 22-323
"ఆసతో శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁగూడె నంటా
వేసాలు సేసే వెంత విత్తరాలవే" 22-417
బిత్తరము కులుకు బెడఁగు బెళుకు
హొయలనఁగ విలాసమొప్పు చుండు"
(ఆం.భా. 1-139)
"వాడికమాటల నిన్ను వలపులు రేఁచిరేఁచి
వేడుకలు గాదెఁబోసీ విత్తరాలు" 23-31

విత్తుకొను : విత్తనాలు చల్లు.
"చిలుకపలుకు లెల్లాఁ జేన విత్తుకొంటివటే
వొలికేవు పెదవుల నొకటొకటే" 7-322

విత్తుమీఁదటి పొల్లు : ప.*బం*; వి. అస్థిరం, సారం లేనిది.
"వత్తిలోపలినూనెవంటిది జీవనము

విత్తుమీఁదటి పొల్లువిధము దేహంబు" 1-328

విదరవెల్లిది : (విదరవెల్లి + అది) వి. ఈ పదాన్ని గూర్చి అధః సూచికలో ఈ విధంగా ఉంది. వేదురువెల్లి, వేదురు శబ్దము వ్యావహారికముగ 'వేదర' కాగా 'వే' కు బదులు 'వి' లేఖక ప్రమాదమేమో!. విదురువెల్లి = పిచ్చి పొంగిన (దానవా) అని కావచ్చు. దీనిని బట్టి పిచ్చి పొంగినది అనే అర్థాన్ని భావించవచ్చు. చూ : వీదరవెల్లితనము.

"గరిమతో వీడెమిచ్చి కడు నుబ్బు రేఁచేవు

తరితీపుతోడి విదరవెల్లిదాననా?" 24-269

విద్యముల యాట : వి. ఇంద్రజాలపు ఆట, విద్దెలాట. 'విద్యము' విలక్షణమైన రూపం.

"విడివిడి చేతులతో విద్యముల యాటవాఁడు

అడవిఁగాచేటి గంగ్యావులవాఁడు" 24-112

విద్యముల యాటవాఁడు : వి. విద్యము రూపము చింత్యము అని సంపా. కాని 'విద్దెము' అనే పదం బాలక్రీడా విశేషమనే అర్థంలో ఉంది. విద్యము అనే దానిని 'విద్దెము'నకు ప్రకృతిగా గ్రహించినచో దీనికి అదే అర్థము చెప్పవచ్చును. అప్పుడు ఒకానొక బాలక్రీడా విశేషము నాడువాడనే అర్థం చెప్పవచ్చు.

"విడివిడి చేతులతో విద్యముల యాటవాఁడు

అడవిఁగాచేటి గంగ్యావులవాఁడు" 24-112

విద్యలాడు : (విద్యలు + ఆడు) గారడీవిద్యలు చేయు, ప్రగల్భాలు పలుకు, స్వోత్కర్ష చెప్పుకొను, దంభోక్తులాడు, వ్యంగ్యార్థం వచ్చేట్లు మాట్లాడు.

"ఘటనఁ బరకాంతను కన్నులెదుట నిలిపి

విటునిచందాన నేఁడు విద్యలాడించేవు" 19-191

విద్రూపుఁడు : వి. ఇది విరూపుడు కావచ్చు.

"ఘోర కుడువఁగఁ ద్రిశంకుని నంత్యజునిఁ జేసె

వీరుఁడగు నలుఁబట్టి విద్రూపుఁజేసె" 1-134

వినపము : వి. 'విన్నపము'నకు రూపాం.

"వినఁగానే వినపాలు వేమారుఁ జేసితిఁగాక

యెనసి నిన్ను నేమించ నెంతదానను" 23-111

వినయాలు : వి; బహు. భక్ష్యవిశేషం కావచ్చు.

"కరజపు వినయాలు కాఁగిటి బువ్వాలు

సిరులతో విందువెట్టీ శ్రీసతి నీకు" 8-166

వినయాలుసేయు : అ.క్రి. వినయంగా ప్రవర్తించు.

"వినయాలు సేసేవు వేంకటేశుఁడ

వెనువెంటఁ బాయక వేంకటేశుఁడ" 28-494

వినయివాఁడు : (వినయి + వాఁడు) వి. వినయవంతుడు. 'వినయి' అంటేనే వినయవంతుడని అర్థం.

"ముంపునే గరివినైనా మొదల వినయివాఁడు

పెంపునఁ దానె వచ్చీఁ బిల్వరె వాని" 11-188

వినికి : వి. శ్రుతి, వేదం.

"వినుకుల కొననెల్లా విష్ణుఁడొక్కఁడే" 3-380

వినిచెవుడు : వి. చెవులు ఉండీ కూడా వినలేకపోవడం.

"కనిగుడ్డును నదె వినిచెవుడును నదె

ననిచె జగత్తు నడచీ నదివో" 3-185

వినుకలిచదువులు : (2) వి. వేదములు, శ్రుతులు. వినికిడితోనే వచ్చిన విద్యలు అని వ్యుత్పత్తి.

"వినుకలిచదువుల సదలో వేమరు మూఁగఁగఁ బెట్టిన

ఘనకర్మపుటొగ రుడుగదు కమ్మర పులిగాయై" 1-482

వినుకుల కొన : వి. ఉపనిషత్తు. (శ్రుతుల అంతం)

"విని యాలకించినాను వినకట్టె మానినాను

వినుకుల కొననెల్లా విష్ణుడొక్కఁడే" 3-380

వినుకొను : (విను + కొను) విను, వినుధాతువుపై 'కొను' అనుబంధంగా చేరడం విలక్షణం.

"గుఱుతులు వినుకొన్నాఁ గూటములు పెనగొను

యెఱుఁగుదుఁ దన నేమ మెంతని చెప్పీనే" 12-354

వినేది : వి. వినడం.

"వేడుకతో నీ మాటలు వినేదే మేలు గాక

జోడుగూడ నందుఁగొంత సోధించనేలా" 7-178

వినోదకత్తె: (వినోదము+కత్తె) క్రీడాదుల చేత పొద్దుపుచ్చే లక్షణం కల స్త్రీ.

"అంతె కాదా వుప్పు వేసి అట్టె పొత్తు గలసేవు
వింతలాయ నీవు నొక వినోదకత్తెవు" 14-496

వినోదకాఁడు: (3) (వినోదము + కాఁడు) వేడుక కలవాడు.

"అతిరాజసపువాఁడు అన్నిటా వినోదకాఁడు
కతలు చెప్ప నన్నెంత గారవించీనే" 28-561

విన్నకన్నందుకు: (విన్న + కన్న + అందుకు) విన్నందుకు, కన్నందుకు.

"కన్నందుకుఁ బట్టే వెట్టివంటిదాననా
సన్నల నీ పని సేసే జవరాలఁగాక" 20-559

విన్నకన్నది: (విన్న + కన్న + అది) విన్నది-కన్నది.

"సన్నిధిని మిమ్ము నుతియించి సరుస జిహ్వయుఁ దనియదు
విన్నకన్నది గాదు ఇది నా వెలితో నీ వెలితో" 2-375

విన్నవినుకులు: చెప్పుడుమాటలు. 2-253

విప్రవినోది: వి. కనుకట్టు చేసేవాడు, గారడివాడు, అసాధారణమేధావి. (తె.తె.ని.)

"అంచెల విప్రవినోదై తిరిగేటివాఁడు
కంచుమించైతిరి గాడీఁ గానరటే మీరు" 24-112

వియ్యపువిందు: వి. చుట్టాలకు సంబంధించిన విందు. 15-273 old

విరజానది: వి. వైకుంఠంలో నుండే దేవనది. ఇది తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి పాదాల కిందినుండి ప్రవహిస్తుందని పెద్దల అభిప్రాయం. ఈ నదిలోని కొంతభాగమే స్వామివారి ఆలయంలో సంపంగి ప్రదక్షిణంలో ఉగ్రాణం ముందున్న చిన్నబావినే విరజానది అని, విరజాతీర్థం అని అంటారు.

"తిరమై వీరి పాదతీర్థమే విరజానది
సొరిది నన్నిచోట్లు చూచినట్టే వున్నది" 1-479

విరవాది: వి. 'విరజాజి'కి రూపాం. నవమాలిక.

"కలసిన కాఁకదేఱ గన్నేరుల వేసేరు
వలపులు రేఁగి విరజాజుల వేసేరు" 15-200

విరవిర: అవ్య. బిరబిర, తొందరగా, వేగంగా.

"దరిదాపు యితఁడే కాతగా వెనుకవేసుకో
విరవిరఁబాపాలు నావెంటఁబడినాను" 3-417

విరవిరవీఁగు: *ప.బం; అ.క్రి.* మిక్కిలి విఱ్ఱవీగు, నిక్కు.

"ఎరవుల తపముల నెంతైనా
విరవిరవీఁగుట వృథావృథా" 1-84

విరసము: వి. వైరస్యం, విరసత్వం; ధర్మవాచకానికి బదులు ధర్మివాచకం వాడడం అన్నమయ్యకు సహజమే.

"విరసము లే దిఁక విచారమేలా" 3-429

విరహపడు: *అ.క్రి.* విరహాన్ని పొందు.

"గరిమ విరహపడఁ గన్నులు మూసెఁగాని
నిరతి నీవు వచ్చేవని తలుపే మూయదు" 9-111

విరికాఁడు: (విరి + కాఁడు) వి. మన్మథుడు. పుష్పాలు బాణాలుగా కలవాడని వ్యు. 3-400

విరిమీఁది బిడ్డపేరి వెలఁది: వి. అలమేలుమంగ, విరిమీఁది బిడ్డ = పువ్వున పుట్టిన బిడ్డ-ఆ పేరుగల స్త్రీ. (అలర్-మేల్-మంగకు సమానార్థకం)

"పొరి నీటిపేరి పాన్పున శ్రీవేంకటనాథ
విరిమీఁది బిడ్డపేరి వెలఁది నిన్నుఁగూడె" 10-2-137

విరివికాఁడు: (విరివి + కాఁడు) ఆధిక్యం కలవాడు.

"ఎరవులవా రెవ్వరు యిందులో నీకు,
విరివికాఁడవు నీవు విచ్చేయవయ్యా" 20-565

విరివిగొను: *ప.బం; అ.క్రి.* అతిశయించు.

"పరిపూర్ణమగు తుంగభద్రాతటమునందు
విరివిగొన్నాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు" 10-165

విరుగాలి: పువ్వుల వాసనతో వచ్చే గాలి. 'విరుల గాలి' యనుటకు బదులుగా 'విరుగాలి' అనడం. విలక్షణం.

"వెన్నెలల ముగ్గువెట్టె విరుగాలి తూరుపెత్తె

పన్నుకొని నిమ్మపండ్లు పట్టేఁగానుక" 23-63

విరులాడు: పూబంతులాడు.

"తచ్చనకాఁడవు నీవు తగులు విరులాడేవు
నచ్చుల గొల్లెతలెట్టు నమ్మిరయ్య నిన్నును"
21-20

విఱవీఁగు: ప.బం; అ.క్రి. విఱ్ఱవీగు, మిక్కిలినిక్కు.

"నిండెను నా కోరికలు నినుపు వారిధులై
వెండిబంగారాలతోడ విఱవీఁగవయ్య" 4-241

విఱిగిపోవు: అ.క్రి. ఓడిపోవు, బెదరిపోవు.

"పోరి నీకును విఱిగిపోయిన దానవులు
బిరుదులుడిగి వోడ బేహారులైరి" 2-246

విఱ్ఱవీఁక: ప.బం; వి. విఱ్ఱవీగడం.

"విన్నవించుదాఁకా విఱ్ఱవీఁకలు
మున్నాడీఁ బులకల మూఁకలు" 25-295

వివరము: వి. విస్పష్టత.

"వివరమెందున్నదో వెలఁదికి వీను లివె
తవిలి నీ సుద్దులందే తావైనవి" 24-124

వివాది: వి. దిష్టి తీసేవాడు.

వివేకించు: (3) స.క్రి. ఆలోచించు, వివేచనచేయు.

"తివిరి చలములే సోదించితే నెఱఁగఁగాక
వివేకించితే మనసే వింత సొమ్ము గాదా"
21-147

విషయములు: వి; బహు. రూపరసగంధస్పర్శ శబ్దాదులు, చక్షురాది ఇంద్రియవిషయాలని భావం.

"మెఱయు విషయములె తన మెడనున్న యురులుగా
ఎఱిగినది యది గదా యెఱుక" 1-181

విష్వక్సేనుడు: వి. విష్ణుమూర్తి.

"వేడుకతో వీఁడె విష్వక్సేనుఁడు
కూడి యిందరునుఁ జూడరో జనులు" 4-286

విసరించుకొను: (4) రువ్వించు, తిప్పించుకొను, కురిపింపజేసుకొను.

"ఆవల నలసిన వారట్టె విసరించుకొంటే
నీ వలసిరావు గదా నీ వేల నవ్వేవు" 17-79

"వెలినున్న మాచేత విసరించుకొనరాదా
పలుమారు నేము సేసేపని యేమి నీకు" 27-53

"సరసమాడుతాను విసరించుకొంటాను"
1 అను. 6

విసరు: వి. విసరడం.

"వెలఁది పయ్యెదకొంగు విసరులు
కులుకునవ్వులలోని కొసరులు" 28-417

విసవిస: అవ్య. విస్సుమని, గాలివీచడంలోను, కత్తి మొదలగు వాటిని తిప్పడం, నవ్వడం, నడవడం, ఊదడం, కోయడం మొదలగు వాటిలోను అయ్యే ధ్వనికి అనుకరణం.

"విసవిస నాతనిచే విడె మందుకోరాదా" 23-14

"మొసలిమొకముసొమ్ములు సెవులనుఁ బెట్టి
విసవిస నవ్వీని వీఁడు గదమ్మా" 17-230

విసుకు: అ.క్రి. విసుగు, విసువు.

"మెలుపున వద్దనుండి మేను విసుకనేర్చు
తిలకించి చిటుకలు దియ్యనేరుచు" 18-176

విసుపు: (4) వి. విసుగు ధాతువు భావార్థకరూపం. విసువుతోపాటు విసుపు కూడా ఔతుంది. 1.విసుగు 2.రోత

"వేడుకలలోపల విసు పేల
వీడెమిచ్చీ నాతఁడు వేగ నందుకోవే" 11-60

వీ

వీఁడివో: (వీఁడు+ఇవో) (వీడు+ఇదిగో > ఇగో; ఇవో) అవ్య. ఎదుటనున్న పురుషుని నిర్దేశించడంలో ప్రయోగింపబడే పదబంధం. రూపాం. వీఁడిగో, వీఁడుగో

"వీఁడివో లక్ష్మిపతి వీఁడివో సర్వేశుఁడు
వీఁడివో కోనేటిదండ విహరించే దేవుఁడు" 3-402

వీఁడుదొడులు ఆడు: పెనగొను.

"వింతగు నా వావులే వీఁడుదొడులాడించె
పంతము దనతో నేలే బతుకుఁగాక" 16-285

వీండ్ల వాండ్ల మాటలు: *వి; బహు.* ఎవరెవరివో మాటలు.

"వీండ్ల వాండ్ల మాటలు వినలేనురా" 21-505

వీండ్లు: *వి; బహు.* 'వీఁడు' శబ్దానికి బ.వ.రూపం. 'వీరు' అని అర్థం.

"ఆండ్లైరి గోపసతులంటానే బిగేసేవు
వీండ్ల వాండ్ల మాటలు వినలేనురా" 21-505

వీటఁబోవు: *ప.బం; అ.క్రి.*1.చెడు, నశించు 2.దూషితమగు 3.వ్యర్థమగు.

"కాలమును వీటఁబోయె, కర్మమునుఁ దెగదాయ
మూలనుండి యెవ్వరికి మొరవెట్టేను"
3-323 & 2-105

"తిన్ననై యెవ్వరి చేతి తిట్టు దాఁకిన విధమో
విన్ననై విజ్ఞానమెల్లా వీటిబోయఁదుదిని" 2-105

వీటిబుచ్చు: *స.క్రి.* వ్యర్థంచేయు.

"పోటుమీరిన యసురపురము లన్నియుఁజొచ్చి
వీటిబుచ్చి దుమ్ములుగా వేసినాఁడు" 6-43

వీడని గంట: *ప.బం; వి.* (?)

"యెగ్గులు వట్టేటిదానవు యేల రమ్మంటివే ముందు
వొగ్గి వీడని గంటవై యుండఁగరాదా" 7-239

వీడించుకొను: *స.క్రి.* తొలగింపజేసుకొను.

"తనువుతో భోగాలు తగులు వీఁడగలేము
వెనక కర్మపాశాలు వీడించుకోఁగలమా" 3-549

వీడిక: (వీడు + ఇక) వి. వీడటం, విడివడటం.

"అనిశముఁ జెలులతో నాడికలు
వెనక చూడవయ్యా వేనలి వీడికలు" 28-417

వీడు: *వి.* ఈ శబ్దానికి 'త్యాగము' అనే అర్థం ఉందనీ "చాలించరే జోలి వీడు చదివేవేళ" అనే సందర్భాన్ని బట్టి కన్యాదానం అనే అర్థంలో ప్రయోగించినట్లున్నదనీ, నేటి చదివింపులని కొందరు చెప్పిరి కాని అది ప్రాచీన సంప్రదాయం కాదనీ సం.ప.స.

"పాలవెల్లి కూఁతురుకు పసపులు నలఁచరే
చాలించరే జోలి వీడు చదివేవేళ" 20-182

"జాడతో శ్రీవేంకటేశ సతి మించితే నే మాయ
వీడెమి చ్చెనసితివి వీడుకూఁళ్లు వెట్టదా"
27-324

దీనికి వీడుటలు కూడుటలు కూడా అర్థంకావచ్చు అని సంపా. కాని కుడుపుపెట్టు అనే పదాలు పై అర్థమే యుక్తమని సూచిస్తున్నాయి.

వీడుఁబట్టు: *ప.బం; వి.* 1. నివాసస్థానం, ఉనికిపట్టు 2.బస, విడిది 3. శిబిరం.

"వెనుక మునుపులకు వీడుఁబట్టు జననము
కొనమొదలునుఁ దానే గురి యాయ నాత్మ"
2-386

వీడుకు వీడగు: (2) *ప.బం; అ.క్రి.* సరికి సరియగు, దెబ్బకు దెబ్బ వంటిది. (పద.)

"వీనులు చల్లఁగా వింటి వీడుకు వీడాయను
మోనమున నప్పటిని మొక్కితి నే ననరే"
23-205

వీడుకూళ్లు: *వి; బహు.* పెండ్లిలో వియ్యాలవారిని వీడుకొలిపే సందర్భంగా ఇచ్చే విందుభోజనాలు.

"వియ్యాలంది వీడుకూళ్లు వేమారుఁ గుడుప నీవే
వొయ్యనె తనకు లోనై వుండేఁగాని" 11-147

వీడుజోడు: ఎడబాటు పొందినది -సాగనంపే తోడు.

"కూడి వుండినట్టిచోట గుఱుతు వెతకనేల
వేడుకలకు వేడుకలే వీడుజోళ్లు"

వీడుజోడుది: *వి.* ఈడుజోడు గలది, సమానురాలు.

"యెనసితి శ్రీవేంకటేశ యిదివో నిన్ను
వెనకముందర నీకు వీడుజోడుదాననే" 16-311

వీడుదోడాడు: *ప.బం; అ.క్రి.* పెనగు.

"వెడవెడని తమ్ములము వీడుదోడాడ మన
సడరీని తలఁప వెరపయ్యీని" 6-98

వీడుదోడాడు: (6) *ప.బం; స.క్రి.* 'వీడుజోడాడు'కు రూపాం. కావచ్చు.

1.మాఱుమలయు, ప్రతిఘటించు 2.పెనగొను 3. సరిపోలు 4.వ్యత్యస్తమగు.
"వీడవు మన పొందులు విట్ఠలేశ్వరా!
వెస వీడుదోడాడే వీడెములఁ బచ్చిదే
వుసురు నూరుపులతో నున్నాఁడు వీఁడే"
24-151

వీడుదోడు: వి. సాగనంపు సహాయుడు, పంపించే తోడు.
"వేడుకతోడుత శ్రీవేంకటేశుఁడీకెఁ గూడె
వీడుదోడై యుండుఁగాక వింత లేల సేసునే"
16-427

వీడుదోడు: విశ. సదృశమైన, ఈడుజోడు.
"ఆడినదే యాటా ఆకెఁజక్క జూడరాదా
వీడుదోడు వయసులు వేడుకోవెట్టో" 7-328
"వీడుదోడాయ వలపు వెలఁదికి నీకును
చూడఁజూడ వేడుకాయ చూచువారికిని"
18-109

వీడుదోడులాడు: అ.క్రి. పెనగొను, మారుమలయు, ప్రతిఘటించు, వ్యత్యస్తములగు, తారుమారగు.
"విందుగాఁ దమ్ములములు
వీడుదోడులాడఁగాను
అంది చిగురుఁగత్తులాయ చెలి మోవి" 14-150

వీడుదోళ్లాడు: అ.క్రి. చూ: వీడుదోడులాడు.
"వెల్లివిరి నవ్వఁగాను వీడుదోళ్లాడకున్న
చల్లేటి వలపులేవి? సట లింతే కాక" 7-11

వీడుప(వి)డు: అ.క్రి. 1. భేదపడు, వేర్పడు 2. తడబడు, తారుమారగు.
"వేడుకైతేఁ జాలు నీకు వేమారుఁ బువ్వులను
వీడుపడకుండా నన్ను వేయవయ్యా" 23-512

వీడువెట్టు: ప.బం; స.క్రి. విడిచిపెట్టు, వదలివేయు. (తె.వ్యు.కో.)
"కాయకపుగాడిదెకు కవణము వెట్టి మరి
వీయపుచుట్టాలెల్ల వీడువెట్టరో" 3-461

వీడెములో కప్పురము: ప.బం. ఎటూ పోనిది.
"ఏడనుండా నా సొమ్ము యెందు వొయ్యీనే
వీడెములో కప్పురమే వీని వలపెల్లను"

వీడేలు: వి. 'విడేలు'కు రూపాం. తాంబూలాలు.
"అక్కజమై సతి నీకు నడపము పట్టఁగాను
పెక్కు వీడే లింతులకుఁ బెట్టవయ్యా" 7-110

వీణెమెట్టు: వి; బహు. సరకట్టు, సారె.
"మీటఁగా గట్టిన వీణెమెట్టు చక్కఁబెట్టఁబోతే
పాటించి బాహుమూలాలు బయటఁబడె"
26-292

వీదరవెల్లితనము: (వీదరవెల్లి + తనము) వేదరువెల్లితనము > విదురువెల్లితనము. పిచ్చిపొంగిన లక్షణము.
"సాదువలె నందరి చన్నులపైఁ జేయి చాఁచు
వీదరవెల్లితనాల వేంకటేశుఁడు" 24-368

వీదరవెల్లిపొందులు: వి. (వెల్లి + వెల్లి = వీదరవెల్లి) కావచ్చును. ప్రసిద్ధనిఘంటువుల్లో ఈ పదం ఎందులోనూ కానరాదు. 'వెల్లి' కి పరంపర, ప్రవాహం అనే అర్థాలు ఉన్నందువల్ల ఈ పదానికి మిక్కిలి ప్రవాహరూపంలో వచ్చే అని కానీ, మిక్కిలి పరంపరగా వచ్చే అని కానీ అర్థం చెప్పవచ్చునేమో!

వీదిఁబోయేది: వి; ప.బం. సాధారణస్త్రీ.
"వీదిఁబోయేదానితోడ వెస నవ్వుతాఁగాక
యీ దెసకుఁ బిలిచేవు యింత వలెనా" 11-215

వీది: (14) 'వీధి'కి జానపదవ్యవహారరూపం. అన్నమయ్య అంతటా 'వీది' అనే పదాన్నే వాడినాడు. ప్రాస స్థానంలో 'ద' వాడబడింది కనుక ఇది నిర్ధారకం.
"వీదిలోన నదే కదే విష్ణుపదము
ఆ దెసనే పాయకుండు నాదిమూలము" 2-418

వీదికట్టువారలు: (వీది+కట్టు+వారలు) ప.బం; వి; బహు. వాడకట్టువారు, వాడలోనివారు.
"ఇంతవాఁడవు గాకున్న యేది దూరతనము
వింతకు తలలూచేరు వీదికట్టువారలు" 13-17

వీధులేగించు: స.క్రి. ఊరేగించు.
"పాడరె సోబనాలు పైపైనె పేరటాండ్లు

యాడాడ ననక వీధులేగించారే" 15-55

వీధులేగు : అ.క్రి. మెరవణిపోవు, ఊరేగు. 11-70 old

వీనుల జేర్చి విను : స.క్రి. సావధానంగా విను. 2-204

వీనులపండుగ(వ) : (4) *ప.బం; వి.* శ్రోత్రపర్వం, కన్నులపండుగవంటి పదం, చెవులకు ఆనందాన్ని కలిగించేది, వీనులవిందు.

"వేమరు నాలకించఁగా వీనులపండుగ లాయ

కోమలితో నీవాడే గురిమాటలు" 9-88

వీనులు చిల్లులగు : *ప.బం; అ.క్రి.* చెవులు భరింపలేకపోవు.

"వీనులెల్లఁ జిల్లులాయ వినివిని నీ కతలు

పూనిన నా మనసెట్టు వొడఁబడీ నిఁకను" 13-468

వీపు బట్టగట్టు : *ప.బం; అ.క్రి.* మిక్కిలి శ్రమించు, అట్టగట్టు.

"ఇట్టు నట్టు మిట్టిపడ్డ నించుకంతా లేదు వీఁపు

బట్టగట్టు మోపు మోఁచి పాటుపడ్డాలేదు" 1-55

వీరనరసింహుడు : వి. అహోబలంకొండపై ఒక గుహలో చక్రాకారంగా కొండనీటిధార అడుగుభాగంలో ఒక అరుగుమీద పదిభుజాలతో వెలసిన నృసింహస్వామి. నవనారసింహుల్లో ఒక స్వామి.

"సతతప్రతాపరౌద్రజ్వాలా నారసింహా

వితత వీరనరసింహ విదారణా" 1-453

వీరి(జి)డి : వి. అవివేకి, మూర్ఖుడు.

"నీవే మంచివాఁడవయ్య నేనే వీరిడిఁగాని"

"నెప్పున శ్రీవేంకటేశ నేమూ నీవూ నొక్కటే

యిప్పుడే వీరిడి మరుఁడింత సేసెఁగాని" 7-2

వీరిడికత్తె : (వీరిడి + కత్తె) వి. వివేకం లేని స్త్రీ, మూర్ఖురాలు. (తె.వ్యు.కో.)

"మగనాలి కేటికే మంకుఁదనాల వొట్లు

తెగనాడే వీరిడికత్తెలకుఁగాక" 26-345

వీరుత్తరాలు : (వీర+ఉత్తరాలు?) వి. ఘాటైన సమాధానాలు. విలక్షణప్రయోగం.

"యీరసమ నా కున్నదా యింత నీవు

చుట్టమవా

వీరుత్తురాలు మాతోను విడువవే ఇఁకను" 27-260

వీలు : అ.క్రి. చీలు, పగులు.

"గాలి యావటించి యిచ్చీఁ గారుమేఘము

మింట

వీలి జీర్ణమై యిచ్చీ విక్రమార్కుని బొంత" 1-455

"చాలుగ నడచి సారెకు నిలచి

వీలుచుఁ బయ్యెద విసరీని" 20-142

వీలు : స.క్రి. వదలు.

"మేలిమి శ్రీవేంకటేశుమీఁద భారము వేసుక

వీలక తనలో విఱ్ఱవీఁగువాఁడే నిత్యుఁడు" 2-117

వీసమంత : (9) *విణ.* కొంచెం, కొద్ది.

"వేసరించఁజుమ్మీ త్రివిక్రమ నిన్ను

వీసమంత పనికే త్రివిక్రమ" 15-243

వీసముచేయు : *ప.బం; అ.క్రి.* కొద్దిపాటి విలువచేయు.

"వీసము సేయనందుకే విడనాడే వాఁడు దాను" 10-508

వీసరపోవు : *ప.బం; అ.క్రి.* వెడలివడు, వెలితిపడు, తగ్గు, (తె.వ్యు.కో.), విసరబోవు, కించిద్భంగమగు, (ఆం.ధా.మా.) వ్యర్థమగు. (తె.జా.)

"ఆసలనాసల హరినెఱగక చేడి

వీసరపోయిన వెఱ్ఱులను" 1-241

వృ

వృషభాసురుఁడు : వి. (?)

"పగుల పగుల వృషభాసురునిఁ జంపె

పగ నీఁగే అతని బలములతో" 2-108

వె

వెంగము : వి. 'వెంగెము'కు రూపాం. వెకిలితనం.

"నేనే వింతగాని నీ చుట్టాలవేయివి

కానుకగా నేఁదెచ్చితే కడు వెంగమనేవు" 7-371

"పొదిగి నీ చేఁతలెల్లా పొగడుతా నుండఁగాను
వెదకి వెదకి యాడే వెంగ మనేవు" 8-108

వెంగలితనము: (వెంగలి + తనము) వెఱ్ఱితనం, అవివేకం, మూర్ఖత్వం. (తె.వ్యు.కో.)
"దొంగిలి గజ్జలపేరు గొలఁగఁ బెట్టఁగఁబోతే
వెంగలితనమే కాక వినక మానరే" 10-2-45

వెంగెపుమాట: వి. వేళాకోలపుమాట, వెకిలితనపుమాట.
"వెల లేని కొసరుల వెంగెపుమాటలే వన్నె
చలి వాసినట్టి రాజసములే వన్నె" 21-254

వెంగెమాడు: (11) *ప.బం; అ.క్రి.* పరిహాసమాడు, వ్యంగ్యార్థం వచ్చేట్లు మాట్లాడు.
"మొకమోట గల సతి మొక్కనే నేరుచుఁగాని
వెకలియై యెంతైనా వెంగెమాడదు" 12-20
"మనసిచ్చి నే నీతో మాటలట్టె ఆడఁగాను
వెనక సుద్దులకేల వెంగెమాడేవే" 9-212

వెంగెము: (18) వి. పరిహాసోక్తి, వ్యంగ్యంతో కూడిన మాట.
"పచ్చడము గప్పితేను పట్టి తీసితి ననీని
యిచ్చకమాడితే వెంగె మేటికనీని" 14-67

వెంగెములాడు: (14) *ప.బం; అ.క్రి.* పరిహాసోక్తులు పలుకు.
"వేలుఁగొప్పుతోడ నీవు వెంగెములాడఁగాను
కోలుముందుగా నిన్నుఁగోర గీరెనతఁడు"
25-223

వెంగేలాడు: (5) (వెంగెములు + ఆఁడు) *అ.క్రి.* చూ: వెంగెములాడు.
"వెనకటి సుద్దులకు వేవేల వెంగేలాడితి
నినుపు నిజమరివి నీకుఁదప్పు లున్నవా" 7-525

వెంగొంగనామము: వి. తెల్లనికొంగనామము, శ్రీవైష్ణవులు ధరించే నామం.
"సింగారానకు నొక్కఁడు చిన్న తిరుమణిపెట్టు
వెంగొంగ నామమువెట్టు వెక్కిరింపుచు
నొక్కఁడు" 15-325

వెంజామరము: (2) (వెల్ల + చామరము) తెల్లని చామరము.
"వెండిపైఁడి గుదె లవె వెంజామరము లవె" 2-79
"జాముదాఁకాఁ దనకు వెంజామరము వేసితి
నేమి సేయుమనీ నన్ను నింతే కాదా" 20-139

వెంటలు[1]: (?)
"జంటవాసినఁ జంపుదుమని లేని
వెంటలు గడియించి వేఁచేరే" 5-139

వెంటలు[2]: అవ్య. వెంటకు బహువచనరూపం. విలక్షణ ప్రయోగం. చూ: వెంట్లు.
"ఎందరివెంటల నేఁగేము
చందపు హరి నీ శర ణనియెదము" 4-265

వెంటిక: వి. వెంట్రుక.
"వెంటిక వట్టుకపోయి వెసఁగొండవాఁకుట
వెంటఁగర్మమార్గమున విష్ణుని సాధించుట"
2-49

వెంటిక పట్టుకపోయి వెసఁగొండ వాకు: *ప.బం; అ.క్రి.* బలహీనమైన సాధనంతో అసాధ్యమైన కార్యానికి పూనుకొను, వ్యర్థప్రయత్నం చేయు.
"ముంటిపై సుఖమందుట ముక్కున
నూరుపువట్టి
దంటవాయువు గెలువఁ దలఁచేదెల్లా
వెంటిక వట్టుకపోయి వెసఁగొండవాఁకుట
వెంట గర్మమార్గమున విష్ణుని సాధించుట"
2-49

వెంటెన: వి. (?)
"వేసర నీ కుంటె నలువేవేలు వెంటెనలు
తాసున వేసి చూచితే తన కేమి బాఁతే" 19-479

వెంట్లు: అవ్య. 'వెంట' (వెంబడి)కు బహువచనరూపం. విలక్షణప్రయోగం.
"వూరఁజుట్టమైనవాఁడు వొదిగి వుండగ నేలే
ధీరత ఇండ్లవెంట్ల దిరుగుఁగాక" 26-379

వెండిశికరమువాఁడు: వి. శివుడు.
"వెండిశికరమువాని వెఱ్ఱి యూవి తుదముట్టి

వండని కూటివారికి వైపాయఁ బనులు" 7-277

వెండ్లు: వి. 'వెండి'కి బహువచనరూపం. వెండి, బంగారం మొ॥ లోహవాచకపదాలకు బహువచనరూపా లుండవి వ్యాకర్తల మతం. అందువల్ల ఈ రూపం విలక్షణం. ఇట్లే బంగారులు అనే రూపం కూడా కనిపిస్తుంది.

వెంబాలవెల్లి: (2) (వెల్లి + పాలవెల్లి) వి. తెల్లని పాలసముద్రం.

"వెన్నెలఁగాయఁగాఁ జూచి వెంబాలవెల్లి యనేవు

తన్నుఁదానే పతిరాక తడసెనటే" 17-207

వెకలితనము: వి. అవివేకం, మూర్ఖత్వం, వెకిలితనం.

"మొకదాకిరివి నీపై మోహమే చల్లుఁగాని

వెకలితనాన నిన్ను వేసరించదు" 23-180

వెక్కసపుటడియాస: వింత అడియాస.

"మిక్కుటపుఁదమకము మీఁదు మెం(యెం)చదు

వెక్కసపుటడియాస వేసటెంచదు" 26-380

వెక్కసపు నేర్పు: వింత నేర్పు.

"వెక్కసపు నేర్పులు శ్రీవేంకటేశుకొరకా

మిక్కిలి యీతనిచేత మెప్పించుకొంటివి"

26-274

వెక్కసపుమాట: వి. దుస్సహమైన మాట.

"వెక్కసపు మాటలాడి వేడుకలు పచరించి

కక్కసించీ రతులకు కతకారి వనిత" 26-254

వెక్కసము: (4) విణ. 1. మిక్కుటము, అధికం 2.దుస్సహం 3. దుర్లభం 4. ఆశ్చర్యం.

"వెక్కసపుజవ్వనాన విఱ్ఱవీగే చెలి గాన

పక్కన నేమైనాఁ జేయఁ బాడి గాదు ఆపెకు"

14-124

వెక్కసాలాడు: ఎకసక్కెములాడు.

"చక్కని విభుని సారెకుఁ జెలులు

వెక్కసాలాడక విడరో" 5-187

వెక్కసి: (వెక్కసము + ఇ) వి. దుస్సహు(డు)రాలు, హింసకు(డు)రాలు.

"తక్కినవారి కింత తగునా నేఁడు

వెక్కసి గనక నిన్ను వేమారు దూరీని" 26-388

వెక్కసీఁడు: (వెక్కసము + ఈడు) సహించ శక్యంకాని వాడు.

"చెక్కలువార గోళ్లఁ జించి చెండాడినయట్టి

వెక్కసీఁడు వీఁడివో వీరనారసింహుఁడు" 4-162

వెగట్లాడు: అ.క్రి. చేదుమాటలాడు, విరసపు మాటలాడు, సరిపడని మాటలాడు, అసహ్యించుకొను.

"మగవారి చేఁతలకు మానినులైనవారు

వెగట్లాడకుండరు వేయైనాను" 7-19

వెగ్గలిం(ళిం)చు: (68) స.క్రి. తోసిపుచ్చు, (తె.వ్యు.కో.) తిరస్కరించు, వెక్కిరించు, మితిమీఱు. (ఆ.మూ.)

"యెగ్గుదీర శ్రీవేంకటేశుఁడిట్టె నన్నుఁగూడె

వెగ్గళించి మోవితేనె విందుపెట్టరాదా" 20-542

వెక్కిరించు:

"సిగ్గుపడ కింటిపనే చేసే నేను

వెగ్గళింపఁదగునా వెర్రి నింతేకాక"

అతిశయించు:

"వినయము చేసితేను వెగ్గళించు మోహము

ననుపు చక్కనయితే నాటు మోహము" 24-557

వెగ్గళము: (15) వి; మాం. అతిశయం, అధికం. 'ఎగ్గలమై పోయింది' అని రాయలసీమ వాడుక.

"తానాడిన సరసము తనకు వెగ్గళమైతే

నే నేమి సేతునే యాల నెపాలు వేసేనే" 12-457

"వెగ్గళించఁజూచితేను వేసటలౌను అందు

వెగ్గళమైతే వలపు వెల్లివిరిసీని" 13-536

వెచ్చజెప్పు: ప.బం; స.క్రి. అమ్ము, విక్రయించు.

"వేంకటవిభుండ! నీకు వెచ్చఁజెప్పఁగా

ఉంకువగా నాకు నబ్బె ఉదుటు నీ చేఁతలు"

5-91

వెచ్చపువలపు: వి. క్రయ విక్రయాదులకు లోబడే ప్రేమ, విటుడు చూపే ప్రేమ (?)

"వలదు వోరి వెచ్చపువలపు నీ దెల్లాను

పలుమారు నిట్ల నాపైఁ బూయవలెనా" 5-278
"వలదు వోరి వెచ్చపు నీ వలపులోని
దాహమెల్లా నాతోనే యింతటఁ జూపవలెనా"
5-278

వెచ్చపెట్టు: (వెచ్చము + పెట్టు) వ్యయంచేయు, వెచ్చించు, పాడుచేయు.
"వెచ్చపెట్టఁడు గదా వేడుక నెవ్వరికైనా
అచ్చలాన నే నా సుద్ది యడుగుదునా" 7-51

వెచ్చమగు: అమ్ముడుపోవు.
"వేంకటవిభుఁడ నీకు వెచ్చమైతిఁ జెప్పరా
వుంకువగా నాకు నబ్బె ఉదుటు నీ చేతలు"
15-91

వెచ్చిచేతలు: పరిపక్వమైన చేష్టలు.
"బద్దులో నిజమోకాని పచ్చివెచ్చి చేతల
వొద్దికతో బందుబండై వున్నాఁడటా" 11-183

వెచ్చివేవు: ప.బం. అ.క్రి. పరిపక్వమగు.
"యెలమి నీతో నాపె యిచ్చకము లాడఁగాను
వెలయ నీ మాట వెచ్చివేవదాయను" 7-801

వెచ్చు: అ.క్రి. 1. సంతాపం పొందు 2. కాలు 3. కాగు 4.ప్రజ్వలించు.
"వెచ్చిన (నీ) మేని సొంపు వింత దోచె నేఁటికే
మచ్చిక నీ కోరికెలు మదమెక్కె నేఁటికే" 6-78

వెట్ట: వి. 1. వేడిమి 2. తాపం 3. వేసవికాలం విణ. వేడి, ఉష్ణం.
"వెట్టగా రావణురొమ్ము విరుగఁ జేతనే గుద్దె
నిట్టతాడువంటివాఁడు నీ బంటు" 1-69
"వెల లేని వెన్నెలలు వేఁగినంతాఁగాయఁగాను
వెలనుండే యెవ్వరికి వెట్టఁబడఁ దగునా"
23-358

వెట్టఁబడు: (2) వేడియగు.
"వెలలేని వెన్నెలలు వేగినంతాఁగాయఁగాను
వెలినుండే యెవ్వరికి వెట్టఁబడఁదగునా"
23-458

వెట్టకాయము: వి. వేడిశరీరం.
"దట్టపుటాసల నేఁదాల్చితి నట నా
వెట్టకాయము మోవ వెఱచేనా" 1-169

వెట్ట చేఁతలాఁడి: వి. ఉగ్రమైన పనులు చేసే స్త్రీ.
"వెట్టచేఁతలాఁడివైనా వీఁకకుఁదేవచ్చుఁగాని
చుట్టపు సూడుఁదానిఁ జొక్కించరాదు" 23-107

వెట్టసంసారము: వి. కటకటగా నడిచే సంసారం. ఇది "వెట్టి సంసారము" కావచ్చు. ప్రయోజనం లేని సంసారమని అర్థం.
"వెట్టసంసారమిది వేంకటేశుఁగొలువని
వట్టి మనుజుల పెడవాడఁ బెట్టుఁగాక" 1-177

వెట్టికొసరు: ప్రయోజనంలేని కొసరు.
"ఎట్టున్నదో నా మనసు యెఱఁగ నేను
వెట్టికొసరులు నీపై వేయఁగవచ్చేనా" 21-178

వెట్టిగాఁడు: వి. ప్రతిఫలం ఇవ్వకయే అనుభవించు వాఁడు.
"రట్టడి వేంకటరమణుఁడ గలసితి
వెట్టిగాఁడ యింక విడు విడు చెఱఁగూ" 6-91

వెట్టిమాన్యము: వి. వెట్టిపని చేసినందుకు ఇచ్చే మాన్యం.
"మీఁటి శ్రీరమణుని మెప్పించు సేవకులకు
వీఁటిడికర్మముల వెట్టిమాన్యము" 15-110

వెట్టిమోపు: వి. ఫలం లేకుండా మోసే మోపు, వెట్టికి మోసే మోపు.
"వెట్టిమోపువంటి మేను విడనాడి వీఁ
డిట్టె దాఁటిపోయె నెటువంటి జాణో" 1-173

వెట్టివేములు: వి. కూలి ఇవ్వకుండా చేయించుకునే పని, వెట్టివేతనం.
"వట్టి జా లింకేల దేవతలాల మునులాల
వెట్టివేములు మానెను వెరవకుడిఁకను" 10-1-32

వెడ: విణ. 1. అల్పం 2. తుచ్ఛం 3. వికృతం 4. వ్యర్థం 5.ఇంచుక.

వెడమాటలాడు: అ.క్రి. అల్పపుమాటలు పలుకు.
"వేసరించఁ జుమ్మీ వెడమాటలాడి నేను
ఆసపడి సరసము లాడుదుఁగాని" 12-185

వెడవికారి: తుచ్ఛమైన వికారం కలది.

"మొగము చూపుకొంటాను ముందర నిలుచున్నది
వెగటుగా నవ్వీనెంత వెడవికారి" 29-524

వెడవెడ: విణ. మిక్కిలి చిన్నదైన.

"వింతవింత నీ మేని వెడవెడ గురుతులు
కొంతగొంత వొడగని కోపమాయను" 21-280

వెడ్డువెట్టు: (15) (వెడ్డు+పెట్టు) వంచించు, మోసగించు అనే అర్థాలు శ.ర.లోనూ, తె.వ్యు.కో. లోనూ చూపబడ్డాయి. నిర్బంధించు అనే అర్థం సం.ప.స. లో చూపబడింది. (27-203 పు.) కాని ఈ పదానికి పెక్కు ఉదాహరణల్లో 'బుజ్జగించు' అనే అర్థం సరిపోతుంది.

"బిడ్డలేమి యియ్యఁగాను ప్రేమముతోఁ గన్నతల్లి
వెడ్డువెట్టి చన్నిచ్చి వెసఁబెంచును" 15-33

"చెప్పుమంటా నన్ను నేల చేరి వెడ్డువెట్టేవు
తప్పక చూచితేనే తలవంచితి" 27-30

సంపాదకు లీ కీర్తన పాదంలోని వెడ్డువెట్టేవు అనే దానికి నిర్బంధించేవు అనే అర్థం సూచించినారు. ఇటపై రెండర్థాలూ కుదరవచ్చు.

వెద[1]: వి. 'వ్యథ'కు వికృతిరూపం.

"నిరతరతి సుఖము నిమిషములోనిదే
విరహపువెదలు వేవేలు" 3-329

వెద[2]: వి. విత్తుట.

"నెక్కొని యంతవట్టును నీమీఁదనే జల్లితేను
వెక్కసమై పులకలు వెదకు మొలచెను" 23-165

వెదవడు: *ప.బం; అ.క్రి.* నాటబడు.

"వెదవడి పుత్రులు పౌత్రులే విత్తులు లోలో మొలచియు
పొదిఁగర్మపు పూ మారదు పూ పిందెయిన దిదే" 1-482

వెదవెట్టు: (9) స.క్రి. విత్తు, నాటు, (తె.వ్యు.కో.) ఎరువులు మొ॥ వాటితో సారవంతం చేయు.

"కేరడపు నవ్వులే కిమ్ముల వెదవెట్టఁగ
సారెసారె ని న్నెట్లు సాదించేము" 23-566

"యిదె నీపై యాసల నిట్టె మేను పులకించె
వెదవెట్టక ససులు వేవేలు మొలచెను" 23-127

"పొలమెల్లాను చిలుకపలుకులే వెదవెట్టి
నెలవుకు నిన్నుఁ బిలిచే నేరుపులను" 28-8

"వెదవెట్టి లోకములో వేదములన్నియు మంచి
పదములు సేసి పావనము సేసెను"

వెనకతియ్యు: *అ.క్రి; ప.బం.* వెనుదీయు, వెనుకంజవేయు.

"వేడుకకుఁ దోడువచ్చి వెనక తియ్యఁగరాదు
వాడికకుఁ జోటిచ్చి వద్దనరాదు" 23-231

వెనక నుయ్యి తగరు ముందట: *ప.బం.* ఎటుచూచినా ప్రమాదమే అని భావం. వెనుక నుయ్యి ముందర పొట్టేలు అని వాచ్యార్థం. 'ముందు గొయ్యి వెనుక నుయ్యి' అనేదీ ఇటువంటిదే. రెండువైపులా పొంచి ఉన్న ప్రమాదం.

"తలఁప వెనక నుయ్యి తగరు ముందట దీన
దొలఁగ నాకుఁదెరువు దోపఁదేమి సేతు" 1-310

వెనకముందర చూచు: *ప.బం; అ.క్రి.* లాభనష్టాలను చూచు.

"తనియకాసలనే తగిలేటి బ్రదుకు
వెనకముందర చూడ వెరపయిన బ్రదుకు"
1-348

వెనకముందు ఎంచు: *ప.బం; అ.క్రి.* సంకోచించు, సందేహించు.

"వెనకముందెంచనేల వెఱపులు మఱియేల
ఘనముగఁ బాలు నీరు గలసినట్టాయను"
20-561

వెనకవేసుకొను: (3) *ప.బం; స.క్రి.*
1. బలపరచు, సమర్థించు, వత్తాసుపలుకు
2. దాచుకొను, పొదుపుచేయు.

"భామ లెవ్వరైనా నిన్ను బతిమి చెరిచినాను
వేమారు నిన్ను వెనక వేసుకోకపోవునా"
19-474

వెనకాముందు : ప.బం. ముందూ, వెనకా.

"అల్లుకొనెఁ గర్మములు అక్కడికి నిక్కడికి

వెల్లవిరాయ మాయ వెనకాముందు " 2-490

వెనవెనక : (3) (వెనక + వెనక) వెనుకవెనుక, మిక్కిలివెనుక.

"మునుకొని వెదకితే ముక్కు నూర్పు గాలికొన

వెనవెనకఁ దిరిగీ వీడివో హరి" 8-57

వెనుబలము : వి. వెన్నుబలం, సహాయం.

"ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిలించి నన్ను నేలి

వెనుబలమై యుండఁగా వెఱపేఁటికి" 23-511

వెన్నకుఁ బండ్లు వచ్చు : (2) ప.బం; అ.క్రి. అల్పుడు బలవంతుడైనాడనే అర్థంలో వాడబడే పదబంధం. వెన్నపూసకు కఱువ పన్నులు వచ్చు అని వాచ్యార్థం. అసంభవమగు.

"పస గల తిరువేంకటగిరిపతి నా దేహపుఁ బురి సీ

వసమై వెన్నకుఁబండ్లు వచ్చిన యట్లాయ "

1-72

వెన్నకొద్ది నెయ్యి : ప.బం; వి. కారణాన్నిబట్టి కార్యం.

"వేడుక శ్రీవేంకటేశ వెన్నకొద్దే నెయ్యీ " 14-200

వెన్నచిట్టి : వి. చిన్న వెన్నపావు, చిన్న వెన్నపాత్ర.

"ఇంత బాఁతిపడేవాని నేల మాకుఁదక్కరించ

చెంత నిదే వెన్నచిట్టిఁ జిట్టెఁడేసి వలపు " 7-180

వెన్న చేతఁబట్టి నేయి వెదకు : ప.బం; అ.క్రి. సాధనం చేతిలోనే ఉండగా మరోచోట వెంపరలాడినట్లు.

"వెన్న చేతఁబట్టి నేయి వెదకినట్టు

యెన్నఁగ నీ వుండఁగాను యెక్కడో చూచేను "

4-118

వెన్నట్టు : వి. భక్ష్యవిశేషం.

"తేనెలు జున్నులు తెంకాయ పాలును

ఆనవాలు వెన్నట్లును" 6-4

వెన్నతోఁ బాముచుపెట్టు : ప.బం. చిన్నతనంలోనే నేర్పు.

"పక్కున నవ్వఁగానే పైకొని పంతమాడేవు

మొక్కళము వెన్నతోఁబాముచుఁ బెట్టిరా "

25-384

వెన్నతోఁబెంచు : ప.బం; స.క్రి. పుట్టిననాటినుండి పెంచు.

"వెన్నతోఁబెంచే దేవుఁడు వివేకమిచ్చే దేవుఁడు

యెన్నని పొగడవచ్చు యీతఁడే మా దేవుఁడు "

4-496

వెన్నతోఁబెట్టు : ప.బం; స.క్రి. చిన్నతనం నుండీ నేర్పు, ఉగ్గుపాలతో పెట్టు.

"వెన్నతోఁబెట్టిరి నీకు వేసాలెల్లాను

పిన్ననాడే గొల్లెతలు పెక్కు చందములను "

13-299

వెన్నతో కలుగు : ప.బం; అ.క్రి. బాల్యంతోనే కలుగు.

"అన్నిమంత్రములు నిందే యావహించెను

వెన్నతో నాకుఁ గలిగె వేంకటేశుమంత్రము "

11-143

వెన్నతోడఁబెట్టు : ప.బం; స.క్రి. బాల్యంనుండే నేర్పు, పుట్టుకతో నేర్పు.

"తోయఁదోయఁదల్లి వెన్నతోడఁ బెట్టె ముచ్చిములు

పోయఁబోయ గొల్లి దోమటాయఁబో మా పెరుగు" 9-73

వెన్నతో నిడు : ప.బం; స.క్రి. పుట్టుకతో నేర్పు.

వెన్నదిన్న నోటనే వేఁడిపాలు దాగు : ప.బం; అ.క్రి. సుఖం అనుభవించిన దానితోనే దుఃఖాన్ని కూడా అనుభవించు.

"వెన్నదిన్న నోటనే వేఁడిపాలు దాగినట్టు

వెన్నెగా మాటాడి యేల వెంగెమాడేవే" 20-31

వెన్నదుబ్బలు : వి. వెన్నదిబ్బలు.

"తొడనె వెన్నదుబ్బలు తొడుక నేల వచ్చీని

వేడుకకాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు" 7-134

వెన్న నూరు : నిరర్థకమగు పని చేయు.

"మిన్నునూయి చేఁతాటఁజేది మెచ్చుమింగు నొక యోగి

వెన్న సన్నముగ నూరి వీఁగు నొకయోగి "
2-125

వెన్నపూసినట్టివారి వెలిమిడి పూయు : *ప.బం;* *అ.క్రి.* ఆదరించిన వారిపైనే నిరాదరణ చూపు. వెన్నపూసిన వారికి వెలిమిడి (బూడిద) పూయడమని వాచ్యార్థం.
"వెన్న పూసినట్టివారి వెలిమిడి పూయలేక
పన్ని నీవు పలుకఁగఁ బలికేఁ గాని" 22-151

వెన్నముచ్చిమి : *వి.* వెన్నదొంగతనం. 7-195

వెన్నలో కలి : *ప.బం;* *వి.* అసంభవం. 2-118

వెన్నలో నేతివంటిది : *ప.బం;* *వి.* అంతర్భూతంగా ఉండేది.
"అన్నియుఁ దెలిసినవే అందరును
వెన్నలో నేతివంటిది వేడుక నీ ప్రియము "
19-148

వెన్నవంటి మనసు : *వి.* అతిమృదువైన మనస్సు
"వెన్నవంటి మనసు వేఁడివంటి దీ వలపు "
18-336

వెన్నవట్టుక (కొని) నేయి వెదకు : *ప.బం;* సాధనం చేతిలో ఉండగా మరొకచోట వెంపరలాడు.
"సరవి నీ వొళ్లి జాణతనమెట్టిదో
నిరతి వెన్నవట్టుక నేయి వెదకేవు"
16-422 & 2-33

వెన్న వేసినవారిని రాత వేయు : *ప.బం;* *అ.క్రి.* ఆదరించినవారిని అవమానించు.
"వెన్న వేసినవారిని వెస రాత వెయ్యరాదు
అన్నిటా జాణఁజేసితి నటు మీరవద్దురా" 13-58

వెన్న సన్నగ నూరు : *ప.బం.* వృథా ప్రయత్నం చేయు. 2-125

వెన్నెకాఁడు : *వి.* వన్నెకాఁడు. 'వె' యతిస్థానంలో ప్రయోగింపబడింది.
"కన్నుల జంకించక కాఁగిట నే నించితేనే
వెన్నెకాఁడవై కడు వెరగందేవు" 27-215

వెన్నెలకాలము : *వి.* శరదృతువు.
"పొటపొట నవ్వు మోవిఁ బాడ నటు నవ్వితేను
నీటున నీ పతికి వెన్నెలకాలము" 17-522

వెన్నెలకువ్వ : *వి.* వెన్నెల కుప్ప.
"యిన్నిటా శ్రీవేంకటేశ యెంచి చూచుకుంటేను
వెన్నెల కువ్వ లెల్లా వెలకెక్కీనా" 21-214

వెన్నెలగలనాఁడే అల్లునేరేళ్లు : నానుడి; అల్లోనేరేళ్లు అనే ఆట వెన్నెల ఉన్నప్పుడే ఆడే ఆట. ఆనుకూల్యం ఉన్నప్పుడే సమయానికి తగిన విధంగా ప్రవర్తించాలి అని భావం.
"వెన్నెల గలనాఁడే కావించె నల్లునేరేళ్లు
యెన్నెసి కతలకారి యెట్టు నీకు దొరకె" 22-376

వెన్నెల గాదెఁబోయు : అసాధ్యమగు పనికి పూను.
"వెన్నెల గాదెఁబోసితే వెచ్చాన కడవు గాదు
సున్నమే వెన్నయైతే సూటిపడేఁగాని" 16-293

వెన్నెల పులు(గము)గాలు : *వి;* *బహు.* క్రీడావిశేషం.
"సన్నపుగుబ్బలమీఁద చంద్రవంకలుగా నొత్తి
వెన్నెలపులుగా లాడే వేడుకకాఁడా" 18-354
"వెలఁది మోము నీకు వెన్నెల పులుగమాడ
నెలవాయ నింతలోనె నీ కిదివో"
12-414 (23-573)

వెన్నెలపూట : *వి.* వెన్నెల సమయం.
"చక్కని వెన్నెలపూట సతి నీ నవ్వుతేట
మొక్కులలోని మొఱఁగు మోవితెఱఁగు"
23-357

వెన్నెలబాయలు : (2) *వి.* వెన్నెలబయలు.
"వింతగా చెలి నవ్వులే వెన్నెలబాయలు నీకు
పొంత నధరామృతమే పులుఁగాలు" 14-408

వెన్నెలబాయిలు : *వి.* వెన్నెల బయలు.
"పుప్పొడి వెన్నల పొళ్లు(?)
పొలఁతికి వెన్నెల బాయిలు" 5-88

వెన్నెలమొలక : *వి.* చిన్నివెన్నెల.
"అలరి కప్పురకాపు అవధరించేటి వేళ
మొలచిన వెన్నెల మొలకయై యుండెను "
3-165

వెన్నెల యెండలు : *ప.బం; వి; బహు.* (?)
"వెన్నెల యెండలు వెలయఁగ మేల్కొను
టెన్నఁడు నిద్దుర యెన్నఁడు నీకు" 1-148

వెయిసేయు : *ప.బం; అ.క్రి.* మిక్కిలి విలువకలది యగు.
"ముదిత నడపులలోని మురిపెమే వెయిసేసు
కొదమగుబ్బల తీరు కోటివేలు సేసు" 5-304

వెయ్యవేలు : (వేలు + వేలు) వేలకువేలు.
"వెయ్యవేలై వేగుదాఁకా వెట్టిసేసి యలసితి
వో యయ్య కొంతైనా వూరడించవలదా" 1-412

వెరఁజాడు : *ప.బం. స.క్రి.* 1. పోగుచేసి ఎత్తు 2. కొల్లగొట్టు. (వ్యు.)
"రోలఁగట్టువడ్డవాఁడు రోఁకలి వట్టినవాఁడు
వేళలేదు వెన్నలెల్ల వెరఁజాడేరు" 3-178

వెరఁజు : *స.క్రి.* కొల్లగొట్టు.
"వీఁడివో యిదె వింతదొంగ
వేఁడిపాలు వెన్న వెరఁజిన దొంగ" 1-322

వెరబొమ్మ : (వెరపు + బొమ్మ) పశువులు మొ॥ వాటికి భయం కలిగించడానికి భయంకరమైన ఆకారంలో ప్రతిష్ఠించే ప్రతిమ. 'వెఱబొమ్మ' అని శకటరేఫంతో కూడిన రూపం సాధురేఫంతో ప్రయోగింపబడింది.
"వసుధలోఁ బురుషలో వనితల రూపులు
వెస మాయయంత్రపు వెరబొమ్మలు" 2-203

వెరసుగ : *క్రి.విశ.* మొత్తంగా.
"పొరలింపు మాటలాడి బొమ్మలను జంకించు
వెరసుగ సాదించితివే విభుని" 14-152

వెరసువేయు : *ప.బం.* అందరినీ కలుపు
"వరుస మధురలోని వారకాంత నెల్లా
వెరసువేసి పొందితివిగా నీవు" 13-502

వెర్తుఁడు : వ్యర్థుడు అనే పదానికి వికృతిరూపం. ప్రయోజనం లేనివాడు.
"ముడుపు కొంగునఁగట్టి మూలమూలల వెదకే
వెడమతినై నే వెర్తుఁడనైతి" 1-19

వెఱఁజు : (2) *వి.* జారుకొను, కొల్లగొట్టు.
"గుతిగా శ్రీకృష్ణుఁడు మనకు దొరదూరువాఁడు
వెఱవక చేతికొద్ది వెఱఁజిరో మీరు" 19-534
"యెన్నడు గొల్లెతల యిండ్లు వేమారుఁ జొచ్చి
వెన్నలుఁబాలును వెఱఁజఁడు" 1-57

వెఱివెఱాటాడు : *అ.క్రి.* వెట్టివెట్టి ఆట ఆడు, మిక్కిలి పిచ్చిగా ప్రవర్తించు.
"వెంగలి యభిని దింటే వెఱివెఱాటాడుఁగాని
అంగవించునా వివే మప్పుడే లోకులకు"
74-389

వెఱుఁజు : రూపాం. వెరజు. కొల్లగొట్టు, పోగుచేసి ఎత్తు.
"మెఱని యట్టుగమీఁది చక్కిలాలు
వెఱఁజి కైకొనె వీఁడెకదె" 4-288

వెట్టిఁదెలిసి రోఁకలి జుట్టుకొన్నట్టు : (2) నానుడి; తాను చెప్పేమాట తప్పని తానే తెలుపుకొనే సందర్భంలో ఉపయోగించే పలుకుబడి. వెట్టి కుదిరినదని అంటూనే రోకలి తలకు చుట్టమనడంతో తన వెట్టిని తానే ఋజువు చేసుకున్నట్లే కదా!
"వెట్టిఁదెలిసి రోఁకలి వెసఁజుట్టుకొన్నట్టు
యిట్టి దీము భోగముల నెనసేము" 3-174

వెట్టిచెరకు : *వి. మాం.* తియ్యగా లేని పిచ్చిచెఱకు.
"కొనబు వెట్టిచెరకు కొన యేమి మొదలేమి
యెనయని పతిమాట లెన్నైనా నేమి" 9-66

వెట్టిచే(తి)రాయి : *ప.బం; వి.* గురిలేని విషయం. ఎక్కడ ఎవరికి హాని కలిగిస్తుందో తెలియని విషయం. వెట్టివాడు తన చేతిలోని రాయి విసరినపుడు తగిలితే తగులుతుంది లేకపోతే లేదు అనే దాన్ని బట్టి వచ్చిన పలుకుబడి.
"కావిరి వెట్టిచేరాయి కాఁపురమా
కావలసినట్లయ్యే కాపురమా" 2-34

వెట్టి దవ్వించు : *ప.బం; అ.క్రి.* మోహం కలిగించు.
"ఇంకా నో దైవమా యేల వెట్టి దవ్వించేవు
కొంకితెంచి ముడిగొంటే కుఱుచే కాదా" 3-175

వెట్టిదవ్వించు : *ప.బం; అ.క్రి.* మోహం కలిగించు.

"ఇంకా నో దైవమా యేల వెట్టి దవ్వించేవు

కొంకి తెంచి ముడిగొంటే కుఱుచే కాదా" 3-175

వెట్టిదవ్వు : *ప.బం; అ.క్రి.* మోహం కలుగు.

"దేహమేమి సేయును దేహము లోపలనున్న

దాహపుటాసలు వెట్టి నవ్వఁగాను" 4-53

వెట్టి దెలిసి వేదురు నవ్వు : *ప.బం; అ.క్రి.* వెట్టి తొలగినా వెట్టినవ్వు నవ్వు.

"వెట్టి దెలిసి మఱియు వేఁదురు నవ్వేము"
3-177

వెట్టినవ్వు : *ప.బం; వి.* నిస్తేజమైన నవ్వు.

వెట్టివాని చేతి రాయి : *ప.బం; వి.* ఎవరికి ప్రమాదం కలిగిస్తుందో తెలియనిది, గురిలేని విషయం.

"పీలిన యీ యాసా వెట్టివాని చేతిరాయి

చాలు నింకా హరి నిట్టే శరణను జీవుడా" 2-157

వెలంకాయ : వి. వెలగకాయ.

"తొలఁగకిటు రెండుచేతుల వెలంకాయలై

తళుకొత్త జేతు వెందలివాడవూ" 13-596

వెలకు : వి. సం.ప.స. (23 సం.) లో 'వెళక్కు' అనే తమిళ శబ్దవికారంగా ఊహింపబడింది. తమిళంలో వెళక్కు అంటే దీపమని అర్థం.

"వెలయఁబెండ్లాడితివి వెఱపేటికి

వెలకా వేఁగుచునుండఁగా వెఱపేఁటికి" 23-571

వెలపరచు : *ప.బం; అ.క్రి.* వెలకట్టు.

"యెలమి శ్రీవేంకటేశుఁ డేడ నుండె నన్నుఁగూడె

వెలపరచఁగరాదు వేడుకలే నిండెను" 8-296

వెలపెట్టు : వెలకు పెట్టు.

వెలమజోలి : వి. అస్థిరమైన స్నేహం, అవకాశవాదం, వెలమ చెలిమి అనికూడా వ్యవహారం. (తె.జా.)

వెలిఁగాంత : (వెలి+కాంత) వి. వేశ్య. బయటి స్త్రీ అని వ్యు.

"కలలో నింతులఁగలసినట్లనే

వెలిఁగాంతలతోడి వేడుకలు" 4-381

వెలుగు చేను మేసినట్టి విధము : నానుడి; రక్షకమే భక్షకమైన రీతి. 23-593

వెలుగే చేను మేయు : *ప.బం.* కంచే చేను మేయు. (వెలుగు = కంచె)

"చెదఱక వెలుఁగే చేనుమేయఁగఁ జొచ్చె

అదలించి తగదు నీ కనువారు వేరీ" 1-193

వెలుగోడు : వి. కర్నూలు జిల్లాలోని ఒక మండల కేంద్రం. ఇది చెన్నకేశవస్వామి వెలసిన క్షేత్రం. వెలుగోటి చెన్నకేశవునిపై అన్నమయ్య ఒక కీర్తన చెప్పినాడు.

"కుంకుమాంక వక్ష వెలుగోటి కేశవ సర్వ

శంకాహరణ నమో జగదేకకేశవా" 4-391

వెలుచుకొను : *స.క్రి.* వెలువఱచు, వెడలించుకొను.

"వెలుపలిసుద్దులెల్లా వెలుచుకొంటా యిది

పిలిచి మరేమైనా బేరుకొంటినా" 23-189

"మంచివానివలెనె మాటలు వెలుచుకొని

పొంచి నవ్వుతాఁ జెప్పేవు పొలఁతికిని" 11-515

వెలుతురుఁగాలము : వి. శరత్కాలం.

"మొత్తమిఁ జెలితురుముమొయిలు విరిసె నిదె

హత్తి వెలుతురుఁగాలమది నేఁడే" 19-519

వెలుమజోలి : వి. ఈ పదము అర్థాన్ని గురించి సం.ప.స.లో వివరణం ఇలా ఉన్నది. వెలమవారి సహవాసము? అది యెట్టిదో తెలియదు. వెలమబంక చాలా జిగురని, వెలమబంకవలె అంటుకొన్నాడని వాడుక రేనాటిలో కలదని ఒక పండితమిత్రులన్నారు. ప్రకృతమున కీ యర్థము కొంత అనువుగా నున్నది. ప్రమాదకరమైన స్నేహమనే అర్థం కావచ్చు. "అవకాశ ధోరణి, ఏరోటికాడ ఆ పాట, అశాశ్వతస్నేహం" అని తె.జా. (254 పు.)

"వేగినంతా నేమిచెప్పె వెలుమజోలి

వాగమై నాకు మేనవాఁడౌనోకాఁడో" 14-1

వెలువ : (4) వి. 'విలువ'కు రూపాం.

"ఎక్కినవానికిఁ జూడ నేనుగ గుజ్జె యుండు

వెక్కసమై వెలువ వేవేలు సేసునయ్య" 17-47

వెల్తి: వి. 'వెలితి'కి రూపాం. న్యూనత, లోపం.
"దేవ నీ పక్షపాతమో తిరిగే లోకుల వెల్తో
శ్రీవిభుఁడ నీవే కాదా చిత్తములోనయ్యా" 3-422

వెల్లవిరి: వి. 'వెల్లివిరి' అని సూ.ని., వెల్లడియైనది, ప్రకటితమైనది.

వెల్లవిరిగా: క్రి.విఙ. వ్యాప్తమయ్యేట్లుగా, ప్రకటితమయ్యేట్లుగా.
"చెల్లఁబో నన్ను నీ వింత సేతురటవే
వెల్లవిరిగా నేమైనా వింటివటవే" 21-498

వెల్లవిరిగా చేయు: ప.బం; స.క్రి. వ్యాప్తమగునట్లు చేయు.
"వేగిరించి వలపులు వెల్లవిరిగాఁ జేసీనీ
యీ గతి వీని గుణము లేమిసేతునే" 23-252

వెల్లవిరివారు: (?)
"ఏఁటిదో నీ చిత్తము నే మెఱఁగమయ్య
వాఁటమైన వెల్ల విరివారమయ్యా" 8-154

వెల్లవిరిసేయు: ప.బం; అ.క్రి. వెల్లివిరిసేయు అని సూ.ని; ప్రకటించు.
"కూడేవేళ లేని సిగ్గు కోలులో వచ్చెనా
వేడుక వలపు వెల్లవిరిసేయరాదా" 14-495

వెల్లావిరులగు: 'వెల్లివిరులగు'కు రూపాం.
"వెగ్గళించి తన సేఁతలెల్లా విరులైనను
వొగ్గి తన్ను మెచ్చేఁగాని వొరటులు చూపనే" 27-369

వెల్లిఁజింతపండు: ప.బం; వి. ప్రవాహంలోని చింతపండు. వ్యర్థమని భావం.
"వుల్లములోపలి హరికొసగని పూజలెల్లా
వెల్లిఁ జింతపంటివలె వృథావృథా"

వెల్లి: వి. వెల్లువ, ప్రవాహం, పరంపర.
"మొక్కవే చెలువునికి ముమ్మాటికి
వెక్కసమైతే సిగ్గులు వెల్లులై నిగుడును" 18-396

వెల్లిగొలుపు: ప.బం; స.క్రి. విస్తరింపజేయు.
"ఇల్లిదె శ్రీవేంకటేశ్వరునామము
వెల్లగొలిపె నీ విష్ణుకథ" 3-355

వెల్లిబోవు: ప.బం. వ్యర్థమైపోవు. ప్రవాహంలో కొట్టుకొని పోవు అని వాచ్యార్థం. 3-68

వెల్లివిరియగు: అ.క్రి. వ్యాపించు, ప్రకటితమగు, వెల్లడియగు.
"వాదము లేఁటికి వలసినవారికి
వేదము గలుగఁగ వెల్లివిరాయ" 15-157

వెల్లివిరులగు: ప.బం. ప్రకటితములగు, వెల్లడియగు, వ్యాప్తములగు.
"అంగవించి శ్రీవేంకటాధిపుఁ గూడితినిట్టే
వెంగలితనాన వెల్లివిరులాయఁ జేతలు" 7-453

వెళ్లఁదీయు: ప.బం; స.క్రి. బయటకు తీయు.
"వట్టి దుష్టులతో సహవాసమైతే దాసులను
దిట్టయై వెళ్లఁదీసి తా దిక్కై కాచుఁగాక" 3-195

వెళ్లఁదోయు: ప.బం; స.క్రి. బయటకి గెంటు.
"కావరము లేల మాను కంతల మే నుండఁగాను
తోవచేసుకొని వెళ్లఁదోయుచుండుఁగాక" 4-61

వెళ్లఁబడు: ప.బం. అ.క్రి. బయటపడు.
"సొరిది నిర్మోహమను జోడు దొడిగినఁగాని
వెర వుడిగి మమతచే వెళ్లఁబడరాదు" 5-206

వెళ్లనాడు: ప.బం; అ.క్రి. స్పష్టంగా చెప్పు.
"పొలఁతి యంపిన లేక బూతులు దొరలఁబోలు
వెలయ నేమడిగినా వెళ్లనాడవు" 10-2-40

వెళ్లవేయు: (2) స.క్రి. వెడలజేయు, వెడలకక్కు, పోజేయు, తీర్చుకొను.
"వెలఁది నీ చెమటలె వెళ్లవేయఁగా
తలఁగి నేఁజెప్పకుంటే దాఁగఁబొయ్యీనా" 10-2-45
"వేగిరపుఁజేఁతలనె విరివి నీ మోహమెల్ల
బాగుగా వెళ్లవేసెవు పండరంగివితలా" 10-2-27

వెవసాయము: వి. వ్యవసాయమునకు వికృతిరూపం.
"పలుకంతల చేను బండవెవసాయము
బలిమిఁ దొక్కీఁ గుంటిపసురము" 3-464

వెసురు: వి. వేడి, వెట్ట, ఊర్పు.
"చెలువపు నీ మోము చెక్కిట నేల మోపేవే

వలపు వెసురుదాఁకి వాఁడబారీని" 17-44

వే

వేఁకకాండు: (2) (వేకము + కాండు) వి. వెగటు గలవాడు, వెక్కసి.

"రాపున హరి కింకరపు వేఁకకాండ్లాల

పైపైని మా కింకఁ బట్టియ్యరో" 1-506

వేఁకము: (4) వి. ఉపద్రవం, వెగటు, వెక్కసం. (వ్యు.)

"దండివేఁక మాపెకును తగు సంతోసము నీకు

నొండొరుల కెటువలె నొనగూర్చె దైవము"

26-223

వేఁగాటి పిఱుదు: వి. వేఁగు అయిన అనే అర్థంలో వేఁగాటి. పొడుగాటి వలె వ్యావహారికం కావచ్చు.(సంపా.) భారమైన పిఱుదు.

"చేఁగదేరఁ గూడి మొక్క శ్రీవేంకటేశ నే రాఁగా

వేఁగాటి పిఱుఁదు చూచి వెరగందేవు" 23-408

వేఁటము: వి. 1. వినోదం 2. వేడుక.

"నీఁటుకత్తె యెవ్వతైనా నీతోను మాటాడితే

వేఁట మేక మొఁగాఁక వేరె పాసీనా" 11-178

వేఁటవెట్టు: వెంటబడు (?)

"వాఁటమైన వలపులే వాసిరేఁచెఁగాక నన్ను

వేఁటవెట్టి నిన్ను నింత వేసరింతునా" 11-460

వేఁడిక: (వేఁడు + ఇక) వి. వేడుకోవడం, వేడుకోలు.

"వెలసిన వొడఁబాటు వేడికలు"

వేఁడిపాలకు నాలుక చాచు: ప.బం. ఇబ్బంది తెచ్చుకొను.

"నాయమా వేఁడిపాలకు నాలుక చాఁచ నీకు

యీ యెడ నీకే తెలుసు నెటువంటి సుఖము"

13-358

వేఁడి విడువని కూడు: *ప.బం; వి.* ఆరగించడానికి అనువైన ఆహారం. 1-328

వేఁడివేండ్లు: (వేఁడి + వేఁడి) *వి; బహు.* మిక్కిలి వేఁడులు. 'వేఁడివేఁడి' శబ్దానికి బహువచన రూపం. 'వేఁడి' శబ్దానికి 'వేండ్లు' అనేది విలక్షణమైన బహువచనరూపం.

"కలయికలే చల్లన కలయికలోపల

వెల లేని రతులెల్లా వేఁడివేండ్లు" 8-133

వేఁడులు: వి. వేఁడి శబ్దానికి బహువచనరూపం.

"సిగ్గువడఁబోతేను చింతలెక్కీని

వెగ్గళించితేను వెన్నెల వేఁడులయ్యీని" 7-44

వేంటకాఁడు: (వేంట + కాఁడు) వేఁటకాడు. ఇట వేట శబ్దం వేంట అని పూర్ణబిందుసహితంగా ప్రయోగించడం విలక్షణం.

"మత్తుఁడైనవానికి మరి పనులే లేవు

హత్తి వేంటకానికి దయలు లేవు" 15-103

వేండ్లు: వి. వేఁడిశబ్దానికి బహువచనరూపం.

"చందురు నేరమేకాదు సరసాన నలిగిన

విందువంటి వెన్నెలకు వేండ్లెక్కును" 16-265

వేండ్లువాండ్లు: వేండ్లు (= వేఁడి శబ్దానికి బహువచనరూపం.) వాండ్లు (= వాఁడి శబ్దానికి బహు. రూపం.)

"విరుల శరంబుల వేండ్లవాండ్ల

మరులునుఁ దెలువులు మగువకును" 20-266

వేగరికాఁడు: (వేగు + అరి + కాఁడు) చారుడు, వృత్తాంతం తెలిపేవాడు.

"ఆసలు చూపిన లో నౌనంటి గదవే

వేసదారి యంటిఁగదే వేగరికాఁడంటిఁ గదే"

11-266

వేగస: క్రి.విణ. వేగంగా (?)

"వీడియు వీడని కొప్పు వేగస ముడుచుచు

ఆడెడి బిత్తరిమాట లమరఁగా" 5-128

వేగాటి: విణ. భారమైన.

"చేఁగదేరఁ గూడి మొక్క శ్రీవేంకటేశ నే రాఁగా

వేఁగాటిపిఱుదు చూచి వెరగందేవు" 23-408

వేగినంతా: తెల్లవారేంత వరకు.

"వేగినంతా మాటలాడి వేసారదు నా మనసు

జాగుకు నీ కోపవంటా జడిసేఁగాని" 27-530

వేగిరకత్తె: (2) (వేగిరము + కత్తె) త్వరపడే స్త్రీ.

"ఇంత వేగిరకత్తె నా యెఱఁగనా నే నేమైనా
మంతనాన న న్నతఁడే మన్నించీఁగాక" 18-49

వేగిరకాఁడు: (వేగిరము + కాఁడు) వేగిరపాటు కలవాడు, త్వరపడేవాడు.

"ఎట్టి వేగిరకాఁడవు యేమయ్యా నీవు
మిట్టిపడి దయ్యమైనా మెచ్చవద్దా నిన్ను" 13-479

వేగిరపుఁదనము: (వేగిరము + తనము) త్వర, తొందర.

"ఒల్లనని మానరాదు వొలసి పైకొనరాదు
వెల్లవిరి ఆయ నా వేగిరపుఁదనము" 20-97

వేగిరించు: (3) స.క్రి. తొందరపెట్టు, త్వరపెట్టు.

"ఆసోదకాఁడవై యంటితివి ముందే
వేసరకెట్లా వేగిరించేవయ్యా" 25-249

వేగిలి: (?)

"రాసికెక్కె మునులకు రచ్చైన పొలము
వేసరక నాఁగేట వేగిలైన పొలము" 4-52

వేగుఁబొద్దు: వి. ప్రాతఃకాలం.

"చెలి వేగుఁబొద్దునను సేసిన చేఁతలకు
సెలవుల నవ్వుకొంటా సిగ్గువడీని" 22-438

వేటులాడుకొను: ఆడుకొను. 11-216 old

వేడిక: వి. 'వేడుక'కు వికృతిరూపం (?)

"కనుచూపు వాడికాయ కాఁగిలిట్టె వేడికాయ
మొనగోరి చెనకుల మోనములేలే" 29-488

వేడీ: ఏడీ? ఎక్కడున్నాడు?

"యేకోదకమున వటపత్రమున యీఁరేటి నీ కంటే
దీకొని పలికిన కాలంబుల కొనదేవుఁడు మఱి వేఁడీ" 4-104

వేడుకకాఁడు: (13) (వేడుక+కాఁడు) వి. కౌతుకం కలవాడు, కోరిక కలవాడు, విలాసవంతుడు, క్రీడాసక్తుడు, ఉపపతి, జారుడు, విటుడు.

"వేవేలు సతులు గల వేడుకకాఁడవు నీవు
దేవులఁ గనక నీకుఁ దెలిపితిఁ జుమ్మీ" 29-270

వేడుకకారితనము: (వేడుక + కారి + తనము) కుతూహలం, విలాసం, వినోదం.

"వింటిమి కంటిమి తన వేడుకకారితనాలు
ఇంటిలోనఁ దన నేమా లెచ్చరించనేఁటికే" 29-145

వేడెము: వి. మండలగతి.

"మట్టి దైత్యపురాల మర్మాలు విదలించినాఁడు
చుట్టు వేడెమున యింతా సోదించినాఁడు" 4-306

వేడెము: వి. మండలగతి, చుట్టు తిరగటం.

"వెడెము నేఁ జేయనంటా విచారాలే హెచ్చెనంటా
యీడనాడ వారితోడ నేల చెప్పేనే" 14-385

వేడెవెట్టు: (వేడెము + పెట్టు) పరివేష్టించు, చుట్టుముట్టు, ముట్టడించు.

"వీడనాడనీఁడు నన్ను విట్టలేశుఁడు అట్టె
వేడెవెట్టీ వలపులు విట్టలేశుఁడు" 11-70

వేద: (8) వి. వ్యథ, బాధ. 'వేధ' కు అంతటా 'వేద' అనే రూపమే కనిపిస్తుంది.

"వేద(దు)తో నొక్కొక్కవేళ వెలుతులు గలిగితే
నీ దయవెట్టి వెనక నీవే తీరుతువు" 3-18

"నీ దాసులున్నచోట నిత్యవైకుంఠ మిదె
వేదతో వేరొకచోట వెదకనేలా" 3-180

వేదనముసేయు: వేదన కలిగించు.

"వగలు బాఁతె వలలఁబెట్టెడి తమ్మిఁ
దగిలించు మమత వేదనము సేయఁగా" 1-141

వేదనారాయణుఁడు: వి. సోమకాసురుడపహరించిన వేదాలను తిరిగి తెచ్చిన విష్ణుమూర్తి.

"వేదనారాయణయంటే వీడేటి (వీడని?) బంధములు
ఆదిగా మూఁడు లోకాలనైనా ఉన్నదా" 1-407

వేదపఠన: వి. వేదపఠనం.

"భవహరముగ వేదపఠన సేసేమంటే
భవహరమగు హరిపాటలు నోట నున్నవి" 4-252

వేదలుకట్టు: బాధలు కలిగించు.
"సాదువలె నుండఁగాను సన్నసేసీనంటే
వేద లేల కట్టేవే విభునిమీఁద" 20-538

వేదవట్టు: *ప.బం.* వేదప్రవచనం చేయు.
"వేదవట్టి యిఁకనేమి వెదకేరు చదివేరు
వేదాంతవేద్యుఁడైన విష్ణునెఱుఁగరా" 3-535

వేదశిఖలు: వి. వేదాంతములు, ఉపనిషత్తులు.
"కల్లని మీ త్రివిక్రమాకారము చూపి మీరు
చెల్లఁబెట్టితిరి వేదశిఖలందు మరియు" 3-68

వేదాద్రి: వి. కృష్ణాతీరంలోని యోగానంద నృసింహస్వామి వెలసిన క్షేత్రం. నెల్లూరు జిల్లాలోని నరసింహుని కొండకు కూడా వేదగిరి అనే నామాంతరం ఉంది. కాని యోగానంద లక్ష్మీనృసింహస్వామి అనడంవల్ల కృష్ణాతీరంలోని వేదాద్రియే కావచ్చు.
"సగముపై యోగానందనరసింహము వీఁడె
మిగుల వేదాద్రి లక్ష్మీఁనారసింహము" 4-182

వేదు: వి. దుర్గంధం.

వేదుగా: క్రి.విశ. వెగటుగా, వెక్కసంగా, దుస్సహంగా.
"పాదమున నంటిన పచ్చకప్పురములోన
వేదుగాఁ దులసితావి విసరీని" 5-190

వేదు విడిచిన కూడు: వి. దుర్గంధం లేని కూడు, విరసత్వం లేని కూడు.
"ఏది చూచినఁ దమకు యిన్నియును నిటువలె
వేదు విడిచిన కూడు వెదకినను లేదు" 1-95

వేధాముఖము: వి. దశమహావిద్యల్లో ఒకటైన తారవిద్యకు సంబంధించిన సాంకేతికపదం. మనస్సు చెదరకుండా ఉంచి శ్రీహరిని తలచడం.
"అదివో వేధాముఖ మంతరంగపు మనసు
చెదరకుండా జొనిపి శ్రీహరిఁదలఁచుట" 1-452

వేనామాల వెన్నుఁడు: వి. వేయి (సహస్ర) నామాలు గల విష్ణువు.
"వేనామాల వెన్నుఁడా వినుతించ నెంతవాఁడ
కానిమ్మని నా కీ పుణ్యము గట్టితి
వింతేయయ్యా" 2-338

వేనీళ్లు: (వేడి + నీళ్లు) వి. 'వేన్నీళ్లు' అనే శబ్దానికి వికృతిరూపం. వేడినీళ్లు.
"ఒకరికొకరు దాపు వోపనంటేఁబోదు యిఁక
వెకలి చన్నీళ్లకు వేనీళ్లు దోడు" 5-86
"ఒప్పుగ వేనీ ళ్లొల్లని దేహము
నిప్పులు చల్లఁగ నిలిచీనా" 6-93

వేనుబాము: వి. (?)
"దోమటి యింద్రియాలే నాతోడు నీడై యుండి నన్ను
వేమరు భోగించఁజేసె వేను బామైనది" 15-69

వేయింటిపై జవ్వాది కొమ్ము: *ప.బం;* వి. పదిలో పదకొండు. (f.n.)
"యెంత లేదు పదవే వేయింటిపై జవ్వాదికొమ్ము
యెంతలేదు పదవే అంతక వచ్చితేఁగా ఆ
పనులు" 22-9

వేయిటిపై జవ్వాది: *ప.బం;* వి. పదిలో పదకొండు. (f.n.)
"వేయిటిపై జవ్వాదివో వేగిరించనేల నాకు
దాయము వచ్చినపుడు తలపించేఁ బనులు"
20-145

వేయినోళ్ల భోగి: *ప.బం;* వి. ఆదిశేషుడు. వేయి శిరస్సులు గల సర్పమని వ్యుత్పత్తి.
"వేయినోళ్లభోగి నీవు విన్నపము సేయరాదా
వేయేసి మా విన్నపాలు విష్ణునికిని" 3-267

వేయివేలగు: అ.క్రి. పదిలక్షలగు, అనేకమగు.
"వేయివేలై వేగుదాఁకా వెట్టిసేసి యలసితి
వోయయ్యా కొంతైనా వూరడించవలదా"
4-412, 4-207

వేయివేలు: వి; బహు. వేలవేలు.
"వెంటనే హరినామాలు వేయివేలై వుండఁగా
జంట నితరమంత్రాలు జపియించీ జీవుఁడు"
2-103

వేరీ: (11) ఏరీ, ఎక్కడ. (వేరు = ఎవరు)
"హరి నీ ప్రతాపమున కడ్డమేది లోకమున
సరి వేరీ నీకు మరి సర్వేశ్వరా" 2-156

వేరు: వి; బహు. ఎవరు.

వేరుపురువగు: ప.బం; అ.క్రి. వినాశకరమగు.
"వెలయఁ జిత్తంబునకు వేరుపురువై బుద్ధిఁ
గలఁగించె మోహవికారము" 11-3-109

వేరువెల్లంకులు: వి; బహు. వేర్లు-గడ్డలు.
(వెల్లఁకి = గడ్డ, దుంప. తె.వ్యు.కో.)
"వెడమంత్ర మిఁక నేల వేరువెల్లంకులు నే
పుడమిధరుఁడు మాకు భువనౌషధము" 1-461

వేలఁజూపు: దోషాన్ని చూపు.
"పొంచి యేమి సేసినాను పుచ్చకాయలోర్చుఁ
గాక
యెంచి వేలఁజూపితేను యితరము లోర్చునా"
8-131

వేలపుఁబ్రియములు: (?)
"వేలపుఁబ్రియముల వేంకటేశ నిను
మూలకుఁ బిలుచుచు మొక్కిరి నీకు" 5-214

వేలుఁగొప్పు: వి. వేలాడుకొప్పు (?)
"వేలుఁగొప్పుతోడ నీవు వెంగెములాడఁగాను
కోలుముందుగా నిన్ను గోర గీరె నతఁడు"
25-223

వేలుకాడు: (వేలుక + ఆడు) వేలాడు.
"కనుఁగొనఁబోతే నందు కళ లింతే వుండీనని
వెనుకొని కాంతలెల్లా వేలుకాడేరా" 21-121

వేలెడు దీపము: చిరుదీపము.
"వేలెఁడు దీపము నమ్మి వెడఁగు జీఁకటిఁబాసి
పోలిమి నొక్క నరుఁడు పొదలఁగాను" 1-429

వేళగాచు: (?)
"మూలనున్నాఁ బోనీదు మున్నిటనే వేసెది
వేళగాచిన బంధము విద్యాగర్వము" 3-361

వేళము: వి. త్వరగా.
"మేలే వేంకటపతి మెల్లనె విచ్చేసినాఁడు
వేళమె అక్కకు విన్నవింత మోసి" 5-9

వేళ లేదు పొద్దు లేదు: ప.బం. వేళాపాళా లేదు
అనే అర్థంలో వాడిన పలుకుబడి.
"వేళ లేదు పొద్దు లేదు వేగిరించే నింతలోన
నీ లాఁగు లెఱఁగరు నిందలాడేరు" 26-169

వేళవేళ: సర్వదా.
"పోలింప వివేకులకు పుణ్యమునుఁ బాపమును
వేళవేళనే వున్నవి వెదకరో జనులు" 3-104

వేళావేళ: వి. సమయాసమయాలు.
"వేళావే ళెరుఁగక వేసరించితిని నిన్ను
యీ లీల నీ చిత్త మెట్టో యెరఁగఁజుమ్మీ
అయ్యా" 11-103

వేళావేళలు: (3) 1. అన్నిసమయాలు, సర్వదా.
"వెలుపల లోపల వేళావేళల
నలినాక్ష నీకే నమో నమో" 4-100
"వేళావేళలు లేవా వినోదములకైనాను
యేలా తమకించి వస్తే యిది నీ వెఱఁగవా"
10-2-114

వేవేలు: వి; బహు. అనేకం.
"వేవేలకు నీకు నీవే విచారించి మన్నించు
భావించి యెన్నఁడునుఁ బాయకుమీ నన్నును"
13-341

వేవేళ: (వేళ + వేళ) అన్నిసమయాల్లో,
ప్రతిసమయంలో.
"యీవేళ శ్రీవేంకటేశుఁ డీతఁడిట్టె నిన్నుఁగూడె
వేవేళకు నీ మోవి విందులాయఁగదవే"

వేసంగికాలము: వి. వేసవికాలం, ఎండకాలం.
"వేసంగికాలమున వేడ్కసలుపు లివె
శ్రీసతియు భూసతియుఁ జేరి కలయఁగను"
7-444

వేసదారి: (5) (వేసము + దారి) వి. 'వేషధారి'కి
తద్భవం, మాయదారి, నటనలు చేసేవాడు.
(విణ. కల్లబొల్లి)
"వొడఁబాటైనఁ గద్దు వోపిక గలిగితేను
విడువక నీవంటి వేసదారికి" 11-428

వేసరించు : అ.క్రి. 1. శ్రమపడు 2. విసుగుచెందు 3.చింతిల్లు, విచారంపొందు 4. నొచ్చు, బాధపడు.
"ఆసలెల్లాఁ జాపినాఁడు ఆలిఁ జేసుకొన్నవాఁడు
వేసరించి ఇఁకనేమి వేఁడుకొనేదేమే" 18-242

వేసరుకొను : 1. శ్రమపడు 2. విసుగుచెందు 3. చింతిల్లు, విచారంపొందు 4. నొచ్చుకొను, బాధపడు. (తె.వ్యు.కో.)
"వేసరుకొనవలదు విభుఁ డెలయించితేను
ఆస రేఁచి యిచ్చకము లాడుటగాని" 16-442
బాధించు :
"వెరవున నే నెవ్వరిని వేసరించజాలక
దరిచేరుటే దొరతనమిది గాదా" 4-326
అసహ్యించుకొను :
"వాసులకే పెనఁగేము వలచి వలచి నీకు
వేసరుకోకు యెంతైనా విడువరాదు" 27-253

వేసారేది : ఇట 'ఏది' అనేది భావార్థంలో చేరిన పదం. శ్రమపడడం, బాధపడడం, విసగడం.
"మిక్కిలి సంసారము మెడఁగట్టితివి నాకు
అక్కరనే వేసారేది అపరాధమవుఁగాదో" 3-20

వేసాలఁబెట్టు : ప.బం; స.క్రి. ఆట ఆడించు.
"వెచ్చిమేనితోఁ గూడి వేంకటేశుఁడ నీ
వెచ్చపుఁ గౌఁగిట నన్ను వేసాలఁబెట్టేవు" 5-4

వేసాలఁబోవు : (6) ప.బం; అ.క్రి. వట్టి నటనలు చేయు.
"ముంగిట మావంటివారి ముందరను గోలవటె
వెంగలివిద్యలే సేసి వేసాలఁ బొయ్యేవు" 16-377

వేసాలది : (వేసాలు + అది) నటనలది.
"వేసాలదానఁగాను వెక్కసపుదానఁగాను
పోసరించి నన్ను నింత పొగడనేలే" 20-408

వేసాలరాయఁడు : వి. వేషాలరాయఁడు, వట్టి నటనలు చేసేవాడు.
"వేంకటేశుఁడు వేసాలరాయఁడు
అంకెలా నన్ను నలరించెనే" 5-176

వేసాలవాఁడు : వి. నటనలు చేసేవాడు.
"వెలలేని మహిమల వేసాలవాఁడు
పలుకు లీడేరె నిఁక భావించనేఁటికి" 24-326

వేసాల వేడుకకాఁడు : నటనల వేడుకకాడు.
"వీదుల జాజరకాఁడ వేసాల వేడుకకాఁడ
యీదెసఁ బాయము కానుకిచ్చేమయ్యా" 11-57

వేసాలు : (7) వి; బహు. నటనలు.
"ఈడ మాతో నింత యేల యెగసక్కేలు
వేడుకకాఁడవు నీవు వేసాలు మానరా" 20-242
"వేసాలకు నీ వెంత వేడుకఁగాఁ గలించినా
ఆసపడి నిన్ను నేను ఆయా లంటేనా" 7-588

వేసాలు చూపు : అ.క్రి. నటనలు చూపు.
"కంటిమే నీ వల్ల నిట్టి కతలెల్లాను
వెంట వెంట వచ్చి కడువేసాలు చూపేవు" 19-290

వేసాలు చే(సే)యు : (13) అ.క్రి. నటనలు చేయు.
"వెగ్గళించి మా ముందర వేసాలు చేసేవు గాక
అగ్గమై యేకతవేళ నడ్డాఁకలున్నవా" 25-330

వేసాలు వేయు : ప.బం; అ.క్రి. నటనలు చేయు, వేషాలు వేయు.
"నీడల నే నవ్వితేనే నీ పరిణామము గాదా
వీడనాడనే వేసాలు వేయకురా" 11-365

వేసును : క్రి.ప. 'వేయును' అనే దానికి వ్యావహారికరూపం.

వేసులు : వి; బహు. వ్యాసులు (వ్యాసమహర్షి) అనడానికి జానపద వ్యవహారం.
"వేసులు మాకుఁ జెప్పు విన భారతము గాఁగ
మోస నీ పాల ముచ్చిమి మొదలుగాను" 2-162

వై

వైకుంఠము అరచేత నిలుచు : ప.బం; అ.క్రి. గొప్ప అదృష్టం కలుగు.

వైఘానసులు : వి; బహు. రూపాం. వైఖానసులు. విఖనసుడు అనే ముని ప్రవర్తింప జేసిన వైష్ణవమతాచారాలను అనుసరించేవారు.

"తేటగా భుజచక్రద్విజాతి నవని
తాటించి వైఘానసులు ధరించే ధర్మమిది"
15-113

వైతాళము: వి. ఈ శబ్దం ప్రసిద్ధనిఘంటువుల్లో ఎందులోనూ కానరాదు. సం.ప.స. లో ఈ పదం అర్థాన్ని గురించి ఈ వివరణ కనిపిస్తుంది. వైతాళిక శబ్దము యొక్క రూపాంతరంగా వైతాళ శబ్దమును గ్రహించి వాడినట్లున్నది. సమయమునకు తగినమాటలు, పొగడ్తలు ఇత్యాదులు దాని అర్థము కావచ్చును. (27 సం. 388 పు.)

"వద్దువద్దు అంతేసి వైతాళాలు
వుద్దండాలు వేయఁబోతే పుట్టిలేక వూఁగవా"
21-169

తగినమాట, పొగడ్త అనే అర్థం పై ఉదాహరణల్లో సముచితంగా ఉన్నా ఈ క్రింది ఉదాహరణల్లో కుదరడంలేదు.

"ఆతుమ వేసరి అలసి వూరకుండితే
వైతాళపు నీడవలె వచ్చు వెంటవెంటను" 2-240

ఇట వేతాళపు (బేతాళపు) నీడ అనే అర్థం ఉచితంగా ఉంటుంది. వేతాళశబ్ద తద్ధితరూపం వైతాళము.

వైనవైనాలు: (వైనములు + వైనములు) మిక్కిలి వివరణలు, ఉపాయాలు, కారణాలు, క్రమాలు, విధాలు. క్రింది ఉదాహరణంలో అనేకవిధాలు (రకాలు) అనే అర్థం కుదురుతుంది.

"ఔనటవే ఇంకా నేమందునే నేను
వైన వైనాలుగా నన్నీ వాఁ(వ్రా)సిత్తునటవే"
23-467

వైపరి: (వైపు+అరి) వి. శ్రేష్ఠుడు (తె.వ్యు.కో.) ఉపాయశాలి, వాసికాడు.

"వైపరివి ఇటువంటివాఁడవు గాకుండితేను
రాఁపుల నిన్నిందరును రసికుఁడవందురా"
21-167

వైపు తెలిసినవాడు అని సంపా. 21 సం. 112 పు.

వైపు: (13) వి. 1. ఉపాయం 2. ఒడుపు, లక్ష్యం 3. తట్టు, పక్క 4. సరి (17-579 old) 5. వాసి 6. అతిశయం 7.మెలకువ 8. అనుకూలం.

"వై పాయ నీ సింగారము వడి సంతోసించు
కొంటిమి
ఆపాటి నీ దొరతనమందరు నెఱఁగరా" 27-544

వైపుగ: క్రి.విణ. గుఱిగా.

"పాపాలు సేసి మఱచి బ్రదుకుచున్నాఁడఁగాని
వైపుగఁ జిత్రగుప్తుఁడు వ్రాయు టెఱఁగ" 2-16

వైపులాఁడి: (వైపులు + ఆఁడి) వి. ఉపాయశాలి.

"అలయించి రతిఁగూడి అంగము లెంగిలిచేసి
వలచిన జా డనేవే వైపులాఁడివి" 26-317

వైష్ణవాగారము: వి. విష్ణువు గుడి.

"వాసి గనవలసినను వైష్ణవాగారంబు
వాసి సేయుట దనకు వైభవస్ఫురణ" 1-326

వొ

వొలకమ్మకెక్కు: (?)

"యిట్టె యాతఁడు వచ్చిన నిద్దరును నొక్కటే
అట్టు వొలకమ్మ కెక్కె యిట్టె మాను మీఁకను"
20-233

వో

వోఁకలు: (?)

"యేఁకట దొర నీకు నెందరు గలరని
వోఁకల పులుసు కలువులఁ బుచ్చవలెనా" 5-1

వోచిక: వి. 'వాచికము'నకు వ్యావహారికమా? (సంపా.)

"చూచినయందెల్ల చూపును రూపము
వోచికఁ (?) బొగడిన వుండు నోటను" 3-141

వ్ర

వ్రతము చెల్లిన వట్టగట్లు: ప.బం; వి. (?)

"ధృతిహీనులకు నెల్ల దిక్కయి కాతువుగాక
వ్రతము చెల్లిన నింక వట్ట గట్లా" 1-280

వ్రయ్యము: (?)

"వ్రయ్యములు తొమ్మిదైన వనిత మానితినని
కొయ్యతనమున బాసగొనక నిన్నొల్లను " 6-166

వ్రా

వ్రాలకమ్మలు : *వి; బహు.* అక్షరాలు వ్రాసే కమ్మలు.

"వలనై పొందికల నీ వ్రాలకమ్మలు చూచి
పలచనినవ్వుల పండు గాయ మోవి" 7-233

వ్రాలాకు : (వ్రాలు + ఆకు) జాబు; అక్షరాలు గల ఆకు.

"తాను వచ్చేననునో యీతరి నన్ను రమ్మనునో
పూని తన వ్రాలాకు పుత్తెంచెనా" 9-54

వ్రాసు : స.క్రి. 'వ్రాయును' అనడానికి వ్యావహారికరూపం.

"భావించి యొకమారు పలకపైనిను వ్రాసు "
28-59

వ్రి

వ్రిత్తి : వి. 'వృత్తి'కి వ్యావహారికరూపం.

"ఆహికముగ నిట్టి అధమవ్రిత్తికి నే
సాహసమున నెట్టు చాలుదునయ్య" 1-235

"కడలేని యిటువంటి కలుష వ్రిత్తికి నాత్మ
వొడఁబర పఁగ నెట్లోపుదునయ్య" 1-235

వ్రిథా : అవ్య. వృథా.

"యెంత లోకానుభవము అంతయు వ్రిథానష్టి
కొంతైనా బ్రహ్మచింత కోటి లాభము " 2-185

"అయ్యో నేనేకా అన్నిటికంటెఁ దీలు
గయ్యాళినై వ్రిథా గర్వింతుఁగాని" 2-80

వ్రే

వ్రేఁత : వి. 'వ్రేఁత'కు వ్యావహారికరూపం. గొల్లస్త్రీ.

"మత్తిలి వ్రేఁతెల నిండుమనసుల కెల్లాను
చిత్తజునివంటివాఁడు శ్రీవేంకటేశుఁడు" 11-343

"తెలుఁగున శౌరివ్రేఁతెల యెడయెడను " అని అష్ట.క. లో 'తె' యతిస్థానంలో ప్రయోగింపబడటం విశేషం.

శ

శంకనినాదమృదంగుఁడు : వి. విష్ణువు, వేంకటేశ్వరస్వామి. శంఖధ్వనియే మృదంగధ్వనిగా కలవాడని వ్యుత్పత్తి. 1-141

శంకము : వి. 'శంఖము'నకు జానపదవ్యవహారం.

"శంకమ నీవ సాక్షి చక్రమ నీవు సాక్షి
వంకలాడ భుజముల వ్రాసుకొంటి మిమ్ము ను "
15-169

శంకరాభరణము : వి. ఒక రాగవిశేషము.

"పాటలలో శంకరాభరణ మాళాపించరే
నీటు చల్లగాలి సొంపు నిలుచుఁగాని" 28-273

శంకుఁజక్రములు : (3) వి. 'శంఖచక్రములు' అనడానికి జానపదవ్యవహారం, విష్ణుమూర్తి అలంకారములైన శంఖము, చక్రము.

"తిమ్మిరి మమ్ముఁగావఁగ దిక్కయి మాకు నిలువ
జమళి భుజముల శంకుఁజక్రములు గలిగె" 3-3

శంఖుఁజక్రాలు : వి. శంఖచక్రాలు.

"భుజములుప్పొంగఁగాను పూఁచిన శంఖుఁజక్రాల
త్రిజగములు నేలేటి దేవసింహమా" 2-363

శంఖచక్రాలహస్తాలవాఁడు : వి. విష్ణువు, శంఖమూ చక్రమూ రెండు చేతుల్లో కలవాడు.

"ముద్దులమొగమువాఁడు ముత్తేల నామమువాఁడు
అద్దిగో శంఖచక్రాల హస్తాలవాఁడు" 7-116

శంఖుచక్రములవాఁడు : వి. శంఖచక్రములు గల విష్ణుమూర్తి.

"జవళి పంతాలవాఁడు శంఖుచక్రములవాఁడు
తివిరిన అహోబలదేవుఁడటే వీఁడు" 2-508

శంఖుచక్రాలు : వి. శంఖచక్రములు.

"ఇప్పుడు శ్రీవేంకటాద్రి నిరవై శంఖుచక్రాలు
కుప్పె కటారముఁబట్టె గోవిందరాజు"
7-470 & 14-453

శఠకోపముని : వి. ద్వాదశాళ్వార్లలో ప్రసిద్ధులైన నమ్మాళ్వారు.

"నిరతి నహోబలనృకేసరికిఁద
త్పరుఁడగు శఠకోపముని యితఁడు" 1-117

శఠియించు : అ.క్రి. కుత్సితత్వం చూపు, మూర్ఖత్వం చూపు.
"వెల్లిగొను మందునకు వేంకటేశుస్మరణ
చల్ల నౌనా మనసు శఠియించుఁగాక" 1-242

శత్రులాఱుగురు : వి; బహు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు, అరిషడ్వర్గం.
"బెదరి వైదుగురికిని భీతి నొందుచుఁ గడు
జెదరంగఁ జూతువే చిలుకా" 1-50

శమించుకొను : స.క్రి. శాంతింపజేసుకొను, క్షమించు.
"శమించుకోవయ్యా సర్వాపరాధాలు
కొమరెవయసు గుణాలదాన" 27-416

శలవు : వి. సెలవు. 1. ఉపయోగం 2. సత్యం 3. ఆజ్ఞ 4.చోటు 5. అనుజ్ఞ 6. విడుదల 7. వీలు 8. పోటు 9.విరామం.
"ఇతరాలు మానఁగానే యీతనికే శలవు
నేనెట్ల నుండినాను నీకె శలవు" 8-217

శా

శాఖ : కొమ్మ అని శబ్దార్థం. కాని క్రింది ఉదాహరణంలో దాని ఛాయార్థంగా కిరణం అని అర్థం చెప్పవచ్చు.
"సతతము చందురుని శాఖాశైత్యము మాన
రతివేళ తాంబూలరసము మందు" 16-145

శాన : క్రి.విణ. 'చాల' అనే శబ్దానికి జానపద వ్యవహారం, ఎక్కువ.
"వూరకే నన్నేల యింక వొడివట్టేవు
నారుకొన్న సతులు శానలు గారా నీకు" 17-104
'శాన' శబ్దానికి బహువచనరూపం విలక్షణం.

శానశాన : (2) విణ. 'చాలా చాలా' అనడానికి జానపద వ్యవహారం.
"అచ్చపు నీ కాఁగిలిదే అతివలు శానాశాన
ఇచ్చితివి నా వంతు యెంత వచ్చునందును"
7-517

"యెంత వలసినాఁ గద్దు యెంచుకొంటే నా యాస
చింతించితేఁ గోరికలు శానాశాన" 12-235

శాయగన్ : 'చేయగన్' అనడానికి జానపద వ్యవహారరూపం.
"తరుణి నినుఁబెడఁబాసి తపము శాయఁగఁదొడఁగె
విరహంపునులిగురులతో విరిజడలతో" 7-290

శాలామాలము : 'శాలామాలావాహ = అవకతవకలుగా confusedly అని తమిళనిఘంటువు. ఇట్టివే ఈదా-మోదా, సాటికి-బేటికి అనే జంటపదాలు.
"శాలామాలములైన చయ్యాటము నీతో నేల
మేలే నీ సేఁత లెల్లా మెచ్చితినే" 13-486

శావ : (2) వి. 'సేవ'కు జానపదవ్యవహారరూపం. పరిచర్య, పూజ.
"భక్తి యింతా నొక ఘంటాపథము నీ శావలే
యుక్తిఁ బాత్రాపాత్రములు యూహించనేల"
1-497

శాసలు : (3) వి; బహు. 'సేసలు' అనడానికి జానపద వ్యవహారరూపం. తలంబ్రాలు.
"పెట్టిన శాసల నీ ప్రియురాండ్లెల్లాను
గుట్టుతోడ నుండవలెఁ గోరి నీవద్ద" 7-587

శాస్త్రి : వి. శాస్త్రం చదివినవాడు.
"జపితలు గొందరు శాస్త్రులు గొందరు
ప్రపత్తిఁ గొందరు బలువులు" 1-499

శి

శింగరి : వి. 'సింగరి'కి జానపదవ్యవహారరూపం. సింగడు, నృసింహస్వామి.
"చెల్లెఁజెల్లె నీ చేఁత శింగరి నీ
వుల్లమెల్లఁ దక్కఁగొంటినో శింగరి" 7-315

శింగిణి : వి. 'సింగిణి'కి జానపదవ్యవహారరూపం. హరివిల్లు, ఇంద్రధనుస్సు.
"అరచంద్రుఁడుఁ జకోరాలద్దాలు సంపెఁగయు
ధర శింగిణులు శ్రీలు తలిరులును" 7-337

శికరము: వి. శిఖరము.
"వెండిశికరమువాని వెట్టియీవి తుదముట్టె
వండనికూటివారికి వై పాయఁబనులు" 7-277

శిఖరులు: వి; బహు. భక్ష్యవిశేషం.
"పానకాలు శిఖరులు పటికంపుఁగొప్పెరల
పూని వాసనలు గాఁగ పువ్వుఁగట్టించి" 17-316

శిఖాసూత్రాలు: వి; బహు. (తలమీది) శిఖ మరియు యజ్ఞోపవీతం.
"వెరసి శిఖాసూత్రాలు విడిచితే ప్రణవమేది
పరఁగ భక్తి లేదట భవ మెట్టు గడచె" 4-270

శిగ్గగ్గు: వి. సిగ్గు అనే అర్థంలో జంటపదం.
"పొంచి శిగ్గగ్గఱగని బోయనాయఁడు
మించి రాలమీఁద దాఁటే మెండు
బోయనాయఁడు" 1-460

శిథిలి: వి. 'చెదలు'కు ప్రకృతిరూపమని సంపా.
"కడుఁబులకలనె శిథిలి కన్నచోటనె పొడమె
సుడిసి చెలి సిగ్గెట్లు చూరఁబోఁగలదో" 5-249

శిన్నెక: వి. 'చిన్నక్క' అనడానికి జానపదవ్యవహారరూపం.
"శిన్నెక లేవే చెలువుని తా
వెన్నలు సవిగొను వెన్నునితో" 5-168
"చెలువపు సేఁతల శిన్నెకా
చిగురుబెదవులాఁడి శిన్నెకా" 5-261

శిరసుండ మోకాల సేసవెట్టిన యట్లు: నానుడి; అర్థమైంది. ఒకటి ఉండగా దానిని విడిచి అనర్థమైన మరొక దానికై వెళ్లు. (తలంబ్రాలు పోయవలసింది శిరసుపై కాని వాటిని మోకాలిమీద పోయడం మీద వచ్చిన పలుకుబడి.)
"శిరసుండ మోకాల సేసవెట్టి న యట్లు
పరమధర్మము మాని పరచుగా వలసె" 15-120

శిరసుముడుచు: ప.బం; అ.క్రి. (స్త్రీలు) తలదువ్వుకొను.
"శిరసు ముడువఁబట్టెఁ జిక్కు దియ్యఁగబట్టె
గరిమల గవటాలఁ గాలకాలము"

శిరులు: వి; బహు. సిరులు అనడానికి జానపద వ్యవహారరూపం. సంపదలు.
"చేరి బ్రహ్మాదులెల్లాను సేవలు సేయఁగాను
మేరమీరిన శిరుల మేడలో నున్నాఁడు" 2-355

శిరోమాణికము: వి. తలలోని మాణిక్యము.
"కప్పురపుఁ బళ్లందిన కాంతల కెల్లాఁను (?)
కప్పిన శిరోమాణికమవె కావా!" 9-201

శిలుగు: వి. 'సిలుగు'కు జానపదవ్యవహార రూపం. 1.ఉపద్రవం 2. హాని 3. కష్టం.
"తలఁపులో దక్కె ముక్తి తగు శరణాగతికి
శిలుగుఁబుణ్యములకుఁ జిక్కదు గాని" 3-399

శివమాడు: ప.బం; అ.క్రి. పూనకం వచ్చి ఊగు.
"బొమ్మలాట నిజమంటాఁ జూచి చూచి
మెచ్చినట్టు
తెమ్మగా శివమాడి తా దేవరైనట్టు" 2-37

శివసత్తులు: వి; బహు. శివభక్తులు.
"పేరులు విడిచి సంకుఁబేరులు మెడవేసుక
సారెకుఁగొందరు శివసత్తులైరి" 2-246

శిష్టు: వి. 'శిష్టులు' లోని ఉకారం లోపించగా ఏర్పడిన రూపం. ఇలాంటి రూపాలు దేశికవుల రచనల్లో కనిపిస్తాయి. ఇట్లే 'దుష్టు' అన్న పదం కూడా.

శిసువు: (5) వి. 'శిశువు'కు జానపద వ్యవహారరూపం.
"శిసువనై నాఁడు నీవు బండికిఁ బాదము చాఁచి
దెసలనర్జునుబండి తేరు నెక్కితి" 20-332

శీ

శీతు: వి. చల్లదనం, చల్లన. రూపాం. సీతు.
"వానల శీతున వాయుమార్గమున
యీనుచు నున్నవి యేండ్లు" 15-360

శీతో భవ: ఇది సంస్కృతవాక్యం. 'చల్లబడుము' అని అర్థం.
"అనలము "శీతో భవ" యన నేరిచిన సీత
పనివి రావణ "హతో భవ" యన నేరదా"
15-263

శీర: వి. 'చీర'కు జానపదవ్యవహారం.
"పసపు శీర నాకుఁ బరపుగాఁ బరపించి
యెసఁగ నిట్టె సనవియ్యేఁడుగా" 5-370

శీరపాణి: వి. 'సీరపాణి'కి జానపదవ్యవహార రూపం. బలరాముడు, నాగలి చేత గలవాడు.
"శీరపాణే గోసమాణే శ్రీ వేంకటగిరి
కూటనిలయ" 2-34

శు

శుకపికము: వి. చిలుకలు, కోకిలలు. ద్వంద్వంలో ఏకవచనం విలక్షణం .
"రవ్వేసెయ శుకపికము రాయడి కోర్వఁగ రాదు
అవ్వల నెవ్వతె పసల కలరున్నవాఁడో" 6-147

శూ

శూర్పనఖ: వి. 'శూర్పణఖ'కు జానపదుల వ్యవహారం. చూ: సూర్పనక, చుప్పనాతి.
"తటుకన మారీచుతలపైఁ బోయ కర్మము
కుటిలశూర్పనఖ ముక్కునఁ బండెను" 4-520

శె

శెలవు: వి. అర్పణం.
"తండ్రిపైఁ జేసిన భక్తి దైవమా నీకే శెలవు
తండ్రికి తండ్రివి నీ వంతర్యామివి" 15-144

శెలవుసేయు: ప.బం. అర్పణచేయు .
"నెలవైన మాటలె నిజమయ్యీని మాకు
శెలవుసేయకు వోయి చెలువరీ!" 10-2-21

శే

శేకరము: వి. 'శేఖరము' నకు వికృతిరూపం కావచ్చు. సిగదండ, బాసికదండ.
"సేకరమాయ వలపు సిగ్గులువడితే బోదు
చేకొలదిఁ బ్రియములు చెప్పవలె నీఁకను"
19-216

"జోకతో సింగారించు కచ్చోటి కట్టే రావయ్యా
సేకరముగా నీ రాక చెప్పివచ్చే మికను"

శేన: విణ. 'చాల' అనడానికి జానపదుల వ్యవహారం. ఎక్కువ, అధికం.
"మేనెల్లఁ జొక్కించితివి మేకులఁ దక్కించితివి
శేన నవ్వులు నవ్వేవు సేఁత లింత చాలదా"
21-477

శేనగా: క్రి.విణ. మిక్కిలి, చాలా.
"శేనగా గూడీనిదె శ్రీవేంకటేశ్వర
నానాగతి నేలవయ్యె నమ్మిక లీవయ్యా"
13-336

శేనాశేన: (3) 'చాలా చాలా' అనడానికి జానపదవ్యవహారం. చూ: సేనాసేన; అనేకములు.
"వొప్పుగా నన్ను మన్నించే దొక్కటే గుఱుతు గాక
చెప్పితే నా విన్నపాలు శేనాశేన" 12-450

శేవంతి చామరలు: వి; బహు. చేమంతి చామరాలు.
"మెలుపుఁజెంగలువలు మేలు కట్లమరించి
మలసి శేవంతిచామరలు వీవఁగను" 7-444

శేసుఁగాక: 'చేయుగాక' అనే అర్థంలో వాడబడిన జానపదవ్యవహారం.
"చిక్కించుక యింటిలోనే చెల్లినట్లు శేసుఁగాక
తక్కి మీ యేలికసాని తగ వేఁటి తగవే" 7-4

శై

శైత్యోపచారము: వి. విరహతాపంతో బాధపడుతున్న నాయికకు చల్లదనాన్ని కలిగించడానికి చేసే ఉపచారం.
"అప్పటి శైత్యోపచారా లందుకుఁగాఁ జేయఁబోలు
గుప్పుకొనీఁ దులసి చిగురు దండలు" 22-528

శో

శోభనగిరి: వి. మంగళగిరి.

శోభనగిరీశుఁడు: వి. గుంటూరు జిల్లా గుంటూరు తాలూకా మంగళగిరి గ్రామంలో వెలసిన నృసింహస్వామి. మంగళగిరికి శోభనగిరి అనేది పర్యాయనామం.
"యిక్కువ దేలిసి నీ వెవ్వతెను గలిసితివో

దక్కి శోభనగిరీశ! దగగొంటివి"

శోభనము : వి. (?)

"ఔభళేశ వోగునూతులౌభళేశ

శోభనము నీకు నాకు జోడుగూడెఁ గాదా" 26-3

శ్రి

శ్రింగారరాయఁడు : వి. శృంగారరాయడు అనే పదానికి వికృతిరూపం. 'ఋ'కారం చాలాచోట్ల 'రి' కారంగా మారడం కనిపిస్తుంది.

"అంగనకు నీవె అఖిలసామ్రాజ్యము

శ్రింగారరాయఁడ నీకు శ్రీసతి నిధానము"

9-299

శ్రీ

శ్రీ జయంతి : వి. కృష్ణాష్టమి, శ్రీకృష్ణ జయంతి

"నేఁడు కృష్ణుఁడు జనించె నేడే శ్రీ జయంతి

దేవకి కొడుకుఁ గన్న దినమిది శ్రీ జయంతి"

4-27 old

శ్రీరామరక్ష : *ప.బం; వి.* గట్టిరక్షణ నిచ్చేది.

"విడువని మతికిని వేదరాసులే రక్ష

చెడని నీ యాయువుకు శ్రీరామరక్ష" 4-459

స

సంక : (2) వి. 'శంక'కు వికృతిరూపం. సందేహం, అనుమానం, జంకు.

"అంకె శ్రీవేంకటేశుఁడని దన కమరుఁగాక

సంక లేనిదాన నాకు సటలాడవచ్చునా" 23-199

సంకము : వి. 'శంఖము'నకు జానపదవ్యవహారం.

"అంచెలఁగూర్మాలు రెండు హంసలతోఁ బొందుసేసె

పొంచి బిసాలు సంకముపొత్తు గూడెను" 7-327

"కొక్కరవంటి సంకము కుదురువంటి కైదువ

అక్కుమీఁది కొకపూస అబ్బెఁ దనకు" 27-393

"ముందు నీ సంకపురవమునకు గోపికలెల్ల

కుందణపుటందెలకుఁ గూడె సతి" 24-114

సంకరుషణుఁడు : వి. 'సంకర్షణ' శబ్దానికి వికృతిరూపం. విష్ణువు.

"సాదించితివి విద్యలు సంకరుషణా మంచి

సాదువలె నుండే నీవు సంకరుషణా" 17-235

సంకించు : *స.క్రి.* 'శంకించు'కు వ్యావహారికరూపం.

"సంకించక నిన్ను నిట్టె సాదించిరింతే కాక

బింకపు గుట్టేమిటికి పెట్టువయ్య సేస" 19-211

సంకు : వి. 'శంఖము'నకు వికృతిరూపం.

"వంకరకోరలవె వజ్రపుదంతములవె

సంకును జక్రము నిరువంకలా నవె" 2-379

సంకు : వి. శంక, సందేహం.

"యింక నేల మా విన్నపా లన్నియి నిండే వున్నవి

సంకు దీరె మాకు మీకు సారె మొక్కేమయ్యా"

12-41

సంకుఁగడెము : (సంకు + కడెము) వి. శంఖంతో చేసిన కడియం.

"అమరెనే సంకుఁగడె మందుకుఁదోడు

భ్రమసి నీవేల గుల్ల పట్టు కున్నాఁడవురా"

19-418

సంకుఁజక్కురాలు : వి. శంఖచక్రాలు.

"జక్కవచన్నుల నీడ సరి నీయందు నంటెనో

నిక్కి నీ చేతుల సంకుఁజక్కురాలై వున్నవి"

7-218

సంకుఁజక్రములవాఁడు : వి. విష్ణువు, శంఖచక్రాలు గలవాడు.

"సంకుఁజక్రాలవాడు చల్లుచున్నాఁడు వలపు

కొంకక శ్రీవేంకటాద్రి గోవిందరాజు" 21-47

సంకుఁజక్రములు : *వి; బహు.* 'శంఖచక్రాలు' అనేదానికి వ్యావహారికరూపం.

"సంకుఁజక్రములతోడ చంద్రగావిరెంటెముతో

కంకణముల చాఁచిన కరములతో" 13-128

సంకుటుంగరము : వి. శంఖంతో చేసిన ఉంగరం.

"మోహపు సంకుటుంగరముల వెలిగోర నా

దేహముపై నునురేక దియ్యఁజూచేవు " 5-278

సంకుదుబ్బ : (?)

"గుల్ల సంకుదుబ్బను కొలచిపోయి మనేవు
యిల్లిదె యిప్పుడె మా యింటికి రావయ్యా "
7-474

సంకుపోచి : వి. (?)

"వాఁడి బిల్లకత్తి వలచేతఁబరిజించి
పోఁడిమి బాలడ సంకుపోచి నాడించి (?)"
17-230

సంకుమెడది : వి. స్త్రీ, శంఖంవంటి మెడగల స్త్రీ.

సంకుసక్రముల సక్కనయ్య : వి. విష్ణుమూర్తి, శంఖచక్రాలతో కూడిన అందగాడు. శ్రీవేంకటేశ్వరస్వామి.

"సంకుసక్రముల సక్కనయ్యకుఁ దన
వుంకువవో నా వొళ్లెల్లా" 5-370

సంకుసక్రములు : వి. 'శంఖచక్రములు' అనడానికి జానపదవ్యవహారం.

"సంకుసక్రముల సక్కనయ్యకుఁ దన
వుంకువవో నా వొళ్లెల్లా" 5-370

సంకె : (84) 'శంక'కు వ్యావహారికరూపం. సందేహం, అనుమానం.

"అంకించి నే వారివాఁడనని దుష్టుఁడనైనా నా
సంకెదీరఁ గావవయ్య సర్వేశ్వరా" 3-127

"యింక నీవు నన్ను నేఁడు యెట్టు లాలించేవో కాని
సంకె లేక నిన్ను దూర సంగతే నాకు " 18-329

సంకెళ : వి. 'సంకెల'కు వ్యావహారికరూపం.

"సంకెళపెట్టినవేళ చంపఁబిలిచినవేళ
అంకిలిగా నప్పులవా రాగినవేళ" 1-158

సంగడము : వి. జెట్టి సాధన కుపయోగపడే ఇనుపగుండు. (స్నేహం, సైన్యం, విణ. అనుగుణం ఆం.ప.ని. రవిక.)

"సంగడాలంటా నీవు సారె నెత్తేవు
అంగవించి యప్పటిని ఆపె కౌఁగిలే నీకు "
22-191

"సంగడాలెత్తిన చేయి చాఁచేవు మా వురముపై
అంగనలము మా చన్నులంత కోపునా "
11-600

సంగడించు : స.క్రి. కూర్చు, అనుసంధించు, (పర్యాయ.) స్నేహం చేయు .

"సంగడించి మాటాడుతాఁ జవిచూచితివి మోవి
యెంగి లని చూడవద్దా యింతిని నేను " 25-160

సంగడి : వి. మిత్రురాలు, చెలికత్తె, సంగడికత్తె .

"చన్నుల నొరసి నాపె సారె గొప్పు దువ్వే నంటా
సన్నసేసి మాటలాడె సంగడి నంటా " 27-210

సంగడి : (35) వి. 1. పార్శ్వం, పక్క 2. సమీపం 3. ప్రేమ 4. స్నేహం 5. స్నేహితుడు 6. సమూహం 7. విధం 8.వెనుక 9. తెప్ప 10. రెండు (పర్యాయ.) విణ. తోడైంది, జతైంది. ఇట 1, 4 అర్థాలు సముచితంగా ఉంటాయి.

"కామించి యాతఁడు నా సంగడిఁగూచుండె నంటాను
యేమేమి మాటలాడేవే యింతలో నీవు "
26-433

సంగడిచన్నులు : వి. జంటగా నున్న స్తనాలు .

"సంగడిచన్నులు నివె చక్రవాకములు నివె "
7-406

సంగడి జాణతనములు : (2) స్నేహంతో కూడిన నేర్పులు .

"సంగడిజాణతనాలు సరసములాడించు
ముంగిటి నేస్తములు ముచ్చటాడించు " 12-234

సంగడిదాష్టీకము : ప్రేమతో కూడిన దాష్టీకం .

"అమర శ్రీవేంకటేశ అట్టె నన్నుఁగూడితివి
సముకాన నీకె కెంత సంగడిదాష్టీకము " 18-143

సంగడిపాదములు : వి; బహు. రెండుపాదాలు .

"జంగ చాచినట్టి నీ సంగడిపాదములు
చెంగలించి యెత్తినట్టి శ్రీహస్తము " 4-413

సంగడిపొందు : వి. స్నేహపుపొందు .

"పొరసి యాతఁడు నిన్ను బొమ్మలఁ జంకించఁగానే

తొరలించి సంగడిపొందులు చూపఁదగునా"
13-141

సంగడిబూవము : వి. (?)
"ముంగిటనే కొంకనేలే ముసిముసినవ్వు లేలే
సంగడిబూవానకు చలివాసీ రావే" 7-249

సంగడివేయు : స.క్రి. పక్కకువేయు.
"అడరి శ్రీవేంకటేశ ఆపె మోవి గంటిసేసి
వీడి సంగడి వేసితివి వనిత వలపులు" 19-271

సంగడిసింగారము : వి. మొత్తపు సింగారము.
"అంగన చెలువు చూడవయ్యా నీవు
సంగడిసింగారాలు సతమై నిలిచెను" 7-406

సంగతి : (12) వి. చేరిక, కూడిక.
"చలువకు వేఁడికి సంగతయ్యీనా
నెలఁతలఁగంటే నిట్టే నీవేమి సేతువు" 21-85
యుక్తం :
"చేయిచాఁచి నే నేమైనా సేవలు సేయఁగఁబోతే
చాయలకు సిగ్గుపడీ సంగతి గా దిపుడు"
20-413
"చెలిమి సేసినవారు చేతికి లోను గావలె
చలములు సాదించ సంగతి గాదు" 14-557

సంగాతము : (10) వి. స్నేహం, చెలిమి.
"సరసము లాడియాడి సంగాతాలు సేసితివి
మరిగి నావద్ద నున్న మగనితోను" 28-201

సంగాతి : (సంగాతము + ఇ) వి. చెలికాడు, మిత్రుడు, బంధువు, ఆప్తుడు.
"యిరవై శ్రీవేంకటేశుఁ డితఁడిట్టె నన్ను నేలె
పరగు సంగాతివి సోబానఁబాడఁగదవే" 29-318

సంచకరువు : (2) వి. ఒక వస్తువు కొనేప్పుడు దాని స్థిరత్వం కోసం ముందుగా ఇచ్చే డబ్బు, బయానా, అడ్వాన్స్. రూపాం. సంచకారి, సంచకర్వు, సంచకరము, సంచకారు.
"యింతి కానుకలు నీకు యిచ్చిన సంచకరువు
దొంతు లైనవని మాకు తోయవసమా" 27-298

సంచకారు : (3) వి. చూ : సంచకరువు.
"ఉంకువిచ్చి కైకొన్న వొగి సంచకారు సుమ్మీ
సరి లక్షకు నా మొక్కు సంచకా రిచ్చితిని"
16-292
"కంతు సంచకారులోనఁ గల్ల దోఁచె నీయందు
మంతనమున నీతోడి మాట లేఁటికే" 17-440

సంచము : (4) వి. బంగారం. (క. సంచ)
"అక్కుపై నిలచి కూడె నలమేలుమంగ నిన్ను
చక్కఁదనమెల్ల నీకు సంచమాయను" 8-92

సంచరిష్ణుఁడు : వి. సంచరించేవాడు.
"పనివడి సజ్జనులపాలికి వర్ధిష్ణుఁడు
సనకాదుల మతుల సంచరిష్ణుఁడు" 12-137

సంచు : (2) వి. 1. గుంపు 2. గొడవ 3. జాడ.
"పొంచి మచ్చ (చ్చె?) మైననాఁటి
పొలసుకంపులు వాయ
సంచులఁబన్నీట మజ్జనమార్పరే"
"పంచమవేదము నీకు పడఁతి మాటలెల్ల
సంచుల నెవరి మాట చవులయ్యీని" 16-142

సంచు : వి. 1. జాడ, గుర్తు, సూచన (ఆం.ప.ని.) 2. నేర్పు 3. గుట్టు 4. పద్ధతి 5. అందం 6. కాంతి 7. అల్పారవం 8. రతి 9. ప్రకారం 10. గాజు 11. పోలిక.

సంత : వి. కొనేవాళ్లు అమ్మేవాళ్ల యొక్క కూటమి.
"సంతలోని జాణవు జాజరలోవాడవు
వింతలేదు నాకు నీకు విన్నపమిదయ్యా" 7-209

సంతకర్మము : వి. (?)
"వింత చదువులవల్ల వేవేలు మతాలు గంటి
సంతకర్మములవల్ల సాముగంటిని" 2-256

సంతకూటపు బ్రదుకు : *ప.బం;* వి. అస్తవ్యస్తమైన బతుకు.
"దొంతులగుఁగర్మములు తోడనే తిరిగేని
సంతకూటపుబ్రతుకు సటలఁబెట్టీని" 3-483

సంతకూటమి : వి. సంతలో కొనేవాళ్లూ, అమ్మేవాళ్లూ కలవడం. తాత్కాలిక మన్నమాట.

"బంతివిందులు చేప్పేరు పాలిండ్లు చూపి చూపి
సంతకూటములలోని చవులాయ వలపు"
21-115

సంతకూటము : (7) వి. సంతలోని గుంపు.
"సంతకూటపువారెల్లా సారె నీ మేనంటఁగాను
పొంత నడ్డము రాకెట్టు పోనిత్తు నేను" 12-351

సంతకూటము అగు : *ప.బం; అ.క్రి.* అస్తవ్యస్తమగు.
"యింతుల మిద్దరమును యిరువంకలా నుండఁగా
సంతకూటమాయను చక్కని నీ మేను" 7-404

సంతకెక్కు : *ప.బం; అ.క్రి.* బజారుకెక్కు.
"దొంతులై యిల్లెల్ల నిండె దొమ్మి నీ యానలు నాకు
సంతకెక్కె నివి సాలు సరసాలు చాలురా" 12-8

సంతజాణతనము : (3) మోసంతో కూడిన నేర్పు.
"దొంతిఁబెట్టు మోవిపండు తొలఁగ కందుకోరాదా
సంతజాణతనాలేల సరసములోనను" 13-237

సంతతగరు : వి. సంతగొఱ్ఱె. బిక్కిరి బిక్కిరి చూపులు చూస్తూ 'ఇదంతా యేమి' అన్నట్లున్న మనిషి విషయంలో వాడే పలుకుబడి. సంతలోని పొట్టేలు అని శబ్దార్థం. ఎవరికైనా అమ్ముడు పోయేది. బిత్తరగొడ్డు.
"ఒడలిపై నీ చెమట వూరు వాడెడు చెలమ
జడియు నీ తమకంబు సంతతగరు" 5-75

సంతపరచు : స.క్రి. శాంతిపరచు, కట్టుబాటు లోనికి తెచ్చు.
"వినయపుదైన్యము విడువని కర్మము
చనదది నీ విటు సంతపరచకా" 2-475

సంతపాకలంజ : *వి; ప.బం.* జారిణి, లంజె, సంతపాక తొత్తు, సంతబసివి. (సంతపాక = అంగడి పెట్టడానికి వేయబడిన పాక.)
"ఎంతసేసెఁబో దైవమింతలోన నయ్యో
సంతపాకలంజవలె చల్లుఁజూపు లేఁటికి" 6-30

సంతపుఁబొందు : వి. సంతలోనో, సంతపక్కనో పాక వేసుకొని వచ్చిపోయ్యే వారికి ఉపయోగపడే వ్యక్తి కావచ్చును అని పీఠిక (1.సం.) కాని 'సంతపొందు' సంతపుపొందు గా మారుతుందా? ఆలోచించాలి.
"సంతపుఁబొందులు జరపెడివారికి
వింతగాఁ జూచినా వేడుక గలుగు" 23-195

సంతబత్తి : వి. సంతవలపు, అస్థిరమైనది.
"పైకొని సంతబత్తి గద్దా నీ కేమైనా
నీకు మోహించినదాననేఁ బాయలేఁగాక"
23-194

సంతమాటలు : *వి; ప.బం; బహు.* అడ్డదిడ్డమైన మాటలు.
"నంతమాట లాడేవు సణఁగులు రాలిచేవు
యెంతలేదు నీ పగటు యేమి చేప్పేదే" 18-434

సంతము : వి. 'శాంతము'నకు తద్భవరూపమైన జానపద వ్యవహారరూపం.
"తగిలి శ్రీవేంకటాద్రి దైవమై పొడచూపఁగా
సంతమై మీలో మీరు చక్కనుండరాదా" 27-81
"పంతమాడవచ్చుఁ గాని బలిమి చూపుటరుదు
జగడము సంతమాయ సంసారము" 3-111

సంతము : వి. స్వంతము.
"చింత యాలె తనకు నేఁ జెక్కిటఁ జే యిడుకొంటే
సంతముగాని చోట సరసములా" 9-139
"జాడతో మాలో మమ్ము సంతముసేసేవు గాని
పాడిపంతా లొరులఁ బచారించరాదా" 26-526
"జగడము సంతమాయ సంసారము" 3-111
"కలిసితివిటు శ్రీవేంకటగిరీశ్వర నన్ను
తలఁచి ఇద్దరిని సంతము సేయనేరవా" 26-325
"చక్కఁగా మాటలోనే మమ్ము
సంతము సేయిమంటాను" 13-48

సంతముద్రకోల : వి. సంతలో వస్తువులకు ముద్రవేసే కోల.
"చందమైన నీ పాదము సంతముద్రకోలాయ
యిందుకు నేనూ లోనై యిరవుకోవలెనా"
7-185

సంతముసేయు : సొంతము చేయు, తనదిగా చేయు.
"మన్నించవయ్యా యిఁక మగువను
సన్నలనే మాకుఁజెప్పి సంతము సేయుమని"
23-267

సంతల చుట్టరికము : *ప.బం; వి.* తాత్కాలికమైన చుట్టరికం, అల్పపు చుట్టరికం.
"సంతలఁజుట్టరికాల జడిసితి నిఁకఁ గావు
అంతరాత్మ నా పాలి ఆదిమూలమా" 2-66

సంతలోకూటము : (2) *వి.* తాత్కాలికం. సంతలో కలయిక తాత్కాలికమే కదా!
"సంతలో కూటమువలె సతులెందరు గూడినా
పొంతనే నీ శిరసున పూజై వుండఁగలరా"
23-313

సంతలోని జాణ : *వి.* మోసగాఁడు.
"సంతలోని జాణవు జాజరలోవాఁడవు
వింత లేదు నాకు నీకు విన్నప మిదయ్యా"
7-209

సంతవలపు బేరము : *వి.* అస్థిరం.
"ఇంతగాఁ జేసితి నన్ను నింతలోననే వోరి
సంతవలపుబేరాల జట్టికాఁడ రారా"

సంతవావి : *వి; ప.బం.* సంతలోని సంబంధం, తాత్కాలికం.
"సంతవావు లిటు చెప్పి సారెకును నవ్వునవ్వి
యింతలోనే పైకొనేమా యెంతైనాను" 16-116

సంతవెట్టు : (సంత + పెట్టు) *ప.బం; స.క్రి.* విడుచు, త్యజించు.
"సంతవెట్టుక మగని సంగడిఁగూచుండి యీకె
యెంత దడవైనా మొగమేమి చూచీనే" 22-488

సంతవేడుకలు : *వి.* సంతలోని వేడుకలు, అస్థిరములు, అల్పములైన వేడుకలు.
"సంతవేడుకలు నీకు చవి చూచి (పి) పిలువఁగ
పంతమా మాకేమి పైపై నిట్టే" 13-445

సంతసతి : (3) *వి.* జారిణి, బజారుపడతి.
"ఇంతకు వచ్చేనా నేఁడు యీపె వలపు
సంతసతులకు నేఁడు సన్నలు చూపేవు" 19-91
"దొంతి వెట్టు కక్కడ విందులు నీకుఁ జేయ
సంతసతులతో నేమి సరసాలాడేవే" 22-306

సంతసపుట్టు : (సంతసము + పుట్టు) సంతోషం కలుగు.
"సంతసపుట్టి రతికి సరిలేదే చెలియా" 12-309

సంతసాకిరి : *వి.* సంతలోని సాక్ష్యం.
"కాంతుఁడు నేనూఁ దారుకాణకు వచ్చితే
సంతసాకిరి చెప్పేవు జాణ వౌదువే" 26-383

సంతసించుకొను : *అ.క్రి.* సంతోషపడు, సంతసించుపై 'కొను' ప్రయోగం రాయలసీమ మాండలిక లక్షణం.
"మంతనాన నుండితేనే మనసు లేకములాయ
సంతసించుకొంటేనే చలము వాసె" 27-336

సంతోషించుకొను : (5) *అ.క్రి.* సంతోషపడు.
"సారెకుఁగాఁగిటఁగూడి సంతోషించుకొందుఁ గాని
నేరుపు నీ గుణాలెంచనేరను నేను" 13-14

సంతోసపడు : *అ.క్రి.* 'సంతోషపడు'కు వ్యావహారికరూపం.
"చింతించి యందుకుఁగాను చెక్కు చేతిలో నున్నది
సంతోసపడ నాన లిచ్చుటఁబెట్టుకో వయ్యా"
12-305

సంతోసము : (68) *వి.* 'సంతోషం' అనే శబ్దానికి వికృతిరూపం.
"అంది నీవే మాఁకు దిక్కైతివి
అన్నిటా సంతోసాన నున్నారమయ్యా" 2-339

సంతోసముసేయు : *అ.క్రి.* సంతోషం కలిగించు.
"సంతోసముసేసి నాకు చనవెల్లా నిచ్చెనే
యెంతకెంత వాని గుణమేమని చెప్పవచ్చునే"
23-87

సంతోసించు : (31) *అ.క్రి.* 'సంతోషించు'కు వికృతిరూపం.
"కోడెకాఁడు మొదలనే గురుతులు మెయినున్నవి

కూడి సంతోసించేఁగాక కొఱత లెంచేనా ”
27-521

సంతోసించుకొను : (25) అ.క్రి. సంతోషపడు. ఇట కొను అనే అనుబంధం రాయలసీమ మాండలికతాలక్షణం.

“సంతోసించుకొంటి నెంతే చవిగా మాటాడఁగాను” 12-218

“సన్నలా చాయలా నవ్వి సంతోసించుకొందును ” 12-218

సందడించు : (9) అ.క్రి. 1. రొదచేయు 2. విజృంభించు 3.గోలపెట్టు 4. అతిశయించు 5. చుట్టుకొను 6.గుమిగూడు 7.ప్రకాశించు 8. తత్తరపడు 9. వ్యాపించు 10. సాంద్రమగు 11. తొందరపెట్టు 12. అంటుకొని యుండు.

“సురలు నీ యవసరము చూచుకొని కొలువునకు
సరవి నాఇత్తపడి సందడించేరు ” 2-436

“సందడించి యిన్నిటా నీ చైతన్యమై యుండఁగాను
వందులేక నేఁగొన్ని వాహనా లెక్కితిని” 1-427

సందడిగొల్లెత : గుంపులోని గొల్లెత.

“ఇందరు జాణలే మీరు యేమని విన్నవించేము
సందడిగొల్లెతలము సంతోసించే మిదేవో ”
13-514

సందడి జాణతనము : వి. అతిశయమైన నేర్పరితనం.

“అందుకుఁగా చెలి నవ్వి అంగమెల్లాఁ జెమరించె
సందడిజాణతనాల సరసుఁడ వవుదువు ”
20-534

సందడిబంటు : వి. పక్కనున్న సేవకుడు.

“కందువ శ్రీవేంకటేశ కడు నీ బంటుబంటుకు
సందడిబంటనవుటే చాలదా నాకు” 3-23

“నీ బంటుబంటుకు సందడిబంట
నవుటే చాలదా నాకు” 3-23

సందడిరతులు : వి; బహు. అతిశయమైన రతులు.

“అందుకే శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
సందడి నీ రతులకు జవదాటదు ” 39-490

సందించు : స.క్రి. ‘సంధించు’కు జానపదవ్యవహారం.

“సందించి వైశాఖ శుద్ధచతుర్దశి శనివార
మందు సంధ్యాకాలమున నౌభళేశుఁడు ” 4-310

సందించుకొను : ‘సంధించుకొను’కు వ్యావహారికరూపం.

“తప్పుగాదు మఱఁగున దండనే వుండేము గాని
చప్పుడుసేయ కిద్దరు సందించుకోరయ్యా ”
26-497

సంది : (11) అవ్య. మధ్య.

“సారె మోవి నే నానఁగ చన్నుల నాపె వొత్తఁగ
యీ రీతి నిద్దరిసంది నెట్టు చిక్కితి” 23-436

సంది : వి. సందిలి, రెండు దండల నడిమిభాగం, దండచేయి.

“సందిఁగట్టుకొన్నవి చంద్రవంకతాయతులు
అందపు వల్లెవాటు పయ్యెద బుజాన” 29-106

సందికంతల త్రోవ : వి. ఇరుకైన అడ్డతోవ, సందిగొందు.

“సందిగట్టినతాడు సంసారము చూడ
సందికంతల త్రోవ సంసారము ” 1-199

సందిగొందులవారు : వి. సందుల్లో, మూలల్లో ఉండేవారు.

“ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
సందిగొందులవారిని సరకుగొనేవా” 19-140

సందు : (2) వి. అవకాశం, అదను.

“ఆడనె కాఁగిటఁ జేర్చే వదే సందుగాను ” 1-495

సందుకొను : (10) ప.బం; అ.క్రి. అవకాశం చేసుకొను, వ్యాపించు, సమయంచూచి చేరు, పరిగ్రహించు, (ఆం.ప.ని.) ప్రసరించు, మధ్యదూరు, కూర్చుకొను, కలసికొను. స.క్రి. వశపరచుకొను, గ్రహించు.

“సందుకొన నీకు నవి చవులై మెరయును ”
16-582

సందుగిందు : *వి; ప.బం.* 'సందు' అనే అర్థంలో వాడబడే జంటమాట. ఇట సందులోని 'స' కారానికి నిందార్థంలో 'గి' కారాదేశం.
"జ్ఞానము లేని యెఱుక సందుగిందు లేని యిల్లు" 15-462

సందుగిందు లేని యిల్లు : *ప.బం; వి.* అసంభవం.
"జ్ఞానము లేని యెఱుక సందుగిందు లేని యిల్లు
రానిపోనిచోటి యాస రాజు లేని కొలువు" 15-462

సందుగొను : అవకాశం పొందు, సమయంచూచి చేరు.
"ఇందాఁకావలెఁ గాదు యిదేమి నీవు
సందుగొని సారె సారె సరసమాడేవు" 23-309

సందులుగొందులు : *ప.బం; వి.* ఇరుకువీథులు.
"సారె నవ్వకు మంటిఁగా సందులగొందుల నీవు
వారు వీరుఁ జూచితేను వట్టి రట్టొ బనులు" 20-222

సందుసుడి : నడుమ, సమయం చూచుకొని, సమయాను కూలంగా, సందు చూచుకోవడం.
"పైకొని మీరిద్దరును బాసలు చేసుకొనగా
సాకిరై నే నుండేనా సందుసుడిని" 27-93
"పచ్చిగడము నీ చేపట్టుఁగా జెలియ్యరాఁగా
ముచ్చటతో సందుసుడి మోవి యానేవు" 18-172
"పొందినదాఁకా నింతే పొరపొచ్చెము లెల్లాను
సందుసుడి నీ కేలే జంకెనలు" 21-23
"పంతపుజీవుడు భ్రమసి సందుసుడి
దొంతులు దొబ్బుచుఁ దూరీఁగాక" 1-495

సందుసుడికత్తె : (4) *వి.* సందు చూచుకొని నడుమ దూరే స్త్రీ.
"సందుసుడికత్తెవు జాణవు నీవు
యిందరు నుండఁగా నీ వెంత లాఁచేవే" 18-132

సందుసుడిది : (సందు + సుడి + అది) సమయానుకూలంగా ప్రవర్తించే స్త్రీ.
"సందుసుడిదానవు చప్పన వుప్పన చేసి
విందులు చెప్ప వచ్చేవు విభునికి" 26-219

సందుసుడి దొంతులు దొబ్బు : *ప.బం.* సందుచేసుకొని దొంగకుక్కవలె ప్రవర్తించు.
"పంతపుజీవుఁడు భ్రమసి సందుసుడి
దొంతులు దొబ్బుచు దూరీఁగాకా" 1-495

సందుసుడి మాటలు : *ప.బం; వి.* అవకాశం చూచుకొని మాట్లాడే మాటలు.
"విందువలె నిన్ను శ్రీవేంకటేశుఁ డిదె కూడె
సందుసుడిమాట లేల చల్లఁ జూచేవే" 16-483

సందుసుడివనిత : *వి.* సమయానుకూలంగా ప్రవర్తించే స్త్రీ.
"సందుసుడివనితవు జాణవమ్మా
అందుకోలు పెండ్లాడే వౌనమ్మా" 12-160

సందుసుడివలపు : *ప.బం; వి.* సందు చూచుకొని చూపే వలపు.
"సందుసుడివలపుల జాజరకాఁడ
యిందరొపై నడియాస లేల చూపవయ్యా" 7-161

సందుసుడిసన్నలు : *వి; బహు.* సమయానుకూలమైన సంజ్ఞలు.
"సందుసుడిసన్నలలో జంకెనలే వేడుక
పొందులై నందులో పిలుపులే వేడుక" 12-205

సందెకాడ : (3) సంధ్యా సమయంలో, సాయం సమయంలో.
"సందెకాడ రమ్మనఁగా జాముపోయి వచ్చితిమి" 17-6
"సందెకాడఁ బుట్టినట్టి చాయలపంట యెంత
చందమాయఁజూడరమ్మ చందమామపంట" 4-342

సందెకాడ వదినె : *ప.బం; వి.* జారిణి.
"గద్దించకువే సందెకాడ వదినె
ముద్దులమఱఁది వింత మొక్కల మేఁటికిరా" 17-203

సందెపొద్దు : వి. సంధ్యాసమయం, సాయంకాల సమయం.
"తఱితోడ సందెపొద్దు దప్పనీక జలధిలో
బఱపుగాఁబండిన నా బాఁపనయ్య వీఁడివో" 5-254

సందేహించుకొను : స.క్రి. సందేహించు. ఇట 'కొను' అనే ప్రయోగం విలక్షణం. కొన్ని ధాతువులపై కొను అనే ప్రయోగం రాయలసీమ మాండలికంలో విలక్షణం.

సందైతే చావడి చంకబెట్టుకొను : *ప.బం; అ.క్రి.* అవకాశం దొరికితే చాలు వస్తువులు అపహరించుకొని పోవు.
"చాయ సందైతే చావడి చంకఁబెట్టుకొన్నమాట
యీ యెడ నీయందె వున్నదిఁక నేఁటి మాటలు" 9-272

సంపతిలు : అ.క్రి. సమృద్ధమగు.
"జవ్వనపు మదములో సంపతిలి సారెతిలి
యివ్వల నిప్పుడుగా మా యింటికి విచ్చేసితి" 17-74

సంపాదము : వి. పూర్తిచేయడం, నెరవేర్చడం, పొందడం.
"శ్రీకాంతుఁడు శ్రీవేంకటపతి సేసిన సంపాద మిందరికి
మేకొని యిన్నియు మీరినవారికి మీ నామమే సుజాతి" 2-383

సంబటూరి చెన్నుడు : సంబటూరులో వెలసిన చెన్నకేశవస్వామి. చూ : సంబటూరు. అన్నమయ్య సంబటూరి చెన్నకేశవస్వామిని ఎనిమిది కీర్తనల్లో స్తుతించినాడు.
"చక్కని యీ చెన్నుఁడూ సంబటూరి చెన్నుఁడూ
అక్కడ నిక్కడ చూపి ఆసలు రేఁచీని" 11-162

సంబటూరు : వి. కడపజిల్లా కమలాపురం మండలంలోని ఒక గ్రామం. పెన్నానదీతీరంలో ఉంది. ఇట చెన్నకేశవస్వామి ఆలయం శిథిలావస్థలో ఉంది. అన్నమయ్య ఈ సంబటూరి చెన్నుని కీర్తించినాడు. 11-162

సంబళము : (2) వి. 1. పాథేయం, దారిబత్తెం 2. వేతనం, జీతం 3. ఆయుధవిశేషం. సంబళము = wages అని బ్రౌన్.
"పాపములే సంబళమెపుడూ యీ
యాపదఁబడి నే నలసేనా" 1-82
సారంగపాణి పదాల్లో కూడా ఈ పదం ప్రయుక్తం.

సంబురము : వి. 'సంబరము' నకు వికృతిరూపం. సంతోషం, వేడుక, పండుగ.
"సంతసాన మాటలాడే సంబురముతోడనే
యింతలో ముత్యాల ఆరతెత్త మఱచితిని" 7-159

సకి : (8) వి. 'సఖి' శబ్దానికి వికృతిరూపం.
"చాలా వేడుక నాకె సకియై యుండినటు
ఆలికిఁగా భువనమోహనరూప మాయను" 10-2-119

సకిన : వి. 1. శుభసూచక నిమిత్తం 2. శుభాశుభసూచక వాక్కు 3. రత్నాలు మొ॥ వాటితో చేసిన కృత్రిమపక్షి. (ఆం.ప.కో.)
"పలుకవే పతితోను పదవే సకినలే
పలికీ నతఁడు పండే పట్టెమంచాన"

సకినగాఁడు : (సకిన+కాఁడు) శుభసూచక నిమిత్తమైనవాడు.
"భవరోగవైద్యుఁడైన బలువెజ్జు
సవరని పైఁడిపక్షి సకినగాఁడు" 10-22

సకినము : (2) వి.1.శుభసూచక నిమిత్తం 2.శుభాశుభసూచక వాక్కు.
"సరినెందు వొయ్యేవంటే సకినాలు వాటించి
తిరిగి తిరిగి వచ్చి తిట్టేవేరా" 11-212

సకినలమంచము : (3) వి. రత్నాలు మొ॥ వాటితో చేసిన కృత్రిమపక్షులు గల మంచం. (సకినె = కీచుబిళ్ల)
"వచ్చి కూచుండఁగా మోసీ వడి సకినలమంచ
మిచ్చట విడెమియ్య వే మీతనికి నీవు" 29-420

సకినలసజ్జ : (22) వి. రత్నాలు మొ॥ వాటితో చేసిన కృత్రిమ పక్షులు గల పడక, కీచుకీచు మనే పడక.

సక్కెర: వి. 'శర్కర'కు వికృతిరూపం.
"సక్కెరరాసులు సద్యోఘృతములు
కిక్కిరియ నారగించవో స్వామీ" 1-22

సగినము: వి. 'శకునం' అనే శబ్దానికి వికృతిరూపం.
"యాకడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యేకమాయ సగినము యింటికిఁ బోవయ్యా"
18-519

సగియించు: అ.క్రి; మాం. సగించు, రుచించు, సయించు, సహించు.
"సగియించకుంటేను చవి పుట్టీనా" 25-82
"సటలివి మాకైతే సగియించ వింకాను
నటన నాతనితోనే నవ్వవే పోయి" 19-473

సగుణవంతుఁడు: వి. గుణవంతుడు. ఈ అర్థంలో సగుణుడైనా, గుణవంతుడనైనా అనాలి. కాని సగుణవంతుడని ప్రయోగించడం విలక్షణం.
"సగుణవంతుఁడు వీఁడే సర్వకాముఁడు వీఁడే
నగుమొగము సుగ్రీవనరసింహుఁడు వీఁడే"
4-500

సగ్గిసమగ్గిసలు: వి; బహు. లోలోపల ఉడుకులు. (తె.జా. II భా)

సగ్గు: (5) అ.క్రి. అణఁగు, తగ్గు.
"సగ్గి నవ్వకుండఁగాను సరసమాడుదురటే
సిగ్గునఁ దప్పించుకోఁగా చే చాతురటే" 17-212

సగ్గుడు: వి. అణగుట.
"చన్నుదాగి పూతనను సగ్గుడుగా జప్పరించె
మిన్నుదాఁకె సుడిగాలి మెడదొక్కను"
4 అను 76

సగ్గుడు ముగ్గుడగు: ప.బం; అ.క్రి. సతమతమగు.
"చంచలపు విషయాల సగ్గుడుముగ్గుడు గాక
యెంచి హరిఁదలపోయు టిదియె యెఱుక"
1-378

సట: (109) వి. 1.మోసం 2.కపటం 3.అసత్యం 4.కొండెం.
"యెటువలె నీ వుండినా నెదురు మాఁటాడదు
సట గాదు రావయ్యా సమ్మతించెను" 28-343

సటఁబడు: వంచింపబడు.
"కందువైన శ్రీవేంకటనాథుఁడు గావఁగా
సందుసుడి కోరికల సటఁబడఁజెల్లునా" 10-1-55

సటకాఁడు: (25) (సట + కాఁడు) వి. మాయకాడు, వంచకుడు, కొండీడు.
"ఏలోయి సటకాఁడ యెఱఁగనా నీ సుద్దులు
పోలించి యామె వలపు పూసేవు నీమీఁదను"
18-351

సటకారి: (4) (సట + కారి) మాయకాడు, వంచకుడు, కొండీడు.
"నెమ్మది నన్నేలినాఁడు నే నలమేల్మంగను
సమ్మతించ నేరుతువే సటకారి నీవు" 7-381

సటకారితనము: (సట + కారి + తనము) వి. శాఠ్యకారి శబ్దభవం కావచ్చు. వంచకత్వం, మోసం చేసే లక్షణం.
"మటమాయతనమున మగువలు మగవారి
సటకారితనమున సాదింతురు" 18-201

సటకారివాఁడు: (సట+కారి+వాఁడు) మాయగాడు, వంచకుడు, మోసగాడు.
"వెల్లవిరాయఁ బనులు విట్ఠలేశ్వరా
చల్లజంపుసేఁతల సటకారివాఁడవు" 9-173

సటము: అసత్యం, మాయ, (తె.వ్యు.కో.) చిక్కు.
"సారె సటములు సందడింపుచు
జారీఁ బయ్యెద సరుగనా" 5-49

సటరాజసము: వి. మోసపు రాజసము.
"కట్టి సటరాజసాలు వర్ణాశ్రమములును
పుట్టుగు లన్నియును యీ భూమిమీఁదివే"
4-235

సటలఁబెట్టు: స.క్రి. చిక్కులఁబెట్టు, బాధపెట్టు, పీడించు.
"సంతకూటపు బ్రతుకు సటలఁబెట్టీని
సానఁబట్టినవయసు సటలఁబెట్టీని" 3-483

"యెంత లేదు నీ వేసాలు యెఱుఁగనా నేఁదొల్లి
సంతకూటములు చూపి సటలఁబెట్టేవు" 19-207
"సానఁబట్టిన వయసు సటలఁబెట్టీని
పూని పురాకృతములు పోనీక తిరిగీని" 3-483

సటలకారి : వి. మాయలమారి. 'సటకారి' అనడం సహజం.
"కన్నుల సొలసుకొంటా కానుక నీ చేతికిచ్చీ
సన్నలా చాయలా నెంత సటలకారి" 29-524

సటలమాట : వి. మోసపుమాట, మాయలమాట, అసత్యపు మాట, క్రూరపుమాట.

సటలవాఁడు : వి. మోసగాడు, మాయగాడు.
"చేసిన తన చేఁతలు చెప్పరాదు
యీ సటలవానితోడ నేమి సేతునే" 7-584

సటలాడు : (5) (సటలు + ఆడు) అసత్యములాడు, మాయలు చేయు.
"అటు శ్రీవేంకటేశు దాస్యము లేక బిగిసితే
సటలాడుకొనేటి రాక్షసమత మౌను" 2-120

సటవటలు : (3) వి. సటవట మాటలు - అనగా జల్లిమాటలు -boasting lies or idle talk బ్రౌన్. దండగమారి మాటలు, వ్యర్థపుపనులు. సటవట = కపటం అని వ్యు.ప.కో.
"అందియు నందనిచోటి యాసలు
సందడిఁ బెనఁగఁబోతే సటవటలు" 8-265
"కటకటా జీవుఁడా కాలము దోలుకరాగా
సటవటలనే పొద్దు జరపేవుగా" 1-350

సడఁగు : వి. 1. బాధ 2. అస్ఫుటమైన వాక్కు.
"సడఁగులు చల్లిచల్లి చత్రాత నా రొలిచేవు
తడయక సిగ్గులనే దడిగట్టేవు" 29-464

సడఁగులు : దోషవాక్కులు అని ఆం.ప.ని.
"సడఁగులు చల్లి చల్లి చత్రాత నారొలిచేవు
తడయక సిగ్గులనే దడి గట్టేవు" 29-464

సడి : వి. 1. నింద 2. చప్పుడు.

సడిఁబడు : కలుషితమగు.
"సడిఁబడ్డ నా తలఁపు చక్కఁగాక వుండినాను
వొడయఁడవు నీ కృప వొగిఁజిక్కనే"

సడిఁబెట్టు : అ.క్రి. కలుషితమొనర్చు.
"బెడిదపువినయాలు పెదవిఁబెట్టుకున్నది
సడిఁబెట్ట కాపె దిక్కు చక్కఁజూడవయ్యా"
29-512

సడ్డ : 1. ఆదరం 2. అక్కర 3. లక్ష్యం 4. శ్రద్ధ 5. ఆసక్తి 6.గౌరవం 7. ఎన్నిక 8. దుష్పరిణామం.
"ఇంతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యెంతకెంత సడ్డ యేల యెవ్వరితో నీకు"
25-319
"కైవసమాయను కైవల్యపదమునుఁ
జావు ముదిమితో సడ్డే లేదు" 5-233 old

సడ్డలాడు : ప.బం; స.క్రి. గౌరవించు.
"సడ్డలాడఁగానే కడుజారిన పయ్యద చూచి
యెడ్డ నన్ను జాణఁజేసే వేఁటికో కాని" 5-373

సడ్డసేయు : స.క్రి. సరకుచేయు, లెక్కచేయు.
"అక్కడ వేరొకతెపై నాసలఁబొరలే నీవు
చక్కెరవంటి నామోవి సడ్డసేసేవా" 17-228

సడ్డు : వి. దుష్పరిణామం. 5-233 old

సణఁగరము : వి. బాధ.
"చెలరేఁగి యందరితోఁ జెప్పుకొనే సుద్దులు
చలివాసి చల్లేటి సణఁగరాలు" 12-328

సణఁగు : (13) వి. 1. అస్ఫుటవాక్కు 2. బాధ.
"సారె సారె నీ మీఁద సణఁగులే చల్లితిని
మేరలు మీరి నవ్వితి మేనవానిని" 14-402

సణఁగులాఁడి : వి. లోలోన గొణిగే స్త్రీ.
"చక్కనిదాన వౌదువే సణఁగులాఁడి వౌదువే
నిక్కి విభునిఁ గొసర నేరుతువే" 19-25

సణఁగులాడు : (2) అ.క్రి. లోలోన పలుకు, అస్ఫుటంగా పలుకు.
"ఇద్దరి నెట్టు గూరుత మేమి సేత మమ్మలాల !
వద్దనే సణఁగులాడీ వద్దన్న మానదు" 14-320

సణఁగులు : 'సడుగులు'కు రూపాం. కావచ్చు. వంకరమాటలు.
"చనవుసేసుక నీవు సణఁగులు చల్లితేను

నను పుసేసుక నతఁడు నవ్వు నవ్వె నవ్వెను ”

సణగులాడు : ‘సడుగులాడు’కు రూపాం. కావచ్చు. వంకరమాటలు పలుకు.

“సన్నలు సేసితేనే సణఁగులాడుదురా

వున్నతితోఁ గొనగోర నూఁదితేఁగాక” 26-457

సతమగు : (58) ఆయాసపడు.

“యితవై శ్రీ వేంకటేశ యేలితి నీవెందున్నా

సతమైతి నిట్లానే సరగన రావయ్యా” 23-221

సతమగు : వి. విణ. శాశ్వతమైన, ఎడతెగని, ఎల్లప్పుడు.

“సతమైన కూరిమికి సాదించనేల

హితవైన వినయాలే యింపులుగాక” 8-74

సత్తు(గా) : (17) *వి; క్రి.విణ.* 1. సత్యం(గా), సత్య శబ్దభవం కావచ్చునని పరిష్కర్తల సూచన. (2. బలం, సారం.)

“సత్తుగా శ్రీవేంకటేశ సరివారి మగఁడవు

హత్తి కూడితివి నిన్నునట్టె మెచ్చవలెను ”

22-516 & 22-516

“సత్తగు నీ దయ నాపైఁ జల్లుదుఁగాక” 11-150

ఇట బలమైన అనే అర్థం కూడా చెప్పవచ్చు.

“సత్తగు శాస్త్రము చాయ చూపినా

కొత్తగ నేనిఁక గుణి నయ్యేనా” 4-60

సత్తెము : వి. సత్యం, నిజం.

“మట్టు మీరిన చేఁతల మగవాఁడవు

వట్టి సత్తేలు నెరపవలెనా నీకు”

సత్వ : (8) వి. సత్వం, బలం. సత్తువకు వికృతిరూపం.

“నిలుచుండ సత్వ లేక నేరమి వచ్చునో

కొలువుసేయక మఱుఁగున నుంటిని ” 15-320

సద : (2) వి. 1. ఆకు 2. ఆకు మీది నూగు 3. ఆకులోని సన్నటి ఈనె. (వ్యు.)

సదచేయు : స.క్రి. నుగ్గుచేయు, సదమదం చేయు, గజిబిజిచేయు. (ఆ.మూ.)

“మెదలి నా ముంగిలది మెట్టిన తప్పునకును

సదచేసి జగడాలు చల్లెఁబో యిఁకను ” 5-50

సదమదము : (19) వి. నలిగిపోవడం. (సదమదము : అందులోనే పూర్తిగా మునిగి పోవుట. పద.)

“సిగ్గరి పెండ్లికొడుకుఁ జేరి చూతము

వొగ్గి సదమదములై వున్నాఁడట” 11-183

“సదమదముగ సరసము లాడఁగదవే” 28-392

“విందుల నీ రతులలో వేడుక పిక్కటిల్లఁగా

సందడించి కుచములు సదమదమాయను ”

8-25

సదరపుదివిజులు : వి. సాధారణ దేవతలు.

“యెదలో శ్రీవేంకటేశ్వరుఁడుండఁగ

సదరపుదివిజులు చవులయిరి” 4-96

సదరమగు : అ.క్రి; మాం. తేలికయగు.

“చల్లలమ్మే వారమైతే సదరమైతిమా నీకు

యెల్ల చోటులకు వచ్చి యేల మొక్కేవయ్యా”

28-312

సదరము : (17) వి. వేళాకోళం, చులకన.

“సదరాన బొమ్మలను జంకించితే నేమాయ ”

29-535

“అయ్యో యేమీ నేనంటే నెంత సదరమే

కొయ్యగదే ముక్కుననే కోపమున్నది ” 11-248

సదరముగ : సమగ్రంగా, స్పష్టంగా.

“ఇదివో శ్రుతి మూలమెదుటనే వున్నది

సదరముగా హరి చాటీ నదివో” 4-71

సదసచ్చాహమ్ : “అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహ మర్జున!” అనే భగవద్గీతా శ్లోకం లోని భాగం. లోకంలో సత్తునూ, అసత్తునూ నేనే అని అర్థం.

“పొదలుచుండేటి యీ జగము పొసఁగ నీవు గా వన వెఱతు

యిది విపరీతజ్ఞానము సదసచ్చాహంబంటివి గాన” 2-121

సనఁగలు : వి. సెనగలు, శనగలు.

“చారపప్పుఁ దేనెలు సనఁగలు చెఱకులు

ఆరగించి .... లతో నట్టుగలెక్కి” 22-240

ఇట 'సనగలు'లోని 'స' యతిస్థానంలో ప్రయోగింపబడింది.

సనిగెపప్పులు : *వి; బహు.* శనగపప్పులు.
"చక్కిలాలు నడుకులు సనిగెపప్పులును
చెక్కిన మెత్తని తూఁటచెఱకులును" 1-256

సనిగెలు : (2) *వి; బహు.* 'సెనగలు'కు జానపద వ్యవహారరూపం. చూ : సనగలు.
"ఊని నానిన సనిగె లొకటి కినుమడి" 21-310

సన్నగాళె : (సన్నము + కాళె) వి. వాద్యవిశేషం.
"చీని చీనాంబరముల సింగారపు మేడనుండి
వీనుల సన్నగాళెలు వినుకొంటాను" 18-281

సన్నము దొడ్డెంచు : (సన్నము+దొడ్డ+ఎంచు) *ప.బం; అ.క్రి.* చిన్నది పెద్దది అనే భేదం ఎంచు.

సన్నలరతులు : *వి; బహు.* (?)
"సన్నల (నీ) రతులకే సమ్మతించే నేను"
19-162

సన్నలు : వి. సన్ననైనవి, చిన్నవి.
"కందువ కన్నులె గొప్పగాని పాదాలు సన్నాలు
మందలించి నీతో మారు మలయంగఁగలనా"
11-118

సన్నలు - చాయలు : *ప.బం; వి; బహు.* గుర్తులు, జాడలు అనే అర్థంలో జంటపదం.
"సన్నలా చాయలా నవ్వి
సంతోసించుకొందును" 12-218

సప్పుసారై పోవు : *అ.క్రి.* చప్పబడిపోవు ; సప్పె-చప్పె flatness, unsipidness, dull - సవర్-to perish (కిటెల్)
"కవకవ నవ్వి కన్నులు దేలగిలఁగ
సవరన్ని యాటదెల్ల సప్పుసారై పోయెను"
12-157

సబ : (2) వి. 'సభ'కు జానపద వ్యవహారరూపం.
"తీగెల యెలుఁగులు తెగని గర్వములు
సాగి యే సబలఁ జదివితివే" 29-340

సమందము : వి. 'సంబంధము' అనే శబ్దానికి జానపద వ్యవహారరూపం.
"గట్టిగా శ్రీవేంకటేశ నీ నా సమందమే
యెట్టయినాఁ దలఁచుకో యింకనైనాను" 15-16

సమకట్టు : వి. కూర్పు, రచనం, వేషరచన.
"కావించి నీ సమకట్లలో నల్ల జల్లి
దూవిన నేరుపుల కెదురు వలెచెనయ్యా"
10-2-102

సమతు : వి. సమ్మతి, అంగీకారం.
"సంతోసాన నవ్వు నవ్వి సమతు సేసుకొనేవు
చెంత నీ వేమి సేసినాఁ జెల్లునయ్యా" 22-407

సమత్తు : వి. సమర్థుడు, నేర్పరి. (త. శమత్తు)
"అమ్మరో నీ వాకెకు అరవి (య) సమత్తువేమో
చిమ్మిరేఁగి తరితీపు చిందీ మీ వల్లను" 24-325

సమదిష్టి : వి. సమదృష్టి.
"సారె జారుపయ్యదతో సమదిష్టి నిలుచుండి
కోరి సిగ్గువడేవేమే కొచ్చి చూచెనంటాను"
22-241

సమయుఁడు : వి. మతవిషయకమైన కార్యాలను పర్యవేక్షించేవాడు.
"ఆచార్యపురుషులు అవ్వలఁగొందరు
యేచిన సమయులై ఏర్పడిరి" 1-499

సమరతి : వి. ఉపరతికి విరుద్ధమైంది.
"జంపు నీ చన్నుల నొత్తి సమరతులకుఁ దీని
అంటి దక్కఁగొనఁగానే నందుకుఁ గాదంటినా"
18-190

సముకపువారు : (2) *వి; బహు.* ఎదుటివారు.
"అమర నీ రతి కాతఁ డాసపడి నవ్వితేను
సముకపువారినల్లా సాకిరి వెట్టుదురా" 14-546

సముకము : (13) వి. సముఖమునకు వికృతిరూపం. ఎదురు, సమక్షము.
"జమళి నిద్దరిని సంగడిఁగూర్చితి
తమకము సముకముఁ దానెఱుఁగు" 25-221

సముఖా : 'హెచ్చరిక'ను తెలియజేసే పదం.
"సముఖా యెచ్చరిక వో సర్వేశ్వరా
అమరె నీ కొలువు ప్రహ్లాదవరదా" 4-489

"అవధారు రఘుపతి యందరినిఁ జిత్తగించు
యివల నిండెఁ గొలువిదె నదె సముఖా" 3-492

సముద్రబిల్లలు : *వి; ప.బం; బహు.* ఒక విధమగు ఆట.

"తమితోడ గోపాలులు తానుఁ గూడి ముంగిటను
సముద్రబిల్లలాడీ సాధుకృష్ణుఁడు" 4-172

సముద్రము కడచి ఓడలో నినుము దెచ్చు : *ప.బం.* కొండను తవ్వి ఎలుకను పట్టుట వంటిది. శ్రమకు తగని అల్పఫలాన్ని పొందిన సందర్భంలో ఉపయోగించే పలుకుబడి. 3-574

సముద్రములో వానలగు : *ప.బం; అ.క్రి.* వ్యర్థమగు.

"నన్నుఁ జూచేవారు లేరు నవ్వేటివారు లేరు
వన్నెల సముద్రములో వానలాయ బ్రదుకు"
2-6

సముద్రాన కేతాలు వెట్టు : *ప.బం; అ.క్రి.* అసాధ్యమైన కార్యానికై వ్యర్థప్రయత్నం చేయు. (ఎంత ఏతం వేసినా సముద్రంలోని నీళ్లు ఇంకుతాయా అనే దానిపై వచ్చిన పలుకుబడి.)

"చుట్టిచుట్టి యాతని మై సొంట్లు సోదించుకొంటా
యిట్టె సముద్రాన కేతా లెన్ని వెట్టేవే" 29-64

సమేళము : (6) విశ. అనుకూలము (ఆం.ప.ని.) ఒద్దిక, చేరిక, (శ.ర.) గుమి. (తె.వ్యు.కో.)

"ఇక్కువంటి శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
మిక్కిలి నవ్విన యీ సమేళమె చాలదా"
14-344

సమేళి : వి. (?)

"వలపులు వలపులు వయాళి
చలమరి మరుఁడును సమేళి" 7-292

సమ్మందము : వి. 'సంబంధము' అనే దానికి జానపదవ్యవహారం.

"కాఁగిటి సమ్మందము కలయఁ జెప్పఁగవచ్చె
చేఁగదేర సేవలెల్లఁ జేయ వచ్చెను" 25-415

సమ్మంధము : (20) వి. 'సంబంధము' అనే దానికి జానపదవ్యవహారం.

"అట్టె దేహసమ్మంధ మాసపడే జీవులాల
పట్టి హరిసమ్మంధాన బ్రదుకరాదా"
10-42 & 2-92

సమ్మటూరి చెన్నుఁడు : వి. కడపజిల్లా కమలాపురంలోని సంబటూరిలో వెలసిన చెన్నుడు.

"సమ్మటూరి చెన్నుఁడా జాణఁడ వౌదువయ్యా
పమ్మి యన్నిటాను చెల్లుబడి యాయ వలపు"
23-554

సమ్మటూరు : వి. రూపాం. సంబటూరు. కడపజిల్లా కమలాపురం మండలం లోని గ్రామం.

"సరవి శ్రీవేంకటేశ సమ్మటూరిలో మనము
యెరవు లేని యీ మేలు కేమి సేతురా" 11-455

సమ్మాళిగెలు : *వి; బహు.* పాదరక్షలు, సంబవులు. రూపాం. సమ్మాళిగలు, సంబాళిగలు.

"సమ్మాళిగెలు మెట్టి సతి రాజసముతోడ
కమ్మి యొకచెలిమీఁదఁ గరము చాఁచి" 17-83

సయించు : స.క్రి. 'సహించు'కు జానపద వ్యవహారరూపం. హితమగు, అంగీకారమగు, సహించు.

"కొంత సయించవె పతి కొరత దీరుచకుండితే
చెంతల నప్పుడె సంతసింతువు గాని" 11-264

సరకు : వి. ఇది రాయలసీమ మాండలికం. సరదా, తమాషా.

"ఎచ్చరించెద ననిన యీ జగంబనఁ గాను
సచ్చరిత్రుఁడ! నీకు సరకా వోరి" 5-314

సరగతి : వి. 'స్వరగతి'కి వికృతరూపం.

"దిక్కులందు హంసలివి తీర్థయాత్రలు సేసి
చక్కని పాదములందు సరగతు లాయ"
28-277

సరతు : *వి;* చెమట; ఇది రాయలసీమ మాండలిక పదం. ఈ నాటికీ రాయలసీమలో ఈ పదం

'సర్తు' అనే రూపంలో వ్యవహారంలో ఉన్నది. 'సరత' అని మాం.ప.కో. (389 పు.)

"చల్లని గందవొడిచే సారపుఁ బన్నీరిదే
చల్లుకోరాదా మేన సరతు వాసు" 21-424

"అక్కుపై గురుతులు అంగపు సరతులు
మక్కళించనేల యిది మరవకు చాలు" 9-91

సరపణి: వి. 1. గొలుసు (ఆభరణం), ఇనుపగొలుసు.

"చాలుఁజాలు బంగారు సరపణు లుంగరాలు
నీలపుఁగంటసరులు నీవే వుండనీ" 5-342

సరవి: వి. 1. క్రమం, వరుస 2. తీరు, విధం 3. ఒప్పు, అందం (సూ.ని.; తె.వ్యు.కో.)

"చనవరి నయ్యేనంటా సరవెల్ల నడపితి
మనసులో తమకాలు మాన వేలరా" 11-282

సరవిసేయు: (?)

"యివల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
జవళి నన్ను నాపె సరవిసేసితి వి" 25-254

సరిఁబదకము: వి. ఒకరకపు ఆభరణం.

"సరిఁబదకము నీకు నే చక్కఁగా నేఁబెట్టితి
నరుదైయున్నది కంఠహార మేడది" 17-98

సరి: విణ. యుక్తం (వి. సాటి, తగిన సమాధానం, సామ్యం, సమానం. విణ . అనుకూలం, సమాప్తం, సమర్థత కలిగి చెడిపోయినది, తగినట్లు, సమానంగా, యుక్తంగా, అనుకూలంగా.)

"పండిన పండ్లు తొడమఁబాసి వూడినయట్టు
అండనే మరణములు అందరికి సరి రే" 2-140

సరికి బేసికి: ప.*బం*; అవ్య. ప్రతిదానికి, ఐనదానికి కానిదానికి, (తె.వ్యు.కో.) మంచికి చెడుకు.

"చలుములు బలుములు సరికి బేసికి ముంచె
నిలచిన నిలువకే నీవు మన్నించితివి" 14-324

సరికి బేసియగు: (4) ప.*బం*; అ.క్రి. మంచికి చెడు అగు, నాశనమగు .

"సరికి బే శాయ నిది చాలదా నేఁడు
యిరవాయఁ బనులెల్ల నిఁక నేల మాటలు"
21-435

సరికి సరి: (4) ప.*బం*; వి. దేనికది, మాటకుమాట అప్పగించడం.

"చేసేటి పుణ్యములకు చెందేటి పాపములకు
యీసుల సరికి సరి ఇందుకిందుకు" 3-363

"చనవుకు మనవికి సరికి సరి
చలువకు వేఁడికి సరికి సరి" 20-234

"అనుఁగుఁబున్నములకు అమాసచీకట్లు
అనయ సరికి సరిందు కందుకు" 3-363

సరికి సరి బేసి గాదు: దేనికదే కాని తద్విరుద్ధం కాదు (?)

"చనవు సేసుక నీవు సణఁగులు చల్లితేను
ననుపు సేసుక నతఁడు నవ్వు నవ్వేను
పెనచి సరికి సరి బేసిగాదు" 15-110

సరికి సరియగు: అ.క్రి. దేనికి అదే అగు, ఒక వస్తువునకు సమానమగు.

"వాకున వినయము వళుకులు చెంతల
సాకిరి రమణుఁడ సరికి సరియాయ" 21-525

సరిగద్దె నుండు: ప.బం. అ.క్రి. అర్ధాసనాసీనుడగు. ఇది అత్యంతగౌరవాదర సూచకం.

"సాజమై నిన్నుఁ గొలిచి సరిగద్దె నుందునా
వోజతో నిన్ను సేవించివుందు నింతేకాక" 2-139

సరిగె: వి. 'సరిగ'కు రూపాంతరం. 1. హారం 2. కాంతి 3.జలతారు 3. బట్టలంచులకు, గాని డిజైన్ల కోసం గాని నేతలో వాడే సన్నటి మెరుపుదారం.

"చక్కనిదాననంటా సరిగె గలదంటాను
వెక్కాసి వెంతైతివే వెల్లివిరితో" 28-558

సరిత: (38) వి. 'చరితము' అనే పదానికి వ్యవహారరూపం.

"కంటిమి మీ సరితలు కందువగాను
ఇంటికి రావయ్యా యీడ నేల చెనకేవు" 17-45

"కందము నీ సరితలు కడదాఁకాను

యిందరిలో నన్ను మాఁటలేల బొంకేనిఁకను ”
11-135

సరితె : (6) వి. 'చరిత్రము' అనే పదానికి వ్యవహారరూపం.
"కానుకగాఁ బట్టేమయ్య కాంతకు నీ సరితెలు
యీ నిజాలె చెల్లించుకో యేల నవ్వేమిఁకనే ”
11-389

సరిదాపు : ప.బం; వి. దగ్గరివాడు.
"శరణాగతులకు సరి దాపెవ్వఁడు
యిరువుగ శ్రీపతి యెవ్వఁడు" 4-403

సరిన్ : ఎదుట కావచ్చు. (f.n. 22-218)
"పొరుగున నున్న నన్నుఁ బోరచివెట్టు మనేవు
సరినున్న కాంతమోవి చవిగొనరాదా ” 22-218

సరిబేసి : వి. మంచి-చెడు.
"తెరలోన దాఁగేవు తేరి నిన్నుఁ జూచితేను
సరిబేశా నీ చేఁతలు సారె సారె ముయ్యను ”
7-487

సరిబేసి : వి; ప.బం. బాలక్రీడావిశేషం.
"చలివాయ నియ్యవే సరిబేసి ఆడినట్టు
వలపులు తనమీఁద వడిఁజల్లేను" 11-476

సరిబేసికి : (4) మంచికి చెడుకు, ఐనదానికి కానిదానికి.
"ఎలమి సరిబేసికి యిదె సుద్ది నిన్ననేల
నిలువు నివ్వెరగులు నీ కేలయ్యా" 8-157

సరిబేసి జంట జరుపు : చిక్కుప్రశ్నలు వేయు.
"గరిమ శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను
సరిబేసి జంటమాట జరపకు మిఁకను ” 4-203

సరిబేసి పంతాలు : ఐనవీ కానివీ ఐన పంతాలు.
"సరిబేసిపంతాలు జగడించకతీరదు
మరుతంత్రముల మెండు మతి చొక్కక తీరదు ”
22-91

సరిబేసులాడు : సరిబేసులాట ఆడు.
"సొరిది గచ్చకాయలు చూపి విట్ఠలా
సరిబేసులాడేవు జాణవిట్ఠలా" 18-369

సరిబేసులు : (2) బాలక్రీడావిశేషం.
"సరిబేసులాయను మీ సరసము నిద్దరికి
మెరసిన మీ చేఁతలు మెచ్చితి మిందరము ”
28-413

సరిముద్రలు : వి; బహు. సాటిముద్రలు.
"సాజాని శ్రీవేంకటేశు సరిముద్రలు ధరించే
తేజముతో విజ్ఞానదేహములో నున్నది ” 15-60

సరియాఁక : (2) వి. ఒరగుడం, వంగడం.
"చదురులాడఁ జూచితే సరియాఁకలై యుండు ”
21-331

సరిసేయు : స.క్రి. సమానం చేయు.
"మానక సరిసేసుక మాఁటలాడీ నాతో
వీనులకు వెట్టదోఁచు విభుఁడు తాఁదాను ” 7-467

సరుగ : క్రి.విణ. వేగిరంగా, తొందరగా.
"చెక్కిటి చేయి దియ్యకు చింతతోడను
చక్కఁబెట్టుదువు ప(స)తి సరుగన రావయ్యా"
23-221
"సరుగ లంకారాజ్యము సాధించినాఁడు ” 3-148
"సరగ విచ్చేయుడు సాకేతమునకు"
అని క.వ.రా. 520 పు.

సరుగు : (2) అ.క్రి. వర్ధిల్లు, పెరుగు.
"పరగు వేదరాసులే పగ్గాలు వట్టి తియ్యఁగ
సరుఁగు దుష్టులఁగొట్టి జయము చేకొనెను ”
3-122

సరుస : (47) సరస, సమీపం.
"సవతులమింతే సరుసల నుంటిమి
దవనపు వాట్లు తా నెఱుఁగు" 25-221
"ఇరవాయ నుండవయ్య యేమి చెప్పేవు
సరుసఁగూచున్నదెల్లా చనవే కాదా ” 13-45

సర్గము : వి. 'స్వర్గము' అనే శబ్దానికి జానపద వ్యవహారరూపం (?)
"చలపట్టితేఁ జాలు సర్గమేమి బాఁతా
చలివేఁడి నాలికపై సత్యములో నున్నాఁడు ” 2-7

సర్వం విష్ణుమయమ్ : 'సర్వం విష్ణుమయం జగత్' అనే శ్లోకపాదంలోని భాగం. (సమస్త విశ్వమూ విష్ణువుతో ఏర్పడిందే అని భావం.)

"సర్వం విష్ణుమయంబను భావము
సత్యం సత్యం బన్నిటను" 40-90

సర్వజాణ: వి. మిక్కిలి నేర్పరి, అందరిలో జాణ.

"సరసుఁడ వన్నిటాను సర్వజాణవు
గరిమనన్నీఁదెలియఁగదవయ్య నీవు" 8-194

సర్వపాపేభ్యో అహం త్వా: (?) "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ, అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః" అనే భగవద్గీతా శ్లోకభాగం. (అన్ని ధర్మాలను వదలి నన్నొక్కణ్ణే శరణుపొందుము. నేను నిన్ను అన్నిపాపాల నుండి విడిపిస్తాను. దుఃఖపడకు అని గీతాచార్యుడైన శ్రీకృష్ణుని అభయదానం.)

"హరి "సర్వపాపేభ్యో అహం త్వా" యనె
గరిమ నా వాక్యమే ప్రమాణమైనట్టి గతి
యొక్కటే నాకు" 4-77

సర్వాపరాధి: వి. సమస్త అపరాధములు చేసినవాడు అని వాచ్యార్థం. శ్రీవైష్ణవులు నమస్కరిస్తూ పలికే మాట. భయకారకమైన స్వదోషానుసంధానం ప్రపన్నునికి ఎల్లవేళలా ఉండాలని శ్రీవైష్ణవుల నియమం. ఈభావం తోనే శ్రీవైష్ణవులు భగవంతునికీ, ఇతర వైష్ణవులకూ నమస్కరించేప్పుడు వినయపూర్వకంగా "సర్వాపరాధిని" అని విన్నవించుకోవడం ఆచారం.

"సంతతము నన్నెంచితే సర్వాపరాధి నేను
యెంత నీ వేమి సేసినా నంత కర్హుఁడ" 2-192

"అట్టి సర్వాపరాధి నపరాధా లెంచనేల
గట్టిరాళ్లతో మలిగండ్లేర నేల" 2-254

సలలితముగ: క్రి.విణ. మనోహరంగా, ఒప్పుగా. ఇట 'స' అనే తొలిపదం అనవసరం.

"సలలితముగ నీవు జగములు రక్షించఁగా
వలనుగఁ బొగడేరు వ్యాసాదులు" 13-504

సలిగ: వి. అండదండలవల్ల కలిగే బలిమి, ఆశ్రయబలం (ఆం.ప.కో.) ప్రాపు, ఆశ్రయం, (శ.ర.) చనవు, కూడని స్వాతంత్ర్యం (సూ.ని.) రూపాం. సలిగె. (క.తు. సలిగె) ప్రాపు, ఆశ్రయం అనే అర్థాలు అన్నమయ్య ప్రయోగాల్లో ఒకటి రెండు తావుల్లో సరిపడుతాయి కాని పెక్కుచోట్ల చనవు అనే అర్థమే పొసగుతుంది. "సలిగెతో మొత్తరాగా" "సలిగలు చెప్పబోతే" మొదలైన ప్రయోగాలు.

"చక్కని యశోద తన్ను సలిగతో మొత్తరాగా
మొక్కఁబోయీఁ గాళ్లకు ముద్దులాఁడు" 4-142

"చెప్పినట్టు సేసేటి చేకొలఁది మగఁడాయ
అప్పుడే సలిగ గల ఆలవైతివి" 17-196

సలిగె: వి. ఆశ్రయం, చనవు, కూడని స్వాతంత్ర్యం. రూపాం. సలిగ. (క.తు. సలిగె) బలం, అండ. (బ్రౌన్) కిటెల్ కన్నడ నిఘంటువులో చనవు అనే అర్థం చూపబడింది. సలిగె = familiar intercourses, familiarity, indulgence, intimacy, familiarity probably is taken from k. (సం.కీ.వా. పద. భాషా - 477, 478 పుటలు) అహంభావపూరితమైన మాట.

"సలిగెతో నిట్టె నిన్ను సారెసారెఁ జెనఁకఁగా
వెలినున్న యాపె నేల వెలిగోర నూదేవు"
18-206

"పొలయుచు రాజసాన పురుషుని సలిగెల
నలువంక విఱ్ఱవీఁగి నవ్వేనవ్వేవే" 18-580

సలిగెతనము: (2) వి. చనవు, కూడని స్వాతంత్ర్యం.

"వెలలేని గుణముల విభుఁడాతఁడు
సలిగెతనాల నెంత సాధించేవే" 22-260

"లలి నీ వాతని తమ్ములము వెట్టించుకొంటివి
సలిగెతనాల నివె జట్టిగొంటివి" 23-73

సలిగెలు చూపు: చనవులు చూపు.

"సరసము నీతో నాడి సలిగెలు చూపితేను
సరివారు వెరతురా సారెఁదనకు" 16-4

సళుపు: అ.క్రి. వి. వ్రణం లోనైనవి పోటెత్తు విణ. బాధాకరమైన, భారమైన .

"సళుపు మరునమ్ములు సాక్షి వెట్టినట్లు
సొలసి తాఁజూచినట్టి చూపులు నీకుఁదెలిపి"
7-62

సళుపులాడు : అ.క్రి. బాధపడు.
"వలచిన నీవు నాకు వసమై వుండితేఁ జాలు
సళుపు లే మాడేరు సవతులిఁక" 13-368

సవతిచుట్టరికాలు : *వి; బహు.* కపటబంధుత్వాలు.
"సవతిచుట్టరికాలు జగతిలోఁ గలవా
వివరించుకొంట గాక వినయాలింకానా" 26-12

సవతిపోరు : (4) *ప.బం; వి.* తగనిపగ, సవతి మత్సరం.
"చలములు సాదించ సవతిపోరా యేమి
తలఁపులో కొద దీర్చె దగ్గరి రమ్మనవే" 8-57

సవతు : వి. 1. సామ్యం, ఔపమ్యం, ఈడు, సమానం 2.విధం, పద్ధతి 3. ఖ్యాతి.
"సవతైన చదువులు సరుగఁదెచ్చిన తలఁపు
రవళిఁదరి గుబ్బలిని రంజిల్లు తలఁపు" 1-356

సవరఁగా : *క్రి.విణ;* చక్కగా.
"వివరించి చెప్పవయ్యా వినవేడుకయ్యీ మాకు
సవరఁగా నేము తెరచాటుననే వుంటిమి"
22-256

సవరఁదనము : వి. చూ: సవరందనము.
"చివురువంటి నా చేతులెత్తి మొక్కించె
సవరఁదనముల నా జవ్వనపు మోహము"
27-507

సవరందనము : వి. సవరఁదనం, చక్కదనం, సౌందర్యం.
"ఏటి పొందు యేఁటి గుణము యేటి
సవరందనము మనసు
నాఁటు కొలుపంజేయలేని నటన లేఁటికే" 6-180

సవరణ : వి. వాహనాద్యలంకారం, సన్నాహం, సామగ్రి, సవరింపు, సౌమ్యం, సేవ. (తె.వ్యు.కో.)
"మించె నివె సింగారాలు మెలుతలాల
పంచబాణు సవరణ పరఁగినయట్లు" 7-405

సవరని : విణ. చక్కని, అందమైన.
"సంపదల ముజ్జగము చందురుని సోయగము
జంపులేల యెత్తవే నీ సవరని మొగము"
26-47 &17-34

సవరనివాఁడు : వి. అందమైనవాడు.
"సవరనివాఁడవంటూ జాణతన మాడితేని
రవళిఁ జెయిముట్టి సరసమాడేవు" 10-2-11

సవరపుఁగొప్పుది : (సవరము + కొప్పు + అది) సవరం (= స్త్రీలు జుట్టుముడితో ఉపయోగించే చమరవాలం) కొప్పులో ముడిచిన స్త్రీ.
"పవడపుమోవిదాన భారపు గుబ్బలదాన
సవరపుఁగొప్పుదాన చక్కనిదాన" 29-409

సవరాజ్యపట్టము : వి. 1. సర్వరాజ్యపట్టం 2.అర్థరాజ్యపట్టం.
"అదివో పట్టపుదేవులారడి పంతము చేరె
పదరక సవరాజ్యపట్ట మేలవయ్యా" 8-276

సవరాజ్యము : వి. సగరాజ్యము (సర్వరాజ్యశబ్ద వికారమా అని అధస్సూచికలో పేర్కొనబడింది. సర్వరాజ్యవికారమే ఐతే సమస్తమైన రాజ్యమని అర్థం.)
"సంగతిఁ గొలువున్నాఁడు సవరాజ్య మేలు
ముంగైమురువులచేత మొక్కవే నీ పతికి"
26-517

సవరేతిరి : (సవము + రేతిరి) వి. అర్ధరాత్రి, అద్దమరేయి. చూ: సవరేయి.
"చందురు నుదయవేళ సవరేతిరికాడ
కందువ దేవకి బిడ్డఁ గనెనమ్మా" 3-193

సవరేయి : వి. అర్ధరాత్రి.
"సవరేయి పుట్టినాఁడు శ్రావణబహుళాష్టమి
నవముగా రోహిణి నక్షత్రమందు" 22-239

సవి¹ : వి. 'చవి కి జానపదవ్యవహారం. రుచి.
"బట్టబయలు నవ్వులు పచరించి రమణుని
జట్టిగొని పెనఁగఁగా సవులయ్యీనా" 27-62

సవి² : వి. 1. భ్రాంతి 2 అని - హేత్వర్థకం.
"పొదలఁబూవులు చూచి బోయతి యంప
పొది సవి వెరచెనె బోయతి" 5-175
"వుదయచందురుఁజూచి అదె నీ పంజని సవి

యెదురుకోనే వచ్చితిరా" 7-223

ససి : వి. 1. పైరు, నస్యం 2. విత్తనాలు పోసిన కయ్య, ఆకుమడి 3. శక్తి 4. రుచి.

"పులకల ససులు గొబ్బున మైనిండా మొలచె" 13-137

"యిదె నీపై యాసల నిట్టె మేను పులకించె
వెదవెట్టక ససులు వేవేలు మొలచెను" 23-127

ససులెత్తు : అ.క్రి; ప.బం. మొలకెత్తు, అంకురించు.

"పన్నీరే చల్లుకొనేవు పదనెక్కి వలపులు
పిన్నపిన్న ససులెత్తి పెరిగీఁ జుమ్మీ" 17-497

ససువు : వి. 1. సాధువు 2. మొక్క.

"యెసఁగు భక్తవత్సలుఁడింట వెంట నుండఁడా
ససువై మొక్కీని వెల్తి జగములది గాక" 4-123

సహజము : (2) వి. సహజత్వం. ధర్మవాచకానికి బదులు ధర్మివాచకం.

"సంసారికిఁగల సహజమిది మతిఁ
గంసారి మనకుఁ గల డటుగాన" 3-481

సహజి : వి. ఈ శబ్దము విశేష్యనిఘ్నం. సహజస్వభావం కలవాడు సహజి. పుట్టినవాడు పుట్టినట్లే (ఏ ప్రయత్నము చేయక) వుండుట. అనే అర్థంలో ప్రయోగించినట్లున్నది. సహజః స్వభావః అస్య అస్తీతి. 'సహజీ'. పుట్టిన నాటి స్వభావమే కలవాడు. ఏమీ ఎరుగనివాడు. శబ్దం వ్యాకరణవిరుద్ధము కాదుగాని బహుళప్రయోగప్రహతం కాదని సంపాదకుల అభిప్రాయం.

"మహినుద్యోగి గావలె మనుజుఁడైనవాఁడు
సహజివలెనుం డేమీ సాధింపలేఁడు" 2-212

సా

సాంబ్రాణి : వి. 1. ఉత్తమాశ్వం (సామ్రాణి దేశపు గుఱ్ఱం) 2.సుగంధద్రవ్యం. రూపాం. సామ్రాణి.

"సింగారించి వాహనాలు ముంగిట నెన్ని వుండినా
సంగతి నీ వెక్కనదే సాంబ్రాణి" 12-202

సాకము : వి. 1. ఉత్సవం (ఆం.భా.) 2. వ్యాజం.

"జంకెనల కారాలు చవుల సాకములు
లంకెలవిందులు వెట్టీ లలన నీకు" 8-166

సాకారము : (13) వి. ఆకారం. ఇందులోని 'స' శబ్దానికి అర్థం లేదు.

"సాకారము పైకొని దశదిక్కులు కరములఁ గబళించి
సాకారము చూపినాఁడిచ్చట హనుమంతుఁడు" 2-218

సాకిరి : (5) వి. సాక్షి.

"నీ వేమి సేతు వాపె నిన్నుఁ బెరరేఁచఁగాను
తావుల సాకిరి గోరఁదగదా నిన్నును" 10-2-50

సాకిరి చెప్పు : (2) అ.క్రి. సాక్ష్యం చెప్పు.

"ఎవ్వరు సాకిరి చెప్పె రెందుకుఁ గాఁదనకు
వువ్విళ్లూరఁదనలోనే వూహించుకొమ్మనవే" 21-217

సాకిరిమాట : వి. సాక్ష్యపుమాట.

"పతిగా సాకిరిమాట పలుకుమంటే నవ్వేవు
మతకానఁబగదీర్చే మాయ నీది గాదా" 17-15

సాకిరివయసు : వి. సేవచేసే వయస్సు. సాకిరి చాకిరికి వికృతిరూపమా?

సాకిరివెట్టు : (8) ప.బం; అ.క్రి. సాక్ష్యం చెప్పు, సేవచేయు.

"నిక్కి చూచి గుట్టుతోడ నిమ్మపంట వేయఁగాను
చక్కఁగా నందరి నేము సాకిరివెట్టేవే" 28-373

సాకిరులు చెప్పు : సాక్ష్యం చెప్పు.

"సంగడి మీయిద్దరికి సాకిరులు చెప్పఁగాను
చెంగట నన్ను యాపైపై సేసవెట్టేవూ" 12-531

సాగఁబెట్టు : స.క్రి. ప్రవర్తిల్లజేయు.

"వేగిరించకంత నిన్ను వింతలుగా బొగడితే
సాగఁబెట్టకు బొంకులు చవులు గావు" 25-349

సాగుడుఁగత : వి. పెద్ద కథ.

"కోడి కూసినందాఁకా సాగుడుఁగతే చెప్పితివి
వీడె మిప్పించుకొనను వేళ యేది" 14-169

సాగుడుగొండ : వి. పొడవైన కొండ.

"చల్లని వానల నీడ సాగుడుఁగొండలలోన
వల్లెగా వేసుకొన్న వాలముతోడ" 3-144

సాజము : వి. సహజం, స్వభావం.
"కామినుల కెప్పుడును గలిగిన సాజమిది
తా మగఁడు నే నాలను దయఁజూడు మనవే" 12-100

సాటికి బేటికి : (6) అవ్య. సరివచ్చుటకు, ఘనతకు. చూ: సాటిబేటికి.
"యీటున శ్రీవేంకటేశుఁడేలె నిన్ను నింతలోనె
సాటికి బేటికి మీలో జంటలిఁకఁ బాయవు" 7-336
"మాటలాడేనంటేఁగాక మంకు దెలుపవచ్చునా
సాటికి బేటికి నిన్ను సాదించెఁగాక" 9-241

సాటిపెట్టు : స.క్రి. పోల్చు, ఉపమించు.
"సాటిపెట్టవద్దుగాని సతులతోడ నన్ను
పాటించి నీ తొత్తుఁజేసి పనిగొనరా" 23-409

సాత్తించు : ఇది సాత్మించు కావచ్చు. చూ: సాత్మించు.
"బుద్ధిమంతుఁ డవుటెన్నఁడు భూమెల్లా వెఱ్ఱులు
తిద్దుకొనక సాత్తించి(?) తిరిగేరు గాక" 15-67

సాత్మించు : స.క్రి. సహించు, సైచు. (తె.వ్యు.కో.)
"అప్పటి గురుతు లెల్లా నట్టె వున్నవి
దెప్పరమునఁగొంత సాత్మించనీయరాదా" 21-410

సాద : వి. అల్లుడు.
"సాదనైన నేఁ జలమతినైనా నీ
పాదమొక్కటే నేఁబట్టినది" 4-392

సాదనకాఁడు : (సాదన+కాఁడు) వి. శస్త్రదక్షుడు, ఆయుధవిద్యలో ఆరితేరినవాడు.
"చందపుమరుగరిడీ సాదనకాఁడవు
సందడిఁ జన్నులపైఁ జేయిచాఁచకుండ గలవా" 22-363

సాదించు : (45) స.క్రి. 'సాధించు'కు జానపద వ్యవహారరూపం. 'సాధించు' లోని మహాప్రాణమైన ధకారం వ్యవహారంలో అల్పప్రాణం (ద)గా మారింది. ఒక్కచోట మాత్రమే 'సాధించు' అనే మహాప్రాణవర్ణంతో కూడిన రూపం ప్రయోగింపబడింది. 7-161

సాదింపు : వి. 'సాధింపు'కు జానపదవ్యవహార రూపం. విరామం లేకుండా కఠినమైన మాటలతో బాధించుట, బాధించుట.
"దిగ్గన యెవ్వతెచే సాదింపులఁ బడి వచ్చితో
యెగ్గుల నీ మొగమాటే ఇంత సేసె నిన్నును" 20-502

సాదు : (9) వి. 'సాధువు' శబ్దానికి జానపదవ్యవహారం. సజ్జనుడు.
"వాదించవద్దు గాని వాడవారిఁ గూడినాను
సాదవై నావద్ద నుంటే సమ్మతించవా" 27-52
"పాదాలు గుద్దుతానే పానుపుపైఁ గూచుండేవు
సాదువలె నుండుతా సేసలు చల్లేవు" 14-452

సాదుఁగొయ్య : (2) (సాదు + కొయ్య) పైకి సాధువుగా కనిపిస్తూ సరసుడు కానివాడు.
"సాదుఁగొయ్య వైనాఁడవు సరికి బేసికి నీవు
యేది నిజమేది గల్ల యేమి సేతునయ్య" 19-219

సాదుఁగొయ్యతనము : (సాదు + కొయ్య + తనము) ప.బం; వి. పైకి సాధువుగా కనిపిస్తూ దుర్మార్గుడైన వ్యక్తి లక్షణం.
"మా దిక్కేమి చూచేవు మాటిమాటికి
సాదుఁగొయ్యతనాలకు సాదించవలదా" 27-364
"వాదులడిచి నిన్నిట్టె వలసినట్టు తిట్టఁగా
సాదుఁగొయ్యతనముతో సారెకు నవ్వేవు" 14-277

సాదుఁదనము : (9) (సాదు + తనము) మంచివాని లక్షణం, మంచితనం, సాధుత్వం.
"వొగరుమాటలకెల్లా వోరిచేవాఁడా తొల్లి
నిగిడి సాదుఁదనాలు నెరపీ నే డీడనే" 17-333

సానఁబట్టిన చూపు : (2) వి. తీక్ష్ణమైన చూపు.
"సానఁబట్టిన చూపుల జగము లేలేటివాని
కొనలుకొనలుగాఁగఁ గుచ్చి యె ట్టెత్తుదునే" 17-121

సానఁబట్టిన వయసు : ప.*బం; వి.* మెరుగారు వయసు, మెరుగెక్కిన వయస్సు, యౌవనం.
"పూని పురాకృతములు పోనీక తిరిగేని
సానఁబెట్టిన వయసు సటలఁబెట్టీని" 3-483

సానఁబట్టు : (4) స.క్రి. పదునుచేయు, వాడిచేయు.
"పూని శ్రీవేంకటేశుఁడ పొదిగి నిన్నుఁ గూడితే
సానఁబట్టిన గోరేల జళిపించేవు" 21-49

సానబిల్ల : వి. బిళ్లవంటి సాన.
"అతివ మోముఁజంద్రుఁడనేటి సానబిల్లకు
తతి జడి(డ?) యనేటికి సూత్రము చుట్టి"
7-409

సానరాయి : ప.*బం; వి.* గంధం తీసే రాయి.
"చక్కని నవ్వుల సానరాయివే
మిక్కిలి యేల నమ్మించేవే" 25-263

సానలఁబట్టు : ప.*బం; స.క్రి;* చూ : సానఁబట్టు.
"రానీ పోనీ తమకాన రాములు తమ చూపుల
సానలఁబట్టుచుఁ బగ చాటుదురు" 7-54

సాప : వి. 'చాప'కు జానపదవ్యవహారం.
"పచ్చని సాపమీఁదఁ బవళించు మనవే
కుచ్చి మా సూపులు దన్ను గురి దాఁకెను"
11-93

సాపనీటి కింది సతి : వి. లక్ష్మీదేవి, సముద్రం నుండి ఉద్భవించిన సతి.
"సాపనీటి కింది సతి సంకఁబెట్టుక
తీపుల తిరుమలదేవరైనాఁడే" 24-13

సాపెన : వి*; మాం;* శాపం, దిష్టి, దూషణ.

సాపెనదాఁకు : ప.*బం; వి.* శాపం తగులు.
"ఒరి నీ సాపెన దాఁకి వొగిఁ బిక్కటిల్లఁజేసు
చేరి చేరి నీ మీఁది చేయి దియ్యఁ జుమ్మీ"
17-420

సాయ : వి. 'చాయ'కు జానపదవ్యవహారం. తోవ, మార్గం, దిక్కు, వైపు, స్థలం.
"చూడఁగానె నా కన్నులు సొరిదిఁ జేరఁడే సాయ
పాయపు వలపులనే పైడివంటి గొల్లెతల
సాయనంపి తొలఁగవా సటకాఁడ" 5-285

సారె : అవ్య. మాటిమాటికి.
"సారెఁ బిల్లఁదీపులాడి జారిపడెఁ గృష్ణుఁడు
వూరకే గడించనేల వోయమ్మ తాను" 17-372

సాళంగము : వి. కలగలుపుదనం, మేళనం.
"గబ్బిమాటల సాళంగంబు లవి యేతులా
గుబ్బతిలు మోహముల కుంటెనలు గాక"
5-126

సాళగించు : స.క్రి. మిళితమగు, సక్తమగు.
"కొదలుదేరు కోవిలెలుఁగు కుత్తికందు సాళగించి
కదలు మోవి రమణి చల్లకడవ తోడను" 5-162

సావధానము : వి. అవధానం, శ్రద్ధ, జాగరూకత, శ్రద్ధతో ఉండడం, నిష్ఠ.
"సావధానములు వద్దు శరణంటేనే చాలు
భావింపనిదే కీలు పరమయోగులకు" 3-528

సావి : (5) వి. 1. భ్రాంతి, భ్రమ 2. కాలం 3. సారం. (విణ. మనోజ్ఞం)
"తావుగ దేహమందు ద్వాదశనామములకు
సావివోని సంకల్పమే శరణాగతి" 15-324
"శ్రీవేంకటేశుఁడ నీ చిత్తము వట్టినది
సావితో నీ రతులలో సదమదమైనది" 24-149
కాలము శ.ర. ఇత్యర్థము అని బ్రౌన్. నన్నెచోడని ఈ శబ్దప్రయోగాలన్నీ భ్రాంతి అనే అర్థంలో ఉన్నాయని, సావివోదు అనే పదానికి క్రమం తప్పదు అనియో, నన్నెచోడని ప్రయోగానుసారం భ్రాంతి తప్పదు అనియో అర్థం కావచ్చుననీ, పద. ఇచ్చిన 'సాటియగు' అనీ అర్థం సరికాకపోవచ్చుననీ ఆ.మూ. వివరణ. (సం.వా. పద. భాషా. 472 పు.)
"దైవికము మా స్వతంత్రముతో గూడె
సావి వోదెన్నడు సంసారము" 3-105
సారము :
"చావుఁ బుట్టుగులవేళ సతము నీతఁడే
సావిభోగములకు నిచ్చకుఁడీతఁడే" 4-205

సావివోవు : ప.*బం; అ.క్రి.* సాటియగు. (వ్యు.) భ్రమపడు, విధము తప్పు, క్రమము తప్పు (?) (ఆ.మూ.)

"దైవికము మా స్వతంత్రముతోఁ గూడె
సావి వోదెన్నఁడు సంసారము" 3-105
"కాలము నెందూఁబోదు కర్మము నెందూఁబోదు
జాలిఁబడ్డ మనసే సావివోయను" 3-104

సాసముఖా : (4) ప.బం. 'చాంగుభళా' వంటి శబ్దం. 'సాసముఖా' అనే శబ్దం అంతమందుగల పద రచన. ఈ పదానికి 1వ సం. పీఠికలో ఈవిధంగా వివరణం ఉంది. "కొందరు పండితులు సహస్రముఖా కావచ్చునని సూచించిరి. అది ప్రకరణమునకు అతుకునట్లు లేదు. ప్రకరణమును బట్టి ఈ శబ్దముయొక్క అర్థమును విచారింతము. అది స్వామికి మజ్జన సమయము. అన్ని లోకములలోని వారు గుంపుగ కూడి స్వామితో వినోదసంభాషణము సాగించుచున్నట్లున్నది.కాలమునకు తగిన కార్యములను నెరవేర్చుటకు కొందరు నియోగింపబడి యుందురు. ఆ వెండిగుదెల వారు వచ్చి గుమిగూడిన గుంపును హెచ్చరింపుచు స్వామి కిది మజ్జన సమయమని తెలియజేయు చున్నారు. ఇప్పుడును స్వామివారి నివేదన, మజ్జన సమయములందు సన్నిధి! సన్నిధి! అని అరచుట కలదు. అనగా స్వామివారివద్దకు మమ్ము పోనిండు, త్రోవ విడువుడు అని అర్థము. ఈ సన్నిధిపదమే అన్నమయ్యనాడు సముఖ (సముఖము) పదముగా నుండినదేమో! సన్నిధి! సన్నిధి! అని రెండుసార్లు ఉచ్చరించినట్లే ఆనాడు సముఖము సముఖము (సముఖ సముఖ) అని ఉచ్చరించుచుండిరేమో? ఆ ద్విరుక్తమునే అన్నమయ్య 'సముఖ సముఖకు' బదులు సాసముఖా అని ఆమ్రేడితసంధి చేసి యుండవచ్చును. ఇట్టి ప్రక్రియలలో అన్నమయ్య చాలా స్వతంత్రుడు. వావాదము వంటి ప్రయోగములు ఈతనిలో కలవు" (29, 30 పుటలు)
"సందడి విడువుము సాసముఖా
మందరధరునకు మజ్జనవేళా" 1-12

సాసముత్యాలు : సేసముత్యాలు, ముత్యాలవంటి అక్షతలు. ఇట 'సేస' 'సాస' గా మారడం జానపదవ్యవహారం వల్లే అని భావించాలి.
"పువ్వులనఁగా నెట్టొ పూఁపలనఁగా నెట్టొ
మువ్వంక సాసముత్యాల ముగ్గులువెట్టేను"
11-131

సాసించు : స.క్రి. 'శాసించు'కు జానపద వ్యవహారరూపం.
"మేసుల నీ లాంఛనాలు మించి నన్ను దూషించె
సాసించి శత్రువును సంహరింపవే" 4-454

సాహాయము : వి. 'సాహాయ్యం' అనే శబ్దానికి వ్యవహారరూపం.
"యీవల శ్రీవేంకటేశుఁ డట్టే కరుణించితేను
సాహాయమై వచ్చుఁదానే సత్వగుణజ్ఞానము"
2-238

సి

సింకసూపు : వి. 'చింకచూపు' అనడానికి జానపద వ్యవహారరూపం. లేడిచూపు. (చింక = జింక)
"సంకనున్న తన సదురాలి మొరఁగైన
సింకసూపు నాపై సిమ్మఁడుగా" 5-370

సింగారదేవుఁడు : వి. శృంగారదేవుఁడు, మన్మథుడు.
"దేవదుందుభులతోడ తేటతెల్లమైనవాఁడు
సేవించరో యిదే వీఁడే సింగారదేవుఁడు" 3-125

సింగారపుఁదోట : వి. శృంగారవనం, ఉద్యానవనం, ప్రమదవనం.
"సింగారపుఁదోటలోన చెలిని దవ్వులఁజూచి
అంగపుఁజెమట నుస్సురుస్సురనేవు" 7-146

సింగారబొమ్మ : వి. శృంగారపుబొమ్మ, సింగారం కల బొమ్మ, హృద్యమైన బొమ్మ.
"రీతిగా సింగారించి రేయిఁబగలుఁ బాలార్ప
ఘాతల సింగారబొమ్మ గలిగెఁగా నీకు" 11-482

సింగారరసము : వి. శృంగారరసం.
"జిగి సింగారరసము చేరి నీపై నొలుకఁగా
పొగరు మించుల తట్టుపుణుఁగాయను" 23-498

సింగారరాయఁడు : వి. శృంగారరాయుడు.
"దొంగిలి వారి చీరలు తొడికి తీసిన చేఁత
సింగారరాయఁడ నీకుఁ జెల్లదాయనా" 20-224

సింగారవతి : వి. శృంగారవతి, సింగారం కలది. తత్సమ శబ్దాలపైనే చేరవలసి మతుప్ ప్రత్యయం (వతి) ఇట 'సింగార' అనే తద్భవంపై చేరడం విలక్షణం. లేదా శృంగారవతికి ఇది తద్భవం.
"సెలవుల వడిసేవి చిఱునవ్వుల వెన్నెలలు
చెలియ నీ కెవ్వ రీడే సింగారవతిని" 12-413

సింగారవిభుఁడు : వి. 'శృంగారవిభుడు" శబ్దానికి వికృతరూపం, మన్మథుడు .
"యేతుల వుబ్బుసగ్గులు యిలమీఁద నాతనికి
చైతన్య మెప్పు డీతఁడు సింగారవిభుఁడు గాని"
3-114

సింగారించు : స.క్రి. శృంగారించు, అలంకరించు .
"సింగారించుక కన్నులజిగి నీ మొకమునేసి
అంగడివలపు చల్లెనదివో" 7-530

సింగారిది : (సింగారి+అది) శృంగారవతి, సింగారించుకున్న స్త్రీ. అందమైన స్త్రీ.
"చిప్పిలు గళలదాన సింగారిదాన" 29-409

సింగిణి : వి. రూపాం. సింగిడి. 1.విల్లు. (2.సింగిడి 3.ఇంద్రధనుస్సు)
"చెఱకు సింగిణివై చెలువుని నేఁచేవు
గుఱిగా నెంత ధనము గూడెనే నీకు" 14-83

సింగినాదము : ప.బం; వి. 'శృంగనాదము' నకు వికృతిశబ్దం. 1. పొడదుప్పి కొమ్ముతో చేయబడిన యోగుల సుషిరవాద్య విశేషం 2. కొమ్మువాద్యం.
"నాదించ వెఱచి సింగినాదా లూదుకొంటాను
సోదించేరటాఁ గొందరు జోగులైరి" 2-246

సిగ్గరికాఁడు : (2) (సిగ్గు+అరి+కాఁడు) వి. సిగ్గు గలవాడు.
"సిగ్గరికాఁడతఁడు చెప్పఁడు మనతో నేవి
యెగ్గులెంచ నేనతని యిాడకుఁ బిలువరే"
7-430

సిగ్గరితనము : (7) (సిగ్గు + అరి + తనము) సిగ్గుగలవాని లక్షణం, సిగ్గు గలిగి ఉండడం.
"నిగ్గుల సరసమాడనేరనా కొంతయినా
సిగ్గరితనానికే నేఁ జింతించేఁగాక" 20-231

సిగ్గరిది : (2) (సిగ్గు + అరి + అది) సిగ్గు గలిగిన స్త్రీ.
"ఆతని తలఁపు మీరే అడుగరే చెలులాల
కాతరము లేని సిగ్గరిదాన నేను" 7-341

సిగ్గరిభావము : (సిగ్గు + అరి + భావము) వి. సిగ్గరితనం.
"చిత్తపు కోరికలలో సిగ్గరిభావముతోడ
పొత్తుల చెలులు చెప్పే బుద్ధులతోడ" 19-491

సిగ్గరివాఁడు : (సిగ్గు + అరి + వాఁడు) సిగ్గు గలవాడు. ఇట 'వాఁడు' శబ్దం స్వార్థంలో చేరింది.
"చేముట్టి పెనఁగలేని సిగ్గరివారము నేము
యీమేర నుందుముగాక యేమి సేతుమయ్యా"
25-253

సిగ్గరీఁడు : (సిగ్గరి + ఈడు) సిగ్గుకలవాడు.
"కాసులు మాకు నెక్కించి వద్దఁ దాయకుండఁ జేసి
సేసలు వెట్టితివిగా సిగ్గరీఁడా" 11-589

సిగ్గరికత్తె : (7) (సిగ్గు + అరి + కత్తె) సిగ్గు గల స్త్రీ.
"ఎంత సిగ్గరికత్తెవు యేమే నీవు
ఎంత వింత వాసులేల వెదచల్లేవే" 29-48

సిగ్గుఁబాటు : వి. సిగ్గుపడటం.
"తగ్గుముగ్గు లైనవేళ తలఁచినవారెల్ల
సిగ్గుఁబాటే కాక తమ్ముఁ జేరవచ్చేరా" 1-210

సిగ్గు చూరబోవు : ప.బం; అ.క్రి. మానం పోవు .
"సుడిసి చెలి సిగ్గెల్ల చూరఁబోఁగలదో" 15-249

సిగ్గులమ్ముకొను : ప.బం; అ.క్రి. మానం అమ్ముకొను . 4-19 old

సిగ్గులు చెఱచు : ప.బం; స.క్రి. మానభంగం చేయు .3-150 old

సిగ్గులు బయటవేయు : ప.బం; అ.క్రి. సిగ్గు

వదలు, మానమును బయల్పరచు .
"చీరల కొంగులు వట్టి సిగ్గులు బయటవేసి
గారవించి కాఁగిటను కరఁగించేవు" 23-245

సిగ్గులు మూటగట్టు : *ప.బం; అ.క్రి.* మిక్కిలిసిగ్గు గలిగి ఉండు, సిగ్గులు రాసిపోయు.
"సిగ్గులెల్లా మూటఁగట్టి చెలి నీపై వేసినట్టు
వొగ్గి నీపై వేసెఁ బువ్వులచెండున" 13-503

సిగ్గులు యెగ్గులు : *ప.బం; వి; బహు.* సిగ్గులు అనే అర్థంలో జంటపదం.
"సిగ్గులు యెగ్గులు వాసె చీఁదక చీమిడి వాసె
దగ్గరి మీరుండితేఁ దరుణులాల" 11-334

సిగ్గులువడు : (సిగ్గులు + పడు) *అ.క్రి.* సిగ్గుచెందు.
"వొగ్గుచు గందము నీకు వువిద వుయ్య రాఁగాను
సిగ్గులువడుచు చెక్కు చేతఁబెట్టేవు" 23-490

సిగ్గులు వడుకొను : *అ.క్రి; ప.బం.* సిగ్గుచెందు .
"చెక్కుచేయి మాఁటువెట్టి సిగ్గులు వడుకొంటాను
తక్కించీ నిన్నీకె యవద(ధ)రించవయ్యా"
29-429

సిగ్గువాటు : *వి.* నగుబాటు, సిగ్గుపడటం .
"యెలమి నాకె వలపు యెరవు నాపైఁ బెట్టేవు
చెలులకింకా నెంతేసి సిగ్గువాట్లో" 7-455

సిడి : *వి.* సిడిమాను .
"సిడిమీద బిత్తరపు చిమ్ములు చిమ్మగవద్దు"
4-62

సిడిదల : *వి.* కొరతవేయడం .
"సిడిదల లియ్యవద్దు జీవాలఁ జంపవద్దు
బడిబడి పగ్గాలఁ బారవద్దు" 4 అను. 62.

సితకమ్మ : *వి.* సీతమ్మ (సీతాదేవి) అనే అర్థంలో జానపదుల వ్యవహారం.
"చెచ్చెరఁ బోరుపెట్టిన సితకమ్మ వుండఁగాను
నిచ్చలుఁబ్రియము చెప్పే నేమేల నీకు" 19-435

సితరకాఁడు : *వి.* చిత్రకాఁడు, చిత్రం చేసేవారు .
"ఎట్టు వేగించే దిందు కేగురు సితరకాండ్లు
వెట్టి నేమి సేయమంటా వెన్నడించే రిపుడు"
1-370

సిద్దెబట్టు : (?)
"ఒద్దేలే జగడాలు వో యింతి
సిద్దెబట్టి కోరికలు చిత్తగించఁగదవే" 8-70

సిబ్బితి : (5) *వి.* 1. సిగ్గు 2. కష్టం.
"నవ్వకుండినా నన్నుఁ బెడరేఁచీ
చివ్వన నా కిది సిబ్బితి గాదా" 11-441

సిబ్బితిపడు : (8) *అ.క్రి.* సిగ్గుపడు.
"ఏలసిబ్బితి పడేవు యేమి సేసేది నీవు
యేలిక విందరికైతే ఇంతలోనె తప్పెనా" 21-190

సిరసు : (7) *వి.* 'శిరసు'కు జానపదవ్యవహారం.
"చొక్కపు సిరసునిండాఁ జుట్టుకొన్న పూదండలు
మిక్కుటముగా నాపె మెడవేసీఁదానూ" 12-173

సిరివంతుఁడు : *వి.* శ్రీమంతుడు, ధనవంతుడు.
"పరాకుసేయక నన్ను భావించి చిత్తానఁబెట్టు
సిరివంతుఁడు దీనుని జేరితేను రక్షించుఁగదా"
15-344

సిరివరుఁడు : (4) *వి.* శ్రీవరుడు , లక్ష్మీపతి, విష్ణుమూర్తి.
"దొరల కొలు వీవేళ తోదీపు లీవేళ
సిరివరుఁడిపు డేమి సేసునో యీవేళ" 24-119

సిరిసింగనవ(వృ)త్తి : *ప.బం; వి.* ఒకరకమైన పిల్లల ఆట.
"చెమటలు గార సిరిసింగనవత్తి యాడీ
గుమితాన వీఁడే యమ్మ గోపాలకృష్ణుఁడు"
4-172

సిలుగందు : *ప.బం; అ.క్రి.* కష్టపడు.
"చింతతోడఁ బొరలుచు సిలుగందనేల" 5-40

సిలుగు : (2) *వి.* 1. ఉపద్రవం 2. హాని 3. కష్టం.
"చెలఁగి నన్నేలితివి శ్రీవేంకటేశ నీవు
సిలుగు లేదు నిన్నుఁజేరి నేఁబొగడుదు"
20-551 & 1-81

సిలుగులాఁడి : (సిలుగులు + ఆఁడి) వి. హాని కలిగించే స్త్రీ.
"తలఁచుకో యింకా నీవే తగవులన్నియు నేఁడు
సిలుగులాఁడి సుద్దులు చెప్పలేము గాని"
24-377

సిష్టి: వి. 'సృష్టి'కి వికృతిరూపం.
"కనురెప్ప మూసితేనే కడు సిష్టే చీఁకటౌను
కనురెప్ప దెరచితే క్రమ్మరఁబుట్టు" 1-434

సిష్టికర్త : వి. సృష్టికర్త అనే పదానికి వికృతిరూపం. బ్రహ్మ.
"చెలియరో నీవే కదే సిష్టికర్తవు
నిలువున నీ మగఁడు నిను
మెచ్చు(చ్చె)నమ్మా" 13-427

సిసువుఁడు : వి. శిసువు. 1-255

సిసువు : (8) వి. 'శిశువు'కు వికృతిరూపం.
"సిసు వితనికి మొక్కి చేసేము జాగరాలు
కొసరరో వరములు కోట్ల కొలఁదులు" 4-27
"సిసువు గోవర్ధనాద్రి చేతఁబట్టి యెత్తేనంటే
కొసరీతని పాదాలే కొలువవద్దా" 1-503

సీ

సీఁకటిమైవాఁడు : వి. చీకటిమైవాఁడు, చీకటివలె నల్లని శరీరం (మై = శరీరం) కలవాడు, విష్ణుమూర్తి.
"సీకటిమైవాఁడు సీల పసవువాఁడు
సీలపసపువాఁడు ఆకుదండలే తలనటు
మోసినాఁడు" 24-13

సీతకమ్మ : వి. సీతమ్మ అనేఅర్థంలో జానపదవ్యవహారం.
"సీతకమ్మఁ బెండ్లాడె చెప్పఁ గొత్తకదవే
చేతనే యీకొమారుఁడా శివుని విల్లువిఱిచె"
1-474

సీతుగాయు : *ప.బం; అ.క్రి.* చలిపోవడానికి వేడిమి కలిగించు.
"వెలయ నిద్దరికిని వేఁడికోపములు రేఁచి
చెలఁగి నడుమ నీవు సీతుగాయవయ్యా"
19-197

సీరపసపువాఁడు : వి. పసపు రంగు వస్త్రం కలవాడు, పీతాంబరుడు. సీలపసపువాఁడు అని పొరపాటున ముద్రింపబడింది.
"సీకటిమైవాఁడు సీలపసపువాఁడు" 24-13

సీలము : వి. 'శీలము' అనే శబ్దానికి వికృతిరూపం. స్వభావం, మంచి నడత.
"ఆలుబిడ్డలఁగని యటుఁ దన మగనికి
సీలాన సమర్పణ సేయవలె నటవయ్యా"
2-444

సు

సుంకమాన్యము : వి. పన్ను లేకుండా ఇచ్చే భూమి.
"తక్కక యితని ముద్ర ధరించే దాసులకు
చొక్కుల భవబంధపు సుంకమాన్యము"
15-110

సుంకరవాఁడు : వి. సుంకం వసూలు చేసేవాడు, సుంకరీఁడు, సుంకీడు, సుంకరి.
"కరువుకు లోఁగాదు సుంకరవాని కబ్బదు"

సుంకు : (7) వి. సోకు, స్పర్శ. (కిటెల్) ప్రతిబంధం. (శ.ర.) పెండ్లిలో పళ్ళెరంలో పోసి వధూవరుల మీద చెరిగే బియ్యం లేక వడ్లపొట్టు.
"సుంకులు చెరిగించుక సొరిదిఁ దోడ నీళ్లాడి
లంకెఁ బెండ్లి పీఁటెక్కిన లలనవో యీపె"
28-252
"అంకెలఁ గూడేయప్పుడే అలపెందుండైనా
సుంకుల నీ నేరుపెల్లఁ జూపఁగరాదా" 14-154
"సుంకులఁగుచాలు నిన్ను సోఁకెనంటా సిగ్గుపడి
అంకెలఁ దలవంచుక అదివో నవ్వీని" 7-502

సుంకుదేరు : వి. ప్రతిబంధం నుండి తొలగు, బాధనుండి తొలగు.
"బొంకకురే చతురుఁ డప్పుడే వచ్చీనా
సుంకుదేరీఁ జూపు మరిచి సుద్దోమద్దో" 5-341

సుంకుమతకము : వి. అడ్డగించే మాయ.
"ఇంకనేల రావయ్య ఇన్నియుఁ జెల్లెను నీకు

సుంకు నీమతకములు చూపి చెప్పఁగలవా"
21-176

సుంకుల సోగలు : వి. మదముల రేఖలు.
"వేంకటపతిఁగూడి వేడుకతోడుత
సుంకుల సోగల సొలశీనయ్యో" 5-261

సుంకులు మోచు : (2) తగవులు మోచు, బాధలు మోచు.
"ఇంక నెన్ని కాఁగలవో యింతి నీవల్లఁబనులు
సుంకులు మోచినవెల్లాఁ జూచేము నేము"
7-453
"చందురుఁడు సుంకుమోఁపె, జవ్వనము చిమ్మిరేఁపె
మందలించి నా మేను మరచితినే" 21-507
"ఇంకనేల సుద్దులు యెదురూఁగుదురుగాను
సుంకుమోచిన కళలు సూట్లాయను" 7-32

సుంకులుమోపు : (5) తగవులు మోపు, బాధలు మోపు.
"చూచితే నందరి యాస సుంకులు మోపు నీమీద
మాచేత నింతేసి పని మట్టుపడునా" 14-31

సుకము : (8) వి. 'సుఖము'నకు జానపదవ్యవహారరూపం. 'క' కారం ప్రాస స్థానంలో ప్రయోగింపబడింది.
"వెకలి శ్రీవేంకటేశు విష్ణుదాసులకే మంచి
సుకము లెల్లాఁ గలవు సుడివడలేదు" 2-89

సుకించు : (3) 'సుఖించు'కు వ్యావహారికరూపం.
"చెలరేఁగి జవరాలు చేరి నిన్ను నవ్వించఁగా
యెలమి సుకించితివి ఇందాఁకాను" 18-347

సుకినప్పాలు : వి; బహు. భక్ష్యవిశేషం.
"సుడిగొను నప్పాలు సుకినప్పాలును
పొడిబెల్లముతోఁ బొరటులును" 6-4

సుకియించు : అ.క్రి. 'సుఖియించు'కు వ్యావహారికరూపం.
"వొకట శ్రీవేంకటేశుఁ డొనరించినట్లవును
సుకియించి పొగడేటి సుద్దులింతే నేము" 3-453
అన్నమయ్యలో సుఖియించు అనే రూపం కూడా కనిపిస్తుంది. చూ : 3-7

సుక్కు : వి. గర్వం, (తె.వ్యు.కో.) బాధ, చింత.
"చక్కగా నాతని మోవి చవిగొన్న యట్లాయ
సుక్కు దీర మైమఱచి చొక్కినట్లాయ"

సుక్కురారము : (4) వి. 'శుక్రవారము'నకు జానపద వ్యవహారరూపం.
"చూడరమ్మ యిదె నేఁడు సుక్కురారము
వేడుక చక్కదనాలు వేవేలైనాఁడు" 17-498

సుక్కువడు : అ.క్రి. వాడిపోవు, జంకు, వెనుదీయు, ముడుచుకొను, ముడుతపడు, తగ్గు, ఏడ్చు, చింతించు, మూర్ఛిల్లు, చుట్టుకొను.
"తిరమై నేఁడిందువంక దినములు నొక్క కళ
సురలెల్లఁ దినఁగాను సుక్కువడఁగలిగె" 24-33

సుగుడతనము : (సుగుడ + తనము) వి. సరసత్వం, గుణిత్వం, యోగ్యత, సుగిడతనము.
"చూతుఁబో అప్పుడు నీ సుగుడతనము లెల్లా
కాతరాన నేఁదిట్టితేఁ గాదనఁగలవా" 20-306

సుగుడరాయఁడు : వి. సరసుల్లో శ్రేష్ఠుఁడు.
"యిద్దరు సతులమీఁదా నిమ్ములఁ జేతులు చాఁచి
సుద్దులు చెప్పేఁగదే సుగుడరాయఁడు" 20-186

సుగుడి : వి. సరసుడు.

సుగుడితనము : వి. సరసత్వం, సుగుణత్వం, యోగ్యత.
"చూడవయ్యా నీ దేవుల సుగుడితనము నేఁడు
యీడనే బుద్ధులు చెప్పి యియ్యకొలువరాదా"
16-3

సుగు(డ)డుడు : వి. సరసుడు, సుగుణుడు, యోగ్యుడు.
"అట్టె యంగనలు నీతో నలిగిన ములుగవు
చుట్టరికపువాఁడవు సుగుడవయ్యా" 14-168
"వేదపురాణార్థమందు విశ్వాసము పెట్టుకొని
సోదించి తెలుసుకునే సుగుడులాలా"

"అద్దరిపాటుండఁగాను అంతలో విచ్చేసి కూడి
సుద్దులు చెప్పవచ్చేవు సుగుడవౌదు" 20-176

సుగుణతనము : వి. సౌగుణ్యం, సుగుణత, మంచిగుణాలు కలవాని లక్షణం. 'సుగుణ' అనే కేవల సంస్కృతశబ్దంపై 'తన' ప్రత్యయం చేర్చడం అన్నమయ్య విలక్షణత.

"చూడరే వో చెలులాల సుగుణతనాలు తాను
ఆడరే మీరిందరును ఆయములు నీకును"

18-560

సుగ్రీవనరసింహుఁడు : వి. చూ: సుగ్రీవనారసింహము . 4-500

సుగ్రీవనారసింహ(హుఁడు)ము : సుగ్రీవనారసింహుడు . విజయనగరంలో తుంగభద్రానదీతీరంలో హంపీశిథిలా లున్నాయి . ఇందులో హజారరామాలయం ఒకటి. దీనికి పశ్చిమంగా 22 అడుగుల ఎత్తైన ఏకాంతపు రాతివిగ్రహం ఉంది. ఈ స్వామిని సుగ్రీవనృసింహస్వామి యని అంటారు. ఈ స్వామి సుగ్రీవ ప్రతిష్ఠితుడు కావచ్చునని రాళ్లపల్లివారి అభిప్రాయం.

"సులభుఁడై వున్నాఁడు సుగ్రీవనారసింహుఁడు
నెలకొన్న దాసులకు నిధానము వీఁడే" 4-512

"తుంగభద్రాతటమున తొడపై నిందిరతోడ
సింగారించుకొన్న వేల్పుసింహము వీఁడే"

4-512

"వెక్కసపు నోరితోడ వెలయు బుగ్గలతోడ
క్రిక్కిరిసీ నవ్వుల సుగ్రీవనారసింహము" 3-518

"సులభుఁడీతఁడిదివో సుగ్రీవనారసింహుఁడు
చెలఁగి మొక్కులు మొక్కి సేవించరో" 4-275

సుజాణఁడు : వి. మంచి నేర్పరి .

"అప్పసము చేయి చాఁచి ఆయములు గరఁగె
యా
చొప్పు నీవె యెరుఁగుదు సుజాణఁడవు"

11-101

సుడిగొను : *ప.బం; అ.క్రి.* చుట్టుకొను, పెనఁగు

"సుడిగొన్న యాసలు" 16-262

సుడియు : *అ.క్రి.* 1. తిరుగు 2. చుట్టుకొను 3. వ్యాపించు 4.ప్రసరించు 5. చలించు 6. సుడిగా వీచు 7. కలతనొందు 8. డాయు, సమీపించు 9. సంచరించు 10. అడ్డువచ్చు 11.మొదలు 12. లీనమగు .

"వుడిగినాఁగామాదు లొక్కొక్కవ్యాజాన నచ్చీ
సుడిసి నడుము చొచ్చు చుట్టాలవలె" 2-331

"చూచిన నాతని రూపే సుడిసీ దిక్కుల నెల్లను"

సుతిగూడు : (3) *అ.క్రి; ప.బం.* శృతి కలియు . (శృతికి సుతి వికృతి)

"వేడుకతోఁ బతివద్ద వీణె నే వాయించఁగాను
జోడుగా వచ్చి నీవేమి సుతిగూడేవే" 22-161

సుద్దముగ : *క్రి.విశ.* 'శుద్ధముగ' అనే పదానికి జానపదవ్యవహారం.

"సుద్దముగ మోము మోముఁ
జూడవలెనా యెదుట" 9-50

సుద్దాత్ముఁడు : వి. 'శుద్ధాత్ముడు' అనే శబ్దానికి జానపదవ్యవహారం. పవిత్రమైన ఆత్మ కలవాడు .

"చూడవే తానంతే కడు సుద్దాత్ముఁడైతేను
వోడక తా నొక్క రీతి నుండవలదా" 29-195

సుద్దాత్మురాలు : వి. శుద్ధాత్మురాలు అనే పదానికి జానపదవ్యవహారరూపం. పవిత్రమైన మనస్సు గలది.

"అన్నిటా యిచ్చలాడి సుద్దాత్మురాల నైతేను
వున్నతి వోజకు వచ్చి వుబ్బున మెచ్చేవు"

7-102

సుద్ది : వి.1.మాట 2.వృత్తాంతం, వార్త 3.సామెత 4.ప్రసంగం 5. జాడ 6.సల్లాపం, ముచ్చట 7.జోస్యం 8.పాటగాచెప్పే వీరులకథ 9.విషయం, జోలి . (తె.వ్యు.కో.)

"ఒరిచేను నీ సుద్దులు వొడఁబడ్డదాఁకాను
జీరవారెఁ జెక్కుమీఁదఁ జేయవయ్యా చేఁతలు"

27-218

సుద్దు : (14) వి. సూక్తి, మంచిమాట. లేదా ఇది సుద్దికి వ్యావహారికరూపం కావచ్చు.

"నీ చిత్తమెట్టుండునో నిన్ను నే నడుగరాదు
చూచి చూచి ఓర్వరాదు సుద్దు చెప్పవయ్యా" 27-547

సుద్దులకత్తె: (సుద్దులు+కత్తె) మాటకారి, మంచిమాటలు చెప్పే స్త్రీ.
"వద్దనుండి ఇందుకుఁగా వావు లేరుపరచేవు
సుద్దులకత్తెవు గదే సుదతి రో నీవు" 18-440

సుద్దులు చెప్పు: *ప.బం; అ.క్రి.* డంబాలు పలుకు.
"చుట్టమవై నాతోనే సుద్దులు చెప్పేవు నీవు
జట్టిగా నిన్ను జంకించి సాదించేనంటాను" 27-236

సుద్దోమద్దో: సుద్దో (సుద్ది+ఓ) సుద్ది అనే అర్థంలో 'సుద్దిమద్ది' అని జంటపదం కావచ్చు.
"బొంకకురే చతురుఁడప్పుడె వచ్చీనా
సుంకుదేరీఁ జూపు మంచి సుద్దోమద్దో" 5-341

సునియు: (4) నిఘంటువుల్లో ఈ పదం కానరాదు.
"సునిసి నా మొగమేమి చూచి నీవు లోగేవు
మనసునఁ గలయట్టే మాకుఁ జెప్పరాదా" 20-547

సుప్పనాతి: వి. 'చుప్పనాతి'కి జానపదవ్యవహారం. 'చుప్పనాతి' లోని 'చ' కారం 'స' కారంగా మారి ఏర్పడినరూపం. శూర్పణఖ.
"సుప్పనాతి శిక్షించి సొరిది రుషులఁగాచి
అప్పుడే ఖరదూషణాదులఁ గొట్టి" 2-274

సుమాళము: (2) వి. 1.సంతోషాదులవల్ల కలిగిన పారవశ్యం 2.మత్తత, గర్వం 3.సంతోషాతిశయం 4.వినయం 5.సుఖం 6.మూర్ఛ (ఆం.ప.కో.లో సుఖం అనే అర్థం ఈయబడింది.) కన్నడంలో సుమాన, సుమ్మాళ అనే శబ్దాలు ఉన్నాయని వాటికి సంతోషమర్థమనీ సం.ప.స. (14 సం. 356 పు.) ఇట పారవశ్యమనే అర్థం యుక్తంగా తోస్తుంది.
"చెలరేఁగి చెలరేఁగి చేతులు చాఁచేవు నాపై
మలసి యిచ్చటనే సుమాళమెత్తెనో" 14-158
"జవ్వనులఁ గూడి యాడి సంతోసాలు దలపోసి
యివ్వల సుమాళమైతే యింక నేనేమి సేతును" 17-223

సురటి: వి. 1. విసనకఱ్ఱ, చామరం 2. రాగవిశేషం. 1-6

సురాళము: వి. 1. కోపావేశము 2. భూతాద్యావేశంచే కలిగిన శిరోభ్రమణం. (శ.ర.)
"విరాళిఁగూడెను శ్రీవేంకటేశుఁడిటు నన్ను
సురాళమైన రతిఁ జొక్కి వుండరాదా" 19-439

సురుసురు: వి. 'చుఱుచుఱు'కు వ్యావహారికరూపం. కాలుట మొ॥ వాని యందనుకరణం. తీవ్రత.
"గుటిగాని మనసే గుబ్బతిలీఁగాక చెలి
కఱకున సురుసురు కన్గొనరాదా" 27-362

సులభము: (6) వి. సౌలభ్యం. ధర్మవాచకానికి బదులు ధర్మివాచకప్రయోగం. ఈ పదం కొన్నిచోట్ల 'సులబము' అనే రూపంలో కూడా ప్రయోగింపబడింది. (29-362, 28-554)
"చెలరేగి రమ్మనుచు చేయి వట్టి తీసీని
సులభాన నెటువంటి చుట్టమో కాని" 29-406

సువర్ణవిద్య: వి. ఓంకారాన్ని గట్టిగా ఉచ్చరిస్తూ మనస్సులో దేవుణ్ణి పొగడే విద్య (?)
"చేరువ సువర్ణవిద్య చిత్తములోఁ బ్రణవము
ధీరత నాదము సేసి దేవునిఁ బొగడుట" 1-452

సువ్వను: ధ్వన్యనుకరణ శబ్దం.
"సువ్వన నా మనసు యిసుకపాతర యెంతని
తవ్వేను తానే దయదలఁచీఁ గాకా" 12-261

సువ్వాలమ్మ: వి. 'సువ్వాల' పాడే స్త్రీ. సువ్వాల అంటే ఆడవాళ్లు పెండ్లిండ్లలో సువ్వి అనే పదంతో ఆలాపన చేసే పాడే పాట.
"సువ్వి సువ్వి సువ్వాలమ్మ
నవ్వుచు దేవకినందనుఁ గనియె" 5-361

సువ్విపాట : వి. జానపదులు పాడుకునే దంపుడు పాట. ఇందులో 'సువ్వి' అనే పదం ఊతగా ఉంటుంది. కన్నడంలో ఈ పాటలను 'సువ్వాలి' అని అంటారు.

"సువ్వి సువ్వి సువ్వాలమ్మ
నవ్వుచు దేవకి నందనుఁ గనియె
శశి వొడచె అలసంబులు గడచె
దిశల దేవతల దిగుళ్లు విడిచె - సువ్వి" 5-361

సుసరము : (38) విశే. సులభం, సూక్ష్మం, సరళం.

"కొసరుచుఁ జెలి నిన్నుఁ గొంగువట్టి పెనఁగిని
సుసరాన లోనైతే సూటికి రావయ్యా" 28-507

శీఘ్రం అనే అర్థంలో తాళ్లపాకకవుల ప్రయోగాలు ఉన్నాయి.

"అటమటీఁ డెప్పుడు నప్పులు తెగి తీతు
సుసరాన దిద్దక జుణుఁగుగాను" నీతిశతకం.

36 ప. భాగవతం, కు.చ., స.నీ.స. లోనూ ఈపదప్రయోగాలు కనిపిస్తున్నాయి.

"సుసరముతో గొల్చుచున్న సురసంఘములన్"
భాగ. 8-179

"సుసరముగఁ బారి కాంక్షు లే జోలిలేక"
(కు.చ. 2-64)

"తొలిచిన మాను విఱువ సుసరమైనయట్లు"
(స.నీ.స. 596)

ఇది సుస్వర శబ్దభవం కావచ్చుననీ, సులభముగా అని అర్థమనీ, సుసరశబ్దానికి కన్నడంలో ఈ అర్థం ఉన్నదనీ సం.ప.స. (14 సం. 356 పు.) తేలికగా అని అర్థమేమో! అని ఆ.మూ.

"సుసరము గాదు జంటమొన
సూదిని రెంటము గ్రువ్వ నొక్కటే"
(శృంగారవృత్త పద్యాల శతకం. 73)

సుసరి : (2) వి. సులభోపాయం కలవాడు (?)

"సుసరివై శరణము చొచ్చుట యతనికి
యెసఁగిన దేహుల మే మెఱుఁగుదుము"
15-138

సూ

సూటిఁబడు : (4) చూ: సూటిపడు. జరుగు, సంభవించు; సరితాకు, సరిపడు. వసు. 2-98

"వద్దు వద్దు నీకింతేసి వట్టి సొలపు
సుద్దులు జెప్పఁగఁబోతే సూటిఁబడ దిఁకను"
20-200

"మాటాడినంతటిలోన మర్మము లెల్ల గరఁగు
సూటిఁబడీనా మా కిట్టే సులభానను" 14-31

సూటి : (3) వి. 1. గురి, లక్ష్యం 2. ప్రసిద్ధి 3. ప్రతి 4. తిన్నన 5. వెరవు 6. విధం.

"చూపులు రూపై నిలచె సూట్లు వాఁటానకెక్కె
వోపిక లద్దరివాయ వొట్లేలే" 20-399

"చూడఁజూడ సూట్లు సుదతి నీ చూపులు
వాడవాడ వలపులు వాడికలు" 29-11

సూటికత్తి : (సూటి+కత్తె) వి. గురికత్తె, అందగత్తె. (తె.వ్యు.కో.)

"మట్టుమీరి మెలఁగితే మరేమున్నది
చుట్టరిక మెరిఁగిన సూటికత్తెలకును" 24-469

సూటికి వచ్చు : ప.బం; అ.క్రి. ఎదురుకు వచ్చు, జతపడు.

"సూటికిఁ బతి రాకున్న సొలతురు మలతురు
తోటకూరవంటి నన్ను దూరుసేసేవా" 14-241

"తప్పు నీ యందున్నదా తగవరి వన్నిటాను
చొప్పు లెత్తఁబోతేను సూటికిరాదు" 8-280

సూటికెక్కు : (2) (సూటికి+ఎక్కు) ప.బం; అ.క్రి. జతపడు, పొసగు, పెంపెక్కు, సరిపడు, లక్ష్యపెట్టు, రీతికెక్కు, ప్రసిద్ధికెక్కు.

"యీడనె శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
జోడైన చుట్టరికము సూటికెక్కఁగదవే" 25-64

"వెదకఁగా వెదకఁగా వేడుకలు దొట్టుకొనె
సుదతిచందము లింత సూటికెక్కఁ గదరే"
27-592

సూటిదప్పు : అ.క్రి. లక్ష్యం తప్పు, గుఱితప్పు.

"యీడనె శ్రీవేంకటేశుఁ డేలినాఁడు నన్ను నేఁడు

జోడుగూడే వుందుఁగాని సూటిదప్ప దెపుడు"
26-483

సూటిపడు : (6) అ.క్రి; ప.బం. 1. జరుగు, సంభవించు 2.సరితాకు, సరిపడు. (తె.వ్యు.కో.)
"సొలయఁగా సొలయఁగా సూటిపడదు నేరుపు
పలుమారు మాటాడితె పలచనౌను" 28-379
"సూటిపడఁదా నెన్ని సుద్దులు చెప్పినాను
మాటల నేనూ కొనేనా మందెమేళాన" 12-438

సూడిగము : వి. చేతికడియం, ఆభరణవిశేషం.
"కంకణసూడిగాలాపె కస్తూరినామము వెట్టు
కుంకుమగందము పూసి గుబ్బలు సోఁక"
22-781

సూడిదిపట్టు : కానుక గ్రహించు.
"చొక్కిన నా వేడుకలు సూడిది పట్టఁగరాదు
గక్కన నీ వెనసితేఁ గానవచ్చీని" 20-384

సూడిదె : వి. 'సూడిద'కు రూపాం. కానుక.
"దవ్వులనే వలపులు తతి నీపైఁ జల్లేనంటే
సువ్వనఁ జేతిమొక్కులు సూడిదెగాఁ బట్టె"
21-228

సూడిదెవట్టు : కానుక గ్రహించు.
"సూడిదె వట్టి వున్నది సుద్దు లలమేలుమంగ
యీడేరెఁ బీటమీఁదికి నిఁక రావయ్యా" 14-109

సూడు : (7) వి. 1. ఈర్ష్య 2. వైరం 3. శత్రువు.
"అట్టె శ్రీవేంకటేశ అరమఱపాయ మేను
చుట్టమై ఇంతేసేయ సూడా నీకు" 22-151
"జోడై నీ వున్నందుకు సూ డెంత గలిగినాను
వేడుక నాతని బుద్ధి వినేదే కదే" 17-250
"చుట్టరిక మమరితే సూళ్లు వెదకరాదు
పట్టి కాఁగిలించుకొంటే పాయఁగరాదు" 29-335

సూడుకాఁడు : (సూడు + కాఁడు) వి. పగ కలవాడు, ఈర్ష్య కలవాడు, శత్రువు.
"యేపున నీ గురుత నే మేలెఱఁగమయ్యా
చూపుల సాములు సేసే సూడుకాఁడవు"
18-540

సూడుఁబాడు : (14) (సూడు+పాడు) సూడు (= ఈర్ష్య, శత్రుత్వం, శత్రువు) అనే అర్థంలో జంటపదం.
"కోపగించఁబనిలేదు కూడితి మిద్దర మీఁద
చూపులఁ జూడు మనవె సూడుఁబాడేల"
11-302
"వట్టి నేరాలెంచకిఁక వచ్చేవో రావో
చుట్టరికాలలో యింత సూడుఁబాడుఁగలదా"
26-13
ఆచార్య ఎస్. గంగప్పగారు మాండలికమైన ఈ పదానికి 'సిగ్గూ లజ్జా' అనే అర్థాన్ని సూచించినారు. (రా.సీ. మాం. 96 పుట) సందర్భాన్నిబట్టి పై అర్థమే సరిపోతున్నట్లుగా తోస్తుంది.
"చుట్టమైన నాయకుఁడు సూడుఁబాడు నెంచ
జట్టిగొని సరసమే జరపఁగవలెను" 12-524
గంగప్పగారు పరిష్కర్తలు సూచించిన పగతో కూడుకున్న అనే అర్థం సరికాదన్నారు. ఇది సరియేనా? ఆలోచించాలి.

సూడుఁబాడు బట్టు : ప.బం; అ.క్రి. పగబట్టు. (పద.)
"చుట్టమనై వుందుఁగాని సూడుఁబాడు బట్టనే
మెట్టి సేవసేతుఁ గాని మేరమీరనే" 29-467

సూడుబంటు : (8) వి. పగదీర్చుకునే శూరుడు. (తె.వ్యు.కో.)
"ఓడక నీ కితవైతే వుట్టిగట్టుకుందుఁగాని
సూడుబంటుతో బలాలు చూపి చెప్ప నేలరా"
19-515

సూడులువట్టు : అ.క్రి; పగలు పూను.
"సూడులువట్టవుగదా సుదతి నే పంగించితే
యీడ శ్రీవేంకటేశ నీ కీపె చుట్టము" 23-447

సూడువట్టు : (2) పగబట్టు, విరోధించు. మాత్సర్యం వహించు అని ఆ.మూ. (సం.వా. పద. భాషా. 479 పు.)
"సొరిది నీ వేల వచ్చి సూడువట్టేవిపుడు"
17-222

"గోర నిన్ను నూఁదితేను గొబ్బున సూడువట్టేవు
బీరమింతెపైఁ జూపేది పెద్దరికమా!" 23-384

సూడువెనఁగు : విరోధించు.

"చుట్టపువరుసనే సూడు వెనఁగఁగ వద్దు
పట్టి నీ పిడికిటిలోఁ బెట్టు యేల వెఱపు" 25-244

సూడో పాడో : ప.బం; పగ అనే అర్థంలో నిందార్థకమైన జంటపదం ; (సూడు = పగ)

"సూడో పాడో తనకు సొరిది న న్నింతసేయ
యీడా నుండఁడు చూడ నింటనే వున్నాఁడు"
20-220

సూతకపుమానము : వి. (?)

"ఈతలఁ గన్నుల మేలిటు చెప్ప రావయ్యా
సూతకపు మానములు (?) చూడఁగలదిఁకను"
7-312

సూతకము : వి. మృతాశౌచం, మైల.

"ఆతల మతకమున నాపెఁ దను నంపకుంటే
సూతకమైన యట్టి సుద్దెరుఁగునా" 14-36

సూత్రపుగణికె : వి. (?)

"కోపుల నాలికెలోనఁ గుచ్చి కట్టినట్టి తాడు
చూపరాని సంసారమే సూత్రపుగణికె" 3-467

సూత్రబొమ్మ : వి. తోలు బొమ్మలాటలు మొ॥ వాటిలో దారంతో ఆడించే బొమ్మ.

"కదలి సూత్రబొమ్మలు కమ్మి సురట్లు విసరీ
పెదవితేనియ లాని ప్రియములు రేఁచవే"
29-420

సూత్రము : వి. 1. కిటుకు 2. కీలకం 3. పన్నుగడ.

"ఏమి సూత్రమో కాని ఇందుకు నందుకు నేఁడు
తామరమొగ్గల సొం పద్దముపై నిలిచెను"
26-308

సూత్రవతీపతి : విష్వక్సేనుడు.

"దిట్టవు సూత్రవతీపతి వసురలఁ
చట్టలు జీరఁగఁ జతురుఁడవు" 1-207

సూత్రే మణిగణా ఇవ : "మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ" అనే భగవద్గీతా శ్లోకం లోని పాదం. దారంలో మణులవలె నాలో ఈ ప్రపంచమంతా కుచ్చబడింది అని భావం.

"ఇదివో సుజ్ఞానము "సూత్రే మణిగణా యివ" గాన
మది నితరమే లేదు మాయల యద్భావం తద్భవతి" 2-121

సూదిపిరిది తాడు : ప.బం; వి. వెనువెంట వచ్చేది. ఒకదానిని అనుసరించుకుంటూ పొయ్యేది. సూది వెనుక వెళ్లే దారం అని వాచ్యార్థం.

"పెనఁగి నీ వాడా నీడాఁ బిలువకుమయ్య నన్ను
తనిసి సూదిపిరిఁదితాడువంటివాఁడవు" 9-5

సూదిరాయి : (4) వి; ప.బం. సూదంటురాయి, అయస్కాంతం.

"ఆఁటదిరైయెతేఁ జాలు నంటుకొనేవు గక్కున
వాఁటమైన సూదిరాతివలెనే నీవు" 23-391

సూదివజ్రాలు : వి. సూదులు, వజ్రాలు.

"చుక్కలు సురవొన్నలు సూదివజ్రాలు గోళ్లు
అక్కర యేనుఁగ తొండాలరంట్లే తొడలు"
7-287

సూదివాటు : (2) వి. సూదివంటి సన్ననైన గాయం, క్షతం.

"చుక్కలువలె మోవిపై సూడివాంట్లంటించును
గుక్కక పూవులు చెక్కలు గొప్పువట్టి తీసును"
27-201

సూదివెంటదారము : (2) ప.బం; వి. వెనువెంట వచ్చేది, అనుసరించి వచ్చేది.

"సుదతి వెంటనే వచ్చి సూదివెంటదారమై
అదిగో నివ్వెఱఁగంది అట్టే నవ్వీని" 17-198

సూదుల మూఁటల సుఖములు : బాధను కలిగించే సుఖములు (?)

"యేది దలంచిన నే కాలంబును
సూదులమూఁటల సుఖము లివి" 1-81

సూదుల (వంటి) మాటలు : వి; ప.బం; బహు. హృదయాన్ని కుచ్చుకుని బాధపెట్టే మాటలు, సూదుల వంటి మాటలు. 2-117

"సూదులమాటలు వో నీ సుద్దులూ కడుఁ
బోదిసేసే కొలఁది నీ బుద్ధులు" 9-116

సూర : వి. ఉంట, కట్టుబడిలో పనికిరాని రాతిముక్క.

"భారతములో నున్నదే పంచమవేదమిది
సూరలుగా సోదించి చూచుకొండో" 15-113

సూరియుఁడు : వి. 'సూర్యుడు' అనే దానికి జానపదవ్యవహారరూపం.

"సూరియునిఁ జూడరాదు చుక్కలెల్లా నెంచరాదు
పోరచి వెట్టించవే వొత్తుగలసె" 25-381

సూరుఁడు : వి. 'శూరుడు' అనే దానికి జానపద వ్యవహారరూపం.

"సూరుఁడు నీవు యెదురుచూచి మోహించినవాఁడు
నేరుపుల నవ్వు నీపై నించెఁ గదమమ్మా"
20-590

సూర్పనక : వి. 'శూర్పణఖ'కు జానపదుల వ్యవహారపదం.

"తనకు వలచినట్టి తరుణి సూర్పనకను
పెనుముక్కు గోసిన బీరగాఁడే" 9-134

సూర్యవీథి : వి. తూర్పువీథి, తూర్పు పడమరలుగా సాగే వీథి. (సూర్యవీథి =తూర్పువీథి, సోమవీథి = ఉత్తరమున నుండు వీథి. సోమసూర్యవీథుల తిరుగుట అనగా ప్రదక్షిణ మాచరించుట అని అర్థమగును. (సం.వా.పద. భాషా. 479 పు.)

"అల సూర్యవీథి నేఁగీ నాదిత్యుని తేరిమీఁద
కలికి కమలానందకరుఁడు గాన" 1-424

సూళ్లువట్టు : ప.బం; అ.క్రి. పగ(లు)వట్టు. ('సూడు'కు సూళ్లు బహువచనం.)

"గోర గీరీని చెమట కుమ్మరించఁ జోటు లేక
జోరునఁబైఁ జిమ్మితేనె సూళ్లువట్టీనా" 9-238

సూసకపుఁబెండ్లి : వి. వధువు తలమీద అలంకరించెడి పూవులను కూర్చు పెండ్లి.

"తాసువలెఁ బెనఁగుచు తలమొల యెఱఁగరు
సూసకపుఁబెండ్లి మిమ్ముఁజూచి నేరవలెను"
23-200

సూసకము : (6) వి. 1. స్త్రీలు తలలో ధరించెడి తిరుగుడు బిళ్ల. (శ.ర.) 2. వివాహ సమయంలో వధువు తలమీద అలంకరించెడి పూవుల కూర్పు.

"సూసకాల పేరటాండ్లు సోబాన బాడరో
మోసపోక యిట్టే ముహూర్తమడుగరో" 14-365

సూసరము : వి. ప్రకరణాన్ని బట్టి బాసికం అర్థం కావచ్చునని సం.ప.స.

"చుక్కబొట్టు పెట్టుకొని సూసరము గట్టుకొని
నిక్కినిక్కి చూచీ నాపె నీ దిక్కు" 18-53

సృ

సృగాలివాసుదేవుఁడు : వి. కరవీరమనే నగరంలో నివసించే పౌండ్రక వాసుదేవుఁడు. జరాసంధుని మిత్రుడు. ఇతడు జరాసంధునితో కూడి శ్రీకృష్ణుణ్ణి ఎదిరించేవాడు. శ్రీకృష్ణునిచే సంహరింపబడినాడు. చూ : పౌండ్రక వాసుదేవుఁడు.

"వొట్టి సృగాలి వాసుదేవుని భంగించిన తేరు
బెట్టు పౌండ్రకునిపై దాడి వెట్టిన తేరు" 2-227

సె

సెంకించు : స.క్రి. 'శంకించు'కు జానపదవ్యవహారరూపం. అనుమానించు.

"సెంకించక తన దాసులఁజేపట్టే మందు"

సెక : వి. సెగ, జ్వాల, తాపం, కాక, వేడిమి, ఆముకాల్పుల యొక్క వేడిమి.

"కాఁగిన దేహపుసెకలును కప్పిన పువ్వుల సొరబులు
వేఁగిన చెలి తాపమునకు వెన్నెల నుండెడిని"
5-138

సెగ్గించు : అ.క్రి. అసహ్యపడు, గర్హించు, నిందించు.

సెగ్గెము : (3) వి. రోత, ఏవము.

"శ్రీవేంకటేశుఁడ ఆకె చేయివట్టి పెండ్లాడఁగా
సేవసేయ నొకతెకు సెగ్గెము గాదా" 16-39

సెరబడివారుము : (?)
"సెరసెత్తు శ్రీవేంకట శ్రీనారసింహ నీ
సెర బడివారము(?) శ్రీనారసింహ" 15-227

సెల : వి. సెలయేరు.
"పిస లేనివారిఁ జేరఁ బిలువఁబోవుటకంటె
కొసరి కొండసెలకు కుయ్యుటే మేలు" 16-237

సెలయు : (2) అ.క్రి. 1. విజృంభించు 2. కొమ్ములు మొ॥ వాటితో పొడుచు 3. చిమ్ము 4. ఖండించు.
"తల వంచఁబోతేను తనువెల్లాఁ బులకించె
సెలసి చూడకువే సిగ్గు లేమోనో" 21-428

సెలయు : స.క్రి. చిమ్ము, విజృంభించు.
"పైకొని నీవే పాదము చాఁచగ
చేకొని పిసుకక సెలసీనా" 11-474
"చేయి నా మీఁద వేయఁగా సెలసి విదలించితి"

సెలవినవ్వులది : సెలవి (=పెదవుల మూలభాగం) భాగంలో నవ్వులు గల స్త్రీ.
"తళుకుఁ జెక్కులదాన తలిరుఁబాదాలదాన
సెలవినవ్వులదాన సిగ్గరిదాన" 29-409

సెలవిల్లు : (సెలసు + విల్లు) వి. ఒకరకం విల్లు. రూపాం. సెలసువిల్లు.
"జలధి బంధించిన సౌమిత్రిరామా
సెలవిల్లు విరిచిన సీతారామా" 3-300

సెలవు : (13) వి. 1. ఉపయోగం 2. సత్యం 3. ఆజ్ఞ 4. చోటు 5. అనుజ్ఞ 6. విడుదల 7. వీలు 8. పోటు 9. విరామం 10.ఖర్చు 11. అర్పణం. (ఆ.మూ.)
"ఆదిమూలమగు హరి నాతుమ సేవించక
యే దైవముల గన్నా యేమి సెలవు" 4-59
"కలిగిన దినములు కాపురానకే సెలవు" 8-86
"కైపుగాఁగ కన్నవారి కాళ్లకు మొక్కినాను
శ్రీపతికి మొక్కినంత సెలవు గాదు" 4-250

సెలవుల నవ్వులాపె : వి. సెలవుల (=పెదవుల మూలభాగాల) లో నవ్వులు గల స్త్రీ.
"చేరఁడేసి కన్నులాపె సెలవుల నవ్వులాపె
మూరెఁడు గొప్పాపె నీకు మొక్కితే ననె"
28-511

సెలవుసేయు : (2) ప.బం; స.క్రి. ఉపయోగించు, వ్యయంచేయు.
"చెలఁగి పాయము నీకు సెలవుసేసెఁ గనక
తలకొన్న చింతలకు తలఁకదు" 24-285
"ఇటువంటివెల్లా నీకే యిట్టే సెలవుసేసితి
తటుకున నీ వనే నిధానము చేకొంటి ని" 2-215

సెలసుమోరవాఁడు : వి. వరాహావతారుడు.
"పొలసుమేనివాఁడు బోరవీఁపువాఁడు
సెలసుమోరవాఁడు సిన్నెకా" 5-182

సెలసువిల్లు : వి. సెలసు (ఒకానొక చెట్టు) బద్దలతో చేసిన విల్లు.
"సెలసువిల్లు విఱిచి సీతఁ బెండ్లియాడునాఁడు
పలికి బొంకని మాఁట పట్టు నాకు నిమ్మీ" 9-21

సే

సేత : (2) వి. 'చేత'కు జానపదవ్యవహారం. చేష్ట, పని.
"ఏ సేఁతలైనా మేలు యెదురాడవయ్యా"
14-450
"దైవమా నీవే మమ్ము దయదలఁచుట గాక
చేవల నీ సేఁతలెల్ల చెల్లును లోకానను" 2-158

సేఁతికుత్తికవాఁడు : వి. శివుడు. (సేఁతి అనేది చేదుకు వ్యావహారికరూపమేమో!) చేదు కుత్తిక కలవాడని వ్యుత్పత్తి.
"సేఁతికుత్తికవాఁడు సెడకుండ దాఁచిన
పాఁతపెద్దవిల్లు బలువున
నాఁతికొరకు వచ్చి నడిమికి విఱిశిన
శేఁతలాఁడు గదె శినకాటి" 5-367

సేకరము : వి. 'శేఖరము' అనే శబ్దానికి జానపద వ్యవహారరూపం కావచ్చు. శిరోభూషణం, మేటి.
"మాకుఁజూడ వెరగాయ మగువచందము నేఁడు
సేకరముగా చలము చెల్లించకుండీనా" 26-22

సేగి : వి. 1. నష్టి 2. ఆపద.

"నీవంటి చతురునకు నిక్కంబుగా వలచి
జీవంబు విడిచినా సేగి గలదా" 6-79

సేదెగాఁడు : (సేద్యం+కాఁడు) సేద్యం చేసేవాడు, వ్యవసాయంలో జీతగాడు.
"మమతఁ జెక్కులమీఁద మళ్లుగా గోరను గీరి
చెమటనీళ్లు గట్టే సేదెగాఁడ" 18-354

సేన : (6) విణ. 'శాన' అనే పదానికి వికృతిరూపం. ఎక్కువ, అధికం, రూపాం. చాల, శాల, శాన, సేన. ఈ సేన అనే శబ్దం 'సేనలు' అని బహువచనరూపంగా కూడా ప్రయుక్తమైంది.
"చెల్లు లేరా నీకు నిది సేన సతులు గలరు"
11-281
"ఆసఁ దొల్లి మును లనంతకోట్లు
చేసిరి తపములు సేనలుగా" 3-255
"ధరలో సేనలు ధనధాన్యంబులు
పరమజ్ఞానవిభవ మీవు" 4-275

సేనమారులు : *వి; బహు;* చాలా పర్యాయాలు.
"యెప్పుడూఁ బాయకుమని యిన్నిటా వలతునని
చెప్పితిఁగా ప్రియములు సేనమారులు" 29-8 అను.

సేనమొదలారి : (3) వి. విష్వక్సేనుడు. సేనలకు అధిపతి అని వ్యుత్పత్తి.
"పరఁగు సూత్రవతీపతివై వెంకటవిభు
సిరుల పెన్నిధి నీవే సేనమొదలారి" 1-285

సేనసేన : విణ. మిక్కిలి ఎక్కువ. రూపాం. చాలచాల > శాలశాల > శానశాన > సేనసేన.
"చెలికత్తె నీకుఁ జేసె సేనసేన విన్నపాలు
వెలయ నీ చెవులార వింటివా నీవు" 22-173

సేనాసేన : (19) విణ. మిక్కిలి ఎక్కువ. రూపాం. చాలాచాల > శాలాశాల > శానాశాన > సేనాసేన.
"చిల్లపూవుదండ లేలే చెంచెత నీకు
చెల్లెఁబో మాకులమీఁద సేనాసేన" 24-159
"యిరుమేలా నూడిగపుటింతులు సేనాసేన
యెరవులేక యిందరి నెట్టు మన్నింతువయ్యా"
25-123

సేవంతి : వి. చేమంతి.
"తొయ్యలి కొప్పున సేవంతులు వించె నిట్లనే
నెయ్యమెల్ల నీకె పైనె నించరాదా" 6-134

సేవిది : వి. శేవధి కావచ్చు. నిధి.
"యిందిరారమణి నేచిన సేవది
చెందరు సుజనులు చెప్పంగలదే" 2-42

సేసకొప్పు : *వి; ప.బం.* కొండెసిగ, సేసలు చల్లేటప్పటి కొప్పు.
"సేసకొప్పుతోడిది చెమట ముత్యాలది
సేసిన నీ పొందు మాతో జెప్పుకొన్నది" 11-204

సేసచల్లు : *ప.బం; అ.క్రి.* అక్షతలు చల్లు, పెండ్లాడు. (?)
"రమణుఁడ నా మన సరయవు గాక
సముకాననే సేస చల్లఁగ వద్దనేనా" 27-7

సేసపాల చెలి : వి. శాస్త్రోక్తంగా వివాహమాడిన స్త్రీ.
"కాయకపు వావులకాంతలు సరయ్యేరా
చేయిమీఁదై సేసపాల చెలులకును" 21-214

సేసపాలది : (2) (సేసపాలు + అది) శాస్త్రోక్తంగా వివాహమాడిన స్త్రీ.
"ఆసపడ్డాడవు నీవు అడ్డమాడ దోసము
సేసపాలిదాన నీ చిత్తమిఁక నయ్యా" 27-120

సేసపాలమగువ : *వి; ప.బం.* అప్పుడే పెండ్లియైన స్త్రీ, తలంబ్రాలు గల స్త్రీ, శాస్త్రోక్తంగా పెండ్లియైన స్త్రీ.
"యేపున వహించుకొని యింటిపను లేమరక
చేపట్టుగుంచమైనది సేసపాలమగువ" 22-524

సేసపాలవారు : *వి; బహు.* భార్యాభర్తలు. (తలంబ్రాలు గలవారు)
"సిగ్గులు వడఁగరాదు సేసపాలవారికెల్ల
నిగ్గులఁగాఁగిటఁగూడి నిక్కుటే కాని" 20-544

సేసపాలు : *వి; ప.బం; బహు.* సేసప్రాలు, అక్షతలు, తలంబ్రాలు.

"చేతిలోనె వున్న వివే సేసపాలు
కాతరించ నేఁటికే కాంతునితోను" 12-172
"సెలవి నవ్వులనే సేసపా లివె చల్లె
సొలవక యీకె మోము చూడవయ్యా" 29-289

సేసపెండ్లికూతురు : వి. శాస్త్రోక్తంగా వివాహమాడే కన్య.
"ప్రేమ నాపె నీకు సేసపెండ్లికూతు రాయఁగాని
నేము వెట్టికి వచ్చిన నెలఁతల మైతిమా"
11-515

సేసపెండ్లిది : (సేస + పెండ్లి + అది) శాస్త్రోక్తంగా పెండ్లాడిన స్త్రీ.
"శ్రీవేంకటేశ నీ సేసపెండ్లిదాన నింతే
కేవలమై యిఁక కనికరించవద్దా" 21-198

సేసపెట్టిపెండ్లాడు : ప.బం; స.క్రి. శాస్త్రోక్తంగా పెండ్లాడు. (అక్షితలు చల్లి పెండ్లాడు అని వాచ్యార్థం.)
"ఆసగించి వున్న యింతి నారఁడిఁబెట్టుదురా
సేసవెట్టి పెండ్లాడిన చెలువుఁడవు" 19-45
"సేసపెట్టి పెండ్లాడి చేతికి లోనైన వేళ
వేసరుకొంటే నా దెస విన్నవించవచ్చునా"
18-33

సేసలు చల్లి పొత్తులు గలయు : ప.బం; అ.క్రి. ఉప్పువేసి పొత్తుగూడు అనడం వంటిది.
"పుక్కట సేసలు చల్లి పొత్తు గలసే వాతని
దక్కఁగొంటివా నా చందమున నీవు" 24-577

సేసవెట్టు : (సేస + పెట్టు) ప.బం; అ.క్రి. అక్షతలు మొ॥ చల్లు, తలంబ్రాలు పోయు, పెండ్లియాడు. (తె.వ్యు.కో.) దీవించు.
"చెట్టుపైఁ బూవులు రాల చెలి సేసవెట్టె నంటా
అట్టె శ్రీవేంకటేశుఁడాలకించఁగా" 17-251
"సేసవెట్టిన పతికి సేవలెల్లా జేయవే"
హరివంశంలో ఈ ప్రయోగం కనిపిస్తుంది.
"కైసేసి తాను సుదతులు
సేసలు వెట్టుటకు శైబ్యచిత్తంబున ను
ల్లాస మెలర్ప నెదుర్కొని యా సరసిజనయనఁ
గని యె నరదముమీఁదన్" (పూర్వ. 3-133)

"బేసబెల్లితనమునఁ బిలిపించి యిందరిలో
సేసవెట్టి పచ్చిసేసి సిగ్గులు వరతురా" 13-21

సేసాడు : (సేస + ఆడు) ప.బం. పెండ్లాడు.
"కూడి నిన్ను నారతులె గురుతులు సేసాడేవు"
14-226

సేసు : క్రి.ప. 'చెయు(ను)' అనే తద్ధర్మార్థక రూపానికి జానపదవ్యవహారం.
"కొత్త చంద్రుఁడేమి సేసు, కోవిల కేడ నేరమి
హత్తిన నా కోరికలే ఆరడిసేయఁగను" 12-412

సేసె : క్రి.ప. 'చేయు' ధాతువు భూతార్థక ఏకవచన రూపానికి జానపదవ్యవహారరూపం.
"సేసెఁగా దైవము నీ చేతిమీఁదుగా నేఁడు
వేసితిఁగా పైఁజేయి వింత లేమీ నెంచక" 20-209

సై

సైఁదపుఁగుడుము : వి. గోధుమపిండితో చేసిన కుడుము, మధురమైన కుడుము.
"దప్పిదేరంగ సైఁదపుఁగుడుములును వడలుఁ
బప్పులునుఁ బన్నీటి పానకములు" 5-14

సైకము : వి. మాండలికపదం. శుభ్రం, పరిశుద్ధం, సుందరం, సూక్ష్మత్వం. విణ. సూక్ష్మం.
"చేకొని యెంతలో నాకె చెరగుమాసి వుండితే
సైకముగా శిరసు మజ్జనము సేసితివి" 14-592
"వలయపు బండికండ్లు వంటి పిఱుఁదు ఘనము
జలజపుఁ బాదములు సైకమైనవి" 12-449
"యెన్నిక శ్రీవేంకటేశ యిద్దరముఁ గూడితిమి
తన్ను దానె సైకమాయఁ దడవలు పనులు"
21-5
"సన్నపు నడుములోని సైకమే లక్షసేసు
పన్నుగాఁ బిరుఁదు వన్నె పదివేలు సేసు" 5-304

సొ

సొంటు : (2) వి. తప్పు, దోషం, (శ.ర.) నెపము, సాకు. (తా.పె.కృ.స.వ.పరి)
"గొంటరితనాన మేని గురుతులు చూపేవు
సొంటులు నీకు నింపా చూచేఁగాని"
13-359, 15-93

సొంటులు సోదించు : (9) అ.క్రి. బాగా పరీక్షించు, దోషాలు వెదకు.
"సొంటులు సోదించి నిన్నుఁ జూడఁగ వసమా
యింట శ్రీవేంకటేశ నీ విరవాట గాక" 13-367

సొకనాసి : *ప.బం;* వి. దేవాలయంలో గర్భాలయపు ముందరి పట్టు, దేవాలయముఖద్వారం.

సొక్కు : వి. 'చొక్కు'కు జానపదవ్యవహారం. 1. పారవశ్యం 2. చొక్కపొడి 3. మూర్ఛ 4. మోహం.
"యీడనె శ్రీవేంకటేశుఁడెనసె నిన్నింతలోనె
వీడెపు సొక్కులతోడి వింత లిదేటిదే" 21-363

సొచ్చెము : వి. ధనాదికము.

సొట్టు : (3) వి. నెపం, సాకు, సొడ్డు, లొట్ట. (తె.వ్యు.కో.)
"విరసపు సొట్టు విడువు మంటి మిటు
తరవాతి పనులు తా మెఱుఁగు" 25-221

సొట్టులెంచు : *ప.బం;* అ.క్రి. సొడ్డులుపెట్టు, తప్పుపెట్టు, సాకుపెట్టు.
"యేది నీవు సేసినాను యిన్నియును నియ్యకొంటే
సోదించనేఁటికి యందు సొట్టు లెంచనేఁటికే"
1-497

సొడగిలు : అ.క్రి. సోలిపోవు.
"చూచి చూచి సొడగిలి సొంపుల నీ చేఁతలెల్ల
తాచి తెరమాఁటుకైనా దలఁగరాదా" 17-446

సొన్నాటంకము : *ప.బం;* వి. మాడ అనే నాణెం. రూపాం. సొన్నటంకము, స్వర్ణటంకము.
"సుదతి బిత్తరిచూపు సొన్నాటంకాలే సేసు
అధరబింబము తీరు ఆరువేలు సేసు" 5-304

సొన్నాటంకాలు సేసు : *ప.బం;* అ.క్రి. మిక్కిలి విలువ చేయు.
"సుదతి బిత్తరిచూపు సొన్నాటంకాలే సేసు
అధరబింబము తీరు ఆరువేలు సేసు" 5-304

సొమ్మ : వి. మూర్ఛ, ఊపిరితిత్తుల జబ్బు, ప్రమాదకరమైన జబ్బు, చుట్టబట్ట.
"వుమ్మడి శ్రీవేంకటేశుఁ డొగి నిట్టె నన్నుఁగూడె
సొమ్మల మైమఱచి నేఁ జొచ్చినదే నేరమా"
11-528

సొమ్మెలంబోవు : *ప.బం;* అ.క్రి. సొమ్మలఁబోవు కావచ్చు. మూర్ఛపోవు.
"సొమ్మెలం బోయేవేలే సొంపుగొల్లెతా వోరి
దిమ్మరి కోనేటిరాయ తిరమైతి నీకును" 6-113

సొరబు : వి. కృశత్వం, వాడిపోవుట.
"కాఁగిన దేహపు సెకలును కప్పిన పువ్వుల సొరబులు
వేఁగిన చెలితాపమునకు వెన్నెల మండెడిని"
5-138

సొరిది : వి. క్రమం, వరుస, పంక్తి, శీఘ్రం, యుక్తంగా.
"చూతమువో వొక్కతైన సొరిదిఁ గాంతునిఁ దమ
చేతికి లోనుగాఁజేసి చిక్కించుకో గలదా"
11-402

సొరుగు : అ.క్రి. మూర్ఛిల్లు.
"సొరిగితినంటా సురతపరవశాన
నరవిరి కనురెప్ప లల్లాడించీని" 5-117

సొర్ణాటంకము : వి. సొన్నాటంకము, మాడ అనే బంగారునాణెము.
"ఎన్నఁగ సొర్ణాటంక మింతటానుఁ జెల్లినట్లు
సన్నపుఁదోలుబిళ్లలు సరిగాఁ జెల్లునా" 2-170

సొలఁగు : పారవశ్యం పొందు.
"తలవంచుకొని నీతో తమకపు మాటలాడి
సొలయుచు నింతి మొక్కి సొలగిలీని" 8-258

సొలతు : క్రి.ప. సొలయు ధాతువు తద్ధర్మార్థంలో మ.పు; ఏ.వ.రూపం. ఇట అంతర్భావితణిజర్థంగా వాడబడింది. సొలయింతును అని అర్థం(?)
"చెప్పినట్టు సేయఁగాను చిత్తములోఁ గరఁగక
చొప్పలెత్తి యెటువలె సొలతు నిన్ను" 14-556

సొలపు : (3) వి. 1. శ్రమ, బడలిక 2. పారవశ్యం 3. పంక్తి 4.దీనభావం 5. మూర్ఛ 6. విలాసం 7. మృదుత్వం 8. వైముఖ్యం 9. విధం 10. దృష్టివిశేషం.

"ఎలమి శ్రీవేంకటేశుఁ డీతఁ డిట్టె నన్నునేలె
సొలపులు మావంటి సుదతుల కేలే" 26-228
"వెల్లవిరిసొలపుల వేడుకలు దైవారె
కొల్లలుగా రీతులను గూడుదువు" 14-564

సొలసేవు: క్రి.ప. సొలయు ధాతువు తద్ధర్మార్థంలో మ.పు; ఏ.వ.రూపం. ఇట అంతర్భావితణిజర్థంగా వాడబడింది. సొలయింతువు అని అర్థం(?)
"ఈతని నేల సొలసే వెందాఁకా నీవు
యేతులు నెమ్మెలుఁ జూప నిఁక నేలే చెలియా"
14-584

సొల్లెము: వి. 'చొల్లెము' అనే శబ్దానికి జానపద వ్యవహారరూపం. జడలో చుట్టిన చుట్ట.
"జడల సొల్లెము సుట్టి సరివీఁక విల్లువట్టి
వెడదవాతంప పొది వీఁపునఁ గట్టి" 20-230
"వేణింజొల్లెము వెట్టి" అని భాగవతప్రయోగం.

సో

సోఁకనాడు: ప.బం; అ.క్రి. మనసు నొచ్చేరీతిగా మాట్లాడు. తాకనాడు, ఆవేశంతో మాట్లాడు.
"సొలయక మలయక సోఁకనాడక
వలపులే చల్లి కైవశము చేసుకోవే" 29-100

సోఁకోర్చు: ప.బం; అ.క్రి. 1. బాధలకోర్చు 2. సంభాషణాదులను పెట్టుకోవడానికి ఇష్టపడు.
"కాఁకలఁబొరలినది కౌఁగిటఁగొసరినాను
సోఁకోర్చి మెచ్చే సరసునిదే నేర్పు" 12-133

సోఁపు: వి. (?)
"సొమ్ముగలవాఁడవు సోఁపుగని యిచ్చె కాక
సమ్మతిఁగాక వంచన సేయవచ్చునా" 11-123

సోగ: వి. పొడవు, అందం. విణ. పొడవైనది, అందమైనది.
"సోగల శ్రీవేంకటేశు సురత సింగారము
వాగమై యమరెఁగాన వన్నెలెల్ల నమరె" 9-90

సోగమేను: వి. అందమైన శరీరం.
"సోఁకనన్న మానదు నా సోగమే నేమో కాని
పైకొని నీ పచ్చిమీఁదఁ బచ్చి దగునా" 9-64

సోదన: వి. 'శోధన'కు వికృతి.
"చొక్కి తన మేను నీకు సోదన లియ్యఁగానే
నెక్కొని యప్పటి నేల నిందవేసేవే" 26-460

సోదనగొను: (2) స.క్రి. గాలింపుచేయు.
"జోలిఁబెట్టలేదు నిన్ను సోదన గొనఁగలేదు
మేలు మేలనుచు నిన్ను మెచ్చరాదా" 24-594

సోదనిచ్చు: (2) (సోదన+ఇచ్చు) అ.క్రి; వి. శకునం కోసం రామాయణాది గ్రంథాల్లో దారంవేసి శోధించు, గాలించు.
"చూడుమని నీ మేను సోదనియ్యవలెనా
జాడతో నీ సేఁతలు సత్యాలుగావా" 23-189

సోదించు: (36) స.క్రి. 'శోధించు'కు జానపద వ్యవహారం. అన్నమయ్య తాను ప్రయోగించిన 36 ప్రయోగాల్లోనూ మహాప్రాణవర్ణమైన 'ధ' కాక అల్పప్రాణమైన 'ద'కారాన్నే ప్రయోగించినాడు. ఒక ప్రయోగంలో మాత్రమే 'ధ' కారం కనిపిస్తుంది. (చూ: 6-96)

సోద్యము: (6) వి. 'చోద్యము'నకు జానపద వ్యవహారం. వైచిత్రి, వింత, ఆశ్చర్యం.
"చూడఁజూడ సోద్యాలాయ చుట్టరికము గట్టేయ
జాడతో మీ యిద్దరికి సరసములు" 23-67

సోపులాడు: ఊగులాడు. 2-246

సోబనపక్షంతలు: (సోబనపు + అక్షంతలు) మంగళకరమైన అక్షంతలు, సేసలు.
"సుదతి నీ కొసఁగే సోబనపక్షంతలు
అదన నీవు మీఁజేత నందుకొంటివి" 8-19

సోబనపత్రిక: వి. శోభనపత్రిక, మంగళపత్రిక, పెండ్లిపత్రిక, లగ్నపత్రిక.
"ఇది పెండ్లి లగ్నవేళ యింతికి నీకు
సుదతి మోవిచిగుళ్లు సోబనపత్రికలు" 16-439

సోబనము: వి. మంగళం. (ముగ్గు)
"యిప్పుడు శ్రీవేంకటేశుఁడు గూడఁగ
చొప్పున నితనికి సోబనమాయ" 28-161

సోబనవేళ: వి. శోభనవేళ, మంగళవేళ.

"సుదతుల కితనికి సోబనవేళ
వుదుటునఁజెలులెల్ల నూడిగాలు శాయరే"
13-100

సోబనాలు: *వి; బహు.* గీతివిశేషం.
"పాడరె సోబనాలు పైపైనె పేరఁటాండ్లు
యీడా డనక వీథు లేఁగించరే" 9-55

సోబాన: వి. ఒకరకం పెండ్లిపాట, శోభనంపాట. (తె.వ్యు.కో.) 8-21
"చూచి చూచి మీ పెండ్లికి సోబాన వాడేము గాక
మీ చేతలిట్టివని మేమెంచఁగలమా" 28-352

సోభనము: వి. 'శోభనము'నకు జానపదవ్యవహారరూపం.
"చూచినవారికెల్లా సోభనమై వుందువు
తాచిన శ్రీవేంకటేశ దైవమై వుందువు" 21-446

సోమపుమోము భూతము: వి. పరాక్రమంతో నిండిన ముఖంకల భూతమని వాచ్యార్థం. ఇట మిక్కిలి పరాక్రమం కల సింహము యొక్క ముఖంతో హిరణ్యాక్షుని సంహరించిన నృసింహావతారమని భావం.
"కనలి కవియు చీఁకటిభూతము
పొనుఁగు సోమపుమోముభూతము" 1-109

సోమయాది: వి. 'సోమయాజి'కి వికృతిరూపం.
"సోమయాదు లొకవంక సొరిది సురలకెల్లా
నామనితో విందువెట్టీ నను దినము" 2-70

సోమరించు: (సోమరి + ఇంచు) అలసత్వం చూపు, బద్ధకించు. సోమరి శబ్దంపై ఏర్పడిన ధాతువు.
"సోమరించి యేపాటి సోఁకినాఁ గాఁకలు రేఁగీ
ప్రేమ నీ చేఁతలు ఆవపిండి వంటిది (వి)"
14-113

సోమవీథి: వి. ఉత్తరం ఉండే వీథి, ఉత్తర దక్షిణాలకు సాగే వీథి.
"చక్క సోమవీథి నేఁగెఁ జందురుని తేరు మీద
యెక్కువైన కువలయహితుఁడు గాన" 1-424

సోమశిలకనుమ: వి. నెల్లూరుజిల్లా సరిహద్దులో ఆత్మకూరు తాలూకా -సిద్ధవటం తాలూకా సరిహద్దులో ఉన్న కనుమ.
"సొంపుల నీ వదనపు సోమశిలకనుమ
యింపులెల్ల జేకొనఁగ నిల్లు నీ పతికి" 5-115

సోరణగండి: (5) *వి; ప.బం.* గవాక్షం, జాలకం. (తె.వ్యు.కో.) రూపాం. సోరణగండె, సోరుణగండె, సోరణగెండె, సోర్ణగండి.
"చూచితి నప్పుడే వాని సోరణగండ్ల నేను
యేచి వేరె సింగారించి యింట దోడి తేరె" 9-266

సోలగిలు: అ.క్రి. మొక్కు, తలవంచు.
"ఏలే చెలియ యీ యింతులకెల్ల
సోలగిలి నీ చనవు చూపవలెనా" 9-14

సోలి: (3) మాం; వి. వరుస. సం.ప.స. లో సోలిగా అనే పదానికి అదేపనిగా అని అర్థమని, అరవంలో శోలి అంటే పని అని అర్థమనీ పేర్కొన్నారు. ఈ అర్థంకూడా సమంజసంగానే ఉన్నది.
"ఏల సిగ్గులువడేవు యెదుటికి రాఁగదవే
సోలిగా నీ సింగారాలు చూచుఁగాని యీతఁడు"
18-290, 4-457 & 16-448

సోవ: (48) వి. పొడవు. (అందం అని లక్ష్యార్థం) విణ. దీర్ఘములైన, అందమైన.
"పూవుల వేసి మోహాన బుసకొట్టుకుంటాను
సోవగా సతిచే నాకు చుట్టింప్పించుకొనవా"
24-456
"సోవలఁ గన్నవారెల్లా జుట్టములంటా నేను"
4-371
"నీ వేడుకే చూచేవు నెలత లాగెంచవు
సోవలకన్నుల నాపె సొలయఁగాను" 23-128
ఆ.మూ. గారు దీనికి ఎదుట, ప్రత్యక్షముగ అనే అర్థాన్ని సూచించి ఈ కింది కీర్తనపాఠాలను పేర్కొన్నారు.
"దీవులను కొండలెక్కి తిరుగాడనే వద్దు
సోవల బిలములోనఁ జొరవద్దు" 10-54
"దేవుఁడు శ్రీవిభుఁడని తెలియరె
సోవల ననంతునిఁజూడరె" 10-2

సోహ: వి. 1.సోహం భావం 2.రక్షణ కీయవలసిన సొమ్ము.

"సోహలను వెలిఁజూచే చూపులోను చూచుటే
ఆహోదేవతల దనందే తాఁగనుట" 4-68
"వూహించ కిందుకుగాను వూఁరకే మారుమో
మేల
సోహగా మొకమొకాలు చూచుకొనరాదా"
20-512

సౌ

సౌకుమారుఁడు : వి. సుకుమారుడు, సౌకుమార్యం కలవాడు; సుకుమార ఏవ సౌకుమారః అని స్వార్థంలో అణ్ ప్రత్యయం రాగా ఏర్పడిన రూపమని చెప్పాలి. విలక్షణప్రయోగం.
"పైకొని వెలిఁగేటి పరంజోతి యై (యౌ)
సౌకుమారునకు శరణ్యము" 4-376

సౌఖ్యత : వి. సౌఖ్యం; సౌఖ్యమనే భావార్థకప్రత్యయం పై మళ్లీ భావార్థక ప్రత్యయం రావడం విలక్షణం.
"రుకుమిణిదేవికి రూపయవ్వనికి
సకలవిభవముల సౌఖ్యతలు" 5-311

స్ప

స్పరుశవేధి : వి. స్పర్శవేధి, పరుసవేది, ఇనుమును బంగారం చేసేది.
"చాల శ్రీవేంకటేశ స్పరుశవేధిచే
కాలజన్మపుటినుము కనకమాయ" 15-70

స్రి

స్రిష్టి : (2) వి. 'సృష్టి' అనే పదానికి జానపదవ్యవహారపదం. 'సృ' లోని ఋవర్ణం 'రి' గా మారింది.
"కామించి మోక్ష సుఖమునకు నైతే
వోమిన స్రిష్టులు వొకటీఁ గావు" 2-95

స్వ

స్వతంత్రము : వి. స్వాతంత్ర్యం; ధర్మవాచకానికి బదులు ధర్మివాచకప్రయోగం.
"సేదదేర నామీఁదఁ జిత్రగుప్తుఁడేల వ్రాసీ
మేదిని స్వతంత్రమేది మెరయ నీ బంటను"
3-498

స్వరూపదీక్ష : వి. స్వస్వరూప జ్ఞానాన్ని- ఆత్మస్వరూప జ్ఞానాన్ని తెలుసుకునే దీక్ష. తన నిజస్వరూపాన్ని గుర్తెరిగే దీక్ష.
"యెదలో శ్రీవేంకటేశు నిటు ప్రత్యక్షము చేసె
యిదివో స్వరూపదీక్ష యిచ్చెను మా గురుఁడు"
2-148

స్వర్గానికి యెక్కి యేకులు వడకుట : నానుడి; ఉన్నతస్థానానికి చేరి సాధారణమైన పనిని చేయడం.
"అక్కటా లోకోన్నతుఁడు హరిఁజేరి యిట్లయితి
యెక్కువ స్వర్గానికెక్కి యేకులు వడకుటా"
15-71

స్వస్తపెట్టు : స.క్రి. స్వస్థపెట్టు, నెమ్మదిపరచు.
"ఆ రీతి నిట్టూరుపుల నసురుసురై వుండఁగా
గౌరవించి స్వస్తపెట్టి కందువ నిల్తువుగా"
21-249

స్వస్థపఱచు : స.క్రి. నెమ్మదిపరచు.
"వరుస లోకమింతాను వసము చేసుకొనేనా
పరఁగ నా మతి స్వస్థపరచుకోలేను" 15-316

హ

హత్తుగడ : వి. రూపాం. అత్తుగడ. 1.పొందిక, చేరిక 2.కలయిక.
"బత్తి యెందుఁగలిగినా పదరి సాదించేనా
హత్తుగడై వున్నదాన నట్టె మెచ్చేఁగాక" 28-587

హరిగె : వి. 'హరిగ'కు రూపాం. 1. డాలు 2. ఎండ తగులకుండా పట్టే కేడెంలాంటి సాధనవిశేషం.
"రాసి మధ్యరంగానఁ జక్రాలు మరుఁడొనరింప
యీసు దీర హరిగె దానెడ చొచ్చినట్లు" 7-405

హరినీల దర్పణము : వి. ఇంద్రనీలపు అద్దము.
"తలపోయు హరినీలదర్పణంబో యితఁడు
వెలుగుచున్నాఁడు బహువిభవములతోడ"
1-228

హరిమధ్య : వి. సింహపు నడుము వంటి నడుము గల స్త్రీ, స్త్రీ.
"కరిగమనకు బాగాలు చేతి కొసఁగరే
హరిమధ్య కొడ్డాణ మమరించరే" 29-15

హరుషము : వి. 'హర్షము' అనే రూపానికి వికృతిరూపం. సంతోషం.
"తావులు చల్లెటి దేహము తలపులు మీరిన హరుషము
లోవెలుతుల వెడయాసలు లోపలి కోరికలు"
5-164

హరుషించు : (2) అ.క్రి. హర్షించు, సంతోషించు.
"నెరతనములు చూపి నిరంతరము నాథుని
హరుషించఁగఁజేసితి గదమ్మా" 1-102

హల్లకల్లోలము : వి. 'అల్లకల్లోలము'నకు రూపాం. చిందరవందర.
"బల్లిదుండై లంకచొచ్చి బలురాకాసులఁ గొట్టి
హల్లకల్లోలము చేసె హనుమంతుఁడు" 4-155

హస్తిణిజాతి : (2) వి. 'హస్తిని' అనే స్త్రీజాతి. హస్తిణి పదంలోని 'ణ'కారం విలక్షణం.
"కాంత హస్తిణిజాతి గాఁబోలు కరమూలము
లంత కంతకు నలుపులై యున్నవి" 5-123

హా

హారించు : స.క్రి. 'హరించు'కు వ్యావహారికరూపం.
"ఇలనెల్లా హారించె నెనసెఁ గొండగుహల
యెలమి నిన్నిటాను నీ కితవుగానె" 9-300

హావభావములు : వి; బహు. శృంగారచేష్టలు.
"హావభావములతోడ ఆయమంటి మన్ననలే
ఆవటించుకొనేవార మందు కొడిగట్టము" 21-38

హి

హిగ్గు : స.క్రి. వెనుకకు పంపు. రూపాం. ఇగ్గు.
"అగ్గపు శ్రీవేంకటాధిప యిట్టవుత
హిగ్గిన వేడుక నెఱఁగముగా" 9-13

హితవరి : (హితవు+ అరి) వి. మేలు చేసేవాడు, మేలు చేసేది. 'ఇతవరి' అని ఆధునిక వ్యవహారం.
"హితవరి పని నీతో నేకతము చెప్పితేను
అతివతోఁ జెప్పితివి అవునా నీవు" 10-2-69

హితవరురాలు : (హితవు + అరి + ఆలు) వి. మేలు చేసే స్త్రీ, హితం చెప్పే స్త్రీ, ఇతవరురాలు.
"యెంచఁగా నాపె నీకు హితవరురాలు గాని
పంచల వేయఁగ నీకుఁ బగవారమా" 11-515

హిమంతకాలము : వి. హేమంతకాలము.
"శ్రీవేంకటేశుఁ జూచి సిగ్గు లీ కామిని చిందె
యీ వేళ హిమంతకాలమిదియే కాక" 17-525

హిమరుతువు : వి. హేమంతర్తువు.
"కమలోత్పత్తికి హిమరుతువుకుఁ గల
కాలము వైరము గాదా" 10-2-112

హిరణ్యకసిపుఁడు : వి. హిరణ్యకశిపుడు.
"పక్కన నుక్కుఁగంభము పగిలించుక వెడలి
తొక్కి హిరణ్యకసిపుఁ దొడికిపట్టి"
4-285 & 2-516

హీ

హీనదెస : వి. కష్టమైన దశ.
"నానాపాట్లఁ బడె నాఁడు కరి మకరిచే
హీనదెస ప్రహ్లాదుఁడు హిరణ్యుచేఁ బాటువడె"
3-245

హీనాధికములు : వి; బహు. హెచ్చుతగ్గులు.
"కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ" 2-1

హృ

హృదయము చిల్లులగు : ప.బం; అ.క్రి. మనస్సు మిక్కిలి బాధ చెందు.
"యిదె మేడపై నతఁడు యిటు నన్నుఁ జూచెనంటే
హృదయము చిల్లులయ్యీ నేమి సేతునె"

హె

హెగ్గాళ : వి. హెగ్గాళె, ఒకరకం వాద్యవిశేషం.
"తుమ్మెదరవము విని తొంటిహెగ్గాళేలంటా
తమ్మికంటి యాసలతో దగ్గరిపోయి" 24-146

హెచ్చుకుందులాడు : అ.క్రి. దూషించు. 7-90

హెచ్చుకుందులు : వి; బహు. హెచ్చుతగ్గులు.
"పచ్చిమాటలాడితేను భావమెల్లాఁ గరఁగేవు
హెచ్చుకుందులాడినా యియ్యకొనేవు" 7-90

హే

హేయము : వి. 1. అశుద్ధం, అమేధ్యం.
(2. విడువదగింది)
"హేయము దొక్కకుమన్న యేచి తినే
ననేవాఁడు
చాయకు రాకున్న నేమి సేయవచ్చును" 1-208

హై

హైహై : అవ్య. సంతోషసూచకంగా పలికే మాట.
"పాలించి శ్రీవేంకటాద్రిపతి నాకుఁ గలుగఁగ
ఆలరినై గెలిచితి హైహై నేను" 7-279

హో

హోయపుటింతి : (హోయము + ఇంతి) వి.
వినోదించే స్త్రీ, వేడుకకత్తె.
"ఈ మేనే కాదా హోయపుటింతులఁగూడె
నీ ముద్రలు ధరియించి నిక్కెఁగాక" 4-56

❖❖❖❖❖

అనుబంధం

అంక: వి. పార్శ్వం, పక్క.
"అలరి మమ్మేలి మాయంకల రాఁగదవయ్యా"
19-142

అంటసిలు: అ.క్రి. నేల కూలబడు. (తె.వ్యు.కో.)

అంతల పొంతలవారు: వి; బహు. చుట్టాలు.

అక్షయ వటపత్రము: వి. సృష్ట్యాదిలో విష్ణువు శయనించిన మఱ్ఱాకు.
"అనంతవేదాలుండేటి అక్షయవటపత్రము
ఘనదేవతలకు శ్రీకరయజ్ఞము" 7-10

అగ్గళ్లు: ముందర, అగ్రభాగం. (తె.వ్యు.కో.)
"అప్పటి మానవే నీవు అతనిఁ గానని వేళ
వుప్పరాలై (?) అగ్గళ్లు వురికిన దానవా"
17-109

అటమటములు: అసత్యాలు. 19-471

అడ్డమై కాచు: స.క్రి. ఎదిరించి రక్షించు.

అద్దలించు: స.క్రి. ఊహించు. (సంపా. 17సం. పీఠిక, 6పు.)

అనసి: 'ఎనసి'కి వ్యావహారికరూపం.
"అనసి యందుకె యాతఁడిట్టె కాఁగిలించుకొంటె
తనువంటెఁ జెమటంటా తప్పు వేయనేటికే"
21-418

అపలపించు: స.క్రి. మఱుఁగువెట్టు. (సంపా. 17సం. పీఠిక, 6పు.)
"ఆనవెట్టరాదు పెట్టి యవలపించఁగరాదు"
17-167

అమాసచీకట్లు: దట్టమైన చీకట్లు.
"అనుగుపున్నమలకు అమాసచీకట్లకు
అనయము సరికి సరందు కందుకు" 3-363

అఱిముఱి: ముందువెనుకలు.
"ముందువెనుకలు నా నఱిముఱి యనఁగ"
(ఆం.భా. 3.73)

అల్లు వంచి తడుకల్లు: ప.బం; అ.క్రి. శ్రమపడి ప్రయత్నం చేయు.
"వెఱ్ఱులాల మీకు వేడుక గలితేను
అల్లు వంచి తడుకల్లంగ రాదా" 7-260

అవళు: వి. స్త్రీ (క.)

అసిఁబోవు: అ.క్రి. రవంత తగిలి తప్పిపోవు (తె.వ్యు.కో.)

అసిమి: 'అసిమిసంచి' అని హం.విం. 2-27

ఆటబొమ్మ: వి. అస్వతంత్రుడు.

ఆడుకోలుమాటలు: ఇచ్చకపుమాటలు.
"ఆడుకోలు మాటలు నీవాడితే నాడుదు గాక
పాడితే దొరవు నిన్ను బలిమిసేసీనా" 22-414

ఆలకించి విను: స.క్రి. శ్రద్ధతో విను, ఏకాగ్రతతో విను. (ఆలక్షించి > ఆలకించి)
"విన్నపము లాలకించి వినవయ్యా
నీకె పొందు నేడేరించవయ్యా" 29-469

ఇఁగ: 'ఇఁక'కు వ్యావహారికరూపం. ఉదా :- మరిగేమి. (మరి + ఇగ + ఏమి)

ఇండె: వి. మాల, చీలిక, ఎముక, కీలు.

ఇండెవాయు: అ.క్రి. చీలు, పగులు. (తె.వ్యు.కో.)

ఇందవమ్మ: అమ్మా! ఇదిగో తీసుకో అని అర్థం.
"నిద్దురతో నున్నాడో నేనతని దోడితెంచే
వద్దు వీడె మిందవమ్మ వట్టి చలిమేల" 11-581

ఇట్ల: క్రి.విశ. ఈవిధంగా, ఇట్లు. తెలంగాణంలో కూడా ఈ వ్యవహారం ఉంది.

ఇడి: వి. భక్ష్యవిశేషం.

ఇవో: ఇగో, ఇదిగో.
"వేదమై నిలచే వీడివో హరి
ఆదిగొని వెదకితే నట్టే నాలిక కొన"

ఈఁతామోఁతా: 1. ఈదునంతగ, మోయునంతగ అని అర్థము గల ఈ పదములు ఎక్కువగ అను తాత్ప ర్యార్థమున నేటికి వ్యవహారమున గలవని సంపా.
"ఇతవైన వలపులే యీఁతామోఁతా" 21-96
2. ఈదుటయు, మోయుటయు. నీటి బరువు మోపు బరువు అని తాత్పర్యమని సంపా.
"చేతకుఁజేత సేసెను చెల్లుఁగదవే
యీఁతా మోఁతా నొక్కటాయ నిఁక నే మనేరే"
21-135

ఈలకూర : వి. సముద్రప్రాంతాలలో నేలను అంటుకొని మొలిచే ఒకజాతి ఉప్పని ఆకుకూర.

ఈహి : వి. ప్రయత్నం.

ఉద్దుఉద్దులు : వి; బహు. జతలు జతలు.

ఉనికిమనికి : వి. స్థిరమైన ఉనికి.
"కొనరో కొనరో మీరు కూరిమియందు
వునికిమనికి కెల్లి నొక్కటే మందు" 1-237

ఉప్పరము : వి. ఆకాశం.

ఉలివచ్చిమాట : వి. పోటుమాట. (బాధాకరమగు మాట)
"పిలువ వచ్చేవు నీ ప్రియురాండ్ల చేతి
వులివచ్చిమాట లోర్చి యుండనా నేను" 17-10

ఊరకుండఁబట్టదా : ఊరికే ఉండబట్టదా అని ప్రచారంగా ప్రయోగముంది.
"పొద్దుపోదా తనకేమి పోరుపెట్టి వేగి లేచి
ఉద్దండీఁడు తనకేమి వూరకుండఁబట్టదా"
11-160

ఎండనీడబతుకు : సుఖదుఃఖాలతో కూడిన బ్రతుకు.
"ఇంపు సుఖదుఃఖాల యెండనీడబతుకు
మంపు కామక్రోధాలమాటు బదుకు" 7-163

ఎండలు నీడలగు : ప.బం. ప్రతికూలములు అనుకూలము లగు (?)
"వండవండ నట్లుగా వారిఁజూచి నవ్వేవు
యెండలెల్లా నీడలాయ నింక నేటి యానలు"
17-117

ఎండ వెన్నెలయగు : ప.బం. హాయి కలుగు.

ఎకపోయు : ప.బం; స.క్రి; రా.సీ.మాం. లేనివి కల్పించి చెప్పు.
"చాయలనే యెకపోసి సన్నల నింతేసిసి
యే యెడకుఁబోనీవు ఇంతకంటె నేమే" 19-368

ఎడ(డఁ)గొల్లకత్తె : (ఎడన్ + కొల్ల + కత్తె) వి. ఈ పదం కొన్ని చోట్ల ఎడఁగొల్లకత్తె అనీ, కొన్ని చోట్ల ఎడగొల్లకత్తె అనీ ప్రయోగించబడింది. అర్థబిందుసహిత రూపమే సముచిత మని భావించవచ్చు. సందుచూచి కొల్లగొను స్త్రీ అని అర్థం.
"ఎడగొల్లకత్తె యీామె యెవ్వతోయి
అడియాలా లెత్తీ నాతో నానతీవోయి"
16-589 & 2-2

ఎత్తరము : వి. ఎత్తైనది.

ఎదుటనే వలపు ఇంటికాడ బులుపు : నానుడి; కపటప్రేమ.

ఏఁజెల్ల : అవ్య. విచారసూచక పదం.

ఏటవేయు : స.క్రి. గుటిపెట్టు, చూపు నిగుడ్చు. (బలి యిచ్చు, భారంవేయు అని పద.)
"వేగి లేచి సంసారవిధులనే వొడిగట్టి
యే గతిఁ గొసరి నీపై నేట వేసేము" 10-2

ఏడకేడ ఎంతకెంత : పోలికకు అందనిది, కుదురనిది.
"ఏడకేడ ఎంతకెంత యెక్కడికినెక్కడనే
తోడ నలుగఁగ నంత దొడ్డ దాననా" 4-59

ఒజ్జలపుచ్చకాయ : వి. నేర్చిన విద్య మరచిపోవడం.

ఒత్తి గొట్టాన బెట్టు : ప.బం; స.క్రి; బాధించు.

ఒలినిలయుఁడు : ఈ మాటకు సంపాదకుల వివరణ మిట్లున్నది. ఒలి = శబ్దము అని తమిళము. అదే మనకు 'ఉలివు' కావచ్చును. ఒలిశబ్దార్థమునకు ఛాయగా (శ్రుతి = వేదము) అని అర్థమైనచో వేదాధారా అని అర్థము కావచ్చు. కాని –
"నిచ్చలు మాచనవొలి నిలయా నేఁ గోరఁగానే
మెచ్చుగా నన్నుఁగూడి మేల మాడితి మేలు
మేలురా శ్రీవేంకటరాయా"
అనే ఉదాహరణ చరణాల్లో "మాచనవొలి నిలయా" అనే పదానికి మాచనవోలు గ్రామం నివాసంగా కల చెన్నకేశవస్వామి అని అర్థం చెప్పడం సమంజసమేమో! తాళ్లపాక గ్రామానికి సమీపంలో ఉన్న మాచుపల్లెయే మాచనవోలు కావచ్చు. చూ : మాచనవోలి నిలయుడు, మాచనవోలి చెన్నుఁడు.

ఓఁకలు : వి; బహు. వక్కలు.

"వీఁక వింటి చెంచెతా వీఁచి కోసేవేటికే
వోఁకల విడేలు వో వొగరుఁగాని" 26-77

ఓదెఁడు : (ఓదె + ఎడు) మిక్కిలి ఎక్కువగా అని లాక్షణికార్థము. (ఓదె = చేనియందు అక్కడక్కడ ఉంచే వెన్ను పోచల కుప్ప)
"బిగిసేవు గాక ప్రియురాండ్లు నిన్ను
పొగరులాడేది వోదెఁడు గావా" 17-152

ఓపె : వి. స్త్రీసంబోధనార్థకపదం.
"ఓమె యోపె యనంగ నొప్పు
స్త్రీసంబోధనార్థమై" ఆం.భా. 3.72)

కంచము కూడు : వి. అందుబాటులోనిది.

కంచాన అన్నము వెట్టి కాచు : జాగ్రత్తగా రక్షించు.
"అంచల దేవతలకు నమృతమిచ్చిన నీవు
కంచాన అన్నమువెట్టి కాఁచుట నన్నింత" 7-217

కందికుడుము : వి. మంగళకరమైన విందు అని అర్థమా? అని సంపాదకులు.
"కన్నచోటనే నీకు కందికుడుము" 24-335

కక్కువడు : అ.క్రి. (?)
"కక్కువడ నవ్వకుమీ నడుమెల్ల బడగయ్యీని
వుక్కున రేపటి కిందు కునుతువు గాని" 17-292

కచ్చుకొను : అ.క్రి. ఆశించు, పంతముపట్టు.

కటూరము : 'కఠోరము'నకు వికృతి కావచ్చు. (సంపా.)
"మంకు దీర్చ వసమా మదిఇంచు కుచముల
పొంకపుఁగటూరమే పొగడుతగాక" 24-181

కడుపూ నిండదు కన్నూ తనియదు : లోకోక్తి; తృప్తి ఉండదనడం. కన్ను కావాలనడం – కడుపు వద్దనడం.
"కడుపూ నిండదు కన్నూ తనియదు
కడగి లోని యాకలియు పోదు" 1-124

కడ్డి : వి. చిత్తరువు గీసే సాధనవిశేషం (?)
"చెలువుఁడంతటిలోన చేతికడ్డి దీసుకొని
తలిరుబోడి రూపు తగులుగా వ్రాసె" 17-314

కతకు కాళ్లడుగు : ప.బం. లేనివాటిగురించి అడుగు.

కతలుగా చెప్పు : ప.బం. రకరకాలుగా చెప్పు.
"కాంతలెల్లా నీ సుద్దులు కతలుగా చెప్పేరు" 22-53

కత్తరాలు : వి; బహు. చీకట్లు.

కదుము : స.క్రి. తరుము; రూపాం. గదుము, గెదుము.
"నీకు నిచ్చకమే నెరవుడు గాకిటు
కాకు సేసి నిను గదిమేనా" 11-474

కనకరాయఁడు : వి. చందనూరు గ్రామంలో వెలసిన స్వామి.
"కందు వలర నగుతా యిట్టె
కనకరాయఁడిపుడూ
విందు వలెనె యెనసె శ్రీవేంక టేశుఁడితఁడు" 17-126

కనుగిరుపు : వి. కన్నుగీటు.
"తిరువేంకటాచలాధీశ్వరుని కనుగిరుపు
తరుణి కిటువంటి మెత్తని పూవుఁబరపు" 6-20

కప్పురపు చూపులు : వి; బహు. స్వచ్ఛమైన చూపులు.
"కప్పురపు చూపులు **చల్లని చూపులు** ఆ కాంత నీపై చల్లఁగాను
ఉప్పతిల్ల వెన్నెలనవ్వులు చల్లేవు" 15-298

కమ్మిరించు : స.క్రి. ఆచ్ఛాదించు.
"చెల్లఁబో యింతేసి పని సేతురా నీవు
కల్లలంటేఁబో నిను కమ్మిరింతుఁగాని" 17-291

కరకరిఁబెట్టు : స.క్రి. బాధపెట్టు.
"మెరవడికత్తెలైన మెలుఁతలే నీకు బాఁతి
కరకరిఁబెట్టేటి కాంతలే బాఁతి" 21-108

కలపనగంప : వి. కలహశీలుడు.

కలబెరికాయ : వి. ఒక కాయ.
"నలుపున జనుపక నాసిక మొకటే
కలసి కదంబపు కలబెరికాయ"

కలయో నిజమో : ప.బం. స్పష్టం కానిది.

కలుపడు : అ.క్రి. నివ్వెరపడు.

కవ్వపుఁగొండ : మంథరపర్వతం.

"కడఁగి శ్రీవేంకటేశ క్రమ్మర నెంచి చూచితే
వడియు నురుగుల కవ్వపుఁగొండఁ బోలు" 7-169

కాయాటుది : వి. కాయవాటుది. వయస్సు మళ్లినా కాయవలె శరీరం ఉండేది. (నెల్లూరి మాండలికం)

కిల్లాకు : వి. లేఖ, చీటి. (ఆ.భా. _____)

"యింతలో శ్రీవేంకటేశ చిగురుఁ గిల్లాకు
కాంత కియ్యఁగా మదనుగుడి చేరి" 17-541

కిసుక : వి. కృషి, సేద్యం.

కీలు అయివుండు : ఆధారం ఐఉండు.

"అతని మూలమె జగమంతా నిది
ఆతుమలో హరి కీలు అయివుండుఁగాని" 7-128

కూకులు వత్తులు అగు : ప.బం. మిక్కిలి కృశించి వత్తులు అగు. (తె.జా; 1. భా; 273 పు.)

కూడువేఁడైతే కూరపై చేఁజాచినట్లు : లోకోక్తి; ఒకటి ప్రతికూలమైతే అనుకూలమైన మరొక విషయంపై ఆసక్తి చూపడమని భావం.

కూరాకువలె నగు : అ.క్రి. ఉడికిపోవు.

"పోరుకుఁజాల కిందుకుఁ బుత్తెంచిన విడెమిదె
కూరాకువలె వాయ కోపపు నా చేతను" 7-213

కెలయు : అ.క్రి. విజృంభించు.

"రట్టుగ శ్రీవేంకటేశ ముట్టి యేల కెలసేవు
వెట్ట దీర నాపె నిన్ను వినుతించఁగాను" 23-128 & 17-234

కొంగుల పసిడి : *ప.బం; వి.* అవసరానికి పనికివచ్చేది.

కొంటెత : (కొంటె + త) కొంటెతనం కలది కావచ్చునని సంపా.

"చలపట్టిన గొంటెతఁ జక్కు నవ్వించకుంటేను
తలకొన్న నీ జాణతనమేమి వున్నది" 21-297

కొండలుఁగోట్లును అగు : *ప.బం; అ.క్రి.* మిక్కుటమగు.

"గోర గీరితే వలపు కొండలుఁగోట్లు నగును
నేరుతుమా నీ వంటి నేరుపులు" 14-31

కొండవంటి చుట్టాలు : *వి; బహు.* అవసరానికి ఆదుకునే బంధువులు.

కొనవేయు : అ.క్రి. చిగురించు.

"ఇక్కువ నున్నవారము ఇచ్చాడఁగలము గాక
గుక్కిక వట్టి వేడుక కొనవేయఁగలమా" 23-411

కోడెసేఁత : వి. యౌవనపు చేష్ట, విటుని చేష్ట.

"మేడలోనఁ బవళించి మెత్తని పరపుమీఁద
కోడెసేఁతలు సేసీని గోవిందరాజు" 23-454

కోలు : వి. కొల్ల.

గండిగడుచు : అ.క్రి. కష్టం దాటుకొను.

"కమలాక్షుఁ డితఁడు కలుగఁగఁగదా దేవతలు
గమిగూడి రిందరును గండిగడచి" 1-116

గంపమోపు : గంపబరువు, మిక్కిలి బరువు.

గచ్చువిచ్చగు : అ.క్రి. చిందరవందర అగు, కలతచెందు.

గరిడి : వి. గరుడుడు.

"కమ్మటి బుసకొట్టేవు గరిడా నా జవ్వనము
దొమ్మిఁబట్టి తీసేవు ద్రోణమా జడ" 23-217

గాదెఁబోసిన కొలుచు : *ప.బం; వి.* వ్యర్థం.

"గాదెఁబోసిన కొలుచు సంసారము
వేదు విడువని కూడు వెడమాయ బదుకు" 1-328

గాయకము : *విశే.* గూఢము, మర్మము.

గాళకుఁడు : వి. ధీరుడు, ప్రౌఢుడు.

గిఱుపు : స.క్రి. (కను) తిప్పు.

"కలికి అదివో కన్ను గిఱిపీని
పొలుపు తామెరలచే పూజ చేసినట్లు" 17-159

గుంగు : *విశే.* పనికిరాని.

గుండె మీది చింబోతు : *ప.బం; వి.* ఇతరులకు హాని తలపెట్టి బాధించేవాడు.

"కుతిలపు టహంకారి గుండెమీఁది చింబోతు"

గుంద్రలు : *వి; బహు.* చెఱకు రాట్నపు కంబములు. (శ.ర.)

"రాట్నము నిలువక గుంౘలు తా నిల్చునా"

గుగ్గిలి : వి. గుగ్గిలికి రూపాం. గుక్క. 5-57

గుడిసేటి : వి. దేవదాసి. (గుడి చేటి జారిణి)

గుడ్డికుక్క సంతకుఁ బోయినట్లు : నానుడి; అన్నీ కష్టాలే అని భావం.

గుల్నుసేయు : స.క్రి. పొడి చేయు, నిరుత్సాహ పరచు, బాధించు.

గుల్ల : వి. గవ్వ.

గువ్వకుత్తుకపడు : *ప.బం; అ.క్రి.* నీరసించిపోవు.

గోర గీరు : స.క్రి. రెచ్చఁగొట్టు.

గోరత : వి. ఘోరతకు తద్భవం(?) ఘోరత్వము, భయంకరత్వము.

"వనితలిందరు నీవంటివారే కారా యేమి
కొనలకెక్కేది కడు గోర తని కాక" 21-393

గోరాదిగొను : (గోరు + ఆదిగొను) గోళ్ల కొలతలు తీసుకొను అని సంపా. 21-49

గోవిందనాంచారి : వి. లక్ష్మీదేవి, గోవిందుని భార్య.

"మేలు మేలు యిద్దరై మేకులకే సేవచేసి
గోలతనము మానితి గోవిందనాంచారి" 17-315

చండిపడు : *అ.క్రి.* (?)

"పలుమారు గొసరితే పచ్చిదేరు వలపులు
తలపట్టి మొక్కఁబోతే చండిపడును"
29 సం. 359 పు.

చంద్రశాల : వి. పైమేడ, వెన్నెల.

"దొంతి తామెరలు తోడుతనే చూపఁగా
సంతసంబున చంద్రశాలలో నిలిచె" 17-541

చట్టుపము : వి. గరిటె, పాత్ర. (చట్టపం అని త.)

"వాసినే సీలపుఁ జట్టుపములనే నించి నించి
ఆనించుకొని వడ్డించ నాయత్తపడీని" 17-316

చన్నుగుడుచు : *ప.బం.* పాలుదాగు.

"గుక్కక జంతులు చన్నుగుడుప నేరుపవద్దు
చక్కఁగా ననాదివాసనలే నేర్పిని" 2-144

చలిమి : వి. చలం.

"చలమిని బలమిని జలనిధి కన్యకనుఁ
గలసిన శ్రీవేంకటపతివి" 23-535

చలువరాయఁడు : వి. చంద్రుడు (?)

చాగతగొను : స.క్రి. అదుము.

చాతను : వి; త. గ్రామదేవత. 2-237

చాళికుడు : వి. నేపథ్యప్రసంగం చేసేవాడు.

"నవ్వేచుఁ జాళికుఁడు తనాచారి మడిచిన
పువ్వుఁలెట్టు
చాళికుడని ముడిచితి పొంది దొరవు"

చింబోతు : వి. మేకపోతు.

"కుతిలపు టహంకారి గుండెమీఁది చింబోతు"

చిట్టంటు చెమటలు : పలుచని చెమటలు. పీఠిక 25 సం.1.10-2-95

చిత్తమెల్ల నీరగు : *ప.బం.* అంతులేని దుఃఖం కలుగు.

"చిత్తమెల్లా నీరై చెలులలో దూరై
తత్తరించి కలసితి తక్కితినటే" 26-134

చిన్నము : విణ. కొంచెము, నాలుగు గురివిందగింజల ఎత్తు బంగారు నాణెము.

చీఁకటి యేరై పారు : *ప.బం.* చీకటి దట్టంగా వ్యాపించు.

"ఉక్కున జారు దురుము వొయ్యారానకింతే
కాక
పక్కన చీకటి యేరై పారే యందుకా" 22-484

చీకటిమేను : వి. నల్లని శరీరం.

చూడికుడుత నాంచారి : వి. గోదాదేవి; ధరించి ఇచ్చిన అమ్మవారు.

చెరకున పండు వండినట్లు : లోకోక్తి; బంగారానికి తావి అబ్బినట్లు.

చెఱకు పోఁకి వెదరు నమలినట్లు : లోకోక్తి; వృథాప్రయాస, వ్యర్థం కావడం.

చెవుల కాపురముండు : *ప.బం; అ.క్రి.* పదే పదే చెప్పు, అదేపనిగా చెప్పు.

చెవులెల్లాఁ జిల్లులగు : *ప.బం; అ.క్రి.* విన శక్యం కాకుండు.

"చెప్పకువే వాని సుద్ది చెవు లెల్లాఁ జిల్లులయ్యీ
దప్పిదేరెఁజాలు చాలు తానె బదుకనీవె" 9-102

చేపట్టుకొమ్మ : ప.బం; వి. ఆధారం.

చొక్కనాథఁడు : వి. చొక్కనాథుఁడు.

"ఒప్పుగాఁగూడె నెలఁదలూరి చొక్కనాథఁడు"
10-2-20

చొక్కనాథుఁడు : వి. సుందరుడైన దేవుడు.

చోఁపు : వి. కలత.

జంటమొనసూదిని రెంటము గుచ్చు : లోకోక్తి; అసాధ్య మనడం. రెండుమొనలుగల సూదితో వస్త్రం కుట్టడం అసాధ్యమే కదా!

జాతరదైవాలు : వి; బహు. అల్పదైవాలు.

జాళె : వి. బొంగరానికి చుట్టే తాడు.

"బోరునఁదా జాళె లేక బొమ్మరాలు వేసెను"
23-127

జిబ్బిటాయ : వి. జిబ్బిడాయ గావచ్చు. గబ్బిలం.

"వొబ్బిడైన వేదమార్గ మొల్లని పుణ్యమంటేవు
జిబ్బిటాయ తపమేలె జీవుఁడ" 10-1-14

జూంజు : వి. వెంద్రుకలు.

జోఁటి : వి. చెలి. (జోటి)

"ఏఁటికి నీ మనికితా అంతేసి నీకు
జోఁటికి నీ వజ్రాంగి జోడఁవై వుండరాదా"
17-105

డిమికీలు : వి. (?)

"కాంత వెట్టిన కొప్పు గండుదుమ్మిదల కొప్పు
చెంత నెన్న డిమికీలు సింగము బోలు" 23-95

తన వేలే తన కన్ను తాకు : లోకోక్తి; తన నడవడియే తనకు కీడు కలిగించు.

"తన వేలే తన కన్ను దాఁకినను తానెవ్వనిఁ గోపించీని
తన కర్మమే తన్నుఁ జేయఁగ దైవము దూరఁగ"
21-151

తలఁజుట్టు : ప.బం; స.క్రి. బలవంతంగా అంటగట్టు.

తలమొల వీడు : ప.బం; అ.క్రి. భయం మొ॥ వాటిచే తలగుడ్డ, కట్టుబట్ట విడిపోవు.

తవ్వక కన్న ధనము : ప.బం; వి. అప్రయత్నంగా లభించేది.

తామరకంటె తంపర : మిక్కిలి ఎక్కువ.

"తంపి నీ చుట్టరికము తామరకంటె తంపర"
15-89

తిరుదండెలు : వి; బహు. మంగళకరమైన దైవ వాహనపు పొడుగాటి కఱ్ఱలు.

"తిరుదండెలపై నేగీ దేవదేవుఁడిదె తొలునాడు
సిరుల రెండవనాఁడు శేషునిమీఁద"

తిరుపళచ్చి : వి. కోయంబత్తూరు సమీపంలో గల గ్రామం (?)

తిరుపళచ్చి విష్ణుఁడు : వి. తిరుపళచ్చి గ్రామంలో వెలసిన విష్ణుమూర్తి.

తిరువీసము : వి. స్వామివారి ఆరగింపునకై చేసిన పలుచని క్షీరాన్నం, కణ్ణముదు.

తిల్ల : వి. తమిళనాడులోని చిదంబరక్షేత్రం.
13-334

తీదీపు : వి. 1. రారాపు, ఒరపిడి 2. తీవ్రబాధ.

తీయమగు : అ.క్రి. సంఘీభవించు, ఏకమగు.

తీరు : స.క్రి. తీర్చు.

"జగడాలు దీరుమని సారె సారె మిమ్ము నంపె"
18-33

తేలించు : స.క్రి. జయించు.

"తెలిసితిమింక నెంత తేలించేవే
కలికివి పతినెంత కారించేవే" 19-190

తొబుక : వి. పండ్ల చర్మం, కాయలపై తోలు. చూ : తొబుక కవిత్వాలు.

తొల : వి. తొన.

"పొలఁతి నీ మోవిపండు పుల్లనో తీపో వోరి
తొలరా నీకేలందుతోడి చింత" 17-75

తోడి : 'తోడ' అనే అర్థంలో ప్రయోగింపబడే రూపం.

"గుట్టుతో డలమేల్మంగ గుబ్బలేల పిసికేవు"
29-176

తోడుఁబోతు : వి. 1. మంత్రాల ద్వారా ఎదుటి వాళ్లకు కీడు చేయు. 2. క్షుద్రోపాసనతో పంపు చేసి మనుష్యులను చంపేవాడు.

దరిశనము : వి. రాజాదుల దర్శనార్థం ఇచ్చే కానుక.

దర్సెనము : వి. కానుక.

దలాటు : అవ్య. అకస్మాత్తు.

దార : వి. విధం, క్రమం, రీతి.

"బీరాన నాపె మోవిఁబెదవి నంటించఁబోతే
దార తప్పకుండ తన తమ్ములానఁగొప్పె" 17-176

దారకత్తి : వి. పదునైన కత్తి.

దావంతము : వి. 1. ఆత్రం 2. దుఃఖం.

దీవిసంకు ముత్యమగు : *ప.బం; అ.క్రి.* (?)

"పూవు గట్టిన జవ్వాది పూసితే వాసన వోదు
దీవిసంకు ముత్యమైతే తెలిసేఁగాని" 16-293

దుత్త : వి. పాలకుండ. (ఆం.భా.)

దొడ్డి కట్టు : వి. చుట్టు కొలారం, నడుమ బయలు, చుట్టును కడ్డడములును గల యిల్లు అని నిఘంటువు. 21-87

దొడ్డికట్టుది : (దొడ్డికట్టు + అది) వి. దొడ్డిలో కట్టివేయు నట్టిది అని సంపా. (21-87)

"దొంతిఁబెట్టేవు ప్రియము దొడ్డికట్టుదానవా"
21-87

దొమ్మిసరసము : వి. ప్రేయసీప్రియుల్లో పరస్పరం ప్రేమ లేనపుడు చేసే సరసం.

"దొమ్మి సరసాలాడితే దొరతనాలు సెల్లునా
వుమ్మడినే సక్కనాయ నుండవయ్య
నాయఁడా" 23-128

దోమటి నవ్వులు : వి. కపటపు నవ్వులు.

దోమటి సంసారి : వి. కపటపు సంసారి.

ధర్మాంగదుఁడు : వి. రుక్మాంగదుని పుత్రుడు. చూ : రుక్మాంగదుడు. 2-85

నందలూరు : వి. చెల్లపిల్లస్వామి నెలకొన్న క్షేత్రగ్రామం.

నట్టు : వి. మాంద్యం, జాగు, ఆటంకం.

నడుకొత్తు : అ.క్రి. నిర్భయంగా ఉండు.

"యెడయక శ్రీవేంకటేశ యీకెఁ గూడితివి
నడుకొత్తి నిచ్చకల్యాణమువలె నున్నది" 7-464

నరకఁడు : వి. మోటువాడు, మొద్దు.

నల్లితిండి : చిరుతిండి. 1-189

నాఁచుఁబాము : వి. పసిరికపాము.

నాగము పేరిటి నాతి : వి. గజలక్ష్మి (?)

నాగేటి గీఁత : వి. తప్పనిది.

"జాఁతిలేని దారవోఁత పాపము చూడని చేఁత
నాఁతిమీఁది తలపోఁత నాఁగేటి గీఁత" 12-275

నాచ్చారి : వి. అమ్మవారు.

"మాయి మాయి యలమేలుమంగ నాచ్చారి
మతిఁ
బాయని వేంకటపతి పట్టపురాణి" 6-47

నామెక్కు : అ.క్రి. లేత జొన్నపైరు, ఆముదపుపైరు గొడ్డుగోద మేస్తే విషమై పశువులు మరణిస్తాయి. దాన్నే నామెక్కి చచ్చిందని అంటారు. విషమెక్కు.

"వలపనే నామెక్కి వనిత యేమైన గదా
బలి నధరామృతాన బతికెఁగాక" 26-173

నాలికఁదగులు : *ప.బం; అ.క్రి.*బయటకు వచ్చు.

నాలికె తుదలనె నాను : *ప.బం; అ.క్రి.* ఎప్పుడూ గుర్తుండి పోవు.

"నాలికె తుదలనె నానెఁ జుట్టరికము
మేలిమి సరసముల మించె మోముకళలు"
21-224

నాలిమాటలు : *వి; బహు.* అల్పపు మాటలు.

"గాలములై నీ చిత్తము కడుఁదగిలె
ఆలరి నాములై నీకు నన్నునట్టెను" 13-143

నిక్కల : వి. నిక్కమైన కల.

"నిక్కల గంటిని నిను నా పాదము
తక్కక యేఁటికో తాఁకెనని" 17-64

నిప్పు దెచ్చి వొడిలోనఁ బెట్టుకొను : *ప.బం; అ.క్రి.* ఆపదలు తెచ్చుకొను.

నిప్పు లేరై పారు : *ప.బం.* ఎక్కువ నాశనమగు.

"గోరపువెన్నెల వెల్లిగొని మీదమీదై నిప్పు
లేరై పారఁగఁజొచ్చె నెందు చొత్తమే" 4-16

నిప్పువంటిది : వి. పవిత్రమైనది.

"దెప్పరమాతఁడు నీచేఁ దిట్టించుకొనుఁ గాక
నిప్పువంటిదాన నేను నీచేతఁ బడేనా" 17-194

నిరుధానకు : నిరోధ, నిరుద్ధ శబ్దాలకు వ్యావహారికరూపం కావచ్చు. అడ్డగింపు, అవధి, పర్యంతము అని అర్థం. కడపటి దినమని తాత్పర్యం.

"అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ నిరుధానకు తిరువేంగళనాథుని మీఁదను అంకితము గాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార కీర్తనలు" (అన్నమాచార్యుల శృంగార కీర్తనల ప్రారంభ గద్యం)

నీటికొద్ది తామెర : పిండికొద్ది రొట్టె అన్నట్లు.
13-256, 14-200 & 18-423

నీరువంక తుంగ : *ప.బం; వి.* గెలుపువారి పక్షం వహించే వ్యక్తి.

నురిపే కళ్లమగు : *ప.బం; అ.క్రి.* అస్తవ్యస్తమగు. ధాన్యాన్ని నురిపే కళ్లం గడ్డి మొ॥ వాటితో అస్తవ్యస్తంగా ఉంటుంది.

"యిక్కువ శ్రీవేంకటేశ యెనసి యిద్దరివల్లా
అక్కర నురిపే కళ్లమాయను నీ వురము"
23-164

నూట యిరువై యెనిమిది తిరుపతులు :
1. నిచుళము (ఉరైయూర్) 2. తంచాపురము (తంజమామణికోయిల్) 3. శ్రీముష్ణపురము (?) 4. ప్రేమాలయము (అన్బిల్)
5. కదంబపురము (తిరుక్కరంబనూర్)
6. విశదాద్రి (తిరువెళ్లరై) 7. శ్రీ పక్షిభూతపురి (తురుపుళ్లం బూదంగుడి) 8. పలాశవన గుహపురము (తిరుప్పేర్నగర్) 9. ఆరునూరు (తిరుఅదనూర్) 10. రథమగ్నపట్టణము (తిరువళుందూర్) 11. వ్యాఘ్రపురి (శిరుపులియూర్) 12. శ్రీసారభూపురి (తిరుచ్చేరై) 13. మస్తక శంఖపురి (తిరుతలైచ్చంగనాణ్మదియమ్)
14. కుంభఘోణమ్ (తిరుక్కడందై)
15. ఖండనగరము (తిరుక్కండియూర్)
16. అంతరిక్షాఖ్యపురి (తిరువిణ్ణగర్)
17. శ్రీకృష్ణపురము (తిరుక్కణ్ణపురం)
18. పరింభపురము (తిరువాలి)
19. నాగపురము (తిరునాగై)
20. గంధపట్టణము (తిరునరయూర్)
21. నందిపురాంబర నగరము (నందిపురవిణ్ణగరం) 22. ఇందుపురము (తిరువిందళూర్) 23. తిల్లవన చిత్రకూటము (తిరుచిత్రకూటం) 24. శ్రీరామాభ్రపురి (శీర్గాళి) 25. సంగమపురి (కూడలూర్) 26. కృష్ణపురి (తిరుక్కణ్ణంగుడి) 27. శ్రీపార్థసఖి మహిషీపట్టణము (తిరుక్కణ్ణమంగై)
28. కపిస్థల పట్టణము (కపిస్థలం)
29. రౌప్యపట్టణము (తిరువెళ్లియం గుడి)
30. శ్రీనాగపురము (తిరువాంగూర్)
31. మణిధామ పురము (మణిమాడక్కోయిల్)
32. ప్రసవ సాయక పుంఖపట్టణము (తిరుత్తెత్తియంబలం) 33. పురుషోత్తమ నగరీ (వణ్పురుషోత్తమం) 34. హైమధామ పురము (శెంబోన్శెయ్కోయిల్) 35. శ్రీసక్తసభాపురీ (తిరుత్తేవనార్ తొగై) 36. అనవాప్యగగనపురము (అరిమేయవిణ్ణగరం) 37. వైకుంఠపుష్కరము (వైకుంఠ విణ్ణగరం) 38. ధవళపుష్కరిణి (తిరువెళ్లక్కుళం) 39. వనాద్రి (తిరుమాలిరుంజోలై) 40. శ్రీగోష్ఠీపురము (తిరుక్కోట్టి యూర్) 41. సత్యపట్టణము (తురుమెయ్యం) 42. దర్భశయనము (తిరుప్పుల్లాణి) 43. శీతకాసారము (తురుత్తణ్గాల్) 44. మోహనపట్టణము (తిరుమోగూర్) 45. మధురాపురము (తిరుక్కుడల్) 46. శ్రీవిల్లిపుత్తూరు (శ్రీవిల్లిపుత్తూర్) 47. కురుక (తిరుక్కురుగూర్)
48. తిరుత్తులవెల్లి మంగళపురి (తిరుత్తొలవెల్లి మంగలం) 49. దక్షిణాపురి (తెన్ తిరుప్పేరై)
50. వైకుంఠపురి (శ్రీవైకుంఠం) 51. దక్షిణ కుళిందపురి (తిరుక్కడందై) 52.వారాంగనాపురి (శ్రీవరమంగై) 53. చించాపురి (తిరుప్పుళింగుడి) 54. గుణవతి (తిరువరగుణమంగై) 55. సూచకపురి (తిరుక్కోళూర్) 56. వామనపురి (తిరుక్కురుంగుడి) 57. అనంతపురము

(తిరువనంతపురము) 58. తిరు వణ్పరిశారపురము (తిరువణోపరిశారం) 59. దక్షిణ మరుత్తటపురి (తిరుక్కాట్కరై) 60. శ్రీమూళిధామ పురి (తిరుమాళిక్కళం) 61. శార్దూలపురి (తిరుప్పలియూర్) 62. నౌపురస్థలి (తిరునావాయ్) 63. శ్రీవల్లనాళపురము (తిరువల్లవాయ్) 64. శ్రీసారభృంగపురి (తిరువణ్ వండూర్) 65. నిద్రాణపట్టణేశ్వరుడు (?) 66. పరుష్ణిహేశ్వరనగరము (తిరువాట్టూరు) 67. విద్వద్రథ నగరము (తిరువత్తువక్కోడు)68. శ్రీకటిస్థాన పురి (తిరుక్కడిత్తానమ్) 69. సద్వృష్టిమత్పురము (తిరువారన్ విళై) 70. ఐంద్రనగరము (తిరువైంద్రపురం) 71. గోపపురము (తిరుక్కోవలూర్) 72. కాంచి (తిరుకాంచీపురము) 73. యథోక్తకారి (తిరువెణికా) 74. పరవేలశ్వరవిణ్ణగరము (పరమేశ్వరవిణ్ణగరం) 75. పాటకేశము (తిరుపాడగమ్) 76. శిశిరోపవనపురి (తిరుత్తణ్కా) 77. కామపురము (తిరువేళిక్కై) 78. జ్యోత్స్యేందుఖండపురము (నిలాత్తింగళ్తుండం) 79. నీరధిపురి (తిరునీరగం) 80. వర్షాకాశపతి (తిరుకార్వానం) 81. ఊరకము (తిరుఊరగం) 82. అష్టభుజకరము (అష్టభుజం) 83. తిరునిన్నయూరు (తిరునిన్టవూర్) 84. శ్రీపక్షికుండము (తిరుప్పుట్కుళి) 85. తోయమహీంద్రము (తిరునిర్మలై) 86. శ్రీమత్స్థలము (తిరువిడవెందై) 87. సాగరమల్లము (తిరుక్కడల్మల్లై) 88. ఘటికాచలము (తిరుఘటికై) 89. వేంకటాద్రి (తిరువేంగడం) 90. లతికాహ్రదము (తిరువెవ్వళూర్) 91. సాలగ్రామము (సాలగ్రామం) 92. నైమిశము (నైమిశారణ్యం) 93. ఖండపురి (కుండ మెన్నుమ్ కకడినగర్) 94. బదరికాశ్రమము (బదరికాశ్రమమ్) 95. గరుడాద్రి (శింగవేళ్‌కున్టం) 96. కేరళపురి (?) 97. శ్రీపతిపురము (తిరుప్పిరిది) 98. అయోధ్య (తిరువయోధ్యై) 99. మధుర (వడమధురై) 100. వ్రేపల్లె (తిరువాయ్‌ప్పాడి) 101. ద్వారక (ద్వారకై) 102. కలశాబ్ధి (తిరుప్పార్కడల్) 103. వైకుంఠం (పరమపదం) 104. శ్రీరంగధామము (తిరువరంగం) ఇవి చిన్నన్న పరమయోగి విలాసంలో చెప్పిన 104 దివ్యతిరుపతులు. వీటిలో రెండు పునరుక్తులను, రెండు నూతన క్షేత్రాలను (శ్రీముష్ణం, కేరళపురి) తొలగిస్తే చిన్నన్న చెప్పని దివ్యదేశాలివి. 1. తిరుమణిక్కూడమ్ 2. పార్తన్‌పల్లి 3. తిరుక్కావళంబాడి 4. తిరుచ్చెంగున్నూర్ 5. తిరుకారగం 6. తిరుక్కళ్వనూర్ 7. పవళవణ్ణమ్ 8. తిరువల్లిక్కేణి ఈ విధంగా దివ్యతిరుపతులు (దివ్య దేశాలు) 108 మాత్రమే ప్రసిద్ధం. అన్నమయ్య నూట యిరవై అని పేర్కొన్నాడు. బహుశః ఆంధ్రదేశంలోని భద్రాచలం, సింహాచలం మొ॥ కొన్ని వైష్ణవక్షేత్రాలను వీటిలో చేర్చి ఉండవచ్చు.

"తగ నూట యిరువై యెనిమిది తిరుపతులఁ గల

స్థానికులును చక్రవర్తి పీఠకములును" 1-227

నూనెకుంచము వలె నుండు : *ప.బం; అ.క్రి.* చేతికి అందకుండా ఉండు, జారిపోవు.

"అన్నియు వింటానే అట్టే వాసన గొంటానే

వన్నెల నూనెకుంచమువలె నున్నాఁడు" 2-232

నూవుగింజ నానదు : *ప.బం; క్రి.ప.* రహస్యం దాగదు.

"ఏవంక చూచిన వీరి యెమ్మెలే వెగ్గళమాయ

నూవు గింజ నానదిదె నోటిలో నీ సుద్దులు"

27-19

నెత్తురు పొత్తు : *వి.* 'రక్తసంబంధం' అనడానికి తెలుగు పదం.

నెరవు : *వి.* హెచ్చు.

నెఱతనీఁడు : *వి.* (నెఱతనము + ఈఁడు) జాణతనం కలవాఁడు.

నెఱిగురి : *వి.* న్యాయదృష్టి.

నేటి : *వి.* నిశ్చయం.

"నేటినే తెలుసునో నీ చందము మాకు

నాటివారు గానరైరి నవ్వుల నీ చందము"
17-441

నేలపొద్దులు: వి; బహు. దేశకాలాలు.

నొడికారితనము: వి. మాటచమత్కారం.

నోముఫలమిచ్చు: ప.బం; అ.క్రి. ఒకటి రెండు పొరపాట్లు జరిగినా చేసిన మంచిపనికి ఎప్పుడూ ఫలం ఉండు.

పంగెము: వి. స్పర్ధ.

పంచలఁదోయు: స.క్రి. పారదోలు, పాడుచేయు.

పంటి: వి. కన్నులు కన్నులుగా తాడుతో అల్లిన ఉట్టి.

పంతగారిది: (పంతము + గారి + అది) వి. పంతకత్తె, పట్టుదల గల స్త్రీ.

పగిడి: వి. పరిహాసం, వెక్కిరింపు.

"తెగువ నీ వలె నాకు దేవరియ్యేఁడాయఁగాక

పగిడివెట్టి నవ్వితేఁ బదరవా నీవు" 14-245

పచ్చిమాటలు: వి; బహు. తిట్లు.

"పచ్చిమాటలాడేవు బయకాఁడా

గచ్చులు సేతురా నీవు కాతరీఁడా" 26-420

పట్టిన చేతి బంగారము: వి. పట్టినదెల్లా బంగారము.

"నెట్టనఁదలఁచేవారి నిండు నిధానమవు

పట్టిన చేతి బంగారమవు" 9-219

పతికి పతి: ప్రతికి ప్రతి.

"కొనచూపులో కొసరు గొణఁగులో నసురుసురు

మునుపనే పతికి పతి ముంచెఁగదె అతఁడు"
19-453

పదరుఁదనము: వి. కోపం, తొందరపాటు.

పన్నారులు: వి; బహు. చిన్నపాత్రలు.

"కతలుగా పన్నారు కాగులలో బియ్యాలు

సతులపై సేసలు చల్లీ వాఁడె" 14-456

పరదు: వి. పద్దు, లెక్క.

పరిసిపోవు: అ.క్రి. నశించు.

పలుకుల పర్వతాలు: వి; బహు. వేదాలనే పర్వతాలు.

"పలుకుల పర్వతాలె బండికండ్లైన తేరు

నలుదిక్కులంచుల వున్నతపుఁదేరు" 2-366

పళి: వి. త. నింద.

పాఁతుమాకు: వి. పాతబడిన చెట్టు.

పాటిగంప: వి. ధాన్యం నింపడానికి ఉపయోగించే గంప. 15-247

పానుపట్టు: అ.క్రి. ప్రయత్నించు.

పాయఁదట్టు: స.క్రి. తొలగించు.

పాలకుండమల: వి. తిరుపతికొండ. (తె.వ్యు.కో.) 11-30

పాలకొండమల: వి. పాలగిరికొండ. కడపజిల్లా మండల కేంద్రమైన వీరపనాయని పల్లెలోని గ్రామం పాలగిరి. ఇదియే పాలకొండ. ఇట చెన్నకేశవుడు వెలసి యున్నాడు.

"మందల పాలకొండమలకు నట్టనడుమ

విందగు దాసులతోడ విహరించీ దేవుఁడు"
4-375

పాలగిరిరాయఁడు: వి. పాలగిరి (పాలకొండ)లో వెలసిన చెన్నకేశవుడు. చూ: పాలకొండమల.

"కంటిరా నీ గుణమెల్ల కడగడనే

పంట మోపితేనే పాలగిరిరాయఁడా"

పాళగాఁడు: వి. 'పాళెగాఁడు'కు రూపాం. ప్రభువు, సేనాని.

"అట్టె శ్రీవేంకటనాథుఁ డమరులనెల్లనుఁ జే

పట్టి దైత్యులఁ జంపించే పాళగాఁడు" 10-1-22

పిచ్చె: వి. ముక్క.

"చెలరేగి యాపె మోవి చెఱకుపిచ్చె యంటాను

చలువగా వేడుకతోఁ జవిగొనేవు" 22-191

పిడువరించు: అ.క్రి. అతిశయించు, పిడుగువలె ఘోషింప జేయు.

పిరువీకు. వి. బాధ, కష్టం.

పుండెరువ మందు నేరుచు: ప.బం.బాధపై బాధ కలుగు. (పుండే బాధిస్తుండగా దాని బాధను తొలగించుకోవడానికై పెట్టిన మందుకూడా బాధించడమని వాచ్యార్థం.)

పుల్లవెలుగులోని బోనపు తరివాఁడు: వి. విష్ణుమూర్తి. పుల్లవెలుగు = అగ్ని;

పుల్లవెలుగులోని (అగ్నిలోని) బోనం అంటే అమృతం; అమృతం చుట్టూ అగ్ని ఉంటుంది. కనుక ఆ అమృతంలోని తరి అంటే ఆ అమృతాన్ని చిలకడమని అర్థం. అట్టి చిలకడం కలవాడు అంటే విష్ణుమూర్తి. అమృతాన్ని మందరం చిలికేప్పుడు అది జారి సముద్రంలో దిగబడుతుంది. అప్పుడు విష్ణువు కూర్మ రూపంలో దానికి ఆధారంగా నిలిచినాడని భారతకథ.

"పుల్లవెలుగులోని బోనపు తరివాఁడు
తెల్లని మెఱుఁగుల తెరలఁదేలెటివాఁడు" 24-13

పూచుక మాట్లాడు : *ప.బం; అ.క్రి;* రా.సీ.మాం. తనదికాని దాన్ని నెత్తిన వేసుకొని మాట్లాడు.

"పోటి చెలికత్తె గాన పూచుకనే మాటాడితి
ఆటది గోలయైతే నట్టే వొత్తుదురా" 16-554

పూవకపూచు : *అ.క్రి.* అపురూపంగా పూయు.

పెంజ : *విణ.* తేలికైన, తుచ్ఛమైన.

పెంట : *వి.* ఆవు.

"పెంట పెరుగుల దొంగ పెండ్లికొడుకు భూమి" 12-185

పెంటపెట్టుకొను : *అ.క్రి.* తగవుపెట్టుకొను.

పెట్టులు : మరల.

"ఒరసి తనుఁదానే వచ్చినది వొల్లనాఁ
బెట్టులురా" 17-71

పెళ్లు : *వి.* పెరడు.

పేరఁబెట్టు : *స.క్రి.* తోడువేయు.

పేరించు : *స.క్రి.* తోడువేయు. 12-355

పేరుమాల్చు : *స.క్రి.* నశింపజేయు. 6-156

పైరువిత్తగా గాదము మొలచినట్లు : ప్రయత్నంలో ఆటంకాలు కలగడం.

"గక్కనఁ బైరు విత్తఁగా గాదము మొలచినట్టు
చిక్కిన కర్మములెల్లాఁ జలఁగేఁగాక" 2-170

పొర : *వి.* కపటం. (సంపా. 17సం. పీఠిక, 7పు.)

పొరుగుపోరచి : *వి.* పొరుగువారి ఈర్ష్య. ('పోరాసి' అనేపదం ఈర్ష్య అనే అర్థంలో కడపజిల్లాలో మాండలికంగా ఉందని ఆచార్య పి. నరసింహారెడ్డి తెలిపినారు.)

పోఁచి : *వి.* మణికట్టు పైభాగం.

"వాఁడి బిల్ల కత్తి వలచేతఁ బరిజించి
పోఁడిమి బాలడ సంకుపోఁచి నాడించి" 17-230

పౌండ్రకవాసుదేవుఁడు : *వి.* కరూశదేశానికి అధిపతి. శ్రీకృష్ణుడు కైలాసానికి వెళ్లినపుడు ఈతడు ద్వారకకు వెళ్లి లోకంలో ఇద్దరు వాసుదేవులుంటారా? ఒక గొల్లవాడు నా పేరు పెట్టుకుంటాడా? నాకు కూడా గద, సుదర్శనం ఉన్నాయి. నిజమైన వాసుదేవుణ్ణి నేనే. అని అందరికీ చెపుతూ శ్రీకృష్ణుణ్ణి దూషిస్తూ ఉంటాడు. ఆ మాటలు సాత్యకి విని ఇతనితో యుద్ధం చేసి ఇతణ్ణి ద్వారకనుండి వెళ్లగొడతాడు. అప్పుడు పౌండ్రకవాసుదేవుడు కాశిరాజు దగ్గరికి పోయి అతని సాహాయ్యాన్ని పొంది శ్రీకృష్ణుని వద్దకు వాసుదేవుడనే పేరును తీసివేసు కొమ్మని చెప్పడానికి ఒక దూతను పంపిస్తాడు. శ్రీకృష్ణుడు వీరిని యుద్ధానికి రండని పిలుస్తాడు. పౌండ్రకవాసుదేవుడూ, కాశిరాజూ యుద్ధానికి పోగా శ్రీకృష్ణుడు వీళ్లను యుద్ధంలో సంహరిస్తాడు. (మహాభారతం)

ప్రాచీనవిత్తు : *వి.* కుజనుడు.

ప్రోచిళ్లు : *వి; బహు.* శకునాన్ని చూడడం కోసం ఇరుగు పొరుగిండ్ల మీద చల్లే అక్షతలు.

బంటుబంటగు : *అ.క్రి.* లోబడు, సక్తమగు.

బండయి తిరుగు : *ప.బం.* నిష్ప్రయోజనంగా తిరుగు.

బంతిపురాణము : *వి.* గుంపుగా వినే పురాణం.

బగ్గడితనము : *వి.* మోటుతనము.

"బగ్గడితనా నంత పదరి పలుకకువే" 29-296

బగ్గదింపు : *వి; బహు.* కోటమీది నుండి శత్రువులపై దొర్లించే రాతిబండ మొ॥

బడిదప్పు : *అ.క్రి.* దారితప్పు.

బద్దు : *వి.* భద్రశబ్ద వికృతిరూపం కావచ్చు. క్షేమము, మంగళము.

"బద్దుల శ్రీవేంకటేశ పాడి నీ వెఱఁగవా" 29-448

బారగించు : అ.క్రి. 'బారకించు'కు రూపాంతరమా! బరువెక్కు.
"పారి పారి మెచ్చకుమీ బారగించీ పులకలు
కోరికె లేమి గల్లాను గుక్కుకొందు గాని"
17-292

బారడు : 'బారెడు'కు శుద్ధవ్యావహారికరూపం.
"తాలిములు మూరెఁడేసి తలఁపులు బారఁడేసి
గాలిగంటు వేసెవే కమ్మటి నీవు" 29-430

బిందువు : వి. దంతక్షతవిశేషం. (సంపా. 17సం. పీఠిక, 8పు.)
"యిప్పుడిట్టె శ్రీవేంకటేశుఁడ నన్నుఁగూడి
పిప్పిగా నా మోవి గడు బిందువుచ్చేవు"
17-420

బులుపు : పులుపు. 15-216

బూడిదలో వసంతము : *ప.బం;* వి. వ్యర్థం.

బెంబాడి : విణ. వ్యర్థం.

బేసిసరి మాటలు : *వి; బహు*. ఒకటికి రెట్టింపు పలికి వాదులాడే మాటలు.

బొమిఁరెడ్డిచెర్ల : వి. నృసింహస్వామి నెలకొన్న క్షేత్రగ్రామం.

బొల్లిమోరగద్ద : వి. గరుడపక్షి.
"గొల్ల నందగోపుఁగారి కొడుకు నేఁడు మనము
బొల్లిమోరగద్ద నెక్కి పోవువాఁడటే"

బ్రహ్మపట్టము : వి. మిక్కిలి గొప్ప పదవి.

బ్రాఁతిపడు : అ.క్రి. ఇష్టపడు, ప్రియపడు.

భ్రమించి : స.క్రి. భ్రమింపజేసి.
"ముచ్చటలే యాడి యాడి మొదలనను
భ్రమించి" 18-24

మందడీఁడు : వి. గొల్లవాఁడు.

మతించు : స.క్రి. అంచనావేయు, వెలకట్టు, నిర్ణయించు అని తె.వ్యు.కో.

మద్దెలలోని ఎలుక : *ప.బం;* వి. చిక్కులలో పడినవాడు.

మనుపీనుగ : వి. 'జీవచ్ఛవం' అనడానికి తెలుగుపదం.

మాటపలుకు : ప.బం. స్పృహ కోల్పోయిన వారిని కానీ, మరణావస్థలో ఉన్నవారిని కానీ చూసి మాటపలుకు లేదనడం వాడుక అని అ.సం.సా.రా.మాం. (పుట 57)
"పక్కన మాతో మాటపలుకు లాడేవు గాని
ఎక్కడో పరాకు నీకు ని దెఱఁగనా" 26-11

మాటపలుకు : *వి;* మాం. పెండ్లి నిశ్చయం. నెల్లూరు మాండలికంలో పెండ్లి నిర్ణయం చేసుకొను అనే అర్థంలో మాటపలుకు చేసుకొను అనే వ్యవహారం ఉంది.

మాణిక్యాలు : *వి; బహు*. శుభకార్యాల్లో వెలిగించే కుందులు. వీటిలో వత్తులు, నూనె వేసి వెలిగించి హారతి ఇస్తారు.
"........... నిలువు మాణిక్యాల నీరాజనం"

మానావతి : వి. ముగ్ధ, గయ్యాళికి వ్యతిరేకపదం. (తె.వ్యు.కో.)

ముత్తర : వి. విన్నాణము.

ముద్దుచేయు : స.క్రి. గారాబం చేయు, ముచ్చటపడు.

ముయికి ముయి : సరికి సరి, వంతుకు వంతు.

ముయ్యాడు వారు : *వి; బహు*. ప్రౌఢలు, యువతులు.
"కోరినట్టె వున్నవారు కొమ్మలు
ముయ్యాడువారు
గారవపు గొల్లజాతి కలిగెఁగా నీ కిందుకే"
21-108

మెంగ : ముగ్ధ.

మేకునఁబెట్టు : స.క్రి. బాధించు.

మేడికాయబోనము : వి. మోసం, దగా, కుళ్లు, కుట్ర.

మేలగాఁడు : వి. (మేలము + కాఁడు) పరిహాసము కల వాడు.
"నిక్కి నిక్కి చూపుల నేస్తకాఁడ
మిక్కుటపుఁ బ్రియముల మేలగాఁడ" 29-23

మేలు : వి. ప్రియుడు, ప్రియురాలు.
"ఆతనికి నీవు మేలు ఆతఁడు నీకు మేలు"
29-499

మేలురాక: వి. 'స్వాగతం' అనడానికి తెలుగుపదం, శుభాగమనం.

మొగచాటు: వి. వెగటు. 13-41

మొగులు నమ్మి దొనల నీరు వెళ్లదీయు: లోకోక్తి; మేఘాన్ని నమ్మి దగ్గరున్న నీరు వృథాచేయు.

మొయిలు లేని వాన: హఠాత్తుగా వచ్చే వాన.

మోఁటు: వి. గోడచివర, చివరిఅంచు.

"ఏఁటికి దగ్గరేవయ్యా యిదేమి నీవు
మోఁటున నుందానఁ" 8-194

మోడామోడి: వి. మూఢామూఢ శబ్దభవం కావచ్చునని, బయట పడీపడని అని అర్థమని సంపా. (21 సం. 239 పు.)

యంపిలిచెట్టు: వి. ఎంపిలిచెట్టు, వెంపలిచెట్టు, దేనికీ పనికిరాని పిచ్చిచెట్టు.

"సొనిగి యంపిలిచెట్టు పూచెనేమి కాచెనేమి ?"
9-66

రంటదప్పురపువేళ: వి. కలయికవేళ (తె.వ్యు.కో.)

ర(ఱ)ట్టు: వి. అల్లరి, రచ్చ.

రచనలు: వి; బహు. అతిశయాలు.

రవ్వతనము: వి. కొద్దిపాటితనము.

రాతికి గిలిగింత: ప.బం; వి. అసాధ్యం.

రుక్మాంగదుఁడు: వి. ఇతడు ఏకాదశీవ్రతాచార పరాయణుడు. ఇతని వ్రతభంగం చేయడానికై దేవతలు మోహిని అనే సుందరాంగిని పంపగా ఇతడామె వలలో చిక్కుకొని పోతాడు. ఐనా ఏకాదశినాడు వ్రతాన్ని చేయగోరుతాడు. తనను వదలి వెళ్లవద్దని మోహిని పట్టుపట్టింది. ఆమె కోరినట్లు తన కుమారునైనా చంపి ఆమెకివ్వడానికి ఒప్పుకుంటాడు. కాని వ్రతం మానడానికి ఇష్టపడడు. మోహిని అతని పుత్రుని ఖండింపు మని అడుగుతుంది. రుక్మాంగదుడు తన పుత్రుని చంపడానికి ఖడ్గమెత్తగా బ్రహ్మాదిదేవతలు ప్రత్యక్షమై అతని వ్రతనిష్ఠను పరీక్షింపదలచి అట్లా చేసినామని చెపుతారు.

"సిరుల రుక్మాంగదు చేతి కత్తిధారఁ దొల్లి
వరుస ధర్మాంగదుపై వనమాలాయ" 2-85

రెమ్ము: స.క్రి. దూయు.

"రేఁగులెక్కి పూఁపలెల్లా రెమ్మి
మాఁగవేయఁజొచ్చె" 17-336

ఱాతిగని: వి. కఠినుడు.

"ఇదివో నీపెద్దరికమెంతని విన్నవించేము
కదిసి కదిసి ఱాతిగని వైతివి" 21-275

ఱాలు దింటా మలిగండ్లేరు: చూ: రాలు దింటా మలిగండ్లను. 4-135

లోఁతుకొలఁదే పాఁతు: నానుడి; లోతును బట్టే వైశాల్యం.

"లోఁతు కొలఁదే పాఁతు లోన నేల జంకించేవు
చేఁత నీవు సేసినంతే చేరి మా పొందు" 16-256

లోకమువారు: వి; బహు. లోకులు.

వంకర కొంకర: వంకరటింకర.

"పొంకముగాని వానికి బుద్ధులెన్ని నేరిపినా
వంకర కొంకరే కాని వశము గాఁడు"

వంద: వి. స్వైరిణి (?)

"వంద వందనట్లుగా వారిఁజూచి నవ్వేవు
యెండలెల్లా నీడ లాయ నింకనేటి యాసలు"
17-17

వయ్యము: వి. శుష్కము, వట్టిది.

"తియ్యపుఁజేఁతలఁ దెవ్విన చోటు
వయ్యమై హృదయము వాడీనె"

వరగు: వి. దాపి.

"యిక్కడ మేల్కొని యింతలో వరగై
మొక్కె నిదివో మునుకొని నీకు" 17-64

వరుసపద్యము: వి. 1. బాంధవ్యపు వివరణలతో కూడిన పద్యం. 2. పదిమంది విద్యార్థుల్లో ఎవనివంతుకు వాడు చెప్పే పద్యం. తక్కిన పద్యాలజోలి వానికక్కరలేదు. శాస్త్రము చెల్లించుట అని భావము.

"ఉన్నతి వరుసపద్య మొప్పగించ వచ్చితిని
మిన్నక కూచుండుము మేలుకొనీ నిపుడు"
14-555

వలలమాటలు: వి; బహు. మోసపుమాటలు.

వలుము: వి. తగాదా (?) వంబు. త.
"వారించి లేదని వలుము చేసి"

వసపడు: అ.క్రి. సాధ్యమగు, వశపడు.
"తలఁచనెంత దడవు దవ్వులనున్న పతినిఁ
బలికించుమంటే వసపడదుగాక" 16-110

వాగము: వి. వాటము అనే పదానికి వాకము రూపాంతరము. వాకమునకు వాగము అనే రూపాంతరం కల్పించి అన్నమయ్య ప్రయోగించినాడు.
"వాగమై యమరెఁగాన వన్నెలెల్ల నమరె" 9-90
"వాగమై యింతులకెల్ల వలవు మని" 9-218

వాగరుమాటలు: వి; బహు. పరుషవాక్కులు, నిందా వాక్యములు.
"వాగరుమాటలకెల్లా వారిచేవాఁడా తొల్లి"

వాగాయిత్తము: వి. మాటల జగడం, కీడు తోపించే మాట.

వాముడి: వి. త. నోటినుండి వెలువడే మాట.

వారమిచ్చు: ప.బం; స.క్రి; రా.సీ.మాం. పాలుకిచ్చు, కౌలుకిచ్చు.
"వెలయఁగ వలరాచవిద్యలు నేరుపుమని
పలుకుదేనియ నీకు వారమిచ్చెను" 14-536

విత్తుమీఁదటి పొల్లు: ప.బం. నిస్సారము, నిరుపయోగము.
"వత్తిలోపలి నూనెవంటిది జీవనము
విత్తుమీఁదటి పొల్లు విధము దేహము" 1-328

వినీని: అవ్య. వినిన్ని. 18-242

విభాండకుఁడు: వి.కశ్యపుని పుత్రుడు. ఇతడు బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ తపస్సు చేసుకునేవాడు. ఒకనాడితడు స్నానం చేస్తుండగా ఊర్వశి కనబడుతుంది. ఆమెను చూడగానే విభాండకునకు రేతః పతనం కలిగి అది నదీజలంలో పడుతుంది. అప్పుడానదిలో దాహం తీర్చుకుంటున్న ఒక మృగం విభాండకుని వీర్యాన్ని జలంతో తాగుతుంది. ఆ వీర్యము వలన ఆ మృగం గర్భంలో ఋష్యశృంగుడు జన్మించినాడు.
"తగు విభాండకునితో దాఁగిలిముచ్చులాడితి
అగడుగా బండివిరిచాటలాడితి" 3-179

విఱివోటు: వి. వైరం.
"తరుణిరో యిందులోనే తమలో విఱివోటాయె
విరహిజనులకెల్ల వెఱపేలే యిఁకను" 17-418

వుడ్డగచ్చకాయలు: వి. గచ్చకాయలతో ఆడే ఒక ఆట.

వెంగన: వెంగాన. (వ్యంగ్యంతో)
"సంతోసాన మోవి చూపి చవులు గొలుపుఁగాని
వింత సేసుకొనీ నిన్ను వెంగన సాదించదు"
29-490

వెండి పైడిఁ దడఁబడు: ప.బం; వి. సిరిసంపదలతో తుల దూగు.

వెడ్డు: వి. వంచన, కపటం.

వెన్నెలనాఁడు: వి. పూర్ణిమ.
"వొట్టుక వెన్నెలనాఁడు వుట్టెక్కి పెద్దవై
యిట్టె రుక్మిణి పెండ్లి తేరెక్కితివి" 3-92

వేఁడిపాలకు నాలుక చాఁచు: ప.బం; స.క్రి. ఇబ్బంది కలిగించుకొను.
"నాయమా వేఁడిపాలకు నాలుక చాఁచ నీకు
యీ యెడ నీకే తెలుసు నెటువంటి సుఖము"
13-358

వేడిక: వి. వేడుక.
"కనుచూపు వాడికాయ కాఁగిలిట్టె వేడికాయ"
29-488

వేలము: వి. శిబిరం.
"బెరయఁ బిఱుఁదు వేఁగు పీఁట యెక్కవే మంచి
వురము నీకు వీలమగు (వేళపు) వోరుతురా"
17-148

వేసరించు: స.క్రి. శ్రమపఱచు.

వైతాళము: వి. మేలుకొలుపు. (సంపా. 17సం. పీఠిక, 4పు.)
"వలెఁగా యివి గొన్ని వైతాళాలు
చెలిమి సేసేయందుకు చెప్పింపవలెనా" 17-161

వైదూర్యము: వి. వైడూర్యమునకు రూపాం.
12-314

శింగారవనము : వి. శృంగారవనం, ఉద్యానవనం.
"శింగారవనములోన చెలులతో రమణుఁడు
అంగవించిన ముచ్చట లాడుకోఁగాను" 17-302

శిరసెత్తుకొను : ప.బం. ధైర్యం వహించు. 21-37

సందకాడ : సంధ్యాసమయంలో.

సందులు దూరే మనసు : ప.బం; వి.చంచలమైన మనస్సు.

సంబాళిగలు : వి; బహు. పావుకోళ్లు.

సంబెళ : వి. వక్కలాకుల తిత్తి; అడపము.

సదమదము : వి. కలవరము. 5-205

సదరము : విణ. చతురమైన; వి. చాతుర్యం.

సనగులు : అనిష్టంతో మాట్లాడిన మాటలు.

సన్నపు లెక్కలు వ్రాయు : ప.బం; అ.క్రి. పొద్దుపోక ఏవో పనులు చేయు. 6-153

సరియేమి బేసేమి : ఏది గలిగితే నేమి.
"చనవు గలవారికి సరియేమి బేసేమి
మనసులే గురి గావా మన్నించవయ్యా"
13-124

సవదరించు : స.క్రి. వహించు, ధరించు.
"వదలుఁబయ్యద సవదరించి వలపులతేట చవులు చూపి
కొదలు మాటల ముద్దు గునిసి కూరిమి గొసరుటెన్నడే"17-20

సాకిరి : వి. ఒట్టు.

సాకిరివెట్టు : అ.క్రి. ఒట్టుపెట్టు.
"ఒణికె వేసుక నేనూరకున్నా మానఁడే
సణగు లాడఁగ పేరే సాకిరి వెట్టీనీ"

సారివెడలు : అ.క్రి. సన్నద్ధమై వెడలు.

సింగడు బూరడు నగు : ప.బం; అ.క్రి. ఉబ్బిపోవు.

సుక్కరారము : వి. 'శుక్రవారము'నకు జానపద వ్యవహారం. చూ : సుక్కురారము.
"చూడఁజూడ సంతలోనే సుక్కరారమునాఁడు
ఆడనీడ విభవాలే అమరె దేవునికి" 17-526

సుడికత్తె : వి. అదృష్టం కల స్త్రీ.

సూత్రపు ప్రతిమ : వి. ఆటబొమ్మ. (అస్వతంత్రమని భావం) 21-2

సూదిమాటలు : ప.బం; వి; బహు. ఎత్తిపొడుపు మాటలు.

సూరియలు : వి; బహు. ఆళ్వారులు.
"పన్నిద్దరు సూరియల బండికండ్ల తేరు
సన్నుతి శేషాద్రి దేవాసనపుఁ దేరు" 2-239

సొంట్లు : వి. రహస్యాలు. 2-231

స్థానకము : వి. నిలుచున్న భంగిమ.

❖❖❖❖❖

తాళ్లపాక కవుల సంకీర్తనల రాగాలు (95)

అబాలి
అమరసింధు
ఆందోళి
ఆరభి
ఆహిరి
ఆహిరినాట
కన్నడగౌళ
కన్నడ బంగాళం
కాంబోది
కాంభోజి
కుంతలవరాళి
కురంజి
కేదారగౌళ
కౌశి
కొండలమలహరి
కోకిలపంచమం
గంభీరనాట
గుండక్రియ
గుజ్జరి
గుమ్మ కాంబోది / కాంభోజి
ఘంటారావం
చాయ
చెంచుమలహరి
ఛాయానాట

తెలుగు కాంభోది / తెలుగుంగాంభోజి
తోడి
తోండి
దీపనం
దేవక్రియ
దేవగాంధారి
దేశి /దేసి
దేసాక్షి
దేసాళి
ద్రావిళ(డ) భైరవి
ధన్నాసి
నట్టనారాయణి
నాగగాంధారి
నాగవరాళి
నాట
నాదనామక్రియ
నారణి
నారాయణదేసాక్షి
నారాయణి
నీలాంబరి
పళవంజరం
పాడి
పిసాళం
పూరిబి / భి

పూర్వగౌళ
ప్రతాపనాట
బల(ళ)హంస
బౌ(భవు)ళి
బౌళిరామక్రియ
భంగాళం
భల్లాటి
భూపాల(ళ)
భైరవి
మంగళకౌ(కై)శిక
మధ్యమావతి
మనోహరి
మలహరి
మాళవి
మాళవ(వి)శ్రీ
మాళవి గౌళ
ముఖారి
ముఖారిపంతు
మెంచభౌళి / మేంచబౌళి
మేఘరంజి
రామక్రియ
రాయగౌళ
రీతిగౌళ
రేవగుప్తి

లలిత
వరాళి
వసంతం
వసంతవరాళి
వేళావళి
శంకరాభరణం
శుద్ధదేశి
శుద్ధరామక్రియ
శుద్ధవరాళి
శుద్ధవసంతం
శ్రీరాగం
సామంతం
సామవరాళి
సావేరి
సాళంగం
సాళంగనాట
సింధురామక్రియ
సోమరాగం
సౌరాష్ట్రం
సౌరాష్ట్రగుజ్జరి
హిందోళం
హిందోళవసంతం
హిజ్జి(జ్జీ)జి

❖❖❖❖❖

ఉపయుక్తగ్రంథసూచి

అధ్యాత్మకీర్తనలు	తాళ్లపాక కవులు, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ.
అన్నమయ్య సంకీర్తనలు - భాషావిశేషాలు (2006)	మండ్యం చంద్రశేఖర రెడ్డి సిద్ధాంతగ్రంథం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.
అన్నమాచార్య సంకీర్తన సాహిత్యం - రాయలసీమ మాండలికం (2007)	ఆచార్య ఎస్. గంగప్ప
అన్నమాచార్య సంకీర్తనామృతం (2008)	డా॥ సముద్రాల లక్ష్మణయ్య తిరుమల తిరుపతి దేవస్థానములు.
ఆంధ్ర ధాతు మాల (1997)	సంపా : పి. జయమ్మ గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ, చెన్నై.
ఆంధ్ర పదకోశము (1981)	సంపా : పోతుకుచ్చి సుబ్రమణ్యశాస్త్రి
ఆంధ్ర పదనిధానము (1930)	తూము రామదాసు కవి
ఆంధ్రభాషార్ణవము (1912)	నుదురుపాటి వెంకనార్యుడు వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
ఆంధ్రవాచస్పత్యము	కొట్ర శ్యామల కామశాస్త్రి
ఆంధ్రశబ్ద రత్నాకరము	సంపా : శ్రీమాన్ చెలమచెర్ల రంగాచార్యులు
కడపరాయని అన్నమయ్య కప్పురపు కీర్తనలు (2006)	డా॥ పాలెం వేణుగోపాల్
తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనల్లో ఉత్సవవిశేషాలు (1987)	డా॥ చిట్రాజు గోవిందరాజు
తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనల్లో పలుకుబళ్లు - సామెతలు (1999)	సిద్ధాంతగ్రంథం; డా॥ టి. అనూరాధ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం.
తాళ్లపాక అన్నమయ్య సాహిత్యంలో తెలుగునాడు (1990)	డా॥ దాసెట్టి శివప్ప

తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల్లో భాషావిశేషాలు (1989)	ఆచార్య జాస్తి సూర్యనారాయణ
తాళ్లపాక కవుల పదకవితలు – భాషాప్రయోగవిశేషాలు	డా ॥ వేటూరి ఆనందమూర్తి
తాళ్లపాక పెదతిరుమలయ్య కృతుల సవిమర్శ పరిశీలన	ఓ. సీతారామమ్మ
తాళ్లపాకవారి పలుకుబళ్లు (1971)	రామలక్ష్మీ ఆరుద్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ.
తెలంగాణా జాతీయాలు	వేముల పెరుమాళ్లు
తెలుగు – ఇంగ్లిష్ నిఘంటువు (2006)	విక్టరీ పబ్లికేషన్స్
తెలుగు – తెలుగు నిఘంటువు	తెలుగు అకాడెమీ
తెలుగు జాతీయాలు (2 భాగాలు)	నాళం కృష్ణారావు
తెలుగు జాతీయాలు (2008)	ఆచార్య మూలె విజయలక్ష్మి
తెలుగు పర్యాయపద నిఘంటువు	ఆచార్య జి. యన్. రెడ్డి
తెలుగు వ్యుత్పత్తి పదకోశం (8 భాగాలు)	ఆంధ్ర విశ్వవిద్యాలయం
పదకవితా వైజయంతి (1993)	డా ॥ పొన్నా లీలావతమ్మ
పదబంధకోశం (తెలుగు జాతీయాలు)	ఆచార్య మూలె విజయలక్ష్మి
పదబంధ పారిజాతము (2 భాగాలు)	ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ
పూర్వగాథాలహరి (1992)	వేమూరి శ్రీనివాసరావు
మాండలిక పదకోశం (1985)	తెలుగు అకాడెమీ
మాండలిక పదకోశం (1970)	కూర్పు: మరుపూరు కోదండరామ రెడ్డి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ
రాయలసీమ పదకవులు	సిద్ధాంతగ్రంథం; డా ॥ కే. జనార్ధనం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
వాచస్పత్యం	కొట్ర శ్యామల కామశాస్త్రి
వావిళ్ల నిఘంటువు	వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
శబ్దార్థ దీపిక (1956)	విద్వాన్ ముసునూరి వేంకటశాస్త్రి దాచేపల్లి కిష్టయ్య & సన్స్.
శృంగార కీర్తనలు	తాళ్లపాక అన్నమాచార్యులు, తాళ్లపాక

	పెదతిరుమలా చార్యులు, తాళ్లపాక చినతిరుమలాచార్యులు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ.
శ్రీహరి నిఘంటువు (2001)	డా॥ రవ్వా శ్రీహరి
సర్వాంధ్రసార సంగ్రహము (1987)	అమలాపురపు సన్యాసి కవి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధన సంస్థ.
సంప్రదాయఅకారాది అను ద్రావిడాంధ్ర నిఘంటువు (1939)	కందాడై శేషాచార్యులు వేదాంతము ద్రాక్షరశాల, గుంటూరు.

❖❖❖❖❖

సంక్షిప్తపద వివరణం

అ.క్రి.	అకర్మకక్రియ.
అ.సం.సా.రా.సీ.మాం.	అన్నమాచార్య సంకీర్తన సాహిత్యం. రాయలసీమ మాండలికం.
అను.	అనుబంధం.
అవ్య.	అవ్యయం.
అస.క్రి.	అసమాపక్రియ.
ఆం.క్రి.మ.దీ.	ఆంధ్ర క్రియా స్వరూప మణిదీపిక.
ఆం.ధా.మా.	ఆంధ్ర ధాతు మాల.
ఆం.భా.చ.	ఆంధ్ర భాషా చరిత్ర.
ఆ.మూ.	ఆనందమూర్తి వేటూరి.
ఉ.	ఉద్యోగపర్వం.
ఆం.శ.ర.	ఆంధ్ర శబ్దరత్నాకరము.
ఉ.రా.	ఉత్తరరామాయణం.
ఉ.హరి.	ఉత్తర హరివంశం.
క.	కన్నడం.
క.అ.క.కీ.	కడపరాయని అన్నమయ్య కప్పురపు కీర్తనలు.
క.చౌ.	కవిచౌడప్ప.
క్రి.ప.	క్రియాపదం.
క్రీడా.	క్రీడాభిరామం.
క.చౌ.	కవిచౌడప్ప శతకం.
కు.సం.	కుమారసంభవం.
చి.సూ.	చిన్నయసూరి.
త.	తమిళం.
తా.అ.సా.తె.	తాళ్లపాక అన్నమయ్య సాహిత్యంలో తెలుగునాడు.
తా.ప.భా.వి.	తాళ్లపాక కవుల పదకవితలు – భాషాప్రయోగ విశేషములు.
తాళ్ల.ఉ.విశే.	తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనల్లో ఉత్సవవిశేషాలు.
తాళ్ల.ప. }	తాళ్లపాకకవుల పలుకుబళ్లు.

తి.అ.న. }	
తు.	తుళు.
తె.జా.	తెలుగు జాతీయాలు.
తె.తె.ని.	తెలుగు – తెలుగు నిఘంటువు.
తె.వ్యు.కో.	తెలుగు వ్యుత్పత్తి పదకోశం.
ప.బం.	పదబంధం.
ప.యో.వి.	పరమయోగివిలాసము.
పద. }	పదబంధపారిజాతం.
ప.పా. }	
పర్యా.కో.	పర్యాయ పదకోశం.
పు.	పుట.
ప్రా.	ప్రాకృతం.
బహు.	బహువచనం.
బ్రౌన్.	బ్రౌణ్య నిఘంటువు.
భా.	భాగం.
భా.రా.	భాస్కరరామాయణం.
భార.	మహాభారతం.
మ.చ.	మనుచరిత్ర.
మాం. }	మాండలికం.
మాండ. }	
మాం.ప.కో.	మాండలికపదకోశం.
మై.వేం.సు.	మైనంపాటి వేంకటసుబ్రమణ్యం.
రా.సీ.	రాయలసీమ.
రా.సీ.మాం.	రాయలసీమ మాండలికం.
రాజ.వి.	రాజవాహనవిజయం.
రూపాం.	రూపాంతరం.
వా.ని. }	వావిళ్ల నిఘంటువు.
వావిళ్ల. }	
వాచ.	ఆంధ్రవాచస్పత్యం.
వి.	విశేష్యం.
విణ.	విశేషణం.

విప్ర.	విప్రనారాయణచరిత్ర.
వ్యు.	వ్యుత్పత్తి.
వ్యు.కో.	తెలుగు వ్యుత్పత్తిపదకోశం.
శ.దీ.	శబ్దార్థదీపిక.
శ.ర.	శబ్దరత్నాకరం.
శు.స.	శుకసప్తశతి.
సం.	సంపుటం.
సం.స. } సం.ప.స. }	సందిగ్ధ పద సమీక్ష.
సం.వా.పద.భాషా.	సంకీర్తనవాఙ్మయము – పదకవితలు – భాషాప్రయోగవిశేషములు.
స.క్రి.	సకర్మకక్రియ.
సారంగ.	సారంగధరచరిత్ర.
సూ.ని.	సూర్యరాయాంధ్రనిఘంటువు.
హం.విం.	హంసవింశతి.

❖❖❖❖❖